యయాతి చరిత్ర

పొన్నగంటి తెలగనార్య

సుగమ వ్యాఖ్య

కపిలవాయి లింగమూర్తి

2001

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

యయాతి చరిత్ర – పొన్నగంటి తెలగనార్య

YAYAATI CHARITRA - Ponnaganti Telaganarya

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రచురణల సంఖ్య - 245

వెల : రూ. 140 /-
ప్రతుల సంఖ్య - 1000
ముద్రణ : సెప్టెంబర్, 2001

ప్రతులకు :
డైరెక్టర్
ప్రచురణల విభాగం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాద్ - 500 004.

ముద్రణ :
కేశవ ఆర్ట్ ప్రింటర్స్
రెడ్‌హిల్స్, హైదరాబాద్.

ISBN No. 81-86073-88-4

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

ఆచార్య ఎన్. గోపి
వైస్-ఛాన్సలర్

ముందుమాట

తెలుగు భాషాసాహిత్యాలు, సంస్కృతి, చరిత్ర, లలిత కళలు, జానపద గిరిజన విజ్ఞానం వంటి బహుముఖీన అంశాల వికాసం కోసం ఏర్పడిన సమున్నత విద్యాసంస్థ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. ఈ లక్ష్యాన్ని సాధించటానికి ప్రధానంగా బోధన, పరిశోధన, గ్రంథ ప్రచురణ, విస్తరణ సేవ వంటి చతుర్ముఖీన మార్గాలను అనుసరిస్తున్నది. విస్తరణ సేవ, అంతర్జాతీయ తెలుగు సంస్థల తరఫున ప్రవాసాంధ్రులకు సాంస్కృతిక సేవ వంటి ఉదాత్త కార్యక్రమాలతో పురోగమిస్తున్నది. గ్రంథ ప్రచురణ క్రింద విశ్వవిద్యాలయం కావ్యాలు, విజ్ఞాన సర్వస్వ సంపుటాలు, నిఘంటువులు, మాండలిక వృత్తిపదకోశాలు, భాషా సాహిత్యం, సంగీతం, నాట్యం, నాటకం, లలిత కళలు, జానపద గిరిజన విజ్ఞానం, చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన ప్రచురణలు, అనువాదాలు వెలువరిస్తున్నది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు అశేష పాఠకాదరణ పొందుతున్నాయి.

ఈ ప్రచురణ కార్యక్రమానికి అనుగుణంగా విశ్వవిద్యాలయం ఇప్పటికే ఎన్నో ప్రముఖ గ్రంథాలను ప్రచురించింది. వ్యాఖ్యాస్రవంతి శీర్షికన సుప్రసిద్ధ పండితులచే ప్రాచీన కావ్య, ప్రబంధాలకు వ్యాఖ్యానాలు వ్రాయించి ప్రచురించే ప్రణాళికను చేపట్టింది. ఇప్పటివరకు ఈ ప్రణాళికలో కుమారసంభవం, కాశీఖండం, శివరాత్రి మహాత్మ్యం వంటి గ్రంథాలను వ్యాఖ్యాసహితంగా ముద్రించింది.

తెలుగులో ప్రసిద్ధి పొందిన ప్రాచీన, ఆధునిక గ్రంథాలను ఇంగ్లీషు, హిందీ భాషలలోనికి అనువాదం చేయించి ప్రచురించింది. తెలుగు కథ అనే పేరుతో ప్రతి సంవత్సరం వెలువడిన ఉత్తమ కథలను ఎంపిక చేసి ముద్రించే కార్యక్రమాన్ని చేపట్టింది. తెలుగుకథ-1995 రెండు భాషల్లో వెలువరించడం జరిగింది. అలాగే 1996, 1997, 1998, 1999, 2000 కథా సంపుటాలు అందుబాటులో ఉన్నాయి.

తెలుగు విజ్ఞాన సర్వస్వ సంపుటాలను తయారు చేయించే కార్యక్రమంలో విశ్వసాహితి, భారత భారతిలను, హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఆంధ్రాస్ అనే పేరుతో ఆంగ్లంలో ఒక సంపుటాన్ని ప్రచురించింది. భాషాభివృద్ధి కృషిలో భాగంగా తెలుగు భాషా చరిత్ర, ద్రావిడ భాషలు అనే గ్రంథాలను పునర్ముద్రించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వారి సహకారంతో డా॥ బి. ఆర్. అంబేద్కర్ రచనలు - ప్రసంగాలు పది సంపుటాలుగా ప్రచురించింది. తెలుగు వారికి మంచి పరిశోధనా పత్రికలేని కొరతను వాఙ్మయి తీరుస్తున్నది. అలాగే విశ్వవిద్యాలయం ఇటీవల చేపట్టిన "వందగ్రంథాలు-సౌజన్య ప్రచురణలు" అనే పథకానికి దాతల నుండి మంచి స్పందన లభిస్తున్నది.

ప్రస్తుత గ్రంథం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'వ్యాఖ్యాస్రవంతి' శీర్షికన వరుసగా వెలువరిస్తున్న గ్రంథాలలో ఒకటి.

'యయాతి చరిత్ర' తెలుగులో మొట్టమొదటి అచ్చు తెలుగు కావ్యం. దీని కర్త పొన్నెగంటి తెలగన్న. దీనికి సుగమ వ్యాఖ్య పేరుతో శ్రీ కపిలవాయి లింగమూర్తి గారు చక్కని వ్యాఖ్యానాన్ని సమకూర్చారు.

వ్యాఖ్యాత తమ 'ప్రవేశిక'లో గ్రంథం గురించి, రచయిత గురించి, గ్రంథాన్ని అంకితం పొందిన అమీను ఖాను గురించి ఎన్నో కొత్త విషయాలను వెల్లడించారు. గ్రంథ రచనా కాలం నాటి సామాజిక రాజకీయ పరిస్థితులను గురించి కూడా విపులంగా చర్చించారు. శ్రీ కపిలవాయి లింగమూర్తి గారికి విశ్వవిద్యాలయం తరఫున అభినందనలు తెలియజేస్తున్నాను.

ఈ గ్రంథం సాహితీప్రియుల ఆదరాభిమానాలను చూరగొంటుందని ఆశిస్తున్నాను.

(ఎన్. గోపి)

హైదరాబాద్
తేది : 24.8.2001

విషయ సూచిక

ప్రవేశిక	- కపిలవాయి లింగమూర్తి	1
	ప్రథమా శ్వాసము	**123**
చందోవివేకము		129
ఇబ్రహీంషా ప్రశస్తి		133
ఏబదారు దేశములు		137
ఏబదారు దేశములు నేడు వాని యొక్క ఉనికి		
ఉపమాలంకార బేధములు		155
బాబు మియా ప్రశస్తి		157
పరిణామము - రూపకము		158
అమీనుకానుని ప్రశస్తి		159
పరిణామము		168
నవనిధులు		170
బడే డీడీ ప్రశస్తి		176
గీతాత ఖాను ప్రశస్తి		178
పాజిలు ఖాను ప్రశస్తి		183
సెక్కర బీబీ ప్రశస్తి		188
అబ్దులల్లీ ప్రశస్తి		190
షేక్ ఇబ్రహీం ప్రశస్తి		194
సెమ్మెబీబీ ప్రశస్తి		195
అమీను ఖాను వంశవృక్షము		199
శిబిచక్రవర్తి కథ		201
ఈ పద్యమందలి పూర్వగాథలు		231
జానపదుల వేట సాధనములు		258
ఆశ్వాసాంతము		270
	ద్వితీయాశ్వాసము	**274**
వేట		277

పందివేట 279
ఎలుగువేట 283
సివంగి వేట 286
లేడి వేట 286
ఎద్దువేట 288
జింక వేట 288
సాది వేట 289
డేగ వేట 291
వల వేట 292
పారు వేట 294
పులి వేట 295
జానపదుల వేటలు
ఇటి వేట 298
ఎద్దు వేట 299
కుక్కల వేట 299
గంట వేట 300
డేగ వేట 300
పాది వేట 301
పారు వేట 301
సివంగి వేట 302
హిమాలయ వర్ణనము **303**
గంగానది వర్ణనము 311
జాబాలి ఆశ్రమము 317
జాబాలి మహర్షి 320
జాబాలి యయాతిని నీవెవ్వరని యడుగుట 322
యయాతికి జాబాలి హితోపదేశము 324
జాబాలి రామాయణ కథ యయాతికి చెప్పుట 325
రావాణాదుల జననము 326

స్వర్గముపై రావణుని దండయాత్ర 330
సూర్యాస్తమయ వర్ణనము 331
చీకటి 335
మిణుగురు పురుగులు 338
వెన్నెల 339
చంద్రుడు 340
చకోర క్రీడ 343
రావణుడు రంభను గాంచుట 346
రావణుడు రంభననుభవించుట 352
రంభ వచ్చి తన గోడు నిలకూబరునితో చెప్పుకొనుట 353
రావణునికి నీలకూబరుని శాపము 355
సూర్యోదయము 356
రావణుని దిగ్విజయము 358
దేవతలు విష్ణువుకడకేగుట 360
క్షీరసముద్రము 360
దేవతలు విష్ణువుని గాంచుట 361
దేవతలు విష్ణునితో రావణుని చేష్టలు చెప్పుట 364
శ్రీ రామాదుల జననము 368
విశ్వామిత్రుని ఆగమనము 369
ఆశ్వాసాంతము 370

తృతీయాశ్వాసము 374

విశ్వామిత్రుడు శ్రీరాముని పంపమని యడుగుట 375
తాటక సంహారము 376
సీతాస్వయంవరము 379
శివధనుర్వృత్తాంతము 380
సీతాదేవికాపేరు కలుగుటకు కారణము 381
శ్రీరామాదుల వనగమనము 384
దండకారణ్య వృత్తాంతము 387

శూర్పణఖ వృత్తాంతము 387
మాయలేడి వచ్చుట 388
రావణుడు సీతను గొంపోవుట 391
హనుమంతుడు 392
వాలిసుగ్రీవులు 393
హనుమంతుడు సీతను వెదకబోవుట 394
లంకా దహనము 395
సముద్రునిపై శ్రీరాముని కోపము 397
సేతు బంధనము 400
రామరావణ యుద్ధము 402
యయాతి నూతి దగ్గరకు వచ్చుట 405
యయాతి నూతంబడిన దేవయాని నుద్ధరించుట 407
యయాతి దేవయానిని నీవెవ్వరని యడుగుట 410
ఘూర్ణిక యయాతికి దేవయాని వృత్తాంతము చెప్పుట 412
శర్మిష్ఠ వన విహారము 414
జలక్రీడా వర్ణనము 419
శర్మిష్ఠా దేవయానుల కలహం 426
శర్మిష్ఠ దేవయానిని నూతద్రోయుట 429
శుక్రుడు వచ్చి దేవయాని నోదార్చుట 430
వృషపర్వుడు శర్మిష్ఠను దేవయానికి దాసిగా నిచ్చుట 438
శుక్రుండు కచుని వృత్తాంతము వృషపర్వునకు జెప్పుట 443
శుక్ర బృహస్పతుల వృత్తాంతము 447
దానవులు కచుని చంపుట 452
కచుని బూడిద దానవులు సురలో కలిపి శుక్రునికి త్రాపుట 454
శుక్రుడు సుర త్రాగరాదని నియమము చేయుట 462
శుక్రుడు కచునికి సంజీవనీ నుపదేశించుట 463
దేవయాని కచునికి తన కోరికను తెల్పుట 472
దేవయాని కచులు పరస్పరము శపించుకొనుట 475

ఆశ్వాసాంతము 476

చతుర్థాశ్వాసము **482**

వసంతర్తు వర్ణనము 482
చెలులు ద్యాన విహారము చేయుట 496
వృక్షదోహదములు 500
చెలుల వనవిహారము 502
యయాతి శర్మిష్ఠంగాంచి వర్ణించుట 514
యయాతి మీరెవ్వరని దేవయాని నడుగుట 530
శుక్రాచార్యులు దేవయానులున్న కడకు వచ్చుట 537
యయాతి దేవయానింబెండ్లియాడుటకు శుక్రాచార్యులు సమ్మతించుట 543
నగరాలంకారము 547
దేవయాని వివాహ సన్నాహము 550
నూనెకు తావి గట్టుట 558
వివాహము 564
దేవయానికి తల్లి బుద్ధులు చెప్పుట 579
శుక్రుడు దేవయానిని యయాతి కప్పగించుట 588
యయాతి తన పురంబున కేగుట 590
ఆశ్వాసాంతము 597

పంచమాశ్వాసము **600**

చెలులు దేవయానను తలిమ మెక్కించుట 601
నఖక్షతములు 620
దేవయాని కుమారులను గనుట 621
యదువు 623
యయాతి పుష్పవనమున కేగుట 625
శర్మిష్ఠ యయాతిని గాంచుట 635
శర్మిష్ఠ యయాతితో సంభాషించుట 638
శర్మిష్ఠ విరహవేదన 640
శశిరోపచారములు 644

ఉపాలంభనములు 647
యయాతి విరహవేదనకు లోనగుట 653
చెలికత్తెలు యయాతికి శశిరోపచారములు చేయుట 657
శర్మిష్ఠ లేచి పొదరింటి కడకు వెళ్ళుట 669
విరహశాంతికై యయాతి పొదరింటి కడకు వచ్చి యచటికి
తనకంటె మొదలే వచ్చిన శర్మిష్ఠను గాంచుట 671
శర్మిష్ఠ యయాతి మహారాజుల సంభోగము 675
చెలికత్తెలు వెదకుచు వచ్చి శర్మిష్ఠా యయాతి మహారాజులనుగనుట 678
యయాతి శర్మిష్ఠలు పొదరిల్లు వెడలి వచ్చుట 684
యయాతి మహారాజు శర్మిష్ఠనంతఃపురమునకు గొనిపోవుట 687
ఫలశ్రుతి 690
ఆశ్వాసాంతము 691

పద్యసూచిక *694*
వచన సూచిక *715*
ఉపయుక్త గ్రంథాలు *724*

మనవి

యయాతి చరిత్ర ఆంధ్రసాహిత్యమున నొకయపూర్వ కృతి. తెలగన దీనికి శ్రీకారము చుట్టి సార్థక నాముడై అచ్చతెనుగు ప్రక్రియ కాద్యుడైనాడు. ఇపుడ దేవిధముగా తెలుగు విశ్వవిద్యాలయం దీనికి టీకాతాత్పర్యములు వ్రాయించ సంకల్పించుట అది గావించుచున్న విశేష సాహిత్యకృషికి నిదర్శనము. ఈ కావ్యమునకు వారునన్ను కోరుట నాయొక్క అదృష్టముగా భావించుచు తెలుగు విశ్వవిద్యాలయ ప్రధానాచార్యులకు మరియు వారి సిబ్బందికి ఇందు మూలముగా ప్రథమముగా నాకృతజ్ఞతను వెల్లడించుకొనుచున్నాను.

విశ్వవిద్యాలయం వారి కోరిక మేరకు నేను దీని టీకా తాత్పర్యములు ప్రారంభించగా నాకాలమున మిత్రుడు గద్వాల నివాసి శ్రీ కె. ప్రభాకరవర్ధన్ గారు రామకోటి దీక్షలో బీచుపల్లిలో నివసించి తనతోపాటు నాకుగూడ నక్కడనుండు నవకాశము గల్పించిరి. అందువలన నేను సాహితీదీక్షా పరుడనై దినదినము కృష్ణానదీ స్నానముతో ఆపావని సన్నిధిలో దీని టీకా తాత్పర్యములు దీక్షాంతము నాటికి ముగించ గలిగితిని.

నాకీ రచనకు తగిన సలహాలు మరియు సూచన లిచ్చిన వాడు ఆత్మీయుడైన మిత్రుడు పాలెం వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యుడు డా॥ శ్రీ రంగాచార్యగారు. అదేవిధంగా తమదగ్గరగల సాంబనిఘంటువు మొదలైనవి యిచ్చి సహాయపడిన వాడు అదేకళాశాలాచార్యుడు మరియు మిత్రుడు శ్రీ యం. రామకృష్ణశర్మగారు. మరొకరు కర్నూలు నివాసి శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులుగారు. అతడు తన గ్రంథాలయము నుండినాకు వేంకటేశాంధ్రము ఇంకను ఇతరనిఘంటువులు చరిత్రలు అందించి సహాయపడెను. ఈ కావ్యమందలి బిరుదములను మరియు కొన్ని అరుదైన ప్రయోగములను గురించినాకు కలిగిన సందేహములకు మాన్యులు శ్రీమాన్ తిరుమల రామచంద్రగారు, నిడుదవోలు శివసుందరేశ్వర రావుగారు, గడియారం రామకృష్ణ శర్మగారు లేఖల ద్వారా తగు సమాధానము లిచ్చిరి. ఇంకను ఎందరో మిత్రులు శ్రీముదివేడు ప్రభాకరరావు, సూర్యదేవర రవికుమార్ వంటి వారునాకు కావలసిన ప్రాచీన పత్రికలువానిలోని రెఫరెన్సులు అందజేసిరి. కనుక వారందరికి నావినయాంజలులు.

నేను ఈకావ్యానికి టీకాతాత్పర్యాలు వ్రాయుట యొక యెత్తు దానిని శుద్ధప్రతి వ్రాయుట మరియొక యెత్తు. సుమారు 950 పుటలుగా సాగిన ఈ కావ్యమును ఓపికగా

శుద్ధప్రతి వ్రాసినవాడు నాగర్‌కర్నూలు నివాసి జాతీయ పాఠశాలలోని ఉపాధ్యాయుడు (శ్రీ) పాలమూరు వీరయ్యగారు. అతడూహ తెలియంగల లేఖక పాఠకోత్తముడు. అతనికి భగవంతుడాయురారోగ్యములు ప్రసాదించవలెనని కోరుతున్నాను.

వాణీ సదనం	ఇట్లు
విద్యానగర్ కాలనీ,	
నాగర్ కర్నూలు.	కపిలవాయి లింగమూర్తి

ధాత వినాయకచతుర్థి

స్తుతి

తే. ప్రళయ నిశినుండి మేల్కొల్ప ప్రకృతి కాంత
నేది యెలిగించెనో త్రయీనాదములను
ఆ ప్రణవ పక్షివాక్కున కాదికు క్షి
పాదలుగా వృత నాజిహ్వాతుదలనెపుడు.

తే. గుణవిశేషుడు గురుభక్తు ఉనవతరము
ధరణి జీవేశ్వర విశిష్ట తత్వమెరిగి
నట్టియు చలుడు మాతులుండైన యట్టి
గురునిదే పూరులక్ష్మయు వరునిదలిచి

యయాతి చరిత్రకు నే నీవ్యాఖ్యానమును ప్రారంభించుచున్నాను. యయాతినామమున కాప్తేనిఘంటువు యస్యపాయెరారివయాతిః. సర్వత్ర రథగతి రస్య-అనిరెండు వ్యుత్పత్తు లిచ్చినది. యకారమునకు"యస్త్యాగేనిలయే వాయరౌయమే యాతరి మాతరి" అని నానార్థ రత్నమాల (ఏకాక్షరకాండము-61) అర్థములుచెప్పినదికాన యయాతి యనగా వాయువువలె - వాయువువంటి గమనము గలవాడు. రథము వలె అంతట వెళ్లువాడు. అని యర్థము."రథోదేహే2పి" అనునానార్థ రత్నమాలను బట్టి రథ శబ్దమున కు దేహమనియు నర్థము యయాతి మహారాజు చరమదశయందు సశరీరముగా నూర్ధ్వలోకము లన్నియు వెళ్లెను అతనికిగల దేవయాని శర్మిష్ఠయను నిద్దరు భార్యలు అర్చిరాది ధూమాది మార్గములకు సంకేతములు. మానవుడు మొదట అర్చిరాది మార్గముననే యుండి యౌవనమున కామవశుడై ధూమాది మార్గమున ప్రవేశించును. సంసార నిజస్వరూప మెరిగిన పిదప మరల నర్చిరాది మార్గమునకు వచ్చును. యయాతి ఈ రెండు మార్గములందును లెస్సగా సంచరించెను, ఒక భూమిక నుండి మరియొక భూమికకు వెళ్లెను అమరకోశము పోవుటకు'యాత్రావ్రజ్యాభి నిర్యాణం ప్రస్థానం గమనం గమః (ద్వి-5)" అని పర్యాయము లిచ్చినది కాననేను ఈవ్యాఖ్యకు సుగమమని పేరు పెట్టితిని.

సుగమ శబ్దమునకు సులభముగా పోదగినది అనియే కాక, గతి శబ్దము జ్ఞానార్థమున గూడ వర్తించును కనుక "సుష్టు జ్ఞాయతే" చక్కగా యెరుగ దనియు నర్థముగలదు.

మహాభారత కథ ననుసరించి యయాతి మహారాజు జీవితమున మానవులెరుంగ దగిన జీవితాంశము లెన్నియో నున్నవి. కాని తెలగన వానిజోలికి పోలేదు. ఈ వ్యాఖ్యానమున నేను గూడ అతని వెంటనే నడిచి కావ్యార్థము పాఠకులకు సులభముగా నవగతమగుటకై సరళము మరియు సులభమైన భాషనే వాడితిని. నా ప్రయత్నమున నేనెంతవరకు కృతకృత్యుడ నైనది. దీనిని సాంగముగా చూచి నిర్ణయించుటయిక మీవంతు.

కవి కరోతి కావ్యానిలాలయన్త్యుత్తమోజనాః

ప్రవేశిక

కపిలవాయి లింగమూర్తి

ప్రవేశిక

యయాతి చరిత్ర కృతికర్త

ఇది ఆంధ్రసాహిత్యమున మొదటి యచ్చ తెనుగు కావ్యము. దీనిని రచించిన పొన్నగంటి తెలగన్నను మచ్చ వేంకట కవి, అబ్బరాజు హనుమంతరాయ శర్మ, జంగా హనుమయ్య చౌదరి, అయ్యనకోట పార్థ సారథి ఇతనిని తమ కావ్యములలో అచ్చతెనుగున కాద్యుడని నుతించిరి.

ఆంధ్రకవుల చరిత్ర మొదలు అచ్చతెలుగు కావ్యముల పై పరిశోధన చేసిన వారి వరకు కవి చరిత్రకారులందరూ తెలగన్నను అచ్చతెనుగున కాద్యుడనియే నిర్ణయించిరి . ఇతని కృతియైన యయాతి చరిత్ర యందు అక్బరు పాదుషా, మల్కిభ్రాహీము, శ్రీ రంగరాయలు పేర్కొనబడిరి.

ఉత్తర భారతమున ఢిల్లీ సింహాసనమును అక్బరు పాదుషా క్రీ.శ. 1556-1605, గోలకొండ రాజ్యమును మల్కిభ్రాహీము క్రీ.శ. 1550-1580; విజయ నగర రాజ్యమును శ్రీరంగరాయలు క్రీ.శ.1574-1585; పాలించిరి. కనుక నీరాజ్యమున మల్కిభ్రాహీమునకు శ్రీరంగరాయలకు జరిగిన సంధి పేర్కొనబడుట వలన నిది 1574నుండి 1581 నడుమ రచింప బడియుండునని శ్రీ అడవి శంకరరావు గారు 1580 ప్రాంతమున రచించి యుండునని కందుకూరి వీరేశలింగము పంతులు గారు అభిప్రాయపడిరి.

కవులు సాధారణముగా తమ కావ్యములలో అవతారిక యందు కృతిపతి వంశము పిమ్మట తమవంశాదికము మరియు గోత్ర సూత్రములను చెప్పుకొనుట పరిపాటి. వానిని మరల ప్రతి ఆశ్వాసాంత గద్య యందును పునరావృత్తము చేయుచుందురు. కాని తెలగన కృతిపతి వంశవివరము తన సాటి కవుల కంటె యెక్కువ గనే యిచ్చినను తనను గురించి మాత్రము తెలుపు కొనలేదు. ఆశ్వాసాంతగద్య లందు మాత్రము తమ యింటిపేరు పొన్నగంటివారని తాను భావనామాత్య పుత్రుడినని మదన గోపాల మంత్రప్రసాద లబ్ధ సారస్వతుడనని మాత్రమే చెప్పుకొనెను. అతడు చెప్పుకొనిన పైమూడు విశేషములం దేవియునతని వర్ణమునుగాని గోత్రసూత్రములనుగాని నిర్ణయించుటకు సహాయపడవు.

ఆమనగంటి, కనగంటి, నెమిలికంటి , మరిగంటి,మొసలి కంటి, రావికంటి అనునవి గ్రామవాచకములు."కల్లు" అనుదానియొక్క షష్ఠ్యంత రూపములు. ఈ గ్రామనామము లాంధ్రదేశమున చాతుర్వర్ణ సామాన్యములు.

తిక్కన, ఎఱ్ఱన , సోమన, పోతన వంటి అన్నంతశ్రేష్ఠతా వాచకములైన నామము లెక్కువగా బ్రాహ్మణ వంశములందేకనిపించినను అవిగూడ మధ్యయుగము నాడు చాతుర్వర్ణ సామాన్యములే కావున తెలగన్నయనుపేరు గూడ కవిగారి వర్ణనిర్ణయమునకు సహాయపడదు.

తెలగన్న తనతండ్రి పేరు భావనామాత్యుడని చెప్పెను. అమాత్యశబ్దము సాధారణముగా నా కాలమున నియోగులకు పరిమితము. వారు గ్రామకరణములు గానో లేదా మంత్రులు గానో నుండుచుండిరి.

తెలుగు కవులలో బ్రాహ్మణులు వారియందును నియోగు లెక్కువ. తిక్కన మొదలు కొని మహాకవులందరు -

1. ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్ర-తిక్కన ఆంధ్రమహా , బారతము.

2. తిక్కనామాత్య పుత్ర మారన నామధేయ - మారన మార్కండేయ పురాణము

3. మారయామాత్యపుత్ర సుకవి జనవిధేయ కవి సార్వభౌమ - కాశీఖండము.

4. తిక్కనామాత్య సంభవ సుకవి జన విధేయ- భోజరాజీయము.

5. చొక్కనామాత్య పుత్ర పెద్దనార్య ప్రణీతంబైన -- మనుచరిత్ర.

6. సకలసుకవిజనమిత్రదేచనామాత్య కుమార-హరశ్చంద్రోపాఖ్యానము.

7. మైత్రావరుణగోత్ర - బ్రహ్మనామాత్య పుత్ర - పంచతంత్రము. అనియిట్టుల తమతండ్రి తాతల నమాత్య విశేషణముననే చెప్పుకొనిరి. వీరందరు బ్రాహ్మణులు నియోగులు కావున కీ.శే. కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు తెలగన్న బ్రాహ్మణుడని నిర్ణయించిరి. వారిననుసరించి కందుకూరి వీరేశలింగము పంతులు గారును ఇతడు నియోగియని చెప్పిరి.

ప్రస్తుతము బ్రాహ్మణులలో పొన్నగంటి ఇంటిపేరుగల వారి యందు వెలనాటి వైదికులు ఆర్వేల నియోగుల అను రెండు తెగల వారున్నారు. ఈ ఆర్వేలవారు శ్రీవత్సగోత్రులు.

తెలగన్న గోలకొండ నివాసి తెలంగాణమున గల నియోగులకు గోలకొండ వ్యాపారులని పేరు, వీరందరు వైష్ణవమతానుయాయులు. కానియితడు శ్రీవైష్ణవుడనియే శ్రీ విరించిగారి మతము.

వైష్ణవమున వడహల-తెనహల యని రెండు శాఖాభేదములు గలవు. నియోగులలో గోలకొండ వ్యాపారుంద రెక్కువగా తెనహల శాఖకే చెందుదురు. కావున గోలకొండ నివాసియైన పొన్నగంటి తెలగన గోలకొండ వ్యాపారులకు చెందిన వాడని తెనహల మార్గాను యాయి యని తలపవచ్చును.

ఇతనికాలమునాటికి నాంధ్రమున ప్రబంధశాఖ పరిపుష్ఠమై కవులు నూతన మార్గప్రియులైరి.

రామరాజభూషణుడు సంగీత సాహిత్యములు జోడించివసుచరిత్ర రచించగా పింగళి సూరన ద్వ్యర్థిగా రాఘవపాండ వీయమును, కల్పనా కథగా కళాపూర్ణోదయమును, పద్యమయరూపకముగా ప్రభావతీ ప్రద్యుమ్నమును రచించెను, మరింగంటి సింగరాచార్యులు నిరోష్ఠ్య రామాయణమును రచించెను.

ఇటుల సమాకాలికులు నూతన మార్గాన్వేషకులుకాగా తెలగన తాను వారందరికి మొదటగ అచ్చతెనుగు ప్రక్రియను చేపట్టి దాని కాద్యుడయ్యెను. పాలెము శ్రీ రంగాచార్యగారుమాత్రమీమత మంగీకరించలేదు. చూ. భారతి-

తెలుగు భాష కాంధ్రము, తెనుఁగు తెలుఁగు అనుమూడు వ్యావహారము లున్నవి. అవియే జాతి వాచకములు గాగూడ నున్నవి. ఆంధ్రుల ప్రసక్తి మొట్టమొదట ఋగ్వేదమునకు సంబంధించిన యైతరేయ బ్రాహ్మణమున, మొదటి దనదగిన తెలుగుపద మమరావతీ స్థూప పలకమున గనుపించును.

శాతవాహనుల కాలమున ప్రాకృతగాథలలో దోబూచులాడు నీ భాషకు ఐదవ శతాబ్దమందలి యుత్తరార్థమున గల రేనాటి వంశమునకు చెందిన ధనం జయ వర్మయను మహారాజు రాజగౌరవ మిచ్చి శాసన పీఠమెక్కించెను.

బూదరాజు రాధాకృష్ణగారు తమ శాసన పరిశోధనమున మన భాషను క్రీ.శ. 200-600 వరకు ప్రాక్సాహిత్య దశయని 7 నుండి 9 శతాబ్దుల మధ్య కాలము సాహిత్యదశయని 10 నుండి 11 శతాబ్దుల నడిమి కాలము కావ్యభాషా దశయని వింగడించిరి, క్రీ.శ.7 వ శతాబ్ది నుండియే ఈ భాషయందు కావ్యశైలి యేర్పడినదని శ్రీకోరాడ మహాదేవ శాస్త్రిగారు నిరూపించిరి. రేనాటి వంశమునకు చెందిన పుణ్య కుమారుని కాలమునుండి మొదటి వనదగిన కవితా శాసనము ఆరంభమైనది.

నన్నయభట్టు నిపుడుమన మాదికవిగా నంగీకరించుచున్నాము. కాని సుమారుగా నతని కంటె రెండువందల సంవత్సరముల మొదటినుండియే తెనుగు కవిత మనకు శాసనములందు కనిపించుచున్నది. కాని యాకాలపు గ్రంధము లేవి లభింపకుండుట యాంధ్రసరస్వతి దురదృష్టము.

రాజరాజు నన్నయగారిని – జననుత కృష్ణద్వైపా, యనము నివృషభాభిహితమహా భారతబ, ద్ధనిరూపి తార్థ మేర్పడ, తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్ – అని కోరెను . ఆకోరిక ననుసరించి నన్నయగారు తనను గురించి తెనుంగున మహా భారత సంహితా రచన బంధురుడయ్యె – అని చెప్పుకొనెను.

తిక్కనగారు గూడ విరాట పర్వాదిని– హృదయాహ్లాది చతుర్థమూర్జిత కథోపేతంబు – అనుపద్యమున పదియేనింటి తెనుంగుబాసజన సంప్రార్థ్యంబులై పెంపునన్ తుదిముట్టన్ రచియించుటొప్పు– అనిచెప్పను. ఇట్లీయిద్దరు మహాకవులీ భాషను తెనుగని నకార మధ్యముగనే చెప్పిరి.

ప్రస్తుతము మన వ్యవహారమందున్న తెనుగున తత్సమము – తద్భవము, దేశ్యము, గ్రామ్యము అనినాలుగు విధములైన పదసముదాయ మున్నది.

తల్లి సంస్కృతంబె – యెల్లభాషలకును ఆం. భా. భా.
జనని సంస్కృతంబు సర్వభాషలకును–

అనికేతన శ్రీనాధులు భారతదేశ భాషలను గురించి నుడివిరి. దేశభాషలు సంస్కృత జన్యములుగా కున్నను సంస్కృతము తనకుగల విజ్ఞాన బలము చేత భారతీయ భాషలన్నిటిపై తన ప్రభావమును వీలైనంతగా పడవేసినది. అందువలన ప్రాచీన లాక్షణికులందరు దేశభాషలన్ని సంస్కృత జన్యములనియే తలచిరి కనుక సంస్కృత ప్రభావము గల భాష లన్నిటి యందును తత్సమ తద్భవాది భేదములు తప్పవు.

నన్నయగారిది తత్సమ బహుళమైన శైలి, తిక్కనగారిది దేశీయత నిండిన శైలి.

దేశ్యమున ఆంధ్రదేశ్యము లేదా దేశ్యము అన్యదేశ్యము అనిరెండు భేదములున్నవి -

1. ఏ దేశమున మానవులకు నాదేశ భాష దేశ్యము - అప్పకవి-

2. త్రిలింగదేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు- సూరి-

3. దేశ వ్యవహార సిద్ధము దేశ్యము- మల్లాది-

4. ఆంధ్రదేశ వ్యవహార సిద్ధమైన భాషదేశ్యం- వఢ్లమూడి-

అనివైయ్యాకరణులు దేశ్యమును నిర్వచించిరి. భాషావిషయమున తమిళులొక్కరే తమ భాషను సంస్కృత సంపర్కము నుండి కాపాడుకొనిరి. తెనుగు భాషకు దేశ్యమొక్కటే నైసర్గికము. దానికే అచ్చుతెలుగు నాటు తెలుగని పేరు. నేడుయిటువంటి నాలుగు వంతులు తద్భవములు పాకృతమునుండి యేర్పడినను అవి మనవారు సంస్కృత భవములుగా భావించి వానిని తెలుగు వర్ణ పద్ధతికి లోబడిన కారణమున నచ్చు తెలుగుగా భావించుచున్నారు యిక దేశ్య విషయమునకు వచ్చినపుడు వానిలో సహజాంధ్ర దేశ్యములకంటె అన్యదేశ్యములే యెక్కువ.

మన దేశభాషయందు కావ్యభాషా దశయందు దరువు పదములు మిక్కిలిగా ప్రవేశించెనని శ్రీ ఆరుద్రగారనిరి.

తెనుగు - తెలుగు

ఏభాషకైనను రెండు పేర్లుండుట సహజముకాదు కాని మనభాషకు రెండుగాదు మూడు పేర్లున్నవి. లాక్షణికులు తెనుగు త్రినగ శబ్ద భవమని తెలుగు త్రిలింగ శబ్దభవమని చెప్పుచున్నారు. గ్రంథస్థముగా మనకు మొదట తెలుగు పదమే లభించును కాని నన్నయగారు తెనుగు అనినకార మధ్యమును వాడిరి.

నకార - లకారములకు తెనుగు భాషయందు వినిమయము కలదు కాన తెనుగు తెలగు యొక్క రూపాంతరమే యని భాషాశాస్త్రజ్ఞుల మతము.

సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు దీనిని తెలుగని లకార మధ్యముగనే వాడెను.

ఆ.వె. : తెలుగదేలయన్న దేశంబు తెలుగేను-తెలుగు వల్లభుండ తెలుగొకండ ఎల్లనృపులు గొలువ యెరుగవే బాసాడి - దేశభాషలందు తెలుగులెస్స. అని ఆంధ్రవిష్ణువుతన కానతిచ్చినట్లు శ్రీ కృష్ణ దేవరాయలాముక్త మాల్యద యందు చెప్పెను. తెలుగు - కన్నడము, అరవము. తుళు, గోండు- ఇవిమూల ద్రావిడ జన్యములని భాషాశాస్త్రజ్ఞుల మతము- వీనియందు చివరి రెండింటికిప్పటి వరకును స్వతంత్రలిపి లేదు.

రాయలు తుళువ వంశమునకు చెందిన వాడుకాన ఆవంశము వారెపుడో తెలుగు దేశమునకు వచ్చి స్థిరపడి తెలుగు వారిలో కలిసి పోయిరని పరిశోధకుల తలంపు.

దక్షిణ భారతమున నానాడు విజయనగర సామ్రాజ్యము మిక్కిలి విశాలమైనది. కాన నారాజ్యమున తెలుగు వారితో పాటు అరవలు, కన్నడులు, మలయాళీలు, కేరళులు, చోళులు, పాండ్యులు, మరెందరోయుండిరి. అరబ్బి, పారసి , తురుష్కము, రుమీ ఆరె, కనోజి మొదలైన వివిధ భాషలు మాటాడు సామంతులు వ్యాపారులు విజయనగరమున నివసించు చుండిరి. రాయలు వారితో స్వయముగా వారిభాషలో మాటాడియు లేదా దుభాసీలు మాటాడగా వినుచుండియు నుండును . అందువలన - దేశభాషలందు తెలుగు లెస్సయని రాయలు చెప్పిన తీర్పు స్వానుభావ పూర్వక మైనదే తప్ప వేరుగాదు. ఈభాషయొక్క మాధుర్యమున కలరి హరికథా పితామహుడైన ఆదిభట్ల నారాయణ దాసుగారు.

ఆ.వె.: మొలకలేత దనము తలిరులన వకంబు-మొగ్గసోగదనము పూవుతావితెనె తీయదనము తెలుగునకేగాక - పరుష సంస్కృతాఖ్య భాషకేది యని సవాలు చేసిను భాషయొక్క మాధుర్యమున కలరి యింకనుయెందరో దీనిని కొనియాడిరి.

నన్నయగారు తెనుగున భారత రచన మారంభింపగా నతని పిమ్మట కవిరాజ శిఖామణి యైన నన్నెచోడుడు మరియొక యడుగు ముందునకు వేసి జాను తెనుగున కుమారసంభవ రచన చేపట్టెను. ఆయన భావించిన జానుతెనుగునకు-

సరళముగాగ భావములు జానుతెంగున నింపుబెంపుతో
బిరిగొన వర్ణనల్ ఫణితి బేర్కొన నర్థములొ త్తిగిల్లబం
దురముగ ప్రాణముల్ మధుమ్పదుత్వ రసంబునొగందళింపన
క్షరములు సూక్తులార్యులకు కర్ణ రసాయన లీలఁగ్రాలగా ౯ - కుమా. 1-35

అని లక్షణము చెప్పెను. కాని తనకావ్యమును పూర్తిగా సరళభావములతో నిర్వహింప జాలక పోయెను. అయినను తనప్రతిజ్ఞను నిలుపుకొనుటకు చాలావరకు ప్రయత్నము చేసెను.

విమర్శకులు మాత్రము యితడు చెప్పిన సరళముగాక భావములు- అక్షరములు సూక్తులార్యులకు కర్ణరసాయన తీలగ్రా ల- అనునవి నన్నయగారి సారమతిన్ కవీంద్రులు ప్రసన్న కథాకలి తార్థ యుక్తిలో నారసిమేలునా ని తరు లక్షర రమ్య తనాదరింప- అను దానిరుండే గతార్థమగునని తలచిరి.

యేది ఏమైనను నన్నెచోడు డారంభించిన యీజాను తెనుగు ఉద్యమమునకు పాల్కురికి సోమన వంటివాడు ఆకర్షితుడైతన బసవ పురాణమున

ద్వి ॥ ఉరుతర గద్య పద్యోక్తుల కంటె
సరసమై బరగిని జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్య మగుట
కూర్చెద ద్విపదము కోర్కెదైవార- అని పండితారాధ్య చరిత్రయందు
ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబుగామి

జానుతెనుగు విశేషము ప్రసన్నరకు -అని తెలిపి జాను తెనుగు లక్షణమును వివరించి సంస్కృత భూయిష్ఠమైన పద్యగద్యరచనలు సామాన్య జనుల కర్థముగావని, వారికర్థమగు నదే జాను తెనుగనిస్పష్టమరచెను . కాని తానుగూడ తన కావ్యములను పూర్తిగా జాను తెనుగున రచింపలేకపోయెను . వృశాధిప శతకమున కన్నడము, అరవము, ఆ భాషలలో పద్యములు వ్రాయుచు బలుపొడతోలు సిరయును బాపనరుల్ గింబారుకన్నువెన్నెల తలచేతు కుత్తుకయునిండిన వేలుపుటేరు వల్లుపూసలు గలతేని లెకవని- జాను తెనుంగున విన్నవించెదర౯ వలపుమది౯ దలిర్ప బసవా బసవా వృషాధిపా!

అని అచ్చమైన జానుతెనుగునకు స్పష్టమైన యొక యుదాహరణము మాత్రము చూపెను.

కన్నడమున "జాణ్ణుడి" అను పదబంధము గలదు కావున ఈ జాను తెనుగు దానికి సూనార్థక మని కొందరు జాను జ్ఞాన శబ్దభవమని కొందరు, జాణకు తోబుట్టువని

కొందరు భావించిరి. నిఘంటువులు జాను శబ్దమునకు అందము, నాణ్యత, నేర్పు, ఒప్పు స్పష్టము అను అర్థము లిచ్చినవి. కావున జాను తెనుగనగా నందమై సందర్భమునకు తగిన పదములతో నొప్పి విను వారికి స్పష్టముగా నర్థమగు తెనుగని యర్థము చెప్పవలసియుండును. జాను తెనుగని చెప్పుకున్నను తిక్కన మొదలుకొని కవులందరు-

క॥ లలిత పద హృద్యపద్యం
బులను కథార్థంబు ఘటిత పూర్వాపరమై
యలతి యలతి తునియలుకా
వాళ సంధించిన విధమున నమరగ పలయుగా
తిక్కన నిర్వచనోత్తర రామాయణము
తెనుగున తేటగాథలు తెల్పిన కావ్యము పొందులేదు మె
త్తన పసచాల దంద్రు విశదంబుగ సంస్కృత శబ్దమూదజె
ప్పిన విదర్భ ముండ్లనుచు బెట్టరు వీనులగాపునగా రుచుల్
దనర తెనుంగు దేశియును తద్భవముల్ గల యంగ జెప్పదున్
కొరివి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక తేనెసొక సోరు తీయముగాందీ
లోనయర్థమెల్ల దోపకుండ -
గూఢ శబ్దములను గూర్చిన కావ్యంబు
ముగ చెవిటివారి ముచ్చటంద్రు-

మొల్ల- రామాయణము

అనియిటుల జాను తెనుగు లక్షణము చెప్పిన వారేకాగ పొన్నగంటి తెలగన వీరందరి దాటవలెనని తానొక క్రొత్త నియమేర్పరచు కొని యచ్చ తెనుగు ప్రక్రియను చేపట్టెను.

జాను తెనుగు – అచ్చతెలుగు

అచ్చతెనుగనగా శుద్ధదేశ్యమ్యమని యర్థము.

1. ఎల్లవారికి ,దెలిపెడి యూపలుకు లచ్చతెనుగన బరగుగా- కేతన- ఆం. భా.

2. క॥నెలకొను సంస్కృత తత్సమ-ములు దొరలక తజ్ఞ దేశ్యముల మూటన

సంధిల కేవలాంధ్రములునా –నరుల కృతుల నచ్చతెనుగులంద్రు తెలుగునగా –

అప్ప-1-111

3. సంస్కృతమే తరం బైన ఈ భాషయచ్చుయనంబడు-సూరి-బాల

4. సంస్కృతసమేతరమైన భాష అచ్చుతెనుగు - వడ్లమూడి - వ్యవహారికాంధ భాషా వ్యాకరణము-

2. తెలుగు పురుంగులు ప్రాదెను-గులు తత్సమ దేశ్యములను గూర్చివ్ప్రుదుపదం బులుగాగ నచ్చుతెలుగులు, మెలకువతో జెప్పెదగు శమిూప్రాంతగృహ- అప్ప 1-112-

అచ్చుతెనుగును నిర్వచించుటలో లాక్షణికులందేకాభి ప్రాయములేదు. తొలి తెలుగులాక్షణికుడైనకేతన -తత్సమము, తద్భవము, అచ్చుతెనుగు, దేశ్యము, గ్రామ్యము -క. భువిలో కత్సమమును తద్భవ మును సహజాంధ్ర దేశభవమును దేశ్యోద్భవమును గ్రామ్యమునా బంచ విధములై తెలుగు పలుకు జాతముదనర్చు అని పదముల నైదువిధములుగా విభజించగా విన్నకోట పెద్దన తత్సవు తద్భవముల పిమ్మట అచ్చుతెనుగనుటకు సహజాంధ్ర దేశభవమని, దేశ్యమునకు బదులు దేశ్యోద్భవమని పేర్కొనెను.

ప్రస్తుతము మన వాడుక యందన్న తత్సమ, తద్భవ, దేశ్యగ్రామ్యమను చతర్విధ విభాగము అప్పకవిగావించి దేశ్యమును ఆంధ్రదేశ్యము లేదా దేశ్యము, అన్యదేశ్యము అని రెండు విధములుగా వింగడించెను-

ఈ విభాగము దేశభాషలన్నిటికిని సమానమే. ఈలాక్షణికు లందు కేతన తెలిపిన యచ్చుతెనుగు పిన్నకోట పెద్దన చెప్పిన సహజాంధ్ర దేశజము రెండును ఒక్కటియేయగును.

ఆంధ్రభాషయందలి పదవిభాగమున తత్సమముతో తద్భవముగాని, దేశ్యముగాని సమవపింపదు కనుక తత్సమము తప్ప తక్కిన మూడొక వర్గముగానుండి ప్రస్తుత మవియే యచ్చుతెనుగన బడుచున్నవి.

అచ్చుతెనుగని చెప్పకున్నను కొరివి గోపరాజు చెప్పిన లక్షణ మచ్చు తెనుగునకే సరిపోవును. తద్భవమునకు వికృతియని మరియొకపేరు. వికృతులు మూల భాషనుండి వర్ణాగమ, వర్ణాదేశ, వర్ణలోప, వర్ణవ్యత్యయ, స్వరప్లుతియను పంచవిధ వికారములచే నేర్పడు చుండును. తెనుగునకు సంస్కృతము, ప్రాకృతము అనురెండు ప్రకృతులున్నవి. కావున దీనియందు రెండు భాషలయొక్క తత్సమ తద్భవములు కాననగును.

ఈ భాషయందలి వికృతులలో నైదింట నాలుగువంతులు ప్రాకృత భవములే యని వానిని పండితులు సంస్కృతములుగా భ్రమయుచున్నారని పరిశోధకుల మతము.

అన్యదేశములందు అరబ్బీ, పారసీ, తురుష్క, పురతకేశ మొదలైన వైదేశ్య పదము లెన్నియో దీనియందు తమిళ కన్నడ మరాఠా పదములతో పాటు చేరిపోయి అచ్చతెలుగుగా చెలామణి యగుచున్నవి.

మనభాషయందుదేశ్యవిభాగమున ఆంధ్రదేశ్యములకంటె యనన్య దేశ్యములే యెక్కువ యందురు

జానుతెనుగు- అచ్చతెలుగు రెండొకటియే యని కొందరి తలంపుకాని ఆరెండు వేర్వేరు. జానుతెనుగును మొదట పేర్కొనిన నన్నెచోడ సోమనాథాదుల మత ప్రకారము కవి చెప్పదలచిన దానిని జన సామాన్యమున కర్థమగునట్లు సులభ సుందర శైలిలో చెప్పుట దాని ప్రధాన లక్షణము.ఈ ప్రయోజనమునకై దీనియందు మహాప్రాణములతో సంయుక్తములతో కూడని కేవల నిఘంట్వాశ్రయములు కాని తత్సమములకు ప్రవేశముండును ఇక అచ్చ తెనుగన్న నో రిటులగాదు. దానియందు తత్సమముల కెంతమాత్రము ప్రవేశముండదు.దేశ్యములు నై ఘంటికములైనను వానికి తప్పక ప్రవేశముండును. ఇది ఈ రెండు భాషలకు గలభేదము.

ఆంధ్రభాషయం దచ్చతెనుగు వలెనే కన్నడమున 12 శతాబ్దముననే అచ్చగన్నడ వాద మావిర్భవించి క్రీ.శ. 1225 ప్రాంతమున జైనకవియగు నండయ్య కావనగెల్ల (కాముని గెలుపు) అను చంపువు నచ్చగన్నడమున రచించెను. అదేవిధముగా మలయాళమున క్రీ.శ. 15వ శతాబ్దమున శుద్ధమలయాళ మను ఉద్యమమారంభమై"కృష్ణగాథ" యను శుద్ధమలయాళ కావ్యము వెలసెను. కాని తెలుగున16వ శతాబ్ద ప్రారంభము వరకు అచ్చతెలుగు కావ్యములేవి వెలువడలేదు. అందులకు కారణము కూచిమంచి తిమ్మయ కవి తనయచ్చ తెనుగు రామాయణమున నిట్లుచెప్పెను.

తెనుగు చదువున పున్నియంబెనయదనుచు
కొందరాడుదు రాడిన కొఱతయేమి
మునుమరాయంచునుడివిన చెనటిబోయ
నెఱనిరాబారియగుటయే గుఱుతుగాదె -

అచ్చతెనుగు కృతులను తెనుగని చులకన చూడవలదని ఇంతవరకే పాల్కురికి సోమన తన బసవపురాణమున -

తెలుగు మాటల సంగమదు వేదముల
కొలదియగా జూడుడిల నెట్టులనిస
పాటింప తూముకు పాటియౌనేని
పాటింప సోలయు పాటియౌ గాదె
అల్పాక్షరముల ననల్పార్ధ రచన
గావించుటయెకాదె కవి వివేకంబు -

అని పలికెను. నన్నెచోడ పాల్కురికి సోమనాథులు జాను తెనుగుపై యభిమానముగనబరచినను తమకావ్యములను పూర్తిగా జానుతెనుగు నందే రచింపలేక పోయిరి. తిక్కనగారి పిమ్మట నతనివలె నాచన సోమన దేశ్యముపై ప్రేమ ప్రకటించినను యతుడుగూడ నుత్తర హరివంశమును పూర్తిగా దేశభాషలో వ్రాయలేకపోయెను.

నన్నయగారు భారతమున 2506 పద్యములు వ్రాయగా నందు కేవలము రెండు మాత్రమే. అటులే తిక్కనగారు 11354 పద్యములు వ్రాయగా నందు 34 పద్యములు మాత్రమే, ఎఱ్ఱనగారు 1099 పద్యములు రచించగా నందు 2 మాత్రమే అచ్చ తెనుగులుగా దొరలినవి. అవియైనను యాదృచ్ఛికములేగాని ప్రత్యేక దృష్టితో వ్రాసినవికావు -

నన్నయాదుల వలె గాక నుత్తర హరివంశమున నాచన సోమన మాత్రము ప్రత్యేక దృష్టితోనే రెండు పద్యము లచ్చతెనుగును వ్రాసెను.

నాచన సోమన దేశీయతపై మక్కువ చేతను, పద్యనిర్మాణ శిల్పము చేతను నవీన గుణ సనాధుడై తనయనంతరము పలువురు కవులను ప్రభావితము చేసెను.

సోమన యొక్క దేశీయత తెలగన్నను బాగుగా నాకట్టుకొని యుండును. అందుచేతనే యతడంత వరకెవరూహింపని మరియు నారంభించని ఈనూతన ప్రక్రియకు శ్రీకారము చుట్టెను.

పొన్నగంటి తెలగన తానారంభించిన ఈ యచ్చతెనుగు ఈ కావ్యవిషయము మరింగంటి యప్పలాచార్యులకు తెలిసి ఆయన -

అచ్చతెనుంగు పద్దె మొకటైనను కబ్బములోన నుండినన్
హెచ్చని యాడు చుందురది యెన్నము నేర్పున బొత్తమెల్లని
ట్లచ్చ తెనుంగున న్నొడువ నందుల చందమెఱుంగువారునిన్
మెచ్చరొ యుబ్బరంబునరొ మేలనరో కొనియాడరో నిను

అని యభినందించెను. అతని యొక్క ఈయభినందన అనగా అచ్చ తెనుంగు పద్యమొకటైనను కబ్బములోన నుండగా అను ప్రశంస బహుశ: నాచన సోముని ఉత్తర హరివంశము పిమ్మటనే సాహిత్య లోకమున వ్యాప్తిచెంది యుండవచ్చును.

ఇక మల్కిభ్రాహీం పాదుషాకు తెలుగనిన అందునను సంస్కృత భూయిష్టమైన రచనకంటె యచ్చతెనుగనిన మిక్కిలి యిష్టమని శ్రీఆరుద్రగారు తమ సమగ్ర ఆంధ్ర సాహిత్యమును సునీతికుమార చటర్జీగారి ఆధునిక భారతదేశ మందలి భాషలు సాహిత్యములు అను నొక ఆంగ్లగ్రంథము నుండి పాద సూచికలో నొక యుద్ధరణ మిచ్చిరి. (చూ.స.ఆం.సం. 6 పుట 74) కనుక యథారాజా తథా ప్రజ యను న్యాయమును మల్కిభరాముని మంత్రియైన అమీనుఖాను గూడ తెనుగుపైన భిమానము గలవాడయ్యెననవచ్చును.

తొలి ఆకరములు

తెలుగు – అగత్తియం – తమిళవ్యాకరణము   ఆగస్త్యుడు – 5వ శతాబ్దం

ఆంధ్ర–కువలయమాల–ప్రాకృతవ్యాకరణము   ఉద్యోతనుడు – క్రీ.శ.9వ శతాబ్దం

తెనుగు – ఆంధ్రమహాభారతము –   నన్నయభట్టు – క్రీ.శ.11వ శతాబ్దం

తొలితెలుగుమాట

తొలితెలుగుపదము – నాగబు – అమరావతీస్తూపము–200 + 200 గుర్తించినవాడు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

తొలితెలుగు వాక్యము – విజయరాజ్యసంవత్సరంబుళ్ – బిక్కవోలుశాసనం క్రీ.శ.

మెదటి తెలుగు శాసనము – కలమళ్ల శాసనము – ధనంజయుడు – క్రీ.శ. 575

మెదటి కవితా సాక్ష్యాలు – పొట్లదుర్తి మాలెపాడు శాసనాలు– పుణ్యకుమారుడు క్రీ.శ. 848

మెదటి లక్షణ గ్రంథము – కవిజనాశ్రయము – మల్లియరేచన – క్రీ.శ. 951 ప్రాంతం

మెదటి కావ్యము – ఆంధ్రమహాభారతము – నన్నయ – క్రీ.శ. 1051 ప్రాంతం

మొదటి పద్యములు

తరువోజ - పండరంగనియుద్ధంకి శాసనము -	క్రీ.శ.848
ఆటవెలది - ధర్మవరశాసనము - గుణగవిజయాదిత్యుడు -	క్రీ.శ. 848
తేటగీతి - కందుకూరు శాసనము- గుణగవిజయాదిత్యుడు -	క్రీ.శ. 848
చంపకము - సాతలూరు శాసనము- గుణగవిజయాదిత్యుడు -	క్రీ.శ. 848
సీసము - కందుకూరుశాసనము- గుణగవిజయాదిత్యుడు -	క్రీ.శ. 850
మధ్యాక్కర - బెజవాడశాసనము - యుద్ధమల్లుడు -	క్రీ.శ. 885
మత్తేభము - ఆదిపురాణము సర్వదేవుడు -	క్రీ.శ.953
ఉత్పలమాల - గూడూరు శాసనము -విరియాల కామసాని-	క్రీ.శ. 1000
రగడ - కోరుమిల్లిశాసనము - రాజరాజు -	క్రీ.శ. 1022
వచనము - కొరివిశాసనము - చాళుక్యభీముడు -	క్రీ.శ. 892 పిదప

తెలుగు దేశమున ముస్లిముల పరిపాలన

తెలుగు వారికి సుల్తాన్ కుతికుతుబుల్ముల్క్, సుల్తాన్ కులీకుతుబ్‌షా, ఇబ్రాహీం కుతుబ్‌షా, కులీకుతుబ్‌షాలు చిరస్మరణీయులు.

కుతుబుల్ముల్క్ వంశము :-

వీరు టర్కీనివాసులు, ఖరానీకుల్ (నల్లగొర్రె) వంశీయులు. ఈ వంశమున పెక్కుయోధులు జన్మించిరి. ప్రపంచ ప్రఖ్యాత వీరుడైన చంఘీజ్‌ఖాన్ నెదుర్కొనిన కీర్తి ముస్లిం ప్రభువులలో వీరికే దక్కినది. అతని నెదుర్కొనిన పిమ్మట ఈరాన్ లోని పశ్చిమ భాగముల నాక్రమించి"హందాం" ను రాజధానిగా చేసికొనిరి ఆసియా ఖండమున తైమూరు పిమ్మట వీరిరాజ్యమే చెప్పదగినదిగా నుండెను.

ఈ వంశమున ఖరామహమ్మదు కుమారుడు ఖరాయూసిప్ గొప్ప సమర్థుడు. అతడు క్రీ.శ. 1347 (హి. 750) లో వచ్చిన తైమూర్ దండయాత్ర నెదుర్కొని తన రాజ్యమును రక్షించుకొనెను. అతనికి అమీర్ జాదా సింకందర్, జహన్‌షా యను నిద్దరు కుమారులు కలిగిరి. అమీర్ జాదాకు రెండవ సికందర్ అని వ్యవహారము. అతడు సమర్థుడైన ప్రభువు. అతనికి అమీర్ జాదా అల్వింద్, కైకుబాద్ అను నిద్దరు కుమారులు కలిగిరి. కైకుబాద్ క్రూరుడు. జహిన్‌షా అల్వింద కండగా నుండి తండ్రి పిమ్మట నతనిని సింహాసన మెక్కించి యతని కుమారుడగు పీర్‌కుతికి తన పౌత్రియైన ఖతజాబేగం నిచ్చి తమ బాంధవ్యమును ధృఢపరచెను.

పీర్‌కులీకి అర్దీకులీ , అల్లాకులీ యని యిద్దరు కుమారులు కలిగిరి. తండ్రిగారి పిమ్మట అర్దీకులలీ సింహాసన మెక్కెను. అతని భార్య మరీం ఖాతూ . ఈ దంపతులకు గోలకొండ సామ్రాజ్య స్థాపకుడైన సుల్తాన్‌కులీ జన్మించెను. అతనికాపేరు తాతాగారే పెట్టెను.

ఈ కాలమున టర్కీలో దయాబకర్‌ను అఖనేల్ (తెల్లగొర్రె) తెగకు చెందిన జమీందారు లేలుచుండిరి. ఖరాయూసప్ రెండవకుమారుడు జహాన్‌షా దయాబకర్‌ను పాలించు అమీర్‌హసన్‌పై దండెత్తెను. అపుడతడు జహన్‌షాకు లొంగిపోయినట్లు నటించి అతనిని లోబరచుకొని సమయము చూచి యుద్ధము ప్రకటించగా దానిలో జహాన్‌షా మరణించెను.

అపుడు అమీర్ హసన్‌వర్గము వారు హందాం నాక్రమించుకొని ఖరానీకుల్ తెగవారినందరిని వధించుచుండగా హందాం పౌరులడ్డుపడి పీర్‌కులీ సాత్వికుడైన గృహస్థని అతనిని కాపాడిరి.

అమీర్‌హసన్ పిమ్మట అతని కుమారుడు ఖలీల్‌ఖసుల్తాను ప్రభువయ్యెను. అతని కాలము శాంతముగనే గడచెను. అతని పిమ్మట కుమారుడైన యాకూబు సింహాసనమునకు వచ్చి మరల ఖరానీకుల్ తెగవారిపై పగసాధింప సమకట్టెను.

సుల్తాన్ కుతుబషా

అప్పటికి సుల్తాన్‌కుత యువకుడయ్యెను, జ్యోతిష్కులతని ముఖము చూచి తండ్రితో నీకుమారుని యందు జహన్‌షా లక్షణము లున్నవి. అతడు చక్రవర్తి కాగలడు. ఇక్కడ యాకూబ్‌తో నతనకి ప్రాణహాని కలుగును. కనుక అతనిని భారత దేశమునకు పంపుము. అతడచట తన యదృష్టమును పరీక్షించుకొనునని చెప్పిరి.

వారి మాటలు విని అదీన్‌కులీ సుల్తాన్‌కులీని అల్లాకులీవెంట భారత దేశమునకు పంపి వారికి కొన్ని విలువైన కానుకలు మరియు మేలు జాతి గుఱ్ఱము లిచ్చి వీనితో మీరు ఢిల్లీ సుల్తానులను దర్శింపుడని చెప్పెను.

దేశమున నప్పుడప్పుడే ఖిల్జీవంశమంతరించి లోఢీవంశము వచ్చెను. దాని స్థాపకుడైన బహలాల్ లోఢీ ఢిల్లిని పాలించుచుండెను. కేంద్రము తైమూర్ దండయాత్ర యొక్క దుష్ఫలితము నుండి యింకను త్రిప్పుకొనకుండెను.

భారత దేశమునకు వచ్చిన సుల్తాన్ కులీని ఢిల్లీ సుల్తానుల రాజవైభవములు ఆచార వ్యవహారములు ఆకర్షించెను. ఇచటి వాతావరణ మతనికి నచ్చెను. కాని వారెన్ని విలువైన కానుకలు తెచ్చియిచ్చినను ఢిల్లీ సుల్తానులకు వారిపై ఆదరాభిమానములు కలుగలేదు.

ఈ కాలమున బీజాపూరును బహమనీ వంశమునకు చెందిన మహమూద్‌షా పాలించుచుండెను. వీరు పారసీకులు, విజయనగర కాలమున గుల్బర్గాయొక్కటే మహమ్మదీయ రాజ్యము. తుగ్లకు దక్షిణ భారతమును జయించి అచట హసన్ గంగూ బహమనీని నిలిపి పోయెను. అతడు తన రాజ్యమును గుల్బర్గా దౌలతాబాద్, బీదర్, బీరార్ అనునాలుగు తరఫులు (రాష్ట్రములు) గా విభజించి నలుగురు తరఫు దార్లను నిలిపెను. బహమనీ వంశమున పదిమంది రాజులు గడిచిరి. విజయనగరము వారికి వీరికి నిరంతరవైరము సాగుచుండుట వలన ఆరవ ప్రభువైన అహమ్మద్‌షా తమరాజధానిని గుల్బర్గానుండి బీదర్‌కు మార్చెను. ఈ వంశమున చివరివాడు మహమూద్‌షా.

సుల్తాన్ కులీ, అల్లాకులీ క్రీ.శ. 1486లో బహమనీ రాజ్యమునకు వచ్చిరి. అపుడు దానిని మహమూద్‌షా పాలించుచుండెను. బహమనీప్రభువులు పారసీకులు. వీరికి ఈరాన్ మరియు టర్కీతో స్నేహసంబంధములుండెను. అందువల్ల నాదేశముల నుండి యెందరో కవులు పండితులు వచ్చి వీరిరాజ్యమున నున్నత పదవులలో నిల్చిరి.

సుల్తాన్‌కులీ, అల్లాకులీ తమ యాస్థానమునకు రాగా మహమూద్‌షావారు ఖరాకునేల్ వంశీయులని తెలిసి గౌరవించి వారిచ్చిన కానుకలు గ్రహించి తన యాస్థానమున వారిని నిలుపుకొనెను. వారక్కడ నిలిచిన కొన్ని దినములకు హందాములో ప్రభువు మరణించెనను వార్త వచ్చెను. అపుడు సుల్తాన్‌కులీ, అల్లాకులీ తమ యాస్తులకొరకై స్వదేశమునకు వెళ్ళుటకాజ్ఞనడిగిరి. అపుడు మహమూద్‌షా సమర్థులైన రాజవంశీయులు తమ యాస్థాన మందుండుట రాజ్యమునకు క్షేమకరమని తలచి వారి కోరిక నిరాకరించెను.

ఈ వంశమున ఖరామహమ్మదు కుమారుడు ఖరాయూసిప్ గొప్ప సమర్థుడు. అతడు క్రీ.శ. 1347 (హి. 750) లో వచ్చిన తైమూర్ దండయాత్ర నెదుర్కొని తన రాజ్యమును రక్షించుకొనెను. అతనికి అమీర్ జాదా సింకందర్, జహన్‌షా యను నిద్దరు కుమారులు కలిగిరి. అమీర్ జాదాకు రెండవ సికందర్ అని వ్యవహారము. అతడు సమర్థుడైన ప్రభువు. అతనికి అమీర్ జాదా ఆల్వింద్, కైకుబాద్ అను నిద్దరు కుమారులు కలిగిరి. కైకుబాద్ క్రూరుడు. జహిన్‌షా అల్వింద్ కండగా నుండి తండ్రి పిమ్మట నతనిని సింహాసన మెక్కించి యతని కుమారుడగు పీర్‌కుతికి తన పౌత్రియైన ఖతజాబేగం నిచ్చి తమ బాంధవ్యమును ధృఢపరచెను.

పీర్‌కులీకి అదీ౯కులీ , అల్లాకులీ యని యిద్దరు కుమారులు కలిగిరి. తండ్రిగారి పిమ్మట అదీ౯కులలీ సింహాసన మెక్కెను. అతని భార్య మరీం ఖాతూ౯ . ఈ దంపతులకు గోలకొండ సామ్రాజ్య స్థాపకుడైన సుల్తాన్‌కులీ జన్మించెను. అతనికాపేరు తాతాగారే పెట్టెను.

ఈ కాలమున టర్కీలో దయాబకర్‌ను అఖనేల్ (తెల్లగొర్రె) తెగకు చెందిన జమీందారు లేలుచుండిరి. ఖరాయూసప్ రెండవకుమారుడు జహన్‌షా దయాబకర్‌ను పాలించు అమీర్‌హసన్‌పై దండెత్తెను. అపుడతడు జహన్‌షాకు లొంగిపోయినట్లు నటించి అతనిని లోబరచుకొని సమయము చూచి యుద్ధము ప్రకటించగా దానిలో జహన్‌షా మరణించెను.

అపుడు అమీర్ హసన్‌వర్గము వారు హందాం నాక్రమించుకొని ఖరానీకుల్ తెగవారినందరిని వధించుచుండగా హందాం పౌరులడ్డుపడి పీర్‌కులీ సాత్వికుడైన గృహస్థని అతనిని కాపాడిరి.

అమీర్‌హసన్ పిమ్మట అతని కుమారుడు ఖలీల్‌ఖసుల్తాను ప్రభువయ్యెను. అతని కాలము శాంతముగనే గడచెను. అతని పిమ్మట కుమారుడైన యాకూబు సింహాసనమునకు వచ్చి మరల ఖరానీకుల్ తెగవారిపై పగసాధింప సమకట్టెను.

సుల్తాన్ కుతుబషా

అప్పటికి సుల్తాన్‌కుత యువకుడయ్యెను, జ్యోతిష్కులతని ముఖము చూచి తండ్రితో నీకుమారుని యందు జహన్‌షా లక్షణము లున్నవి. అతడు చక్రవర్తి కాగలడు. ఇక్కడ యాకూబ్‌తో నతనకి ప్రాణహాని కలుగును. కనుక అతనిని భారత దేశమునకు పంపుము. అతడచట తన యదృష్టమును పరీక్షించుకొనునని చెప్పిరి.

వారి మాటలు విని అదీన్‌కులీ సుల్తాన్‌కులీని అల్లాకులీవెంట భారత దేశమునకు పంపి వారికి కొన్ని విలువైన కానుకలు మరియు మేలు జాతి గుఱ్ఱము లిచ్చి వీనితో మీరు ఢిల్లీ సుల్తానులను దర్శింపుడని చెప్పెను.

దేశమున నప్పుడప్పుడే ఖిల్జీవంశమంతరించి లోఢీవంశము వచ్చెను. దాని స్థాపకుడైన బహలాల్ లోఢీ ఢిల్లిని పాలించుచుండెను. కేంద్రము తైమూర్ దండయాత్ర యొక్క దుష్ఫలితము నుండి యింకను త్రిప్పుకొనకుండెను.

భారత దేశమునకు వచ్చిన సుల్తాన్ కులీని ఢిల్లీ సుల్తానుల రాజవైభవములు ఆచార వ్యవహారములు ఆకర్షించెను. ఇచటి వాతావరణ మతనికి నచ్చెను. కాని వారెన్ని విలువైన కానుకలు తెచ్చియిచ్చినను ఢిల్లీ సుల్తానులకు వారిపై ఆదరాభిమానములు కలుగలేదు.

ఈ కాలమున బీజాపూరును బహమనీ వంశమునకు చెందిన మహమూద్‌షా పాలించుచుండెను. వీరు పారసీకులు, విజయనగర కాలమున గుల్బర్గాయొక్కటే మహమ్మదీయ రాజ్యము. తుగ్లకు దక్షిణ భారతమును జయించి అచట హసన్ గంగూ బహమనీని నిలిపి పోయెను. అతడు తన రాజ్యమును గుల్బర్గా దౌలతాబాద్, బీదర్, బీరార్ అనునాలుగు తరపులు (రాష్ట్రములు) గా విభజించి నలుగురు తరపు దార్లను నిలిపెను. బహమనీ వంశమున పదిమంది రాజులు గడిచిరి. విజయునగరము వారికి వీరికి నిరంతరవైరము సాగుచుండుట వలన ఆరవ ప్రభువైన అహమ్మద్‌షా తమరాజధానిని గుల్బర్గానుండి బీదర్‌కు మార్చెను. ఈ వంశమున చివరివాడు మహమూద్‌షా.

సుల్తాన్ కులీ, అల్లాకులీ క్రీ.శ. 1486లో బహమనీ రాజ్యమునకు వచ్చిరి. అపుడు దానిని మహమూద్‌షా పాలించుచుండెను. బహమనీప్రభువులు పారసీకులు. వీరికి ఈరాన్ మరియు టర్కీతో స్నేహసంబంధములుండెను. అందువల్ల నాదేశముల నుండి యెందరో కవులు పండితులు వచ్చి వీరిరాజ్యమున నున్నత పదవులలో నిల్చిరి.

సుల్తాన్‌కులీ, అల్లాకులీ తమ యాస్థానమునకు రాగా మహమూద్‌షావారు ఖరాకునేల్ వంశీయులని తెలిసి గౌరవించి వారిచ్చిన కానుకలు గ్రహించి తన యాస్థానమున వారిని నిలుపుకొనెను. వారక్కడ నిలిచిన కొన్ని దినములకు హందాములో ప్రభువు మరణించెనను వార్త వచ్చెను. అపుడు సుల్తాన్‌కులీ, అల్లాకులీ తమ యాస్తులకొరకై స్వదేశమునకు వెళ్ళుటకాజ్ఞనడిగిరి. అపుడు మహమూద్‌షా సమర్థులైన రాజవంశీయులు తమ యాస్థాన మందుండుట రాజ్యమునకు క్షేమకరమని తలచి వారి కోరిక నిరాకరించెను.

కాని అల్లాకులీ మరీ మరీ ప్రార్థించుట వలన నతని కొక్కనికి మాత్రము స్వదేశమునకు వెళ్లుట కాజ్ఞ ఇచ్చెను.

ఆపిదప ఒకనాడు మహమ్మద్‌షా సపరివారముగా వేటకు వెళ్లగా అపుడు సుల్తాన్‌కులీ మిక్కిలి ధైర్యమును మరియు నైపుణ్యమును ప్రదర్శించెను. అంతనందులకు- క్రీ.శ. 1486లో మహమ్మద్‌షా సుల్తాన్ కులీకి 450 అరబ్‌జాతి గుర్రములనిచ్చి ఖిల్లతుదయచేసి వాటి నిర్వాహణకు కొడంగల్ మరియు దాని పరిసర ప్రాంతమును జాగీరుగా నిచ్చి "ఖానేఖాన్" అను బిరుదమున సత్కరించెను.

అప్పటి కాప్రాంత మంతయు నడవి. కొండె రిగలకు నడవి పందులకు నిలయమైయుండెను. కొడంగలు ప్రాంతమున సుల్తాన్ కులీ కొన్ని సంవత్సరములుండి పల్లెగా నున్న గ్రామమునభివృద్ధిపరిచి పెద్దకోటగట్టెను. దాని సమీపమున హసనాబాదును స్థాపించెను.

రెండవ అహమ్మద్‌షా కాలమున (1422-35) మస్లిములలో విదేశీయులు స్వదేశీయులు అను భేధము లేర్పడెను. ఈరాన్, తుర్కిస్తాన్ మధ్యాసియానుండి వచ్చినవారు విదేశీయులు. ఆఫ్రికా నుండి వచ్చి మతాంతరీకరణ మందినవారు, మరియు దక్కన్‌లో మతాంతరీకరణము పొందిన వారు స్వదేశీయులనబడిరి. విదేశీయుల వర్ణము తెలుపు. వీరు షియా మతస్థులు, స్వదేశీయులు నలుపు వీరు సున్నీలు, ప్రభువునకు కుడివైపున విదేశీయులు ఎడమవైపున స్వదేశీయులు కూర్చొనుండిరి.

బీదరులో విదేశీయు లెక్కువై స్వదేశీయులను చిన్న చూపు చూడసాగిరి. ఇది మొదటి ముల్కినాన్‌ముల్కీ కలహమునకు బీజము. ఉన్నత పదవులందున్న విదేశీయులు స్వదేశీయులకు విలువ లేకుండ చేయుచుండ నొకపర్యాయము వారాయుధపాణులై వెళ్లి దౌర్జన్యమున కోట తలుపులు మూసి బయటి సహాయము వారికందకుండ జేసిరి. అపుడు సుల్తాన్ కులీ కోటలోనే యుండెను. ఆయన లోపలి వారికి నాయకత్వము వహించి ప్రభువుకే అపాయము జరుగకుండ చూచుచు ప్రాణములకు తెగించి స్వదేశీ విప్లవ కారులతో పోరాడి కోటతలుపులు తెరిపించెను. ఆ పిమ్మట పితూరీదారులను నిర్దాక్షిణ్యముగా శిక్షించెను. మహమూద్‌షా అందుకు సంతోషించి సుల్తాన్ కులీని గొప్పగా సత్కరించెను.

ఇదేవిధముగా క్రీ.శ. 1493లో గోవా ప్రాంతపు సుబేదారు మహమూద్‌షాకు వ్యతిరేకముగా నలజడి సృష్టించగా రెండవవైపు పశ్చిమ ప్రాంత ప్రతినిధి బహద్దురు గేలాని

గుజరాతు సుల్తానుల యోడలను దోచుకొనుచు పాదుషాకు వ్యతిరేకముగా ప్రవర్తించెను. ఈ రెండు సందర్భములలో సుల్తాన్ కులీ అమిత శౌర్యమును ప్రదర్శించి మహమూద్‌షాకు విజయము చేకూర్చెను. దానికతడు సంతసించి సుల్తాన్ కులీకి కుతుబుల్ముల్క్ అను బిరుదమొసగి తెలంగాణాకు సుబేదారుగా చేసెను.

స్వదేశీ విప్లవమున నణచబడినప్పటి నుండి దక్కనీ ముస్లిములు మహమూద్‌షా యభిమానము తమకందకుండుటచే వారు ప్రభుత్వమునకు తమ సహాయము పూర్తిగా మానివేసి నతనినేవగించు కొనసాగిరి. ఈ సమయము కనిపెట్టి బీదరు ప్రభువు కాశింబరీదు మహమ్మద్‌షాను పూర్తిగా తన చెప్పుచేతలలోనికి తీసికొనెను. కాశింబరీదు పిమ్మట నతని కుమారుడు అమీరు బరీదు రాజ్యమునకు వచ్చి మహమూద్‌షాను పూర్తిగా ప్రభుత్వము నుండియే తొలగించి తాను సింహాసన మెక్కెను.

ఈ పరిస్థితి చూచి క్రీ.శ. 1489లో అహమ్మద్‌నగర్, బీజాపూర్, బీరార్ రాజ్యములు కేంద్ర ప్రభుత్వము నుండి విడిపోయి మహమూద్‌షా పేరును తొలగించి తాము స్వాతంత్ర్యము ప్రకటించుకొని సుల్తాన్‌కులీని గూడ స్వతంత్రించమనిరి కాని యతడందు కంగీకరించలేదు.

మహమూద్‌షా బీజాపూర్‌పై దండెత్తునప్పుడు సుల్తాన్‌కులీని సాయము రమ్మని పిలిచెను. బీజాపూర్ సుల్తాను షియా మతస్థుడు, సుల్తాను కులీగూడ షియాయే యైనను మతాభిమానము చూపక యపుడు తన ప్రభువునకు సహాయముగా వెళ్లెను.

మహమూద్‌షా బరీదుల చేతిలో చిక్కి నిస్సహాయుడై నప్పుడు సుల్తాను కులీ గోలకొండ నుండి యతనికి నెలకైదు వేల హొన్నులు పంపెను. ఇవి యతని రాజభక్తి కుదాహరణము.

అహమ్మద్‌నగర్ బీదర్ సుల్తానులు సున్నీలు, గోలకొండ, బీజాపూర్, బీరారుల సుల్తానులు షియాలు.

ఇస్లాంమత స్థాపకుడైన మహమ్మదు జీవించినంతకాలము తానే ప్రవక్తగా తానే ప్రవర్తకుడుగా నుండెను. అతని మరణానంతరము మతాధికారి ఎవరను సమస్యయేర్పడెను. కొందరు మహమ్మద్ పిన తండ్రికొడుకు అలీని చేయవలెననిరి. కొందరు మహమ్మద్‌కు అబూబకర్ మిక్కిలి విశ్వాసిగావున్న అతనిని చేయవలెననిరి. ఇంకొందరు ఈ యిద్దరిని గాక విశ్వాసులు సూచించిన మూడవవ్యక్తిని చేయవలెననిరి. ఇటుల మహమ్మద్

మరణానంతర మతని మతమున మూడు చీలికలేర్పడెను. మొదటి వారిని సున్నీలని, రెండవవారిని షియాలని మూడవవారిని ఖవంజాలని యందురు. ఈ శాఖల వారందరికి ఖురాను, హదీత్ (ధర్మశాస్త్రము) రెండు సమానముగా ప్రమాణమే యైనను మొదటి వారు హదీత్‌కు తోడుగా "సున్న" అనగా ప్రాచీనసాంప్రదాయము - రెండవవారు"ఇఓమా" అనగా సున్నకు బదులు సర్వజనాంగీ కారమ-నుండవలెననిరి. అందువలన సున్నను బలపరచిన వారు "సున్నీలు" ఇఓమాను బలపరచిన వారు షియాలనబడిరి. ఈనాడు ప్రపంచమున నీరెండు జాతులే ఎక్కువ. 23 కోట్ల ముస్లిములలో సున్నీలే 15 కోట్లున్నారు.

ఈ మూడు శాఖలవారు అల్లాను సమానముగనే యంగీకరించిరి. సున్నీలు అల్లా స్వర్గమున సింహాసనముపై కూర్చొని యున్నాడను నంతవరకేగాని ఆవలకి పోయి అల్లా ఎట్లున్నాడు ఎందుకు కూర్చున్నాడు ఇత్యాది ప్రశ్నలు వేయ వలదు. వేసినవాడు పాపి, వానిని వధించుడనిరి. వారు ఆ రేఖ దాటి పోలేకపోయిరి. కాని భారతీయులది దాటి అవతలికి చాలాదూరము వెళ్లి విహరించిరి. షియాలనగా విడిపోయిన వారని యర్థము. వీరు అతని ఇమాముగా నంగీకరించిరి. అలీవారసులు పన్నెండుగురుండిరి. కనుక వీరిలో 12 శాఖలేర్పడెను. సున్నీలలో నాలుగు శాఖలున్నవి. ఖువందులు ఉత్తర ఆఫ్రికాలో నున్నారు.

ఇటువంటి ప్రభు భక్తులు చరిత్రయందరు కన్పింతురు.

మహమూద్‌షా క్రీ.శ. 1518లో మరణించెను. అతని మరణానంతరము సుల్తానుకులీ స్వాతంత్ర్యము ప్రకటించుకొని విజయ యాత్రలు చేసి గోలకొండ దుర్గమును బాగుచేయించి దానిని రాజధానిగా చేసుకొని తనపేరు కుతుబ్‌షాగా మార్చుకొనెను.

ఈ మహారాజు తనయొక్క అరువదేండ్ల పాలనలో చెదరిపోయిన తెలంగాణా భాగములన్ని ఏకచ్ఛత్రము క్రిందికి తెచ్చి యాంధ్రదేశమున నత్యధిక భాగమేకముగా జేసి జాతీయ సమైక్యతకు తోడ్పడెను.

ఇబ్రాహీంకుతుంబ్‌షా- ఇబ్రాహీం కుతుబ్‌షా పూర్తిపేరు అబుల్ ముజఫర్ ఇబ్రాహీం కుతుబ్‌షా. తెలుగు వారితనిని భరాముడని వ్యవహరించిరి. ఇతడు గోలకొండకు నాల్గవ ప్రభువు. తండ్రియైన కుతుబ్‌షా గోల్కొండ సామ్రాజ్యమును స్థాపింపగా నితడు దానికి రాజధానిని రూపుదిద్దెను. ఈ మహారాజు జననము క్రీ.శ. 1530.

సుల్తాన్ కులీకుతుబ్‌షా కార్గురు కుమారులు కలిగిరి. వారిలో యిబ్రాహీం చివరివాడు. పెద్దవాడు హైదర్‌కులీ తండ్రి కాలముననే గతించగా రెండవ వాడైన కుతుబుద్దీనును తండ్రి యువరాజుగా ప్రకటించెను.

మూడవవాడు యార్‌కులీ, నాల్గవవాడు అబ్దుల్‌కరీమ్, ఐదవవాడు దౌలత్‌కులీ. ఈ ముగ్గురు కలసి కుతుబుద్దీను నెట్లులైన సంహరించి తామే రాజు కావలెనని పోటిపడుచుండిరి. ఆ ప్రయత్నమునసే భాగముగా నబ్దుల్‌కరీము తండ్రిపై తిరుగుబాటుచేయుటకై బీజాపూరు సుల్తానుతో సంప్రతించుటకు వెళ్లి దారియందే మరణించెను.

మిగిలిన యిద్దరు యార్‌కులీ దౌలత్‌కులీ ఎల్లప్పుడు కలహించుచు తండ్రికి మనశ్శాంతి లేకుండ చేయుచుండ ఆయన వారిని కుమారులని దయచూడక యార్‌కులీని గోలకొండలో దౌలత్‌కులీని భువనగిరిలో సకల సౌకర్యములతో చెరలో పెట్టించెను. చివరి వాడైన ఇబ్రహీం ఉదారస్వభావుడు, స్థిరచిత్తుడు, తండ్రియాజ్ఞ జవదాటని వాడు. అతనిసేవ నేరమని వాడుగా నుండెను. కావున తండ్రి యతని క్రమశిక్షణా విషయమున మిక్కిలి శ్రద్ధ తీసికొనుచు తాను చివరి దశలో జయించిన దేవరకొండ దుర్గము సంక్షోభముగా నుండగా నమ్మకమైన సరదారులతో నతనినచట పాలకునిగా నుంచెను.

ఇక్కడ యార్‌కులీ చెరలోనున్న తన ప్రయత్నము మానక అంతరంగిక మిత్రుడగు మీర్‌మహమూద్‌కు తమ తండ్రిని హతమార్చుపని యప్పగించెను. దానికతడు సమయమువేచియుండి ఒకనాడు కుతుబ్‌షా నమాజుముగించుకొని ఆ మసీదు నిర్మించు మేస్త్రీలకు సూచన లిచ్చుచుండగా మీర్‌మహమూద్ అతనిని కత్తిలాగి సంహరించి యా సంతోషవార్త తెలుపుటకు యార్‌కులీ దగ్గరకు వెళ్లెను. యార్‌కులీ ఆవార్త విన్న పిమ్మట మీర్‌మహమూద్ జీవించియుండిన తన కుట్ర బయటపడునని తలచి వెంటనే కత్తి దూసి యతని తలనరికి తాను చెర నుండి బయటపడి క్రీ.శ. 1543లో జంషీద్‌కుతుబ్‌షా పేర గోలకొండ సింహాసనమెక్కెను. అపుడతని యనుచరులు యువరాజైన కుతుబుద్దీన్‌ను యింటిపై బడి యతనిని పట్టుకొని కన్నులుపీకి యంధునిచేసిరి.

జంషీరుయొక్క ఈ చర్యల వలన అనగా తండ్రిని, మిత్రుని, వధించుటవలన ప్రజలతని యెడల ఏవగింపుకొనిరి. అతని దౌర్జన్యములను సహింపలేక కొందరు పట్టణము విడిచి వెళ్లిరి.

జంషీరు సింహాసనమధిష్ఠించి దేవరకొండయందలి ఇబ్రాహీమును గోలకొండకు రావలసినదిగా ఉత్తరములు వ్రాసి పిలిపించెను కాని యతడన్నగారి దుశ్చర్యలెరిగి తనను వధించుటకే పిలిపించుచున్నాడని తలచి హితైషులయొక్క సలహానను సరించి బీదరువెళ్లి అతబరీదును సహాయమర్థించి యన్నగారిపై దండెత్తెను. అతబరీదు సైన్యము నిరాటంకముగా వచ్చి గోలకొండను ముట్టడించెను.

ఊహించని యూపరివహణమునకు జంషీదు ఇరుకునపడి అహమ్మద్‌నగర్ సుల్తానునకు సహాయమున్నకై వర్తమాన మంపగా నతడు అతబరీదు గోలకొండను జయించిన యెడల తమకంటె బలపడునని తలచి బురహాన్ నిజాంషా జంషీదు సహాయార్థమై తనయొక్క అపారమైన సేనను పంపెను. ఆ సైన్యము రెండు దళములుగా చీలి ఒకటి గోలకొండకు వచ్చి రెండవది కోహీరును ముట్టడించగా అతబరీదు దానిని రక్షించు కొనుటకై గోలకొండ ముట్టడినాపి వెళ్లిపోయెను.

గోలకొండ ముట్టడి యిటుల వ్యర్థముకాగా ఇబ్రాహీము అక్కడి నుండి విజయనగరమునకు పారిపోయెను. అపుడు దానిని అళియరామరాయలు పాలించు చుండెను. అతడిబ్రాహీము కాశ్రయమిచ్చి కుమారునివలె యాదరించి రాజ్యతంత్రమును మంచి తర్ఫీదిచ్చెను. విజయనగరమున ఇబ్రాహీము ఏడేండ్లుండెను. ఈ కాలమున నతడొకవైపు అళియరామరాయలతో రాజనీతిని గ్రహించుచు రెండవవైపు అతని యాస్థానమున మందలి రామరాజ భూషణుడు మొదలైన కవుల యొక్క సాహచర్యమున నాంధ్రసాహిత్యముపై యభిరుచి పెంచుకొనెను.

ఇట్లుండగా జంషీదు క్రీ.శ. 1550లో మరణించెను. అపుడు రాజ్యమందలి సరదారులు రెండుపక్షములైరి. మొదటి వారు వితంతువైన రాణి బిల్‌కీస్ పక్షము వహించి ఏడేండ్ల కుర్రవాడైన యామెకుమారుడు సుభాన్‌కులీని సింహాసనమెక్కించిరి. రెండవవారు జంషీద్ యొక్క ఏడేండ్ల దుష్టపరిపాలనలో విసిగియుండిరి. కనుక విజయనగరమున నున్న ఇబ్రాహీము నాహ్వానించిరి. అపుడు గోలకొండ వాతావరణము తనకనుకూలముగా నుండుట వలన ఇబ్రాహీము విజయనగరమునుండి గోలకొండకు పయనమయ్యెను. దారిలో నతనికి పానగల్లు, గణపురము, కొయిలకొండ సరదారులు సహాయము చేయుటకై గట్టిమాట యిచ్చి తమ సైన్యములను వెంటపంపిరి. యతని యభ్యుదయము కోరు సరదారులెందరో యాతని సింహాసనోత్సవము చూడ గోలకొండవరకు వచ్చిరి. ఇబ్రాహీం కుతుబ్‌షా వారందరితో గోలకొండ రాగా మంత్రి జగదేవరావు గౌరవ పురస్సరముగా కోటతాళపు చెవులతని కప్పగించెను. పిమ్మట ఆకోటలోని శత్రువులందరిని ఇబ్రాహీం వర్గము వారు పట్టుకొని చెరలో బంధించిరి. తర్వాత క్రీ.శ. 1550 హి 957 రజ్జబ్ 12 నాడు ఇబ్రాహీము కుతుబ్‌షా గోలకొండ సింహాసన మధిష్టించెను.

ఇబ్రాహీము సింహాసనమునకు వచ్చునాటికి గోలకొండ ప్రభుత్వ పరిస్థితులేవి బాగులేవు సమర్థులు సజ్జనులైన యుద్యోగులెందరో జంషీదు పాలనలో నుండలేక పారుగు

రాజ్యములకు వెళ్లియుండిరి. వర్తక వ్యాపారములు పూర్తిగా పడిపోయి దారులన్ని దోపిడిగాండ్రతో నిండియుండెను. కళలు కళాకాంతులు తరిగి కన్నుమూసియుండెను.

ఇబ్రాహీము తన పరిపాలన యందు అడుగడుగునా విజయనగరమును దృష్టియందుంచుకొని మరల తమ రాజ్యమును పునరుద్ధరించ పూనుకొనెను. కాని యితని జీవితమున తల్లికోట యుద్ధమొక మాయని మచ్చనాపాదించెను.

దక్కనులో బహమనీ రాజ్యము మొదటిది. అది మహమూదుషా కాలమున విడిపోయి పంచకంతలయ్యెను. వానిలో అహమ్మద్ నగర్ వారికి నిజాంషాహీ, గోలకొండ వారికి కుతుబషాహీ, బీజాపూరు వారికి ఆదిల్‌షాహీ, బీదర్ వారికి బరీద్‌షాహి బిరార్ వారికి యిమాద్‌షాహి వంశములని పేర్లు. ఈ అయిదుగురికి పరస్పరము పడక నెప్పుడే యిద్దరో కలహించుచుండిరి. సున్నీలు, షియాలపై జిహాదుకూడ చేయుచుండిరి. ఈ కలహములలో నెక్కువ భాగము షోలాపూర్ దుర్గమునకై బీజాపూర్ అహ్మదనగర్ వారికి జరుగు చుండెను. బీదర్‌వారు తమరక్షణకై వారినడుమ కలహములు రేపు చుండిరి. గోలకొండవారు మధ్యవర్తిత్వము వహించుచుండిరి.

ఈ కలహములలో ప్రతిసారి ఎవరో ఒకరు విజయనగర ప్రభువుల నాశ్రయించుచుండిరి. రామరాయలకు మహమ్మదీయులనిన ద్వేషములేదు. ఇబ్రాహీమక్కడి నుండి వచ్చిన పిదప యాయన కుమారుడు గతించగా బీజాపూరు ఆదిల్‌షావెళ్లి యతనినోదార్చి నేటినుండి నన్నే మీకుమారునిగా భావించుడని విన్నవించి అలియరామరాయలకు మిక్కిలి సన్నిహితుడయ్యెను. యతని అంతఃపురమునకు గూడనాదిల్‌షా నిరాఘాటముగా వెళ్లుచుండెను. కాని యానాటి రాజనీతిననుసరించి రామరాయలు తన నాశ్రయించిన వారి ఎదుటి పక్షముతో పోరి వారి దుర్గములు తన రాజ్యమున కలుపుకొనుచుండెను. ఈ కలహములలో నెక్కువగా అహమ్మద్‌నగర్ వారు నష్టపోయిరి.

ఆనాడు విజయనగరము నెదురించు శక్తి సైనిక బలము మహమ్మదీయ రాజ్యములకు లేకుండెను. పరస్పర కలహములవలన దుర్గములొక్కక్కటి చేజారిపోవుచుండెను. అది యిటులే సాగు చుండిన దక్షిణమున మహమ్మదీయ రాజ్యమునకే మోసమగు నట్లుండెను. గోల్కొండ వారు గూడ రామరాయలతో నష్టపోయినవారే. ఈ నష్టపోయిన వారతని నాశము కన్నులు దెరిపించెను.

ఈ రాజులు మాటలు మిగిలినచోట పట్టింపులు వచ్చిన చోట బంధుత్వమునుగాని స్నేహమునుగాని చూడరు. తండ్రికొడుకు, అన్న తమ్ముడను రక్త సంబంధమును గూడ లెక్కింపరు. రక్తసంబంధమును గూడ జూడరనుట రాజు నామముననే గూఢముగా దాగినది.(ర-రక్తసంబంధము జు-చూడరు)

ఈ సుల్తానులలో ఆదిల్షా కపటి, ఇబ్రాహీం కుతుబ్‌షా ఉపాయశాలి, బరీదుషా కార్యశీలి.

ఇబ్రాహీం కుతుబ్‌షా వీరినెట్లేకము చేయవలెనో తెలుపగా నాదిల్షా రామరాయల నెట్లెదుర్కొనవలెనో పథకము రచించెను. ఇబ్రాహీం సూచననుసరించి హుసేన్‌నిజాంషా కూతురు చాంద్ బీబీని ఆదిల్షాకు, ఆదిల్షా చెల్లెలు హదియా సుల్తానాను హుసేన్ నిజాంషాకుమారుడైన ముర్తజాకిచ్చునట్లు వివాహములు కుదిరి వారి పరస్పరవైరములు సమసెను. కాని ఈ కూటమిలో బీరార్ యొక్క ప్రభువు మాత్రం మహమ్మద్‌నగర్ గల వైరమున చేరలేదు.

గోలకొండ కోటకు మొదట మానుగల్లు కోటయని పేరు. అది కాకాతీయుల వంశమందుండెను. కాపయప్రోలయ నాయకులు మొదట దానిని స్థావరముగా చేసికొని పిమ్మట దానిని గోలకొండ సుల్తానులకు తమకు హద్దుగా నంగీకరించి వారికి విడిచిరి.

గోలకొండ సామ్రాజ్యస్థాపకుడైన కుతుబ్‌షా మట్టి గోడలతోనున్న ఆదుర్గమును కొంత పటిష్టము చేయగా నతని కుమారుడైన ఇబ్రాహీం కుతుబ్‌షా దానికి నేడుగల తుదిరూపము నిచ్చెను. పొన్నగంటి తెలగన యందులకే తన కావ్యారంభమున దీనిని వర్ణించెను.

ఇబ్రాహీం కుతుబ్‌షా ముస్తఫాఖాన్ సలహా ననుసరించి దానికి ప్రహరి గోడలు పునర్నిర్మించి బలిష్టమైన బురుజు లేర్పరచి బాలా హిస్సార్ నిర్మాణము పూర్తిచేసెను. కోటను పటిష్టము చేసిన పిమ్మట సుల్తానులు రామరాయల చెంతకు అతడాక్రమించిన దుర్గములు తిరిగి తమవశము చేయుమని యట్లైన శాశ్వతముగా తామతనితో పేచీలేకుండ నుందుమని రాయబారమంపిరి కాని రామరాయలు దానిని తిరస్కరించెను. అపుడు సుల్తానులు 24.12.1564 నాడు దండయాత్రకు బయలుదేరి కృష్ణామలా పహారి సంగమస్థలమున విడిసిరి.

రామరాయల సైన్యమున పది లక్షల కాల్బలము, నాలుగు లక్షల యాశ్వికదళము, మూడువేల గజసైన్యము ఇంకను బలవంతులైన సామంత మాండలికులనేకులుండిరి. కాని యెన్నియున్ననేమి శరణము దైవమే పురుషశక్తి నిరర్థక మెన్నిభంగులన్ అను సూక్తి నాయుద్ధము ఋజువు చేసెను. రామరాయలు తానెవరిని పుత్ర సదృశులుగా భావించి యాశ్రయమిచ్చి యభిమానించెనో ఆ యొక్క ఆదిల్‌షా ఇబ్రాహీముల యొక్క మోసము చేతనే యతడు వధింపబడెను.

విజయనగరము యొక్క ఓటమితో సుల్తానులు పది దినములు విజయోత్సాహము జరుపుకొని ఆపిమ్మట నారు నెలలచట నిలిచి యచటి యైశ్వర్యమును దోచుకొనినంత దోచుకొని నగరమును పాడుచేయ గలిగినంత పాడుచేసి చివరకు తామె యలసి యచటి నుండి వెళ్లిపోయిరి.

ఇబ్రాహీంకుతుబ్‌షాకు అప్పటికి రామరాయల నెట్లైన యణచి యతని ప్రాబల్యము నొకహద్దులో నుంచుటే యుద్దేశ్యమై యుండవచ్చును కాని యుద్ధావేశమున పరిణామము వేరైనది. ఆ పిమ్మట తమవారు విజయనగరము నంతగా ధ్వంసము చేయుదురని యత డూహించి యుండక పోవచ్చును. అందుచేతనే యతడు నాశనమైన విజయనగర సంస్కృతికి బదులుగా తెలుగువారికి మరల విదేశీయులుగూడ నాశ్చర్యపడునంతటి సుందరమైన పట్టణముగా గోలకొండను తీర్చిదిద్దెననవచ్చును.

గోలకొండలో నతడెన్నియో ఉద్యానములు వేయించెను. రాజప్రసాదములు, విద్యాశాలలు, వైద్యశాలలు కట్టించెను. వ్యాపారులకు తగిన వసతులు కల్పించెను. ఈనాడు జంటనగరముల నడుమగల హుసేన్‌సాగర్‌ను వేయించెను – దానిని హజరత్‌హుసేన్‌షాయను నింజనీరు ఇరువది లక్షలతో నెనిమిది నెలలలో పూర్తిచేసెను. అందుచేతనే యది యతనిపేర నిలిచినది.

ఇతడు కట్టించిన దౌలత్‌ఖానా అను దర్బారు హాలు చెప్పదగినది. అది 200 అడుగుల పొడవై చుట్టు అనేకమైన ప్రభుత్వ కార్యాలయములతో నొప్పినది.

ఈ మహారాజునకు భార్యలెందరో తెలియదు కాని ముప్పదిమంది కుమారులట. వారిలో నతనికి కులికుతుబ్‌షాపై యెక్కువ ప్రేమ. అతని తల్లి పేరు భాగీధీబాయి. ఆమె హిందూ వనిత. ఆమె పేర యానాడు గోలకొండ పట్టణము భాగీరథీ పట్టణమని పిలువబడుచుండెను.

కుమారుడైన కులీకుతుబ్‌షా భాగ్యమతి యను నొక కన్యను ప్రేమించి యొకప్పటి వర్షాకాలమున పొంగిపొరలుచున్న మూసినిదాటి ప్రియురాలి దగ్గరకు పోవుచుండుట ఇబ్రాహీం చూచి యానదిపై యిపుడుండు పురానాపూల్ కట్టించెను.

తండ్రి పిమ్మట కుమారుడు సింహాసనమెక్కి తన ప్రియురాలిపేర ఈనాటి భాగ్యనగరమును (హైదరాబాదు) స్థాపించెను. ఈ విధముగా నా తండ్రి కొడుకులు ఆ యత్తా కోడండ్రు ధన్యులై చరిత్రలో నిలిచిరి.

అమీనుఖాను -

"యథారాజా తథాప్రజ" అని న్యాయము కనుక ఈ కాలమున నిబ్రాహీముకుతుబ్‌షాకు మంత్రిగా నున్న యమీనుఖాను గూడ తమ రాజధానియైన పొట్లచెరువును చక్కగా తీర్చిదిద్ది యనేక ధర్మకార్యములు చేసెను.

కుతుబ్‌షాహీల పరిపాలన పట్టిక క్రీ.శ. 1455 - 1687

క్ర.సం	పాదుషా పేరు	పుట్టినతేది	పట్టాభిషేక దినము	మరనము	పరిపాలనా సంవత్సర -ములు
1	సుల్తాన్‌కులీకుతుబ్‌షా కాతుబుల్‌ముల్ 1496-1518,1543-50	860 హిజ్రీ క్రీ.శ.1455	906 హిజ్రీ క్రీ.శ.1500	950హిజ్రీ క్రీ.శ.1543	44 సం॥
2	జంషీద్ కులీకుతుబ్‌షా 1543 - 1550	- - -	950 హిజ్రీ క్రీ.శ.1543	957 హిజ్రీ క్రీ.శ.1550	7 సం॥
3	సుబ్‌హాన్ కులీకుతుబ్‌షా 1550	950 హిజ్రీ కీ.శ.1543	957 హిజ్రీ క్రీ.శ.1550	957 హిజ్రీ కీ.శ.1550	అదే ఏడు పదవీభ్రష్టుగా చేయుబడెను
4	ఇబ్రాహీంకులీకుతుబ్‌షా 1550 - 1580	- -	957 హిజ్రీ రజబ్16సోమ క్రీ.శ.1550	988 హిజ్రీ రబ్బసాని21 గురు రుక్రీ.శ.1581	30 సం॥ 9 నెలలు
5	మహ్మాద్ కులీకుతుబ్‌షా 1580 - 1612	- - - -	988 హిజ్రీ రజబ్ 1 క్రీ.శ.1581	1020 హిజ్రీ జికదా17 ఉదయం క్రీ.శ.1611	31 సం॥
6	సుల్తాన్‌మహ్మద్ కుతుబ్‌షా 1612 - 1626	1001హిజ్రీ రజబ్ క్రీ.శ.1592	1020హిజ్రీ జికదా 17 క్రీ.శ.1611	1035 హిజ్రీ జమాదిలవుల్ బుధ 13 క్రీ.శ.1625	14 సం॥ 6 నెలలు
7	సుల్తాన్ అబ్దుల్లా 1626 - 1672	1003హిజ్రీ షవ్వాల్27 క్రీ.శ.1612	1035 హిజ్రీ జమాదిలవ్వల్ క్రీ.శ.1625	1083 హిజ్రీ మొహరాం3 కీ.శ.1672	48 సం॥
8	సుల్తాన్ అబ్దుల్‌హసన్ తానీషా 1672 - 1687	- - - - -	1083హిజ్రీ క్రీ.శ.1672	1111 హిజ్రీ క్రీ.శ.1700 కారాగారంలో	పదవీభ్రషత 1098 హిజ్రీ 1687పదవీ కాలం15సం॥

గమనిక :- బీజాపురు చరిత్ర - బషీరుద్దీన్ అహ్మద్ కలెక్టర్

ముద్ర - 1915 బా -3 -పు 542,43,570,71

దీనిలో పేర్ల క్రింద యిచ్చిన తేదిలు శ్రీ బి. యన్. శాస్త్రి గారివి. తక్కినవి బషీరుద్దీన్ గారివి. సుల్తాన్ కులీకుతుబ్‌షా క్రీ.శ. 1496 నుండి 1518 వరకు గోలకొండకు సుబేదారుగా నుండి ఆతర్వాత 1518 నుండి 1543 వరకు ప్రభువుగా నుండెనని శాస్త్రి గారు చెప్పుచుండగా బషీరుద్దీన్ గారు 1500 నుండియే ప్రభువుగానే నుండెనని చెప్పిరి. బషీరుద్దీన్ గారి చరిత్ర యందు మహ్మదీయుల హిజిరీలు నెలలున్నవి. వానిని క్రీ.శ. లెక్కించునప్పుడు ఒక్కటి రెండు తేడాలేర్పడుట సహజముగాన బషీరుద్దీన్ గారిచ్చిన నిజమైనవేమోననిపించును.

యయాతి చరిత్రమున నమీనుఖాను మూడుతరముల నుండి కుతుబ్‌షాహీ వంశస్థులను సేవించుచున్నట్లు చెప్పబడినది. దానికి తగినట్లే కావ్యమున నతని వంశముగూడ మూడుతరముల నుండి చెప్పబడినది. కనుక బహుశః ఈ వంశీయులు కుతుబ్‌షాకాలము నుండియే వీరిని సేవించుచుండిరనవచ్చును.

యయాతి చరిత్రమున వీరివంశము హుమామియా దగ్గరి నుండి చెప్పబడినది కాని కలెక్టర్ బషీరుద్దీన్ అహమ్మద్‌గారి వాఖియాతెమమిలికతె బీజాపూర్ అను చరిత్ర వలన వీరి మూలపురుషుడు ఖాజీబాబా ఖురైషి ఖాద్రి యని తెలియును అతని కుమారుడు ఖాజీ మహమ్మద్ ఖ్తెఖార్‌బిన్. అతని కుమారుడు షేక్ హుమాయూన్‌బిన్ ఖాజీజియాన్. అతని కుమారుడు షేక్ బడేబిన్ హుమాయూన్. ఈ హుమాయూన్ నుండియే యయాతి చరిత్ర యందు వీరివంశము చెప్పబడినది. ఇతనిని తెలగన హుమామియా అని చెప్పెను. ఇతని కుమారుడు షేక్ మియాబిన్‌షేక్‌బడే. ఈ బడేమియా కుమారుడు అమీన్‌ఖాన్ ఖురైషిఖాద్రి. ఇతడే యయాతి చరిత్ర కృతిభర్త కాసలనాటిలోని పొట్లచెరువును రాజధానిగా చేసికొని ఇబ్రాహీం కుతుబ్‌షా క్రింద కాసలనాటిని పాలించుచుండెను.

కాసలనాడనునది తెలంగాణములోని హైదరాబాదు వరంగలు జిల్లాల కుత్తర ప్రాంతము, మెదకు కరీంనగరు జిల్లాలలోని కొంత భాగము శ్రీశైల మల్లికార్జునుని దేవాలయమున గల శాసనమున నీకాసలనాడు కుసలనాడని పేర్కొనబడినది. ఆకుసలనాటిలోనివిగా చెప్పబడిన కలుచెఱులు – సాసుట్టుల దేవరపల్లి యను గ్రామము లీనాడు కరీంనగర్ జిల్లా సుల్తానాబాదు తాలూకాలోని కలువచెర్లయని, సాసుట్టుల తాలూకా కేంద్రమగు సిరిసిల్లియని గుర్తింపబడినవి. దేవరపల్లిగూడ దానియందేనున్నది. పొట్లచెఱువీనాడు సంగారెడ్డి తాలూకాలోనున్నది. దానిని పటన్‌చెఱువనుచున్నారు. దానికి నాలుగు మైళ్ల దూరమున నానాడమీనుఖాను స్థాపించిన యమీనుపురమున్నది.

శ్రీశైల శాసనమున కాసలనాటియందు మల్లికార్జున దేవాలయమున్నట్లు కలదు. అదిపుడు అమీన్‌పురము సమీపముననేయున్నది.

అమీనుఖానునకు బడే బీబీ. ఖుకూర్ బీబీ, షయా బీబీ యని ముగ్గురు భార్యలుండిరి.

బడే బీబీ మిక్కిలి ధర్మాత్మురాలు, ఆమె పెద్దయుద్యోగస్థుని భార్యయైనందులకు గర్విష్ఠిగాక, ప్రజాక్షేమ పరాయణురాలై యుండి వివాహమై కొత్తగా నత్తవారిండ్లకేగు కన్యల

కట్నములిచ్చుచుండెను. ప్రతిదినముదయమున పసిపిల్లలకు పాలుబోయుచుండెను. అతిథుల కర్థమరేయి యైనను యాకలి యరసి యన్నము బెట్టుచుండెను. ఈమెకు గతాతఖాన్; ఫాజిల్‌ఖాను అనునిద్దరు కుమారులు కలిగిరి. షకూర్ బీబీకి అబ్దులల్లి, షేకిబ్రాహీం, అనువారు షమా బీబీకి అబ్దుల్‌కరీమను వారుకల్గిరి.

పెద్దవాడైన గతాతఖాను డానాటి రాజకీయ వ్యవహారము లందు ప్రముఖుడైయుండి తండ్రిని మించిన కీర్తిని సంపాదించెను. క్రీ.శ. 1550-1605 వరకు ఢిల్లీ సింహాసనమధిరోహించి పాలించిన యక్బరు చక్రవర్తి యిబ్రాహీం కుతుబ్‌షాకు సమకాలికుడు. ఢిల్లీ పాదూషాలు దక్షిణ మహమ్మదీయ రాజ్యములను జయించు ప్రయత్నములు చేయుట యక్బరు చక్రవర్తి నాటినుండియే ప్రారంభమైనదనవలెను. ఈ కావ్యమందలి1-46వ పద్యము కలన గతాతఖానుడు ఢిల్లీపాదూషాయైన యక్బరు చక్రవర్తితో మెప్పులందినట్లు చెప్పబడినది. కనుక నతడానాడు సమర్థుడైన రాజకీయ వేత్తయై గోలకొండకు ఢిల్లీ సామ్రాజ్యయునకు నడుమ రాయబారిగా నుండెనని తలంపవచ్చెను.

దక్కనులోని షాహీవంశ పంచకము తల్లికోట యుద్ధముననేకమైనను వారియైక్య మాపిమ్మట నిలువలేదు. మరల ఎప్పటి వలెనే కుటుంబ కలహములందు మునిగిరి. అంతవరకు వారు తమ యంతః కలహములలో నళియ రామరాయలను సహాయమర్థించుచుండిరి. ఇపుడతడు లేడు కనుక వారు ఢిల్లీశ్వరుని సహాయము వేడవలసిన వారైరి. అతడుగూడ నీ యవకాశయునుపయోగించుకొని తమ సామ్రాజ్యమును దక్కనులో గూడ విస్తరింపజేయుటకు వారి తగవులలో జోక్యము కలుగజేసికొనుట చాలాసారులు తటస్థించినది. మల్కిభరాము మరణమునకు పూర్వము క్రీ.శ. 1576 లో నక్బరు చక్రవర్తి బీరారు అహమ్మద్‌నగర్ సుల్తానుల కుటుంబ కలహములలో కలుగజేసికొని తన యుత్తరువులు వారిచే నెరవేర్ప బడకపోవుటచే దక్షిణమునకు దండెత్తి వచ్చినట్లు" గ్రిబ్బిల్" వ్రాతలవలన తెలియును కనుక గతాతఖాను డీసందర్భముననే యక్బరును దర్శించి తనయొక్క వాఙ్నైపుణ్యమున నా చక్రవర్తి మెప్పులందియుండును.

పైపద్యము యొక్క రెండవ పాదమున గతాతఖానునకు విశ్వనాథ దేవుడేనుగులనిచ్చినట్లు చెప్పబడినది. ఈ విశ్వనాథ దేవుడు ఒరిస్సా ప్రభువు.

తల్లికోట యుద్ధమునకు పూర్వము రఫత్‌ఖాన్ లాహరి యను వాడు పూర్వ దిగ్విజయమునకై బయలుదేరి రాజమహేంద్రవరము వరకు జయించుకొనుచు వచ్చెను కాని

క్రీ.శ. 1565లో తల్లికోట యుద్ధము సంప్రాప్తమగుటచే ఇబ్రాహీం కుతుబ్‌షా యాజ్ఞదీసికొని మరుసటియేడు అనగా క్రీ.శ. 1566లో తన దిగ్విజయయాత్రను పూర్తి చేసికొనుటకు బయలుదేరి ఖాసిం కోట వరకు గల ప్రదేశములన్ని జయించెను.

అపుడు రాజమండ్రి వద్ద పెద్దయుద్ధము జరిగెను. ఆ యుద్ధమున వేదాద్రి – సీతాపతి యను వారి యాధిపత్యమున నా ప్రాంతముల వారు గోలకొండ సైన్యముల నెదిర్చి నాలుగు నెలల వరకు ముట్టరి కాగిరి. తుదకాముట్టడి గోలకొండ సైన్యమున లెక్కలవ్రాతగాడుగానున్న యొకపండితుని మూలమున యుభయ పక్షములకు సంధి జరిగి వేదాద్రి ఖాసింకోటకు సీతాపతి విజయనగరమునకు వెళ్లిరి.

గోలకొండ సైన్యములు రాజమహేంద్రవరమును లోబరచుకొని ఖాసింకోట వరకు చొచ్చుకొని వెళ్లి యొరిస్సాలో ప్రవేశించెను. అపుడు చిన్నచిన్న జమీందారులు లోబడి గొల్లపిల్లి, వీరకూటము, దేవిపురము, చంద్రవరము మొదలగు స్థలములు పట్టుబడుటచే రఫత్‌ఖానా ప్రాంతమున బలవంతుడైయున్న విశ్వనాథ దేవునిమీదికి దాడివెడలి పొట్నూరిలో నతని సోదరుని ఖైదీగ పట్టుకొనెను. తరువాత కొండదేవరపల్లి గూడ గోలకొండ సైన్యమునకు లోబడెను. కాని యింతలోనే విశ్వనాథ దేవుడే బదివేల కాల్బలముతో నైదువేల గుర్రపు దళముతోనే నూరేనుగులతో ప్రతిఘటించి యోడి పారిపోవలసి వచ్చెను. అపుడతడు తనకువారుని గోలకొండ శిబిరమునకు బంపి సంధిజేసికొనెను. ఆ సంధి షరతులననుసరించి విశ్వనాథదేవుడు ప్రతియేట కొంత కప్పము గోలకొండ నవాబునకు చెల్లించుటకు, నలుబది యేనుగులను నవాబునకు కానుకగా నిచ్చుట కంగీకరించెను.-ఈసంధి క్రీ.శ. 1569లో జరిగినది.

గతాత ఖానుడు విశ్వనాథదేవుని వద్ద నుండి తెచ్చెనని తెలగన చెప్పిన యేనుగులివియేయుండును. ఈ విజయయాత్రలో గతాతఖానుడు రఫేత్‌ఖాన్ లాహిర్‌సైన్యమున నొకయధికారియై యుండి విశ్వనాథదేవునితో సంధి షరతులలో నతనితో నలువది యేనుగుల నిచ్చుట కంగీకరింపజేయుటలో ప్రముఖపాత్ర వహించి యుండుననవలెను.

ఇతడు ఏదులఖానువద్దకు బోయి చాలాసారులు కప్పములు పుచ్చుకొనినట్లు గూడ తెలగన చెప్పెను. ఈ ఏదులఖాను బీజాపూరు సుల్తాను. ఇతని పూర్తి పేరు అలీ ఆదిల్షా. ఈ సుల్తాను క్రీ.శ. 1557 నుండి 79 వరకు పాలించి ఇబ్రాహీమున కంటె రెండేండ్లు ముందు మరణించెను. బీజాపూరు గోలకొండ రాజ్యములకు తల్లికోట యుద్ధయునకు

పూర్వము మరియు నాతర్వాత గూడ నిరంతర యుద్ధములు జరుగుచునే యుండెను. కావున గతాత ఖానుడా యుద్ధయులలో దేనిపిమ్మట వారితో కప్పము వసూలు చేసెనో తెలియలేదు.

గతాతఖానుతో ఈ యేదులఖానేగాక మాదన మల్కిబరీదు, నిజాంషాహ్ గూడ యోడింపబడినట్లు తెలగన జెప్పెను. బీదర్ సుల్తానులకు బరీదులని పేరు. వీరుతురుష్కులు, సున్నీమతస్థులు. ఈ వంశమందలి అమీరలీ ఆదిల్షాపై తమరాజ్యమున షియా మతము స్థాపించెనని యతనిపై జిహాదు ప్రకటించెను కాని యతనిని సాధించలేకపోయెను.

రక్షసతంగెడ యుద్ధమున నలీబరీద్షా ప్రముఖ పాత్ర వహించెను. యతని యనంతర మైదుగురు సుల్తానులు పాలించిరి. వారందరు దుర్బలులు. వారిలో మాదన మల్కిలురీదు ఒక్కడు.

అహమద్నగర సుల్తానులకు నిజాంషాహీలని పేరు. ఈ వంశస్థాపకుడు మాలక్ అహమద్. అతని తండ్రి మాలిక్హసన్. వస్తుతః విజయనగర నివాసియైన బ్రాహ్మణ వీరుడు. మహమ్మదీయ మతము స్వీకరించి మహమూద్ గువాఁ మృతికి కారణమై యారాజ్యమునకు ప్రధానియయ్యెను. ఈ వంశమున అలీ ఆదిల్షా య ల్లుడైన ముర్తజాయే చివరిరాజు. ముర్తజా నతనికుమారుడే హత్యచేసెను. అపుడు రాజ్యమున నల్లరులు చెలరేగినవి. వానినణచి రెండవ బర్హాన్షా సింహాసనమెక్కెను. కావున మర్తజామరణానంతరము చెలరేగిన యల్లరుల నదుపుచేయుటలో గతాతఖాను పాత్ర యేదైన నుండవచ్చును, ఇక గతాతఖాను డోడించిన కన్నడ రాజులు విజయనగరపు రాజులే. కావున నీగతాతఖానుడు గొప్పసేనాధిపతి కాకపోయినను యన్నియుద్ధములలో పాల్గొని విజయములు పొంది యనేక దేశములు జూచినవాడై యనుభవజ్ఞుడైన సైనికోద్యోగియైయుండవచ్చును.

గతాతఖానుని వలెనే అతని సోదరుడు ఫాజిలుఖాను గూడ రాజనీతిచతురుడు. అతడు పెనుగొండ యందు రాజ్యము చేయు శ్రీరంగరాయలను మల్కిభరామునికడకు గొనివచ్చి వారిద్దరికి -శ్రీరంగరాయలు రక్షస తంగెడ యుద్ధమున హతుడైన యళియరామరాయల తమ్ముడైన తిరుమల దేవరాయల కుమారుడు. అతడు క్రీ.శ. 1574 నుండి 85 వరకు విజయనగర రాజ్యమును పెనుగొండ నుండి పాలించెను.

క్రీ.శ. 1575వ సంవత్సరమున బీజాపుర సుల్తాను అలీ ఆదిల్ షా చంద్రగిరి, గుత్తి దుర్గములను బాగుచేయించి శత్రుభయము లేకుండ జేసికొని కేరళ దేశముపై దండువెడలి

యచటి నాయకులను జయించి యారాజ్యభాగములనుపాలింప నొకసమర్థుడగు ప్రతినిధిని నియమించి పెనుగొండ వైపునకు పయనమాయెను. ఆ సమయమున శ్రీరంగరాయలు కార్యాంతరమున చంద్రగిరికి బోవుచు నాదిల్‌షా తమ రాజధానిపై దండెత్తుట దెలిసి పెనుకకు మరలి, తానొంటరిగా బీజాపుర సుల్తానుతో బోరలేనని ఇబ్రాహీం కుతుబ్‌షా సాయముగోరదలచి యనర్ఘమైన కానుకలతో నొక రాయబారిని గోలకొండకు బంపెను. కుతుబ్‌షా శ్రీరంగరాయల సందేశమును విని బీజాపుర సుల్తానుపై తనకు గలకసి దీర్చుకొనుట కదిమంచి యదునని యెంచి యాదిల్‌షా రాజ్యపు పొలిమేరలను ముట్టడింప "షామహమ్మద్ అంజా " యను సేనానిని బంపి మరికొంతసైన్యమును దీసికొని తాను పెనుగొండవైపునకు నడువసాగెను. ఈ లోపల షామహమ్మద్ అంజా ఇబ్రాహీము నాజ్ఞపై బీజాపుర రాజ్యభాగములను కొన్నిటి నాక్రమించుకొని సైన్యముతో కదలి తమ యేలికను గలిసెను.

శ్రీరంగరాయలు కుతుబ్‌షా రాకను విని యెదురేగి సగౌరవముగా దోడ్కొని వెళ్లెను. ఆదిల్‌షా యపుడు శ్రీరంగరాయలకు యిబ్రాహీం కుతుబ్‌షా సహాయమ్ముగా వచ్చెనని విని యిక తన మాటలు సాగవని వెనుదిరిగి బిజాపురమునకు వెళ్లెను. అట్లతడు వెళ్లిన పిదప యిబ్రాహీంగూడ గోలకొండకు వెళ్లెను. నాటి నుండి మరల గోలకొండ విజయనగర రాజుల మైత్రి పునరుద్ధరింపబడి వృద్ధియయ్యెను. దానికనుగుణముగా ఇబ్రాహీం కుతుబ్‌షా తన రాయబారి నంపి శ్రీరంగ దేవరాయలను తన రాజధానికి పిలిపించుకొని యాతనితో సంధి చేసికొనెనని విజయనగర చరిత్రమున గలదు. అపుడీసంధిని పొసగించినవాడు పాజిలుఖానే యనుటలో సందేహము లేదు.

బీజాపురము చేరిన ఆదిల్‌షా మరుసటి సంవత్సరము అనగా క్రీ.శ. 1576 నందు శ్రీరంగ దేవరాయల రాజ్యమును కబళింప మరల బయలుదేరెను. ఈ నడుమ మరియేమి జరిగెనో తెలియదు కాని క్రీ.శ. 1584 నందు వచ్చిన యహోబల శాసనము ఆదండ యాత్రయందు ఇబ్రాహీం కుతుబ్‌షా శ్రీరంగ దేవరాయలతో చేసికొనిన సంధిని పాటింపక మలకప్ప నాయనితో చేరి విజయనగర రాజ్యమునకు చేరియుండిన యహోబల మండలమును గైకొన నేగెనని చెప్పును.

పాజిలఖానీ సంధిని పొసగించుటే కాక అహమ్మద్‌నగర్ సుల్తాను నిజామనముల్కు నుండి పల్లకీలను బీజాపూరు సుల్తానగు ఆదిల్‌షా నుండి పెరూదేశము నుండి తెచ్చిన గుఱ్ఱములను ఒరిస్సా సరిహద్దులలో నున్న యేడు మాడెముల యొక్క పాలకుల నుండి

యేనుగులను, విజయనగర పాలకుల నుండి ముత్తెముల పెట్టెలను తెచ్చెననుటలో యానాటి గోలకొండ వైభవము తెలియును.

షుకూర్ బీబీ పెద్దకొడుకైన యబ్దులలీ గతాతఖానువలె పరరాజులపైకి దండయాత్రకుగాని పాజిలఖాను వలె రాయబారములకుగాని వెళ్లక ఇబ్రాహీం కుతుబ్‌షా హజారముననే అరబ్బీ, పారసి, కన్నడము, రుమీ, కన్నోజి తెలుగు మొదలైన భాషలెరిగి వ్రాయనేర్చిన వాడై బహు భాషావేత్తగా నుండెను. అంతేకాక నితడు విలువిద్యలో నేర్పరియై యుండెను. ఇతని తమ్ముడు షేక్ ఇబ్రాహీం – ఇది యమీనుఖాను తమ ప్రభువుపై గల యభిమానమున పెట్టుకొనిన పేరు కావచ్చును. మంత్రులు, సేనానులు తమ కుమారులకు తమ ప్రభువుల పేరు పెట్టుకొనుటాంధ్ర దేశమున ప్రాచీనము నుండి గలయాచారము.

షేక్ ఇబ్రాహీం ఈ కావ్యకాలము నాటికి యువకుడు కావచ్చును కాని యింకను వ్యవహార రంగమున కాలుమోపలేదని పించును. అందువలన తెలగన్న యతని ప్రతాపాదులేవి వర్ణించలేదు.

మూడవ భార్య కుమారుడైన యబ్దుల్‌కరీము అరబీ పారసీ భాషలు నేర్చిన విద్యావంతుడై యుండెను. ఇతడిబ్రాహీము పాదుషాను మెప్పించి యతనితో తగిటు దట్టీలు, కుల్లాయీలు, పాగరుగల గుఱ్ఱములు, అందలములు, గొడుగులు పొందెనట కాని ప్రభువునే విధముగా మెప్పించెనో తెలియదు.

ఈ విధముగా తన యైదుగురు కుమారులు ప్రభువుగారి కొలువులో మంచి యుద్యోగములలో నున్నతస్థితి యందుండగా పెద్దతనమున తాను తన యేలికయగు మల్కిభరాముని వలె సప్తసంతానములను పొందుచుండెను.

ఇబ్రాహీం పాదూషా ఒకపుడు వేటకు వెళ్లి యాప్రదేశమున తన పేర ఇబ్రాహీము పట్టణము స్థాపించగా నమీనుఖాను తన పేర నమీనుపురము స్థాపించెను. ఇబ్రాహీం తన పట్టణమున చెరువును త్రవ్వించగా అమీనుఖాను గూడ నమీనుపురమున చెరువును త్రవ్వించెను.

ఇబ్రాహీము ఇబ్రాహీము పట్టణమున మరియు గోలకొండలో నుద్యానములు వేయించగా అమీనుఖాను గూడ నమీనుపురమున మామిడి, నిమ్మ, దానిమ్మ మొదలైన తోటలు పెట్టించెను. ఇబ్రాహీం పాదూషా మసీదులు కట్టించగా తానుగూడ నమీనుపురమున భవ్యమైన మసీదు కట్టించెను.

మల్కిబ్రాహీము అద్దంకి గంగాధర కవి చేత పతీ సంవరణము కృతినందగా నితడు పొన్నగంటి నీ కృతిని యంకితముగా గొనెను. ఇట్లితడు మల్కిబ్రాహీము చెంత మంత్రియై యుండి ప్రభు సదృశమైన జీవితము గడుపుచుండెను.

అమీనుఖానుడు దీనిని కృతి నందుకొను నాటికి కుమారులు పెద్దవారై తండ్రికి రాజ్యకార్యములలో సహాయమొనర్చుచు నిభరాము పాదూషా కొలువున నుద్యోగములలో నుండగా డెబ్బది సంవత్సరముల వయస్సువాడై సప్తసంతానములపై మక్కువ కలిగి తోటలు బెట్టించుచు, చెరువులు, బావులు త్రవ్వించుచు బ్రాహ్మణ పిల్లకాయలకు వడుగులు మొదలైనవి చేయించుచు ధర్మకార్యరతుడై యుండెనని కావ్యావతారికను బట్టి ఊహింప వీలగుచున్నది.

అమీనుఖాను గురుపరంపర మరియు సంప్రదాయము

అమీనుఖాను ఆస్థానమున మరింగంటి యప్పల దేశికులుండెను. తెలంగాణమున మరింగంటి వారిది చాలా పెద్ద పీఠము. వారెందరో జాగిర్దార్లకు దొరలకు ఆచార్యులై యుండిరి. విశిష్టాద్వైతమునకు చెందిన ఈ వంశీయులందరు నృసింహోపాసకులు. తపః ప్రభావ సంపన్నులు.

అప్పలాచార్యులు నరపతులు, అశ్వపతులు, గజపతులను ముగ్గురు రాజులచేత మ్రొక్కులందుకున్న వారు. తనకు నిరంతరము భక్తి తాత్పర్యములతో మొక్కువారికే యాపదలు రాకుండ జూచు నుపాసనా బలము గలవాడు.

విశిష్టాద్వైతము భక్తిప్రధానమైన మతము. అద్వైతులు పోగొట్టుకొనిన యాత్మను విశిష్టాద్వైతము వెదకి మరల యుద్ధరించి సమాజమున కిచ్చి సామాన్యుని ముందు కష్టసుఖములలో నేనున్నానని వరదాభయ హస్తముతో నిలిచిన శ్రీమన్నారాయణుని జూపెను. ఈ మతము ప్రతిపాదించిన భక్తి నవవిధములు.

అమీనుఖానుగారి కులగురువులు ఖాదిరీలు, హజరత్ మోఖిదుంజి ఖాదరిగారు వీరిగురువు. ఆయునను గతాతఖాను, ఫాజిలుఖాను, అబ్దులలీ, అబ్దులు కరీము సేవించుచుండగా మోఖిదుంజి ఖాదరీగారి సోదరుడగు తసీరుని హజరత్ షేక్‌బుదురుది గారిని ఆ సోదరులలో చిన్నవాడైన షేక్‌బ్రాహీము సేవించుచుండెను.

హజరత్ మోఖిరుంజి ఖాదరీ గారి సమాధి యిపుడు బీదర్ లోనున్నది.

ఇస్లాం దర్శనము మ్యూటాజెలిజం (బుద్ధివాదము) అషారిజం (ఛాత్రవాదము) సూఫీయిజం (రహస్యవాదము) ఫిలాసపి (శుద్ధదార్శనికవాదము) అని నాలుగు శాఖలుగా విస్తరిల్లినది. వీనియందు సూఫీమార్గము హిందువుల యొక్క భక్తిమార్గమునకు మిక్కిలి చేరువైనది. అందువలన నిది భారతదేశమున బాగుగా విస్తరిల్లినది. దీనియందు 14 శాఖలున్నవి.

1. మలామతియా :- లామయనగా నరబీ భాషలో గర్హించుట కావున నీశాఖవారు దైహిక వాంచలను గర్హింతురు. ఇది 8వ శతాబ్దమున పర్షియా దేశమున నారంభమైనది. సూఫీలు తమసాధనలో వారధిరోహించు స్థితుల యొక్క ఆనందమును ప్రకటించుకొనుచుందురు. ఈ శాఖ వారటులగాక దానిని రహస్యముగా నుంచుకొనుచుందురు.

2. సుహర్వర్దియా:- దీనిని సహర్వర్థియాయని గూడ నందురు. ఇది క్రీ.శ. 1144-1236 నడుమ బగ్దాదులో జీవించిన సహర్వర్దియాగారు స్థాపించెను. వీరు కఠోరమైన యధ్యాత్మిక క్రమశిక్షణకు ప్రసిద్ధి. ఈ శాఖవారు అల్లాకు గల 99 అతిసుందరమైన నామములను (జికర్) వేలాది పర్యాయములు వల్లింతుచుందురు. ఇపుడీ శాఖవారు అఫ్ఘనిస్తానులో యెక్కువ.

3. చిష్తియా:- ఈ శాఖను క్రీ.శ. 12వ శతాబ్దమున ఖ్వాజా మొయినొద్దీన్ చిష్తీగారు అజ్మీరును కేంద్రముగా జేసి కొని స్థాపించెను. వీరుశాంతికాముకులు. జికర్ ఖఫి (మానస్మరణ) జికర్జలి (సంకీర్తన) వీరి సంప్రదాయము.

4. రిఫాయియా:- ఈ శాఖ 12వ శతాబ్దమున అహమదుర్ రిఫా వారిచే స్థాపింపబడెను. ఈ శాఖ వారికి దర్వీషులని పేరు. వీరు గొప్పగా అరుతురు. అద్భుత మహిమలను విశ్వసింతురు. ఈ శాఖను క్రీ.శ. 1925లో టర్కీ అధ్యక్షుడగు ముస్తఫా కెమాల్పాషా నిషేధించెను.

5. జెకాష్తియా:- దీనిని 13వ శతాబ్దమున ఖోరాసాన్ ప్రాంతపు "జెక్తాన్వలీ" స్థాపించెను. వీరు నాల్గవ ఖలీపా హజరతలీ అనుయాయులు. ఈ శాఖవారు బ్రహ్మచర్యమునకు ప్రాముఖ్యమిత్తురు. టర్కీదేశపు దర్వీషులీ మార్గమునకు చెందుదురు.

తెలుగులో చార్దర్వీషుల కథలు ప్రసిద్ధము.

6. ఖాదిరియా:- ఈ శాఖ సయ్యద్ అబ్దుల్‌ఖాదర్ గారిచే స్థాపింపబడినది. ఖదర్ అనగా స్వేచ్ఛాసంకల్పము, జబర్ అనగా బలవంతము. ఈ శాఖవారు భగవంతుని చేరుటకు స్వేచ్ఛాసంకల్పముపై యాధార పడుచుందురు.

7. మౌలవ్య:- ఈ శాఖ 13వ శతాబ్దమున టర్కీలో జలాలుద్దీన్ రూమీగారిచే స్థాపింపబడినది. ప్రజలాయనను మౌలానాయని పిలిచెడివారు. మౌలానాయనగా నాచార్యుడని యర్థము. సుప్రసిద్ధులైన నాట్య దర్వీషులీశాఖకు చెందుదురు.

8. నక్ష్‌బందియా:- ఇది మొదటి ఖలిఫాయగు అబూబేకర్ గారి నుండి వచ్చిన సంప్రదాయము. క్రీ.శ. 1384లో బహావుద్దీను అనునతడు తుర్కిస్థానులోని బొఖారోలోస్తాపించెను. బహావుద్దీనుకు నక్ష్‌బందీయని బిరుదు. నక్ష్‌బందీయనగా చిత్రకారుడని యర్థము. ఈయన యేర్పాటుచేసిన జికర్ (కీర్తనాపద్ధతి) సూఫీల హృదయాలపై భగవంతుని చిత్రమునచ్చువలె ముద్రించును. కనుక దీనికీ పేరు కలిగినది.

9. ఖాలందరియా:- ఈ శాఖను యిండియాలోని సంచార దర్వీషులు క్రీ.శ. 13వ శతాబ్దమున డమస్కస్‌లో స్థాపించిరి. ఈ శాఖవారు బ్రహ్మచర్యమునకు ప్రాముఖ్యమిచ్చిరి.

10. షాజిలియా:- ఈ శాఖ క్రీ.శ. 13వ శతాబ్దమున షజిలీగారిచే అలెగ్జాండ్రియా (ఈజిప్టు) లో స్థాపింపబడినది. వీరు సన్యాసము, మఠజీవితము, భిక్షుక వృత్తికి బదులు సంసారిక జీవితమును ప్రతిపాదింతురు. కనుకనిది తెలుగు వారి రాజయోగము వలె సహజీవన మార్గమై ఈ పరంపర యెక్కువగా నిపుడు వ్యాపించినది.

11. షత్తారియా:- ఈ శాఖను క్రీ.శ. 1428లో యిండియా దేశపు సూఫీయైన అబ్దుల్లా సత్తారిగారు స్థాపించిరి. వీరు "ఫన" అనగా నహంకార నివృత్తి నంగీకరించరు. నేను అనునది లేని యెడల భగవదైక్యము (తాహిద్) దేనికని వీరిమతము.

12. దర్వాషా:- ఈ శాఖను 18వ శతాబ్దమున దర్వానీగారు స్థాపించిరి. వీరు నాట్యగానములతో భగవంతుని సేవింతురు. ఇది బ్రహ్మసమాజస్థితి. మొరాకో దేశమున నీ తెగకు చెందిన సూఫీలుగలరు.

13. సుకర్:- ఈ శాఖ మలామతియాతో పాటుగనే యుద్భవించినది. మలామతులు నిరంతర జాగరూకతకు ప్రాముఖ్యమీయగా వీరు దానికంటె భగవచ్చింతనకు ప్రాముఖ్యమిత్తురు.

సూఫీ గురువుల యొక్క యుపదేశము రహస్యముగా నుండును. దానిని శిష్యుడు మూడు సంవత్సరములు గురువు గారిసేవా శుశ్రూషలు చేసి పొందవలసియుండును. అది పొందిన వారిని వారివారి తరగతిని బట్టి మురీద్- ఇఖ్వాన్- దర్వేష్- ఫకీర్ అని పిలుతురు. వైష్ణవమున గూడ తిరుమంత్రము గోప్యముగనే యుపదేశింపబడును. దానిని దాసులు గురువుగారి సేవా శుశ్రూషలు చేసియే పొందవలసియుండును. అందువలన భక్తి విషయమునగాని యుపదేశ విషయమునగాని వైష్ణవమునకు సూఫీకి మిక్కిలి దగ్గరి పోలికలున్నవి.

తత్వవేత్తలు సూఫీపై జైన, బౌద్ధ, శైవ, శాక్తేయ, వైష్ణవ బోరాష్ట్రియన్ మొదలైన ప్రపంచమంతటి యొక్క ప్రభావమున్నందురు. ఈ మత శాఖలు క్రీ.శ. 12,13 శతాబ్దులలో నెక్కువగా ప్రభవించినవి. అందులకు అప్పటి వరకు ప్రపంచమునగల వివిధ మతములు శాఖోపశాఖలుగా విస్తరిల్లి ఆయామతములకు చెందిన సన్యాసులు విదేశములను దర్శించుచు నచటి మతవిషయములపై యాసక్తిని ప్రదర్శించుచుండుట యొక కారణమగును.

ఇక నిస్లాము క్రైస్తవములొక్కకుదుట బుట్టినవే, క్రైస్తవు లేసును దేవుని కుమారుడనగా ముస్లిములు దేవుడొకరికి పుట్టడు. ఒకరిని కనడు కావున యేసు ఒక భగవద్విశ్వాసి మాత్రమే యందురు. ఇదియే నా రెండు మతములకు గల ముఖ్యభేదము. వారిలో కేథలిక్కు ప్రొటెస్టెంటులవలె వీరిలో షియా సున్నీలు నిలిచినవి.

సూఫిశాఖలలో గూడనేడు ఖాదిరియా, చిష్తియా, నక్ష్బందియా, సుహార్ వర్దియా యను నాలుగే నిలిచినవి. వానిలో నమీనుఖాను కుటుంబము ఖాదిరియాకు చెందినవారు. అనగా కొంత యాత్మ స్వాతంత్ర్యము గలవారు. అందుచేతనే వారు పేదలపై దయ, సప్తసంతానములపై మక్కువ తమ అన్యమైన హిందూమతముపై యభిమానము గలవారైరి.

దానికనుగుణముగ తెలగన్న మున్నీటి రాణియడుగు కెందామర తేనెయ్యైనట్టి కర్తారుడు పొట్లచెర్వునకు రక్షకుడుగా యమీనుఖా నచట నిల్పిన మసీదును జూచి శివుడు కైలాసమును విడిచి యందే నివసించినట్లుగా, నా మసీదు పొడవులకెల్ల పొడవై ప్రోడలు నెమ్మదిలోన గాంచు నిల్కడ, కడలేని తేజాన జగంబున కవ్వలియైన వెల్గును బొందువారలకు

నెక్కగ నిచ్చెనగా నుండెనని చెప్పి హరిహర స్మరణజేసి దానిని"తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య" యను గాయత్రీ నామక పరబ్రహ్మ రూపమునను పసంహరించుట తెలగన్న నాదరించిన యయానాటి యమీనుఖాను హృదయు పరిణతిని తెల్పును.

యయాతి వృత్తాంతము

యయాతి చంద్రవంశ ప్రభువు. ఇతనికి దేవయాని శర్మిష్ఠయని యిద్దరు భార్యలుండిరి. దేవయాని నతడు శాస్త్రీయముగా వివాహమాడగా శర్మిష్ఠ గాంధర్వ విధిని వివాహమాడెను. అందుకొక కారణము గలదు.

దేవదానవుల వైరము పురాణ ప్రసిద్ధము, దేవతల గురువు బృహస్పతి, దానవుల గురువు శుక్రాచార్యుడు. దేవతలకడ నమృత ముండగా దాని బదులు శుక్రుడు శివుని గురించి తపస్సుచేసి మృతసంజీవనీ విద్యను పొందెను.

అమృతము త్రావినవారికి మరణము లేదు కాని మృతసంజీవనితో మరణించినవారు పునర్జీవితులగు చుండిరి.

దేవదానవుల యుద్ధములందు కర్మము చాలక మరణించినచో దానవులను శుక్రుడు బ్రతికించుచుండెను. కాని బృహస్పతి ఆ పని చేయలేకుండెను. దానివలన దేవతల బలగము తరుగుచుండగా వారు బృహస్పతి దగ్గరకు వెళ్లి మనమెట్లైన మృతసంజీవనీ విద్యను సాధింప వలెను. కనుక నీ కుమారుడైన కచును శుక్రుని దగ్గరకు విద్యార్థిగా పంపినచో దానిని నేర్చుకొని వచ్చునని చెప్పిరి.

బృహస్పతి యందులకంగీకరించి కచుని శుక్రుని దగ్గరకు పంపగా శుక్రుడతనికి విద్యనేర్పిన యెడల బృహస్పతిని పూజించినట్లుగునని శిష్యునిగా నంగీకరించెను. దానవులది చూచి ఇతడు మృతసంజీవనీ విద్యను గ్రహించి వెళ్లిన దేవతలు మనకజేయులగుదురని తలచి కచునే విధముగా నైన వధించవలెనని తలపెట్టిరి.

అతడు శుక్రుని దగ్గరచేరి వినయమున సేవలు చేయుచుండ అతని రూప లావణ్యములు సద్గుణములు చూచి శుక్రుని కూతురతనిని వలచెను. వివాహము చేసికోదలచెను.

కచునిపై పగబట్టిన దానవులు సమయము కొరకు వేచియుండి అతడు హోమధేనువు వెంట అడవికి వెళ్లినపుడు పట్టుకొని చంపిరి. అంత సాయంకాలమునకు కచుడింటికి రాక

దేవయాని దుఃఖించనారభించెను. కూతురు దుఃఖము చూడలేక శుక్రుడు అతనిని వెదకుటకు మృతసంజీవనీ విద్యను బంప అది యతనిని పునర్జీవితుని జేసికొని వచ్చెను.

దానవులతనిని సమయము చూచి చంపుచుండగా శుక్రుడు బ్రతికించుచుండెను. అపుడు రాక్షసులది పనిగాదని చివరి పర్యాయ మతని చంపి కాల్చిబూడిద చేసి దానిని సురలో కలిపి శుక్రునికి త్రాగించిరి.

ఆనాడెప్పటి వలె కచుడు రాకపోగా దేవయాని యన్నము మాని దుఃఖించుచు కూర్చొనెను. శుక్రుడు కూతురు దుఃఖము చూడలేక కచుడు మరల నెక్కడ చచ్చిపడినాడోయని దివ్యదృష్టితో చూడగానే లోకమందును కనిపించకపోగా చివరకు తనలో చూచుకొనెను. అపుడు కచుడు తన యుదరముననే కనిపించెను.

మామూలుగా గడిచిన యెడల శుక్రుడతనికి మృతసంజీవని తెలిపెడి వాడోలేదోకాని దానవులే విద్య కచునికి లభించ గూడదని దుండగము తలపెట్టిరో అదియే యతనికి కలసివచ్చెను. శుక్రుడు గర్భస్థుడైన కచుని బ్రతికించి యతనికి మృతసంజీవని నుపదేశించి తనకడుపు ప్రక్కలించుకొని బయటికి వచ్చి తనను మరల బ్రతికించమని చెప్పెను.

కచుడు గురువు చెప్పిన ప్రకారమతని యుదరమును చీల్చుకొని బయటికి వచ్చి యతనిని మరల బ్రతికించి గురువు ఋణము తీర్చుకొని పిదపనింటికి వెళ్ల సమకట్టగా దేవయాని అదితెలిసి తనను వివాహమాడి యచటనే నిలిచి పొమ్మని కోరెను.

వివాహమను మాట వినగనే కచుడు భిన్నుడై నీవు నాకు గురుపుత్రివి. సోదరీసమానురాలవు అదిగాకనేను మరణించి మరల మీ తండ్రి కడుపునుండి జనించితిని కనుక నిన్ను వివాహమాడజాలనని ఖండితముగా చెప్పెను. అదివిని దేవయాని యతనిపై తాను పెంచుకొన్న యాశలన్ని భగ్నము కాగా కోపవశమున కచుని నీవు స్త్రీహృదయము నర్థము చేసికొనక నాకోరికను వ్యర్థము చేసితివి, గాన నీకు మాదగ్గర నేర్చిన విద్య ఫలించకుండుగాక! యని శపించెను.

అందులకు కచుడు ఈ విద్యనాకు ఫలించకున్నను నేను ధర్మము తప్పని వాడనైన యెడల నాదగ్గర నేర్చిన వారికి ఫలించగాక నీవు ధర్మము తప్పి నన్ను కామించితివి. కాన నీ కులస్థుడెవడు నిన్ను వివాహమాడకుండు గాక! అని ప్రతి శాపమిచ్చి తనలోకమునకు వెళ్లిపోయెను.

శుక్రుడు వృషపర్వుడను దానవుని ఆస్థానమున నుండెను. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ. శర్మిష్ఠ దేవయాని యిద్దరు ప్రాణమునకు ప్రాణమైన స్నేహితులై మసలు చుండిరి. ఒకనాడు వారిద్దరు ప్రమద వనమునకు వెళ్లి జలక్రీడలాడుచుండగా వాయువశమున దరిపైనున్న వారి చీరలు కలిసిపోయెను.

జలక్రీడానంతరము వడ్డునకు వచ్చి శర్మిష్ఠ గుర్తింపనేరక దేవయాని చీరను కట్టుకొనెను. అపుడు దేవయాని శర్మిష్ఠ చీరను చూచి నేను బ్రాహ్మణ కన్యను. మీ గురువు గారి కూతిరిని, నీ చీరనెట్లు కట్టుకొందువని గర్వించి పలికెను. దానిపై వారిద్దరికి మాటమాట పెరిగి శర్మిష్ఠ దేవయానిని తన చెలికత్తెలతో నాసమీపమున గల యొక పాడు బావిలో త్రోయించి వెళ్లెను. ఆమె వెళ్లిన పిదప ఆ ప్రాంతమునకు వేటకై వచ్చిన యయాతి మహారాజు దప్పిగొని నీటికై వెదుకుచు వచ్చి పాడు నూయిలో గల దేవయాని చూచి నీవెవరు ఏ విధముగా దీనిలో పడితివని యడిగి తనకుడిచేతి నందించి యామెను పట్టుకొని పైకి తీసి వెళ్లిపోయెను. ఇక్కడ వనమునకు వెళ్లిన శర్మిష్ఠ యొక్కతియే మేడకురాగా దేవయానిని వెదకుచు ఘూర్ణిక యను దాసివచ్చి ఆమెను చూచెను. అపుడు దేవయాని ఆమెతో షర్మిష్ఠ విషయ మంతయు చెప్పి నేను పట్టణములోనికి రాను. నీవు వెళ్లి మా తండ్రిగారితో నీ విషయము చెప్పుమనగా ఘూర్ణిక వెళ్లి శుక్రునితో జరిగిన విషయము చెప్పెను.

శుక్రుడు దేవయాని వృత్తాంతము విని ఆమెపై గల ప్రేమతో పరుగు పరుగున వచ్చి శర్మిష్ఠ నీకంటె చిన్న పిల్ల. ఏదో తెలియక చేసినది. అని ఆమె నోదార్చగా దేవయాని ఈ గౌరవములేని బ్రతుకు మనకెందుకు వేరొక చోటికి వెళ్లుదమని తండ్రితో పట్టు బట్టెను. ఈ లోపల ఈవర్తమానము చారులు వెళ్లి వృషపర్వునకు చెప్పగా ఆయన వచ్చి వారిని సముదాయించి దేవయానితో నీవేమి కోరెదవో కోరుము దాని నిచ్చెదననెను.

దేవయాని అట్లైన తన సహస్రదాసీలతో శర్మిష్ఠను నాకు దాసిగా చేయుమని కోరెను. అదివిని వృషపర్వుడు శుక్రుని విడుచుకొనలేక కూతురనియైన చూడక శర్మిష్ఠ నామెకు దాసిగా చేసెను.

ఆ తర్వాత మరొకనాడు దేవయాని తన దాసీలతో వనవిహారమునకు వచ్చెను. ఆనాడు దైవికముగా యయాతి మరలవేటకు వచ్చి వారిని చూచి దేవయానితో శర్మిష్ఠ ఎవరనియడిగెను. అపుడామె మహారాజా! నీవు నన్నప్పుడే మరచితివా! ఆనాడు నాచేయి పట్టి బావినుండి బయటికి తీసితివిగదా! ఆనాడు నన్ను నూతిలో పడద్రోసిన యీమె నాకిపుడు దాసియైనది. పేరు శర్మిష్ఠ వృషపర్వుడను దానవ రాజు కూతురు.

నీవు నన్ను వివాహమాడుము. వీరందరు నిన్ను సేవింతురు. అనగా యయాతి నేను క్షత్రియుడను నీవు బ్రాహ్మణ కన్యవు. బ్రాహ్మణులు క్షత్రియకన్యలను వివాహ మాడవచ్చును కాని క్షత్రియులు బ్రాహ్మణ కన్యలను వివాహమాడుట ధర్మము గాదనెను. అపుడు దేవయాని తనకు గల కచుని శాపము దెలిపి మా తండ్రి సమ్మతించిన నీవునన్ను వివాహమాడుదువా యనియడిగెను. యయాతి యతడంగీకరించిన యెడల వివిహమాడుదుననగా దేవయాని తండ్రిని తలచుకొనగా నతడచటికి వచ్చెను. అపుడామె యయాతిని చూపి తండ్రితో ఇతడే నన్ను బావి నుండి చేయిపట్టి యుద్ధరించిన వాడని తెలిపి నేనీయునను తప్ప ఇతరుని వివాహమాడను. ఇందులకు నీవు సమ్మతించని యెడల ప్రాణత్యాగము చేసికొందుననెను.

యయాతికి అంతవరకే ఒక కూతురు గలదు. దేవయాని మాటవిని శుక్రుడు ఆమె పై గల ప్రేమచేత దాని నొక ప్రత్యేక విధిగా నంగీకరించగా యయాతి యామెను శాస్త్రోక్తముగా వివాహమై తన పట్టణమునకు గొనివెళ్లెను. అపుడు శుక్రుడతనికి శర్మిష్ఠ నప్పజెప్పుచు నీమెకు సకల భోగములు దేవయానికి వలెనే నడుపుము కాని శయ్యను మాత్రము పరిహరింపుమని చెప్పెను.

యయాతి శుక్రుడు చెప్పినట్లు నడుచుకొనుచుండగా దేవయానికి యదువు తుర్వసుడని యిద్దరు కుమారులు కలిగిరి. శర్మిష్ఠ ప్రత్యేకముగా ప్రమదవనమున నుండెను.

ఒకనాడామె ఋతుస్నాతయై దేవయాని యదృష్టమును తన దురదృష్టమును తలచుకొని చింతించుచుండ నపుడావనమునకు వచ్చిన యయాతి శర్మిష్ఠను చూచుట సంభవించెను. అప్పటి వరకే యతడామె రూపసంపదకు ముగ్ధుడై యుండెను. కావున శర్మిష్ఠ యారాజు హృదయమును కనిపెట్టి తనకు ఋతుదానము చేయుమని కోరెను. యయాతి ఆమెతో శుక్రుడు చేసిన నియమము తెలిపెను. అపుడామె మహారాజా! మీరెపుడు మాయజమానురాలికి పతయైతిరో అమె దాసీలమైన మాకందరికి మీరు పతయైనట్లే లెక్క అంతేకాక ప్రాణాపాయ సమయమున, ధనాపహరణవేళ, వివాహ సమయమున స్త్రీ, జన సంగమమున బొంకవచ్చును. దోషము గాదని యామె యతనికి శుక్రనీతిని తెలిపెను. ఆనాటి నుండి వారేకమైరి. శర్మిష్ఠకు క్రమముగా ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనుకుమారులు కలిగిరి.

ఆమె కుమారులు కలిగిన సంగతివిని యొకనాడు దేవయాని యేమేనీకు భర్త లేకుండగనే పుత్రులెట్లు కలిగిరని యడిగెను. అందుల కామె నాకొక ఋషివరము వలన

ఈసంతానము కలిగెనని చెప్పెను. దేవయాని బ్రాహ్మణ కూతురు కనుక శర్మిష్ఠ ననుమానించకుండ దానిని నమ్మెను. కాని యొకనాడా బాలురు యయాతి దగ్గర నాడుచుండ నాసమయమున దేవయాని యచటికి వచ్చి వారి పోలికలు చూసి మీ తండ్రి యెవ్వరని యడుగ వారు మహారాజును చూపిరి.

అపుడామె యయాతిపై మండిపడి తండ్రిదగ్గరకు వెళ్లి తనపతి వివాహము నాడు చేసిన ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి యను ప్రతిజ్ఞను వమ్ము చేసెనని చెప్పుకొని దుఃఖించనతడు కోపపరవశుడై యయాతిని వృద్ధుడవు గమ్మని శపించెను.

దేవయాని తన తండ్రి యయాతిని మందలించును గాని యటుల శపించునని తలచలేదు. ఆమెకింకను భోగేచ్ఛ తీరకుండెను. అందువలన తండ్రిగా శాపముప సంహరింపుమని వేడగా నాశాపమోఘము. అది తిరుగదుకాని మీ కుమారులలో నెవరైన తండ్రి యొుక్క ముదిమిని తీసికొనుట కిష్టపడిన యెడల నతని యౌవన మితడనుభవింపవచ్చును. మీ పుత్రులలో తండ్రికి తన యౌవన మెవడిచ్చునో వాడే రాజ్యమునకుత్తరాధికారి యగునని దానిని మార్చెను.

పిమ్మట యయాతి దేవయాని కుమారుల నొక్కొక్కరిని పిలిచి తన ముదిమిని భరించుమనగా వారెవరుకూడ నందు కంగీకరించక రాజ్యార్హతను కోలుపోయిరి. శర్మిష్ఠ కుమారులలో చివరివాడైన పూరుడు పితృభక్తిపరుడై తన యౌవనము తండ్రికిచ్చుట కంగీకరించెను. యయాతి దానిని స్వీకరించి మరల పెద్దకాలము సుఖభోగములనుభవించి చివరకు తనముదిని తాను తీసికొని పూరుని రాజ్యమునకు పట్టము గట్టి తాను వనములకు వెళ్లి తపము చేసి సశరీరముగా బ్రహ్మలోకము వెళ్లి తిరుగు ప్రయాణముగ స్వర్గమునకు రాగా ఇంద్రుడతనిని గౌరవించి నీవేయే సత్కార్యములు చేసితివని యడిగి యయాతి తనగొప్పలన్ని చెప్పుకొనగా నింద్రుడిట్టివారికి స్వర్గమున స్థానములేదు వెళ్లుమని పంపెను.

అపుడతడు భిన్నుడై నేను భూలోకమునకు మరల వెళ్లలేను. సద్భువనమునన్నైన నుండునట్లనుగ్రహింపు మనివేడ ఇంద్రుడందుల కంగీకరించెను. అంతనతడు నక్షత్ర లోకమునకు రాగా నచటనొక భవనమున నలుగురు పురుషులు కనిపించి యతనిని చూచి యెవరో మహానుభావుడని గౌరవించి మీరెవరిని యడిగిరి. అతడునేను యయాతి మహారాజునని చెప్పెను. అదివిని వారు మేము నీ దౌహిత్రులమని తమ వృత్తాంతములు వినిపించిరి.

పూర్వము గాలవుడను ఋషికుమారుడు విద్యార్జనకై విశ్వామిత్రుని కడకేగి మిక్కిలి భక్తి శ్రద్ధలతో నతనిని సేవించి విద్యలన్ని నేర్చుకొని తిరిగి వెళ్లునపుడు గురుకట్నమేమి కోరెదరని యడిగెను. విశ్వామిత్రుడునేను నీసేవా శుశ్రూషలకే సంతసించితిని కాన గురుకట్న మీయనక్కరలేదనెను. కాని గాలవుడు విద్యనేర్చుకొని యూరక వెళ్లుటకు మనసొప్పక నేదియో గురుకట్న మీయదలచి యతనిని మరిమరి యడుగగా నా మహర్షి క్రోధపరవశుడై నీవు గురుకట్న మీయదలచిన శరీరమంతయు తెల్లనై యొకచెవి మాత్రమే నల్లనైన యశ్వములు 800 తెచ్చియిమ్మని యనెను.

గాలవుడా మహర్షి ఏదియూ తనశక్తిలోనిది కోరుననుకొనెను. గాని యిట్టి విషమ పరీక్షకు గురిచేయునని తలంచలేదు. అయినను గురువు కోరెను కనుక తప్పదని తానెందరు రాజుల దగ్గరకువెళ్లినను అకోరిక సిద్ధింపక చివరకు తన మిత్రుడగు గరుడు నాశ్రయించెను. అతడు గాలవుని యయాతి మహారాజు దగ్గరకు కొనివెళ్లి యతని కోరికను తెలిపెను.

యయాతి మహారాజునకు మాధవియను నొక కూతురుండెనని ఇంతవరకు తెలిపితిని ఆమె ఊర్వశి యందు కలిగియుండెను. ఆమెకు కన్యాత్వదూషితము కాకుండ నొక ఋషివరముండెను. అతడు గాలవుని కోరకవిని తనచెంత గూడ నట్టి యశ్వములు లేవని మాధవినతని కప్పగించి యీామెను కొనివెళ్లి యట్టి యశ్వము లెవరికడనున్న వారికీమెనిచ్చి వానిని తీసికొమ్మని చెప్పెను.

గాలవుడామెను వెంటగొని దేశదేశములు తిరుగుచు నిక్ష్వాకు మహారాజు దగ్గరకు వెళ్లగా నతని యశ్వశాల యందట్టి గుర్రములు రెండు వందల మాత్రమే యుండెను గాలవుడు వానిని పుచ్చుకొని మాధవినతని కప్పగించెను. ఆమెకతని వలన వసుమనసుడను కుమారుడు కలిగెను. పిదప ఇక్ష్వాకు వామెను గాలవుని కప్పగించగా నీ పర్యాయ మామెను దివోదాసుకడకు కొనివెళ్లెను. అతని దగ్గర గూడ నట్టి గుర్రములు రెండువందలే యుండెను. వానిని పుచ్చుకొని గాలవుడు మాధవిని దివోదాసున కప్పగించెను. అతని వలన నామెకు ప్రతర్ధనుడను కుమారుడు కలిగెను. పిమ్మట దివోదాసామెను మరల గాలవుని కప్పగించగా నతడామెను ఉశీనరుని చెంతకు గొనివెళ్లెను. అతని దగ్గర గూడ మరల రెండువందల గుర్రములే లభించెను. గాలవుడు వానిని తీసుకుని మాధవి నతని కప్పగించగా నపుడామెకు శిబియను కుమారుడు కలిగెను. పిదప నతడుగూడ మాధవిని మరల గాలవుని కప్పగించగా నీ పర్యాయమెక్కడను మరల యశ్వములు దొరకక నామెను గాలవుడు నేరుగా విశ్వామిత్రుని దగ్గరకే కొనివెళ్లి అంతవరకు తనకు లభించిన యారువందల గుర్రములప్పగించి విషయమంతయు నివేదించెను.

అదివిని విశ్వామిత్రుడు మాధవిని మొదలే తన దగ్గర కెందులకు కొనిరాలేదని శిష్యుని చివాట్లు పెట్టెను. ఈ పర్యాయమామెకు విశ్వామిత్రుని వలన అష్టకుడను కుమారుడు కలిగెను. పిదపనతడు గూడ మాధవిని మరల గాలవున కప్పగించగా నతడామెను మరల తండ్రికప్పగించెను.

గమనిక : – ఈమె కథను "మాధవి" అనుపేర కన్నడమున అనుపమ నిరంజన రచించగా దానిని కళ్యాణి అను నామె తెలుగున అనువదించెను. ముద్రణ : 1979.

ఇపుడు యయాతి చరిత్రను యయాతి పేర మరాఠీలో విష్ణు సుఖరామ్ ఖండేకర్ రచించగా దానిని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు తెలుగు చేసినారు. ధారావాహికం ఆంధ్రజోతి : 1996.

ఈ విధముగా మాధవికి కలిగిన వసుమనాది నలువురు పుత్రులు యయాతి రెండవ యవ్వన మనుభవించుచుండగా స్వర్గస్థులై సద్భువనమున నుండిరి. వారు తమ వృత్తాంతములు వినిపించిన పిమ్మట యయాతి వారితో గూడి కొంతకాలముండి జీవుని జనన మరణాది విషయములు చర్చించుచు తత్వచింతనుడై కాలము గడిపి నిరహంకారుడై చివరకు వారితో గూడి నూర్ధ్వలోకములకు వెళ్లెను. ఇది యయాతి యొక్క సంపూర్ణమైన వృత్తాంతము.

యయాతి చరిత్ర పీఠిక యందు వావిళ్లవారు చెప్పినట్లు తెలగన్న యయాతి వృత్తాంతమున తెలిపిన దానికంటె విడిచినదే యెక్కువ. వస్తువు విశాలమైన దైన యెడల ప్రబంధ ప్రక్రియ కొదుగదని తెలగన ఈ వృత్తాంతమును తన కావ్యమున శర్మిష్ఠ వివాహము వరకే గ్రహించెను.

యయాతికి విధియుతముగా పెండ్లియాడిన భార్య దేవయాని యున్నను కాళిదాసు శాకుంతలమున శకుంతలను కణ్వమహర్షితో యయాతికి శర్మిష్ఠవలె మనసున కెక్కుమని దీవింపజేసెను. కావున దానిననుసరించి యయాతి చరిత్రను గ్రహించిన కవులందరు అతని జీవితమున శర్మిష్ఠకే ప్రాముఖ్యమిచ్చిరి.

యయాతి అనగా పోవువాడు లేదా వెళ్లువాడని యర్థము. అతడు తన జీవితమున నొక భూమికనుండి మరియొక భూమికకు అనగా యౌవనము నుండి వృద్ధదశకు, వృద్ధత్వము నుండి మరల యువక దశకు, అటులే భూలోకము నుండి బ్రహ్మలోకమునకు అటునుండి ఇంద్రలోకమునకు దానిని విడిన సద్భువనమునకు అక్కడి నుండి మరల

నూర్ధ్వలోకములకు వెళ్లెను. శర్మిష్ఠయనగా శ్రుతి మార్గమున నున్నది లేదా నిలిచినదని యర్థము. నిజమునకు యయాతి యీామెనే శాస్త్రీయముగా వివాహమాడలసినది కాని అటుల జరుగలేదు. మహారాజునకీమెపైననే ప్రేమ యధికము. అందువలన కాళిదాసు కణ్వమహర్షితో శకుంతలను యయాతి శర్మిష్ఠవలె ప్రేమ పాత్రురాలవగుమని దీవింపజేసెను.

యయాతి చరిత్రను మొదట రచించిన కాకతి రుద్రుడు శర్మిష్ఠనే ప్రధానముగా చేసికొని మహారాజామెను ప్రమద వనమున జూచినది మొదలంతఃపురమున చేర్చుకొను వరకు గల యతి వృత్తమునే గ్రహించి దానిని సప్తమాంక పరిమితము గా రచించెను. నన్నయగారికథను మహా భారతమందలి ఆదిపర్వమున మూడవ యాశ్వాసమందు 97 నుండి 225 వరకు అనగా 129 గద్య పద్యములో రచించగా దానిని తెలగన 179వ పద్యము వరకే అనగా 82 పద్యముల కథను మాత్రమే గ్రహించి దానిని తాను 737 గద్యపద్యములుగల నైదాశ్వాసముల కావ్యముగా రచించెను.

నీ కావ్యమున 103 పద్యములతో రామాయణ కథ 74 పద్యములతో నవలారిక రచింపబడినవి. కావున నవిపోను నికరముగా 560 పద్యములలో నన్నయగారి 82 పద్యముల కథను చెప్పెను. అనగా తెలగన దానిని తన ప్రతిభచేత నేడు మడుగులు పెంచెను. తెలగన యొక్క ఈ పెంపున సగమునకన్న కొంచెము తక్కువగా అనగా 220 పద్యములు ప్రకృతి వర్ణనలే కనుక అవిపోను తక్కిన 340 పద్యములలో తెలగన నికారసైనకథను చెప్పెననవలెను.

1. శర్మిష్ఠా విజయము నాట. భరద్వాజము దేవగుప్తారావు క్రీ.శ.		1910
2. యయాతి చరిత్రము వచ.		1911
3. శర్మిష్ఠాపరిణయము	నాట. సూరకవి శర్మ	1911
4 శర్మిష్ఠ	వచ. మంద కృష్ణమూర్తి	1913
5. యయాతి చరిత్రము	వచ. గర్భాము అప్పారావు	1916
6. శర్మిష్ఠ	నాట. దేవులపల్లి కృష్ణమూర్తి	

మొదలైన ఈ కవులందరు యయాతి జీవితమున శర్మిష్ఠకు గల ప్రాముఖ్యమును గురించి ఆమెనే ప్రధానముగా చేసికొని తమ రచనలు చేసిరి. అటుల గాక అతని జీవితమున దేవయానిని ప్రధానముగా చేసి కావ్యరచన చేసినవారియందీ తెలగనయే ప్రథముడనవలెను.

చేర్పులు - మార్పులు

తిక్కనగారు మహాభారతము నాంధ్రీకరించుచు-

కథజగత్ప్రసిద్ధంబు గావున, పూర్వపరార్ధ యుక్తి సేయునెడల యత్నమించు కంతయైనను వలవదు, వలసినటుల జెప్పవలసియుండు అని చెప్పెను. తెలుగులో ప్రబంధకవులందరు తమ రచనలకు పురాణములనుండి ప్రసిద్ధేతి వృత్తముల నెన్నుకొనినవారే. కావున తిక్కన గారు చెప్పిన పైనియమము దాదాపుగా ప్రబంధకవులందరకి వర్తించినది. వారికి కవితకు నన్నయ, కథావిన్యాసమునకు తిక్కన యాదర్శముగా నిలిచిరి.

తిక్కననానేర్చిన భంగిజెప్పి వరణీయుడనయ్యెద భక్తకోటికిన్ అనెను. ప్రబంధకవులు గూడ వావిచ్చి చెప్పకున్నను. ఆదారినేనడిచిరి. మహాభారతమందలి యయాతి చరిత్ర యందు దేవతలు మృత సంజీవనీ విద్యను పొందుట, కచదేవయానుల వృత్తాంతము, శర్మిష్ఠ దేవయానికి దాసియగుట, దేవయాని యయాతిని వివాహమాడుట, శర్మిష్ఠ యయాతి వలన పుత్రలాభమును పొందుట, యయాతి శాపగ్రస్తుడై పూరునికి రాజ్యార్హత కలుగుట, యయాతి ఉత్తమలోకములను పొందుట, అను నేడు వృత్తాంతములున్నవి. వీనియందు తెలగన నైదు విషయము వరకు మాత్రమే తనకావ్యమున గ్రహించెను.

కథాకథనమునందు కాలసరణి - హేతుసరణి యని రెండు పద్ధతులున్నవి. కాలసరణి యందు కథను కాలక్రమమున వరుసగా చెప్పుచు పోవుదురు. హేతుసరణి యందు కథను నాయకుని జీవితమందేదో యొక ఘట్టముతో నారంభించి తత్పూర్వములవసరమైన చోట చెప్పుదురు.

తెలగన తన ప్రణాళిక యందు హేతుసరణిని పాటించెను. జనమేజయుడు వైశంపాయనుని సన్మద్వంశకరుండైన యయాతి చరితంబు వినవలతుం జెప్పుమని యడిగిన నతడు.

కం॥మనుజాధిప వృషపర్వుం, డనుదానవపతికి శుక్రుడాచార్యుండై

1.యనిమిష విరోధులకు ప్రియ, మొనరించుచు -అని కచుని వృత్తాంతముతో నారంభించెను. తెలగన యటులగాక యయాతి పరిపాలనతోనే యారంభించి ఈకచుని వృత్తాంతము దేవయాని వివాహప్రస్తావన విషయమున శుక్రునితో వృషపర్వునకు జెపించెను.

2. ఆంధ్ర మహాభారతమున దేవతలు మృతసంజీవని కొరకు నేరుగా కచుని దగ్గరకే వెళ్లి యతని నడిగి నట్లుండ తెలగన వారువచ్చి బృహస్పతిని యడిగి కచుని బంపుటకు ప్రేరేపించినట్లు చెప్పెను.

బృహస్పతి దేవతల గురువు, ఏదేగాని యొక విషయమున నొకవ్యక్తిని సంప్రదించవలసి వచ్చినపుడతని తండ్రి జీవించియున్న గౌరవస్థితిని బట్టి మొదట తండ్రితో నావిషయము ప్రస్తావించుటయే లోకసహజము కావున తెలగన నిచట చేసిన యీమార్పు వృద్ధాచార సమ్మతము -

3. మూలమున వలువలు వీడ్వడగట్టుకొనునప్పుడు -

- నక్కన్యకల న్యోన్య పరిధానంబులు వీడ్వడంగట్టుకొను నెడ దేవయాని పుట్టంబు శర్మిష్ఠ గట్టుకొనిన మఱి దాని పరిధానంబు దేవయాని పుచ్చుకొనక రోసి - 3-134

అని యుండగా తెలగన.

కం॥ లిలినీనెలతయు దానును - వలువలువీడ్వంగ దాల్చివైళమెచెలువల్ దలపింపనెఱిగి

- అని చెప్పెను.

మూలము ననుసరించి దేవయాని కట్టుకొనుటకు చూచి శర్మిష్ఠ చీరను ముట్టుకొనుటకే మనసొప్పక నామెతో నాచీర నీవు కట్టవచ్చునా! నేను బ్రాహ్మణ కన్యను గదా నీవుకట్టిన చీరనెట్లు కట్టగలనని యన్నట్లుగన్నది. నన్నయ కాలము నాటికి బ్రాహ్మణుల యాచారములు వారికి నిరాటంకముగా సాగుచుండినవి. అందువలన దేవయాని, శర్మిష్ఠ చీర ముట్టుకొనకయే నామెను మందలించుట సబబు- ఇపుడు గూడ సదాచారులైన బ్రాహ్మణస్త్రీలు ఇతరులు కట్టు వలువలు ముట్టరు- దేవయాని శర్మిష్ఠ లొకరిచీర లొకరు గుర్తింపనేరకు ధరించి పిదపనది చెలికత్తెలు గుర్తించి చెప్పగా తమ పొరపాటు తెలిసికొన్నట్లు తెలగన తన కావ్యమున చెప్పెను 3-75.

తెలగన కాలమునాటికి మహమ్మదీయులు ప్రభువులై బ్రాహ్మణులు వారిక్రింద నుద్యోగులైరి. కనుక నిచట తెలగన చేసిన ఈ మార్పు ఆనాటికి సడలుచున్న బ్రాహ్మణాచారమును తలపించును. అంతేకాక దేవయాని అమాయకురాలు ఈతడబాటు ఆమెలోమరొకచోట ప్రథమ సమాగమమునాటి రాత్రి మగని దుప్పటి వీడ్వడ కప్పుకొన్నపుడు గూడ కనిపించును (5-34)

ఈ పిమ్మట మూలమున.

4.క: లోకోత్తర చరితుండగు -నాకావ్యుతనూజ - 3-135 నని దేవయానియే
మొదట శర్మిష్ఠతో కేరడము లాడినట్లుండగా తెలగన్న దానిని -

ఉ॥ నెట్టనరేయి నంబవలు నేరమివెట్టునటంచు - 3-76 అని శర్మిష్ఠయే తన గొప్పతనము చెప్పుకొనుచు దేవయానిని కేరడము లాడినట్లు చెప్పెను. బహుశః తెలగన యిట్లు మార్చుట కానాటి సాంఘిక స్థితి గూడ కొంతకారణముగావచ్చును. నన్నయ కాలమున బ్రాహ్మణుల ప్రతాపము బాగుగా సాగుచుండెను. కాన నాడామె గయాళితనము చేయుట చెల్లినది. వర్ణము ననుసరించి చూచినచో బ్రాహ్మణులు శాంతచిత్తులై యుండవలెను. తెలగన్నది ముస్లిం ప్రభువుల దర్పము చెల్లుచున్న కాలము కనుక గుర్తింప నేరక శర్మిష్ఠయే మొదటి దేవయాని పుట్టము గట్టినను నాచీరను నీవెట్లు కట్టితివని దేవయానిపై నిందారోపము చేయుట యానాటి రాజస ప్రకృతిని సూచించును.

5. శర్మిష్ఠ దేవయానిని బావిలో త్రోసి వెడలిన పిమ్మట వేటకై వచ్చిన యయాతినీరమపేక్షించి నూతికడకువచ్చి యందున్న దేవయానిని చూచినపుడు మూలమున నామెదానిలో నుండగనే వ. నీవెవ్వరిదాన విట్లేల యేకతంబయివ్వి పినాంతరంబున నున్నదాన వనిన (3-141) అమర సన్నిభ! యేను భార్గవు కూతురను దేవయాని యనుదానను ప్రమాద వశంబున నిమ్నాతంబడి వెలువడ నేరకున్న దానను - (3-142, 43) అని యామె చెప్పినట్లు అపుడు యయాతి యామెనుద్ధరించి నట్లుండ తెలగన యయాతి మొదలామెనుద్ధరించి ఆ పిదప యామె సౌందర్యమును తేరిపారజూచి యబ్బురపడి నీవెవ్వరిదానవని యడిగినట్లు మార్చెను.

నూతి నుండి దేవయాని నుద్ధరించుటకు భారత యయాతికి కావ్య యయాతికి ఆర్త రక్షణము సమానమే యైననుభారత యయాతి యామెను నీవెవరిని యడిగి యామె చెప్పిన భార్గవుని ప్రశస్తిని విని యామెనుద్ధరించెను. ఆపిదప నామెవైపు చూడకుండనే వెళ్లెను కనుక నీ యయాతికి వ్యక్తిత్వముతోనే పనిగాని శరీర సౌందర్యముతో గాదనిపించును. అందువలన నతడు ధీరోధాత్తుడు.

అటులగాక కావ్య యయాతి యామె సౌందర్యమాకేశ పాదాంతము పరిశీలించిన పిమ్మట నీవెవరని యడిగెను. కాన నితడు సౌందర్యోపాసకుడు, ధీరలలితుడు. ఇది నన్నయ - తెలగన్నలు తీర్చిన యయాతిలోని భేదము -

ఇటులే యిక దేవయాని - యయాతి ఆమె నుద్ధరించి ఆపిదప తనవైపైన చూడకుండ

తన రాజఠీవినెంతగా నిల్పుకొనుచు వెళ్లెనో దేవయాని యంతకన్న నెక్కుడుగా గడుసు పిండము నీవెవ్వరిదాన విట్లేల యేకతంబున నివ్విపినాంతరంబున నున్నదాన వనిన నేను భార్గవు కూతురను ప్రమాదవశంబున నిన్నూతబడి వెలువడ నేరకున్నానని చెప్పెనేగాని తనకు చులకన దనమును గూర్చు శర్మిష్ఠ వృత్తాంత మెచటను యెత్తదు.

అంతేకాక మహాభారతమున తన వృత్తాంతమును తానే చెప్పుకొనెను. ఇక కావ్యనాయికయైన దేవయానియెా అట్లుగాక తన దీనస్థితిని తానే చెప్పుకొనలేక కనులలో చెలికత్తెయైన ఘూర్ణిక నాజ్ఞాపించెను గాన నీమె దయనీయ -

తెలగన కావ్యమున నీ ఘట్టమున యయాతి దేవయాని మేని సౌందర్యమునదే పనిగ పరికించుట నతని యుదాత్తతకు భంగమైనను దుష్యంతు నంతటి వాడే చెట్లచాటున పొంచి శకుంతల సౌందర్యమును చూచినపుడెదరుగా నున్న దేవయాని సౌందర్యమును యయాతి చూచుటలో వింతయుండదు -

ఇక నామెను శర్మిష్ఠ నూత ద్రోసిన విధము ఘూర్ణిక చెప్పుట యభిజ్ఞాన శాకుంతలమున శకుంతలా వృత్తాంతమును దుష్యంతునితో ప్రియంవద చెప్పుటను తలపించును.

6.రెండవసారి యయాతి దేవయానిని దర్శించినపుడు

వ॥ అతిశయ రూపలావణ్య గుణసుందరియైన శర్మిష్ఠనెరుంగ వేడి మీారెవ్వరి వారలు మీకుల గోత్ర నామంబులెరుంగ వలతుం జెప్పుండని - (3-158) మూలమున నుండ దానిని తెలగన - మున్నన్నెలంత నెరింగియు నెఱుంగని వాడపోలె జిక్కదనంబునకు నిక్కయగు శర్మిష్ఠం దెలియ వలసి యక్కొమ్మ కిట్లనియె (4-54) అని చెప్పెను. ఇక్కడ గూడ తెలగన నన్నయ ననుసరించి . అనిన విని దుష్యంతుండు దానినంతయు నెఱింగియు నెరుంగని వాడపోలె నిట్లనియె - ఆది (4-76) అని నన్నయగారి వాక్యములనే అనువదించెను, ఈ సందర్భమున తెలగన యయాతితో నెరిగయు నెరుగని వానివలె నేలయబద్ధ మాడించెనో యూహించలేము. ఇటులగాక నీసందర్భమున

ఏనుమున్ను నిన్నెంగుదును- ఇన్నెలంత యెవ్వరని యడిగిన యెడల దేవయాని యీామె వృషపర్వుని కూతురు నాకు దాసియని చెప్పినపుడామె విభవ మింకను ఎన్నియెా మడుంగులు వృద్ధియై కనిపించెడిది.

ఇక చేర్పుల విషయమున - దీనియందు ద్వితీయ, తృతీయాశ్వాసములందలి రామాయణ కథయొక్కటియే చేర్పు.

తెలగన నన్నయ తిక్కన యుభయుల మార్గమున నడవదలచెను. కనుక నన్నయ భారతమునుండి యయాతి కథను, తిక్కన గారి నిర్వచనోత్తర రామాయణము నుండి రామకథను గ్రహించెననవలెను.

ఔచిత్య కల్పనలు -

యయాతి చరిత్రలో రామకథను ప్రవేశపెట్టుట యౌచిత్యముగా కున్నను దాని ప్రసక్తికై వేటలో లేడినొకదానిని ప్రవేశపెట్టి దానివెంటబడి యయాతి జాబాలి యాశ్రమము చేరుట చెప్పదగినది.

లేడి వేటకు రామాయణమున ప్రాముఖ్యము గలదు. పూర్వము కనుక మృగము వెంట శ్రీరాముడు వెళ్లినట్లు యయాతి వెళ్లెను. వేటకాండ్రు తరిమినపుడు తరుచుగా జింకలు పూర్వమాత్మ రక్షణకై యాశ్రమ ప్రాంతములకే పరుగెత్తుచుండెడివి. ఇందుల కభిజ్ఞాన శాకుంతలమున దుష్యంతునిచే వెన్నాడ బడిన హరిణము కణ్వాశ్రమ ప్రాతంతమునకు వెళ్లుటొక నిదర్శనము.

అటులే ఈ హరిణము ఏ మహర్షి యాశ్రమమునకో పరుగెత్తక జాబాలి యాశ్రమమునకు పరుగెత్తుట రామాయణ కథకు ముఖ ద్వారమైనది. జాబాలి రామాయణ కథతో సంబంధమున్నవాడు - శ్రీరాముడడవులకు వచ్చినపుడతనితో కొంత చర్వాక వాదము చేసియుండెను. కనుక తెలగన యతనితో రామకథ చెప్పించుట సముచితమేయనవలెను.

జాబాలి చెప్పిన రామాయణకథ యందు రావణుడు రంభను బలాత్కరించు సందర్భమున తెలగన చంద్రికా వర్ణన ప్రవేశపెట్టి యందు చకోరతలలను వర్ణించెను. వెన్నెల వయసులో నుండి విడివిడిగా నున్న స్త్రీపురుషులకు కామోద్దీపన కారణము. అటులే పశుపక్షుల సంసారములు గూడ నొకొకపుడు మానవులకు సంసారోద్దీపన కారణములగును, తన యాశ్రమమున గూడుకట్టుకొని పిల్లలను జేసిన శుకమిధునమును గని వ్యాస మహర్షి గూడ సంతానాపేక్షుడయ్యెను. జలమధ్యమున తపము జేయు సౌభరిముని విరాన రాజా సంసారమును గని తాను వివాహమాడగోరెను. కనుక తెలగన రావణుని కామోద్దీపనమునకు చకోర పక్షుల కామక్రీడను నేపథ్యముగా కూర్చుట చక్కటి యౌచిత్య కల్పనము -

ఇది మొదట నన్నయగారు చెప్పినకథ కనుక ఆంధ్రమునకు నన్నయ ఆదికవి యైనట్లు అచ్చ తెలుగున కాదికవియైన తెలగన నన్నయగారి మార్గముననే నడుచుచు నవరసమైన చోట మాత్రము కథను విస్తరించెను. కచుని మృతి సందర్భమున నన్నయ శుక్రుండు తనయోగదృష్టింజూచి లోకాలోక పర్యంత భువనంబున కచుంగాన – (ఆది – 3–119) అని చెప్పగా తెలగన పై వచనమందలిలోకాలోక భువనమును, వీనులో జూపున నేలపై యడవుల్ వళ్ళుల్ మళ్ళుల్ సంద్రముల్ అని యొక మత్తేభమున వివరించెను. అటులే శుక్రుడు దేవయానికి శాంతమును గురించి చెప్పుసందర్భమున అనుపమ వినయాన్వితులై యనూన దక్షిణలక్రతు సహస్రంబులు సేసిన వారికంటె నక్రోధనుడు కరంబధికుడండ్రు – (3–146) అని కందమున పలుకగా దానిలోని యనూన దక్షిణులను దళమును'చెన్నగు మానికంబులును చెల్వగుగుర్రములే నుగుల్అని యుత్పలమున విస్తరించెను.

దేవయాని శర్మిష్ఠతో వనమునకు జనినపుడు యవ్వనంబున కన్యకలుం దానును పుష్పాప చయంబుసేయుచు .... ఇష్టవినోదంబులనున్న యసరంబున (3–155) అని నాలుగు బంతుల వచనమున నుండగా నీవచన మందలి పుష్పాప చయమునకు కారణమైన వసంతమును, వారి వనవిహారము, వృక్షదోహదములు ఇష్టవినోదములందు తీగయుయ్యేల లూగుట యంచబోదలకు చిలుకలకు గోరువంకలకు పెండ్లిండ్లు చేయుట ఆ పిమ్మట రతీమన్మథుల వివాహము. ఈ విధంగా చతుర్థాశ్వమున నాలుగవవంతు కథను పెంచెను.

ఆయాశ్వాసమందే మూలమున నన్నయ అతిశయ రూపలావణ్యమగు శర్మిష్ఠ నెరుంగవేది (3–158) యనియొక చిన్న వచనమున చెప్పగా నది యాధారముగా శర్మిష్ఠ రూపలావణ్యము నొకసీసము నాలుగు వృత్తములు మరియు పదమూడు కంద గీతములలో విస్తరించెను.

మహాభారతమున నన్నయ దేవయాని వివాహమును గురించి యయ్యిరువురుకు పరమోత్సవంబున వివాహంబుసేసి (3–169) అని యొక మాటలో తెలిపెను. ఈ సందర్భమున యయాతి ప్రమదవనమునకు వెళ్లుట యచట శర్మిష్ఠను జూచుట యామెను గాంధర్వ విధిని చేపట్టుట, ఆమెకు సంతానము గలుగుట వరకు గలకథ యంతయు పన్నెండు గద్యపద్యము లందున్నది. దానిని తెలగన చతుర్థాశ్వాసమున 88 పద్యములు అనగా సగభాగము ఆపిమ్మట పంచమాశ్వాసము పూర్తిగా 154 పద్యగద్యములుగా పెంచి కథకు భరత వాక్యము పలికెను.

అతడు గావించిన ఈ విస్తర మంతయు నతని ప్రతిభకు తార్కాణమగును.

యయాతి చరిత్ర దాని పరమార్థము

మన పురాణ కథల కన్నిటికి ఒక సందేశము జ్ఞానమార్గ ప్రతిపాదమైన ఒక పరమార్థములు గలవు. మహాభారతమందలి ఆఖ్యానోప ఖ్యానములకు వాని పరమార్థమును శ్రీమాన్ శ్రీ మత్తిరుమల వెంకట శ్రీనివాసా చార్యుల వారు "శ్రీమహా భారత వైజ్ఞానిక సమీక్ష" అను గ్రంథమున వివరించిరి.

దాని ప్రకార మీ కథయందలి.

1. శుక్రుడు = సృష్ట్యుపాదానమైన శుక్రము

2. వృషపర్వుడు = శుక్రమందలి యాగ్నేయ భ్రూణమైన వృష

3. కచుడు = జీవన్మృత్యురహస్యమును గ్రహింపజాలుబుద్ధిక ఇతి బ్రహ్మణోనామ తస్మిన్ చరతీతికచః అందువలన నితడుబ్రహ్మచారి

4. దేవయానమునకు కారణమైన జ్ఞానమార్గమును చూపు

అమృత శుక్రము = దేవయాని

5. పితృయానమునకు కారణమైన కర్మమార్గమును జూపు మర్త్య శుక్రము = శర్మిష్ఠ

అమృత శుక్రమందలివాగా పోగ్నులు మర్త్య విభాగమున అగ్న్యాపో వాక్కులుగా మారును. ఇది దేవయాని శర్మిష్ఠల చీరలు తారుమారగుటకుపలక్షణము. మానవులు దేవయాన పితృయానములలోనే దేని యొకదాని యందే సంచరింతురు. పరిణామ క్రమమున నారెండింటి యందు సంచరించు వారరుదు. ఈ కథ యందలి యయాతి ఆరెండింటి యందు సంచరించెను. కాన వానియందు యానము చేయువాడు యయాతి (యాతి-యాతియయాతి).

ఈ కథయొక్క సంపూర్ణవివరములు కావలసినవాడు చూ. శ్రీమహాభారతవైజ్ఞానిక సమీక్ష (ఆది పర్వము) శీర్షిక 15 యయాతి చరితము పు. 80-88

యయాతి ఒకే జన్మమున రెండు యౌవనములనుభవించెను కనుక నీ కథయందలి పాత్రలందు ఆదిమానవుడు మొదలుకొని ఆధునిక మానవుని వరకు గల మానవులలో నంతర్లీనమైన ఆవేశములు ఉద్రేకములు భావపరంపరలు అన్ని కనిపించునని ఆధునికుల మతము. అందువలన నీ యితి వృత్తము పలువురు మేధావులు నేటి సమాజ స్పృహలో మలిచిరి.

బ్రాహ్మణుడై పుట్టినంత మాత్రమున వాని యందు బ్రాహ్మణత్వముండదు, దానవుడై పుట్టినంత మాత్రమున వాని యందు దానవత్వముండదని ఇప్పటి సమాజవేత్తల యభిప్రాయము. ఆ దృష్టితో దీనిని కన్నడమున గిరీశ్ కర్నాడ్ యయాతి యనుపేర నాలుగంకముల నాటకముగా రచించెను.

దీనియందు శర్మిష్ఠ ఎంత యణగి మణగి సేవచేయుచున్నను దానిని దేవయాని అతి వినయముగనే వ్యాఖ్యానించును. తమ చీరల - ఇందు రవికల అని యున్నది. తారుమారు శర్మిష్ఠ కావలెననియే చేసెనని ఒక ఆర్యురాలి వస్త్రమును ధరించినంత మాత్రమున దానవకాంత ఆర్యురాలు కాదని యామెవాదన. ఈ నాటకము శర్మిష్ఠకుమారుడైన పూరుడు అంగరాజ పుత్రిక యగు చిత్రలేఖను వివాహమాడి పురప్రవేశము చేయగా నతని స్వాగతపు ఏర్పాటులతో నారంభమగును. నాటకాంతమున దేవయాని శర్మిష్ఠకు కలిగెడు గౌరవ మర్యాదలు చూడలేక తననల్లపూసలు త్రెంచివేసి తండ్రివెంట వెళ్లెను. శుక్రుడు దేవయాని మాటలు విని శర్మిష్ఠ పాదములపై బడి దోషిని నేను నన్ను శపించుమని ఎంత ప్రార్థించినను వినక యయాతిని కఠినముగా శపించివెళ్లెను. పూరుడు తండ్రి వార్థక్యము నెవరు స్వీకరించుట కిష్టపడకపోగా గత్యంతరములేని పరిస్థితియందు తాను స్వీకరించగా నది భరించలేక అతని నవవధువు ఆత్మహత్య చేసికొనెను యయాతి ఆ పరిణామమును సహించలేక వెంటనే తన వార్థక్యమును తాను తీసికొని కుమారునికి నేను నివృత్తి భయముతో ప్రవృత్తి వైపు ఒరిగితిని నీవైనా అటులకాక సుఖముగా రాజ్యమును పాలింపుమని చెప్పి వానప్రస్థమునకై అరణ్యములకు వెళ్లగా శర్మిష్ఠ యతనిని తోడునీడయై యనుసరించును. దీనిని కన్నడము నుండి భార్గవీరావుగారనువదించెను. మహారాష్ట్రమున ఖండేకర్ రచించిన నవలయందు దేవయాన తండ్రిగారాబమున పెరిగిన బిడ్డ. ఆమె హృదయమున తండ్రికి గలస్థానము భర్తకుండదు. మొదటిసారిగా గాఢముగా ప్రేమించిన కచుడు తనను తిరస్కరించెను. కాన నేను నిన్ను కట్టుకొని ఆయాకుల పర్ణశాలలో నుండెడి బదులిపుడిటువంటి రాజభోగములందున్నానో చూడుమని యతనికి తన వైభవమును ప్రదర్శించుకోవలెననియుబలాటము. కచుడు మాత్రము శాంతజీవనుడై దేవయానిలోని అహంకారము నశించి శాంతురాలు కావలెననియే కోరుచుండెను. కథాంతమున శుక్రుడు దేవయాని వెళ్లి తనకు జరిగిన యన్యాయము చెప్పుకొనగానతడు యయాతిని నీతప్పులన్నిటి కారణము నీ యవ్వనము. కనుక నికముందు నిన్నేస్త్రీవైపు జూడకుండ చేయుదునని వృద్ధడవుకమ్మని శపించెను. అదివిని దేవయాని తండ్రీ నాకింకను భోగవాంచ తీరలేదు. నీ విటుల శపించితివని యేడ్చెను. అంత శుక్రుడు సరియె తన వంశజు డెవరైన నీవార్థక్యమును

గ్రహించిన యెడల నీవతని యౌవనమును పొందవచ్చునుకాని తిరిగి నీవృద్ధదశను పొందిన మరుక్షణమున మరణించునని శాపమును మార్చెను. దేవయాని మదివిని తండ్రీ ఈ శాపము మొదటికన్నను ఘోరముగానున్నది. దీనిని గూడ మరలింపుమని విలపించెను. అంత శుక్రుడుగ్రుడ్డై తల్లిలేని పిల్లవని నిన్నుగారాబమున పెంచి నీవు చెప్పినట్లెల్ల నాడుచు నాతపోశక్తినంతను వ్యర్థపరచుకొంటిని. మూర్ఖురాలవైనీ కాపురమును నీవేనాశనముచేసి కొంటివి. యికమీద మీచావు బ్రతుకులతో నాకు నిమిత్తములేదు. నీవు కాపురము చేయి లేదామానుమని కసిరికొట్టి వెళ్లిపోయెను. ఇంతలో నక్కడికి తండ్రిని చూచుటకు వచ్చిన పూరుడతనిదుస్థితిని చూడలేక నావార్ధక్యము తానుస్వీకరించెను. అపుడచటికి పూరుని ప్రేమించిన "అలక" గూడ వచ్చియుండెను. ఆమె కాబోవు తన పతిని చూచి దుఃఖించనారంబించెను. రెండవవైపు శర్మిష్ఠ అకార వార్ధక్య మావహించిన కొడుకును పట్టుకొని ఏడువనారంభించెను. కుమారుడు తన యౌవనమును మరల గ్రహించిన యెడల పతి మరణించును. కానీ యిపుడామె యిరుకునపడెను. ఈ పరిస్థితినాలోచించి యయాతి మనసుమార్చుకొని. తనవార్ధక్యమును తాను గ్రహించి మరణించి పడిపోయెను. అపుడు కచుడు వచ్చి గురువుగారి శాపముపసంహరించి యయాతిని పునర్జీవితుని చేసెను. యయాతిలేచి కుమారునికి పట్టాభిషేకము చేసి అతనికి పురుషార్థములందు ధర్మము, కామము ప్రభలమైనవికాన ధర్మముచేతికి పగ్గములిచ్చి కామమునదుపున బెట్టకొమ్మని హితోపదేశము చేసి తపమునకు వెళ్లెను.

మూలకథయందు యయాతి కుమారుని యౌవనమును గ్రహించి కొంతకాలము సుఖించినట్లుండ కన్నడమున గిరీశ్‌కర్నాడ్ మహారాష్ట్ర మున ఖండేకర్ దానిని కొన్ని నిమిషములకు మాత్రమే పరిమితము చేసి కథను సుఖాంతము చేసిరి.

పురుషుడు భార్యతనకు దాసివలె పనిచేయవలెనని కోరును. గాని కూతురును మాత్రమల్లుడు దాసిగా చూడరాదనియే తలచును. ఈ నవలలో శుక్రుడు కూతురు కోరికలెల్ల తీర్చుచూ పోయెను. గాని అత్తవారింట నెట్లుమసలవలెనో కణ్వుని వలె యుపదేశించిన వాడు కాదు. దీని చాటున నవలాకర్త సమాన హక్కుల పేర తండ్రిగారింట, అత్తింట నేర్వవలసిన యణకువ నెరుగకుండ స్వేచ్ఛగా పెరిగిన ఈనాటి యువతిని చూపెననుపించును.

"శుభం"

తెలగన వర్ణనా వైశిష్ట్యము :

"కవయంతీతి కవిః తస్య కర్మకావ్యం"

కవియనగా వర్ణించి చెప్పువాడని యర్థము. లోకమందలి వస్తువుల నందరు చూతురుగాని కవియొక్క చూపువేరు. అతడు సామాన్యుల కందని ఏవో విచిత్ర భావ ధర్మాంశము లావస్తువు నుండి అవిష్కరించును. అట్టి చూపునకు దర్శనమని, దానిని వెల్లడించు ప్రజ్ఞకు ప్రతిభయని వ్యవహారము.

కవితన ప్రతిభతో వెల్లడించిన వస్తువు కావ్యమనబడును. అతడు ప్రకృతిలో నెన్నియో సుందరమైన వస్తువులను లోకమున నెన్నియో విధములైన వ్యక్తులను చూచును. అతడు తాను దర్శించిన వానినెల్ల ప్రతిభతో వెల్లడించవచ్చును. అవన్నియు కావ్యములే యగును కాని వానియందేక సూత్రతయుండదు. అందువలన భారతీయ కవులు తమకవిత్వమునకు ఏదో యొక యితివృతము నాధారముగా చేసికొనిరి. అపుడందలి ప్రకృతి వర్ణనలతో తాను దర్శించిన ప్రకృతి నేత్రాలతో తాను చూచిన చిత్తవృత్తులు ఒదిగి పోవుచుండును. అందువలన కవితా ప్రపంచమున కావ్యమున కగ్రస్థాన్నమున్నది.

కవికేవల మితివృత్తము నిర్వహించినపుడు మాత్రమే కవికాడు. దానిని రసభావోపేతముగా తీర్చినపుడే అతడు కవి శబ్దవాచ్యుడగునని ఆనందవర్ధనుని ఉవాచ.

కావ్యము రసభావోపేత మగుట కందలి వర్ణనలు సహకరించును. ఇవి వస్తువర్ణనలు భావవర్ణనలు అనగా చిత్తవృత్తుల వర్ణనలు అని రెండు విధములు.

కావ్యమున వర్ణనాంశము లేవేవి, అవి యెన్నియును విషయమున లాక్షణికు లందు మతభేదములు కలవు. విశ్వనాథుడు సాహిత్య దర్పణమున మొత్తమిరువదిమూడంశములు పేర్కొని అందు పది మాత్రమే సాంగోపాంగముగా చెప్పవలెనని తక్కినవి యదాయోగ్యముగా గ్రహించవలెనని యనెను. అలంకార శేఖరుడు మొత్తము ముప్పది మూడంశములను పేర్కొనగా నప్పకవి ఇరువది రెండంశములు చెప్పి యందు పదునెనిమిది మాత్రము ప్రధానమనెను. భట్టుమూర్తి నరసభూపాలీయమున గూడ పదునెనిమిదింటినే గ్రహించెను.

మిత్రభేదమున దమనకుడు కరకటకునితో నీయర్థము వచింపవలెనని నియమము గలదా ప్రతిభాశాలికి ప్రభువు నెదురసమయోచితముగా వచింపవలసినది బహు విధములుగానుండుననెను.

కవి విషయము గూడ నట్టిదే ప్రతిభావంతుడైన వానికిది యేయని నియమముండదు. రమ్యం జుగుప్సితము దార మధాపినీచం అని దశరూపక కర్త చెప్పినట్లతడే వస్తువు నైనను తన ప్రతిభా మూలమున ఆస్వాద యోగ్యముగా చేయగలడు.

తెలుగు కవులు కొందరు లాక్షణికులు చెప్పిన అష్టాదశ వర్ణనలు దృష్టియందుంచుకొని యందేది తక్కువైన తమది మహాకావ్యము కాకపోవు నేమోయని కథకతుకకున్నను యనవసర వర్ణనలు జొప్పించిరి కాని తెలగనయటుల జేయలేదు. అతని యితివృత్తమునకు సహజముగానే అప్పకవి చెప్పినవి కలిసి వచ్చినవి. వానిలో నతడు పుర- ఉద్యాన- జలక్రీడలను విపులముగా విస్తరించెను.

వర్ణనా నిపుణఃకవిః అను లాక్షణికోక్తికి తెలగన ఉదాహరణమైనవాడు. అతని యయాతి చరిత్ర అచ్చతెలుగైనను పాల్కురికి సోమన చెప్పినట్లు ఇతని వర్ణనలు తెలుగు మాటలనంగ వలదు వేదములకొలదియగానే జూడదగియున్నవి.

ఇష్టదేవతాస్తుతి పిమ్మట తెలగన నేరుగా కృతిపతి వంశావ తారమున కాలుబెట్టి దానిని గోలకొండ కోట వర్ణనతో ప్రారంభించెను. తల్లికొట యుద్ధానంతరము ఇబ్రాహీం కుదుబ్షా దక్కను యుద్ధములలో నంతగా జోక్యము పుచ్చుకొనక తన దేశమునభివృద్ధి జేసికొనుటలో కాలమంతయు గడుపు చుండెననియు, గోలకొండ కోట మరల క్రొత్తగా కట్టబడి బలమైనదిగా జేయబడుటేగాక కోటలోననేకమైన నున్నత హర్మ్యములు నిర్మింపబడెననియు చరిత్రకారుడగు గ్రిబ్బెల్ వ్రాసెను. ఆనాటి తెలుగు దేశము ఈజిప్టు దేశము వలెనే ప్రపంచమున కంతకు వాణిజ్య స్థలమై యుండెనని పెరిష్టా వ్రాసెను.

కవులు రెక్కలు గట్టుకొని ఎంతగా నాకాశమున విహరించినను భూలోకమును పూర్తిగా పరిహరించి పోలేరుకనుక తెలగన ప్రతిష్ఠాన పురమునగల కోటను వర్ణించినపుడు గూడ దాని నిగ నిగలను గురించియు కోట కొమ్మల ధగధగలను గురించియు బురుజాల తోపువన్నియను గురించియు అగడిత తెలినీటిని గుతించియు మేడలను గూర్చియు అతడు వ్రాసినది కొంతవరకు నిక్కువమేయని ఈ కావ్యమందలి పురవర్ణనము యావత్తు ఆనాటి గోలకొండ ప్రతిబింబమేయని అడవి శంకరరావుగారి యభిప్రాయము.

కావ్యమునకు రసము జీవము. ధ్వని ఆత్మ. అలంకార శాస్త్రము ననుసరించి అక్షర సంహతిచే గుణములు, గుణములతో రీతులు, రీతులతో వృత్తులేర్పడును.

వృత్తులు శబ్దార్థ భేదములతో నిరుదెరగులై శబ్దవృత్తులచే పాకములు వానిచే రసము తెర్పడగా అర్థవృత్తులచే నభిధాదులు వానిచే ధ్వనులేర్పడును. ఇది సాహిత్య ప్రస్థానము.

తెలగన మదనగోపాల మంత్రోపాసకుడు. మదనగోపాలుడు శృంగార మూర్తి కనుక యయాతి చరిత్రము శృంగార ప్రధానకావ్యమైనది.

అలంకారములు గుణాది కావ్యవిషయములలో చేరకున్నను అవి శృంగారమున కెక్కువ దోహదవములగునం. తెలగన నీ కావ్యమున అవతారికా భాగము నెక్కువగాగుణసముదాయంతోను, కథాభాగము నలంకార బాహుళ్యముతోను తీర్చెను.

అలంకారముల వలె కావ్యశిల్పముగూడ శబ్దార్థముల నాశ్రయించి యుభయ విధములుగా నుండును. తెలగన ఆ రెండు విధములైన శిల్పములందును చేయితిరిగిన వాడు కృతిపతి వంశము నారంభింపగనే

మున్నీటి రాణియరౌ విన్నేలు యేవేల్పు - నడుగుకెందామరనలరుదేనె - అని కర్తారుడు తానైన విష్ణువును వర్ణించిన తీరు అచ్చతెనుగుననే గాదు. ఆంధ్ర సాహిత్యముననే యపురూపుము. విష్ణువుగా నతడు పాలచెరువున నుండగా కర్తారుడుగా నిపుడు పొట్లచెరువున నుండెను.

19వ పద్యమున హుమామియా కొడుకు బిడేమియాను వర్ణించుచు కవి హిందూ పురాణములందలి బడాబడా వారి నందరినతనికి సాటిగా నొకచోట జేర్చెను. అతని కీర్తినితో పెద్దపెద్ద వారిలోని కందు నెత్తి చూపెను.

బడేమియా కుమారుడు అమీానుఖాను - అమీాననగా మహమ్మదీయుల కాలమున నొకపోలీసధికారి. ఇతనిని వర్ణించుచు తెలగన - పట్టంగనీడు సంబళిలు కలనిలో - అను పద్యముచేత సమాజమున నానాడు తురకయమీానులకు గల దర్పము నెత్తిచూపెను.

ఈ పద్యములు వ్యక్తులను వర్ణించుపట్ల తెలగనకు గల పేరెరిగి పెద్దతనము చెప్పెడియవగాహనను తెలుపును.

ఆనాటి యమీానుఖాను వితరణమునకు సరిరాక కల్పకము పలపలనై వ్రాన్పడెనని, మేఘుడు నమ్మించి మించుచూపుచునే విషమొసగునని కర్ణుడు ఒసివోయి యొకపూట వెట్టెనని సముద్రుడు పారలంగబడి తెరమరుంగున నుండి కసరుకొనునని దానపరులని ఖ్యాతిగొన్న వారి నిదానములన్ని చక్కని భాషీయములతో చూపెను. కావ్యగుణములలోనిట్టి శైలిని ప్రసాద గుణమందురు.

లోకమున ప్రియవాదిత్వముతోడి దానము దుర్లభము, లోకులు తమచేతితో చేసికొనెడి పుణ్యమును నాలుకతోనాకి వేసికొనుచుందురు. అమీను ఖాను అటుల గాడని ఈ పద్య తాత్పర్యము.

కథాసంగ్రహము

ఇక కథలోనికి ప్రవేశింతుము. తెలగన వర్ణనలన్నిటి యందు క్రొత్తదనము కొట్టివచ్చినట్లు కనిపించుచుండును.

ప్రథమాశ్వాసమున ప్రతిష్ఠాన పురవర్ణనము, యయాతి వంశావతారము, రాజ్యపాలనము, ఆటవికుల రాక, మహారాజు వేటకు వెడలి యరణ్యమున విడియుట యనునంశములున్నవి.

పురవర్ణనమున అట్ట- పరిఖ- తోరణ- ధ్వజ- ప్రసాద మార్గ- ప్రప- ఆరామ- వాపి- వేశ్యా- నదులు వర్ణింపబడవలెను. వీనిలో తెలగన వప్ర- తోరణ- ప్రసాద- ధ్వజ- పరిఖలను మరియు వేశ్యలను గ్రహించెను.

ఈ కావ్యారంభము గోలకొండ కోటతో కథారంభము ప్రతిష్ఠాన పురదుర్గముతో చేయబడినది. ఈ రెండు సీసములు.

సీ॥తెరగంటి దొరరాల తెగల దీనినకోట -నిగనిగల్ నలుగడనిండియుండ- అవ.1-3

సీ. తగగోట దాచిన మగమానికంబుల తెలిరంగులెపుడు వెన్నెలలుగాయు -1-75

అని యడుగున యడుగు కలిపి నడిచెడు నక్కచెల్లెండ్రవలెనున్నవి.

సూర్యడు ప్రతిష్ఠానపురము యొక్క కోటపై నుండి వెళ్లలేక దానిగవనుల నుండియే రాకపోకలు జేయునట (1-75) చంద్రుడచటి మేడలపై నాడు పడతుల మొగములతో తడబడుదునని ప్రక్కప్రక్కలుగా బోవుచుండునట (1-76) అచటి మేడల కప్పులలో నైరావతము తన నీడ జూచి పోటికి దిగుచుండునట (1-77) ఆమేడల శిఖరములపై నున్న బంగారు కలశము లాకాశ గంగలో ప్రతిఫలించుచుండగా నవి స్వర్ణకమలములని దేవతాయువతులు కోయబోయి నవ్వుపాలగు చందురట (1-78) ఆకోట కొమ్మల తుదల దగిలించిన కటిటెక్కెములు జూచి నెమిళ్లు మబ్బుల గుంపని యాడుచుండునట (1-79) ఆకోట చుట్టుగల యడగడితలోని ఎఱ్ఱతామర మొగ్గలు సముద్రమందలి బడబాగ్ని పిల్లలవలె నున్నవట (1-80) తెలగన యేది చెప్పినను దానినిటుల కొత్తకొత్తగా చెప్పును.

తెలగన వర్ణించిన అమీను పురము (1-30) ఆనాటి గోలకొండకు, గోలకొండ ప్రతిష్ఠాన పురమునకు రూపాంతరములు.

పురవర్ణనయందు స్త్రీ పురుష జాతుల దొక ప్రత్యేక ప్రకరణము. తెలగన హిందూమత మందలి చాతుర్వర్ణములలో బ్రాహ్మణుల నొకకందమున లఘువుగా తేల్చివేసి రాచవారిని సీసము నెత్తుకొనుట జూడ నది యానాటి స్థితి యనవలెను. చతురంగ బలములందు అశ్వములను, గజములను మాత్రము చెప్పి భటులను శూద్రస్థానమున నిలిపెను.

అతడే వస్తువును జెప్పినను దానిని తన కవితానైపుణ్యములో చిలికి సేయక మానడు.

పెద్దన మనుచరిత్రలో వెలయాండ్ర నొక్కరినే చెప్పగా శ్రీ కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో వారిజతకు వేశ్యలను పుష్పలావికలను గూడ జేర్చెను. తెలగన పై ముగ్గురిని గూడ శీర్షమెత్తిచూచెను.

అచటి స్త్రీలు నిలుకడ గలిగిన మెరుపులు, రెప్పలల్లార్చ నేర్చిన దేవతాయువతులు. నడువనేర్చిన బంగారు బొమ్మలు. చికిలి చేసిన మదనుని ములుకులు. తెలగన వారిని గూర్చి నలువ తాజేయు గలిగిన పొలుపుగూర్చి, కరముచేతులబట్టిన గండునంచు, దలచెకొమ్మలు గానన నలరునట్టి - పువ్వుబోండ్లు దలిర్తురా ప్రోలిలోన -(1-81) అని చెప్పెను. వారు పూబోండ్లు, పూలు పదే పదే చేతులతో నంటిన కందును. గాన వారియే యేయవయవము లేయే పూవులవలె నుండవలెనో భావించి వారిని చేతులతోగాక తన మనసుతో సృజించెనట.

మన్మధునికి మనసిజుడని పేరు అతడు మానవుల మనస్సు నుండియే పుట్టి దేవతలలోనికెల్ల నందగాడయ్యెను. గాన నిక వీరో బ్రహ్మమనస్సు నుండియే పుట్టిరి. ఇక నాయంద మడుగుటెందులకు - మన్మధుడు పురుషుడు - వీరు స్త్రీలు - ఇంతియే భేదము. ఇతి తెలగన సృష్టి.

స్త్రీలు పూబోడులని గదా! వారి కన్నులు చన్నులు రదములు, పెదవులు, ఒకటేమిటి కవులు వారి సమస్తాంగములను పూవుల తోనే పోల్చుచుందురు. కనుక వారిని పూబోడులనుట కంటె పూలప్రోవులనుటే లెస్స.

ప్రతిష్ఠాన పురమున పూలమ్ము వారి మేని నిగ్గులు వారి పుటికలలోని నాయా పూవులపై తమయొక్క వింతకాంతులు ప్రసరింపజేయుచుండుటను. బెళుకులై తళుకులు గులుక

కన్నులచెన్ను - కలువల కొంకొవింత చెలువు గొలుప - (1-84) అను పద్యమున సూచించెను.

విజయనగర కాలము భోగయుగము. ఆకాలమున భోగపు వాడలకు భోగస్త్రీలకు ప్రత్యేకస్థానముండెను. రాయలముక్తమాల్యద యందు"సవల యద్వనిగాగ సారెవేయున దల్చు, యతినైన గుండెజల్లని గలంప. (అము - 1-59-60) అని రెండు సీసములలో వారి స్వభావ చేష్టలను చెప్పగా మొల్లతాను స్త్రీయయ్యు తనరామాయణమున కలికి చూపుల చేత గరగింపనేర్తురు, బ్రహ్మచారులనైన భ్రాంతిగొలిపి (1-14) అని వారి మాయలను మంత్రములను చెప్పెను. కాని వారెన్ని చేసినను ఎదుటి పురుషునికి హృదయ మనున దుండి నగడా వారి శృంగార చేష్టలు ఫలించును. కళాపూర్ణోదయములోని సిద్ధుని వలె " రాతికి చక్కిలిగింత గలదే యనువారిచెంత వేశ్యల విలాస విభ్రమములేమి చేయును. ఈ జీవనాడి నెరిగిన తెలగన నగగల్గినను జాలు, చూడగల్గిన చాలు, పలుక గల్గిన జాలు, చెనక గల్గిన జాలు, అంటగలిగిన చాలు నని పురుషపరముగాచెప్పి, వారు హనుమంతుడు వెంకయ్య వంటి వారైనను తమవెనుక త్రిప్పుకొనగులుగుదురని (1-85) చెప్పెను. ఇది తెలగన యొక్క కవితాకళాశాస్త్ర ప్రత్యేకత.

ఇటువంటి ప్రతిష్టానపురమున కేలిక యయాతి మహారాజు. అతని వంశావతారము హిమకరు దొట్టి యతని వరకు ఒక సీసమున సూచించెను. (1-91)

అమీను ఖానునకు ముగ్గురు భార్యలు. ఇద్దరే ముఖ్యముగా కనిపించినను నతనికి గూడ ముగ్గురు భార్యలు అమీను ఖానున కైదుగురు కొడుకులు, యయాతికి గూడ నైదుగురు కొడుకులు. గాన నీవిధముగా యయాతిని అమీను ఖానునకు సామిప్యము గలదు. తెలగన్నకు అమీనుఖాను యొక్క దర్పమున నతనికుమారులగు ఫాజిలు ఖాను సామర్థ్యమున, అబ్దులల్లి సౌందర్యమున యయాతియే భాసించి యుండును. అందువలన నతడు యయాతిని వర్ణించుచు పట్టంగనీడు సంబళికలు కలనిలో జేరవచ్చిన మార్తు చేతగాని (1-27.) అను పద్యమునకు దీటుగా అలవేల్పుదొర పంపినట్టి తలంపుఱా పనియుడపం బొక్కపడతి దాల్పు-(1-98) అను పద్యమును "మదిలోగి యులనిజా మనమల్క పెట్టిన పల్లకీలోకవంక బాగు మీర (1-53) అను పద్యమునకు సాటిగా ఆహా పరాకు విదేహుని కానుకీ పొబగైన యాట కస్తురిమెకంబు (1-100) అను పద్యమును" తనరూపు వలయందు తలిరాకు బోడుల కనుదళ్కు జేడి సగములు దగుల-(1-57) అనుదానికి సాటిగా తనవాలు ముక్కంటికిని మూర్తురగురాచగము లెల్ల పూవిలుకాండ్రుగాగ (1-92) అను పద్యములను రచించెననిపించును.

ఈ కావ్యమునగల అమీనుపురమున నానాటి యమీనుఖాను పాలనము ప్రతిష్ఠానమందలి యయాతి పాలనము. ఈ రెండు గూడ నానాటి ఇబ్రహీముని పాలనయేయని యనవలెను.

ప్రభువుల పాలన యందు భూదేవి ఆది కూర్మము శేషుడు ఆదివరాహమూర్తుల వలని నొగులును, బలి, శిబి, మాంధాతాది చక్రవర్తులను మరిచి సంతోషముగా నున్నట్లు చెప్పుట పరిపాటికాని తెలగన తనకావ్యమున భూదేవిగాక సముద్రుడు శాంతముగా నున్నట్లుచెప్పెను.

అతడు యయాతి విడిచెడుదాన ధారలవలన దేవతలు తనను మథించిన నాటి నుండి గలిగిన కలతలన్ని మరిచి యెప్పుడు నిండుగా నుండెనట (1-95) వరునకు వివాహ సమయమున మధుపర్కమునకు మొదలిచ్చెడు ధ్వజలమును "సముద్రంవః ప్రహిణోమిస్వాంయోని మపిగచ్ఛత" అను మంత్రముతో "ఓజలమా నీవు నీ స్థానమైన సముద్రమునకు బొమ్ము" అని దానిని సముద్రమునకు బంపుటగలదు. ఇది తెలగనకు గల వివిధ శాస్త్రపరిచితి కొక యుదాహరణమగును.

ఈవిధముగా యయాతి-శేషునికి మారుటగా భూమిని భరించుచు కొలువున నుండగా ఒకనాడతని కడకు వేటకాహ్వానించుట కాటవికులు వచ్చిరి.

వరాహపురాణము, శృంగారశాకుంతలము, మనుచరిత్ర, తపతీసంవరణము అను కావ్యములందన్నింట వేట వర్ణన గలదు గాని దానినందరి కంటె వివరముగా జెప్పిన వాడు తెలగనయే.

ఆటవికులనగనే మన కవులకు-

ఉ. జుంజురు పల్ల వెంట్రుకలు జొంపములుంగల మస్తకంబులన్
కెంజిగురాకు కెంపురుల కించెడు వట్రువకన్నులున్ జర
త్కుంజర చర్మ పట్టములకంటసరివచ్చు బెరళ్లమేనులున్ - శృంగారశా - 1-97.

ఇవియే స్ఫురించును గాని వారికి గూడ నొక సంస్కృతి గలదు వారి యందు గూడ నొక సౌందర్యము గలదని తోచదు. తెలగన తన స్వభావోక్తితో నిచట గురివెంద పట్టెళ్లకును తోడు సందిళ్ల పీలిదండలు గూర్చి చాల దొడిగి (1-102) అని వారి యాటవిక నాగరికతా సౌందర్యమును మన కన్నుల యెదుట నిలిపెను. ఇది కఱుకు జుంజురు వెంట్రుకల కొప్పుగాధ తరంబుగా నెమిలి పింఛంబు ' ట్టి - కాళ -3-15 అను పద్యమును

తలపించును. వారి భూషణాంబరములను చెవులకీ తెల్లయుచ్చితకాయ లెంతేసి పారుటాకులది కుప్పసమిదప్పు -(1-120)

అని మరియొక పద్యమున చూపెను.

అటవికులను వర్ణించిన ఈ రెండు పద్యములు వారి యలంకార సర్వస్వ మనదగి యున్నది.

యయాతి వారు తెచ్చిన కానుకలు స్వీకరించి వేటకై వీట చాటింపించి పయనమై వెళ్లి యొక భీకరారణ్యమున నొకయడవి పల్లెచెంత విడిసెను.

ఈ సందర్భమున తెలగన వర్ణించిన యడవి నింగి బీటలు వార పొంగు సింగంబుల రవలచే దిసలెల్లచెవుడు వడగ (1-116) తడబడ బడియెడు రవమును, బడికాలెడు రవము అను (ఆది. 2-215) ఆంధ్ర మహాభారతమందలి సర్పసత్రమును దలపించును. వారు ప్రవేశించిన ఆయడవి యిసుకచల్లిన రాలనట్లనియే మన జాతీయముగాని యది ప్రొద్దు చాయలు దూరక పొళ్లుజేసి, యిసుముచల్లిన రాలకనిరులు గ్రమ్మి. నడువగా రాని యొక్క కారడవి (1-117) అని తెలగన కథనము. అది యిసుక గాదు దానిని పొడి జేసి చల్లినను రాలదట. ఇక దాని చిక్కదనము మనసుతో దప్ప కనులతో చూడదగినది కాదు. ఆ యడవిలో కొన్ని యెఱుకు పల్లియలుండెను -

అలరుకస్తురి తేనెలలికి వాకిళ్ల చెంతల పైచిన పోయిన తట్టు పునుగు (1-119) సంకుమిదంబునుం బునుగు జాదును కస్తురియుః ఘటంబులం. బంకము జేసి యిండ్లలికి ప్రత్యహయుః వెలివైన - కాళ 3-5 అని ధూర్జటి చెప్పెను.

ఇట్టివి ఆనాటి ఆటవికుల వైభవమును దెలుపు చుండును. వారు తమ వైభవమున పట్టణ వాసుల కేమి తీసిపోయెడు వారుగారు.

ద్వితీయాశ్వాసము

ఈ యాశ్వాసమున యయాతి యొక్క వేట. అతడు లేడివెంటబడి మంచుమల ప్రాంతమునకు వెళ్లి జాబాలి యాశ్రమమును ప్రవేశించుట జాబాలి యయాతికి రామాయణ కథను శ్రీరామాదుల జననము వరకు చెప్పుట గలదు. ఈ నడుమ రావణుడు వేలము విడిసిన చోట చంద్రోదయము - నలకూబరుని చెంతకు వెళ్లుచున్న రంభనతడు బలాత్కారముగా భోగించుట యున్నది.

తెలుగు వారేపని చేసినను దైవస్తుతితో దానిని ప్రారంభించుచుందురుగాన యయాతి వేట ఆటవిక దేవతలైన కంబమయ్య కాట్రేడు మలలమ్మ దుగ్గమ్మల ప్రార్థనతో ప్రారంభమైనది.

ఇటువంటి సందర్భములలో కవులు తమకు దెలియకుండ గనే మతవిషయమున బయట బడుచుందురు. పోతన శివకేశవ భేదము పాటించని వాడైనను "తథాపి భక్తిస్తరుణేందు శేఖరే" యన్నట్లు చేతులారంగ శివుని పూజింపడేని - అని తమయొక్క సహజ ధోరణిలో చెప్పెను. తెలంగాణమందలి వైష్ణవులెక్కువగా నృసింహ భక్తులు - ఉపాసకులు కనుక దానిననుసరించి తెలగన కంబమయ్యరో మేలుగలిగించు (2-3) అని తన స్తుతిని నృసింహ స్వామితో నారంభించుట యిచట గమనింపదగిన విషయము.

వర్ణనా నిపుణః కవిః - తెలుగు కవులందరు వర్ణనా ప్రియులేయైనను దానిని సంయమనముతో నాలోచించి యౌచిత్యముగా నిర్వహించు వారరుదు. ఆయరుదైన వారిలో తెలగన యొకడు. అతడు తన యొక్క ఈ స్తుతి యందు పూర్వార్థమున పురుష, ఉత్తరార్థమున స్త్రీ దేవతలను తలచుట యతనికి గల వస్తువిన్యాస దృష్టికి తార్కాణము.

వేటయనగనే మనకవులు పులులను, సింహములను, ఏనుగులను నరుకుటయేగాని వేటకాడే జంతువు నెటుల చంపునో ప్రత్యక్షముగా చూచి చెప్పిన వారు తక్కువ.

వరాహ పురాణకర్తలు ఈశ్వర నరసరాయులవెంట వేట కరిగి చూచినట్లున్నది. అందువలన వారోదెములు త్రవ్వియందడవి పందులను పడవేయుట చెప్పిరి. అంతే గాక

సెలవులు వెట్ట క్రోల్పులికి చేయిడి ముప్పిడిగుప్పు శౌర్యవం
తులగని కర్ణముల్ బిగియునొక్కి వరాహము నెక్కు వీర్యవ
తులగని లేటివెంటబడి దుత్తెడు మేరనబట్టు వేగవం
తులగని మెచ్చి లేనగవులతోడ నభీష్టము లెల్లనిచ్చుచుఌ -వరా - 4-86

అని దుర్జయుని వేటను వర్ణించిరి. పూర్వము పౌరుషవంతు లెడమచేతికి తలపాగను దిండుగా చుట్టుకొని పులికెదురేగి దానినోటి కాచేతినందించి తలపై పిడిబాకుతో పొడిచి చంపెడి వారట. అటులే యడవి పందిపై నెక్కుట దానిని పొడిచి చెవులు పట్టి లాగుకొని వచ్చుట చేసెడి వారట. అందులకు వేటకానికెంతో ధైర్యము, బలము, సాహసముండవలెను. ఈ విషయుములు మా తాతగారు చెప్పగా వింటిని. పెద్దన గారు స్వరోచి వేటను కృష్ణదేవరాయల వెంట వేటకరిగిచూచి చెప్పిన వాడేయని విమర్శకుల మతము. అతడు చెప్పిన పందివేట, జాగిలములవేట, డేగవేట సహజోక్తులే కాని అతిశయోక్తులు గావు.

పందిని పొడిచినవాడే బంటు కందము చెప్పివాడే కవి యని సామెత. అందువలన తెలుగు కవులు తమ కావ్యములలో కందములకు వేటలో పందివేటకు ఎక్కువ ప్రాముఖ్యము నిచ్చిరి తెలగన.

తొలత మ్రింగిన కొరనెలల్ సెలవులందు,
గడగి వెడలించు నెలదింది గాములనగ
కొమ్ముపందులు వెడలె ఘుర్ఘురములడర
పొదలలో నుండి యుప్పుడార్పులకు గాక -2-6

అని యతడు వనవరాహములను వర్ణించిన తీరద్భుతము. పెద్దన యొక సీసము, ఒక కందమున చెప్పిన పందివేటను తెలగన మూడు పద్యములలో మూడు వృత్తములలో విస్తరించెను. పందివేట పిమ్మట మూడు పద్యములలో నెలుగువేట పిమ్మట నొక్కొక్క పద్యమున సివంగి, లేడి, ఎద్దు వేటలను చెప్పెను. ఈ వేటలన్ని ధూర్జటి గూడ తన కాళహస్తి మహాత్మ్యమున పేర్కొనెను.

పెద్దన పిమ్మట వేటవివరములు పెద్దగా దెలిపిన వాడు తెలగనయే పెద్దన వేటలోనే జాతి డేగ యేపిట్టనెటుల గొట్టునో చెప్పగా (4-58,59) తెలగన వేటడేగలెన్ని విధముల పిట్టలను గొట్టునో (2-24) తెలిపెను. అంతేగాక నితడు తనకంటె పూర్వులు తెలుపని

1.పొదివేటజూడ బదరెడు రాని మదినెఱింగి తడవుమనినవెలచె
కొజుకారు కోడి కక్కెర పూరేడు - చిందలున్న గూండ్ల చేరదెచ్చి - 2-21
2.ఎడగలుగ బెట్టి తలుపు, ల్విడనవిగావించు రవలివినిచని గూళ్ళ
బడుపులుగుంల, నుసురులతో,కడువేడుక దెచ్చి యొకడు కనుకజేసేన్ - 2-22.

అని పొదివేటను జెప్పెను. వేటలలో పారువేట యొకటి. వైష్ణవమత కావ్యములందు వేట సందర్భమున పారువేటకు వారు ప్రాముఖ్యమిత్తురు. వెంకటేశ్వరునిపై పారువేట కృతులు

గూడ నున్నవి. తెలగన పారువేటలో యయాతి పులులను వధించినట్లు లేళ్ల వెంట పరుగెత్తి నట్లు చెప్పెను.

పులి అడవికి రాజు గాన రాజులకు పులివేట పౌరుషదాయకము. ప్రతాపరుద్ర చక్రవర్తి గూడ తన యయాతి నాటకమున ప్రథమాంక మందీ వేటను ప్రవేశపెట్టెను తెలగన.

క.పొడిచిననే జావెంటనె, వడిజేకొని చౌకళించి వచ్చిన పులులన్
మెడలెదలించెను జెడిదపు, టడిదంబున నేలగప్పినట్టులనుండన్ - 2-29

అని యయాతి పౌరుషమును దెలిపెను. లేడివేటలో పెద్దన -

హరణం బొక్కటి కుక్క తండము పుళిం దానీకముంద్రోచియు
ర్వర కాలూదక దాట నేటలవికిన్ వాహంబు నడ్డంబునూ
కిరసావల్లభుడేసె భల్లమును నింగిన్ కాళ్ల జోడించుచో
గొరిజల్ నాలుగు ద్రెవ్వ-సేనవోగడన్ కోదండపాడిత్యమున్ - మను 4-44.

అని చెప్పగా తెలగన- (ఎగిరిన లేడిని యితనికంటె మొదట నాలుగు కాళ్ళ తెగవేసినవాడు నాచనసోమన)

స్రగ్ధర :-అనుకుంజావుల్ దగన్ దా మడుగుల్ పుడమిన్‌హత్తనీకేగులేళ్లం
గనితేజీద్రోలియుంటన్ గదుముచు మెరుగుల్ గ్రమ్ముచుండంగమున్నే
సిన దూపుల్‌వెండి యెుంటన్ జెలగుచు దునుకల్‌జేసే చేనేర్పు మీరన్
గను వాలుగంటికన్నుల్ దలపుచు మదిలో దాచియున్నట్టి కూర్మిన్ 2-31

మొదట వేసిన బాణమును వేటకాడు తానే రెండవ బాణమున తునకలు జేయుట సామాన్యమైన నేర్పుగాదు. కోదండ పాండిత్యమున తెలగన పెద్దన కంటె యొుక కాండ మెక్కువగనే జదివెను. యయాతి యిటుల వేటాడుచుండగా పైవలెనే నొక యిర్రి వేటకాండ్రను తప్పించుకొని దాటగా దాని వెంటబడి చలిమల పట్టు జేరెను.

హిమాలయమును తెలగన రెండు సీసములు మరియు నొక వృత్తమున వర్ణించెను. వ్యక్తుల యొుక్క ఆకారమును వేషభాషలను చెప్పవలసినపుడు సీసము ప్రవర్తనాదులు చెప్పవలసినపుడు వృత్తములనుకూలముగా నుండును. తెలగన యీమెలకువ నెరిగిన వాడు కనుక వ్యక్తులను చూపవలసినపుడెల్ల నతడు తప్పక సీసమునే వాడెను.

హిమాలయము శివుని నావాసము, శివునికి గిరీశుడని పేరు. గిరీశుడనగా కొండలరేడనియునర్థము.

సీ॥ బెట్టుగా నడివంకజుట్టివచ్చిన మబ్బువెలయు నేనిక తోలు వలువగాగ (2-36) అని దానిని చక్కగా శివునితో నిరూపించెను. దీనికంటె మొదటి పద్యమున దానిపై నచట నచట నాడు దేవకన్యలు చెప్పబడిరి. దేవకాంతలతో పాటు దానిపై చెంచితలు గూడ నుండిరి. వారి సంసారములుండెను. వారు సింహము లేనుగులపైకి లంఘించి కుంభస్థలములను పగులగొట్టగా చిల్లి మంచులో పూడిన ముత్యములను తమ యమ్ములతో త్రవ్వియేరుకొను చుండిరి. (2-37)

చెంచు యువతులడవులందు తమ యమ్ములతో నీటెలతో త్రవ్వి చెంచుగడ్డలను దుంపగడ్డలను ఏరుకొనుచుందురు గాననిది దానిపై చేసిన నుదాత్తమగునూహ.

హిమాలయమునుండి గంగ బయలు దేరును. దానిని తెలగన మూడు సీసములలో వర్ణించెను. యయాతి రెండు పద్యములలో నుతించెను.

సంస్కృతవాఙ్మయమున ప్రకృతి యందలి వృక్షనదీ పర్వతాదులను వానివాని శబ్ద గత లింగమును బట్టి స్త్రీ, పురుషులుగా రూపించుట పరిపాటి. పర్వత శబ్దము పుంలింగముగాన నది శివునిలో రూపింపబడినది. గంగా శబ్దము స్త్రీలింగము. నదులందు స్త్రీ శరీరాంగములకు సరిపడు సామాగ్రి, పుష్కలముగా గలదు కాన కవులనేకులు నదులను స్త్రీలుగా నిరూపించిరి.

తెలగన ఈ కావ్యమున గంగను సరస్వతిగా రూపొందించెను. సరస్వతికి నదీరూపము గూడగలదు. 'సేవ్యాసిద్ధస్వతీ సూక్తిఃస్యందనూఃసరస్వతీ - అని అగస్త్య కృత గంగాస్తవముఆకారణములచే తెలగన గంగను సరస్వతిగా రూపించెననవచ్చును.

సరస్వతి వీణాపాణి గంగయందు దానికి సాటి చెప్పదగిన వస్తువు మృగ్యము కాని కవియైన వాడు క్రాంత దర్శిగదా! తాను సంకల్పించిన దాని నూరకనే విడుచునా! తెలగన మంచి భావుకుడే గాక నిశిత పరిశీలకుడు గూడ అందువలన నతడు గంగలో మెడలు సాచి పరస్పరము మేత లందించకొను చుండురాయంచ జంటలను జూచి.

సీ. గీ. మేతలిడునంచలిరువంక మూతి గరవ - రాణదిలకించు పూదీగె వీణగాగ -(2-42) అని యువి పట్టుకొనిన పూదీగతోకూడిన మెడలను కోపుగా వాని పొట్టలను కరివె మరియు కాయలుగా జేసి, కావ్యాదిని సరస్వతిని స్తుతించని లోపమును దీర్చుకొనెను. లోకోత్తరమైన ఈయూహ యచ్చ తెలుగు ప్రపంచమున తెలగనను నలువను జేయుచున్నది.

యయాతి గంగను నుతించి ముందునకు సాగగా నతనికి జాబాలి మహర్షి యాశ్రమము కనిపించెను. దీనిని తెలగన మరల రెండు సీసములలో వర్ణించెను. ఆశ్రమము లందచటి మునుల ప్రభావమున ప్రాణులు తమసహజ వైరము మరచి జీవించుచున్నట్లు చెప్పుట కవి సంప్రదాయము. దీనికి నన్నయగారాంధ్ర మహాభారత మందలి కణ్వాశ్రమమున శ్రీకారము చుట్టెను. దినినందుకొని తర్వాతి కవులీ ప్రాణుల మైత్రినినేకవిధములుగా వృద్ధిచేసి విస్తరించిరి. కావ్యవర్ణనలందలి ఈ జంతు మైత్రి పూర్తిగా ప్రకృతి విరుద్ధమే యనిపించినను –

ఈనాడు పత్రికలలో

1. పిల్లికూనలకు పాలిచ్చి సాకిన కుక్క
2. పిల్లితో చెరలాటమాడే ఎలుక
3. పిల్లితో స్నేహంచేసిన పాము
4. పాముకు పాలిచ్చే ఆవు
5. కుక్క కూచులకు పాలిచ్చే పిల్లి
6. కుక్కతలపై నెక్కిన కుందేలు
7. పిట్టను రక్షించిన పిల్లి
8. కుక్కతో జీవించే గుడ్లగూబ

ఇట్టివింతలు చదువుచున్నపుడు మనకవులు వర్ణించిన జంతు ప్రవర్తన కొంతవరకు నిజమేయనిపించక మానదు.

తెలగన యీ యాశ్రమమును రెండు పద్యములలో వర్ణించెను. మొదటి పద్యమున నాయాశ్రమమందలి జంతుమైత్రి (2–49) రెండవ దానియందాశ్రమ వాతావరణము (2–50) చెప్పబడినవి.

మహాభారతమున జాజిలితులాధారుల సంవాదము గలదు. జాజిలి మహర్షి తలపై పిచ్చికలు గూళ్లు కట్టుకొని పిల్లలనుచేసెనట. నామసాదృశ్యము ననుసరించి తెలగన జాబాలి తలను పిచ్చికలలో శరీరమును గోరువంకలతో, గడ్డమును గబ్బిలాయిలతో హస్తములను సర్పములతో నింపి ఒక విచిత్రమైన శాంతమయత పోమూర్తిని పాఠకుల యెదుట నిలిపెను. (2–51)

ఆ మహర్షి యయాతికి నొంటరిగా నటులరారాదని నిదర్శనముగా రామకథ నారంభించెను. భారత కథయందు రామాయణ ముండవచ్చునుకాని రామాయణ కథయందు భారతముండరాదు. శ్రీరాముడు జనించుటకు మొదట రావణుడు స్వర్గముపై దండెత్తి వెడలి కైలాసగిరి చెంత వేలము విడిసెను.

అప్పకవి చెప్పిన కావ్యవర్ణనలందు ప్రయాణము గూడ నొకటి. ఈ కావ్యమున యయాతి వేటకు వెడలుట - (1-109) రావణుడు దండు వెడలుట (2-65నుండి67) అను రెండు పయనము లున్నవి. ఆరెండున గూడ భయానకాస్పదములే.

రావణుడు కైలాసము చెంత దండువిడువగా సూర్యుడస్తమించెను. తెలగన ఈ అస్తమయమున "సంధ్యా సూర్యేందురజనీ ప్రదోష ధ్వాత వాసరాః" అని సాహిత్య దర్పణమున చెప్పబడిన యంశములకు తన కావ్యమున చక్కని యవకాశము కల్పించుకొని వానిని 37 గద్యపద్యములలో నిర్వహించెను.

సూర్యాస్తమయమున తామరలు ముడుగుచు వానిలో వ్రాలిన తుమ్మెదలేమాత్రము తాత్సరము చేసినను రాత్రియంతయు లోపల చిక్కిపోయి దాని జత తుమ్మెద నాపద్మము చుట్టు తిరుగుచుండును. దాదాపుగా తెలుగు కవులందరికీ తామరలోని తేటులు వర్ణనీయ వస్తువులైనవి. సాయంకాలమున కొలనులలో తామరల చుట్టు దిరిగెడు తుమ్మెదలను తెలగన-

తలపననుంగులైన తమతమ్ములలోపల దాగెగాక తా
వెలికాటకేగగా గలడు వేడి వెలుంగని పేర్చియార్చుచున్
పిలుగులబెట్టగా వెదకు చీకటిసోకు దుపిల్లలోయనన్
గొలకుల ద్రిమ్మరన్ దొడగెగూర్కకమోయుచు గండు తుమ్మెదల్ -2-73

అనుంగులైన తన తమ్ములు అనట మీ పద్యమున చక్కని శ్లేష.

తే : పూనిపదిరెండు ప్రొద్దులు పొడిచెనేని, నిందులోగాన వచ్చునేయించుకైన
నసగలిగిన వన్నియు నలమితనదు- రూపుగామీరి చీకటియేపు చూపె - 2-76

తే: తనకు బగయగు ప్రొద్దును వెదకిగనక, కనలుచీకటి రక్కసి కన్నులందు
దొరుగు కణకణమను నిప్పుదునకలనగ, బొలిచెనెడనెడ మిణుగురు బుర్వులంత
- 2-77

క: వెలిచాయలొచె తూరుపు, వలనందగ తమ్మివిరుల వాతులుమూయన్
నెలచూలన వెలవెలనగు - తొలుకడయును నెలతమొగము తొరపుజిగిగాన్

నెలచూలనుట ఈ పద్యమున రమణీయమైన శ్లేష- చూలు నిలిచిన తొలిదినములలో నెల తల మొగము వెలవెల నగుటలోక ధర్మము.

తెలగన యొక్క ఏ వర్ణనబట్టి చూచినను యిటులందేదో యొక క్రొత్తదనమే. ఇక చంద్రోదయ నాటకమున చకోరముల తలలొక ప్రకరి.

వెలుతురు - చీకటి వెన్నెల వస్తువులు గాకున్నను కవితా సంప్రదాయమున వానిని ఘన ద్రవ పదార్థములుగా భావించుట పరిపాటి.

చకోరములకు వెన్నెలయనిన మిక్కిలిప్రీతి. అవి వెన్నెలరాత్రులలో నింగికి గొంతెత్తి యానందమున కొలకొల గూయుచుండునట. అందువలన కవులు వానికి వెన్నెలవిందు లేర్పరచిరి. పెద్దన సాయంకాల వర్ణనమున చక్రవాకి వినియోగమును (మను - 3-16) చెప్పెను గాని చకోరముల వెన్నెల విందొక పద్యముగా పలుకలేదు. నంది ఘంటల జంట వరాహపురాణమున సీ॥ వీని చంద్రికలు ద్రావిన చకోరములకు (4-23) అని వెన్నెలను ద్రవ పదార్థముగనే భావించిరి. మేనమామ ననుసరించి ముక్కుతిమ్మన గూడ దానిని ద్రవపదార్థముగనే జేసి పారిజాతాపహరణమున చకోరములకు విందుజేయ తెలగన మాత్రమది ఘన పదార్థముగా జేసి దానిలో నలభీమపాకములు జేసెను.

తెలగన తన వెన్నెల పద్యమున రాధా మాధవ కవి ననుసరించెనని ఆరుద్రగారు తమ సమగ్రాంధ్ర సాహిత్యమున (భార.పు 77) నిదర్శనము జూపిరి.

తమ కావ్యములలో వెన్నెలవిందును పెట్టిన ముక్కు తిమ్మన చింతలపూడి యెల్లన, ఎడపాటి ఎర్రయ, పొన్నాడ పెద్దిరాజు చకోరములను స్త్రీలుగనే చెప్పుట గమనింపవలసిన యంశము కాగా రాధా మాధవుడు తన పద్యమున మూడవ పాదమున చకోరికి బదులు చకోర వల్లభుని జెప్పి యించుక ప్రక్రమ భంగము జేసెను. తక్కిన వారు గూడ తమ పద్యమలందేదో యొక పాదమున వెన్నెలను ఘనద్రవ సంకరముగా జేయుచునే వచ్చిరి. వస్తుసంకరముగాకుండ దీనిని సూక్ష్మేక్షికతో చెప్పినవాడు తెలగన యొక్కడే.

కవికి ఒకరి ననుసరించు నపుడు లేదా ఒకవస్తువును విస్తరించునపుడు తత్పరిశీలనమవసరము.

ఈవెన్నెలలో రంభ తన ప్రియుడైన నలకూబరుని దగ్గరకు బయులు దేరెను. అప్పటి యామె వేషమానాటి విలాసవంతులకు ప్రతిబింబము (2-88) రావణుడపుడామెత్రోవ కడ్డము వచ్చి నేను నలకూబరుని భార్యను నీకు కోడలినగుదునని యెంత చెప్పినను వినక బలవంతమున పైబడి మదన కదనము చేసి విడిచెను. అప్పటి యామెస్థితి నేటి కామాంధుల బారిబడిన యువతి కేమియుదీసిపోదు.

ఈ ఘట్టమున తెలగన పూర్తిగా తిక్కననుసరించెను. తిక్కన రావణుడు చెరచిన రంభను -

పగరాజు పైవచ్చి బలువిడి పరిభవించిన దలంకిన పురశ్రీ విధమున
సమదద్విపముకేళి సలిపిన జాలనలంగిన నుద్యాన లక్ష్మి కరణి
ఘనలు లాయము సొచ్చితన యిచ్చనాడిన నలగిన నెత్తమ్మికొలనుభంగి
కడుబెట్టదపు గాలి సుడిసిన నెఱిదప్పి తిరిగిన మువ్వంపు తీగెమాడ్కి

అని చెప్పగా తెలగన -

బలిమితో బిగ్గర పదినోళ్ల నానరగా సోంపరు జిగిమోవి కెంపుతోడ
సెలగ చేతుల గోళ్ల జీర సెత్తుట దోగి నజ్జునజ్జయిన చన్మొనలతోడ
కలసిమై కందగ కౌగితుగదయింప బొక్కిళ్లు వోయిన సొమ్ముతోడ
మెలనసినతమి బోకవుడిదివ్వబెనగగా - చినిగిననుంజల్వచేలతోడ
నోపికెరుగక తనలావు జూపికదియ బడలియుదవదయ్యెయున్న యుడలితోడ
గాకనీడ్చిన విడిన కీల్గంటుతోడ,వచ్చెనలకూబరుండున్నవలని కతివ (2-99)

అని చెప్పెను. ఇక్కడ తిక్కనది అలంకార మార్గము కాగా తెలగనది యధార్థ కథనమార్గము. అప్పటికి చంద్రుడస్తమయ శిఖరి జేరెను.

చంద్రునికి నిశాపతియనిపేరు. నిశారాత్రి స్త్రీ లింగ శబ్దములు కనుక నలంకార శాస్త్రమున నిశాచంద్రుల దాంపత్యము ప్రసిద్ధము. ఎఱ్ఱనగారి యీ వర్ణనమును జూడుడు-

వెన్నెలవెల్లి పచ్చడము విచ్చిన యంబర శయ్యమీదజే
రన్నుననుండి దిగ్వని తలాదట జుట్టునుగొల్వ రాత్రియున్
కన్నియ గూర్మి చిక్కదన కౌగిట జేర్చి సుఖించినాడనన్
జెన్నువహించె చందురుడు శ్రీకమనీయ కళంకరేఖలోన్ (నృసింహ 3-89)

ఎఱ్ఱన తొలిజాము దృశ్యమును చెప్పగా తెలగన-

పొదలెడునట్టి చుక్కలను పువ్వులు చాల విదుర్వనొప్పున
చ్చదలను సెజ్జరేయునెడు చానయుదా దెలిరంగు గందమొ
ప్పిదముగ జిట్లగా బెనగి బెట్టగు నాయుల తంగలంగుచున్
నిదురకు బోలె గ్రుంకుముల నెత్తము జేరెను జందురుండొగిన్- 2-103

అని తెల్లవారు జాము దృశ్యమును చూపెను. చంద్రుడస్తమించబోగా నాపిమ్మటనుదయించు సూర్యుని

క.తెగియుపుడె మగుడనిగుడం జగురించిన పగటి పేరి చెట్టును బోలెగ 2-104
నరికి వేయుగా వెంటనే చిగురించిన పగటి పేరిచెట్టు వెలుతురు చెట్టువలె

ఇంకను-

సీ.గీ. నిట్టుపుట్టగు గట్రేని నెట్టెమునను సొంపుచే నొప్పు తామరకెంపసంగ 2-105
నుండెనట నెట్టెమనగా గుండురుమాలు. దీనిని పూర్వులు గట్టు చుండిరి.

రాధాకృష్ణపండితడు కట్టెడివాడు. గట్ల రాజైన ఉదయగిరి తలకు గట్టుకొనిననెట్టెము పైగల పద్మరాగపు మణివలెనుండెనట.

ఈ పద్యములలో సూర్యునకు పగటి పేరిటి చెట్టు, తామర, కెంపు అనునవి నామసార్థకమైన విశేషణములు. తెలగన ప్రతిభకు నిదర్శనములు.

తెల్లవారిన పిమ్మట రావణుడు దిక్పాలక పట్టణములపై దాడివెడలి - ఇంగలము వేడి చల్లార్చి యముని బీరము చక్కబెట్టి నీటిలేని పెంపు యిగురజేసి గాలిని కదిలిపో దూలించి ఈశానుని తిరిపెగాని చేసెనట. (2-107) ఇదీ కావ్యమున ప్రాసాద గుణభరితమైన పద్యములలో నొకటి తెలగనదీనియందు దిక్పాలకు వాడిన జాతీయము లొకవైపు వారిపై కరుణ గలిగించుచునే రెండవవైపు రావణుడు వారిని బఱచిన స్థితికి నవ్వును గూడ పుట్టించు చుండును. ధీర్ఘ ధీర్ఘ సమాసాడంబరములతో గూడిన రచనలు పండిత వేద్యములు గాగా యలతి యలతి పలుకుల తోడి ప్రాసాద గుణ భూయిష్టమైన యిట్టి రచనలు సమాజమున బహుళ జనామోదములగు చుండును -

రావణుడు తమ పురములపై దండయాత్రలు సల్పగా దేవతలు విష్ణువును దర్శించుటకు వెళ్లిరి. అతడు క్షీరసాగర మందలి శ్వేతద్వీపమున నుండును. దేవతలు క్షీరసాగరము దరికేగిరి. అది తెల్లనిది. దానియందు పుట్టిన కల్పవృక్షము, కామధేనువు, ఐరావతము గూడ తెల్లనివే.

దేవతలకు క్షీరసాగరము కల్పవృక్షమువలె గన్పించెను. ఇది తెలగన యొక్క మరియొక అద్భుతమైన రూపకము (2-109) ఇట్టి రూపకములు పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్ర యందు పర్వత ప్రకరణమున కననగును.

దేవతలు విష్ణువునుదర్శించి రావణుడు చేసిన నిర్వాహకమును తెలిపిరి. తెలగన యీ కావ్యమున విష్ణువును కృతిపతి వంశావ తారమునకు ముఖతిలకముగా నొకచోట మరియు నిచట వర్ణించెను. ఈ రెండును సీసములు.

మొదటి సీసము ప్రౌఢమై ధ్వని ప్రధానముగా నుండగా (1-16) రెండవది సీ. జగములు గలిగింప జాలునల్వకు బుట్ట నిమ్మైన పొక్కిలి తమ్మివాని (2-110) అని సులభ సుందరముగా నున్నది. దీని పిమ్మట-

చిలువల చేనిమ్మై యునెడు సెజ్జను మించిన మంచుగొండపై
నలిబొలు పొందు కార్మొగులు నాదగు చామన మేనినిద్దపుం
జెలువున మీరుకుందనపు జేల మెఱుంగున నొప్పు వెన్నునిం
గలముల చానగేస్తుగని -కన్నుల నీరొలు కంగ మ్రొక్కుచుం

శ్రీమహా విష్ణువును గురించి ఇటువంటి రూపక చిత్రముఁ . మనకు పోతనగారి భాగవతమున కనిపించుచుండును. ఈ పద్యముతో తెలగన పోతనగారిసరసన నిలుచును.

దేవతలు విష్ణువును దర్శించి మ్రొక్కి -

సీ. తునిసి కూకటి ప్రేళ్లకును పెల్లగిల్లగా, బుడుకు మ్రాకులునేల బడగ్రోసి (2-114)

అని రావణుడు చేసిన విధ్వంసమును

సీ॥ ఉలుప చాలదుటుంచు నలుగు వేలుపు తేని, సంటుగాదని యగ్గినంటుగట్టు (2-115)

అని యతడు దిక్పాలకులను బరచిన పాట్లను కన్నీరొలుక విన్నవించిరి.

ఈ సందర్భమున తెలగన తెలిపిన విధ్వంస కాండ ఆనాడు తల్లికోట యుద్ధానంతరము తురలకు విజయనగరమున జేసినవే. దిక్పాలకులను పఱచిన బాధలు వారానాటి హిందూసామంతులను పరచినవే. అపుడు విష్ణువు వారి మొరవిని యోదార్చి పంపి తాన యోధ్యా పురమున దశరథుని భార్యలకు రామలక్ష్మణ భరత శత్రఘ్నుల రూపమున బుట్టి పెరుగసాగెను.

తృతీయాశ్వాసము

ఈయాశ్వాసమున శ్రీరాముడు విశ్వామిత్రుని వెంటవెళ్లినది మొదలుకొని రావణుని వధించి యయోధ్యకు వచ్చి పట్టాభిషేకము చేసికొనుట. యయాతి దప్పిగొని నూతికడకు వెళ్లి అందు దేవయానిని చూచి పైకి తీయుట, ఆమహారాజుకు ఘూర్ణిక యను దాసి శర్మిష్ఠ వృత్తాంతము చెప్పుట, అతడు వెళ్లగా శుక్రుడు వచ్చి కూతురు నోదార్చుట, వృషపర్వుడు వచ్చి యామెకు తనకూతురును దాసిగా నిచ్చుట, అతనికి శుక్రుడు కచుని వృత్తాంతము చెప్పుట గలదు. ప్రధాన కథ యంతయు యిట్లీ యాశ్వాసముననే యిమిడినది. కనుక దీయాదు కథా భాగ మెక్కువ వర్ణనాంశము తక్కువగానున్నది.

అయినను తెలగన యథావకాశముగా సంక్షేప రూపమున వర్ణనసాగించుచునే పోయెను.

రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంటవెళ్లుచుండగా వారిపైకి తాటక వచ్చెను. తెలగన యామెను.

చ॥ పెలుచగు రూపుతో పునుక పేరులు దూలవెడందనాముకన్
సెలవులునాకి కొంచు నిరుసేతుల కేడెము వాలు బూనిమై
పొలుసుగ పుల్లదుర బొట్టకు గల్గెనటంచు నార్చుచన్
సొలవచ్చు తాటకి గనుంగొని - రాజడ దారి రాముతోన్ 3-7

అని స్వభావోక్తిలో చెప్పెను . ఈ పద్యమున "పొలసుగవులు- పొట్టకుగల్గు" ఈరెండు అచ్చముగాణ ప్రయోగములు, గవులు = దుర్వాసన, దీనినిప్పటిని జానపదులు వాడుదురు. అట్టులే పిల్లల విషయమున పొట్టకు వేయు, పొట్టకుదాపు అని ఆహారమిచ్చు సందర్భమున వాడుచుందురు.

శ్రీ రాముడు సముద్రమును దరిసి సేతువు గట్టనుంచు సమయమున సముద్రుడతనిని గని సంతసమున పొంగెను. రాముడది గని-

క॥ కడునలిగి పుడిసిలించియు, బడలింపగలేని కడవ పట్టియెమరినా బెడిదపు దూపు+?
(అని సారిందొడిగిన బలుచిలుకు జూచి తొలుకుటుడిగియున్ 3-29)
క॥ అప్పుడు జూచిననేమని -చెప్పుదునక్కడలి కాకిచిప్పలు నిసుమున్
గుప్పలు తెప్పలు తిప్పలు-కప్పలు చిక్కంగదుమ్ము గ్రమ్ముచునుండెన్ 3-30

అని సముద్రమందలి కప్పలు చేపలు బయట బడుటను చెప్పెను. వేసవి విజృంభించినపుడు పల్లెటూళ్లసమీపమున పారెడు చిన్నచిన్న వాగులు కాకి చిప్పలు నిసుము బయటబడి నిజముగనే దుమ్ము రేగుచుండును. కావున నిది మరియొక స్వభావోక్తి. తెలగన యిక్కడ తాను చూచిన దృశ్యమునే చెప్పెను.

శ్రీరామునకు సముద్రుడు శరీరము ధరించి కనిపించి దనపై సేతువు నిర్మించుమని చెప్పెను. అపుడతడు కపులతోనే యేకొండలు తేవలదో-

సీ॥ నెలతాల్పు దేవర యలిగినపనిగాదు వెండిగుబ్బలిచేకయుండ నిండు 3-35

అని యొక పట్టికను చెప్పెను. దీనిని బట్టి శ్రీరాముని సైన్యమునగల వానరమూక కైలాసాద్రి గిరులనైన పెకల్చి తేగల సమర్థులని తెలియును. ఇటువంటి ధ్వనియే కవితా కన్యకు జీవమని ఆనందవర్ధనుని మతము-

జాబాలి శ్రీరాముని వృత్తాంతమును ముగించగా యయాతి సెలవు దీసికుని బయలుదేరి దప్పిగొని యొకబావి కడకు జేరి యందు జలమునకు బదులు జలజాక్షిని చూచెను.

ఇక్కడ మహాభారతమున నన్నయ

సీ॥ చనుదెంచి యమ్మహాజనపతి జలమపేక్షించి యచ్చో విశ్రమించిచూచి
తత్కూపమున విలసత్కాల ఘనవల్లి యన్నిష్ఠ సఖినూదియున్న దాని
గురుకుచ యుగముపై బరువడి దొరగెడు కన్నీరు పూరించుచున్నదాని
తనసమీపమునకు జనులయాగమనంబు పన్నుగాగోరుచున్నదాని
వరుణ దోవుతోడ కరములిగి జలనివాసంబు విడిచి భూస్థలంబువలని
కరుగు దేరనున్న వరుణేంద్రుదేవియు పోనిదాని దేవయానిగనియె

-ఆది 3-140

అని చెప్పెను. నన్నయగారి ఈ పద్యమున ప్రథమ భాగము కథా భాగమునకు చెందగా మిగిలిన మూడు పాదములు దేవయానకి విశేషణములుగా గీతముపమానముగానున్నవి. ఇట్లీ పద్యము మూడు భాగములైనది. నన్నయగారిది కావ్యమార్గము. తెలగనది ప్రబంధ మార్గము. ప్రబంధేతి వృత్తమున వస్త్వైక్యమువలెనే ప్రబంధ పద్యములందు గూడవస్త్వైక్యముండవలెను. అందువలన తెలగన తన పద్యమున -

సీ. మాటమాటైయల్గి మరుగుమైడాగిన నీటి రాయుని కూర్మినెలతయనగ (3-42) అని నన్నయ నందుకొనిసీస భాగమంతయును సమాసములతో నిర్వహించి ననుగు జెలిని బోలె నలరుదీవియు నూదియుని గీతమత ని విశేషములలో పూర్తిచేసి తన పద్యమున వస్త్యైక్యమును పాటించెను.

నూతిలోని దేవయాని యయాతిని చూడగనేమొగమున కొంగు బెట్టుకొని యేడ్చెను. ప్రబంధములందీ యేడ్పులకు గూడనొక ప్రత్యేకత యున్నది. వసుచరిత్ర యందలి గిరిక ఈమెను చూచియే మొగమున కొంగు బెట్టుకొని యేడ్చెనేమో!

అపుడు యయాతి యామెను బావి నుండి చేత బట్టుకొని పైకి లాగి ఈ నూతిలో నెట్లు బడితివని యడిగెను. అపుడు దేవయాని తనను వెదకుచు వచ్చిన ఘూర్ణికను సాకూతముగా జూడగా నామె యయాతికి శర్మిష్ఠ వృత్తాంతమంతయు వివరించెను.

శర్మిష్ఠ దేవయాన లొకనాడు తమ చెలులతో విహారమునకై శృంగార వనమునకు వచ్చిరి. తెలగన వారి వనవిహారమును యిక్కడ -

సీ ॥ మొదలు తుమ్మెద దిమ్మురొదలచే రొదలచేనుప్పొంగి,
తులకించు పూబొదల్ దూరిదూరి - 3-55

అని సీస పాదములామ్రేడితములతో ముగించి వారి విహారము యొక్క నైరంతర్యమును ధ్వనింపజేసెను. సీసములను పాదములన్ని యేకపదములో ప్రారంభించినపుడు గాని, లేదా ఏక వాక్యములో ముగించినపుడుగాని అది కవికి సులభమగుటయే గాక పద్యగతి కొక యందము సమకూర్చును. తెలగన యీమెళకువ గూడ నెరిగినవాడు.

వనవిహారమున వారలసిపోయి యచటి సరస్సున నోలలాడ దలచిరి, ఆసరస్సు యొక్క మెట్లపై జక్కవలు రాయంచలు, బెగ్గురులు అచటి నొదలలో తుమ్మెదలు గుంపులు గుంపులై విహరించు చుండెను. కావ్యమున నితివృత్తము సమాజమునకు సందేశమిచ్చుటకు వర్ణనలు కవికి తన కాలపుసమాజమును చూపుటకు సహకరించును.

తెలగన ఈ సరస్సు దగ్గర జలపక్షుల మిషను ఆనాటి కొన్ని బాలికా క్రీడలను ప్రదర్శించెను. (3-56) ఆ సరస్సొక యందమైన జోగురాలి వలెనుండెను. యిప్పటికి మెదకు మండలమున జోగినులెక్కువ. కనుక తెలగన ఈ సరస్సును జోగురాలితో పోల్చి తన నాటియొకానొక జోగినిని చూపెను. (3-57) ఆసరస్సు తనలో నోలాడ వచ్చిన ఆ యువతులను జూచి వారు నడగొలకులని తలచి తనలోని తమ్మితావుట కానకవెట్టెను 3-58.

ఆ యువతులందరు తమ వివిధ వర్ణవస్త్రములు విడిచి చెందిర కావి పావడలు ధరించి మన్మథుని చిలుకల వలె కనిపించుచు కొలనిలో దిగగా సరోలక్ష్మి తనలోని పూవులను, ముత్యములను వారి పాదముల చెంత సమర్పించెను. 3-63

వారు జల క్రీడలో పరస్పరము నీరు చల్లుకొనుచుండగా నది వారిపై మన్మథుడు కురిపించుచున్న పూలవానవలె నుండెను. (3-65) ఓలఓలయని వారు నీటిలో మునిగి తేలుచుండగా మబ్బులలో చొచ్చి మరల వెడలెడు మెరుపు తీగవలె నుండిరి. (3-66) వెల్లకిలబడి ఈదునపుడు వారి గుబ్బలను గని జక్కవలు జతపక్షులని వచ్చుచుండెనట. వారి జడలు చంద్రబింబములను పట్టుకొనుటకు వచ్చురాహువులవలె నుండెను (3-70) నీటిలో నిలిచినపుడు కనిపించు వారి నీడలు వారియందమును పొందగోరి నాగకాంతలు తలక్రిందై తపము జేయుచున్నట్లుండెను. (3-71) కవులు తమకంటె ముందు వచ్చిన కావ్యముల సమకాలీన కావ్యలు చూచుచుందురు. కనుక వాని ప్రభావము తమపై చెప్పకుండనే నిలుచును. తెలగన యొక్క ఈ రెండు నిలువుటీతలు రాజశేఖర చరిత్రలో కనిపించును. (2-157-58) దరిపైనిలిచి నీటిలో దుమికి తేలిమరల పైకివచ్చునపుడు సముద్రము మధించునపుడందులో పుట్టి పైకివచ్చు యచ్చరలవలె కనిపించుచుండిరి -(3-72).

జలక్రీడలను తెలగన యంత విపులముగా మరెవ్వరును వర్ణించలేదు. ఈ సందర్భమందలి యితని భావనల పూర్వములు మరియు సుందరములు.

వారు నీటిలో నాడుచుండగా సుడి గాలివచ్చి యొడ్డునగల చీరలు కలసిపోగా శర్మిష్ఠయే గుర్తించలేక దేవయాని చీరను కట్టుకొన్నను చివరకు దేవయానిపైనే కోపించి యామెను నూతద్రోపించి వెళ్లెను.

యయాతి యామెనుద్ధరించి వెళ్లిన పిదప తండ్రి వచ్చువరకామె-

సీ ॥ కలువలు ముత్యాల గనియెడునోనాగ,
బోరిపోరి కన్నీటి బొట్లు జార -(3-84)

దుఃఖించుచుండెను. తెలగన యొక్క ఈ పద్యము చెందమ్మి విరులలో జిందుతేనెలు వోలె కన్నుల బాష్పంబు కణములురల (5-274) అను నాచన సోముని పద్యమునకు సాటివచ్చును.

శుక్రుడు వచ్చి బిడ్డనోదార్చి శాంతమునకు మించిన గుణములేదని చెప్పెను. ఈ పట్టున తెలగన ధర్మ తత్వజ్ఞుడు కనుక నన్నయగారి మాటలనే యనువదించెను. ఈలోపల

వృషపర్వుడు వచ్చి శుక్రుని

సీ॥ దురములో తెరగంటి దొరనింగలపు వేల్పు కడిమిగెల్చినది నీవలనగాదె (3-95)

అని బ్రతిమాలి శర్మిష్ఠను దేవయాని కోరిక ప్రకారమామెకు దాసిగా నిచ్చెను.

తెలగన కీ కావ్యమున నాలుగు తడవలు దిక్పాలకుల ప్రస్తావన చేయవలసి వచ్చెను. వాని నాయన ప్రతిసారి ప్రదక్షిణ క్రమముగనే నిర్వహించెను. సముదాయవాచకములు చెప్పునపుడు వానిని పూర్వాపర వివేచనతో చెప్పుట నన్నయ యొక్క మెళుకువ. తెలగన యితివృత్తము వలెనే ఈ విషయమున గూడ నన్నయనే ఆదర్శముగా నుంచుకొనెను.

ఈ సందర్భముననే వృషపర్వుడడుగగా శుక్రుడు కచుని వృత్తాంతము చెప్పెను. మహారాజైన వృషపర్వునికి తమ గరువు యింట జరిగిన ఈవిషయము తెలియకుండునా! ఇది సందర్భ శుద్ధితప్పిన ప్రసంగమని కొందరు విమర్శకుల తలంపు కాని వృషపర్వుడు రాజైనంత మాత్రమున నతనికి తనవారి యిండ్లలో జరుగు వృత్తాంతములన్ని తెలియ వలసిన పనియుండదు కాన నిది యసందర్భ ప్రసక్తియేమి గాదనిపించును.

తెలగన ఘూర్ణికతో శర్మిష్ఠ, శుక్రునితో కచుని వృత్తాంతములను చెప్పించుట మూలమున ఇతివృత్తమున నుత్కంఠతను పోషించెను.

ఇతనికి వంశవివరములు వాని మర్యాదలు చెప్పుట యందు భక్తి తాత్పర్యము లెక్కువ. అందువలన యయాతిని చెప్పునపుడు మొదట మిన్నేరు తలగల్గు వేల్పునౌదలపువ్వు - తలపనెవ్వని తాత తాతతండ్రి (1-91) అటులే యిక్కడ కచుని గురించి / సీ॥ జగముల గల్పింప జాలునల్మొగముల దొరపట్టియైన యంగరసుని మన్మడు (3-133) అని కచుడింటికి వెళ్లినపుడు - శుక్రుని పలుకులు గాకరము పెద్దయిని యంగిరసు చెంతకు బోయి చక్కగా జాగిలి మ్రొక్కి తనుము (3-150) అని, షర్మిష్ఠతో కచునికి సీ॥ ముగురువేల్పులు మెచ్చుభృగువున కర్మిలి మనుమడున్నది నీకు చనువుగాదే (3-155) అని యనిపించిన సందర్భము లీతనకి గల వంశాభిమానగౌరములను గురించి తెలుపును.

157 పద్యము దేహాత్మ సంవాదముకాగా తర్వాతిది దేహాంతర తుల్య సంవాదమగును.

చతుర్థాశ్వాసము

ఈయాశ్వాసమున వసంతర్తువు, చెలుల వనవిహారము మరియు యయాతి శర్మిష్ఠను చూచుట, దేవయానిని వివాహమాడుట మాత్రమున్నవి - ఇట్లీ యాశ్వాసమున కథ - స్వల్పమై వర్ణన లెక్కువ చోటుచేసికున్నవి.

కావ్య వర్ణ్యాంశములందు ఋతువర్ణనలకు ప్రముఖస్థానము గలదు. కనుక కవులేదో సందర్భమును పురస్కరించుకొని తన కావ్యములలో వానిని ప్రవేశపెట్టెదరు. తెలగనకీ యితివృత్తమున వసంతమునకు తప్ప తక్కినవానికవకాశము కలుగలేదు. కనుక కావ్యమున నతడు దీనినే నిండుగా వర్ణించెను. అంతేకాక వసంతము నితడు -

సీ ॥అంమంటజెలగు రాచిలుకల చాలుపుల్ వేలుపు మన్నీని విండ్లుగాగ -(4-4)

అని తొలుకారుతో నుపమించి కేవలము వసంత మొక్కటే కాకుండ వర్షర్తువును గూడ చెప్పితిననిపించెను.

పంచాంగమునకు వసంతము తొలుకారు కాగా లోకులకు వర్షర్తువే తొలికారు కనుక కవి యిందు వసంతమును వర్షర్తువుతో రూపించుట యతని లోకజ్ఞతకు నిదర్శనము. వసంతునిపై నితడు చేసిన కల్పనలద్భుతముగా నుండును.

చెట్లకు మండపగిలి ఎర్రగా మొలిచిన చిగురులు, గాలియను రక్కసులు వనముల యొక్క వస్త్రములను హరింపగా నావార్త కోకిలలలో విని వసంతుడను విష్ణువు - గాలికి కారణము చెట్లేగాన - వానిపై ఎత్తివచ్చి దండించగా వెడలిన నెత్తురువలె నుండెనట (4-3).

గాలికి కదులుచున్న లతల యొక్క మొగ్గలు వాయువను నాట్యాచార్యుడు నేర్పిన కోపులను తుమ్మెదల శ్రుతితో కోవెల పాటలతో ప్రదర్శించు చుండగా వసంతుడను ప్రభువు మెచ్చి బహూకరించిన ముత్యాల సరములవలెనుండెనట. (4-12)

నేలనానిన కొమ్మలుగల మామిడి గుబురులతో చిక్కిన గాలులు రేపుమాపు తావులు దోచుకొని పోవుచుండగా వసంతుడు పట్టుకొని పచ్చని చెరసాలలో పెట్టిన బందీలవలె నున్నవట (4-8)

వసంతమున చెట్లన్ని పూయుననుగాని జాజిపూయులు, మోదుగు మొగ్గలు జాజిపాదలను ఏనుగుల వొంచ విజృంభించిన సింగపు గోళ్లవలె నుండెను (4-5) మెట్ట

తామరాకులపై రాలిన పుప్పొడి కుప్పలు వనలక్ష్మి సంపెంగలను చూలాంద్రకు వేవిళ్ల దీర వడ్డించిన పిండి వంటలవలె నుండెను (4-9) సుడిగాలిలో తిరుగు పుప్పొడి చక్రములు దేవతాస్త్రీలపైకి మన్మధుడు పంపు చక్రములవలె నుండెను (4-10)

వసంతమున మామిడుల దొక ప్రత్యేకమైన సొగసు - దానికి వసంత ద్రుమము వసంత దూతయని వ్యవహారములు. కాళిదాసు ఆమ్రకూటమను కొండను భూదేవి స్తనముగా చెప్పగా పెద్ద నయామ్ర కుజమునే వనలక్ష్మి స్తనముగా (మను- 3-75) నిరూపించెను.

తెలగన చిగురించిన మామిడి గున్నను ఎఱ్ఱని పడగలతో నలంకరింప బడిన మన్మధుని తేరుగా చెప్పెను (4-9)

ఇతని వర్ణనలందు కొత్తదనమేదో యొక కోణము నుండి కనిపించుచునే యుండును. అప్పకవి చెప్పిన వర్ణనలలో తెలగనకు మధుపానమున కవకాశము రాలేదు. మధువనగా తేనెగూడ. అది త్రాగినపుడు గూడ జనులకు మత్తు కలుగును. వనవిహారమున నొక తరుణి తేనెలు త్రావి మత్తిల్లి నిండుగా పూచి తుమ్మెదలు వ్రాలిన యొక పొన్నను చూచి విషముపైకి పెచ్చరిల్లుచున్న శివుడని మ్రొక్కెనట. రసికుందొక్కడు చాలును. రసహీనులు పలువురేల రాయని బాచా! అన్నట్లు యయాతి చరిత్రమున మధుపాన వర్ణనము లేదనులోటు పూరించటకీ యొక్క పద్యము చాలును.

తెలగనకు భ్రాంతిమత్తులపై మక్కువ యెక్కువ . ఆయన సృజించిన భ్రాంతి మదులంకారము లెంతో సహజముగా నుండెను.

వారు వనవిహారము చేసి యొక పొదరింట రతీమన్మధుల వివాహము చేయుచుండ వారి వేనలి పూల తావులు గొనివెళ్లి వాయువను కాలరి యయాతికి కానుక వెట్టి అతని నచటికి గొనివచ్చెను.

ఈ సందర్భమున నన్నయ చెప్పిన సీ॥ అంగనాజనుల యుత్తుంగ సంగతకుచ కుంకుమ చందన పంకములను (ఆది -3-156) అను పద్యము నిండుగా ప్రబంధ పరిమళము గలది. తెలగన దానిని పూర్తిగా నెత్తుకొనక ఎత్తుగీతిని మాత్రమే యెందుకు గ్రహించెనో తెలియదు.

యయాతి అచటికి వచ్చి మేఘము నుండి వెలువడు తొలికారుమెరుపువలె

నొకపొదరింట నుండి వెడలిన షర్మిష్ఠను జూచి తమ్ములు చుక్కలు తాబేళ్లు మరు పొదలని (4-33) ఆమె శరీర సౌందర్యమున కబ్బురపడెను. పింగళి సూరన ప్రతిభను శంకించలేము గాని నెత్తమ్ములంచు కొన్నెలలంచువటషల, శ్రీలంచు తాబేటి చిప్పలనుచు (ప్రభా 2-63) అని చెప్పిన ప్రభావతి యందానికీ శర్మిష్ఠయే మార్గదర్శి కావచ్చును.

తెలగన యొక్కడ యయాతిలో శర్మిష్ఠను వర్ణింపించిన పద్యము లావె సౌందర్యమునకు చేయించిన యొక షోడశనామపూజ.

క॥ మరుడలునెల కడదాచిన విరిదూపుసు నల్లచెఱుకు విండ్లును బలెవే
మరునలరు చేరుచుక్కయు - నరుదగు కసుబొమలుమిగుల నతివకు నమరెన్ 4-35
క॥ నెలతుక కన్నులనంగా బొలుపగు నెలవెలుగు మేపు బులుగులు తమిచే
కొలదియొలుంగకతినివె-న్నెల - గ్రక్కుడు ననగ నెసగు నెలకొనునగవుల్ 4-36
కప్పురపు పొదులొపల కరము సంది - నాటివెన్నెలయును తేటనీటదడుప
మొనలు సూపిన ముత్యాల మొలకలనగ - నొరపుతోడుత చెలిపలువరుసవలె 4-39

అని వర్ణించెను. ఇతనికంటె కొంచెము మొదటి వాడైన అద్దంకి గంగాధరుడు తపతి కురులను.

సారెకు మానస ప్రభవ శైవల జాలము సంగ్రహించి (4-58)

అని ఇదే పద్ధతిలో వర్ణించెను. శివునకు మొగిలిపూవుపడదు.
తెలగన దీనికొన విచిత్రమైన కల్పనజేసి -
చెలినుదురుంగడుందొరయు సేమములో నెలకుండగల్గిన
వ్వలి మలయుల్లు వాని తల పాడని పువ్వయి నిచ్చ నేమునీ
నెలతుక చేతులంబడిన నేలరదంబగు వేల్పుతాల్చిన
ర్మలినని చెరనమ్మొగిలి రేకులనందగెవాడి గోళ్లగన్ (4-43)

ఈమెనుదురును పోలుట వలన చంద్రుడు శివుని తల పూవయ్యెనుగాన మేము గూడ నీమెచేతులలో బడిన శివుని తల కెక్కగలమని తలచి మొగిలిరేకు లామెచేతి గోళ్లయ్యెననెను.

యయాతి ఆమెనిటుల నోరార వర్ణించుచుండనటకు దేవయాని చనుదెంచెను. న్యాయమున కీకావ్యమున నామెయే ప్రధాన నాయిక గాబట్టి ఆమె యంగ సౌందర్యమే వర్ణింప బడవలె.

ఈ కావ్యమున నిద్దరు నాయికలు గలరు. ఆ యిద్దరి యంగాగ వర్ణనము

వివాహాలంకారములు చెప్పిన యెడల కథ యందు పునరుక్తి పెరుగును అంతేకాక శర్మిష్ఠది గాంధర్వ వివాహము. గాన నామెను పీటలపై కూర్చుండబెట్టి వివాహాలంకారము జేయు నవకాశముండదు. తెలగన దీనిని బాగుగా యోచించి శర్మిష్ఠకు అంగాంగ సౌందర్య దేవయాని వివాహాలంకారము చెప్పనిర్ణయించు కొని యుండవచ్చును. అందువలన - యయాతి ఆమెను నూతి నుండి దీసినపుడేగాదిగ జూచినను సౌందర్యమును గురించి పల్లెత్తుమాట పలికించలేదు. యాలోపమిపుడు కొంత దీర్చదలచి -

బలుమించు, తలమించు, నలిమించు సిరిబోల్చు మేచాయ విరుల సంపెగల జేయు (4-53) అని అనుప్రాసతో గూడిన ఆమె శరీరమొక సీసమున వర్ణించెను. ఆమె బ్రహ్మలోకమున గల సౌందర్యములన్ని దలిచి కరగించి వెన్నెల కరువున బోసి తీర్చినట్లుండెనట.

నిక్కమైన మంచినీలమొక్కటి చాలు. తళుకు బెళుకురాలు తట్టెడేల - అన్నట్లామె గాత్ర సౌందర్యమున కీయొక్క పద్యమెచాలును.

ఇతనికీయక మదిలోన నెంచనన్ను - నొరలకొసగ దలంచిన నొకటి వినుము
తగనిపనియన కెన్ని చందములనైన - నొడలు దొరగుదునిపుడె నీయుడుగులాన్ - 4-71

యనెను. ఈ సంప్రదాయము మన యాడు పడుచులకు దమయంతి నాటిక నుండి యున్నదే (శృంగారనై 4-70) అపుడు శుక్రుడు దానికి సమ్మతించి వారిని పురమునకు దోడ్కొని వెళ్లగా వృష పర్వుడెదురుగా వచ్చి కానుకలిచ్చి యయాతిని గొనివెళ్ళి తనమందిరమున విడిది చేయించెను.

ఈ కావ్యమున వివాహఘట్టము సవిస్తరముగా చెప్పబడినది. దీనికంటె మొదటి కావ్యములందు వివాహఘట్టములున్నను వానినెవరింత విస్తరముగా చెప్పలేదు.

తెలగన ఈ వివాహఘట్టమును పురాలంకారము నుండి ప్రారంభించెను. పురాలంకారము, వివాహ సందర్భమున వృషపర్వుని పట్టణము దేవయానితో యయాతి పురప్రవేశము చేసినపుడు ప్రతిష్టానము చేసినట్లు చెప్పి చంపకము, కందము, సీసము, కందము చంపకము సీసములందు వానిని వర్ణించి ఆరెండు పట్టణములు సమానముగా నలంకరింప బడినట్లు చూపెను.

పెండ్లికూతురును చేసినపుడు దేవయాని నలకరించిన విధమున- "తమ్ములు

చుక్కలు, తాబేళ్ల అన్నట్లుగా భూషణములు మట్టెలు పిల్లాండ్లు మరివీరమద్దియల్ అని పాదాదిగా గ్రహించి చక్కని యౌచిత్యమును కాపాడెను. అంతేకాక అనాటి యాభరణములన్ని ఒక చోట చూపెను. (4-90)

దేవతలను పాదాదిగా మావుల నుమస్తకాదిగా వర్ణింపవలెనని లాక్షణిక మతము. దేవయాని శుక్రుని కూతురు. శుక్రుడు దానవాచార్యుడు. దానవులు దేవయానులలోనే ఒక భేదము కనుక తెలగన నిచట ఈ వర్ణనమున నా సంప్రదాయ మునుగూడ దృష్టియందుంచుకొనెననవలెను.

అలంకారానంతరము ముకుర వీక్షణ మొక యాచారము కనుక నొక చెలి నిండుచందమామను పట్టుకొనివచ్చినటు నిలువుటద్దము దెచ్చెనట (4-91) మృగనేత్ర మొకతె సతికి జగిగల యద్దంబు- (5-48) అని ముకుర దర్శనముచెప్పెను. అద్దంకి గంగాధరుడు గూడ నిటులే చెప్పెను కనుక తెలగన తపతీ సంవరణమును జూచియుండును. నతని భావమును మెరుగుపెట్టెను.

ఈ వధూవరులలో దేవయాని శృంగారము రెండు సీసములు రెండు కందములలో యయాతి శృంగారము రెండు సీసములు మూడు కందములు ఒక వృత్తమున చెప్పబడెను. అలంకారానంతరము లగ్నమున కాలస్యము లేదని పురోహితుడెచ్చరించ యయాతి భద్రేభముపై పెండ్లి చవికె దగ్గరకు వచ్చెను. అపుడు కాళ్లుకడిగి ముత్తయిదువ లారతులిచ్చిరి శుక్రుడు కూతురును ధారవోసి అరణములు చదివించెను. పిదప తెరబట్టగా వధువును తెచ్చి నిలిపిరి. తెరయెత్తిన పిమ్మట యయాతి ఆమె మెడలో తాలి గట్టిగా చెలులు దేవయాని చేతులెత్తి వట్టి తలంబ్రాలు పోయించిరి.

మొదటి వారైన వరాహ పురాణకర్తలు గూడ నట్లే పోయించిరి కాని పెద్దన మరియు శ్రీకృష్ణదేవరాయలు చేతులెత్తిన యెడల నిక్కిన చనుగవపై వరుని దృష్టి పడునని సిగ్గున చిరునగవులతో మనోరమ, గోదాదేవితో వరులనెత్తిపైకి తలంబ్రాలు విలాసముగా చల్లించిరి. మరియొక విశేషమేమన వీరిద్దరు తలంబ్రాల పిమ్మటనే పుస్తెగట్టించిరి.

వివాహమున నాకబలిని ప్రోలును పెద్దవారులెవరు తడవలేదు. కాని మాదయగారి మల్లన దానిని సాంగముగా చెప్పెను. రంగాజమ్మ తన యుషా పరిణయమున ఉప్పెనుగు పప్పెనుగలను కూడ చెప్పెను. తెలగన నాకమలి ఘట్టమందు మల్లనగారిమార్గమున నడిచెను. నాకబలిపిమ్మట వరునికి కట్నములు చదివించెను.

తెలుగు వారిలో ఆడపిల్లకు పసుపు కుంకుమల మాన్యమిచ్చు యాచారము పూర్వము నుండి వచ్చుచున్నది. దీనిని వరాణ పురాణకర్తలు, మాదయగారి మల్లన చెప్పిరి. తెలగన గూడ ఈ యాచారమును చెప్పెను.

ఆడపిల్ల నత్తవారింటికి పంపునపుడు తల్లి బుద్ధులు చెప్పుట వియ్యపురాలికి కూతురు నప్పజెప్పునపుడు నాకూతురేమి ఎరుగని పసిబాల. తప్పులు కడుపులో పెట్టుకొని కావుమని ప్రార్థించుట పరిపాటి. ఇది కణ్వమహర్షినే కరగించిన ఘట్టము.

తెలగన ఈ సందర్భమున గూడ మాదయగారి మల్లననేయనుసరించెను

క॥ కులమును రూపము ప్రాయము, నిలవడియును గలుగునింటికీ గంటినిసుః
తొలినానోచిన నోములు, ఫలియించఁ జూవెవికచపంకజనేత్రరాజ -3-195

క: ఇలువడియు చెలువు కలిమియు, గలవానికి కన్నెనొసగగా గోరుదుర
ట్లిలు వడియు చెలువు కలిమియు, గలవానికి కన్నెనొసగ గాంచితి మింతీ - యయా
4 -126

క: ఏ తెరగున నీమగనిం బ్రీతుని జేసెదవో యెట్లు బెంపొందెదవో
నీ తెలివియు నీకడకయు,జాతముగా యింకనో విశుద్ధ చరిత్రా! రాజ- 3-196

క :చొచ్చిన యింటికి దగనిన్నిచ్చిన యింటికిని వన్నెయే చందమునః
దెచ్చెదవో చూచెదగా -నిచ్చలు మనవంగడంబు నిన్నః బొగడః-యయా-
4-132

క:మగడెవ్వరి తెగజూచుః మగడెవ్వరిబ్రోచునట్టి మాడ్కినసతికిః
దగునడవ దేవుడనగా - మగడనగా వేరుగలదే మదగజగమనా-3-200

తే:వినుము మగడేరినేనియు మనుపగోరు, నలుగునట్లనె చెలువయుదలపవలయు 4-133

ఇటుల కూతురికి బుద్ధులు చెప్పిన పిమ్మట శుక్రుడు వెంట వెళ్లి అల్లునకు కూతురనప్పగించి -

క: ఏదియునెరుగదు ప్రోదిః బోదున బెరిగినది పేద మొన్నటిదినుమీ
పైదలినేరముగల్గిన కాదని తెలుపుదువుగాని కడు నలుగకుమీ- 4-146

అని యప్పగించి మరలెను. ఈ ఘట్టమున తెలగన కరుణమును చక్కగా రూపు కట్టించెను. అనంతరము యయాతి పురప్రవేశము చేయుగా పౌరులు వాద్యములతో నెదురు వచ్చి తోడ్కొని వెళ్లిరి.

ఇక్కడ ప్రతిష్ఠానమును తెలగన ॥సీ॥ యెడలేకయుండంగ నిడిన తోరణములు పెల్లుపైబడెడు కరళ్లుగాగ (4-154) అనివేరొందు పాలకడలి వలె పోల్చిన తీరద్భుతముగా నుండును. ప్రభువుల పురప్రవేశమున పౌర కాంతలు మేడలెక్కి చూచుటపరిపాటి. ఈ దృశ్యమును తిమ్మన స్వరముకు శ్రీకృష్ణుడు వెళ్లినపుడు (ఆ.3-11-21) పెన్నెండు పద్యములలో పెద్దన స్వరోచి పెండ్లి కుమారుడైనపుడు (ఆ-5-60 నుండి 70) పదకొండు పద పద్యములలో వర్ణించిరి కాని తెలగన దానిని-

చూడగనేగు దెంచి కడుచుక్కల తోడుత రాయుముత్తెపుల్ మేడలమీదకెక్కి (4-157) అని ఒక్క పద్యములోనే సరిపెట్టెను. ఇందులకు కారణము ఆనాటికి స్త్రీలకు పరదా పద్ధతి వచ్చి వారిస్వాతంత్ర్యము బందీయై యుండుటేనని తలపవలెను. యయాతి పుర ప్రవేశ సందర్భమున ॥సీ॥ వేలుపు పూబోండ్ల గేలిసేయు నొయారి చెలువలు తగవీర మలహరియును (4-159) అని ఆనాటి వాద్యములు తెలగన కొన్ని తెలిపెను.

వస్తుసముదాయమును తెలుపు విషయమున తెలగన మిక్కిలి శ్రద్ధవహించి తనకావ్యము నొక చిన్న సర్వస్వముగా తీర్చెను.

పంచమాశ్వాసము

ఇందు దేవయాని యయాతి మహారాజుల సంభోగ శృంగారము, దేవయానికి పుత్రులు కలుగుట, యయాతి ప్రమద వనమున కేగి శర్మిష్ఠనుగాంచుట వారి విరాళి గాంధర్వవివాహము యయాతి శర్మిష్ఠ నంతఃపురమునకు గొని వచ్చుట యను విషయములున్నవి. దీనియందుగూడ కథా భాగము తక్కువ. వర్ణనాంశమెక్కువ అంతే గాక నాటకీయతగూడ చోటుచేసికొనినది. చివరకు ఫలశృతియున్నది.

చెలికత్తెలు దేవయానిని తలిమ మెక్కించ తలచుటలో నీయాశ్వాస మారంభమగును. ఈ కావ్యము మొత్తమున తెలగన దేవయానిని రెండే రెండు పద్యములలో చెప్పెను. మొదటిది యయాతి శర్మిష్ఠను చూచిన సందర్భమున గలదు (4-53) రెండవదీ క్రిందిది.

సీ॥నలచి వైచిన జాలు నలరుక ప్రవుదావి పొలుపొందు నెమ్మేన బుగులు కొనగ (5-3)

తెలగన దీనిలో గూడ దేవయానిని మొదటివలెనే రూపు కట్టించెను.

ఆంధ్ర ప్రబంధ నాయికలందరు చిత్రలేఖ నాకుశలలు కాన దేవయాని యొకపటమున తనయొక్క యయాతి యొక్క నిలువెత్తు ప్రతిమలు వ్రాసికొనెను. ఆమె వానిని చూచుండెనేమో ఒక చెలివచ్చి-

సీ॥బంగారు కుండల పగటునీ గబ్బిగుబ్బల మీదికొకమేలు కలుగు నేడు - తాళుకో

ప్రొద్దు గ్రుంకిన దాక (5-4) అనెను.

అది విని యామెచెలికత్తెను కన్నులలో జంకించి ఏమేమో గొణుగుచుండ మరొకతె యామెతో నీవు వ్రాసికొనిన మీప్రతిమలను చూచి ఎరగనిది ఏదేదో యనగా దానిపై యింత కోపమా!

తే. మగువ యెప్పుడు సిగ్గన మగనిజాడ నట్టిగోలవు నివ్వనదగు నెయ్యైన.

విదియనాడేరు పడకున్న తదియనాడు - కానబడియెడు పనికింత కనలనేల 5-6 అని సదిరి చెప్పెను. నవదంపతులను తలిమ మెక్కించుటకు ప్రొద్దుగ్రుంకవలెను. అదింత వరకే జాబాలి చెప్పిన రామాయణమున (2-68, 69, 70) వచ్చినది. అక్కడ దానిని తెలగన మూడుకందములు ఒక సీసమున వర్ణించెను. (అపుడది కూడ నక్కడ చకోర దంపతులు తలిమము లెక్కు సంధర్భమే) కాన దాని నిక్కడ ఒక పద్యమున మాత్రమే

క్రుంకుమలపై నెరసంజ దావాగ్ని వలె వ్యాపించగా నాసెగకు తాళలేక సూర్యుడు పశ్చిమ సముద్రమున గ్రుంకనేగెనని (5-8) తెలిపెను.

రాత్రిపడిన పిమ్మట చెలులామెను నెత్తమాడుదము రమ్మని మేడపైకిగొనివెళ్లిరి. తెలగన యిక్కడ -

॥సీ॥పలుకుల తేనియల్లులు కకొక్కోకంబు చెలగి రాజేయు రాచిలుక గములు(5-11)

చ॥ బొగడలసాన రాచిలుక పుత్తడి పావలు తావి దూపపుం, బొగలు - (5-12)

అని రెండు పద్యములలో నానాటి కేళీమందిరముల వైభవమును తెలిపెను. యువతులు గాంధర్వమున ప్రియులను కలిసికొనుటవేరు. సంసారమున సఖులు కన్యను పడక గదికి పంపుట వేరు. మేడపైకిగొని వెళ్లగనే యాసన్నివేశము నర్థము చేసికొని దేవయాని అప్పటికి కొంత బెట్టు చేసెను.

చ॥ నడుము వడంకసిబ్బితి గనంబడ విప్పగుఁగొప్పకప్పుక్రొ
మ్ముడి విడిజార నందియల మ్రోతకు తోడుగ దమ్మికెంపుపెం
దొడవులు మ్రోవ బయ్యెద చనుంగవ చక్కి యొకింత చూపగా
వడి మగుఁడంగ నేను చెలువంగని వ్వచు నింతులింపునన్- 5-14

క॥ ననబోడి యోర్తు కూడం, జనికేలు తెమల్చి వట్టి చనునే నీకున్
పెనిమిటిని జూచి క్రమ్మర. బెనగకచనుదెమ్మటంచు పేర్కొని తిగువన్ 5-15

తే. తెలవ యొకొమ్మ కేలు విదిర్చివైచి కేలగంబంబువట్టి జంకించిపెనగ
వెలది మమ్మేల వెట్టి నవ్వింపనీకు - బయటికెత్తిన దివ్వెనీదయినడక-5-16

క॥ తక్కిన కన్నెల వలె నీ- విక్కడ బూటకము నేయ నేటికి నీకున్
మ్రొక్కెదనీకును బెనగకునా. యక్కవుగ రమ్మటంచు (నడుగులబడియెన్) 5-17

అని తెలగన యీ ఈసందర్భమున చెప్పిన పద్యములు నవోఢల మనస్తత్త్వములకు చక్కని మణి దర్పణములు

తరువాత చెలులెట్లో నామెను పతికడకు జేర్చిరి. అపుడొకచెలికత్తె

క॥ మును పెంత కూర్మిగలిగిన,ననబోడికినిట్టి యెడల నానయె తగుగా
వున మగువ తడవునడిపెన్ కనుగొనుడీ మీరలొండుగా దలపకుడీ -(5-20)
అని సర్ది చెప్పెను. పిమ్మట చిలుకకు చదువు రాజెప్ప లేదాయె
గా యనుచు వేగిరపడి చని చనియెనొకతె- (5-22)

యిటుల మెల్లమెల్లగా నొక్కొక్కరు జారుకొనిరి. ఈ సందర్భమున చివరన జారుకొను వారికి మాత్రము మాటనేర్పు చాలకున్న గండమే. మొదటి యామె యింకనీవె మెనువాటేసుకోవయ్యా! యని కన్నులతో చెప్పుచు వెళ్లగా నీ చివరి యామె మరియొకామెను. అది విడియ మింకను తీసుకురాక పోయెనే అని తిట్టుచు బయటకి వచ్చెనట. తెలగన తెలుగు లలనలనాడిని బాగుగావట్టి చూచిన వాడు.

వారు వెళ్లిన పిమ్మట యయాతి దేవయానితో

క॥ ననునెరుగని గోలవు బలె ననయము నట్లనగి పెనగియుల సితివిగదా! (5-24)

అని యనునయించుచు నామెను మెల్లగా కౌగిలిలోనికి తీసికొనెను.

విజయనగర కాలము శృంగారయుగము. ఆనాటి సంసారులు శృంగార జీవితము నిండుగాననుభవించిరి. శ్రీకృష్ణదేవరాయలు

మలయపుగాలి రేలు వనమాలి విమాన పతాక ఘల్లుమం
చులియ పసిండి మువ్వగమి నొక్కొక మాటుగ దల్ప నుల్కిమి
న్నలము తదీయ హేమవరణాంచల చంపక శాఖలందులు
ఖులు రొదసేయ వేగెనని కూడదు రల్కలు దేరి దంపతుల్ (అముక్త 1-74)

అని ఆయన యువదంపతుల యొక్క వేకువ జాము కేళిని జెప్పెను. ఈ కావ్యమున తెలగనగూడ -

తెలతెలవారినన్ దొరల దేవర తామరకంటి వాతెరన్
పలుమొనలొత్తి మేల్కొలుప పైదలిగేస్తుని మోము చెక్కుచే
నలుముచు చేత దువ్వలువ నంతమొలన్ సవరించి లేచితా
నలయక వీడెమిచ్చె నతడప్పటి కప్పని పై తలంపిడన్ (5-28)

అని రాయలు చెప్పిన దానిని సూచించెను.

ఉదయ సంధ్య యందు కవులు శుక్రోదయము కృకవాక కూజితములు చెప్పుచుందురు. తెలగన వానినేవి వర్ణించ లేదుగాని అస్తగిరి శిఖరాపైగల చంద్రుడు ఉదయగిరి శిఖర మెక్కిన సూర్యుడు విష్ణువు భార్యయైన భూదేవి కీయగా నామె రెండు చేతులలో ధరించి శంఖచక్రముల వలె నుండెనని చెప్పెను. ఇదియొక అపూర్వమైన యుపమ.

తెలవారిన పిమ్మట దేవయాని నఖక్షత దంత క్షతములలో నిదుర మంపున మగని దుప్పటి తారుమారుగా గప్పుకొని గది నుండి వెలుపలికి వచ్చెను.

కన్యతొలినాటి రాత్రి గదివీడి బయటికి రాగానే మన వారికి వెంటనే వెళ్లి ఆమెను చూచుటలవాటు కనుక చెలులు వచ్చిచూచి.

తే: రహిని వలపులరాయని రాచలచ్చి - కరణినొక వింతయగు సోయగమున మెరయు
నిన్నుగనుగొన గలిగెను కన్నులార - కోర్కులెల్లను మాకు చేకూరెనేడు (5-33)

అని పలుకరించిరి. ఆమె వారిని కనులతో జంకించెను. అపుడొకతె

సీ॥ అదలించితివి కొమ్మనదియే మెఱుంగు బయ్యెద జారనీకువేయిగురు బోడి...
కనలనేటికి వీడ్వడ గప్పుకున్న. మగని దుప్పటి యిచ్చిరామగుడనని (5-34)

యనామెనుహితోక్తులతో నాటపట్టించిరి. ఆమె సిగ్గున గదిలోపలి కేగి గడియ బిగించుకొనెనట.

హాస్యము శృంగార జన్యమే కనుక దాని నంగముగా జేసి తెలగన నిచట జనక రసమును పోషించిన తీరు మనోహరము.

దినములు గడుచుచుండగా దేవయాని గర్భముధరించెను. దానిని తెలగన రెండు పద్యములందు మాత్రమే చెప్పెను. ఆమె కిరువురు కుమారులు కలిగిరి.

అపుడొకనాడు వనపాలిక వచ్చి చెంగలువలు కానుకగానిచ్చి మనతోటలో వృక్షములన్ని పూచినవి. చూచుటకు రమ్మని పిలిచెను.

ఉద్యాన వర్ణన మీ కావ్యమున ద్వితీయ, చతుర్థ, పంచమాశ్వాసములందున్నది. అందు రెండవ దానిలో రెండు పద్యములు నాలుగవ దానిలో పన్నెండు పద్యములు ఒక రగడ, ఐదవ దానిలో పది పద్యములున్నవి.

ఉద్యాన వర్ణనమున నికుంజములు, మార్గములు, తేనెవానలు, పుప్పొడి తిన్నెలు, పూచిన వృక్షములు, వృక్షదోహదములు, వనవిహారము, పుష్పాపచయము, డోలాక్రీడ, మయూర రాజహంసాది పక్షులతో నాట, చలువ చప్పరములు, మన్మథ పూజ, మధుపానము, కృతకాద్రులు, కేళీ సరస్సు వర్ణింప బడవలెను.

తెలగన ద్వితీయాశ్వాసమున నికుంజవిహారము, చతుర్థమున వనవిహారముతో పాటు, వృక్ష దోహదములు, పుష్పాపచయము మధుపానము, డోలాక్రీడ, అంచబోడలతో చిలుకలతోనాట, రతీ మదనుల వివాహము చెప్పెను.

ఈ యాశ్వాసమున యయాతివెంట వచ్చిన వారు పుష్పాపచయము చేయగా వనపాలిక యయాతి మహారాజుకు విరబూచిన పొన్నలు, మామిడులు, దాదినిమ్మలు, పనసలు, పాదిరులు, పొగడలు, సంపెంగలు ఒక్కొక దానిని వర్ణించి చూపు చురాగా నొక పొదరింట శర్మిష్ఠ విశ్రమించు చుండి రెండవ మరునివలె వచ్చు యయాతిని చూచి యితడు మగడగుటకు దేవయాని ఏమినోము నోచెనో యనుకొనుచు లేచి ఎదురుగా వచ్చి తన చేతనున్న కెందమ్మిని కానుకగా నిచ్చి సాష్టాంగ నమస్కరించి -

క॥ వినునన్నేలిన నెలతకు, పెనిమిటి వైనపుడె నాకు పెనిమిటి వగుదె
ట్లన నాలు కొడుకు వరవుడు, నను నవి పాయనివి చదువులందున వినవే
-(5-66)

క. అదిగాన దేవయానిఁ, మదిగైకొని నట్లనన్ను మన్నన మీరఁ
కొదలేక యుండనేలుము, వదలక వలరేని బారివడి బడకుండఁ 5-67

అని ప్రార్థించెను.

దేవయాని బావినుండి చేయిసట్టి పైకి తీసినంత మాత్రముననే నీవు నన్ను వివాహమాడి నట్లే యని సమర్థింపనీమె యామెకంటె రెండాకు లెక్కువేచదివి మా యజమానురాలికి పెనిమిటివైనపుడే నాకు పెనిమిటివని పెండ్లి యాడకుండగనే పెనిమిటిని చేసికొనెను.

యయాతి ఆమె మాటలు విని శుక్రుడు నిన్నప్పగించునాడు శయ్యను పరిహరించుమని చెప్పెనుగాన నామాట మీరిన యతనికి కోపము వచ్చునని తన మనసామెపై తగిలినను బలవంతముగా మరలించుకొని తననగరుకు వెళ్లెను.

మహారాజు వెళ్లిన పిమ్మట శర్మిష్ఠ విరాళికి లోనై -

సీ॥ తావులు నిండియే తావులు నాడంగ - పొదలి యిమ్మాకులు పూయనేల
కోరివేంచేసె బోలోని గుట్టువిడిచి, మించు కూరిమినేనెపై కొంచువేడ
కొసరి డాసిన రేడియ్యు కొనకచనగ -వలపు బలి యుంచుకొని యిట్లు కలగనేల
5-71

అనిచింతకు లోనయ్యెను. తెలగన ఈ పద్యమును నిర్వహించిన తీరు వసుచరిత్ర యందలి -

సీ॥ సోయగంబున వీణ వాయింప మాయంపు జటిలు డచ్చటికి నేమిటికివచ్చె (3-116)

అను పద్యమును తలపించును.

చెలులపుడు శర్మిష్ఠ చింతను చూచి శశిరోపచారములకు పూని యొక యుపచార గృహము నిర్మించి యామెనందు పరుండబెట్టి శశిరోపచారములు ప్రారంభించిరి -

తెలగన నాటికి ప్రబంధమున యితివృత్తమునకొక నిర్దిష్టమైన లక్షణమేర్పడి అందేవి వర్ణింపబడవలెనో ఏ సందర్భము నేచందముపయోగింపలెనో గూడ ఒక స్థిరమార్గమేర్పడెను. ప్రబంధములందు రగడను సాధారణముగా పుష్పావచయమునందే వాడిరి. కాని తెలగన దీనియందు శశిరోపచారమునకు కూడ దానిని వాడెను. నిజమునకు శశిరోపచారము గూడ నొక రగడయే. యిది తెలగన యొక్క క్రొత్తపోకడ.

శశిరోప చారవములు చేసి చెలులామె తాపమును చూడజాలక వలరాయుని కలువలరాయుని నుపాలంభించ నారంభించిరి. యికనక్కడ తన మేడ యందు యయాతి -

సీ॥ఆకొమ్మ వేనలి యడుగు దమ్ములునొనల్ చిరుబొదల్ బొమలును మెరుగుదొడలు-

దగిలిమదిలోన నిలిచి యెంతయు గలంప (5-90) వలకాకతో ప్రొద్దుపుచ్చసాగెను. ముఖము హృదయమునకు దర్పణము గాన మనసులో నున్నది మొగముపై కనిపించును. స్త్రీలు గర్భము ధరించినపుడు కడుపులోని శిశువు లక్షణము లా తల్లిపై కనిపించు చున్నట్లు లేదా అతడు జనించిన పిమ్మట చేయబోవు కార్యము లామె చేయగోరినట్లు వర్ణించుట కవుల సంప్రదాయము. గాన తెలగన హృదయమున శర్మిష్ఠగ యయాతిని-

సీ॥ అలమి నెమ్మది నున్న యతివలే నవ్వుచే.
బలెనొడలెల్ల వెల్వెలుక బారె (5-92)అని వర్ణించెను.

అపుడతని విరహవేదనగని చెలులు శైత్యోపచారములు బూని శృంగారవనమున నొక శశిర భవనము నిర్మించి యతని నందు జేర్చిరి.

తెలగన ఈ కావ్యమున యానాటి నిర్మాణములను కొన్నిటిని చెప్పెను.

1. కొలువునుప్పరిగెలోలి చలువరా చప్పరము - యిది యయాతి మహారాజా సభాస్థానము

2. గిరివెంద పందిరి క్రింది నిర్మించిన చలువరాల తిన్నె - ఇది రతీ మదనుల కొరకై నిర్మించిన వివాహవేదిక.

3. ముత్యాల చవికె - వివాహమునకు వచ్చిన యయాతి మహారాజా విడిది.

4. పసిడి యుప్పరిగె – యయాతి మహారాజు శయ్యామందిరము.

5. కర్పూరపు పలుకుల మేడ– శర్మిష్ఠ శిశిరోపచారములకు చెలులేర్పరచిన కట్టడము.

6. కలువ రేకుల మిద్దె– యయాతి శిశిరోపచారములకు సఖులేర్పరచిన కట్టడము.

ఈ నిర్మాణము నందలి మణి మయాదులను నతిశయోక్తులను పరిహరించిన యెడల నా కాలము వారే నిర్మాణము లెందులకు వాడుచుండిరో తెలియును. యయాతి నాటి వారు -

సీ॥ గంధంపు పొడివైచి గట్టించి యుందు పై. నెల రాలగట్టిన నెలపుటింటి
కల్వ రేకుల మిద్దె గావించి చుసచుట్టు కురువేరు దడిగట్టి విరులతేనె
బూసి ముత్యాల కీల్బొమ్మలు లేదుడు చిమ్మన గ్రోవుల జిమ్మనెగయు
పన్నీట బొబ్బిల్లు పచ్చకప్రపు దీవె మీద పుప్పొడి రవ పాదుకొల్పి
గడిత పడినట్టి వెన్నెల కళుకులమర మెరయు వడగండ్ల బొమ్మల మేటివగలు
చూచియుబలెగర గగబొగురు తలిరులందు మీదట దెచ్చియుయూలునునిచి

(5-98)

ఈపద్యమందలి కురువేరు దడులు, చిమ్మిన గోవుల కీలుబొమ్మలు పుప్పొడి రవ, కలువ రేకులు ఆనాటి వారు వేసవిలందు శవిర గృహాలకు పయోగించె సామగ్రియే యనవలెను.

వారటుల శశిరోప చారములు చేయుచుండగా ప్రొద్దుగ్రుంకెను. సమర్ధులైన కవులు తాముచేయు ప్రకృతి వర్ణనలను కథా సందర్భమునకు ముడిపెట్టుచుందురు పెద్దన–

తరణి ననన్య కాంత నతిదారుణ పుష్పశిలి ముఖ వ్యథా
భరవివ శాంగినంగ భవుబరికి నగ్గము జేసి క్రూరుడై
యరిగె మహీసు రాధముడ హాలకృతి తోనని రోషభీషణ
స్ఫురణ వహించె నోయుననభోమణి దాల్చె కషాయ ధీధితిన్ -

అని చెప్పెను. యిక్కడ తెలగన యటులె -

ఆనం బెట్టిమరుండు నొంప బగతో నన్నేల తేడిమ్మెయిన్
గాసింబొందగ జూడ లేకరుగు వీకన్ బ్రొద్దువేగ్రుంకినన్ (5-109)

అని చెప్పెను. అటుల ప్రొద్దుగ్రుంకి వెన్నెల గాయగా మన్మదు డిద్దరిని కుడి యెడమల వేయుచు కోయని యార్చెను. (5-111)

చెలులది చూసి శశిరోపచారములు చేసిచేసి యలసి యొకింతకనుమూసిరి. అపుడు షర్మిష్ఠ తన శశిర మందిరము నుండి లేచి యొక పొదరిల్లు చేరవచ్చి యయాతిని వెదకసాగెను. అపుడిక్కడ యయాతికి గూడ చెలులు శశిరోపచారములు చేసి యలసి యుంచుక కనుమూయుగా నతనికి మునసులోని శర్మిష్ఠ ఎదుట నిల్చినట్లె యామెను వెదకుచు వచ్చి యొక పొదరింటి దగ్గర తనవలనే వచ్చి యున్న శర్మిష్ఠను చూచెను. మదనుడు విజృంభించి ప్రేరేపించు చుండగా నా యిద్దరు అంతవరకే తమరాక యెరిగి వాయుదేవుడు పానుపు పరిచినట్లు రాల్చియున్న పూవులుగల యొక యరుగుపై బిగ్గరగా కౌగలించుకొని మరుపనులు దీర్చుకొనసాగిరి.

క॥ ఈ చందము నందగవల,
రాచపనుల్ దీర్చుకొనుచు రహిమీరంగా
నా చెల్వయు రాజును మది
నీ చెయ్వులు నిక్కమనుచు నెరిగిరి తమలోఁ (5-131)

శర్మిష్ఠ యయాతి పూర్తిగా మదన పరవశము నుండి తేరుకొనక మొదలే యతని ముఖమును చీర సవరించుకొనుచు తనయక్కున జేర్చుకొనుచు నవ్వుచు నానందమున తేలించసాగెను.

ఈ కావ్యమున దానవ మానవ గాంధర్వములను మూడు విధముల శృంగారములు వర్ణింపబడినవి. మొదటిది మీరు రావణుడు రంభను పరచిన చేతలతో చూచితిరి. యిక రెండవది యయాతి కేళీమందిరములోనిది. అక్కడ నతనిదే మొదటి పాత్ర. ననునెరుగనిగోలవు బలె, ననయుంబును నిట్లు పెనగియల సితివి గదా! యని యతడే యామెను బుజ్జగించుచు మెలపుకోవలసి వచ్చెను. ఇక్కడ నిక యట్లుగాదు.

ఎన్నిభవంబులంగులుగ నిక్షు శరాసనసాయ కవ్యథా
ఖిన్నతవాడి వత్తలయి కేలకపోలము లూది చూపులఁ
విన్నదనంబు దోప కనువేదురునఁ పయిగాయి సోకినఁ
వెన్నవలెంగరంగు నలివేణుల కౌగిట జేర్చు భాగ్యముల్ (మను 2-57)

అని వరూధిని వచనము కనుక నిక్కడ శర్మిష్ఠ యాస్థితియందున్న యువతి. వారిద్దరిక్కడ కాలమెరుగకుండ నుండగా నక్కడ చెలులు మేలు కాంచి అయ్యో శర్మిష్ఠ లేదేయని యామె చెలులు, మహారాజులేడేయని యతని సఖులు వెదుకుచు బయలుదేరి యొకచోట దేవయాని శర్మిష్ఠల చెలులు కలిసిరి. అప్పటి కింకను పూర్తిగా తెలవారలేదు. కాబోలు శర్మిష్ఠదాసి యయాతి మనిషినిచూసి ఆమెయే యనుకొని ఏమమ్మా! ఈ వెన్నెలలో

నడుగులు పొక్కుచుండగా నొంటరిగా నిట్లు రాదగునా! నిన్ను చెంపవాయించుటకు చిన్నపిల్లవు కావుగదా!

క॥ ఒక్కతెవు నిటులవత్తువె - యక్కట రేయెండలో ననడుగుందమ్ముల్
బొక్కగ చిరుత వెనిన్నుఁ జెక్కిలిగొట్టంగనేమి నేయుదు తల్లీ -(5-137)
క॥ మింటిసికవేల్పు మిక్కిలి, కంటిసెకఁ నొచ్చి పుట్టు గానక సోకుఁ
వెంటబడి మరుడు వాలుం, గంటీ రాదగునే యెంత గండముగడచెఁ- (5-138)

అనగా నామె యమ్మా! నేను నీవు వెదకు శర్మిష్ఠనుగాను. మామహారాజా మీశర్మిష్ఠవలెనే శశిర గృహము నుండి వెడలి యెక్కడికో వెళ్లెను. వారినీ పొదలో వెదుకుదమా! యనుచుండ నందుండి శర్మిష్ఠ లేచి వచ్చెను. అపుడామెను చూచి చిలికత్తె ఏమమ్మా మమ్ముల నిదరపుచ్చి యిక్కడికి వచ్చి ఈ రాజుతో కలిసితివి. పగవానితో మెప్పుగొనుటేగదా మగువ నేర్పదగా నామెలేని కోపము నటించుచు చెలికత్తెను కన్నులతో జంకించెను. అది చూచి యయాతి దాసి తల్లీ! నీమొగముతో పోలినాడని పగబట్టి తొగలరాకొమరుని కొండలపైనిలిపితివి. నీతో మేమేమి మాటాడగలము.

క॥ మొగముం బోలిన యంతనె పగగొండల మీదచాల పదిలంబుగనీ
తొగరాకొమరుని నునిచితి, మగువానిను చెనక దరమెమాబోటులకుఁ
- (5-145)

అనెను. అపుడామె తలవంచి చూచుకొని పయ్యెద తొలగి చనుగొండలపైనఖము క్షతములు కనిపించు చున్నందులకు సిగ్గుపడి మేఘములోనికి వెళ్లినమెరుపు తీగవలె తుర్రున పొదరిల్లు దూరి మరల మహారాజుతో వెనగి యతని బుగ్గలపై చిటుకలు వేయుచుండ -

క:తలపులు సమకూరెంగద-వెలితేమియులేకనింక వేంచేయందగుఁ
తెలతెల వాఱెనటంచును, నెలతుకలు-(5-148) సుప్రభాతము పాడిరి-
అదివిని చెదరిన ముంగురుల్ నగవు చిందెడు మోములు చిట్లుగందముల్
పెదవులకెంపులుఁ నుదట బేరినకప్రము సొల్పు జూపులుఁ
నిదురలులేమి కన్గొనల నిండిన జాజులెలర్పు చుండగా
పొదరిలు వెళ్లి వచ్చె వలపుల్ దగ నింతియు రాచవేల్పుతోఁ (5-149)

అపుడుదయగిరిపై సూర్యుడు మహారాజా మదనుడు చేయుకొరతను బడకుండ ప్రకాశించెనని చూడవచ్చినట్లు దయించెను. సూర్యోదయము ద్వితీయాశ్వాసమున నింతవరకు (2-104,05) రెండు పద్యములలో వర్ణింపబడినది.

సీ॥అరయువెన్నుడె దేవరని వేల్పుగమిచాటగా నెత్తుపైడి జేగంట యునగ(2-105)

అనిసాగిన ఈ సీసము కవిగారిమతమును దెలుపునేగాని కథను దెలుపదు. యిక్కడటులగాక తెలగన - వలపులిరేడు సేయు కొదవంబడ కెంతయు రాజు మీరలో నలరుచు జూడవచ్చెనన నంతట పుట్టుపుగట్టు మీదటన్. తెలివి దలిర్ప తామరల దేవర దోచిన -(5-151) కథా సందర్భమునకు ముడి వెట్టి వర్ణించెను. అపుడు మహారాజు శర్మిష్ఠతో దిడ్డిత్రోవను నగరున ప్రదేశించెను. పిమ్మట వారు -

క॥ ఇదిరేయిది పగలనుచున్ , మదినెరుగక చాల బొదలు మరు పోదుములన్
సదమదమంగుచుండిరియం, మ్ముదితయు రాపేడు కూర్మిముంచుకొనంగన్
(5-152)

యయాతి మహారాజామె యందు ద్రుహ్యుడు, అనువు, పూరువు అనుమగ్గురు కొడుకులను గాంచెను. యయాతి కుమారులు సేవించుచుండగా సంతోషమున రాజ్యమును పాలించెను. ఇది తెలగన చెప్పిన కథ.

కావ్యంయశసేఅర్థకృతే వ్యవహార విధే, శివేత రక్షయే కాంతానమ్మిత తయెూప దేశముజే-

అని చింతామణి కారుడు చెప్పెను. కావ్య పఠనము వలన యశస్సు కలుగును. వస్తు పరిజ్ఞానమున వ్యవహార పరిజ్ఞానము కలుగును, అశుభములు నశించును. అని లాక్షణికుల మతము, దీనిననుసరించి మహా కవులు తమ కావ్యాంతములందు ఫలశ్రుతులు నిబంధించిరి. కలిదోషనివారకమని శ్రీనాథుడు హర్షనైషధమునాందీకరింప పెద్దన స్వారోచిషమను సంభవమును రచించెను. పింగళి సూరన ఫలశ్రుతి పైననే తన కళాపూర్ణ సౌధమును నిర్మించెను. ఆమర్యాదననుసరించి తెలగన - ఈక మర్మిలి నెవ్వారు జదివిన - విన్నను వ్రాసిన నెన్నదగిన విడిముడిచే బొంగి వెండియుపైడియు, ద్రవ్యితండము కాగ దవిలిమెఱసి కొడుకులు కోడండ్రు, కూతుల్లు, మనుమలు, మనుమరాండ్రును మేలి మగువపిండు పాడియు పంటయు పల్లకీ లేనుగుల్ సాలల గుర్రముల్ సాలగలిగి ప్రొద్దుక ల్వల రేడును పుడమి మిన్ను బలెను తిరమైన యునికిచే బెలగియాగి పెంపురేల్పులరాయని సొంపునొనర మనుచు నందురు తనరునేమములు నెపుడు (5-156).

అని పాఠకులకు శుభము సాకాంక్షించెను.

ఆంధ్ర కావ్యములందు కన్పట్టు వివిధ వర్ణనాంశములు

క్ర.స	పేరు	1	2	3	4	
1	స్వర్గము	-	✓	-	-	
2	దేశము	-	-	-	-	
3	పర్వతము					
	మహావృక్షములు	✓	✓	✓	✓	
4	అరణ్యము	✓	-	-	-	వృక్షము
	క్రూరసత్వములు					
5	అడవిపల్లె	-	-	-	-	
6	ఆటవికులు	-	-	-	-	గ్రామము
7	ఆశ్రమము	✓	-	-	✓	
8	ఋషి	-	✓	-	-	
9	అధ్వరము	-	✓	-	-	
10	నది	✓	-	-	-	
11	సముద్రము	✓	✓	✓	✓	
12	పురము	✓	✓	✓	✓	
13	కోట	-	-	-	-	
14	అగడ్త	-	-	-	-	
15	సస్యములు	-	-	-	-	
16	శాలిపాలికలు	-	-	-	-	

17	వనములు	-	-	-	-
18	వనపాలికలు	-	-	-	-
19	వీధులు	-	-	-	-
20	భవనములు	-	-	-	-
21	నాలుగు జాతులు	-	-	-	-
22	వేశ్యలు	-	-	-	-
23	పుష్పలావికలు	-	-	-	-
24	చతురంగబలము	✓	-	-	-
25	ప్రభువు	-	-	✓	-
26	వాజారము	-	-	-	-
27	అంతఃపురము	-	-	-	-
28	పెంపుడపక్షులు	-	-	-	-
29	దానీలు	-	-	-	-
30	రాణి	-	-	-	-
31	పందెములు	-	-	✓	-
32	ప్రయాణము	✓	✓	✓	✓
33	రాయబారము	-	✓	✓	✓
34	యుద్ధము	✓	✓	✓	✓
35	విజయము	-	-	-	✓
36	వేట	-	✓	-	-
37	వేట జంతువులు	-	-	-	-

38	వేట సామగ్రి	-	-	-	-	
39	ఋతువులు	✓	✓	✓	✓	
40	ఉద్యానము	✓	✓	-	-	
41	కృతకాద్రి	-	-	-	-	
42	వనవిహారము	-	-	✓	✓	
43	పుష్పాపచయము	✓	-	-	-	
44	క్రీడలు-కళలు	-	-	-	-	
45	సరోవరము	-	-	-	-	
46	జలకేళి	-	-	-	-	
47	మన్మథపూజ	-	-	-	-	
48	ప్రదోషము	-	✓	-	-	రజని
49	అంధకారము	-	✓	-	-	
50	జారదంపతులు	-	-	-	-	
51	చోరులు	-	-	-	-	
52	చోరసామగ్రి	-	-	-	-	
53	తమోభసారికలు	-	-	-	-	నక్షత్రములు
54	చంద్రోదయము	-	-	-	-	
55	చంద్రిక	-	-	-	-	
56	చంద్రికావిహారము	-	-	-	-	
57	మధుపానము	✓	-	-	✓	

58	ఉజ్వలాభిసారికలు	-	-	-	-
59	అర్ధరాత్రి	-	-	-	-
60	ప్రత్యూషము	-		-	-
61	సూర్యోదయము	✓	✓	✓	✓
62	మధ్యాహ్నము	-	✓	-	-
63	గోధూళివేళ	-	-	-	-
64	కన్యాంగసౌంధర్యము	-	-	-	✓
65	విరహము	-	-	-	-
66	శశిరోపచారము	-	-	-	-
67	ఉపాలంభనము	-	-	-	-
68	స్వయంవరము	✓	-	-	-
69	వివాహము	✓	✓	✓	✓
70	కేళీగృహము	-	-	-	-
71	సురతము	-	-	-	-
72	దౌహృదము	-	-	-	✓
73	సుతోదయము	-	✓	✓	✓
74	విప్రలంభము	-	✓	✓	✓
75	పునర్మిలనము	-	-	-	-

సూచన: -

1. అలంకారశేఖరము

2. సాహిత్యదర్పణము - విశ్వనాధుడు

3. నరస భూపాలీయము - భట్టుమూర్తి

4. అప్పకవీయము - అప్పకవి

యయాతి చరిత్రమున తెలగన చేసిన వర్ణనలు

		ఆ	
1	పురము	1	75 - 90
2	ఋతువు	4	3 - 13
3	ప్రయాణము	4	151 - 165
4	శైలము	2	34 - 41
5	వేట	2	3 - 33
6	సాగరము	3	28 - 33
7	మున్యాశ్రమము	2	48 - 50
8	మంత్రము	2	113 - 115
9	రణము	3	37 - 38
10	విజయము	3	38
	వనవిహారము	3	54,53
11	వనవిహారము	4	14 - 26
12	వారికేళి	3	56 - 79
13	కన్యాంగ సౌందర్యము	4	33 - 51
14	చంద్రోదయము	2	78 - 84
15	విప్రలంభము	5	70 - 126
16	సూర్యోదయము	5	28 - 30
17	పరిణయము	4	84 - 143
18	సురతము	5	10 - 35
19	దౌహృదము	5	36 - 37
20	సుతజననము	5	39 - 41

అప్పకవి పేర్కొనిన వానియందు తెలగనకు ద్యూతము, మద్యపాన వికారములను రెండిటికి మాత్రము కథయందవకాశము కలుగలేదు. ఇంద్రలి పాత్రలు దానవ కాంతలే కనుక వనవిహార సందర్భమున మద్యపాన ప్రసక్తి తేవచ్చును. కాని కవి దృష్టి యటుమరల లేదు. కావున మద్యపాన వికారమునకు బదులు చకోర పక్షుల వెన్నెలవిందు 2 - 84 సరిపెట్టుకొన వచ్చునని శ్రీ నోరి నరసింహ శాస్త్రి గారి యభిప్రాయము. ఇక ద్యూతమునకు బదులు సరస్సులోని జల పక్షుల క్రీడలు 3 - 56 సరిపెట్టుకొన వచ్చును.

		1	2	3
1	నగరాలంకారము	-	✓	✓
2	వరుని పురప్రవేశము	✓	✓	✓
3	విడిది ఏర్పాటు	-	✓	✓
4	నలుగు పెట్టి వరునికి మంగళ -స్నానము చేయించుట	✓	✓	✓
5	అలంకరించుట	✓	✓	✓
6	వధువును మంగళ స్నానము -చేయించుట	✓	✓	✓
7	అలంకరించుట	✓	✓	✓
8	ముకురము నిలుపుట	-	✓	✓
9	వరుడు విహానముపై వివాహ వేదికకు వచ్చుట	✓	✓	✓
10	ముత్తైదువలు నీరాజనమిచ్చుట	-	✓	✓
11	వరునికి పీఠము పెట్టుట	✓	✓	-
12	కూర్చున్నపిమ్మట కాళ్ళుకడుగుట	-	✓	✓
13	మధుపర్క మిచ్చుట	✓	✓	-
14	అల్లునికిచ్చు అరణము	-	-	✓

15	పాటలు పాడుట- ధారవోయుట	✓	✓	-
16	వధూవరుల నడుమ తెర	✓	✓	✓
17	తెరతొలగించుట- పరస్పర వీక్షనము	✓	✓	-
18	మంగళ సూత్రధారణము	✓	✓	✓
19	తలంబ్రాలు	✓	✓	✓
20	బ్రహ్మముడులు	✓	✓	-
21	చేతులుపట్టించుట- అగ్నిప్రదక్షనము	✓	✓	-
22	లాజహోమము- ధృవదర్శనము	✓	✓	✓
23	సన్నెకల్లు త్రొక్కించుట	✓	-	-
24	ప్రాకెన	-	-	✓
25	నాకబలి- ప్రోలు	-	-	✓
26	శేషహోమము	-	-	✓
27	దంపతి తాంబూలము	-	-	✓
28	చదివింపులు	-	✓	-
29	వధువునకు పసుపుకుంకుమల- కట్నము	✓	-	✓
30	అప్పగింతలు	-	-	-
31	శోభనగృహప్రవేశము	✓	✓	-

తెలగన యొక్క పదప్రయోగములు

గూడు = గూళ్లు- గోరు = గోళం - చాలు = చాళ్లు-పాడి = పాళ్లు-బోడు = బోళ్లు -మడి = మళ్లు- లేడి =లేళం-సుడి = సుళ్లు- అంగడి = అంగళ్లు- ముంగిలి = ముంగిళ్లు

సూ : బహువచనశ్లిష్టంబులై యద్విరుక్తంబులయిన డకారలకారంబుల కలఘులకారంబు నిత్యంబు గానగు - బాల- ఆచ్చి - 14

విల్లు = విండ్లు

సూ :- ఔపవిభకితకంబులలివర్ణసలలు వర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణ బిందుపూర్వకడు వర్ణంబు బహుళంబుగానగు - ఆచ్చి - 16

చుట్టములు = చుట్టలు, మాడెములు = మాడెలు

సూ : బహువచనంబు పరంబగు నపుడా వు ప్రభృతుల తుదియక్షరంబునకు లోపంబు విభాషనగు ఆచ్చి - 22

చెలికారము -

సూ : మగటి మ్యాదులు యధా ప్రయోగంబుగ గ్రహ్యంబులు తద్ది 8

నిజమరి -ఒరపరి

సూ : అరివర్ణంబు మతు బర్ధంబున జాలాదులకగు తద్ది 17

సివంగి = సివ్వంగి, వజీర్లు = వజ్జీర్లు

సూ : అక్కటాదుల జడ్డకు లోపంబు విభాషనగు- ప్రకీ - 8

చిగుర్వెట్లు, పాల్కడలి, కార్పోతు, కార్మొగులు (తోడ+నీటుగ) తోడ్నీగటు

సూ :- పదాంతంబులయి యసంయుక్తంబులయిన సులురుల యత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు - ప్రకీ 16

ములికి = ముల్కి, బోరుకు = బోర్కు

సూ :- ఆచ్చికంబుల పదమధ్యంబుల నలడరలయయుత్వంబునకు లోపంబు బహుళంబుగానగు - ప్రకీ 17

మలక = మల్క

సూ :- లాతియచ్చునకు సహితమొకానొకచో నుడినడుమలోవంబుగా నం బడియెడి - ప్రకీ - 18

తెలగన శైలీసామాగ్రి

సాహిత్యమనగా రససహితమైనదని యర్థము. దాని యందు రసావిష్కరణకు జాతీయములు, భాషీయములు, నానుడులు, న్యాయములు, సూక్తులు, సామెతలు అనునవి తోడ్పడుచుండును. కావున వీనియన్నింటికి కలిపి శైలి సామాగ్రి యని వ్యవహారము.

స్వభావోక్తికి జాత్యలంకారమని మరియొక పేరు. కాన ఆయాజాతుల స్వభావములను తెలుపు కాకిబలగము, పాము పగవంటి పదబంధములకు జాతీయములని వాడుక. మానవులు తమ భావ వ్యక్తీకరణను ఒక్కొక్క భాష వారొక విధమైన పదముల నాశ్రయించి చేయుదురు అట్టివారికి భాషీయములని పేరు. యిక తెలగన యుపయోగించిన భాషీయాదులను కొన్నింటిని పరికింపుడు.

భాషీయములు

అర్థమరేయి, అడియాస, ఆటపట్టు, ఉసిగొల్పు, ఏడుగడ, ఒకపూటవెట్టు, ఒప్పులకుప్ప, ఒసివోవు, కట్టడచేయు, కన్నులు వాయు, కుప్పగూలు, కూకటి వ్రేళ్ల, కొండంత కోటికి పడగెత్తు, గాసివెట్టు, చెవుడువడు, చెవులు మూసికొను, జన్నెగట్టు, తంగెటి జున్ను, తోడునీడ, నల్లిండ్లు, నెత్తురుపొత్తు, పట్టుగొమ్మ, పదియార్వన్నెలపసిడి, పిన్నపెద్ద, పుట్టినిల్లు, పెడచేయి, బంగారు కొండ, బయటికెత్తిన దివ్వె, బీటలువారు, మాయక్కవుగద, వడవడవడకు, వన్నెవాసి.

న్యాయములు –

కడుపులో చేయివెట్టి కలచినట్లు – నీరుకొలది తామర–పూవునుం దావియు బోలె – పాలు నీరు నెనసిన వడువున –

సామెతలు –

రాజమగడైన వెనుకను గాజు కడియ మన్నట్లు–

విదియనాడేరు పడకున్న తదియనాడు తానకనపడు–

తెలగన తెలుగులు –

ఇది యచ్చతెనుగు కబ్బము – అచ్చ తెనుగు కృతులు రచించిన వారందరు చారిత్రక నామములు దప్ప పురాణనామములన్ని తెనుగున యనువదించిరి. అందులకు తెలగన కూడ యపవాదుకాదు.

అయిదుతలల రాయడు = పంచాననుడు

ఏనుమోముల మేటి = పంచాననుడు

కనువినుకలి = చక్షుశ్రవము

కనువినుకలినెలవుపుట్టవు = వల్మీకభవుడు

కలిమి తొయ్యలిగేస్తు = లక్ష్మీపతి

కలిమి పొలతి = శ్రీదేవి

కమ్మ తెమ్మెర = మలయానిలయము

కలువలరేడు = కుముదేశుడు

కణివేల్పు = కృష్ణుడు నల్లనయ్య

కానసిరి = వనలక్ష్మి

కొమ్మమెకము = శాఖామృగము

గాలి చూలి = మారుతాత్మజుడు

గాలిమేపరి = వాతాశనము

గెలుపుపైడి నెలంత = విజయలక్ష్మి

చదిలేటి పట్టి = అభ్రగంగాసూనుడు

చాలు పేరింటిపడతి = సీతాదేవి

చిన్కు మేపుడు పుల్గు = చాతకము

జక్కులతేడు = యక్షేశుడు

జాబిలి తాల్పు = శశిమౌళి

జేజేల దొర = దేవతా ధీశుడు

తమ్మికంటి = పద్మాక్షుడు / పద్మనేత్ర

తమ్మిపొక్కిటి వేల్పు = కమలనాభుడు

తరటి పుట్టువు = కుంభసంభవుడు

తమ్మెలవిందు = కుముద బాంధవుడు

తామరచెలి = పద్మబాంధవుడు

తావిగుబ్బలి = మలయపర్వతము

తుంట విల్తుడు = ఇక్షుధన్వి

తెరగంటిదంట = దేవతాస్త్రీ

తెఱగంటిదొరరాలు = ఇంద్రనీలములు

నలుమొగములవాడు = చతురాననుడు

నాగటిజోదు = హలాయుధుడు

నీటిరాయడు = వరుణుడు

నెలదిండిగాము = విధుంతురుడు

పలుకులేజవరాలు = గీర్వాణి

పాల్కడలి కూతురు = క్షీరసాగర కన్యక

పుడమితాల్పరి = ధరాధరుడు

పుడుకుజెట్లు = కల్పవృక్షములు

పూవింటి వాడు = పుష్పచాపుడు

పొలదిండి రాతేడు = క్రవ్యాదపతి

పైడినెలత = లక్ష్మీ దేవి

బాసవాల్గములు = గీర్వాణులు

బేసికంటి = విషమాక్షుడు

మగమానికము = పురుష రత్నము (వజ్రము)

ముక్కంటి = త్రినేత్రుడు

మున్నీరు = సముద్రము

మున్నీటి రాణి = గంగ

మూడు పాలెములు = త్రిపురములు

మొగసాల = ముఖశాల

మినువాక బిడ్డడు = భీష్ముడు

వేల్పుమన్నీడు = ఇంద్రుడు

వేగన్నుల దొర = సహస్రాక్షుడు

వేయితలల ప్రోడ = శేషుడు

సింగపుగద్దియ = సింహాసనము

సుడిగట్టు = చక్రవాళగిరి

సుడివాలు = చక్రము

సెకవెలుగు = సూర్యుడు

సెకతేడు = అగ్ని

తెలగన యయాతి చరిత్రయందుపయోగించిన పద్యములు

తెలుగు పద్యము వృత్తములు జాతులు ఉప జాతులని మూడు విదములు. వృత్తములన్ని మార్గ ఛందములందు బుట్టినవి. ఇవి నిసర్గ గణముల చేతనే యేర్పడు చుండును. వీనికి యతిప్రాసలనియమము గలదు.

ప్రధానమైన చందము లిరువది యారు. కాన పాదమున కిరువది యారక్షరములు దాటిన పద్యములకు మాలికా వృత్తములని పేరు. వృత్తముల యొక్క నియమమే వీరికి గూడ వర్తించును. కాని వీని పాదములందు యతి స్థానము లెక్కువగానుండు

జాతులకు వృత్తముల వలెనె యతిప్రాసల నిలయమముండును. కాని యివి నసర్గ గణ మరియు నుపగణముల సమ్మేళనమున నేర్పడు చుండును. కందము, ద్విపద, అక్కఱలు, రగడలు, దండకము లిందు జేరును.

ఉపజాతులకు నాలుగు పాదముల ప్రాసనియమముండదు. యిక యతి విషయమున గూడ యతిగాని ప్రాసయతి గాని వేయవచ్చును. ఇందు సీసములు గీతములు చేరును. వృత్తముల కన్న జాతులు, జాతులకన్న ఉపజాతులు కవులకు సులభము.

వృత్తకవి ఉత్తమ కవి. పద్య కవి మధ్యమ కవి. శ్లోక కవి కనిష్ఠకవి యని కవిలోకమున నొక వాడుక యున్నను నన్నయ మొదలుకొని ప్రబంధ యుగాంతము వరకు కవులందరు కందము పై మొగ్గు చూపిన వారే. ప్రస్తుత కావ్యకర్తయైన తెలగన గూడ దాని కపవాదుగాదు. నిర్దుష్టముగా పద్యమైనను శ్రమ సమానమే యగును.

తెలగన వృత్తములందును ఇటు జాత్యుప జాతులందును అన్నింట చేయి బాగుగా తిరిగిన వాడు కావున నిక కావ్యమున నతడు వాడిన పద్యములను చూడుడు.

తెలగన వాడిన వృత్తములు

క్ర.సం.	పేరు	ఆ 1	2	3	4	5	మొ.
1.	తోటకము	0	0	0	1	0	1
2.	తోదకము	0	1	0	0	0	1
3.	మాలిని	0	1	1	0	0	2
4.	మణిగణనికరము	0	0	0	0	1	1
5.	పంచచామరము	0	0	1	1	0	2
6.	మత్తకోకిల	1	1	2	1	0	5
7.	శార్దూలము	0	3	0	1	2	5
8.	తరళము	1	0	1	2	0	4
9.	మత్తేభము	4	0	4	7	4	19
10.	ఉత్పలము	11	9	11	9	6	46
11.	చంపకము	14	8	7	16	19	64
12	సుగంధి	0	0	0	1	0	1
13.	స్రగ్ధర	0	1	0	0	0	1
14.	మహాస్రగ్ధర	0	1	0	0	0	1
15.	సరజిజము	0	1	0	0	0	1
16.	బంధురము	0	0	0	1	0	1
17.	లయగ్రాహ	0	0	0	0	2	2
18.	లయవిభాతి	0	0	0	0	1	1
19.	కందము	37	36	62	58	48	242
20.	ఉత్సాహము	0	0	1	0	0	1
21.	మధురగతి రగడ	0	0	0	1	0	1
22.	ద్విరదగతి రగడ	0	0	0	0	1	1
23.	తేటగీతి	4	15	15	12	22	68
24.	ఆటవెలది	5	1	10	5	2	23
25.	సీసము	31	23	16	22	20	112
26.	వచనము	16	25	32	27	30	130
	మొత్తము	124	126	163	165	159	737

వృత్తముల గణ వివరము

పేరు	గణము	యతి
తోటకము	స, స, స, స	9
తోదకము	న, జ, జ, య	8
మాలిని	న, న, మ, య, య,	9
మణిగణనికరము	న, న, న, న, స	9
పంచచామరము	జ, ర, జ, ర, జ, గ	10
మత్తకోకిల	ర, స, జ, జ, భ ర	11
శార్దూలము	మ, స, జ, స, త, త, గ	13
తరళము	న, భ, ర, స, జ, జగ	11
మత్తేభము	స, భ, ర, న, మ, య, వ	14
ఉత్పలము	భ, ర, న, భ, భ, ర, వ	10
చంపకము	న, జ, భ, జ, జ, ర	11
సుగంధి	భజనన భజసగ	8+8 అక్షరముల యతిస్థానము
స్రగ్ధర	మభరనయయయమ	8+15 అక్షరముల యతిస్థానము
మహాస్రగ్ధర	పతతనసరరగ	9-16 అక్షరముల యతిస్థానము
సరజిజము	మతయననననస	10+18 అక్షరములయతిస్థానము
బంధురము	నననననసభభభగ	16
లయగ్రాహి	భజసన - భజసనభయ 8+8+8 అక్షరములు ప్రాసయతులు	
లయవిభాతి	రసననసననసననసగ 9+9+9 అక్షరములు ప్రాసయతులు	
కందము	గగభ-జసనలయు	సరిపాదములందు 3 గణలములపై యతి
ఉత్సాహము	7 సూర్యగణములపై 1 గురువు	5 గణము మొదటి అక్షరము యతి
మధురగతి రగడ	గగ. భసనలము	మొదటి అక్షరము యతి మూడవగణము యొక్క ప్రథమాక్షరము యతి
ద్విరదగతి రగడ	5 మాత్రలగణములు 4	మూడవగణము యొక్క ప్రథమాక్షరము యతి
తేటగీతి	1 సూ. 2 ఇం. 2 సూ.	3వ గణము ప్రథమాక్షరము యతి ప్రాసయతిగూడ వేయవచ్చును.
ఆటవెలది	బేసిపాదములు 3 సూ. 2 ఇం.	సరిపాదములు 5 సూ. మూడు గణములపై యతి
సీసము	6 ఇం. 2 సూ. ఒకపాదము ఇటుల నాల్గుపాదములు	ప్రతి రెండుగణముల పిమ్మట యతి. దీనికి అనుబంధముగా ఆటవెలది లేదా తేటగీతి చేర్చవలెను.

యయాతి చరిత్ర - తెలగన అనుకరణలు - అనుసరణలు

ప్రథమాశ్వాసము :-

1.	సీ.	జలజసంభవుడు ప్రజ్ఞావిశేషంబున -	శ్రీ.శా.	1-51
	సీ.	పూవింటివాడు నేర్పున సోయగంబున -	యయాతి	1-19
2.	మ.	దివిప్రాకారము జుట్టి యుండగ తదుద్దేశంబునన్ -	శృం	1-71
	తే.	చదలరాసినకొమ్మల చాలు కతన మీదరారాక -	య.	1-75
3	ఉ	ఆపురినున్నతస్ఫటిక హర్మ్య విభాగములంబు -	శృం-	1-70
	మ.	తళుకుల్ గుల్కెడు నందుమేడల తుదన్ -	య-	1-78
4.	సీ.	మరుడింద్రజాలిక మహిమ గైకొనివచ్చి -	తు-	4-74
	సీ.	మెరసిపోవక నిల్చి మెలతలై యొరపుచే -	య.	1-81
5.	సీ.	కలికి చూపులచేత కరగియనేర్తురు -	మెల్లరా.	1-14
	సీ.	నగగల్గినను చాలు మొగసాలవాకిలి -	య.	1-85
6.	సీ.	కలుకు జుంజురుమెట్రుకలకొప్పు -	కాళ-	3-15
	సీ.	గురువెందపట్టెల్లకును తోడు సందిళ్ల -	య.	1-102
7.	చ	పులులు కురంగముల్ కరటి పోతము లేదులు -	కాళ.	3-45
	మ.	పులికూనల్ సమరాలు కస్తురి మెకంబుల్ -	య.	1-104
8.	ఉ	జుంజురువల్లమెట్రుకల జోయముల్ -	శృం.	1-97
	తే	కులుచచేతులు మిడిగ్రుడ్లు కలుకు మీస -	య.	1-102
9.	క.	ఒక్కయెలుకు తేదున్కొమ్మును నిల్తీ -	మను.	
	ఆ	పికిలిపూలు బూతపిల్లులేనిక కొమ్ము -	య.	1-103
10.	వ	దొడ్డివల పేటివల కుందేటివల పందివల - - -	కాళ.	3-46
	తే	లేటివలలును మేటి కుందేటి వలలు -	య.	
11.	తే	మృగయులంతట దెచ్చిరిల గుడుగిద్ద -	శృం.	1-110
	ఆ	కారుకోడి కాజు క్కురపూరేడు -	య.	1-113

ద్వితీయాశ్వాసము :-

1.	ఆ	మునుపు వడినమెకము గొనివచ్చి -	కా.	3-49
	క.	మునువడినమెకము గొని చని -	య.	2-4
2.	సీ.	చిలుకతేరును నల్లచెలుకు విల్లును -	పారి.	2-35
	సీ.	కంబమయ్యె రోమేలుకలిగించు నీకొక్క -	య-	2-3

తెలగన సీసములు - స్వీసంవాదములు

విస్తృతమైన కథాకావ్యములు రచించునపుడే కవికైనను ఒకదానిని పోలి మరియొక పద్యమును రచించుట తప్పదు. అటువంటి వానిని సంవాదములందురు. యయాతి చరిత్రమున సీసములు కథయందారున్నర వంతాక్రమించినవి. తెలగన యొక్క స్వీ సంవాదములన్ని ఈ సీసములందే కనిపించుచున్నవి.

సీ॥	తెరగంటి దొరజాల తెగల దీరిన కోట -	1-3 - 1-75
సీ॥	పట్టంగనీడు సంబళికలు కలనిలో -	1-27-1-98
సీ॥	తలిదండ్రులే మాటతనకాన తిచ్చిన -	1-47-1-65
సీ॥	తనరూపు వలయందు తలిరాకు బోడులు -	1-57-1-92
సీ॥	పదియూరు వన్నెల పసిడి గోడల చెంత -	1-97-1-119

<u>ఉత్ప్రేక్షలు</u> :-

సీ॥	మెరసి పోవకనిచ్చి మెలతలై యొరపుచే -	1-81-3-42
సీ॥	వేల్పు మన్నీనికై వెఱచి వెన్పొదలిలో -	2-12 -2-72
సీ॥	పూనికదగు నీటి తేని పసిండి -	2-70-2-105

<u>నామమాలికలు</u> :-

సీ॥	మారెళ్లు, నేరెళ్లు, మామిళ్లు జిన్నులు -	1-36 ఆరామతరులు
సీ॥	కొక్కెర పూరేడు గోరవంకలావుక -	2-24 పక్షులు
సీ॥	తమ్మలు చుక్కలు తాబేళ్లు మరుపొదుల్ -	4-33 ఉపమాసామగ్రి
సీ॥	మట్టెలు పిల్లెండ్లు మరివీర మద్దియల్ -	4-90 భూషణములు

<u>సాంగోపములు</u> :-

సీ॥	బెట్టుగా నడివంక జుట్టివచ్చిన -	2-36-2-109
సీ॥	ఉబ్బుబుగ్గలు గబ్బి గుబ్బలు గాగ -	2-42-3-51
సీ॥	అలమింటు జెలగు రాచిలుకల చాలుపు -	4-4-4-154
సీ॥	బెళుకులై తళుకులు గులుకు కన్నులచెన్ను	1-84-3-50

<u>వేషములు</u> :-

సీ॥ గురివెంద పట్టీళ్ళకును తోడు సందిళ్ళు - 1-102 ఆటవికులు

సీ॥ పటికంపు మురువులు పాపకొమ్మలటంచు - 2-51 జాబాలి

సీ॥ కస్తూరిమొదలుగా కలపంబు చేసిన - 2-88 రంభ

<u>కట్టడములు</u> ఉదాత్తాలంకారము

సీ॥ పదియూరు వన్నెల పసిడిగోడంచెంత - 1-97-4-74

సీ॥ పువ్వుదేనియకాల్వపొంత పొన్నలలోన - 4-29--5-77

సీ॥ అలరుకస్తురి తీనెలలికి వాకిళ్ల - 1-119-5-98

<u>బాలక్రీడలు</u> :-

సీ॥ చల్లని తలపు రాబిల్లల మీదట - 2-35-3-56

సీ॥ మొదలు తుమ్మెద దిమ్మ రొదలచే - 3-55-4-25

<u>రాహువు - చంద్రుడు</u> :-

తే॥ తొలుత మ్రింగిన కొఱనెలల్ సెలవులందు - 2-6-4-11

క॥ చెలితీవెయుయ్యెలూగగ - 4-23-4-70

<u>మామిడిచెట్లు</u> :-

క॥ క్రందుకొను చివురు జొంపము - 4-6-5-53

<u>పొన్నచెట్లు</u> :-

ఉ॥ తొంగలిపూవు దేనియల దోకొని - 4-16-5-52

<u>దేవయాని</u> :-

సీ॥ బలుమించు తలమించు నలిమించు - 4-53-5-3

సీసములను సమవిభక్తాంగములుగా ప్రక్రియాభంగము లేకుండ నడుపనేర్చిన వాడు శ్రీనాథుడు. తెలగన యొక్క ఈ క్రింది సీసములను పరికించిన యెడల అతని సీస నిర్మాణ చాతురి తెలియును -

సీ॥ బలిమితో బిగ్గర పదినొళ్లనానగా - 2-92 తృతీయాంతము

సీ॥ జగములగల్గింప జాలు నల్వకుబుట్ట - 2-110 ద్వితీయాంతము

సీ॥ జగముల గల్గింప జాలునల్మొగముల - 3-133 ప్రథమాంతము

సీ॥ ఇసుమునగావించి యెంటిగి - 2-43 బహువచనాంతము

సీ॥ బొట్టుగలేమావి బొదలించెనొక్కర్తు - 4-20 స్త్రీవాచకసర్వనామాంతము

3.	సీ.	హోమధేను వ్రాతమొయ్యె నట్టులు చాప -	రాజ.	2-107
	సీ.	మదికూర్ములుప్పొంగ మొదవు బాలెంతలు -	య.	2-49
4.	సీ.	దినూరి రాసి మాపను మౌని గ్రోలంగ -	పారి.	2-34
	సీ.	పూనిక దగునటి తేని పసిండి -	య.	2-70
5.	సీ.	కార్కొన్న కటికచీకటి మొగుల్మొత్తంబు -	పారి.	2-37
	సీ.	నింగి పేరింట మున్నీటిలోప్పుదు -	య.	2-72
6.	సీ.	మొలకవెన్నెల చాలు గలిపి నెచ్చెలులకు -	రాదా.	4-102
	సీ.	అనుకువెన్నెలదాల్చి తునిచి సేమెలు జేసి -	య.	2-89
7.	మ.	కనివేగంబున నడ్డమేగి యతడాకంపించు -	నిర్వ.	6-59
	తే	వడివడిం జని యాతడో వాలుగంటి -	య.	2-89
8.	చ	అతులితధైర్యసారకరుణాలయ మానస -	నిర్వ.	6-60
	ఉ	రక్కసి రాయయే వినుము రంభను -	య.	2-90

తృతీయాశ్వాసము :-

1.	క.	పడతుల కన్నులగనుగొని అడియాసల -	రాజ.	2-15
	క.	ఎలనాగల గుబ్బల మది చెలులని -	య.	3-69
2.	తే	పదుగు రొక్కటియై యొక్క పడతి దరుము -	రాజ.	2-157
	తర.	పలుతెఱంగుల బోవు చుందురు -	య.	3-70
3.	క.	దరియొక్కవారి నీడలు సరసింగను పట్టె -	వరా.	3-106
	క.	పొలతుల నీడలు దగియర్ఁ -	య.	3-71
4.	చ	కొసరివసంతకాలమున కోకిల కోల్చిన భంగనెద్దొ -	కాశీ.	5-167
	క.	వలపంబు చెఱగు మోమున నెలజేరిన మంచుపగిది -	య.	3-44
5.	సీ.	చెందమ్మి రేకుల జిందు తేనెలు వోలె - ఉత్తరా -	య.	-5-274
	సీ.	కలువలు ముత్యాల గనియెదు నోనాగ -	య.	3-84

చతుర్థాశ్వాసము :-

1.	ఉ॥	సారెకు మానస ప్రభువశైవల జాలము -	తపతి.	4-58
	తే॥	కప్పురము పాదు లోపల కరము సరిది -	య.	4-39
2.	క.	మృగనేత్రమొకతె సతికిని జిగిగల -	తప.	5-48
	క.	పొలతి మొగము బోలుదుని -	య.	4-91

3.	సీ॥	ఆణిముత్తియము కొక్కొంతగా నొందొండ-	రాజ.	3-175
	సీ॥	చెలగుచు మంచి పచ్చలు దెచ్చి మేలేర్చి -	య.	4-116
4.	క॥	కన్నెచుదోయి చుట్టుముల్ గాన-	రాజ.	3-176
	మ.	చెలిచన్నుంగవ బోల జాలునచుచుఁ -	రాజ.	4-117
5.	క.	ప్రోలనియెడు కాసారములో -	రాజ.	3-178
		పై పద్యమందలి దీప ప్రసక్తి మాత్రము -	-	- -
6.	చ	మగువయు నాధుడుఁ పసిడిమంచముపై పసియించి -	రా.	3-180
	క.	తెలనాకులు బాగాలును -	య.	4-119
7	క.	కులమును రూపము ప్రాయము -	రాజ.	3-95
	క.	ఇలువడియు చెలిమి కలిమియు -	య.	4-126
8.	క.	ఏ తెలుగున నీ మగనిం బ్రీతుని జేసెదవో -	రాజ.	3-196
	క.	చొచ్చిన యింటికి దగ నిన్నిచ్చిన యింటికిని -	య.	4-132
9.	క.	మగడెవ్వరి తెగ జూచుఁ -	రాజ.	3-200
	తే	వినుము మగడేరనేనియు మనుపగోరు -	య.	4-133
10.	సీ॥	కాళంజి పట్టు నీకలికి -	రాజ.	3-202
	సీ॥	అదివేల్పురాయని యనుగు నెచ్చెలిసుమీ -	య.	4-136

పంచమాశ్వాసము :-

1.	సీ॥	సకి నెలపట్టెమంచము పట్టుతలగడ -	వైజ.	3-72
	చ॥	బొగడల సానరాచిలుక పుత్తడిపావలు -	యా.	5-12
2.	క.	ఈరీతింబెనగినవ్వారెరుగరు నీదుగుట్టు -	ప్రభా.	5-25
	తే	తెలవయాకొమ్మ కేలువిదిర్చి -	య.	5-16
3.	చ॥	మొగడలు వజ్రముల్ విరులు ముత్తెములు -	కుమా.	4-99
	క.	బలుమగు సొంపున వ్రేగగు -	య.	5-53
4.	సీ॥	సోయగంబున వీణ వాయియ -	వసు.	3-116
	సీ॥	తావులు నెలపియే తావులు నిండంగ -	య.	5-715.
5	సీ॥	జవరాలి యడుగుల చివురాకులంటించి -	వసు.	3-182
	సీ॥	పొరపొరనిండకప్పురము పుత్తిల్లెడు -	య.	5-100

తెలగన సీసములు - స్వసంవాదములు

విస్తృతమైన కథాకావ్యములు రచించునపుడే కవికైనను ఒకదానిని పోలి మరియొక పద్యమును రచించుట తప్పదు. అటువంటి వానిని సంవాదములందురు. యయాతిచరిత్రమున సీసములు కథయందారున్నర వంతాక్రమించినవి. తెలగన యొక్క స్వ సంవాదములన్ని ఈ సీసములందే కనిపించుచున్నవి.

సీ॥	తెరగంటి దొరజాల తెగల దీరిన కోట -	1-3 - 1-75
సీ॥	పట్టంగనీడు సంబళికలు కలనిలో -	1-27-1-98
సీ॥	తలిదండ్రులేమాటతనకాన తిచ్చిన -	1-47-1-65
సీ॥	తనరూపు వలయుందు తలిరాకు బోడులు -	1-57-1-92
సీ॥	పదియారు వన్నెల పసిడి గోడల చెంత -	1-97-1-119

<u>ఉత్ప్రేక్షలు</u> :-

సీ॥	మెరసి పోవకనిచ్చి మెలతలై యొరపుచే -	1-81-3-42
సీ॥	వేల్పు మన్నినికై వెఱచి వెన్నొందలిలో -	2-12 -2-72
సీ॥	పూనికదగు నీటి తేని పసిండి -	2-70-2-105

<u>నామమాలికలు</u> :-

సీ॥	మారెళ్లు, నేరెళ్లు, మామిళ్లు జిన్నులు -	1-36 ఆరామతరులు
సీ॥	కొక్కెర పూరేడు గోరవంకలావుక -	2-24 పక్షులు
సీ॥	తమ్మిలు చుక్కలు తాబేళ్లు మరుపొదుల్ -	4-33 ఉపమాసామగ్రి
సీ॥	మట్టెలు పిల్లెండ్లు మరివీర మద్దియల్ -	4-90 భూషణములు

<u>సాంగోపములు</u> :-

సీ॥	బెట్టుగా నడివంక జుట్టివచ్చిన -	2-36-2-109
సీ॥	ఉబ్బుబుగ్గలు గబ్బి గుబ్బలు గాగ -	2-42-3-51
సీ॥	అలమింట జెలగు రాచిలుకల చాలుపు -	4-4-4-154
సీ॥	బెళుకులై తళుకులు గులుకు కన్నులచెన్ను -	1-84-3-50

వేషములు :-

సీ॥ గురివెంద పట్టిళ్ళకును తోడు సందిళ్ళు - 1-102 ఆటవికులు

సీ॥ పటికంపు మురువులు పాపకొమ్మలటంచు - 2-51 జాబాలి

సీ॥ కస్తూరిమొదలుగా కలపంబు చేసిన - 2-88 రంభ

కట్టడములు ఉదాత్తాలంకారము

సీ॥ పదియూరు వన్నెల పసిడగోడలచెంత - 1-97-4-74

సీ॥ పువ్వుదేనియకాల్వపొంత పొన్నలలోన - 4-29--5-77

సీ॥ అలరుకస్తురి తీనెలలికి వాకిళ్ల - 1-119-5-98

బాలక్రీడలు :-

సీ॥ చల్లని తలపు రాబిల్లల మీదట - 2-35-3-56

సీ॥ మొదలు తుమ్మెద దిమ్మ రొదలచే - 3-55-4-25

రాహువు - చంద్రుడు :-

తే॥ తొలుత మ్రింగిన కొఱనెలల్ సెలవులందు - 2-6-4-11

క॥ చెలితీవెయుయ్యెలూగగ - 4-23-4-70

మామిడిచెట్టు :-

క॥ క్రందుకొను చివురు జొంపము - 4-6-5-53

పొన్నచెట్టు :-

ఉ॥ తొంగలిపూవు దేనియల దోకొని - 4-16-5-52

దేవయాని :-

సీ॥ బలుమించు తలమించు నలిమించు - 4-53-5-3

సీసములను సమవిభక్తాంగములుగా ప్రక్రియాభంగము లేకుండ నడుపనేర్చిన వాడు శ్రీనాథుడు. తెలగన యొక్క ఈ క్రింది సీసములను పరికించిన యెడల అతని సీస నిర్మాణ చాతురి తెలియును -

సీ॥ బలిమితో బిగ్గర పదినొళ్లనానగా - 2-92 తృతీయాంతము

సీ॥ జగములగల్గింప జాలు నల్వకుబుట్ట - 2-110 ద్వితీయాంతము

సీ॥ జగముల గల్గింప జాలునల్మొగముల - 3-133 ప్రథమాంతము

సీ॥ ఇసుమునగావించి యెంటిగి - 2-43 బహువచనాంతము

సీ॥ బొట్టుగలేమావి బొదలించెనొక్కర్తు - 4-20 స్త్రీవాచకసర్వనామాంతము

సీ॥ యేదారి జూచిన మేదించి జవ్వాది - 4-82 సర్వనామాంతము
సీ॥ పలుకుల తేనియల్ గులుక కొక్కొకంబు - 5-11 బహువచనాంతము
సీ॥ చిలుకకు చదువు రాజెప్పలే దాయెంగా - 5-22 స్త్రీవాచకసర్వనామాంతము
సీ॥ కొమ్మయీపొన్న పూగుత్తులంటితివేని - 5-51 ప్రతిజ్ఞాంతము

<u>అసమాపక క్రియాంతములు</u>

సీ॥ చనియింగలము పేడిచల్లార్చి - 2-107
సీ॥ తునిసి కూకటి వ్రేళ్లకును పెల్లగిల్లగా - 2-114
సీ॥ అనిలోన మార్కొన్న యతికాయుజంపించి - 3-38
సీ॥ తమమోములకునుల్కి తగవడంతె డునట్లు - 3-64
సీ॥ కలువలు ముత్యాల గనియెండు నోనాగ - 3-84
సీ॥ వినుమన రక్కసులును వేల్పులును దొల్లి - 3-106
సీ॥ మెదలెడు గండు తుమ్మెదలపెఁరొదలచే - 4-15
సీ॥ బలమంచు తలమించు - 4-53

<u>ఆమ్రేడిత క్రియాంతములు</u>

సీ॥ మెదలు తుమ్మెద దిమ్ము రొదలచే - 3-55
సీ॥ చిన్నారి పొన్నారి చిఱుత ప్రాయంబుల - 4-25
సీ॥ చెలగుచు మంచి పచ్చలు దెచ్చి - 4-116

<u>సమాపక క్రియాంతములు</u>

సీ॥ ఉలుప చాలదటంచు నలుగువేలుపుఱేని - 2-115 బుజ్జగింపు
సీ॥ నెలతాలు దేవర యలిగిన పనిగాదు - 3-35 విధ్యర్థకము
సీ॥ కరము పెద్దయిన యాంగిరసు చెంతకుబోయి - 3-150 ఆజ్ఞార్థకము
సీ॥ దురములో తెఱగంటి దొరనింగలవుపేల్పు - 3-95 నిశ్చయార్థకము
సీ॥ ముగురు వేల్పులు మెచ్చ భృగువున కర్మిలి - 3-155 ప్రశ్నార్థకము

యయాతి చరిత్రయందలి అలంకారములు

ఈ కావ్యము 737 గద్యపద్యములు కృతి. దీయియందు 73 పద్యములందవతారిక ద్వితీయ, తృతీయాశ్వాసముల నడుమ 104 పద్యములందు రామాయణ కథ చెప్పబడినవి. ఇవికాగ మరొక 20 పద్యము లాశ్వాసముల యాద్యంతములు కావున వానిని వదలిన యెడల 640 గద్యపద్యములందు ప్రధానకథ నడిచినది.

ఈ కథయందు సంధాన వచనములు అనగా అంత, అప్పుడు మరియు నిట్లనియె, అని ఇంతమాత్రమే గల వచనములు 55 సంఖ్యాపరముగా మూలకథయందివి 6వ వంతు, ప్రధాన కథయందివి 43 ఉన్నవి. కావున తెలగన 600 పద్యములలోపుననే యయాతి కథను చెప్పెను.

ఇందలి రామాయణేతి వృత్తమున సంధ్యాకాల వర్ణమున్నది. యది యాకథయందు నాలుగవ భాగమాక్రమించినది. కావ్యము మొత్తముపై చూచిన యెడల నిందు మూడింట నొకవంతు అలంకారములు గద్యుననో పద్యముననో నిబంధింప బడినవి.

అలంకారములు శబ్దాలంకారములు, అర్థాలంకారములు, రసాలంకారములు, సంకర సంసృష్టులని నాలుగు విధములు తెలగన శబ్దార్థోభయాలంకారములు రెండు తన కావ్యమున యథాయోగ్యముగా వాడెను. అతడు సుమారు 40 అర్థాలంకారములను వాడెను. వానియందుపమ – ఉత్ప్రేక్ష స్వభావోక్తి సురి – చుక్క మరియు ఒకటియను స్థానమున నిలిచినవి. ఉపమ చెప్పిన వాడుత్తమకవి. ఉత్ప్రేక్ష పలికిన వాడు ప్రౌఢకవి. సభావోక్తి చెప్పినవాడు సహజకవి యని కవుల వింగడింపు.

శబ్దాలంకారములు :

1. వృత్త్యను ప్రాస :- **II 40 III 68 IV 21 V 65, 73, 104, 106**

2. యమకము :- **II 101, III 7,15,26,53, V 107**

శబ్దాలంకారములు :

వృత్త్యనుప్రాస :- **II 40 ; III 68; IV 21; V 65,73,104,106**

యమకము:- **II 101, IV 26, V 71;**

ముక్తపదగ్రస్తము :- **IV 13, V 71**

అర్థాలంకారములు :

1. ఉపమ :- I 18,20,22,44,69,99, II 1,26,69,75,79, 80,113,123, III 44,64,70,71,72,146, IV 1,3,10,11,23,24, 31, 33,35,46, 66,68,80, 92,102,134, 139,153, V 13, 30, 32, 39, 41,53, 54,62,85,87,146
2. అనన్వయము :- I 53
3. ప్రతీపము :- III 69, IV 48
4. రూపకము :- 4,52,57,71,92, II 36,78,103,111,126, III 1,4,59,62 IV 1,12,42,60,165 V 1,59,74,157
5. పరిణామము :- I 26,32,92, II 36,42,109, III 57, IV 4,53,154
6. ఉల్లేఖము :- I 19,44,48,52,86,123 II 44,125
7. స్మృతి :- I 120, II 54, III 67
8. భ్రాంతి :- I 77,78,79, II 35,38,39,82, III 68, IV 16,17,18,97, V 123.
9. సందేహము :- IV 34,41,44,45,51,65, V 71,123,125
10. ఉత్ప్రేక్ష :- I 81, II 6,12,68,70,71,72,76,77,81,104,105, III 42, 61, 65, 66,84,128, IV 5,6,8,9,13,36,47,91,113,117, V 52,55,56,57,58
11. అతిశయోక్తి :- I 3,29,59,70,75,76,99,116,117, II 29,66;IV157,159; V 88,159
12. తుల్యయోగిత :- I 29,45,87, II 124, III 162, IV 37,163
13. దీపకము :- IV 164
14. వ్యతిరేకము :- IV 49, II 107, IV 45,49
15. సహోక్తి :- I 102
16. పరికరము :- III 64, V 151
17. శ్లేష :- I 37, II 73.78

18. పర్యాయోక్తి :- I 16,73 II 110,163, III 163, V 17

19. వ్యాజస్తుతి :- I 50

20. వ్యాజనింద :- I 5

21. అసంభవము :- V 94,137,138

22. విషయము :- V 99,118

23. యథాసంఖ్యము :- I 61

24. సముచ్చయము :- II 32, III 55, IV 38,89 V 37,113,129

25. కావ్యలింగము :- IV 38, V 92

26. అర్థాంతరన్యాయము II 74

27. ప్రౌఢోక్తి :- IV 39,40

28. ప్రహర్షణము :- IV 126

29. తద్గుణము :- V 73,102

30. పూర్వరూపము :- I 95,122

31. అనుగుణము :- I 84, II 50 V 100

32. గూఢోక్తి : V 4,34,145

33. యుక్తి : I 1

34. లోకోక్తి : II 93,96, III 107,147, IV 129,130, V 6,16,44,63

35. స్వభావోక్తి : II 11,31,88,99,114, III 7,11,30,41,151, IV 19,20, 95,96,108,112, V 3,14,18,26,63,46,47,64,65,70, 117,121,132,147,149

36. ఉదాత్తము : I 30,91,97,98,100,119, II 43, III 95,132,133, 150,155; IV 29,67,77,103,104,106,116,121,136, V 11,12,97,98

37. ప్రతిషేధము : III 29

ప్రధమా శ్వాసము - అవతారిక

ఇష్టదేవతాస్తుతి - 1, గోలకొండ పట్టణము-3, ఇబ్రాహీం ప్రశస్తి -4, ఏబదారు దేశముల పట్టిక5, అమీనుఖాను తెలగనను కృతి నిమ్మని కోరుట6, మరిగంటి అప్పనగారి ఆజ్ఞ 10, అచ్చ తెనుగు ప్రశస్తి 11, తెలగన రచనా నియమము 14, అమీనుఖాను వంశము 15, హుమామియా ప్రశస్తి 16, బడేమియా ప్రశస్తి 19, బాబుమీయా ప్రశస్తి 26, అమీనుఖాను ప్రశస్తి 27, బడేబీబీ ప్రశస్తి 42, గతాతఖాను ప్రశస్తి 45, పాజిలుఖాను ప్రశస్తి 50, సెక్కరబీబి ప్రశస్తి 55, అబ్దులల్లీ ప్రశస్తి 57, షేక్ ఇబ్రాహీం ప్రశస్తి 60, సెమెబీబీ ప్రశస్తి 63, అమీనుఖాను వంశ వృక్షము పట్టిక - షష్ఠ్యంత్యములు.

కథా ప్రారంభము - పురవర్ణన :-

ప్రతిష్ఠాన పురము కోట 75, మేడలు 76, టెక్కెములు 79, అగడ్త 80, పురస్త్రీలు 81, అశ్వములు 82, గజములు 83, పుష్పలావికలు 84, వెలయాండ్రు 85, పుడమి వేల్పులు 86, రాచవారు 87, విక్రమార్క్యాదుల వివరము పట్టిక - కోమట్లు 88, బంటులు 89, యయాతి 91, చంద్రవంశ వృక్షము - పట్టిక, యయాతి పరిపాలనము 92, యయాతి కొలువు 97, ఎరుకుల రాక 102, వారి విన్నపము 106, యయాతి వేట పయనము 109, వేట సామగ్రి 110, జానపదుల వేట సాధనములు కారడవి 116, ఎఱుకు పల్లెలు 119, యయాతిని చూచిన ఆటవికుల అబ్బురము 120, ఆశ్వాసాంతము.

ద్వితీయాస్వాసము :-

చెంచుల మొక్కులు-3; వేట 4; పందివేరు-6; ఎలుగు వేట-12; సివంగివేట-16; లేడివేట - 17; ఎద్దువేట - 18; జింక వేట - 19; పాదివేట - 21; డేగ వేట - 23; వలవేట - 25; పారు వేట - 27; పులివేట - 29; జానపదుల వేటలు. హిమాలయవర్ణనము -35, గంగానది వర్ణనము - 42; జాబిలి ఆశ్రయము - 48; జాతాలి మహర్షి - 51; జాబాలి యయాతిని నీవెవ్వరని యడుగుట - 54; యయాతికి జాబాలి హితోపదేశము - 57; జాబాలి రామాయణ కథ యయాతికి చెప్పుట - 61; రావణాదుల జననము - స్వర్గముపై రావణుని దండయాత్ర - 65; సూర్యాస్తమయ వర్ణనము - 68; చీకటి - 73; మిణుగురు పురుగులు - 77; వెన్నెల - 78; చంద్రుడు - 80; చకోరక్రీడ - 84; రావణుడు రంభను గాంచుట - 88; రావణుడు రంభ ననుభవించుట - 98; రంభవచ్చి

తన గోడును నలకూబరునితో చెప్పుకొనుట - 99; రావణునికి నలకూబరుని శాపము - 19; సూర్యోదయము - 103; రావణుని దిజ్విజయము - 106; దేవతలు విష్ణువుకడ కేగుట - 108; క్షీరసముద్రం - 109; దేవతలు విష్ణువును గాంచుట - 110; దేవతలు వెన్నునితో రావణుని చేష్టలు చెప్పుట - 113; శ్రీరామాదుల జననము 118; విశ్వామిత్రుని ఆగమనము 123; ఆశ్వాసాంతము 124;

తృతీయాశ్వము :-

విశ్వామిత్రుడు శ్రీరాముని పంపుమని యడుగుట - 5; తాటక సంహారము - 7, సీతాస్వయంవరము - 12; శ్రీరామాదుల వనగమనము - 14; మాయలేడి వచ్చుట - 17; రావణుడు సీతను గొంపోవుట - 21; హనుమంతుడు సీతను వెదక బోవుట - 22; లంకాదహనము - 25; సముద్రునిపై శ్రీరాముని కోపము - 28; సేతుబంధనము - 35; రామరావణ యుద్ధము - 37; యయాతి నూతి దగ్గరకు వచ్చుట - 41, యయాతి నూతబడిన దేవయాని నుద్ధరించుట - 44; యయాతి దేవయానిని నీవెవ్వరని యడుగుట - 47; ఘూర్ణిక యయాతికి దేవయాని వృత్తాంతము చెప్పుట - 51; శర్మిష్ఠ వనవిహారము - 55; జలక్రీడా వర్ణనము 61; శర్మిష్ఠా దేవయానుల కలహము - 74; శర్మిష్ఠ దేవయానిని నూత ద్రోయుట - 80; శుక్రుడు వచ్చి దేవయాని నోదార్చుట - 83; వృషపర్వుడు శర్మిష్ఠను దేవయానికి దాసిగా వచ్చుట -94; శుక్రుడు కచుని వృత్తాంతము వృషపర్వునకు చెప్పుట - 106; శుక్ర బృహస్పతుల వృత్తాంతము-; దానవులు కచుని చంపుట - 119; కచుని బూడిద దానవులు సురలో కలిపి శుక్రునికి త్రాపుట - 124; శుక్రుడు సుర త్రాగరాదని నియమము చేయుట - 137; శుక్రుడు కచునికి సంజీవని నుపదేశించుట - 139; కచుడు తమ లోకమునకు పయనమగుట - 150; దేవయాని కచునికి తన కోరికను తెల్పుట - 154; దేవయాని కచులు పరస్పరము శపించుకొనుట - 158; ఆశ్వాసాంతము - 161.

చతుర్థాశ్వాసము :-

వసంతు వర్ణనము - 3; వృక్షదోహదములు - 20; చెలుల వనవిహారము - 21; యయాతి శర్మిష్ఠంగాంచి వర్ణించుట - 32; యయాతి మీరెవ్వరని దేవయాని నడుగుట - 55; శుక్రాచార్యులు యయాతి దేవయాన లున్నకడకు వచ్చుట - 64; యయాతి దేవయానిం బెండ్లియాడుటకు శుక్రాచార్యులు సమ్మతించుట - 73; నగరాలంకారము

- 79; దేవయాని వివాహ సన్నాహము - 84, వివాహము - 105; దేవయానికి తల్లి బుద్ధులు చెప్పుట - 129, శుక్రుడు దేవయానిని యయాతి కప్పగించుట - 146; యయాతి తన పురం బునకేగుట - 151; ఆశ్వాసాంతము - 163;

పంచమాశ్వాసము :-

చెలులు దేవయానను తలిమ మెక్కించుట - 3; దేవయాని కుమారులను గనుట - 36; యయాతి పుష్పవనమున కేగుట - 42; శర్మిష్ఠ యయాతిని గాంచుట - 61; శర్మిష్ఠ యయాతితో సంభాషించుట 66; శర్మిష్ఠ విరహవేదన- 70; శశిరోప చారములు - 77; ఉపాలంభనములు - 78; యయాతి విరహ వేదనకు లోనగుట -90; చెలికత్తెలు యయాతికి శశిరోప చారములు చేయుట - 97; మదనోపాలంభనము - 106; శర్మిష్ఠ లేచి పొదరింటి కడకు వెళ్ళుట - 117; విరహ శాంతికై యయాతి పొదరింటి కడకు వచ్చి యచటికి తనకంటె మొదలే వచ్చిన శర్మిష్ఠను గావించుట - 121; శర్మిష్ఠాయయాతి మహారాజుల సంభోగము - 128; చెలికత్తెలు వెదకుచు వచ్చి శర్మిష్ఠా యయాతి మహారాజులను గనుట - 134; యయాతి శర్మిష్ఠలు పొదరిల్లు వెడలి వచ్చుట - 148; యయాతి మహారాజు శర్మిష్ఠ నంతః పురమునకు గొనిపోవుట - 151; ఫలశ్రుతి - 150; ఆశ్వాసాంతము -151.

ప్రథమాశ్వాసము

1 చ॥ సిరుల మెఱుంగుఁ బోఁడి తన చెక్కులు సిబ్బెపు గబ్బి గుబ్బలున్
బరువడి నాల్గు చేతులను బట్టఁగ, నల్వఁ దలంచి కేలుఁ దా
మరఁ గుడికన్ను మూయుటకు, మాటికి నవ్వెడు వెన్నుఁ డింపు తోఁ
దిరముగఁ బ్రోచుఁ గావుత మదిం జలరేఁగి యమీను ఖానునిన్ - 1

టీక : మెఱుంగుఁ బోఁడి = మెరుపుతీగవంటి శరీరము గల స్త్రీ బహు వ్రీహిని స్త్రీ నాచ్యంబగుచో నుపమానంబు మీది మేనునకు బోఁడియగు-(బాల-సమా-23) సిఱుల మెరుంగు బోఁడి = సంపదలకు దైవమైన స్త్రీ, అనగా లక్ష్మీదేవి, తన, చెక్కులు = కపోలములు, సిబ్బెపు = శోభగల సిబ్బెయు యౌవన ప్రాదుర్భావమున యువతీ యువకుల శరీరముపై నేసిడు యొక పొడ, సిబ్బెము మొలుచు చున్న దనగా వారికి యౌవనో దయ మగుచున్నదని జనుల వాడుక; గబ్బి = బింకమైన, గుబ్బలున్ = చన్నులు, అనగా శోభతోగూడి బింకము కలిగిన వక్షద్వయమును, బరువడి = క్రమముగా, నాలుగు చేతులను బట్టగన్, నల్వదలంచి = బ్రహ్మదేవుని తలచుకొని, అతడు తమ యొక్క కుమారుడు కనుక తమను చూచునను సిగ్గున, కేలుదామరన్ = ఉ.పు.క. హస్త పద్మమున అనగా పందము వంటి చేతితో కుడికన్ను మూయుటకు, మాటికి నవ్వెడు = అందులకు పదే పదే నవ్వుకొను, వెన్నుడు = విష్ణువు, ఇంపుతోన్ = ప్రేమతో, మదిన్‌చెలరేగి = మనస్సున నుల్లసిలి, అమీను ఖానునిన్ = అమీను ఖానుడు అను నీకృతిపతి, తరముగన్ ప్రోచుగాత = శాశ్వతుడగునట్లుగా రక్షించుగాక -

తా : లక్ష్మీదేవి తనయొక్క రెండు చెంపలను రెండు చన్నులను విష్ణువు వరుసగా నాలుగు చేతులలో ననగా పైరెండు చేతులతో చెక్కులను, క్రింది వరుస రెండు చేతులతో వక్షద్వయము ననుట - పట్టుకొనగా నాసమయమున నాభి పద్మస్థితుడైన బ్రహ్మను తలచుకొని అతడు కుమారుడు కనుక తమ యొక్క నా రహఃకేళిని గనుచున్నాడని సిగ్గున విష్ణువు యొక్క కుడికన్నును తన యొక్క తామర వంటి ఎడమ చేతితో మూయగా నందులకు ప్రియురాలి యొక్క ఆచేష్టకామె హృదయ మెరిగి పదే పదే నవ్వుకొను విష్ణు వమీను ఖానుని స్థిరముగా నుండునట్లు కాపాడు గాక! -

విశే : లోకమున తల్లులు తాము దాంపత్య సుఖమనుభవించు నపుడు ప్రక్కనున్న బిడ్డలు మెలకువ వచ్చి కనులు విచ్చిన తమను గమనింతురని వారిని చక్కగా ముఖ్యముపై

పలుచని గుడ్డగప్పి పడుకొని బెట్టి ఆ పిమ్మట తాము పతి కౌగిలిలో నిముడుట సర్వసాధారణము కనుక నిక్కడ లక్ష్మీదేవి యొక్క స్థితి గూడ నట్టిదే విష్ణువు యొక్క నాభి పద్మమున బ్రహ్మ యుండును. అతడు వారి కుమారుడు. వారి యొక్క కామక్రీడ నందుండి గమనించు చుండును. అందువలన నతనిని తమను గమనింపకుండ వారింప దలచి- అతడున్న పద్మము సూర్యుడు ప్రకాశించుచున్నంత వరకు వికసించియే యుండును. కనుక నా ప్రకాశమును మాటిన యెడల పద్మము ముకుళించి బ్రహ్మదానియందు తమ్మిలో గూర్కిన తేటియై తమను గమనింపడని తలచి, విష్ణువు యొక్క కుడికన్ను సూర్యుడుగావున దానిని తన హస్త పద్మమున మూసెను. అంత విష్ణువు ప్రియురాలి యొక్క హృదయము నెరిగి మధుర భావనగల ఆమె యొక్క ఈ శృంగార చేష్టను మనస్సున పదే పదే తలచుకొని నవ్వసాగెను.

సిబ్బెపు గబ్బిగుబ్బల్ అనుట వలన నిచట లక్ష్మి దేవి ప్రౌఢయని ధ్వని. ఆమె నిత్య యౌవన - వినువీధి జనుదేరగావించి రమరుల్..... నవోఢోల్లస దిందిరా పరిచరి ఘ్లృ జిష్ణు - అని పోతనగారి వాక్కు, భాగ. 8-105 విశే - ఈ పద్యము కావ్య ప్రకాశమందలి ఆచార్యమమ్మటుని యొక్క -

శ్లో॥ విపరీత రతేలక్ష్మీః బ్రహ్మాణం దృష్ట్వానాభి కమలస్థం,
హరేర్దక్షిణ నయనం రసాకులా ఝుడితి స్థగయతి.

తా :- పురుషాయితము నారంభించిన లక్ష్మి నాభి కమలాసీనుడగు బ్రహ్మనుగాంచి అతడు చూచు చున్నాడను సిగ్గున రసాకులు రాలై హరియొక్క దక్షిణ నయనమును మూయుచున్నది - అను శ్లోకమునకు ప్రస్థానము.

శృంగార కావ్యమైన యమరుకము నమరుకుడు పురుషా యితమున ప్రవర్తించు యువతి ప్రసక్తితోనే యారంభించెను కనుక నాసాంప్రదాయము ననుసరించి కాబోలు తెలగన శృంగార ప్రధానమైన తన యొక్క ఈ కావ్యమును పురుషాయిత వర్ణనతో నారంభించెను. కాని తన పద్యమున సంస్కృత శ్లోకము నందువలె దానిని విపరీత రతియని వాచ్యము మాత్రము చేయలేదు.

ఆమె యతని కుడికన్ను మూయుట రతిభంగిములలో ఉత్తాన కరణమున - అందును పురుషాయితముననే యవలీల.

పై పద్యమునకు మూలమైన సంస్కృత శ్లోకమున కవి హరియని విష్ణువు విశేషించి

యతని కుడికన్ను సూర్యుడగుట నాశబ్దమువలన జ్ఞాపకము చేసెను. హరియైన విష్ణు వాసమయమున పద్మనాభుడు, సిరియైన లక్ష్మీదేవి వరారోహయని గూడ చెప్పవలయును.

ఈ కవియైన పొన్నగంటి తెలగన్న మదన గోపాల మంత్ర ప్రసాద లబ్ధ సారస్వతుడైన కవి. శ్రీమన్నారాయణుని లీలావతారములందు శ్రీకృష్ణునిది శృంగారావతారము. అందును నతడు మదన గోపాలు డైనపుడా రసమున కది పరాకాష్ఠ కావున నామంత్రమునుపాసించిన తెలగన్న శృంగార కవి ఎట్లుకాకుండును.

శ్లో॥ అపారేకావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథాస్మైరోచతే విశ్వం తథేతం పరివర్తతే
శృంగారీ చేత్కవిః కావ్యం జాతం రసమయంజగత్
స ఏవ వీతరాగశ్చేత్, నీరసం జాతమే వతత్.

తా:- అపారమైన ఈ కావ్య సంసారమునకు కవియే ప్రజాపతి. అనగా సృష్టి కర్త. అతడు శృంగారియైన కావ్యము శృంగార రస ప్రధాన యగును. నీరసుడైన కావ్యము గూడ నీ రసముగాను, వైరాగ్యభావము కలిగించున దగును. అని ఆనంద వర్ధనుని ఉవాచ.

ఇక తెలగన్న పేరుచేతనే కాక కావ్యప్రపంచమున తాను చేపట్టిన ప్రక్రియ చేత గూడ తెలగన్నయే. అచ్చతెలుగు పందంబులెల్ల తరచుగ స్త్రీ సమంబు లనియే సూరి సిద్ధాంతము. ఇక కావ్యమన్ననో లాక్షణికుల దృష్టియందు స్త్రీయే. అందుచేత దానికి కావ్యకన్యయనియే వ్యవహారము.

లోకమున పురుషుడన్నపుడు పౌరుషము, స్త్రీ యున్నపుడు శృంగారము శ్రోతల యెదుట రూపుగట్టు చుండుట సహజము కనుక తెలగన్న యొక్క ఈ కావ్యము శృంగార ప్రధానమగుటలో వింతయుండదు. అందువలన తెలగన్న కృత్యాదికి లక్ష్మీ నారాయణులయొక్క పవిత్రమైన శృంగారము నెన్నుకొని తన కావ్యము శృంగారరస ప్రధామని ధ్వనింప జేసెను.

శృంగార ప్రపంచమున నెపుడైనను స్త్రీదే ప్రధాన పాత్రయైనను తెలగన్న యిందు ప్రదర్శించిన శృంగారమున నొకప్రత్యేకత యున్నది.

ఈ కావ్యమందలి నాయిక దేవయాన. ఆమె బ్రాహ్మణ కన్య క్షత్రియు డగు యయాతిని వివాహమాడినది.

బ్రహ్మణుడు క్షత్రియకన్యను, క్షత్రియుడు వైశ్యకన్యను, వైశ్యుడు శూద్రకన్యను వివాహమాడవచ్చును. క్షత్రియుడైన మనువు తన కూతురు దేవహూతిని బ్రహ్మణుడైన కర్దముని కిచ్చెను. క్షత్రియుడైన నాభాగుడు వైశ్యకన్యను వివాహమాడెను. ఇట్టి వానికి అనులోమ వివాహములని వ్యవహారము. ఇవి ధర్మశాస్త్ర సమ్మతములు. కాని బ్రహ్మణకన్య క్షత్రియుని, క్షత్రియకన్య వైశ్యుని, వైశ్యకన్య శూద్రుని వివాహమాడరాదు. బీజదాత ఉన్నత కులజుడై యుండవలెనని శాస్త్రము కనుక దేవయాని వివాహము వంటివి విలోమ వివాహములనబడి అవి శాస్త్ర నిషిద్ధములైనవి. కాని దేవయానికి కచుని శాపము వలన స్వకులీనుని వివాహమాడు నదృష్టమామెకు దూరమైనది. అందువలన నామె తప్పక విలోమ వివాహమే చేసికొన వలసి వచ్చి యయాతిని వరించినది. అందులకతడు మొదట సమ్మతించలేదు. ఈ ప్రశ్ననే జనమే జయుడు వైశంపాయనుని ముఖ్యముగా నడిగెను.

వర్ణధర్మముల్ గాచుచు వసుధ యెల్ల
ననఘ చరితుడై యేలిన యయ్యయాతి
భూసురోత్తమ భార్గవ పుత్రియైన
దేవయానిని దానెట్లు దేవిజేసె - ఆంధ్రమహాభార - ఆది - 3 - 97 అనియడిగెను.

కాని దేవయాని యతనిని విడువలేదు. ఆమె తమ తండ్రియైన శుక్రాచార్యుడు నీతి శాస్త్రకర్త కనుక మాయయ్య జెప్పిన యెడల నీవంగీకరింతువా యని యతని నోడబరచి తమ తండ్రితో నందులకై నాపద్ధర్మమైన యొక నీతిని సృజింపించి యతనిని వివాహమాడెను. ఈ విధముగా నిందు నాయికా ప్రాముఖ్యమున్నది.

ఈ నాటి యువతులు గూడ విద్యావంతులై వర్ణభేదము నిరసించుచు విలోమ వివాహములకు గూడా ముందడుగు వేయుచున్నారు. ఇది యభ్యు దయ సూచకము కనుక నీతరుణమున దేవయాన యయాతి మహారాజుల వివాహము వారికొక యాదర్శముగా నుండగలదు - ఇక ప్రస్తుతము.

కవి కృత్యాదిని పురుషాయిత రూపమైన సంభోగ శృంగార మీకథ యందలి నాయికకు గల ప్రాధాన్యమును మరియు స్వాతంత్ర్యమును వ్యంజించుటకే స్వీకరించి యుండవచ్చును. అంతేగాక మరియొకటి విష్ణువు పద్మనాభుడైనపుడు లక్ష్మికి రతికేళికి పురుషాయితము తప్ప వేరు మార్గములేదు. అంతేగాక అది శృంగారమున పరాకాష్ఠ గూడ.

ఇది దేవయానకు విలోమ వివాహము తప్ప వేరు మార్గములేని స్థితిని సూచించును. ఇదంతయు కావ్యవిషయకధ్వని.

ఇదిగాక తెలగన్న కృత్యాదికి పైన తెలిపిన సంస్కృత శ్లోకమునే యనువ దించుటకు చారిత్రకమైన మరియొక ముఖ్య కారణము గనిపించును.

లక్ష్మీదేవి విష్ణువు యొక్క కుడికన్ను మూసిన దనగా కాల ప్రభావము ననుసరించి యప్పటికి సూర్యవంశాది రాజుల ప్రభావము లన్ని పూర్తిగా మరుగు పడినవి. అతని ఎడమకన్నైన చంద్రుడొక్కడే ప్రజలకు కనిపించు చుండెను. అనగా చంద్రధ్వజులైన మహమ్మదీయులైన ప్రభువులే దేశమంతటను ప్రజలకు కనిపించు చుండిరి.

చంద్రునికి రాజని వ్యవహారము. ఆ రాజువలెనే ఈ రాజులు గూడ ప్రజారంజనము జేయుచుండిరి. కనుక లక్షణ కారుడు ''విపరీత రతేలక్ష్మీః'' అను శ్లోకమును కావ్యపరముగా నుపయోగించు కొనగా తెలగన్న దానిని చారిత్రిక పరముగా మలుచుకొని యానాటి రాజకీయ పరిణామము సూచించుటకై దాని ననువదించెనని గూడ తలపవచ్చును.

ఇట్లీ పద్యమున కావ్యార్థ, కాలాపర్థ సూచకమైన ధ్వనులు కృత్యాదినిఖ లేకపోతే న్యాయమున ననేకము దృశ్యమాన మగు చున్నవి.

కృతిని శ్రీకారముతో నారంభింప వలెను కాని అచ్చతెనుగున శ్రీకారము లేదు. తెనుగు నందు ద్విత్వములేగాని సంయుక్తములుండవు. అందువలన శ్రీశబ్దమునకు వికృతియైన సిరితో కవి ఈకృతి నారంభించెను.

సిరియన్నప్పుడు ప్రథమాక్షరమైన ''సి'' యందు నకారేకారములు గలవు. సహకార - ఇకారవములు రెండును అగ్ని బీజములే కాగా ఇకారవము లక్ష్మీబీజము కూడ. ''శ్రీయమిచ్ఛేద్దు తాశనాత్త'' ని పురాణ వచనము గనుక హిందువులు లక్ష్మిని గూడ అగ్నిముఖముగానే నాహ్వానించవలయును. అందువలన సకారము కృతి ముఖమున శుభప్రదమే యగు చున్నది.

ఇక సిరుల మెఱుంగు బోడి - యను సమాసమున ప్రథమ గణమగు నగణమును గుఱించి ''న గణంబమృతాం ధోనాధ దేవతాకంబుగాన సకల భోగ ప్రదంబని, నలోదయంబునందు హృదయసదా యని కాళిదాసుండును, శివభద్రంబునందు ''ప్రణమిత శిరసి'' యని కవివరుండును, అరణ్య పర్వావ శిష్టంబునందు భీమకవి శాపయంబున

జయుమగోరి ''స్ఫురదరుణాంశురాగరుచి'' యని శుంభదాసుండును, త్రిస్థతి దండకంబునందు ''విజయనగర హేమకూటంబునన్నిల్చియని'' నంది తిమ్మనయు జెప్పిరని యప్పకవి తనకృతియందు నిదర్శనంబులు జూపించెను. అంతేకాక నతడు నగణంబును గుఱించి - నగణ వివేకము. అప్పకవీయము.

సీ॥ ఏకమాత్రలు మూడు - నింద్రుండు పతి యద్భు
తము రసంబు - నిశీకదైవతాక
మారయతండ్రి - బృదారకాధీశుని
దంతావళం బుండు తావునెలపు
దివ్యభోగంబిగి - తెలుపు వర్ణము - జాతి
విప్రము - ఉద్దవవేళ వేగుజాము
రవము షడ్జము - ప్రవ, రంబు వాశిష్టంబు
చుక్కరేవతి - గాము సురగురుండు
గీ॥ వాని తేజంబు పచ్చన - యోనిగజము
రాసి మీనంబు - గణము సుధాశనంబు
నందనుడులేడు - మధ్యమ నగణమునకు
దానవ వినాశకామె వల్లీనివేశ ఆ. 4.84

నగణ ప్రశస్తి - అప్పకవీయము.

సీ॥ గ్రహముల లోన భాస్కరుని విధంబున
దరులలో పారిజాతంబు కరణి
క్ష్మాధరంబుల లోన కనకాద్రికైవడి
నదులలో జహ్ను కన్యక విధమున
దైవతంబులలోన దైత్యారి చాడ్పున
ప్రమధులలో శూలపాణి పగిది
మృగములలోన కరిద్వేషి భాతిని
వివిధ విద్యలలోన వేదముక్రియ
క్షేత్రములలోన వారణాసీ స్థలంబు
కీవినిభముల లోన నైరావణంబు
రీతిగణములలోన జర్జించి చూడ
నగణ మొప్పారు శుభనిధానంబుగాను - ఆ. 4-74

అని చెప్పబడినది. కావున తెలగన్న బాగుగా నాలోచించియే సిరుల మెరుంగు బోడియని లక్ష్మీ ప్రదమైన సకారములోను, ఇంద్రదేవతాకమైన నగణములోను తన యొక్క యాకృతి నారంభించెను.

కవులు సాధారణముగా కృత్యాదిని యిష్టదైవ ప్రార్థన పిమ్మట మరెవరిని స్మరింపకున్నను కవి నాంకవి కనుగ గణపతిని వాగ్దేవతయైన సరస్వతినైన స్తుతించుట పరిపాటికాని యితడెవరిని స్తుతించక చివరకును కవివందనముకు కవినిరాక రణము గూడ జేయక తక్కిన వారివలె నొకే పద్యముతో సకల బ్రహ్మ ప్రార్థన సరిపెట్టి కృతిభర్త వంశావ తారమున నడుగు బెట్టెను.

తెలగన వైష్ణవ మతానుయాయి. వైష్ణవులు విష్ణువును అతని బలగమును దప్పని తరదైవముల స్మరింపరు.

కృతిపతి మహ్మాధీయుడు. వారేకేశ్వరారాధకులు. బహుదేవతాస్తుతి వారి యభిమతము గాదు. అందుచేత తెలగన సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి అని యున్నది కనుక విష్ణువు నొక్కనిని స్తుతించిన చాలు అందరిని స్మరించినట్లేయని భావించి యితడు ఇతర దేశతాస్తుతులు మాని యుండవచ్చును.

చంధోవివేకము-

ఈ కావ్యమందలి కృత్యాది చంపకము. చంపకోత్పలములు మార్గ ఛందోజన్యములే కాని వానికి సంస్కృతమున ప్రచారములేదు. కన్నడాంధ్రము లందే వాని యునికిగాని ఆభాషలో వానికి దేశీయమైన పేర్లులేవు.

10వ చందమున బుట్టిన రుక్మవతినిరుగ్మవతి రూపవతి అని కూడ నందురు. దానికి గూడ చంపకమాలయని పేరున్నది. అది ''భమసగ'' అను గుణములతో నేర్పబడును - సంస్కృతమున దానికి ఆరవస్థానము యతికాగా తెలుగులో నేడవస్థానమై అప్పకవిచే రుక్మవతి కంటె వేరుగా గుర్తింపబడినది. రుక్మమనగా బంగారము. సంపెంగకు హేమ పుష్పియని పర్యామున్నది. దానిని పురస్కరించుకొని మేకవికుమారుడో దీనిని పరంపరిత లక్షణగా చంపకమాల యని పిలిచి యుండును. అది యట్లే నిలిచిపోయినది. ఇదిగాక గౌణవృత్తము లందొక చంపక మాలయున్నది. గౌణములు ప్రాకృతమున తప్ప సంస్కృతమున లేవు గాన లక్షణ కారు లీవృత్తమును గాథలలో చేర్చిరి.

ప్రస్తుతము ప్రసిద్ధమైన చంపకమాల 21వ చందమున బుట్టినది. ''నజభజజజర'' అను గణములతో గూడి 11వ యక్షరము యతిస్థానముగా నుండును. సంస్కృతమున నీవృత్తము గుణగ విజయాదిత్యుని శాతలూరు శాసన మందొకటి మాఘుని శిశు పాలవధ యందొకటి (3-82) యున్నవి. మల్లినాథ సూరి శిశుపాల వధకు వ్యాఖ్య వ్రాయుచు దీనిని చంపకావళియని చెప్పగా నిర్ణయసాగరముద్రణాలయము వారు పంచకావళి యని కొందరు ''ధృతశ్రీ'' యని యందురనిరి. పింగళఛందోటీకలో ఇది సరసి - సలిలనిధియని చెప్పబడినది. ఈ రెండు పేర్లపై రుక్మవతి చంపకమాల వంటి పర్యాయములే. ఇక వృత్త రత్నాకర టీక దీనిని శశివదన యని చెప్పినది. ఈ పేరున సారవ చందనమున బుట్టిన మరియొక వృత్తమున్నది. అది ''నయు'' గణములలో నేర్పబడును. చంపకమున కీటులగంపెడు చరిత్రయున్నది. దీనిని శ్రీరావూరి దొరసామి శర్మగారు తెలుగు భాషలోని ఛందోరీతులు అను గ్రంథమున తెలిపిరి.

ఈ పద్యమున లక్ష్మీదేవి వెన్నుని యొక్క కుడికన్ను మూయుట యను క్రియ ద్వారాతవు యొక్క రహఃకేళిని దర్శించ కుండుటకై బ్రహ్మను వంచించుట సూచించబడినది. క్రియ ద్వారా యటుల రహస్య గోపనము చేయుటను యుక్తి యందురు. యుక్తింపరాతి సంధునం క్రియ యా మర్మ గుప్తయే అని చంద్రా లోకము (89) దీని లక్షణమును చెప్పినది. ఈ యుక్తి క్రియద్వార కాక వాక్కు ద్వారా జరిగినట్లు చెప్పిన యెడల దానిని ఛేకమందురు. ఇది యుక్తి - మరియు ఛేకాలంకారములకు గల భేదము. ఛేకులనగా పండితులు వారు రహస్యమైన దానిని చేష్టవలనగాక తమ వాక్కుచేత గోపనము చేయుచుందురు.

2. వ॥ అని యిచ్చం జెలంగు జేజే దొరం దలంచి యచ్చ తెనుంగుఁ
గబ్బం బొక్కటి యొనరింపం దలంచి యున్న యెడ - 2

టీక :- అని, ఇచ్చం జెలంగు = మనస్సులోనున్న జేజేదొరఁ = దేవతాధి పతిని దలచి, తలచుకొని, యచ్చ తెనుంగు, కబ్బం బొక్కటి = ఒక కావ్యము, యొనరింపఁ దలంచి = నిర్మింప దలచుకొని, యున్న యెడఁ = ఉండనిగా -

తా :- అని, మనస్సులో గల దైవమును దలచుకొని యచ్చ తెనుగు కావ్య మొకటి రచింపవలె నని యను కొను చుండుగా -

3. సీ॥ తెఱగంటి దొరఱాల తెగలఁ దీఱిన కోట
నిగనిగల్ నలుగడల్ నిండియుండఁ
దమ్ముల విందురా కొమ్మల దగదగల్
వేలుపుఁ బ్రోలిర్లు విరియఁ జేయఁ
గొత్త డంబుల కెంపు క్రొత్త డంబుల రంగు
నింగికిఁ దోపు వన్నియలు నింపఁ
గడలి యౌనని చిల్వ పడఁ తిచా లగడిత
తెలినీటి నేప్రొద్దుఁ గలసి యుండ
తే॥ మిసిమి బంగారు మేడల మీఁది యెడల
నిడిన ముత్యాలుఁ జుక్కలుఁ దడఁ బడంగఁ
దెలియకెల్లరు వెఱఁగంద నలరు నెపుడు
మేలు వజ్జీర్ల గమికొండ గోలకొండ - 3

టీక : తెరగంటి దొర = ఇంద్రుడు, ఱాల తెగలన్ = ఇంద్రుని పేరి రాలు అనగా ఇంద్రనీలములయొక్క జాతుల చేత, దీరిన కోట = తీర్చికట్టబడిన దుర్గము యొక్క, నిగనిగల్ = నిగనిగమను కాంతులు, నలుగడిల్ = నాలుగువైపుల, నిండియుండన్ = తమ్ముల విందు = సూర్యుడు తమ్ముల విందుఱా, కొమ్మల = సూర్యుని పేరుగలరాలు, అనగా సూర్యకాంతములచే కట్టబడిన ఆ కోటకొమ్మల యొక్క, దగదగల్ = మెరుపులు వేలుపుబ్రోలు = దేవతల యొక్క పట్టణమైన స్వర్గమందలి, ఇర్లు = చీకట్లు, విరియజేయన్ = విచ్చుకొనునట్లు చేయుచుండగా, కొత్తడంబుల = ఆకోటబురుజుల యొక్క, కెంపు = కెంపులను, రత్నములయొక్క కొత్త డంబుల రంగు = నూతన మైనట్టి శోభయొక్క కాంతి, నింగికి = ఆకారమునకు, తొపువన్నియలు నించన్ = ఎఱ్ఱని కాంతులు నిండించుచుండగా, కడలి యౌనని = సముద్రమగునని, చిల్వపడతిచాలు = నాగకన్యల సమూహము, అగడిత = అగడ్త యందలి, తెలినీటన్ = స్వచ్ఛమైన నీటియందు, ఏప్రొద్దున్ = ఎల్లవేళలందు, కలసి యుండన్ = చేరియుండగా, మిసిమి = కాంతిగల, మేడల మీద యెడల = సౌధముల యొక్క పై భాగములందు, ఇడిన ముత్యాలు = అలంకారమునకై యుంచిన ముత్యములు, చుక్కలు, తడబడంగ = తారుమారు పడుచుండగా, తెలియకన్ = వానిని అనగా నామేడలపై యుంచిన ముత్యములను చుక్కలను యెఱుగలేక, ఎల్లరు వెఱంగదన్ = చూచు వారందరు విస్మయపడుచుండగా, మేలు = శ్రేష్టమైన, వజ్జీర్ల గమికొండ = మంత్రులకు

నివాసమైన కొండయగు, గోలకొండ = గోలకొండయను పట్టణము, అలరు + ఎపుడు = ఎల్లప్పుడు నొప్పుచుండును. వజీర్లు = వజీర్ – పార్సీ – బహు – వజీర్లు – జేర్ అనగా ఆధీనము లేదా ఒకరిక్రింద, ఒకదానిక్రింద కనుక వజీర్ అనగా ప్రభువు క్రింద నుండవాడని యర్థము. వజీరు పదమిచట గణముకొఱకై ''అపిమాషం కుర్యాత్ గణ భగం నకారయేత్తను'' న్యాయమున వజ్జీరయినది. కవులు గణనియమమును బట్టి ఒక్కొక్కపుడట్లు చేయుట గలదు.

ఉదా :- రాళ్ళపల్లిలోన రాళ్ళెన్ని బుట్టెనో
రాళ్ళలోన వజ్జరాలు బుట్టె
వజ్జరాలలోన వలపెట్లు గలిగెరా
కీర్తనీయ చరిత కృష్ణశర్మ-

డా॥ చిలుకూరి నారాయణరావుగారి చాటువు.

తా :- మంత్రి సమూహముల కెల్ల నిలయమైన గోలకొండ యను పట్టణము యొక్క కోట వివిధమైన యింద్ర నీలపురాలతో కట్టబడి నిగనిగలాడుచు అన్ని దిక్కులకు ప్రకాశించు చుండెను. దాని కొమ్మలు సూర్యకాంతపురాలతో నిర్మించబడి యుండెను. వాని దగదగలు స్వర్గ పట్టణమందలి చీకట్లను మాపుచుండెను. కెంపురాలతో కట్టబడిన ఆ కోట బురుజుల కాంతి ఎల్లప్పుడా కాశమునకు నెత్తిడాలు కలిగించు చుండెను దాని చుట్టు గల యగడ్తను జూచి నాగకన్యలు సముద్రము మని తలచి యెల్లపుడా నిర్మలమైన నీటియందే నివసించు చుండిరి. ఆ కోటలోని మేడల శిఖరముల కలం కారమునకై ముత్యములు పొదిగి యుండిరి. చూపరులు రాత్రివేళ నాకాశమున మొలిచిన నక్షత్రము లేవియో మేడలకు పొదిగిన ముత్యము లేవియో పోల్చుకొన లేక పొరబడు చుండిరి.

ఈ పద్యమున మొదటి పాదమున స్వభావోక్తి, రెండవదానిలో నతిశయోక్తి, మూడవ దానియందు తద్గుణము, నాలుగవ పాదమున మరియు గీతమున భ్రాంతిమత్తను నలంకారములున్నవి.

విశే :- గోలకొండ కోటయొక్క స్వరూపము – ఇది భూమికి సుమారు నాలుగు వందల యడుగుల యెత్తుపైగల యొక కొండపై సుమారేడు మైళ్ళ కైవారమున గ్రానైటు రాయితో కట్టబడినది. ఇది మూడు ప్రాకారములతో మూడంతస్థుల గవాక్షములతో నున్నది. దీనిగోడలు 17 నుండి 30 అడుగుల మందమున్నది.

ఈ గోడలపై ఫిరంగుల మర్చుటకు 87 అర్ధచంద్రాకారపు రాతి బురుజులు నిర్మించినారు. ఒక్కొక్క బురుజు యెత్తు 50 నుండి 60 యడుగులుండును. ఈకోటకు మక్కా, జమాలి, బంజారా, ఫతే యని నాలుగు వైపుల నాలుగు మహాద్వారములున్నవి. ఆద్వారము లన్ని ఖరీదైన టేకు దూలములతో తయారు చేసి ఇనుప రేకులతో మొన దేలిన ఇనుప కడ్డీలు తలుపుల కమర్చబడినవి. అవి ఫిరంగుల ధాటికి గూడ తట్టుకొను చుండెను. ఈ కోట ప్రవేశ ద్వారమున చప్పట్లు కొట్టిన దాని ప్రతిధ్వని దుర్గముపై గల రాజాగారి విశ్రాంతి గదిలోనికి వినిపించును.

ఇబ్రాహింషా ప్రశస్తి -

4. కII ఆవీడేలుఁ సొబగుల
పూవిల్తుఁడు, నిచ్చ వాగపుంబులి యనఁగా
దీవులకుఁ బాదుసాలకు
దేవర యిభరాముశాహు తే జడరంగన్ - 4

టీక :- ఆవీడు = ఆ పట్టణమును, సొబగుల పూవిల్తుడు = అందములందు మన్మథుడు, స.త. అయినవాడు, వాగపుంబులి = (చేప. రూ); వాగ = బలము/సత్తువ బలమునకు పులియైనవాడు, అనగాఁ = అనునట్లుగా, నొప్పుచు, దీవులకు = ద్వీపములకు, పాదుసాలకు దేవర = ప్రభువులకు ప్రభువైన, ఇభరాము పాదుసాహుడు = ఇబ్రహీము ప్రభువు, తేజ + అడరంగఁ = తన యొక్క ప్రతాపము లెస్సగా ప్రకాశించు చుండగా, నిచ్చఁ = ఎల్లప్పుడు, ఏలుఁ = పాలించును - (బాద్షా - ఫార్సీ - బాద్షా అనగా ఉన్నతుడని శబ్దార్థము. ఏలిక యని రూఢి - రహమ్ = దయ, రహీమ్ = దయ గలవాడు, ఇబ్రాహీమ్ = దయగలవాని కుమారుడు - అనగా మహ్మదీయ మతానుసారము దేవుని కుమారుడని యర్థము- ఇబ్రహీమ్=ఇభరామ, శాబ్దికమైన సంస్కృతీకరణము -)

తా :- ఆ పట్టణమును అందములందు మన్మథుడు బలమునందు పులియన దగిన ఇబ్రహీము పాదుషా దీవులకు మరియు వానిని పాలించు సామంతులందరికి ప్రభువై ఎల్లపుడు పాలించు చుండెను.

విశే :- శౌర్య పరాక్రములకు హిందులు సింహమని పేరుపెట్టుకొనగా మహమ్మదీయులు షేర్షా, షేర్ఖాన్ అని పెద్దపులి పేరుపెట్టు కొందురు. దర్గాల మొదలైన వారి

కట్టడములపై గూడ పులి బొమ్మలే యెక్కువ దర్శన మిచ్చును కనుక తెలగన్న ఈ పద్యమున నిబ్రహీం బాదుషాను ''చాగకుంబులి'' యని విశేషించి యుపమా నౌచిత్యమును పాటించెను. పులు లెక్కువగా ద్వీపములలో నివసించును. అందువలన దానికి ద్విపి యని పేరు. ఇబ్రాహీము పాదుషా దీవులకన్నిటికి రాజు కనుక నా విధముగా గూడ నతనికి పులియను నుపమానము చెల్లును.

''అలం : ఉల్లేఖము''

పురాణములందు ద్వీపములు పదునెనిమిదని ప్రసిద్ధి – అవి ఇవి. 1) అశ్వభద్రము 2) ఋషభము 3) కేతువు 4) కైవల్యము 5) గోభి 6) చౌరకృతము 7) ద్వారక 8) నిమ్లోచనము 9) నియామ్యము 10) పారావారము 11) పుష్కరము 12) మలయము 13) మాల్యము 14) మాల్యవంతము 15) రమణకము 16) రమ్యము 17) రైవతకము 18) సింహళము.

5. చ॥ దురమున నోడిపోయి మఱి త్రోవలుగానక మార్తు రెంతనే
ర్పరు లిభరాము శాహువు తిరం బగునండను జేరి తొంటియ
చ్చెరు వగు సొమ్ము రాకొమరుచే గడు మ్రొక్కులఁ గాంతురౌఁ గదా
వెరవకు లైన వారలకు వింతయె యాసిరు లెందు నుండినన్ – 5

టిక : మార్తురు + ఎంత నేర్పరులు = ఔరా ! ఇభరాము పాదుషా యొక్క శత్రువు లెంత తెలివిగలవారు; దురమునన్ = యుద్ధరంగమున ఓడిపోయి, మఱి, త్రోవలుగానకన్ = తప్పించుకొనుటకు దారులేవి ఎరుగలేక, ఇభరాము శాహువు = ఇబ్రాహీము పాదుషా యొక్క తిరంబగు = స్థిరమైన యండును, జేరి = ప్రాపునుపొంది, కడు మ్రొక్కులన్ = మిక్కిలియగు నమస్కారములతో, రాకొమరుచేన్ = ఆ రాకుమారుని చేత, తొంటి = పూర్వపుదైన, అచ్చెరువగు సొమ్మున్ = తామోడిపోయిన యాశ్చర్య కరమగు సంపదను, కాంతురు = పొందుచుందురు; వెరవరులైన వారలకు = ఉపాయముగల వారికి, ఎందున్ + ఉండినను = ఎచట నుండినను అనగా స్వతంత్రముగా నున్నప్పటికీ లేదా సామంత స్థానమున నున్నప్పటికీ, ఆ సిరులు = తమ యొక్క పూర్వవైభములు పొందుట, వింతయే = ఒక చిత్రమా! అనగా కాదు ఔగదా ! షాహ్ = ఫా గొప్పవాడు – షాహ్ = వి. శాహువు.

తా :- ఔరా ! ఇబ్రహీము పాదుషా యొక్క శత్రువు లెంత నేర్పరులు. వారు యుద్ధరంగమున నోడిపోయి తమకు మరియొక రక్షణమార్గ మేది కనబడ నపుడతనిని చేరి నమస్కరించి - కాపాడుమని ప్రార్థించి - ఆరాకుమారునిచే మరల తమ యొక్క మొదటి యైశ్వర్యమును పొందు చుందురు. ఉపాయశాలులైన వారి కెందుండినను అనగా నస్వతంత్రముగా నున్నను, మరియొకరికి సామంతులుగా నున్నను, తామెప్పటి వలెనే సిరులు పొందు చుండుట ఇది చిత్రమా! అనగా కాదు, అవును గదా ! అనుట.

''అలం - వ్యాజస్తుతి (స్తుతిలో నింద)''

విశే : దిగ్విజయ యాత్రలో ప్రభువులు తాము జయించిన వారిని తమ నాశ్రయించినప్పుడు సామంతులుగా జేసుకొని పూర్వవైభవమున మరలనదే స్థానములందు నిలుపుట యాచారము. కనుక ఇభరాము పాదుషా గూడా యుద్ధములందోడి తమ నాశ్రయించిన వారిని జయించినటువంటి యొక్క సంపదనంతా తిరుగ యిచ్చి వారలనదే స్థానమున యెప్పటివలె నిలుపుచుండెనని దీని వలన తెలియును.

6 సీ॥ తెలివి సింగంపు గద్దియల రాతెఱంగంటి
దొరలెల్ల మోడ్పుఁ జేతులనె కొల్వఁ
బూని యేఁబదియాఱు మానిసి నెలవుల
పుడమిఱేం డ్లాడిగంబులకుఁ జొరఁగ
తీవి మున్నీటిలో దీవు లన్నియు నేలు
మున్నీలు మెట్టఁ దామర కెరఁగఁ
దనతేజు సుడిగట్టు వెనుక చీఁకటినెల్ల
విరియించు తమ్ముల తవిందు గాఁగ
తే॥ వెలయు మలికిభరామును గొలిచి మనుచుఁ
గలనఁ దనచెయ్యి మీఁదుగాఁ గడిమి మెఱసి
మేలు సిరులందు నట్టి యమీను ఖాన
యొడయఁ డొకనాఁడు నిండు పేరోలగమున - 6

టీక :- తెలివి = ప్రకాశమైన, సింగపు గద్దియల = సింహాసనముల పైగల రాతెఱంగంటి దొరలెల్లన్ రాజేంద్రులందరు, మోడ్పున్ + చేతులనె = ముకలించిన హస్తముల

చేతనే, కొలువన్ = సేవించుచుండగా, పూని = ప్రయత్నపడి, ఏబదియారు మానిసినెలవుల = ఏబది యారు దేశముల యొక్క, ప్రాచీన దేశము లేబది యారని ప్రతీతి. పుడమితేండ్లు = భూపాలురు, ఊడిగంబులకున్ + చొరగ = సేవలకు చొచ్చుచుండగా, రివిన్ = దర్పముగా, మున్నీటిలో = సముద్రములో గల, దీవులన్నియు నేలు = ద్వీపములన్నియు నేలు, మన్నీలు = రాజులు మెట్ట + తామరల కెఱగ = మెట్టదామరలు = స్థల పద్మములు అనగా పాదములు, స్థల పద్మములైన పాదములకు నమస్కరించు చుండగా, తన తేజు = తన యొక్క ప్రకాశము, సుడిగట్టు వెనుక = చక్రవాళ పర్వతము యొక్క వెనుక గల, చీకటినెల్లన్ = అంధకార మంతయు, విరియించు = తొలగించు, తమ్ముల విందుగాగ = పద్మబాంధవుడు, అనగా సూర్యుడు కాగా, వెలయు = ఒప్పుచున్నటి, మల్కిభరామును = మలిక్ ఇబ్రాహీమును, గొలిచి = సేవించి, మనుచు = జీవించుచు, కలనన్ = యుద్ధరంగములందు, తన చెయ్యి మీదుగాన్ = తన యొక్క హస్తము అందరిని మీరు చుండగా కమిడి మెఱసి = గొప్పదనమును పొంది, మేలు సిరులందు నట్టి = శ్రేష్ఠమైన సంపదలు పొందుచున్న, అమీను ఖాను యొడయడు = అమీనుఖాననే ప్రభువు ఒకనాడు, నిండు పేరొలగమున = నిండు కొలువులో-

అర్థ విశేషము -

మిల్కియత్ = (అ) = ఆస్తి, మాలిక్ = ఆస్తికి అధికారి అనగా యజమాని, మలిక్ = ప్రభువు, అమన్ = (ఉ) శాంతి అమీన్ = శాంతిని కాపాడు వాడు - ఇది యొక పదవీ వాచకము.

తాత్పర్యము -

మల్కిభరాముని తేజము చక్రవాళ పర్వతము యొక్క వెనుకగల చీకటిని సూర్యుడై తొలగించుచుండెను. శోభలుజిందు సింహాసనములపై కూర్చుండెడు ప్రభువులందరతనిని చేతులు గట్టుకొని సేవించు చుండిరి. ఏబదారు దేశముల సామంతులందరతనిని కావలయునని యూడిగములు సల్పు చుండిరి. సముద్రము లందలి ద్వీపముల నేలు ప్రభువులందరు మెట్ట తామరల వలె నున్న యా మహారాజు పాదము లకు మ్రొక్కుచుండిరి. అటువంటి మల్కిబ్రహీము ప్రభువు ను అమీను ఖాను అనురాజు సేవించి జీవించుచు యుద్ధరంగములందు చేయి మించిన వాడని

పేరంటి యా మహారాజా యొక్క యనుగ్రహమున సిరులు పొందుచుండెను. అతడొకనాడు నిండు కొలువున - ముందరి పద్యములో నన్వయము.

అలం :- మూడవ పాదమున సామ్యనిబంధన నాలుగవదానియందు రూపకము.

ఏబదారు దేశములు :-

ఏబదారు దేశములు నేడు వాని యొక్క ఉనికి

అంగ – పశ్చిమ బెంగాలు

అవంతి – నర్మద కుత్తర భాగము

కనాకుబ్జ – కనోజి

కర్నాటక – మైసూరు

కళింగ – ఒరిస్సా

కాంబోజ – అఫ్ఘానిస్తానము

కామరూప – బర్మా సముద్రప్రాంతము

కాశి – బెనారస్

కాశ్మీర – కష్మీరు

కిరాత – భారతమునకు తూర్పు భాగము.

కుంతల – తుంగభద్ర హంగరీ నదుల భాగము

కుకుర – చంబల్ నదీ తీరము

కురు – మధ్యప్రదేశము

కేకయ – అఫ్ఘానిస్తానము

కేరళ – తిరువాన్కూరు

కోంకణ – మలబారు సమీపము

కోసల – అయోధ్య ప్రాంతము

గాంధార – అఫ్ఘానిస్తానము

గౌడ – సరయూనది కుత్తరదేశము

ఘూర్జర – గుజరాతు

చేది – చంబల్ నదీతీరములోని బోగ్లీకుండ్

చోళ – కాంచీపురము

జలంధర – లాహోరు

టెంకణ – రంగూన్ క్రింది భాగము
త్రిలింగ – ఆంధ్రదేశము
దశార్ణ – దక్షిణకోసల
ద్రవిడ – తమిళనాడు
నేపాల – నేపాలు
పాంచాల – పంజాబు
పాండ్య – మధుర, తిరునల్వేరి
పానాట – ఉత్తర సర్కారు
పాట – పాట్నా
పులింద – యమునా తీరపశ్చిమము
బంగాళ – బెంగాలు
బర్బర – బర్మా
బాహ్లీక – బెలుచిస్తానము
భోజ – బీరారు ప్రక్క దేశము
మగధ – బీహారు
మత్స్య – జబల్పూరు ప్రాంతము
మద్ర – పంజాబులోని దేశము
మలయాళ – మలబారు
మహారాష్ట్ర – బొంబాయి రాష్ట్రము
మాలవ – మాల్వా
యావన – టర్కి
లాట – ముల్టాన్
వంగ – బెంగాల్ దేశము
వరాట –
విదర్భ – బీహారు
విదేహ – దర్భాంగ
శూరసేన – ఢిల్లీకి దక్షిణ ప్రాంతము
సాళ్వ – నాగపూరు ప్రాంతము
సింధు – సింధు జీలంనదుల నడిమి దేశము

సింహళ - సిలోను
సురాష్ట్ర - గుజరాతు
సేవర - సింధూ రాష్ట్ర మధ్యప్రదేశము
హూణ - యూరోపు
చూ : - భవిష్యద్భారతావని
పు 62 - 63 గ్రంథకర్త
N.S. అవధాని

దానియందీ దేశములు హిందూ దేశ పటమున గుర్తించబడినవి.

7. చ॥ పొలఁతుల్ చుట్టలు రాయబారులు దొరల్ ప్రోడల్ చెలుల్ మన్నెవా
రలు మావంతులు దీవులే బలియల్ రౌతుల్ మొదల్గాఁ దనుం
గొలువన్ సంతస మంది కబ్బములు పేర్కోవించుఁ బిల్పించి న
న్నల రంగాఁ దనదండ నుంచుకొని నెయ్యంబొప్ప మన్నించుచున్- 7

టీక :- పొలతుల్ = స్త్రీలు, చుట్టలు = బంధువులు, రాయబారులు, దొరల్ = దొరలు ప్రోడల్ = నేర్పరులు, చెలుల్ = స్నేహితులు, మన్నెవారలు = మన్నీలు, మావంతులు = మావటివారు, దీవులేలు బిలియుల్ = ద్వీపములను పాలించు బలవంతులు, మొదల్గాన్ = మొదలుగా, తనుంగొలువ = తనను సేవించుచుండగా, సంతసమంది = సంతోషమును పొంది, కబ్బములు పేర్కోవిందు = మహమ్మదీయ ప్రభువులంకితముగా గొనిన తపతీ సంవరణమువంటి కావ్యములుగా వచ్చును. అటువంటివి చెప్పుచుండగావినుచు, నున్ను = పొన్నగంటి తెలగనన్నైన నన్ను, అలరంగా బిల్పించి = సంతోషమున పిలించుకొని, తనదండన్ = తనప్రక్కగా, నుంచుకొని, నెయ్యంబొప్పన్ = స్నేహము గనిపించు చుండగా, మన్నించుచున్ = గౌరవించుచు -

తా :- ఆ మహారాజు నిండుగా కొలువుదీరి యాకొలువున నూడిగపు కత్తెలు, చుట్టాలు, రాయబారులు, దొరలు, మన్నీలు, దీవులేలు వారు, మావంతులు, విద్యలలో నేర్పరులైన వారు, స్నేహితులు మొదలైన వారందరు సేవించుచుండగా సంతోషమున నుండి యా కొలువున ప్రసంగ వశమున తమ పూర్వులు, మరియు తన సాటి వారైన ప్రభువులు కావ్యములు వ్రాయించుట, యంకితములు గొనుట విని పొన్నగంటి తెలగనైన నన్ను పిలిపించుకొని గౌరవించి తన ప్రక్కన నుంచుకొని.

8 క॥ కలపము చేసిన గంధం
బలఁదించిన వెనుక వన్నియల పచ్చడముల్
పలుమానికముల సొమ్ములు
బలుతేజీ లిచ్చి కూర్మిపైఁ బైఁ బర్వన్ - 8

టీక :- కలపము చేసిన = బాగుగా కలిపి పలుచుగా చేసిన, గందంబలందించి న వెనుక = గంధము పూయించిన వెనుక, వన్నియల పచ్చడముల్ = రంగురంగుల శాలువాలు, పలుమానికముల సొమ్ములు = వివిధమైన రత్నాభరణములు, బలుతేజీలు = మేలైన గుఱ్ఱములు యిచ్చి, కూర్మి పైబై బర్వఁ = నాపై తన ప్రేమ మీాద అనగా మిక్కిలిగా ప్రసరించు చుండగా -

తా :- పలుచగా కలిపిన గంధము పూయించి రంగరంగుల శాలువా జోడుగప్పి రత్నాభరణములు మరియు మంచి గుఱ్ఱముల నిచ్చి నాపై తన ప్రేమ మిక్కిలిగా ప్రసరించు చుండగా-

విశే :- పూర్వము మహారాజులు కవులకు కావ్యము వ్రాయుమని యాదేశించు నపుడు వారిని పిలిపించుకొని గద్దెపై కూర్చుండ బెట్టి గంధ మలదించి, జోడుశాలువాలు గప్పి, రత్నాభరణములు తొడిగి కర్పూర విడియ మిచ్చి ఆనాటి కవులకు సంచారార్థమై గుఱ్ఱము లవసరమగు చుండెను. కనుక మంచి గుఱ్ఱముల నిచ్చి -

9 మ॥ తనకు న్నిచ్చలు మ్రొక్కు వారిని సిరుల్ దైవాఱఁగాఁ జల్ల చూ
పున నెల్లప్పుడుఁ జూచి మన్పఁ గల పెంప్రోడఁ మఱిం గంటియ
ప్పనగారిఁ మదిలోని మాట దెలియం బాటించుచుం గాంచినఁ
గని యామేటి తలం పెఱింగి పొసగంగా నన్ను మన్నించుచున్ - 9

టీక : తనకుఁ, నిచ్చలు = ఎల్లపుడు; మొక్కువారిని = నమస్కరించువారిని, సిరుల్దైవారగాఁ + చూచి = సంపదలు పొంగి పొరలు నట్లుగా, చల్ల చూపున = చల్లని చూపులతో, నెల్లప్పుడు, చూచి, మన్పగల = కాపాడగల, పెఁప్రోడన్ = మిక్కిలి సమర్థుడగు వానిని, మరింగంటి యప్పనగారిఁ = మరింగంటి యప్పనయను వానిని, మదిలోని మాట దెలియఁ = తన మనస్సులోని మాట తెలియనట్లుగా, పాటించుచుఁ+ కాంచినఁ = సంకేతించుచు చూడగా, యామేటి= మహాపురుషుడు, కని = అమీాను ఖానుని చూచి, తలంపెరిగి = అతని

మనస్సులోని కోరిక నెరిగి, పొసగంగాఁ = దానికి తగినట్లుగా, నన్ను, మన్నించుచుఁ = గౌరవించుచు.

తా :- ఈ పద్యమున మరింగంటి యప్పనగారి మహత్వము చెప్పబడినది.

ఆయన తనకెల్లపుడు నమస్కరించుచు విధేయులై యుండువారిని కరుణా దృష్టితో యెప్పుడు గూడ వారికే యాపదరాకుండ చూడగల సమర్ధుడగు మరింగంటి యప్పనగారను మహాపురుషుని యమీను ఖాను తన యొక్క మనస్సులోని మాట యతనికి తాకునట్లు చూడగా పరేంగితజ్ఞుడగు వాడు పండితుడు లాతివాడు పామరుడు కనుక నతని యొక్క హృదయ మెరిగి యప్పటికి తగినట్లుగా నన్ను గౌరవించుచు-

విశే :- మరిగంటి వారి నివాసము నల్లగొండ జిల్లా. పరమ వైష్ణవులైన ఈ వంశీయులందరు ఆచార్యులైన, నృసింహస్వామి భక్తులై గొప్ప యుపాసకులు, మరియు మంత్రవేత్తలై తమ యొక్క దైవికమైన శక్తిచే ఆశ్రితుల నే యాపద సోకకుండ కాపాడు సమర్ధత గలవారై యుండిరి.

తెలగన్న చెప్పుకొనిన విధానమును బట్టి చూడు మరింగంటి యప్పనగారు తాను ప్రవేశించు నాటికే యమీను ఖాను నాస్థానమున నుండెను. బహుశః యతని వైభవము గూడ యప్పనగారి యనుగ్రహ బలముననే సాగుచుండెనేమో ! మహమ్మదీయుడైన యమీనుఖాను నాస్థానమున వైష్ణవాగ్రేసరుడైన మరింగంటి యప్పనగారుండుట, యానాడతనిని యమీనుఖాను తన మనసులోని మాట చెప్పుకొను వానిగా మన్నించుట సంఘమున గల యానాటి మత సమైక్యతకు నిదర్శన మనదగును.

10ఆ:- పిలిచి పొన్నికంటి తెలగన్న, నీ చేయు
నచ్చ తెనుఁగుఁ గబ్బ మన్ని యెడల
మించి వెలయఁగా నమీను ఖానునకిచ్చి
పుడమిలోన సిరులఁ బొగడు గనుమె ! - 10

టీక :- పిలిచి, పొన్నగంటి తెలగన్న, నీ చేయు = నీవు రచించు, నచ్చ తెనుగు కబ్బము = అచ్చ తెనుగు కావ్యము, అన్ని యెడలఁ = అన్ని దిక్కులందు, మించి వెలయగాఁ = అన్నిటిని మించి గొప్పగా ప్రకాశించు నట్లుగా అమీను ఖానునకుఁ + ఇచ్చి,

పుడమి లోనన్ = ప్రపంచమున, సిరులన్ = ఐశ్వర్యములతో, పొగడు గనుము కీర్తిని పొందుము.

తా :- దగ్గరగా పిలుచుకొని, ఓ పొన్నగంటి తెలగనా ! నీవు రచించు యచ్చ తెనుగు కావ్యమైన ఈ యయాతి చరిత్రను తెలంగాణమున నన్ని దిక్కులందును ప్రకాశించునట్లుగా యీ యమీను ఖానునకు కృతి యిచ్చి సంపదలతో కీర్తిని పొందుము.

విశే :- పొన్నగంటి యనునది యిచట కవిగారి యింటిపేరు. సాధారణముగా తెలుగు వారి యింటిపేర్లు నూటికెనుబది శాతము గ్రామనామములే. పొన్నకల్లు గ్రామ వాచకము. పొన్నకంటి, నెమిలికంటి, మరింగంటి, రావికంటి - ఇత్యాదులందలి కంటి ''కల్లు'' అను శిలావాచకము యొక్క ఉపవిభక్తియగు ''ం'' ''టి''తో కూడిన పుష్ప్యంత రూపము.

11 క॥ మున్నెవ్వరు నొడువని యీ
తెన్నిడి కడుమీఱి యచ్చ తెనుఁగుం గబ్బం
బెన్నిక మీఱగ జెప్పిన
నిన్నుం బొగడంగఁ గలఁడె నెలతాల్పయినన్ - 11

టీక :- మున్ను = ఇంతకు పూర్వము, ఎవ్వరు నుడువని = ఎవరు గూడ చెప్పని, ఈ తెన్నిడి = రామార్గము నవలంబించి, కడుమీరి = మిక్కిలిగా యతిశయించి, అచ్చ తెనుగు కబ్బంబు = అచ్చ తెనుగు కావ్యము, ఎన్నిక మీరగన్ = నలుగురు లెక్కించునట్లుగా, చెప్పిన, నెలతాల్పయినన్ = శివుడైనను, నిన్నున్ = పొగడంగ కలడే = పొగడ గలడా ! -

తా :- ఓ తెలగన్నా ! ఇంత వరకెవ్వరును చెప్పని ఈ మార్గము ననుసరించి నీవు మిక్కిలి గొప్పగా నుండునట్లుగా నచ్చ తెనుగు కావ్యమును నలుగురు మెచ్చునట్లుగా రచించ గలిగిన నిన్ను శివుడైనను పొగడలేడు సుమా !-

విశే :- నలుగురు

క. కవితా కన్యకు నలుగురు- కవిజనకుడు భట్టుదాది గణుతింపంగా
నవరస రసికుడు పెనిమిటి - అవి వేకియె తోడబుట్టు వవనీ నాదా ! అని ఒక చాటువు.

నలుగురనగానికుప యనేకులని తాత్పర్యము-

12 ఉ॥ అచ్చ తెనుంగు బద్దె మొకటైనను గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుచుందు రది యెన్నుచు నేర్పునఁ బొత్తమెల్లని
ట్లచ్చ తెనుంగునన్నుడువ నందుల చంద మెఱుంగు వారునీ
మెచ్చరొ యబ్బురం బనరొ మేలనరో కొనియాడరో నిన్నున్ - 12

టీక :- అచ్చ తెనుంగు పద్దెమొకటైనను, కబ్బములోన నుండినన్ = కావ్యము లలో నున్న యెడల హెచ్చని యాడు చుందురు = గొప్పయని పలుకుదురు, అది యెన్నుచు = దానిని లెక్కకు తీసికొని, నేర్పునన్ = నేర్పుచేత, పొత్తమెల్ల నిట్లచ్చ తెనుంగు నన్నొడువన్ = పుస్తక మంతయు నీవిధముగా నచ్చ తెనుగులో చెప్పగా, అందుల చంద మెఱుంగు వారు = దానిలోని సౌందర్యము తెలిసినవారు, ఎదన్మెచ్చరొ = మనస్సులో మెచ్చుకొనరా !, అబ్బురం బునరో = ఆశ్చర్య యనరా! మేలనరో = బాగున్న దనరా !, కొని యాడరో నిన్నున్ = నిన్ను పొగడరా ! -

తా :- ఓ తెలగనా ! అచ్చ తెనుగు పద్యమొక్కటి యైన కావ్యమున నున్న యెడల నదిగొప్పయని పొగడు చందురు. కావున దానిని మనస్సులో నుంచుకొని యీ విధముగా కావ్యమంతయు నచ్చ తెనుగున రచింపగా దాని సౌందర్య మెరిగిన వారలు, మనస్సులో మెచ్చుకొనరా ! అబ్బుర పడరా ! ఆశ్చర్యమనరా ! మేలు మేలనరా ! నిన్ను కొనియాడరా ! -

అనగా నిన్ను భుజముల పైననో పల్లకీ పైననో యెత్తుకొని వీధులలో సంతోషమున నాడుచు నూరేగరా ! -

విశే :- జాను తెనుగు పేర అచ్చ తెనుగుపై అభిమానము ప్రకటించిన మొదటి కవి నన్నెచోడుడు దానికుదాహరణ పద్యము రచించిన వాడు పాల్కురికి సోమనాధుడు. అచ్చ తెనుగు పద్యమునకు మొదట కావ్యమున స్థానము కల్పించినవాడు నాచని సోమనాధుడు.

తిక్కన-పోతనాదుల రచనలలో పేర్లు తప్ప పద్యమంతయు నచ్చ తెనుగు, కొన్ని సందర్భములందు పూర్తిగా నచ్చ తెలుగు రచనమగు పించినను వారవి సహజ ధోరణి యందు వ్రాసినవేగాని యచ్చ తెనుగను నభిమానమున రచించినవి కావనవలెను.

13. అనవుడు బళినా కబ్బం
బునకుఁ జేడబ్బెఁ దావి పుత్తడికింగ
ల్గినటివి ననుచు మదిలో
నను సంతసమంది కూర్మినన లెత్తంగఁ - 13.

టీక :- అనవుడు = అనిన పిమ్మట, బళి = ఆహా, నాకబ్బంబునకుఁ = నా కావ్యమునకు, తావి పుత్తడి కిం గల్గిన టీవి = బంగారమునకు పరిమళ మబ్బినట్లు, జేడబ్బెఁ = కృతిపతి లభించెను, అనుచు మదిలోనను, సంతసమంది; కూర్మినన లెత్తంగఁ = నా మనస్సులో సంతోషము మొగ్గ దొడుగుచుండగా -

తా :- మరిగంటి యప్పన గారా విధమున జెప్పిన పిమ్మట నాకావ్యమునకు బంగారమునకు పరిమళ మబ్బినట్లు తగిన కృతిపతియైన రాజు లభించెనని మనస్సున సంతోషము పొటమరించగా - అలం - ఉపమ.

14 కII తెనుఁగునను మాఱు పేర్లిడి
పెనఁచిన వినఁగూడ దనుచు బిరుదులుఁ బేళ్ళుఁ
మును వేల్పు బాస వెంబడి
నునిచెదఁ గా దనకుఁ డయ్యె యుల్లము లందున్ - 14

టీక :- బిరుదులు పేళ్లుఁ = వ్యక్తులకు గల బిరుదులు మరియు నామములు, తెనుగునను మారు పేర్లిడి పెనిచిన = అచ్చ తెనుగున మారు పేర్లుగా నల్లన యెడల, వినగూడదనుచు మునువేల్పు బాసవెండి = పూర్వపు సంస్కృత భాషా మర్యాద ననుసరించియే, ఉనిచెదఁ = ఉంచెదను, ఉల్లములందుఁ = మనస్సు లందు, కాదనకు దయ్యా.

తా :- బిరుదులుగాని పేర్లుగాని అచ్చ తెనుగున ననుసరించిన యవి వినరానివిగా నుండును. గావున వానిని మొదట సంస్కృత భాషయందే యుంచెదను. దానిని కాదనకుడు.

15వ:- అని పలికి లాలసరిగ జాంకుశుండును రాయపక్షి సాళ్వుం
డును సతకా సింహాసనా ధీశ్వరుండును సింగిణీ సురత్రా
ణుండును దురగారోహణ రేవంతుండును సింహ తలాట
రాయుండును నగు మలికిభరాము పాదుషా హునకు
నితవరియై చదువులకుం గుదురై మన్ననల కెన్నికయై చెన్నొందపీ
నమీనుఖాన సింగంబు వంగడంబు నేర్పుఱిం చెద నది యెట్లనిన.

ిక :- అని పలికి = అని చెప్పి లేదా విన్నవించి - లాలసరిగ జాంకుశుండును = ఈ బిరుదము బిరుదావళులందు లాలు సరియని ప్రయోగింప బడినది. దీనికి శ్రీ గడియారము రామకృష్ణశర్మగారు లాలస + అరి + గజాంకుడని పదచ్ఛేదమును సూచించిరి. కాన నాపక్షమున లాలసులైన అనగా కేవలము భోగ వ్యాపరులైన శత్రువులను గజములకు అంకుశము వంటి వాడు అనగా వారి నదుపున నుంచు వాడని చెప్పవచ్చును. మరియొక పక్షమున లాలసరులనగా నశ్వములకు కోవెల కట్టినపుడు దాని వేసిన గుడ్డకు నలంకారముగా క్రిందవ్రేలెడు దండలు. ఏనుగులకు మదమెత్తునపుడు మావటీలు వానికి గూడనే లాలసరులు వేసి విడిచెదట. నని యా ఏనుగ తెరువెవరును పోకుండుటకై యొక గుర్తు. కావున నట్టి మదించిన యేనులపాలిటి కంకుశము వంటి వాడు. అనగా గజారోహణ విద్యయందు నేర్పరియని చెప్పవచ్చును.

- రాయపక్షి సాళ్వుండును = శ్యేనజాతికి పక్షిరాజము, లేక రాయపక్షులని వ్యవహారము ఈనాడు గూడ అమెరికా, జర్మని చైనా దేశముల రాజచిహ్నములు డేగలే. కావున రాజాలను పక్షులయందు సాళువము వంటి వాడని తాత్పర్యము, మృగములందు సింహ శార్దూల వాచకములవలె పక్షులందు బైరి, సాళువము శ్రేష్ఠతా వాచకములుగా నున్నవి. వనపర్తి ప్రభువులకు బైరియని బిరుదు. దానిని వారి బహిరీ యని చెప్పుకొను చుండిరి. కావున రాజాలను పక్షులయందు సాళువము వంటివాడు అనగా రాజశ్రేష్ఠుడని, మరియొక పక్షమున సాళువము వేటపక్షి కనుక రాజాలను పక్షులకు సాళువము వంటివాడు అనగా యుద్ధములందు సాళువము తక్కిన పక్షులను పొడిచి చంపునట్లు సంహరించువాడని యర్థము. మల్కిభారామున కీబిరుదు తల్లికోట యుద్ధా నంతరమే యేర్పడి యుండునని తపతీ సంవరణ పీఠికయందు శ్రీతిరుమల రామచంద్రగారభిప్రాయపడిరి.

సతకా సింహాసనాధీశ్వరుండును = రాజాలకు గల సింహాసనాధీశ్వర బిరుదములనియు స్థలవాచకములైన వారి ప్రథమ పట్టణముల చేతనే ముడిపడి యున్నవి. మల్కిబ్రాహీము పూర్వులు టర్కినివాసులు కనుక సతకాయనునది టర్కిలోని వీరి మొదటి నివాసమైన యొకానొక నగర నామము కావచ్చును. చోళులు తెలుగు దేశమందలి వేర్వేరు ప్రాంతములను పాలించి నప్పటికీ వారు ఒరయూరు పురవరేశ్వర కోడూరు పుర వరేశ్వర యని తమిళ దేవమందలి నగర నామములనే వారి బిరుదావళియందు చేర్చుకొనుటొక యుదా హరణముగా

నెన్నవచ్చును. మరియొక పక్షమున సతకాయనగామహమ్మదీయ మతనమున దేవాదాయ ధర్మాదాయము వంటి యొకశాఖ కావచ్చునని శ్రీ గడియారము రామకృష్ణ శర్మగారభిప్రాయ పడిరికాన మల్కిభరాము డట్టి ధార్మిక సంస్థకు అధ్యక్షపీఠ మలంకరించి యుండవచ్చును - సింగిణీ సురత్రాణుండును = సింగిణి శార్ఙ శబ్దము యొక్క వికృతి రూపాంతరము. సుర త్రాణ, సురదాణ వాచకములు, ''సుల్తాను'' అను పారసీ పదమునకు సంస్కృతీ కరణములు, సురత్రా ణుడనగా దేవతలను రక్షించువాడని, సురధాణు డనగా నింద్రుడని సిఘంటు పరమైన యర్థములు కావున సింగిణీ సురత్రాణు డనగా చాపవిద్యయందు ఇంద్రుని వంటి వాడని, లేదా చాపము చేత దేవ బ్రాహ్మణులను రక్షించు వాడని యీ బిరుదమున కర్థములు చెప్పవలసి యుండును -

సురత్రాణ వికారమైన సురతాణి నపుంసక లింగమైనపుడు మేలైనదని స్త్రీలింగమై నపుడు స్వతంత్రురాలని యర్థములున్నవి. కనుక వానిని పురస్కరించుకుని సింగిణీ సురత్రాణ శబ్దమునకు చాపవిద్యయందు శ్రేష్ఠుడు లేదా స్వతంత్రుడని యర్థములు చెప్పవచ్చును -

తురగారోహణ రేవంతుండును = రేవంతుడు సంజ్ఞా సూర్యుల పుత్రుడు. సంజ్ఞాదేవి బడబారూపమున నున్నపుడి తడశ్వినుల పిమ్మట జనించెను. కనుక పుట్టుక చేతనే యశ్వరోహ కళాభిజ్ఞుడయ్యెను. పిమ్మట సూర్యుడిత నిని గుహ్యకుల కధిపతిని చేసెను. రేవంతు డశ్వారోహణ కళా నిపుణుడగుట వలన నశ్వశిక్షకులను, ఆరోహణా నిపుణులను కవులు తురుగా రోహణ రేవంతులని పోల్చుచుందురు. గజారోహణ, అశ్వారోహణ చాపవిద్య లానాడు ప్రభుకుమారులు విధిగా నేర్వవలసిన విద్యలలో నొకటిగా నుండెను.

సింహ తలాట రాయండను = తలాటమనగా తల యొక్క ఆకారముగలనగ. ఈ తలాటములు పులి తలాటము, సింహ తలాటము, శరభ తలాటము, వారణ తలాటము, గరుడ తలాటము. గండ బేరుండ తలాటము, అర్ధనారీశ్వర తలాటము అని పలువిధములుగా గలవు. ఇవి కిరీటమునకు లేదా శిరోవేష్టనమునకు ధరింపబడు చుండును. వీనిని బంగారముతో చేయుచుండిరి. కనుక సువర్ణ తలాటమని ముత్యములు పొదిగి నపుడు ముత్యాల తలాటమని, రత్నములు పొదిగినపుడు రత్నకలితతలాటమని, ఇంకను మాణిక్య తలాటము, పంచెవన్నెల తలాటముని వీనిని పిలుచు చుండిరి.

కవిపండితులకు సింహపు మూతి కడియములు ప్రభువులకు సామంతులకు సింహశార్దూలాధి తలాటములు బిరుద సూచకములు గాన వానినెంత కలవారైనను సొంతముగా చేయించుకుని ధరించిక ప్రభువులచేత బహూకరింప బడినపుడే ధరించు చుండిరి. గొడుగులు, అందలములు, వింజారమలు, ఆందోళికలు, తలాటములు, సామంతులు తమ ప్రభువులు బహుకరించినపుడే ధరించవలెను లేదా అవి అనువంశికవముగా వచ్చుచున్న యెడల ధరింపవచ్చును. ఈ తలాటకమునకే తురాయి అనునది యమర్చ బడు చుండెను.

మల్కిభరామునకు లాలసరిగ జాంకుశ రాయపక్షి సాళువ, సింహ తలాట రాయయను బిరుదులున్నట్లు అద్దంకి గంగాధర కవిత పతీ సంవరణమున చతుర్థాశ్వాంత పద్యములందు చెప్పెను. కావున అగు = అట్టి బిరుదలు ధరించినవాడైన మల్కిభరాము పాదుషాహునకు = మల్కిబ్రాహీమను రాజునకు, నితవరియై = హితవరియనగా హితమును జెప్పువాడై, చదువులకు గురువై = విద్యలకు నివాసస్థానమై అనగా వానిని ఎరిగినవాడై మన్నలకు = గౌరముకు, ఎన్నికయై = చెప్పదగినవాడై, ఎన్నుకొన బడువాడై, చెన్నొందు = ఒప్పుచున్న అమీనుఖాన సింగంబు = అమీనుఖాను అను శ్రేష్ఠుని యొక్క, వంగడంబుఁ = వంశమును, ఏర్పరించెదఁ = తెలిపెదను, అది ఎట్లనిన = అది ఎట్లనగా -

తా :- అని (పండితులకు) విన్నవించి లాలసరిగ జాంకురుడు, తురగారోహణ రేవంతుడు సింగిణీ సురత్రాణుడు, రాయపక్షి సాళ్వుడు, సతకా సంహాసనా ధీశ్వరుడు, సింహతలాట రాయుడు అయినట్టి మల్కిభరావు ప్రభునకు హితవరియై, విద్యలకు నిలయమై మన్ననలకెన్నికయై యొప్పు అమీనుఖాను అను శ్రేష్ఠుని యొక్క వంశమును తెలిపెదను అది ఎట్టి దనగా -

అమీనుఖాను బిరుదములు గల తపితీ సంవరణ పద్యములు -

ఉ॥ సింహ తలాటరాయ రణజిత్వర సత్వ సహస్ర కద్వయీ
జింహ ధనుర్గుణ ధ్వని విశేష వశం వద దుందుభీభవ
ద్గంహరి గంహరాంతర విఘట్టిత పద్మభవాండ దుష్టశీ
లంహర సంహరీ విమత లాలస లాలసరీ గజాంకుశా - 4- 95

సుగంధి : భీమసేన బాహుసార భీమసేన వైంహ్వా
ద్భీమ సంగరాంగ ణోగ్ర భీమతుల్య విక్రమా
రామణీయక ప్రభాభిరామధామ సత్కృపా
రామ యక్షయ ప్రభావ రాయపక్షి సాళువా ! 4-97

లాలుసరి గజాంకుశ బిరుదు అలఘు చెర్లవారికి, మారట్ల వారికి కొప్పు న్రూళ్లవారికి నుండెను. ముట్నూరు వారికి దుష్టరాజ గజాంకుశ అను బిరుదుండెను. గాన దానిని బట్టలాలసరి యనునది గజమునకు దుష్టమైనది యని యర్థమిచ్చునదిగా యెరుగ వలెను.

తలాటములు పొందిన కొందరు నాయకులు

చోళ కాకతీయుల కాలమున తమ ప్రభువులతో తలాటములు పొందుట ఆనాటి నాయకుల కొక బిరుదుగా నుండెను. వారు పెక్కు సాహసములు ప్రదర్శించి తమ ప్రభువులతో వానిని పొందుచుండిరి.

ఏఱువ రాజులలో అలఘు చెర్లవారు ఉజ్వల తలాటమును వెంపాలవారు గరుడ తలాటమును కరికాలునితో విరియాల వారు మాణిక్య తలాటమును కాకతి ప్రతాప రుద్రునితో రేపాల వారు తెల్ల తలాటమును పొందిరి.

తమ ప్రభువులతో వెదున్రూళ్లవారు ముత్యాల తలాటమును, ఆరుట్లవారు అర్ధనారి తలాటమును, గోసంగివారు వారణ తలాటమును నెలవెల్లివారు సింహతలాటమును, నిడియాని వారు గండభేరుండ తలాటమును పొందిరి.

చూ. చాటు పద్య మణిమంజరి - ద్వితీయ భాగము
బిరుదావళులు - వేటూరి ప్రభాకార శాస్త్రి

16 సీ॥ మున్నీటి రాణి యా విన్నేటి యే వేల్పు
నడుగుఁ గెందామర నలరు తేనె
బాస వాల్గము లెన్ను ప్రామిన్కు లేవేల్పు
చెలువంపుఁ బావాల గిలుక రవలు
కడిఁది రక్కసి మూఁక మెడ వాల్పు లేవేల్పు
చేనున్న సుడివాలు చికిలి కళుకుఁ
గమ్మఁ దెమ్మెర పూప దిమ్ము దా నేవేల్పు
మంచు మించుల పాను పంచదూది
తే॥ యతఁడు దానైన కర్తారుఁ డెలమికూర్మిఁ
బ్రోవ సత్య చింతామణి పొట్ల చెఱువు
నందుఁ, దెందేపలుగ సిరుల్ గ్రందు కొనఁగఁ,
బడమి వెలసె హుమాయూ పుడమిఱేఁడు - 16

టీక :- మున్నీటి రాణి యౌ మిన్నేరు = సముద్రుని భార్యయైన ఆకాశగంగ యేవేల్పు = ఏదేవుని యొక్క, అడుగు కెందామరఁ = పాదమను ఎఱ్ఱతామర యందు, అలరు తేనె = ఒప్పుచున్నట్టి తేనెయో ! బాస వాల్గములు = మాట లేతమ ఆయుధములుగా గలవారు, అనగా శపింపగల వారైన దేవతలు, ఎన్ను = ఎల్లప్పుడు గణించు, ప్రామిన్కులు = తొలి చదువులు అనగా వేదములు, ఏ వేల్పు = ఏ దేవుని యొక్క చెలువంపు = అందమైన, పాదాల = పాకోళ్ళయొక్క, గిలుకు రవలు = కలకలయను ధ్వనులో కడిది రక్కసి మూక = బలవంతులైన రాక్షస సమూహము యొక్క, మెడ చాల్పులు = తలల వరుసలు, ఏ వేల్పు = ఏ దేవుని యొక్క, చేనున్న = చేతియందున్న, సుడివాలు = చక్రమునకు చికి అకళకు = వాడిని కలిగించెడి కళుకు = కఱుకు అనగా బిరుసుదనముగల సానలో కమ్మ తెమ్మెర పూపదిమ్మ = మలయ పవనమును తినునట్టి వాడైన శేషుడు, తా = తాను, ఏ వేల్పు = ఏదేవుని యొక్క, మంచుమించుల = మంచును మించునట్టి చలువగల మరియు మెరుపుగల, పానుపంచ దూది = పరుపునందలి హంస తూలికయో! అతడు = అటువంటి తానైన = తానుగా జన్మించిన, కర్తారుడు = సమస్తమును సృజించు అల్లా , అలమి = ఆక్రమించి, సత్యచింతామణి పొట్ల చెఱువు = సత్యచింతామణి యగు పొట్ల చెఱువును, కూర్మి బ్రోవన్ = ప్రేమతో రక్షించు చుండగా, అందు = ఆ పొట్ల చెఱువు నందు, తెందే పలుగ = తేప + తేప = దెందేప, తెప్పలు తెప్పలుగా, అనగా మిక్కిలిగా, కాసులు రాసులుగా, సిరుల్ = ఐశ్వర్యములు, క్రందు కొనగ = వ్యాపింపగా, హుమామియా పుడమితేడు = హుమామియా అనబడు ప్రభువు, పుడమి వెలసెన్ = భూమియం దొప్పెను.

అర్థ విశేషణము :-

హుమా = మహమ్మదీయ మతమున ఒక పురాణ పక్షి - దానిని హోమపక్షి యనవచ్చు. అది యెల్లపుడాకాశమందే సంచరించు చుండునట -

తా :- ఆకాశగంగ ఎవని పాద కమలము నందలి మకరందమో, వేదము లెవని వాడుకల యొక్క గలగలలో రాక్షసుల యొక్క తలలు ఏదేవుని యొక్క చక్రాయుధమును తరిమెన పట్టు సానలో, ఆదిశేషుడు ఏ స్వామికి చెల్లనైన హంసతూలికా తల్పయో అట్టి స్వామియే తానైనరి ల్లా మహమ్మదీయుడై హుమామియా అను ప్రభువుగా సత్యచింతామణి యగు పొట్లచెఱువు నాక్రమించి పాలించుచు అచట రాసుల రాసులగు యైశ్వర్యములతో నొప్పుచుండెను.

విశే : ''నావిష్ణుః పృథివీపతిః'' విష్ణ్వంశ లేనిది రాజుకాడని ఆర్యోక్తి. కనుక నీ పద్యమున హుమామియా విష్ణువుగా నిరూపింపబడినాడు.

17 క॥ కలిమిని బలిమిని విడిముడిఁ
బలుకుల పస నీవిఁ తీవి బంటుఁ దనమునన్
వెలయు హుమామియ్యా అం
పిలుపొంపుల జాదుబీబిఁ బెండిలి యయ్యెను - 17

టీక :- కలిమిని = ఐశ్వర్యమున, బలిమిని = బలమున, విడిముడిని = ధనమున, పలుకులపసన్ = సంభాషణ యందు, ఈవిన్ = దానమునందు, తీవిన్ = తీవియందు, బంటు దనమునన్ = శౌర్యమునందు, వెలయు = ఒప్పుచున్న ఆహుమామియా, సొంపులన్ = అందంలందు, అంపిలు = అతిశయించిన, జాదుబీబిన్ = జాదుబీబియను నామెను, పెండిలియయ్యెన్ = వివాహమాడెను.

తా :- కలిమియందును, బలమందును, ధనమందును, సంభాషణ యందును, దానమందును, తీవియందును, పౌరుష మందును; మేటియై యొప్పు ఆహుమామియా సౌందర్యమునందు అందరికంటె మిన్నయైన జాదుబీబిని వివాహమాడెను.

18 క॥ ఆమగువ యందు నతఁ డు బ
డేమియ్యాఁ గనియె సందడించుచు సిరులెం
తో మెఱయఁగ వెన్నుఁడు సిరి
చామ వలన మరునిఁ గన్న చందము మీఱన్ - 18

టీక :- ఆమగువ యందు = ఆజాదు బీబి యందు, అతడు = అనగా నా హుమామియ్యా, బడేమియ్యా = బడే మియ్యా అనెడు వానిని సందడించుచు = అనగా మిక్కిలిగా మెలగుచు, సిరులెంతో వెలయగ = ఇంటిలో సంపద వెంతగానో అభివృద్ధి పొందగా, వెన్నుడు = విష్ణువు, సిరిచామ వలన = లక్ష్మీదేవి వలన, మరుని = మన్మథుని, కన్నచందము= కాన్పుగా కనిన విధము, మీరన్ = అతిశయించగా, కనియెన్= కనెను.

అర్థవిశేషణము :-

మగువ= మగు = పరిమళము, ఇదియే గుమగుమగా రూపొందినది కాన మగువ యనగా పరిమళించు నోరు కలదని యర్థము.

మృగమద సౌరభ విభవ
ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీగంధ
స్థగితేతర పరిమళమై
మగువ పొలుపు దెలుపు నొక్క మారుత మొలసెన్ =

అని పెద్దనగారి ప్రయోగము. చూ మను. ఆ. 2

తా :- అతడు అనగా హుమామియా జాదుమబీబీయందు, అతని పుట్టుకతో ఇంటినిండ యైశ్వర్యము సందడించగా విష్ణువు లక్ష్మీదేవి వలన మన్మథుని గన్నట్లుగా కనెను,

''అలం - ఉపమ''

ప్రకృతమునకు అప్రకృతముతో నే దేనొక ధర్మమును పురస్కరించుకొని పోలిక చెప్పిన యెడల నుపమాలంకారమనబడును. ఇది స్వరాలంకార బీజ భూతమని వామనుని మతము. బ్రహ్మజ్ఞానము వలన సమస్త విశ్వము తెలియబడిన విధమున నుపమాలం కారము వలన సర్వాలంకార జ్ఞానము కలుగునని యది సర్వాలంకార చక్రవర్తియని అప్పయ్య దీక్షితులు నిర్ణయము. ఆయన యీయలంకారమును నిరువదెనిమిది యలంకారములుగా మార్చి చూపెను. ఉపమాకాళి దాసస్య ఉపమానమును చెప్పుట యందు కాళిదాసు సిద్ధహస్తుడని లాక్షణకోక్తి.

ఈ యలంకారమున ఉపమేయము, ఉపమానము - అలంకార వాచకము సమానధర్మము, క్రియయను నైదు విభాగములుండును.

ఉపమేయమునకు ప్రకృతము, వర్ణ్యము విషయము - అని ఉపమానమునకు అప్రకృతము అవర్ణ్యము. విషయ అని పర్యాయములు తెనుగు ''కావ్యం దర్శనమున'' శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 120 వరకు ఉపమాలంకార వాచకములు ఒక సీస మాలికగా గూర్చిరి.

సీ॥ మాదిరి. కైవడి - మాడ్కి - పగిది - పోల్కి
తెఱగున - విధమున - తీరున - క్రియ
గతి - భాతి - చందముగా - రీతి - ఠీవి - చాయ -
రేవ - కరణి - జాడ - తీవి - డంబు -
వలె - నట్టు - లటు - లట్లు - బలె - పోలె - వరుసను
చోటి - వంటి - యొరయు - పోని - యట్టి -

పోలు మున్నగు శబ్దములు - ఇది ఉపమా సాధారణ వాచకములు. వీనియందు తెలగన అట్లు అమరు - అలరు - కరణి - చందము - పగిది - పోలె - వడువు - వలె అను వానిని మాత్రము తనయుపమ లందు పయోగించెను.

19 సీ॥ పూవింటివాఁడు నేర్పున సోయగంబున
వినువాఁక బిడ్డండు వింటికడిమిఁ
దామర చెలిచూలి తగునీగి నానచే
రాముండు ప్రతిన బీరంబు నందుఁ
బుడమి తాల్పరియె నిల్కడఁ బల్కు నేర్పున
రాజు సొంపున నిబ్బరంపుఁ దెలివి
నేను మోముల మేటి హెచ్చగు బలిమిచే
రారాజు సొమ్ముల రవణమునను

తే ॥ నెట్టి వజ్జీర్లు నెన్నంగ నీడుగారు
కొమరు మీఱు హుమామియా కొమరుఁ డగుచుఁ
బొలుపుఁగనిన బడేమియా పుడమిఱేని
కహహ ! ముజ్జగముల యందు నరసి చూడ - 19

టీక :- బడేమియా పుడమితేడు - నేర్పున సోయగంబున = నైపుణ్యమునందు మరియు అందమునందు, పూవింటివాడు = మన్మథుడు, పూలను బాణములుగా సంధించుటకు ఎంతో నేర్పవసరము, అందువలననే యితడు నేర్పున పూవింటివాడు/ వింటికడిమిఁ = బాణ విద్యయందలి గొప్పదనమందు, వినువాక బిడ్డండు = ఆకాశగంగా తనయుడు, అనగా భీష్ముడు, తగునీగిఁ = ఉచితమైన దానమునందు, తామర చెలిచూలి = పద్మ బాంధవుని కుమారుడైన కర్ణుడు, అనచే, ప్రతిన బీరంబు నందు = ఆజ్ఞ చేతను, ప్రతిజ్ఞ చేతను, శౌర్యమందును, రాముడు = రామునివంటివాడు, పురాణములందు రామోరాశ్చ రామశ్చ అని పరశురామ, శ్రీరామ, బలరాములు ముగ్గురున్నారు. కనుకపై మూడు విశేషణములు. ఒక్కొక్కరి కొటిగా గూడు చెప్పుకొన వచ్చును. నిబ్బరంపు తెలివిఁ = దిట్టమైన తెలివియందు, నిల్కడఁ= ఓర్పున పల్కు నేర్పునఁ = భాషావిషయమునను, పుడమి తాల్పరియె = భూమిని ధరించిన ఆదిశేషుడే, శేషుడు భూమిని ధరించుచున్నాడు గాన ఓర్పు గలవాడనుట, సొంపునఁరాజు = అందమునందు చంద్రుడు, దేవతలలో చంద్రుడు, మన్మథుడు, వసంతుడు

జయంతుడు, నలకూబరుడు, ఈయైదుగురందమైనవారు, హెచ్చగు బలిమిచే = మిక్కిలి బలమున, ఏను మోముల మేటి = ఐదు ముఖములు గల శివుడు, సొమ్ముల రవణమునఁ = భూషణముల యొక్క కాంతులందు, రారాజు = కుబేరుడు, కొమరు మీరు = గొప్పదనమున అతిశయించిన, హుమామియా కొమరు డగుచు = హుమామియా తనయుడై, పొలుపు గనిన = కీర్తి వహించిన, బడేమియా పుడమి తేనికి = బడేమియా అను ప్రభువునకు, అహహా, ఎట్టి వజీర్లు = ఎటువంటి మంత్రులైన, ముజ్జగము లందున = మూడు లోకములందు, అరసి చూడఁ = విచారించి చూడగా, ఎన్నంగ నీడుగారు = సాటిచెప్పుటకు తగరు.

అర్థవిశే :- బడేమియా అనునది ''పెద్ద దొర'' అన్నట్లుగా విశేషమేగాని తలిదండ్రి పెట్టిన పేరుకాదు. లోకపు రూఢిలో అది మరుగునబడి పోయింది.

తా : గొప్పదనమున అందరిని మించిన హుమామియా కుమారుడైన బడేమియా అందమునందు మరియు నేర్పునందు మన్మథుడు. బాణ విద్యయందు భీష్ముడు, దానము నందు కర్ణుడు, ఆజ్ఞయందును, ప్రతిజ్ఞయందును, శౌర్యమందును, రాముడు. ఓర్పునందు మఱియు మాటనేర్పునందు శేషుడు, అందమునందు మఱియు దిట్టమైన తెలివియందు చంద్రుడు, బలమునందు శివుడు, ఆభరణముల కలిమి యందు కుబేరుడు. కనుక ఆహా! మూడు లోకములందు వెదకి చూచినను అతనికి సమానమైన వజీర్లను మనము సాటి చెప్పుటకు కనుగొనలేము.

''అలం - రూపకము - ఉల్లేఖము - అనన్వయము.''

ఉల్లేఖనమనగా వర్ణించుట - కువలయానంద మిందు రెండు భేదములు చెప్పెను. ప్రకృతమును దాని యొక్క వివిధ ధర్మములను బట్టి ఒక్కొక్క తీరుగా భావించినట్లు చెప్పుట దాని యొక్క మొదటి భేదము. ఒకే ధర్మమును అనేకులనేక విధములుగా భావించినట్లు చెప్పుట రెండవ భేదము.

బడేమియా ఈ పద్యమున మన్మథుడు భీష్ముడు మొదలైనవారితో సాటి చెప్పబడినాడు. కాన యుల్లేఖమునందలి మొదటి భేదము.

20 తరళము - పలుకులే జవరాలి వేనలిఁ బాలసంద్రములోని యా
కలిమి తొయ్యలి గేస్తు నెమ్మొయి గాలి మేపఱిఁతేని చూ
పుల బెడంగును బాసవాల్కను పూపకందు నదల్చు బా
గుల యసంబు బడేమియా తనకుఁ సతంబుగఁ దాలిచెఁ - 20

టీక :- బడేమియా - పలుకులే జవరాలి = సరస్వతి యొక్క, వేనలిన్ = కొప్పును, పాలసంద్రములోని = క్షీరసాగరమున జనియించినట్టి , కలిమితోయ్యలిగేస్తుఁ = లక్ష్మీదేవి ఇల్లాలుగాగల గృహస్థుని, అనగా విష్ణువును, గాలిమే పరిజేని = వాయువే ఆహారముగా గల సర్పముల యొక్క అధిపతియైన శేషుని యొక్క; చూపుల బెడంగును = నేత్రసౌందర్యమును, బాసవాల్కను పూప = దేవర్షియైన అత్రిమహర్షి యొక్క కంటి యందు పుట్టిన బిడ్డడగు చంద్రుని యొక్క, కందుఁ = నలుపును, అదల్చు = ధిక్కరించు, బాగులయసంబును = మేలైన కీర్తిని, తనకుఁ, సతంబుగ = ఎల్లప్పుడు, దాలిచెన్ = ధరించెను.

తా :- ఆ బడేమియా సరస్వతీదేవి కొప్పును, విష్ణు దేవుని యొక్క శరీరమును, ఆదిశేషుని యొక్క కన్నులను, చంద్రునిలోని కందును. ధిక్కరించునట్టి శుభ్రమైన కీర్తిని ఎల్లప్పుడు తాను ధరించెను.

విశే :- ఇందు బడేమియా కీర్తి వర్ణింపబడినది. దానిని తెల్లనిదిగా చెప్పుట కవి సంప్రదాయము. కనుక ఈ బడేమియా కీర్తి ఎట్టిదనగా అదిదేవతలనే నిరసించినది.

'సరస్వతీ దేవిని మనము యాకుందేందుతు షారహార ధవళాయని పొగడినను, ఆమె వెంట్రుకలు మాత్రము నలుపే. విష్ణువు బంగారు వస్త్రము గట్టినను శరీరము నలుపే ఆదిశేషుడు ఎంత తెల్లని వాడైనను పాములకు కంటిచుట్టు నలుపే - చంద్రునికి ఎదలో నలుపు కాని బడేమియా కీర్తి కాంత కెచ్చటను గూడ నలుపులేదు. అనగా ఆమెశుభ్రమైనది. మచ్చలేనిదని తాత్పర్యము.

ఈ పద్యము -

బలభిన్నాగము చెంపగొట్టి గిరిజా ప్రాణేశు నట్టెక్కి వా
గ్గల జాతేక్షణ కొప్పువట్టి శశివక్షంబెక్కి ధట్టించి యా
బలరాముఁ మొలబట్టునీయశము భూభాగంబునఁ మించెనా
లలనామన్మథ కృష్ణరాయ నరపాలా రాజకంఠీరవా !

అను శ్రీకృష్ణదేవరాయల పైగలచాటువును తలపించును. తెలగఅరిష్ట దిగ్గజకవుల చేత ప్రభావితమైన వాడుగదా!

కల్యాణ కల్పవల్లి జం. పాపయ్యశాస్త్రిగారి సంపాదితము పు. 152.

ఈ పద్యమునే యనుకరించుచు కవి సింహ పోకూరి కాశీపత్యవధాని సారంగధరీయమను త్ర్యర్థి కావ్యమున

వాణిన్ నెత్తిన మొట్టి దివ్యకరి చెంపల్ గొట్టి గోవల్లభున్
ఘ్రాణంబందున మట్టి సీతకరువక్షంబున్ గయిందట్టియా
స్థాణున్ కుత్తుకబట్టి నెట్టి హలివస్తుంబీగి సోమేశ్వర
క్షోణీనాధుని కీర్తికన్యనటి యించున్ ధాత్రిపై శుభ్రతన్

అను పద్యమును రచించెను.

ఆ.తా - 94

21 వ॥ అతండు

అతండు = ఆ బడేమియా సాహెబు.

22 క॥ కలిమిచెలి వెన్నుఁడుం బలు
కులలే జవరాలు నాలుగు మొగముల తఁడున్
బలెఁ దగు సిలారు బీబిం
గొల మలరఁగ బెండ్లియయ్యెఁ గూరిమి మీఱన్ - 22

టీక :- కలిమి చెలి వెన్నుడున్ = లక్ష్మీదేవిని విష్ణువు, పలుకులలే జవరాలు = సరస్వతీ దేవిని, నాలుగు మొగముల తండున్ = నాలుగు ముఖములు గల బ్రహ్మ, బలె = వలె, తగు = తనకు తగినట్టి, సిలాదు బీబిన్, కొలమలరగ = తమ యొక్క కులము సంతోషించునట్లుగా, కూరిమి మీరన్ = ప్రేమ తొలుకాడగా, పెండిలియయ్యెన్ = వివాహమాడెను.

తా :- ఆ బడేమియా, విష్ణువు లక్ష్మీదేవిని, బ్రహ్మ సరస్వతిని వివాహమాడి నట్లుగా తనకు తగినట్టి సిలారు బీబీని వివాహమాడెను.

''అలం - ఉపమ''

ఉపమాలంకార భేదములు

ఉపమాలంకారము పూర్ణోపమ - లుప్తోపము యని రెండు విధములు. ఉపమాలంకార భాగము లింతవరకు చెప్పితిని. వాని యందలంకారము ననే భాగములోపించిన నాభాగము పేర ఉపమేయ లుప్త - ఉపమాన లుప్త - సమాన ధర్మలుప్త - అలంకార వాచక లుప్త - యని యిటుల పిలుతురు.

పూర్ణోపమ ఆర్థి - శ్రౌతియని మరల రెండు విధములు - అలంకారమున నీషద్వ్యవధానమును దెలుపు సదృశ - సంకాశ - నీకాశ - ప్రతీకాశ - సన్నిభ ప్రభృతి ఉపమా వాచకములుపయోగింప బడినది. ఆర్థియని, అట్లుగాక వలెన్ - పోలెఁ - ఓ యనఁ - ఓయన్నట్లు, అనఁగఁ - అనునవి యుపయోగింప బడినపుడు శ్రౌతి యని యందురు.

దండి తన కావ్యాదర్శనమున ఉపమను 32 విభాగములుగా వింగడించి నిరూపించెను. వానియందు మాలోపమ 28వది. ఉపమలు ఒక్కటికంటె నెక్కువగా దండవలె కూర్చిన యెడల నది మాలోపమ యనబడును. దండి మతము ననుసరించి

ఉ : శారదనీరదేందు ఘనసార పటీర మరాళమల్లికా - అనునది బహూపమకు,

ఆ : తెల్ల కలువలట్లు, మల్లెల భంగియు, హరుని మాడ్కిఁ తళుకు సరములట్లు - (పతా - అర్థా ప్ర - 42) అనునది మీలోపకు మనోహరమైన యుదాహరణము లగును.

23 ఉ॥ చుట్టపువారి రాసిరుల చూపుల కోపులకై పులాని చే
పట్టి యనుంగుగా నపుడు ప్రాపగు కూరిమి నాబడేమియా
పట్టపు రాణియై కలిమిఁ బాటిలు చుండు సిలారు బీబియె
వ్వట్టున నానెలంతకును బాడియె యెన్నంగ గట్టు మూలియుఁ - 23

టీక :- ఆ బడేమియా పట్టపురాణియై = అతనితోపాటు పట్టాభిషేకము చేసికొన్నదై, సిలారు బీబి, చుట్టపువారిని = తమ బంధులైన వారిని, చూపుల కోపుల - కోపు/ కోప్పు = కొన, చూపుల కోపులఁ = కడగంటి చూపులతో, అనగా కటాక్షములతో, కైపులాని = వారి వార్త లెరిగి, అపుడు, చేపట్టి = వారిని దగ్గరకు తీసి, అనుంగుగాఁ = ప్రియమైన వారిగా మన్నించి ఎప్పట్టునఁ = ఎపుడైనను ప్రాపగు కూరిమిఁ = రారికి రక్షణ కలిగించు ప్రేమతో, పాటిలుచుండు = ప్రవర్తించు చుండును, ఆ నెలంతకును = ఆమెకు, గట్టుచూలియున్ = పర్వత పుత్రికయైన పార్వతి, పాడియె యెన్నఁగఁ = సాటి చెప్పుట న్యాయమా, అనగా కాదనుట.

తా :- ఆ బడేమియా పట్టపురాణియైన సిలారు బీబి, బంధువులైన వారిని కడగంటి చూపులతో వారి స్థితులెరిగి చేరదీసి ప్రియమైన వారినిగా మన్నించి ఎల్లప్పుడు వారియెడ రక్షణను గల్గించు ప్రేమతో ప్రవర్తించు చుండును. కనుక అటువంటి ఆ సిలారు బీబీకి పార్వతీదేవిని సాటి చెప్పుట న్యాయముగాదు.

24 ఆ॥ ఆసిలారు బీబియందు బడేమియా
పుడమి ఱేఁడు సిరుల బొందునట్టి
కడఁకతో నమీనుఖాను వేల్పుల ఱేనిఁ
గనియె మదిని గూర్మిమ గడలు కొనఁగ - 24

టీక :- ఆసిలారు బీబియందు, బడేమియా, పుడమి ఱేడు = అనగా ప్రభువు, సిరుల౯ = ఐశ్వర్యములను, పొందునట్టి, కడకలో౯ = పూనికతో, మదిని = మనస్సునందు, కూర్మికడలు కొనగ = ప్రేమ ఉప్పొంగగా, అమీఖాను, వేల్పుఱేని౯ = అమీనుఖాను అను రాజేంద్రుని, కనియె౯ = కాంచెను.

తా :- బడేమియా సిలారు బీబీయందు మనస్సునందు ప్రేమపొంగు చుండగా ఐశ్వర్యములను పొందు పూనికతో అమీనుఖాను అను భూపేంద్రుని గాంచెను.

25 క॥ అనువుగ మరియు నతఁడు నర
బనబీబిం బెండ్లియాడె బలువేడుకతోఁ
గనియెం దగ నాయమ యం
దను బాబను మియ్యా నీవితో వ చెలికానిన్ - 25

టీక :- అనువుగ౯ = తగినట్లుగా మరియు౯, అతడు, బలువేడుకతో౯ = మిక్కిలి ప్రేమచేత, సరబనబీబి౯ = సరబన బాబీయను నామెను, పెండ్లి యాడెను, తగ౯ = ఒప్పునట్లుగా, ఆమె యందు౯, బాబను మియ్యా౯ = బాబు అను గొప్పవానిని, ఈవి తోవ చెలికాని౯ = దానము నందు చంద్రుడైన వానిని, దానమున చంద్రుని కర్ణుడు, శిబి, దధీరుచిని సాటిచెప్పుట కవి సాంప్రదాయము. కనియె౯ = కాంచెను.

అర్థ విశే :- బీబీ యనగా శ్రీమతి యని యర్థము.

తా :- సిలారు బీబీ పిమ్మట బడేమియా తనకు తగినట్లుగా సరబన బీబీ యను నామెను మిక్కిలి వేడుకతో వివాహమాడి ఆమె యందు 'బాబు' అను రాజచంద్రుని గాంచెను.

<u>బాబుమియా ప్రశస్తి</u>

26మ:- కలనం బాబను మియ్యా సింగము కడంక౯ మార్తుచేనుంగు జం,
గిలిఁ జక్కై దువ నొంది వానితలలం గీల్కొన్న ముత్తెంబులే,
తలఁ బ్రాల్గా, ననినేల పెండ్లరఁగుగాఁ, దాసొంపుతో మీఱుచు౯
గెలుపుంబైఁడి నెలంతఁ గైకొనియెఁ, నగ్గింప౯ జగం బంతయు౯ - 26

టీక :- కలనన్ = యుద్ధరంగమందు, బాబను మియ్యసింగము = బాబు అను నట్టి యారాజసింహుడు - సింహశబ్దమిచట శ్రేష్ఠతా వాచకము, మార్తురేనుంగు జంగిలిన్ = శత్రువుల యొక్క ఏనుగుల మందను, జేకైదువ నొంచి = చేతిలోని ఆయుధముతోనే, అనగా చిన్న కత్తితోనే చంపి, వాని తలలన్ = వాని తలలందు, కీల్కొన్న ముత్యంబులే = ఏర్పడియున్న ముత్యంబులే - ముత్యములు శక్తులందేగాక వెదురు బొంగులందు, ఏనుగు తలలందు, పందికోరలందును బట్టునని శాస్త్రము, తల బ్రాల్గా = తలంబ్రాలు కాగా - తామ్ర పర్ణీనదీతీర ధరణి నేలు - దొరతనము తెల్పగా రాశి దోరల బోసె ముదిత చేతుల తల బాలముత్తియములు - వి.వి. అని నేల పెండ్ల రుగగా = ఆయుద్ధ రంగమే పెండ్లి యొక్క అరుగాగా !, చ తాసొంపులతో మీరుచున్ = తానువైభవముతో నొప్పుచు, గెలుపుం బైడి నెలంతన్ = విజయమను లక్ష్మిని, జగంబంతయున్ అగ్గింపన్ = ప్రపంచమంతయు పొగడగా, కైకొనియెన్ = గ్రహించెను.

తా :- బాబు అను ఆరాజేంద్రశ్రేష్టుడు యుద్ధరంగమలందు శత్రువుల యొక్క ఏనుగుల మందను, అనగా గజసైన్యమును సంహరించి వాని కుంభస్థలము లందలి ముత్యములే తలంబ్రాలుగా - యుద్ధ రంగమందలి నేలయే పెండ్లి యరుగుగా జగమంతయు పొగడు చుండగా విజయలక్ష్మిని చేపట్టెను.

ముత్యములు తలంబ్రాలుగా పోయుదురనుటకు -
జానక్యా కమలాం జలిపుటే యాఃపద్మ రాగాయి తాః
న్యస్తా రాఘవ మస్తకేచ విలసత్కుంద ప్రసూనాయి తాః
స్రస్తాశ్యామల కాయకాంతి కలితా యాః ఇంద్రనీలాయితాః
ముక్తాస్తా శుభదా భవంతు భవతాం శ్రీరామ వైవాహికా -
శ్రీ రామకృష్ణమృతం

పరిణామము - రూపకము

ఉపమాన ముపమేయాత్మకత్వము చేత క్రియా సాధకమైనట్లు చెప్పిన యెడల పరిణామాలంకార మనబడును. ఈ పద్యమున బాబూమియా విజయలక్ష్మిని చేపట్టుటకు అనగా వరించుటకు అని నేల పెండ్లి యరుగుగా ఏనుగుల కుంభస్థలము లందలి ముత్యములు తలంబ్రాలుగా నైనట్లు చెప్పబడినది కాన నిది పరిణామాలంకార మగును.

బాబను మియ్య సింగము. గెలుపుంబైడి నెలంత ఈ రెండు రూపక సమాసములు.

- అమీనుకానుని ప్రశస్తి -

27 సీ॥ పట్టంగ నీఁడు సం బళికలు కలని లోఁ
జేరవచ్చిన మార్తు చేతఁ గాని
పూననీఁ డడపంబు పొగరుతో బవరంబు
సేయవచ్చిన వాని చేతఁ గాని
తేనీడు గొడుగు మత్తిల్లి యాలంబులోఁ
జేపడ్డ మన్నీని చేతఁ గాని
తాల్పంగనీడు కుందనపు ఝూరీ చివ్వఁ
జెనక వచ్చిన ఱేని చేతఁ గాని

తే॥ యతనిఁ గొనియాడ నలవియే, యైదుతలల
వేల్పురాయని కైనను, వేయితలల
ప్రోడకేనియు, ననిచాలఁ బొగడ నెగడె
నిండు వేడ్క నమీను ఖానుండు పుడమి - 27

టీక : అమీనుఖానుండు - కలనిలో = యుద్ధ రంగమందు, చేర వచ్చిన, మార్తుర చేతగాని = శత్రువులచేతగాని, సంబళికలు = జీతములు, పట్టంగనీడు = తీసుకొననీయడం - అనగా యుద్ధమున నోడిపోయి యాశ్రయిరచిన వారినే తప్ప తక్కిన వారిని జీతగాండ్రను చేసికొడని భావము, పొగరుతో = గర్వముచేత, బవరంబు = యుద్ధము, చేయవచ్చిన వాని చేతగాని, ఆడపంబు = వక్కలపెట్టె, పూననీడు = పట్టుకొననీయుడు, అనగా గర్విష్టులై యుద్ధమునకు వచ్చిన వారినోడించి వారిని యడపకాండ్రను చేసికొనును, అనగా అంతగా లోబడిన వానినిగా జేసుకొనును గాని సామాన్యుని అడపగానిగా గ్రహించడని భావము, మత్తిల్లి = మదించి, ఆలంబులో = యుద్ధ రంగమున, చేపడ్డ = చేతికి చిక్కిన మన్నీని చేతగాని = రాజుచేతగాని, గొడుగు, తేనీడు = తేనీయడు, అనగా మదించి యుద్ధమున వచ్చి చేతజిక్కిన వానిచేత తనకు గొడుగు పట్టించు కొనును గాని యితరుని చేపట్టించు కొనడని భావము,చివ్వక = యుద్ధమునందు చెనక వచ్చిన వాని చేతగాని = చెనకుటకు, అనగా కెలగించుకొనుటకు, వచ్చిన వానితోగాని,

కుందనపు ఝారీ = బంగారు కొండి చెంబు; తాల్పం గనీడు = ధరింపనీయడు, అనగా యుద్ధరంగమున కాలుదువ్వి యతనిని కవ్వింప వచ్చిన వారినోడించి వారితో తన ఝారీ చెంబు పట్టించుకొనునని భావము, ఐదుతలల వేల్పు రాయనికైనను, బ్రహ్మకైనను, లేదా శివునికైనను, వేయితలల ప్రోడకేనియు = వేయితలలుగల మగవానికైనను అనగా శేషునికైనను గొనియాడ నలవియే = అతనిని పొగడ తరమా, అని చాలబొగడ, మిక్కిలి పొగడునట్లుగా, నిండు వేడ్కతో = గొప్పవైభవముతో, అమీను ఖానుండు, పుడమినెగడె = భూమిపై యొప్పెను.

తా :- అమీనుఖానునకు తనపై యుద్ధము చేయవచ్చి యెడిన వారు జీతగాండ్రైరి, పొగరుతో నోడించి వచ్చిన వారోడిపోయియుడప కాండ్రైరి. మదించి వచ్చి యుద్ధమున చేతికి చిక్కిన వారు గొడుగు పట్టువారైరి. యుద్ధమున నొక పట్టుపట్టి చూతమని వచ్చినవారు ఝారీ చెంబు పట్టుకొనవలసిన వారైరి కనుక అతనిని బ్రహ్మకైన, శివునికైన, ఆదిశేషునికైన, పొగడ వశమా అనునట్లు పరాక్రమము మరియు వైభవమున నతడు ప్రపంచమందొప్పెను.

విశే :- ఈ పద్యమున పట్టంగనీడు, పూననీడు, తేనేడు, తాల్పింగ నీడు, మార్తుర చేతగాని, వాని చేతగాని, మన్నీని చేతగాని, తేని చేతగాని అని చెప్పి కవి అమీనుఖానుని యొక్క రాజసమును చక్కగా వ్యంజించుటయే కాక పద్యమున రచనా శిల్పముచే చక్కని ధ్వనిని గూడ సాధించెను.

28 ఉ॥ మించి యమీనుఖానుఁ డెలమిం గలబట్లకు నల్లె నిచ్చెఁ బ
ట్టంచుల పచ్చడాలు వరహాలు సరాలు గుఱాలు పల్లకీల్
కుంచెలుయందలాలు గొడుగుల్ పడగల్, కడుఁ దోరహత్తుగా
నెంచఁగ నెవ్వరీ డతని కీగిపసం బరికించి చూచినన్ - 28

టీక : అమీనుఖాను, మించి = దానమున అతిశయించి, ఎలమిఁ = ప్రేమతో, కలబట్లకునెలన్ = తన యాస్థానమందున్న భట్రాజుల కందరికి, పట్టంచుల పచ్చడాలు, వరహాలు = బంగారు రూకలు, సరాలు = హారాలు, గుఱ్ఱాలు, అశ్వములు, పల్లకీల్ = అందలములు, కుంచెలు = వింజామరలు, అందలాలు, గొడుగులు, పడగలు = టెక్కెములు, కడున్ = మిక్కిలి, తోరహత్తుగాఁ = ఎక్కువగా, నిచ్చె = యిచ్చెను, ఈగిపసన్ = దానవిషయమున, పరికించి చూచినన్

= పరీక్షించి చూచిన యెడల, ఎంచగన్ = లెక్కించగా, వవ్వరేడ తనికిన్ = అతని కెవరు సాటిరాగలరు -

తా : అమీనుఖానుడు తన యాస్థానమున గల భట్రాజుల కందరికి - పట్టుంచు శాలువాలు, బంగారు నాణేలు, హారములు, అశ్వములు, పల్లకీలు, మేనాలు, చామరములు, గొడుగులు, టెక్కములు మిక్కిలిగా బహూకరించెను. గాన దానవిషయమున నతని కెవరును సాటి రాకుండిరి.

29సీ॥ పలపలనై మ్రానుపడి పండ్లు చూపెడు
పుడుకుఁ జెట్లను వేఁడబోవ నేల ?
మించు చూపుచునె నమ్మించి నిల్కడ యేది
వినమొసంగెడు మబ్బుఁ గొసరనేల ?
యొలివోయి యాలేక యొుక పూఁట వెట్టెడు
తామర - చెలిపటిఁ దడవ నేల?
పొరలంగ బడుచుఁ దాఁ దెరమఱుంగున నుండి
కసరెడు మున్నీటిఁ బొసఁగ నేల ?
తే॥ తెలివి గురికొల్పి నిచ్చలు పలుకుఁ దియ్యఁ
దనము గాన్పింప నొసగెడు దారిచేత
మిగులఁ బొలుపొందునట్టి యనుమీఖాన
యొడయఁ డొప్పులకుప్పయై యొనరుచుండ - 29

టీక : తెలివి గురికొల్పి = బుద్ధిని చక్కగా నిలిపి యోచించి, నిచ్చలు = ఎల్లపుడు, పలుకు తియ్యదనము గాన్పింపన్ = మాటలలో మధురత్వము కనిపించుచుండగా, ఒసగెడు = ఇచ్చెడు, అనగా దానము చేసెడు, దారిచేత = మార్గము వలన, మిగులన్ = మిక్కిలిగా, పొలుపొందునట్టి = ప్రకాశించునట్టి, అమీనుఖాన యొడయెడు = అమీనుఖానను ప్రభువు, ఒప్పుల కుప్పయై = మంచితనమునకు నిధియై, ఒనరుచుండన్ = ఒప్పుచుండగా, దానమునకై, పలపలనై = పలుచపలుచగానై, లేదా పలపలమని యాకురాల్చి, మ్రానుపడి = నిశ్చలమై, పండ్లుచూపెడు = పండ్లిగిలించెడునని తిరస్కార వాచకము, గ్రహించుడని ఫలములను చూపెడు; పుడుకు చెట్లను = కల్ప వృక్షములను, వేడబొవనేల = యాచించుటకై వెళ్ళుట ఎందులకు, కల్ప వృక్షము కడకేగి యాచకుడేదేని వరము వేడ, అది యావెంటనే

ఒక మండకుపలపలమని యాకురాల్చి చిగురించి పుష్పించి సద్యః ఫలము పుట్టునట, అర్థియా ఫలమందుకొని భజించిన యతిని నీస్థితి మీడేరునట, కనుక నిట పలపలనై మ్రానుపడి యున్నచోట కల్పవృక్షము యొక్క నీస్థితి నంతయు యూహింపవలెను, మించు చూపుచునె = తన యొక్క గొప్పదనము అనగా గంభీరతను ప్రదర్శించుచునే, మెరపును చూపు చునే, నమ్మించి – విశ్వసింపజేసి, ఆ + మించునర్ = నిల్కడయేది = నిల్కడ లేక, విసమొసంగెడు = విషమునిచ్చు, విషమనగా జలము కనుక జలమునిచ్చు, మబ్బుర్ = మేఘమును, కొసర నేల = ఇంకను కొంత యిమ్మని కొసరుటెందులకు – మించులన మెరుపుల నగను – అనితటిల్ల పలపేర్లు కనుక – మించు చూపుచునే అనుటలో మేఘముగంభీరతకు చిహ్నము కనుక అదితన గంభీరతను చూపుచునే కురిసిన కురియును లేదా తేలిపోవును. కనుక అటువంటి దానిని అనగా తన గంభీరతను నిలుపుకొనలేని దానిని అని యను కొనవలెను ఒలివోయి = ఒలుచుకొని పోయి, ఈ లేక = ఈయలేక, ఒకపూట పెట్టెడు = ఒక నిబంధనను పెట్టెడు, తామర చెలిపట్టిర్ = పద్మ బాంధవుడైన సూర్యుని కుమారుడగు కర్ణుని, తడవ నేల = చెప్పుకొనుట ఎందులకు – కర్ణుడు ఇంద్రుడు కవచకుండలములు వేడగా వానిబదులు తనకొక యస్త్రమిమ్మని సమయ మేర్పరచు కొని ఇంద్రునికి వాని నిచ్చెను దానకర్త తాను దానము చేయుదానికి ప్రతిఫల మాసించరాదు కనుక యొక పూట పెట్టెడు అనగా ఒక నియమును కోరెడు అని ఇచట చెప్పుకొనవలెను. మహాభారతమున కర్ణుని యందీలోపము గనిపించును. అది దానకర్ణుడను అతని శీలమునకు వన్నెదెచ్చునది కాదు. కావున కర్ణ భారమున ఈ విషయమును మార్చి కర్ణుడు ప్రతిఫలము కోరకుండగనే దానము చేయ ఇంద్రుడు తని త్యాగమున కబ్బురపడి తానైతానె అస్త్రమిచ్చెనట్లు భాసుడు కల్పించెను. పొరలంగ బడుచు – పొర్లబడుచు, తా = తాను, తెరమరుంగున నుండి = అలల చాటుగా నుండి, తెరయనంగను వీచిపరగును – ఆం. భా. 1-154, కసరెడు= చలించెడు, ఘూర్ణిల్లెడు, మున్నీటిర్ =. సముద్రుని, పొసగనేల = దానకర్ణుడని అంగీకరించుట యెందులకు – పొరలంగబడి – తెరమరుంగు ననుండి కసరెడు, అను విశేషణములతో సముద్రుడెపుడు అలతో పొర్లి పడుచుండుట – ఆనీటి తెరలలో సముద్రుని యసలు రూపము అనగా నిశ్చల రూపము గనిపించకుండుట, ఎల్లప్పుడు ఘోషించుచుండుట యనునవి యిచట స్మరింప వలెను.

తా :- భూలోకమున తెలివితో యోచించుచు, ప్రియవాక్కులతో దానము చేయు మార్గమున యమీనుఖాను ప్రభువు వర్తించుచుండగా యాచకులకు నిక కల్పవృక్షములను వేడబోవుట, కర్ణుని పొగడుట, మేఘమును దానపరుడని చెప్పుట, సముద్రుని దానపరుడని చెప్పుట యెందులకు -

విశే : ఈ పద్యమున కల్ప వృక్షాదులందొక్కదానియందొక దోషము చూప బడినది. కల్పవృక్షము అర్థిని చూడగనే వెలవెలబారి మ్రాన్పడి పండ్లు చూపును. మేఘుడు మించుచూపుచునే ఆమించున నిల్కడలేక విసమొసంగును. కర్ణుడు బోసివోయి ఒక నియమము పెట్టి దానము చేసెను. సముద్రుడు పొరలబడి అలల చాటున నుండి కసరును. ఈ లక్షణములేవిగూడ యమీనుఖానునకు లేవు కాగానతడు ప్రియవాక్కులతో దానము చేయును. ప్రియవాదిత్వముతోడి దాన మరుదు. కాన వానికన్న అమీనుఖాను గొప్పవాడని నిష్కృష్టార్థము.

కర్ణుడు సూతుని దగ్గర బెరుగుచు కృపాచార్య జామదగ్న్యుల వలన వివిధాస్త్రలాభములు పొందగా నతనిని తలచుకొని ధర్మరాజు మనమున దిగులు పడుచుండెను. అది చూచి ఇంద్రుడు కర్ణుని కవచ కుండలములు బ్రాహ్మణ రూపమున నేగి యాచించి యతనిని శక్తి హీనుని జేయువలెనని యెంచెను. అది తెలిసి యొక నాడు సూర్యుడే బ్రాహ్మణ వేశమున కర్ణుని దగ్గరకు వచ్చి తననెరిగించుకొని యింద్రుడు నీకవచ కుండలములర్థించుటకు వచ్చును. అవి అమృత మయములు. కావున వాని నిచ్చిన యెడల నీవు యుద్ధమున మరణింతువు. కనక నీయవలదని చెప్పెను. కాని కర్ణుడు బ్రాహ్మణుడు వచ్చి నన్నేది యడిగినను యిచ్చుట నావ్రతముగాన దానిని నేను విడువ జాలనని చెప్పెను. అంత సూర్యుడతనితోనైన యెడల ఇంద్రుని చెంత యమోఘ మైన శక్తి యను నస్త్రము కలదు దానిని నీ కవచ కుండలములకు బదులుగా నడుగుమని చెప్పెను. ఆ మాట ప్రకార మతడు ఇంద్రుడు తనను వేడివచ్చినపుడు ''దేవా యట్లయిన నిఖిల శత్రుఘాతిని యైన నీ యమోఘ శక్తినాకుం గృపజేసి కవచ కుండలంబులు గొనుమని'' చెప్పెను. అది విని ఇంద్రుడు సరియే ఇది నీ శత్రువులలో ఒక్కరిని మాత్రమే చంపి తిరిగి నన్ను జేరును కనుక మిక్కిలి యవసరపడిన సమయముననే యుపయోగించుమని హెచ్చరించి దానినిచ్చి కవచ కుండలములు పుచ్చుకొనెను.

ఈ సందర్భమును పరిశీలింపగా జరుగుబోవు భారత యుద్ధమున

సూర్యేంద్రులు తమ తమ కుమారులను రక్షించుకొనుటకై ఎవరి ప్రయత్నము వారు చేసిరని యనవలెను. కాని కర్ణుడు సూర్యుడు చెప్పినను తన నియమమును విడువక యుద్ధరంగమున ప్రాణా పాయము తెచ్చుకొనెను.

వామనునికి భూమిని దానము చేయవలదని గురువైన శుక్రుడు చెప్పినను వినక బలిచక్రవర్తి, ఇంద్రునికి కవచకుండలమీయవలదని తండ్రియైన సూర్యుడు చెప్పినను వినక కర్ణుడు దానఫల మనుభవించిరి –

కర్ణుని దగ్గరగల శక్తిని శ్రీకృష్ణుడు అర్జునిపై ప్రయోగించకుండ అతనిపైకి ఘటోత్కచుని పురికొల్పి దానిని ప్రయోగించునట్లు చేసి యర్జునుని గండమును తప్పించెను.

''అలం – తుల్య యోగిత''

కేవల ప్రకృతములకు గాని అప్రకృతములకుగాని యొకే ధర్మము నిలుపుట తుల్య యోగిత యనబడును – తుల్యమనగా సమాన ధర్మము. అవి కలవాని నన్నిటి నొకచోట సమావేశ పరచుట యోగము. అందువలన దీనికి తుల్య యోగిత అనుపేరు సార్థకము–

ఈ పద్యమున నమీనుఖాను దాతయై యుండగా పుడుకు చెట్లను మబ్బులను, తామర చెలిపట్టిని, మున్నీటిని వేడనేల కొనర నేల, తడవ నేల, పాసగనేల యని పర్యాయ రూపములలో నవరసము లేని వన్ని యొక చోట చేర్చబడినవి గాన విదితుల్య యోగిత – ఈ పద్యము కేవలం ప్రకృత తుల్యయోగిత కుదాహరణము.

30 సీ॥ దురములో వ్రేటారు తునకులుగా వ్రేయు
నట్టి రౌతులకెల్ల నాటపట్టు
తొడరి బెబ్బులినైనఁ బెడకేల బడఁ ద్రోయు
వూపు గల్గిన బంట్ల పుట్టి నిల్లు
వట్టి ప్రూకులఁ నిగు ర్వెట్టెడు పాటలఁ
బాటిల్లుగాణల పట్టుఁ గొమ్మ
పుట్టఁ బుట్టిన ప్రోడ పొల్పునఁ జెప్పగాఁ
గలుగు జాణల మొత్తములకు నెలవు

తే॥ నైన తనపేరఁ గల్గ నమీనుపురము
నందు మున్నీటి జోక చేయంగ జాలు
చెఱువు త్రవ్వించె మిగుల నచ్చెరువుగాఁగ
నిండు వేడ్క నమీను ఖానుండుమెఱసి - 30

టీక : అమీను పురము, దురములో = యుద్ధ రంగమున, వ్రేటారు తునకలుగా వ్రేయు = వ్రేటు+ ఆరు ఒక్క దెబ్బతోనే ఆరు తునకలగు నట్లు ఖండించు, నట్టి, రౌతులకెల్ల = అశ్వికుల కందరికి, ఆటపట్టు = క్రీడాస్థలము, తొడరి = తాము ప్రయత్నించిన, బెబ్బులినైన, వెడకేల౯ = ఎడమ చేతితోనే = అనగా అతి లాఘవముగా - కుడిచేతి కంటే ఎడమచేతియందు బలము తక్కువ కనుక ఇది తేలిక యను నర్థము రూఢియైనది - పడద్రోయు = నేల గూల్పగల, వూపు గల్గిన = శౌర్యముగల, బంట్ల = యోధుల యొక్క, పుట్టినిల్లు = జన్మభూమి, వట్టిమ్రాకుల = ఎండిన మ్రానులు, ఇగురెవ్వట్టెడు పాటలన్ = చిగురించునట్లు పాటలను, పాటిల్లు = పాడగల, గాణల = గాయనీ మణులకు, పట్టుగొమ్మ = ఆలంబనమైన స్థానము, పుట్టబుట్టిన ప్రోడ = వల్మీక సంభవుడగు వాల్మీకి, పొల్పున = విధముగా, చెప్పగా గలుగు = కవిత్వము చెప్పగలుగు, జాణల = నేర్పరులైన, మొత్తములకు = సమూహములకు, నెలవు = నివాసము ఐన = ఐనటువంటి, తన పేరగలుగు = తనపేరుతో నొప్పు, అమీనుపురమునందు, మున్నీటి జోక చేయంగ జాలు = సముద్రము యొక్క సామ్యము చేయగల, చెఱువు, అమీనుఖానుండ, నిండు వేడ్కమెఱసి = మిక్కిలి సంతోషముతో ప్రకాశించి, మిగుల నచ్చెరువు గాగన్ = చూపరులకు మిక్కిలి ఆశ్చర్యము కలుగు నట్లుగా త్రవించె = త్రవ్వించెను.

తా :- ఆ అమీనుఖానుడు యుద్ధమున శత్రువులను ఒక వ్రేటున కారు తునకలుగా చేయగల యోధులకు, ప్రయత్నించిన యెడల బెబ్బులినైన ఎడమ చేతనే క్రింద బడవేయగల బంట్లకు, ఎండిన చెట్లయిన చిగురించునట్లు పాడగల పాటకత్తెలకు, వాల్మీకివలె కవిత్వము చెప్ప గలిగిన కవులకు నిలయమై తన పేర గలుగు నమీను పురమున సముద్రమునకు సాటి చేయగల చెఱువును మహా సంతోషమున చూచు వారాశ్చర్య పడునట్లు త్రవ్వించెను.

31 ఉ॥ తామర తంపరై సిరులఁ దార్కొను కాసల నాఁట, సత్యచిం
తామణి పొట్లచెర్లను, సతంబగు చుండ నమీనుఖానుఁ, డిం
పొమతి లంగ నిల్ప, బొడ్డపై బెడఁగైన మసీదుఁ గాంచి యం
దేమను వెండికొండ పయి కేఁగ దలంపక బేసికంటియున్ - 31

టీక : తామర తంపరై = ఎడతెగనివై, సిరులు = ఐశ్వర్యములు, దార్కొను = సమకూడిన, కాసల నాట, సత్యచింతామణి, పొట్ల చెర్లను = కాసల నాడు అను దేశమున గల సత్యచింతామణి యను పొట్లచెఱువున, సతంబగు చుండ = శాశ్వత మగుచుండగా, అమీనుఖానుడు, ఇంపామ తిలంగగ = జాతర ఏర్పడు నట్లుగా, నిల్పగ = ఎత్తించగా, పొడవైన = ఎత్తయిన, బెడగైన = అందమైన, మసీదు గాంచి = ఆ మసీదును చూచి, బేసికంటియుగ = శివుడు, వెండికొండ పయికి, ఏగదలంపక = పోవుట కిష్టపడక, అందేమనుగ = దాని యందే నివసించును.

తా :- ఐశ్వర్యముతో తామర తంపరై వర్ధిల్లు కాసల నాటిలో గల సత్య చింతామణి యగు పొట్ల చెరువునందు అమీనుఖానుడు శాశ్వతమగు నట్లు ఎత్తయిన మసీదును నిల్పగా దాని యందమును గని ముక్కంటి కైలాసమున కేగుట కిష్టపడక దానియందే నివసించు చుండను.

కాసల నాడు – ఇది హైదరాబాదు వరంగల్లు జిల్లాల కుత్తరమున గల సీమ. నేటి మెదకు కరీంనగరము జిల్లాలలోని కొంత కొంత భాగ మానాడు కాసల నాటికి చెందు చుండెను. దీనికి దక్షిణ కోసల మనియు, శాసనములలో కుసలనాడనియు వ్యవహారములు. శ్రీరాముని తల్లియగు కౌసల్యాదేవి ఈ దేశమునకు చెందిన మహారాజు కూతురే నని పరిశోధకుల మతము. పొట్లచెరువు సంగారెడ్డి తాలూకా లోని గ్రామము. దానినిపుడు పటన్‌చెరువందురు. చూ. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము పు. 82

హిందువుల ఆలయములందు బైరాగులు తురకల మసీదులందు పకీరులు నిలుచు చుండుట ఆనాటి నుండి నేటి వరకు సాగుచున్నదే.

ముక్కంటి శివరూపమొక్క యింటికి వచ్చి భిక్షమడిగితే లేదనెడి వారికి ముక్తి మెక్కడిదని తిక్కయ్య గారితత్వము భిక్షుకులందరు శివస్వ రూపులేని యతని మతము. అభ్యాగతులు విష్ణు స్వరూపము.

వైష్ణవులు సాధారణముగా శివసర్మరణ చేయరు కాని తెలగన శివుని కైలాసమునుండి యమీనుపురములోని మసీదులోనికి రప్పించెననగా నిది ఆసర్వజ్ఞానివోగడుటో తెగడుటో ఎరుగరాని గడుసు దనము.

కేవలమింతే విషయము అనగా మామిడిమడయందు తూము రామచంద్రారెడ్డి శివాలయము కట్టించెను. కైలాసవాసము నుండి శివుడు వచ్చియందు నివసించెను. అను నింతమాత్ర విషయమునే చింత కిందిరామన్నయను కవి గౌరీ విలాసమును పేర ఆరాశ్వసముల కావ్యము రచించెను. కథా సంగ్రహమునకు క్షేపాల గంగోత్ర చూ. పు. 14 నుండి. 17.

32 చ॥ పొడవుల కెల్లనుం బొడవు ప్రోడలు, నెమ్మది లోనఁ గాంచుని
ల్కడ కడలేని తేజున జగంబున కవ్వలయైన వెల్గునె
య్యెడలను బొందువారలకు, నెక్కఁగ నిచ్చెన యౌ మసీదునిం
పడర నమీను ఖానయొడయందు తిరంబుగ నిల్పెఁ బొల్పుగన్ - 32

టీక :- పొడవులకెల్లనుం బొడవు = ఉన్నతము లన్నింటి కున్నతమైనది. ప్రోడలు = ప్రజ్ఞావంతులు, నెమ్మదిలోన గాంచు = శాంతమైన మనసుతో చూచు, నిల్కడ = స్థిరమైనది, కడలేని తేజున = అంతము లేనట్టి తేజస్సుతో జగంబున కవ్వల యైన వెల్గు = ఈ లోకము లన్నిటికి ఆవలి దగు వెలుగు -

కం॥ లోకంబులు లోకేశులు, లోకస్థులు తెగిన తుది నలోకం బగు పెం; జీకవ్వల నెప్పుడు, నేకాకృతి తోడ వెలుగు - అని పోతనగారు. భాగ స్క.8.ప. నెయ్యెడలను = ఆ వెల్గును ఎప్పుడైనను, పొందువారలకు = చేరువారలకు ఎక్కగ నిచ్చెన = అధిరోహించుటకై నిశ్రేణి, యౌ = అగు, మసీదు, ఇంపడర = అందములుకునట్లు, అమీనుఖాను యొడయందు = అమీనుఖాను అను ప్రభువు, పొల్పుగన్ = ఒప్పునట్లుగా, తిరంబుగ = శాశ్వత మగునట్లు, నిలిపెన్ = నిలిపెను.

తా :- అమీను ఖానుడు పొట్ల చెఱువున, ఉన్నతములకెల్ల నున్నతమైనది, జ్ఞానులెల్లపుడు తమ యొక్క శాంతమైన చిత్తమున చూచునట్టి నిల్కడ యైనది, అంతములేని తేజస్సుతో ఈ లోకము లన్నిటి కావలిదై ప్రకాశించునది యగు వెలుగును పొందదలచిన వారెక్కుటకు నిచ్చెన యైనటువంటి మసీదును సొగసు చిందునట్లుగా మరియు శాశ్వత మగునట్లుగా నిలిపెను.

విశే :- ఇందు మసీదు పరబ్రహ్మము నందు కొనుటకు నిల్పిన నిచ్చెన యని చెప్పబడినది.
''అలం : రూపకము''

'పరిణామము -

ఈ పద్యమున నమీనుఖాను పొట్ల చెఱువున కట్టించిన మసీదు జగంబుల కవ్వలిదైన వెలుగును చేరుటకు ప్రోడలకు నిచ్చెనయైనదని చెప్పబడినది గాన నిది పరిణామము.

33చ॥ కడక నమీనుఖానుఁడు జంగంబు తనుం బొగడంగ వేడ్కతో
విడువక యెప్పుడుం బడమి వేల్పుల బిడ్డల పెండ్లి చేయఁగా
నడరెడు బీతు లోఁ బొడమ, నందు కతింబునఁ గాదె దూఱుఁ బే
రడవులలోపలన్. దబిసియై కనుపట్టెడు గాలి చూలియున్ - 33

టీక : అమీనుఖానుడు, జంగంబు తినంబొగడంగ = లోకమంతయు తనను మెచ్చుకొనుచుండగా, వేడ్కతో = సంతోషముతో, కడకన్ = తన ప్రయత్నమును, విడువక, యెప్పుడున్ = ఎల్లప్పుడు, పడమి వేల్పుల బిడ్డల పెండ్లి సేయగాన్ = బ్రాహ్మణ బాలుర యొక్క వివాహములు చేయుచండగా, తబిసియై కనుపట్టెడు = మునియై కనిపించు, గాలి చూలియున్ = వాయుదేవుని కుమారుడైన హనుమంతుడు, అడరెడు బీతు = అధిక మగుచున్న భయము, లోబొడమ = లోపలకలుగగా, అందు కతంబునగాదె = అందుకొరకే గదా; పేరడవుల లోపలన్ = పెద్ద పెద్ద యడవులందు, దూరను = చొచ్చుచుండును

తా : అమీనుఖానుడు సంతోషముగా ఎల్లపుడును ప్రయత్న పరుడై బ్రాహ్మణ బాలుర వివాహములు చేయుచుండగా తపస్సు చేసికొనుచు మునియై కనిపించు హనుమంతుడు మన అమీనుఖాను తనకు గూడ నెక్కడ పెండ్లి చేయునోయని మనస్సున తీవ్రమైన భయము కలిగి అందుకే పెద్ద పెద్ద యడవులలో దూరి నివసించెను.

ఈ పద్యమున కవి యాంజనేయుడు అమీనుఖాను తనకు గూడ వివాహము చేయునేమో అని భయపడి యడవులకు పారిపోయి దాగి నట్లు చెప్పెను. అనగా నతడు బ్రహ్మచారిగనే నిలిచెనని భావము.

అమీనుఖాను బ్రాహ్మణ వటువులకు వివాహములు చేయు చుండగా హనుమంతునకు భయము కలిగెననుటలో నతడు గూడ హనుమంతునకు భయము కలిగెననుటలో నతడు గూడ ద్విజవర్గములోని వాడనవలయును. అపుడు వటువులకు శిఖా యజ్ఞోపవీతము లుండవలెను. కాని ఇవిపుడెక్కడను హనుమంతునికి కనిపించవు.

విజయవాడలోని బందర్ రోడ్డులో గల విక్టోరియా మ్యూజియమున నున్న యాంజనేయునకు పిలక గలదు. యతనిని పిలకాంజనేయు లందురు. యతనిని గురించి ఆ మ్యూజియం అసిస్టెంటు డైరెక్టరు శ్రీ గోవిందరెడ్డిగారు హనుమంతుడు వేదవేదాంగ వేత్త. సూర్యుని దగ్గర వేదములు చదివెను కనుక విజయ నగర రాజుల కాలమున శిల్పు లాంజనేయుడు వేదపండితుడనుటకు చిహ్నముగా పిలక నుంచారని చెప్పిరి.

చూ. వడర్ వరల్డ్ మార్చి 1996 పుట 27 పిలకాంజనేయులు.

ఇటువంటి పిలకాంజనేయ ప్రతిమలు కందూరులో గూడ రామ లింగేశ్వరాలయము వెలుపలనున్నది. తెలగన నతడమీను ఖానునకు భయపడి యడవులకు పారిపోయెనని చెప్పెను. కందూరులో ఇపుడా హనుమంతుడున్న ప్రదేశం మట్టిదే.

విశే :- దేవతలలో గణపతి, హనుమంతుడు, కుమారస్వామి ఈ ముగ్గురు బ్రహ్మచారులుగా ప్రసిద్ధి. ఉత్తర భారత మంతటను వీరు బ్రహ్మ చారులుగానే ప్రసిద్ధి నందగా దక్షిణ భారతమున వీరు వివాహితులై నారు. అందునను గణపతికి కుమారస్వామికి యిద్దరేసి భార్య లున్నారు.

గణపతి ఆలయములు అడవులలో నుండవుగాని హనుమ దేవాలయములు అడవులలో గూడ నుండును. అతడు బ్రహ్మచారి కనుక ఈ విషయ మాధారముగా జేసికొని కవి ఈ కల్పన జేసెను. ఈనాడు హనుమంతునికి గూడ కళ్యాణములు జరుగు క్షేత్రములు కొన్ని యున్నవి. కాని ఆ సంప్రదాయము బహుశః తెలగన్న నాటికి యింకను రూపు దిద్దుకొని యుండ దనవలెను. హనుమత్కల్యాణము యిపుడు కావ్యము గూడ నున్నది. కర్త – అడుగుల రామయ్య హనుమంతునకు దివి సీమలోని అవనిగడ్డలో కల్యాణోత్సవము జరుగును. ఇది ప్రతి యేట పుష్యశుద్ధ చతుర్దశినాడు జరుగును. ఆంధ్ర దేశమున హనుమత్కల్యాణమీ యొక్క చోటనే జరుగు చుండును. ఇది విశేషము.

34ఉ॥ దొమ్మి నమీనుఖానుఁ డని దూకొని గెల్పులఁ గొన్న, సొమ్ముఁ దా
నిమ్ముల లిబ్బులున్న, నవి యేర్పడ జక్కుల తేఁడు గాంచి. నా
తొమ్మిది లిబ్బులున్ బలిమితోఁ గొనునో యనుచుం దలంపుతో
నమ్మక, కాచియుండు జతనంబున రేలుఁ బగళ్ళు నెంతయున్ – 34

టీక : దొమ్మిఁ = పెనగులాటలందు, అమీనుఖానుడు, అని దూకొని = యుద్ధరంగములందు ప్రవేశించి, గెల్చులగొన్న సొమ్ముఁ = జయించిన ధనమును. తాన్ = తాను, ఇమ్ములఁ = తనయొక్క నివాసములలో, లిబ్బులున్పఁ = రాసులుగా నుంచగా, అవి, జక్కులఱేడు = కుబేరుడు, ఏర్పడఁ గాంచి = చక్కగాగని, నా = నాయొక్క తొమ్మిది లిబ్బులఁ = నవనిధులను, బలిమితోఁ = తన యొక్క భుజబలముతో (జబర్దస్తితో) కొనునోయనుచఁ = గ్రహించునేమో యని, తలంపులో నమ్మకఁ = మనస్సులో నమ్మిక చాలక (కొనడని), జతనంబున = ప్రయత్నము చేత, రేలు బవళ్ళు = రాత్రిం-బగళ్ళు, ఎంతయున్ = ఎంతగానో జాగ్రత్తగా, కాచియుండుఁ = రక్షించుకొనుచుండను.

తా : అమీనుఖానుడు దొమ్మి యుద్ధములందు సాహసమున ప్రవేశించి గెలుచుకొన్న ధనమంతయు తన నివాసములందు రాసులు రాసులుగా నుంచగా కుబేరుడవి చూచి, ఇతడు బలవంతుమున నా యొక్క నవనిధులను గూడ నాక్రమించునేమో యని రాత్రింబవళ్ళు వాని నెంతో జాగ్రత్తగా కాపాడు చుండును.

నవనిధులు -

శ్లో ॥ మహాపద్మశ్చ పద్మశ్చ, శంఖోమకర కచ్ఛపే
ముకుందః కుంద నీలాశ్చ, ఖర్వశ్చ నిధయోనమః

హిందువుల సంఖామానమున ఒకట్లు మొదలు కొని మొత్తము ముప్పదైదు స్థానములున్నవి. వానిలో మనకిపుడు శతకోటి వరకే తెలియును. మనయొక్క కోటిని ఆంగ్లేయులు మిలియనని, శతకోటిని బలియనని వ్యవహరింతురు. ఆ పిమ్మట నింకను అర్బుదము, న్యర్బుదము, ఖర్వము, మహాఖర్వము, పద్మము, మహాపద్మము, క్షోణి, మహాక్షోణి, శంఖము, మహాశంఖము, క్షితి, మహాక్షితి, క్షోభము, మహాక్షోభము, నిధి, మహానిధి, పర్వతము, పరార్ధము, అనంతము, సాగరము, అవ్యయము, అచింత్యము, అమేయము, భూరి, మహాభూరి, అని ఇరువది యెదు స్థానములున్నవి. నవనిధు లలో ఖర్వము - పరమూడవ, పద్మము, పదునాలుగవ, మహాపద్మము, పదునైదవ, శంఖము పదునెనిమిదవ స్థానములగును. ఇవిగాక మిగిలిన మకర కచ్ఛప కుందముకుంద, నీలములకు మనసంఖ్యామానమున నాకరములేదు. అవి వేనికి సంకేతము లగునో తెలియదు.

ఇవి నిధులపేర్లగాని సంఖ్యావాచకములు కావని పౌరాణికుల మతము. శిల్పశాస్త్రమున కుబేరునకు అతడు నిధిపతియైనటుల గుర్తుగా కుడివైపున పద్మపాణి, ఎడమ వైపున శంఖపాణియైన దూతలను తీర్చెదరు. వారు రెండు చేతులందును పద్మశంఖములే ధరించియుందురు.

35 క:- అబ్బురమై పొలుపొందెడు
కబ్బంబులు చాల నంది కనియె ననంబుల్
నిబ్బరముగ బొడమెడు పే
రుబ్బున నల్గడల జాణ లోహో యనఁగన్ - 35

టీక :- అబ్బురమై = ఆశ్చర్యకరమై, పోలు పొందెదు = ప్రకాశించెడు, కబ్బంబులు = కావ్యములు, చాలనంది = మిక్కిలిగా నంకితముగొని, నిబ్బరముగ = స్థిరముగా, పొడమెడు = కలిగెడు, పేరుబ్బున = నామము యొక్క గొప్పదనమున, నల్గడలఁ = నాలుగు దిక్కులందలి, జాణలు = నేర్పరులు, ఓహోయనగఁ = మెచ్చుకొనగా, అసంబుల్ = కీర్తులు, కనియెన్ = పొందెను.

తా :- అమీనుఖానుడు ఆశ్చర్యకరమై ప్రకాశించెడు కావ్యములు అనేకముగా కృతులనంది, వానివలన నాలుగు దిక్కులందు స్థిరముగా కలిగెడు తన పేరుయొక్క గొప్పదనము చేత నేర్పరులు ఓహోయని పొగడు చుండగా గొప్పకీర్తిని పొందెను.

36 సీ॥ మారేళ్ళు నేరేళ్ళు మామిళ్ళు జిన్నులు
మాదీఫలంబులు దూదినిమ్మ
లీఁడెలు మేడులు జీడులు దాడింబ
లనఁటులు పనసలు చనుపకములు
పొగడలు పొన్నలు పోఁక ద్రాఁకులు కమ్మ
రేనులు నిమ్మలు రేఁగు లిప్ప
లంబాళములు కజ్జూరంబు లనాసలు
నారికడంబులు నార దబ్బ

తే॥ లగరు లేలకి విరవాది యాఁకు దీఁగె
మల్లియలు గొజ్జఁగులు దాక మొల్ల మొగిలి
మొదలుగా నివి యెప్పుడుఁ బూచి కాచి
యుండు తోఁట లమీను ఖానుఁడు నిలపె - 36

టీక :- అమీనుఖానుండు, యెల్లపుడు, పూచికాచి యుండునట్టివి. మారెళ్ళు, నెరెళ్ళు, మామిళ్ళు, జిన్నులు = ? మాదీఫలంబులు = మాతు లుంగములు, దూదినిమ్మ, ఈడెలు = నారింజలు, మేడులు, జీడులు = జీడిమామిడులు, దాడింబలు = దానిమ్మలు, అనటులు = అరటులు, పనసలు, చనుపకములు = చంపకములు, పొగడలు, పొన్నలు, పోకమ్రాకులు, కమ్మరేనులు = కమ్మరేగులు / గంగరేగు, నిమ్మలు, ఇప్పలు, రేగులు, అంబాళములు = ఆమ్రాతక = పుల్ల మామిడి, కజ్జూరములు, అనాసలు, నారికడంబులు = టెంకాయలు, నారిదిబ్బలు = కర్నెకాయలు, ఆగరులు = ఏలకులు, విరవాది = విరిజాజులు, ఆకు తీగెలు = తమలపాకు తీగలు, మల్లియలు = మల్లెలు, గొజ్జంగులు, కు బ్జక = గులాబీలు, దాక = ద్రాక్షలు, మొల్ల = మొగిలి - మొదలైనవి, నిలిపెను = వేయించెను.

తా :- ఈపద్యమున అమీనుఖానుడు వేయించిన (34) ముప్పదినాలుగు రకముల తోటలు చెప్పబడినవి. వీటిలో కొన్ని పూవులవి. మరికొన్ని పండ్లవి. ఇవి ఎల్లపుడు పూచి కాచుచుండెను.

37ఆ॥ ఏచిననిచి పూచి కాచి పండిన యమీ
నృరము మేలితోఁట లరసి కాంచు
ముసలి వారికైనఁ, పసిబిడ్డలకు నైనఁ
బండ్లు వచ్చు నలరుఁ బ్రాయ మొదవి - 37

టీక :- ఏచి = విస్తరించి, ననిచి = చిగురించి, పూచి, కాచి, పండిన = ఫలించి నట్టి, యమీన్పురము, మేలి తోటలు = ఆ అమీన్పురమందలి మంచి తోటలు, అరసి = బాగుగా పరీక్షించి, కాంచు = చూచునట్టి, ముసలి వారికైన, పసిబిడ్డలకునైన, అలరు ప్రాయమొదలి = కోడెవయసు వచ్చి, పండ్లు వచ్చును = దంతములు మొలుచును.

తా :- అమీనుఖానుడు తనపేర గట్టించిన పట్టణమున వేయించిన తోటలు, ఏపుగా పెరిగి చిగురించి, పూచి, కాచి ఫలించు చుండుట చూచు చున్నపుడు, పసిబిడ్డలకైనను, ముసలి వారికైనను కోడెవయసు వచ్చి దంతములు మొలుచును, అనగా అవి చూచువారికంత ఉల్లాసము గొల్పుచుండెనని యర్థము.

విశే :- పండ్లు పులియుట, గోర్లుపోవుట, అను జాతీయమున్నది. పుల్లనివి తిన్నపుడు లేదా కొందరికి విన్నపుడు కూడ దంతములు పులియుట కలదుకాని పండ్లు

మొలుచుట క్రొత్త జాతీయము. అలరు ప్రాయ మొదవి అనుట ఇందు సాభిప్రాయ విశేషణము. వృక్షములకు అలరులు అనలుగా పూవుల పిమ్మటనే పండ్లు వచ్చును.

38క॥ చలిపందిరులును సత్తరు
వులు నూతులు బావులుం బువుం దోఁటలు జె
ర్వులు నల్లిండ్లును మొదలుగ
నిలిపి యమీన్ ఖానుఁ డసము నించెం బుడమిన్ - 38

టీక :- అమీనుఖానుడు, చలిపందిరులను = చలివేంది రాలను, సత్తురువులు = సత్రములను, నూతులు = చేదుడు బావులు, బావులు = దిగుడు బావులు, పువుందోటలు = పూల తోటలు, చెర్వులు, నల్లిండ్లు = బ్రహ్మణాగ్రహారములు, మొదలైనవి నిలిపి, పుడమిఁ = భూమిపై, అసమునించెన్ = కీర్తిని నిండించెను.

తా :- అమీను ఖానుడు తన రాజ్యమున చలిపందిళ్లు, సత్రములు, నూతులు, నడబావులు, చెఱువులు, పూదోటలు, బ్రహ్మణాగ్రహారములు ఎన్నో ఏర్పంచి భూమిపై తన కీర్తిని నిండించెను.

నల్లిలు = నల + ఇల్లు, నల్లార్, పవిత్రమైన, నల్లిల్లు = హోమధూమము లచే పవిత్రమైన గృహములు గలది. అనగా బ్రహ్మణాగ్రహారము.

నల్ల శబ్దార్థాలు -

1. తమి - నల్ / నర్ = మంచి
   నల్ల = అందమైన. నల్లవర్/ నల్లర్ = పవిత్రమైన/ విద్యావంతుడైన
   నల్లాళ్ = పవిత్రమైన / మేలైన స్త్రీ

2. తెలు - నలవు - నలవు / నలుపు = అందమైన / మంచి

3. మలయా - నల్ / నలం / నల్లం/ = మంచి
   నల్ల / నల్మ / నల్లర్ / నల్లవఁ = సంతోషమైన వాడు
   నల్లాల్ = ఉత్తముగలైన స్త్రీ

4. కొడగు - నల్లె = మంచి good

5. తుళు - నలు/ నల = మంచి

6. గోండి - నిలా = మంచి good
ద్రవిడియన్ ఎటిమాలజికల్ డిక్షనరి - ప్రచు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ 1984 - పు. 318, 19 పదము నెం. 3610

తెలగన ఈయాశ్వాసంలోని 33వ పద్యమున యమీను ఖాను బ్రాహ్మణ వటువులకు పెండ్లిండ్లు చేయునని యీ పద్యమున వారి కగ్రహారము లిచ్చెనని తెలిపెను. అతని యాస్థానమున మరింగంటి యప్పలాచార్యులుండుట అతడు, అతడు బ్రాహ్మణవటువులకు వివాహములు చేయుట, అగ్రహారము లిచ్చుట యనునవి అతని బ్రాహ్మణ భక్తిని తెలుపును.

''గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం'' అనుకోరునది హిందూ ధర్మము, గోవధ, బ్రాహ్మణావమానము ధ్యేయముగా గలది మహమ్మదీయ మతము కాన యీ యమీనుఖానుని బ్రాహ్మణ భక్తిని జూడ మహమ్మదీయ మతమున నదియు తడవలంబించిన శాఖాలక్షణ మనవలెను. అతడు సూఫీమత మందలి ఖాదరీశాఖకు చెందిన ట్లతని గురుపరంపరను బట్టి తెలియును. చూ. (67)వ పద్యము.

సూఫీలు భారతదేశమునకు ఢిల్లీలోని తురుష్కపరిపాలనకు ముందే ప్రవేశించిరి. కాని మహమ్మదీయుల పరిపాలనలో వీరిరాక కూడ ఇనుమడించినది. ఈ మతమునకు మహమ్మదు జీవితము మరియు అతని బోధలైన ఖురానే ఆధారమైనను దీనికి 9వ శతాబ్దము వరకు స్పష్టమైన రూపు రేఖలు లేవు. 12వ శతాబ్దము నాటికది తనదైన ప్రత్యేక సంప్రదాయమును నిల్పుకొన్నది. దీనిపై హిందూ, బౌద్ధ, క్రైస్తవ, జోరాష్ట్రియన్ నియోప్లాటో మొదలైన యన్ని మతముల ప్రభావ మున్నది.

దీనియందు అహింస భగవద్భక్తి, త్యాగము సంయమన మను సుగణములుండుట వలన ఈ మతము భారతీయులు నాకర్షించి యిక్కడ నిలువ గలిగినది. దీనియందు 14వ శాఖలున్నట్లు అబుల్ - ఫజిల్ చెప్పెను. (ప్రాచీన భారత దేశ చరిత్ర ఉమ్మడి పాఠ్య ప్రణాళిక ననుసరించి. తెలుగు అకాడమీ ప్రచురణ 1994 సూఫీ మతం పు. 320, 21).

39 క॥ ఇట్టి గొనంబులచే నె
పుట్టున నెన్నంగ దగిన బలియుఁడు, సొంపుల్
నెట్టుకొనఁ దనకు దగియెడు
పట్టపురాణులను గూర్మి పైపైఁ బర్వన్ - 39

టీక :- ఇట్టి గొనంబులచే = ఇటువంటి గుణముల చేత, అమీనుఖాను, ఎప్పుట్టున = ఎటువంటి సమయమందైన, ఎన్నందగిన బలియుడు = లెక్కించదగిన బలవంతుడు, సొంపుల్ = అందములు, నెట్టు కొనన్ = అతిశయించగా, తనకు తగియెడు పట్టపురాణులను = తనకు తగినట్టి దేవేరులను, కూర్మిపైపై బర్వ౯ = ప్రేమ పైన పైన వ్యాపించగా, ముందు పద్యములతో నన్వయము.

40క॥ గరిత బడే బీబిన్, సె
క్కర బీబిన్, సెమ్మెబీబిఁ గనుపట్టెడు రా
మరుఁ డగు నమీను ఖానుఁడు
సిరు లొదవగఁ బెండ్లి యాడెఁ జెలువల రంగన్ - 40

టీక :- గరిత = పతివ్రతయైన, బడే బీబి౯ = సెక్కర బీబి౯, సెమ్మె బీబి౯, బడే బీబీ, సెక్కర బీబీ, సమ్మె బీబీలను వారిని, కనుపట్టెడు రామరుడగు = కన్నులకు గనిపించువలరాజైన, అమీనుఖానుడు, చెలువల రంగ౯ = తనదైన పద్ధతి శోభించు చుండగా, సిరులొదవ౯ = ఐశ్వర్యము సమకూడగా, పెండ్లి యాడెను = వివాహమాడెను.

తా :- అమీనుఖానుడు పైన తెలిపిన చలిపందిరు లాదిగా నెలకొల్పిన సద్గుణములతో నెటువంటి సందర్భములందైనను లెక్కించ దగిన గొప్పవాడై, అందము లొలుకగా తన యొుక్క ప్రేమ భార్యలపై మిగుల వ్యాపించగా కన్నులకు గనిపించు మరుడనదగి, పతివ్రతలైన బడే బీబీ, షుకూర్ బీబీ, షమాబీబీ యనుకాంతలను తనదైన పద్ధతి శోభించగా ఐశ్వర్యము సమకూరగా వివాహమాడెను.

విశే :- బడేబీబీ = పెద్ద దొరసానిగారు - ఇది విశేషణమే గాని సొంత పేరు గాదు. ఈమె పేరేదియో తెలియదు. షుకూర్ బీబీ = పా. షుకూర్ అనగా కృతజ్ఞత షమాబీబీ = షమా యనగా ఉర్దూ భాషయందు జ్యోతియని యర్థము. ఇది తెలుగున ''సెమ్మె'' యైన దనవచ్చును. ఇక ''బీబీ'' పదమాభాషయందు కుమారి/శ్రీమతి యని రెండర్థములందు గూడ ప్రయోగింపబడు చుండును.

41వ॥ వారియందు - 41

టీక :- వారియందు = ఆ ముగ్గురు భార్యలందు.

-: బడేడీడీ ప్రశస్తి :-

42చ॥ కొడుకుల కోట, పాల్కడలి కూఁతురితో నెనవచ్చులేమ, యె
ప్పుడు గడుఁబేద లాదరువు ప్రోచును, జుట్టలఁ గన్నతల్లియై
యడుగిడ దావలం బెనిమి టాడిన మాటకు, మాటవాసి జెం
దెడు బడెబీబి సాటిగలదే, మరియొక్క పొలంతియె య్యెడన్ - 42

టీక :- బడేబీబీ, కొడుకులకోట = కుమారులను పెట్టని కోటయై కాచునది. పాల్కడలి కూతురితో నినవచ్చులేమ = క్షరసాగర కన్యతో సాటివచ్చు యింతి, ఎప్పుడుఁ, కడుపేదల = మిక్కిలి పేదవారికి, ఆదరువు = ఆదరు దైయుండునది. చుట్టల = బంధువులను, కన్నతల్లియై ప్రోచును = రక్షించును, పెనిమిటాడిన మాటకు = భర్త చెప్పిన మాటకు, ఆవలఁ అడుగిడదు = అవతలికి దాటదు, మాటవాసిచెందెడు = మాట గలవారితో ప్రసిద్ధి చెందినది; మరియొక్క పొలంతి = ఇంకొకస్త్రీ, ఎయ్యెడన్ = ఏస్థలమందైనను, ఆమెకు, సాటిగలదే = సాటియున్నదా! అనగా లేదట.

తా :- బడేబీబి లక్ష్మీదేవికి సాటి, కొడుకుల కోట, చుట్టాల సురభి, పేదవారి కాదరువు, భర్త చెప్పిన మాటకు అడుగు దాటదు. మాట వాసి గలవారిలో ప్రసిద్ధి చెందినది. కావున లోకమున నెక్కడను నామెకు సాటిలేకుండిరి.

43.సీ॥ అత్తవారిండ్లకు నరుగు కన్నియలకుఁ
గట్నంబు లిచ్చుచు గారవించుఁ
బ్రొద్దు ప్రొద్దునెనె యెప్పుడు లేచి వాడల
పసి బిడ్డలకు నెల్లఁ బాలు పోయు
నాఁ కొన్న వారల కద్దమ రేయైన
నారగించఁ గ బెట్టునరసి యరసి
పాలునీ రెనసిన బాగునఁ బెనివాటి
తలఁపులో మెలఁకువ మెలఁగనేర్చు

తే॥ నౌర, తనపుట్టినింటికి నత్తవారి
యింటికిని వన్నెఁ దెచ్చిన తుంట విల్తు
తల్లివంటి బడేబీబిఁ దరమె పొగడఁ
దమ్మి పూవింట నెలకొన్న దంటకైన - 43

టీక :- ఆ బడేబీబి - అత్తవారిండ్లకు, నరుగు కన్నియలకు = అత్తింటి కేగెడు నాడు పడుచులకు, కట్నంబులిచ్చుచు గావించు = కానుకలిచ్చుచు గౌరవించును; ఎప్పుడు = ఎల్లవేళల, ప్రొద్దుప్రొద్దుననే - లేచి = తెల తెల వారగనే లేచి, పసిబిడ్డలకు నెల్లపాలు బోయు = చిన్న పిల్లలకు పాలు పోయును, ఆ కొన్ని వారలకు = ఆకలిగొన్న వారికి = అర్ధమరే యైన = అర్ధరాత్రి యైనప్పటికి అర్ధమరేయి దాఁక పోలమారసి మారశిల్ ముబంబునర్ - పాండు ఆ - అరసి యరసి = గమనించి గమనించి, ఆరగించగ బెట్టును = తినుటకు పెట్టుచుండును, పాలు నీ రెనసిన బాగున = పాలు నీరు గలిసిన విధమున, పెనిమిటి తలపుతో = భర్త యొక్క మనస్సులో, మెలకువర్ = జాగ్రత్తగా, మెలగనేర్చు = నడుచుకొన నేర్చును. ఔర, తన పుట్టినింటికి = అమ్మ, నానల వారి యింటికిని, వన్నెదెచ్చిన = ప్రశస్తిని దెచ్చిన, తుంటవిల్తు తల్లివంటిది = మన్మధుని గన్న లక్ష్మి వంటిది. ఆమెను, తమ్మి పూవింట = తమ్మి పూవు + ఇంట = అనగా పద్మ గృహమున, నెలకొన్న = నివసించిన, దంటకైన = మొనగాన్కైన, అనగా బ్రహ్మకైన తరమె పొగడ = పొగడుట సాధ్యమా! అనగా కాదనుట.

తా :- బడేబీబి అత్తవారిండ్లకు వెళ్లెడు కన్యలకు కానుక లిచ్చును. తెల తెల వారగనే లేచి వాడలోని పసిపిల్లందరికి పాలు పోయును. ఆకలిగొని వచ్చి వారిని అర్ధరాత్రి యైనను. సరియె చక్కగా విచారించుకొని యన్నము పెట్టును. భర్త యొక్క మనసెరగి పాలు నీరు గలసిన విధమున జాగ్రత్తగా మెలగును. ఆమె మన్మధుని గన్నట్టి లక్ష్మీదేవి వంటిది. కనుక నామెను పొగడుటకు కమల వాసియైన బ్రహ్మకును సాధ్యముగాదు.

44.క॥ కలిమి పొలఁతి బోలిన యా
చెలువకును నమీనుఖాను సింగంబునకుం
గలిగిరి గతాత ఖానుఁడు
బలియుఁడు ఫాజీలఖాను పట్టపు దొరయున్ - 44

టీక :- కలిమి పోలతి బోలిన = లక్ష్మీదేవిని పోలినట్టి, ఆ చెలువకును, ఆ యొక్క బడేబీబీకి, అమీనుఖాన సింగంబునకుఁ = అమీనుఖాను అనుసింహమునకు, గతాత ఖానుఁడు అను, బలియుడు = బలము గలవాడు, ఫాజీలు ఖాను, అను పట్టపు దొరయుఁ = పట్టాభిషేకము చేసికొన్న ప్రభువు కలిగిరి = జనించిరి.

తా :- లక్ష్మీదేవి వంటి బడేబీబీకి, అమీనుఖాను అను శ్రేష్టునికి, బలవంతుడైన గతాతఖాన్, పటపు దొరయైన పాజిలఖాన్ అనువారు కలిగిరి.

విశే :- ఈ పద్యమున బడేబీబీని కలిమిపాలతి బోలిన యనెను కనుక అమీను ఖానును సింగమనుట గమనింప దగిన యంశము. ఈ సింగము లక్ష్మీదేవికి పతియైన నరసింహునకు గుర్తు. అతడు నర + సింహుడు. ఇతడు మహమ్మదీయుడు కనుక అమీనుఖాన + సింగము – మొదటి దానియందు పూర్వ పదము సంస్కృతము. ఇందు ఉర్దూ.

''అలం – ఉపమ''

గతాత ఖాను =

ఫాజీలుఖాను = ఇది ''అప్జల్'' నుండి యేర్పడిన పదము ''పాజిల్'' అనగా పండితుడు విద్వాసుండని యర్థము

''ఖాన్'' అనగా గొప్పవాడు – ఇది బిరుద వాచకము.

-: గతాత ఖాను ప్రశస్తి :-

45.క:- అనిలో గతాత ఖానుఁడు
తన తేజీ నెక్కినట్టి తఱి, నదరుం గ్ర
క్కున నెడమ కన్ను సెలవెలుఁ
గునకుం దెఱగంటి దంట కొమ్మల గమికిన్ – 45

టీక : గతాత ఖానుఁడు, అనిలోన్ = యుద్ధమందు, తన తేజీనెక్కినట్టి తఱి = తన యొక్క గుఱ్ఱము నెక్కినపుడు, గ్రక్కునఁ = ఆ వెంటనే, సెకవెలుగునకుఁ = వేడి వెలుగైన సూర్యునకు, తెఱగంటి దంట కొమ్మల గమికిఁ = తెఱగంటి = కన్నులెప్పుడు తెరచి యుండునట్టి వారు అనగా ఱెప్పపాటు లేనివారు, దేవతల నిమిషులని పురాణం, తెఱగంటి దంట = దేవతాస్త్రీలలో నేర్పరులైన, కొమ్మలగమికిన్ = స్త్రీ, సమూహములకు అనగా రంభాదులకు, ఎడమకన్ను - అదరుఁ = వామనేత్ర స్పందనము జరుగును.

తా : బడేబీబీ అమీనుఖానుల పెద్ద కొడుకగు గతాతఖానుడు. యుద్ధ రంగమున గుఱ్ఱమునెక్కగనే ఆ వెంటనే సూర్యునకు శంభాదులకు నెడమకన్ను దురును.

విశే : ఎడమకన్నుదురట పురుషుల కశుభము, స్త్రీలకు శుభము, వీర స్వర్గము సూర్యమండలమున కావల నుండునట. యుద్ధమున మరణించినవారు వీర స్వర్గమునకు వెళ్లుదురు కాబట్టి యపుడు వారు సూర్య మండలమును భేదించుకొని వెళ్లుదురట. వీరమరణము చెందిన వారటుల వెళ్లు చుండుట వలన సూర్యుని శరీరము చిల్లులు పడిపడి జల్లెడవలె యైనదని వేదము వారి ఉపాచ. కావున గతాత ఖానుడు తన గుఱ్ఱము నెక్కగానే మరెవరో ఆ యుద్ధమున చచ్చి నన్ను చించుటకు వత్తురని సూర్యునికి భయము. అందువలన సూర్యునికి ఎడమకన్నదరుట నతని కాకీడును సూచించును. ఇకరంభాదులకో వారు స్వర్గమందలి వేశ్యలు కనుక యజ్ఞయాగములు చేసి మరణించిన వారైనచో వారు వృద్ధులుకాని యుద్ధ రంగమున జచ్చెడు వారు ప్రౌఢులు కనుక తమకు ఇక క్రొత్త కోడెకాండ్రు లభించగలరని వారికి సంతోషము. ఎడమ కన్నదరుట వారికా శుభమును సూచించును.
అలం – తుల్యయోగిత.

ఈ పద్యమున గతాత ఖానుడు అనిలో తేజీ నెక్కగనే సూర్యునకు మరియు నచ్చరలకు నెడమకన్నదరునని యిద్దరి కొకే ధర్మము చెప్పబడినది గాన నిది తుల్యయోగిత –

ఎడమకన్నదరుట సూర్యున కశుభము. రంభాదులకు శుభము – ఆయిద్దరి యవస్థ గూడ కథననుసరించి ప్రకృతయే – యనగా నప్పటికి సరిపడునదేగాననిది కేవల ప్రకృత తుల్యయోగిత. ఇది సరస భూపాలీయమునందలి ఓబట మహారాజా యొక్క పటహధ్వానము నకు కొండలు రంభాదుల చనుగొండలు నదురునను దానికి సంవాదముగా నున్నది.

46 సీ॥ నెఱపల్కు నెఱపులనేచాల మెప్పించి
యక్బరుచే మెప్పు లందుకొనియెఁ
జని విశ్వనాథ దేవుని చేత మస్తున
వెలయు నేన్నులఁ దెచ్చె వేన వేలు
పూనికి నేదుల ఖాను వీటికి నేఁగి
పలుమఱు మించు కప్పములు గొనియె

మాదన మల్కు బరీదు నిజాం శాహు
దన యేలికకుఁ బన్నుఁ బనుప నడఁచె

తే॥ మఱియుఁ గన్నడ రాజులు మెఱసి పొగడి
నెనరు దళు కొత్తఁ గ్రొత్త కానుకలు వనుప.
మనియె మల్కిభరాము మన్నన గతాత
ఖానరాయఁడు రెండవ కలువ ఱేడు - 46

టీక :- గతాతఖాను, నెఱ పల్కు = తన యొక్క నిరడైన మాటలను, నెఱపులనె = పచరించుటందే, చాల మెప్పించి = మిక్కిలిగా మెప్పించి, అక్బరుచే, మెప్పులందుకొనియె = మన్ననలు పొందెను, చని = వెళ్ళి, విశ్వనాధునిచేత, మస్తున వలయు = మదముతో నొప్పు, వేనవేలు = వేలకు వేలు, ఏన్గుల దెచ్చును పూనికి = పట్టుదల చేత, ఏరులఖాను, వీటికినేగి = పట్టణమునకు వెళ్ళి, పలుమరు = అనేక పర్యాయములు, మించు కప్పములు కొనియె = గొప్పనైన రాజ సుంకమును తీసికొనెను. మాదన మల్కు = మాదన యొక్క, మల్కున్, బరీదు = బరీదు ముల్కు, నిజాం శాహు = నిజాం శాహును, తన యేలకకు = తన యొక్క రాజునకు, పన్నుబనుప = పన్నుకట్టునట్లు, నడచె, వర్తింపజేసెను. మరియు, కన్నడ రాజులు మెఱసి పొగడి = మిక్కిలిగా పొగడి, నెనరు దళుకొత్త = ప్రేమ ప్రకటించునట్లు, క్రొత్త కానుకలు ననుప = నూతనమైన కానుకలు పంపగా, మల్కిభరాము మన్ననన్ = మల్కిబ్రహీము యొక్క మన్ననతో, మనియె = జీవించెను. గతాతఖానుడు, రెండవ కలువ ఱేడు = రెండవ చంద్రుడు.

తా :- గతాత ఖానుడు రెండవ చంద్రుడు అతడు. తన యొక్క నిండైన మాటల చేతనే అక్బరు చక్రవర్తిచే మన్ననలు పొందెను. విశ్వనాధరావుచే మదించిన ఏనుగులను వేనకు వేలు దెచ్చెను. పట్టుదలతో ఏదుల ఖాను పట్టణమునకు వెళ్ళి అనేక పర్యాయము లతనితో కప్పములు గొనెను. మాదన మల్కుబరీదు నిజాం శాహు చేత తమమహారాజునకు కప్పము గట్టునట్లు చేసెను. ఇంకను కన్నడ ప్రభువు పొగడుచు కొత్త కానుకలు పంపగా మల్కిభరాము మన్ననకు పాత్రుడై జీవించెను.

47.సీ॥ తలిదండ్రు లే మాట తన కాన తిచ్చినఁ
దలమోచి నడుచు గతాత ఖానుఁ
డిభరాము పాదుషా యేలెడు పుడమిలో
దగవులరాజు గతాత ఖానుఁ

డలచిన్న పాయంబునందు రాజుల చేతఁ
దగు నిమ్మపండు గతాత ఖానుఁ
డేప్రొద్దుఁ గూరిమి హెచ్చఁ గర్తారునిఁ
దలఁపులో నిలుపు గతాత ఖానుఁ
తే॥ డరబి పారసి గుజరాతి యారె మచ్చ
తెనుఁగు కన్నోజి మొదలుగాఁ దెలిసి వ్రాయ
దారి గన్నట్టివాఁడు గతాత ఖానుఁ
డహహ యతనికి నెవ్వరీ డరసి చూడ - 47

టీక :- గతాత ఖానుడు, తలిదండ్రులేమాట తనకు + ఆనతిచ్చినను = ఆజ్ఞాపించినను, తలమోచినడచును = శిరోధార్యముగా నడచు కొనును ఇభరాము పాదుషా = మల్కిఇబ్రాహీం ప్రభువు, ఏలెడు పుడమిలో పాలించు రాజ్యమున, తగవులరాజా = జగడములు పరిష్కరించువాడ గానుండెను, అనగా తీర్పరి, అలచిన్న పాయంబు నందు = అతడు మొదట అల్లంతగా నున్నపుడే అనగా మిక్కిలి చిన్నవాడే, రాజుల చేత దగు నిమ్మపండు = ప్రభువుల చేతిలోని నిమ్మపండు వలె - అనగా అరచేతి యుసిరిక వలెనుండెను. ఏప్రొద్దు = ఎల్లప్పుడు, కూరిమిహెచ్చు = ప్రేమ హెచ్చుగా, కర్తారుని = అల్లాను తలపులో నిలుపు = మనస్సులో నిలుపును, అరబి, పారసి, గుజరాతి, ఆరె, మచ్చ, తెనుగు కన్నోజి = కనోజీ, మొదలుగా, తెలిసివ్రాయ, దారిగిన్నట్టివాడు = మార్గ మెరిగిన వాడు, ఆహహా ! అతనికి అరసిచూడన్ = పరిశీలించి చూడగా, ఎవ్వరీడు = సాటియెవరు, అనగాలేరనుట.

తా :- గతాత ఖాను ఎల్లపుడు తల్లిదండ్రి మాట శిరోధార్యముగా నడుచును. మల్కిఇబ్రహీము పాలించు రాజ్యమున తగవరిగా నుండెను. అతడు చిన్నప్పటి నుండియే రాజులందరి చేత నిమ్మపండుగా నుండెను. ఎల్లప్పుడు మనసులో కర్తారుని నిలుపుకొనెను. అరబ్బి, పార్సి, గుజరాతి, ఆరె, మచ్చ, తెనుగు, కనోజీ మొదలైన భాషలన్ని వ్రాయనేర్చి యుండెను. కావున విచారించి చూడగా నాకాలపు రాజలోకమున నతని కెవ్వరీడు గాకుండిరి.

1. అరబి = అరబ్బీ దేశపు భాష

2. పారసి = పార్సీ దేశపు భాష

3. గుజరాతి = గుజరాతు దేశపు భాష

4. ఆరె = మరాఠీ భాష

5. మచ్చు = ?

6. కన్నోజీ = కన్యాకుబ్జపు దేశ భాష

48. ఉ॥ లాలసరీగ జాంకుశుఁడు, లావున నాఁగటి జోదునైనఁ గెం
గేలనె గీట డంచి బలుగెల్పుఁ బయిండి నెలంత నేలుకోఁ
జాలిన వాఁడు, సొంపులను జందురుఁ డెంచ గతాత ఖానునిం
బోలినవారు గల్గుదురె పుట్టిన వారల బుట్టు వారలన్

టీక :- లాలసరీగ జాంకుశుడు = మదించిన ఏనుగుల కంకుశమైనవాడు, లావున = బలమున, నాగటి జోదునైన బలరామునినైన – బలరాముడు మిగుల బలశాలియని ప్రసిద్ధి, – కెంగేలనే = చేతులకు కెంపుదనం సుకుమారత్వానికి చిహ్నం కనుక, తన యొక్క సుకుమారమైన చేతుల చేతనే, అనగా నేయాయుధము లేకుండగనే, కీటడంచి = వధించి, బలుగెల్పు పయిండి నెలంతఁ = గొప్పనైన విజయ లక్ష్మిని, ఏలుకో జాలిన వాడు = స్వాధీనము చేసుకోగలవాడు, సొంపులను చందురుడు = అందమున చంద్రుడు, ఎంచఁ = విచారించగా, పుట్టిన వారలఁ = ఇంతవరకు జన్మించిన వారిలోను, పుట్టువారలఁ = పుట్టగల వారలలోను, గతాత ఖానునిం బోలినవారు = ఈ గతాత ఖానుని వంటివారు, గల్గుదురె = ఉండగలరా ! అనగా ఉండరనుట.

తా :- గతాత ఖానుడు లాలసరిగ జాంకుశుడు, బలమున బలరామునినైన యేయాయుధము లేకుండ కేవలము చేతులతోనే వధించి విజయ లక్ష్మిని చేపట్ట గలవాడు. కనుక ఇంతవరకు పుట్టిన వారిలోను పుట్టగల వారిలోను గతాత ఖానుని పోలిన వారుండరు.

విశే :- బలరాముడు శేషుని యవతారము కనుక మిక్కిలి బలముగలవాడు. బలరాముడు బలము గలవాడనుటకు –

ఆ॥ బలము మిగుల గలుగ బలభద్రుడన'' లోక
రమణుఁ డగుట జేసి రాముడనగ
సతికి బుట్టె గర్భ సంకర్షణమున, సం
కర్షణుం డనంగ ఘనుఁడు సుతుఁడు
భాగ – స్క. 10 పూ. 64

బలరాముడు ప్రలంబాసురుని దనపిడికిలి చేతనే తలబ్రద్దలు చేసెను కనుక ఇది యతని బలమునకు చిహ్నము. ఇటువంటి బలరాముని యితడు మరల ఈ చేతి దెబ్బలోనే గెల్చునట - ఇదియు తనిబలము -

49వ॥ అతని తమ్ముఁడు

టీక : అతని తమ్ముడు = గతాత ఖానుని తమ్ముడైన ఫాజలు ఖాను.

- పాజిలు ఖాను ప్రశస్తి -

50మ॥ అనిలో మార్కొను మార్తు లేండ్లఁ గడు నెయ్యం బొప్పగా వేల్పుఁ క్రొ
న్నన బోండ్లం గలయుంగఁజేసి, మరికానల్ గట్టులున్ వాఁకలే
యునుకుల్ గానొనరించె గొందరికి, నోహో మేలు, ఫాజీలు ఖా
నుకున్ సాటిదలంప నెవ్వ రిఁక నెందున్ గ్రందుగా నెన్నినన్ - 50

టీక :- అనిలో మార్కొను = యుద్ధరంగమున తన్నెదిరించు, మార్తురేండ్లన్ = శత్రురాజాలను, కడు నెయ్యంబొప్పన్ = మిక్కిలి స్నేహమున, వేల్పుఁ క్రొన్నన బొండ్లన్ గల యందజేసి = దేవతాస్త్రీలైన రంభాదులను గలియునట్లు చేసి, అనగా స్వర్గమునకు బంపి - మరి = కొందరికి, కానల్ = అడవులు, గట్టులన్ = పర్వతములు, వాకలే = నదులే, అనుకుల్‌గా నొనరించె = నివాసములుగా జేసెను, మేలు, ఎందున్ = ఏదేశమందైనను, క్రందుగా నెన్నినన్ = తరచుగా చూచినప్పటికి, వాజీలు ఖానునకున్, సాటిదలంప నెవ్వరు = సాటిగా చెప్పుట కెవరును ఉండరు.

తా :- ఫాజీలు ఖాను యుద్ధరంగమున తననెదిరించు శత్రువులను మిక్కిలి స్నేహమున రంభాదులను గలియునట్లు చేసెను. మరికొందరికి అడువులు, గుట్టలు, నదులే నివాసములుగా చేసెను కనుక ఏదేశ మందైనను తరచుగా వెదికిచూచినప్పటికీ నతనికి సాటి చెప్పగలిగిన వారు కనిపించకుండిరి.

''అలం - వ్యాజ్యస్తుతి''

నిందచేస్తుతిగాని, స్తుతిచే నిందగాని వ్యక్తమైన యెడల నది వ్యాజ్యస్తుతి యనబడును. స్తుతిచే మరియొక స్తుతి వ్యక్తమైనను నది గూడ వ్యాజ్యస్తుతియే యగును. ఈ పద్యము నమీాను ఖానును ఓహో మేలు అని స్తుతించుటకు కారణ మతడు తన శత్రువులను సంహ రించుట, వారి నడవులు పట్టించుట ఈ విధముగా

నతని స్తుతితో పాటిందు అతని యొక్క పరాక్రమము గూడ పరోక్షముగా నగ్గింప బడెను కాన నిది స్తుతిచే స్తుతి యనవలెను.

51చ॥ కని తనరాజు లెన్నుకొనఁగా బెను పౌఁజులతో సిరంగ రా
యని కడకేఁగి మాటలనె యాయనఁ దేఱిచి తెచ్చి మల్కుకున్
మనుకువ నంటు చేసి యొరిమం గడుమెచ్చులు గొన్నమేటి, నే
మని పొగడంగ వచ్చు నవునౌ నిఁక ఫాజిలు ఖాన రాయనిన్ - 51

టీక :- వాజిలు ఖాను - కని = సమయము చూచి, తనరాజులెన్నుకొనగా = తన సాటివారందరు ఈ పనికి నీవే తగుదువని యెన్నుకోగా, పెను పౌజులతో = పెద్ద సైన్యముతో, సిరంగ రాయను కడకేగి = చంద్రరిగిని పాలించు శ్రీరంగరాయల దగ్గరకు వెళ్లి, మాటలనేయయన దేఱిచి = సౌమ్యమైన వాక్కులతోనే యతనిని సమాధానపరచి అతని మనస్సులోని కలకను దొలగించి - తెచ్చి = వెంటగొని వచ్చి, మల్కుకున్ = మల్కిబ్రాహీముకు, మనుకువన్ = అతని నివాస స్థానమున, అంటుజేసి = వారిని కలిపి, ఒరిమన్ = ఆమైత్రిలో, కడుమెచ్చులు = మిక్కిలిగా బహుమానములు, గొన్నమేటి = పొందిన గొప్పవాడు ఔనౌనిక = ఔను, ఔను, ఇంక - పాజిలు ఖాను రాయనిన్, ఏమని పొగడంగ వచ్చు ఏమని పొగడ వలెను.

తా :- ఫాజిలు ఖాను తనవారందరీపనికి నీవే తగుదువని యెన్నుకోగా సమయము చూచి గొప్పసేనతో శ్రీరంగ రాయుల చెంతకు వెళ్లి అతనిని మంచి మాటలతో మనస్సులోని కలకను పోగొట్టి సమాధాన పరచి తన వెంటగొనివచ్చి మల్కిబ్రాహీమునివాసమున వారిద్దరిని జతగలిపి తన ప్రభువుతో మిక్కిలి బహుమానములు పొందెను. కావున అటువంటి గొప్పవాని నేమని పొగడ వచ్చును.

విశే :- ఫాజిల్ అనగా పండితుడు కనుక నతని పేరీ రాయబారమున సార్ధక మైన దనవచ్చును.

52 సీ॥ తగువేల్పు దొరరాణి మగ మానికవు సొమ్ము
సెగఱేని చాన గొజ్జఁగుల బంతి
జముగేస్తు రాలిమై నమరుక ప్రపుఁ బూఁత
పొలదిండి రాఱేని నెలఁత నగవు
నీటి రాయని కల్కి నిద్దంపు దువ్వల్వ
తెమ్మెర కొమ్మచే తెల్ల దమ్మి

ముక్కంటి చెలి లేమ ముత్తెంపుఁ జేర్చుక్క
నెలతాల్పు పడఁతి పన్నీటి జలక
తే॥ మగుచుఁ జిలువల గమికానిఁ దొగల తేనిఁ
గ్రింద మీఁద నడంచి యేకందు లేక
యలమి ఫాజీలు ఖానుని యసము లెపుడు
నెలమి జగములఁ బండు వెన్నెలలు గాయు - 52

టీక :- ఫాజిలు ఖానుని యశములు = ఫాజిలు ఖానుని స్వచ్ఛమైన కీర్తులు, తగువేల్పు గొరరాణి = దేవతలకు ప్రభువైన ఇంద్రుని యొక్కరాణి యగు శచీదేవికి తగు - మగమానికపు సొమ్ము = తగినట్టి వజ్ర భూషణము - సీ ॥ మగజాలు మూల జాలన వజ్రములగు సాం. 61 - సెగతేని చాన = అగ్నిదేవుని యొక్క భార్యయైన స్వాహాదేవి చేతిలోని, గొజ్జఁ గులబంతి = తెల్లని చేమంతి చెండు, జముగేస్తురాలు = యమధర్మరాజు భార్యయైన శ్యామలాదేవి యొక్క, మైనమరు = శరీరముపై గలుగు, కప్రపు బూత = కర్పూరపు కలపము (ఈమె నల్లనిది కనుక) పొలదిండి రారేని = మాంసాశను లైన రక్కసుల రాజగు నివృత్తి యొక్క, నెలత నగవు = భార్యయగు దీర్ఘాదేవి నవ్వు, నీటిరాయని కల్కి = జలమునకు ప్రభువైన వరుణుని యొక్క భార్య యగు వారుణీదేవి యొక్క, నిద్దంపు దువ్వల్వ = నునుపైన చలువ చీర, తెమ్మెరకొమ్మచే = వాయుదేవుని భార్యయగు అంజనాదేవి యొక్క చేత గల తెల్ల దమ్మి = తెల్లని తామర పూవు, ముక్కంటి చెలిలేమ = శివునికి స్నేహితుడైన కుబేరుని యొక్క భార్యయగు చిత్రరేఖ యొక్క, ముత్తెంపు చేర్చుక్క =ముత్తెములతో చేయబడిన పాపెట బొట్టు, నెలతాల్పు పడతి = చంద్రుని ధరించిన శివునియొక్క భార్య యగు పార్వతీదేవికి, పన్నీటి జలకము = పన్నీరు, అగుచు = అయి, చిలువల గమికాని = సర్పములకు ప్రభువైన ఆదిశేషుని, తొగల తేనిఁ = చంద్రుని, క్రింద మీద నడంచి = అనగా ఆదిశేషుని అడుగునను, చంద్రుని పైనను కప్పివేసి, ఏకందు లేక = ఎటువంటి నలుపు దనము లేక, అలమి = వ్యాపించి, ఫాజిలు ఖానుని యశములు = ఫాజిలు ఖానుని కీర్తులు, ఎపుడుఁ = ఎల్లపుడు, ఎలమిఁ = ఉత్సాహమున, జగములఁ = ప్రపంచమందు, పండు వెన్నెలలుగాయుఁ = సంపూర్ణ మైన వెన్నెలను కాయుచుండును.

తా :- ఫాజిలుఖాను కీర్తి శచీదేవికి వజ్రాభరణమై, స్వాహా దేవికి చేతిలోని చేమంతి బంతియై, శ్యామలా దేవికి కర్పూరపు పూతయై, దీర్ఘాదేవికి దరహాసయై, వారుణీ

దేవికి దువ్వలు వయ్యె, అంజనాదేవికి చేతిలోని తెల్ల తామరయ్యె, చిత్రరేఖా దేవికి ముత్యాల చేర్చుక్కయ్యె పార్వతీ దేవికి పన్నీరై, ఆది శేషుని అడుగునను, చంద్రుని పైనను కప్పి వేసి అన్ని దిక్కులను తానేయ్యె వ్యాపించి ఏకందు లేక ప్రపంచమున పండు వెన్నెలలు గాయు చుండెను.

విశే :- దిక్కులు ఎనిమిది. ఊర్ధ్వాధో భాగములు రెండు కూడ కలుపుకొనిన పది యగును. దిగ్దేవతా నమస్కారములందు ఊర్ధ్వ అధో దిశలను గూడ జేర్చియే చెప్పుకొనుట పరిపాటి కనుక తెలగన్న ఇందు తూర్పు మొదలు కొని ప్రదక్షిణ క్రమముగా తిరిగి పిమ్మట ఊర్ధ్వాధో దిశలు చెప్పినందువలన నతడు దిగ్దేవతా స్తుతి చేసినట్లయినది. అంతేగాక దిక్కులను కాంతలుగా చెప్పుదురు కనుక ఆ సంప్రదాయము ననుసరించి యితడాయా దిక్కులందలి దేవతా స్త్రీలను వారి వారి పతి నామ స్మరణ పూర్వముగా చెప్పి విషయమునకు క్రమౌచిత్యమును కూర్చెను.

ఈ పద్యమున చిలువల గమికాని తొగల జేని క్రింద మీద నడంచి – యను చోట క్రమాలంకారము.

శేషుడు రసాతలమున చంద్రుడాకాశమున నందురు కనుక శేషునికి యడుగు భాగమున చంద్రుని పైభాగమున కప్పుకొని యనగా బ్రహ్మాండమున నిక సందులేకుండ యని భావము కాగా చందురనికి మీద అనగా బింబముపై నలుపు. అటులే ఆదిశేషునకు నడుగు భాగము గూడ నలుపని చంద్రసాదృశ్యమున బట్టి యనవలసి యున్నది. ఫాజిలు ఖానుని ధవళమైన యశము చంద్రుని యొక్క ఆనలుపును మరియు ఆదిశేషుని యొక్క నలుపును గూడ యణచి వేసిన దనగా కనిపించ కుండ చేసిన దని భావము. అనగా నది ఇతర కళంకమును గూడ మాపునంతటి ధవళమైదని తాత్పర్యము.

53.సీ॥ మదిలోఁగి యలనిజా మనమల్క పెట్టిన
పల్లకీ లొకవంక బాగు మీఱ
ఉదిలి యేదుల ఖానుఁ దొసగిఁన పైగొప
గుఱ్ఱముల్ బగినాఁగె గొల్చిరాఁగ
వేడుకతో నేడు మాదెల దొరలు కా
నుకలంపినట్టి యేనుఁగులు బెరఁయు

కన్నడ రాయఁడు మన్నించి యంపిన
ముత్తేల పెట్టెలు హత్తి మెఱయ

తే॥ నచ్చి తెచ్చిన సొమ్ములు మచ్చికలర
నిచ్చి యిభరాము శాహుచే మెచ్చుగనియె,
నట్టి ఫాజీలు ఖాన రాయనికి సాటి
గలరె నేర్పరు లెల్ల జగంబులందు - 53

టీక :- ఫాజీలు ఖాను - మదిలోఁగి = మనస్సుతో లొంగిపోయి, అలనిజామన మల్క = ఆ యొక్క నిజాముల్ముల్క, పెట్టిన = ఉంచినటువంటి పల్లకీలు, ఒకవంక = ఒకవైపు, బాగుమీరఁగ = అందముతో నుండగా ఉదిరి = చలించి ఏదుల ఖాను డొసగిన, ఏదుల ఖాను యిచ్చిన, పై గోవ గుఱ్ఱముల్ = గోవాదేశపు గుఱ్ఱములు, పడివాగె = అలంకారము లతో, కొల్చిరాగా = సేవించుచురాగా ! వేడుకతో = ఇష్టముగా ఏడు మాడెల దొరలు = దూడెము = దుర్గమ ప్రదేశము రూ. దున్యము, ఏడు మాడెముల దొరలు, కానుకలంపినట్టి = కానుకలుగా పంపిన, ఏనుగులు, బెరయ = ప్రకాశించుచుండగా కన్నడ రాయుడు = కర్నాటక ప్రభువు, మన్నించి యంపిన = మన్ననతో పంపిన, ముత్తేల పెట్టెలు = ముత్యముల పెట్టెలు, హత్తి మెఱయ = తగినట్లు ప్రకాశించు చుండగా, నచ్చి = తనకు బాగని పించి, తెచ్చిన సొమ్ములు = కొని వచ్చిన యాభరణములు మచ్చికలర నిచ్చి = చనువు వికసించు చుండగా నిచ్చి, ఇభరాము సాహుచే, మెచ్చుగనియె = మెప్పును పొందెను, అట్టి ఫాజీలు ఖాన, రాయనికి = రాజునకు, సాటియైన నేర్పరులు, ఎల్ల జగంబు లందు = అన్నిదేశములందు, సాటిగలరె = సాటియున్నారా!

తా :- మనస్సుతో లొంగిపోయి నిజాముల్ముల్క పంపిన పల్లకీలు ఒకవైపు, ఏదుల ఖాను పంపిన పడిపాగెగల గోవా గుఱ్ఱములు ఒకవైపు, ఏడు మాడెముల దొరలు కానుకలుగా పంపిన ఏనుగులు ఒకవైపు, కన్నడ రాయడు పంపిన ముత్యముల పెట్టెలు, సభాంగణముముందు ప్రకాశించు చుండగా వీనితో పాటు తానా యాదేశములకు వెళ్లి నపు డక్కడ కొని వచ్చిన తనకు నచ్చిన సొమ్ములు చనువు మీరగా మల్కిబ్రాహీము పాద్షాషా కిచ్చి యతనితో మెప్పులు పొందెను. కనుక ఏదేశమందైనను అపుడు పాజిలు ఖానునకు సాటియైనవారు లేకుండిరి.

''అలం - అనన్వయము''

ప్రకృతమునకు ప్రకృతము చేతనే పోలిక చెప్పిన యెడల యనన్వయ మనబడును. ఒక వస్తువునకు మరల దాని చేతనే పోలిక చెప్పుట కుదురదు. అందుచేతనే దీనిని అనన్వయమని పిలిచిరి.

ఈ పద్యమందు గీతమున ఫాజిలు ఖానునకు రెండవ వాడు సాటిలేడు అని చెప్పబడినది. కాననిది యనన్వయాలంకారము.

ఈ యలంకారమున చెప్పబడిన వస్తువునకు ప్రపంచమున సాటి రెండవది యుండదుగాననది లోకోత్తరమని లేదా సర్వోత్కృష్టమని తేలును.

ఈ పద్యమున ఫాజిలు ఖానుకు సాటికలరె - అనగా లేరని తెలుప బడినది.

54వ: - మఱియు నమీను ఖానుని రెండవ దేవేరి యెట్టిదనిన - 54

టీక :- మఱియు, అమీను ఖానుని, రెండవ దేవేరి = రెండవ రాణి - ఎట్టి దనిన = ఎటువంటి దనగా-

-: సెక్కర బీబీ ప్రశస్తి :-

55.తే॥ కలికి నిజమరి జాణ బంగారు కుండ
వన్నెవాసిగ మెలఁగెడి పిన్న పెద్ద
చుట్టముల పాలి తంగేటి జున్ను నంగఁ
బేర్మిఁ జెలు వొందు సెక్కర బీబి యెపుడు - 55

టీక :- సెక్కరబీబీ, కలికి = యనోజ్ఞమైనది, నిజమరి = సత్యశీలము గలది, జాణ = నేర్పరి తనముగలది, బంగారు కుండ = స్వర్ణఘటము, వన్నెవాసిగ మెలగెడి = గౌరవము మరియు హోదాతో వర్తించెడు, పిన్నపెద్ద = చిన్నవారు పెద్దవారైన, చుట్టముల పాలి = చుట్టములకు, తంగేటి జున్ను = తంగెడు చెట్టునకు పెట్టిన తేనె, అనంగ, ఎపుడుఁ పేర్మి చెలవొందుఁ = గొప్పదనముతో నొప్పు చుండును.

తా :- సెక్కర బీబీ మనోజ్ఞమైన రూపము గలది. సత్యము మరియు జాణ. ఆమె బంగారు కుండ. తమ నగరియందు, గౌరముతో, హోదాతో సంచరించు చున్నవారు పెద్దవారైన చుట్టముల కందరికి తంగేటి జున్ను అనగా ఎపుడును అందుబాటులో నుండునది అని జనులు చెప్పుకొను చుండగా గొప్పదనముతో నొప్పుచుండెను.

విశే :- ఇందు బంగరు కుండ, తంగేటి జున్ను అనునవి భాషీయములు. బంగారమునకు వన్నెవాసి యుండును. కనుక నామె బంగారు కుండ యైనందులకు వన్నెవాసితో మెలగ నేర్చినది. ఇక ''తంగేటి జున్ను'' పెద్దలకే గాదు పిల్లలకు గూడ నందు బాటులో నుండును సెక్కర - చక్కెర - బీబీ కాబట్టి యేమో తెలగన్న యామెను ''తంగెటీ జున్ను'' అని ఒక మెళకువను ప్రదర్శించెనన వలెను. తంగేటి జున్ననగా అందుబాటులో నుండునదని తాత్పర్యము.

సీ॥ కెలకుల నున్న తంగేటి జున్ను గృహమేధి - మను ఆ. 1 అని పెద్దనగారి ఉవాచ.

56\. క॥ ఒఱపరి సెక్కర బీబీ
తెఱవందు నమీనుఖాను దేవర గనియెఁ
నెఱజాణ యబ్దులల్లిని,
మఱియును షేకీభరామ మరునిం బెరియన్ - 56

టీక :- వరపరి = సౌందర్యవతియైన, సెక్కర బీబీ తెరవందు = సెక్కర బీబీ అను నామెయందు, అమీనుఖాను దేవర, నెరజాణ = మిక్కిలి జాణ యగు, అబ్దులల్లని, మఱియును, షేకీభరామమరునిఁ = షేక్ ఇబ్రహీం అను మన్మధుని, అనగా సుందరుని పెరియఁ = ప్రేమతో, కనియఁ = గాంచెను.

తా :- సౌందర్యవతియైన ఆసెక్కర బీబీ యందు అమీనుఖాను నెరజాణ యగు అబ్దులల్లీని, మరుడగు షేకీభరాముని కనెను.

అర్ధ వి:- అబ్దుల్లో - అర - భగవంతునికి ఇష్టమైన వాడు
అబ్దుల్ + అలీ - అతిశ్రేష్టవాచకము
షేకీభరాము = షేక్ ఇబ్రహీం
షేక్ = అర - నాయకుడు ''ఇబ్రాహీం'' అనునది తమ ప్రభువుపేరు. పూర్వము సామంతులు, దండనాధులు కుమారులకు తమ ప్రభువుల పేర్లను పెట్టుకొను సంప్రదాయముండెడిది.

తిక్కనగారి పేరావిధముగా పెట్టబడిన దేనట అది తిరుకాళత్తి విభునకు వికృతి - ఖడ్గతిక్కన కవితిక్కనల తండ్రులు నెల్లూరి ప్రభువైన తిరుకాళత్తి విభుని యాస్థానమందుండి ఆ ప్రభువు పేరే తమ కుమారు లకు పెట్టుకొనిరట.

57 సీ॥ తన రూపు వలయందుఁ దలిరాకుఁ బోడుల
కనుఁదళ్కు బేడి సగములు దగులఁ
దన చాగ మనుయబ్బు మొన వేఁ డువారను
చినుక మేపుడు పుల్లు లెనసి పాదలఁ
దనయడుగుం దమ్ములను రాచ నెట్టెంపుఁ
బలుదిండి రాతుమ్మెదలు మెలంగఁ
దన పరంజీ చిల్వకును మార్తురా జేండ్ల
యుసులు గాడుపు లింపు లొసఁగు చుండ

తే॥ నొనరు నిభరాము పాదుశా హుజరునందు
బొందుగా వ్రాయ నేర్చిన ప్రోడయైన
యబ్దులల్లికి నీడెవ్వ రరసి చూడ
నహహ, గొనముల నతనికి నతఁడె తగును – 57

టిక : తనరూపు వలయదు = తనయొక్క సౌందర్యమను వలలో, తలిరాకు బోడుల = చిగురు టాకుల వంటి కోమలత్వము గలయువతుల యొక్క కను = కన్నులను, తళ్కు బేడి సగములు = మిలమిలలాడు ఆడుచేపలు తగుల౯ = తగులు చుండగా – అనగా తన యొక్క సౌందర్యమును సుందరులైన యువతులు తగిలి చూచుచుండగా – తన = తనయొక్క, చాగమను మబ్బుమొన = త్యాగమనెడు మేఘముల యొక్క సమూహము, వేడువారను = అర్థిజనమను, చినుకు మే పరిపుల్గులు = వర్షబిందువుల నాహారముగా గొను చాతకములు, ఎనసి పాదలన్ = గుమిగూడి ప్రబలు చుండగా సీ – తే– చాతకా – ఖ్యలుద నర్చు). వానకోయిల మబ్బునీరాను పిట్టయనగ – సాం– 82 తన = తన యొక్క, అడుగుందమ్ములను = పాదపద్మములను, రాచనెట్టెంపు = రాజశిరో, వేష్టనము గల, పలు దిండిరా = పలుదిండి రాజాలను, తుమ్మెదలు, మెలగ = వర్తించుచుండగా, అనగా తనపాదముల చుట్టు రాజలాంచనములు తల ధరించిన రాజాలందరు గుమిగూడు చుండగా, తన = తనయొక్క వరంజీ చిల్వకును = కవాలమను సర్పమునకు, మార్తు జేండ్ల = శత్రు రాజుల యొక్క, యుసులు గాడుపులు = ప్రాణానిలయములు, ఇంపులొసగుచుండ = ఇష్టములు చేకూర్చు చుండగ, ఒనరు = ఒప్పునట్టి, ఇభరాము పాదుషా, హుజరునందు = సమక్షమున, పొందుగా =

చక్కగా, వ్రాయనేర్చిన, ప్రోడయైన = సమర్థుడైన, అబ్దులల్లికి, అరసిచూడఁ = వెధకి చూడగా, ఈడెవ్వరు = సాటి యెవరు, అనగా లేరనుట, అహహా = ఆశ్చర్యార్థకము, గౌనములన్ = మేలిగుణములందు, అతనికి, అతడె తగును.

తా : తన యొక్క సౌందర్యమును వలకు సుందరీ మణుల యొక్క చూపులను చేపలు తగులు చుండ తన యొక్క త్యాగమును మేఘమునకు యాచకులను చాతక పక్షులు గుంపులై తనియు చుండ, తన యొక్క అడుగులను తామరకు రాజలాంచనములు ధరించిన రాజులను తుమ్మెదలు మూగుచుండ, తన యొక్క కత్తియను పామునకు శత్రురాజుల యొక్క ప్రాణములను వాయువులు సంతోషము గల్గించు చుండ, ఇభరాము పాదుషా సమక్షమున చక్కగా రాజుగారి పర్మానాలు - వ్రాయనేర్చిన అబ్దులల్లికి ఆనాడు ఎవరును సాటిలేకుండిరి. అతని కతడే సాటిగా నుండెను.

అలం - సీసము యొక్క నాలుగు పెద్దపాములందు రూపకము - అనన్వయం

''ఆరోపాత్తు రూపకమ్'' అని నిరుక్తి - ఉపమేయమునకుపమాన ముతోడియు బేధముగాని, తాద్రూప్యముగాని వర్ణించిన యెడలనది రూపకమగును. ప్రకృతా ప్రకృత్యములక భేదము చెప్పినను అందుగూడ నారోపమే ముఖ్యముగాన దీనికి రూపకమని పేరు. దీనియందిటుల అబేధము తాద్రూప్యమని రెండు బేధములు.

ఈ పద్యమున తన రూపువల - కనుదళ్కు - బేడి సగములు - చాగమను మబ్బు - వేడువారను చిన్కు మేపుడు పుల్గులు - అడుగుందమ్ములు రాచనెట్టింపు బలుదిండి తుమ్మెదలు - పరంజీ చిల్వ - ఉసురుగా డుపులు - అనునవి రూపక సమాసములు - ఈ సమాసము లన్నిటి యందును రూపువల = రూపమనువల - కనుదళ్కు బేడిసలు = కన్నుల తళుకులను బేడిసలు అని యిటుల ఉపమేయముపై నుపమానా రోపమున్నది గాన నిది తాద్రూప్య రూపకమున కుదాహరణము - ఆభేద రూపకము లిందులేవు.

58.క॥ అరబీ పారసి కన్నడ
మురుమీ కన్నోజి తెనుఁగు మొదలగు బాసల్
పరికించి కుతుబుశా తలఁ
పరయుచుఁ బొలుపొందు నబ్దులల్లీ పుడమిఁ - 58

టీక :- అబ్దులల్లీ - అరబి, పారసి, కన్నడము, రుమీ = రోము, కన్నోజి, తెలుగు, మొదలగు బాసల్ = మొదలైన భాషలు, పరికించి = పరీక్షించి, కుతుబుషా, తలబరయుచు = తలబు + అరయుచు = పిలుపును అరసికొనుచు, అబ్దులల్లీ, పుడమిన్ = ప్రపంచమందు పొలుపొదుగ్ = ఒప్పు చుండెను.

తా :- అబ్దులల్లీ అరబ్బి, పార్సి, కన్నడము, రోము, కన్నోజి, తెలుగు మొదలైన భాషలన్ని పరిశీలింప నేర్చి ఎల్లప్పుడు కుతుబ్‌షా పిలుపు నరసి కొనుచు మెలగు చుండెను.

విశే :- తలబు = పిలుపు - అన్య దేశ్యము
కావ్యములందన్య దేశ్యముల వాడవచ్చు ననుటకు అప్పకవి -

కII క్షితి మ్లేచ్ఛ భాష శ్రుతిగ
వ్రాత మగునట్లైన నాధరిత్రిని దానిన్
మతిరోసి విడువ గూడదు
సతతము వ్యవహారహాని సంధిలు కతనన్ - అప్ప - 1-66

కII నీతంబని దేశీయము
జాతీయంబును పచించు సమయమున నిజ
క్ష్మాతుల భాషా కృతులను
ఖ్యాతిగ మ్లేచ్ఛోక్తులాదిగా గూర్తురజా - అప్ప - 1-67

59.ఉII కంటిని వింటినేర్పునను గావక కయ్యము నందు నొంచినన్
వింటిని నేఁగి వెలుపుల వీటను జూపు కటారికత్తి లా
దంటల గుబ్బ చన్నుల దుదన్నెల కొందురు మార్తు రౌర, య
వ్వింటికి నబ్దులల్లి బలువింటికిఁ గీ లది యేమిగల్గెనో ! - 59

టీక :- మార్తురు = శత్రువులు, అబ్దులల్లి వింటిరేర్పు నను గావక = శరనైపుణ్యము చే రక్షింపక, కయ్యమునందు = యుద్ధమందు, ఒంచినన్ = వధించగా, వింటికి నేగి = స్వర్గమునకు వెళ్ళి, చూపుకటారి కత్తిలా = తమ యొక్క చూపులే ఆయుధములుగా గలవారైన, దంటల = ప్రౌఢల యొక్క, గుబ్బచన్నుల తుదన్ = గుండ్రములై యుబికిన చన్నుల యంచులపై, నెలకొందురు = నివసింతురు, ఔర ! ఆశ్చర్యము, కంటిని = ఇది చూచితిని, అవ్వింటికి = ఆ యొక్క

స్వర్గమునకు, అబ్బులల్లి బలు వింటికి = అబ్బులల్లీ యొక్క గొప్పదగు బాణమునకు, కలదిప ఏమి గల్గెనో = ఏ మర్మము గలదో

ఇది కవి వాక్యము.

తా :- అబ్బులల్లి తన శర సంధాన నైపుణ్యమున శత్రువులను రక్షించక వధించిన యెడల వారు స్వర్గమున కేగి యచటగల ప్రోడలైన రంభాద్యప్సరసల యురోజములపై వ్రాలుదురు. ఇది చూచితిని. ఔరా ! ఆవింటికి ఈ అబ్బులల్లీ వింటికి ఏ సంబంధముగలదో -

విశే :- విన్ను = స్వర్గము, విల్లు = బాణము. ఈ రెండింటికి ఔపవిభక్తిక రూపము ''వింటి'' అనునది ఒకటే కనుక ఇచట ''వింటికి'' అను దానిపై శబ్దరూప మాధారముగా చేసికొనిన చమత్కారమును కవి ప్రదర్శించెను.

''అలం - యమకము''

అర్థవిశే : ఈ పద్యమున వింటినేర్పునను గావక - అనుచోట ''వింట'' అనగా వినుట కనుక వింటినేర్పునను అనుటలో శత్రురాజులు చెప్పుకొను నట్టి దానిని వినిపించుకొని - అను నర్థము గూడ ద్యోత మానమగును.

''అలం - అతిశయోక్తి''

వర్ణ్యము యొక్క స్థితిని అతిశయించి చెప్పినను, లేదా ఉపమేయము నధఃకరించి యుపమానమునే యభివర్ణించినను నది యతిశయోక్తి యనబడును. ఈ యలంకారము రూపక - సాపహ్నవ - భేదక - సంబంధ - అసంబంధ అక్రమ - చపల - అత్యంతాతిశయోక్తులని యారు విధములు. వీనియందు పై పద్యమున యవ్వింటికి యబ్బులల్లీ బలువింటికి ఏకీలు అనగానే సంబంధము లేకున్నను సంబంధమున్నట్లు వర్ణింప బడినది గాననిది సంబంధాతి శయోక్తి. ఈ యర్థాలంకారముతో దాటించు బిందు పూర్వకట కారములో అనుప్రాసయను శబ్దా లంకారము గూడ చోటు చేసికొనినది.

షేక్ ఇబ్రహీం ప్రశస్తి

60.కII అతనికి గూరిమి తమ్ముఁడు
సతముగ షేకీభరాము చదురుఁడు పగరం
దతిఁ గూడుకోక లరయని
ప్రతినలు పట్టించి మలల పజ్జల కనిచెన్ - 60

టీక :- అతనికి = ఆ అబ్దులల్లికి, కూరిమి తమ్ముడు = ప్రియమైన సోదరుడు షేకీభరాము, చదురుడు = నేర్పరి, సతముగ = శాశ్వతముగా, పగరందు = పగవారియందు, అతిగ = మిక్కిలిగా, కూడు కోకలరయని = అన్న వస్త్రములు విచారింపని , ప్రతినలు పట్టించి = ప్రతిజ్ఞనలు చేయించి, మలల పజ్జలకు = గట్టుల పంచలకు, అనిచెన్ = పంపెను.

తా :- ఆ అబ్దులల్లీకి తమ్ముడైన షేక్ ఇబ్రహీము, శత్రువులతో శాశ్వతముగా అన్న వస్త్రములు విచారించని ప్రతిజ్ఞతలు చేయించి పర్వతముల పంచలకు పంపెను. అనగా వారిని అన్న వస్త్రములకు దూరము జేసి యడవులు పట్టించెను.

61మII అరయన్ షేకిభరాము రాలెలకుఁ బ్రాపైనట్టి లోఁ గూర్మిచే
సిరియుం బల్కులతమ్మి కంటియుఁ గడుం జేదోడు వాదోడునై
వరుసన్ ద్రిమ్మరు చుందు రన్న, మఱి కైవారంబుఁ గావింపగాఁ
దరమే, యాయన చాగముం జదువులుం దానొక్క ముక్కంటికిన్ - 61

టీక : అరయన్ = విచారించగా, షేకీభరాము రానెలకు = షేక్ ఇబ్రహీమను రాజచంద్రునకు, ప్రాపైనట్టి = రక్షణమైనట్టి, సిరియన్ = లక్ష్మీదేవియు, పల్కుల తమ్మికంటి యును = భాషాదేవియనగా సరస్వతియును, లోఁ గూర్మిచే = తమహృదయములందుండెడి ప్రేమ చేత, కడున్ = మిక్కిలిగా చేదోడు = చేతికి సహాయము ఐ = అయి, వాదోడు = మాటకు సహాయము. ఐ = అయి, వరుసగ = క్రమముగా త్రిమ్మరు చందురున్నగ = తిరుగు చుందురనగా, ఆయన చాగముగ = ఆయన యొక్క త్యాగము చదువులుగ = విద్యలు, మరికైవారంబు గావింపగా = ఇకను తించుటకు, తానొక్క ముక్కటికిగ = ఆ ఒకడైన ఈశ్వరునికి గూడ, తరమే = వీలగునా ! అనగా కాదనుట.

తా :- విచారించి చూడగా ఆషేకీబ్రహీమను రాజచంద్రునకు లక్ష్మి సరస్వతులు తమ

హృదయమున గల ప్రేమచే చేదోడు వాదోడై తిరుగు చుందురనగా నిక నతని త్యాగమును గాని విద్యలను గాని నుతించుటకు ఆ శివుని కైనను వీలుగాదు.

ఇందు లక్ష్మి సరస్వతులు చేదోడు, వాదోడు అనగా లక్ష్మి చేతికి తోడు అనగా త్యాగమునకు సరస్వతి వాక్కునకు తోడు, అనగా విద్యలకు లేదా సంభాషణ కని తాత్పర్యము.

పల్కులోడైతాంధ్ర భాషామహాకావ్య
నైషధగ్రంధసం దర్భమునను -
అని శ్రీనాధుని ప్రయోగము

ఇది క్రమాలంకారము - దీనికి యధాసంఖ్యమని మరియొక పేరు.

ఉద్దిష్ట విషయములనే క్రమమున జెప్పుదుమో యదే క్రమమున దాని విశేషణములుగాని క్రియలుగాని కూర్చుట క్రమాలంకారమన బడును. ఈ పద్యమున సిరియుంబల్కుల తమ్మికంటియు కడుఁ చేదోడు వాదోడునై - అను పాదమున నీయలంకారము చోటు చేసికొనినది.

62.వ:- ఇంక నమీనుఖాను మూఁడవ దేవేరి యెట్టిదనిన - 62

ఇంక అమీనుఖాను, మూడవ దేవేరి = మూడవ భార్య ఎట్టిదనిన

సెమ్మెబీబీ ప్రశస్తి

63క:- వీడదు తన చుట్టంబులఁ,
జూడదు పెఱవారి, మగనిచొప్పెరయక మా
టాడదు, పలువేల్పులఁ గొని
యాడ, దహహ, సెమ్మెబీబి నలవియె పొగడన్! - 63

టీక :- వీడదు తన చుట్టంబుల = తన బంధువులను విడువదు, మగని చొప్పెరయకఁ = భర్తయొక్క మనస్సెరుగక, చూడదు పెఱవారిఁ = పరులను చూడదు, మాటాడదు, పలువేల్పులఁ = అనేకమైన దేవతలను, కొనియాడదు = పొగడదు, అహహా ! సెమ్మె బీబిఁ - అలవియె పొగడఁ = పొగడుటకు సాధ్యమా !

తా :- సెమ్మెబీబి ఎపుడును తన బంధువులను విడువదు. భర్త యొక్క హృదయ మెరుగక పరులను చూడదు. మాటాడదు. అల్లాను తప్ప - అనేకమైన దేవతలను పొగడదు. కనుక ఆమె యొక్క సద్గుణములు పొగడుట తరముగాదు.

విశే :- ఇది ద్విప్రాస కందము. అనగా ప్రాసస్థానమున రెండక్షరములు నిలిచినదని యర్థము.

64.క:- తగునట్టి సెమ్మెబీబీ
మగువయును నమీనుఖాన మగసింగయు సొం
పుగఁ గాంచి రబ్దుల కరీ
ము గొనంబుల ప్రోకఁ జాగముల తొగ ఱేనిన్ - 64

టీక :- తగునట్టి సెమ్మెబీబీ మగువయును = తనకు తగినట్టి సెమ్మె బీబీ మరియు, అమీనుఖాన మగసింగము = అమీనుఖాను అను పురుషసింహము, గొనంబుల ప్రోకఁ = సద్గుణముల యొక్క రాశిని, చాగముల తొగఱేనిఁ = త్యాగములందు చంద్రుడైన వానిని, అబ్దుల కరీమును, సొంపుగ గాంచిరి = గొప్పగా గనిరి.

తా :- ఆ సెమ్మె బీబీ అమీను ఖాను అనుదంపతులు సద్గుణములకు రాశి, త్యాగములకు చంద్రుడు అయినట్టి అబ్దుల్ కరీము అను వానిని కనిరి.

అర్థవిశే :- కరీమ్ - చేయువాడు
అబ్దుల్ కరీమ్ = తన కర్మచేత భగవంతునికి
ప్రియమును చేయువాడు

65సీ॥ మాట నేర్పున రాజు మదిఁ గూర్మి నిండగా
నలరించు నెప్పు డబ్దుల కరీము
వలరేని కైవడిఁ దలిరాకుఁ బోడుల
వలపించు జాణఁ డబ్దుల కరీము
పారసి యరబు లేర్పడ వ్రాయఁ జదువంగ
నలువ తలంప నబ్దుల కరీము
అడుగు వారలకు లే దనుమాట తనమదిఁ
దలఁప డెన్నఁడును నబ్దుల కరీము

తే॥ మించి యిభరాము శాహు మెప్పించి మేలు
తగటు దట్టీ ల్కుళా యీ పొగరు. మిగులు
గుఱ్ఱములు నందలమ్ములు గొడుగుఁ గాంచి
కలిమి పొగడొందెఁ బుడమి నబ్దుల కరీము - 65

టీక : అబ్దుల్ కరీము, మాటనేర్పునన్ = మాటల యొక్క నేర్పునందు, రాజామదిన్ = తండ్రియైన అమీనుఖాను మనస్సును, ఎపుడు, కూర్మినిండగా = ప్రేమనిండగా, అలరించున్ = సంతోషపెట్టెను మన్మధుని వలె, తలి రాకు బోడుల = తొలుకారు యవ్వనముగల యువతులను, వలపించు జాణడు = వలపించు నేర్పుగలవాడు, పారసి, అరబులు = అరబ్బీ భాషలు, ఏర్పడన్ = తగినట్లుగా, వ్రాయ, చదువంగ, వ్రాయుటకు మరియు చదువుటకు నలువ దలంప = తలచి చూడగా బ్రహ్మవంటివాడు, అడుగు వారలకు = యాచకులకు, అట్టడుగు జాతుల వారికి, లేదు + అనుమాట, తనమదిన్ = తన మనస్సున, తలపడెన్నడును = ఎన్నడును తలపెట్టడు, మించి = ఇన్నిటికి మించి, ఇభరాము షాహు మెప్పించి = ఇబ్రహీము పాదుషాను మెప్పించి; మేలు తగటు దట్టీలు = మేలైన బంగారు అంచుగల దట్టీలు, కుళాయీలు = కుల్లాయిలు, పొగరు మిగులు గుఱ్ఱములు = మదము గల గుఱ్ఱములు, అందలమ్ములు పల్లకీలు, గొడుగుల్, కాంచి = అతని వలన పొంది, పుడమిన్ = భూమియందు, కలిమి పొగడొందెను = ఐశ్వర్యమున పేరు చెందెను.

తా :- అబ్దులు కరీము తనయొక్క మాటల నేర్పున మహారాజైన తండ్రి మనస్సు సంతోష పెట్టు చుండెను. మన్మధునివలె యువతులను వలపించు చుండెను. అరబ్బీ, పారసీ, భాషలు నలువవలె చదువగా వ్రాయగా నేర్చియుండెను. అడిగెడు వారికి లేదను మాట తన మనస్సున నెన్నడును తలపకుండెను. ఇన్నిటికి మించి ఇబ్రహీము పాదుషాను మెప్పించి అతనితో మేలైన బంగారు జరియంచులు గల దట్టీలు, కుల్లాయీలు, పొగరు గల గుఱ్ఱాలు, పల్లకీలు మరియు గొడుగును పొంది, యైశ్వర్యమున పేరు జెందెను. ఆనాడు యజ మానులతో గొడుగులుపల్లకీలు పొందుట తమ యొక్క గౌరము నకు చిహ్నముగా నుండెను.

విశే :- 47వ సీసము, మరియు నీ పద్యము ఈ రెండొకే తీరు ఎత్తుగడ కలవి. వీనిలో సీసపాదములందుత్త రార్ధమున నాలుగు పాదము లందొక దళము నిబంధింప బడినది.

66.చ॥ చదువుల ప్రోడ నేరుపరి జాణలు మెచ్చఁ గడంగి దాయలన్
గదిమి యడంచి గెల్పుసిరిఁ గైకొని మించిన మేటి యెప్పుడున్
మదిఁ దనవేలుపు న్నిలిపి మల్కిభరాము శహాను గొల్చుఁ గూ
ర్మి దయిలు వాఱ నబ్దుల కరీమునకున్ సరియెవ్వరిచ్చటన్ - 66

టీక : చదువుల ప్రోడ = చదువులందు దిట్ట, నేరుపరి = నేర్పరి, జాణలు మెచ్చ౯ = నేర్పరులు మెచ్చునట్లుగా, కడంగి = పూని, దాయల౯ గదిమి యడంచి = పగవారిని గదిమి భయపెట్టి యణచి, గెల్పుసిరిఁ గైకొని = విజయలక్ష్మిని చేపట్టి, మించిన మేటి = తన సాటి వారందరిని మించిన గొప్పవాడు, ఎప్పుడు౯, మది౯ = మనస్సునందు, తన వేలుపున్నిలిపి = తన దేవునిని నిల్పుకొని, కూర్మిదయిలు వార౯ = ప్రేమ అతిశయించగా, ఇభరాము షహను గొల్చు౯ = ఇబ్రహీం పాదుషాను సేవించును. అబ్దుల కరీము నకు౯, సరియెవ్వరి చ్చుట౯ = ఇచ్చుట౯ = ఈ దేశమున, అబ్దుల కరీమునకు సరియెవ్వరు ? అనగా లేరని భావము.

తా :- అబ్దుల కరీము చదువులలో దిట్ట, పనులలో నేర్పరి, జాణలందరు పొగడు నట్లుగా ప్రయత్నించి తన శత్రువుల నందరిని గద్దించి యణచి వేసి వారిపై విజయమును పొందిన మేటి. తన సాటివారందరిలో గొప్పవాడు. మనస్సులో ఎల్లప్పుడు తమ దేవుని నమ్ముకొని ప్రేమ ద్వారగా ఇబ్రాహీము పాదూషాను సేవించు చుండెను. కనుక ఈ లోకమున తని కెవ్వరును సాటి లేకుండిరి.

67వ:- మఱియు మెఱయు సిరులకు నెలవై తమ పేరుండైన
హజరతి మోఖిదుంజిఖాదిరి యడుగుం దమ్ములు తలంపులో
నెలకొల్పు గతాత ఖానుండును. ఫాజీలు ఖాన యొడ యుండును,
నబ్దులల్లీ రాయండును. నబ్దులకరీమును, వీరలకు,c గూరిమి
తమ్ముం డైన తసీరుని హజరతి శేఖు బుదురుది ఖాది
రిని మదిం దలంచు శేఖభరాముండును, దనర్చిరి - 67

టీక :- మఱియు మెఱయు సిరులకు నెలవై = ప్రకట మైనట్టి ఐశ్వర్యము లకన్నటికి నిలయమై, తమపేరుండైన = తమగురువైన, హజరతి మోఖీ దుంజిఖాదిరి, యడుగుందమ్ములు= పాదపద్మములు, తలంపులో నెలకొల్పు = మనస్సులో నిలుపుకొను- గతాత ఖానుండును, ఫాజిలుఖాన, యొడయందును = మహారాజును, అబ్దులల్లీ రాయండును = రాజును, అబ్దుల కరీమును, వీరలకు, కూరిమి తమ్ముండైన = ప్రియమైన తమ్ముడైన, తసీరుని హజరతి షేక్ బుదురుది ఖాదిరిని మదిందలంచుచు = మనస్సులో తలచుకొనుచు, శేఖిభ రాముండును, తనర్చిరి = ఒప్పిరి.

తా॥ ఇంకను ఐశ్వర్యములన్నిటికి నిలయమై తమగురువైన హజరతి మోఖిందుంజి ఖాదిరిగారి పాద పద్మములను మనస్సులో నిలుపు కొని గతాతఖాను,

పాజిలుఖాను, అబ్దులల్లీ, అబ్దుల్‌కరీం అనునలుగురును. తమ గురువుగారికి తమ్ముడైన తసీరుని హజరతి షేక్ బుదిరి ఖాదిరి గారిని మనస్సులో తలచుకొనుచు షేఖిభ రాముడును ఉండిరి.

68.ఉ॥ ఇట్టి కొమాళ్ళు రాసిరుల హెచ్చుగ మించిన ప్రోడ, యేలికై
పట్టపు ఱేండ్ల మ్రొక్కుcగని పాటిలు నాయిభరాము శాహుచే
పట్టి యనుంగుగా నడుప, బాయక మూcడు తరాలనుండి క
న్పట్టు నమీను ఖానుcడు రవంబున మించెననంబు కల్మిచేన్ - 68

టీక : ఇట్టికొమాళ్ల = ఇటువంటి కుమారుల యొక్క, రాసిరులన్ = రాజైశ్వర్యములతో, హెచ్చుగ మించిన ప్రోడ = బాగుగా పెరిగినట్టి దిట్ట, ఏలికై = పై వారందరికి ప్రభువై, పట్టపు ఱేండ్ల మొక్కుగని = పట్టాభిషేకములు చేసికొనిన రాజులచే మ్రొక్కులందుచు, పాటిలు = ఒప్పుచుండు, ఆయిభరాము శాహు = ఆ యొక్క ఇబ్రాహీం పాదుషా, చేపట్టి = వారిని స్వీకరించి, అనుంగుగా = మిక్కిలి ప్రియముగా, నడుపన్ = నడుపుచుండగా, పాయకన్ = వారిని విడువకుండ, మూాడు తరాలనుండి, కన్పట్టు = కనిపించు, అమీనుఖానుడు, తపంబున = ఆనతిచేత, నసంబు = కీర్తి, కల్మిచేన్ = ఐశ్వర్యముతో మించెన్ = లెస్సగా ప్రకాశించెను.

తా : ఇటువంటి కుమారుల యొక్క రాజైశ్వర్యములతో మించినట్టి వాడు మరియు ప్రభువై పట్టాభిషిక్తులైన ప్రభువులతో మ్రొక్కులందు వాడైన ఇబ్రహీం పాదుషా చేపట్టి ప్రేమతో నడుపుచుండగా ఆవంశమును విడువకుండ మూాడుతరముల నుండి కనిపించు అమీనుఖాను ఆయొక్క రాజాజ్ఞచే కీర్తిలోను, ధనములోను మిక్కిలిగా ప్రకాశించెను.

అమీనుఖాను వంశ వృక్షము

1. హుమామియా - భార్య జాదూబీబీ
2. అమీనుఖాను - భార్య సరబనబీబీ
3. బాబుమియా - భార్య .....
4. అమీనుఖాను

- భార్యలు
  - బడేబీబీ
    - గతాతఖాను
    - ఫాజిలఖాను
  - సెక్కరబీబీ
    - అబ్దులల్లీ
    - షెక్ ఇబ్రాహీం
  - సెమ్మెబీబీ
    - అబుల్‌కరీం

షష్ఠ్యంతములు

షష్ఠీ విభక్త్యంతముగా కృతిపతి నుద్దేశించి చెప్పబడు పద్యములు

69.క॥ ఈగౌనములఁ గడు మీఱుచుఁ
జాగపు మెఱవడిని వేల్పు జిన్నియును నెలఁ
వేగన్నుల దొరమ్రాఁకుల
చేగం గైకొనని యీగి చెలువపు శిబికిన్ - 69

టీక :- ఈ గౌనముల గడుమీఱుచు = ఈగుణములతో మిక్కిలి ప్రకాశించుచు (పైన పేర్కొనునట్టివి) జాగపుమెరవడిని = త్యాగము యొక్క ప్రకాశముచే, వేల్పు జన్నియను = కామధేనువును, నెలఁ = చంద్రుని, వేగన్నుల దొరమ్రాకుల = ఇంద్రుని యొక్క వృక్షమైన కల్పతరువు యొక్క, చేగఁ = శ్రేష్ఠత్వమును, గైకొనని =అంగీకరించని, ఈగి చెలువపు = దానమందు చెలువుగల, శిబికిఁ = శిబిచక్రవర్తికి-

తా :- ఈ విధమున గుణములు గలిగి తనయొక్క దార ప్రకాశముచే కామధేనువు యొక్క చంద్రుని యొక్క కల్పవృక్షము యొక్క శ్రేష్టత్వము నంగీకరించని దానగుణము గల శిబికి -

విశే :- కామధేనువు, కల్పవృక్షాదులు, అడిగిన దానినే యిచ్చునుగాని ఆత్మార్పణము చేయలేవు. శిబిపావురమునకై ఆత్మార్పణము చేసెను. అందులకే అతడు వాని గొప్పతన మంగీకరించని వాడు.

ప్రస్తుతము చేజెర్లలో గల కపోతాలయము ఆనాడు శిబి పావురమును రక్షించిన స్థలమని చెప్పుదురు.

కామధేనువు- కల్పవృక్షము- చింతామణి- మేఘము, మరియు చంద్రుడు, దధీచి మహర్షి - శిభిచక్రవర్తి, కర్ణుడు అనువారు దానకర్తలకుపమానములగుదురు.

70.క॥ నిగనిగ మను నెలకలు బలు
తెగలను వెలిపులుఁగుఁబదువుఁ దెలి మొగిలుగమిఁ
దొగలఁ వగలం దగులఁ
మిగుల న్నడి నవ్వునసపు మిసుము లగమికిన్ - 70

టీక :- నిగనిగమను నెలకలు = నిగనిగలాడు చంద్రకాంత శిలల యొక్క, పలుతెగలను = వివిధ జాతులను, తెలిపులుగు పదువును = తెల్లని పక్షులగుంపును, అనగా హంసలను, తెలిమొగులుగమిఁ=తెల్లని మేఘములను, అనగా శరత్కాల మేఘములను, తొగలఁ = తెల్ల కల్వలను, వగలఁదగులఁ = చింతలతో మునుగు నట్లుగా, మిక్కిలిగా పరిహసించు, అసపు యశమను, మిసుముల గమికిఁ = కాంతుల సమూహమైన వానికి -

తా :- నిగనిగలాడు పలువిధములైన చంద్రకాంత శిలలను, తెల్లని పక్షులైన హంసలను, శరత్కాల మేఘములను, తెల్లకలువలను, చింతలలో మునుగునట్లు పరిహసించు కీర్తులను కాంతుల సమూహములు గలవానికి- మిసిమి = కాంతి, బహు- మిసుములు.

విశే :- అనగా చంద్రకాంత శిలలకంటె హంసలకంటె, శరత్కాల మేఘముల కంటె అమీనుఖానుని కాంతి ఇంకను శుభ్రమైన దని యర్థము.

''అలం - అతిశయోక్తి''

- మానవుల యొక్క కీర్తిని దిగంతవ్యాప్తముగా మరియు తెల్లనిదిగా చెప్పుట కవి సంప్రదాయము.

71. కII తనవారి మనుప, మార్తురఁ
బనివంపఁ, గొలంబు నిలుప బటిమిని, బుడమిం
దనరఁగ మానిసి తన మూ
నిన కఱి వేల్పునకు, రాచనెల తాల్పునకున్ - 71

టీక :- తనవారిమనుపన్ = తనవారిని రక్షించుటకు, మార్తుర + పనివంపన్ = శత్రువుల యొక్క విధానమును అణచుటకు, కొలంబు నిలుపన్ = తనయొక్క కులము నిలుపుటకు, పసిమిని పుడమిం దనరగన్ = పసిమిని భూమిపై నుంచుటకు, మానిసి తన మూనిన = మనుష్యత్వమందిన, కరివేల్పునకున్ = నల్లనయ్యకు, అనగా విష్ణునకు, రాచనెల తాల్పునకున్ = నెల రాజును ధరించిన వానికి, అనగా శివునకు-

తా:- తనవారిని రక్షించుటకు, శత్రువుల నణచుటకు, కులము నుద్ధరించుటకు భూమిపై కీర్తిని నిలుపుటకు మానవుడై పుట్టిన విష్ణువునకు, శివునకు.

విశే:- కవి ఈ పద్యమున అమీనుఖానుని దేవ భేదమెంచకుండ విష్ణువు మరియు శివుడని చెప్పుట గమనించ దగిన యంశము.

''నా విష్ణుః పృధివీ పతిః'' అను సూక్తి ననుసరించి శివకేశవులలో నెవరిదో యొకరి యంశ లేకుండ పృధివీపతి కాలేదని పురాణవచనము.

72. కII గమకమున నెదురు పగతురఁ
కొమరుం దాయముల వేల్పు కొమ్మలఁ గడుఁజు
ట్టములఁగఁ గూర్చెడు నేరుపు
సమకూరిన రాయపక్షి సాళ్వంబునకున్ - 72

టీక :- గమకమునన్ = ఉత్సాహముతో, నెదురు పగతురన్ = ఎదుర్కొనెడు శత్రువులను, కొమరుంబాయముల = లేత వయస్సుగల, వేల్పు కొమ్మలన్ = దేవతాస్త్రీలతో అనగా రంభాదులను, కడు = మిక్కిలి, చుట్టములుగ గూర్చెడు = చుట్టాలుగా చేసెడు, నేరుపు సమకూడిన = నైపుణ్యము గల్గిన, రాయపక్షి సాళ్వంబునకు, పక్షులలో రాజైన సాళువమునకు -

తా :- ఉత్సాహముతో తననెదుర్కొను శత్రువులను లేత వయసు గల దేవకాంతలతో చుట్టములు చేయగల నేర్పుగలిగిన రాయపక్షి సాళ్వునకు -

విశే :- అనగా తననెదుర్కొనిన శత్రువులను యుద్ధరంగమున వధించెడి వాడని యర్థము. యుద్ధరంగమున మరణించెడి వారికే వీరస్వర్గము అట్టివారికే రంభాదుల సమాగమము.

73.క॥ పలు తలఁపులఁ బొలుపగు తన
తలవాకిట నెపుడుఁ బలుకు తలిరుం బోఁడిం
బొలుపుగఁ గాఁపుర ముంచిన
మెలఁకువ గలనేరుపరి కమీర్ఖానునకున్ - 73

టీక :- పలుతలపులన్ = అనేకములైన తలంపులకు, బొలుపగు = నిలయమగు, తనతలవాకిటన్ = తనయొక్క వదనమున, ఎపుడు, పలుకు తలరుం బోడిన్ =సరస్వతినిక, తలవాకిటను మెలింగెడు - పోలతుక పలుకుల వెలంది - ఆంధ్ర-పొలుపుగన్ = అందముగా, కాపురముంచిన = నిలుపుకొనిన, మెలకువగల = జాగ్రత్త గల, నేరుపరికి = నిపుణునకు, అమీనుఖానునకు,

తా :- అనేకములైన తలంపులకు నిలయమగు భాషాదేవి నెల్లప్పుడు తన నాలుకపై ఎడబాయకుండ నిలుపుకున్న మెలకువగలిగిన నేర్పరియైన అమీనుఖానునకు,

విశే :- మానవులలోని ఊహలకు భావములకన్నిటికి అతనికి గల భాషయే కారణము కనుక అటువంటి వానికి కారణమైనది. సరస్వతి. ఆమెనిలయము తలవాకిలి. ఆమెను అచట నుండి ఎపుడును కదలకుండ నిలుపు కొనుట యదృష్టము. అమీనుఖాను అటువంటి యదృష్టశాలి.

పూర్వము కుంభకర్ణుడు బ్రహ్మను గురించి తపము చేయుచు ''నిర్దయ'' ను వరముగా కోరుకొననెంచెనట. రిపుడు బ్రహ్మ వాని వరము నకు భయపడి సరస్వతి తోవాడు వరము కోరుసమయమున నీవు నాలుకపై నుండి కాస్త తొలగుమని చెప్పెనట. అంత వాడు వరము కోరు సమయమున సరస్వతి నాలుకపై నుండి జరుగుటచే వాడు ''నిర్దయ''యనుటకు బదులు ''నిద్ర నిద్ర'' యని వరము కోరెను కనుక సరస్వతి నాలుకపై స్థిరముగా కాపురముండకున్న నిటువంటి ప్రమాదములు వాటిల్లును.

ఈ అమీను ఖాను అట్టివాడు కాడు. సరస్వతిని చక్కగా తననాలుకపైననే కాపురముంచు కొనిన వాడు.

''అలం - పర్యాయోక్తి''

74.వ॥ సిరిలుం గడు నమరు కొమరులుం గలిగి మనునట్లుగా నా
యొనర్పం బూనిన యబ్బురం బగు నిబ్బలు కబ్బంబునకుం
బ్రావ యగు త్రోవ యెట్టి దనిన, - 74

టీక :- సిరులం గడు నమరు = ఐశ్వర్యములు మిక్కిలిగా కలిగిన, కొమరులుం గలిగి = కుమారులు గలిగి మనునట్లుగా, జీవించునట్లుగా, నా యొనర్పంబూనిన = నాచే చేయుటకు ప్రారంభింపబడిన, అబ్బురంబగు = ఆశ్చర్యకరమగు, నిబ్బలు కబ్బంబునకున్, ఈ మహా కావ్యమునకు, బ్రావయగు = అనుకూలమగు, త్రోవ యెట్టిదనిన = మార్గ మెట్టిదనగా -

తా :- మిక్కిలిగా నైశ్వర్యములు కలిగిన కుమారులచే నమీానుఖాను చిరకాలము జీవించునట్లుగా నేను రచింప బోవు ఈ మహా కావ్యమునకు త్రోవ యెట్టిదనగా-

విశే :- కవులు కృతిభర్తలకు అభ్యుదల పరంపరాభివృద్ధిని కావ్య ముఖమున నాకాంక్షించుట సంప్రదాయము వ్యక్తులందులకే కృతి నందవలయును. కవులు అవితథ వాక్కులు కావున వారిచే కృతి ముఖమున నిలిచిన వ్యక్తులు చిరంజీవులగుచునే యుందురు. అభ్యుదయమునందుచునేయుందురు.

కథాప్రారంభము

75.సీ॥ తగఁ గోటఁ దాచిన మగమానికంబుల
తెలిరంగు లెవుడు వెన్నెలలు గాయ
మేడలపై నాడు మెలఁతలుఁ దెఱగంటి
కొమ్మలు నేప్రొద్దుఁ గూడి తిరుగఁ
జిలువచాను లగడ్త వలినీటిపైఁ దేలి
యొరిమతో ననయంబు నోలలాడ
మేలిమి బంగారు మేలి పచ్చల డాలు
మిసిమి మింటికి నెల్లఁ బసిమి యొసఁగఁ
తే॥ జడల రాసిన కొమ్మల చాలుకతన
మీఁద రారాక యల ప్రొద్దు మెఱుఁగుదేఱు
గవనులనె రాకపోకలుగా మెలంగఁ,
దనరుఁ బుడమిఁ బ్రతిష్ఠాన మనఁగ వీడు - 75

టీక :- ప్రతిష్ఠానమనగర్ = ప్రతిష్ఠానమని పిలువబడుచు, వీడు = ఒకానొక పట్టణము, తగర్ = ఒప్పిదమగునట్లుగా, కోటర్ దాచిన = కోటకు పొదిగిన, మాగమాని కంబుల = వజ్రముల యొక్క -

సీ॥ పొలుచును వజ్రంబు మూల రాలన మగ
రాలనంగను గురుజాల నంగ - అ.బా. 2.78

తెలిరంగులు + ఎపుడు = ధవళకాంతులు సర్వవేళలందు, వెన్నెలలు గాయ = వెన్నెలవంటి కాంతులను వెదజల్లుచుండగా, మేడలపైర్ = ఆపట్టణ మందలి ఎత్తైన సౌధములపై, ఆడు = ఆటలాడుకొను, మెలతులు = స్త్రీలు, తెరగంటి కొమ్ములుర్ = దేవతాస్త్రీలు, తెరగంటి = తెరచి యుండెడు కన్నులుగల, కొమ్ములుర్ = కొమ్మెత, మనోజ్ఞము. కొమ్మ = మనోజ్ఞతగల స్త్రీ, అనగా దేవతాస్త్రీలు, ఏ ప్రొద్దుర్ = ఎల్లవేళలందు, కూడితిరుగ = కలిసి తిరుగుచుండగా, చిలువ చామలు = నాగకాంతలు, చిలువ (చిలుము+వాయి) నోటి యందు విషము గలది అనగాపాము, విషాస్యము. చామ = సం. శ్యామా - శ్యామాయౌవన మధ్యస్థా అని లక్షణము కనుక నిండు జవ్వనమున గలస్త్రీ - చిలువ చామలు = అనగా నాకకాంతలు - నాగకన్యలు. నిత్యయౌవనలు కనుక వారు చామలు అగడ్త = కందక మందలి. వలనీటిపై దేలి = చల్లనినీటిలో పైకి తేలి, బరిమతోర్ = ఆసక్తితో అనయంబున్ = ఎల్లప్పుడు, ఓలలాడ = ఓలఓలయని నీటిలో మునుగుచు తేలుచు క్రీడించుచుండగా, మేలిమి బంగారు = శ్రేష్టమైన సువర్ణము యొక్క (రంగుగల) మేలి - శ్రేష్టమైన, పజ్జల డాలు = పచ్చలు తాపిన ధ్వజము యొక్క, సీ॥ డాలు టెక్కంబు నిడము పడగయన, కేతునామంబులు గేరుచుండు - ఆం..భా 2-221 (పాఠా, మేలిమి బంగారు = శ్రేష్టమైన బంగారు (రంగుగల); మేని పచ్చని డాలు = కాయము యొక్క పచ్చనికాంతి) మిసిమి = క్రొత్తదనము మింటికి నెల్ల = ఆకాశమున కంతటికి, పసిమి యొసగ = పసుపుపచ్చదన మిచ్చు చుండగా (ఈ పాదము రెండవ పాదమునకు మొదటిదైనపుడు ఈ బంగారు కాంతి అచట మేడలలోని స్త్రీల శరీరములకు వర్తించును) చదలర్ = ఆకాశమున, రాసిన = బరసి కొనునట్టి, కొమ్ముల చాలుకతన = కోటకొమ్ముల యొక్క వరుసల కారణముగా; మీదరారాక = ఆకాశమున ఆకోట కొమ్మలపై నుండి దాటి ఈవలికి వచ్చుటకు వీలుగాక, అల = ఆయొక్క ప్రొద్దు మెరుగు దేఱు = సూర్యుని యొక్క కాంతివంతమైన రథము,

తే॥ చాయపెనిమిటి.... తమ్మిచుట్టమ్ము మిను రతనమ్ము ప్రొద్దు -

వేవెలుంగన సూర్యుడౌ - అ-కో. 81, గవనులనె = ఆకోట యొక్క గోపుర ద్వారముల నుండియే, సీ॥ గవకు గవను నాగ గలవు గోపుర సంజ్ఞ - అ.కో భా. 2-21, రాకపోకలుగా మెలంగఁ = తూర్పుపడమరలకు వచ్చుటలు పోవుట చేయు చుండగా, దనరు పుడమి = భూలోకమున నొప్పుచుండును.

తా :- భూలోకమున ప్రతిష్ఠాన మను పురముండెను. దాని కోటకొమ్మ లాకాశము నొరయు చుండెను. సూర్యుని రథమునకు ఆకాశమున ఆకోట కొమ్మలపై నుండి వచ్చుటకు వీలుగాక అతడా కోట యొక్క గోపురములు గల ప్రధాన ద్వారాములనుండియే తూర్పు పడమరలకు రాకపోకలు జేయు చుండెను. ఆకోటకు తాపిన వజ్రాలు యెల్లప్పుడు తెల్లని వెన్నెల కాంతులను చిమ్ముచుండెను. మేలిమి బంగారుతో చేయబడి పచ్చలు తాపిన పతాకము (ఆకోటపై నెగురుచు) ఆకాశమునకు పచ్చని రంగు పూయు చుండెను. ఆకోటలోని మేడలలో నుండు స్త్రీలెల్లపుడు దేవకాంతలతో గూడి తిరుగుచుండిరి. ఆకోట చుట్టుగల యగడ్తలోని చల్లని నీట పాతాళమందలి నాగకాంత లెల్లప్పుడు పైకి తేలివచ్చి ఓలయోల యని ముని తేలుచు జలక్రీడ లాడుచుండిరి.

విశే :- దీనిలో పచ్చలడాలు ఆకాశమునకు పసుపు రంగు కలిగించుచున్నట్లు చెప్పబడినది. పచ్చలనగా సాధారణముగా నాకు పచ్చరంగుగల రత్నములే. వానిలో నెమిలి కుత్తుక రంగు, బింగన్న రంగు, చిలుకరెక్క రంగు, పాలపిట్ట వన్నె, నాచువన్నె, గరిక వన్నె, దిరిసెన పూవు వన్నె, గాజు పచ్చ అని ఎనిమిది భేదము లున్నట్లు రత్న శాస్త్రమున చెప్పబడినది. కనుక నిచట పచ్చలనగా దిరిసెన పూవు రంగు గల రత్నములని యన్వయము.

ప్రతిష్ఠాన పురము యొక్క కోటకొమ్మలు ఆకాశము నొరయు చుండును. ఆ కోటలోని మేడలలో గల స్త్రీలు దేవకాంతలతో కలసి తిరుగు చుందురు. అనగా ఆ కోట మరియు అచటి మేడుల ఆకాశమును తాకుచున్నవని -

అగడ్తలో నాగకాంతలోలలాడుచుందు రనగా నాగకాంతలు పాతాళమున నుందురు. కనుక యగడ్త పాతాళము నంటుచున్నదని యిందలి వస్తుధ్వని.

పాములు సాధారణముగా వేడి నోర్వవు. చిత్త ఋతువులలో వేసవిలో అవి తిరుగుచల్లని నీడపట్టులకు వెళ్లు చుండును. కనుక కవి ఈ పద్యమున నాగకాంతల గడ్డ యందలి చల్లని నీట నాసక్తితో నోల లాడుచుందురని చెప్పుట సర్పజాతియొక్క స్వభావమును తెలుపును.

కోట ఎంత ఎత్తున్నను ఆకాశము నంటదు. అగడ్త ఎంతలో తున్నను పాతాళమును తాకదు కావున కోట ఆకాశమును తాకు చున్నది. అగడ్త పాతాళము నంటుచున్నదని యిందు చెప్పబడుటచే యిది సంబంధాతి శయోక్త్యలంకారము.

ప్రతిష్ఠానము నిపుడు పైఠణ్ అందురు. తెలుగు వారికి పైట వేసికొను నాచార మక్కడి స్త్రీల నుండియె యబ్బినదని భాషా శాస్త్రజ్ఞుల మతము.

''అలం - అతిశయోక్తి''

వస్తువు యొక్క స్వభావము నతిశయించి చెప్పిన ఎడల నది యతిశయోక్తి యగును. సంబంధము లేకున్నను సంబంధము కలిగి నట్లు చెప్పిన సంబంధాతిశయోక్తి యను బేధమగును. ఈ పద్యమున 2, 3, 4 పాదములందు మేడలపైనాడు స్త్రీలకు దేవకాంతలతో కలిసి తిరుగుట లేకున్నను ఉన్నట్లు చిలువ చామల కగడ్త నీటితో సంబంధము లేకున్నను దానిలో నోలలాడు చున్నట్లు, మేడల కాంతి యాకాశమును పచ్చబరచకున్నను పరచుచున్నట్లు, సంబంధము కల్పించి చెప్పబడినది. కనుక నిది 'సంబంధాతి శయోక్తి' - ఎత్తు గీతమున సూర్యుడా కోటకొమ్మలపై నుండి వెళ్ళుచున్నను వెళ్లనట్లు చెప్పబడినదికాన నది యసంబంధాతిశయోక్తి ఇట్లీ పద్యము సంబంధా సంబంధాతి శయోక్తులతో నిండినది.

76 క॥ పొడదగు బంగరు మేడల
గడు వేడుక నాడు పడతు; కల మొగములతో
దడబడుదు నంచు రేలం
గడకడ జనం జందురుండు కందుచు నచటన్ - 76

టీక :- అచటన్ = ఆ పట్టణమున, రేలన్ = రాత్రులందు, చందురుడు = చేందమామ, పొడవగు = ఎత్తయిన, బంగరు మేడలన్ = బంగారు మేడలపై, కడుమేడుకన్ = మిక్కిలి యుల్లాసమున, ఆడు = ఆడుకొను, పడతుకల మొగములలో = పడచుల

యొక్క ముఖముల చేత, తడబడుదునంచున్ = తబ్బిబ్బు పడగలనని - సంశయించి (చంద్రుడు), కందచుర్ = కాంతిహీనమై నల్లబడుచు, కడకడఁ = ప్రక్క ప్రక్కలుగానే, చనుఁ = వెళ్ళుచుండును.

తా ॥ ఆ పట్టణమున రాత్రివేళలో చంద్రుడు నేరుగా నచటి మేడలపై నుండి వెళ్లక వానిపై వెన్నెలలో నాడు కొనుచుండు పడచుల ముఖములలో కలిసి తబ్బిబ్బు పడగలనని తలచి నల్లబడుచు ప్రక్క ప్రక్కలుగనే వెళ్ళు చుండును.

మొదటి పద్యమున సూర్యుడచట కోటకొమ్మలపై నుండి వెళ్లలేక దాని వదనుల నుండి పోవు చున్నాడని తెలుపబడగా నీ పద్యమున చంద్రుడచటి మేడలపై నుండి గాక వాని ప్రక్కల నుండి వెళ్లుచున్నాడని ఈ రెండు పద్యములలో నచటి సూర్యచంద్ర గమనములు తెలుపబడినవి.

విశే :- స్త్రీల ముఖమును చంద్రునితో పోల్చుట పరిపాటి. ఈ పద్యమున ప్రతిష్ఠాన పురమందలి మేడలలో గల పడచుల ముఖములతో చంద్రుడు సరిరాడని ధ్వనింప జేయబడినది.

కందు అనగా నలుపు. మానవులు ''చింతాదహతి మనాష్యాణాం'' అని ఆర్యోక్తి కనుక నేదైన చింతలో చిక్కినపుడు వర్ణవిహీనమై నల్లబడుట సహజము. ఆంధ్ర మహాభారతమున నన్నయగారు మయ సభను జూచి మనస్తాపమునకుములు దుర్యోధనుని క॥ కందుగల పసిడి గాచిన కంది వివర్ణ మైనటుల కారవు కాయం, బొంది కడు వివర్ణ మయ్యెను - అని వర్ణించెను. కనుక కవి యిచట చంద్రుని యందుగల కందును సార్థకముగా నుపయోగించుకొనెను. కవి ఈ పద్యమున నచటి మేడలపై నాడువారిని పడతుకలని యనెను.

పణత యనగా చెక్కిలి కనుక పడతి యనగా మంచి చెక్కిళ్లుగల యాడుది. పడఁతుక, పోల తుఁక, నెలతుఁక - ఇత్యాదులందలి కప్రత్య యమల్పార్థ సూచకము కనుక ఆమేడలపై నాడుకొనువారు ప్రౌఢలుకాక బాలికలని తెలియును.

చంద్రుడచట నా బాలికల మొగముల కే సరిరానపుడు ప్రౌడల మొగములకు సరివచ్చునా! రాలేడు కనుక నచటి ప్రౌడలు చంద్రుని కంటె అతిశయమైన వదన బింబములు గల వారని ధ్వని.

సూర్యచంద్రులు మేరువు యొక్క శిరో భాగమునుండి గాక దాని యొక్క ఉత్తర దక్షిణ పార్శ్వముల నుండి సంచరింతురని పురాణ ప్రసిద్ధి. మేరవు బంగారు కొండ.

ప్రతిష్ఠాన పురమందలి మేడలు గూడ బంగారువే. అంతేగాక నవి స్వర్గమును తాకుచున్నట్లు పై పద్యమున చెప్పబడినది. కనుక నిపుడు చంద్రుడా మేడలలోని పడుచుల మొగములకు సిగ్గుపడి ప్రక్క ప్రక్కలుగా వెళ్ళు చున్నాడనగా నా మేడలు మేరు గౌరవమును పొందుచున్నవి.

77.చ॥ కనదగు తెల్లమానికపు గప్పుల నొప్పెడు చప్పరాలలో
దనపొడ వైన నీడ గని తాళక యేను గటంచు గొమ్ములం
జెనకగ వచ్చి కోటపయి జేసిన ముత్తెపు సింగపుంగమిం
గనుకొని పారు వేల్పు దొరగా రత డౌదల మస్తరింపగన్ - 77

టీక :- వేల్పు దొరగారు = దేవతలకు ప్రభువైన యింద్రుని యొక్క ఏనుగు అనగా నైరావతము; సీ॥ గ॥ ఏనుగు హత్తి గౌరేను గేన్గు, నాగదంతావళ నామ మౌ. ఆం. భా. 2-194.

కనఁదగు = చూడదగినట్టి అనగా నందమైన, తెల్లమానికపు = వజ్రపురాలయొక్క, కప్పులన్ = మేడల యొక్క కప్పులందు, ఒప్పెడు, చప్పరాలలోన్ = చపారములలో, తన = తన యొక్క పొడవైన నీడన్ + కని = ఎత్తైన అనగా తనంతగా కనిపించు ప్రతిబింబమును చూచి, తాళక = సహింపనోపక ఏనుగటంచు = అది మరియొక యేనుగని తలచి, కొమ్ములన్ = దంతములతో, చెనకగ వచ్చి = ఎదిరించుటకై వచ్చి, కోటపై, చేసిన, ముత్తెపు సింగపుంగమిఁ = ముత్యముల యొక్క సింహములను, కనుగొని = చూచి, (అతడు = అనగా నింద్రుడు, జౌదలన్ = శిరస్సు యొక్క మధ్య భాగమును మస్తరింపగఁ = చేతిలో తట్టుచుండగా) పరుగెత్తు చుండును.

తా :- దేవతా ప్రభువైన ఇంద్రుని యొక్క ఐరావత మతడాకాశమున వెళ్ళు నపుడు ప్రతిష్ఠాన పురమందు చూడ దగినట్టి పెద్ద పెద్ద మేడల యొక్క వజ్రపు కప్పుల నుండి ఓరగా వేయబడిన చపారములలో తన యొక్క నీడ కనిపించగా నది మరియొక యేనుగని తలచి ఇంద్రుడటు పోవలదని నడినెత్తిపై చేతితో చరచు చున్నను కొమ్ములతో దానిని

డీకొనుటకై వచ్చి యా మేడలపై ముత్తెములతో జేసి యలంకారమున కమర్చిన సింగములను జూచి నిజమైనవిగా దలచి భయపడి పరుగెత్తు చుండును.

విశే :- ఈపద్యమున ఐరావతము గౌరు అని పేర్కొనబడినది. గౌరవమనగా తెల్లని రంగు, ఐరావతము తెల్లనిది. పూర్వము తెల్లని ఏనుగులు గూడ నుండెడివట. కనుక ఐరావతమును కవి యందు ''గౌరు'' అని చెప్పుట సార్థకమైన విశేషణము.

ముత్యములు తెల్లనివి. కవి సమయములందు సింహములు గూడ తెల్లనివే. ముత్యములు కొంత కావిరంగు గలిగి సింహముయొక్క రంగుతో పోలుచుండుట గూడ ప్రకృతి సహజము. కనుక ఈ మర్యాద నెరిగియే కవి ప్రతిష్ఠానపుర సౌధములపై ముత్తెపు సింగములను నిలిపెను.

''ఇందలి యలంకారము భ్రాంతిమత్తు''

ఈ పద్యమున నైరావతము తన ప్రతిబింబమును గని పోట్లాటకు సిద్ధపడుట జంతు స్వభావమును సూచించుటచే గాక ఆమేడల చదారములకు తాపిన వజ్రపు పలక లద్దములంత స్నిగ్ధముగా నున్నవని తెలియును.

ఈనాడు పెద్ద పెద్ద హోటళ్లలో నిలుపు టద్దములను చూచినపుడు లోపలకి ప్రవేశించు మనుజులే తమకెదురుగా మరెవరో వచ్చుచున్నారని యొకొక్కపుడు భ్రమపడుట కద్దు. కనుక తన ప్రతిబింబము స్పష్టముగా కనిపించు నపుడు జంతువులు పొరపడి వానిపై కయ్యమునకు కాలు దువ్వుటలో వింతలేదు. అద్దముముందు కూర్చున్న పిచ్చుక నిందుల కుదాహరణముగా చూడ వచ్చును.

ఈ ప్రతిబింబ భ్రాంతిని చంద్రికాపరిణయ కర్త సురభి మాధవ రాయలు బాలవినాయకునిపై నారోపించి -

శ్రీగౌరీ కుచ హైమ కుంభకలిత క్షీరంబులంగ్రోలిత
ద్భాగాసక్తిని జాననంబపుడు తాభావించి ప్రత్యాపత
న్నాగ భ్రాంతిని దూటగా జనని తానత్యాను రక్తిన్నగ
రాగానందము జెందు నగ్గణ పతిన్ ప్రార్థింతు వాక్సిద్ధికిన్

అని అద్భుతమైన కల్పన జేసెను.

78.మ॥ తళుకుల్ గుల్కెడు నందు మేడల తుదం దార్కొన్న బంగారు కుం
డలు మిన్నేటను గానిపించుచును విన్నాణంపు దెల్విం గడుఀ
విలసిల్లం గని పైడి తమ్ము లనుచున్ వేల్పుంబు బోండ్లచే
తుల దేవరంజన జూచి నవ్వుదురు రంతుల్గాగ జేజే దొరల్ - 78

టీక :- అందు = ఆప్రతిష్ఠాపురమందు, మేడలతుదఀ = సౌధముల చివరలందు, దార్కొన్న = కలిగిన, ఉన్న; తళుకుల్ గుల్కెడు = కాంతులు చిమ్మెడు, బంగారు కుండలు = సువర్ణకలశములు, మిన్నేటను = ఆకాశ గంగయందు, కానిపించుచును = కనబడుచు, విన్నాణంపు + తెల్విన్ = పరిశీలన కందునంతటి ఎరుకలో, కడున్ విలసిల్లన్ = మిక్కిలి ప్రకాశింపగా, కని = వానిని చూచి, వేల్పువు పుంబోండ్లు = దేవతా స్త్రీలు, పైడి తమ్ములనుచున్ = అవి బంగారు తామరలని, చేతులన్ = చేతులతో, తేరంజన = తెచ్చుటకు వెళ్లగా, జేజే దొరల్ సూచి = దేవతా ప్రభువులు చూచి - వారి మౌర్ద్యమునకు - రంతుల్గాగ = పెద్దగా ధ్వని కలుగునట్లుగా, నవ్వుదురు = నవ్వుచుందురు.

తా : ఆప్రతిష్ఠాన పురమందలి మేడల యొక్క శిఖరముల పైనున్న బంగారు కలశము లాకాశగంగ నీటిలో కనిపించి స్పష్టముగా బంగారు తామరల వలె కనిపించు చుండగా నచటి దేవతాస్త్రీలవి నిజముగా బంగారు తామర లేనని తలచి వానిని చేతులతో కోసికొని వచ్చుటకు నీటి లోనికి వెళ్లగా నదిచూచి యచటి దేవతా నాయకులు గొప్పగా నవ్వుచుందురు.

విశే : ఈ పద్యమున స్వర్గమందలి దేవతాస్త్రీలకు ఆకాశగంగలో ప్రతి బింబించిన ప్రతిష్ఠానపుర సౌధ స్వర్ణకలశములు బంగారు తామరల వలె కనిపించినవని చెప్పబడినది.

ఇందది చూచిన వారు దేవతాస్త్రీలు. వారు మానవులవలె జడ మతులుగాని భ్రంశమనస్కులు గాని కారు. కనుక వారి కవి అచ్చమైన తామరల వలె కనిపించుటకు వాని నిర్మించిన త్వష్ట బ్రహ్మల యొక్క శిల్పనైపుణ్యము కారణము. ఇక రెండవది ఆకాశగంగ యొక్క నిర్మలత్వము. ఆ నీరు నిర్మలమైన స్ఫటిక తుల్యముగా లేకున్న ఈ కలశము వెంత ప్రకృతి సహజముగా నున్నను వారిని భ్రాంతి పరచ జాలవు. కనుక కవి పై పద్యమున తనయొక్క ఈ పరిశీలనా విజ్ఞానము నంతటిని ''విన్నాణపు తెల్విఀ కడుఀ విలసిల్లన్.'' అను వాక్యమున పాదిగెను.

కలశములను చూచి పూవులని భ్రమసిరి కనుక వారిని పూవు బోండ్లను జేయుట ఇందు కవియొక్క చమత్కారము. ఇది మరియొక భ్రాంతి మదలంకారము.

ఇందు భ్రాంతి జెందిన దేవతాస్త్రీలను జూచి పురుషులు గొప్పగా నవ్వినట్లు చెప్పబడినది.

నవ్వులు - స్మితము, హసితము, విహాసితము, అవహసితము, అపహసితము, అతి హసితము లని యారు విధములు.

1. కొలదిగా చెక్కిళ్లు వికసింపజేసి దంతములు గనరా కుండ మధురముగా నవ్వినది. స్మితము.

2. కన్నులు చెక్కిళ్లు లెస్సగా వికసింపజేసి దంతములు కనిపించునట్లు నవ్వినది హసితము.

3. కంఠగతముగానే మధుర స్వరము జేయుచు ముఖరాగము గన్పడ నవ్వినది విహాసితము.

4. భుజములు శిరస్సు కదులునట్లు నవ్వినది అవహసితము.

5. కన్నీరు వెడలునట్లు భుజములు వెంట్రుకలు అదిరి పోవునట్లు నవ్వినది అపహసితము.

6. కన్నుల నీరుగారగా డొక్కలదరు నట్లు నవ్వినది అతిహసితము.

వీనిలో ఈ దేవతల నవ్వు నాలుగవ తరగతికి చెందినది. ఎదుటి వారు భ్రాంతి పడినపుడుగాని, జారిపడినపుడుగాని చూచిన వారు నవ్వుల లోక సహజము - చూ. అము. అ. 1-65.

తిక్కన గారు తెనుగు భారతమున ముప్పది రెండు విధముల నవ్వులు తెలిపిరట. నవయుగ కవిచక్రవర్తి జాషువా నవ్వులను గురించి-

నవ్వు జంతువుల్ నరుడు, నవ్వును నవ్వులు చిత్తవృత్తికిన్
దివ్వెలు, కొన్ని నవ్వులెటు తేలవు కొన్ని విషప్రయుక్తముల్
పువ్వులవోలె ప్రేమరసముల్ వెలిగ్రక్కు విశుద్ధమైనలే
నవ్వులు సర్వదుఃఖదమనంబులు వ్యాధులకున్ మహౌషదుల్

అని విరించెను.

''అలం - భ్రాంతిమత్తు''

దీనిని భ్రాంత్యలంకారమని గూడ నందురు. మిథ్యా జ్ఞానమునకు భ్రాంతియనిపేరు. దాని వలన నుపమేయమును పమానముగా భావింప బడును.

79.చ॥ దళముగ నందు గోటల తుదం దవిలించిన మించుపైడి వ్రా
తలకటి టెక్కముల్ గనియెద న్మె ఱుగుల్గల మబ్బులంచు అం
పిలి తగ నాడ నన్నె మలిపిండు గనుంగొని చిన్కు గూటియ
ప్పులుగులు సంతసిల్లు గడుపు ల్గడు నిండుగ నాను గోర్కులన్ - 79

టీక :- అందు = ఆ పట్టణమునందు, దళముగా = దట్టముగా, కోటల తుదన్ = కోటయొక్క చివరలందు, తవిలించిన-తగిలించిన, మించు = అతిశయమైన, మెరుపుతీగల వంటి, పైడివ్రాతల = బంగారుగీతలు గల, కరిటెక్కముల్ గని = నల్లని జండాలను చూచి ఎదన్ = మనసులో నవి, మెరుల్గల మబ్బు లంచు = మెరుపు తీగలతో గూడిన మేఘములని, అంపిలి = అంతట గుంపులు గూడి, తగన్ + ఆడన్ = చక్కగా నాట్యము చేయుచుండగా, అన్నెమిలి పిండు = ఆ + నెమిళ్లగుంపు - త్రికసంధి - ఆనెమిళ్ల గుంపును, కనుంగొని = చూచి, ఆ = ఆ యొక్క చిన్కు + కూటి పులుగులు = వర్షజల బిందువులే ఆహారముగా గల చాతకములు, కడుపుల్ + కడునిండగన్ = కడుపులు చక్కగా నిండు నట్లుగా, అనుకోర్కులన్ = నీరుత్రాగవచ్చునను కోరికలతో సింతసిల్లున్ = సంతోషించును.

తా :- ఆపట్టణమున దట్టముగా కోటకోనలకు తగిలించిన బంగారు రేఖలు గల నల్లని జండాలను జూచి నెమిళ్లు అవి మెరుపు తీగలతో గూడిన మేఘములని భ్రమసి అంతటా గుంపులు గుంపులుగా గూడి నాట్యము చేయుచుండగా వానిని చూచి చాతక పక్షులు ఇక వర్షము పడును. కడుపునిండ వర్షజల బిందువులను త్రాగవచ్చునని సంతోషించు చుండును.

నెమిళ్లాడిన వానవచ్చునను సంప్రదాయ మిందు తెల్పబడినది.

''అలం - భ్రాంతిమత్తు''

80. క॥ అగడితలో గెందామర
మొగడలు కనుపట్టై జాల మ్రూకై చడం
దగి మున్నీటం దేలుచు
బెగడని వార్వంపుటగ్గి పిల్లులు వోలెన్ - 80

టీక :- ఆ గడితలో = ఆ కందకమున, కెందామర = కెంపు + తామర, ప్రాతాది సంధి. ఎఱ్ఱ తామర యొక్క, మొగడలు =మొగ్గలు చాల మ్రూకై = మిక్కిలి గుంపులు గుంపులై, చూడందగి = చూచుటకు తగినవై, మున్నీటం దేలుచు = సముద్రమున దేలుచు, బెగడని = భయ పడని, వార్వంపు టగ్గి పిల్లల దోలెన్ = బడ బాగ్ని కూనలవలె, గనుపట్టెన్ = కనిపించుచుండెను.

తా :- ఆ పట్టణమున కోటచుట్టుగల యగడ్తలో కనిపించు యెఱ్ఱతామర మొగ్గలు నీటికే మాత్రము భయపడక సముద్రమున పైకి తేలి వచ్చిన బడబాగ్ని శిఖలవలె గనిపించు చుండెను.

విశే :- శివుడు మన్మథుని దహించిన పిమ్మట అతని నేత్రము నుండి పుట్టిన యగ్నిని బ్రహ్మ సముద్రమున విడువగా నది బడలు అనగా నాడు గుఱ్ఱము రూపమును ధరించి యానీటిలో నిలిచెనని పురాణము.

అగ్ని నీటి నుండి పుట్టును కనుక నగ్నికి ''నీటి పాపడని'' పేరు. దివిసీమ యందు సముద్రపు ఉప్పెన వచ్చినపుడు నీటిపై పెద్ద మంటలు కనిపించెనట. కనుక సముద్ర జలమున నగ్నికలదు. దానికి బడబాగ్ని యని పేరు. అది ప్రళయ కాలమున ఈ జగత్తును భస్మము సేయునని పురాణము.

''అలం - ఉపమ''

81.సీ॥ మెరసి పోవక నిల్చి మెలతలై యొఱపు చే
దిలకించు క్రొమ్మించు తీవెలనగ
గప్పారు తొంగలి ఱెప్ప లల్లార్చుక
న్గవల నొప్పెడు వేల్పుటువిద లనగ
గడు సోయగంబుచే బుడమిపై నడయాట
బొలుచు మేలిమి పైడిబొమ్మ లనగ
సింగార మమరంగ జికిలి చేయించిన
వల రాచవాని పూలములుకు లనగ

తే॥ నలువతా జేయగలిగిన పొలుపు గూర్చి
కరము జేతుల బట్టిన గందునంచు
దలచె గొమ్మలుగానన నలరు నట్టి
పువ్వుబోండ్లు తనర్తు రాప్రోలిలోన - 81

టీక : ఆప్రోలిలోన = ఆ పట్టణమందు, నలువ (నలు + వాయి) = నాలగు మోములు గలవాడైన బ్రహ్మ. తా (జేయ తగిన) పొలుపుగూర్చి = తీరును గురించి, ఆ ... చెలువు తీరు సొరు పొలుపు చెన్ను చక్క దనమునంగ సౌందర్యమొప్పు - ఆం. భా.3.41 కరమున్ = మిక్కిలిగా అనగా పదే పదే యనుట. కందునంచున్ = నల్లబడుదురని, తలచెకొమ్మలు గానన్ = తానుసృజించబోవు వారిని స్త్రీలుగా మనస్సులోనే తలచి సృజించెనని, అలరునట్టి = ఒప్పుచున్నట్టి, పువ్వుబోండ్లు = పూలవంటి సుకుమారమైన మేనుగల స్త్రీలు, మెరసి = ఆకాశమున తళుక్కుమని కనిపించి, పోవకనిల్చి = ఆ పిమ్మట ఆమెరుపు తీగలంతరానము గాకుండ నిలిచి, మెలతలై = మెలయు = వర్తించు మెలత = చక్కగా వర్తింప నేర్చిన వనితలై, ఒరపుచే = తమ యొక్క దేహకాంతి చేత, క్రొమ్మించు = (కొత్త + మించు) కొత్త శబ్దంబున కాద్యక్షరశేషంబును కొన్ని యెడల మీద హల్లునకు ద్విత్వంబునగు బాల - సం. 38 నూతనమైనటు వటువంటి, మెరుపు తవెలనగ = విద్యుల్లత లేమె అనిపించునట్లుగా,

సూ. ఆపదాద్యంబయి యసంయుక్తం బైన గకారంబునకు వకారంబు విభాషనగు బాల - ఆచ్చి 27 - కప్పారు = (కప్పు + ఆరు) నల్లనై తొంగలి ఱెప్పలు = వ్రాలినట్టి కనురెప్పలు - (కనురెప్పలపైన క్రింద మీద మడతలందు నల్లదనముండును (అందువలన నాటకములలో మేకప్పునం దక్కడ స్పెషలు కోటింగు వేయుచుందురు). అల్లార్చు = ఆర్చు + ఆర్చు అల్లార్చు ఆమ్రే. వేగముగా కదిలించు. ఈకనురెప్పలల్లార్చుట యనునది బ్రహ్మ దేవుడు మానవజాతికి మాత్రమే ఏర్పరచిన ఒక శృంగార లక్షణము. ఇది శృంగార చేష్టలలో విలాసమని చెప్పబడును. దేవతలకు నిలువు కన్నులేకాని మానవులవలె రెప్పలు కదులు కన్నులుగావు. హిమా లయమున గంధర్వ కాంతయైన వరూధినికి ప్రవరుని చూడగనే మనస్సులో మనుష్యుని భావించెను. కనుక మనుషత్వ మామెదేహమున చూపట్టెనని పెద్దనగారు - అని మేషత్వము మాన్పె బిత్తరపు చూప స్వేదతా వృత్తి - (మను - 2-33) అను పద్యమున వర్ణించెను. కన్గవలన్ + ఒప్పెడు = కన్నుల

జంటతో నొప్పు, వేల్పుటువిదలనగ =వేల్పు+ ఉవిదచ వేల్పుటువిద, టుగాగమసంధి, వేల్పుటు విదలు + అనఁగ = దేవతాస్త్రీలేమో అనిపించునట్లుగా, ఉవిద = యువతి అనే దాని యొక్క వికృతి దేవతాస్త్రీలలో యువతులేకాని బాలికలుగాని లోలలుగాని నుండరు. కడుపోయుగంబుచే = అధికమైన సౌందర్యముచే, పుడమిపై = భూమిపై, నడయాటన్ = నర్తించుటవంటి నడగకతో అనగా యొయ్యారమైన నడకతో, పొలుచు = ఒప్పునట్టి, మేలిమిపైడి బొమ్మలనగ = శ్రేష్ఠమైన బంగారు బొమ్మలేమో అనిపించునట్లుగా – ఈ బంగారు బొమ్మలు భోజరాజు సింహాసనమున మెట్లపై అమరి యున్నట్లు సింహాసన ద్వాత్రింశిక లేదా బంగారము నేలలోని గనులలో నుండునది. కనుకనది భూమిపై తన యందమును ప్రదర్శించుటకే మానవకాంతల రూపమును పొందివచ్చెనని గూడ నిచట చెప్పవచ్చును – సింగారమ మరంగ = శృంగార మొప్పునట్లుగా, చికిలి సేయించిన = చెక్కడపుపని చేయించిన, చికిలిసేయు అనుటకు నిఘంటువ మెరుగు పెట్టు, వాడిసేయు అను నర్థములిచ్చినది కాని వానికంటె నిక్కడ చెక్కడపు పని చేయించిన అనునదే మనోజ్ఞమైన యర్థము, వలరాచనివాని = మన్మథుని యొక్క, పూములు కల నఁగ = పుష్ప బాణము లేమో యని పించునట్లుగా, ఇక్కడ ఈ ములుకులకు శృంగార మమరవలె కనుక వాని కపుడు సానపెట్టుట కంటె చెక్కడపుపని సేయుట యుచితము.

తా ॥ ఆ పట్టణమున గల స్త్రీలు ఆకాశమున తళుక్కుమని మెరిసి మరల అంతర్ధానము గాకుండ తమయొక్క కాంతితో భూలోకమున మెలగ నేర్చిన స్త్రీలై నిలిచిన విద్యుల్లతలేమో, కప్పుదనముతో గూడి కనులపై వ్రాలిన ఱెప్పలల్లార్ప నేర్చిన దేవతా స్త్రీలేమో, మిక్కిలి యైన యందముతో భూలోకమున నడయాడుచు నొప్పెడి బంగారు బొమ్మలేము. శృంగారమొలుకునట్లుగా చికిలీపని సేయించిన మన్మథుని బాణములేమో అని పించునట్లుగా నొప్పుచుందురు. వారిని బ్రహ్మదేవుడు పదే పదే చేతులతో తాకుతు చేసిన యెడల కంది పోదురేమో యని తలచి వారెంత సుందరముగా నుండవలెనో దాని నంతటిని మనస్సులోనే యూహించి వారిని ఆ యొక్క అంతః కరణము చేతనే పుట్టించినట్లుందురు. అనగా స్త్రీ రూపము ధరించిన మనసి జమూర్తులు. వారు పూబోణులు కనుక చేతులతోనంటిన కందు దురని ఇందు కవి చమత్కారము.

''అలం – ఉత్ప్రేక్ష''

ఉత్ప్రేక్షయనగా నూహ, గుణక్రియాది ధర్మములను బట్టి ప్రకృతము నుపమానముగా నూహించుట, లేదా తర్కించుట యుత్ప్రేక్ష యనబడును. అలంకార వర్గమున నిది మిక్కిలి పెద్దది. మరియు కష్టతరమైనది. ప్రతాపరుద్ర యశోభూషణమున నిది 96 తీరులని చెప్పబడినది. చంద్రాలోకమున మొదట దీనిని వస్తు - హేతు - ఫలోత్ప్రేక్షలని మూడు ప్రధాన భాగములుగా చెప్పి ఒక్కొక్క దాని యందు రెండేసి యవాంతరముల చొప్పున నతడారు భేదములు ప్రదర్శించెను. వీనియందు వస్తూత్ప్రేక్షకు స్వరూపోత్ప్రేక్ష యని వ్యవహారము.

తే॥ తలతు - ననుకొందు - శంకింతు - తద్యము - ధ్రువ
మనగ - నాగ - గానోపు - నాజను ననదగు
పోలె - నొక్క - కావచ్చు - కాబోలు - నేమొ
కో - యకోవంటి దుత్ప్రేక్ష నొప్పుగుర్తు

తెలుగు కావ్యాదర్శము - పరి - 2-213

అని యుత్ప్రేక్షా వాచకములు చెప్పబడినవి. ఈ పద్యమున నచటి స్త్రీల యొక్క రూపములు వర్ణించ బడినవి. కనుక నిది స్వరూపపోత్ప్రేక్ష యగును.

82. ఉ॥ ఇంచుక కేలవాగె గుదియించిన సంద్రము దాటుచంజుమా
యించిన నేలగ్రక్కదల నిట్టటుగా పడి ద్రొక్కుచుఁ దువా
ళించిన గట్టు గుట్టనక లెక్కకు మిక్కిలి దవ్వువాఱుచున్
మించిన వారువంబు లట మీఱుచు ద్రిమ్మరు నెన్ని యేనియున్ - 82

టీక :- అటన్ = ఆ పట్టణమున, మించిన వారువంబులు = శ్రేష్ఠమైన గుఱ్ఱములు, ఇంచుకఁ = ఏమాత్రమైనను, కేలన్ = చేతితో, వాగెన్ = కళ్లెమును, కుదియించిన, బిగపట్టిన = వెనుకకు లాగిపట్టిన, సంద్రము దాటుచున్ = సముద్రమును లంఘించుచు, జూమా యించిన = ఈడ్చి పట్టిన, నేలన్ = భూమిని, క్రక్కదల = కదలు + కదలు = గ్రక్కదలు - ఆమ్రే మిక్కిలి కదలునట్లుగా, నిట్టట్టుగాన్ = ఇటు అటుగను, వడిఁ త్రొక్కుచున్ = వేగముగా కాళ్లతో మట్టుచు, దువాళించినఁ = పరుగెత్తించిన, గుట్టు గుట్ట + అనక, లెక్కకు మిక్కిలి = లెక్కించరానంతగా దవ్వు = దూరము, దాటుచుఁ = పరుగెత్తుచుఁ, మీరుచు = అన్ని జంతువులను అతిశయించుచు, ఎన్నియేనియుఁ = లెక్కింపరానన్నివై, త్రిమ్మరుఁ = తిరుగు చుండును.

తా :- ఆ పట్టణమున శ్రేష్టమైన అశ్వరాజములు చేతితో నేమాత్రమయు కళ్లెము కుదించి లాగిన సముద్రములైన లంఘించునంతటివి కళ్లెమును లాగిపట్టిన నేలనంతటిని అదరునట్లుగా త్రొక్కునంతటివి, పరుగెత్తించిన గుట్ట గట్టుననక నెంతదూరమైన పరుగెత్తగలవి యై చతుష్పాత్తు లన్నిటిని మించినవై లెక్కించరానట్టివై తిరుగు చుండును.

విశే :- ఇంద్రాయుధము, మల్లికాక్షము, శోణము, శ్రీవృక్షకము. హరితము, హలహలము, హేమము ఈ ఏడు అశ్వజాతి భేదములు. కాదంబరి కావ్యమున శాపవశముచే కపింజలుడు ఇంద్రాయుధ రూపమును ధరించెను. సూర్యుడు హరితాశ్వుడు. అస్కందితము, ధోరితకము, రేచితకము, వల్గితము, ప్లుతము అనునైదు అశ్వగమన బేధములు.

1. అస్కందితము = శరీరము కదలకుండ ఒక్కతీరుగా పరుగెత్తుట.

2. ధోరితకము = నాలుగుకాళ్ళు ఎత్తి పరుగెత్తుట.

3. రేచితము = వంకరలు పోకుండా సూటిగా పరుగెత్తుట.

4. వల్గితము = గంతులు వేయుచున్నట్లు పరుగెత్తుట.

5. ప్లుతము = నాలుగు కాళ్లతో జింకవలె దూకుచున్నట్లు పరుగెత్తుట.

ఈ అయిదు రకముల నడకలు నేర్చిన వానికి పంచధారలని వ్యవహారము. కాకతిరుద్రదేవుని గుఱ్ఱములు పంచధారలై యుండెనట.

83.చ॥ ఎనిమిది తావులన్ దొడరి యేపుగ నెప్పుడు నాము జాఱగా
నెనయుచు గెంపురేకలు పయిం బొలుపొందగ నందు నేనుగుల్
తన రుచునుండు నాకసము దాకెడు నిక్కున జాప ఱబ్బురం
బన సెలయేళ్ల తోడ నడయాడెడు జేగుఱు గొండలోయనన్ - 83

టీక : అందున్ ఆపురమున, ఏనుగులున్, ఎనిమిది తావుల౯ = 'ఎనిమిది స్థానముల నుండి. కుంజరేణప్రభిన్నేన సప్త ధాస్రవతామదమ్ - ఏనుగులకు నేడు స్థానముల నుండి మదము స్రవాచునని భీష్మ పర్వమున వ్యాసభగవానుడు చెప్పెను. రెండకణతలు, రెండు కన్నులు, తుండము, వదనము, మేఢ్రము అనునవి సప్త స్థానములు వీనిలో

తుండమును రెండు నానారంధ్రములుగా గుర్తించిన యెడల నివి యెనిమి దగును. లోడరి = అనుసరించి, ఏపునఁ = మిక్కిలిగా, ఎప్పుడు, నామజారగాఁ = మదజలము స్రవించుచుండగా, ఎనయుచు = ఒప్పుచు, కెంపు రేకలు = ఎఱ్ఱని చారలు, పయిఁ = మేనిపై పొలుపు + ఒందగా = అందగించగా, తనరుచు = ఒప్పుచు ఆకసము దాకెడు = ఆకాశమునంటెడు, నిక్కన = ఎత్తున చూపఱులు = చూచువారు, అబ్బురంబన = ఆశ్చర్యమను చుండగా, సెలయేళ్ల తోడ = కొండవాగులలో, నడయాడెడు = సంచరించెడు, జేగురు + కొండలోయనఁ = ఎఱ్ఱని కొండలేయో అన్నట్లుగా, ఉండుఁ = నుండును.

తా :- ఆపట్టణమందలి ఏనుగులు ఆకాశమంత ఎత్తు గలిగి ఎఱ్ఱని చారలలో ఎల్లప్పుడు కణతలు కన్నులు, తొండము, ముఖము, మేఢ్రము అను నెనిమిది స్థానముల నుండి మదముస్రవించు చుండగా చూచువారి కాశ్చర్యము గొలుపుచు సెలయేళ్లతో గూడి తిరుగాడుచున్న జాజుకొండలేమో యున్నట్లుండును.

''అలం - ఉత్ప్రేక్ష''

ఏనుగులలో భద్ర, మంద, మృగ, సంకర అని నాలుగు జాతులున్నట్లు గజశాస్త్రమున చెప్పబడినది. వీనిలో భద్ర గజము శ్రేష్ఠమైనది మద జలమే ఏనుగులకు భూషణము కనుక మదజల స్రావము దీర్ఘకాలము నిలిచి యుండునది. లేదా నిరంతరముండునది భద్రజాతి గజమన బడును.

84.సీ॥ బెళుకులై తళుకులు గులుకు కన్నుల చెన్ను
కలువల కొకవింత చెలువు గొలుప
గొప్పలై యొప్పుల కుప్పలై పాలిండ్లు
విరిబంతులకు వింత సరవి గఱప
బొలుపులై వలరాచ బలుపులై పలు మొనల్
మొల్లల కొకవింత మురువునింప
దళుకులై తేనెలు చిలుకు మోవుల రంగు
చెందొవలకు వింత సిరుల జేయ

తే॥ సొంపు వలపును గొలుపు నిచ్చలపు దెలుపు
నగవు మల్లెల కొకవింత నయము దెలుప
గోడెకాంద్రకు విరు లమ్మకొందు రెపుడు
బువ్వ లమ్మెడు చెల్వ లా ప్రోలిలోన - 84

టీక : ఆప్రోలిలోన = ఆ పట్టణమందు, పువ్వులమ్మెడు చెల్వలు = చెలువు = అందము, చెలువ = చెలువముగలది అనగా నందగత్తె పూవు లమ్ముకొను చుండు సుందరులు, బెళుకులై = (బెణుకు) చలించున్నవై, తళుకులు గుల్కు = కాంతులు చిమ్ము, కన్నుల చెన్ను = నేత్రముల యొక్క అందము ఆ॥ సోయగంబు సొబగు జోకమురువు కొమరు చెలువు తీరు సొరు పోపుచెన్ను, చక్కదనమనంగ సౌందర్యమొప్పును - ఆం. భా. 3-41 కలువలకు = కలువ పూలకు, ఒకవింత = ఒకానొక చిత్రమైన చెలువు గొలుప = అందము నిచ్చుచుండగా, గొప్పలై = పెద్దవై, ఒప్పుల కుప్పలై = సౌందర్యరాసులై, పాలిండ్లు = చన్నులు విరిబంతులకు = పూల చెండ్లకు, వింతసరవి = నూతనమైన యందము, కఱపఁ = నేర్పుచుండగా, పొలుపులై = అందమైనవై, వలరాచ బులుపులై = మన్మదుని యొక్క విలాసములై, పలుమొనల్ = దంతాగ్రములు, మొలల్లకు = మొల్ల పూలకు, ఒక వింతమురువు = ఒక చిత్రమైన అందమును నింపన్ = నిండించు చుండగా, తళుకులై = తళతళ లాడున్నవై, తేనెలు చిలుకు = తేనెలను వెదజల్లు, మోవుల రంగు = పెదవుల వన్నె, చెందోవలకు = చెన్ను + తోవ, ప్రాతాది సంధి - ఎఱ్ఱకలువలకు - వింత = చిత్రమైన, సిరుల జేయ = ఐశ్వర్యమును కలిగించు చుండగా సొలపు వలపును గొలుపు = పరవశతను మరియు వలపును గలిగించు నిచ్చల పుఁ + తెలుపు నగవు = నిశ్చలమైన (నిండు చలముతో గూడిన) తెల్లని పువ్వు, అనగా కల్మషములేని హాసము, మల్లెలకు ఒక వింత నయమ్ముఁ + తెలుప = మల్లెపూలకు ఒక కొత్తనైన న్యాయమును తెలుపు చుండగా, ఎపుడుఁ = ఎల్లపుడు, కోడె కాండ్రకు = కోడెవయస్సున్నవారికి, విరులమ్ము కొందరు = పూవులమ్ము కొను చుందరు.

తా :- ఆ పట్టణమున పూలమ్ముకొను నందగత్తెలు కాంతులు లొలుకాడు కన్నులు కలువలకు, మన్మధుని విలాసములు చిమ్ము దంతముల కొనలు మొల్లపూవులకు, తళతళ లాడుతు తేనెలు చిందే పెదవులు ఎఱ్ఱకలువలకు, పరవశము గలిగించే నిష్కల్మషమై తెల్లని నవ్వులు మల్లె పూలకు, గొప్పలై సౌందర్యరాసులైన చన్నులు పూలబంతులకు, ఒక వింత యందమును ఒక క్రొత్తదనమును కలిగించుచుండగా నెల్లప్పుడు యువకులకు పూవులమ్ముకొనుచుందురు.

విశే :- ఆ పుష్పలావికల పూటికలలో తెలకలువలు, మొల్లలు, ఎఱ్ఱకలువలు, మల్లెలు పూలబంతులు నుండెడివి. అవి వారి అంగములకు సాటిదివి వారు పూలమ్ము వేళలలో వారి చూపులు, మాటాడు ప్రుడు దంతపు కాంతులు, పెదవుల రంగులు

నవ్వునపుడా దరహాస కాంతులు వానిపైబడి ఆ పూవుల కొకక్రొత్త శోభ నిచ్చుచుండెడివి. ఇది యిందలి విశేషము. లావికమనగా పరిహాసవచనము. చెణుకు కనుక పుష్పలావిక లనగా పూలనెపమున కోడెకాండ్రతో చెణుకులాడు వారని తాత్పర్యము. అందువలన కవులు వీరిని తమ కావ్యములలో జాణలనుగా తీర్చుట పరిపాటి.

''అలం - అనుగుణము''

వర్ణ్యము యొక్క స్వగుణ మన్యవస్తు సాన్నిధ్యము చేత యుత్కర్ష పొందినట్లు చెప్పిన యెడల నది అనుగుణాలంకార మనబడును. ఈ పద్యమున పుష్పలావికల యొక్క కన్నులు చన్నులు మొదలైనవి వారి గంపలగొని పూలకు వింతకాంతు లొసగినట్లు చెప్పబడినది గాన నిది యనుగుణాలంకార మగును.

85.సీ॥ నగగల్గినను జాలు మొగసాల వాకిలి
కాపించు నబ్బేసి కంటినైన
జనిచూడ గల్గిన జాలు జేయును నన్ను
కానిగా బూవిలుకాని నైన
బలుక గల్గిన జాలు జనులు నేయించును
వెట్టిమై జదలేటి పుట్టి నైన
జెనక గల్గిన జాలు జేయును దనయింటి
చట్టు ద్రిమ్మర గాలిచూలి నైన

తే॥ నంటగలిగిన నవ్వెనకయ్యు నైన
గోచి విపించి వలపులు గొల్పి నిచ్చ
వెంట దిరుగాడ జేయు నవ్వీటి లోన
గలుగు వెలయాండ్రు గమి పొల్టు వలకు దిగిచి - 85

టీక :- అవ్వటిలోన = ఆ పట్టణమందు, గలుగు వెలయాండ్రగమి = ఉన్నటు వంటిరో చేడియల గుంపు, నగగల్గినను చాలు = నవ్వగలిగినంత స్థితి యున్న చాలును, అబ్బేసికంటినైనన్ = ఆ + బేసికంటినైన, (త్రికసంధి) ఆ శివునినైన మొగసాల వాకిలి ముఖమండపము యొక్క ద్వారామును, కాపించున్ = కావలియుండ జేయును; చని = సమీపమునకు వెళ్లి, చూడగల్గినన్ - చాలున్ = పూవిలుకానినైవన = మన్మధునినైన నప్పుకానిగాన్ చేయును, ననుపు = ప్రేమ, ప్రేమగల వానిగా

విటునిగా జేయ గల్గును, పలుక గలిగిన చాలు = మాటాడ గలిగిన చాలును, చెదలేటి పట్టినైనన్ = గంగాకుమారుడైన భీష్మునినైన, వెట్టిమై = వెట్టిగా పనులు సేయించును, పనులు చేయించ గలుగును, చెనక గల్గిన చాలు = ఎదిరించిన చాలును. గాలిచూలినైన = వాయుదేవుని కుమారుడైన ఆంజనేయునైన, తన యింటిచుట్టు ద్రిమ్మర జేయును = తిరుగ జేయ గలుగును. అంటగలిగిన = తాకగలిగిన, నవ్వెనకయ్యనైన = ఆ + వెనకయ్య (త్రికసంధి) ఆవినాయకునైన, గోచివిడిచి = గోచి బ్రహ్మచారి లక్షణము కనుక దానిని తీయించి. కచ్చను తీయించి, వలపులు గొల్పి = ప్రేమను కలుగ జేసి, నిచ్చన్ = ఎల్లప్పుడు, తన వెంట తిరుగాడ జేయుర్ = తన వెంట తిరుగ గలుగునట్లు వలకు దిగిచి = తమ వరకు ఆకర్షించు కొని లాగుకొని, పోల్చున్ = ఒప్పు చుండను.

తా :- ఆ పట్టణమందలి వేశ్యాసమాజము తమను చూచి నవ్వగల్గిన చాలు శివునినైనను మొగసాల కాపరిగా, సమీపమునకు చేరి చూడగలిగిన చాలు మన్మథునైన విటునిగా, మాటాడ గలిగిన చాలు, భీష్మునినైన వెట్టివానిగా, ఎదిరించ గలిగిన చాలు. హనుమంతునైన తమయింటి చుట్టు దిరుగువానిగా తమను తాకిన చాలును. వినాయకునైన వలపు గొలిపి వస్త్రము విడిచి తమ వెంట తిరుగువానిగా జేయును. అనగా తమవలలో వేసికొన గలుగు చుండిరి – అనగా వారింతటి సమర్థులని అర్థము.

విశే :- కవియందు గ్రహించిన శివుడు, మన్మథుడు, భీష్ముడు, హను మంతుడు, వినాయకుడు అనువారిలో శివుడు, మన్మథుడు యిద్దరు వివాహితులే. భీష్ముడు తప్ప ఆ తరువాతి యిద్దరు హనుమంతుడు. వినాయకుడు బ్రహ్మచారులని ఉన్నా కొన్ని పురాణములలో హనుమంతుడు వివాహితుడే. అతని భార్య సువర్చలాదేవి. సూర్యుని కుమారిత, వినాయకునికి సిద్ధి, బుద్ధి యని యిద్దరు భార్యలు వారు విశ్వరూప ప్రజాపతి కూతులు. నిటులపై యైదుగురిలో నలుగురు స్త్రీ, ముఖ మెరిగిన వారే కనుక ఒక పర్యాయము రుచి మరిగిన వారిని మరల దానికి సుముఖులను జేయుటలో వింతలేదుకాని –

మన్మథుడు లోకమునంత విటులను చేయువాడు. కాన అతనినే విటుని జేయుట. హనుమంతుడు లంకలో ప్రవేశించినపుడా రాత్రి లంకలో వస్త్రములు తొలగిపోయి ఏకాంతమున నిద్రించుచున్న రెందరో మదవతులైన సుదరులను

జూచెనుకాని చలించలేదు. కనుక నట్టివానినే తమయింటి చుట్టు దిరుగువానిగా జేయుట, భీష్మని మొదటిపేరు దేవరాతుడు. వివాహమాడనని భీష్మప్రతిజ్ఞ చేయుట వలననే యతడు భీష్ముడయ్యెను. కనుక నతనినే తమకు వెట్టిపని చేయువానిగా చేసికొనుట యనునీ మూడే యక్కడి వేశ్యల బింకము నకు బిరుదు.

86. కం॥పలుకుల చిలువల దొరలన
నలు మొగములు పూని రానినలువ లనంగా
దొలుమినుకుల ప్రోవులన
న్వెలయుదు రవ్వీటి పుడమి వేలుపు లెపుడున్ - 86

టీక : అవ్వటన్ = ఆ పట్టణమున, పుడమి వేలుపులు = బ్రాహ్మణులు, ఎపుడున్ పలుకులన్ = భాషలలో / విద్యలలో చిలువల దొరలన అనంతాది నాగశ్రేష్టులనగా, నలుమొగములు = నాలుగు ముఖములు, పూనిరాని = ధరించి భూలోకమునకు రాని, నలువలనంగాన్ = బ్రహ్మ దేవులనగా, తొలి మినుకుల = మొదటి ఋక్కులు అనగా వేదముల యొక్క; సీ॥ మినుకునాగను సూక్తి దనరును - ఆం. భా. I-III; ప్రోవులనంగాన్ = రాసులనగా, వెలయుదురు = ప్రకాశింపు చుందురు. మనచరిత్రలో ప్రవరుడు భాషాపరశేష భోగియను వర్ణింప బడెను.

తా :- ఆ పట్టణమున గల భూదేవులు శేషవిద్యలలో అనంతుని పింగళుని వంటి వారనగా నాలుగు ముఖములు ధరించని బ్రహ్మదేవులనగా, వేదముల యొక్క రాసులనగా నొప్పుచుందురు. అనగా మిక్కిలి గొప్ప పండితులని తాత్పర్యము

''అలం - ఉపమ మాలోపమ''

మనుచరిత్రయందు ప్రవరుడు భాషాపరశేష భోగి యని వర్ణింప బడెను. నాగులలో అనంతుడు పింగళుడు అను వారిద్దరు గొప్ప పండితులు అనంతుడే పాణిని రూపమున అష్టాధ్యాయిని మరల పతంజలి రూపమున దాని భాష్యమును వ్రాసెనని ఒక విశ్వాసము. ఇక పింగళుడు ఛందఃకర్త అందువలన ఛందశ్శాస్త్రమునకు పింగళ కౌముది మరియొక పేరు.

దీనిని బట్టి చూడ ఛందోవ్యాకరణములు రెండు మనకు నాగుల నుండియే లభించెనని ఆ జాతి వారు గొప్ప విద్యావేత్తలని తెలియును.

7.సీ॥ వరుస వెంబడి గాని పొరిగొన లేడయ్యె
మార్తుర నారాము మనికి యెంత
దురములో సిరిగేస్తు నెరసొచ్చి పగవారి
గొలిచిన కవ్వడియల పదెంత
మూడు పాళెములు తెంపున గెల్చి పొదలు జా
బిల్లి తాలుపు వేల్పు బీరమెంత
కోమటి సైదోడు గూడి త్రిమ్మరి పేర్మి
దగు విక్రమార్కుని తెగువ యెంత
తే॥ నేలపైనిల్చి తమయేపు నిలుపలేక
బెడిదమున భర్వు పిడుగుల కడిమి యెంత
యనుచు గేలిగ రచ్చల నాడు కొనుచు
నేచి పచరింతు రచ్చట్టి రాచవారు - 87

టీక :- అచ్చటి రాచవారు = ఆపట్టణమందలి క్షత్రియులు, వరుస వెంబడిగాని = ఒకరి పిమ్మట నొకరిని గాని, పోరిగొన లేడయ్యె = సంహరించ లేక పోయెను. కనుక ఆ రామునికి యెంత = ఆశ్రీరామచంద్రుని గొప్పతనమెంత, దురములో = యుద్ధ రంగమున, సిరిగేస్తు = శ్రీపతియైన కృష్ణుని యొక్క, నెరసొచ్చి =(నెరవు + సొచ్చి) సహాయమును పొంది, పగవారి గెలిచిన, కవ్వడి = (కవ్వ + వడి) రెండు చేతులందు సమానమైన వడిగలవాడు అనగా అర్జునుని యొక్క, అలవు = సామర్థ్యము, అదెంత, మూడు పాళెములు = త్రిపురములు, తెంపున గెల్చి = సాహసముచే జయించి, పొదలు = ఒప్పునట్టి, జాబిల్లి తాలుపు వేల్పు = జాను + బిల్లిక = ఆహ్లాదకరమైన బింబము అనగా చంద్రుడు, జాబిల్లి తాలుపువేల్పు = చంద్రుని ధరించిన దేవుడైన శివుని యొక్క, బీరమెంత = వీరత్వమెంత, కోమటి సైదోడు గూడి = వైశ్యుడైన తమ్మునితో కలిసి, త్రిమ్మరి = తిరిగి, పేర్మిన్ + తగు = పెద్ద తనమున నొప్పు, విక్రమార్కుని, తెగువయెంత = సాహస మెంతటిది-

క్షత్రియ కన్యయందు పుట్టినవాడు విక్రమార్కుడు. వైశ్యకన్య యందు కలిగినవాడు భట్టి యని ప్రసిద్ధము కనుక విక్రమార్కుడు కోమటితో గూడి తిరిగినవాడు. నేలపై నిల్చి = భూమిపై నిలబడి, తమ యేపు = తమ యొక్క విజృంభణము చూపలేక, బెడిదముగన్ = భయం కరముగా, పర్వు = పరుగెత్తు, పిడుగుల యొక్క కడిమి = ధైర్యము, ఎంత, అనుచు, గేలిగన్ = పరిహాసముగా, రచ్చలన్ + ఆడుకొనుచు = రచ్చలపై మాటాడుకొనుచు ఏచి = తమ యొక్క ఏపు చూపుచు, పచరింతురు = ప్రవర్తించుచుందురు.

తా :- ఆ పట్టణమందలి క్షత్రియ కుమారులు కేవలము మూడు పట్టణములు మాత్రమే గెల్చిన శివుని వీరత్వమెంత, ఒకరి పిమ్మట నొకరినే గాని శత్రువులందరిని ఒకేసారి సంహరింపలేని శ్రీరాముని గొప్పతనమెంత, యుద్ధరంగమున శ్రీకృష్ణుని సహాయమును పొంది శత్రువులను గెలిచిన అర్జునుని సామర్థ్యమెంత, వైశ్యుడైన భట్టిని సహాయముగా గొని దేశములు తిరిగిన విక్రమార్కుని సాహసమెంత యని రచ్చలపై పరిహాసముగా చెప్పుకొనుచుందురు... అనగా నచటి రాకుమారులు శివునికంటె, శ్రీరామునికంటె, అర్జునుని కంటె, విక్రమార్కుని కంటె వీరులని తాత్పర్యము.

ఈ పద్యమున నాలుగు పదములలో నాలుగు యుగములలోని వీరులు చెప్పబడిరి.

''అలం - అతిశయోక్తి''

విశే : పిడుగు నేలపై పడినపుడు లోనికి చొచ్చుకొని పోవును గాని నెల్లి కుదుళ్లలో పడినపుడటుల పోజాలవని జనశ్రుతి

''అలం - తుల్యయోగిత''

భర్తృహరి భట్టి విక్రమార్కులను గురించి నేడు మూడు నాలుగు విధములైన కథలు ప్రచారమందున్నవి. ఒక కథ ననుసరించి వీరుజ్జయినీ రాజవంశమునకు చెందినవారు. పూర్వముజ్జయినిని పాలించు విక్రమా దిత్య చక్రవర్తికి నాలుగు వర్ణములకు చెందిన నలుగురు భార్యలుండిరి. బ్రాహ్మణ భార్యపేరు తెలిసిరాలేదు. క్షత్రియ భార్యపేరు భానుమతి, వైశ్యభార్యపేరు భాగ్యవతి, శూద్రభార్యపేరు సింధుమతి ఈ నలుపురికి వరుసగా వరరుచి, విక్రమార్కుడు, భట్టి భర్తృహరి కలిగిరని - భర్తృహరియే మొదట నుజ్జయినికి ప్రభువుగా నుండి కారణాంతరము లచే సంసార భోగములనుండి విరకుడైన రాజ్యమును సోదరుడగు విక్రమార్కునకిచ్చి తాను సన్యసించి వెళ్లెనని ఈ కథను శ్రీతంజ నగరము తెవప్పెరు మాళ్లయ్యగారు వావిళ్లవారు మొట్టమొదట ప్రచురించిన భర్తృహరి సుభాషిత త్రిశతి పీఠిక యందు తెలిపిరి, యిక తక్కిన కథల ప్రకారము పై నలుపు రొక బ్రాహ్మణుని కుమారులు - ఆ కథలిట్లున్నవి.

పద్య - అ I-87

పూర్వము నందీపురమున చంద్రవర్ణుడని యొక బ్రాహ్మణు డుండెను. అతడనేక విద్యల నభ్యసించి తనివి తీరక తగిన గరువున్కై యన్వేషించుచు వెచ్చుచు నొకచోట దారియందొక రాగి చెట్టుక్రింద నిద్రింప నాచెట్టుపై నున్న బ్రాహ్మరాక్షస డొకడు అతని వృత్తాంత మెరిగి నిద్రలేపి నీవు విద్యార్జనమునకై వెళ్లుచుంటివి గదా నేను నీకట్టి విద్యలన్ని యారునెలలలో నేర్పెదను. ఈయారు నెలలు నీకాకలి దప్పులుండవని యొక యోషధినిచ్చి చెట్టుపై నుండి యతడు దినదిన మొకరాగి యాకుపై పాఠము వ్రాసిక్రిందికి వేయుచుండ దాని నాబ్రాహ్మణుడు మననము జేయు చుండెను. అటుల విద్యను పూర్తి చేసికొని గృహోన్ముఖుడై మార్గమధ్యమున కన్యాకుబ్జము చేరి యచట నొక సుందరమైన భవనము గని మార్గాయాసముచే నా యింటి యరుగులపై విశ్రయించి నిద్రించెను.

అది యొక వేశ్యాగృహము. ఆవేశ్యయొక్క పుత్రికపేరు అలంకార వతి. ఆమె అతడు నిద్రించిన కొంతసేపటికి వెలుపలికి వచ్చి అతనిని చూచి సౌందర్యమున కబ్బురపడి యతనికి సకలోప చారములు చేసి మేల్కొనిన పిమ్మట తనను వివాహమాడుమనగా నేను బ్రాహ్మణడను. కనుక అన్యజాతిని వివాహమాడరాదనెను. అపుడామె నా వివాదమును రాజసభకు గొని వెళ్లగా నచటి పండితులు బ్రాహ్మణు డేకకాలమున నాలుగు వర్ణములకు చెందిన కన్యలను వివాహమాడ వచ్చునని చెప్పిరి. అపుడు ప్రభువగు మహేంద్రవర్మ తనకూతురగు మిత్రరేఖను, పురోహితడగు గుణశర్మ, తనకూతురగు కల్యాణిని, సోమశేఖరుడను వైశ్యుడు తన కూతురగు కోమలాంగిని, నతని కిచ్చుట కంగీకరించిరి. చంద్రవర్ణుడపుడా నలుగురి నేకకాలమున వివాహమాడెను. అపుడు వారిలో విత్రరేఖకు విక్రమార్కుడు, కళ్యాణికి వరరుచి, కోమలాంగికి భట్టి, అలంకారవతికి భర్తృహరి అను వారు కలిగిరి.

మహేంద్రవర్మకు పురుష సంతానము లేనందున అతడు తనరాజ్య మితనికే నిచ్చెను.

అంతచంద్రవర్ణుడు తన యవసానకాలమున నలుగురు కుమారులను పిలిచి నాకు న్యాయమునకు అలంకారవతియే పెద్ద భార్య. ఆమె మూలముననే నేను మీతల్లులను వివాహమాడవలసి వచ్చిన దని తెలిపి మహేంద్రవర్మ తనకిచ్చిన రాజ్యమునకు భర్తృహరిని పట్టము గట్టెను.

ఈ కథను శ్రీమాన్ ఉత్పల వేంకట రంగాచార్యులు ప్రయోగ రామకృష్ణ అనేవారిద్దరు చెప్పిరి. కాని వీరిద్దరి పేర్లలో మత భేదము లున్నవి. ప్రయాగవారు భార్యలపేర్లే చెప్పిరి.

కాని వారి తండ్రులపేర్లు చెప్పలేదు. ఉత్పల వారి తాత్పర్యము బాలసరస్వతీ బుక్‌డిపో కర్నూలు వారు క్రీ.శ. 1989లోను ప్రయాగ వారి వ్యాఖ్యానము శ్రీరామానుజ వాణి విజయవాడ వారు క్రీ.శ. 1993లోను ముద్రించిరి.

విక్రమార్కాదుల వివరము

తంజనగరము	ఉత్పల	ప్రయాగ
ఉజ్జయిని	నందీపురం	పాటలీపుత్రం
	చంద్రవర్ణుడు	విద్యాసాగరుడు
విక్రమాదిత్యుడు	మహేంద్రవర్మ	ప్రభువు
-	గుణశర్మ	మంత్రి, పురోహితుడు
-	సోమశేఖరుడు	కులపతి, వైశ్యుడు
-	వేశ్య	

ప్రభువు యొక్క భార్యలు బిడ్డలు

తంజనగరమువారు	ఉత్పలవారు	ప్రయాగవారు	
బ్రాహ్మణి	కళ్యాణి	మాలతి	వరరుచి
భానుమతి	మిత్రరేఖ	కళావతి	విక్రమార్కుడు
భాగ్యవతి	కోమాలాంగి	సుమంగళి	భట్టి
సింధుమతి	అలంకారవతి	మందాకిని	భర్తృహరి
(శూద్రకన్య)	(వేశ్య)	(వేశ్య)	

ఈ నాటి పరిశోధకులీ గాథలను విశ్వసింపరు. వారు విక్రమార్కుని విక్రమ శకా మూలభూతుడని యందురు. ఆశకము క్రీ.పూ. 56 నుండి యారంభమగును. అతడు శకులను జయించి తనపేర శకాబ్దమారంభించెను.

ఇక భర్తృహరి నాము లిద్దరున్నారు. ఒకడు వాక్య పదీయ కారుడు. మరొకడు త్రిశతికారుడు. వాక్యపదీయ కారుడు బౌద్ధుడు. శతక కారుడు శైవుడు. క్షత్రియుడు మధ్య హిందూదేశ వాసియని అంతేకాక భట్టి బ్రాహ్మణుడని భట్టి కావ్యకర్తయని వలభి రాజాస్థానమునకు చెందినవాడని యందురు.

88. క॥ తడవగ వసమా యందుల
నెడపనిసిరు లేరికైన నెఱుగగ వచ్చున్
నొడువక కోటికి నెత్తిన
పడగలచే గోమ టిండ్ల బంగరు మళిగల్ - 88

టీక :- ఆ పట్టణమందు, కోమటిండ్లన్ = వైశ్యుల యిండ్లలో ఎడపని సిరులు = ఎడతెగని సంపదలు, ఏరికైనన్ = ఎవరికైనను, నొడువక = నోటితో చెప్పకుండగనే, ఎఱుగగ వచ్చున్ = స్పష్టముగా తెలియవచ్చును. కోటికి నెత్తినపడగలచే = నిధులను సర్పరాజములు రక్షించుచుండునని ప్రతీతి కనుక పూర్వము కోటిరూపాయలు కూర్చిన వారు బంగరుతో తలెత్తి పడగ విచ్చిన నాగప్రతిమను చేయించి ఆధనరాశిపై ప్రతిష్ఠించి పూజించు చుండిరట. అందువలన కోటికి పడగెత్తుటనునది తెలుగువారి యైశ్వర్యమును తెలుపు భాషీయముగా నిలిచినది. కోట్లకు పడగెత్తిన యైశ్వర్యముతో గూడిన బంగరు మళిగల్ = వైశ్యుల యిండ్లలోని బంగారు మడిగెలను, అందులన్ = ఆ పట్టణమున తడవగ వశమా = ఇన్ని + యని లెక్కించి చెప్పుటకు సాధ్యమా !

తా :- ఆ పట్టణమందుగల వైశ్యుల యిండ్లలోని సంపదలు వారు కోట్లకెత్తిన పడగలు చూడగనే ఎవరికైనను అవి నోటితో చెప్పకుండగనే తెలియును. ఆ పట్టణమందలి బంగారు మడిగలు లెక్కించు చెప్పుట వశము గాకుండెను.

''అలం - అతిశయోక్తి''

గడితపు బడుగుల నైనను
బెడిదపు సింగముల నైన బెడచే బుడమిం
బడినడుచు బంటు లెన్నగ
గడలేక తనర్తు రచట గడుబీరమునన్ - 89

అచటన్ = ఆపట్టణమున, గడితపు పిడుగుల నైనను = లావైన పిడుగుల నైనను, బెడిదపు సింగముల నైనన్ = భయం కరమైన సింహములనైన, పెడచేన్ = ఎడమ చేతనే, పుడమిబడనడచు = నేలపై ఎగురునట్లు అణచి వేయగల బంటులు = యోధులు, కడుభీకరమునన్ = మిక్కిలి వీరత్వమున, ఎన్నగన్ = లెక్కింపగా అనగా కడిది వీరులలో లెక్కింప దగినట్లుగా, కడలేక = అంతులేకుండ, తనర్తురు = ఒప్పుచుందురు.

ఆపట్టణమున ఎంత మోటు పిడుగుల నైనను, బెరికి సింహములనైనను ఎడమ చేతనే చరచి మట్టి కరిపించగల యోధులు, భుజబలమున గొప్ప వీరులలో లెక్కించ దగిన వారు అంతులేకుండ నుండిరి.

అర్జునుడు ఒకపరి పిడుగును చేత పట్టుకొనగా అపుడది యతనిని ప్రార్థించి నేటినుండి నిన్ను ప్రార్థించువారిని నేను బాధించనని బ్రతిమిలాడి విడిపించుకొనెనట. రేనాటి చోళ ప్రభువులలో అగ్రణి పిడుగు ఉత్పత్తి పిడుగని బిరుదులు గలవు. వారు పిడుగులను పట్టుకొని యుండవచ్చునని చరిత్రకారుల మతము.

ఇక్కడికి పురవర్ణన ముగిసినది. కవులు ప్రబంధ కథను మొదట పురవర్ణనతో ప్రారంభింపవలెను. ఆపట్టణమే దేని పుణ్యనదీ పర్వతముల సమీపమున నున్న యెడల మొదట దానిని స్మరింపవలెను. అరుణాస్పద పురము వరుణానదీ తీరమందుండుటచే పెద్దనగారు మొదట దానిని స్మరించెను.

పట్టణము పేరు చెప్పిన పిదప అచటి కోట, అగడ్త కోటయందలి మేడలు, వీధులు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులను నాలుగు జాతులు యువతీ యువకులు, పుష్పలావికలు, వేశ్యలు, కథానాయకుడు క్షత్రియుడైన అచటి రథ, గజ తురగ పదాతులు క్రమమున యధావకాశముగా వర్ణించ వలెను.

అనంతరము ప్రధాన కథ నారంబింప వలెను.

90.వ॥ ఇట్లు కడలి కడగా గలుగు పుడమి పడతికి దొడ
వనంగడు నొప్పు నవ్వీ డేలు నేల ఱేడెట్టి వాడనిన - 90

టీక :- ఇట్లు = ఈవిధముగా, కడలికడగా గలుగు = సముద్రమే చివరగా కలిగిన అనగా సముద్ర పర్యంతమైన పుడమి పడఁతికి = భూదేవికి, తొడవనఁ = భూషణమనగా, కడునొప్పు మిక్కిలిగా తగినట్టి, నవ్వీడు = ఆ + వీడు త్రికసంధి, ఆపట్టణమేలు, నేల ఱేడు + ఎట్టివాడనిన = ధరణీపతి ఎటువంటి వాడనగా -
ముందరి పద్యములో సన్వయము.

91.సీ॥ విన్నేఱు తలగల్గు వేల్పునౌ దలపువ్వు
తలప నెవ్వని తాతతాత తండ్రి
కలువల చెలి కాని గారాపు బట్టియై
తనరారు నేఱేని తాత తాత
దీవులు పదునెన్మి దింటితో నేలయం
తయు నేలె నేఱేని తాత తండ్రి
తనయాన సుడి గట్టు వెనుక బర్వగ జాల
దేజున మించె నే రాజు తాత

తే॥ చేరి జేజేలు మరి జడదారి గములు
నచ్చరలు గొల్వ వేగన్నులతని మొదలి
రాచనెల వేలె బేర్మి నే రాజుతండ్రి
యతడు కొనియాడ నెగడె యయాతి పుడమి - 91

టీక :- విన్నేరు తలగల్గు = (విను + ఏఱు) ఆకాశగంగ తలపై నుండు, వేల్పు = దేవుని యొక్క, నౌదలపూవు = నడినెత్తిపై పూవై నిలిచిన వాడు, అనగా చంద్రుడు, తలపఁ = ఆలోచించగా, ఎవ్వని, తాతతాత తండ్రి = తాతగారికి తాతయైన యతనికి తండ్రియో - కలువల చెలికాని = కలువ పూవులకు మిత్రుడైన చంద్రుని యొక్క గారాబు పట్టియై గారాబముగల కుమారుడైన బుధుడు, ఏఱేని = ఏ మహారాజు యొక్క, తాతతాత = పితామహునికి పితామహుడై, తనరారుఁ = ఒప్పునో, దీవులు = ద్వీపములు, పదునెన్మిదింటిలో, నేలయంతయు = భూమి నంతటిని, ఏఱేని తాతతండ్రి = ఏమహారాజు యొక్క ప్రపితామహుడు అనగా పురూరవుడు ఏలెనో

- తనయాన = తనయొక్క ఆజ్ఞ, సుడిగట్టు వెనుక బర్వగఁ = భూమండలమును చుట్టిన చక్రవాళ పర్వతము యొక్క వెనుక గూడ వ్యాపించగా, నేరాజు తాత = ఏ మహారాజు యొక్క పితామహుడు అగు ఆయువు. చాల తేజునఁ + మించెను = మిక్కిలి తేజమున ప్రకాశించెనో - తనను సమీపించి; జేజేలు = దేవతలు, జడదారిగములు =జడలు ధరించిన వారు అనగా మునులు, అచ్చరలు = అప్సరసలు, కొల్వఁ = సేవించుచుండగా, వేగన్నులతని = వేయికన్నులు గలవాని, అనగా నింద్రుని మొదలి రాచ నెలవు = మొదటి రాజధాని యనగా స్వర్గము, ఏరాజు తండ్రి = ఏమహారాజుగారి తండ్రి, పేర్మిఁ ఏలెఁ = గొప్పగా పాలించెనో, అతడు = అనగా నటువంటి వాడైన యయాతి, పుడమి గొనియాడఁ = భూలోకము మెచ్చుకొను చుండగా, నెగడన్= ఒప్పెను.

యచ్ఛబ్దముతో మహా పురుషులను వర్ణించుట విరాట పర్వమున తిక్కనగారేర్పరచిన సంప్రదాయము. ఇందుయయాతి వంశము చంద్రుడు మొదలు కొని అతని వరకు చెప్పబడినది.

తా :- శివునికి తలపూలైన చంద్రుడు యే మహారాజు యొక్క తాతగారి తాత తండ్రియో, చంద్రుని యొక్క గారాబము గల కుమారుడైన బుధుడు యే మహారాజు గారి యొక్క పితామహునికి పితామహుడో! .... అష్టాదశ ద్వీపములతో గూడిన భూమండలము నంతటిని ఏకచ్ఛత్రముగా నేలిన పురూరవుడే మాహారాజు యొక్క తాతగారి తండ్రియో ! భూమిని చుట్టిన చక్రపాళ పర్వతము యొక్క ఆవలగూడ తనయాజ్ఞను వ్యాపింప జేసిన యాయువు యే మహారాజుగారికి తాతగారో ! దేవతలు, ఋషులు, అప్సరసలు సేవించుచుండగా స్వర్గపట్టణము నేలిన నహుషుడు ఏమహారాజు యొక్క తండ్రియో! అట్టి యయాతి మహారాజు యొక్క తండ్రియో! అట్టి యయాతి మహారాజు భూజనులందరి పొగడ్తలను గనుచు నొప్పుచుండెను.

-: ఈ పద్యమందలి పూర్వగాథలు :-

చంద్రుడు అనసూయా అత్రి మహర్షుల పుత్రుడు. బ్రహ్మాంశతో జనించిన వాడు. అతనికి దక్షుడు అశ్విన్యాదులగు తనబిడ్డల నిరువదేడు గురినిచ్చి వివాహము జేసెను కాని వారిలో నతడు రోహిణి యం దెక్కువ మక్కువ గలిగి యుండుటచే తక్కిన వారా విషయము

తండ్రితో జెప్పుకొనిరి. అంత దక్షుడు కోపా ద్రిక్తుడై యల్లుని రాజయక్ష్మ పీడితుడవు గమ్మని శపించెను. అంత చంద్రుడా శాపమునకు భయపడి వెళ్లి శివుని శరణు వేడగా నతడతని కభయమిచ్చి తలపై ధరించెను. ఈవిధముగా నతడు శివునికి తలపూవయ్యెను.

చంద్రుడు బృహస్పతి దగ్గర చదివెను. ఆకాలమున తార యతనిని బలవంతపెట్టగా నతడామెతో కామకేళిని దేలి బుధుడను కుమారుని గనెను. అనంతర మతడు వివాహితుడై దక్షుని శాపమునకు గురియైన పిమ్మట భార్యలకు మరింత దూరమయ్యెను. అందువలన నతనికి నిజభార్యలయందు సంతానము పొందు నవకాశము కలుగ లేదు. తార యందు గన్నవాడే అతని వంశోద్ధారకు డయ్యెను. అందువలన నతడు చంద్రునికి గారాబు కుమారుడు. ఇతనిని రోహిణీ దేవియే పెంచి పెద్ద ఓ .

ఈబుధు డొకనాడు వేటకై యరణ్యమున కేగి యచట నొంటరిగా సంచరించుచు ఇలయను నొక యువతిని గాంచెను. అపుడు వారిరువురు పరస్పరము ప్రేమించుకొని వివాహమాడిరి. వారికి పురూరవుడను కుమారుడు కలిగెను.

ఈ ఇల యొక్క మొదటి పేరు సుద్యుమ్నుడు. ఇతడు ఏడవ మనువైన వైవస్వతుని కుమారుడు. అతని భార్య శ్రద్ధాదేవి. చాలాకాలము వరకు వారికి సంతానము కలుగక పోగా వైవస్వతుడు పుత్రార్థమై యాగము చేసెను. అపుడు శ్రద్ధాదేవి పురోహితునాశ్రయించి తనకు పుత్రిక కావలయునని పుత్రునికి బదులు పుత్రిక జన్మించునట్లు చూడమని కోర పురోత పుత్రిక కలుగునట్లు మంత్రములు చదివెను. అందువలన సుద్యుమ్నుడు మొదట స్త్రీగా జన్మించెను. అదిచూచి వైవస్వతుడు కులగురువైన వశిష్టుని దగ్గరకు వెళ్లి నేను పుత్రుడు కావలెనని యాగము చేయ పుత్రికేల కలిగెనని యడిగెను. అంత వశిష్టుడపుడు దివ్యదృష్టితో పురోత చేసిన మోసమెరిగి తాను శివుని ప్రార్థించి, ఇలాకుమారిని పురుషునిగా మార్చెను అతడు పెరిగి పెద్దవాడై ఒకనాడు వేటకు వెళ్లి శరవణమున ప్రవేశించెను.

పార్వతీదేవి ఎల్లప్పుడు శరవణ మందలి సరస్సుర జలకము లాడుచుండును. అపుడు రాక్షసులు కామరూపులై వచ్చి యామె నగ్న సౌందర్యమును చూడసాగిరి. అంతనది తెలిసి యామె నేటినుండి ఈవనమెవరు ప్రవేశించినా వారు స్త్రీలై పోదురు గాక యని శపించెను. ఈ శాపమెరుగని సుద్యుమ్నుడావనమున ప్రవేశించి మరల స్త్రీయై యావనము వెడలివచ్చి సిగ్గున ఒంటరిగా దిరుగుచుండగా మృగయావిహారమునకై వచ్చిన బుధుడామెను చూచుట. వారిద్దరు పరస్పరము ప్రేమించుకొనుట జరిగెను.

పురూరవుడు కలిగిన పిమ్మట ఇల తాను స్త్రీ రూపమున నుండనొల్లక వశిష్టుని కడకేగి మరల తనను పురుషుని చేయుమని ప్రార్థించెను. అంత వశిష్టుడీ పర్యాయమామెను పురుషుని జేయుమని పార్వతిని వేడగా, నామె యాతని పుట్టుకకు తనశాపమునకు మరియు వశిష్టుని తపమునకు భంగము రాకుండ సుద్యుమ్ను డొకనెల స్త్రీగను ఒకనెల పురుషుడుగను నుండునట్లు వరమిచ్చెను.

ఈ సుద్యుమ్ననికి పురుషరూపమున ఉత్కలుడు, గయుడు మొదలైన సూర్యవంశమునకు మూలపురుషులైన సంతతి కలిగినది.

ఈ యిల వలన చంద్రవంశీయులు ఐలుననబడిరి. జ్యోతిష్య ప్రకారము బుధుడు నపుంసకుడు. అతని భార్య యిల ఒక నెల స్త్రీ, ఒకనెల పురుషుడు కనుక వీరిదొక విచిత్ర దాంపత్యము.

పురూరవుడు నవయువ్వనుడై ఒకనాడు వేటకు వెడలి యాయరణ్యము నకు విహారమునకు వచ్చిన యూర్వసిని జూచి కామించెను. అపుడు వారిద్దరు కాపురము చేసిరి. ఊర్వశి పదిమంది కుమారులను గని పతిని పదకొండవ వానిని జేసి మరల స్వర్గమునకు వెళ్లెను.

ఈ ఊర్వశీ పురేరవుల సంతానమున ఆయువను వాడు ముఖ్యుడు. అతని కుమారుడు నహుషుడు. చంద్రవంశమున ఇతడు పేరు చెందిన చక్రవర్తి. ఇతని కాలమున స్వర్గమున నింద్రునికి విశ్వరూపాచార్యుని వధచే బ్రహ్మ హత్యా దోషము చుట్టుకొని పదవీచ్యుతి కల్గగా మహర్షులితనిని గొనివెళ్లి స్వర్గాధిపతిని చేసిరి. ఇతడు తన కాలమున స్వర్గము నుండి భరతులను భూలోకమునకు గొని వచ్చి యిచట నాటక రంగాభివృద్ధి చేసెను.

స్వర్గసింహాసన మెక్కిన పిమ్మట నితనికి శచీదేవిని పొందవలయునని యప్రబుద్ధిపుట్టి మహర్షులచే పల్లకి మోయించుకొని యింద్రసదనమున కేగుచు దారిలో అగస్త్య మహర్షి శాపమునకు గురియై భూలోకమున నజగరమై పడెను. ఈ యజగరమే అరణ్యావాసమున భీముని పట్టుకొనినెను. ఇతని కుమారుడే ఈ కథానాయకుడైన యయాతి.

''అలం - ఉదాత్తము''

వస్తుసమృద్ధినిగాని - అన్యోపలక్షణమైన శ్లాఘ్య చరితముగాని వర్ణించిన యెడల నది యుదాత్తాలంకార మనబడును. 16వ పద్యమున అమీనుఖాను వంశమునకు, ఈ పద్యమున యయాతి మహారాజు వంశమునకు వారి పూర్వుల శ్లాఘ్య చరితములు జోడింపబడినవి. గానవిని యుదాత్తాలంకారము లనబడును.

చంద్రవంశవృక్షము

బ్రహ్మ	-	భార్య సరస్వతి
అత్రిమహర్షి	-	భార్య అనసూయ
చంద్రుడు	-	తార/ అశ్వాన్యాదులు
బుధుడు	-	భార్య ఇలాదేవి
పురూరవుడు	-	భార్య ఊర్వసి
ఆయువు	-	భార్య స్వర్భానవి
నహుషుడు	-	భార్య ప్రియంవద
యయాతి	-	భార్యలు దేవయాని, శర్మిష్ఠ

92.సీ॥ తనవాలు ముక్కంటికిని మార్తురగు రాచ
గముల్లెఁ భూవిలుకాండ్రు కాఁగఁ
దనరూపువలకుఁ బైదలుల నెమ్మదు లెల్ల
మేలైన బేడినమీలు కాఁగ
దనయీగి తొగఱేనికిని వేఁడు వారెల్ల
దునకించు కల్వల తుటుము కాఁగఁ
దనగెల్పు పట్ల వ్రాఁతలకు మున్నీటియ
వ్వల నున్న నుడిగట్టు పలక కాఁగఁ

తే॥ దనదు తేజు జగం బునఁ తగిన తమ్మి
కొలకునకుఁ గోర్కులిడు వేఁడి వెలుఁగు కాఁగఁ
గడలి లోఁగొనఁ గల్గిన పుడమి యెల్ల
నానకును లోనుగా నేలె నయ్యయాతి - 92

క :- తనవాలు = తనయొక్క ఆయుధమును, ముక్కంటికి = శివునికి మార్తురగు = శత్రువులైన, రాచగములెల్ల = ప్రభు సమూహము లందరు, పూవిలుకాండ్రు కాగన్ = మన్మథులు కాగా, అనగా నీఱు కాగా - తన రూపు = తనయొక్క సౌందర్యమును, వలకువైదలుల నెమ్మదులెల్లన్ = (పయిద + ఆలు) పైద = పిల్ల, పైదలి = పిల్లతనము విడువనియాడుది స్త్రీల యొక్క నెఱ + మది = ప్రాతాదిసంధి. నిండైన మనుస్సు లెల్ల, మేలైన = శ్రేష్టమైన బేడి సమీలు గాగన్ = ఆడుచేపలు కాగా అనగా అతని రూపమునకు చిక్కగా, తనయీవి = తన యొక్క దానమను, తొగజేని కినికిని = కలువల రాజునకు అనగా చంద్రునకు, వేడువారెల్ల = అర్థించువారందరు, తులకించు = ప్రకాశించు, కల్వల తుటుముగాగన్ = కైరవ సమూహముకాగా - అనగా ఆనందించగా తనగెల్పుపట్ల = తనయొక్క విజయ సంబంధమైన, వ్రాతలకు = లిపులకు అనగా శాసనములకు, మున్నీటి యవ్వలనున్న = (మును + నీరు) సృష్టికి మొదటి జలమైన సముద్రమున కావల గల సుడిగట్టు = చక్రవాళ పర్వతము, పలకగాగన్ = జయాంకములు లిఖించు వ్రాతపలక కాగా - రాజులు తమ విజయ యాత్రలలో చిట్ట చివరి స్థానమున తమ జయాంక శాసనములు వేయుదురు కనుక చక్రవాళ పర్వతము వరకు అతని విజయ యాత్రలు వ్యాపింపగా నని యర్థము. తనదు తేజు = తన యొక్క ప్రకాశము, జగంబన దగిన = లోకము అనునటువంటి, తమ్మి కొలకునకు = పద్మాకరమునకు, కోర్కులిడు = కోరికలిచ్చు, వేడివెలుగు గాగన్ = సూర్యుడు కాగా, కడలిలో గొనగల్గిన = సముద్రముల నడుమ గలిగిన, పుడమియెల్ల = భూమియెల్ల, అయ్యయాతి = ఆ + యయాతి త్రికసంధి. ఆయయాతి మహారాజు, ఆనకును లోనుగానేలెన్ = ఆజ్ఞకు లోబరచు కొని పాలించెను.

తా :- తన యొక్క కత్తియను చిచ్చర కంటికి పగవారందరు మన్మథులై మాడిపోవుచుండగా, తన యొక్క విజయ యాత్రలందు చక్రవాళ పర్వతమే జయాంక ఫలకముగాగా తన యొక్క తేజ మను సూర్యునకు లోకమను పద్మాకరము కోరికలు దీరి వికసించగా, తన యొక్క దానమను చంద్రునకు అర్థి జన సముదాయ మందరు కలువలై హర్షింపగా, తన యొక్క సౌందర్యమును వలకు స్త్రీలందరాడు చేపలై చిక్కిపోవుచుండగా, నాలుగు సముద్రముల నడుమ గల నేలనంతయు ఆయయాతి మహారాజు తన యాజ్ఞ చెల్లించుచు పాలించెను.

''అలం - పరిణామము''

విశే : తన రూపువలకు పైదలులెల్ల బేడిసమీలుగాగ'' - అని చెప్పి కవి యిందు ముంది తనవయోరూపములకు శర్మిష్ఠయను బేడి సచికులిటను సూచించెను.

93చ॥ అనికి నెదుర్ప జాలుదొర నారసి కానక యయ్యయాతి దా
బెనకువ మేటిజన్నములు పెక్కులు చేసి పసిండిబా ఱులం
దనుపగ దానినిచ్చు నని దయ్యపు మూకలు పైకి కొండపై
ననయము కాపురంబులుగ నన్నియు గాచుచు నుండు నెంతయున్ - 93

టీక : అయ్యయాతి = ఆ యయాతి మహారాజు, అనికి నెదుర్ప దొలుదొరన్ = యుద్ధరంగమున తన నెదిరించగల ప్రభువులను, ఆరసికానకన్ = వెదకి కనుగొనలేక, తాన్ = తాను, పెనకువన్ = ఆసక్తితో, మేటి జన్నములు = గొప్ప గొప్ప యజ్ఞములు, పెక్కులు సేసి = అనేక మొనరించి, పసిండి బారులన్ = తనవగన్, బారువు = ఇరువది మణుగులు, మణుగుల కొలది - బ్రాహ్మణులను మణుగుల కొలది బంగారము చేత తృప్తి చెందించగా, అది చూచి, దయ్యపు మూకలు = దేవతా సమూహములు, అన్నియున్ = మొత్తము దాని నిచ్చునని = యయాతి మహారాజు దానమున దీనిని గూడ నీయగలడని, పైడి కొండపయిన్ = బంగారు గట్టగు మేరువుపై, అనయమున్ = ఎల్లప్పుడు, కాపురంబులుగన్ = సంసారములతో నుండి, ఎంతయున్ = మిక్కిలి జాగరూకతతో, కాచుచునుండున్ = రక్షించుచుండను.

తా : యయాతి మహారాజు మొదట దిగ్విజయ యాత్రలు చేసి అందరిని జయించి ఇంక తన నెదిరించు ప్రభువులు లేరని తెల్చుకొని పిమ్మట గొప్ప గొప్ప యాగములు తల పెట్టి వానిలో బ్రాహ్మణులకు బారువుల కొలది బంగారు దానము చేయు చుండగా నదిగని దేవతా సమూహము లందరా మహారాజీ మేరువును గూడ దానము చేయగల డేమోనని భయపడి దాని పైననే కాపురములు పెట్టి దానిని నిరంతరము కాపాడు కొనుచుండిరి.

94చ॥ తోటలు లేని త్రోవలును దోరపు జన్నపు గంబము ల్గడు
నాటని యేటి పెందరులు నాడెపు బాఱుల కీనియూళ్లు నీ
రాటని గాటపుం జెఱువు లారయ నబ్బుర మెంచి చూడ న
మ్మేటి యయాతి యేలు పుడమిం దగునబ్బ లియుందలం పగన్ - 94

టీక :- తోటలులేని త్రోవలును, తోరపు జన్నపు కంబముల్ = లావైనట్టి యూపస్తంభములు అనగా యజ్ఞశాలయందు నాటెడు స్తంబములు పెద్ద పెద్ద యజ్ఞములు తరచుగా పుణ్యనదీ తీరములలో చేయుచుండుట ప్రసిద్ధము కనుక - కడుఁ నాటిని యేటి పెందరులు = మిక్కిలిగా పాతియుండని విశాలమైన నదీతీరములు, నాడెపు = నాణ్యమైన అనగా మేలైన పాఱుల కీనియూళ్లు = బ్రాహ్మణులకీయని గ్రామములు, నీరాటని గాటపుం జెరువులు = నీరు + ఆట = జలక్రీడ, నీరాటని, జలక్రీడలాడని గాటపుం జెఱువులు = గొప్పత టాకములు, అమ్మేటి యయాతి = ఆ గొప్పనైన యయాతి మహారాజు, ఎలుపుడమిఁ = పాలించు భూమియందు లేవు, ఆరయఁ = బాగుగా నాలోచించి, ఎంచి చూడగాఁ = లెక్కించి చూడగా, నబ్బురము ఇది ఆశ్చర్యము అబ్బలియఁ = ఆ బలవంతుడైన మహారాజును, తలంపఁ దగుఁ = తలపనగును.

తా :- ఆ యయాతి మహారాజు పాలించు రాజ్యమున తోటలు లేని త్రోవలు, యాగయూపస్తంభములు నాటని విశాలమైన నదీతీరములు ఉత్తములైన బ్రాహ్మణుల కీయని యూళ్లు, జలక్రీడలకు పనికిరాని చెఱువులు, వెదకి చూచినను లేకుండెను. కనుక మహారాజులందతని పాలనమే స్మరింపవలెను.

అనగా నతని పరిపాలన ప్రజారంజకముగా నుండి దేశము సుభిక్షముగా నుండెనని తాత్పర్యము.

95. సీ॥ తలపడు జేజేలు బొలసు దిండ్లను గొండ
గలచిన నాటి యంకిలి యొకింత
యె ఱుగడు తనలోన నేప్రొద్దు బాయక
యేర్చు వార్వపుటగ్గి యెగ్గు మదిని
మరచె జాల్వేరింటి మగువ నేలిన వేల్పు
చిలుకు వేడిమి నింకి కలగ బడుట
యెఱుగడు మత్తిల్లి పరటి పుట్టువు గ్రుక్క
గొనిన యప్పుడు గల కుతిల పాటు
తే॥ నయ్యయాతి కడంగి నెయ్యమున బుడమి
వేల్పులకు బైడి యొసగెడు విడుపు నీట
నిండి కొద వేమియును లేక యుండె గడలి
యతని చాగంబు లికనెన్న నలవి యగునె - 95

టీక :- కడలి - కడలు = కరడు అనగా పెద్దయల, కడలు + ఇ = కరళ్లుగలది అనగా సముద్రము, సముద్రశబ్దము పుంలింగము కనుక కడలి రాజు, జేజేలు = దేవతలు, పొలసు దిండ్లును = రక్కసులును, కొండగల చిననాటి = మందరములో చిలికి కలచినప్పటి, అంకిలి యొకింత = బాధను ఏమాత్రము గూడ తలపడు - తనలోన, నేప్రొద్దు = ఎల్లపుడు పాయక = ఎడతెగక, ఏర్చు = విజృంబించు, వార్వంపుటగ్గి యొగ్గు = బడబాగ్నివలన కలిగెడు కీడు, మదిని - మనస్సున నెరుగడు - చాల్పేరింటి = నాగటి చాలునకు పర్యాయమైన సీతయను పేరుగల, మగువఁ = మగు = పరిమళము, మగువ = పరిమళించు వాయిగలది. అనగా స్త్రీ చాలునాగర్సుతాఖ్యదనరు ఆం. ఖా. 2-223 సీతను ఏలిన వేల్పు = పాలించిన దైవము అనగా శ్రీరాముని యొక్క, ములికి వేడిమిఁ = బాణము యొక్క కొనతో ఇంకిపోయి, కలగ బడుట = కళవళ పడుట మర చెను - మత్తిల్లి = మదించి/ గర్వించి, పరటి పుట్టువు = కుంభ సంభవుడు, గ్రుక్కగొనిన యప్పుడు = అపోశనము పట్టినపుడు, గల = పొందిను కుతిలపాటు = దుఃఖము ఎరుగడు, అయ్యయాతి = ఆయయాతి మహారాజు, కడింది నెయ్యమున = మిక్కిలి స్నేహము చేత, పుడమి వేల్పులకు = బ్రాహ్మణలకు, పైడియొసగెడు = సువర్ణ దానము చేయు, విడుపునీట = ''సంప్రదదేనమమ'' యని దారవోయు నీటిచేత, నిండి = పూర్ణమైన, కొదమేయును లేక = ఏ మాత్రము తక్కువ లేకుండ యుండెను. ఇకఁ = ఇంక, అతని చాగంబులు = ఆయయాతి మహారాజు యొక్క దానములు, ఎన్ననలవి యగునె = లెక్కించుటకు వీలగునా !

తా : ఆ యయాతి మహారాజు బ్రాహ్మణులకు ధారాపూర్వకముగా సువర్ణ దానము చేయుచు విడిచెడు నీటిచేత సముద్రు డెపుడును నిండుగా నిండి తనను దేవదానవులు మందరముతో చిలికిననాటి బాధనుగాని, తనలో విజృంభించుచున్న బడబాగ్ని వలని బాధను గాని, అగస్త్యుడు తనను పుడిసిట పట్టినప్పటి దుఃఖమునుగాని, శ్రీరాముడు బాణము వేసి యింకించినప్పటి బాధను గాని లెక్కించక శాంతముగా నుండెను. కావున నారాజు యొక్క దానము లెన్నియని చెప్పగలము.,

అనగా నతని దానధారలచే సముద్రము నిండి పోవుచుండెను కావున నిక ఆదానముల యొక్క విరివి యెన్నలేమని తాత్పర్యము.

''అలం - పూర్వరూపము''

వస్తువు పూర్వరూపమును విడిచి మరల గ్రహించినట్లు చెప్పినను, లేదా యది క్షీణించినప్పటికి తన పూర్వరూపము విడువనట్లు చెప్పినను నది పూర్వరూపాలంకారమనబడును. ఈ పద్యమున పెద్ద పాదములందు సముద్రుడెపుడెపుడు తన పూర్వరూపమును కోల్పోయెనో తెలుపబడి దానిని మరల యయాతి దానధారలచే పొందినట్లు చెప్పబడినది గాననిది పూర్వ రూపాలంకారమగును.

96.క॥ ఆరాచవేల్పు రాయడు
వేరపు బే రెందునైన వినబడు కుండం
దోరముగ జిల్వ ఱేనికి
నూరటగా బుడమి దాల్చి యొకనా డంతన్ - 96

టీక :- ఆరాచ వేల్పు రాయడు = ఆయొక్క యయాతి అనుభూవేంద్రుడు, వేరపు బేరు = వైరమను పేరు, ఎందునైన, విన్పందుర్ + ఐనన్ = ఎక్కడనైన, వినబడకుండ, తోరముగన్ = స్థూలయగుట వలన; అనగా మిక్కిలి బరువైన దగుటచేత, చిల్వఱేనికి = ఆదిశేషునికి, నూరటగాన్ = విరామము కలుగు నట్లుగా, పుడమి దాల్చి = భూమిని భరించి, ఒకనాడు, అంతన్ = అంతట,

తా :- ఆయయాతి రాజేంద్రుడు తన రాజ్యమున వైరమను పేరెక్కడను వినబడకుండ జేసి, అనగా శత్రువులు లేకుండ చేసి బరువైన దగుట చేత నీభూమి యాదిశేషునకు భరించుటకు కష్టమనిపించకుండ నతని కూరట కలుగునట్లుగా తానే భరించుచు నొకనాడు -

విశే :- భూమిని ఆదికూర్మము, శేషుడు ఆదివరాహమూర్తి సప్తకుల పర్వతములు, అష్టదిగ్గజములు భరించుచున్న వని పురాణ ప్రసిద్ధి కనుక సమర్థులైన ప్రభువులను పైవానికి భారవముగాకుండ భూమిని భరించుచున్నారని చెప్పుట కవి సంప్రదాయము.

97.సీ॥ పదియాఱు వన్నెల పసిడి గోడల చెంత
దిరమైన కస్తురి తీనియలును
బాపమే పరిపచ్చ పలకల జెంగల్వ
దొరఱాల దీర్చిన దూలమాలును
మగమానికంబుల తెగల బోదెలచేత
పగడంపు గొప్ప కందిముల గములు

బెద్దతామర కెంపు బిగి పట్టియల చేత
సొబగైన ముత్యాల సోరణములు

తే॥ వాసి యేనుంగు కొమ్ముల జేసినట్టి
బోరు తలుపుల చేత గప్పురపు బనుల
యరగులును మించు కొల్వునుప్పరిగెలోన
బరగు గొజ్జంగి చల్వ చప్పరమునందు - 97

టీక :- పిదియారు వన్నెల పసిడి = పదారు వన్నెల బంగారముయొక్క, - బంగారమును పదారు వన్నెలని ప్రతీతి. కాని యిపుడు మనకు లభించునది పన్నెండు వన్నె బంగారము మాత్రమే- అదిగూడ లోపించి యిపుడు పన్నెండు క్యారట్ల బంగారము వచ్చినది - గోడలచెంత = గోడల సమీపమున, తిరమైన = స్థిరమైనట్టి కస్తురి తీనియలును = కస్తూరితో వేసిన, చిన్న యరుగులు గలిగి, పాపమే పరిష్క పలకలన్ = పాములే ఆహారముగా కలిగిన గరుడుని పేరగల పచ్చని పలకలచేత. (పూర్వము సర్పభయము లేకుండుటకై తమ మేడల బయట భాగములను గరుడ పచ్చలతాపడము చేయుచుండిరి) చెంగల్వ = ఎఱ్ఱకలువల యొక్క, తోరణాల్‌దీర్చి = మంగళ తోరణములు కట్టిన, దూలములు, మగమానికంబుల తెగల = వివిధ బేధములైన వజ్రముల యొక్క, బోదెల చేతన్ = స్తంభములకు ఆసరగా నిలిపెడు లావైన దూలపు తునకల చేత నిలిపి నట్టి, పగడంపు = పగడములచేత చేయబడిన, గొప్పకంబముల గములన్ = గొప్పనైన స్తంభములు, పెద్ద = గొప్పదైన, తామర కెంపు = పద్మరాగ మణితో చేయబడిన, బిగి = బిగుతుగల, పట్టియల చేత = పట్టెలు అనగా చుట్టు అమర్చిన పట్టెల చేత, సొబగైన = అందముగా కనిపించు ముత్యాల సోరణములు = ముత్యములు తాపిన వాతాయనములు అనగా కిటికీలు, వాసి = మేలైన, ఏనుంగుకొమ్ములన్ = ఏనుగు దంతములచేత జేసినట్టి, బోరుతలుపులచేతన్ = పెద్దతలుపుల చేతను, కప్పురపు పనులన్ = కర్పూరపు ముగ్గులు మొదలైన దానిచేత, యరుగులును, గలిగి మించు = ప్రకాశించు కొల్వునుప్పరిగెలోన = సభదరునట్టి, ఉప్పరిగ = (ప్ర. ఉపకారికా) - సౌద, మందు పరగు = ఒప్పునట్టి, గొజ్జగి = ప్ర. కుబ్జక, గులాబి పూవులుయొక్క, చల్వ = చల్లని, చప్పరమునందు = సభామంటపమందు -

ఈ పద్యమున యయాతి మహారాజు కొలువు కూటము వర్ణింపబడినది.

తా :- ఆభవనము పదారువన్నె బంగారపు గోడలతో కట్టబడి యుండెను. ఇంటిచుట్టు వెలుపలి వైపున గోడలకు గరుడపచ్చల పలకలు తాపి - ఇంటిలోనికి సర్పములు రాకుండుటకై గోడలకు గరుడ పచ్చలు తాపుట పురాణ సంప్రదాయము - లోపలివైపున కస్తూరి తిన్నెలు వేసి యుండిరి. భవనమున పగడపు కంబములు వివిధములైన మాణిక్యపు బోదెలతో నిలుపబడి యుండెను. వానిపైగల దూలములకు ఎఱ్ఱకలువల దండలు కట్టిరి. గోడలకు పద్మరాగపు మణుల, చట్రములతో బిగించిన ముత్యాల వాతాయనములుండెను (వెంటిలేటర్స్). గవనికి ఏనుగు దంతములతో చేసిన పెద్దపెద్ద తలుపులుండెను ఆసౌధముపై ఒక గులాబీల చప్పరము క్రింద కర్పూరపు పిండితో ముగ్గులు పెట్టిన యరుగులుగల సభామంటపమున -

''అలం- ఉదాత్తము''

ఇందు యయాతి మహారాజా యొక్క కొలువుకూటము వర్ణింప బడినది. ఇది ఉదాత్తాలంకారమున వస్తుసమృద్ధి యనుమొదటి భేదమునకుదాహరణమగును.

98. సీ॥ అలవేల్పు దొర పంపినట్టి తలంపు ఱా
పనియడపం బొక్క పడతి దాల్ప
జెలిమితో దామర చెలిపట్టి యనిచిన
బలున రంజీ యొక్క చెలువ పూన
గడగి గాడుపు ఱేడు కానుకంపిన తెల్ల
వీచోపు లద్దఱు వెలదు లిడగ
బైడి రాయడు కూర్మి బనిచిన నెత్తమ్మి
కెంపుగిండి యొకర్తు కేల నలమ
తే॥ వెండియును నేల చెఱగుల నుండు రాజు
లరికి నిచ్చిన కన్నియ లడకు వలను
గదిసి కట్టడ యగు నూడిగములు నేయ
బచ్చసింగంపు గద్దియపై జెలంగె - 98

టీక : అల = ఆయొక్క, వేల్పుదొర పంపినట్టి = ఇంద్రుడు పంపినట్టి, తలంపురా పనియ పనియడ పంబు తలంపురాయి = చింతామణి - చింతామణి యను రత్నముతో చేసిన వక్కల పెట్టె = ఒక్కపడతి దాల్ప = ఒక యువతి ధరించగా, చెలిమితో

స్నేహముచేత, తామర చెలిపట్టి, పద్మబాంధవుడైన సూర్యకుమారుడు యముడు, యనిచిన = పంపినట్టి, బలు సురంటీ = గొప్పనైన వీవన, ఒక్క చెలువ బూన - చెలువు = అందము, చెలువ = అందముగలస్త్రీ - ఒక స్త్రీ ధరించగా కడిగి = ప్రయత్నించి, అనగా మిక్కిలి యత్నము జేసి, గాడుపు టేడు = వాయుదేవుడు, కానుకంపిన - కానుకగా అందిన, తెల్ల = ధవళమైన, వీచోపులు = (వీచు+చోపు), చోపుట = ఈగలు మొదలైన వానిని తోలుట, చోపు = జోపెడు సాధనము, వీచోను = విసరుచు (ఈగలు మొదలైన వానిని తోలు చామరము,) తెల్లవీచోపులు = వింజామరలు, ఇద్దరు వెలదు లిడగ = వెలది, వెలి = తెల్లని వెళుదు = త. నిర్మలము, వెలఁది = నిర్మలమైన యాడుది. ఇద్దరు యువతులు విసరు చుండగా, పైడిరాయడు = స్వర్గము యొక్క ధనమున కధికమైన కుబేరుడు, కూర్మిౕ+పనిచిన = ప్రేమతో పంపిన, నెత్తమ్మి, కెంపుగిండీ = నెఱ + తమ్మి = నెత్తమ్మి తమ్మికెంపు = పద్మరాగము, నెత్తమ్మికెంపు గిండి = పద్మరాగపు కెంపుతో చేయబడిన పెద్దదగు ఝారీ చెంబు, యొకర్తు = ఒకతె, కేలౕ + అలమ = చేతితో పట్టుకొనగా, వెండియును - మరియు నేలనాలుగు చెరగుల = భూమియందలి నలుదిక్కుల నుండు రాజులు, ఆరికి = మర్యాదలకొరకై, ఇచ్చిన కన్యలు, అడకు వలను గదిసి = వినయమున చేరి, కట్టడయగు = తమ తమకు నియమితమగు, ఊడిగములు సేయ - సేవలు చేయు చుండగా, పచ్చ = ఆకుపచ్చనైన, సింగపు గద్దెపై = సింహాసనముపై, చెలంగె = సంతోషమున నొప్పెను.

తా:- ఇంద్రుడు పంపిన చింతామణి తో చేయబడిన అడపము ఒక పడతి, యముడు పంపిన సురటి ఒక చెలువ ధరించి నిలువ వాయుదేవుడు ప్రయత్నించి పంపిన వింజార మరలోక యిద్దరు యువతులు వేయుచుండగా, కుబేరుడు పంపిన పద్మ రాగపు ఝారీ చెంబు ఒకతె పట్టుకొని నిలువగా, నింకను నేల నాలుగు చెరగుల నుండి యాయా మహారాజులు మర్యాదకై పంపిన యువతులు తమతమకు నియమితమైన పనులు వినయమున సమీపించి చేయు చుండగా ఆయయాతి మహారజు పచ్చల సింహాసనముపై కూర్చుండెను.

విశే:- ఇందు దేవతలు తూర్పు మొదలుకొని ప్రదక్షిణ క్రమమున చెప్పబడిరి. నాచనసోముడుత్తర హరి వంశమునరకుని దండయాత్రను ధనదాంతః పురతారహారములు అనియ ప్రదక్షిణముగా వర్ణించి యతని పరాజయమును సూచించెను.

99.క॥ మానికపు సొమ్ము రంగులు
పూనిక నరుదైన మేని పొలుపునకు గదుర్౯
మానని యారతులై తగ
దా నొకమరు డనగ నెఱపు దనమున నొఱపై - 99

టీక :- మానికపు సొమ్ము రంగులు = రత్నాభరణముల యొక్క కాంతులు, పూనికన్ = ధరించనందువలన, అరుదైన = ఆశ్చర్యకరమైన, మేనిపొలు పునకున్ = అతని శరీర సౌందర్యమునకు, కడున్‌మానని యారుతులై తగన్ = మిక్కిలిగా ఎడితెగని నివాళులై యొప్పుచుండగా, తానొక మరుడనన్ = తాను ఒక మన్మధుడనగా, ఎఱుపు దనమున నొఱపై = ఎఱుపెక్కిన కాంతితో ప్రకాశించుచు.

ఆయయాతి మహారాజు రత్నాభరణములు ధరించి వాని కాంతులు అరుదైన తన యొక్క శరీరకాంతికి ఆరిపోవని మంగళ హారతులై యొప్పుచుండగా తానొక మన్మధుడనగా రత్నకాంతులతో నెర్రగా ప్రకాశించుచు -

100.సీ॥ ఆహా! పరాకు! విదేహుని కానుకీ
సొబగైన యట్టి కస్తురి మెకంబు
లెచ్చరికయ్యా! మాహిష్మతి యేలువా
డనిచినా డీ చిన్నయలరు బోండ్ల
నవధారు! కుంతలుం డంపిన వీ యాము
పొగరుచే మీరు నేనుగుల గములు
చిత్తగింపుము సామి ! సింధురా జంపెను
వడిమీఱు నీమేటి వారువముల
తే॥ ననుచు బేర్కొని కటికవాం డ్రగ్గలంపు
రవళిగా జూపి తెలుపగా దవిలి వాని
నల్లనల్లన గనుగొంచు నుల్లసిల్లి
యపుడు పేరోలగం బుండె నయ్యయాతి - 100

టీక :- అయ్యయాతి = ఆయయాతి మహారాజు, ఆహా! పరాకు ఈ సొబగైన.యట్టి = ఈ అందమైన, కస్తురి మెకంబులు = కస్తురి జింకలు, విదేహుని కానుక = మిథిలా చక్రవర్తి యొక్క కానుక, అయ్యా! హెచ్చరిక! ఈచిన్ని యలరు బోండ్లన్ = ఈలేతవయసు పూబోండ్లను, మహిష్మతి యేలువాడు = మాహిష్మతీ పురము

నేలు మహారాజు; అనిచినాడు = అంపినాడు, అవధారు! ఆము = పొగరు, చేమీరు = మదము యొక్క గర్వముతో అతిశయించిన ఈ , ఏనుంగులగములు = ఏనుగుల గుంపులు, కుంతలుండంపినవి = కుంతల దేశపు మహారాజు పంపించినవి, సామీ! చిత్తగింపుము, వడిమీరు = వేగమున నన్నిటిని మించిన, ఈ మేటి వారువములు = ఈపెద్దగుఱ్ఱములు, సింధు రాజంపెను = సింధూదేశపు మహారాజు పంపెను. అనుచు, పేర్కొని = పేరులు బెట్టి తెలుపుచు, కటికవాండ్రు – కటికము = బెత్తము, కటికవాండ్రు = బెత్తములు ధరించిన వారు; అగ్గలం పురవళిగాఁ = గొప్పధ్వనితో, చూపి = ఆయామహారాజు తెలుపగా = వానివాని విశేషములు వివరించు చుండగా, తవిలి = ఆసక్తితో వాని యందు మనసు లగ్నమై, వానిఁ+ అల్లనల్లనగను గొంచు, వానిని మెల్లమెల్లగా చూచుచు, ఉల్లసిల్లి = సంతసించి, అపుడు, పేరోలగంబుండె = నిండు కొలువున నుండెను.

తా॥ ఆయయాతి మహారాజు బెత్తములు పట్టుకొనిన సేవకులు ప్రభూ! పరాకు ఈ ఈ కస్తూరి మృగములు మిథిలా మహారాజు పంపినది. మదగర్వముతో నున్న యీ యేనుగులు కుంతల ప్రభువు పంపినవి. వేగముగల ఈ పెద్ద గుఱ్ఱములు సింధురాజు పంపినవి. ఈ లేత వయసుగల పూబోడులు మహిష్మతీ పురప్రభువు పంపిన వారు. అని పెద్దగా చెప్పుచు వివరించు చుండగా నతడు వాని వాని నాసక్తితో మెల్లమెల్లగా జూచుచు నిండు కొలువున నుండెను.

విశే:– మిథిలా నగరము కస్తూరి జింకలకు, కుంతల దేశ మేనుగులకు, సింధు దేశము గుఱ్ఱములకు ప్రసిద్ధి. విదేహ సీతాదేవి పుట్టిన దేశము. దీనినిపుడు బీహార్ అందురు. భారతదేశమున ప్రాచ్యవనము, చేదికరూషక వనము, అంగరేయవనము, కాళింగక వనము, దాశార్ణక వనము అపరాంతక వనము, సౌరాష్ట్రవనము, పంచనదవనము అను నెనిమిది అరణ్యములు గజముల యుత్పత్తి స్థానములుగా గుర్తింపబడినవి. వీనియందు నాలుగవ దైన కాళింగక వనగజము లుత్తమమైనవిగా ఏడవదైన సౌరాష్ట్రవన గజములు అధమ మైనవిగా తక్కినవి మధ్యమ మైనవిగా గుర్తింపబడినవి.

కుంతలము నిపుడు బళ్లారి భాగముగాన కర్నాటక మందురు. అది దాశార్ణక వనమున చేరును. కనుక గజములు పుట్టు స్థాన మగుట వలన నాదేశ ప్రభువు గజములంపినట్లు చెప్పబడినది.

కాంభోజ, సైంధవ, ఆరట్టజ, వనాయుజములైన యశ్వములు సమరోపయోగమున కుత్తమములని, బాహ్లీక, పావేయక, సౌవీరక తైతలములు మధ్యమములని కౌటిల్యుని మతము, సింధూ దేశ మశ్వములకు ప్రసిద్ధము. అందువలన గుఱ్ఱములకు సైంధవములని పేరు కలిగినది. కనుక నాదేశ ప్రభువు గుఱ్ఱములను పంపినటుల చెప్పబడినది.

మాహిష్మతీ పుర మగ్ని దేవుని యత్తవారి దేశము. అగ్నిదేవుని భార్య స్వాహాదేవి, మహిష్మతీ ప్రభువు నీల ధ్వజుని కూతురు. మహిష్మతీ పురవనితలకు జారత్వ దోష మంటకుండునట్లగ్ని దేవుని వరము కలదు. కనుక వారు నిత్య పరిశుద్ధులు. అందువలన మహిష్మతీపుర ప్రభువు యయాతికి కానుకగా యువతులను బంపుట గూడ తగినదే. ఇట్లీపద్యమున కవి ఆయా దేశవాసులు పంపిన వానిని చెప్పుటలో తనయొక్క లోకజ్ఞతను, పురాణ జ్ఞతను పాటించి యౌచిత్యమును వెలార్చెను.

101.వ॥ అంత! **101**

టీక :- అంత = ఆసమయమున -

102.సీ॥ గురివెంద పట్టెళ్లకును దోడు సందిళ్ల
బీలిదండలు గూర్చి చాల దొడిగి
యెడనెడ బికిలి పూ లిడిన సంకుల పేర్లు
కోరెంద పూసల గూడ దాల్చి
గుఱుతుగా మెఱయు జేగురు బొట్లమీద దం
గేటి పూబోరలు రాగిల్ల దాల్చి
బరువైన పాఱు టాకుల బొట్ట దట్టీల
దిండుగా దీగెల పిండు చుట్టి
తే॥ కురుచ చేతులు మిడిగ్రుడ్లు కఱకు మీస
లిరులు గ్రమ్మెడు మేనులు నిరుకు బోర
లేచమాటలు జడగొన్న పీచు గురులు
గలుగ నెఱుకులుగ బొడగనగ వచ్చి - **102**

టీక : గురివెంద పట్టెళ్లకును లోడు = గురిగింజలతో కుచ్చిన పలక దండలకు తోడుగా, సందిళ్లన్ = బాహువులకు, పీలి దండలు గూర్చి, పీలి = నెమిలి, పీలిదండలు, నెమిలి ఈకల దండలు జతగా కూర్చుకొని, చాలన్+ తొడిగి = ఎక్కువగా ధరించి, ఎడనెడన్ = అక్కడక్కడ, పికిలిపూలు = పికిలి పిట్టలతో కీలక్రింద నుండెడి యెఱ్ఱని

ఈకల కుచ్చులు, ఇడిన = కూర్చిన, సంకుల పేర్లు= శంఖముల దండలు, కోరింద పూసలుఁ గూడ = కోరింద అను చెట్టు కొమ్మలతో చేసికొనిన పూసలను గూడ, తాల్చి = ధరించి, గురుతుగా మెరయు = చక్కగా మెరయు చున్న, బేగురు బొట్లమీద = ఎఱ్ఱనైన శిలాద్రవపు తిలకలములపై, తంగేటి పూబొరలు = తంగేడు పూల రేకులు, రాగిల్లఁ + దాల్చి = ఎఱుపెక్కిన వగునట్లుగా ధరించి, బల్విన = విశాలమైన, పాఱుటాకులఁ = పండుటాకులను, పొట్టదట్టీలఁ = దట్టీవలె పొట్టచుట్టు చుట్టుకొనిన వానిపై దిండుగా = ఎత్తుగా, తీగలపిండు = తీగల సమూహము, చుట్టి, కుఱుచ చేతులు = పొట్టిచేతులు, మిడిగ్రుడ్లు = పైకి తేలిన కనుగ్రుడ్లు, కఱుకు మీసలు = బిరుసుగల మీసములు, ఇరులుగ్రమ్మెడు మేనులు = చీకట్లు వ్యాపింపజేయు శరీరములు, అనగా మిక్కిలి నల్లని మేనులు, ఇరుకు బొరలు = విశాలముగా లేని బొమ్మలు, జడిగొన్న = దట్టమైన, పీచుకురులు = అల్లుకొనిపోయి పీచుకట్టిన వెంట్రుకలు, ఏచమాటలు = యాసబాసలు, గలుగఁ = ఒప్పగా, ఎఱుకులు = అడవిజాతి వారైన శబరులు, తగఁ = తమకు తగినట్లుగా, కనుగొన వచ్చి = మహారాజును చూచుటకు వచ్చి.

తా : దండ చేతులకు గురిగింజల దండలతో పాటు నెమిలి ఈకల దండలు గూడ కట్టుకొని, నడుమనడుమ పికిలిపూలు కూర్చి శంకులు మరియు కోరింద పూసలు కలిపి గ్రుచ్చిన దండలు వేసికొని, నొసట జేగురు బొట్లు పెట్టి వానిపై తంగేడు పూల రేకులంటించుకొని పొట్టచుట్టు వెడల్పయిన పారుటాకులు ధరించి వానిపై దిండుగా తీగలు చుట్టుకొని నల్లని దేహములతో, పొట్టిచేతులతో – ఆజాను బాహుత్వము మహాపురుషలక్షణము. నలచక్రవర్తికి కర్కోటకుడు కరిచి రూపువూరినపుడు చేతులు పొట్టివయ్యెను. అందుచేతనే అపుడతనిని బాహుకుడనిరి–

మిడిగ్రుడ్లతో; కరుకు మీసాలతో, ఇరుకటమైన ఎదలతో ఎద విశాలముగా నుండుట గూడ మహాపురుషలక్షణము – దట్టముగా నుండి పీచుగట్టిన కురులతో ఇటుల తమకు తగిన వేషమున కొందరు అడవి జాతి ఎరుకులు యాయాతి మహారజాను చూడవచ్చిరి – వచ్చి – యాయెరుకులు.

''అలం–స్వభావోక్తి – సహోక్తి''

ఈ వచన జాతికి మూలపురుషుడైన నిషాదుడు వేన చక్రవర్తి యొక్క ఊరు మదనము నుండి పుట్టినట్లు భాగవతము చెప్పును. అతనిని పోతన -

సీ॥ ఘనకాక కృష్ణ సంకాశ వర్ణుండును
  హ్రస్వావయవుడు మహాహనుండు
హ్రస్వ బాహుండును హ్రస్వపాదుండును
  నిమ్ననా సాగ్రుండు నెఱయు రక్త
నయనుండు దామ్ర వర్ణశ్మశ్రు కేశండు
  నతిదీన వదనుండు నైనయట్టి
యొక్కని షాద కుండు దయించి యేమిసే
  యుదునని పలుకుచు నున్న జూచి
వరమునులు నిషీద యనుచు బలుకుటయును
దానవాడు నిషాధాభి ధానుడయ్యె
నతని వంశ్యులు గిరికాన నాళివేను
కల్మషము దెల్పుచుండిరి కడఁక మఱియు

అని వర్ణించెను. భాగ. 4-433

''స్వభావోక్తి - సహోక్తి ''

జాత్యాదికమైన స్వభావమును వర్ణించిన యెడల నది స్వభావోక్తి యనబడును. దీనికి జాత్యాలంకార మని మరియొకపేరు.

ఈ పద్యమున గురివెంద పట్టెళ్లకును తోడు - సందిళ్ల పీలి దండలు గూర్చి చాలదొడిగి యని యాటవికుల వేషము స్వభావ సిద్ధముగా చెప్పబడినది. గాననది స్వభావోక్తి యగును.

ఏవేని రెండు వస్తువులను సహృదయ రంజకముగా సహభావము చెప్పిన ఎడల నది సహోక్తి యనబడును. ఈ పద్యమున గురివెంద పట్టెళ్లకును తోడు - అని పీలిదండలకు సహభావము చెప్పబడినది. సీసపాదములన్ని ఒకే యెత్తు నడతో నడిచినవిగాన అందువలన నిది సహోక్తి గూడనగును.

103. ఆ॥ పికిలి పూలు బూతపిల్లు లేనిక కొమ్ము
లలరు దేనె పెద్ద వెలగ పండ్లు
వెదరు బ్రాలు ఱాతి వదనికల్ గసగసాల్
జల్లి మెరకపు జాలు జాఱుపప్పు - 103

టీక :- పికిలిపూలు = పికిలి పిట్టల తోకలక్రింద కుచ్చులు, బూత పిల్లులు = పునుగు పిల్లులు, ఆ. బూతపిల్లినాగను, గమ్మపిల్ల నాగను, బున్గ పిల్లి యటంచన జెల్లు గంధమార్జాల నామంబు ఆం. భా. 2.24 ఏనిక కొమ్ములు = ఏనుగు దంతములు, అలరు తేనెలు = (తీయ+ నూనె = తేనె) అలరు తేనెలు = అచ్చమైన తేనెలు, పెద్దవెలగ పండ్లు = గొప్పగొప్ప వెలగ పండ్లు, వెదురు బ్రాలు = వెదురు బియ్యము, ఱాతివదనికల్ = రాతిపై మొలిచిన బదనికలు, గసగసాల్ = గసాలు, జల్లి మెకపుజాలు = చమర మృగముల యొక్క వాలగుచ్ఛములు సమూహము, చార పప్పు = మొర్లిపప్పు -

తా :- పునుగుపిల్ల, జవ్వాది పిల్లి, పులి, ఎలుగు, సివంగు,ల యొక్క కూనలు, కస్తూరి జింక మామూలు జింకల యొక్క పిల్లలు, కారెనుము, మునుబోతుల యొక్క దూడలు, అడవిపంది గున్నలు, కుందేళ్లు, పికిలిపూలు, ఏనుగు దంతములు తెల్లని నల్లని చమర మృగముల యొక్క తోకలు అనగా చామరముల, సవరములు అచ్చమైన తేనెలు, వెదురు బియ్యము, చారపప్పు, పెద్దవెలగపండ్లు, గసాలు, ఱాతి బదనికలు మొదలైన అడవిలో గలుగు వస్తువులన్నిగుంపులు గుంపులుగా తీసికొని వచ్చి యయాతి మహారాజునకు చేతికానుకగా నిచ్చి చేతులు జోడించి నడినెత్తిపై చేర్చి సాష్టాంగ పడి లేచి యిట్లనిరి.

క. పతికడకు తన్ను గూర్చిన- సతికడకును వేల్పుకడకు సద్గురు కడకున్ సుతుకడకు రిత్తచేతుల- మతిమంతులు చనరునీతి మార్గము సుమతీ అని సుమతిశతకనీతి -

104. మ॥ పులికూనల్ సవరాలు గస్తురి మెకంబుల్ లేళ్ల గుందేళ్లుబం
దులు గార్పోతు లెలుంగు లేదులును మన్నుంబిళ్లుజివ్వంగి
పిల్లల మొత్తంబు జవాది పిల్లులు మొదల్గా గానలో వానిగుం
పులగై కానుక చేసి యాొదలల మోడ్పుం జేతులం గూర్చుచున్ - 104

టీక :- పులికూనల్ = పులిపిల్లలు, సవరాలు = చామరములు, కస్తురి మొకంబుల్ = కస్తూరి జింకలు, లేళ్లు = సామన్యమైన జింకలు, కుందేళ్లు, పందులు, కార్పోతులు

= అడవి దున్నలు, ఎలుంగులు = ఎలుగుబంటులు, ఏదులు, మన్నుంబళ్లు, పిడి = పెంటి, పిడులు, పిళ్లు = మనుబిళ్లు, పెంటి మనుబోతులు, చివ్వంగి పిల్లల మొత్తంబులు సివంగి పిల్లలు, జవాది పిల్లులు = జవ్వాది పిల్లులు – మొదల్గాఁ = మొదలగునట్టి, కానలో వాని అడవిలో గలుగునట్టి, గుంపుల గైకొని = సమూహములను తీసుకొని, కైకానుక చేసి = చేతికిచ్చెడు కానుకగా బెట్టి, మోడ్పు జేతులఁ = ముకుళించిన హస్తములను, ఔదలఁ= నదినెత్తిపై, గూర్చుచుఁ = చేర్చుచు –

తా :- పునుగుపిల్లి, జవ్వాదిపిల్లి, పులి, ఎలుగు, సివంగు, ల యొక్క కూనలు, కస్తూరి జింక మామూలు జింకల యొక్క పిల్లలు, కారెనుములు, మనుబోతుల యొక్క దూడలు, అడవిపంది గున్నలు, కుందేళ్లు, పికిలిపూలు, ఏనుగు దంతములు తెల్లనినల్లని చమర మృగముల యొక్క తోకలు అనగా చామరములు, సవరములు, అచ్చమైన తేనెలు, వెదురు బియ్యము, చారపప్పు, పెద్దవెలగ పండ్లు గసాలు, జాతిబదనికలు మొదలైన అడవిలో గలుగు వస్తువు లన్ని గుంపులుగుంపులుగా తీసికొని వచ్చి యయాతి మహారాజునకు చేతి కానుకగా నిచ్చి చేతులు జోడించి నడినెత్తిపై చేర్చి,

క:- పతికడకు తన్ను గూర్చిన– సతికడకును వేల్పుకడకు సద్గురు కడకుఁ సుతుకడకు రిత్తచేతుల– మతిమంతులు చనరునీతి మార్గము సుమతీ అని సుమతిశతకము.

105.వ॥ వాగి మ్రొక్కి లేచి యిట్లనిరి – **105**

టీక :- వాగిమ్రొక్కి = సాష్టాంగపడి, లేచి యిట్లనిరి

106.సీ॥ కొండ మల్లయ్యచే నుండు నందురు కాని
జింకను గాన మేవంకనైన
నొకటియా జమునకు నున్న దందురు కాని
కాఱెను పోతును గాన మెచట
నలకంబమయ్య తానైన దేమో కాని
సింగ మొక్కటి యైన సెలలలేదు
గాలి దేవరకును గల దటందురు కాని
యిట్టి నొక్కటి జూచి యె ఱుగ మెందు

తే॥ హా శినేటేట మీరు వేటాడు కతన
నిప్పు డేడాది గోల్ సామి యేగు దేమి
నేల ఈనిన తెఱగున నోలి నెపుడు
గడమి నెడ యాక తిరుగు మెకంబు లడవి - 106

టీక :- సామీ = ప్రభువు, హళిఁ = ఆసక్తితో ఏటేట మీరు, వేటాడు, కతన్ - కారణమున, కొండవల్లయ్యచే శ్రీశైల మల్లికార్జునుని చేతిలో, నుండు నందురుగాని, ఏవంకనైన = అది తప్ప మరేదిక్కు గూడ జింకనుగానము. ఆ. జింకలేడన (లేడి+అన) మృగి చెలగు - సాం-తిర్య74 ఆజమునకు = ఆయమధర్మరాజుకు ఒకటి, యన్నదందురుగాని, ఎచటను, కారెను పోతును, కారు + ఎనుపోతు, కారు = కాదు అడవి, ఎనుము + పోతు = ఎనుపోతు, కారెనుపోతు = అడవి దున్నను. ఎచటఁ + కానము, అల = ఆ యొక్క, కంబమయ్య = స్తంభోద్భవుడైన నరసింహస్వామి, తానైనదేమో కాని = తాను అయినది ఎంతనో కాని, సింగము ఒక్కటియైన, సెలలఁ = ఈ కొండ లందు, లేదు, గాలి దేవరకును = వాయుదేవునకు, కలదట + అందురుగాని. ఇట్టిని = కృష్ణసారము, ఇట్టియ - పార్శ్వము నల్లని వీపు ఎరుపు తెలుపు గలిగిన ప్రక్కలుగల జింక.

సీ॥ ఇట్టి - నులికొమ్ము మెకమన వెలయు కృష్ణ మృగంబు - సాంబ - త్యో74 ఎందుఁ - చూచి, ఎరుగము, కాని ఇపుడు, ఏడాదిగోల్ = ఏడాదిగోలె = ఏడాది నుండి, ఏగుదేమి = రాని కారణమున, తెంచు ధాతు వగ్వాదుల కను ప్రయుక్తంబగు, నగుచో నుత్వంబు పయిని దాని తకారంబునకు దకారంబగు - బాల క్రి. 110 ఏగు + తెంచు ఏగుదెంచు - వ్యతిరేక భావంబున మి2+యగు - క్రి. 37 ఏగు దెంచు + మీ = ఏగు దెంచమి, తే తేరులు తెచ్చునకుగు క్రి. 93 ఏగుదేమి. నేల యీనిన తెరగున = భూదేవియే కనినట్లు అనగా మిక్కిలిగా నసుట, ఓలిఁ = ఒప్పుచు, ఎపుడుఁ = ఎపుడు గూడ, కడిమి = ఆధిక్యము చేత, ఎడయాక = సందులేక, అడవిన్ = అడవియందు, మెకంబులు = మృగంబులు, తిరుగుఁ = తిరుగు చుండును.

తా :- స్వామీ మీరు ఏటేట నాసక్తితో వేటాడు చుండుటవలన మన పొలమున నొకజింకను గాని సింగమునుగాని కారెనుపోతునుగాని, యిట్టినిగాని, కానము.

శ్రీహరి హిరణ్యకశిపుని వధించునపుడు సగము సింగపు రూపు ధరించెనని విందుము. లేడి మల్లికార్జునుని చేతియందు, కారేను పోతు వాహనముగా యముని చెంత, ఇఱ్ఱి వాహనముగా వాయుదేవుని చెంత నుండునని విందుము. ఇవన్నియు నెంత నిజమోగాని ఇపుడేడాది కోలిగ మీరు వేటకు రాని కారణమున పైజంతువులు నేల ఈనినట్లు మందలు మందలై ఎటుజూచినను యెడములేక తిరుగుచున్నవి.

విశే :- ఈ పద్యమున జింక – ఇఱ్ఱి యని హరిణ పర్యాయములు రెండు వాడబడినవి.

సంస్కృతమున గోవు – వృషభము, దంతి, కరిణి, కేసరి, సింహిక అని తెలుగున ఆవు – ఎద్దు, పెయ్య, కోడె, గేదె, దున్న, చింబోతు మేక, పెట్ట, పుంజు అని యిటుల తిర్యక్కులలో పోతు పెంటి పేర్లు వేరువేరుగా నున్నవి. అటులే హరిణ జాతిలో జింక – యనగా పెంటి యిఱ్ఱియనగా పోతు గాని కవి యిందు జింక పదమును సామాన్య జాతి వాచకముగా వాడెను.

జాషువ పిరదౌసి కావ్యమున – ఉ. ఆనతినంది సొంపుతడి యారని – అను పద్యమున ఉ. సుల్తానుల రాజ్యపాలన విధానము తండ్రి సుబక్త గీనుము.

స్నీనిన లేటి కొమ్మదని యించుట లాదిగలట్టి ఘట్టముల్పిర 1-38 లేటికొమ్మ (లేడి + కొమ్మ) లేడియను పదమును హరిణ సామాన్య ముగా వాడెను. లేడి యనగనే పెంటిది కనుక దానిని కొమ్మ యని విశేషింప నవరసముండదు. అయినను నిరంకుశాః కవయః అని సూక్తి కనుక వానివాని వ్యుత్పత్తిని లేదా రూఢిని ప్రధానముగా జేసికొని కవులు సామాన్యమును విశేషముగా విశేషమును సామాన్య వాచకముగా వాడుచుండుట పరిపాటి.

సుబక్తగీను గజనీమహమ్మదు తండ్రి అతడొకపుడు వేటకు వెళ్లి ఒక లేడి కూనను పట్టుకొని గుఱ్ఱముపై బెట్టుకొని వెళ్లుచుండ తల్లి జింక గుఱ్ఱము వెనుక పరుగెత్తి రానారంభించెనట. అది చూచి ఆయన యాతల్లిప్రేమ కాశ్చర్యపడీ ఆకూనను విడిచి పెట్టెనట. ఆ విషయ మీపద్యపాదములందు స్మరింపబడినది.

107.తే॥ చేలు బోళ్లను బీళ్లను జేరి చొచ్చి
పైరు పచ్చులు మేసి యప్పొట బోక
పల్లియలు సొచ్చి తోటలు పాడుచేసి
కావరంబున గదుపులై గాసి చేయు - 107

టీక :- చేలు, బోళ్లను = బోడులు - ఎత్తుగ ప్రదేశములు, బీళ్లను = బీడులను, చెర చొచ్చి = ప్రవేశించి, పైరు పచ్చలు = చేలు, మేసి యప్పాటఁ + పోక = అంతటితో నూరుకొనక, పల్లియలు = పల్లెలు చొచ్చి, తోటలు పాడుచేసి, కావరంబున = పొగరున, కదుపులై = మందలు మందలై, గాసిచేయు = బాధపెట్టుచున్నవి.

తా :- ఆయడవి జంతువులు చేలు, మిట్ట ప్రదేశములు, బీడులు, ప్రవేశించి అచటగల పైరులన్నిటిని మేసి, అంతటితోనైన విరమించక పల్లెలలో ప్రవేశించి తోటలను పాడుచేయుచు పొగరుతో మందలు మందలై మమ్ము బాధించు చున్నవి.

విశే :- బోళ్లు, బీళ్లు - పైరు పచ్చలు - ఇవి జంట పదములు. జంటపదములు - ఊఁత పదములు, జాతీయములు, భాషీయములు, సూక్తులు - సామెతలు - ఇవి శైలీసామగ్రి క్రింద జేరును.

108.క॥ ఏటికి జెప్పగ సామీ !
మీటి నజము రొలుకునట్టి మొగములు మిగులఁ
గాటమ్ము లైన యమ్ములు
నాటక తిరుగాడు బొలము లన్నియు దామై - 108

టీక :- ఎటికి చెప్పగ సామీ = సామీ చెప్పనేటికి, మీటినఁ = గోటితో తాకిన చాలును, చము రొలుకునట్టి = క్రొవ్వుచిందు నట్టి, మెకములు = మృగములు, మిగులఁ గాటమ్ములైన = మిక్కిలి వాడియైన, అమ్ములు నాటక = బాణములు తగులుట లేక - అనగా వేటాడకుండుటచే, పొలము లన్నియు తామై = పొలము లన్నియు తిరుగాడును.

తా :- సామీ ! చెప్పుట ఎందులకు మాపొలమున గోటితో తాకిన చాలును క్రొవ్వు చిందునట్టి మృగములు బాణములు తాకకుండుట వలన - అనగా వేటలో తప్పుడు దెబ్బలు తాకిన జంతువులు స్వేచ్ఛగా తిరుగు లేవు కనుక - పొలమంతటను తామేయై తిరుగు చుండును.

విశే :- ఈ పద్యమున మీటిన చమురొలుకు అను భాషీయ మీయడవి యందలి మృగముల బలుపును మరియు కొండక్రొవ్వును వ్యంజించును.

109.వ॥ అని విన్నవించు చెంచుల విన్నపం బాలించి సంతసంబున
వారికి నుడగర లిచ్చి నేడు వేట యని వీటం జాట బడ
వాళ్లం బంచి పేరోలగంబు విచ్చి కొలువు దారల ననిచి
ననుచు సంతసంబున దన నగరికిం జని తగు పనులు
దీర్చి వేటకు నంగగు సింగారంబునం బొంగి బేరులు
మొదలుగా గలుగు నిద్దంబులగు వాయిదంబుల ప్రెన్నవలి
దవిలి నేలచెఱంగు యేనుంగుల చెవులకుం జెవుడు
కొలుప జాజులు నడువం బుడమిం బొడము దుమ్మునం
గ్రమ్ము చిమ్మచీకట్లు నడిదంబుల బెడదంపు జాయలు
విరియింప నొక్క వారువంబు నెక్కి వెడలె నప్పుడు వేట
కాంద్రు నాయితంబై - 109

టీక : అనివిన్నవించు = వినయముగా తెలుపు, చెంచుల, విన్నపంబు = మొర, ఆలించి= విని, వారికిఁ, ఉడుగరలిచ్చి = కానుకలిచ్చి, నేడు = ఈనాడు, వేటయని, వీటంజాట= పట్టణమున చాటింపగా, బడవాళ్లంబంచి = సేవకులను బంపి, పేరోలగంబు = నిండుకొలువు, విచ్చి = విడిచి, కొలువువారల ననిచి = ఉద్యోగులను పంపి, ననుచు సంతసంబునఁ = చిగురించిన సంతోషమున, తననగరికింజని = తన మేడకు వెళ్లి, తగు పనులు దీర్చి = ఉచిత కృత్యములన్ని ముగించుకొని, వేటకు నంగగు = హంగయిన, సింగారంబునం బొంగి, శృంగారము చేసుకొని, భేరులు = భేరీలు, మొదలుగా గలుగు, నిద్దంబులగు = గొప్పనైన వాయిదంబుల = వాద్యములయొక్క, ప్రెన్నవలి = పెద్దచప్పుడు, తలివి = తగిలి, నేలచెఱంగుల యేనుంగుల చెవులకుఁ = భూమికి కడలందుండునేనుగులు అనగా దిగ్గజములు, వాని చెవులకు చెవుడు గొలుప =బధిరత్వము కలిగింపగా, పౌజులు నడువఁ= సైన్యములు నడువగా, పుడమి బొడము దుమ్మునఁ= భూమి యందు పుట్టు దుమ్ముచేత, గ్రమ్ము చిమ్మ చీకట్లు = అలముకొను నంధకారములు, నడిదంబుల = ఆయుధముల యొక్క, బెడిదంపు జాయలు = భయంకరమైన కాంతులు, విరియింపఁ = తొలగించు చుండగా, నొక్క పారువంబు నెక్కి = ఆ యయాతి మహారాజొక గుఱ్ఱమునెక్కి వెడలెను, అప్పుడు వేటకాండ్రు, ఆయితంబై = వేటకు సిద్ధమై.

తా :- పై పద్యములో నన్వయము-

అని విన్నవించిన చెంచుల యొక్క విన్నపములు విని వారికి తగిన కానుకలిచ్చి, ఈనాడు వేటయని పట్టణమున చాటింపుడని సేవకులను బంపి, కొలువు చాలించి, ఉద్యోగులను తమతమ నివాసములకు బంపి, తనలో ననలెత్తు సంతోషమున మేడకు జని కాలోచిత కృత్యములన్నియు ముగించుకొని, వేటకు తగిన శృంగారము చేసికొని, భేరీలు మొదలైన పెద్దపెద్ద వాయిద్యముల చప్పుడు దిగ్గజములను చెవుడు పడ జేయు నట్లు సైన్యములు నడిచిరాగా అపుడు గ్రమ్మిన దుమ్ముచే కప్పుకొనిన చీకట్లను వారి యాయుధముల కాంతులు తొలగించుచుండ యయాతి మహారాజొక గుఱ్ఱమునెక్కి బయలు దేరెను. అపుడు వేటకాండ్రు వేటకు సిద్ధమై

110.తే॥ లేటి వలలును మేటి కుందేటి వలలు
నెలుక వలలును సవదండ వలలు దొడ్డి
వలలు బందిటి వలలును బలుపు మకిల
వలలు మొదలుగ గలిగిన వలలు మఱియు - 110

టీక :- లేటి వలలును = లేడి+వల. టుగాగమ సంధి, కర్మధార యంబు లందుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు, బాల. సం. 28. కర్మధారయమున నుదంతములపైననే గాక ఇతరములగు వానిపై గూడ నీటుగాగమము గన్పట్టు చున్నది. మిద్దెటిల్లు దుక్కిటెద్దు, కాని ప్రాచీన భాషలో నిట్టి రూపములుండుటరు దగుటం జేసి చింతామణి సామానాధికరణ్యేషు - అనియే కార్ధీభావ రూప సామర్థ్యము గల కర్మధారయ భేదముల నెల్ల గ్రహింప బహువచన ప్రయోగము జేసెగాని తత్పురుషమును సంగ్రహింపగాదని చెప్పవలసి యుండుటచే - యని పై సూరి సూత్రమునకు దూసి వివరణ మిచ్చెను గాని యిచట లేటి వల = లేడి కొఱకు వల అని చతుర్థీ తత్పురుషముననేటుగాగమము వచ్చినది. ఇటులే కుందేటి వల పందిటి వలగూడ - మేటి కుందేటి వలలుₑ = మేలైన కుందేటి వలలు, ఎలుక వలలును, సవదండవలలు = దొడ్డి వలలును దొడ్డి వలె చుట్టు కట్టెడి వలలు పందిటి వలలును, = పందిరి వలె కట్టెడు వలలు బలుపు = మిక్కుటమైన మకిలములును = గూ. మకరివల/ మొకరివలలు = ముఖ భాగము కలవల మొదలుగ గలుగువలలు మఱియు

తా :- లేడి వలలు, కుందేటి వలలు, ఎలుకవలలు, సవరదండ వలలు, దొడ్డి వలలు, పందిటి వలలు, మొకరి వలలు మొదలైనవి.

విశే:- ఈ పద్యము నేడువలల భేదములు చెప్పబడినవి. వానిలో లేడివల, కుందేటి వల, ఎలుకవల, ఈమూడు ప్రత్యేకముగా నాయాజంతువుల కొరకేర్పరచినవి. తక్కినవి వేట సామాన్యములని తలపవలెను. ఇంకను వేట సాధనములుగల 114వ పద్యమును గూడ నిచటనే చేర్చుకొనవలెను

111.కII ఉద్దవిడి గవియు కుక్కలు
గద్దఱి సివ్వంగు లిర్లుగడునేచినమే
లెద్దులు మొదలుగ వేటకు
దిద్దిన యవి ప్రోగు ద్రాళ్లు దెరచీరగముల్ - 111

టీక :- ఉద్దవిడిౘ = విడిచిన వెంటనే, గవికుక్కలు - వేటనాక్రమించు జాగిలములు = గద్దరి సివ్వంగులు=పొగనేగల సివంగులు, కడునేచిన మేలెద్దులు = వేట విధానమును బాగుగా నేర్చిన యెద్దులు, మొదలుగ, వేటకు దిద్దినయవి = వేటకు బాగుగా తరిబీతిచ్చిన జంతువులు, మరియు ప్రోగుదాళ్లు = పోగులు గా కట్టెడు త్రాళ్లు, తెరచీర గముల్ = పరదాలుగా కట్టెడు వస్త్రములు.

తా :- విడిచిన వెంటనే వేటాడు జంతువు నాక్రమించు కుక్కలు, పొగరుబోతులైన శివంగులు, వేటవిధానం నేర్పిన ఎద్దులు, వేట పద్దతులు నేర్పిన యితర జంతువులు మరియు ప్రోగుదాళ్లు, తెరచీరలు-

112.కII బలువైన వేస డంబులు
జలకట్టెలు నోరణములు సాళ్వంబులుగి
ద్దులు మొదలుగ గలవిడివే
టల పులుగులు పదనుతో మిటారింపంగన్ - 112

టీక :- బలువైన = పెద్దవియైన, వేసడంబులు = జలకట్టెలు, ఓరణములు సాళ్వంబులు = సార్వలు, గిద్దులు = గృధ్రములు, మొదలుగ, విడివేటల పులుగులు = విడివిడిగా వేటాడు పక్షులు, పదనుతో = డేగపడునుతో, 1. వేటాడు డేగకు ఆహారము పెట్టకొన్న పనిచేయదు. ఎక్కువైన కునికి పాట్లకు దొరకొనును కనుక ఆహారమును నెరిగి తగుమోస్తరుగా నిచ్చు చుందురు. అందువలన మిక్కిలి ఎక్కువగాగాని,

తక్కువగాగాని యాహారమునకు డేగ పదునని జాతీయ మేర్పడినది.
మిటారింపంగ౯ = విభృంభించు చుండగా

తా:- గొప్పగొప్పవైన వేసడములు, జలకట్టెలు, ఓరణములు, సార్వలు, గృధ్రములు అను వేటాడు డేగలు తగిన పదునుతో విజృంభించు చుండగా -

విశే :- ఈపద్యమున నైదు డేగల భేదములు చెప్పబడినవి. పూర్వము శ్యేనశాస్త్రమొకటి ప్రత్యేకముగా నుండెడిది.

డేగపదును - జాతీయము

ఆయాజాతుల యొక్క విశిష్టలక్షణములను తెలుపు పదబంధములను జాతీయములందురు.

తే: జాలె జలకట్టి యణుజవేసడములగుడు
జావడము వారణము వైరి సాళువంబు
కనిసెరము చెంచడము డేగయనఁగదనరు
శ్యేనమునకు మునీశ్వరా ధీనసాంబ . సాం.ని.తిర్య.79

జాలె(జాలియ) జలకట్టె (జలకట్టియ, సెలకట్టె /య) అణుజా (అడుజా) వేసడము, లగుడు, జావడము, వారణము, బైరి (బయిరి) సాళువము (సాళ్వము) కనిసెరము, చెంచడము, డేగ, ఈ పదునెనిమిది శ్యేనభేదములు పు.96

విశే:- వివరణ కర్త ఈ పద్యమున రూపాంతరములను లెక్కించి డేగల భేదములను పదునెనిమిది చేసెను కాని పద్యమున పన్నెండు మాత్రమే కనిపించుచున్నవి.

113.ఆ॥ కారుకోడికాజు కక్కెర పూరేడు
కేరజములు మఱియు బేరుగలుగు
చిందమొదలుగాన బొంది వేటకు మీఱు
పిట్టలెల్ల గూళ్ల బిట్టు చెలగ -113

టీక :- కారుకోడి = అడవికోడి, కాజు = కపిం జలము, కక్కెర = కొక్కెర పూరేడు = మీలవల్లంకి, కేరజములు మరియు = ఇంకను, పేరుగలుగు = పేరున్న, చిందు = చిన్నగద్ద, మొదలుగా౯ పొంది = కలిగి, వేటకు మీరు = వేటకు తగినట్టి, పిట్టలెల్ల, గూళ్ల౯ + బిట్టు = మిక్కిలిగా చెలగ = విజృంబించగా

తా :- అడవి కోడి, కౌజు, కక్కెర, పూరేడు, కేదడము, చింద, ఇంకను పేరుగలుగు వేటలో మీరిన దీమములు తమతమ గూళ్లలో చేలరేగగా-

114.క॥ మరి తెరలుఁ జిక్కములు వం
కర బోనులుఁ ద్రాళ్లు నురులుఁ గాలురులును జే
గురుడండెలుఁ దల ముళ్లుఁ
గరిచిలుకులు విండ్లు లోనుగాఁ గొంచువెసన్ - 114

టీక :- మరి = మరియును, తెరలు, చిక్కములు, వంకర బోనులు త్రాళ్లుఁ + ఉరులు, కాలురులు, కాళ్లకు వేయు బంధములు, జేగురు కండెలు = జిగురు కండెలు, తలముళ్లుఁ = ఒకవిధమైన త్రాళ్లు, కరిచిలుకులు, విండ్లు = బాణములు, లోనుగాఁ = మొదలగునవి; కొంచు = గ్రహించి, తీసికొని, వెసఁ = వేగముగా -

తా॥ మరియును తెరలు, చిక్కములు, వంకర బోనులు, త్రాళ్లు, ఉరులు, కాలురులు, జిగురు కండెలు, తలముళ్లు, కరిచిలుకలు బాణములు మొదలైన వేటసాధనము గైకొని

110 నుండి 114 వరకు నీయైదు పద్యములలో నానాటి వేట సాధనములు చెప్పబడినవి. మనుచరిత్ర పిమ్మట వేటను చెప్పిన వానియందు యయాతి చరిత్రకే ప్రాముఖ్యము గలదు. నిచట తెలగన్న పేర్కొన్న వేటసాధనములను సమీక్షించి చూచుకొందము.

అ. I. వేట సామన్యమైన వలలు – దొడ్డివల, పందిటి వల, మొకరి వల

II. జంతువులకొరకు ప్రత్యేకమైన వలలు – లేటివల, కుందేటి వల, ఎలుకవల, సవదండవల.

ఆ:- వేట సాధనములు – త్రాళ్లు, ప్రోగుద్రాళ్లు, తెరలు, తెరచీరలు, వంకర బోనులు, ఆలయుళ్లు, ఉరులు, కాలురులు, జిగురు కండెలు, కరిచిలుకులు, విండ్లు, చిక్కములు.

ఇ. I. వేటాడు జంతువులు – జాగిలములు, సివంగులు, ఎద్దులు

II. వేటాడు డేగలు – వేసడము, జలకట్టె, ఓరణము, సాళ్వము, చింద, గద్ద

III. ఇతర పక్షులు :- కారుకోడి, కౌజు కక్కెర, పూరేడు, కేరజము

జానపదుల వేట సాధనములు

ఉరులు -

ఇవి కాలురులు తలముడులు అని రెండు విధములు. వీనిని గుఱ్ఱపు తోక వెంట్రుకలతో చేయుదురు.

1. కాలురులు మూడేసి వెంట్రుకలు కలిపి వానికి ఒక చిలుకట వేయుదురు. అటువంటివి మూడు నాలుగు చిలుకటలు పక్షులు మేతకు వెళ్ళినపుడు చెట్లకి వాని గూండ్ల దగ్గర మూతి ముందు కట్టెదరు. అపుడు పక్షులు వచ్చి గూటిలోనికి పోబోయి తమకాళ్ళు ఆదూముడులలో తగిలించుకొని గింజాలాడు కొనును. దానితో ఆదూముడి కాళ్లకు గట్టిగా బిగిసి యవి ఆచెట్టు కొమ్మ లకు తల క్రిందుగా వ్రేలాడును.

   ఉదయముననే వేటకాండ్రు వచ్చి వానిని పట్టుకొని ఉరులు సడలించి రెక్కలు విరిచి చిక్కములలో వేసికొందురు.

2. తలముడులు కాలురుల కంటె సన్నగా నుండును. అనగా వానిని రెండేసి వెంట్రుకలే కలిపి దూముడి వేయుదురు.

వసంతర్తువునమోదుగులు పూచినపుడు ఆపూల లోని పుప్పొడి ఒక రకమైన పక్షులు దూసికొని తిను చుండును. వీని ముక్కులు సన్నగా పొడవుగా నుండును. శాకునికు లది కనిపెట్టి తలముడులను ఆమోదుగు పూలకాడలకు కట్టి ముడిని పూవు యొక్క కీలాగ్రమునకు తగిలించి యుంతురు. అంత పిట్టలు వచ్చి ఆరెమ్మపై వ్రాలి పుప్పొడి కొరకు తమ ముక్కులను పూవులోనికి దూర్చగా తల కీలాగ్రమునకు తగిలించిన యురిలో చిక్కి అవి గించుకొనగా నురి బిగిసి పోయి చచ్చి ఆరెమ్మలకు వ్రేలాడును.

మరునాడు పిట్టలవారు వచ్చి వానిని జాగ్రత్తగా ఉరులు సడలించి తీసికొని వానిని మరల క్రొత్తరెమ్మలకు కట్టి వెళ్లుచుందురు.

జిగురుకండెలు -

వీనిలో జిగురు కండెలు, జిగురు గడలు జిగురు మీటలని మూడు విధము లున్నవి. ఈ జిగురును వేటకాండ్రు ఒక పాత్రలోనికి రాగి (అశ్వత్థము) యొక్క పాలు బాగా వడుపు కొని వానిలో ఆముదము వేసి కలిపి దానిని ఎద్దు కొమ్ము బుఱ్ఱ లలో నిలువ చేసి కొందురు.

1. ఈ జిగురును చిటికెనవ్రేలు మందముగల మూరెడం తవెదురు పుల్లలకు ఒకకొనకు గట్టి దారముతో గాని పల్చని బట్టతో గాని కండెను చుట్టి దాని చుట్టు తాము సిద్ధ పరచిన జిగురు దట్టముగా పూతురు. పిమ్మట ఈ కండెలను కొని వెళ్లి పక్షులు మేతలకు వెళ్లినపుడు వాని గూండ్ల దగ్గర కండెను గూటివైపు ముఖము చేసి ఒకటి గాని రెండుగాని ప్రతిగూటి దగ్గర పై మండలకు గట్టిగా కట్టెదరు.

సాయంకాలము పక్షులు గూండ్లకు చేరును. పక్షి గూటి లోనికి పోవునపుడు రెక్కలు ముడుచుకొని వెళ్లి బయటికి వచ్చునపుడు రెక్కలు విచ్చుకొనుచు వచ్చును. కనుక అవి రెక్కను విచ్చినపుడా రెక్క జిగురు కండెకు తగిలి అతుకుకొని పోవును. పక్షి ఎంత గింజు కొన్నను అది యిక వదలదు. పిమ్మట పక్షి వేటకాండ్రు వచ్చి వానిని పట్టుకొని జిగురు కండెలు విడిపించి రెక్కలు విరిచి చిక్కములలో వేసికొందురు. ఈ జిగురు కండెలను పోతనగారు భాగవతమున పేర్కొనెను. స్క7 -

2. జిగురుగడలు - ములుకోలవంటి పొడవైన వెదురు కఱ్ఱలకుకొనకు కండెచుట్టి దానికి జిగురు పూతురు. పక్షులు ఎండ వేళలలో చెట్లకొమ్మలపై విశ్రాంతి తీసికొను చుండును. ఆసమయమున వేటకాండ్రు నిశ్శబ్దముగా చెట్లక్రిందికి చేరి ఏయే కొమ్మలపై పక్షులు కూర్చున్నవో గమనించి తమచేతిలోని జిగురు గడను మెల్లగా పైకెత్తి ఆపక్షికి తాకింతురు.

పక్షుల శరీరము మొత్తము ఈకల మయము కనుక జిగురు గడ దానికేభాగము తాకినను అది దానికంటుకొని పోయి గడను క్రిందికిలాగగా దానితో పాటు విలవిలలాడు ఆపక్షి గూడ క్రింద బడుచుండును. అపుడు వేటకాండ్రు వానిని పట్టుకొను చుందురు. ఈ జిగురు గడలను వరాహ పురాణ కర్తలు మరియు పిల్లలమఱ్ఱి పిన వీరన పేర్కొనిరి - జైమి.

జిగురుమీటలు :-

ఇది చాపాకారముగా వంచిన నాలుగు వెదురు పుల్లలతో సిద్ధపరుతురు. ఆ పుల్లలు సుమారు నాలుగు జేనల పొడవై పెన్సిలు పుల్ల మందముండును. వేటాడు వారవి కొని వెళ్లి

వానిని X అక్షరమువలెనేలపై నిలుచున్నట్లు కట్టి నాలుగు కాళ్లకు తమ వెంటకొని వెళ్లిన జిగురును ఒక పుల్లతో పూసి దాని నడుమ సజీవమైన ఒక కుమ్మరి పురుగును గుర్రపు వెంట్రుక సహాయమున వ్రేలాడ దీతురు. అపుడది గాలిలో రెపరెప లాడుచుండును.

పక్షులలో కొన్నింటికి నేలపై ప్రాకు కీటకములను పట్టుకొనరాదు. అవి గాలిలో నెగురు కీటకములపైననే యాధారపడుచుండును. కనుక గద్ద యాకాశమున తిరుగు నపుడీ పురుగు దానికంట బడిన దానిని కొట్టుకొని పోవుటకు నేలకు దిగి రెక్కముడిచి మీటలోనికి దూరి పురుగును పట్టుకొని వెలుపలికి వెళ్లిపోవుటకు మరల రెక్కలు విప్పగా అవి రెండువైపులలో మీట కాళ్లకంటుకొని పోయి అది నిలబడి పోవును. అపుడు దానికొరకు పొంచిన వేటకాడు వెళ్లి పట్టుకొని ర్కెలు విడిపించి విరిచి సంచిలో వేసికొనును. ఈ జిగురు మీటలను గణపవరపు వేంకటకవి ప్రబంధ రాజ వేంకటేశ్వర విలాసమున పేర్కొనెను-ఆ-

వలలు : -

వలలలో ఉడుతవల, ఎలుకవల, కుందేటివల, దొడ్డివల, పందివల, పందిరివల, పిట్టలవల, మొకరివల, యని అనేక భేదము లున్నవి.

ఉడుత వల : ఇది సన్నని కండ్లతో జానెడు వెడల్పు గలిగి ఏడెని మిది మూరల పొడవుండును.

ఉడుతలు సాధారణముగా చెట్లపై నివసించును. వేటకాండ్రు వానిని జోపినప్పుడవి బిర బిర ఆ మ్రానుదిగి దాని ప్రక్క నున్న మరో చెట్టుపైకి ప్రాకు చుండును.

ఉడుతలను పట్టువారు చెట్టు చెట్టు కాలి బాటపై మందు దినుసుల వారు బట్టతో ఆవరణ కట్టు కున్నట్లుగా ఉడుత వలను నాలుగైదు పుల్లలు పాతి వరుసగా కట్టి అది నేలపై వాలిపోకుండ నడుమ నడుమ సన్నని పుల్లలు పోటి పెట్టి నిలువుదురు. పిమ్మట వల వెలుపల నిలిచి ఒక కర్ర తీసికొని ఉడుతలు గల చెట్టు మండలను బాదుతూ వానిని బెదిరించగా అవి మ్రానుదిగి యురుకుచు ఆ చెట్టుచుట్టు గల వలను తాకును. అటులవి తాకగనే దానికి పోటి పెట్టిన పుల్లలు క్రిందపడి వల వానిపై వ్రాలిపోవును.

వలలో పడిన జంతువు ఎంతగా తన్నుకొనిన వల దాని కంతగా చుట్టు కొనును. కనుక వలపైని వ్రాలగనే ఉడుతలు తన్నుకొనగా వాని కాళ్లు వల కన్నములలో చిక్కియవి కదలజాలకుండ నగును. అపుడు వేటకాండ్రు వచ్చి వానిని పట్టుకొని తలపై బొటనవ్రేలితో

నొక్కుదురు. దానితో యువి మరణించును. అపుడు వానిని వారు వలనుండి తీసి చిక్కములలో వేసి కుందురు.

పందిరి వల నీసందర్భముననే చెప్పవలెను. చెట్లు దగ్గర దగ్గరగా నుండి వానిపై యుడుత లెక్కువగా నున్నపుడు వేటకాండ్రు వలను వాని నడుమ పందిరి వలె కట్టుదురు. పిమ్మట చెట్లను కదిలించగా వానిపైగల యుడుతలు బిరబిర చెట్లుదిగును. కొన్ని నేరుగా తామున్న కొమ్మలపై నుండియే క్రిందికి దూకును. అటుల దూకినవి సర్కసులోని ఉయ్యాల పిల్లల వలె ఈ పందిరి వలలో పడిపోవును. చెట్లు దిగినవి పరుగెత్తి ప్రాకుల చుట్టు పన్నిన వలలలో చిక్కు చుండును.

ఎలుక వల : - ఎలుకలు వలను కొరుకగలవు కనుక నిది సన్నని కండ్లతో గట్టి దారముతో నల్లబడును. ఈవల చదరముగా చూపవలెనుండును.

అడవి ఎలుకలలో రెండు మూడు రకములు గలవు. ఎలుకలను తినువారు ఎల్లెలుకల (వెల + ఎలుక) నెక్కువగా యిష్టపడుదురు. ఇవి తరుచుగా పొలము గట్ల వెంబడి యుండును. వేటకాండ్రు ఎలుకల కన్నము లెక్కడ నున్నవో గమనించి వానిపై వలను పరచి కన్నమును గుడ్డతోగాని బురద మట్టితోగాని మూయుదురు. ఎలుకలు తెలివి గల ప్రాణులు. అవి ఒక్కొక్క కన్నములో నాలుగైదు నివసించును. అంతేకాక అవి ప్రమాదము సంభవించి నపుడు పారిపోవుటకు దిడ్డి దోవ నేర్పరచుకొని తట్టుదీసి యుంచుకొనును. ఈ తట్టుపైకి నేలవలెనే కనిపించును. లోపలి నుండి ఎలుక తగిలినపుడు కన్నము పడుచుండును. బిల ద్వారము మూయగానే లోపలగల ఎలుకలు తట్టులనుండి బయట పడి పైన పరచిన వలలో చిక్కిపోవును. అపుడు వానిని వేటకాండ్రు కర్రతో బాది చంపుదురు.

ఒక్కొక్కపుడు ఎలుకలు తాము కన్నములో లేమని వేటకాండ్రను మభ్యపెట్టును. అపుడు వారు వానిని బెదిరించుటకై తమ చేతిలోని గుతుపతో కన్నము చుట్టు నేలను త్రవ్వుచున్నట్టు కొట్టుదురు. అపుడు లోపలగల ఎలుకలు భయపడి బయట పడుచుండును.

కుందేటి వల : - సుమారు మూడు జానల వెడల్పు గలిగి ఆరేడు మూరల పొడవుండును. దీనిని రెండు చెట్ల నడుమగాని పొదల నడుమగాని కుందేళ్ళు సంచరించు స్థలమున దారి కడ్డముగా కట్టి ఉడుతవల వలెనే పుల్లల పోటితో వాలిపోకుండ నిలిపి పిమ్మట కుందేలును జోపుదురు. అపుడది దాట్లతో పరుగెత్తుచు వచ్చి వలను తగిలి దానిలో చిక్కును. వేటకాండ్రు దానిని సజీవముగా పట్టుకొని కాళ్ళు కట్టుదురు.

దొడ్డివల : – ఇది గొల్లవారు గొర్రెల మంద లాపుటకు కట్టెడు వలవలెన నుండును. ఇది సుమారు ఐదడగుల ఎత్తు గలిగి పొడవుగా నుండును. ఒక్కొక్కపుడు రెండుమూడు వలలు కలిపిగూడ వేటకాండ్రు దొడ్డివలను కట్టుచుందురు.

ఇది తరుచుగా గుబురు పొదల లేదా చెట్లనడుమ గల బయలు ప్రదేశమున దొడ్డివలె కట్టబడును. అడవి జంతువులను జోపినపు డవి పొదలలో దూరుటకు పరుగెత్తుకొని ఈ దొడ్డిలోనికి వచ్చుచుండును. అపుడు వేటకాండ్రు దాని ముఖద్వారము ముందు నిలిచి లోపల దూరిన జంతువులను ఈటెలతో బాకులతో కుమ్మిచంపుదురు.

పిట్టల వల : – సన్నని కండ్లతో మిక్కిలి విశాలమై గుండ్రముగా నుండును. ఈవల చుట్టు ముగుదాడుండును. ఆత్రాడును దగ్గరగా లాగినపుడు వల మొత్తము వక్కల సంచి వలె దగ్గరగా నగును.

ఊరపిచ్చుకలు, ఇంకను ఆజాతి పిట్టలు తరుచుగా పాత బావులలో గూండ్లు పెట్టుకొని నివసించు చుండును. పిట్టల వేగాండ్రు అవి గూండ్లకు చేరిన సమయము కనిపెట్టి ఆ బావుల దగ్గరకు వెళ్లి దాని ముఖముపై వలను విసరుదురు. వల బావి ముఖముపై పరుచుకొనగనే లోపలి పిట్టలన్ని బిరబిరపైకి లేచి వచ్చును. అపుడు వెంటనే జాలరి వల యొక్క ముగుద్రాళ్లు సరసర లాగును. అంత నావల పెద్ద సంచియై పిట్టలన్ని దానిలో చిక్కిపోవును.

బావులలో విసరెడు చేపల వలగూడ యిటులేయుండునుగాని అది నీటిలో మునుగ వలసి యుండును. కనుక ఆవలచుట్టు బరువైన ఇనుప పూసలు అల్లబడి యుండును. వేటకాండ్రు బావులలో చేపలుల్లాసముగా పైకితేలుచు తిరిగెడు సమయము కనిపెట్టి ఈవలను వానిపై విసరుచుందురు. వలను విసరి ముగుద్రాడు లాగగా వలసంచియై చేపలన్ని దానిలోనే చిక్కిపోవును.

పందివల : – అడవి పంది బలిష్టమైన జంతువు కనుక ఈ వల పెద్ద పెద్ద కండ్లతో బలమైన త్రాళ్లతో వేయబడుచుండును. ఆటవికు లీవలను పూర్వము ఏప లేదా మార్పటి నార త్రాళ్ళతో వేసెడి వారట. దీనిని కుందేటి వల వలెనే పందులు తిరుగు దారి కడ్డముగా కట్టి పోటీలతో నిలుపుదురు. అడవి పందులు గర్వముగల జంతువులు. కనుక అవి వలను లక్ష్యపెట్టక కుమ్ముకొని పోదలచి ఆ వలలో చిక్కుచుండును. అపుడు వేటకాండ్రు వెళ్లి వానిని కర్రలతో ముట్టెపై బాది చంపుచుందురు.

మొకరి వల :- ఇది నడుమునకు కట్టుకొను గోతము వలె పొడవుగా నుండి మూతివైపు వెడల్పుగా తోకవైపు రాను రాను సన్నముగా నుండును. ఈ వల మకరాకారముగా పొడవుగా నుండును. కనుక దీనికి మకరి వల యని మరియొక పేరు. దీని మూతికి చతురస్రమైన ఒక చట్రముండును. అది పుస్తకమువలె దగ్గరగా మూయునట్లు గూడ నుండును. వేటకాండ్రు ఈవలను పొదలలో పన్ను చుందురు. వలయొక్క మూతిని తెరచి యుంచి వలనంతటిని పొదలలో కనిపించ కుండ పరచి యుంతురు.

కుందేళ్ళు, ఉడుములు, ముంగీసలు, ఎంటువల వంటివి ఈ వలలలో పడుచుండును. జంతువు వల యొక్క నోటిలో ప్రవేసింపగనే మాటుగాయుచున్న వేటగాడు వచ్చి దాని మూతిని దగ్గరగా మూయును. పిదప దాని లోనికి వెళ్లిన జంతువును కర్రతో బాది చంపును.

115.వ॥ వేటకాండ్రు కొలిచి నడువ సంతసంబునం గొంత
దవ్వరిగి యంతట బలుమూఁకల మెకంబుల నిలుచు
నట్లుగా నేమించి వేఁటకుం దగిన పోఁజులతోఁ జనిముందట - 115
ప్రతినలు పట్టించి మలల పజ్జల కనిచెన్ - 60

టీక :- వేటకాండ్రు = మృగములు, కొలిచి నడువ = యయాతి మహారాజును సేవించుచు వచ్చుచుండగా, కొంత దవ్వరిగి = యటుల కొంత దూరము వెళ్లి, అంతటన్ = ఆ పిమ్మట, బలుమూకల్ = పెద్ద మూకలను, మెకంబుల నిలుచు నట్లుగాన్ = మృగములు తమ యరణ్యము దాటిపోకుండ నిలుచునట్లు, నేమించి, నియమించి, వేటకుం దగిన = తాను వేటాడుటకు తగిన, పౌజులలోన్ = సైన్యములో, చని = ముందట.

తా ॥ వేటకాండ్రు పైని తెలిపిన సాధనములను పక్షులను తీసుకొని జంతువులను వెంబడించుకొని మహారాజును సేవించుచు వచ్చు చుండగా, నటులవారు కొంత దూరము చనిన పిమ్మట మహారాజా వారితో పెద్ద గుంపులను జంతువులు తమ యరణ్యము దాటిపోకుండ చూచుటకు నియమించి వేటకు తగిన ముఖ్య సైన్యములతో మాత్రమే వెళ్లి తమముందట -

116.సీ॥ నింగిబీటలు వాఱఁ బొంగు సింగంబుల
రవలిచే దెసలెల్లఁ జెవుడు పడఁగఁ
బొలసు దొబ్బల నుబ్బుపులుల పెన్బొబ్బలఁ
గడలియుఁ బలుమాఱు గలఁగి పొరలు
వీక నేనిక మూఁక విఱుచు మ్రాఁకుల మ్రోఁత
పెటపెటల్ మలల నిట్టటుగఁ జేయ
మీఱుచు నేట్లాడు కారుపోతుల కొమ్ము
చప్పుళ్లఁ బులుఁగులు కుప్పగూల
తే॥ గొరగొరంజను పందుల ముర్ఘురంబు
బెడిదములఁ బుడమియు పడవడ వడంక
నెపుడు వెడయాని చీఁకట్ల నివముగొనుచు
నొంటిఁ జొరరాని యట్లుగా నుండె మఱియు - 116

టీక :- నింగి బీటలు వార = ఆకాశము పగుళ్ల చూపునట్లు, పొంగుసింగంబుల = మదముచే నుప్పొంగి సింహముల యొక్క, రవలిచే = ధ్వనుల చేత, దెసలెల్లన్ = దిక్కులన్ని, చెవుడు పడగన్ = చెవుడు పడు చుండగా, పొలసు దొబ్బలన్ = మాంసఖండములచే, నుబ్బు = సంత సించు - పులుల = పెద్దపులుల యొక్క, మెన్బొబ్బలన్ = పెద్దపెద్ద యరుపులచేత, కడలియు = సముద్రము పలుమారున్ = అనేక పర్యాయములు కలిగి = క్షోభించి, పొరలగ = పొంగగా, వీకన్ = బలముతో, నేనిక మూక = ఏనుగుల గుంపు విఱుచు, మ్రాకుల మ్రోత = మానుల చప్పుడగు, పెటపెటల్ = పెటపెటమను ధ్వనులు, మలలన్ = కొండలను, ఇట్టట్టుగన్ చేయ = ఇక్కడక్కడ చేయగా, అనగా కదిలించగా, మీరుచు = క్రొవ్వులతో విజృంభించు, ఏట్లాడు = వేటులాడు, కారుపోతుల అడవి దున్నల యొక్క, కొమ్ముచప్పుళన్ = కొమ్ముల చప్పుడు చేత, పులుగులు = పక్షులు, కుప్పగూల = చచ్చికుప్పలుగా పడుచుండగా, గొరగొరం జను = వేగముగా పోవుచుండు, పందుల, ఘుర్ఘురంబు = గురుగురు మను ధ్వనిధ్వని, బెడిదములన్ = కఠినత్వము వలన, పుడమియు వడవడ, వడంకన్, ఎపుడున్ ఎడయాని = విరామమియాయని, చీకట్లన్ = అంధకారముచే, ఇవముగొనుచున్ = నెమ్మిగొనుచు, ఒంటి చొరరాని యిట్లుగాన్ = ఒక్కరు పోరాని తీరుగా, ఉండె = ఒప్పుచుండెను. మఱియు

తా :- ఆకాశము బ్రద్దలగునట్లు గర్జించు సింహముల ధ్వనులచే దిక్కులన్ని చెవుడు పడుచుండగా మాంసము తిని బాగుగా పోతరించిన పెద్దపులుల గాండ్రింపులచే సముద్రము పొర్లిపడుచుండగా ఏనుగులు బలప్రయోగముచే మ్రాకులను విరుచు చుండగా నా పెళపెళ లకు పర్వతములు కదలి పోవుచుండగా కారెనుములు పోట్లాడు చుండ వాని కొమ్ముల చప్పుడుల కదిరి చెట్లపై నున్న పక్షులు కుప్పగూలు చుండగా కారెనుములు పోట్లాడు చుండ వాని కొమ్ముల చప్పుడుల కదిరి చెట్లపై నున్న పక్షులు కుప్పగూలు చుండగా ఘుర్ఘురించు గునగున పరుగెత్తు నడవి పందుల ధ్వనులచే నేలయదరి చుండగా నెల్లప్పుడును వెలుతురున కెడమీయని చీకటి యలుముకొని నేలయంతయు నెమ్ముగొని యొక్కొక్కరికి గూడ చొర రానంత దట్టముగా చెట్టు బలిసిన యొక యడవి వారిముందు కనిపించెను.

విశే:- ఈపద్యమున నన్నియునా యడవియందలి వివిధమైన ధ్వనులే చెప్పబడినవి. ఎత్తుకొనిన పద్యమును వస్తుసంకరముగాకుండ నిర్వహించుట వస్తువు నౌచిత్ర మెఱిగి దానినొక క్రమపద్ధతిలో విన్యసించుటయే కావ్య ప్రపంచమున ప్రబంధమునకు గల విశేషము.

''అలం - అతిశయోక్తి''

117.తే॥ ప్రొద్దు చాయలు దూఱక పొళ్లు చేసి
ఇసుము చల్లిన రాలక యిరులుగ్రమ్మి
నడవఁగా రాని యొక్క కారడవి నపుడు
కాంచి వెఱఁగందె నా రాచకలువతేడు - 117

టీక :- పొద్దు చాయలు దూరకఁ = సూర్యుని కిరణము లేమాత్రము ప్రవేశింపక, పొళ్లు చేసి = మెత్తగా చూర్ణము చేసి, ఇసుక చల్లిన రాలక = ఇసుక చల్లినను రాలకుండ, ఇరులుగ్రమ్మి= చీకటులలుముకొని =నడువగారాని, ఒక్క, కారడవిన్ = దట్టమైన యడవిని, అపుడు కాంచి = ఆసమయమున చూచి, ఆరాచ కలువతేడు = ఆరాజచంద్రుడు, వెలుగందెఁ = భయముతో కూడిన యాశ్చర్యమును పొందెను.

తా :- అపుడా రాజచంద్రుడు తమముందట సూర్యకిరణము లేమాత్రము చొరక, ఇసుక మెత్తని పొడిచేసి చల్లినను రాలక దట్టమైన చీకటులు క్రమ్మి నడవరానటువంటి యొక భయంకరమైన యడవిని జూచి విస్మయ మందెను.

విశే :- యయాతి మహారాజు చంద్రవంశమునకు చెందినవాడే కనుకనతని చంద్రుడని విశేషించుచుంటితేని సముచితము - అలం రూ.

ఇసుక యేసన్ననిది. దానినింకను పొడిచేసి చల్లినను రాలదనుట ఆచీకటి యొక్క ప్రగాఢ త్వమును వ్యంజించును. వెన్నెలను, చీకటిని ఘనపదార్థములుగా చెప్పుట లేదాభావించుట కవి సమయ సంప్రదాయము.

''అలం - అతిశయోక్తి''

118.వ॥ ఇట్లు కాంచి వెఱఁగందు డెందంబున నయ్యడవిం గొంత దవ్వరిగి
ముందట-118

టీక :- ఇట్లు = ఈవిధముగా, కాంచి = చూచి, వెఱగందు = భయము కలుగు, డెందంబున = హృదయములో, కొంతదవ్వరికి = కొంత దూరమువెళ్లి, ముందట-

తా :- ఈవిధముగా నున్న యడవిని జూచి హృదయమున వెఱపు కలిగి యటులే కొంత దూరమరుగగా - నాముందఱ

119.సీ॥ అలరు కస్తురిఁ దీనె లలికి వాకిళ్ల చెం
తల వైచిపోయిన తట్టు పునుఁగు
గోడలు పూయంగ గ్రుమ్మి గందంబున
మేదించినట్టి జవ్వాది యుడుసు
నాడాడ సరిబేసు లాడి పోవిడిచిన
ముదురు వెదుళ్లలో ముత్తియములు
బలుపు టేనిక కొమ్ముటలవలపైఁ ద్రోవఁ
దవిలించి కట్టిన సవరములును

తే॥ వంటకట్టెల కని తెచ్చి వాములిడిన
యగరు ప్రాఁకులపై నిండ నాఱఁ బెట్టు
కప్పురంపుట నంటులు గలిగి మెఱయు
నెఱుకు పల్లియ లొకకొన్ని యోదుటఁ గాంచి - 119

టీక : అలరు = ఒప్పిదమైన, కస్తూరి తేనెలలికి = కస్తూరితో వేసిన తిన్నెలు అలికి, పాకిళ్లచెంతల = పాకిండ్ల దగ్గర, వైచిపోయిన = పారవేసిన - తట్టుపురుగు కరిగి బేట్లుకట్టిన పునుగు - గోడలు, పూయంగ౯ = పూయుటకై, క్రుమ్మి = బాగుగా

నలుగ గొట్టి, గందంబున మేదించినట్టి = గందముతో బాగుగా కలిపిన జవ్వాది యడుసు = జవ్వాది బురద, నాడాడఁ = అక్కడక్కడ, సరిబేసులాడి, పోవిడిచిన = ఆట పిమ్మట విడిచి పెట్టిన, ముదురు వెదుళ్లలో = పండువెదురు గడలలోని, ముత్తియములు, బలుపు = బలసినట్టి, ఏనికకొమ్ము = ఏనుగు దంతము యొక్క అలవలపై మొక్కలకు రక్షణార్థముంచెడు గుమ్ములపై, త్రోవఁ = దారి వెంట, తగిలించి కట్టిన = ఆలల వలకు తగిలించి కట్టిన, సవరములును వంట = కట్టెలకని, తెచ్చి, వాములు + ఇడిన = వాములుగా పేర్చిన, అగరు మ్రాకులపై, అగరు కట్టెలపై నిండఁ = నిండుగా, ఆరబెట్టు = కపురంపుటనంటులు = కర్పూరపు టరటి పొగలు, కలిగి, మెఱయు = ఒప్పు చుండు, ఎఱుకు పల్లియలు = యెఱుకు పల్లెలు, ఒకకొన్ని ఎదుటఁ + కాంచి= ముందుర చూచి-

తా :- అందమైన కస్తూరి తిన్నెలను అలికి వాకిండ్లలో అలుకు పిప్పిగా పారవేసిన తట్టు పునుగు, గోడలు పూయుటకు బాగుగా నలుగ గొట్టి గందముతో కలిపిన జవ్వాది బురద, బాలికలు అక్కడ సరిబేసి యాటలాడి యటులే విడిచి పోయిన వెదురు ముత్యముల కుప్పలు, దారుల వెంట మొక్కలకు రక్షణార్థమై పెట్టిన ఏనుగు దంతపుటలవలపై తగిలించిన సవరములు, వంటకట్టెలకని తెచ్చి వాములు వాములుగా పేర్చుకొనయగరుకట్టెలు, వానిపై నారబెట్టు కొనిన కర్పూరపు టరటి పొరలు, కలిగి యొప్పుచున్న కొన్ని యెరుకు పల్లెలను యయాతి మహారాజా యడవి యందు చూచెను. చూచి -

విశే :- ఈ పద్యమున నగరము లందుండు వారి బంగారు మేడలు వజ్రాల కప్పులవలె అడవులందుండు వారి యైశ్వర్య జీవనము వర్ణింపబడినది.

I. అగరు అనునది ఒకగంధ ద్రవ్యము, దీనిని వృక్షములనుండి తీయుదురు. ఈ వృక్షములు అస్సాము అడవులందును, చిలుక సముద్ర ప్రాంతముసను విస్తారముగా పెరుగును.

II. కర్పూరము గూడ వృక్షద్రవ్యమే. దీని చెట్టు దాల్చిన చెట్టు జాతిలో చేరి యింగువ చెట్టువలె నుండును. చెట్ల యొక్క శాఖల పై పట్టు దళసరిగా నుండి గంటుపెట్టినచో చిక్కని రసము స్రవించును. అదియే కర్పూరము. దీనికాయలు చెనగకాయలు వలెనుండి పండ్లలోని గింజలకు గూడ కర్పూరపు వాసననే యుండును. చెట్టు

ప్రూనుకు గంటు పెట్టినను ద్రవము కారును. ఈ చెట్లను చీనా, జపాను వారు విస్తారముగా తోటలుగా పెంచుదురు.

దూర్జటి మహాకవి కాళహస్తి మహాత్మ్యమున గూడ చెంచుల యొక్క ఆటవికైశ్వర్య జీవితమును ఇటులే వర్ణించెను. ఉదా :

ఎ. గీ. గంధ సారాగరుద్ర మకాష్ఠ ఖండ
చయము తమయింటి వంట కట్టియలుగాగ
జేయుదురు కాపురంబులు సేయునపుడు
చెంచితలు చెంచులం గూడి చిత్రతల - ఆ. 3-4

ఉ॥ సంకుమందంబునుం బునుగు జాదును కస్తురియుం ఘటింబలం
బంకము జేసి యిండ్లలికి ప్రత్యహముం వెలియైన మూర్గకహా
లంకష గోమయ ప్రతులం బురిడించుమనుండు గుప్పలై
యింక తదీయ భూతిని దమి ద్ధమటంచు ను తింపశక్యమే - 3-5

''అలం - ఉదాత్తాలంకారము''

97వ పద్యము యయాతి మహారాజు యొక్క వస్తు సమృద్ధిని తెలుపగా నిది ఆనాటి యాటవికుల వస్తుసమృద్ధిని తెలుపును

120.సీ॥ చెవుల కీ తెల్ల యుచ్చిత కాయ లెంతేసి
పాఱుటాకులది కుప్పసమి దప్ప
అయ్యకుఁ గట్ట నెంత రంటాఁకు గల్గెరా
యీ పచ్చ తాడిబి ళ్లేడ దొక్కొ
వ్రేళ్లఁ జుట్టిన వెట్టి వేళ్లొకో చేతులఁ
బండుఁ దీఁగెలవి గొప్పులు కడేలు
తలకు వేసీకలో తాల్చిరి యీలాగు
నీ యచ్చ గురిజపే రెండుఁ గలిగె

తే॥ రాజు కాఁడన్న కంబమురాయఁ డితని
వేసమును మేలు బాగెము నేసియుంట
నిపుడు కమఁగొంటి మనిపల్కు వెఱుకు దొరల
ముగుద మాటలు విని చాలనగుచు నలరి. 120

టీక :- అప్ప = సం ఓరీ!, ఈ = ఇవి, చెవులకు, ఎంతేసి, తెల్లయుచ్చిత కాయలు, ఇది, పాఱుటాకుల పండుటాకుల యొక్క, కుప్పసమ = కూర్పాసము అనగా అంగి,

అయ్యకుఙ + కట్ట = కట్టుకొనుటకు, ఎంతరటాకు గల్గెరా = ఎంత యరటి యాకబ్బినది, ఈ పచ్చతాడి బిళ్ల = ఈ యొక్క ఆకుపచ్చని తాటియాకుల యొక్క బిళ్ల, ఏడదొక్కొ = ఎక్కడిదో కదా!, వ్రేళ్ల జుట్టినవి = వ్రేళ్లకు పెట్టుకొన్నవి. ఎట్టివెళ్లోకో = ఎటువంటి మూలికలో, చేతులఙ =చేతులకు, పండతీగెలవి = పండబారిన తీగలవి, గొప్పలు కడేలు = పెద్దపెద్దవైన కడియాలు, ఈలాగు = ఈ తీరున, తలకు , వేనీకలో = ఏపక్షుల యొక్క ఈకలోతాల్చిరి = ధరించిరి, ఈ యచ్చగురిజపేరు = ఈమేలిమి గురిగింజల దండ, ఎందుగలిగె = వీరికెక్కడ లభించెను. రాజుకాదన్న = ఇతడు మహారాజు గాడు, కంబము రాయడు = స్తంభోద్భవుడైన నరసింహస్వామి, ఇతని వేషమును మేలు = ఇతని వేషము బాగున్నవి. బాగెము నెసి యుంట = మనము భాగ్యము చేసి యుండుట వలన, ఇపుడు కనుగొంటిమి = ఇపుడితనిని చూడ గలిగితిమి. అని పల్కు = అని చెప్పుకొను, ఎఱుకు దొరల = ఎఱుకు రాజుల యొక్క, ముగుద మాటలువిని = అమాయకపు మాటలు విని, చాలనగుచు = మిక్కిలిగా నవ్వుకొనుచు, అలరి = సంతసించి –

తా : అప్పా చెవులకివి ఎంతేసి తెల్లయుచ్చింతకాయలు, ఇది పారుటాకు లకుప్పసము! కట్టుకొనుటకు అయ్యకు ఎంతపెద్దరటాకు కలిగినది. ఈ పచ్చని తాడి బిళ్ల ఎక్కడిది. వేళ్లకు చుట్టుకొన్నవి, యివియే చెట్ల యొక్క వ్రేళ్లు, చేతులకుండే యీపెద్ద కడేలు పండు తీగెలవి. ఈలాగున తలకు వేని యీకలో ధరించినారు. ఈఅచ్చమైన గురివిందల పేరెక్కడిది. ఈయన వేషము చూడ రాజు కన్నా! కంబము రాయడు, మేలుమేలు. మనము భాగ్యము సేసి యుండుట వలన నిపుడితనిని చూడగలిగితిమి. అని చెప్పుకొను యెరుకు దొరల యొక్క యమాయకపు యాస మాటలు విని వారలు మిక్కిలిగా నవ్వుకొనుచు –

విశే :- మహారాజు మరియు అతని సేనాపతులు చెవులకు ధరించిన యురువైన ముత్యములు వారు తెల్లని యుచ్చింత కాయలుగా పసుపు పచ్చని చొక్కాలు పారుటాకులకుప్పసములుగా పచ్చల తాళితాటియాకుల బిళ్లగా మొలకు గట్టిన ఆకుపచ్చని దట్టి పెద్ద యరటి యాకుగా వ్రేళ్లకు గల యుంగరములు మూలికలు వ్రేళ్లుగా, చేతులకుగల కడియములు పండుతీగల కడియములుగా తలకు గల ఉష్ణీషములు ఏవో పక్షుల యీకలుగా ఇటుల మహారాజు వేషము నొక విచిత్రమైన యడవి వేషముగా, నతనిని మహారాజుగా గాక నరసింహస్వామిగా తలచిరి.

ఇందువారి ముగ్ధత్వములో గూడిన భ్రాంతి యున్నది. జానపదులపరిచిత వస్తువుల సూచి నపుడవి తమకు పరిచితమైన వస్తువులని భ్రమపడు చుందురు. కాబట్టి ఇది భ్రాంతిమత్తు.

''అలం - స్మృతి''

సదృశవస్తు స్మరణము వర్ణింపబడిన యెడల నది స్మృత్యలంకారమన బడును. ఈపద్యమున యయాతి మహారాజు యొక్క భూషణాంబరము లాటవికులకు వారుధరించెడు వానిని స్మరింప జేసినవిగాన నిది స్మృత్యలంకారమగును. ''తేటగీతి'' యందు ''రాజుకాడన్న కంబము రాయజితడు'' అనుట నిశ్చయాంత సందేహమను సందేహాలంకార భేదమగును.

121.వ:- చనుచున్నెడ నిచ్చోటు వేఁటకు వాటంబని వేఁటకాండ్రు
విన్నవించు మాట లాలించి వేఁట వెట్టుమని పుడమి
తేఁ డానతిచ్చిన - 121

టీక :- చనుచున్నెడఁ = అటుల వారిని చూచి నవ్వుకొనుచు జంతసించి ముందుకు వెళ్లుచున్నపుడు, ఇచ్చోటు = ఈస్థలము, వేటకు వాటంబని = వేటకు మంచిదని, వేటకాండ్రు, విన్నవించు = విన్నపముచేయు, మాటలు + ఆలించి = మాటలువిని, వేటపెట్టుమని = ఇచటనే వేటకు సిద్ధము చేయుమని, పుడమి తేడు = మహారాజు ఆనతిచ్చిన = ఆజ్ఞాపింపగా-

తా :- మహారాజావిధముగా వారిని చూచి నవ్వుకొని సంతోషమున మందుకు వెళ్లు చుండగా వేటగాండ్రు ఈస్థలమే వేటకు బాగున్నదని విన్నవింపగా మహారాజు ఆమాటలు విని అయిన నిచటనే వేట జేయుదమని వారికాజ్ఞాపింపగా -

ఆశ్వాసాంతము

122. చ॥ దురమున వారు వంపుగమి ద్రొక్కఁగ లేచిన దుమ్ము క్రమ్మినన్
బురదయి యుండు నాకడలి బూనిక నేనిక మూఁకరేసివే
మఱు బుసకొట్టఁగా నెగయు మువ్వఁపు దుంపురు నీటి చేతరా
సిరి పయిఁ గూరిమిన్ మగుడ జెల్వుగ నించిన యాభగీరథా - 122

టీక :- దురమున = యుద్ధరంగమున, వారువంపుగమి = గుఱ్ఱముల గుంపు త్రొక్కగా, లేచిన దుమ్ము + క్రమ్మినన్ = బురదయియుండు, ఆకడలి = ఆయొక్క సముద్రము, పూనికన్ = పట్టుదలతో, నేనిక మూక = ఏనుగులగుంపు, రేసి = రేగి, రెచ్చిపోయి, వేమఱు = అనేక పర్యాయములు, బుసకొట్టగాన్, ఎగయు = ఎగురుచున్నట్టి, మవ్వపు దట్టమైన, తుంపురు నీటిచేత = రాసిరిపయి కూరిమిన్ = రాజ్యలక్ష్మి పై నుండు ప్రేమచేత, మగుడన్ = మరల, చెల్వుగ నించిన = ఆసముద్రమును చక్కగా నిండించిన భగీరదా! = ఓ అపర భగీరథుడా!–

తా :- యుద్ధరంగమున గుఱ్ఱముల గుంపు తొక్కిప దుమ్ములేచి సముద్రమంతయు బురద బురద కాగా రాజ్యలక్ష్మిపై గల ప్రేమచే దానిని యేనుగుల దండు విజృంభించి బుసలుకొట్టునపుడు చిమ్మెడు తుంపురుల నీటిచే మరల నింపినట్టి ఓ రెండవ భగీథుడా –

విశే :- ఏనుగులు బుసలుకొట్టునపుడు వాని తొండముల నుండి సన్నని నీటిపంపురులు చిమ్ముచుండును.

''రాసిరిపయికూరిమిన్'' అనుటచే లక్ష్మి సముద్రమున జనించినది కనుక నదిబురదయ్యెయింకిపోయిన తమ తల్లివారిల్లు భ్రష్టమయ్యెననియామెవగచును కాననామె పై గల ప్రేమచే నా సముద్రములు వట్టి పోకుండ మరలనీటీ చే నిండించెనని సూచితము.

''అలం – పూర్వరూపము''

123.క॥ తెలివిం బుడమిం దగు క
ల్వల రాయా! మైఁదనర్చు వలరాయ! కడుం
గలనైన వీ గెఱుంగక
కలనైన న్మెఱయు పెంపుగల ముక్కంటి ! 123

టీక :- తెలివిన్ = ప్రకాశమున, పుడమిందగు కల్వల రాయా = భూలోకమున నొప్పెడు చంద్రుడా !, మైదనర్చు = శరీరముగల, వలరాయా మన్మధుడా !, కడున్ = గొప్పగా, కలనైనా = కలను + ఐనన్ = యుద్ధము జరిగినను, కలనైనన్ = కలన్ + ఐనన్=స్వప్నమున గూడ, వీగెఱుంకన్= వీగు+ఎఱుంగకన్ = ఓటమియోఱుగక,

మెఱయు = ప్రకాశించు, పెంపుగల = గొప్పతనముగల, ముక్కంటి= మూడుకన్నులుగల రుద్రుడా! -

తా :- ప్రకాశమున భూలోకమున నొప్పెడు చంద్రుడా! శరీరముగల మన్మథుడా! ఎంతగొప్ప యుద్ధమైనను, కలయందు గూడ నోటమి నెరుగక ప్రకాశించు రుద్రుడా! -

విశే :- చంద్రునికి రాజనిపేరు. యయాతి భూలోకమున గల మహారాజు, మన్మథునికి అనంగుడని పేరు. అనగా శరీరము లేని వాడు. 92వ పద్యమున యయాతి తన రూపు వలకు పై దదల నెమ్మదులెల్ల మేలైన బేడిన మీలుగాగ = అనివర్ణింప బడినాడు. కనుక నితడు శరీరముగల మన్మధుడు, శివునికి భీముడని పేరు. యుద్ధములందతనికి యోటమియుండదు. అమీనుఖాను గూడ యుద్ధములందోటమి యెరుగని వాడేకనుక నతడు గూడ ముక్కంటియే.

''అలం - ఉల్లేఖము''

మత్తకోకిల:- పోరులం దెగి నీదుమార్తురు ప్రొద్దు నెన్నడు మొక్కటం
జేరి బల్విడి దూఱి బంగరు చేలయు న్సిరితోడి సిం
గారము న్సుడివాలుఁ జిందముఁ గల్గి పొంపుల మీఱుచుఁన్
రారువేలుపుఁ జానలిండ్లకు రాసిరిం దగు వేర్పరీ - **124**

టీక :- రాసిరిఁదగునేర్పరి = రాజైశ్వర్యములతో గూడిన నిపుణుడా!, పోరులలదెగి = యుద్ధరంగములందు చచ్చి, నీదుమార్తురు = నీయొక్క శత్రువులు, ప్రొద్దునెన్నడు మొక్కటఁన్ జేరి = యుద్ధమున మరణించిన వారు సూర్యలోకమును భేదించుకొని పోవుదురని ప్రసిద్ధి కనుక, సూర్యబింబము యొక్క మధ్యప్రదేశము చేరి, బల్విదిఁదూరి = శౌర్యముతో దానిని దూసుకొని, బంగరు చేలయు = బంగారు వస్త్రము సిరితోడిసింగారముఁన్ = లక్ష్మీదేవితోడి యందమును, సుడివాలు, చక్రము, చిందము = శఖము, గల్గి సొంపులఁన్, మీరుచుఁన్= అందమున ప్రకాశించుచు, వేల్పుల చానలిండ్లకుఁన్ = వారు అప్సర సలయిండ్లకు, రారు-

తా : రాజైశ్వర్యములతో ప్రకాశించు ఓయయాతి మహారాజా! యుద్ధరంగమున మరణించిన నీశత్రువులు సూర్యమండల మధ్యప్రదేశమును చేరి తమ

పరాక్రమముతో దానిని దూసి కొని ఆవలికి దాటి బంగారు వస్త్రము, ఎదపై లక్ష్మి, చక్రము మరియు శంఖము ధరించి సారూప్య ముక్తిని బొంది ప్రకాశించుచుందురుగాని, వారు అప్సరసల యిండ్లకురారు. అనగా - స్వర్గముచేరిన వారు "క్షీణేపుణ్యే మర్త్యలోకే విశంతి" ఆపుణ్య ఫలమునశించగానే మరల భూలోకమునకు వచ్చు చుందురు. కనుక వీరావిధముగా అప్సరసల ఇండ్లకు రాక అప్సరసల స్వర్గమున కంటె నెక్కువదగు సారూప్యముక్తిని పొంది పునరావృత్తి రహితులై యుందురని తాత్పర్యము.

యుద్ధమునమరణించినవారు సూర్యమండలమును భేదించుకొని
పోవు దురనుటకు తెనాలి రామకృష్ణయ్య చాటువు
కలనందావక ఖడ్గఖండనరిపు క్ష్మాభర్త మార్తాండమం
డల భేదం బొనరించి యేగునుడదన్మ ధ్యంబునఁహారకుం
డల కేయూరకిరీట భూషితుని శ్రీనారాయణుంగాంచిలో
గలగంబారుచునేగునీవయను శంకం గృష్ణరాయధిపా!

గురజాడరామమూర్తి కవిజీవితములు.

గద్యము :

ఇది శ్రీమదన గోపాల మంత్ర ప్రసాద లబ్ధ సారస్వత సుక విజన వర్ణ నీయవచో విభవ భావనా మాత్య తనూభవ సొన్నికంటి వంశ్య తెలగ నార్య ప్రణీతంబైన యయాతి చరిత్రంబను నచ్చ తెనుగు కబ్బంబు నందు బ్రథమాశ్వాసము.

★ ★ ★

ద్వితీయాశ్వాసము

1. క. సిరివంటి బడేబీబీ
విరిఁ బోడికి వెన్నుఁ డనఁగ వెలయుచు మిగులన్
గరగరికలఁ దనరెడు రా
సిరులందు నమీనుఖాన, చెలువములగమీ! - 1

టీక:- సిరివంటి =లక్ష్మీదేవివంటి, బడేబీబీ విరిబోడికి=బడేబీబీ యను పూబోఁడికి, వెన్నుఁడనగ వెలయుచు= విష్ణువనగా నొప్పుచు, మిగులన్= ఎక్కువగా, సిరులందు= ఐశ్వర్యములందు, గరగరికలన్ = శృంగారములతో, తనరెడు= ఒప్పెడు, అమీనుఖాన-చెలువముల = సౌందర్యముల యొక్క, గమీ = సమూహమా! (ఇది సంబోధన)

తా: లక్ష్మీదేవివంటి పూబోడియైన బడేబీబీకి విష్ణువు వంటి వాడవై యొప్పుచు సంపదలందు అధిక్యముతో నొప్పువాడ! ఓ అమీనుఖానా! సౌందర్యముల యొక్కపోనా!

విశే :- ఇందు బడేబీబీ లక్ష్మీదేవితో పోల్చబడినది. ఆమెను విరిబోడియనుట యిందు సాభిప్రాయ విశేషణము. విరిబోడి యనగా విరివంటి పోడిమి గలదియని వ్యుత్పత్తి యైనను - విరిబోడి యనగా నిచట విరియందు అనగా పూవునందు వెలసిన బోటియని చెప్పుకొనిన యెడల ఈ విశేషణము యొక్క యౌచిత్యము, కవి యొక్క మెళకువ యవగత మగును. సిరివిరిబోడి కనుక కవి ఆశ్రీదేవి వంటిదైన బడేబీబీనిచట విరిబోడియని చెప్పెను.

"అలం - ఉపమ"

2.వ:- అటమీఁది తెఱంగు వినుండు.

టీక:- అటమీది తెఱంగు= ఆ తరువాతి విధానము, వినుండు.

చెంచుల మొక్కులు

3.సీ॥ కంబమయ్యరో, మేలు గలిగించు నీకొక్క
గరుటాల మంతునిఁ గానుకిత్తుఁ
గాఁవ్రేడ, మొకముల కదుపు రాఁ జేయు మీ
జింకనొక్కటి నీకుఁ జేతికిత్తు

మలలమ్మ, వేఁటలో మాపాలఁ గల్గు మీ
సింగంపుఁ గొదమఁ దెచ్చెదము నీకు
దుగ్గమ్మ, కాఱుపోతుల లోను జేయు మీ
తొలిముద్దుగా నిత్తు దుంతనొకటి.

తే॥ యనుచుఁ దమవేలుపుల నెల్ల మును దలంచి
వేఁడుకొని మ్రొక్కి వాకట్లు వ్రేళ్లు గొనుచు
వలను లెస్సైన మిక్కిలి యులరు కొనుచు
వచ్చి యెఱుకులు వేఁటాడఁ జొచ్చి రపుడు.

1. కలిగిన

టీక: -కంబమయ్యరో=కంబములో పుట్టినఓ నరసింహస్వామీ, మేలుగలిగించుము = మాకు శుభము చేకూర్చుము. అడవుల సంకట స్థలుల నాజిముఖంబుల నగ్నికీలలం, దెడరుల నెల నాకునుతి, కెక్కగ దిక్కగుగాక శ్రీనృసింహుడు-అని నారాయణ కవచము - నీకు, ఒక్క, గరుటాలమంతుని=గరుత్మంతుని, అనగా గరుడ పక్షిని, కానుకిత్తుము=కానుక గా నిచ్చెదము/ కాట్రేడ=కాటి+ఱేడు, కాడు=అడవి, కాట్రేడు=అరణ్యాధిపతియైన శివుడు, అరణ్యానాం పతయే నమో - అనినమకము, మెకముల కదుపు=మృగసమూహము, రాజేయుమీ=మాకు వేటకు వచ్చునట్లు చేయుము. నీకు, జింకన్= ఒక్కటి, చేతికి+ ఇత్తుము / మలలమ్మ=అడవులలో నుండెడు తల్లి, అనగా పార్వతి, ఆమె అమ్మల (ఆ+మల) గన్నయమ్మ, వేటలో=వేటయందు, మాపాలగల్గు మీ=మా పక్షమున నుండుము, కలుగడే నాపాలి కలిమి సందేహింప కలిమి లేములు లేక కలుగువాడు - అని పోతన, నీకు, సింగపు గొదమ=సింగపు+కొదమ (సరళాదేశము) కోడె వయసు గల సింహమును తెచ్చెదము, దుగ్గమ్మ= ఓ దుర్గాదేవీ, కారుపోతులన్=అడవి దున్నలను, లోనుజేయుమీ = మాకు వశపడునట్లు చేయుము. నీకు, తొలిముద్దగా = ప్రథమ కబళముగా, దుంతనొకటి= ఒక దున్నపోతును, యిత్తుౘ, అనుచుౘ, ఇట్లని తమ వేలుపులనెల్ల=తమ తమ దైవమునెల్ల, మునుదలంచి=మొదట తలచుకొని, వేడుకొని=వారిని ప్రార్థించి, మ్రొక్కి=నమస్కరించి, వాకట్లు=వాయికట్లు, క్రూర జంతువుల నోరుకట్టెడు, వ్రేళ్లు=మంత్రించిన మూలికలు, కొనుచు=తీసికొని, వలను=అనుకూలము, లెస్సైన=లెస్స+అయిన =మిక్కిలి బాగుగా నుండగా,

మిక్కిలి అలరుకొనుచు = సంతసించుచు, యెఱుకలు వచ్చి, వేటాడఁగ, చొచ్చిరపుడు = వేటాడ బూనిరి.

ఈ పద్యమున ఆటవికులు వేడు దేవతలు చెప్పబడినారు.

తా :- ఓ నరసింహస్వామీ మాకు మేలె కలిగించుము నీకు ఒక గరుడ పక్షిని కానుకగా ని త్తుము, ఓకాటిరేడా ! వేటకు మృగములు మందలు మందలుగా వచ్చునట్లు చేయుము. నీ చేతికొక జింకనిత్తుము, ఓ మలలమ్మా! వేటలో మా పక్షమున నుండుము. నీకొక కోడెసింహము నిత్తుము. ఓ దుర్గాదేవీ ! వేటకు అడవి దున్నలను బాగుగా రప్పింపుము. తొలి ముద్దగా నీకొక ఎనుపోతు నిత్తుము. అని ఇటుల వారు తమ తమ ఇష్టదైవములను తలచుకొని యెఱుకులు రాజు సన్నిధికి వచ్చి తమకు అదును మంచిగా కనిపించగా వేటకుపక్రమించిరి.

విశే : నరసింహస్వామి అడవులలో నున్నప్పుడు స్మరింపవలసిన దైవమేగాక చెంచులక్ష్మి సంబంధము వలన ఆటవికులందరికిని దైవము. శివుడు అడవుల కదిపతి. కనుక కాట్రేడని అతనికి వ్యవహారము. పార్వతి పర్వతరాజు పుత్రిక కాబట్టి ఆమె మలలమ్మ. దుర్గమ ప్రదేశమల కధిపతి కనుక దుర్గ ఆటవికుల దైవము.
ఇక యెఱుకులు వారికి మ్రొక్కుకొనిన మ్రొక్కులను విచారించగా నరసింహుడనగా విష్ణువు. అతడు గరుడవాహనుడు. శివుడు కురంగపాణి. పార్వతి సింహవాహన, దుర్గమహిషాసుర మర్దని. కనుక వారాయా దేవతలకు తగిన కానుకల నిత్తుమని మ్రొక్కుకొనుట వారి యౌచిత్యమునకు గుర్తు.

దుర్గను తెలంగాణమున మైసమ్మయందురు. ఈమెకోటలో నున్నపుడు కోటమైసమ్మ - కనకదుర్గ యైనపుడు బంగారు మైసమ్మ ఈ మైసమ్మకు సాధారణముగా దున్నలనే బలి ఇచ్చుట ఆచారము. దీనికి జానపదులలో నొక కథ యున్నది.

F.B : బ్రహ్మ ప్రాణులన్నిటిని సృజించిన పిమ్మట దుర్గ తాను బలిగా తీసికొనుట కేజంతువు రుచికరముగా నుండునో తెలిసికొనుటకు దోమను పంపెనట. అది యన్నిప్రాణుల రక్తము పీల్చును. కనుక దేని రుచి ఎట్టిదో దానికి తెలియును. అది యన్నిప్రాణులను రుచి చూచుచు చివర కొకనాడు బల్లి యింటికి వచ్చెనట. అపుడు కుశలప్రశ్నలతో దోమదేవి తనను లోకమందలి యన్నిప్రాణుల రక్తమును రుచి చూడ నియోగించెనని

చెప్పగా బల్లి లోకములో నన్నిటికన్న దేని రక్తము రుచియని యడిగెను. అంత బల్లి మనిషి రక్తమని చెప్పెను. ఆ వార్త తెలిసి మానవులందరు దోమవెళ్లి కాళికతో మనిషి రక్తము రుచియని చెప్పనామె ఇక మనల విడుచునాయని బయపడ సాగిరి. ఈ లోపల బల్లికి దోమ యిన్ని ప్రాణుల రక్తమును రుచి చూచినది కదా! దీని రక్తమెంతరుచిగా యుండునో యని యప్రబుద్ధి పుట్టి దానినికాస్తా గుటకాయ స్వాహా చేసి, పిమ్మట తానే దేవి దగ్గరకు దోమ దూతగా వెళ్ళి ఆమెతో తల్లీ! దోమ అన్ని ప్రాణుల రక్తమును రుచి చూచుచు తిరిగి తిరిగి యలసి పోయి మాయింటిలో విశ్రాంతి తీసికొనుచు నన్ను మీ దగ్గరకు పంపినదని విన్నవించెను. అంత దుర్గ సరియే. అది లోకమునసే ప్రాణి రక్తము రుచియని చెప్పినదని యడుగ బల్లి మనిషి యనుటకు బదులు మాట తడబడుచు మహిషి-మహిషి యనుట. దానితో నామె యానాటి నుండి మహిషమును తనకు బలిగా నిర్ణయించెనట.

పిమ్మట మానవుల కీవార్తతెలిసి బల్లివలన తమకు కలుగ బోవు గండము తొలగినందులకు సంతసించి అది అస్పృశ్య- తాకరాని దైనను దానికి తమ ఇంటిలో స్థానమిచ్చిరట. బల్లులలో ఈనాడు పాలబల్లి-ముట్టుబల్లి యని రెండు రకము లున్నవి. పాలబల్లి తెల్లగా, ముట్టుబల్లి నల్లగా నుండును. పాలబల్లి కంటె ముట్టుబల్లి దోషమధికము. ఈ రెండు కూడ విషపు జంతువులే. పొరపాటున బల్లి కూరలలో గాని, అన్నములో గాని పడిన దానిని తిన్నప్పుడు మానవులు మరణింతురట.

వేట

4. క॥ మునువడిన మెకముఁ గొనిచని,
కనుగ్రుడ్లు పెకల్చి, నెత్తిగడిగి, కటారిం
గొని, తోఁక పొడిచి, యొకఁడొ
ననఁగ సురాళించె నయ్యయాతికిఁ గడఁకన్ -

టీక:- మునుపు వడిన మెకము=మొదటగా వేట జరిగిన జంతువును, కొనిచని= తీసికొనివెళ్లి, కనుగ్రుడ్లు పెకల్చి= కన్నులు పెకలించి, నెత్తిగడిగి= దానితలను నీటితో కడిగి, తోకపొడిచి= తోకను కోసివేసి, ఒకడౌననగాన్= ఒక వ్యక్తి యిట్లు చేయవలెనని మెచ్చుకొనుచుండగా, అయ్యయాతికిన్ = యయాతి మహారాజునకు, కడకన్ = ప్రయత్న పూర్వకముగా, సురాళించెన్ = దిగదుడిచెను.

తా:- ఒక వేటకాడు వేటలో మొదట పడిన జంతువును తీసికొని వచ్చి దాని కనుగ్రుడ్లు పెకలించి తీసి తలను నీటితో కడిగి తోకను కోసివేసి మరొక ఉది చూచి మెచ్చుకొనునట్లుగా అనగా పద్ధతి తప్పకుండ యయాతి మహారాజునకు దిగదుడిచెను.

విశే : ఇందులో ఆనాటి వేట యాచారము చెప్పబడినది. వేటను పెద్దన మొదలెందరో చెప్పిరిగాని దానిలో మొదట పడిన జంతువును మహారాజునకు దిగదుడుచు నాచార మింతవరకెవరును చెప్పలేదు.

ఇందు చనిపోయిన జంతువునకు కన్నులు పెకిలించుట, తోక కోయుట చెప్పబడినది. మరణించి నపుడు కన్నులు తెరిచి మరణించరాదని సామాన్యుల నమ్మకము. కన్నులు తెరచి చూచుచు మరణించిన నాయింటిలో మరొకరికి ఎవరికో మరణము సంభవించునని వారి విశ్వాసము. అందువలన వ్యక్తి మరణించునపుడతనికన్నులు మూయుదురు ఇక్కడ జంతువిషయమున గూడ నంతియే. కన్నులు తెరచి యుండిన నది మహారాజును చూచుచు తనవెంట రమ్మని పిలిచినట్లుండును. అందువలన దాని కన్నులు పొడుతురు. లేదా పెకిలింతురు. జాషువ బలిపీఠమును ఖండికలో తలతెగి తెరచియున్న మేక కన్నులను నన్నింతకాలము పెంచిన ఇతడేనా ఈపని చేసినదని ఆశ్చర్యపడు చుచూచుచున్నట్లు వర్ణించెను.

ఇక తోకను కోయుట ఎందుకనగా నది శరీరమును గృహమునకు పొరకవంటిది. పొరకతో దిగదుడువరుగాన దానిని కోయుదురు.

5.వ:- అంత నెఱుకులు కఱకుంబలుకులు చెలంగఁ చేర్చి యర్చిన.-5

టీక:- అంతన్= ఆపిమ్మట, ఎఱుకులు, కఱకుంబలుకులు చెలంగన్ = కఠినమ్మైన భాషణలు అనగా దూషణాత్మకములైన మాటలు విజృంభించగా, పేర్చి = విజృంభించి, యార్చిన = గొప్పగా ధ్వనిచేయుగా

తా:- ఆపిమ్మట అనగా మొదటపడిన జంతువును రాజుగారికి దిగదుడిచిన పిమ్మట వేట కాండ్రైన యాయెఱుకులు తమ యొక్క జాతి సహజమ్మైన పరుష భాషణలతో విజృంభించి గొప్పగా ధ్వని చేయుగా-

6.తే॥ తొలుత మ్రింగిన కొఱనెలల్ సెలవులందుఁ
గడగి వెడలించు నెలదిండిగాము లనఁగఁ
గొమ్ము పందులు వెడలె ఘుర్ఘురము లడరఁ
బొదలలో నుండి యప్పుడార్పులకుఁ గాఁక. - 6.

టీక:- కొమ్ముపందులు తొలుత మ్రింగిన=అంత వరకు కబళించినట్టి కొరనెలల్= దినములు తక్కువ చంద్రబింబములు, అనగా నెలవంకలు. సెలవులందు=పెదవుల మూలముల నుండి, కడగి = ప్రయత్నపూర్వకముగా, వెడలించు=బయటికి వెడలగాయు, నెలదిండిగాములు =చంద్రుని కబళించు గ్రహములు అనగా రాహువులు, అనగా, కొమ్ముపందులు=కోరలు సెలవుల నుండి బయటికి వెడలిన అడవిపందులు, అప్పుడు, పొదలలో నుండి, ఆర్పులకు= ఆయొక్క ఎఱుకులకు ధ్వనులకు, గాఁకన్=తాళలేక, ఘుర్ఘురములడరఁ = గురుగురుమను చప్పుడు లొప్పగా, వెడలెను=బయలుదేరెను.

తా:- అపుడు ఆయెఱుకులు చేయు ధ్వనులకు తట్టుకొనలేక అంతవరకు తాము మ్రింగిన నెలవంకలను సెలవులనుండి వెడలగ్రక్కుచున్నవేమో అన్నట్లున్న కోరలతో రాహుగ్రహములవలె నున్న కొమ్ముపందులు పొదల నుండి ఘుర్ఘురములతో బయటికి వచ్చెను.

విశే :- అలం - ఈ పద్యమున ఉత్ప్రేక్ష - ఇందు పందికోరలను నెలవంకలతో పందులను తమోగ్రహము అనగా నల్లనివాడు కావున రాహువుతో పోల్చుట తెలగన్న యొక్క ప్రతిభకు నిదర్శనము.

అలం - ఉత్ప్రేక్ష

7. క॥ పొదలట్లు వెడలు పందుల
కదుపులఁ బట్టెడలు దిగిచి కవియించిన బె
ట్టిద మైన జాగిలంబులు
చెదరక డాయంగఁ జూచి, చెంచులు కడఁకన్ - 7.

టీక : పొదలు- అట్లు, వెడలు, పందుల కడుపులన్= మందలను చూచి, పట్టెడలు=మెడలకు

గల పటకాలు, తిగిచి=సడలించి, బెట్టిదమైన = భయంకరమైన జాగిలంబులు = వేటకుక్కలు, కవియించినన్= ఆపందులను చుట్టుముట్టునట్లు చేసిన, అవి యనగా ఆ జాగిలములు, చెదరకన్= ఆ పందులను చూచి చెదరి చిల్లిపోక, డాయంగన్ = ఆ పందులను సమీపించు చుండగా, చూచి,చెంచులు, కడఁకన్=తవు ప్రయత్నముతో

తా:- ఆవిధముగా పొదల నుండి వెడలుచున్న పందుల మందలను చూచి వేటకాండ్రు మెడలకు కట్టిన పట్టెడలను సడలించి వేటకుక్కలను ఆ పందుల పైకి పంపగా నవి వానిని చూచి చెదరిపోక ఆ మందను సమీపించగా చెంచులది చూచి -

8.క॥ వడి నుసికొలుపుటయును నిరు
గడల న్వెనువంకఁ జేరి కఱవఁగ గినుకం
గుడి యెడమఁ దిరుగు నెడమం
గుడిదిరుగున్ సాగి పోక గుటగుట లడరన్ - 8.

టీక : వడిన్ = వేగముగా అనగా వెంటనే, ఉసికొలుపుటయును= ఉసికో- ఉసికో యని ఆ కుక్కలను ప్రేరేపింపగా అవి, ఇరుగడలన్=రెండు వైపులను, వెనువంకన్=వెనుకవైపును, చేరి, కఱవగన్=వానిని కరచుచుండగా, ఆపందులు, సాగిపోకన్=ముందునకు వెళ్లలేక, గుటగుటలమరన్=గుండెగుబగుబ లాడగా, కినుకన్= ఆకుక్కలపై కోపముతో, కుడియెడమందిరుగున్=కుడి నుండి యెడమకు, ఎడమం కుడిదిరుగున్ = ఎడమ నుండి కుడికి, తిరుగున్ = తిరుగుచుండును.

తా:- పొదల నుండి వెడలిన పందులపైకి కుక్కలను పంపగా అవి వెడలి వానిని చుట్టుముట్టుట చూచి చెంచులు వెంటనే వాని నుసికొలుపగానవి ఆ పందులకు రెండువైపులను మరియు వెనుకవైపునను జేరి కరవసాగగా నా పందులు ముందుకు సాగక, గుండె గుబగుబ లాడుచుండ కోపముతో నా కుక్కలు కరువకుండ కుడి నుండి యెడమకు, ఎడమ నుండి కుడికి తిరుగుచుండెను.

విశే:- పందికి మెడ తిరుగదు కనుక వెనకి వైపు చూచుట కది పూర్తిగా వెనుకకు తిరుగ వలసియే యుండును.

ఈ పద్యమున చుట్టు శత్రువులు చేరినపుడు వాని నుండి రక్షించుకొనుటకు పందులెట్లు తిరుగునో సహజముగా చెప్పబడినది. కనుక ఇందలి యలంకారము "స్వభావోక్తి" వరాహ భ్రమణమునకు నితరములు-

క. రిభవార్జునశరపాత - ప్రభవవ్యధదిరిగెనవ్వరాహముకడు సం
క్షుభితమ్మైవిలయమువేళా - నభస్వదుద్భ్రాంతఘనఘనాఘనము క్రియన్

హర - 7-47

క. ఖండేందుధరుని శరమున్ - పాండవ మధ్యమునిశరముప్రక్కలు గాడన్
రెంగుతలలనగదిరిగన్ - చండగతిన్ పంది గఱచి శరములు దివియున్

కాళ - 4-182

9.ఉ. అంతట నొక్కచెంచు కడు నగ్గలకం జని పందిపోటు మై
చెంతకుఁ బోవఁ జూచుటయుఁ జిందఱఁ గొమ్ములనెత్తఁ, బందినిం
తింతలు చెక్కలై పడఁ బయిం బడి నొంచెఁ బిడేన, దాని క్రొ
వ్వంతయుఁ గాఱి కాఱి యుచటారక నేతను దోఁగునట్లుగన్ - 9.

టీక:- అంతటన్ = అపుడు, ఒకచెంచు, కడు=మిక్కిలి, అగ్గలికన్ = ఉత్కర్షచేత, చని=వెళ్ళి, పందిపోటుమై = పందిని పొడుచుటకై, చెంతకు బోదన్ =దాని దగ్గరగా వెళ్లుటకు, చూచుటయు = చూడగా, చిందరన్ =కోపముతో అది, కొమ్ములనెత్తన్ = కొమ్ములతో కెత్తగా పయింబడి=దానిపైబడి, పందిని, దానిక్రొవ్వు, అంతయు కారికారి, యుచట, ఆరక, నేలయుంతయు, నేతనుదోఁగునట్లగన్ = ఆకొవ్వులో బాగుగా తడియునట్లుగా, పంది, ఇంతింతయు చెక్కలైపడన్ = చిన్నచిన్న ముక్కలై పడునట్లుగా, పిడేనన్ = బాకుతో, బంచెన్ =దానిని హతమార్చెను.

తా:- అపుడొక చెంచువాడు మిక్కిలి మొనగాని తనముతో పందిని పొడుచుటకు దాని దగ్గరకు వెళ్లగా అది అతనిని కొమ్ములతో నెత్తగా దానిపైబడి క్రొవ్వంత గూడ కారికారి నేలలొప్పదోగునట్లుగా దానిని బాకుతో ఇంతింత ముక్కలగునట్లు చెండెను.

"కందము చెప్పిన వాడే కవి. పందిని పొడిచిన వాడే బంటు" అని సామెత.

10.ఉ- కుక్కల నొంపఁ జూచి, మఱికొందఱు కొన్నిటిఁ గొంగవాలునం
బ్రక్కలు చించినం, గదిసి పైఁబడి కొమ్ముల వారినందఱం
జెక్కలు చేసినం, గడలఁ జెంచులువే చముదాళ్ళఁ బందులన్
ప్రక్కలు వాపి రన్నిటిని, వండఁగ జెండిన మాడ్కి నుండఁగన్ - 10

టీక:- కుక్కల నొంపఁ జూచి= ఆ పందులు కొన్ని కుక్కలను చంపగాచూచి

సీ॥ చప్పరించుమెకంబు జాగిలంబుల మిత్తి- అని వరాహ నామములువేం.తి-95 మరికొందరు = అపుడింకను కొందరు, కొంగవాలునఁ= వూదిగకత్తిచేత, ప్రక్కలజించన్ = ఆ పందుల యొక్క పార్శ్వములను కోయగా, కదిసి=సమీపించి, పైబడి=అవి వారలమీదపడి, కొమ్ములన్=కోరలతో, వారినందరన్-చెక్కల జేసినన్=చర్మము చెక్కలుచెక్కలగునట్లుచేయగా, కడలఁ=ప్రక్కలలోగల, చెంచులు, వే=వేగముగా, జముదాళ్ళన్=(యముధాటి.ప్ర) పొడవైన పిడులుగల కత్తులతో, పందులన్= ఆ వరాహములను, వండగన్=వండుటకై, చెండిన మాడ్కి=ముక్కలు చేసినట్లు, ఉండగన్, అన్నిటిని= ఆ పందులన్నిటిని, ప్రక్కలు వాపిరి=పార్శ్వములు ముక్కలు చేసిరి.

తా:- అపుడు కొందరు వేటగాళ్లు ఆ యడవి పందులు తిరుగబడి తమ వేట కుక్కలను చంపగా చూచి, తమ చేతులందుండెడు వంకనైన కత్తులతో ఆ పందుల యొక్క ప్రక్కలు కోయుగా అవి వారిని సమీపించి పైబడి కోరలతో వారి శరీరములను క్రుమ్ముతు చెక్కలు చెక్కలు చేయుగా వెంటనే ప్రక్కగానున్న చెంచులు వచ్చి తమ చేతులందుండెడు పొడవైన పిడులుగల కత్తులతో నా పందులను వండుటకు చేసిన ముక్కల వలె వాని పార్శ్వములను ముక్కలుగా నరికిరి.

11.చు॥ ఎదురుగఁ బీటవెట్టుకొని యెవ్వరిఁ జేరఁగనీక, నల్గడం
గదిపిన కుక్కలం దునుమ, గద్దరి పంది నొకండు, వెన్నుచే
యదరక ముప్పిడిం బొడిచి, యుంటఁగ బట్టుచుఁగోఱఁగొట్టిన
న్నెదలగనీక తెచ్చినను, మెచ్చులొసంగెను రాజువానికిన్ - **11**

టీక : ఎదురుగ= ఆవేటకాంౘ్రడకు ఎదురుగా, పీటవెట్టుకొని=తిష్టవేసికొని

సీ:- పీటవెట్టు మెకంబు, మోటజారు మెకంబు - వేం. ఆ. 95
పందికి పీట వెట్టు మెకమని పేరు.

ఎవ్వరిజేరగనీక= ఎవరిని గూడ దగ్గరకు రానీయకుండ, నీల్గడఁగదిసిన=నలువైపుల నుండి సమీపించు, కుక్కలన్ దునుమ = కుక్కలను చంపగా, గదరి పందిని = అటువంటి గర్విష్ఠియైన వరాహమును, ఒకండు, వెన్నుచే = వెనకి భాగము నుండి, య ఎదరక = ఏ మాత్రము గూడభీతిల్లక, ముప్పిడిం బొడిచి = ముప్పిడియను చేతికత్తితో పొడిచి, యటంగ బట్టుచు =దానిని గట్టిగా పట్టుకొని, కోరగొట్టినఁ=అది

కోరతో కొట్టినప్పటికి, మెదలగనీక = దానిని కదలనీయకుండ, తెచ్చిన = పట్టుకొని తేగా, రాజు = యయాతి మహారాజు, దానికి,
మెచ్చులొసంగెను = బహుమతులిచ్చెను.

తా :- ఒక పంది వేటగాండ్ర కెదురుగా దాష్టికముతో పీటవెట్టుకొని కూర్చొని ఎవ్వరిని దగ్గరకు రానీయక నలువైపుల నుండి వచ్చెడి కుక్కలను చంపగా అటువంటి గర్వపోతైన పంది నొకడు వెనకి నుండి వెళ్లి చేతికత్తితో పొడిచి గట్టిగా పట్టుకొని యది యతనిని కోరతో కుమ్మినను లెక్కచేయక కదలకుండ పట్టుకొని మహారాజు దగ్గరకు తేగా ఆయన యతని సాహసమునకు మెచ్చి బహుమతులిచ్చెను.

' అలం – స్వభావోక్తి '

ఎలుగు వేట

12.సీ॥ వేల్పుమన్నీనికై వెఱచి పెన్బొదలలో
నొదుగు కాటుక కొండ కొదమ లనఁగఁ
బ్రొద్దునకై లోఁగి పోయి సందుల డాఁగి
బెదరి వెడలు నిర్లపిల్ల లనఁగ
నచటెల్లఁ దమచాయ నంటినట్లుగ నుండఁ
దిరుగు లాడెడు నీలి తిన్నె లనఁగ
నడవి మున్నీరంచు నరుదెంచి పోలేక
పూని త్రిమ్మరు మబ్బుకూన లనఁగఁ
తే॥ దావిగుబ్బలిదెస యేలుదేవ రలిగి
పుడమిఁ బంపిన తనబంట్ల పూవ లనఁగఁ
జాడమేనులు గరుదాల్పు చొప్పు గలుగు
నెలుఁగులను జూచి మది నుబ్బి యొఱుకు లెదిరి – 12

టీక:- వేల్పుయన్నీనికై = దేవేంద్రుని కొరకు, వెఱచి = భయపడి, పన్బొదలలో నొదుగు = పెద్దపెద్ద పొదలలో ఒదిగిపోయిన, కాటుక కొండ కొదమ లనగ = కాటుక కొండ యొక్క పిల్లలేమో అన్నట్లుగా / ప్రొద్దునకై = సూర్యునికి, లోగిపోయి = ఓడిపోయి = లొంగిపోయి బెదరి, సందులడాగి = సందులలో దాగుకొని, వెడలు = ఆప్రొద్దుగ్రుంకిన పిమ్మట బయటికి వచ్చు, ఇర్లపిల్లలనగ = ఇరులు = చీకటులు,

ఇర్లపిల్లలనగ=చీకటి యొక్క పిల్లలేమో అన్నట్లుగా అచటెల్ల= అంతటా, తమ చాయ: =తమ యొక్క వన్నె, అంటినట్లుగన్ + ఉండు, తిరుగులాడెడు =సంచరించు, నీలితిన్నెలనగ=నల్లని యంరంగు లనగ / అడవి = ఆ అరణ్యము, మున్నీరంచు=సముద్రమని, అరుదెంచి =వచ్చి, పోలేక=మళ్లి ఆకాశమునకు వెళ్ల లేక, పూని=ప్రయత్నపడి, త్రిమ్మరు =తిరుగులాడు, మబ్బుకూనలనగ=మేఘముల యొక్క పిల్లలనగ / తావి గుబ్బలి=మలయ పర్వతము, తావిగుబ్బలిదెస =దక్షిణము, ఏలుదేవర=దక్షిణమును పాలించు దైవము- అనగా యముడు, అలిగి=కోపించి, పుడమిజూపిన=భూలోకమునకు పంపిన, తనబంట్లు=తనసేవకులైన యమదూతల యొక్క, పూపలనగ=పిల్లలనగ, చూడన్=చూడగనే. యేనులు=శరీరములు గరుదాల్చు=గుగురు పొడుచు, చొప్పు=విధానము, రీతి, కలుగు ఎలుగులను జూచి=భల్లూకములను చూచి, ఎఱుకులు, మదినుబ్బి=మనస్సున సంతసించి, ఎదిరి=విజృంభించి.

తా:-. దేవేంద్రునికి వెరచి పెద్దపెద్ద పొదలలో దాగిన కాటుక కొండ యొక్క పిల్లలో, సూర్యునికి లోగిపోయి సందులలో దాగి సాయంకాలమైన పిమ్మట బయటికి వచ్చిన చీకటి పిల్లలో, శరీరమంతటా తమవన్నె అంటినట్లుగా ఉండి తిరుగాడు చుండునల్లని తిన్నెలో అడవిని చూచి సముద్రమని తలచి భూలోకమునకు వచ్చి మళ్లి పైకి వెళ్లలేక తిరుగుచున్న మేఘపు తునకలో, యమధర్మరాజు భూలోకము చూపుటకుపంపిన తన సేవకుల యొక్క బిడ్డలో అన్నట్లుగా నుండి చూడగనే శరీరము గగుర్పాటు చెందగల యెలుగు బంట్లను చూచి ఎఱుకులు మనస్సున సంతసించి చెలరేగి -

విశే:- ఈ కవి మేడలను ఎచ్చట చెప్పినను బంగారువిగ, తిన్నెల నెక్కడ చెప్పినను నల్లనివిగా వర్ణించినాడు. మేడలను బంగరువిగ చెప్పవచ్చును. కాని తిన్నెలను నల్లనివిగా చెప్పుటలోని విశేషమేమియో -

"అలం: ఉత్ప్రేక్ష."

13.క॥ వడినొక్క యెలుఁగు చెంచులఁ
గడచి, తనుం బొదువ వచ్చు గద్దరి యెఱుకుఁ
మెడవట్టి కొన్నఁ గ్రిందను
బడి ముప్పిడి నతడు బొరఁ బగిలిచి నొంచెన్ - 13

టీక:- వడిఁ=వేగముగా, ఒక యెలుగు, చెంచుల గడచి=చెంచులను దాటి, తనుంబొదువ వచ్చు =తనను పట్టుకొనుటకువచ్చెడు, గద్దఱి యెఱుకుఁ=గడుసైన ఎఱుకు వానిని, మెడవట్టుకొన్న, క్రిందనుబడి, అతడు, ముప్పిడిఁ=ముష్టికి మాత్రమే సరిపడు పిడిగల బాకుతో, దానిని బోర బగిలిచి=దాని రొమ్మును పగులచీరి, ఒంచెఁ =చంపెను.

తా:- ఒక ఎలుగు వేగముగా చెంచువారినందరిని దాటి తనను పట్టుకొనుటకు వచ్చెడు భయంకరమైన ఎఱుకు వానిపైకి వచ్చి మెడపట్టుకొనగా వాడుక్రిందపడి తనచేతిలోని బాకుతో దాని రొమ్మును చీల్చి చంపెను.

విశే:- ఎలుగునకు ఎద సున్నితము. అది ఎదకెంత సూక్ష్మమైన దెబ్బ తగిలినను చచ్చునట. అందువలన ప్రమాద వశమున క్రిందబడవలసి నపుడు ఎలుగు వెల్లికిలనే గాని బోరగిలబడదట. అటులే పందికి ముట్టి ఆయువు పట్టందురు. ముట్టెపై తప్ప మరెక్కడ కొట్టినను అదిచావదట.

వేటకాండ్రు ఎలుగును క్రిందబడవైచి దానిపై నిలిచి ఎదను చీల్చి భీముడు దుశ్శాసనుని రక్తము త్రావినట్లు దాని రక్తము త్రావుదురు. అది పుంస్త్వమును వృద్ధిచేయునని వారి నమ్మకము.

14.క॥ దానిఁ గని వచ్చి పైఁబడు
వానిని, బల్లెములఁ గొంగ వాలుల సురెలన్
మేనులు వ్రాలిచి పెంపున
ఱేనికి సంతసము చేసి ఱేసిరి కడఁకన్ - 14

టీక:- దానిగని = అటుల చంపిన దానిని చూచి, వచ్చిపైబడువానిని = గుంపు గా వచ్చి తమపై బడు ఎలుగులను, బల్లెముల, కొంగవాలుల, సురెలన్= బల్లెములతో, వంకర కత్తులతో, సురియలతో, పెంపునఁ = ధైర్యముతో, మేనుల వ్రాలిచి = వాని శరీరములు నేలకొరుగునట్లు చేసి, కడకఁ = సాహసముతో; ఏసిరి = వానిని కత్తులతోనేసిరి, ఱేనికి సంతసము చేసిరి = మహారాజునకు సంతోషము కలిగించిరి.

తా॥ ఒక చెంచువాడటుల తనపైబడిన ఎలుగును చంపగా చూచి తమపై బడవచ్చిన యెలుగులనెల్ల వారు బల్లెములతో పొడిచి వంకర కత్తులతో నరికి, సురెలతో పొడిచి చచ్చిపడునట్లు చేసి తమ మహారాజునకు సంతోషము కలిగించిరి.

15.వ- అప్పుడొక కొందఱు

-: సివంగివేట :-

16.ఉ:- చెంగటఁ బాఱులేళ్లఁ గని, చేతుల సన్నల నెడ్ల నిల్పి, సి
వ్వంగుల బండ్లు డించి, తగ వానికిఁ గన్మొఱుఁగుల్దెరల్చి, యా
మంగలఁ బాఱఁ జూపుటయు, మున్నుగ నాయుచుఁ బోయిచేరువం
జంగున దాటి పైకుఱికి చంపి కలంచెను వాని నన్నిటిన్

టీక : చెంగటన్ = సమీపమున, పాఱులేళ్ళఁ గని = పరుగెత్తు జింకలను చూచి, చేతులసన్నలన్ = చేతి సైగలతో, ఎడ్లనిల్పి = ఆలేళ్లకు తాముకనిపించకుండ ఎద్దులను మాటుగా నిలుపుకొని, సివ్వంగుల = సివంగులను, బండ్లుదించి = బండ్లపైనుండి క్రిందికి దించి, తగవానికి కన్మొఱుగుల్ దెరల్చి = వానివానికి తగినట్లు కట్టియుంచిన కన్నుల మరుగులు తొలగించి, ఆమృంగల = వానికి తమ ఎదురుగా, పాఱజూపుటయు = పరుగెత్తుటకు చూపగా, మున్నుగ డాయుచు బోయి = అవిముందుగా వానిని సమీపించి, చేరువన్ = దగ్గర, చెంగున దాటి = చెంగుమని దూకి, పైకుఱికి = వినిపైబడి, వానిని అన్నింటిని కలంచి = కలగజేసి, చంపెను.

తా : అపుడు కొందరు తమ సమీపమున పరుగెత్తులేళ్లను చూచి చేతి సైగలతో ఎద్దులను మాటుగా నిలుపుకొని బండ్లపై వేటకు కొనివచ్చిన సివంగులను క్రిందికి దించి వాని కండ్లకు కట్టిన గంతలు విప్పి ముందువైపు పరుగెత్తుటకు చూపగా అవి పరుగెత్తుచున్న లేళ్లను సమీపించి వానిని కలవరపరచి చెంగుమని పైకి దూకి మెడలు విరిచి చంపెను.

-: లేడి వేట:-

17.తే॥ పెంపుటిఱ్ఱులు కినుకలు పెనచి పోయి
కొమ్ముసుచ్చులఁ దగిలించుకొన్న నరిగి
రాజు చూడంగఁజెప్పంగరాని కడిమి
నీఁటియులఁ గ్రుమ్మి నొంచిరి లేటిమగల - 17

టీక:- పెంపుటి ఱ్ఱులు = పెంపుడు జింకలు, కినుకలు పెనచిపోయి = మోహములు పెనవేసుకొని వెళ్ళి, కొమ్ము సుచ్చులన్ = తమ కొమ్ములకు కట్టిన యుచ్చులలో, లేటి మగలన్ = మగలేళ్లను, తగిలించుకొన్నన్= అరిగి వేటకాండ్రు వెళ్లి, రాజు

చూడంగన్ = ఆ యయాతి మహారాజు చూచుచుండగా, చెప్పంగరాని కడిమిన్ = చెప్పలేనంతటి దిట్టతనముతో, ఈటియుల గ్రుమ్మి నొంచిరి = ఆ జింక పోతులను ఈటలతో పొడిచి చంపిరి.

తా:- పెంపుడు జింకలు కొమ్ములకు నుచ్చులు కట్టి విడువగా మోహము పెనవేసుకొని వెళ్లి మగ జింకలను తమ యుచ్చులలో తగిలించుకొని నిలుపగా మహారాజు చూచుచుండగా వేట కాండ్రు వెళ్లి వాని నీటెలతో పొడిచి చంపిరి.

విశే:- వేటకాండ్రు తాము పెంచినటువంటి పెంటి జింకలకు కొమ్ములకు, వెనుక మోకాళ్ళకు గూడ నుచ్చులు కట్టెదరు. కొమ్ములకు కట్టెడు నుచ్చు చిలుకటముడి వలె, వెనుక పిక్కలకు కట్టెడి యుచ్చు చిన్నవక్కల సంచివలె నుండును. ఇదివల .ఇవిగాక ఆ పెంపుడు జింకలకు వెనుక పిక్కలకు సీసపు గుండ్లు కట్టెదరు. అవి ఆ జింకలు పరుగెత్తినపుడు మోకాళ్లకు పటపట తాకును. కనుక అవి ఇక పరుగెత్తలేవు. వేటకాండ్రు వానిని అడవిలో విడువగా ఆ పెంటి జతకు వచ్చిన పోతులు తనవలపు దానికి తెలుపుటకు కొమ్ముతో మెడదగ్గర మెల్లగా గీరును. అపుడు దాని కొమ్ము పెంటి కొమ్ముకు కట్టినయురిలో చిక్కును. లేదా అది వెనుక చేరి దాని తొడను తన ముంగాలితో గీరును. అపుడాకాలు దానిపిక్కకు కట్టిన వలలో చిక్కును. ఈ విధముగా జింకపోతు అక్కడ బందీయై నిలువగా వేటకాండ్రు వెళ్లి దాని నీటెలతో పొడిచి చంపుదురు. లేదా జీవగ్రాహముగా పట్టుకొందురు.

కొమ్ములుగల జంతువులు తమప్రేమను తెలుపుటకు ప్రియురాలిని మెడక్రిందమెల్లగా గోకుననుటకు -

మధుద్విరేఫఃకుసుమైక పాత్రే
పవౌప్రియాం స్వామనవర్తమానః
శృంగేణచస్పర్శ నిమీలితాక్షీం
మృగీమకండూయత కృష్ణ సారః
కుమార - స. 3-36.

సీ. మృదువుగా కొమ్ముల మెల్లనగళముల
నివురుచు ప్రేమతో నెఱపు వలపు
భాగ. స్క.8 -39 ఇదిగజేంద్రుని శృంగారచేష్ట

-: ఎద్దువేటు :-

18.క॥ ఎద్దులు మఱుఁగులుగాఁ జని
గద్దరులై చేరు పెన్మెకంబుల నాలో
నుద్దవిడి నొంచి రలవున
నద్దరి యని యయ్యయాతి యబ్బురపడఁగన్ - 18

టీక:- ఎద్దుల మఱుగలుగాజని = ఎద్దులయొక్క చాటుగా వెళ్లి, గద్దరులై చేరు = గర్వముతో వానిని సమీపించు, పెన్మెకంబులన్ = అనేకములైన మృగములను, ఆలోఁ = అపుడు, అద్దిరయని = ఔరా! నేర్పనగా అదియని, అయ్యయాతి = ఆ యయాతి మహారాజు, అబ్బుర పడగఁ = ఆశ్చర్యపడుచుండగా, ఉద్దవిడిఁ = శీఘ్రముగా, అలవున =నేర్పున, ఒంచిరి = చంపిరి.

తా:- వేటకాండ్రు ఎద్దుల మరుగున నడచుచు, వానిని నమ్మి సమీపించు గబ్బి జంతువులను యయాతి మహారాజు నేర్పనగా నదయని మెచ్చుకొను చుండగా ఈటెలతో వేగముగా పొడిచి చంపిరి.

విశే :- వేట కొరకు ఎద్దులను లేదా ఆవులను వేయుచున్నట్లు నటించుచు మెల్లగా నడవ నేర్పుదురు. పిమ్మట వేటకాండ్రు దాని చాటున చేతితో ఒక బల్లెమును పట్టుకొని వంగి దాని యడుగు వెంట అడుగు వేయుచు నడుచుచుందురు. అపుడు కుందేలు జింక మొదలైనవి ఆయెద్దును చూచి యెద్దేయనుకొనును. గాని దాని చాటున పొంచియుండు ప్రమాదమును పసిగట్టలేవు. నవి యటులే నిర్భయముగా నిలుచును. అపుడు వానిని గమనించి వేటకాడు చేతిలోని బల్లెముతో పొడిచి చంపును. జంతువులను నమ్మించుటకు ఎద్దుచాటున నడుచు నీవేటకాండ్రో కక్కపుడాకు పచ్చని దుస్తులు వేసికొనుట లేద తలకు కానుగు తంగెడు మొదలైన ఆకుల మండలు కట్టుకొనుట గూడ జరుగును. వానిని గని జంతువులది చెట్టనుకొని పారిపోవు.

-: జింకవేటు :-

19.క॥ మిడిబోనులఁ గాలుచ్చులఁ
బడఁ దోలియుఁ బోఁగు లోను పఱిచియు లేళ్ళన్
వడిగల జింకల నెల్లం
బొడిచిరి కడుఁ జెంచు లాఱుపులఁ జదలదరన్ - 19

టీక : చెంచులు విడిబోనులన్ = విడివిడిగా ఉంచిన బోనులలోను, కాలుచ్చులన్ = కాళ్లకు తగులు బంధములలోను, లేళ్లన్ = ఆడుజింకలను, వడిగల = వేగముగల జింకల నెల్లను, పడఁద్రోలియు = వానిలో పడునట్లు జోపి, పోగు = పోగు దాళ్లకు, లోనుబరచియు = లోబడి చిక్కునట్లు తోలి, కడు = మిక్కిలియైన, అరపుల = ధ్వనుల, చదలంటన్ = నింగిముట్టు చుండగా, పొడిచిరి = ఈటెలతో గ్రుమ్మిరి.

తా:- చెంచులు ఇంకను ఆడు జింకలను, జింకపోతులను తాము ఉంచిన విడి బోనులలో పడునట్లు, కాలురులలో తగులునట్లు పోగు డ్రాళ్లలో చిక్కునట్లు మిన్నుముట్టెడు అరుపులతో జోపి, వానిని ఈటెలతో పొడిచి చంపిరి.

విశే:- ప్రోగు త్రాళ్లు అనగా బంతివల వాటముగా అడ్డముగా, నిలువుగా పెద్దపెద్ద గళ్లు ఏర్పడునట్లు కట్టెడు త్రాళ్లు, ఆగళ్లను చూచి జంతువులు దాని నుండి దూరి పోవచ్చునని తలలు దూర్చి శరీరము దూరక చిక్కిపోవుచుండును.

20.వ- అప్పుడు -

అనగా ఆసమయమున

-: పాది వేట :-

21.ఆ- పాదివేట జూడఁ బదరెడు రాజేని
మదియెఱింగి, తడవు మనిన వెలిచె
కౌఁజు కారుకోడి కక్కెర, పూరేడు
చింద లున్న గూండ్లు చేరఁదెచ్చి - 21

టీక:- పాదివేట జూడన్ = పాదులను పరికరములతో ఆడెడు పక్షివేట (వీనినిపుడు పంతెలందురు) చూడన్ పదరెడు = కోరెడు, రాజేని = రారాజైన ఆ యయాతి యొక్క, మది యెరింగి = మనస్సును తెలిసికొని, తడవు మనిన = కానిమ్మనగా, వెలిచె = వెలచె పిట్ట, కౌజు = కపింజలము, కారుకోడి = అడవి కోడి, కక్కెర = కర్కరేటువు, పూరేడు = పూరేడు పిట్ట, చిందలు = చింద=చిన్న డేగలని నిఘంటువు బురక అని జానుల వాడుక, లువర్ణకం సామూహిక ప్రత్యయము ఉన్న గూండ్లు = అవి యుంచిన వెదురు గూళ్లు లేదా పంజరములు, చేరదెచ్చి = సమీపమునకు తెచ్చి.

తా:- మహారాజైన యయాతి అపుడు పాది వేట చూడవలెనని కోరగా వారు కానిమ్మని వెలిచె, కౌజు, కారుకోడి, కక్కెర పూరేడు, చింద అను పెంపుడు పక్షులు గల పంజరముల నచటికి తీసికొని వచ్చి.

22.క॥ ఎడఁ గలుగ బెట్టి తలుపు
ల్విడ నవి గావించు రవలి విని చని గూళ్ళం
బడుపులుఁ గుల నుసురులతోఁ
గడు వేడుకఁ దెచ్చియొకఁడు కానుక చేసెన్ - 22

టీక : ఎడగలుగబెట్టి = దూరదూరముగా నుంచి, తలుపుల్విడ = వాని తలుపులు తెరువగా, అవి గావించు రవలి విని = ఆయా పక్షులు చేయు రొదలు విని, చని = పోయి, గూళ్లంబడు పులుగులన్ = ఆయా గూళ్లలోబడిన పక్షులను, ఉసురులతో = ప్రాణములతో, ఒకడు, కడువేడుక దెచ్చి = మిక్కిలి ప్రేమతో పట్టుకొని వచ్చి, కానుక చేసెన్ = మహారాజునకు కానుకగా నిచ్చెను.

తా:- వారు ఆయాపక్షుల బోనులను దూరదూరముగా నుంచి వాని తలుపులు తెరువగా వానిలో నుండు పక్షులు చేయు ధ్వనులు విని ఆయా జాతి పక్షులురికి వచ్చి గూళ్లలో చిక్కుకొనగా ఒకడు వానిని ప్రాణముతో పట్టుకొని వచ్చి మహారాజుగారికి కానుకగా నిచ్చెను.

విశే:- పాదివేట యనగా నేదియో నిఘంటువు వివరించలేదు. గాని యిది చదివి నపుడట్టిదే యొక వేట యిటచెప్పవలసి యున్నది.

జానపదులు సన్నని ఇనుప పుల్లలతో చతురస్రములు చేయించుకొని అవి యొక దానికొకటి ముడుచుకొనుటకు పొడవుగా విప్పుకొనుటకు వీలుగా అల్లుకొందురు. పిమ్మట ఒక్కొక్క చట్రమున రెండు లేదా మూడేసి గుఱ్ఱపు వెంట్రుకలతో దుసుముడులు ఆచట్రములందు పైకడ్డికి కట్టి వ్రేలాడ దీయుదురు. ఈ చట్రములకు "పంతె"నలని పేరు. పిమ్మట వానిని వేటస్థలమున పొడవుగా విశాలమైనలు ఆకారముగా పొడవుగా గాని లేదా పెద్ద వలయముగాగాని నిలిపి అవి పడిపోకుండ నేలపై సన్ననిమేకులు అక్కడక్కడ పాతి దానిని కట్టుదురు.
ఈ పంతెలు వలయముగా పన్నినపుడు పెంపుడు పక్షి బోను దానినడుమ లేదా దానిని పొడవుగా పన్నినపుడు ఆ బోనుదానివెనుక ఉంచి బోను తలుపు తెరుతురు.

అపుడందలి పక్షి అరవసాగును. ఆయురుపువిని అడవిలోని వాని జాతి పక్షులు బిరబిరమని పరుగెత్తివచ్చి చట్రముల నడుమ వ్రేలాడు గుర్రపు వెంట్రుకల కొలికి నుండి దూరి ఆవలికి వెళ్ళుటకు దానిలో తలదూర్చి లాగగనే ఆయురి కంఠమునకు బిగిసుకొనును. అపుడు వానిని కనిపెట్టుచున్న వేటకాడువచ్చి ఆ పక్షులను ఉరులు సడలించి ప్రాణములతో పట్టుకొనును.

ఈ పద్యమున తెలగన్న చెప్పిన వాది వేట యెట్టిదో కాని అదియీ పంతెలవేటకు సరిపోవుచున్నది.

-: డేగవేట:-

23.తే॥ అపుడు విడివేఁట యిడుమని యానతిచ్చు
రాజు ముంగలి కడకుఁ జేరంగవచ్చి
లగడు సాళ్వంబు డేగ లోనుగను గల్గు
వేట పుల్గుల విడిచిన వింటి కెగసి - 23

టీక:- అపుడు = ఆ పిమ్మట అనగా ఈ పాదివేట చూచిన పిమ్మట, విడివేట = పక్షులను విడిగా విడిచెడు వేట, విడుమని = విడువుమని, ఆనతిచ్చు = ఆజ్ఞాపించు, రాజు ముంగలి కడకు = ఆ యయాతి మహారాజు ఎదురుగా, చేరంగ వచ్చి = సమీపించి, లడుగు సాళ్వంబు, డేగ, లోను గను గల్గు = లగుడు, సార్వ, డేగ మొదలైన వేట, పుల్గుల విడిచిన = వేటాడు పక్షులను విడువగా, వింటికెగసి, విన్ను = ఆకాశము, వింటికి = ఆకాశమునకు (జాప విభక్తికము) ఎగసి.

తా:- అపుడు మహారాజు ఆపాది వేటను చూచిన పిమ్మట విడివేటకు పక్షలను విడువుడని యాజ్ఞాపించగా వారు రాజుగారి యెదురుగా వచ్చి, లగుడు, సాళువ, డేగ, మొదలైన వేట పక్షులను విడువగా నవి యాకాశమునకెగసి.

24.సీ॥ కొక్కెర పూరేడు గొఱువంక లావుక
పొన్నగి కోవెల కన్నెలేడి
బెళగువ్వ బాతు లావిల మూసతప్పుడు
గాడు నెమలి పాలకాకి చిలుక
బలితపు వెలిచె పావళము తీతువు చింద
కక్కెర యేట్రింత కారుకోడి

కౌజు బెగ్గురు నీరుకాకి కంకణమును
బొంగ దాబయుగువ్వ వంగపండు
తే :- మొదలుగాఁ గల్గువానిని మెదలనీక
కదిపి నన్గోళ్ళ కొనలను గుదిచి పట్టి
పొదలుచును తేని మదికి నింపొదవఁజేసె
నెలమినప్పుడు విడివేట పులుఁగు లెల్ల - 24

టీక:- కొక్కెర=ఒకజాతి కొంగ, పూరేడు, గోఱవంక=శారిక, లావుక = లవంక, పొన్నంగి, కోవెల = కోకిల, కన్నెలేడి, బెళగువ్వ, బాతు, లావిలము, అసతప్పుడుగాడు, నెమలి, పాలకాకి, చిలుక, బలతంపువెలిచె = బలముగల వెలిచెపిట్ట, పావళము = పావురము, తీతువు, చింద = చిన్న డేగ, కక్కెర = కర్కరేటువు, ఏట్రింత = భారద్వాజము, కారుకోడి, కౌజు = కపింజలము, బెగ్గురు = బెగ్గురు పక్షి, నీరుకాకి, కంకణము, రాబందు, బొంగ, బాబయుగువ్వ, వంగపండు, మొదలుగా గల్గువానిని = మొదలైన వానిని, మెదలనీక, కదిపి = సమీపించి, నున్గోళ్ళకొనలను = వాడియైన కొన గోళ్లతో, కుదిచిపట్టి = బిగ్గరగా పట్టుకొని, పొదలుచును = విహరించుచు, అప్పుడు విడివేట పులుగు లెల్ల = విడిగా వేటాడు పక్షులన్ని, తేనిమదికి = రాజుగారి మనస్సుకు, ఇంపొదవజేసి = సంతోషమును కలిగించెను.

తా:- అపుడావిడివేట పక్షులు, కక్కెర, పూరేడు, గోరెంక, లావుక, లవంక మొదలైన పక్షులన్నిటిని తమ వాడియైన గోళ్ళతో బిగించిపట్టి మహారాజు మనస్సుకు సంతోషమును కలుగజేసెను.

విశే:- ఈ పద్యమును 28 పక్షులపేర్లు చెప్పబడినవి. ఇన్ని పక్షుల పేర్లు ఇంతవరకెవరును చెప్పలేదు.

-: వలవేట :-

25.తే॥ అంత నారాచ వేలుపు హోళి యెత్తిఁగి
కడిమి తోడుత నవ్వేఁట కాండ్రు కడఁగి
పొడవులైయుండు తెరలెత్తి పోగు దీర్చి
బలు మెకంబుల వలలందు బడఁగనార్చి - 25

టీక:- అంతన్ = ఆ పిమ్మట, ఆరాచవేలుపు = ఆ రాజేంద్రుని, హాళియెఱిగి = ఉత్సాహమును తెలుసుకొని, కడఁమి తోడుతఁ = అతిశయము చేత, ఆవేటకాండ్రు కడగి = ఆవేటాడువారు ప్రయత్నపడి, పొడవులైయుండు, తెరలు ఎత్తి, పోగు దీర్చి = పోగుత్రాళ్లకట్టి, బలుమెకంబులు = గొప్ప గొప్పవైన జంతువులు, వలలందు బడగఁ = తాముపన్నిన వలలలో పడునట్లు, ఆర్చి = గొప్పగా ధ్వనులచేసి.

తా:- అపుడా వేటకాండ్రు రాజుగారి యుత్సాహమును చూచితాము మిక్కిలి యుత్సాహమున పొడవైన తెరలు మరియు ప్రోగు త్రాళ్ళు కట్టి ఆ అడవిలోని జంతువులన్ని ఆ వలలో తగులుకొనునట్లు ధ్వనులు చేసి-

విశే:- విపరీతముగా వారు అద-ఇద అని అల్లరి చేయు వరకు జంతువు లన్నియు బెదరి తప్పించుకొని పరుగెత్తిబోయి వారు పన్నిన వలలలో చిక్కుచుండును. దీనిని జోపుటయందురు.

26.క॥ పిడుగుల చప్పుడు వడువునఁ
గడురొప్పెడు మెకపు గర్జికల కలుకకయే
కడల వెడలంగ నీయక
పొడువఁగ నారవలి నింగి బోరుకలంగెన్ - 26

టీక:- పిడుగుల చప్పుడు వడువున = పిడుగులు పడిన ధ్వనులట్లు, కడుఁ = మిక్కిలిగా, రొప్పెడు = ఎగశ్వాసలు తీసుకొనెడు, మెకపు గర్జికలకు = మృగములయొక్క చెదిరించెడు గర్జనలకు, అలుకక = భయపడక, కడల వెడలంగనీయక = ప్రక్కల నుండి దాటిపోనీయక, పొడువఁగ = ఈటెలతో బాకులతో వానిని పొడుచు చుండగా, ఆరవలి = ఆయొక్క ధ్వనికి, విరిగి, ఆకాశము, బోరు కలంగెన్ = బోరుమని మారుమ్రోగెను.

తా:- పిడుగుల వంటి చప్పుడులతో పరుగెత్తుటలో అలసి ఎగశ్వాసలు తీసుకొనుచు గర్జించెడు మృగముల యొక్క భయంకరమైన ధ్వనులకా వేటకాండ్రే మాత్రము జంకక వానిని ప్రక్కలనుండి పారిపోనీయక ఈటెలతో బాకులతో పొడువగా వాని యరుపులతో ఆకాశము బోరుమని మారుమ్రోగెను.

"అలం – ఉపమ"

-: పారువేట :-

27.శా॥ రాజంతట్ బలుపైన వేటతమిచే రాగిల్లి, కెంగేలిపై
నేజాద్రిప్పుచు లాగి వాగె బలిమిన్ దేయుంచు నొక్కుమ్మడిం
దేజీఁదోలిన, ముందు వెన్కరుగ కెంతే బీతులోఁ గ్రుంగి, తా
మేజాడం జనఁగా నెఱుంగ కొదిగెన్ హెచ్చై మెకంబుల్ వెసన్ – 27

టీక:- రాజంతట్ = అపుడురాజు, బలువైన వేట తమిచే = మిక్కిలియైన వేట యొక్క కుతూహలము చేత, రాగిల్లి = ప్రీతిని పొంది, కెంగేలిపయిన్ = ఎఱ్ఱనైన తనయొక్క చేతిపై, నేజా త్రిప్పుచు = ఈటెను త్రిప్పుచు, లాగివాగెబలిమిన్ = బలముగ కళ్లెములాగి, దేయుంచు = దేయని అదలింపుతో, ఒక్కుమ్మడిన్ = ఒక్కపెట్టున, తేజీదోలిన = గుఱ్ఱమునురికించిన, మెకంబుల్ = మృగములు, ముందు వెన్క అరుగక, ఎంతే = మిక్కిలిగా, బీతులోఁగ్రుంగి = భయములో మునిగి, హెచ్చై = మిక్కిలియై, వెసన్ = ఆ వెంటనే, తామేజాడం జనగా నెఱుంగకన్ = తాము ఏ దిక్కు వెళ్లవలసినది తెలియక, ఒదిగెన్ = దాగెను.

తా:- అపుడు రాజు ఇంకను కుతూహలముతో వేటపై ప్రీతిని పొంది తనయొక్క ఎరుపుగల అనగా చక్కనైన-అరచేతులు అరికాళ్లు ఎఱ్ఱగానుండుట మహాపురుష లక్షణము కనక చేతితో ఈటెను ద్రిప్పుచు మరియొక చేత బలముగా కళ్లెమును వెనుకకు లాగి గుఱ్ఱమును ధేయని యదలించగా అపుడదిచూచి యా అడవిలోని జంతువులు వెనుకకు ముందునకు వెళ్లలేక మిక్కిలి భయముతో అవి వెంటనే వేటగాండ్రకు తామెక్కడపోయినది ఎరుగరాకుండ ఎక్కడి వక్కడనే నక్కెను.

ఎక్కిన వాహనమును ధేయని యదలించుటకు-

క. నింగికిధేయునికదలిం – చెంగడువడిగలుగు తనదుసింగముబలుమా ఱుంగల
బాషిణిదేతిక –నుంగొని పదిలమ్ముసుమ్మను చుశీఘ్రగతిన్

కళా 3–71

28.వ- ఇట్లు గాలింగేలిగొను నురవడి మెఱవడి గారవంపు
వారువంబు నదలించి తెరలోనికిం గదలించి – 28

టీక:- ఇట్లు = ఈ విధముగా, గాలింగేలి గొనును రవడి = వేగమున గాలిని గూడ

పరిహసించు వేగమున, మెఱవడిఁ = ఊరేగింపువలె వెళ్ళుటకు, గారువంపు పారువంబుఁ = ప్రియమైన తన గుఱ్ఱమును, అదలించి, తెరలోనికిన్, గదిలించి = వేట కొరకు కట్టిన తెరలలోనికి దోలి.

తా:- మహారాజావిధముగా గాలికన్న వేగముగా మెరవణిగా వెళ్లుటకు తన ప్రియమైన గుఱ్ఱము నదరించి వేటకొరకు కట్టిన తెరలలోనికి తోలగా-

-: పులివేట :-

29.క॥ పొడిచిన నేజావెంటనె
వడిఁ బైకొని చౌకళించి వచ్చిన పులుల
న్నెడ వెడలించెను బెడిదపు
టడిదంబున నేల గప్పినట్టుగ నుండన్ - 29

టీక:- పొడిచిన నేజాను = జంతువును పొడిచిన ఈటెను, వెంటనే వడిగైకొని = ఆ వెంటనే అనగా పొడవగనే వెంటనే వెనుకకు లాగుకొని, పైకొని = పైనిగవయుటకు, చౌకళించి = నాలుగు కాళ్ల యెత్తి, వచ్చిన = పైకి వచ్చిన, పులులఁ, బెడిదపు టడిదంబున = భయంకరమైన కత్తితో, నేలకప్పినట్టుగ నుండఁ = నేలయంతటా పరచినట్లుండగా, అనగా నంత దట్టముగా మెడలెడ లించెను = తలను నరికెను.

తా:- ఆ మహారాజా ఈటెతో పులులను పొడువగా అవి వెంటనే నాలుగు కాళ్లెత్తి అతనిపైకి దూకరాగా ఏమాత్ర మాలస్యము లేకుండ ఈటెను వెనుకకు లాగుకొని ఒక భయంకరమైన కత్తితో నేలయంతట వానికళేబరములు పరుపు పరిచి నట్లగునట్లు తలలు నరికెను.

విశే:- ఇట్లనుటవలన వేట యందు యయాతి మహారాజాయొక్క చాకచక్యము తెలియుచున్నది. పులియడవికి రాజాగాన మహారాజాలకు పులివేట మిక్కిలి ప్రియమైనది. గద్వాల మహారాజా సీతారామ భూపాలరావుగారి పులివేటను ఆదిపూడి ప్రభాకరామాత్యుడు పౌండరీకము పేర ఒక ఖండ కావ్యముగనే తీర్చెను.

"అలం - అతిశయోక్తి"

30.క॥ ఆపగిది వ్రేసి యుడుగక
యేపున సింగిణికి నారి యెక్కించి వడిం
గోపుల బెబ్బులులం గని
యయాతిక్షత్రుడు న్వాని నోళ్ల దొనలుగఁ జేసెన్ - 30

టీక:- ఆపగిదివేసి = ఆవిధముగా నరికి, యుడుగక = అంతటితో నూరకొనక, ఏపున = ఎనరేగి, సింగిణికి నారి యెక్కించి = బాణమున కల్లెత్రాడు తొడిగి, వడి = వేగముగా, కోపుల బెబ్బులంగని = కోపించినటువంటి బెబ్బులను చూచి, వానినోళ్ళు = తెరచుకొని పైబడవచ్చు వాని యొక్క వదనములు, తూపులకు దొనలుగ జేసి = తన బాణములకు అంపపొదలుగా జేసెను. అనగా తెరచిన వాని నోళ్లలోనే బాణములు నాటెను.

తా:- ఆవిధముగా కత్తితో పులుల తలలు నరికి, అంతటితో నూరకొనక ఇంకను విజృంభించి విల్లందుకొని దానికి యల్లెత్రాడెక్కించి తనపైకి తెరచుకొని వచ్చు బెబ్బులుల యొక్క నోరులు తన బాణములకు నంపపొదలుగా జేసెను. అనగా ఆ తెరచిన నోళ్లనిండ బాణములు నాటెను.

విశే:- ఇది బాణవిద్యలో మహారాజా యొక్క లక్ష్యశుద్ధిని తెలుపును. ఇచట పులివేటలో కత్తివేట, బాణపువేట, రెండు ప్రదర్శింపబడినవి. వీరులు పులివేటలో కత్తివేటకే అనగా పులికెదురు నిలిచి కత్తితో నరుకుటకే ప్రాముఖ్యమిత్తురు. కాని కవియందు యయాతి బాణవిద్యలో గూడ నిపుణుడని తెలుపుటకు కాబోలు బాణపు వేటను గూడ చెప్పెను.

31. మహాస్రగ్ధర :-

అను కుంజాపుల్దగం దాముడుగులు పుడమిన్ హత్తనీకేఁగులేళ్ళం
గని తేజీఁ దోలియుంటం గదుముచు మెఱుంగల్ గ్రమ్ముచుండంగమున్నే
సిన తూపుల్వెండి యొుంటం జెలఁగుచుఁ దునుకల్ చేసి చేనేర్పు మీఱం
దనవాలుంగంటి కన్నుల్ దలఁపుచు మదిలో దాఁచి యున్నట్టి కూర్మిన్ -31

టీక:- అనుకంజాపుల్ దగ = బెదరు చూపు లొప్పుచుండగా, అడుగల్ = పాదములు, పుడమిహత్తంగనీక = నేలపై ఆనకుండ, ఏగులేళ్ళగని = పరుగెత్తు జింకలను చూచి, తేజీ దోలియుంట = వానినందుకొను నట్లు గుఱ్ఱమును పరుగెత్తించి, గదుముచు = వానిని గద్దించుచు, మున్నేసిన తూపుల్ = వానిపై మొదట వేసిన బాణములు, మెఱుగుల్ గ్రమ్ముచుండంగ = తళతళలాడుచుండగా, తన వాలుగంటి కన్నుల్ = తనయొక్క ప్రియురాలి కన్నులను తలచుకొనుచు, మదిలో దాచి యున్నటి కూర్మిన్ = మనస్సులో దాచుకొన్న ప్రేమచేత, వానికి హాని చేయలేక, వెండి = మరల, యొుంట = మరియొక దానితో, చెలగుచు = అతిశయించుచు, చేనేర్పు

మీఱ = తనయొక్క చేతి నైపుణ్యము మీరగా, తునకల్ జేసి =మొదట వేసిన వానిని ఖండించెను.

తా:- ఆ మహారాజు బెదురు చూపులతో నేల తాకకుండ పరుగెత్తులేళ్లను గని వానినందుకొనునట్లు తన గుఱ్ఱమును పరుగెత్తించి, గర్జించుచు వానిపై మొదట బాణము లేసి, ఆ వెనుక తనయొక్క ప్రియురాలి కన్నులు ఆ లేళ్ల కన్నులను పోలియుండుట తలచుకొని ఆమె పై మనస్సులో గల ప్రేమచేత, తన ప్రియురాలి నేత్ర సౌందర్యమును ఆ జింకలు చూపుచున్నవి. కనుక వానిని చంపుట యెందులకని వెంటనే మరియొక బాణముతో మొదటి వానిని అవి వానికి తగులక మునుపే ఖండించెను.

విశే:- ఇందులో మహారాజు మొదట విడిచిన బాణము తిరుగ వెనుకకు తీసుకొనరాదు. కనుక వెంటనే దానిని మరియొక దానితో త్రుంచివేసెనని చెప్పుట వలన యతని శర సంధానలాఘవము అబ్బురమని తెలియును.

అస్త్రవిద్య మంత్రముతో కూడినది. దానికి ప్రయోగోపసంహారములు రెండునుండును. ఉపసంహార మనగా ప్రయోగించినదానిని తిరుగతీసి కొనట కాని చాప విద్య యందిది యుండదు.

లేళ్లునేలను తాకకుండ పరుగెత్తుననుటకు -
గ్రీవాభంగాభిరామం ముహురనుపతతిస్యందనే బద్ధ దృష్టిః
పశ్చార్ధేన ప్రవిష్టశరపతనయా భూయసాపూర్వకాయం
దర్భైరర్ధావలీఢై శ్రమవివృతముఖభ్రంశిభిః కీర్ణవర్త్మా
పశ్యోదగ్రప్లుతత్వాద్వియతి బహుతరంస్తోకముర్వ్యాంప్రయాతి
అభిజ్ఞానశాకుం ప్ర. 1

"అలం - స్వభావోక్తి"

32. ప్రగ్ధర:-
తుండించెన్మన్నుఁ బిళ్ళుం, దునియెఁ గణుదులంద్రుంచెఁ జివ్వంగి మూఁకం
జండాడెం గొండగొర్లం, జెలగె నెలుఁగులం, జించెఁగార్పోతులన్మె
కండల్గాఁ జేసె నిర్లం, గలఁచె జిఱుంతలఁ, గండ్రికల్ చేసినేల
న్నిండించెఁదుప్పులం మన్నిదమున కొకటి న్లేకయుండగ నచ్చొన్ -32

టీక:- ఆ మహారాజా, అచ్చోట = అచట, పన్నిదమున కొకటిన్ లేక యుండంగ = పెందెము వేయుటకైనా ఒక్కటి మిగుల కుండ, తుండించెమన్ను బిళ్లల్ = పెంటె మనుబోతును తునకులు చేసెను. తునిమె కణుదులన్ = కణుతులను చంపెను, త్రుంచెసివ్వంగి మూకన్ = సివంగులను చంపెను. చెండాడెన్, కొండగొర్లల్ = కొండగొర్రెలను చంపెను, చెలిగె నెలుగులల్ = ఎలుగు బంట్లను నరికెను, చించెకార్పోతులల్ = అడవి దున్నను గాయపరచి చంపెను, మైకండల్గాజేసెనిర్లల్ = ఇఱి = జింక, ఇర్లు = జింకలు - బహువచనముతో హల్శ్లిష్టమగునపుడు శకటరేఫమునకు సాధురేఫము - లేళ్ల యొక్క శరీరములు ముక్కలు ముక్కలుగా చేసెను, కలచెచిరుతులన్ = చిరుతపులులను చికాకు పరచెను, కండికల్ జేసి నేలన్నిండించెల్ దుప్పులల్ = దుప్పులను నేలయంతటను పరుచుకొనునట్లు ముక్కలు జేసెను.

తా:- ఆ మహారాజా యడవిలో పందెంవేసే అందకైన ఒక్క జంతువు మిగులకుండ, మనుబోతులను, కణుతులను, సివంగులను, కొండ గొర్లను, ఎలుగులను, అడవి దున్నను, జింకలను, చిరుతపులులను, దుప్పులను అన్నిటిని వేటలో ఖండించెను.

ఈ పద్యమున చంపెననుటకు తుండించె, తునిమె, త్రుంచె, చెండాడె, చెలగె, చిందె, మైకం డల్గా జేసే, కలచె, కండికల్ జేసి అని యన్ని గూఢ గౌణ క్రియలు ప్రయోగింపబడినవి. ఇది యిందలి విశేషము.

"అలం: సముచ్ఛయము"

జానపదుల వేటలు

1. ఇఱ్ఱివేట :-

జింకల వేట మిక్కిలి ప్రాచీనమైనది. శృంగిబేరి పురమున గల బోయలు జింక బొమ్మలను చేసి పెట్టి వానిని నిజమైనవిగా భ్రమసి జతకట్టుటకు వచ్చు మగజింకలను వేటాడు చుండిరట.

రాజుల కాలమునాటి వారు జింక బొమ్మలకు బదులు పెంటి జింకలనే పెంచి వానికి వేట తర్ఫీదిచ్చి అడవికి కొనిపోయి కొమ్ములకు నుచ్చులు, కొంకులకు సీసపుగుండ్ల పిక్కలకు వలసంచులు కట్టి వదలు చుండిరి. అవి యడవిలోనికి వెళ్లి మేయుచుండగా చూచి దానితో జతకట్టుటకు వచ్చిన మగ జింక తన ప్రేమను ఆపెంటికి తెలుపుటకు మెల్లగా మెడక్రింద

తన కొమ్ముతో దానిని గోకును. అపుడా ఉంకపోతు కొమ్ముపెంటి దానికొమ్ముకు గల ఉచ్చున తగిలి వెంకవేసినట్లుగా నిలిచిపోవును. వేటకానిని చూచి అది పెంటిదానితో పరుగెత్తుట కెంతపెనగినను దాని కొంకులకు సీసపుగుండ్లుండును కనుక అవి పరుగెత్తునపుడు పటపటమని మోకాళ్లకు తాకును అందువల్లనది పరుగెత్తక స్థిరముగా నటులేనిలుచును. అపుడు వేట కాండ్రు దానిని సమీపించి ఈటెలతో కుమ్మి చంపుదురు.

అటులగాక పోతు కామపరవశమై ఒకేసారి పిరుదనే చేరిన యెడల పెంటి యొక్క తొడను తన ముంగాలితో దువ్వును. ఆ పక్షమున దాని కాలు గిట్ట చీలియుండును కనుక పెంటి దాని తొడకు కట్టిన వల సంచిలో చిక్కి నిలిచిపోవును. అపుడు గూడ వేటకాండ్రు వచ్చి దానిని పట్టుకొందురు. ఈ వేటను కాకుత్థవిజయ కర్త తెలిపెను.

2. ఎద్దువేట :-

కుందేళ్లు, ఎంటువలు, ఉడుములు ఎండవేళలలో పొలము గట్టువెంట చిన్న చిన్న గుబురులలో గాని లేదా అడవిలోని పొదలలోని విశ్రాంతి తీసుకొనుచుండును. వేటకు మచ్చిక చేసిన ఎద్దు మేయుచున్నట్లు నటించుచు తన ప్రక్కన నడుచు యజమాని సన్న నెరిగి మెల్లగా నడుచుచు సాగుచుండును. వేటకాడు దాని చాటున వంగి దానియడుగులో యడుగు వేయుచు చుండును.

అది పొలము గట్లవెంటగాని పొదల ప్రక్కనగాని పోవుచుండగా నది పశువే కనుక నక్కడ విశ్రాంతి తీసికొను కుందేలుమొదలైనవి బెదిరి పరుగెత్తవు. అపుడు వేటకాడు వాని యునికిని గమనించి తన చేతి బల్లెముతో వానిని పొడిచి పట్టుకొనుచుండును. ఈ వేటను పొన్నగంటి తెలగన పేర్కొనెను.

3. కుక్కలవేట :-

వేటకుక్కలను పెంచుట మిక్కిలి ప్రాచీనమునుండి యున్నది. ఏకలవ్యుని వెంట వేటకుక్కలున్నట్లు, అర్జునునికి పాశుపతాస్త్రమిచ్చుటకు శివుడు మాయాకిరాతుడై రాగా నతని వెంట గూడ వేటకుక్కలున్నట్లు మహాభారత కథలందు గలదు. అతి ప్రాచీన కాలమున నాంధ్రులు గూడ వేట కుక్కలతోనే జీవించుచుండిరట. సాధారణముగా నీ వేట కుక్కలను అడవి పందుల పైకి నుసిగొలుపు చుందురు. అవి కుక్కలను చంపును గూడ. అందువలన దానికి జాగిలముల మిత్తియని పర్యాయమేర్పడినది. అల్లసాని పెద్దన ఈ జాగిలముల వేటను

మనుచరిత్రలో చెప్పెను.

4. గంటువేట :-

దీనికి గిరక షికారి యని మరియొక పేరు. ఈ వేటలో ముగ్గురు వ్యక్తులుందురు. వీరు తరుచుగా రాత్రివేళనే బయలు దేరుదురు. మొదటివాడు తనచేతిలోని గిరకను చప్పుడుచేయుచు అడవిలోనొకచోట నిలుచును. రెండవవానిచేతిలో బాగా మండుచున్న కొరివియుండును. ఈ కొరివికి వారు నెల్లి రేదా గేదపు కఱ్ఱను నుపయోగింతురు. అది మిక్కిలి కాంతి వంతముగా నుండునట. మూడవ వానిచేతిలో నొక దుడ్డు కఱ్ఱ యుండును.

మొదటి వాని గిరక చప్పుడు విని అడవిలోని కుందేళ్ళు తమ జాతి పిలుపని గుంపులు గుంపులుగా పరుగెత్తుకొని వచ్చి రెండవవాని చేతిలోని కొరివిని చూచి కన్నులు చీకట్లు క్రమ్మి ఎటుకదలలేక నిలిచిపోవును. అపుడు మూడవవాడు వానిని బాది చంపి తీసికొనుచుండును. ఈ గంట వేటను తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు వేంకటేశ్వర వచనములలో పేర్కొనెను.

ఈ వేట గూడ మిక్కిలి ప్రాచీనమైనదే. వత్సరాజు వీణను వాయించి నడవిలో నేనుగుల నాకర్షించుచుండెనట. పశువుల వారు దొమ్మన గొయ్యనూది యడవులలో లేళ్లనాకర్షించి వేటాడుదురు. ఈ లేడి వేటను పోతన భాగవతమున భ్రమర గీతలలో పేర్కొనెను.

5. డేగవేట :-

వేటాడు పక్షులకు దీవములని పేరు. దీవములలో డేగ జాతులకే ప్రాముఖ్యముండును. వేటకాడు తన యిష్టమైన జాతినెన్నుకొని వానికి తర్ఫీదిచ్చును. అడవికి వెళ్ళిన పిమ్మట డేగ ఆకాశమునకెగిరి స్వేచ్ఛగా చక్రభ్రమణములు చేయుచు పైనుండి వెళ్ళు, పావురములు, చిలుకలు గువ్వలు మొదలైన వానిని తరిమి పొడిచి క్రిందికి వేయుచుండును. యజమానిపైన దాని తిరుగుడు గమనించుచు క్రిందపడిన వానిని తీసికొనుచుండును. అంతమున పక్షి యజమాని పిలుపు విని క్రిందికి దిగివచ్చును.

ప్రాచీన కాలమున వివాహ సందర్భములలో వేటగూడ పెండ్లి వేడుకలలో నొకటిగానుండెను. నాకబలికి ముందు డేగాట యనుపేర నీయాచారము గత శతాబ్దము

వరకుండెను.

6. పాదివేట :-

చిన్నచిన్న చతురస్రమైన చువ్వచట్రములకు పాదులు లేక పంతెలని పేరు. వానితో నీవేట సాగును. కనుక దీనికి పాదివేట యని పేరు.

ఇవి బురుక పంతెలు కౌజుపంతెలని రెండు విధములు బురుక పంతెలు చిన్నగా కౌజు పంతెలు పెద్దగా నుండును. ఈ చట్రములను ఒక దానితో నొకటి కలిపి వరుసగా W అక్షరమువలె ఒకదానిపై ఒకటి మడుచుట కనువుగాకట్టి యుంచుకొందురు. ప్రతి పాదియందు గుఱ్ఱపు వెంట్రుకలతో కట్టబడిన యొకయురివ్రేలాడుచుండును. ఈ పంతెలను వేటస్థలమునకు కొనివెళ్ళి యొకచోట సన్నని మేకులు నాది ఉడుతవల వలెను గుండ్రముగా కట్టి దానినడుమ వెదురు పుల్లల బోనులో గల బురుక లేదా కౌజు నుంతురు. అపుడది వర్లసాగును. వేట సమయమున వానికి స్త్రీల పాలు త్రాపుటగూడ పరిపాటి అపుడవి యింకను లాసిగా ధ్వని చేయునట. కోడి జాతికి చెందిన పక్షులన్ని కలహప్రియములు కనుక నా చప్పుడు వినియూ చుట్టుపట్ల గల స్వజాతి పక్షులు దానిపై పోట్లాటకు పరుగెత్తుకొని వచ్చి పంతెలలో నుండి దూరబోయ యందలి ఉరిలో తలదూర్చి వెనుక ముందు లాగుకొనుటలో నది మెడకు బిగిసి వేటకానికి చిక్కిపోవును.

ఒక్కొక్కపుడు దైవికముగా కొన్ని ఉరి నుండి బయటపడును. అపుడవి పంతెను దూరి బరిలోనికి ప్రవేశించి పరిస్థితిని గమనించి దాటిపోవుచుండును.

రాజు లీవేటను కోడి పందెములవలె మిక్కిలి యుత్సాహమున తిలకింతురు. ఈ వేటను పొన్నగంటి తెలగన పేర్కొనెను.

7. పారువేట :-

ఇది జంతువు వెంట పరుగెత్తి చంపెడు వేట, జింక, దుప్పి మొదలైన వాని వెనుక వేటకాండ్రు వేగముగా పరుగెత్తి వాని నీటెలతో క్రుమ్మెదరు. వైష్ణవోత్సవములలో పారువేట ఒక ముఖ్యమైన వేడుక - పూర్వము వివాహములలో వేటకూడ ఒక ముఖ్యాచారముగా నుండెను. నాకబలికి మొదటినాడు వరునితో పాటు ఉత్సాహవంతులైన వారడవికి వెళ్ళి యానాటి కేదో యొక జంతువును వేటాడి తెచ్చి విందు చేసికొనుచుండిరి. చారుణి యను

ఖండ కావ్యమీా వృత్తాంతముతోడనే నడిచినది.

8. సివంగి వేట :-

పూర్వము కుక్కలవలెనే సివంగులను గూడ పెంచి వేటకు తర్ఫీదిచ్చుచుండిరి. వేటకు సివంగులను కన్నులు గట్టి బోనులలో బండ్లపై వేటస్థలమునకు గొంపోవుదురు. అక్కడ బోనులు దించి వాని కన్నులు విప్పి ఎదురుగా పరుగెత్తు మృగములను చూపి వానిని కుక్కలవలె ఉసికొల్పుదురు. అపుడవి వానివెంట తగిలి పట్టుకొని చంపును.

అక్బరు చక్రవర్తి కాలము వరకు వేటకాండ్రు వీనిని పెంచుచుండిరి. కొందరిపుడీ జాతి లేదందురు. ఈ వేటను తెలగన పేర్కొనెను.

ఇపుడు తుపాకి వచ్చిన పిమ్మట ప్రాచీనమైన వేట విధానము పూర్తిగా మారినది. ఇపుడే ప్రాణినైనను తుపాకితోనే వేటాడుదురు.

33.క॥ ఇటువలె వేఁటాడెడు తఱిఁ
దటుకున నొక యిఱ్ఱి తెరలు దాఁటి వడింజెం
గటనుఱుక, నెఱుకు దొరలా
ర్చుటయుఁ జేఁ డలుక దాని చొప్పున నొంటిన్ - 33

టీక:- ఇటువలె, వేటాడెడు తఱి=వేటాడెడు సమయమున, తటుకున=తటాలున, ఒక యిఱ్ఱి = ఒక జింక, తెరలుదాటి=వేట కొరకు గట్టిన తెరలను లంఘించి, వడిఁ = వేగముతో, చెంగటనురుక = సమీపమున పరుగెత్తగా, ఎఱుకు దొరలార్చుటయుఁ = ఎరుగువారు దాటిదాటి, ననియురువగా, ఱేడలుకన్= మహారాజా కోపమున, దాని చొప్పున = దానివెంట, యొంటఁ= యొక్కడగా

తా:- వారట్లు వేటాడు చుండగా నొక జింక తటాలున వేటకాండ్రు కట్టిన తెరలు దూకి వారి ముందరనే పరుగెత్తగా ఎఱుకులు దాటిదాటినని నయురువగా నపుడు మహారాజా జింకపై కోపమున దానివెంట నొకడే వెళ్లగా - పోగా పోగా ముందట -

విశే : పంది ఎత్తెగురలేదు. దూరముగూడా గెంతలేదు కాని జింకలు దూకి వలలు దాటిపోవుట, ఎగుర బోయి వలలో పడుట గూడ వేటకాండ్ర కనుభవమే.

34.వ: చనంజన ముందట

హిమాలయ వర్ణనము

35.సీ॥ చల్లని తలఁపు టూబిల్ల మీఁదటఁ జిల్లి
జీర్కులాడెడు వేల్పుఁ జేడియలును
దమపాటఁ గరఁగు నిద్దపుఱాల నీట నం
దఱు నోలలాడు కిన్నరు లగములు
గవుల జేజేనన్పు కాండ్రతో వలరాచ
మచ్చికఁ బెరలాడు నచ్చరలును
పచ్చల గనులపైఁ బసిమి పచ్చికయంచు
వడి మేయవచ్చిన పుడుకుఁ బసులుఁ

తే॥ గెంపునెలవులు గాంచి యుంకించి తమ్మి
కొలఁకు లని వచ్చి కాకున్నఁ గలఁగి యపుడు
మగుడ నేఁగెడు నంచలఁదగిలి పట్టి
మెలఁగు తెఱగంటి కొమిరెలుఁ గలిగి మఱియు -35

టీక- చల్లని, తలుపురాబిల్ల=చింతామణి వలక, మీఁదట, చిల్లజీర్కులు = జారుడుబండలాట, జిరుకు=జారు, జిరుకు+జిరుకు = జిల్ల జిర్కు-అమ్రే - చూ.తె-శ్రీ.వి-పు-377. ఆ డెడు= ఆడుచుండ వేల్పు చేడియలును = దేవతాస్త్రీలు/ తమపాట గరగు=తమపాటతో కరిగి ప్రవహించెడు, నిద్దపురాలనీటన్=శ్రేష్టమైన రాళ్లయొక్క నీటిలో, అందరున్=అందరు కలిపి, నోలలాడు=జలకాలాడు, కిన్నరులగములు=కిన్నెరస్త్రీల సమూహములు/ గవులన్ =గుహలలో జేజేనన్పుకాండ్రతోన్=దేవజాతి విటులతో, వలరాచమచ్చికన్=మన్మథ క్రీడలతో, చెరలాడు = విహరించు, నచ్చరలును=అప్సరసలు/ పచ్చల గనులపై=హరిన్మణుల యొక్క గనులపైగల పసిమి=పచ్చని కాంతి, పచ్చియంచు= పచ్చిగడ్డియని తలచి, వడిన్=వేగముగా, మేయ వచ్చిన, పుడుకు పసులు = కామధేనువులు/కెంపునెలవులు గాంచి= ఎఱ్ఱని రత్నము లుండెడు స్థలములు చూచి, ఉంకించి=ప్రయత్నించి, తమ్మికొలకులని వచ్చి = తామరకొలనులనివచ్చి, కాకున్న కలిగి=అవి తామర కొలనులు కాకపోగా చికాకుపడి, అవుడు మగుడన్=తిరిగి, ఏగెడు=వెళ్ళుచున్నట్టి, అంచలదగిలి =హంసలను వెంటతగిలి, పట్టి=పట్టుకొని, మెలగువర్తించు, తెరగంటి కొమిరెలు = దేవతాయువతులుకలిగి, మరియు -

35.తా:- ఆముందట చల్లనైన చింతామణి బల్లలపై చిల్లజీరుకు లాడెడు దేవతాస్త్రీలు, తమయొక్క పాటతో కరిగి పాఱెడు అచ్చమైన రాలయొక్క నీటితో నోలలాడెడు కిన్నెరస్త్రీలు, గుహలలో దేవతా విటులతో మన్మథ క్రీడలలో విహరించు నప్సరసలు, పచ్చల గనులపై కనిపించు పచ్చని కాంతులు జూచి పచ్చికయని మేయ వచ్చిన కామధేనువులు, కెంపుల గనులను జూచి ఎఱ్ఱ తామరల కొలకులని విహరించుటకై వచ్చి యవి కొలకులు కాక పోగా చికాకుపడి తిరిగి వెళ్లుచుండగా నా హంసలను వెంటగిలి పట్టుకొనుచున్న దేవతా స్త్రీలు గలిగి - మరియు - ముందరి పద్యముతో నన్వయము.

విశే:- తెలగన్న ఈ సీసమున మొదటి మూడు పాదములలోను, ఎత్తుగీతిలోను దేవతా స్త్రీలను పేర్కొని ఒక్క నాల్గవ పాదమున మాత్రమేలనో కామదేనువులను పేర్కొనెను. వానిని గాక దానియందుగూడ దేవతా స్త్రీలనే చెప్పిన యెడల పద్యమున ప్రక్రమ భంగము కాకుండెడిది.

"అలం - భ్రాంతిమత్తు"

36.సీ॥ బెట్టుగా నడివంకఁ జుట్టివచ్చిన మబ్బు
వెలయు నేనికతోలు వలువగాఁగఁ
బైనుండి క్రిందికిఁ బర్వుజేగురుటేఱు
లొడల వ్రేలెడు పల్ల జడలు గాఁగ
నెత్తంబు క్రిందటి నెత్తమ్మి కెంపు ఱా
గనిపెంపు వేలిమికన్ను గాఁగ
ననయంబుఁ దొరిఁగి పేరిన మంచు వెన్నెలల్
చిలికెడు నెమ్మేని తెలుపుగాగ
తే॥ నెపుడుఁ బాయకయున్న మిన్నేఱు దనరఁ
బేర్మిఁ గొండలఱేఁడను పేరు మెఱయు
వేల్పుమల వింటి దేవర పోల్కి దాల్చు
జన్నపుందిండి విడిమట్టు చలువగట్టు - 36

టీక:- జన్నంపుందిండి=భోక్తలగు దేవతలకు, విడిమట్టు=విడిదియగు తావు, చలువగట్టు=హిమాలయము, బెట్టుగా=గట్టిగా, నడివంకన్ =నడిమి ప్రదేశమును, చుట్టివచ్చిన మబ్బు=గుండ్రమున నాక్రమించిన మేఘము, వెలయు=ప్రకాశించు,

ఏనికతోలు వలువ=గజచర్మవసనము, కాగా పై నుండి క్రిందికి, పర్వు=పరుగెత్తి వచ్చుచు వ్యాపించిన, జేగురుటేరులు= ఎఱ్ఱని నదులు, ఒడల వ్రేలెడు=శరీరముపై వ్రేలాడు, పల్లజడలు= ఎఱ్ఱని జడలు కాగా /నెత్తంబు క్రిందటి=శిఖరము క్రింద గల, నెత్తమ్మికెంపు జాగని=శ్రేష్టమైన పద్మరాగపు మణులగని యొక్క, పెంపు=గొప్పదనము, వేలిమికన్ను=అగ్నినేత్రము కాగా/ అనయంబు= ఎల్లపుడు, దొరిగి=దొరలి, పేరిన=పేరుకొని పోయిన, మంచువెన్నెలల్=మంచు యొక్క తెల్లని కాంతులు, చిలికెడు=అలదుకున్నట్టి, నెమ్మేని=నిండైన తన శరీరము యొక్క, తెలుపు=తెల్లని భస్మము కాగా/ ఎపుడుఁ=సర్వకాలములందును, పాయుక యున్న మిన్నేఱు=విడువకున్న ఆకాశగంగ, తనరఁ= ఒప్పుచుండగా, పేర్మిన్=పెద్దతనమున, కొండలవేడను పేరు మెరయన్=గిరీశుడను పేరు ప్రకాశించు చుండగా,వేల్పుమలవింటి దేవర=దేవతా పర్వతమైన మేరువు విల్లుగాగల శివుని యొక్క, పొల్పుదాల్చు, పోలికను ధరించుచుండును.

తా:- యాగభోక్తలైన దేవతలకు నివాసమగు నా హిమాలయము గట్టిగానడిమి ప్రదేశమును చుట్టుకొని వ్రాలిన మేఘము ఏనుగు తోలుగా పైనుండి క్రిందికి పరుగెత్తుకొని వచ్చు ఎఱ్ఱని నదులు శరీరముపై వ్రేలు పల్ల జడలుగా శిఖరము క్రిందగల మేలిమైన పద్మరాగపుగని అగ్నినేత్రముగా అక్కడక్కడ దొరలుచు పేరుకొని పోయిన తెల్లని మంచు కాంతి శరీరమున కలదుకొనిన విభూతి పూతగా తలపై ఎల్లపుడు పారుచుండు నాకాశగంగతో తన యొక్క పెద్దతనమున నా గట్టు గిరీశుడను పేరు జెంది శివుని యొక్క పోలకను ధరించుచుండెను.

విశే:- కొండల రేడనగా గిరీశుడు. గిరీశో గిరిశో మృడః అని అమరము. గిరీశుడనగా శివుడు గనుక నాగట్టు గిరీశుడను పేరు ధరించినందులకు శివుని వలె యొప్పుచుండెనని భావము.

అలం - సావయువ రూపకము-

"పరిణామము - ఉపమ"

37.ఉ॥ మించినయా ముటేనుఁగుల మీఁదికిఁ జెంగున దాఁటి యౌదలల్
చించిన, గోళ్ళలోఁ దవిలి చిందిన ముత్తెము లెల్లఁ జట్లపై
మంచునఁ జేరి దాకొనిన, మాటికి నమ్ములఁ ద్రవ్వి త్రవ్వియ
చ్చెంచునె లంత లేఱుందురు సింగపుఁ జాడ లెఱింగి యచ్చటన్ - 37

టీక : చెంచు నెలంతలు= ఆ పర్వతమునగల చెంచు స్త్రీలు, మించిన=పొగరుతో నతిశయించిన, యూముటేనుగుల=మదించిన యేనుగుల, మీాదికి, చెంగున దాటి = చెంగుమని దూకి, యౌదల్‌చించిన=వానినడినెత్తులు పంజాలతో పగులగొట్టు చించగా, గోళ్లలో దవిలి= ఆగోరులలో చిక్కుకొని, చిందిన ముత్తెములెల్లన్=చిల్లిన ముత్యము లన్నిటిని, అచటన్ చెట్లపై =చట్టులు అనగా మిట్టలపై, సింగపు జాడలెరింగి=సింహముల యొక్క జాడలు గుర్తించి, మంచున బేరి దాకొనినన్=పేరిన మంచులో నిరికి దాగగా వాటిని, మాటికి=పదేపదే, మరల మరల, నమ్ముల త్రవ్వి త్రవ్వి=బాణములతో నామంచును త్రవ్వి త్రవ్వి ఆముత్తెములను, యుచ్చెంచు నెలంతలు=అచటి చెంచు యువతులు ఏరుదురు.

తా:- అచటి చెంచు యువతులు సింహములు మదించిన ఏనుగుల పైకి దూకి వాని తలలు పగులగొట్టగా అపుడు వాని గోళ్ళలో చిక్కి క్రిందికి చిల్లి మంచులో పూడిన ముత్తెములను (ఆ చెంచు వనితలు) చట్లపై ఆసింహముల జాడలెఱిగి తమ బాణములతో నామంచును త్రవ్వి త్రవ్వి ఏరుచుందురు. ఉత్తర ధృవమున మంచులో దాగిన సీలుజంతువుల నచటి వారిటులే వాని జాడలెరిగి బాణములతో మంచును త్రవ్వి వానిని వేటాడుచుందురట.

38.క॥ వలిగాలి నెఱుకు బిడ్డలు
నెలవులకడ కెంపురాలు నిప్పుకలనుచుం
జలి గ్రాఁగఁగ వత్తురు త
ల్లుల చంకలు డిగ్గి నిచ్చలుం దగ నచటన్ - 38

టీక : వలిగాన్=చల్లని గాలిచేత, నెఱుకు బిడ్డలు= ఎఱుకు వారి పిల్లలు, నెలవులకడన్= తమ నివాసముల దగ్గరగల, కెంపురాలు= ఎఱ్ఱని రాళ్ళ, నిప్పుకలనుచున్=నిప్పులని తలచి, నిచ్చలుల్, ఎల్లప్పుడు, అచటన్= తగన్, తల్లుల చంకలు దిగ్గి=తల్లుల యొక్క చంకలు దిగి, చలిగ్రాగగ వత్తురు=చలికాచుకొనుటకు వచ్చుచుందురు.

తా:- ఆ పర్వతముపై చల్లని గాలికి, ఎఱుకు వారి పిల్లలు తమ నివాసముల దగ్గర గల నెఱ్ఱని కెంపులను చూచి ఎల్లపుడు నిప్పులని భ్రమసి చలిని కాచుకొనుటకు తల్లుల చంకలు దిగి వచ్చుచుందురు.

విశే:- కెంపురాలను నిప్పుకలని మనుచరిత్రమున సీమా పర్వత వర్ణన వచనమందు పెద్దనగారు గూడ చెప్పెను.

"అలం - భ్రాంతిమత్తు"

39. ఉ॥విన్నున నేగు తామరల విందుకి లాతవు నీడ నెప్పుడున్
వెన్నెల రాచఱాలఁ గని, వెళ్ళక నీళ్ళ మునింగి యున్న వి
మన్నులటంచుఁ, జెంచితలు మాటికి నమ్ములనేసి నాటమిన్
మిన్నక సిగ్గునం గదలి మెల్లనఁ బోవుదు రిండ్ల పట్లకున్

టీక:- చెంచెతలు-విన్నుననేగు= ఆకాశముపై వెళ్లుచుండు, తామరలవిందు = సూర్యుని యొక్క, కిలాతవునీడలెప్పుడున్=గుఱ్ఱముల నీడలు ఎల్లపుడు, వెన్నెల రాచఱాలగని=చంద్రకాంతపురాలలో చూచి, ఈ మన్నులు= ఈ మనుబోతులు, వెళ్లక నీళ్ల మునింగియున్నవి, అటంచు=అని తలచి, చెంచెతలు, మాటికి=మరల మరల అమ్ములనేసి=బాణము లేసి, నాటమిన్=అవి వానికి నాటకపోగా, మిన్నక= ఏమి చేయలేక, సిగ్గునన్ గదలి=లజ్జతోనట నుండి కదలి, ఇండ్ల పట్లకున్, మెల్లనన్బోవుదురు.

తా:- ఆ పర్వతముపై చెంచు యువతులు సూర్యుడాకాశముననేగు చుండగా చంద్రకాంత శిలలో నతని గుఱ్ఱముల నీడను గని యీ మనుబోతులు నీళ్లలో మునిగి యున్నవి. బయటికి వెళ్ళుట లేదని తలచి, బాణములతో మరల మరల వేసి అవి నాటకపోగా - అపుడు నిజము తెలిసి - సిగ్గుతో తలలు వంచుకొని మెల్లగా నచటి నుండి కదలి తమ యిండ్ల పట్టునకు బోవుచుందురు.

విశే:- గుఱ్ఱములు మనుబోతు లోకేతీరుగా నుండును/ పూర్వము మనుబోతులపై గూడ స్వారిచేయుచుండిరట, అవి గుఱ్ఱము కన్నవేగముగా పరుగెత్తునట/ కాని గుఱ్ఱములు నీటిలో మునుగవు, మనుబోతులు నీటిలో మునుగును. ఇది వాని భేదము. కుట్టిన తేలు కుట్టకయున్న కుమ్మర పుర్వు అన్నట్లుగా నిచట యాభాస - ఆ చెంచు వనితలు ముగ్ధలు కనుక వారు నెలరాల యందలి గుఱ్ఱపు నీడలను జూచి మనుబోతులని తలచిరి.

"అలం - భ్రాంతిమత్తు"

40.వ- మఱియుఁ జూపఱమరులు గొలుపుచు మరుని యురుల సరులై యిరులు కొను కఱకుఁ జుఱుకుఁ జూపుల కోపుల వలపులు గొలుపు నెఱుకుటిఱుకు గుబ్బెతల విప్పుగప్పుల గొప్పుల యొప్పులుగని తెమలి, నెమలి పించంబు లనుచు వెఱచి పఱచి యందపు గందపు మ్రాఁకుల మోకల బెట్టుఁ జుట్టుకొను చిలువ ల తలల మినుకుల కునుకు లగు మానికంబుల రంజిలు కెంజాయ చిగురని పొగరున నెగిరి వచ్చు కోయిలలును. వడి వడి మీఁదికడ నడరుచు బీరపుఁ గుప్పలై తిప్పలకుం గొప్పలగు దుప్పలతదకుంగాక బెగ్గిలి నేలకు డిగు పెంజీలువలుం బోలె మలల చఱుల మలకలై జాఱు సెలయేఱులును, జలువ నెలవులగు కలువ రాచఱాచలువలపై వలపుతోఁ బడుకొలఁకుల కెలఁకులందగు మొగిలు తెరల యొరల మఱుంగు నం గరంగుచు మగు వల బిగువుం గవుంగిళ్ళఁ జొక్కు జక్కవల పెక్కువలును, మురువులై సింగంపు జంగిలి కిరవులై విరువులగు నరవలం గరువలి మేపుడు దొరపడగలపై నిగుడుసొంపుగల కెంపుల రంగులు తొంగలించి మీదికిం బచరించె ననమించు తలిరు మ్రాఁకులునుం, గలుగు నగ్గబ్బలి సోయగంపు టుబ్బునకు మైనిబ్బరి కింప నబ్బురపడి యబ్బలియుండు తనలోన-40

టీక:- మరియు, చూపఱమరులుగొలుపు=చూచు వారిని వ్యామోహపరచుచు, మరుని యురుల సరులై = మన్మధుని యొక్క యురుల త్రాళ్ళయి, యిరులుకొను = దట్టముగా కవియు, కఱుకు చుఱుకు చూపుల= కఠినమై చుఱుక్కుమని తగులు, చూపుల కోపులు=కడ కంటి చూపుతో / వలపుగొలుపు= వలపును కలిగించు, ఎఱుకుటిఱుకు గుబ్బెతల= ఎఱుకులైన గబ్బిగుబ్బలు గల యువతుల యొక్క, చ. చుఱుకు చూపుల జూచిన కొఱత నురుకు ఇరుకువలి గుబ్బిపాలిండ్ల యెఱుకు వారి- అని దూర్జటి ప్రయోగము. విప్పుకప్పుల, విశదమై నలుపైన, కొప్పులయొప్పులుగని =కొప్పుల యొక్క అందమును చూచి, తెమలి=తొందరపడి, యువి =నెమిలి ఫించబులనుచు, వెఱచుపఱచి =భయపడి పరుగెత్తి అందంపు =సుందరమైన, గందపు మ్రాకుల మోకలఁ =గందపు చెట్ల యొక్క- కోడెమ్రాకులను, జెట్టుచుట్టుకొను=గట్టిగా చుట్టుకొను, చిలువల తలల=సర్పముల యొక్క తలల యందుండి, మినుకులకు = ప్రకాశములకు, ఉనుకులై=నిలయములైన, మానికంబుల = మాణిక్యములందు, రంజిల్లు=ప్రకాశించు, కెంజాయ= ఎఱ్ఱనికాంతి, చిగురతి=పల్లవములని తలచి, పొగరునఁ =గర్వముతోనెగిరివచ్చు, కోయిలలును/ వడివడిఁ=వేగముగా, మీదికడఁ =పై భాగమునకు, అడరుచు=అతిశయించుచు, బీరపుకుప్పలై =వీరత్వమునకు రాసులై =తిప్పలకుం =చిన్నగుట్టలకంటె, గొప్పలగు =పెద్దవైన, దుప్పలకుఁ గాక= దుప్పలకుకాక,

బెగ్గలి=భయపడి, నేలకుఁడుగు=నేలపైకి దిగు,పెంజిలువలుంబోలె = పెద్దపెద్ద పాములవలె, మలలచరులఁ = గుట్టల యొక్క చెరియలందు, మలకలై జాఱు=వంకర వంకరలై పారు సెలయేఱులును/ చలువనెలవులగు = శీతలత్వమునకు నిలయమైన, కలువరాచఱాచలువలపై=చంద్రకాంత శిలాఫలకములపై, వలపుతోఁబడు = ప్రేమతో పడుచుండెడు, కొలకుకెలకులఁ = సరస్సుల ప్రక్కలందు, ధగు= ఒప్పుచున్న, మొగిలు తెరల మెరలఁ=మేఘములను తెరలయొక్క సమూహముల, మరుగునం గరంగుచు =చాటున కరిగిపోవుచు, మగువల=స్త్రీలయొక్క, బిగువుం కవుంగిళ్ళఁ =బింకమైన కౌగిలింతలతో,చొక్కు= పరవశించు, జక్కువల పెక్కువలును= చక్రవాకముల గుంపులు/ మురువులై=అందమైనవై, సింగంపుజంగిలికి=సింహముల మందలకు, ఇరువులై=నివాసములై, విరువులగు =చీలినవగు, నరవలఁ=కొండ దారులందు, కరవలిమేపుడు దొర=నాగరాజు, పడగలపైనిగుడు=ఫణములపై నిక్కు, సొంపుగల =అందమైన, కెంపుల రంగులు= ఎఱ్ఱనిరత్నముల యొక్క కాంతులు, తొంగలించి=అతిశయించి, మీదికిఁ=పైకి, పచరించెనన= ప్రసరించెనేమో యనగా, మించు= ఒప్పునట్టి, తలిరుమ్రాకులుంగలిగిన =చిగిర్చిన చెట్లుగల, అగ్గబ్బలి =పర్వతము యొక్క, సోయగంపుటుబ్బునకు =సౌందర్యము యొక్క అతిశయమునకు, మై=శరీరము, నిబ్బరికింప =పులకింపగా, అబ్బురపడి= ఆశ్చర్యపడి, అబ్బలియుండు= ఆ గొప్పవాడగు యయాతి మహారాజు తనలోన –

తా: – ఇంకను చూపరులను మోహపరవశుల జేయునట్టి మన్మథుని యొక్క నుచ్చుత్రాళ్ళై, దట్టముగా వ్యాపించునట్టి కఱుకైన కడగంటి చూపులతో వలపు పుట్టించు ఎఱుకు గబ్బిగుబ్బె తలును/ వారి యొక్క వెడల్పు నల్లనైన కొప్పుల యొక్క యందమును జూచి తొట్రుపడి యువి నెమిలి పింఛములని భయపడి పరుగెత్తి అందమైన కోడెవయసుగల గంధపు మ్రాకులను గట్టిగా చుట్టుకొనిన సర్పములును/ వాని తలందుండి మినుకు మినుకుమని యొఱ్ఱగా ప్రకాశించునట్టి మాణిక్యములను చూచి యువిచిగురు టాకులని భ్రమసి ఎగురువచ్చు కోకిలలును/ అతివేగముగా మీదికి దుముకుచు శౌర్యపురినిధులై తిప్పలకంటె గొప్పవైన దుప్పులును/ వానికి భయపడి ఆ తిప్పలపై నుండి నేలపైకి దిగు పాములవలె నొప్పుచున్న సెలయేరులును/ శీతలత్వమునకు నిలయమై చంద్రకాంతపు రాలపై వయ్యారముగా పడుచుండు కొలనుల ప్రక్కలందు మేఘముల యొక్క తెరలమరుగున ప్రియురాండ్ర కౌగిలింతలలో పరవశించు చక్రవాక పక్షులును, అందమైన సింహముల యొక్క

మందలకు నివాసములై యొప్పుచు చీలిన దారులందు గల నాగరాజుల యొక్క పడగలపై యొప్పు కెంపులకాంతులు పైకి ప్రసరించుచు చిగురించినచెట్లవలె నొప్పునట్టి యాపర్వతము యొక్క యందమునకు శరీరము పులకింపగా నాశ్చర్యపడి యా మహారాజు తనలోన-

"అలం - వృత్త్యనుప్రాస"

దీని అనుప్రాస యనియు పిలుతురు. వృత్తపాదమందలి ప్రాసలవలె యొకే యక్షరము మరల మరల వచ్చుచున్న యెడల వృత్త్యను ప్రాసాలంకారమగును. ఈ వచనమున మఱియు, జూపఱ, మర్రులుగొలుపుచు, మర్రుని యురుల సర్రులె అని యిటుల ఏకాక్షరా వృత్తులున్నవి. కనుక నిది వృత్త్యనుప్రాసము.

41. మత్త కోకిల:-

నీటి పుట్టుగు పట్టి యెన్నఁడు నెమ్మిఁ గానఁగ లేని యు
మ్మేటి వేలుపురాయఁ డా మరుమేపు కందొర మామగా,
నేటి నీటుతపంబు సేసెనొ యీవడంకువు లంచుఁ దా
మాటికిం గొని యాడుచుం జని మన్నుఁతేఁడట ముందటన్ -41

టీక:- నీటి పుట్టువు=తామర, నీటి పుట్టువు, పట్టి=పద్మభవుడు అనగా బ్రహ్మ, ఎన్నడున్ = ఎపుడును, నెమ్మిన్, ప్రేమతో, గానగ లేని=చూడజాలని, అమ్మేటి (అ+మేటి) వేలుపురాయడు= గొప్పనైన దేవతాధీశుడైన, మరుమేపుకందొర= మన్మధుని మేసిన కన్నుగలవాడు, అనగా శివునికి మామగాన్ =మామయగుటకు, ఏటి= ఎటువంటి, నీటితనంబు చేసెనో=గొప్పనైన తపము చెసెనో, ఈ వడంకువులంచు= ఈచలివములయని, తాన్ =తాను, యయాతి మహారాజు, మాటికింగొని యాడుచున్ =పదేపదే పొగడుచు, చని, దున్నుతేడు= ఆ భూపాలుడు, అటముందటన్ =అక్కడ ముందర-

తా:- పద్మభవుడైన బ్రహ్మకు గూడ చూడ సాధ్యము గానట్టి దేవతాధీశుడైన పరమశివునికి మామయగుటకు ఈ హిమవంతుడెంత గొప్పతపము చేసెనోయని మాటిమాటికి పొగడుచు వెళ్లగా ఆ ముందర -

'గంగానది వర్ణనము'

42.సీ॥ ఉబ్బు బుగ్గలు గబ్బిగుబ్బలు గాఁగ, బి
త్తర మైన తరగలు తరుఁలు గాఁగ,
జాలగు తొగలు ముత్యాల పేరుఁలు గాఁగ
మురువగు వెలిదమ్మి మోము గాఁగ
దోరంపుఁ దామర తూండ్లు చేతులుగాఁగ
నలతేఁటి చాల్పు నూగారు గాఁగ
బలు లోఁతు నుడియె పొక్కిలిగాఁగ, మిక్కిలి
కొమరైన చిందంబు కుతిక గాఁగ.

తే॥ గప్పుగల నాఁచు గొప్పైన కొప్పుగాఁగ
మేఁతలిడు నంచ లిరువంక మూతి గఱవ
రాణ దిలకించు పూఁ దీఁగె వీణెగాఁగ
బలుకుఁటెల నాఁగయును బోలెనలరి, మఱియు - 42.

టీక:- ఉబ్బుగుబ్బలు=పైకి ఉబికి వచ్చెడు ఊటలు, గబ్బిగుబ్బలు గాగఁ=బింకమైన చనుకట్టుగా, బిత్తరమైన తరగలు=అందమైన తరంగాలు, తరులుగాగ=కడుపుపైగల ముడుతలుగాగ, చాలగు తొగలు=వరుసలుగా ఉన్న కలువలు, ముత్యాల పేరులుగాగ = ముత్యముల దండలుగా, మురువగు తెలిదమ్మి=అందమైన తెల్ల తామర, మోముగాగ =ముఖము కాగా, తోరంపు తామర తూండ్లు=అందమైన తామర కాడలు, చేతులుకాగ=బాహువులు కాగా, అలతేటి చాల్పు= ఆ తామరలపై వ్రాలుచున్న తుమ్మెదలబారు, నూగారు కాగ= ఉదరముపై నుండెడు కోమావళికాగా, బలులోతు సుడియె పొక్కిలికాగ=మిక్కిలి లోతైన సుడి నాబికాగ=పొక్కిలి కాగా, మిక్కిలి కొమరైన=మిగుల అందమైన, చిందంబు=శంఖము, కుతిక కాగ=గొంతు గాగ, కప్పుల నాచు=నల్లదనము గల నాచు, గొప్పైన కొప్పు కాగ=గొప్పనైన కేశపాశము కాగా/ ధమ్మిల్లము కాగా, మేతలిడు నంచలు= ఒక దానికొకటి మేతలందించుకొను హంసలు, ఇరువంక మూతి గరవఁ=రెండువైపుల నుండి మెడలు చాపి మూతులు కలుపగా, రాణఁ తిలకించు= ఆదృశ్యమందముతో ప్రకాశించునట్టి పూదీగ వీణకాగా=పూదీగె వీణకాగా పలుకుటెల నాగయునుబోలె=సరస్వతీ దేవివలె, నలరి= ఒప్పి మరియు= ఇంకను-

తా :- అడుగు నుండి పైకి ఉబికి వచ్చె బుగ్గలు చనుకట్టుగా, అందమైన తరగలు వళులుగా, చాలుకలువలు ముత్యాల పేరులుగా, తెల్లతామర ముఖముగా, తామర తూడులు బాహువులుగా, తామరలపై(వ్రాలు తుమ్మెదల బారునూగారుగా, లోతైన సుడి నాభిగా, నల్లని నాచు కొప్పుగా, ఒక దానికొకటి మేతలందించు కొనుచు మూతులు కలిపిన హంసలు, పూదీగ వీణగా, ఇటులానది సరస్వతీదేవి వలె యొప్పెను - ఇంకను. - ముందరి పద్యముతోనన్వయము.

విశే:- నదులను స్త్రీలతో కవులెందరో రూపించిరి. తామరను ముఖముగా, శైవాలమును వేణిగా మొదలైన ఉపమానములందరు సర్వసాధారణముగా చెప్పనవే గాని యిందు మేతలందించుకొనుచు మూతులు చాపిన రెండు హంసలను వీణతో పోల్చుట యీతని యొక్క ప్రతిభా నవనవోన్మేతకు నిదర్శనము -

"అలం - సా. రూపకము"

పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్ర యందు పర్వత ప్రకరణమున 39 వీణల పేర్ల చెప్పెను - చూ. పు. 443.

" పరిణామము - ఉపమ "

43.సీ॥ ఇసుమునఁ గావించి యెఱఁగి జాబిలి తాల్పుఁ
దగఁ గొల్పునజ్జడ దారి తుటుము
గాలి యోగిరము గాఁగను నీటిలో నఁద
బము లొనర్చెడు నిరాబారిగములు
నేచవుల్మని మాని లోచూపుగా మిన్కు
కడలఁ దోఁచు వెలుంగుఁ గాంచువారుఁ
గ్రుంకి యానీటి కెలంకు లందును వన్నె
ముగ్గు వెట్టెడు వేల్పు ముద్దియలును
తే॥ బసిఁడి వేఁడెడు వారికి నొసఁగ వచ్చి
దరుల నిల్చిన జేజేల దొరలుఁ గడల
నడవి పసుపులు మెదిచి పైనలఁదు తబిసి
కన్నియల పిండు నెంతయుఁ గలుగు దాని - 43.

టీక:- ఇసుమున గావించి = ఇసుకతో చేసి, జాబిలి తాల్పు = శివుని, ఎఱిగి = నమస్కరించి,

తగఁగొల్చు తగినట్లుగా సేవించు, అజ్జడ దారి (ఆ+జడదారి) ఆ యొక్క మునుల సమూహము/ గాలి=వాయువు, ఓగిరముగాగను= ఆహారముగా, నీటిలోన, తపము లొనర్చెడు=తపస్సులుచేసెడు, నిరాహారిగములు=ముని సమూహములు/ ఏచవుల్ = ఇతరమైన చూపులు, మునుమాని = మొదట విడిచి, లోచూపుగా = అంతరమైన దృష్టితో, మిన్నుకడల దోచు=వేదముల చివరన గన్పించు, వెలుంగు=జ్యోతిని, గాంచువారు=చూచువారు, గ్రుంకి =స్నానమాడి, ఆనీటి కెలంకులందును = ఆ నదీ తీరములందు, వన్నెగ్రుముగ్గు వెట్టెడు = వన్నెవన్నెల ముగ్గు పెట్టెడు, వేల్పుముద్దియలును =దేవతా స్త్రీలును, పసిడి వేడెడు వారికిఁ= ఐశ్వర్యమును కోరువారికి, ఒసగవచ్చి = ఇచ్చుటకు వచ్చి, దరుల నిల్చిన=తీరములందు నిల్చినట్టి, జేజేల దొరలు=దేవతాధిపతులు, కడలఁ= ఆ ప్రక్కలందు, అడవి పసపులు మెదిచి= అడవి పసుపు మెత్తగా పిసికి, పై=శరీరమునకు, అలదు= రాచికొను, తబిసి కన్నియల పిండు=తాపస కన్యకల సమూహము, ఎంతయు=మిక్కిలిగా, కలుగుదాని= ఉన్నట్టి దానిని-

తా :- తీరమున సైకత లింగములు చేసి భక్తితో నమస్కరించి పూజించు మునుల సమూహము, గాలినే ఆహారముగాతీసి కొనుచు నా నీటిలో నిలిచి తపము చేయు మునుల గుంపు, యితరమైన చూపులన్ని మాని లోచూపున వేదముల కవ్వలవెలుగు జ్యోతిని గాంచు ఋషుల సమూహము, ఆ నీటిలో స్నానమాడి దాని తీరమున రంగు రంగుల ముగ్గులు పెట్టు దేవతాస్త్రీలు, అక్కడ తపములు జేయువారికి ఐశ్వర్యములిచ్చుటకై వచ్చి దాని తీరములందు నిల్చిన వివిధ దేవతాధిపతులు, మఱియొక వైపు అడవిపసుపు మెత్తగా పిసికి శరీరమున కలదుకొని స్నానము చేయు తాపస కన్యకల సమూహము గలిగి - మరియును - ముందరి పద్యముతో నన్వయము.

"ఉదాత్తము"

44.సీ॥ తులకించు వేలుపు దొరల కేళా కూళి
పసిఁడి కెందమ్మిల పంటచేను
జొట్టునట్టున తేజిజోదుఁగాంచిన దంట
సగరు లేఁగిన నాటి ముగితి త్రోవ
బెడిదంపు జడదారి తొడఁ దూఱి నవలంతి
నలువ వారువములు చెలఁగు చోటు

జగములు మూఁటిపై జంగజాచిన ఱాఁగ
నుడుగుల చెలిమామ యడుగుఁ జెమరు
తే॥ పరగఁ దనుఁ జూచు వారి కెవ్వరికి నైన
మలబిడారును మలకల నలరుపేరుఁ
బంటతేరును వేలిమికంటి తీరు
నొసఁగు ప్రోడయు నైచాల నోనరు దాని - **44**

టీక:- తులకించు = చక్కగా ప్రకాశించు, వేలుపు దొరల = దేవతాధిపతుల యొక్క, కేళాకూళి = జలక్రీడ లాడెడు సరస్సు.

సీ॥ శచికీతనేర్పుచు, చదవేట సురరాజు, జలకేళి సవరించు చవులె రింగె-అని మనుచరిత్ర- పసిడి కెందమ్ముల = బంగారు తామరల యొక్క పంటచేను, పండెడు పొలము, జుట్టు నట్టువ = జుట్టుగలిగి నాట్యమూడునది, అనగా నెమలి, తేజిజోదు = దానిని వాహనముగా గల, దిట్ట = అనగా కుమారస్వామిని, గాంచిన దంట = కన్నటువంటి జాణ, కుమారస్వామికి గంగా పుత్రుడని గూడ పురాణ ప్రసిద్ధి, తాసైరింపక పర్లయుండగ - అను విజయ విలాస పద్యమునిట యను సంధించు కొని స్మరింపవలెను - సగరులు = సగరు చక్రవర్తి కుమారులు - ఏగిననాటి = వెళ్ళినప్పటి, ముగితి త్రోవ = ముక్తి మార్గము, బెడిదంపు = భయంకరమైన, జడదారి = మునియొక్క, తొడదూఱిన = ఊరువున ప్రవేశించిన, వలంతి = స్త్రీ, నలువవారు వములు = హంసలు, చెలగు చోటు = సంతోషించు స్థలము, జగములు మూటిపై = మూడు లోకములపై, జంగ జాచిన = తనయొక్క కాలును చాపిన, ఱాగ = గయ్యాళి -గంగ స్వర్గ మర్త్య పాతాళములు మూపిటిని గూడ చుట్టి నట్లు పురాణ ప్రసిద్ధి, నుడుగుల చెలి = సరస్వతి, మామ = ఆమె యొక్క మామ యైన వాడు విష్ణువు కనుక అతని యొక్క, అడుగు చెమరు = పాదము యొక్క చెమట, అనగా చెమర్చిన జలము గంగ విష్ణు పాదోద్భవ పరగన్ = యని ప్రసిద్ధి ఒప్పునట్లుగా, తను జూచు వారికి, ఎవరికినైన = ఎటువంటి వారికైన, మలబిడారును = పర్వత నివాసము, అనగా కైలాసము, మలకల నలరుపేరు = మెలికలు గల దండ, అనగా సర్పహారము, పంటతేరును = ధరణీ రథమును, వేలిమికంటితీరు = అగ్ని నేత్రము, నొసగు = ఇచ్చునట్టి, ప్రోడయునై = దిట్టయై, చాలన్ = మిక్కిలిగా, ఒనరు దానిన్ = ఒప్పుదానిని.

తా:-దేవతాధీశుల కందరికి జలక్రీడా సరస్సు, బంగారు తామరలు పండు పొలము, కుమారస్వామిని కన్నటువంటి జాణ, సగరుల యొక్క ముక్తి మార్గము, జహ్ను

మహర్షి తొడలో ప్రవేశించిన కాంత, హంసలు మెలిగే స్థలము, మూడు లోకాలపై తనకాలు చాపిన గయ్యాళి, విష్ణువు యొక్క కాలిచెమట, తనను చూచి నటువంటి వారెవరైనను వారికి కైలాస నివాసము సర్పహారము ధరణీ రథము, వేడికన్నుయీూయు గలిగిన దిట్టయైనట్టి దానిని – ముందరి పద్యముతో నన్వయము

"ఉల్లేఖము"

45.క॥ రంగుగఁ జూపఱకోర్కులొ
సంగన్, దోసంబు లడఁపఁ జనుదెంచిన యా
గంగం గని, మై యెల్లను
పొంగం. దగ మ్రొక్కి రాచపుట్టువు మదిలోన్ ,- 45

టీక:– రంగుగన్ = స్పష్టముగా/ ప్రకాశముగా, చూపఱకొర్కులు = చూచువారి కోరికలు, ఒసంగన్ = ఇచ్చుటకును, దోసంబులడపన్ = పాపములు తొలగించుటకు, చనుదెంచిన = భూలోకమునకు వచ్చిన, ఆగంగంగని = ఆ గంగా దేవిని చూచి, మైయెల్లను పొంగన్ = శరీరమంతయు పులకించగా, రాచపుట్టువు = ఆ రాకుమారుడు, తగన్మ్రొక్కి = ఉచిత రీతిగా నమస్కరించి, మదిలోన్ = మనస్సులో–

తా :– ఆ రాకుమారుడు తనను దర్శించు వారి దోషములన్ని తొలగించి కోరికలన్ని తీర్చుటకై భూలోకమునకు వచ్చిన గంగాదేవిని చూచి శరీరమంతయు పులకించగా నమస్కరించి, మనస్సులో– ముందరి పద్యముతో నన్వయము –

46. సరసిజ వృత్తము :–
కప్పఁగఁ దోలుం గొప్పునఁజాలుం, గనువిను కులనొడికములగు సరులుం
దిప్ప బిడారుం, ద్రిప్పని తేరుం, దిరముగఁజదువులు దెలిపెడి తెరెయుం
గప్పగు తూపున్, గొప్పగు రూపుం, గడలిని దరువఁగఁ గలిగిన పువ్వుం
దప్పక యిచ్చునిప్పుగ మెచ్చుం దమనటు పాడఁగనఁదడ వెవ్వరికిన్ –46

టీక : కప్పగతోలున్ = ఆచ్ఛాదించు కొనుటకై తోలు, కొప్పున జాలున్=జటాజూటమున నది, కనువినుకుల నొడికములగు సరులున్ = కన్నులే చెవులుగా గలిగిన అనగా సర్పముల యొక్క అందమైన హారములు తిప్పబిడారున్ = శైలనివాసము, అనగా కైలాసము, త్రిప్పని తేరున్ = అనగా ధరణీ రథము, తిరముగ = స్థిరముగ, చదువులు

దెలిపెడి = విద్యలను తెలిపెడిది, కపాల మనుట; తెలెయుఁ= బోజన పాత్రము, కప్పగు తూపుఁ= నల్లని బాణము, అనగా విష్ణువనుట, గొప్పగు రూపుఁ = గొప్పనైనట్టి రూపము, కడలిని దరువగ గలిగిన పూవుఁ= సముద్రమును చిలుకగా లభించిన పూవు, అనగా చంద్రుడనుట, ఎవ్వరికిఁ= ఎటువంటి వారికైనను, తననట పొడగనఁ = తనను అటుల వచ్చి దర్శించుటయే, తడవు = ఆలస్యము, విప్పుగమెచ్చుఁ = అట్టివారిని బాగుగా మెచ్చుకొనును, తప్పక యిచ్చుఁ = పైన పేర్కొన శివత్వ చిహ్నములైన అజినాంబరాదులు తప్పక యిచ్చును. అనగా గంగాదేవిని దర్శించినంత మాత్రమే చాలును, వారికి మరణాంతమున శివుని యొక్క సారూప్యముక్తి కలుగునని తాత్పర్యము.

తా:- ఎవరైనను సరియే తనను కేవలము దర్శించినంతన చాలును. వారికి గజాజినము, తలపై గంగ, సర్పహారము, కైలాస నివాసము, ధరణి రథము, పునుక పాత్ర, విష్ణువను తూపు, శిరోభూషణమైన నెలవంక తప్పక వారికి కలుగు నట్లు చేయును.

అనగా గంగా దేవిని దర్శించినంత మాత్రముననే శివసారూప్యము గలిగిన యెడల నిక స్నానమాడిన యెంతఫలముండునో ఆ దేవిని పూజించిన మరెంత ఫలముండునో ఊహాతీతము.

47.వ- అని యమ్మున్నీటి రాణి చెన్ను మాటికిం గొని
యాడుచుఁ గొంత దవ్వరిగి యచ్చుట - 47

టీక:- అని = ఇట్లని, అమ్మున్నీటి రాణి చెన్ను = సముద్రుని దేవేరియైన ఆ గంగాదేవి సౌంధర్యమును, మాటికిఁ గొని యాడుచు = మరల మరల పొగడుచు, కొంత దవ్వరిగి = కొంత దూరము వెళ్లి, యచ్చట-

తా:- అని ఈ విధముగా సముద్రుని రాణియైన గంగాదేవి యొక్క సౌందర్యమును మరల మరల పొగడుచు కొంతదూరమరుగగా నచ్చట-

సంస్కృత సాహిత్యమును గంగాదేవి సౌందర్యమును జగన్నాథపండితుని "గంగాలహరి" లో దర్శింపవచ్చును.

48. తోదకము :-

మావులు జిన్నులు మాదిఫలంబుల్
క్రోవులుఁ బొన్నలు గోఁగులు నిమ్మల్
మోవులు రోవులు మోదుగు లొద్దుల్
రావులు నిప్పలు రాణ దలిర్పన్.

టీక:- మావులు = మామిడులు, జిన్నులు = ? మాదిఫలంబుల్ = మాతు లుంగలు, క్రోవులు = కురువకములు, పొన్నలు, గోగులు, నిమ్మలు, మోవులు=? రోవులు = ?, మోదుగు, లొద్దుల్ = లొద్దుగులు, రావులున్ = రాగులు, ఇప్పలు = ఇప్పచెట్లు, రాణదలిర్పన్ = ప్రకాశించుచుండగా -

తా:- అక్కడ మామిడి, మాతులుంగి, కురవక, పొన్న, గోగు, నిమ్మ, మోదుగు, లొద్దుగ, రాగి, ఇప్ప, జిన్ను, మోవి, రోవు మొదలైన వృక్షములు ప్రకాశించు చుండగా - ముందరిపద్యములోనన్వయము-

49.సీ॥ మదిఁ గూర్మలుప్పొంగ మొదవు బాలెంతల
పురుడోము ముదుసలిపులు లకదువు
బలుదాదులగుచు బెబ్బులి బిడ్డలను నిచ్చ
విసువక ఎంచునాఁ బసుల పదుపు
లెలమి ముంగిస పిల్లలెండ దాఁకక యుండఁ
బడగ లడ్డము పట్టు పాఁపగములు
నెలుక పూఁపల వీఁపు లెక్కించుకొని సారె
నలరించు జంగుపిల్లుల తుటుములుఁ

తే॥ జేరిసింగపుఁ[1] బిల్లల చెమటలాఱఁ
జెవుల విసరెడు నేనిక చేడియలును
గౌరు లామున నొడ లెఱుంగమిని జూచి
మేఁత లందిచ్చు తెఱనోటి మెకములడరు - 49

టీక :-మది గూర్మలుప్పొంగ = మనస్సులో ప్రేమలు పొంగుచుండగా, మొదవు బాలెంతల = బాల+ఇంతి (బాలెంత) బాలెంతలైన మొదవుల = అనగా లేగటి యావుల యొక్క,

పురుడోము = పురుడుతీర్పు, ముదుసలి పులులకదుపు = ముసలివైన పెద్ద పులుల యొక్క గుంపు/బలుదాదులగుచు = గొప్పనైన దాదికత్తెలగుచు, బెబ్బులుల = బెబ్బులలయొక్క, బిడ్డలను = కూనలను, నిచ్చల్ = ఎల్లపుడు, విసువక = విసుగు కొనక, పెంచు = పెంచెడు, ఆబసుల పదుపు = ఆవులగు పశువుల మంద/ ఎలమి = ప్రేమతో, ముంగిస పిల్లలు = ముంగిపిల్లలకు, ఎండదాకకయుండ, పడగలు అడ్డము పట్టు, పాపగములు = పాముల గుంపులు/ఎలుక పూవలర్= ఎలుక పిల్లలను, వీపులెక్కించుకొని, సారె = మాటిమాటికి, అలరించు = సంతోషపెట్టు, జంగుపిల్లల తుడుములు = జంగురు పిల్లుల గుంపులు చేరి = సమీపించి, సింగపుకొదమల = సింహము పిల్లల యొక్క, చెమటలార = చెమటలు ఆరిపోవునట్లుగా, చెవులర్= చెవులతో, విసరెడు, ఏనిక చేడియలును = పెంటి ఏనుగులు/ గౌరులు = ఏనుగులు, ఆమునర్ = వ్యాధితో, బడలెరుంగమిని = శరీరముపై స్పృహలేని స్థితిని చూచి, మేతలందించు = వానికి మేతలు తెచ్చిపెట్టు, తెరనోటి మెకములు = సింహములు, అడురుర్ = ఒప్పును.

తా:- మనస్సులో ప్రేమ పొంగుచుండగా లేగటి యావుల యొక్క పురుళ్ళను దీర్చు ముసలి పెద్దపులులు, పెద్ద పులుల యొక్క పిల్లల నెల్లప్పుడు విసుగు కొనకుండ పెంచు నావులు, ముంగిస పిల్లలకు ఎండ తగులకుండ పడగలు పట్టు పాములు, ఎలుక కూనలను వీపుల నెక్కించుకొని యాడించు జంగురు పిల్లులు, సింహముల పిల్లలకు చెవులతో విసరి చెమటలార్చు పెంటి ఏనుగులు, ఏనుగులు జబ్బుపడి యొడలెరుగనపుడు వాని నోటికి మేతలందించు సింహములు అచట నొప్పుచుండెను.

విశే:- కావ్యమందలి అష్టాదశ వర్ణనలందు పుణ్యాశ్రమ వర్ణనము గూడ నొకటి. వానిని వర్ణించు పట్ల నచటి ప్రాణులు జాతి వైరములు విడిచి వర్తించు చున్నట్లు చెప్పుట కావ్య సంప్రదాయము.

50.సీ॥ ఆరఁగట్టిన కావిచీరల కెంజాయ
చిగురు జొంపంబుల చెన్నుఁబెంప
నోలి నిచ్చలుఁ జేయు వేలిమి పొగలు తు
మ్మెద దిమ్ములకు రంగు లొదవఁజేయ
దులకించు మూఁడవ తొలిపల్కు రవలి కో
వెలకూఁతలకు నొక్కవింత నెఱప

ముంగిళ్ల బాసవాల్ముద్దియ లిడిన ముగ్గు

గ్గులు పువ్వులకు నిండు తెలివినింప

తే॥ గలుగు మ్రాకులు జన్నంపు గంబములను
దడఁబడంగను దగు నొక్క తబిసితోఁటఁ
గాంచి, యబ్బురపడి కోర్కి గడలు కొనఁగ,
రాచవేలుపు ఱేఁడు చేరంగవచ్చి.

టీక:- అరగట్టిన = ఆరుటకు కట్టినటువంటి, కావి చీరల = కావి బారిన వస్త్రముల యొక్క, కెంజాయ = ఎఱ్ఱటి వన్నె, చిగురు జొంపంబుల = చిగురించిన పొదలయొక్క, చెన్నుబెంప = ఎఱుపు దనమును మిక్కిలిగా చేయుచుండగా/ ఓలిన్ = క్రమముగా, నిచ్చలు = ఎల్లపుడు, చేయువేలిమి పొగలు =చేయు చుండు హోమముల యొక్క ధూమములు, తుమ్మెద దిమ్ములకు = తుమ్మెదల యొక్క గుంపులకు, రంగు లొదవ జేయ = మరింత నల్లదనమును కలిగించు చుండగా/ తులకించు = ప్రకాశించు, మూడవ తొలిపల్కు = మూడవదగు సామవేదము యొక్క, రవలి = ధ్వని, కోవెలకూతలకు = కోకిలల ధ్వనులకు, ఒక వింత నెఱప = ఒక క్రొత్తదనము నేర్పుచుండగా/ ముంగిళ్ళ = వాకిండ్లలో, బాసవాల్ ముద్దియ లిడిన = గీర్వాణ వనితలు దీర్చిన, ముగ్గులు = రంగవల్లులు, పువ్వులకు = ఆ ముగ్గులపై నుంచిన పూలకు, నిండు తెలివినింప = నిండుగా కాంతినిచ్చుచుండగా/ కలుగు మ్రాకులు = అచట నున్నమ్రానులు, జన్నంపు కంబములను = యజ్ఞయూపములు, తడబడగను = గుర్తింపరాక కాడుపడు చుండగా, తగు = ఒప్పునట్టి, ఒక్క తబసితోట = ఒక ముని వనము, కాంచి = చూచి, యబ్బురపడి = ఆశ్చర్యపడి, కోర్కిగడలు కొనగ = తనయొక్క కోరిక యుప్పొంగగ, రాచవేలుపుఱేడు = ఆ రాజేంద్రుడు, చేరంగవచ్చి = సమీపించి.

తా:- అచట అరగట్టి నటువంటి కాషాయ వస్త్రములు చిగురు పెట్టిన పొదల యొక్క ఎఱుపు దనమును మరింతగా పెంచుచుండగా, విధివిధాన ప్రకారముగా నెల్లపుడు చేయుచుండు హోమముల పొగలు తుమ్మెదలకు మరింత నల్లదనము గలిగించు చుండగా, ఋత్విక్కులు చదువుచుండు సామగానములు కోకిల కూతలకు ఒక క్రొత్తదనము నేర్పుచుండగా దేవతాస్త్రీలు వాకిండ్లలో పెట్టిన రంగవల్లులు అచటి పూలపై నిండుగా కాంతులు ప్రసరించుచుండగా, అచట నున్న వృక్షములు, యాగ యూపములు ఎరుగ రాకుండ తడబడుచుండగా నొప్పుచున్న ఒకానొక మునియొక్క

వనమును గని యాశ్చర్యపడి ఆ రాజేంద్రుడు కోరికలుప్పొంగుచుండగా సమీపించి – ముందరి పద్యములో నన్వయము

"అనుగుణము"

"జాబాలి మహర్షి"

51.సీ॥ పటికంపు మురువులు పాఁపకొమ్మలటంచు
జిలువల ఱేండ్లు చేతులం బెనంగ
జడలలో నిండ గూండ్లిడిన పుల్గుల మ్రోత
చెలఁగుచు నల్గడల్ చెవుడు పరుప
గమిగూడ నరపగడ్డము వట్టి వ్రేలుచుఁ
జింకిలీకంబులు చేరి యుఱుక
బెట్టుగా మైనిండఁ బెట్టిన చెదలకై
గొఱువంక లెప్పుడు గోళ్ళఁ ద్రవ్వఁ

తే॥ బ్రాఁత చదువుల తుదల నేర్పడిన మెఱుంగు
మదిని గనుగొంచుఁ దావెలి బఱచి కడిఁది
దబము గావించు జాబాలి దండకరిగి
ముందఱికి నేఁగి సాఁగిలి మ్రొక్కుటయును – 51

టీక:– పటికంపు మురువులు = స్ఫటిక వలయములు, పాపకొమ్మలటంచు = ఆడుపాములని, చిలువల ఱేండ్లు = నాగరాజులు, చేతుల బెనంగ =చేతులకు చుట్టుకొను చుండగా, జడలలో = జడలందు, నిండఁ = నిండుగా, గూండ్లిడిన = గూళ్ళుబెట్టిన, పుల్గులమ్రోత = పక్షులు ధ్వని, చెలగుచు నల్గడల్ = విజృంభించుచు నాలుగు దిక్కులను, చెవుడు బరప = చెవుడు పడజేయుచుండగా, గుమిగూడి = గుంపులు గుంపులై, నరపగడ్డము = పండిపోయిన గడ్డమును, పట్టివ్రేలుచు = పట్టుకొని వ్రేలాడుచు, చింకిలీకంబులు = చిన్న గబ్బిలములు అనగా బండ జింకలు, చేరియురక = గుంపులుగా లేచి యురుకుచుండగా, బెట్టుగా = దట్టముగా, మైనిండ = శరీరము నిండ, పెట్టినచెదలకై = పెట్టునటువంటి చెదలు కొరకు, గొరవంకలు = శారికలు, ఎప్పుడుఁ = ఎల్లపుడు, గోళ్ళ ద్రవ్వ = గోళ్ళతో త్రవ్వుచుండగా, ప్రాత చదువుల తుదల = వేదముల యొక్క చివరలందు, ఏర్పడిన మెరుగు = కలిగినటువంటి

కాంతి, మదిని గనుగొంచు = మనస్సులో చూచుచు, తా= తాను, వెలిమరచి = బాహ్యమును విస్మరించి, కడిదితపము = గొప్పనున తపము, కావించు = చేయుచున్న, జాబాలి = జాబాలి మహర్షి యొక్క, దండ కరిగి = సమీపమునకు చేరి, ముందరికి నేగి = అతని ఎదురుగా వెళ్లి, సాగిమొక్కుటయును = సాష్టాంగ నమస్కారము చేయుగా -

తా: - చేతులకు గల స్ఫటికపు కడియములను చూచి పెంటి నాగులని నాగరాజులు చేతులకు చుట్టుకొని చుండగా/ జడలనిండ గూళ్లు పెట్టిన పక్షుల యొక్క కలకల ధ్వనులు నలువైపుల వ్యాపించు చుండగా/ పండిన గడ్డమును పట్టుకొని వ్రేలాడు చుండెడు బండ జింకలు గుంపులుగా లేచి యురుకు చుండగా, శరీరము నిండ దట్టముగా పెట్టబడిన పుట్టలను చెదపురుగులకై ఎల్లప్పుడు గోరెంకలు గోళ్లతో త్రవ్వు చుండగా/ నాలుగు వేదముల కవ్వల నుండు వెలుగును మనస్సులో దర్శించుచు బాహ్యమును మరచి తపము చేయుచున్న జాబాలి మహర్షిని జూచి సమీపించి ముందువైపునకు వచ్చి సాష్టాంగ పడగా - ముందరి పద్యముతో నన్వయము.

విశే:- జాబాలి మహార్షికి తలపై పిచ్చికలు గూళ్లు పెట్టుటే పురాణప్రసిద్ధము, దాని నాధారముగా తెలగన్న నతని శరీర మంతయును యుచితమైన ప్రాణులతో నింపి యతని తీవ్రతపోనిష్టను యిందు చక్కగా రూపుకట్టించెను. అడవులలో స్థాణువులై కూర్చుండు వారి శరీరములపై పాములు ప్రాకుట, తలపై పిట్టలు వాలుట వింతయేమియు గాదు.

ఈనాడు తలకు గడ్డమునకు తేనె టీగలను పట్టించుకొను వారిని శరీరముపై తేళ్లు పాములను ప్రాకించుకొను వారిని మనము ప్రదర్శనలలో చూచుచునే యున్నాము గదా!

సాష్టాంగము :-

కరయుగములు చరణంబులు (4)
ఉరములలాటస్థలంబు నున్నత భుజముల్ (4)
సరిధరణి మోపి మ్రొక్కిన
బరువడి సాష్టాంగ మంద్రు పరమము నీంద్రుల్

52.వ- అప్పుడాచప్పు డాలించి, జాబాలి మహార్షి అపుడు ఆ మహా రాజు సాష్టాంగ పడిన చప్పుడును విని -

53.తే॥ అల్లనల్లన కనువిచ్చి యతని మేని
సోయగంబును బీరంబుచొప్పు మురువుఁ
దడవుగాఁ జూచి మదిని సంతసము గ్రమ్మ
నపుడు జడదారి రాయఁ డిట్లనుచుఁ బలికె - 53

టీక:- అల్లనల్లన = మెల్లమెల్లగా, కనువిచ్చి = కనులు తెరచి, అతని మేని = ఆ మహారాజు శరీరము యొక్క, సోయగంబును = సౌందర్యమును, బీరంబుచొప్పు = పరాక్రమము తీరు, మురువు = విలాసము, తడవుగా జూచి= నిదానముగా చూచి, మదిని సంతసము గ్రమ్మన్= మనస్సులో సంతోషమావరించగా, అపుడు, జడదారిరాయడు = ఆ మునీశ్వరుడు, ఇట్లనుచు బలికె = ఈ విధముగా ననెను.

తా :- అపుడు ఆ మునీశ్వరుడు మెల్లమెల్లగా కనులు తెరచి ఆ మహారాజు శరీరము యొక్క అందమును, పరాక్రమమును, విలాసమును నిదానముగా పరికించి మనస్సులో సంతోషము క్రమ్ముకొనగా నిట్లనెను -

"జాబాలి యయాతిని నీవెవ్వరని యడుగుట'

54.క॥ 'అన్నా నీపేరెవ్వరు?
నిన్నుం గనుఁగొన్న నహుషునిం జూచిన య
ట్లున్నది, యారావేలుపు
గన్న కుమారుఁడవె, నీదుకైవడి దోఁచెన్ - 54.

టీక:- అన్నా! నీపేరెవరు = నీయొక్క పేరేమి, నిన్నుగనుగొన్న = నిన్నుచూడగా, నహుషునిన్ =చూచిన యట్లున్నది, ఆరావేలుపు = ఆ యొక్క రాజేంద్రుడు, కన్నకుమారుడవె = జన్మనిచ్చిన తనయుడవా, నీదుకైవడి = నీ పోలిక, దోచెన్ = అటుల కనిపించెను.

తా:- అన్నా! నీపేరెవరు! నిన్నుచూడగా నహుషచక్రవర్తిని చూచినట్లున్నది. నీవామహారాజు యొక్క తనయుడవా! నీపోలిక ఆవిధముగా నున్నది.

విశే:- ఆత్మావైపుత్ర నామాసి - పురుషుడు తానే స్త్రీ గర్భమున ప్రవేశించి మరల జన్మించునని శాస్త్రము కనుక సంతానమున తండ్రిపోలికలు లేదా తల్లి పోలికలు తప్పక నుండును.

ఉత్తర రామచరిత్రమును శ్రీరాముడు లవకుశులను సీతాదేవి పోలికల ను బట్టి వారు తనపుత్రులని గుర్తించగా మహాభారతమున దేవయాని శర్మిష్ఠకుమారులను యయాతి పోలికలు జూచి యతని పుత్రులని గుర్తించెను.

"అలం: స్మృతి"

55.చ॥ అనవిని రాచవేల్పుదొర యామునిఁగన్గొని కూర్మి నెమ్మదిం
బెనగొన, నయ్యనే నహుషుబిడ్డఁడఁ బేరు యయాతి, వేఁటకో
పున నవరించినం దెరలు బోనులు గైకొన కొక్కయిఱ్ఱివ
చ్చినఁ జనుదెంచినాఁడ, నది చేపడునో యను హాళితోడుతన్ -

టీక:- అనవిని = అనగా విని, రాచవేల్పుదొర = ఆరాజేంద్రుడు, యామునిగన్గొని = ఆమహార్షిని చూచి, కూర్మినెమ్మదిన్ = స్నేహభావము మనస్సును పెనవేసుకొనగా, అయ్య = ఓ తండ్రీ, నేనహుషుబిడ్డడన్ = నేను నహుషచక్రవర్తి కుమారుడనే పేరు యయాతి, వేటకోపున = వేటనిమిత్తమున, నవరించినన్ = నవరించగా, తెరలు, బోనులు, గైకొనకన్ = తీసికొనకనే, ఒక్క యిఱ్ఱి వచ్చిన = ఒక జింకరాగా, అది, చేపడునోయను = చిక్కునోయను, హాళితోడుతన్ = ఆసక్తితో, చనుదెంచినాడ = వచ్చినాను -

తా:- అనగా విని రాజేంద్రుడు ఆ మహార్షిని జూచి, యతనిపై తండ్రిపేరు స్మరించినందున స్నేహభావముకలుగగా ఓ తండ్రీ! నేను నహుషుని బిడ్డడనే! నాపేరు యయాతి, వేట నిమిత్తమై ఏర్పాటున వచ్చి తెరలు, బోనులు ఏవి లేకుండగనే ఒక జింక ఈ మార్గమున రాగా అదిచిక్కునేమోయని యాసక్తితో వచ్చితిని.

56.వ- అనవుడుఁ జేరువం దగిన యెడం బుడమి ఱేనిం
గూర్చుండ నేమించి గారవించి యిట్లనియె.

టీక :- అనవుడు = అనగా, చేరువన్ = సమీపమున, తగిన యెడన్ = తగిన చోట, పుడమిఱేనిం = మహారాజును, కూర్చుండ నేమించి = కూర్చుండుమని నియమించి, గారవించి = గౌరవించి, ఇట్లనియె-

తా:- అనగా నా మహార్షి ఆరాజును తగిన స్థలమును కూర్చుండజేసి గౌరవించి ఇట్లనెను -

యయాతికి జాబాలి హితోపదేశము

57.కII రక్కసులు వేడబంబుల
మిక్కిలి నాముకొని కొట్టుమిట్టాడంగా,
నక్కట యొక మెకమునకై
యిక్కానల నొంటిc దిరుగు టిది తగవగునే?

టీక:- రక్కసులు = రాక్షసులు, వేడబంబుల = మోసములచేత, మిక్కిలి = ఎక్కువగా, నాముకొని = వ్యాపించి, కొట్టుమిట్టాడంగా = నిరంకుశముగా సంచరించుచుండగా, అక్కట = అయ్యో! ఒక మెకమునకై = ఒకమృగము కొరకు, ఇక్కానలన్ = (ఈ+కానలన్) ఈ యడవిలో, ఒంటిదిరుగన్ =ఒక్కడుగా తిరుగుట, ఇది తగవగునే = ఇదితగినదేనా -

తా:- ఓ మహారాజా ! రాక్షసులు మాయలతో మిక్కిలి వ్యాపించి నిరంకుశముగా తిరుగుచుండగా నీయడవిలో అయ్యో! ఒక మృగము కొరకై యిటులనొంటరిగా తిరుగుట తగినదేనా!

58.కII మునుపొక రక్కసి మెకమై
తన ముందటి కేఁగుదేర దాని వెనుకc దాc
జనుదెంచి కాదె, రాముడు
నను వేదుచు మోసపోయి యలజడి పడియెన్ - 58

టీక:- మునుపు = పూర్వము, ఒక రక్కసి = ఒక రాక్షసుడు, మెకమై = మృగమై, తనముందటికేగుదేర = తన ఎదుటికి రాగా, దాని వెనుక, తా = తాను, చనుదెంచిగాదె = వచియేగదా, రాముడు, మోసపోయి, అనువేదుచు = (అనువు+ఏది) మేలును గోల్పోయి, అలజడి పడియెన్= చికాకుపడెను.

తా:- పూర్వమొక రక్కసుడు మృగమై తన ఎదుటికి రాగా దాని వెంట వచ్చియేకదా శ్రీరాముడు మోసపోయి మేలు తొలగి చికాకు పడెను.

59.ఉ॥ నావుడు నయ్యయాతి, మదినాటిన ప్రేముడి ముజ్జగంబులం
బ్రోవఁగ గావ బీరమునc బల్లుగు రాముడునట్టి బూమెచే
నేవగ మోసపోయె? నతఁడేమిటc దాగడతేటె? నాకునో
దేవర, యానతీ వలయుc దేటపడ న్విన వేడుకయ్యెడున్ - 59

టీక:- నాపుడు = అనగా, అయ్యయాతి = ఆ యయాతి మహారాజు, మది నాటిన ప్రేముడిన్ = మనస్సులో నిలిచిన స్నేహము చే, ముజ్జగంబులన్ = (మూడు+జగములు) మూడు లోకములను, అనగా స్వర్గ, మర్త్య, పాతాళములను, ప్రోవగన్ =పోషింపగా, కావగన్ =కాపాడగా, బిరమునన్ =శౌర్యమున, పొల్పగు = (పొలుపు+అగు) స్థిరుడగు, రాముడు = రామచంద్రుడు, అట్టి బూమెచే = అటువంటి మాయచే, నేవగన్ = ఏవిధముగా, మోసపోయెన్, అతడేమిటన్ = అతడు దేనివలన, తా = తాను, కడతేరె = ఆ యాపదను నిస్తరించెను. ఓ దేవరా = ఓస్వామీ, నాకున్ , ఆనతీవలయు = తెలుపవలయును, తేటపడన్ = అది మంతయు స్పష్టమగునట్లుగా, వినన్ = వినుటకు, వేడుకయ్యెడున్ = వేడుక కలుగుచున్నది.

తా:- అనగా నా యయాతి మహారాజు ఆ మహర్షిపై మనస్సులో నిలిచిన స్నేహమున, మూడు లోకములను పోషించుటకు కాపాడుటకు స్థిరమైన శౌర్యముగల ఆ శ్రీరాముడు అటువంటి మాయచే ఏవిధముగా మోసపోయెను, పిదప దానినెట్లు కడతేరెను. ఓ స్వామీ! నాకిది స్పష్టముగా వినుటకు వేడుక కలుగుచున్నది. కావున దానిని ఆనతీయవలయును.

60.వ- అని యడుగుటయును - 60

అని అడుగగా -

"జాబాలి రామాయణ కథ యయాతికి చెప్పుట

61.చు అలరఁ బులస్త్యు ముద్దుకొడుకై తగు విశ్రవసుండు రావణుం
బెలుచగు కుంభకర్ణుని విభీషణుఁ గాంచిన, వారు మీఱి, చే
బలువున నల్లెడ ల్గెలిచి, పైడి దొరం దెగి పాఱఁద్రోలి, ని
చ్చలమున దావిగట్టుకడ సంద్రములోపలి దీవి యేలుచున్ - 61

టీక:- పులస్త్యు ముద్దుకొడుకై తగు = పులస్త్య బ్రహ్మకు గారాబముల కుమారుడై, తగు = ఒప్పునట్టి, విశ్రవసుండు = విశ్రవసువాడు, అలరన్ = తగినట్లుగా, రావణున్ = రావణుని, పెలుచగు = అధికమైన వాడైన, కుంభకర్ణుని, విభీషణున్ = విభీషణుని, గాంచినన్ = పొందగా, వారుమీఱి = వారలు విజృంభించి, చేబలువున = భుజబలమున, నెల్లడల్గెలిచి = అన్నిదిక్కులను గెలిచి, పైడిదొరన్ = కుబేరుని,

తెగిపాఱన్ = పిరికి వడి పరుగెత్తునట్లుగా, త్రోలి = వెళ్లనడచి, నిచ్చలమున = ధైర్యముగా, తావిగట్టుకడ = మలయపర్వతము దిక్కున అనగా దక్షిణమున, సంద్రములోపలి దీవి = సముద్రమందలి ద్వీపము, ఏలుచున్ = పాలించుచు -

తా:- పులస్త్యునికి ప్రియమైన పుత్రుడగు విశ్రవసుడు అనువాడు కైకసియను దానవకాంతయందు, ఒప్పుగా రావణుడు, బృహత్కాయము కలిగిన కుంభకర్ణుడు, విభీషణుడు అనువారిని పొందగా వారు విజృంభించి భుజబలమున నన్ని దిక్కులు గెలిచి కుబేరుని పిరికివడి పరుగెత్తునట్లు చేసి, దక్షిణపు దిక్కుగల సముద్రము నందలి ద్వీపము నేలుచు -

రావణాదులజననము

లంకాద్వీపమును మొదటి " కేశి " యను దానవప్రభువు పాలించుచుండెను. అతనికి మాలి సుమాలి యని యిద్దరు కుమారులుండిరి. వారొకపు డింద్రుని పైకి దండెత్తి పోవనతడు మాలిని వధించెను. అంత సుమాలి భయపడి సకుటుంబముగా పాతాళమునకు పారిపోయెను.

సుమాలి భార్య కేతుమతి. ఆమె "నర్మద" యను గంధర్వ కాంత పుత్రిక. దేవయోనులలో విద్యాధరులు, అప్సరసలు, యక్షులు, రాక్షసులను తెగలున్నను వివాహ విషయమున వారికి తెగల నడుమ పట్టింపులు లేవు. గంధర్వ కాంతలను దానవులు, దానవకాంతలను దేవతలు వివాహమాడుచునే యుండిరి.

కేతుమతికి ప్రహస్తుడు, అకంపనుడు, వికటుడు, శకటి ముఖుడు, ధూమ్రాక్షుడు, దరిడుడు, సుపార్శ్వుడు, సంహాద్రి- ప్రఘనుడు అను తొమ్మిది మంది కుమారులు. బాల, పుష్పోత్కట, కైకసి, కుంభీనసి యను నలుగురు కూతురులు కలిగిరి.

సుమాలి యొకనాడు పుష్పకమునెక్కి వెళ్ళుచున్న కుబేరుని చూచి తన మనుమడుకూడ నటుల కావలెనని తలచెను.

కుబేరుని తల్లి యిలబిల. ఆమె యలంబుస యను యచ్చర బిడ్డ. ఒకనాడామె వనవిహారమున విశ్రవో బ్రహ్మ యాశ్రమమునకు వచ్చి యలజడి చేసెను. అపుడా మహర్షి కనులు దెరచి చూడగా నతని తేజస్సామె శరీరముపై బడి యామెకు చూలేర్పడెను. అంత

నిల్లుజేరిన కుమారిని గని తలిదండ్రి యావృత్తాంత మెరిగి వచ్చి విశ్రవసుని ప్రార్థించగా నతడామెను భార్యగా నంగీకరిచెను. అపుడు వారికి కలిగిన పుత్రుడే కుబేరుడు.

అతడు పెరిగి పెద్దవాడై బ్రహ్మను గురించి తపము జేసి పుష్పక విమానమును మరియు లంకారాజ్యమును పొందెను. ఈ సంగతి నెరిగిన సుమాలి తనకూతురు కైకసిని విశ్రవో బ్రహ్మ దగ్గరకు గొనివచ్చి యామెను స్వీకరించుమని ప్రార్థించెను. అంత మహర్షి యతని కోరిక నంగీకరించి కైకసితో నీవేమి కోరెదవని యడిగెను. అపుడామె మీ వంటి బ్రహ్మ తేజస్సుగల పుత్రుడు కావలెనని కోరెను.

అదివిని విశ్రవసుడు నీవిపుడుసురసంధ్యావేళ నన్నుమించితివి. కాన నీకు కలిగిన కుమారుడు బ్రహ్మతేజము కలవాడైనను అసురడేయగునని చెప్పెను. ఆ ప్రకారముగా నామెకు మొదట కలిగిన కుమారుడు రావణాసురుడయ్యెను.

కైకసి రెండవ సారి మరలనొక కుమారుని కోరెను. అపుడా మహర్షి నీవు తమోవేళ నన్నుకోరితివి. కనుక ఈ తడవ నీకు కలుగువాడు నిద్రాళువగునని చెప్పెను. ఆ మాట ప్రకారమె రెండవతూరి యామెకు కలిగిన కుంభకర్ణుడు నిద్రాళువయ్యెను.

ఒకసారి తప్పిన మూడుసార్లు – మహాభారత కాలమున ధృతరాష్ట్ర పాండురాజుల విషయమున గూడ నిటులే జరిగెను. సత్యవతి మొదటిసారిగా అంబికను వ్యాసమహర్షితో నియోగమునకు బంపనామె యతని రూపముగని కనులు మూసికొనెను. వ్యాసుడామె కంధుడైన వాడు కలుగునని చెప్పెను. ఆమెరెండవసారి అంబాలికను బంపెను. ఆమె అతని రూపముగని వెలవెల బోయెను. వ్యాసుడామెకు పాండురోగి కలుగునని చెప్పెను. అంత మూడవసారిగా దాసియగు వృషలిని బంప వ్యాసుడామె కుత్తముడు గుణవంతడైన కుమారుడు కలుగునని చెప్పెను.

కైకసి మూడవసారి మరల పుత్రుని గోరెను. విశ్రవసుడాతడవ యిపుడు నీకుత్తముడైన కుమారుడు కలుగును. అతని వలన మీ వంశముయొక్క కీర్తి ప్రతిష్టలు పెరుగునని చెప్పెను.

ఆవిధముగా మూడవసారి విభీషణుని జన్మతో కైకసి యొక్క కోరిక నెరవేరెను.

రావణుడు పెరిగి పెద్దవాడైన పిమ్మట నొకనాడు సుమాలి యతనితో లంకారాజ్యము మొదట తమదేనని దానినిపుడు కుబేరుడనుభవించు చున్నాడని చెప్పెను.

అది విని యతడు కుబేరునిపై ఎత్తిపోయి యోడించి యతని పుష్పకమును మరియు లంకాద్వీపమును వశపరచుకొనెను.

అంతకుబేరుడు వెళ్లి శివుని మరుగు జొచ్చియల కాధిపతిత్వము, నవనిధి పతిత్వము వడసి యక్షులకు ప్రభువయ్యెను.

62.క॥ ఎనలేని కడిమి పెంపున
సని మీఱిన యింద్రజిత్తునతికాయునిన
క్షుని త్రిశిరుఁ గాంచె రావణుఁ
డనయంబును జగము లెల్ల నలజడిఁ జెందన్ - 62

టీక:- ఎనలేని = సాటిలేనటువంటి, కడిమి పెంపున = శౌర్యము యొక్క పెంపున, నని మీరిన= యుద్ధములందు మీరినటువంటి, ఇంద్రజిత్తుŕ, అతికాయుని, అక్షుని, త్రిశురుని, రావణుడు, అనయంబును = ఎల్లపుడును, జగములెల్ల = లోకములన్ని, అలజడి జెందŕ= కల్లోలము పొందగా, కాంచెŕ = పొందెను.

తా:- లంకారాజ్యమును జయించిన పిమ్మట రావణుడొకనాడు వేటలో మయబ్రహ్మ యొక్క ఆశ్రమ ప్రాంతమునకు వచ్చి యతిని కూతురగు మండోదరిని వలచి వివాహమాడి - ఆమెయందు లోకములన్ని కల్లోలమందగా యుద్ధమున నందరిని మించినట్టి యింద్రజిత్తు, అతికాయుడు, అక్షయుడు, త్రిశిరుడు అను నలువురు కుమాఱులను పొందెను.

మండోదరి "హేమ" యను యప్సరస కూతురు. చక్కని సౌందర్యవతి, సౌందర్యమునకు తోడామె పంచకన్యలలో నొకతిగా పరిగణింపబడినది పరమ పతివ్రత.

63.శా. ఇట్టట్టెందును బోవరాక వగతో నెల్లపుడు న్వేలుపుల్
వెట్టిం గొట్టము సేయు, మత్తిలివడి న్విన్నేటి తాల్పున్నయా
గట్టున్ బిట్టు పెకల్చి, రావణుఁడనంగా మీఱి రాకాసి పెం
బట్టం బేలె, నతండు తమ్ముగవ యెప్పట్లం దనుంగొల్వఁగన్ - 63

టీక:- ఇట్టట్టెందును బోవరాక =(ఇట్టు+అట్టు) ఇటునటు ఎందును వెళ్ళరాక, వగతో = దుఃఖముతో, ఎల్లపుడుŕ , వేలుపుల్ = దేవతలు, వెట్టిŕ కొట్టము సేయన్ =

గోష్ఠమున అనగా కొలువు కూటమున వెట్టి చేయుచుండగా, మత్తిలి = గర్వించి, వడిఁ = బలమున, మిన్నేటి తాల్పు = ఆకాశగంగను, ధరించిన శివుడు, ఉన్న, ఆగట్టుఁ = ఆ కొండను, అనగా కైలాసమును, బిట్టు పెకల్చి = ధృఢముగా పెకలించి, రావణుడనంగా మీరి = రావణుడని పేరు పొంది, అతండు = ఆ రావణుడు, రాకాసిపెఁపట్టంబు = రక్కసుల యొక్క గొప్పనైన సింహాసనమును, తమ్ముగవ = తమ్ములసమూహము, ఎప్పట్లఁ = ఎప్పుడును, తనుంగొల్వగఁ = తనను సేవించుచుండగా, ఏలెఁ = పాలించెను.

తా:- దేవతలు ఇటునటు ఎటువెళ్లలేక, అనగా నున్నచోటునుండి కదలక దుఃఖముతో నెల్లపుడును తనకొలువున వెట్టి చేయుచుండగా నారావణుడు, మదించి పరమశివుడు నివసించు కైలాస పర్వతమును తన భుజబలమున గట్టి గా పెకలించి, రావణుడని పేరుపొంది, యతడు రక్కసుల సింహాసనమును ఎల్లపుడు తమ్ములు తనను సేవించుచుండగా పాలించెను.

విశే:- రావణుడు కైలాస పర్వతమును పెకలించి పిమ్మట తన యిరువది చేతులు దానిక్రింద పడి నలిగి గొప్పగా ధ్వని చేసెనట. నాటినుండి యతనికి రావణుడని, అంతవరకు దశగ్రవుడని పేర్లని పురాణ ప్రసిద్ధి. దశగ్రవుడనగా పిట్టగొంతుగల వాడని యర్థము. మరియొక మతమున పుట్టినపుడే పెద్దగా ఏడ్చెనని - అందువలన రావణుడని యొక మతము.

చూ. అసురసంధ్య, కథానిక, భారతి

64.వ-. ఇట్లెందును నెదురు లేక యతండు లెక్కకు మిక్కిలి యగు
రక్కసి మూకల వ్రేకంబులతో జగంబులు వగలం బొగుల
నెట్టికొని కుతిల వెట్టుచు నొక్కనాడు -64

టీక:- ఇట్లెందుఁను = ఈ విధముగా ఎచటగూడను, ఎదురులేక = తనకు ప్రత్యర్థియైన వాడులేక, యతండు = ఆరావణుడు, లెక్కకు మిక్కలియగు = లెక్కింపవీలుగాని, రక్కసి మూకల = రాక్షసుల యొక్క గుంపుల, వ్రేకంబులతో = బరువుతో, జగంబులు = లోకంబులు, వగలంబొగుల = దుఃఖమున బాధ పడుచుండగా, నెట్టికొని = చొచ్చుకొనిపోయి, కుతిలపెట్టుచు = వానిని బాధించుచు, ఒక్కనాడు = ఒక దినమున -

తా:- ఈ విధము నా రావణుడు తనకెక్కడను యెదరులేక, గణింపరాని రక్కసి బలగములతో లోకములన్ని క్షోభపొందు నట్లుగా వానిలోనికి చొచ్చుకొని పోయి బాధించుచు నొకనాడు-

"స్వర్గముపై రావణుని దండయాత్ర"

65.క॥ అలవోకయుఁ బలె, జేజే
నెలవు పయిన్ దాడివెట్టునిగఁ దనబంట్లం
బిలిపించి సొంపు పెంపున
జెలఁగుచుఁ బయనంపుఁదవుకు చేయించుటయున్ - 65

టీక:- అలవోకయు బలె = ప్రొద్దుగడుచుటకైన దాని యట్లు, జేజే నెలవుపయిన్ = దేవతల నివాసమైన స్వర్గముపై, దాడివెట్టునిక = దాడి వెడలుటకై, తన బంట్లన్ = తన యోధులను, పిలిపించి, సొంపుపెంపున = ఠీవితో, చెలగుచు = విజృంభించుచు, పయనంపుదముకు = ప్రయాణ భేరి, చేయించుటయున్ = ధ్వని చేయించగా, అగామ్రోగించగా -

తా:- రావణుడట్లుండి యొకనాడు ప్రొద్దుపోకకై స్వర్గముపై దండెత్తుటకు తనబంటులను పిలిచి ఠీవిచే పొంగుచు ప్రయాణ భేరి వేయించగా - ముందరి పద్యముతో-

66.శా॥ రాలెంజుక్కలు గుబ్బలు ల్వ్రిగిలె సంద్రంబుల్గలంగె న్వడి
న్నేలం గుమ్మరిసారి పోల్కిఁ దిరిగెన్ఁబ్రీలెన్ దెసల్భీతుచేఁ
దూలె న్వేలుపు టెంకి పాప నెలవుం దోడ్తోవెతం బొందెవే
జాలిం జెందిరి బేసికంటి దొరయున్ సైరింప కావెన్నుఁడున్ - 66

టీక:- రాలెన్ జుక్కలు = చుక్కలు రాలెను, గుబ్బలుల్వ్రగిలె = పర్వతములు పగిలెను, సంద్రంబుల్ కలంగెన్ = సముద్రములు కల్లోలమయ్యెను, వడిన్ నేలన్ గుమ్మరి సారె పోల్కి దిరిగెన్ = భూమి వేగముగా కుమ్మరి సారెవలె తిరిగెను. బ్రీలెన్ దేసల్ = దిక్కులు పగిలెను, భీతుచేదూలెన్ వేటపుటెంకి = భయమున స్వర్గమల్లాడెను, పాపనెలవున్ = నాగులకు నివాసమైన పాతాళము, తోడ్తోవెతం బొందె = వెనువెంటనే దుఃఖమును పొందెను, బేసికంటిదొరయున్ = శివుడును, ఆవెన్నుడున్ = ఆ విష్ణువును, సైరింపక = దానిని సహింపలేక, వే=వేగమే, జాలింజెందిరి = జాలిని పొందిరి.

తా:- రావణుడటుల ప్రయాణభేరి వేయించగా నాధ్వనికి చుక్కలు రాలెను, పర్వతములు పగిలెను, సముద్రములు కల్లోలమయ్యెను, నేల కుమ్మరి సారెవలె తిరిగెను, దిక్కులు పగిలెను, భయముతో స్వర్గమల్లాడెను. అవెనువెంటనే పాతాళము గూడ క్షోభపొందెను. దానిని సహించక శివుడును, విష్ణువును జాలిబొందిరి.

విశే:- ఈ పద్యము విరాటపర్వమందలి - కలగెఁ లోయధిసప్తకంబు (ఆ.4-172) అను అర్జునుని శంఖధ్వనికి ప్రతిధ్వని

"అతిశయోక్తి"

67.వ- ఇట్లు తముకు సేయించి కడిమి రక్కసుల పెక్కువల
బెడిదంపు నడకం బుడమి గ్రక్కదలఁ గదలి చని
వెండి కొండ కెలంకుల మొనలు విడియించెనప్పుడు - 67

టీక:- ఇట్లు = ఈవిధముగా!, తముకు సేయించి = భేరివేయించి, కడిమిరక్కసుల =బలమైన రాక్షసులను, పెక్కులఁ =అనేకులచే, బెడిదంపునడకఁ = భయంకరమైన నడకతో, పుడమిగ్రక్కదల = భూమి మిక్కిలిగా కదలిపోగా, (కదలు + కదలు = గ్రక్కదలు ఆమ్రే), కదలిచని = కదలివెళ్ళి, వెండికొండ కెలంకులఁ = కైలాస పర్వత సమీపమున, మొనలు విడియించెఁ = సైన్యమును విడిపించెను, అపుడు = ఆ సమయమున-

తా:- ఈ విధముగా ప్రయాణభేరి వేయించి, బలములగల రక్కసులయొక్క గుంపుల నడకలతో నేల కదలిపోవుచుండగా స్వస్థానము నుండి కదలి వెళ్ళి కైలాస పర్వత సమీపమున దండు విడిపించెను. ఆసమయమున-

"సూర్యాస్తమయ వర్ణనము"

68.తే॥ పరగ మిన్నను కమ్మరి పంజకొలిమి
బెట్టుగాఁ గాల్చి బంగారు చుట్టువాలు
పదను వెట్టఁగఁ గొనిపోయి పట్టలేక
విడిచెననఁ బ్రొద్దు పడమటి కడలి మునిఁగె - 68

టీక:- మిన్నను కమ్మరి = ఆకాశమను మనుబ్రహ్మ, పరగఁ = తగినట్లు, పంజకొలిమి, పంజ = చిన్నయిల్లు, నివాసము, స్థానము, పంజకొరిమిఁ = తనదాతిలోని

కొలిమిలో, బంగారు చుట్టు వాలు = బంగారు చక్రము, బెట్టుగా కాచి = బాగుగా కాచి, పదను పెట్టగ గొనిపోయి, పట్టలేక = పట్టుకొనలేక, విడిచెనన = విడిచిపెట్టెను, అన్నటుల, ప్రొద్దు = సూర్యబింబము, పడమటి కడలిన్ = పశ్చిమ సముద్రమున, మునిగె = మునిగెను.

తా:- ఆకాశమను మనుబ్రహ్మ తన దాతిలోని కొలిమిలో బంగారు చక్రమును బాగుగా కాచి పదును బెట్టుటకు కొని పోయి దానిని పట్టుకొనలేక విడిచిపెట్టినట్లు సూర్యబింబము పశ్చిమ సముద్రమున మునిగెను.

విశే: పదును, ఉక్కు, కంచు అను రెండు లోహములకు మాత్రమే పెట్టుదురు. కంచును పదును పెట్టుటకు కాచి నీటిలో నిండుగా ముంచెదరు. అందువలన వారిలో నిండముంచెడు పదునును కంచుపదునని వాడుదురు. ఇక ఉక్కును కాచిన పిమ్మట ఆముక్కను పట్టుకారుతో పట్టుకొని దానికి తాను కోరిన పదును వచ్చువరకు మాత్రమే నీటిలో ముంచెదరు. కాని పూర్తిగా ముంచరు. ఇందులో కవి బంగారు చక్రమును పదును పెట్టుట చెప్పెను. బంగారుకు వన్నె పెట్టుదురు. గాని పదును పెట్టరు కనక నిది చింత్యము.

69.క॥ కడకడలి వేఁడివెలుఁగను
జడదారి వడి న్మునుంగఁ జనిజేగుఱుంప
చ్చడ మాఱఁగట్టె దరిననఁ
బడమట నెఱసంజ నిండె బలుపుగ మఱియున్ - 69

టీక:- కడకడలిన్ =పశ్చిమ సముద్రమున, వేడివెలుగను జడదారి = సూర్యుడను ముని, వడిన్ = వేగముగ, మునుగంజని = స్నానమాడుటకు వెళ్లి, జేగురు పచ్చడము = కావిశాలువ, ధరిన్ =తీరముపై, ఆరగట్టెనన, పడమట, నెఱసంజ = ఎఱ్ఱని సంధ్యా కాంతి, బలుపుగ = మిక్కిలిగా, నిండెన్ = వ్యాపించెను.

తా:- పడమటి సముద్రమున సూర్యుడను ముని స్నానమాడుటకు వెళ్ళి దాని తీరమున తన కావి వస్త్రమును ఆరగట్టెనన్నట్లుగా, పడమట ఆకాశమున ఎఱ్ఱనైన సంధ్యాకాంతి మిక్కిలిగా నిండెను.

"ఉపమ"

70.సీ॥ పూనిక దగు నీటిఱేని పసిండియు
ప్పరిగె వాకిటి తోఁపుతెరయనంగఁ
గ్రుంకు మెట్టున వేల్పుఁ గొమ్మ లాడుచుఁ జల్లఁ
దులకించు చెంద్రపు దుమ్మనంగఁ
గడు సొంపుచే నొప్పు పడమటి మలమీఁది
చఱులందు గెంపుల చాయ లనగఁ
దమినాడు తెఱగంటి కొమరులు గావింపఁ

తే॥ బ్రొద్దు వాసిన వంత లోఁ బొడము చుండ
ముణుఁగు కెందమ్మి రేకుల మూఁకయనఁగ
విరియు చెందొవ ననలకు వెన్నపెట్టి
నిండె నెఱసంజ కన్నుల పండు వగుచు - 70

టీక: నీటిఱేని = వరుణుని యొక్క, పసిండి యుప్పరిగె = బంగారు మేడయొక్క, వాకిటి = ద్వారమునందు, పూనికన్ = పూన్చినట్లు, తగు = ఒప్పు, తోపు తెరయనంగ = ఎఱ్ఱని తెరయనగా/ గ్రుంకుమెట్టున = అస్తమయ పర్వతమున, వేల్పుకొమ్మలు = దేవతా స్త్రీలు, ఆడుచు, చల్లన్ = చల్లగా, తులగించు = ప్రకాశించు, చంద్రపుదుమ్మనంగ = చెందిరపు చూర్ణమనగ/ కడు = మిక్కిలి, సొంపుచేనొప్పు = అందముతో ఒప్పు, పడమటిమలమీద = పడమటికొండపైన, గల, చరులందు = చరియలందుగల, కెంపులచాయలనగ = ఎఱ్ఱని రత్నముల కాంతులనగ, తమిన్ = ఉత్సాహముతో, తెరగంటి కొమరులు = దేవతా కుమారులు, ఆడు = ఆడుటకై, కావింపన్ = చేయగా, పొలుపొందు = ప్రకాశించుచు నొప్పు, పగడంపు = పగడముల యొక్కపలకయనగ/ ప్రొద్దువాసిన = సూర్యుడు తొలగి పోయిన, యంతలో = సమయమున, పొడము చుండు = కలుగు చుండెడు, ముణుగు = ముడుచుకొను, కెందమ్మి, ఎఱ్ఱని తామరల, రేకులమూకయనగ = పత్రముల సమూహమనగ, విరియు = విచ్చుకొను, చెందోవననలకు = ఎఱ్ఱకలువలకు, వెన్నబెట్టి = వెన్నదినిపించి, అనగా తెల్లదనము కలిగించి, నెఱసంజ = ఎఱ్ఱని సంధ్యా కాంతి, కన్నుల పండువగుచు = నేత్రపర్వమై, నిండెన్ = అంతటవ్యాపించెను.

తా:- వరుణునియొక్క బంగారు మేడయొక్క ద్వారమునకు కట్టిన ఎఱ్ఱని తెరయనగా, అసమయ పర్వత సానువులందాడుచు దేవతాస్త్రీలు చల్లిన చెందిరపు పొడియనగా, పడమటి కొండచరియలలో గల కెంపుల యొక్క కాంతులనగా పడమటి దిక్కున

గల దేవతా కుమారులు ఆడు కొనుటకు చేసిన పగడపు పలక యనగ, సాయంతనమున ముడుచుకొను ఎఱ్ఱతామరల రేకులనగా, విచ్చుకొననున్న కలువలకు వెన్నబెట్టి ఎఱ్ఱని సంధ్యాకాంతి కన్నుల పండువై వ్యాపించెను.

"అలం – ఉత్ప్రేక్ష"

71.వ. అప్పుడు = ఆసమయమున – 71

72.సీ నింగిపేరింటి మున్నీటిలో నప్పుడ
పొడమిన బెడిదంపు బుగ్గ లనఁగ
నాకసంబను మ్రానియందు నొక్కుమ్మడిఁ
బూచిన తెలిచాయ పువ్వులనఁగ
మిన్నను కొలనిలో మెఱుఁగెక్కి విరియుచుఁ
జిగినుల్లసిల్లెడు తొగలనంగఁ
జదలను నల్లపచ్చడముపైఁ బచరింప
దిలకించు నాణిముత్తెము లనంగఁ

తే॥ గదిసి వలరాచ మేపుడుఁ గంటి వేల్పు
జడలలో నుండి వడియుచు గడిత పడిన
తేటవేలుపు టేటి పన్నీటి బొట్లు
ననగ జుక్కలు గనుపట్టె నలరు దెలివి – 72

టీక:– నింగిపేరింటిలో = ఆకాశమను పేరుగల, మున్నీటిలో = సముద్రమున, పొడమిన = పుట్టినటువంటి, బెడిదంపు = భయంకరమైన, బుగ్గలన = బుగ్గలేమో అన్నట్లు, ఆకసంబను = ఆకాశమను, మ్రానియందు = చెట్టునందు, ఒక్కుమ్మడి బూచిన = ఒక్కపెట్టున వికసించిన, తెలిచాయపువ్వులనగ = తెల్లనిరంగుగల పూలేమో అన్నట్లు/ మిన్నను కొలనిలో = ఆకాశమనే సరస్సులో, మెరుగెక్కి = కాంతులు పుంజాకొని, విరియుచు = వికసించుచు, జగిన్ = మెఱుగుతో, ఉల్లసిల్లెడు = ప్రకాశించెడు, తొగలనంగ =కలువపూలన్నట్లు, చదలను నల్లపచ్చడముపై = ఆకాశమను నల్లని దుప్పటిపై, పచరింపన్ = అనగా చల్లగా, తిలకించు = ప్రకాశించు, ఆణిముత్తెము లనంగ = మేలి జాతిముత్తెము లేమో అన్నట్లు, కదిసి =సమీపించి, వల రాచమేపుడుకంటివేల్పు = మన్మదుని మేసిన కన్ను అనగా అగ్ని నేత్రము గల శివుని యొక్క, జడలనుండి వడియుచు = చిన్నచిన్నగా ఒక్కొక్క బొట్టు పడుచు, గడిత పడిన = గట్టిపడిన, తేటవేలుపునీటి = తేటయైన ఆకాశగంగ యొక్క, పన్నీటి

బొట్టులనగ = (పడు+నీరు = పన్నీరు = పూవులపై నుండి జారునీరు) పెద్ద పెద్ద నీటిచుక్కలన్నట్లు, అలరు తెలివిన్ = ప్రకాశించే తెల్లదనముతో, చుక్కలు, కనుపట్టెన్ = కనుపించెను.

తా:- ఆకాశమను పేరుగల సముద్రమున - పుట్టిన పెద్దపెద్ద బుగ్గలేమో, ఆకాశమనే చెట్టు, ఒక్కుమ్మడిగా పూచిన తెల్లని పూలేమో, ఆకాశమను కొలనిలో కాంతులు పుంజుకొని విచ్చిన కలువలేమో, ఆకాశమను నల్లని పచ్చడముపై చల్లిన మేలి ముత్యములేమో, శివుని జడలలో నుండి ఒక్కొక్క చుక్కగా పడియుచు గట్టిపడిన యచ్చమైన ఆకాశగంగా జలముయొక్క బొట్లేమో అన్నట్లుగా నాకాశముపై యపుడు చుక్కలుననుపట్టెను.

"అలం: ఉత్ప్రేక్ష"

చీకటి

73.చ॥ తలఁప ననుంగులైన యల తమ్ముల లోప డాఁగెఁగాక, తా
వెలి కెట కేఁగఁగాగలఁడు వేఁడి వెలుం, గని పేర్చి యార్చుచున్
సిలుఁగులఁ బెట్టఁగా వెదకు చీఁకటి సోఁకుడు పిల్లలో యనం
గొలఁకులఁ ద్రిమ్మరం దొడఁగెఁ గూర్కక మ్రోయుచుఁ గండుఁ దుమ్మెదల్

టీక:- తలపన్ = ఆలోచించగా, వేడివెలుంగు = సూర్యుడు, అనుగులైన = తనకు ప్రియమైన, అల = ఆ యొక్క, తమ్ములలోపల = తామరలలో, డాగెగాక = దాగెనుగాని, తా = తాను, వెలికి = బయటికి, ఎటకు, ఏగగాగలడు, అని, పేర్చి = చెలరేగి, అర్చుచు్ = గొప్పగా రోదలు చేయుచు, సిలుగుల బెట్టగా = బాధలను పెట్టుటకు, వెదకు, చీకటి సోకుడు పిల్లలోయనన్ = చీకటి యను దయ్యపు బిడ్డలేమోఅన్నట్లు, కొలకుల్ = సరస్సులలో, గూర్కక = నిద్రించక, మ్రోయుచు = రోదచేయుచు, గండు తుమ్మెదల్ = గండు తుమ్మెదలు, త్రిమ్మరం దొడగె్ = తిరుగసాగెను.

తా:- ఆలోచింపగా సూర్యుడు తనకు ప్రియమైన ఈ తామరల యందే ఎక్కడనో దాగి యుండును, బయటకెక్కడకువెళ్ళ గలడు, అని విజృంభించి యరచుచు, అతనిని పట్టుకొని బాధించుటకువెదకు చీకటియను దయ్యము యొక్క పిల్లలేమో యన్నట్లు

గండు తుమ్మెదలు, నిద్రింపక, సరస్సులలో పద్మములు చుట్టుతిరుగ సాగెను.

"అలం : ఉత్ప్రేక్ష- శ్లేష"

74.క॥ తమ్ములు మొగిడించినఁదమ
కొమ్ములు లోఁజిక్క నిక్కు కూరిమిఁ జుట్టుం
ద్రిమ్మరు మగ తుమ్మెదలౌ
నెమ్మది వగ గాక యున్నె నెలఁతలఁ బాయన్ !- 74

టీక:- తమ్ములు = తామరలు, మొగిడించిన =ముడుచుకొనునట్లు చేయగా, తమ = తమయొక్క, కొమ్ములు లోజిక్కగ =స్త్రీలు వానిలో చిక్కగా, నిక్కుకూరిమిగ = వానిపై యధిక మగు ప్రేమచే, చుట్టుగ త్రిమ్మరు = తిరుగును, మగతుమ్మెదలు, ఔ =అవును,నెలతల బాయగ = స్త్రీల నెడబాయుగా, నెమ్మదిగ = శాంతమైన మనస్సునందు, వగగారయున్నె = దుఃఖము కలుగకుండునా! కలుగునని భావము -

తా:- తామరలను సాయంకాలము ముకుళింప జేయుగా తమ యొక్క స్త్రీలు వానిలో చిక్కి నందువలన మగతుమ్మెదలు వానిపై గల యధికమైన ప్రేమచే ఆమొగిడిన తామరల చుట్టు తిరుగసాగెను. తమ స్త్రీల నెడబాసి నపుడు ఎవరికైనను దుఃఖము కలుగ కుండునా!

విశే:- సూర్యుడస్తమించగనే పద్మములు ముకుళించును. అపుడంతవరకందులో మకరందమునకై వ్రాలిన తుమ్మెదలు లోపలచిక్కిపోచుండును. ఆ సమయమున ప్రియురాలు చిక్కినపుడు ప్రియుడైన తుమ్మెద, ప్రియుడు చిక్కినపుడు ప్రియురాలైన తుమ్మెద ఆ పద్మములచుట్టు తిరుగుచుండుట సహజము.

ముక్కుతిమ్మన పారిజాతాపహరణమున నిదే ఘట్టమున నొకమొగ తుమ్మెద ననుమానముగల నాయకుని జేయుగా తెలగన్న దీనిలో నా తుమ్మెదల ననుకూల నాయకులనుగా దీర్చెను. చూ-పారి. ఒక భృంగంబు పరారినీ మదనతంత్రోన్మాది ప్రాణేశ్వరిగ - ఆ.

"అలం - అర్థాంతరన్యాసము"

75.క॥ ఇరులు బలియుచును వలకుల్
కరమరుదై కరుడుకట్టి కదిసిన కరణిం
బరఁగఁగఁ దోఁచుడుఁ గాటుక
కరవటముంబోలె నిజ్జగంము దనర్చెన్ - 75

టీక:- ఇరులు = చీకటులు, బలియుచు = ముదురుచు, వలకుల్ = దిక్కులు, కరమరుదై = మిక్కిలి యరుదయి, కరడుగట్టి = గట్టిపడి, కదిసిన కరణిౕ= దగ్గరగా నైనట్లు, పరగం దోచుడు = ఒప్పి కనిపించగా, కాటుక, కరవటముంబోలె = బరణివలె, ఇజ్జగంబు (ఈ + జగము) తనర్చెౕ = ఒప్పెను.

తా:- చీకటి బాగుగా ముదిరి దిక్కులు తెలియరాక. చూచువారరుదనునట్లుగా అదిగట్టిపడి దగ్గరగా యైనట్లనిపించగా అపుడీ జగమంతయు నొక కాటిక కాయువలె నొప్పెను.

"అలం : ఉపమ"

విశే:- కాటుకకాయలు పూర్వము తెలంగాణమున గోళాకారముగా చేయబడుచుండెడివి. కావుననిది వస్తుతత్వమెరిగిన యుపమ -

76.తే॥ పూని పదిరెండు ప్రొద్దులుఁ బొడిచెనేని
యిందులోఁ గానవచ్చునే యించుకైన
ననగ గలిగిన వన్నియు లలమి తనదు
రూపుగా మీఱి చీఁకటి యేపు చూపె - 76

టీక:- పూని = ప్రయత్నించి, పదిరెండు పొద్దులు = పన్నెండు సూర్యబింబములు, పొడిచెనేని = ఉదయించెనప్పటికి, ఇందులో, ఇంచకైన = కొలదిగా నైన, కానవచ్చునె = కనిపించునా! అనగ, కలిగిన వన్నియు, లోకమున నున్నవన్నిట, అలమి = వ్యాపించి, తనదు రూపుగా మారి = వానిని తనరూపముగా చేసికొని, విజృంభించి, చీకటి, ఏపుచూపె = తనయొక్క ఆధిక్యమును ప్రదర్శించెను.

తా:- ఇప్పుడు ప్రయత్నించి పన్నెండు సూర్యబింబములుదయించినను యిందులో కొలదిగానైనను కనిపించునా యనునట్లుగా లోకమున నున్న వాని నన్నిటిని తన రూపముగా చేసికొని అంతటా వ్యాపించి చీకటి తనయొక్క విజృంభణత్వమును చూపెను.

"అలం : అతిశయోక్తి"

విశే:- సూర్యునకు ద్వాదశాత్ముడని పేరు. సూరసూర్యార్య మాదిత్య ద్వాదశాత్మ దివాకరః అని యమరము.

ద్వాదశాత్మ డనగా పన్నెండు రూపములుగల వాడని యర్థము. అతడొక్కొక్క నెలలో నొక రూపముతో నుండునని పురాణవచనము. అతనివెంట నెల్లప్పుడారుగురు బలగముందురు. వారిలో నొక యప్సరసగూడ నుండును. ప్రతి మాసమున సూర్యునితో పాటు బలగముగూడ మారుచుండును.

"అలం : ఉత్ప్రేక్ష"

"మిణుంగురు పురువులు"

77.తే తనకుఁ బగయగు ప్రొద్దును వెదకి కనక
కనలు చీఁకటి రక్కసి కన్నులందుఁ
దొరుఁగు కనకన మను నిప్పుఁ దునుకలనఁగఁ
బొలిచె నెడనెడ మిణుఁగుఱుఁ బుర్వులంత - 77

టీక:- తనకు, పగయుగు = విరోధియగు, ప్రొద్దును = సూర్యుని, వెదికి, కనక = చూడలేక, కనలు చీకటి = కోపించిన చీకటియను, రక్కసికన్నులందు = రాకాసికనులలో నుండి, దొరుగు = దొరలు చున్న, కణకణమను, నిప్పుదునుకలనగ, అంతఁ = అపుడు, ఎడనెడఁ = అక్కడక్కడ, మిణుగురు బుర్వులు = ఖద్యోతములు, పొలిచెఁ = ప్రకాశించెను.

తా:- తనకు విరోధియైన సూర్యుని వెదకి యెచటను గానక కోపించిన చీకటి యను రక్కసియొక్క కన్నులనుండి దొర్లుచున్న కణకణమను నిప్పు తునుకలేమో యన్నట్లు అపుడు అక్కడక్కడ మిణుగురు పురుగులు కనిపించెను.

"అలం : ఉత్ప్రేక్ష"

విశే:- కోపించినపుడు కన్నులనుండి నిప్పులు కురియు చున్నట్లు చెప్పుట లోకసంప్రదాయము కనుక మిణుగురులనిచట కవి చీకటి రక్కసి కనుల నుండి కురియు నిప్పు తునకలని చెప్పుట యద్భుతమైన యూహ.

కోపించినపుడు శివుని కంటి నుండి నిప్పులు కురిసి మన్మధుడు

బూడిదయయ్యెను. కపిల మహర్షి కన్నుల నుండి నిప్పులు కురిసి సగరులు నీరైరి. కౌశికుని కంటిమంటకు కొంగ క్రిందబడి చచ్చెను- ఇది పురాణ నిదర్శనములు.

"అలం: ఉత్ప్రేక్ష"

-: వెన్నెల :-

78.క॥ వెలిచాయ దోఁచెఁ దూరపు
వలనం దగఁ దమ్మివిరుల వాతుల మూయన్
నెలచూలన వెలవెల నగు
తొలుకడ యను నెలఁత మొగము తోరపు జిగిగాన్ - 78

టీక:- నెలచూలన = చంద్రుని ఉదరమున భరించిన చూలాలనగా, వెలవెలనగు = పాండిమను బారు, తొలుకడయును = తూర్పు దిక్కును, నెలత మొగము = స్త్రీయొక్క ముఖము, తోరపు జిగిగాన్ = బాగుగా మెరుగెక్కగా, తగన్ = అప్పటి కొప్పినట్లు, తమ్మివిరులు = తామరపూలు, వాతులు మూయన్ = వాయి = నోరు, (వాతి ఔపవిభకము) వాతులు మూయన్ = వదనములు ముకుళించగా, తూరుపువలనన్ = తూరుపు దిక్కున, వెలిచాయ దోచెన్ = తెల్లని కాంతి కనుపట్టెను.

తా:- చంద్రుని కడుపులో ధరించిన చూలాలనగా తెలుపు వారిన తూరుపు దిక్కు అను యువతి మొగము బైకాలు విడిచిన పిదప మరల మెరుగెక్కినట్లు తూరుపు దిక్కున తెల్లని కాంతి కనిపించెను. అప్పటికి తగినట్లు తామరలు ముడిగెను.

"అలం: శ్లేష- రూపకము"

79.క॥ కర మలరెఁ దూర్పుమలఁ జం
దురుఁ డాదట నిర్లసోఁకు దునుయుటకైవే
గిర మాక సంపుఁ గటిదే
వర పంపిన కెంపుఁ జుట్టు వాలుం బోలెన్ - 79

టీక:- తూర్పుమల, ఆకసంపు = ఆకాశమను, కటిదేవర = నల్లని వేలుపు, అనగా వెన్నుడు, అదటన్ = తన ధర్మము నెరిగి, ఇర్లసోకు = చీకటియను రక్కసిని, తునుముటకై = వధించుటకు, వేగిరమ = తొందరగా, పంపిన, కెంపు = ఎర్రనైన, చుట్టువాలున్

బోలెఁ = చక్రమువలె, చందురుడు, ఒప్పగా, తూర్పుమల = తూరుపు కొండ, కరము = మిక్కలిగా, అలరెఁ ప్రకాశించెను, సంతోషించెను.

తా:- అపుడాకాశమును విష్ణువు తన ధర్మము నెరిగి చీకటియను రక్కసిని సంహరించటకై పంపిన చక్రమనునట్లు చంద్ర బింబము ఎర్రగా నొప్పగా తూర్పుకొండ మిక్కిలి ప్రకాశించెను.

చంద్రబింబ ముదయించినపుడెఱుపుగా నుండుననుటకు -

స్ఫుట సౌగంధిక రాగ రక్తరుచిమై బూనెఁ జపాసన్నిది

స్ఫటికంబట్లు దయాద్రి గైరిక శిరస్థానద్యుతిఁ - మను - ఆ

"అలం: ఉపమ"

"చంద్రుడు"

80.తే వీణె యుక్కున హత్తించి విన్నునాఁగ
వఱలు వెన్నుని గొలువంగ వచ్చు చివ్వ
కూటితబిసియు బలెఁ గందు గొనబుమీఱఁ
జందురుం డల్లనల్లనఁ జదలఁ బ్రాకె - 80

టీక:- వీణె యుక్కున హత్తించి = వీణను ఎదపై జేర్చి, ఎన్నుకాగ = ఆకాశమున, వఱలు = ఒప్పునట్టి, వెన్నుని = విష్ణుని, గొలువంగఁ = సేవించుటకు, వచ్చు = వుచ్చునట్టి, చివ్వ కూటిత బిసియు బలె= చివ్వ = కలహము, జగడమే ఆహారముగా గల నారదుని వలె, కందు = ఎదపైగల మచ్చ, గొనబు మీరఁ = అందముతో నతిశయించగా, చందురుడు = చంద్రుడు, అల్లనల్లన = మెల్లమెల్లగా, చదలుప్రాకె = ఆకాశమున కెక్కెను.

తా:- ఎదపై మచ్చగల చంద్రుడు, వీణను ఎదపై నుంచుకున్న నారదునివలె ఆకాశమను విష్ణుని సేవించుటకు వచ్చుచున్నట్లు ఆకాశమున కెక్కెను.

విశే:- నారదుడు దేవర్షులలో తెల్లని వాడు కనుక చంద్రుని నారదు డనుట తగిన పోలిక

"అలం: ఉపమ"

81.క॥ ఆతఱి వెన్నెల దగుమ
జ్జా! తాబిల్లి వెజ్జు జనమునకెల్లన్
రాతిరి సోఁకిన చీఁకటి
బూతయు విడువంగ జల్లు బూతియు

టీక : ఆతఱిన్ = ఆసమయమున, మజ్జా ! అయ్యారే, జాబిల్లి వెజ్జు = చంద్రుడను వైద్యుడు, తా = తాను, జగమునకెల్లన్ = ప్రపంచమున కంతటికి, రాతిరి సోకిన = ఆ రాత్రి తగిలినట్టి, చీకట భూతము = చీకటియను దయ్యము, విడువంగ = విడుచుటకై, చల్లు =చల్లునట్టి, బూదియనంగన్ = విభూతి యనగా, వెన్నెలడగన్ = వెన్నలయొప్పెను.

తా:- అపుడు ఆ వెన్నెల చంద్రుడను వైద్యుడు, రాత్రిసోకినట్టి చీకటియను భూతమును విడిపించుటకు జల్లిన విభూతి వలె యొప్పెను.

"అలం : ఉత్ప్రేక్ష"

శ్లో : వైష్ణవాశ్చ పిశాచాశ్చ - మశకాశ్చ పిపీలికాః
భస్మదర్శన మాత్రేణ - పలాయంతేనసంసయః చాటువు.

82.సీ॥ వేల్పురాయఁడు దన వెలిమావుఁదెలిగౌరు
నీగిమాఁకులఁ గాన కెదఁగలంగఁ
గఱిమేని దొర పాలకడలిఁ జిల్వలఱేనిఁ
దెలిదీవిఁ గనలేక తిరుగుచుండ
ముక్కంటి వలిగట్టు నిక్కమెట్టును నాల
పోతుఁగానక చాల బీతుకుడువ
నలుమొగంబుల మేటి పలుకుఁ దొయ్యలి నంచ
వెలిమేని కొడుకును వెదకఁ బోవ
తే॥ వన్నిరంగులు తనరంగు లై తలిర్ప
నిగిడి తెలిచాయ వెల్లియై నిండెననగఁ
నిక్కి జగముల నెల్లను బిక్కటిల్లి
నిలిచి పొంగుచుఁ బండువెన్నెల దనర్చె -82

టీక:- వేల్పురాయడు = ఇంద్రుడు, తన = తనయొక్క, వెలిమావు = తెల్లని యావు, అనగా కామధేనువు, తెలిగౌరు = తెల్లని ఏనుగు, అనగా నైరావతము, ఈగిమ్రాకులు

= కోరికలనిచ్చు చెట్లు, అనగా కల్పవృక్షములు, కానకన్ = చూడలేక, ఎదగలంగ = మనస్సులో కళవళ పడగా/ కరిమేనిదొర = నల్లని దేహముగలవాడు, అనగా వెన్నుడు, పాలకడలిన్ = క్షీరసముద్రమును, చిల్వల తేనిన్ = ఆదిశేషుని, తెలిదీవిన్ = శ్వేతదీపమును, కనలేకన్ =చూడలేక, తిరుగుచుండ, ముక్కంటి = మూడు కన్నులు గలవాడైన శివుడు, వలిగట్టును = హిమాలయమును, ఇక్కమెట్టును = నివాసమైన పర్వతము అనగా కైలాసమును, ఆలపోతును = బసవని, గానకన్ = చూడలేక, బీతుగుడువ = భయపడగా/ నలుమొగంబుల మేటి = బ్రహ్మ, పలుకు తొయ్యలిని = సరస్వతిని, అంచన్ = హంసను, వెలిమేని కొడుకును = తెల్లని శరీరముగల కుమారుని, అనగా నారదుని, వెదకబోవ = వెదకుటకు వెళ్ళగా/ అన్ని రంగులు = అన్నివన్నెలు, తనరంగులై = తనవలె తెల్లనై, తలిర్పన్ = ఒప్పగా, నిగిడి = నిక్కి, చాయ = చంద్రునియొక్క కాంతి, వెల్లియై = నదియై, నిండెననగా = ప్రపంచమంత నిండెను అనునట్లు, నిక్కి = బాగుగా నెదిగి, జగముల నెల్లను = అన్ని లోకములను, పిక్కటిల్లి = దట్టముగా నలిమి, నిలిచి = తొలగక స్థిరమైన, పొంగుచు = ఇంకను విజృంభించుచు, పండువెన్నెల = పరిపూర్ణమైన వెన్నెల, తనర్చెన్ = ఒప్పెను.

తా :-ఇంద్రుడు తనయొక్క కామధేనువును, ఐరావతమును, కల్పవృక్షములను కనలేక కళవళ పడగా, విష్ణువు క్షీరసముద్రమును, ఆదిశేషుని శ్వేత ద్వీపమును చూడలేక తిరుగుచుండ, శివుడు హిమాలయమును కైలాసమును నందీశ్వరుని కానక దిగులు పడుచుండ, బ్రహ్మసరస్వతిని, హంసను నారదుని వెదకుచుండ వెన్నెల ఈ విధము అన్ని రంగులను తరంగులుగా చేసి తనలో లీనము చేసికొని చంద్రుని యొక్క కాంతి ప్రవాహమై పొంగి ప్రపంచ మంతటా దట్టముగా నిండెనేమో యన్నట్లు పండు వెన్నెల యంతట విజృంభించెను.

" అలం : భ్రాంతి/ అతిశయోక్తి"

శిఖరిణి -

మహారాజశ్రీ మన్ జగతి యశసాతేధవళితే
పయః పారావారం పరమ పురుషోయం మృగయతే
కపర్దీ కైలాసం కరివరమ భౌమం కులిశ భృత్
కళానాధం రాహుః కమల భవనోహం సమధునా

భోజచంపువు -

పై పద్యము భోజ చంపువులోని ఈ శ్లోకమున కనువాదము. కాళిదాసుదీనిని భోజుని కీర్తిపరముగా చెప్పగా తెలగన్న వెన్నెలపరముగా మార్చెను. ఇట్టి మార్పును దేహాంతర తుల్య సంవాదమందురు.

ఈ శ్లోకమున విష్ణువు, శివుడు, ఇంద్రుడు, రాహువు, బ్రహ్మ అను నైదుగురుండగా తెలగన్న తమోగ్రహమైన రాహువును విడిచి సీసపాదముల కవసరమైన నలుగురిని మాత్రమే గ్రంహించి తనదైన యౌచిత్యముద్రను ప్రకటించెను.

"అలం : భ్రాంతి – అతిశయోక్తి"

83.వ- అప్పుడు = ఆ వెన్నెల సమయమున

"చకోర క్రీడ"

84.సీ॥ అనుకు వెన్నెలఁ దాల్చి తునిచి సేవెలు చేసి
వెన్నెల పాలను జున్నొనర్చి
గట్టి వెన్నెల పిండిగొట్టి వెన్నెల వెన్న
గలయు వెన్నప్పాలుగా నమర్చి
గడితంపు వెన్నెల గండ్రికల్ సిగలిగాఁ
దియ్య వెన్నెలలోనఁ దెచ్చి పెట్టి
యొడల వెన్నెల చక్కెరిడి జోర్కు వెన్నెలఁ
బూనిక నాలీలు గాను గూర్చి
తే॥ పండువెన్నెల యను వెండి పళ్లెరముల
జెలఁగి యిల్లాండ్రు వడ్డింపఁ జెలులుఁదాము
వేడుకలు మీఱ బువ్వంపు గూఁడుఁ గుడిచి
పాదలు తయితోడ వెన్నెల పులుఁగు లమరె – 84

టీక:- అనుకు వెన్నెల దాల్చి= అనుకు = మెత్తనిఁ దీనిని జానపదులు అసుకు అని వాడుదురు, పిండి మొదలైనవి చేతితో బాగా పిసికినపుడు దానితో ఒక జిగట గుణమేర్పడును – కనుక అటువంటి అసుకుగల వెన్నెలను తీసుకొనివచ్చి, తాల్చి = తెలంగాణమున పూర్వము సేవెలకు గోధుమ పిండిని ఉల్లిగా చేసి క్రొత్త కుండను బోర్లించి దానికి వెన్నను రాచి ఉల్లెను దానిపైని ఉంచి సేవలుగా తాల్చుచుండిరి. కనుక అటుల తాల్చి, తునిచి, సేవెలు చేసి = సేవంగులు చేసి, వానిని త్రుంచి,

వెన్నెల పాలను = వెన్నెలయొక్క పాలను, జున్నొనర్చి = జున్ను చేసి, గట్టివెన్నెలన్ = పిండిగొట్టి, వెన్నెలవెన్న, కలయన్ = కలిపి, వెన్నప్పాలుగా, నమర్చి = చేసి, గడితంపు వెన్నెల = గడ్డబారిన వెన్నెల, కండ్రికల్ = గంటుకలు, సిగరిగా తియ్యవెన్నెలలోన = సిగరి = చిక్కగా కాచిన సాంబరువంటి పులుసు, సిగరిగా కాచిన తియ్యని వెన్నెలలో, పైగడ్డ బారిన వెన్నెల గంటుకలు, తెచ్చిపెట్టి, ఎడల వెన్నెల = పాడిపాడియైన వెన్నెల, చక్కెరిడి = పంచదార చేర్చి, జోర్కు వెన్నెల = జోరుగా అనగా పలుగగా నుండు వెన్నెలలో, పూనికన్ = ప్రయత్నించి, నాళీలు గాను గూర్చి = నాళీలను వంటలు చేసి- (ఇవి బోలు జంతికల వలె) పండువెన్నెలయును, వెండి పళ్లెరముల్ = వెండికంచములందు, చెలగి = సంతోషమున చెలంగించి, ఇల్లాండ్రు = భార్యలు, వడ్డింపన్ = వడ్డించుచుండగా, చెలులున్ = స్నేహితులు, తాము = అనగా ఇంటివారు, వేడుకలు మీర = సంతోషములు పిచ్చరిల్లు చుండగా, బువ్వంపు కూడు = బువ్వపు బంతి తిండి, కుడిచి = తిని, వెన్నెల పులుగులు = చకోరములు, పొదలు తమితోడ = అతిశయించు చున్న తృప్తితోడ, అమరెన్ = ఒప్పెను.

తా:- ఆ వెన్నెలలో చకోర పక్షులు అనుకుగల వెన్నెలను తీసికొని దానితో సేవెలు చేసి, వెన్నెల పాలను జున్నుగా కాచి గట్టి వెన్నెలను పిండిగొట్టి వెన్నెలయనే వెన్నను, పూసి వెన్నప్పాలు చేసి, గడ్డ పెరుగు వలె గడ్డబారిన వెన్నెలను గంటుకలుగా చేసి వానిని సిగరిగా గాచిన వెన్నెలలో వేసి, పాడిపాడి వెన్నెలలో పంచదారము చేర్చి జోరు వెన్నెలలో నాళికలు చేసి ఆవంటకములను వెన్నెలయను వెండి పళ్లెరములలో తమతమ భార్యలు వడ్డింపగా చకోరపు గేస్తులు తమతమ సుఖులతో బంతి భోజనములు చేసి నిండినటువంటి తప్తితో నుండిరి.

1. వెన్నెలను పిండి యారజోసి నట్లనియుపమింతురు గనుక

కవిగారీ పద్యమున స్త్రీలు గోధుమ పిండి మరియు వరి పిండితో చేయు పిండి వంటలను చెప్పెను. ఇటుల చెప్పుట కతనికి పాకశాస్త్ర మర్యాదలు గూడ తెలిసియుండవలెను. అందులకే భరతముని -

శ్లో ॥ నతచ్ఛాస్త్రం నతచ్ఛిల్పం నసావిద్యానసాకళా
జాయుతేయన్న కావ్యాంగం మహోభారోమహాకవేః

అని చెప్పెను.

విశే:- అనుకు అనగా మృదువు అని నిఘంటువు. కాని అప్పలకుగాని, సేవెలకుగాని పిండి మెత్తగా ఉండగనే చాలదు. దానిలో అసుకు అనగా ఒక విధమైన జిగటదనముండవలె. లేని యెడల అది ఎరువెరువుగా విచ్చుకొని పోవును. ఈ జిగట దనము దానిని బాగుగా పిసుకుట వలన వచ్చును.

చకోరములకు వెన్నెల పురుగులని పేరు. వానలు కురిసే దినములు చాతక పక్షులకు ఆనందమైనట్లు వెన్నెల రాత్రులు చకోరములకు ఆనందము కలిగించును. ఆవెన్నెలలో నవి మెడలుపైకెత్తి కూయుచు మనము పండుగ నాడు సేవెలు వార్చుకొన్నట్లు పాలతో జున్ను కాచుకొన్నట్లు, వెన్నప్పాలు చేసి కున్నట్లు, సిగరి కాచుకున్నట్లు నాళికలు చేసికున్నట్లు సంతసించును. కనుక నా విషయమే యిందు భావనా మయముగా చెప్పబడినది. చకోర పక్షుల యొక్క ఈ వెన్నెల విందులు ప్రబంధ కవులు పలువురు చెప్పిరి.

చూ. వెన్నెల విందులు -

1. సీ॥ విరహులమై సోకివేడి యావెన్నెల - పారి - ఆ - ముక్కుతిమ్మన
2. సీ॥ మొలుకవెన్నెలచాలు గలిపి రాధా - ఆ- చింతలపూడి ఎల్లన
3. సీ॥ ముదురు వెన్నెల మోసునమిలి- కుమారసైష- ఆ- ఎడపాటి ఎఱ్ఱన
4. సీ॥ బ్రాతియేయిక గల్గి లేత వెన్నెల నిగ్గు - ప్రద్యు - ఆ- పొన్నాడపెద్దిరాజు.

85.వ- అప్పుడు = ఆ సమయమున

86.క॥ బలునెన రైనవి గూర్పఁగఁ
బాలివోవని లేఁత పాయపుం బొగరులతోఁయు
దలిమము లెక్కెడి వెన్నల
పులుఁగులఁ గని తనదు మదిని బొదలు విరాలిన్ - 86

టీక: బలు = మిక్కిలి, నెనరైనవి = ప్రియమైనవి, గూర్పగ = చేకూర్చు, పాలివోవని = బోణిగాని, లేత ప్రాయపు = తొలియవ్వనము యొక్క, పొగరులతో = గర్వములతో, తలిమము లెక్కెడి = మంచములెక్కెడి, అనగా కాముకేళికి సిద్ధపడెడి, వెన్నెల పులుగులన్ గని = చకోరములను చూచి, తనదు మదిని = తన మనస్సునందు, పొదలు విరాళిన్ = పెరిగిన మోహముతో -

తా:- అపుడాచకోరపక్షులు ఆ వెన్నెలలో తమకు యిష్టమైన విందారగించుకొని పాలిపోని కోడెకారు యువ్వనపు బింకముతో కాముకేళికి సిద్ధపడు ఆ చకోరములను చూచి రావణుడు తనలో తలెత్తిన మోహమున

87.వ- వలరాజు తూపులకు నులికి వేలంబు వెలికింజని
రావణుండు గ్రుమ్మరు నట్టియెడ - 86

టీక:- వలరాజు = మన్మథునియొక్క, తూపులకు = బాణములకు, ఉలికి = భయపడి, వేలంబు = సైనికుల గుడారము, వెలికింజని = బయటకివెళ్ళి, రావణుండు, గ్రుమ్మరునట్టియెడ = తిరుగుచున్న సమయంబున -

తా:- అపుడు రావణుడు మన్మథుని యొక్క బాణములకు ఉలుకుచు, అనగా కామోద్దీపనము గలవాడై, సైన్యావాసము వెలుపలికి వచ్చి తిరుగుచుండగా -

-: రావణుండు రంభను గాంచుట: -

88.సీ॥ కస్తూరి మొదలుగాఁ గలపంబు చేసిన
గందంబు నునుపూఁత గాఁగబూని
వెన్నెల పొరవంటి వెలిపట్టు వలిపంబు
జిలుగుఁగుఁ బావడ మీఁద నలవరించి
వేలుడుగాఁ దీర్చి కీలుగంటునఁ గ్రొత్త
చనుప కంబుల పరుల్ పెనచి చుట్టి
పసిమి నుప్పొంగు మట్టసపు సొమ్ములతోడ
నాణిముత్తెపుఁ బేరు లనువుపఱిచి
తే॥ యందియుల మ్రోఁత చెవులకు విందుసేయఁ
జదల నెకసెక్కె మాడెడు సన్నగాను
బిగువుఁ జన్నుల వ్రేఁగున బెగడు గుడువ
మరుఁడు దోడుగఁ జనుదెంచు మగువ గాంచి - 88

టీక:- కస్తూరి మొదలుగా = కస్తూరి మొదలైన పరిమళ ద్రవ్యములతో, కలపంబు చేసిన = పలుచగా కలిపిన, గందంబు = గందము, నునుపూతగాగ = నున్నైన పూతగా, బూని = పూసుకొని, వెన్నెలపొరవంటి, వెలిపట్టు = తెల్లని పట్టు, వలిపెంబు = వస్త్రము, జిలుగు పావడమీద = సన్నని లంగాపై, అలవరించి = ధరించి,

వేలుడుగాదీర్చి = వ్రేలాడునట్లుగా అదురుకొనిన, కీలుగంటున = జారుముడితో, సీ. జడకీలుగంటు క్రొమ్ముడినూనెముడియన, దనరారుకేశబంధమ్ము సిగయు - వెం-ఆం వూ. 39. కొత్త చనుపకంబుల సరుల్ = కొత్త అనగా అపుడే విచ్చిన, చనుపకంబుల సరుల్ = సంపెంగ దండలు, పెనచి చుట్టి = అల్లి దూముడికి చుట్టుకొని, పసిమి నుప్పొంగు = బంగారపు కాంతులు ఎత్తికనిపించు, మట్టసపు సొమ్ముల తోడ = మట్టసము, పొట్టెయని నైఘంటికము, ఉచితమైన పొందికయని లౌకికము, మట్టసపు సొమ్ములతోడ = పొందికగల భూషణములతో, ఆణిముత్తెపు పేరులు = మంచి ముత్తెముల దండలు, అనువు పరిచి = తగినట్లుగా కూర్చుకొని అసగా ధరించి, అందియల మ్రోత = హంసకముల ధ్వని, చెవులకు విందుసేయ = కర్ణ పర్వముచేయుచుండగా, చదలుః = ఆకాశమును, ఎకసక్కెమాడెడు = పరిహాసము సేయు, సన్నగౌను = సన్నని నడుము, బగువు = బిగువైన, చన్నుల వ్రేగున = రొమ్ముల బరువుతో, బెగడుగుడువ = భయపడుచుండగా, అనగా వణకుచుండగా, మరుడు తోడగః = మన్మథు డొక్కడే తనకు సహాయముగా, చనుదెంచు = వచ్చుచున్న, మగువ గాంచి = యువతిని చూసి

తా :- కస్తూరి మొదలైన పరిమళ ద్రవ్యములు గంధముతో పలుచగా కలిపి మనువుగా అలదుకొని వెన్నెల పొరవంటి తెల్లని చీర సన్నని పావడపై కట్టుకొని చక్కగా క్రింది వరకు వేలునట్లు వెంట్రుకలు జారు ముడివేసి అప్పుడే విచ్చిన చంపకములు దండలల్లి సిగకు చుట్టుకుని బంగారు కాంతులెత్తి కనిపించు మట్టసమైన సొమ్ములకు తగినట్లు ముత్యాల దండలు గూడ ధరించి కాళ్ళకు ధరించిన యందెలు చెవుల పండువుగా ధ్వని చేయుచుండగా, ఆకాశమును పరిహసించు సన్నని నడుము బిగువైన చన్నుల బరువున వణకుచుండగా మన్మథుడే తనకు తోడుగా వచ్చుచున్న యారంభను చూసి -

"అలం : స్వభావోక్తి"

89.తే॥ వడివడిం జని యూతc డోవాలుcగంటి
నీదు పేరేమి? యెవ్వడు నీదుమగడు ?
పూని కాందారి మాందారి ప్రొద్దుకడను
నెందుc బోయెదు? తలితండ్రులెవ్వ? రనిన - 89

టీక:- అతడు, వడివడింజని = తొందర తొందరగా వెళ్ళి, ఓవాలుగంటి = ఓ! వాలుకన్నులదానా ! అనగా దీర్ఘమైన కన్నుల దానా! అనియునియు వాలునకు, విజృంభించు, అతిశయించు, ప్రసిద్ధిచెందు, ఆసక్తి మగు, ప్రకాశించు, కత్తి, తీక్ష్ణము, దీర్ఘము, అధికము, క్రూరము, మనోజ్ఞము, మృదువు అని సుమారుగా పన్నెండర్థములు కలవు, కనుక సందర్భము ననుసరించి స్త్రీలయొక్క కన్నులకు చూపులకు నిన్నిటిని గూడ సమన్వయము చేసి చెప్ప వచ్చును. నీదు పేరేమి ? ఎవ్వడు నీదు మగడు = నీమగడెవ్వడు, కాందారి మాందారి ప్రొద్దు కడను = సీ...... నడిరాతిరియన, నడిరేయియనగ కాందారి మాందారి ప్రొద్దున, సరిప్రొద్దున - నర్ధమరేయి, గీయన నిశీథాఖ్యలగు - ఆం-బా-1-94 అర్ధరాత్రి సమయమున, పూని = ఈ వేషమును ధరించి, ఎందు బోయెదు, తలిదండ్రులెవరినిన = తల్లిదండ్రులు ఎవరు అనగా -

తా:- అతడు తొందర తొందరగా నామెసమీపమునకు, వెళ్లి ఓ వాలుగంటీ! నీపేరేమి, నీదుమగడెవరు, తలిదండ్రులెవరు, ఈ అర్ధరాత్రి సమయమున నీవేషముతో నీవెక్కడి కరుగుచున్నావనగా -

విశే:- కాదిదారి మందారి పొద్దు= కాని దారిని మానిన దారిని, తిరిగెడివేళ అనగా విధి నిషిద్ధమైన పనులు దుష్టులెవరికంట బడకుండ అర్ధరాత్రివేళలో చేయుచుందురు కనుక కాదారి యాందారి ప్రొద్దనగా అర్ధరాత్రి యని రూఢియైనది.

90. ఉ॥రక్కసిరాయ! యేవినుము రంభను, మిక్కిలి నన్నుకత్తెనై
జక్కులతేని పట్టికిని జవ్వన మంతయు జన్నె గట్టిరే
యొక్కతె నుండ లేకతని యొద్దికిఁ బోవుచున్నదాన, నే
నక్కడలిం దగం గలుగు టందఱు విన్నదె చెప్పనేటికిన్ - **90**

టీక:- రక్కసిరాయ = ఓదానవరాజా! వినుము, ఏఁ= నేను, రంభను, జక్కుల తేనిపట్టికిని = కుబేరునికుమారుడైన నలకూబరునికి, మిక్కిలి నన్నుకత్తెనై = మిక్కిలి యనురాగము గలదాననై, జవ్వన మంతయు = నాయవ్వనమంతయును, జన్నెగట్టి = నేను అతని కొరకై నాయవ్వన మంతయు మీాదుగట్టి, రేయి = ఈ రాత్రి, ఒక్కతెనుండలేక, అతనియొద్దికి పోవుచున్న దాన, నేను, అక్కడలిఁ/అక్కరణిఁ = ఆ విధముగా, తగన్గల్గుట =ఒప్పియుండుట, అందరు విన్నదె = అందరికి దెలిసినదే, ఏమిచెప్పుదుఁ = దాని నింక చర్విత చర్వణముగా నేమని చెప్పుదును.

తా:- ఓ దానవరాజా! రంభను యక్షులకు ప్రభువైన కుబేరుని యొక్క కొడుకగు నలకూబరునకు ప్రియురాలనై నాయవ్వనమంతయు నతనికై మీదు గట్టినాను. ఈ రాత్రి ఒకతినే యుండలేక నతని చెంత కేగుచున్నాను. నేనావిధముగా నుండుట, అనగా నతనికై జన్నెవట్టియుండుట నందరెరిగినదే కావున దాని నిపుడు క్రొత్తగా నేమిచెప్పుదును.

విశే: జన్నెగట్టు = జన్నమనగా యజ్ఞము కావున యజ్ఞార్థము తీసి దాచిన సొమ్మును జన్నెగట్టుట యందురు. పూర్వమది ఎవరికందకుండ మీదికి కట్టుచుండిరి, కావున దానికి మీదుగట్టు అను నర్థము రూఢమైనది. ఒకవేళ అది పశువైన దానిని స్వేచ్ఛగా విడుతురు, దానిని దేవరదున్న, దేవరపోతు, దేవరకోడెయందురు. దానిపై ఎవరి యధికారముండదు. దాని ననుసరించి ఈనాడ ఒకపనికై తీసిపెట్టిన సొమ్మును జన్నెగట్టుట, దీక్షతీసికొనుటను జన్నెవట్టుట అని రూఢమైనవి.

91.క॥ తడవయ్యెనాకుఁ బోవలె
విడవయ్య తలంపు లొరుల వెలయాండ్ర పయిం
బడిపట్టఁ దగవుగా దిది
సడిసేగియు వచ్చు వేల్పుసామికి నైనన్ - 91

టీక:- నాకు తడవయ్యె = నాకు ఆలస్యమాయెను, పోవలెన్, బరుల వెలయాండ్రపయిన్= ఇతరుల యొక్క యుంపుడగత్తెలపై,పడి, పట్టదగవుగాదు = పట్టుకొనుట న్యాయము గాదు, ఇది = ఈ యొక్క, తలవు = కోరిక, విడవయ్యా = విడువవయ్యా, దానివలన, వేల్పుసామికినైనన్= దేవేంద్రునికైన, సడి = అపవాదు, ముయుసేగియు = కీడును, వచ్చున్ = కలుగును.

తా:- నాకు ఆలస్యమైనది, పోవలయును, అయ్యా పరుల యొక్క వేశ్యలపై బడి పట్టుకొనెడు కోర్కెను విడువుము. దాని వలన ఇంద్రునికైనను అపకీర్తి మరియు కీడు కలుగును.

92.తే॥ అనుఁడు రక్కసిరాయఁ డోయతివ, జగము
లన్నియును బంపు సేయంగ నున్న నన్ను
రావణునిగా నెఱుంగవో నీవు తమిని
నెఱిగి తేనియుఁ బలుకుదే యిత్తెఱఁగున ?

టీక:- అనుదు = అనిన పిమ్మట, రక్కసిరాయడు = రాక్షసరాజైన యారావణుడు, ఓ

యతివా! (అతివ = మిక్కిలిగా మాటాడునది), నన్ను, నీవు, జగములన్నియు = అన్నిలోకములు, పంపు సేయంగనున్న = నేను చెప్పిన పనులు చేయుటకు సిద్ధముగానున్న, రావణునిగా, ఎఱుంగవో! = తెలియదా, ఎరిగితేనియు = నేనెవరో తెలిసి యుండినచో, తమిన్ = మైమరపున, పలుకు జేయిత్తెరంగు = ఈ విధముగా నందువా !

తా:- అనిన పిమ్మట రాక్షసరాజైన యా రావణుడు, ఓ యతివా! నన్ను లోకములన్ని నేను చెప్పిన పనులు సేయుటకు సిద్ధముగానున్న రావణుడనని యెరుగవా ! యెరిగిన ఎడల మైమరుపున నిట్లు పలుకెదవా!

93.క॥ సిరిరా మోఁకాలొడ్డిన
కరిణిం బైకొనుచు నేన కదియుఁగ ననునీ
వెరవున విడనాడుచు నొక
తిరిపెపుఁ జెలిపట్టిఁ జేరఁ దివిరెదవేమీ ? - 93

టీక:- సిరిరామోకాలొడ్డిన కరిణిక్ = లక్ష్మివచ్చుచుండగా మోకాలడ్డము పెట్టినట్టు, పైకొనుచునేను కదియుగక్ = నేను పైబడి మీాపించగా, ననునీవు, ఎరవున = పరాయివానిగా, విడనాడుచు = విడుచుచు, ఒక తిరిపెపు చెలిపట్టని = భిక్షగాని స్నేహితుని యొక్క కొడుకును, చేరక్ = చేరుటకు, తివిరెదవేమి = తొందరపడెదవెందుకు -

తా:- ఓ తరుణీ ! లక్ష్మిదేవి వచ్చుచుండగా మోకాలడ్డము పెట్టినట్లు నేనై నేను పైబడి సమీాపించు చుండగ్రా నన్ను పరాయి వానిగా విడిచి ఒక బిచ్చగాని మిత్రుని కొడుకును చేరుటకు తొందరించెదవెందులకు-

94.వ- అని పలికి తలంపు నిలుప నోపక పయింబడం దమ
కించు నతని తలంపెఱింగి రక్కసున కది యిట్లనియె - 94

టీక:- అనిపలికి తలంపు నిలుపనోపక = కోరికను ఆపుకొనలేక, పయిక్ బడక్ = తనపై పడుటకు, తమకించు = యత్నించు, అతని తలంపెరింగి = అతని కోరిక నెరిగి, అది = ఆమె, రక్కసునకు + ఇటనియె.

తా:- అని చెప్పి యతడు తనకోరికను నిలుపు కోలేక నామెపై బడ జూచుచుండగా నతని మనసెరిగి యామె ఇట్లనెను.

"అలం: లోకోక్తి"

95.ఉ॥ కోడిగమేటికయ్యొ? నలకూబరుఁ డంటిన దానఁ గాననేఁ
గోడలనీకు, నావుడును గొంచక యాతఁడు కూర్మిహెచ్చఁగాఁ
జేడియ, యేటిమాటలివి? చెల్లునటే వెలయాలి కిచ్చటం
బాడియు వావియుం గలదె? పల్కకు మట్లును గాక వెండియున్ - 95

టీక:- కోడిగమేలనయ్య = అయ్యా! పరిహాసమెందులకు, నలకూబరునంటిన దానగాన = నేను నలకూబరుని అంటుకొనిన దానను కదా!, అంటుకొను = తాకు, మరుగు, అలవాటగు- ఇవి జార సంబంధమునకు ప్రజా వ్యవహారములు, నే=నేను, కోడలనీకు = నీకు కోడలినయ్యెదను, విశ్రవోబహ్మకు ఇలబిల యందు పుట్టినవాడు కుబేరుడు, కైకసి యందు కలిగిన వాడు రావణుడు, వీరిద్దరిలో కుబేరుడేపెద్ద, ఈ యిద్దరు సవతిసోదరులు కనక నలకూబరుని భార్యయైన రంభ రావణునికి కోడలు, నావుడును = అన్నప్పటికి - సీ॥ నావుడనగా నాగనా ననవుడు నాగ నననలరు ననుట కభిధ - వేం. 76 - కొంచెక ఏమాత్రము సందేహించక, ఆతడు, కూర్మిహెచ్చగా = మనస్సులోని తమిపెరుగు చుండగా, చేడియ = ఓయువతి! (చేడు = ఆపద, కష్టము చేడియ = ఆపదలు పొందుచుందునది) ఏటిమాటలివి, చెల్లునటే వెలయాలి కిచ్చటన్ = వెలయాలికి ఎక్కడైనా చెల్లునా, పాడియు = ధర్మము, వావియున్ = అనగా శాస్త్రీయమైన సంబధము, కలదే = ఉండునా, పల్కకుమట్లును = అటుల పలుకవద్దు, కాక = అది గాక, వెండియున్ = మరియు.

తా:- అయ్యా! పరిహాసమెందులకు. నేను నలకూబరు డంటిన దానను కనుక నీకు కోడల నగుదును. అనగా నతడేమాత్రము సంకోచించ మనస్సులో పెరుగుచుండెడు కుతిచేత ఓయువతీ! ఇవేటి మాటలు వెలయాలి కెచ్చటనైనా వావి వరుసలుండునా అటుల పలుక వద్దు. అదిగాక మరియు - ముందరి పద్యముతో

విశే :- వావివరుసలు తెలంగాణమున జంటపదములు, వావియనగా శాస్త్రీయసంబంధము లేదా నేరుగా కలిసెడి సంబంధము, వరుస యనగా ఒకరిపైనుండి కలిసెడి సంబంధము

96.క॥ వెలయాలుఁ జెఱువుఁ దెరువుం
జలిపందిరి యొకరి సొమ్మె? సమకూర్చి మదిన్
దలపోసి చూచి తెలిసినఁ
దలిరాకుంబోఁడి యింకఁ దరితీపేలా ? - 96

టీక:- దలిరాకుబోడి, వెలయాలు = వేశ్య, చెఱువు = తటాకము, తెరువు = దారి, చలిపందిరి = చలివేంద్రము, ఒకరి సొమ్మె = ఒకరికే సొంతమా!, మదిన్ తలపోసి = మనస్సులో బాగుగా విచారించి, సమకూర్చి = వాని వానికిగల నియమములన్ని ఒకేకోటికి చేసికొని, చూచి = వానిని బాగుగా విచారించి, తెలిసిన = ఎరిగిన యెడల, తలిరాకుంబోడి = చిగురుటాకుల వంటి మేనుగల యో రంభా! ఇంకఁ = ఇక, తరితీపేలా = మధన మాధుర్యము, అనగా తీపియూ రింత లెందులకు.

తా: ఓ రమణీ ! వేశ్య, చెఱువు, దారి, చలివేందిరము, ఒకరి సొమ్ము వాని నియమములు బాగుగా ఆలోచించి చూచిన యెడల యవి యేయొక్కరి సొంతముగావు కనుక నిక ఈ తీపియూరింతలెందులకు

"అలం : లోకోక్తి"

97.వ- అనిపలికి = అని చెప్పి

"రావణుండు రంభననుభ పించుట"

98.తే బలిమిఁ బైఁబడి వలరాచవని యొనర్చి
విడిచి రక్కసిదొర వోయె వేలమునకు
దమ్మి కంటియు నాతఁడు తగవు దొఱగి
తన్నుఁ జేసిన చేఁతకు దలఁకు మదిని - 98

టీక:- బలిమిఁ = బలముతో, పైబడి = పైనబడి, వలరాచపని యొనర్చి = మన్మథ యుద్ధముచేసి, విడిచి = ఆ పిమ్మట విడిచి పెట్టి, రక్కసి దొర = రాక్షసరాజైన రావణుడు, పోయెవేలమునకు = శిబిరమునకు వెళ్లెను, తమ్మికంటియు = ఆ తామసాక్షి గూడను, ఆతడు, తగవు దొరగి = న్యాయమును విడిచి, తన్నుచేసిన చేతకు = తనకు చేసిన కీడునకు అనగా మానభంగమునకు తలకు మదిని = మనస్సులో కళవళపడుచు-

తా:- రావణుడావిధముగా బలవంతముతో నామెపైబడి మదన కదనము చేసి విడిచిపెట్టి తన శిబిరమునకు వెళ్ళెను. ఆమె గూడ నతడు తనకు చేసిన యపకారమునకు మనస్సులో కళవళపడుచు -

ముందరి పద్యములో నన్వయము -

-: రంభ వచ్చి తన గోడు నలకూబరునితో చెప్పుకొనుట :-

99.సీ॥ బలిమితో బిగ్గరఁ బదినోళ్ళ నానఁగా
సొంపఱు జిగి మోవి కెంపుతోడఁ
సెలఁగ చేతుల గోళ్ళఁజీర నెత్తుటఁ దోఁగి
నజ్జునజ్జయిన చన్మొనలతోడఁ
గదిసి మై కందంగఁ గౌఁగిట బిగియింపఁ
జొక్కిళ్ళు వోయిన సొమ్ములతోడ
మొనసిన తమిఁ బోకముడి దివ్వఁ బెనఁగఁగాఁ
జినిఁగిన నుంజల్వ చేలతోడ

తే॥ నోపి కెఱుఁగక తనలావు చూపి కలయఁ
బదలి యదవద యైయున్న యొడలితోడఁ
గాక నీడ్చిన విడిన కీల్గంటు తోడ
వచ్చె నలకూబరుండున్న వలని కతివ - 99

టీక:- బలిమితో = బలవంతముగా, బిగ్గరఁ = గట్టిగా, పదిమోళ్లఁ = దశవదనములతో, అనగాఁ = త్రావగా, అనగా నధరపానము సేయుగా, సొంపఱు = సౌదర్యముడిగి పోయిన, జిగిమోవి = నిగనిగలాడు పెదవి యొక్క, కెంపుతోడ = ఎరుపుదనముతో- అనగా పెదవిలోని సహజ సౌందర్యమైన ఎఱుపు దనము పోయి నెత్తురు పేరిన ఎరుపుతో/చేతులఁ = సెలగఁ = సెలగి పెట్టగా అనగా చేతులతో నలిపి గోళ్ళతో, చీరఁ = రక్కగా, నెత్తుటఁదోగి = నెత్తురులో మునిగి, అనగా నలుపుట వలన చేరిన నెత్తురుతో తడసి, నజ్జునజ్జయిన = మిక్కిలిగా నలిగిని, చన్మొనలతోడ = చూచుకములతో/కదిసి = సమీపించి, మైకందగా = శరీరము కందిపోవునట్లుగా అనగా అంతటి గట్టిగా, కౌగిట బిగియింపన్ = కౌగిలిలో గట్టిగా బిగించి పట్టుకోగా, చొక్కిళ్ళు పోయిన = చొట్టలుపోయిన, సొమ్ములతోడ = భూషణములతో/మొనసిన తమిఁ = మిక్కుటమైన తమిచే, పోకముడిదివ్వ = నీవివిడుచుటకు, పెనగగా = పెనుగులాడగా - అనగా పోకముడి విడునంతకు గూడ నిలుకడ లేకుండ ననుట, చినిగిన = చినిగి పోయిన, నుంజల్వ = నునుపైన తెల్లని, చేలతోడ = చీరతో/ ఓపికెఱుగకఁ = ఓర్పు అనగా మనస్సును స్వాధీనములో నుంచుకొనుటనునది తెలియక, తనలావు చూపి = తనయొక్క బలము చూపి, కలయఁ = కూడగా,

బడలి = అలసిపోయి, అదవదయ్యైయున్న = క్షుబ్ధమైన, ఒడలితోడ = శరీరముతో/ కాకనీడ్చిన = కోపమున లాగగా లేదా వలకాకతో లాగగా, విడిన = విడిపోయిన, కీల్గంటుతోడ = దూముడితో/ నలకూబరుం డున్న వలనికి = నలకూబరుడున్న చోటికి, వచ్చెనతివ = ఆమెవచ్చెను.

తా:- రావణుడు బలవంతముగా పట్టుకొని బిగ్గరగా పదిగోళ్ళతో కరవగా సహజమైన కెంపుదనము పోయి నెత్తురు పేరి ఎరుపెక్కిన పెదవితో చేతులతో గోళ్ళతో సెలగొపెట్టగా మిక్కిలిగా నలిగిన చనుమొనలతో, కౌగిలతో గట్టిగా బిగించి పట్టుకొనగా, సొట్టలు పోయిన సొమ్ములతో, మిక్కుటమైన తమితో పోకముడి విడుచుటకు పెనగగా చినిగిన చీరతో, ఏమాత్ర మోర్పులేకుండ తన బలము నంతటిని చూపి కలియగా అలసిపోయి సడలిన శరీరముతో వలకాకతో ఇటునటు లాగగా విడిపోయిన వెంట్రుకల ముడితో ఆమె నలకూబరుడున్న చోటికి వచ్చెను.

విశే:- లోకమున రాక్షసరతి యని ఒక జాతీమున్నది. దానిని తెలగన్న ఈ పద్యమున చక్కగా రూపుకట్టించెను. అటులే పరుల చేతులలో బటి మిక్కిలి అస్తవ్యస్తమైన వస్తువును గూడ రావణుని చేతిలో పడిన రంభవలె అనటము కద్దు – దానిని గూడ తెలగన్న యిందు సార్ధకముగా చూపెను. అంతేకాక దీని చాటున తొలిరాత్రి దురుసుగా ప్రవర్తించెడు పురుషులకు గూడ వ్యతిరేకముఖమున నొక హెచ్చరిక చేసి స్త్రీలను బలవంతపరచువారి దురుసుతనము చూపెను.

దీనితోపాటు ఈ పద్యమంతయు ఏక విభక్తి (తృతీయ) తో నడిపి దీనికి సొదసౌందర్యము చేకూర్చెను.

"అలం – స్వభావోక్తి"

100.క॥ వచ్చి తనయుండుగులం బడి
యచ్చర పూఁబోఁడి వానికంతయుఁ జెప్పన్
హెచ్చుగుచుఁ గినుక మదిలోఁ
బిచిల నప్పసిఁడి తేని బిడ్డఁడు గడిమిన్ - **100**

టీక:- వచ్చి = అటులవచ్చి, తనయుడుగులంబడి = తనయొక్క పాదములపై బడి, అచ్చర పూబోడి = ఆ రంభ, వానికంతయుజెప్పఁ = అతనికి జరిగిన దంతయు చెప్పగా, మదిలో =మనస్సులో, హెచ్చుగుచు కినుక = కోపము పెరుగగా, అప్పసిమి తేని

బిడ్డడు = నవనిధుల కధిపతియైన కుబేరుని కొడుకగు నానలకూబరుండు, పిచ్చల గడిమిన్ = శౌర్యము పొటమరించగా -

తా :- రంభ యంటుల వచ్చి తన పాదముల పైబడి జరిగిన దంతయు చెప్పగా నానలకూబరుడు మనస్సులో కోపము పెరిగి శౌర్యము పొడమగా-

రావణునికి నలకూబరుని శాపము

101.క॥ 'ఇది మొదలుగాఁగ బలిమిన్
ముదితలఁ దాఁబట్టె నేని యుదితలలు వడిన్
బది వగిలి పొలియుఁగా!' కని
యదరుచు రావణునిఁ గూర్చి యలుగం బలికెన్ - 101

టీక:- ఇది మొదలుగాక = ఇది మొదలుకొని, బలిమిన్ = బలవంతముగా, ముదితల తాబట్టెనేని = స్త్రీలను తాను బలవంతముగా పట్టుకొనిన యెడల, ముదితలలు వడిన్ =ముది = ముదిరిన, లేక ముదిసిన అనగా నప్రబుద్ధితో ముదిరిన యాతలలు, వడిన్ = వేగముగా, పదిపగిలి = పదిగూడను పగిలిపోయి, పొలయుగాకని = చచ్చుగాక! అని, రావణుని గూర్చి, అలుకన్ = కోపముతో, యిదురుచు = వణకి పోవుచు, భయక్రోధములు పెచ్చరిల్లి నపుడు వణకి పోవుట సహజము వ. కోపావేశమున బెదవులదర - అని శ్రీ నాథుడు - కాశీ - 4-110 పలికెన్ = అనెను.

తా:- అపుడు నలకూబరుడు ఇది మొదలుకొని ఆరావణుడు ఏ స్త్రీనైన బలవంతముగా పట్టుకొనిన యెడల వాని పది తలలు పగిలి చచ్చుగాక యని కోపము పట్టలేక శపించెను.

"అలం - యమకము"

యమళమనగా జంట. కావున ఒకే పదముల జంట మరల మరల వచ్చిన యెడల యమకమనబడును. ఈ పద్యమున ముదితల తాబట్టెనేని, ముదితలలు వడిన్ షనుచోట నీయలంకారమున్నది.

102.వ- అంత = ఆ సమయమున -

-: సూర్యోదయము :-

103.చ॥ పొదలెడు నట్టి చుక్కలను పువ్వులు చాలవిదుర్ప, నొప్పున
చ్చదలను సజ్జ, రేయనెడు చానయుఁదాఁ దెలిరంగు గందము
ప్పిదముగఁ జల్లఁగా బెనఁగి, బెట్టగు నాయలఁతం గలంగుచుఁ
నిదురకుఁ బోలెఁ గ్రుంకు మల నెత్తము చేరెను జందురుండొగిన్ -103

టీక:- పొదలెడునట్టి = ప్రకాశించునట్టి, చుక్కలను పువ్వులు = నక్షత్రములను పూలు, చాలఁ = మిక్కిలిగా, విదుర్పఁ = విదిలించగా అనగా చల్లగా, ఒప్పునట్టి, అచ్చదలను సజ్జ = (అ+చదలు) ఆయాకాశమను శయ్యపై, రేయనెడు చానయు = రాత్రియనెడు స్త్రీ మరియు, తాఁ=తాను, తెలిరంగు గందము = వెన్నెలయను తెల్లని రంగుగల గందము, చిట్లగా బెనగి= చిట్టి పోవునట్లుగా పెనగులాడి, బెట్టగు = మిక్కిలియైన, ఆయలతఁ = ఆయలసట చేత, కలంగుచుఁ = బాధపడుచు, చందురుడు, బగఁ = క్రమముగా, నిదురకు బోలె = నిద్రబోవుట కన్నట్లు, క్రుంకుమల = అస్తమయ పర్వతము యొక్క, నెత్తము = శిఖరము చేరెను.

తా:- ప్రకాశించెడు చుక్కలను పూవులను మిక్కిలిగా చల్లిన ఆకాశమను శయ్యపై రాత్రి యను కాంతతో చంద్రుడు వెన్నెలయను గందము చిట్లునట్లుగా పెనగి ఆ యలసటలో బాధపడుచు నిక నిద్రించుటకై వెళ్ళు చున్నాడేమో యనట్లుగా అస్తమయ పర్వత శిఖరము చేరెను.

విశే:- విధుస్సుధాంశు శుభ్రాంశు ఓ షధీశో నిశాపతిః – అనిఅమరము నిశాపతియనగా రాత్రికి భర్తయనియర్థము –

రాత్రి స్త్రీలింగ శబ్దము, చంద్రుడు పుంలింగ శబ్దముగాన రాత్రి మరియు చంద్రులకు కావ్య ప్రపంచమున దాంపత్యము ప్రసిద్ధము

"అలం – రూపకము"

104.క॥ తెగి యపుడ నిగిడి మగుడం
జిగిరించిన పగటి పేరిచెట్టును బోలెం,
దగ దగ మనియెడు కెంపనఁ
దగిసంజ దనర్చె మిగులఁ దార్కొను తెలివిన్ - 104

టీక:- తెగి= నరకబడి, యపుడ= అపుడే, నిగిడి = నిక్కి, మగుడఁ = మరల, చిగిరించిన = చిగురు పెట్టిన, పగటి పేరిచెట్టునుబోలెఁ = పగలు అను చెట్టువలె (వెలుతురు చెట్టువలె), దగదగమనియొడు కెంపన = తళతళలాడు కెంపు అనగా తగి = ఒప్పి, మిగులఁ = మిక్కిలిగా, తార్కొను = వ్యాపించునట్టి, తెలివిఁ = ప్రకాశముతో, సంజదనర్చెఁ = సంధ్యాకలమొప్పెను.

తా:- పగలు అను చెట్టు నరకబడి యపుడే మరల పెరికి చిగురించిన దనగా, తళతళమగు కెంపు అనగా, పూర్వసంధ్య ఎఱ్ఱనై మిగుల ప్రకాశించెను.

"అలం - ఉత్ప్రేక్ష"

105.సీ॥ అరయ వెన్నుఁడె దేవరని వేల్పుగమి చాటఁ
గా నెత్తు పైఁడి జేగంట యనఁగ
దొలుకడ కడలిలోఁ దిలకించు సిరిగేస్తు
నక్కునఁ దగు నీటి యిక్కయనఁగ
జేజేల రాయని తేజీతలాటమై
పరగెడు పికిలి పూబంతి యనఁగ
దూరుపునాఁ డేలు దొరపట్టి నీటుతోఁ
గేలఁ బూనిన కెంపుఁ గేడె మనఁగ

తే॥ నిట్టపు ట్టగు గట్రేని నెట్టెమనను
సొంపుచే నొప్పు తామరకెంపనంగ
మొదలి మువ్వర తేజు పెన్ముద్దయైన
ప్రొద్దు కెంజాయ నెంతయు బొఁడమియొప్పె - **105**

టీక:- అరయఁ = విచారించగా, వెన్నుడెదేవరని = విష్ణువొక్కడు మాత్రమే దైవమని, వేల్పుగమి =దేవతాసమూహము, చాటగా = లోకమునకు చాటించుటకై, ఎత్తు = పైకెత్తిన, పైడి జేగంటయనగ = బంగారు యొక్క జయగంటయనగా/ తొలుకడ = మొదటి దిక్కగు తూర్పున, కడలిలో = సముద్రమందు, తిలకించు = ప్రకాశించు, సిరిగేస్తునక్కున = లక్ష్మిపతి యొక్క యెదపై, తగు = ఒప్పినట్టి, నీటి యొక్క = సముద్రమే గృహముగా గలది యనగా లక్ష్మీదేవి, యనగ/ లక్ష్మీదేవి ఎఱ్ఱనిదిగా పురాణ ప్రసిద్ధము, జేజేలరాయని = ఇంద్రుని యొక్క, తేజీ = గుఱ్ఱము యొక్క, తలాటమై = శిరోభూషణమై, పరగెడు = ఒప్పెడు, పికిలి, పికిలియను పక్షి ఈకలయొక్క,

పూబంతియనగా = పూలచెండనగ/ తూరుపునాడేలు = తూర్పుదిక్కునగల పట్టణమైన స్వర్గమును, ఏలు = పాలించు, దొరపట్టి = ప్రభువైన ఇంద్రుని యొక్క కుమారుడగు జయంతుడు, నీటుతో = ఠీవిగా, కేలబూనిన = చేతధరించిన, కెంపుకెడెమనగా = కెంపుతో చేయబడిన డాలు అనగ/ఇట్టపుట్టగు = నిక్కిపుట్టిన, గద్రేని = పర్వతరాజుయొక్క, నెట్టెమునను = తలపై గల గుండ్రని శిరోవేషమున, సొంపుచేనొప్పు = అందముగా నుండు, తామర కెంపనంగ = పద్మరాగమణియనగా, మొదలి మువ్వుర తేజా = మొదటి దేవతలైన అనగా త్రిమూర్తులైన ఆముగ్గిరి యొక్క కాంతి, పెన్ముద్దయైన = పెద్ద ముద్దగా ఏర్పడిన, ప్రొద్దు = సూర్యుని యొక్క, కెంజాయ = ఎరుపుదనము, ఎంతయు = మిక్కిలిగా, పొడమి = పుట్టి అనగా పొడిచి, ఒప్పె = తగెను.

తా:- అపుడు విష్ణు ఒక్కడే ప్రపంచమున కంతటికి దైవమని చాటుటకై దేవతలు పైకెత్తి పట్టిన చేతిగంట యనగా తూర్పున దిక్కునగల సముద్రమున శయనించిన విష్ణువు యొక్క ఎదపైగల లక్ష్మీదేవి యనగా ఇంద్రుని యొక్క గుఱ్ఱమైన ఉచ్చైశ్రవము తలపైగల పికిలి చెండనగా ఇంద్రుని యొక్క కుమారుడైన జయంతుడు ఠీవిగా పట్టుకొనిన కెంపుడాలనగా, తూర్పు దిక్కును పర్వత రాజు యొక్క కిరీటమున గల పద్మరాగమణి యనగ, మూడు మూర్తుల యొక్క తేజపు ముద్దయనగా సూర్యబింబము తూర్పున నెఱ్ఱగా యుదయించి యొప్పెను.

"అలం: ఉత్ప్రేక్ష"

-: రావణుని దిగ్విజయము: -

106.వ- అట్టియెడ రావణుండు - 106

టీక:- అట్టియెడ = ఆసమయమున, రావణుండు

107.సీ॥ చనియింగలము వేడిఁ చల్లార్చి యుల్కతో
జముని బరంబెల్లఁ జక్కబెట్టి,
కొలము సొగెమున నప్పాలను దిండిని నిల్పి
తెగినీటి ఱేని పెంపిగుఱఁజేసి
గాడుపునెందేవి కదలిపోఁ దూలించి
యలక నేలెడువాని కలిమినాచి

తివిరి జాబిలి తాల్పుఁ దిరిపంబు గావించి
వేల్పురాయుని సొంపు ప్రీలగెల్చి
తే॥ బలువుచే వారినెలవులు పాడుచేసి
చెలగి జేజేల కొమ్మలఁ జెఱలువట్టి
కలన నెదరింప నెవ్వరిఁ గానకపుడు
కదలెఁ దనదీవి కలరి రక్కసుల ఱేడు - 107

టీక:- చని = వెళ్ళి, యింగలము వేడి చల్లార్చి = అగ్నిదేవుని యొక్క తేజమును మాపి, యల్కతో = కోపముతో, జముని బీరంబెల్ల = యమధర్మరాజు, శౌర్యమంతటిని, చక్కబెట్టి = అనగా నణచి (వ్యతిరేక లక్షణ), కొలము సాగెమున = కులము యొక్క సంబంధమున, అప్పొలసు దిండినినిలిపి = (ఆ+పొలసు) మాంశాసనుడైన ఆ నిర్రుతిని యధావిధిగా నుంచి, తెగి = సాహసించి, నీటిరేని పెంపు = వరుణుని యొక్క గొప్పదనము, ఇగురజేసి = నసింపజేసి, గాడుపును = వాయుదేవుని, ఎందేని = ఎక్కడనైన, కదలిపోఁ = ఆ స్థానము విడిచి వెళ్లునటుల, మూలించి = తూలి పడజేసి = అలకనేలెడువాని = అలకను పాలించు కుబేరుని యొక్క, కలిమినాచి = ఐశ్వర్యమును స్వాధీన పరచుకొని, ఆవిరి = త్వరపడి, జాబిలి తాల్పుఁ = శివుని, తిరిపంబుగావించి = తిరిపెగానిని జేసి, వేల్పురాయుని సొంపు = ఇంద్రుని యొక్క అభివృద్ధి, ప్రీలగెల్చి = ముక్కలగునట్లు గెలిచి = బలువుచే = తనయొక్క ఆధిక్యముతో, వారి నెలవులు = వారినివాసములు, పాడుజేసి, చెలగి = విజృంభించి, జేజేలకొమ్మలఁ = దేవతాస్త్రీలను, చెఱలు పట్టి = చెరబట్టి, కలననెదిరింపఁ = యుద్ధరంగమున తననెదిరించుటకు, ఎవ్వరిఁ గానకపుడు = అపుడు ఎవరిని గూడ గానక, రక్కసుల ఱేడు = రాక్షస రాజైన రావణుడు, అలరి = సంతసించి, కదలెతనదీవికి = తన ద్వీపమునకు అనగా లంకకు కదలెను.

తా:- రావణుడు అగ్నియొక్క వేడిమిని చల్లార్చి, యముని శౌర్యమును చక్కబెట్టి కులము యొక్క సంబంధమున నిర్రుతిని మాత్రము యధావిధిగా నిలిపి వరుణుని బలిమిని గురించి, వాయుదేవుని తూలించి, కుబేరుని ఐశ్వర్య మాక్రమించి, ఈశానుని తిరిపగానిని చేసి, ఇంద్రుని వైభవము పగులగొట్టి వారి పట్టణములన్ని నాశనము జేసి యచ్చటి దేవకన్యలను చెరబట్టి యుద్ధరంగమున తన నెదురించు వారినెవరిని గానక అపుడు సంతోషమును తన దీవికి మరలెను.

విశే:- ఇందుకవి అగ్నినార్పి, వరుణుని ఇగురించి, గాలిని దూలించి శివుని తిరిపగానిని చేసి యుని చెప్పుట సార్థకమైన విశేషములు. ఇంగలమునకు చల్లారుట, నీటికి గిరి పోవుట, గాలికి తూలిపోవుట స్వభావములు కావునకవి ఈ పద్యమున వారివారి స్వభావములచేతనే వారిపరాజయములను సూచించుచు భాషీయములయొక్కచమత్కారమును ప్రదర్శించెను.

"అలం - వ్యతిరేకము"

"దేవతలు విష్ణువుకడకేగుట"

108.కం॥ ఈకరణిం బది మొగముల
రాకాసి యొనర్చినట్టి రాయిడి చేతం
జీకాకగుచును వెలువ
లాకఱి దేవరకు నుడువ నరుగుచునెదుటన్ - 108

టీక:- ఈ కరణిఁ = ఈ విధముగా, పదిమొగముల రాకాసి = దశముఖుడు అను రాక్షసుడు, ఒనర్చినట్టి = కలిగించినట్టి, రాయిడి చేతఁ = ఆపద చేత, చీకాకగుచున్ = చికాకు పడుచు, ఆకరి దేవరకు = ఆనల్లనయ్యకు, నుడువ = చెప్పుటకు, వెడలుచు = వెళ్ళుచు, ఎదుటఁ = ఎదురుగా -

-: క్షీరసముద్రము: -

109.సీ॥ కరువలి నెగయు తుంపరల ముమ్మర మెల్లఁ
గ్రమ్మెడు పుపొళ్ళ దుమ్ము గాఁగఁ
గరము పైఁ గదలెడు తరగల మొత్తముల్
సమకొన్న కొమ్మలగములు గాఁగఁ
దనలోన నెలమిని దరిఁజేరి యున్నవు
త్యాలెల్లఁ దెలిచాయ పూలు గాఁగ
గప్పలై వెన్నెల కుప్పలో యన నొప్పు
బలితంపు నురుఁగులు పండ్లు గాఁగ
తే॥ జాలుకొను తెల్లరంగునఁ జాగమునను
జెలువు మీఱుచు వేలుపుఁ జెట్టువోలెఁ
బరఁగి యెంతయు నుప్పొంగు పాలకడలిఁ
జేరపబుమాఱు మది సంతసిలుచునుండి - 109

టీక:- కరువలినెగయు= గాలికి లేచెడు, తుంపురుల ముమ్మరమెల్ల = తుంపురుల పంపు అంతయు, క్రమ్మెడు = కమ్ముకొనెడు, పుపొళ్ళుదుమ్ము గాగ = (పూవు+పొడి) పుప్పొడి యొక్క దుమ్ముగాగ/ కరము = మిక్కిలిగా, పైగదలెడు = పైనికదలుచున్న, తరగలమొత్తముల్ = తరంగములన్నియు, సమకొన్న = వ్యాపించిన, కొమ్మల గములు గాక = శాఖాసమూహములు గాగ/ తనలోన, ఎలమిని = ప్రకాశమున, దరిజేరి యున్న = వడ్డులకు జేరియున్న, ముత్యాలెల్ల = ముత్యములన్ని, తెలిచాయ = తెల్లని వన్నెగల, పూలుగాగ, గొప్పలై, వెన్నెలకుప్ప లోయనఁ = వెన్నెలకుప్పలేమో అనునట్లు, ఒప్పు, బలితంపునురుగులు = ఉరువైన ఫేనములు, పండ్లుగాగ, చాలుకొను తెల్లరంగునఁ = వరుసగా కనిపించెడు తెలుపులో, చాగమునను = త్యాగమునందు, చెలువు మీరుచు = అందముగానొప్పుచు, వేలుపు చెట్టువోలె బరగి = దేవతావృక్షము వలెనొప్పి, ఎంతయుఁ = మిక్కిలి, ఉప్పొంగు = (ఉబ్బి+పొంగు) సరళమునకు పరుషము) పైకి బాగుగా పొంగు, పాలకడలిజేరి = క్షీరసాగరమున చేరి, మది సంతసిలుచు, ఉండు = ఉండునట్టి -

తా:- గాలికి లేచెడు తుంపురులు పుప్పొడిగా, కదలుచున్న తరంగములు కొమ్మలుగా దరులకు చేరిన ముత్యములు పూలుగా అక్కడక్కడ చేరిన నురగ కుప్పలు ఫలములుగా, వరుసగా కనిపించెడు తెలుపుతో కల్పవృక్షము వలెనున్న ఆ క్షీరసముద్రమును చూచి సంతసించి -

విశే:- ఈ పద్యమున క్షీరసముద్రము కల్పవృక్షముతో పోల్చబడినది. సముద్రమునకు వృక్షమునకెందును సామ్యముండదు. అటుల సామ్యములేని రెండింటిని జతపరచుట యనగా సామాన్యముగాదు - పాల్కురికి సోమనాథుడు పండితారాధ్యచరిత్రమున నిటులే శ్రీశైలము ను - పర్వతము - సముద్రముతో సాటివెట్టి చెప్పెను.

"అలం - పరణామము"

దేవతలు విష్ణువుని గాంచుట

110.సీ॥ జగములు గలిగింపఁ జాలు నల్వకుఁ బుట్టి
నిమ్మైన పొక్కిలి తమ్మివానిఁ
దొలుకారు మొగులుపై నలరుమించిన మేనఁ
గడునొప్పు పసిఁడి పచ్చడము వానిఁ

గలిమి దేవేరి నక్కలికితోఁ బుట్టిన
కెంపునక్కునఁ దాల్చు సొంపువానిఁ
గొలువ వచ్చిన ప్రొద్దు నెలయునాఁ జేదోయిఁ
జుట్టల్గుఁ జిందంబు సొగయువాని
తే॥ నాలిగన్నయ్యఁ దనయంప కోలముల్కిఁ
గట్టకడనొంచి మించిన కడిమి వానిఁ
బ్రాఁత చదువుల తుదల నేర్పడుచునొప్పు
నడక గలవానిఁ దమబారి నడఁచువాని - 110

టీక:- జగములు కలిగింపజాలు = లోకములన్ని పుట్టింపగల, నల్వకు = బ్రహ్మకు, పుట్టఁ = జన్మించుటకు, ఇమ్మైన = తగిన, పొక్కిలి తమ్మివాని = నాభిపద్మముగల వానిని, తొలుకారు మొగులపై = నూతనమైన వర్షాకాలపు మేఘముపై, అలరుమించిన మేన = కాంతిని మించినట్టి శరీరమున, కడునొప్పు = మిక్కిలిగా ప్రకాశించు, పసిడి పచ్చడము వాని = బంగారశాలువా గలవానిని/ కలిమి దేవేరిని, లక్ష్మిని, అక్కలికితో బుట్టిన = ఆమెతో పాటుగా పుట్టిన, కెంపును = కౌస్తుభమను ఎఱ్ఱని రత్నమును, అక్కున దాల్చు = ఉరమున ధరించు, సొంపువాని = అందగానిని/ కొలువవచ్చిన = తనను సేవించుటకు వచ్చిన, ప్రొద్దునెలయునా = సూర్యచంద్రులనగా, చుట్టల్గు = (చుట్టు+అలుగు) చిందంబు = చక్రము, శంఖముతో, సొగయువాని = అందమైన వానిని/ ఆలిగన్నయఁ = భార్యను కన్నవాడైన సముద్రుని, తనయంప కోలముల్కిఁ = తనయొక్క బాణములతో, కట్టకడినొంచి = చిట్టచివరకు అణచి, మించిన కడిమి వాని = గొప్పవాడని పెంచిన గొప్పవానిని/ రామావతారమున సముద్రుని గర్వమ మణుచుట నిచట స్మరింప వలెను. ప్రాత చదువుల తుదల = వేదముల యొక్క చివరలైన యుపనిషత్తులందు, ఏర్పడుచు = రూపొందుచు, ఒప్పు = ఒప్పునట్టి, నడకగలవాని = ప్రవర్తన గలవానిని, తమబారినడచు వాని = తమయొక్క ఆపదను అడగించువానిని -

తా:- లోకములన్ని సృజింపగల బ్రహ్మ జన్మించుటకు కారణమైన నాభి పద్మము గలవాడు, తొలుకారు మేఘము వంటి శరీరకాంతితో నుండి బంగారు వస్త్రము ధరించిన వాడు సముద్రమున జనించిన లక్ష్మిని మరియు కౌస్తుభమును ఎదపై ధరించిన వాడు తనను సేవించుటకు వచ్చిన సూర్యచంద్రులన్నట్లున్న చక్రమును శంఖమును ధరించిన వాడు - తన భార్యను గన్న సముద్రుని బాణముతో గర్వమణచినవారు

ఉపనిషత్తులతో తెలిసికోదగినవాడు, తమయొక్క ఆపద తొలగించువాడు అయిన వానిని - ముందరి పద్యముతో నన్వయము

"అలం - పర్యాయోక్తి"

111.చ॥ చిలువల ఱేనిమై యనెడు సెజ్జను మించిన మంచు కొండపైఁ
నిలిఁ బొలుపొందు కార్మొగులు నాఁదగు చామనమేని నిద్దపుం
జెలువున మీఱు కుందనపుఁ జేల మెఱుంగున నొప్పువెన్నునిం
గలుముల చానగేస్తుఁగని కన్నులనీ రొలుకంగ మ్రొక్కుచున్ - 111

టీక:- చిలువల ఱేనిమై యనెడు = ఆదిశేషుని శరీరమును, సెజ్జను = శయ్యపై, మంచు కొండపై = హిమాలయముపై, నలిఁ = తగినట్లుగా, పొలుపొందు = ప్రకాశించు, కార్మొగులునా = నల్లని మేఘమనగా, తగు = తగినట్టి, చామన మేని = శ్యామమైన శరీరము యొక్క, నిద్దపుం జెలువున = స్నిగ్ధత్వము యొక్క సౌందర్యమున, మీఱు = అతిశయించు, కుందనపు చేలమెఱుంగున = బంగారు వస్త్రముయొక్క కాంతితో, ఒప్పు, వెన్నునిఁ = విష్ణువును, కలుముల చానగేస్తుఁ = లక్ష్మీదేవి యొక్క భర్తయైన వానిని, కని = చూచి, కన్నుల నీరొలుకంగఁ = కన్నీరు జారుచుండగా, అనగా దుఃఖముతో, మ్రొక్కుచుఁ = నమస్కరించుచు.

తా:- శేషుని యొక్క శరీరమనెడు శయ్యపై మంచు కొండపై వ్రాలిన కారుమేఘము వలె నల్లనైన శరీరము యొక్క కాంతితో మీరుచు, బంగారు వలువలతో ఒప్పుచున్నవానిని, లక్ష్మీదేవి యొక్క భర్తయైన వానిని చూచి దుఃఖముతో నమస్కరించుచు -

"అలం : రూపకము"

112.వ- పలుదెఱంగులం బొగడి వగలు మిగుల నొగిలి పొగులుచు
నెలుంగు రాలుపడ వేలుపు లిట్లనిరి - 112

టీక:- పలుదెఱంగుల బొగడి = పలువిధములుగా నుతించి వగలు మిగుల నొగిలి = మిక్కిలి కష్టములతో బాధపడి, పొగులుచు = దుఃఖపడుచు, ఎలుంగ రాలుపడ = ధ్వని క్షీణము కాగా, అనగా గాద్గదికముతో వేలుపులిట్లనిరి = దేవతలిట్లనిరి.

తా:- వారు విష్ణువును అనేక విధములుగా పొగడి మిక్కుటమైన బాధలతో దుఃఖపడుచు, గొంతు కీచు కంఠముపడగా నిట్లనిరి.

దేవతలు వెన్నునితో రావణుని చేష్టలు చెప్పుట

113.ఉ॥ 'కంటికి రెప్పచందమునఁ గైకొని దేవర ప్రోవ నిన్నినా
ళ్ళుంటిమి గాక, మీదుమది నొప్పరికించిన నొక్కపూటయుఁ
మంటిమె, యొండుచోటు మఱి మాకును గల్గునొ, చూచి మాసిరుల్
గెంటక యుండఁగావు మదిఁ గీల్కొను ప్రేముడి మమ్మునందఱన్ - 113

టీక:- కంటికి రెప్పచందమున = కంటికి రెప్పవలె, కైకొని = మముచేపట్టి, దేవర = దేవర వారైన తాము, ప్రోవఁ = రక్షించుచుండగా, ఇన్నినాళ్ళుంటిమి గాక = ఇన్ని దినములు బ్రతికితిమిగాని, మీదు మదిన్ = మీది మనస్సులో, ఒప్పరికించిన = ఉపేక్షచేసిన, ఒక్క పూటయుఁ = ఒక్క పూటగూడ - మంటిమె = బ్రతికితిమా!, ఒండుచోటు = వేరొక తావు, మఱి మాకును గల్గునొ = మరి మాకు కలుగునా! చూచి = దీనిని విచారించి, మీసిరుల్ = మాయైశ్వర్యములు, గెంటకయుండఁ = తప్పిపోకుండ, మదిగీల్కొను = మనస్సునగల, ప్రేముడిఁ = దయతో, మమ్మునందఱఁ = మమ్ములను అందరిని, కావుము = రక్షించుము.

తా:- దేవరా! తాము మమ్ముల నెల్లపుడు కంటికి రెప్పవలె చేపట్టి కాపాడుచుండగా, నిన్నిదినము లుంటిమిగాని మీరు మనస్సుతో ఉపేక్షించిన యెడల మేమొక్క పూటయైన బ్రతికి యుండగలమా మీరు తప్ప రక్షణకు మాకు మరొకతావు కలదా! ఇది విచారించి మీరు మా యైశ్వర్యములు తప్పిపోకుండ మనస్సునగల దయతో మమ్మందరిని లక్షించుడు.

"అలం : ఉపమ"

114సీ॥ తునిసి కూఁకటి వేళ్లకును బెల్లగిల్లఁగా
బుడుకు మ్రాఁకులు నేల బడఁగ ద్రోచి
వాడవాడలఁ గెంపుమేడ లెల్లను జాల
మొదలిమట్టు గలంగఁ జదియఁ దాచి
యంగళ్ళ తావు లెఱుంగరా కుండంగ
బంగారు గోడల రంగు చెఱి ?

నెలఱాలఁ దీరిన యుర మాళిగల లోని
మేలిమచ్చులు ప్రీలఁ గూలనూకి
తే॥ యంత బోవక సోఁకు మావంతు లేఁచి
కొలువ జేజేల రాయని కొలువు మేడ
వైజయంతంబు పుడమిపై వ్రాలఁద్రొబ్బె
నుగ్గునుగ్గుగ నతని యేనుగులు రేపి - **114**

టీక:- తునిసి = తునిగి, కూకటి వ్రేళ్లకును = పుట్టినప్పటి వ్రేళ్లతో గూడ, పెల్లగిల్లగా, పుడుకు మ్రాకులు = కల్పవృక్షములు, నేలన్ = నేలపై, పడగద్రోచి = పడవేసి/ వాడవాడలన్ = వీధి వీధులందు, కెంపు మేదలెల్లను = కెంపులతో కట్టబడిన మేడలన్ని, చాల = మిక్కిలి, మొదలి మట్లు కలంగ = పునాది లోని మొదటి వరుసలు కదలునట్లుగా, చదియుదాచి = పగులగొట్టి/ అంగళ్లతావులు, ఎఱుంగరాకుండగ = తెలియు రాకుండ, బంగారుగోడల, రంగు జెఱచి = ఉన్న తీరు మాపి/ నెలరాల దీరిన = చంద్రకాంత శిలలతో తీర్చిన, ఉరుమాళిగలలోని = పెద్దపెద్ద మడిగెల లోని, మేలిమచ్చులు = మేలైన అటకలు, ప్రీలన్ = పగులునట్లు, కూలనూకి/ అంతబోవక = అంతటితో నూరుకొనక, సోకుమావంతులు = రాకాసి మావటీలు, ఏచికొలువ = విజృంభించి సేవించుచుండగా, జేజేలరాయని = ఇంద్రుని యొక్క, కొలువు మేడ, సభాభవనమైన, వైజయంతంబు = వైజయంతము, అతని ఏనుగులు రేపి = అతని యొక్క యేనుగులనుసి కొల్పి, నుగ్గనుగ్గగ = చిన్నచిన్న ముక్కలగునట్లుగా, పుడమిపై = నేలపై, వ్రాలదొబ్బె = పడదోయించెను.

తా:- కల్పవృక్షములు తునిగి కూకటి వ్రేళ్ళతో కూలునట్లుగా పడద్రోసి నడివీధులలో గల కెంపుల మేడలన్ని పునాది మొదటి వరుసలు గూడ కదలునట్లు పగులగొట్టి, అంగడుల తావులు, తెలియరాకుండ, బంగారుమేడల యొక్క తీరును చెరచి, చంద్రకాంత శిలలతో తీర్చికట్టిన పెద్దపెద్ద మడిగెలలోని మేలైన మచ్చులన్ని పడనూకి, అంతటితో నూరకొనక ఆ రక్కసి మావటీలు తమ ఏనుగుల నుసికొలిపి యింద్రుని సభయైన వైజయంతమును కూలద్రోయించిరి.

విశే:- పూర్వము దండయాత్రలు జరిగినపుడు ఓడిపోయిన శత్రురాజులయొక్క పట్టణము లెట్లు ధ్వసంము చేయుబడుచుండెనో ఈ పద్యమున ప్రదర్శింపబడినది.

"అలం – స్వభావోక్తి"

115.సీ॥ ఉలుప చాల దటంచు నలుగు వేలుపుఱేని
నంటఁగా దని యగ్ని నంటఁ గట్టుఁ
బొలుసు దేఁడని వేఁడి వెలుఁగు పట్టిని గొట్టుఁ
గని కొల్వఁ డనుచు రక్కసుని నొంచు
నీళ్లు చల్లఁ డటంచు నీటి ఱేనిఁ గలంచుఁ
గడువీచి తనిగాలి గాసిపెట్టు
నదలించుఁ గానుకకై పైఁడి రాయనిఁ
గడకొత్తి ముక్కంటి జడలు పెఱుకు
తే॥ పరగ వరవుడుఁ బనుల కచ్చరలఁ బనుచు
నేమి చెప్పుదుమయ్య, మా యిడుము పాటుఁ
తలఁచుకొన్నను గుండియల్ తల్లడిల్లు
జియ్య, యికనైనఁ బ్రోవవెఁ జిత్తగించి - **115**

టీక:- వేలుపుటేనిఁ = ఇంద్రుని, ఉలుపచాలదటంచు = తమకిచ్చెడు మామూలు చాలదని, అలుగు = కోపించును, అంటగాదని = తాకరాదని, అగ్గినంటగట్టు = అగ్నిదేవుని కట్టివేయును/పొలుసుదేడని = మాంసమును తేడని, వేడి వెలుగు పట్టిని = సూర్యుని కుమారుడైన యముని, కొట్టుఁ = కొట్టును, కనికొల్వుడంచు = జాగ్రత్తగా చూచి సేవ జేయుడని, రక్కసుని నొంచు = నిర్రుతిని దండించును, నీళ్లుచల్లడు + అటంచు = అని, నీటి ఱేనిఁ = వరుణిని, కలంచుఁ = బాధించును, కడువీచితని = మిక్కిలిగా విసరినావని, గాలిఁ =వాయుదేవుని, గాసిబెట్టు = బాధించును, కానుకకై = కానుకలకొరకు, పైడిరాయుని = కుబేరుని, అదలించుఁ = అదరించును, కడకొత్తి = చివరకు పడవేసి, ముక్కంటి = శివునియొక్క, జడలు పెరుకు = జడలు పెరికి వేయును, పరగఁ = తగినట్లు, ఒరవుడు పనులకు = దాసీల పనులకు, అచ్చరల పనుచు = అప్సరస నేర్పాటు చేయును, ఏమిచెప్పుదుమయ్య = అయ్యా! ఏమని చెప్పుదుము, మా = మాయొక్క, యిడుమపాటు = కష్టములు, తలచుకొన్నను, గండియల్ = గుండెలు, తల్లడిల్లుజియ్య = ఓ! స్వామీ, ఇకనైనఁ , చిత్తగించి = మామొరవిని, ప్రోవవే = కాపాడుము.

తా:- తమకిచ్చెడు కానుక చాలదని ఇంద్రునిపై కోపించును. తాకరాదని యగ్గినంట గట్టును, మాంసము తేలేదని యముని దండించును, బాగుగా చూచి కొలువుడని నిర్రుతిని గద్దించును, నీళ్ళు చల్లడని వరుణిని, అతిగా వీచెనని వాయుదేవుని

బాధించును. కానుకలు పంపలేదని కుబేరుని అదిలించును. శివుని కడ కొత్తి యతని జడలు పెరుకును. అయ్యా! మీా యొక్క కష్టము లేమని చెప్పెదము. అవి తలచుకొన్నయెడల గుండెలు తల్లడిల్లును. ఓస్వామి! ఇకనైన చిత్తగించి మమ్ముకాపాడుడు.

116.వ- అని వగచి పలుకు వేలుపుల మాట లాలించి వారికి వెన్నుం డిట్లనియె -16

టీక:- అనివగచి = అని దుఃఖించుచు, పలుకు, వేలుపుల = దేవతలయొక్క, మాటలాలించి = మాటలువిని, వారికి, వెన్నుడిట్లనియె = విష్ణువిట్లనెను.

తా:- అని దుఃఖముతో చెప్పగా నా దేవతల మాటలు విని విష్ణువిట్లనెను.

117.చ॥ 'వెఱవకుఁడయ్య, రక్కసుఁడు వేమఱుఁ బెట్టిన బాములెల్లనే
నెఱుఁగనె, వానికి న్నలువ యిచ్చిన మాట దలంచి దానికిఁ
దఱి యగునంతకుఁ మదిని దాళితి, నిప్పని వేగఁదీర్తు, నే
మఱఁ జనుఁడన్న' వారు వగ మానుచు వచ్చిరి ఁటెంకి పట్లకున్ -117

టీక:- వెరవకుడయ్య = అయ్యా, భయపడవద్దు, రక్కసుడు = ఆ రాక్షసుడు, వేమరు = పలుమారు, పెట్టి బాములెల్ల = పెట్టెడు కష్టములన్ని, నేనెరుగనె = నాకు తెలియదా! వానికిఁ, నలువ యిచ్చిన మాట దలంచి = బ్రహ్మ యిచ్చిన వరములు తలచి, దినికిఁ = అందుకు, తఱియగునంతకుఁ = సమయముగువరకు, మదిని దాళితిఁ =మనస్సులో నోపికపట్టితిని, ఇప్పని = ఈపని, వేగదీర్తు = తొందరగనే ముగింతును, ఏమరఁ = మరువను, చనుడన్న = వెళ్లుడనగా, వగమానుచు = దుఃఖమును మానుచు, టెంకిపట్లకుఁ = తమనివాసములకు వచ్చిరి.

తా:- ఓ దేవతలారా! మీరు భయపడవద్దు. అ రాక్షసుడు మిమ్ములను పలుమారు పెట్టెడు కష్టములన్ని నేనెరుగనా! వానికి బ్రహ్మయిచ్చిన వరమును దలచుకొని మనసులో నోపిక పట్టితిని, ఈ పనిని నేను తొందరగనే ముగింతును, మరువను, వెళ్ళుడు అనగా వారు దుఃఖమును మాని తమనివాసములకు వెళ్ళిరి.

-: శ్రీరామాదుల జననము :-

118.తే॥ అంతఁ బ్రొద్దుకొలంబున నలరు మేటి
దశరథుడు పెండ్లి యయ్యెను దగిన సొంపు
మెఱయఁ గౌసల్యకైక సుమిత్ర యనఁగ
వెలసి యొప్పెడు ముప్పురు తలిరుఁబోండ్ల - 118

టీక:- అంతః = ఆపిమ్మట, ప్రొద్దుకొలంబున = సూర్యవంశమున, అలరు మేటి = వెలిగెడు గొప్పవాడైను, దశరథుడు = అజాని కుమారుడైన దశరథుడు, తగిన సొంపు మెరయ = తనవైభవమునకు తగినట్లుగా, కౌసల్య, కైక, సుమిత్ర యనగ = అనునట్టి పేరులతో, వెలసి = ప్రకాశించి, ఒప్పెడు, ముప్పురు తలరుబోండ్లః = ముగ్గురు చిగురాకులవంటి కోమలమైన వారిని పెండ్లియయ్యెను.

తా:- ఆపిమ్మట సూర్యవంశమునగల గొప్పవాడైన దశరథుడు తగినట్టి వైభవముతో ప్రకాశించుచు కౌసల్య, కైక, సుమిత్ర యను ముగ్గురు చిగురు బోడులను వివాహమాడెను.

విశే :- కౌసల్య కోసల దేశ ప్రభువగు భానుమంతుని కూతురు. కైకేయి కేకయ ప్రభువగు కేకయుని కూతురు. సుమిత్ర విదర్భదేశ ప్రభువు కూతురు.

119.వ- అందు = ఆముప్పురియందు

120.తే॥ తమ్మిపొక్కిటి వేలుపు దశరథునకు
నలరు కౌసల్యకును రాముఁడనగఁ బుట్టెఁ ;
గైక భరతు, సుమిత్ర లక్ష్మణుని జాలఁ
గడిమి మించిన శత్రఘ్నుఁగాంచి రలరి -120.

టీక:- తమ్మి పొక్కిటి వేలుపు = పద్మనాభుడు దశరథునకు మరియు అలరు కౌసల్యకును = ఒప్పిదమైనట్టి కౌసల్యాదేవికి, రాముడనగ బుట్టె = రాముడను పేరున జనించెను, కైకభరతు= కైకేయి భరతుని, సుమిత్ర లక్ష్మణుని = సుమిత్రా దేవి లక్ష్మణుని, కడిమిమించిన = శౌర్యమున మించిన , శత్రుఘ్నుః , అలరి = సంతసమున, కాంచిరి = కనిరి.

తా:- విష్ణువు దశరథుడు మరియు కౌసల్యాదేవికి రాముడను పేరున జన్మించెను. కైకేయి భరతుని, సుమిత్ర లక్ష్మణుని మరియు శౌర్యవంతుడైన శత్రఘ్నుని కనిరి

విశే:- విష్ణువు రాముడు కాగా శేషుడు లక్ష్మణుడై శంఖము భరతుడై చక్రము శత్రుఘ్నుడై పుట్టినట్లు పురాణకథనము.

121.తే॥ ఎలమి నప్పువ్వుఁ బోండ్లకు నిట్లు గలిగి
రాముఁడన లక్ష్మణుండన రహిని భరతుఁ
డనఁగ శత్రుఘ్నుఁ డనగ నెయ్యమున మెఱసి
యిద్ద ఱిద్దఱు కవగూడి యొనసి రెపుడు - 121

టీక:- ఎలమిన్ = ప్రేమతో, అప్పువు బోండ్లకున్ (అ+పువుబోండ్లకు) ఆవనితలకు, ఇట్లుకలిగి = ఈ విధముగా జన్మించి, రాముడన, లక్ష్మణుడన, రహిని = పేరులకు ఒప్పినట్లుగా, భరతుడనగ, శత్రఘ్నుడనగ, నెయ్యమున మెఱసి = స్నేహముతో వెలుగుచు, ఇద్దరిద్దరు, కవగూడి = జతగలిసి, యొనసిరెపుడు = ఎల్లప్పుడు వర్తించుచుండిరి.

తా:- దశరథుని భార్యలైన ఆ యువతులకు ఈ విధముగా వారు జన్మించి, రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రఘ్నుడు అని పేరులకు తగినట్లుగా నొప్పుచు వారు యిద్దరిద్దరు జతగూడి, ఎల్లప్పుడు స్నేహమున వర్తించుచుండిరి.

122.వ- ఇట్లు గూడి కందుపొం దెఱుంగని విదియ చందురుని
యందంబున నానాటికి నీటు గలిగి పెరుఁగుచు - 122

టీక :-ఇట్లు = ఈ విధముగా, కూడి = వారు జతగలిసి, కందు పొందెరుంగని = కళంకములేని, విదియ చందురుని యందంబున = విదియనాటి చంద్రుని యందముతో, నానాటికి =దినదినము, నీటుగలిగి = ఠీవిగలిగి, పెరుగుచు -

తా:- ఈ విధముగా వారు జతగలిసి కళంకమెరుగని విదియనాటి చంద్రునివలె నుండి దినదినము ఠీవి గలిగి పెరుగుచు -

-: విశ్వామిత్రుని ఆగమనము :-

123.క॥ నెలపూఁ దాలుపు పగిదిన్
విలు నేర్పున సాటిలేక వెలయు కొమరులన్
లలిఁజూచి పొంగు దశరథు
కొలువున కరుదెంచె గాధి కొడుకు కడంకన్ - 123

టీక:- నెలపూ దాలుపు పగిదిఁ = చంద్రుని పూవుగా ధరించిన శివునివలె, విలునేర్పునఁ = బాణవిద్యయందు, సాటిలేక = సమానము లేక, వెలయు కొమరులఁ = ఒప్పుచున్న కొడుకులను, లిలఁ = సంతోషమున, చూచి = చూచుచు, పొంగు = ఉప్పొంగుచున్న, దశరథుకొలువునకు, గాధికొడుకు = విశ్వామిత్రుడు, కడంకఁ = ఒక ప్రయత్నమున, అరుదెంచెఁ = వచ్చెను.

తా:- విలువిద్యయందు శివుని వలె సాటిలేక యొప్పుచున్న కుమారులను గని దశరథుడు సంతోషించు చుండగా నపుడొక ప్రయత్నమును విశ్వామిత్రుడు దశరథుని కొలువునకు వచ్చెను.

"అలం - ఉపమ"

-: ఆశ్వాసాంతము :-

124.ఉ॥ వెరవున లావునఁ గడిమి బీరమునం బొలుపొందు రాచదే
వర మెఱయుంగ నేర్చిన కువాళపు మన్నియ మూఁక నేలతా
ల్పరి, బలుగాడ్పు తమ్మి చెలిపట్టిని సంద్రము, వేల్పుమ్రానిఁజం
దురు బలిఁ జాగపుఁ మొదవును మ్మఱపించిన యీగి నేర్పరీ! - 124

టీక:- వెరవున = నేర్పున, లావునఁ =గొప్పదనమున, కడిమిఁ = అతిశయమున, బీరమునఁ = వీరమున, పొలుపొందు = ప్రకాశించు, రాచ దేవర = ఓ మహారాజా! మెరయుంగనేర్చిన= ప్రకాశింపనేర్చిన, కువాళపు మన్నియ మూకఁ = కపటచేష్టలుగల రాజులను, నేల తాల్పరిఁ = శేషుని, బలుగాడ్పును = గొప్పనైన వాయువును, తమ్మిచెలిపట్టిని = సూర్య కుమారుడైన కర్ణుని, సంద్రమును = సముద్రమును, వేల్పు మ్రానిఁ = కల్పవృక్షమును, చందురుఁ = చంద్రుని, బలిఁ = బలిచక్రవర్తిని, చాగపుఁ మొదవుఁ = కామధేనువును, మరపించిన, యీగనేర్పరీ = త్యాగమునందు నేర్పుగలవాడ!

తా :- ఓ అమీను ఖానా! నేర్పున కపటచేష్టలుగల రాజులను, గొప్పదనమున ఆదిశేషుని, అతిశయమున వాయుదేవుని వీరత్వమున కర్ణుని పరాక్రమమున సముద్రుని వలె ప్రకాశించువాడా, దానము నందు కల్పవృక్షము, చంద్రుడు, బలిచక్రవర్తి, కామధేనువు వంటి వాడా!

"అలం - తుల్యయోగిత"

125.కII కలుముల కుబేర, యనిగెలు
పులవేలుపు రాకొమార, పుడమిఁ మెయితో
మెలగువలరాయ, పలుకుల
చిలువలరాయా, దురంపు సెకకన్నేటీ ! - 125

టీక:- కలుములకుబేర =ఐశ్వర్యమునందు కుబేరుడా! అనిగెలుపుల = యుద్ధములందు జయించుటలో, వేలుపురాకుమారా = దేవతల ప్రభువైన ఇంద్రునికొడుకా అనగా జయంతుడా ! పుడమిఁ = భూమియందు, మెయితో మెలగు = శరీరముతో మెలగు, వలరాయ = మన్మధుడా, పలుకులఁ = భాషయందు, చిల్వల రాయా = శేషుడా, దురంపు = యుద్ధములందు, సెకకన్నేటి = అగ్నినేత్రము గలవాడా అనగా రుద్రుడా! శివుడు యుద్ధములందు సాటిలేనివాడు. అంతేకాక నతడు యుద్ధములధిపతి యని శ్రుతివచనము -

తా:- ఐశ్వర్యమున కుబేరుడవు, యుద్ధవిజయములందు జయంతుడవు, ప్రపంచమున శరీరముతో సంచరించు మన్మధుడవు, విద్యయందు శేషుడవు, యుద్ధము లందు పాలాక్షుడవు అయిన ఓ అమీను ఖానా!

"అలం - ఉల్లేఖము"

126. మానిని :-

కలుముల చెలి చాలంగ్గైపుతోఁ బాలవెల్లిం
గలిగి చెలఁగుచుం జాగంబుతో మించురేవఁ
వెలయుఁ గొలములోనఁ బీరముఁ లావు మీఱం
గలిగి పొలుచు మైతోఁ గమ్మ విల్తాను మేటీ! - 126

టీక:- కలుములచెలి = లక్ష్మీదేవి, చాలంగ్గైపుతో = మిక్కిలి లాహిరితో, పాలవెల్లింగలిగి = క్షీర సముద్రమున బుట్టి, చెలగుచున్ = అతిశయించుచు, చాగంబుతో మించు రేవఁ- త్యాగముతో మించు నట్లుగా, కొలములోనఁ = మీ వంశమున, వెలయుం = ప్రకాశించగా, బీరముఁ = శౌర్యమును, లావు = బలము, మీఱంగలిగి = మిక్కిలిగా గలిగి, పొలుచు మైతో = ఒప్పిన శరీరముతో, కమ్మవిల్తాను మేటి = చెఱుకు విల్లును ధరించిన వాడా! అనగా మన్మధుడా!

తా:- లక్ష్మీదేవి మిక్కిలియైన లాహిరితో క్షీరసముద్రమున జనించి త్యాగముతో మించినటుల నీవు నీకులము ప్రకాశించగా శౌర్యము మరియు బలము కలిగి శరీరముతో నొప్పుచున్న మన్మధుడవైన ఓ అమీనుఖానా !

"అలం - రూపకము"

గద్య :- ఇది శ్రీ మదనగోపాలమంత్రప్రసాదలబ్ధ సారస్వతి సుకవి వర్ణనీయ వచోవిభవ భావనామాతృతనూభవ పొన్నికంటి వంశవర్య తెలగనార్య ప్రణీతంబైన యయాతి చరిత్రంబను నచ్చ తెనుఁగు కబ్బంబునందు ద్వితీయాశ్వాసము.

ద్వాదశాదిత్యుల వివరము - అతని వెంట నుండెడు బలగము.

క్ర.సం.	నెలలు	సూర్యులు	అప్సరసలు	గంధర్వులు	నాగులు	బ్రహ్మర్షులు	దూతలు	
1	చైత్రము	ధాత	కృతస్థల	తుంబురుడు	వాసుకి	పులస్త్యుడు	హేతి	రథకృత్తు
2	వైశాఖము	మిత్రుడు	పుంజకస్థల	నారదుడు	కంజనీరుడు	పులహుడు	ప్రహేతి	ఓజుడు
3	జ్యేష్ఠము	అర్యముడు	మేనక	హాహా	తక్షకుడు	అత్రి	పౌరుషేయుడు	రథస్వనుడు
4	ఆషాడము	శక్రుడు	సహజన్య	హూహూ	వర్చసుడు	వశిష్ఠుడు	చర్యుడు	చిత్రస్వనుడు
5	శ్రావణము	వరుణుడు	ప్రమ్లోచ	విశ్వావసువు	ఏలాపుత్రుడు	అంగీరసుడు	వ్యాఘ్రుడు	శ్రోత
6	భాద్రపదము	అంశుడు	అనుమ్లోచ	ఉగ్రసేనుడు	శంఖపాలుడు	భృగువు	శరజిత్తు	అసారణుడు
7	ఆశ్వయుజము	భగుడు	ఘృతాచి	సురుచి	ధృతరాష్ట్రుడు	కంబలాశ్వుడు	మఘాపేతుడు	బ్రహ్మోపేతుడు
8	కార్తీకము	వివస్వంతుడు	విశ్వాచి	పరావసువు	అశ్వతరుడు	విశ్వామిత్రుడు	ఋతసేనుడు	సత్యజిత్తు
9	మర్గశిరము	పూషుడు	ఊర్వశి	చిత్రసేనుడు	మహాశంఖుడు	కశ్యపుడు	అరిష్టనేమి	తర్క్ష్యుడు
10	పుష్యము	సవిత	పూర్వచిత్తి	ఊర్ణాయువు	కర్కోటకుడు	ఊర్ణుడు	సురుచి	స్ఫూర్జుడు
11	మాఘము	త్వష్ట	తిలోత్తమ	ధృతరాష్ట్రుడు	ధనంజయుడు	గౌతముడు	సహజన్యుడు	వాతుడు
12	ఫాల్గుణము	విష్ణువు	రంభ	సూర్యవర్మ	ఋతసేనుడు	భరద్వాజుడు	విశ్వుడు	పర్జన్యుడు

అధికమాసమున విష్ణువే ఆదిత్య స్థానమున నుండును. నేటి పరిశోధకులు సూర్యగోళమున కాత్మభ్రమణము కలదని ప్రతి పదకొండేండ్లకొకి పరియతని శక్తిక్షీణముగా నుండునని పృషవలయమును బట్టి తేల్చిరి కాన నేటి శాస్త్రవేత్తల ప్రకారము సూర్యగోళమునకు 11 ముఖములున్నట్లు లెక్క. సూర్యగోళముపై మచ్చలెక్కువగా నున్నయేడు భూమిపై పంటలు బాగుగా పండునట. క్రీ. శ. 1917 లో అమచ్చలెక్కువగా నున్నట్లు కనుగొనిరి.

తృతీయా శ్వాసము

1.క॥ సిరిగుబ్బ చన్ను గొండల
దరులం గఱి మొగులు పగిదిఁ దవిలి తిరుగున
మ్మరు తండ్రి మనుపు నసముల
నెరయు నమీర్ ఖాన, సింగణీ సుల్తానా ! - 1

టీక :- సిరి = లక్ష్మీదేవి యొక్క, గుబ్బచన్నుల = బాగుగా గుబ్బటిల్లిన చన్నులన్నెడు, కొండల దరులన్ = పర్వతముల యొక్క యంచు లందు, కరిమొగులు పగిది = నల్లని మేఘమువలె, తవిలి = ఆసక్తితో తిరుగు = సంచరించు, నమ్మరు తండ్రి = ఆమన్మథుని తండ్రియైన విష్ణువు, మనవున్ = కాంచుగాక/ అసములన్ = కీర్తులతో, ఎఱయు = ప్రకాశించు, అమీర్‌ఖాన, సింగణీ సుల్తానా! బాణము ను ధరించిన ఓశ్రేష్టుడా !

తా :- ఓ అమీనుఖానా! సింగణీ సుల్తానా ! లక్ష్మీదేవి యొక్క గొప్పనైన చనుగొండల తటములందు నల్లని మేఘమువలె నాసక్తితో సంచరించు విష్ణుమూర్తి నిన్నెల్లప్పుడు బ్రోచుగాక !

''అలం - రూపక- ఉపమ''

2. వ॥ అట మీఁది తెఱంగు వినుండు - 2

టీక :- అట మీది తెఱంగు = ఆతరువాతి విధానము, వినుండు -

3. తే॥ ఇట్లు వచ్చిన జడదారి కెదురు గాఁగ
నరిగి సాఁగిలి మ్రొక్కి, తానతఁ డొసంగు
నట్టి దీవనఁ గైకొని, యలరి తలిసి
నపుడు బంగరు గడియ యందు నునిచి - 3

టీక :- ఇట్లు వచ్చిన = ఈవిధముగా వచ్చిన, జడదారికి = మునికి, ఎదురుకాగ నరిగి = ఎదురు వెళ్ళి, సాగిలిమ్రొక్కి = సాష్టాంగ నమస్కారము చేసి, తాను, అతడొసంగునట్టి= అతడిచ్చునట్టి, దీవెన గైకొని = దీవెనను తీసుకొని, అలరి = సంతసించి, తలిసిని = ఆమహర్షిని, అపుడు, బంగరు గద్దియ యందు = బంగారు పీఠముపై, నునిచి = ఉంచి -

తా :- ఈ విధముగా వచ్చిన మునికి ఎదురుగా వెళ్ళి సాష్టాంగ నమస్కారము జేసి యతడిచ్చిన దీవెనను గ్రహించి, సంతసించి ఆమహర్షిని తోడ్కొని వచ్చి బంగారు సింహాసనముపై కూర్చుండ జేసి.

4. కII అడుగుం దమ్ములు గూరిమిఁ
గడిగి తగం గారవించి కర మలరుచున
ప్పుడు వచ్చిన పని యే మని
యడిగిన, రాతబిసి చూచి యాయనతోడన్ - 4

టీక :- అడుగుం దమ్ములు = పాదపద్మములు, కూరిమిన్ = ప్రేమతో కడిగి, తగన్‌గారవించి = తగినట్లు గౌరవించి, కరమలరుచున్ = మిక్కిలి సంతసించుచు, అప్పుడు రాతబసిన్ = ఆముని రాజును చూచి, వచ్చిన పని, ఏమని యడిగిన, ఆయన తోడన్ = అనగా నాదశరథునితో,

తా : దశరథుడతని పాదపద్మములు కడిగి తగినట్లుగా గౌరవించి మిక్కిలి సంతోషమున నాముని రాజుతో మీరు వచ్చిన పనియేమని యడుగగా - అతనితో -

'అలం - రూపక'

విశ్వామిత్రుడు శ్రీరాముని పంపుమని యడుగుట

5. క II వెన్నుని మాఱట రూపై
యొన్నఁగఁ దగినట్టి రాము నిఁకఁ బాయమునం
బిన్నని చూడక మఱి నా
జన్నముఁ గావంగఁ బనుపఁ జనునని పలుకన్ - 5

టీక :- వెన్నుని మాఱట రూపై = విష్ణువు యొక్క మారురూపమై, ఎన్నగ దగినట్టి = లెక్కించ తగినట్టి, రామున్ = రాముని ఇకన్, బాయమునన్ = వయస్సునందు, పిన్నని చూడక = చిన్నవాడనక, మఱి, నాజన్నముగా వంగన్ = నేను చేయు యజ్ఞమును రక్షించుటకు, పనుప జనును = పంపవలయును, అని పలుకన్ = అనియనగా -

తా :- విష్ణువు యొక్క మరో రూపమని యెన్నదగిన రాముని వయస్సులో చిన్నవాడని చూడక నేను చేయు యాగమును రక్షించుటకు పంపవలయును అని పలుకగా -

మా అటశబ్దమునకు అప్పకవిప్రయోగము -

తే॥ పల్లెనాలను నూటతోంబదియునాల్గు
గ్రామములనీడు గానక కాకునూరి
వెంగనార్యుండు వేదవేదాంగములను
బ్రస్తుతికి నెక్కిమాఅట బ్రహ్మయనఁగ
అప్ప - పీ.82

6 వ:- ప్రేముడిం గొడుకు నసుపం జాలకుండియు
నతని పరుసఁ దనంబునకు వెఱచి యనిచిన,
ననుచు సంతసంబున నెంతయు రాముఁ డనుఁగుఁ
దమ్ముని తోడ రాజడదారి పజ్జం జనునప్పుడు - 6

టీక :- ప్రేముడిఁ = ప్రేమతో, కొడుకు, నసుపం జాలకుండియు = పంపలేకుండ, నతని, పరుసదనంబునకు = పరుషత్వమునకు, వెఱచి = భయపడి, యనిచినఁ = పంపిన, అనుచు సంతసంబున = పంపిన సంతోషమున, ఎంతయు మిక్కిలిగా, రాముడు, అనుగు తమ్ముని తోడఁ = ప్రియమైన తమ్మునితో, రాజడదారి పజ్జఁ = ముని రాజా ప్రక్కగా చనునప్పుడు = వెళ్ళునప్పుడు -

తా :- దశరథుడు ప్రేమతో కొడుకును పంపలేకుండియు విశ్వామిత్రుని కఠినత్వమునకు వెఱచి పంపగా శ్రీరాముడు మిక్కిలి సంతోషమున ప్రియమైన తమ్ముడగు లక్ష్మణునితోగూడి విశ్వామిత్రుని ప్రక్కన చనునప్పుడు -

-: తాటక సంహారము :-

7. చ॥ పెలుచగు రూపుతోఁ బునుకపేరులు దూల, వెడందనాలుకఁ
సెలవులు నాకికొంచు, నిరుసేతులఁ గేడెము వాలుఁబూని, మై
పొలుసుగవు ల్కడుం గదురఁ గిట్టకుఁ గల్గె నటంచు నార్చుచుఁ
పొలవక వచ్చు తాటకిఁ గనుంగొని రాజడదారి రాముతోన్ - 7

టీక :- పెలుచగు రూపుతో = ఆటోపమైన రూపముతో, పునుక పేరులు దూలఁ = కపాల మాలికలు తూలు చుండగా, వెడందనాలుకఁ = వెడల్పు అయిన నాలుకతో, సెలవులు నాకికొంచు = చెలిమెలు అనగా పెదవుల మూలములు నాకు కొనుచు, ఇరు చేతులఁ = రెండుచేతులతో, కేడెము వాలు బూని = డాలు మరియు కత్తి

ధరించి, మై = శరీరము పైగల, పొలుసుగవుల్ = మాంసపు నీచు వాసనలు, కడుంగదుర = మిక్కిలి వ్యాపించుచుండగా పొట్టకు గల్గెనటంచు = ఈనాడు నాకు తిండి దొరికెననుచు, నార్భుచుఁ = గొప్పగా బొబ్బలిడుచు, పొలవకఁ = ఏమాత్రము శ్రమలేకుండ, వచ్చు తాటకి గనుంగొని = తాటకిని చూచి, రాజడదారి = మునిరాజు, రాముతోఁ = రామునితో

తా :- ఆటోపమైన రూపముతో మెడలోని ఎముకల దండలు తూలు తుండగా వెడల్పయిన నాలుకతో పెలిమెలు నాకు కొనుచు ఒక చేతికత్తి, ఒక చేతడాలు పట్టుకొని శరీరము నుండి నీచువాసన వ్యాపించుచుండగా ఈనాడు నాకు తిండికలిగెనని బొబ్బలు పెట్టుచు అవలీలగా వచ్చెడు తాటకిని చూచి మునిరాజైన విశ్వామిత్రుడు రామునితో -

''అలం - స్వభావోక్తి''

8.కII 'అదె, తాటకి యను రక్కసి,
గొదగొని యేతెంచె, దీనిఁ గూల్చుము కడుబె
ట్టిద మగు తూపులఁ నిదియాఁ
డది యని చూడకుము, మిగుల డాయఁగ వచ్చెన్' - 8

టీక :- అదె - తాటకియను రక్కసి, గొడగొని = ఆకలిగొని, యేతెంచె = వచ్చెను, కడు = మిక్కిలి, బెట్టిదమగు తూపులఁ = భయంకరమైన బాణములతో, దీని గూల్చుము = దీనిని చంపుము, మిగులఁ = మిక్కిలి, డాయగ వచ్చెఁ = సమీపించెను. ఇది + ఆడదియని, చూడకుము.

తా :- ఓ రామచంద్రా ! ఇది తాటకియను రాక్షసి, మిక్కిలి యాకలిగొని మనపైకి వచ్చినది. మిక్కిలిగా సమీపించినది. కనుక దీనిని ఆడుదియని విచారించక మిక్కిలి కఠినమైన బాణములతో వధించుము.

విశే :- తాటక వృత్తాంతము -

ఆమె సుకేతుడను యక్షుని కూతురు. మిక్కిలి సౌందర్యవతి మరియు వేయి యేనుగుల బలముకలది. సుకేతుడామెను బ్రహ్మను గురించి తపము చేసి కూతురిగా పొంది సునందుడను యక్షునికిచ్చి వివాహము చేసెను. వానికి

మారీచుడు, సుబాహుడు అను నిద్దరు కుమారులు కలిగిరి. అట్లుండనొకనాడు తండ్రికొడుకులైన సునందుడు మారీచుడు అనునిద్దరు ఆకటి పెల్లున వేగి యగస్త్యాశ్రమముపై బడిరి. అపుడా మహర్షి కోపించి వారిని రాక్షసులు కండని శపించెను.

నాటితోతాటకి రాక్షసత్వ వరావహించి వికార స్వరూపురాలై మనుష్యాశనురాలయ్యెను.

9.క॥ అని పల్కిన రాముఁడు గ్ర
క్కున లక్ష్మణుని చేతి విల్లుఁగొని యెక్కిడి తూ
పున దానిఁ బుడమిఁ గూల్చెం
దన తమ్మని తోడ రాచతబిసి చెలంగన్ - 9

టీక :- అని పల్కిన = అనిచెప్పగా, రాముడు, గ్రక్కునన్ = వెంటనే, లక్ష్మణుని చేతి, విల్లుగొని = బాణమును గ్రహించి, యెక్కిడి = ఎక్కుపెట్టి, తూపునన్ = బాణముతో దానిన్, పుడమిన్ గూల్చెన్ = నేలపై పడవేసెను. అనగా చంపెను. తన తమ్మనితోడ = లక్ష్మణునితోపాటు, రాతబిసి = మునిరాజైన విశ్వామిత్రుడు, చెలంగన్ = సంతోషించగా-

తా :- అని చెప్పగా రాముడు వెంటనే లక్ష్మణుని చేతిలోని విల్లందుకొని ఎక్కుబెట్టి దానిని ఒక బాణముతో లక్ష్మణునితో పాటు విశ్వామిత్రుడు గూడ సంతసించగా చంపెను.

''అలం - సహోక్తి''

10.వ:- ఇట్లు తాటకిం గూల్చిన - 10

టీక :- ఇట్లు తాటకిం గూల్చిన = ఈవిధముగా తాటకిని చంపగా -

11.మ:- మదిలోఁగిన్కను బండ్లు గీఁటు కొనుచున్, మరీచుఁ డేతేర, బ
ల్లిదపుం దూపున సంద్రమువ్వలికి నోలిన్వానిఁ బోనేసి, వే
కదియ న్వచ్చు సుబాహునిం దునిమి, వేడ్కన్ జన్నముంగాచి, యా
పిదపన్ రాజడదారి వెంట జనకుం బేర్కొంచురా నర్మిలిన్ - 11

టీక :- మదిలో గిల్కను = మనస్సులోని కోపముతో, పండ్లు గీటు కొనుచున్ =పండ్లుకొరుకుచు, మారీచుడేతేర =మారీచుడు రాగా, బల్లి దంపు దూపున =

భయంకరమైన బాణమున, సంద్రమవ్వలికి = సముద్రము యొక్క అవతలకు, ఓలిఁ వాని బోనేసి = చక్కగా వానిని పడవేసి, వేకదియఁ వచ్చు = ఆవెంటనే వేగముగా తమను సమీపించు, సుబాహునిం దునిమి = సుబాహుని చంపి, వేడ్కన్ = వేడుకతో, జన్నముఁ గాచి = యజ్ఞమును రక్షించి, ఆపిదపఁ = ఆపిమ్మట, రాజడదారివెంట = రాజార్షివెంట, అర్మిలిఁ = ప్రేమతో, జనకుఁ బేర్కొంచురాఁ = జనకుని తలచుకొనుచురాగా-

తా :- మనసులో కలిగిన కోపముతో మారీచుడు పండ్లు కొరుకుచు రాగా వానినొక భయంకరమైన బాణముతో చక్కగా సముద్రమవతల పడవేసి, ఆవెంటనే తమపైకి వేగముగా వచ్చిన సుబాహుని చంపి ఆయజ్ఞమును కాపాడి పిమ్మట నారాజర్షి వెంట జనకుని స్మరించుకొనుచు రాగా -

విశే :- శ్రీరాముడు తాటకిని వధించిన పిమ్మట విశ్వామిత్రుని యాగమును ధ్వంసము చేయుటకు వచ్చిన యామెకుమారులగు మారీచ సుబాహులలో శ్రీరాముడొక బాణముతో మారీచుని సముద్రము యొక్క ఆవల లంకలో బడునట్లు వేసి మరియొక బాణముతో సుబాహుని వధించెను.

లంకలో పడిన మారీచుడు రావణుని కింకరుడయ్యెను

''అలం - స్వభావోక్తి ''

-: సీతా స్వయం వరము :-

12.కll తనరుచు మిథిలకుఁ జని పెం
పున విల్లెక్కించు పందెమున గెలిచి, జగం
బున మించు చాలుపేరిటి
నన బోఁడిం బెండ్లియై దనర్చె న్మిగులన్ - 12

టీక :- తనరుచు = సంతోషించుచు, మిథిలకు జని = మిథిలా పట్టణమునకు పోయి, పెంపునఁ = తమగొప్పదనమున, విల్లెక్కించు = విల్లెక్కుపెట్టు, పందెమున, గెలిచి, జగంబున మించు = లోకమున పొగడ్తున్న, చాలుపేరిటినన బోడిఁ = నాగటిచాలు అనుపేరు గల కొమలిని, అనగా సీతను, మిగులఁ = మిక్కిలి సంతోషమున, పెండ్లియై తనర్చెఁ = పెండ్లియాడి యొప్పెను.

తా :- అతడు సంతోషించుచు మిథిలకు వెళ్లి యక్కడ తనయొక్క గొప్పదనమున విల్లెక్కుపెట్టుట యను పందెమున గెలిచి లోకమున పేరుగన్న సీతయను కన్యను మిక్కిలి సంతోషమున వివాహమాడెను.

విశే : మిథిలానగర వృత్తాంతము -

జనకుని వంశమునకు నిమివంశమని పేరు. నిమి యిక్ష్వాకు మహారాజు కుమారుడు. అతడొకపుడు ఒక యాగము తల పెట్టి వశిష్టుని పురోహితునిగా పిలువగా నతడంతవరకే ఇంద్రుని యాగము చేయించుట కంగీకరించుటచే దానిని చేయించి వచ్చెదనని చెప్పెను.

నొసట వ్రాసినది నోట పలుకును. నిమి ఈజీవితము క్షణభంగురము. కనుక నెప్పటికేమి మూడునోయని తలచి వశిష్టునికై వేచి యుండక గౌతముని పిలుచుకొని యాగమారంభించెను. అదినడుచు చుండగా వశిష్టుడింద్రుని యాగము పూర్తిచేయించి వచ్చి నిమిని చూచితనకొరకు వేచి యుండ నందులకు విదేహుడవు కమ్మని శపించెను. దానితో నిమి చక్రవర్తి దేహము నుండి వేరైపోయి పిమ్మట మానవుల కనురెప్పలందు నిలిచెను. అందువలన నేడు రెప్పపాటునకు నిమిషమను పేరు కలిగినది.

నిమి విదేహుడైనందు వలన నతడు పాలించిన రాజ్యమునకు నాటినుండి విదేహ దేశమని వ్యవహార మేర్పడెను.

నిమికి అంతవరకు సంతానములేదు. కను మహర్షులపుడు నిమిని మరల శరీరమున ప్రవేశింపుమని కోరిరి. కాని అతడందుల కంగీకరించలేదు. అంత వారతని దేహమును మథించి యొక పురుషుని పుట్టించిరి.

నిమి యొక్క దేహమును మథించుట వలన కలిగెను. కనుక నాపురుషునికి వారు మిథియని నామకరణ చేసిరి అతను రాజ్యమునకు వచ్చి విదేహ దేశమునకు తనపేర రాజధానిని నిర్మింప జేసెను. అందువలన జనులు దానిని మిథిలానగరమని పిలిచిరి.

శివధనుర్వృత్తాంతము -

ఆదియుగమున నరణ్యుడను నొక మహర్షి బ్రహ్మను గూర్చి ఘోర తపమొనరించెను. అపుడతని శరీరము చుట్టుపుట్టలు పెరిగి వెదురులు మొలిచెను. కొంతకాలమునకు బ్రహ్మ యతనికి వరములిచ్చుటకు వెళ్ళి అచటి పుట్టపై గల వెదురులలో నొకటి విశేషముగా

కనిపించగా దానిని గొనివచ్చి మూడు పాయలుగా చీల్చి చాపములు చేసి ఒకటి విష్ణువునకు, ఒకటి శివునకిచ్చి మరియొకటి తన చెంతనుంచుకొనెను.

బ్రహ్మ చెంతనున్నది కాలాంతరమున నతడు చంద్రుని కీయగా నతని నుండి యగ్నిదేవుడు కొని వెళ్లి దానినర్జునకిచ్చెను. అదియే గాండీవము.

బ్రహ్మ శివుని కిచ్చిన చాపమునకు పినాకమని వ్యవహారము. దానినతడు దక్షయజ్ఞ ధ్వంస సందర్భమున వీరభద్రున కీయగా దానితో నతడు ఆయజ్ఞమును ధ్వంసము చేసి దానినక్కడనే విడిచి సతీదేవి కళేబరమును శివుని దగ్గరకు కొనివెళ్లను.

అపుడక్కడికి వచ్చిన దేవతలు వీరభద్రు డక్కడ విడిచి పోయిన శివుని చాపమును ఎత్తి ఆయజ్ఞమునకు వచ్చిన నిమి చక్రవర్తి కిచ్చిరి. ఆయన దానిని కొని వెళ్ళి ఇంటనుంచుకొని భక్తి తాత్పర్యములతో పూజించు చుండెను.

సీతాదేవి వివాహమునకు అదియే పణముగా నుంచ బడి శ్రీరామునిచే భంగము చేయబడెను.

సీతాదేవికాపేరు కలుగుటకు కారణము -

పూర్వము రావణుడు దిగ్విజయముగోరి మహర్షులకడ కేగి వారి రక్తమును యాచించి ప్రతివారు కొంతకొంత తమ నెత్తురునీయగా దానినొక భాండమున గొని వచ్చుచుండెను. అపుడు దారిలో కృత్స్నమదుడను మహర్షి పుత్రికను గోరి యజ్ఞము చేయుచు నొక భాండమున దర్భలతో క్షీరము నభిమంత్రించి యుంచెను. రావణుడాయజ్ఞశాలనుండి యాక్షీర భాండమును హరించి దానియందు తానుకొనివచ్చు చున్న ఋషుల రక్తమును కూడకలిపి ఇంటికి గొని వచ్చి మండోదరికి దానిని భద్రపరుచు మని యిచ్చి యది ''విషమని'' చెప్పెను.

అంతనొక నాడు మండోదరి రావణుని చేష్టలకు విసిగి ఆత్మహత్యా ప్రయత్నమున భర్త తనకిచ్చిన విషమును ద్రావగా దానితో నామెకు చూలు నిలిచెను. అపుడామె యా విషయము పతికి చెప్పక తీర్థయాత్రలపేర సంచారమునకు బయలుదేరి నవమాసములు నిండిన పిమ్మట నొక ఆడశిశువును గనియాబాలిక నొక పెట్టెలో నుంచి నదిలో విడిచి తాను సరస్వతీ నదిలో స్నానము చేసి పునీతురాలై మరల నిల్లు జేరెను.

మండోదరి యీవిధముగా నదిలో విడిచిన మందసము నీటివాలున వచ్చి మిథిలా పట్టణ సమీపమున భూగర్భమున చేరిపోయి జనకుడు పుత్రకామేష్టికై భూమిని దున్ను చుండగా నపుడు నాగటి చాలున యాపెట్టె బయలు పడి యందు సురక్షితముగా నున్న బాలిక జనకునకు లభించెను.

అటులామె నాగటిచాలున లభించెను కనుక జనకుడామెకు ''సీత'' యని నామకరనము చేసెను. సీరమనగా నాగలి సీతయనగా నాగటిచాలు. అందుచేతనే తెలగన్న సీతను చెప్పునప్పుడెల్ల నీ కావ్యమున నామెను ''చాలుపేరిటి కన్య'' యని వాడెను

13.ఆ:- ఇట్లు చాలుపేరి యెల నాగఁ బెండ్లియై
గాధి పట్టి ననిచి కదలి చనుచుఁ
దెగి యెదుర్చు రాచపగనేల వేలుపు
బీరమెల్లఁ జక్కఁ బెట్టి యంత - 13

టీక :- ఇట్లు = ఈవిధముగా, చాలుపేరి = సీతయను పేరుగల, యెల నాగ౯ = కన్యను, పెండ్లియై = వివాహమాడి, గాధి పట్టిని = విశ్వామిత్రుని, అనిచి = పంపి, కదలి చనుచు = అక్కడినుండి బయలుదేరి వెళ్లుచు, తెగి = సాహసించి, ఎదుర్చు = తననెదుర్కొను, రాచపగ నేల వేలుపు = రాజులపై పగగొన్న బ్రాహ్మణుడగు పరశురాముని, బీరమెల్ల౯ = శౌర్యమంతటిని, చక్కబెట్టి = బాగుచేసి, అంత౯ = ఆపిదప -

తా :- ఆవిధముగా సీతను వివాహమాడి విశ్వామిత్రునికి వీడ్కోలు చెప్పి యచటి నుండి వచ్చుచుండగా క్షత్రియ సంహార కర్తయైన పరశురాముడు సాహసమున వచ్చి తన నెదుర్కొనగా నతని గర్వమును అణచి వేసి ఆపిదప -

విశే :- పరశురాముడు క్షత్రియ సంహార కర్తయగుటకు కారణము :-

భృగు మహర్షి పుత్రుడైన ఋచీకుడు మిక్కిలి తపస్సంపన్నుడు. తపస్సుతోనే యతడు ముదిసిపోయెను కాని యపుడతనికి వివాహ కాంక్ష కలిగెను. ముసలివాడైన యతనికి మహర్షులెవరు తమకన్యల నిచ్చుట కంగీకరించకుండిరి. అపుడతడు ''గాధియను'' మహారాజునకు ''సత్యవతి'' కూతురుగలదని తెలిసి యతని దగ్గరకు వెళ్లి నీకూతురును నాకిమ్మని యడిగెను. అదివిని యామహారాజా లోచనలోపడి కాదనిన నితడేమి శపించునోయని భయపడి ఒక చెలి మాత్రమే

నలుపు శరీరమంతయు తెలుపుగల వేయి గుఱ్ఱములను కానుకగా నిచ్చిన నాకూతురు నిచ్చెదనని నియమము పెట్టెను.

గాధి ఋచీకుడవి సంపాదించ లేడనుకొనెను. కాని ఆమహర్షి సామాన్యుడుగాడు. వరుణుని గురించి తపము చేయగా నతడు ప్రత్యక్షమై యేమికావలెనని యడిగి యతని కోరికను తెలిసి కొని ఆగుఱ్ఱములు నీవెక్కడ తలచిన నక్కడనే పుట్టగలవు పొమ్మని వరమిచ్చెను. అంత ఋచీకు డొక చోట నిలిచి ఆగుఱ్ఱములను సృజించు కొని వాని మందను తోలుకొని రాగా గాధికిక తన కూతురు నతనికీయక తప్పలేదు.

సత్యవతి తన భర్త వృద్ధుడని యేవగించుకొనక మిక్కిలి భయభక్తులతో నతనిని సేవించుచుండెను. అంత నతడామె సేవకు మెచ్చి యొకనాడేమి కావలెనో కోరుకొమ్మనగా నామె యంతవరకు తమ తండ్రికి గూడ మగసంతానము లేకుండెను గాన తమ తల్లికి తనకు చెరొక కుమారుడు కలుగ వలెనని కోరెను. అంత ఋచీక మహర్షి గాధి క్షత్రియుడు కనుక నతనికి క్షాత్రతేజము గలిగిన కుమారుడు కావలెను. తమకేమో బ్రహ్మ తేజముగల కుమారడు కావలెను. అని తలచి రెండు చెరువులను మంత్రించి సత్యవతికి ఆమె కొరకు ఆమె తల్లి కొరకు వేరువేరుగా నిచ్చెను కాని వారు పొరపడి తల్లి భక్షింపవలసిన చరువు సత్యవతి, ఆమె భక్షించవలసినది ఆమె తల్లి భక్షించిరి. అది తెలిసి ఋచీకుడు భార్యతో నీకు క్షత్రియకుమారుడు, మీతల్లికి బ్రాహ్మణుడైన కుమారుడు కలుగునని చెప్పెను. అదివిని సత్యవతి నేను క్షత్రియుడైన కుమారుని భరింప జాలను. కావున పొరపాటున క్షమించి యేవిధముగానైన దానిని మార్చుమని ప్రార్థించగా నామహర్షి అయిన క్షాత్రతేజము నీకుమారుని యందు కాక నీమనుమని యందు ప్రకాశించునని నియమము చేసెను. అనంతర మాతల్లి బిడ్డలిరువురు మగశిశువులను కనిరి. గాధి తనకుమారునకు విశ్వామిత్రుడని పేరు పెట్టుకొనగా ఋచీకుడు జమదగ్ని యని పేరు పెట్టుకొనెను. ఇటుల విశ్వామిత్ర జమదగ్నులు బ్రాహ్మణ క్షత్రియులయ్యు మామాయల్లుండ్రైరి. అంతేగాక విశ్వామిత్రుడు క్షత్రియ వంశమున బుట్టిన బ్రాహ్మణుడు. జమదగ్ని బ్రాహ్మణ వంశమున జనించిన క్షత్రియుడైరి.

ఈ జమదగ్ని కుమారుడే పరశురాముడు. అతని యందు క్షాత్రతేజము సంపూర్ణముగా ప్రకాశించెను. ఇతడు చిరంజీవులలో నొకడై కార్తవీర్యార్జునుని కుమారుడు తమ తండ్రిని చంపినందులకై క్షత్రియలోకముపై పగబూని యిరువది యొక మారు దండయాత్రలు చేసి లోకమునందలి రాజులందరిని సంహరించెను.

అపుడెందరో రాజులు రాజలాంఛనములు విడిచి మారు రూపములలో దాది ప్రాణములు కాపాడుకొనిరి. అగ్గివారిలో మూలకు డొకడు. అతడు స్త్రీ వేషమున పరశురాముని బారి నుండి తనను రక్షించుకొనెను. అనంతర కాలమున సూర్య వంశమున కతడే మూల పురుషుడయ్యెను.

పరశురాముడు మహేంద్ర పర్వతమున శివుని గురించి తపము చేసి యతనిచే నస్త్రవిద్యను పొందెను. అనంతరము తాను ఇరువదొక మారు దండయాత్రలు చేసి రాజులందరిని చెఱబట్టుకొని వెళ్లి శమంత పంచకమను చోట నైదు మడుగులు జేసి రాజుల నచట వధించి వారి రక్తముతో నామడు గులు నింపు వానియందు స్నానము చేసి ఆరక్తమున పితృతర్పణము చేసి శాంతించి యాపిమ్మట తాను జయించిన భూమినంతటిని కశ్యపుడను బ్రాహ్మణునకు దానము జేసి మహేంద్ర పర్వతము పైకి వెళ్లి తపము చేసికొను చుండ శ్రీరాముడు జనక చక్రవర్తులు పూజించు శివుని చాపమును విరిచెనని తెలిసెను. అదివిని తమగురువైన శివుని చాపమును విరిచి నందులకు శ్రీరామునిపై కోపించి యతడు సీతాదేవిని వివాహమాడి యయోధ్యకు వచ్చుచుండగా దారిలో నతని నెదుర్కొని పరాజితుడయ్యెను.

పరశురాముడు గూడ విష్ణ్వవ తారములలో నొకడే యైనను అతని దావేశావతారమని శ్రీరామునిది పూర్ణావతార మని యందు చేతనే శ్రీరామునితో పరశురాముడు పరాజితుడయ్యెనని పురాణములు చెప్పును.

-: శ్రీరామాదుల వనగమనము :-

14.సీ॥ ~~ఈగాc~~ ప్రోలి కేఁగిన దశరథుఁ డర్మిలి
రాముఁ బట్టముగట్టు రహి యొఱింగి
కైక మానుషఁ దండ్రి కట్టడ చేసినఁ
దోన తమ్ముఁడు నాలుఁ దోడురాఁగఁ

దనవీడు వెడలి కొందలముతో వెనువెంటఁ
జనుదెంచు వారల ననిచి పిదపఁ
దొడవు లొల్లక మేటి జడదారి చందము
ల్సవరించుకొని గంగ యవలికరిగి
తే ॥ గుహుని మన్నించి యమ్మేటి కోర్కు లొసఁగి
నిలుపుచును జిత్రకూటపు మలకు నేఁగి
కాంచి తప సులు తమ్మను గారవింపఁ
నచట నొక కొన్ని నాళ్లుండె నంత నిచట - 14

టీక :- తగన్ = ఒప్పునట్లుగా, ప్రోలికేగినన్ = తమ పట్టణమునకు వెళ్ళగా దశరథుడు, ఆర్మిలిన్ = ప్రేమతో, రాముపట్టము గట్టు = శ్రీరామునికి పట్టాభిషేకము చేయు, రహి = విధానము, ఎఱింగి = తెలిసి/కైక = కైకేయి, మానుపన్ = దానిని మాననట్లు చేయుగా, తండ్రి = దశరథుడు కట్టడి చేసినన్ = నియమించగా, తోనన్ = వెంట, తమ్ముడు = లక్ష్మణుడు, ఆటన్ = భార్య, తోడురాగన్ = వెంట రాగా, తన వీడు వెడలి = తమపట్టణముదాటి, కొందలముతో = దుఃఖముతో, వెనువెంట జనుదెంచు = తనవెనుక వచ్చు, వారలననిచి = పౌరులైన వారిని బంపి, పిదపన్ = ఆపిమ్మట, తొడవులొల్లకన్ = భూషణములు అక్కర లేదని, మేటి = గొప్పనైన, జడదారి చందముల్ = మునివేషములు, సవరించుకొని = ధరించి, గంగయవలికరిగి = గంగయొక్క ఆవలి దరికి చేరి, గుహుని మన్నించి = గుహుని గౌరవించి, అమ్మేటి = ఆగొప్పవాని యొక్క, కోర్కులొసగి = కోరికలిచ్చి, నిలుపుచును = అతనిని వెంటరావద్దని యక్కడనే నిలిపి, చిత్రకూటపు మలకున్ = చిత్ర కూట మను కొండకు ఏగి = వెళ్ళి, తపసులు = అచటి ఋషులు, కాంచి = చూచి, తమ్మను గారవింపన్ = తమను గౌరవింపగా, అచటన్ = ఒకకొన్ని నాళ్ళు ఒకకొన్ని దినములు, ఉండెన్, అంతన్ = అపుడు, ఇచట -

తా :- పరశురాముని గర్వభంగము చేసి తమ పట్టణమున కేగగా దశరథుడు ప్రేమతో శ్రీరామునికి పట్టాభిషేకము తలపెట్ట కైకేయి దానిని మానిపించెను. అపుడు తండ్రి యాజ్ఞతో నతడు తమ్ముడు మరియు భార్య వెంటరాగా తమ పట్టణమును దాటి, విచారముతో తమ వెంట వచ్చు పౌరులను పట్టణమునకు పంపి పిదప ఆభరణములు దీసి మునుల వేషములు వేసికొని గంగను దాటి గుహుని గౌరవించి అతని కోరిక తీర్చి, తమవెంట రావలదని యచటనే నిలిపి చిత్రకూట పర్వతమున కేగి యచటి

ఋషులు తమను జూచి గౌరవింపగా నచట కొన్నిదినము లుండగా నపుడిచట - అనగా అయోధ్యలో -

విశే :- గుహుడు శృంగి బేరిపుర నివాసియైన యొక నిషాద ప్రభువు, దండకారణ్యమునకు వెళ్లునపుడు శ్రీరాముని తన పడవలో గంగను దాటించెను.

శృంగిబేరమనగా నల్లము. శృంగిబేరిపురమనగా నల్లము పండు పొలములుగల దేశమని యర్థము. అచటి నిషాదులు శృంగిబేరము లనగా జింకలబొమ్మలు కనుక వానిని చేసిపెట్టి అవి చూచి భ్రమసి జతకట్టుటకు వచ్చు లేళ్లను వేటాడుచుందురట.

శృంగిబేరి నిపుడు ''సింగా'' యందురు. ఇది యొక క్షేత్రముగా నున్నది.

చిత్రకూటము గూడ నిపుడొక దర్శనీయమైన యాత్రాస్థలము.

15మః:- కొడుకుం బాసిన వంతఁ దండ్రి తెగినం, గోర్కిన్ వసిష్ఠుండు వె
న్వడి రాఁగాఁ జని, చిత్రకూటమున నన్నంగాంచి, రమ్మంచు వే
యడుగుం దమ్ముల మీఁద వ్రాలు భరతున్ హాళిం గడు న్రాముఁడ
ప్పుడొడం బాటుగఁ జెప్పి, వీటి కతనిం బుత్తెంచి, యా పిమ్మటన్- 15

టీక :- కొడుకుంబాసిన = కొడుకును తొలగినటువంటి, వంతన్ = దుఃఖముతో, తండ్రి తెగినన్ = తండ్రిమరణింపగా, కోర్కిన్ = కోరికతో అనగా తనప్రార్థనతో, వశిష్ఠుండువెన్వడి రాగాన్ = వెంటవచ్చు చుండగా, చని = వెళ్ళి, చిత్రకూటమునన్, అన్నంగాంచి = అన్నగారిని చూచి, రమ్మంచు = పట్టణమునకు రావలసిన దని, వే = వేగముగా, అడుగుం దమ్ముల మీదన్ = పాదపద్మములపై, వ్రాలు భరతున్ = పడెడి భరతుని, హాళింగడున్ = మిక్కిలి ప్రేమతో రాముడప్పుడు = అపుడు రాముడు, ఒడం బాటుగ జెప్పి = ఒప్పు కొనునట్లు సమాధానము చెప్పి, వీటికతనిన్ బుత్తెంచి = పట్టణమున కతనిని బంపి, ఆపిమ్మటన్ = ఆపిదప.

తా :- కుమారుని ఎడబాసినటువంటి దుఃఖముతో తండ్రియైన దశరథుడు మరణింపగా, భరతుడు వశిష్ఠుని ప్రార్థించి వెంటగొని చిత్రకూటమునకు వెళ్ళి యన్నగారిని దర్శించి పట్టణమునకు రావలసినదని పాదములపై బడగా శ్రీరాముడు మిక్కిలి ప్రేమతో భరతునికి ఒడంబడిక మాటలు చెప్పి పట్టణమునకు బంపి యాపిమ్మట-

16.కII దండకమును కానకుఁ జని
యుండఁగ రావణుని చెలియ లొగిఁ గలయిక్కై
దండకు రాలక్ష్మణుఁ డది
మండాడఁగ ముక్కు సెవుల మనుకువ మాన్చెన్ - 16

టీక :- దండకమను = దండకారణ్యమను, కానకుజని = అడవికివెళ్ళి, యుండగ౯ = అచట నివసించగా, రావణుని చెలియలు = రావణుని చెల్లెలగు, శూర్పనఖ, ఒగి౯ = తగినట్లుగా, కలయిక్కై = అతని పొందుగోరి, దండకురా౯ = సమీపించగా, లక్ష్మణుడు, అది = ఆశూర్పనఖ, మండాడగ౯ = దీనముగా ప్రార్థించగా, ముక్కు చెవుల మనకువ మాన్చె౯ = ముక్కు చెవులు లేకుండచేసెను.

తా :- దండకారణ్యమను యడవికి వెళ్లి యచట నివసించగా రావణుని చెల్లెలగు శూర్పణఖ వచ్చి శ్రీరాముని పొందు గోరి సమీపించగా నామె దీనముగా ప్రార్థించు చున్నను వినక లక్ష్మణుడామె ముక్కు చెవులు కోసెను.

విశే :- దండకారణ్య వృత్తాంతము -

దండుడు ఇక్ష్వాకు చక్రవర్తియొక్క కడగొట్టు కుమారుడు. అతడు మిక్కిలి దుర్మార్గుడై ఆటలలో తోడిబాలురను హింసించి చంపుచుండగా తండ్రివాని దుర్మార్గమును సహించక పట్టణమునుండి వెడల గొట్టెను. అపుడు వాడు వింధ్య పర్వత పాదమునకు వెళ్లి యచట ''మధుమంతమను'' రాజ్యమునేర్పరచుకొని యాటవిక ప్రజలను పాలించుచు నొక నాడు వేటకు వెడలి శుక్రుని యాశ్రమ ప్రాంతమునకు జని యచట నతని కూతురు ''అరజ'' యొక్కతెయే నుండగా జూచి యామెతో బలవంతముగా భోగించి వెళ్లెను.

అంతనామె కార్యార్థమై వెళ్లిన తండ్రి రాగా దండుడు తనపై జరిపిన యత్యాచారమును చెప్పి దుఃఖించెను. అంతనదివిని శుక్రుడు క్రోధుడై దండుని రాజ్యము శిలాపాంసు వర్షము గురిసి నిర్మానుష్యమగుగాక యని కఠినముగా శపించెను. దానితో మూడు దినములాపట్టణముపై రాళ్లవాన దుమ్ము కురిసి ప్రజలందరు నశించి యది యరణ్యముగా మారి యతని పేర దండ కారణ్యమను పేరును పొందెను.

శూర్పణఖ వృత్తాంతము

రామలక్ష్మణులచట నుండగనే వారికడకు శూర్పణఖ వచ్చెను. సుమాలికి పాక - పుష్పోత్కట - కైకసి- కుంభీన సయను నలుగురు కూతులుండిరని మొదట చెప్పితిని

వారిలో సుమాలి కైకసిని గొని వచ్చి విశ్రవో బ్రహ్మ కర్పించెను. అది చూచి పిమ్మట పాక - పుష్పోత్కట గూడ విశ్రవో బ్రహ్మనే వరించిరి. వారిలో పాకకు ఖరుడు, దూషణుడు అనుకుమారులు శూర్పణఖ యను కూతురు కలిగిరి. పుష్పోత్కటకు మహోదరుడు, మహాపార్శ్వుడు అనువారు కలిగిరి.

కుంభీనసను మధువనువాడు బలవంతముగా నెత్తుకొని వెళ్లి వివాహమాడగా నామెకు లవణాసురుడు జనించెను.

సుమాలి శూర్పణఖను విద్యుజ్జిహ్వుడను దానవునకిచ్చి వివాహము చేసెను. వారికి జంబుమాలియను కుమారుడు కలిగెను.

విద్యుజ్జిహ్వుడు యుద్ధరంగమున శత్రువులను తన నాలుకతో నాకి చంపుచుండెను. కాలకేయుల పైకి యుద్ధమునకు వెళ్లి నపుడు రావణుడే యతనిని పొరపాటున పొడిచి చంపెను. అంత శూర్పణఖ యతనిని బట్టుకొని యిప్పుడిక నాగతియేమని విలపింప దండకారణ్యమునకు ఖరదూషణుల దగ్గరకు పంపి వారితో నామెకేలోటు లేకుండ జూడ మని చెప్పెను.

రామలక్ష్మణులచటికి వచ్చునాటికి శూర్పణఖ కుమారుడొక చోట వెదురు పొదలలో తపము చేసి కొను చుండెను. లక్ష్మణుడొకనాడా పొదలు నరుకుటకు రాగా పొరపాటున నతని కత్తి దగిలి జంబుమాలి మరణించెను. అది తెలిసి శూర్పణఖ ఆగ్రహోదగ్రురాలై వారిని మ్రింగుటకు వచ్చి శ్రీరాముని సౌందర్యమును చూచి తన కుమారుని విషయము మరచి యతనిని కామించెను. అంత లక్ష్మణుడామె ముక్కు చెవులను కోసి విరూపను చేసెను.

-: మాయలేడి వచ్చుట :-

17.ఉ॥ గాసిలు దాని సూఁడు నకుఁగాఁ ద్రిశరుండు ఖరుండు దూషణుం
డీసున రాఁగ, వారి నని నేపఱఁ ద్రుంచిన, రావణుండు దా
జేసి, యనుంగు రక్కసుల జేనిఁ బసిండి మెకంబు రూపుగాఁ
జేసి యలంపఁ బంపుటయు, సీత కనుంగొని దానిఁ దెమ్మనన్ - 17

టీక :- గాసిలు = బాధపడుచున్న, దాని - ఆ శూర్పణఖ యొక్క, సూడునకుగాఁ = పగకుగాను, త్రిశిరుండు = ఖరుండు, దూషణుండు అను ముగ్గురు, ఈసున రాఁగ = ఈర్ష్యతో శ్రీరాముని పైకి రాగా, అనిఁ = యుద్ధమున, ఏపఱఁ =

విజృంభించి, త్రుంచి నన్ = చంపగా, రావణుండు, తా = తాను, జేసి = రేగిపోయి, అనుంగు రక్కసుల జేని = తనకు ప్రియమైన రాక్షసరాజగు మారీచుని, పసిండి మెకంబు రూపుగా జేసి = బంగారు లేడిగా జేసి, అలంపన్ = బాధించుటకు, పంపుటయు = పంపగా, సీత = సీతా దేవి, కనుంగొని = చూచి, దాని దెమ్మనన్ = దానినితెమ్మనగా -

తా :- అటుల ముక్కు చెవులు కోయగా బాధపడుచున్న శూర్పణఖను చూచి యాపగ దీర్చుకొనుటకై త్రిశిరుడు, ఖరుడు, దూషణుడు అనువారు రాగా రామలక్ష్మణులు విజృంభించి యుద్ధమున వారిని జంపగా, రావణుడు రెచ్చిపోయి, తనకు ప్రియమైన రాక్షస రాజగు మారీచుని బంగారు జింకను చేసి వారిని బాధించుటకు పంపగా దానిని చూచి సీత యది పట్టి తెమ్మనగా -

విశే :- ఖరదూషణులిద్దరు శూర్పణఖసోదరులు - త్రిశురుడు రావణుని కుమారుడు బంగారు జింకయైన మారీచుడు తాటక తనయుడు.

18.మః- తమ్ముని నాలిగావ నిడి దానిబడిం జని వేడ బంబుచె
య్దిమ్ములఁ గానలేక, యలయించుచు, బోవఁగ గిన్కతోడఁదా
నమ్మరి వోసి యేయుటయు నామెక మప్పుడు (దెళ్ళు చుండి 'యో
తమ్ముడ, లక్ష్మణా', యన నెదం దురపిల్లుచు సీతపంపినన్ - 18

టీక :- తమ్మునిన్, ఆలిగావనిడిన్ = భార్యను రక్షించుటకై యుంచి, దాని బడింజని = దానివెంటవెళ్ళి, వేడబంబు చెయ్దమ్ములన్ = మోసపు చేష్టలను, కానలేక = ఎరుగలేక, అలయించుచు బోవగ = అది యతనిని శ్రమపెట్టుచు వెళ్ళగా, కిన్కతోడన్ = కోపముతో, తానమ్మరివోసి = తాను (అమ్ము+ అరివోసి) బాణము నెక్కించి, ఏయుటయు= వేయగా, అమ్మెకమప్పుడు = (ఆ+ మెకము) అపుడు ఆమృగము, త్రెళ్ళు చుండి = మరణించు చుండి, ఓతమ్ముడా! లక్ష్మణాయనన్ = సీత, ఎదన్ దురపిల్లుచు = మనస్సున దుఃఖపడుచు, పంపినన్ = లక్ష్మణుని పంపగా-

తా :- అపుడు శ్రీరాముడు తమ్ముడైన లక్ష్మణుని భార్యకు రక్షణగా నుంచి దాని వెంబడి వెళ్ళి దాని మోసపు చేష్టల కనలేక, అది తనను శ్రమపెట్టుచు వెళ్ళుచుండగా బాణమెక్కుపెట్టి కొట్టెను. అపుడా మృగము బాణము తగిలి ఓ తమ్ముడా లక్ష్మణా! యని యరువగా నదివిని సీత మనస్సున తల్లడిల్లి లక్ష్మణుని పంపెను.

19.తే॥ ఒరులపని యేమి, జేజేల దొరలనైనఁ
బొడము కడిమిని గలనిలోఁ బొలియఁ జేయు
నన్నబలిమి యెఱింగియు, నతివ మాట
కులికి, లక్ష్మణుఁ డంతంత నొద్దికేఁగ - 19

టీక :- ఒరులపనియేమి = ఇతరుల పనియె ఎందులకు, జేజేల దొర లనైనన్ = ఇంద్రునియైనగాని, పొడము కడిమిని = తనకు కలిగిన శౌర్యముతో, కలనిలో = యుద్ధమున, పొలియజేయున్ = వధించును, చంపును, అటువంటి, అన్నబలిమి = అన్నగారి యొక్క బలమును, ఎఱింగియు = తెలిసియు, అతివమాట కులికి = స్త్రీయైన ఆమె మాటకు జడిసి, లక్ష్మణుడు, అంతంతన్ = అంతటన్, ఒద్దికేగన్ = అన్నదగ్గరకు వెళ్లగా-

తా :- వారువీరని యితరుల మాటనేయేమి, ఇంద్రునినైన యుద్ధరంగమున చంపగల యన్నగారి బలము తెలిసియుండియు లక్ష్మణుడామె మాటకు జడిసి యన్న గారి దగ్గరకేగెను.

20.క॥ అతనిఁ గనుఁగొని రాముం
'డో తమ్ముఁడ, నేలచూలి నొక్కతె విడి యి
ట్లే తెంచురె?' యని దూఱుచు
నాతెగిన మొగంబుఁ గొనుచు నరుదేనంతన్ - 20

టీక :- అతని గనుగొని = అతనిని చూచి, రాముండు, ఓతమ్ముడ, నేల చూలి నొక్కతెన్ = భూజాతను ఒక్కతినే, ఇడి = విడిచి, ఇట్లే తెంతురె = ఇటుల వత్తురా! అని దూఱుచున్ = అనినిందించుచు, ఆతెగిన మొగంబు = ఆయొక్క మరణించిన రక్కసుని తలను, కొనుచు=తీసికొని, అరుదేన్ = రాగా, అంతన్ = అంతటితో -

తా :- అటుల వచ్చిన తమ్ముని చూచి రాముడు, ఓతమ్ముడా! సీతను ఒక్కతినే విడిచి ఇటుల వత్తురాయని నిందించి, అక్కడ వింటితో తెగిపడిన రక్కసుని తలతీసికుని రాగా నంతట -

-: రావణుడు సీతను గొంపోవుట :-

21.సీ॥ జడదారియై వచ్చి తడయక రావణుం
డతివఁ గొం పోయిన, నాకుటింటఁ
గొమ్మఁ గానక కానఁ ద్రిమ్మరి రాముండు
లక్ష్మణుం డడవి నోలముల వెదకి,
పనవఁగా సీతను గొనిపోవు రక్కసుఁ
గని పోరి మడిసిన కడిఁది పులుఁగు
నకుఁ దగునట్టి చందము దీర్చి, యరుగుచుఁ
బంప చేరువ గాలిపట్టిఁ గాంచి,
తే॥ యతఁడు తెలుపంగ సుగ్రీవు నలరఁ జేసి
తమ్ముఁ గొలిపించుకొని వానిదాయయైన
వాలిఁ దునుమాడి మఱి తన వాఁడ ననిన
యంగదుని నిల్పి కొన్నినాళ్లచట నుండి - 21

టీక :- జడదారియైవచ్చి = మునియై వచ్చి, తడయకన్ = ఏమాత్రము ఆలస్యము చేయక, రావణుండు, అతివగొంపోయినన్ = ఆమెను తీసికొని పోగా, ఆకుటింటన్ = పర్ణశాలలో, కొమ్మగానకన్ = సీతను చూడలేక, కానద్రిమ్మరి = అడవి యంతయు తిరిగి, రాముండు, లక్ష్మణుండు, అడవిన్ = అడవిలో ఓలములన్ = చాటుమాటులను, వెదకి, పనవగా =కేకలు వేయగా, సీతను గొనిపోవు = సీతను తీసికొని వెళ్ళు, రక్కసి గని = రాక్షసునిచూచి, పోరి = అతనితో యుద్ధముచేసి, మడిసిన = చచ్చినట్టి, కడిది పులుగునకు = గొప్పనైన పక్షికి అనగా జటాయువునకు, తగునట్టి చందము దీర్చి = చేయదగిన విధులాచరించి, యరుగుచు వెళ్ళుచు, పంప చేరువన్ = పంపానది సమీపమున, గాలిపట్టిగాంచి = వాయు సూనుడైన హనుమంతుని చూచి, అతడు తెలుపంగ = ఆహనుమంతుడు విశదీకరించగా, సుగ్రీవునలరజేసి = సుగ్రీవుని సంతోషపెట్టి, తమ్ముగొలుపించుకొని = తమను సేవింప జేసికొని,వాని దాయయైన = అతని జ్ఞాతియైన, వాలిదునుమాడి = వాలిని చంపి, మఱి, తనవాడనినన్ = నేను నీవాడననగా, అంగదుని నిల్పి = అంగదుని యచట తండ్రిబదులుగా నిలిపి, కొన్ని నాళ్లచట నుండి = కొన్ని దినము లక్కడ యుండి-

తా :- రావణుడు మునియై వచ్చి ఆలస్యము చేయకుండ సీతను గొనివెళ్లగా రామలక్ష్మణులు వచ్చి, పర్ణశాలలో సీతను గానక ఆయడవిలో చాటుమాటులన్ని వెదకి, సీతను పిలుచుచు, కేకలు వేయుచు, సీతను గొనిపోవు రక్కసుని చూచి యతనితో యుద్ధము చేసి, మరణించిన జటాయువును గని, అతని కంత్యక్రియలు సలిపి, ముందుకు వెళ్ళుచు పంపాతీరమున హనుమంతుని గని యతడు తెలుపగా సుగ్రీవుని విషయమెరిగి యతని చెంతకు వెళ్లి అతనిని సంతసింప చేసి తమ సేవకుని చేసికొని అతని దాయాదియైన వాలిని చంపి నేనే నీవాడ ననగా అతని కుమారుడైన యంగదుని తండ్రిస్థానమున నిలిపి కొన్ని దినము లచట నుండి -

విశే :- జటాయువు

గరుత్మంతుని యన్నయైన అనూరుని కుమారుడు సంపాతి సోదరుడు. దశరథునకు పరమ మిత్రుడు. అతడు కౌసల్యా వివాహమున కేగుచు మార్గమధ్యమున నొకనదిలో కొట్టుకొనిపోగా దశరథుని ఈజటాయువే రక్షించెను. రావణుడు. సీతనెత్తుకొని పోవుచుండగా నామె నేను శ్రీరాముని భార్యను, దశరథుని కోడలను. నన్ను రక్షింపుడని కేకలు వేయు చుండ దశరథుడను పేరు విని జటాయువు రావణునితో తలపడి మరణించెను.

హనుమంతుడు -

ఇతడు అంజనాదేవి కుమారుడు. అంజన కుంజరుడను వానర వంశీయుని కూతురు. అతడామెను కేసరియను వానరు నికిచ్చి వివాహము చేసెను. కేసరి ప్రభాస తీర్థమున నివసించు చుండెను. అచట శంఖము శబలము అనురెండు మదించిన ఏనుగులు సంచరించుచు మునులను బాధించు చుండగా కేసరి వానిని తన భుజబలమున గ్రుద్ది చంపెను. అది చూచి భరద్వాజ ఋషి యతనిని మెచ్చుకొని కేసరియని బిరుదిచ్చెను. కాని యితని నిజ నామమేదియో తెలియదు.

అతడంజనాదేవిని వివాహమైన పిమ్మట నొకనాడామె వనమున విహరించు చుండ వాయుదేవుడామె సౌందర్యమును చూచి మోహించి యామెకు పాతివ్రత్య భంగము కలుగకుండ వరమిచ్చి యొడంబరచి యామెతో కూడెను. అంత అంజనాదేవికి చూలునిలిచి వాయుదేవుని యొక్క యంశచే ఆంజనేయుడు జనించెను. అందుచేత హనుమంతునికి కేసరిభార్యయందు జనించినను వాయుసూనుడనియే యెక్కువ వాడుక నిలిచినది.

వాలిసుగ్రీవులు -

ఋక్షవిరజుడను వాడు బ్రహ్మకుమారుడైన ఆదిమ వానరుడు. అతడు కాంచనాద్రి యందు నివసించు చుండెను. ఒకనాడు దాని తూర్పువైపున గల శిఖరము చెంతనున్న యొక సరస్సున తన ప్రతిబింబమును గని యతడు వేరొక వానరమని భ్రమసి యందు దిగి బయటికి వచ్చు వరకతడు స్త్రీయయ్యెను.

అది శరవణము ఆసరస్సునకు అందెవరు ప్రవేశించినను స్త్రీలగునట్లు పార్వతీ దేవి శాపముండెను. అది యెరుగక ఋక్షవిరజుడందు ప్రవేశించి స్త్రీయై ఆకాననమున సంచరించు చుండ నాదారిని యింద్రుడు సూర్యుడు వెళ్లుచు నామెను చూచి కామించిరి. అపుడతని కింద్రుని వలన వాలి, సూర్యుని వలన సుగ్రీవుడు కలిగిరి. వారు కలిగిన పిమ్మట నతనికా సరోవరమున దిగిన దోషము పరిహారమైపోయి యథారూపము కలిగెను.

వాలి సుగ్రీవులు పెద్దవారై కిష్కింధను తమరాజ్యముగా చేసికొనిరి. వాలి మిక్కిలి బలశాలి. యతనితో నెవరు పోరలేకుండిరి.

ఆకాలమున మాయావి కుమారుడైన దుందుభి యను రక్కసుడు బలగర్వితుడై హిమవంతుని దగ్గరకు చేరి తనతో యుద్ధమునకు రమ్మని పిలువ నతడు నీతో పోరగలవాడు వాలి యొక్కడే నీవతని దగ్గరకు వెళ్లుమని చెప్పెను. అంత దుందుభి వచ్చి వాలిని యుద్ధమునకు బిలువ నతడు వానిని వధించి కళేబరము నెగురవేయగా నదివెళ్లి ఋష్యమూక పర్వతముపై తపము చేసికొను మతంగముని యాశ్రమమున బడెను. అపుడది చూచి యాముని ఆకళేబరమునచట బడవైచిన వాడిక్కడికి వచ్చిన తలపగిలి చచ్చునని శపించెను.

దుందుభి నటుల చంపగా నతని కుమారుడు రెండవ మాయావి తండ్రిని చంపిన కోపమున వాలిపైకి యుద్ధమునకు వచ్చెను. అపుడు వాలి వానిని తరుమగా తనడు పరుగెత్తి యొక గుహలో దూరెను. వాని వెంట వాలిగూడ పరుగెత్తెను. అపుడు వారివెనుక సుగ్రీవుడు వాలి భార్య తారగూడ వెళ్లిరి.

ఆగుహలో వాలి మాయావిని వధించగా నతని రక్తము గుహముఖము వరకు పారుచు వచ్చెను. అది చూచి సుగ్రీవుడు ఆరక్కసుడే తమ యన్నను చంపియుండునని భయపడి ఆగుహాముఖమునకు పెద్దరాతిబండ నడ్డము త్రోసి యిల్లు చేరెను.

అంత వాలి గుహాముఖము మూసియుండుట చూసి సుగ్రీవుడు కావలెననియే తననటులే లోపల బంధింప వలననియే యటుల చేసెనని యారాతి త్రోసికొని వెలుపలికి

వచ్చి సుగ్రీవునిపై పగబట్టి యతనిని రాజ్యము నుండి వెడల గొట్టెను. అపుడతడు రక్షణకై తమ యన్న రాజాలడని తెలిసి ఋష్యమూక పర్వతముపైకి వెళ్లి నివసించగా నతడక్కడ నుండగనే హనుమంతుడు రామ సుగ్రీవులకు సఖ్య మొడగూర్చెను.

అపుడు శ్రీరాముడు సుగ్రీవుని వృత్తాంతము విని న్యాయము నాలోచించి దోషియైన వాలిని వధించి సుగ్రీవుని మరల వానర రాజ్యమున నిలిపెను.

హనుమంతుడు సీతను వెదకబోవుట

22. ఆ॥ నేలచూలి వెదక గాలి బిడ్డఁడు లోను
గాను గలిగి నట్టి కడిఁది కొమ్మ
మెకపు గముల ననుప, మించి యందటిలోన
ననుమఁ డుప్పు కడలి యవలి కరిగె - 22

టీక :- నేలచూలి వెదకఁ = భూజాతయైన సీతను వెదుకుటకు, గాలిచూలి = హనుమంతుడు, లోనుగాను గలిగినట్టి = మొదలైన, కడిది = బలముగల, కొమ్మ మెకపుగములఁ = శాఖామృగసమూహములఁ, అనగా వానరులను, అనుపఁ = పంపగా, మించి యందటిలోనఁ = అందరిలోపల మించి, అనుమడు = ఆంజనేయుడు, ఉప్పుకడలి = లవణ సముద్రము, అవలికరిగె = ఆవలి తీరము చేరెను.

తా :- సీతను వెదకుటకై హనుమంతుడు మొదలైన బలవంతులైన వానరులను పంపగా, వారందరిలో బలవంతుడైన హనుమంతుడు సముద్రమావలి తీరము చేరెను.

23. ఆ॥ సీతఁ గాంచి యల్లఁ జేరి యారావేలు
పానవాలు గాఁగ ననిపినట్టి
యుంగరం బొసంగి యువిద నెమ్మదిలోని
వగపు కొంత కొంత నొగులఁ జేసి - 23

టీక :- సీతగాంచి = సీతనుచూచి, అల్లజేరి = మెల్లగా నామెనుచేరి, ఆరావేలుపు = ఆరాజేంద్రుడైన రాముడు, ఆన వాలుగా ననిపి నట్టి = గుర్తుగా పంపినట్టి, ఉంగరం బొసంగి= అంగులీయక మిచ్చి, ఉవిద= ఆసీత యొక్క, నెమ్మది లోని (నెఱ+ మది) = నిండు మనస్సులోని, వగపు కొంతఁ = కొంతదుఃఖము, ఒగులజేసి = తొలగించి,

తా :- సీతను చూచి మెల్లగా సమీపించి శ్రీరాముడు గుర్తుగా పంపిన యుంగర మామెకిచ్చి మనస్సులో నిండుకొనిన దుఃఖమును కొంత తొలగించి -

24.వ:- అట్లు రాముడంపిన యానవాలిచ్చి, యచ్చెలువం గనిన యుబ్బునం
గొబ్బునం బొంగి సింగారపుఁ దోట లోనుగాఁ దోఁపులు పెకలించి,
కాపులున్న రక్కసుల పెక్కసంబుగా నొక్కుమ్మడి నక్షుడు మొదలుగాఁ
బలువురఁ బొలసు మే పరుల జముని నెలవున కనిచి, పెనఁకువఁ
బట్టువడ బెట్టు వేడుక పడు గాడుపుఁ బట్టి మీఁద రాకాసి మొనలు
గనలి - 24

టీక :- అట్లు = ఆవిధముగా, రాముడంపిన యానవాలిచ్చి = శ్రీరాముడు పంపిన గుర్తు నిచ్చి, అచ్చెలువం గనిన (ఆ+చెలువ) ఆమెను చూచిన, ఉబ్బునం గొబ్బునం బొంగి =సంతోషమున మిక్కిలి విజృంభించి, సింగారపుందోట = శృంగారవనము, లోనుగా = మొదలైన, తోపులు పెకలించి = తోటలు పెరికి, కాపులున్న రక్కసుల = వానిని రక్షించుచున్న రాక్షసులను, పెక్కసంబుగా = చులకనగా, నొక్కుమ్మడి = ఒక్కపెట్టున, నక్షుడు మొదలుగా = ఆయక్ష కుమారుడు మొదలైన, పలువురఁ = అనేకుల, పొలసు మేపరులఁ = రాక్షసులను, జముని నెలవున కనిచి = యమసదనమునకు బంపి, పెనకువఁ = యుద్ధమున. క॥ పెనకువజగడము ... ... యుద్ధం, బునకుబేళ్లు = ఆం.సం.మా. 48; - పట్టువడఁ = చిక్కగా, బెట్టువెడుకఁ పడు = మిక్కిలి సంతోషపడు, గాడుపు పట్టి మీదఁ = ఆవాయుసూనునిపై, రాకాసి మొనలు = రాక్షసైన్యము, కనలి = కోపించి.

తా :- ఆవిధముగా శ్రీరాముడు పంపిన యానవాలిచ్చి యామెను చూచిన సంతోషమున పొంగి రావణుని యొక్క శృంగార వనము మొదలైన తోటలు పెరికి వానికి కావలియున్న రక్కసులను అక్షయ కుమారడు మొదలైన వారిననేకులను చులకనగా చంపి పిమ్మట వారికి యుద్ధమున పట్టుపడగా రాక్షససైన్యమా యాంజనేయుని పై కోపించి-

-: లంకాదహనము :-

25.క॥ పట్టికొని కట్టి రావణు
కట్టెదుటను బెట్టి, తోఁక గ్రందుగఁ గోకల్
చుట్టించి యింగలంబున
ముట్టించిన, ననుమఁ డలిగి మొగ మిగురింపన్ - 25

టీక :- పట్టుకొని, కట్టి = త్రాళ్ళతో కట్టివేసి, రావణు = రావణునియొక్క కట్టెదుటన బెట్టి = (కడు+ ఎదురు) పూర్తిగా ఎట్ట ఎదురుగా నిలిపి, తోకన్ = అతని వాలమునకు, క్రందుగన్ = మిక్కిలిగా, కోకల్ చుట్టించి = వస్త్రములు చుట్టించి, ఇంగలంబునన్ = నిప్పున, ముట్టించిన, అనుమడలిగి = ఆంజనేయుడు కోపించి,మొగమిగు రింపన్ = ముఖము ఎర్రబడగా -

తా :- వారతనిని పట్టుకొని రావణుని యొక్క ఎదుటనిలిపి, యతని వాలమునకు దట్టముగా బట్టలు చుట్టి నిప్పు ముట్టించగా నాంజనేయుడు కోపించి ముఖ మెర్రబడగా-

26.క॥ ఉలికి పడి యతని వీటం
గలతావుల నెల్లఁ గలయఁగాఁ ద్రిమ్మరి, కో
వెలచాయఁ జేసి, మిక్కిలి
యలరుచుఁ బలుమాఱుఁ ద్రుళ్లె నాడుచుగినుకన్ - 26

టీక :- ఉలికిపడి = త్రుళ్ళిపడి, అతనివీటన్ = అతని పట్టణమున కలతావుల నెల్లన్ = ఉన్నస్థలము లన్నిటిని, కలయగా ద్రిమ్మరి = కలియునట్లుగా తిరిగి, కోవెల చాయజేసి = కోకిలవలె నల్లగా జేసి యనగా వానినన్నిటిని బొగ్గుగాజేసి, మిక్కిలి యలరుచు = మిగుల సంతసించుచు, ఆడుచు, కినుకన్ = కోపమున, పలుమారు - అనేక పర్యాయములు త్రుళ్ళిపడెను.

తా :- హనుమంతుడు త్రుల్లిపడి యాపట్టణమున గల స్థలము లన్ని కలయ దిరిగి వానిని బొగ్గుగా జేసి సంతోషమున నాడుచు, కోపమున పలుమారు త్రుళ్లెను.

27.వ॥ ఇట్లు గావించి యక్కఱువలి పట్టి, క్రమ్మఱిచ యక్కొమ్మ
చేతి గురుతుగొని వచ్చి ముద్దియసుద్దియుద్ద విడి నెఱిఁ
గించినం, బొంగి రాముం డతనిం గౌఁగిటం జేర్చి గారవించి,
యుడుగర లిచ్చి, యనిచిన పిమ్మట వేఁడి వెలుంగు ననుం
గుఁ జూలిం బిలిపించి కడలి దాఁటి చనవలయుం జాటిం
పు మానవుడు నతం డట్ల చేసిన మఱునాఁడు - 27

టీక :- ఇట్లుకావించి = ఈవిధముగా జేసి, అక్కఱువలిపట్టి = ఆవాయు నందనుడు, క్రమ్మరి = తిరిగి, ఆకొమ్మచేత గురుతు = ఆసీతాదేవి తనచేత యిచ్చిన యానవాలు, కొనివచ్చి = తీసుకొని వచ్చి, ముద్దియ సుద్ది = ఆసీతాదేవి విషయము,

ఉద్ధవిడిఁ = విశదముగా, ఎఱింగించనఁ = తెలిపిన, పొంగి = సంతసించి, రాముండతనిఁ = శ్రీరాముడతనిని, కౌగిటం జేర్చి = కౌగిలించుకొని, గారవించి = గౌరవించి, ఉడుగర లిచ్చి = కానుకలిచ్చి, అనిచిన పిమ్మట = పంపిన తరువాత, వేడివెలుంగు నమ్మంగుం జూచిఁ = సూర్యుని కుమారుడైన సుగ్రీవుని పిలిపించి, కడలిదాటి చనవలయుఁ = సముద్రమును దాటి వెళ్ళవలయును, చాటింపు మనవుడు = చాటించుమని చెప్పిన పిదప, నతండట్లు చేసిన = అతడావిధముగా చేయగా, మరునాడు-

తా :- ఈవిధముగా చేసి యనగా లంకనుగాల్చి, హనుమంతుడు తిరిగి సీతాదేవి యొసంగిన యానవాలు గొనివచ్చి శ్రీరామునికిచ్చి యామె విషయము విశద పరుపగా నతడు సంతసించి ఆంజనేయుని కౌగలించుకొని గౌరవించి కానుకలిచ్చి పంపి పిదప సుగ్రీవుని బిలిపించి సముద్రమును దాటివెళ్ళవలెను..చాటింపు వేయింపు మన నతడా విధముగా చేయగా మరునాడు-

-: సముద్రునిపై శ్రీరాముని కోపము:-

28.ఉ॥ కొమ్మమెకంపు వెల్లువలు గొల్వఁగ వేగిర, మేఁగుదెంచి సం
ద్రమ్ము కడం దగ న్విడిసి, రావణు తమ్ముఁడు చేరవచ్చినఁ
రమ్మని వానికి న్మునుపె రక్కసి పట్ట మొసంగి, యేటిఱేఁ
డమ్మెయిఁ ద్రోవ యీమి మది నల్గుచు ఁదా విలుకేలఁ బూనుచున్-28

టీక :- కొమ్మ మెకంపు వెల్లువలు = శాఖామృగ సైన్యములు, కొల్వగఁ = సేవించగా, వేగిరమేగుదెంచి = వెంటనేవచ్చి, సంద్రమ్ముకడఁ = సముద్రము దగ్గర, తగన్విడిసి = తగినట్లుగా నిలిచి, రావణు తమ్ముడు చేర వచ్చినఁ = రావణుని యొక్క తమ్ముడైన విభీషణుడు, చేరవచ్చినఁ = సమీపించగా, రమ్మని వానికిన్, మునుపె = మొదలే, రక్కసి పట్టడు, అమ్మెయిఁ త్రోవయీమి = అపుడు దారి యీయిక పోగా, మదినల్గుచు = మనస్సులో కోపించుచు, తా = తాను, విలుకేల బూనుచుఁ = బాణమును చేత ధరించి-

తా :- వానరసైన్యములు సేవించు చుండగా శ్రీరాముడు వెంటనే వచ్చి సముద్రము దగ్గర విడిసి, రావణుని తమ్ముడగు విభీషణుడురాగా నాతనిని రమ్మని చేరదీసి మొదటనే లంకారాజ్యము పట్టముగట్టి, పిదప సముద్రుడు త్రోవ యీయక పోగా కోపించి బాణమును చేబూని-

29.క॥ కడునలిగి ''పుడిసి లించియు
బడలింపఁగ లేని కడవ పట్టియె మఱినా
బెడిదపుఁ దూ'' పనినారిం
దొడిగిన బలుచిలుకుఁ జూచి తొలఁకుటుడుగుచున్ - 29

టీక :- అపుడు శ్రీరాముడు, కడునలిగి = మిక్కిలి కోపించి, మఱి నాబెడిదపు = నాయొక్క భయంకరమైన తూపు = బాణము పుడిసిలించియు = పుక్కిటబట్టి, బడలింపగ లేని = ఇంకింప జాలని, కడవ పట్టియె = అగస్త్యుడా అని, నారిందొడిగిన = అల్లె తాటిని ఎక్కించి నపుడు, బలు = మిక్కిలి, చిలుకుంజూచి = మిక్కిలిగా వ్యాపించుటను చూచి, తొలకుటుడగుచుఁ = పొంగుట మానుచు.

తా :- అపుడు శ్రీరాముడు మిక్కిలిగా కోపించి నాయొక్క భయం కరమైన బాణమనగా పుక్కిటబట్టి ఇంకింపలేని యగస్త్యుడాయని చాపమునకు నారినెక్కించగా చూచి సముద్రుడు తొలకుట మానుచు.

30.కం॥ అప్పుడు చూచిన, నేమని
చెప్పుదు, నక్కడలి కాకిచిప్పలు విసుముం
గుప్పలు దెప్పలు తిప్పలు
కప్పలు చిక్కంగ దుమ్ముగ్రమ్ముచు నుండెన్ -30

టీక :- అప్పుడు, చూచినఁ, ఏమని చెప్పదు, అక్కడలి(ఆ+కడడి) ఆసముద్రము, కాకిచిప్పలు = కౌచిప్పలు, ఇసుమున్ = ఇసుక, కుప్పలు తెప్పలు = కుప్పతెప్పలుగా, తిప్పలు, కప్పలు చిక్కంగఁ = మిట్టలు మరియు వానిపై కప్పలుమాత్రమే మిగులుగా, ద్రుమ్మగ్రమ్ముచు నుండెన్ = దుమ్ముకమ్ముకొను చుండెను-

తా :- అపుడు చూచిన యేమని చెప్పవలె, ఆసముద్రము కాకిచిప్పలు, ఇసుక కుప్పతెప్పలుగా తేలి, తిప్పలు మరియు కప్పలతో దుమ్ముగ్రమ్ముచు కనిపించెను.
''అలం - స్వభావోక్తి''

31.ఆ॥ కడలి యప్పు డొడలుగైకొని చనుదెంచి
కడిఁది మానికములు కాను కిచ్చి
'తప్పు చేసినాఁడఁ దగఁ బ్రోవు' మనిరాము
నడుగుఁ దమ్ములందుఁ బదివడకుచు - 31

టీక :- కడలి = సముద్రము, అప్పుడొడలుగైకొని = శరీరముధరించి, చనుదెంచి = వచ్చి, కడిది = గొప్పనైన, మానికములు = రత్నములు, కానుకిచ్చి = కానుకలిడి, తప్పుచేసినాడఁ, తగఁ, ప్రోవుమని = కాపాడుమని, రాము = శ్రీరాముని యొక్క, అడుగు దమ్ములందు = పాదపద్మములందు, పడివడకుచు, -

తా :- అపుడు సముద్రుడు శరీరము ధరించి వచ్చి గొప్పనైన రత్నములు కానుకలిడి, ఓరామచంద్రా! తప్పుచేసినాను కాపాడుమని యతని పాదపద్మములపై వడకుచుపడి -

32.వ:- తొలిమినుకుల కడలనుం గానరాని యాతేనిం బలు తెఱం గులం
పొగడి - 32

టీక :- తొలిమినుకుల కడలనుం = ఉపనిషత్తులందును, కానరాని = కనిపించని, ఆతేనిఁ = ఆరాజును, పలుతెఱంగులఁ = అనేక విధములుగా, పొగడి.

తా :- అపుడు సముద్రుడు ఉపనిషన్మార్గమున గూడ కనిపించని యాశ్రీరాముని పలువిధములుగా పొగడి

33.ఉ॥ 'తెన్నునకేను గాదనను, దేవర, మీయస మిజ్జగంబునం
దెన్నటికిం దిరంబగుచు నెన్నిక కెక్కుచు నిల్చునట్లుగా,
దిన్నఁగఁ గట్టఁ గట్టఁ జనుదెమ్మ' నినఁ, సిరిగన్న తండ్రిఁదా
మన్ననజేసి పంపి తనమంద గనుంగొని రాముఁడిట్లనున్ - 33

టీక :- తెన్నునకేను కాదనను = దారికొరకు నేను కాదనను, దేవర = ఓస్వామీ! మీయసము = మీకీర్తి, ఇజ్జగంబునందు = ఈలోక మందు, ఎన్నటికిఁ = ఎప్పటికిని, తిరంబగుచు = శాశ్వతమగుచు, ఎన్నికకెక్కుచు = గణనకు వచ్చుచు, నిల్చునట్లుగా = నిలుచునట్లు, తిన్నగఁ = సూటిగా, కట్టకట్టజను = కట్టగట్టుట యొప్పును, అని, సిరిగన్నతండ్రిఁ = లక్ష్మిని గన్న తండ్రియైన సముద్రుని, చనుదెమ్మనినఁ = రమ్మనగా, తా = తాను, మన్ననసేసి = మన్నించి, పంపి, తన మందగనుంగొని = తనయొక్క గుంపును చూచి, రాముడిట్లనుఁ = రాముడీవిధముగా ననెను -

తా :- ఓరామా! దారికొరకు నేను కాదనను, కాని దేవరా! మీ కీర్తి ఈలోక మందు కలకాలము నిల్చునటుల నాపై సూటిగా కట్టగట్టవలయును, సామగ్రి తెమ్మనగా సముద్రుడు తాను అతనిని మన్నన చేసిపంపి శ్రీరాముడు తనగుంపును చూచి యిట్లనెను.

34.క॥ మనవాఁడై సంద్రుఁడు చె
ప్పిన మాటలు వింటి, రింకఁ బిఱుతివక మల
ల్గాని వచ్చి కట్టఁ గట్టుఁడుఁ
చన వలయుం గడలి దాఁటి నరుగున మనకున్ - 34

టీక :- మనవాడైన సంద్రుడు = సముద్రుడు మనవాడై, చెప్పిన మాటలువింటిరింకఁ = ఇంక చెప్పిన మాటలు వింటిరి, పిరుతివకఁ = వెనుదీయక, మలల్గాని వచ్చి = కొండలు తెచ్చి, కట్టగట్టుడు, సరగునఁ = వేగముగా, మనకుఁ = మనకు, కడలిదాటి = సముద్రునిదాటి చనవలయును -

తా :- సముద్రుడు మనవాడై చెప్పిన మాటలు విన్నారు గదా! ఇకకొండలు తెచ్చి కట్టగట్టుడు, మనముసముద్రుని దాటి వెళ్ళవలెను.

-: సేతుబంధనము :-

35.సీ॥ నెలతాల్పు దేవర యలిగినఁ బనిగాదు
వెండి గుబ్బలి దేక యుండ నిండు
నేల గ్రక్కునఁ గ్రుంగ నిల్వరా దేరికిఁ
దెగి యేడు గొండలుఁ దివక రండు
నలిరేయుఁ బగలును నడక గానఁగరాదు
పుట్టు గ్రుంకుడు గట్లు వెట్టి రండు
దేవళ్ల టెంకులఁ దివియుట గారాదు
లలిఁ బైఁడి మలఁ దేక నిలిపి రండు
తే॥ మఱియుఁ గడుపేరు గలిగిన మలల నరసి
యున్న తావులు గదలింప కునిచి రండు
మీర లంచును బిలిచి నేమించి పనుప
నరిగి కొమ్మ మొకంబులు నట్ల చేసి - 35

టీక :- నెల తాల్పుదేవర = చంద్రశేఖరుడు, అలిగిన పనిగాదు = కోపించిన యెడల మనపనిసాగదు, వెండి గుబ్బలిదేక = వెండికొండను తేక, ఉండనిండు/ నేల= భూమి, గ్రక్కునగ్రుంగఁ = మిక్కిలి గా కదలి క్రుంగగా, ఉండరాదేరికి = ఎవరికిని నిలువరాదు, కనుక తెగి= సాహసించి, ఏడుకొండలు = సప్తకుల పర్వతములు, తివక రండు = పెకిలించకుండ రండి/ నలిఁ = ఒప్పునట్లు, రేయుపగలును =

రాత్రిపగలును, నడకకానగరాదు = నడక కనిపించదు కావున, పట్టుక్రుంకుడుగట్లు = ఉదయాస్తమయ పర్వతములు, పెట్టిరండు = వాని నట్లే ఉంచిరండి/ దేవళ్ల టెంకులఁ = దేవతల యొక్క నివాసముల, తివియుట = తీయుట, కారాదు = చేయరాదు, అలిఁ = ఒప్పునట్లుగా, పైడిమలఁ = బంగరు గట్టును, తేకఁ = నిలిపి రండి,/ మరియు, కడుపేరుగలిగిన = మిక్కిలి పేరుగల, మలలఁ = అరసి = గట్లను విచారించి, ఉన్నతావులు = అదిగల స్థానములు, కదిలించక, ఉనిచిరండు = ఉంచిరండి, మీరలు - అంచు పిలిచి, నేమించి = నియమించి, పనుపఁ = పంపగా, కొమ్మమెకంబులు = వానరులు, అరిగి = వెళ్ళి, అట్లుచేసి = శ్రీరాముడు చెప్పినట్లుగా చేసి,

తా :- శివుడు కోపించిన మనపని గాదు కనుక రజితాద్రిని తేవద్దు. భూమి కదిలి క్రుంగిన మానవులు నిలువలేరు కనుక కులపర్వతములు పెకలించ వద్దు. రాత్రింబగళ్ళు తెలియరావుగాన ఉదయాస్తమయ పర్వతముల నుండనిండు. దేవతానివాసములను కదిలించరాదు కనుక బంగరు గట్టుతేవలదు. ఇంకను మిక్కిలి పేరుగల పర్వతములను కదలించక యున్న తావుననే యుంచి రండని ఏర్పరచి పంపగా వానరులు వెళ్లి యటుల జేసి -

విశే :- పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో పర్వత ప్రకరణమున శ్రీశైలమును వర్ణించుచు 7 ద్విపదలలో 52 పుణ్య పర్వతములను పేర్కొనెను.

అటులే నంది ఘంటల జంటగూడ వరాహ పురాణమున నొక పద్యమున పర్వతముల పేర్లు చెప్పిరి. చూ.వరా. అం.10-164

36. తే॥ వెదకి మఱి కల్గు మల లెల్ల గదియఁ జేర్చి
కట్టఁ గట్టినఁ గౌసల్యపట్టి మల్లు
వెల్లువల మున్ను నడిపించి వెనుకఁ గదలి
తమ్ముఁడును దాను మున్నీరు దాఁటి యవల - 36

టీక :- వెదకి, మఱిగల్గు మలలెల్లఁ = పైచెప్పినవి పోగా, మిగిలిన కొండలెల్లను, కదియ జేర్చి = ఒక చోటికి కూర్చి, కట్టగట్టిన = సముద్రముపై కట్టగట్టగా, కౌసల్యపట్టి = శ్రీరామ చంద్రుడు, మల్లువెల్లువలఁ = వానరసైన్యమును, మున్ను నడిపించి = మొదట దానిపై నుండి నడిపించి, తమ్ముడును, తాను, వెనుకగ దలి = ఆవెక బయలుదేరి, మున్నీరు దాటు = సముద్రమును దాటి, ఆవలఁ -

తా :- వానరులు పైన చెప్పిన కొండలుపోగా మిగిలిన వానిని వెదకి ఒకచోటికి చేర్చి సముద్రముపై కట్టగట్టగా, శ్రీరాముడు, మొదట వానర సైన్యమును దాటించి ఆవెనుక, తమ్ముడు తాను సముద్రమును దాటి, - అవతల

-: రామ రావణ యుద్ధము :-

37.వ:- వేలంబు విడియించి మిడిమేలంబుగా నాలంబునకు వెడలు
రక్కసి యొడయని బెడిదంబున కోర్చి యతని ప్రేకంబులైన మూఁకల
నేలం గూల్చి యంత - 37

టీక :- వేలంబు విడియంచి = శిబిరమును విడిది చేయించి, మిడిమేలంబుగాఁ = మిడిసి పాటుతో, ఆలంబునకు వెడలు = యుద్ధము నకు వెడలు, రక్కసి యొడ యని = రాక్షస రాజైన రావణుని, బెడిదంబున కోర్చి = (క్రౌర్యమున కోర్చి), అతని, ప్రేకంబులైన = అధికములైన, మూకలఁ = సైన్యమును, నేలంగూల్చి = వధించి, అంతఁ = ఆపిదప.

తా :- సముద్రమును దాటి ఆవల శిబిరమును విడియించి మిడిసి పాటుతో యుద్ధమునకు వచ్చు రావణుని యొక్క క్రౌర్యమును సహించి అధికమైన యతని సైన్యమును వధించి ఆపిదప -

38.సీ॥ అనిలోన మార్కొన్న యతికాయుఁ జంపించి
కడిమి విద్యుజ్జిహ్వుఁ బడఁగ వైచి
ఖడ్గరోముని మేను కడికండలుగఁ జేసి
పేర్మి విరూపాక్షుఁ బేరడంచి
ఇంద్రజిత్తును జము నింటికి నంపించి
కుంభకర్ణుని నేలఁ గూలనేసి
బలగంబుతోఁ గూడ బలియు రావణుఁ ద్రుంచి
మఱియు రక్కసుల నందరను నొంచి
తే॥ పిల్చి రాకాసి ప్రోలు విభీషణునకుఁ
దిరముగా నిచ్చి, సెకబాసఁ దేఱినట్టి
వాలుపేరంటి పూఁ బోడి నోలిఁ గూడి,
తానుఁ దమ్ముఁడుఁ దగ నయోధ్యకును వచ్చె, - 38

టీక :- అనిలోన మార్కొన్న = యుద్ధములో మొ[illegible]కాయు చంపించి = రావణుని కుమారుడైన అతికాయుని చంపి[illegible]. [illegible] = బలముతో, విద్యుజ్జిహ్వున్ = తాటక పతి గాకనితడు పేరుగల మరియొకడు. పడవైచి = కూల్చి, ఖడ్గ రోముని మేను = ఖడ్గరోముని శరీరము, కడికండలుగ జేసి = మిక్కిలి తునుకలుగా జేసి, పేర్మిన్ = ఆధిక్యముతో. విరూపాక్షున్ = విరూపాక్షుని. పేరడంచి = పేరులేకుండ జేసి, ఇంద్రజిత్తును = రావణుని కుమారుడైన ఇంద్రజిత్తును, జమునింటికి బంపించి = యమసదనమునకు బంపి, కుంభకర్ణునిన్, నేలగేల నేసి = నేలగూల్చి, బలగంబులతో గూడ = బంధుమిత్రులతో సహా, బలియు = బలవంతుడైన, రావణుద్రుంచి = రావణుని చంపి, మరియు రక్కసులన్ = రాక్షసులను, అందరిని, ఒంచి = చంపి, పిల్చి = పిలిచి, రాకాసిప్రోలు = లంకా పట్టణము, విభీషణునకు, తిరముగా నిచ్చి = శాశ్వతముగా నిచ్చి, సెకబాసన్ = అగ్నిపరీక్షతో, తేరినట్టి = కడతేరినట్టి, చాలుపేరింటి బోడిన్ = సీతను, కూడి = కలిసి, తాను, తమ్ముడు, తగన్ = ఒప్పునట్లుగా, అయోధ్యకు వచ్చె

తా :- యుద్ధరంగమున ఎదుర్కొనిన అతికాయుని చంపించి, బలవంతుడైన విద్యుజ్జిహ్వుని పడవేసి, ఖడ్గరోముని తనకలు తునుకలుగా జేసి, విరూపాక్షుని పేరు లేకుండ జేసి ఇంద్రజితుని యమపట్టణమునకు పంపి, కుంభకర్ణుని నేలగూల్చి బలగముతో గూడ రావణుని చంపి మరియు మిగిలిన రాక్షసుల నందరిని వధించి విభీషణుని పిలిచి లంకారాజ్యము శాశ్వతముగా నిచ్చి, అగ్నిపరీక్షలో నెగ్గిన సీతతో గూడి తాను మరియు తమ్ముడు నయోధ్యకు వచ్చిరి.

39. ఆ:- ఇట్లువచ్చిరాముఁ డెల్గు జేనిని బ్రొద్దు
చూలిగాడ్పు పట్టి వాలిబిడ్డ
మును విభీషణుండు మొదలైన వారలఁ
గోర్కు లొసఁగి యనిపెఁ బేర్కొనంగ - 39

టీక :- ఇట్లువచ్చి రాముడు = ఈ విధముగా రాముడు వచ్చి, ఎల్గుజేనిని = ఎలుగు బంట్ల రాజైన జాంబవంతుని, ప్రొద్దు చూలిని = సూర్యుని కుమారుడైన సుగ్రీవుని, గాడ్పుపట్టిని = వాయుదేవుని కుమారుడైన ఆంజనేయుని, వాలిబిడ్డన్ = వాలికుమారుడైన యంగదుని, మును = మొదట, విభీషణుండు, మొదలైన వారల కొర్కులొసగి = కోరిక లిచ్చి, పేర్కొనంగ = తనను చెప్పుకొనగా, అనిపెను = పంపెను.

తా :- వానరులు పైన చెప్పిన కొండలుపోగా మిగిలిన వానిని వెదకి ఒకచోటికి చేర్చి సముద్రముపై కట్టగట్టగా, శ్రీరాముడు, మొదట వానర సైన్యమును దాటించి ఆవెనుక, తమ్ముడు తాను సముద్రమును దాటి, - అవతల

-: రామ రావణ యుద్ధము :-

37.వ:- వేలంబు విడియించి మిడి మేలంబుగా నాలంబునకు వెడలు
రక్కసి యొడయని బెడిదంబున కోర్చి యతని ప్రేకంబులైన మూఁకల
నేలం గూల్చి యంత -37

టీక :- వేలంబు విడియంచి = శిబిరమును విడిది చేయించి, మిడిమేలంబుగా౯ = మిడిసి పాటుతో, ఆలంబునకు వెడలు = యుద్ధము నకు వెడలు, రక్కసి యొడ యని = రాక్షస రాజైన రావణుని, బెడిదంబున కోర్చి = క్రౌర్యమున కోర్చి, అతని, ప్రేకంబులైన = అధికములైన, మూకల౯ = సైన్యమును, నేలంగూల్చి = వధించి, అంత౯ = ఆపిదప.

తా :- సముద్రమును దాటి ఆవల శిబిరమును విడియించి మిడిసి పాటుతో యుద్ధమునకు వచ్చు రావణుని యొక్క క్రౌర్యమును సహించి అధికమైన యతని సైన్యమును వధించి ఆపిదప -

38.సీ॥ అనిలోన మార్కొన్న యతికాయుఁ జంపించి
కడిమి విద్యుజ్జిహ్వుఁ బడఁగ వైచి
ఖడ్గరోముని మేను కడికండలుగఁ జేసి
పేర్మి విరూపాక్షుఁ బేరడంచి
ఇంద్రజిత్తును జము నింటికి నంపించి
కుంభకర్ణుని నేలఁ గూలనేసి
బలగంబుతోఁ గూడ బలియు రావణుఁ ద్రుంచి
మఱియు రక్కసుల నందరను నొంచి
తే॥ పిల్చి రాకాసి ప్రోలు విభీషణునకుఁ
దిరముగా నిచ్చి, సెకబాసఁ దేటినట్టి
వాలుపేరింటి పూఁ బోడి నోలిఁ గూడి,
తానుఁ దమ్ముఁడుఁ దగ నయోధ్యకును వచ్చె, - 38

టీక :- అనిలోన మార్కొన్న = యుద్ధములో మొ[illegible] అతికాయు చంపించి = రావణుని కుమారుడైన అతికాయుని చంపించి. కడిమిన్ = బలముతో, విద్యుజ్జిహ్వుర్ = తాటక పతి గాకనితడు పేరుగల మరియొకడు, పడగ్రైచి = కూల్చి, ఖడ్గ రోముని మేను = ఖడ్గరోముని శరీరము, కడికండలుగా జేసి = మిక్కిలి తునుకలుగా జేసి, పేర్మిన్ = ఆధిక్యముతో, విరూపాక్షుర్ = విరూపాక్షుని, పేరడంచి = పేరులేకుండ జేసి, ఇంద్రజిత్తును = రావణుని కుమారుడైన ఇంద్రజిత్తును, జమునింటికి బంపించి = యమసదనమునకు బంపి, కుంభకర్ణునిర్, నేలగేల నేసి = నేలగూల్చి, బలగంబులతో గూడ = బంధుమిత్రులతో సహా, బలియు = బలవంతుడైన, రావణుద్రుంచి = రావణుని చంపి, మరియు రక్కసులర్ = రాక్షసులను, అందరిని, ఒంచి = చంపి, పిల్చి = పిలిచి, రాకాసిప్రోలు = లంకా పట్టణము, విభీషణునకు, తిరముగా నిచ్చి = శాశ్వతముగా నిచ్చి, సెకబాసర్ = అగ్నిపరీక్షతో, తేరినట్టి = కడతేరినట్టి, చాలుపేరింటి బోడిర్ = సీతను, కూడి = కలిసి, తాను, తమ్ముడు, తగర్ = ఒప్పునట్లుగా, అయోధ్యకు వచ్చె

తా :- యుద్ధరంగమున ఎదుర్కొనిన అతికాయుని చంపించి, బలవంతుడైన విద్యుజ్జిహ్వుని పడవేసి, ఖడ్గరోముని తనకలు తునుకలుగా జేసి, విరూపాక్షుని పేరు లేకుండ జేసి ఇంద్రజితుని యమపట్టణమునకు పంపి, కుంభకర్ణుని నేలగూల్చి బలగముతో గూడ రావణుని చంపి మరియు మిగిలిన రాక్షసుల నందరిని వధించి విభీషణుని పిలిచి లంకారాజ్యము శాశ్వతముగా నిచ్చి, అగ్నిపరీక్షలో నెగ్గిన సీతతో గూడి తాను మరియు తమ్ముడు నయోధ్యకు వచ్చిరి.

39. ఆ:- ఇట్లువచ్చిరాముఁ డెల్గు జేనిని బ్రొద్దు
చూలిగాడ్పు పట్టి వాలిబిడ్డ
మును విభీషణుండు మొదలైన వారలఁ
గోర్కు లొసఁగి యనిపెఁ బేర్కొనంగ - 39

టీక :- ఇట్లువచ్చి రాముడు = ఈ విధముగా రాముడు వచ్చి, ఎల్గుతేనిని = ఎలుగు బంట్ల రాజైన జాంబవంతుని, ప్రొద్దు చూలిని = సూర్యుని కుమారుడైన సుగ్రీవుని, గాడ్పుపట్టిని = వాయుదేవుని కుమారుడైన ఆంజనేయుని, వాలిబిడ్డర్ = వాలికుమారుడైన యంగదుని, మును = మొదట, విభీషణుండు, మొదలైన వారల కొర్కులొసగి = కోరిక లిచ్చి, పేర్కొనంగ = తనను చెప్పుకొనగా, అనిపెను = పంపెను.

తా :- ఈవిధముగా శ్రీరాముడు అయోధ్యకు వచ్చి, జాంబవంతుని సుగ్రీవుని, హనుమంతుని, అంగదుని, మొదట విభీషణుడు మొదలుగా నందర కోరికలు దీర్చి తనను చెప్పు కొను చుండగా వారినందరను పంపెను

40.వ:- ఇప్పగిది ననిచి రాముండు కడలేని సిరులు దొడరి కడలి
కడగాఁగల పుడమిఁ దడ వేలె, నిది కనువినుకలి నెలవు
పుట్టుచే విరివిగాఁ జెప్పంబడ జగంబు లెఱింగిన దగు
టం జేసి నకుం గొంచెంబుగాఁ జెప్పితి, నట్లగుట మీవంటి
వారికి నొంటి నడవి నడతేరం జన, దని యజ్జడదారి
గారవించి పంచిన నయ్యయాతి మగిడి కాఱడవిలోఁ
జనుదెంచు నప్పుడు దప్పిగొని నలుగడలుం బరికించి – 40

టీక :- ఇప్పగిదిననిచి = ఈవిధముగా బంపి, రాముడు, కడలేని = అంతములేని, సిరులు తొడరి = ఐశ్వర్యములతో గూడి, కడలికడగా గలపుడమిని = సముద్రపర్యంతమైన భూమిని, తడవేలె = చాలా కాలము పాలించెను. ఇది = ఈవృత్తాంతము, కనువినుకలిసెలవు పట్టుచే = చక్షుశ్రవముల నివాసమైన వల్మీకము నుండి పుట్టిన వానిచే అనగా వాల్మీకిచే, విరివిగా జెప్పంబడ = విస్తరించి చెప్పబడగా, జగంబులెరింగిన దగుటం జేసి = లోకములన్ని యెరిగిన దగుట వలన, నీకుం గొంచెంబుగా జెప్పితి = నీకు సంక్షేపముగా చెప్పితిని, అట్లగుట = ఆశ్రీరాముని వలె నగుట వలన, మీవంటివారికి, యొంటి నడవి నడతేరం జనదని = ఒక్కడుగా నడవిలో రాగూడదని, అజ్జడదారి =(ఆ+జడదారి) ఆముని యనగా జాజిలి, గారవించి పంపిన = గౌరవించి పంపగా, అయ్యయాతి = ఆయయాతి మహారాజు, మగిడి = తిరిగి, కారడవిలో = నాభయంకరమైన యడవిలో, జనుదెంచునప్పుడు = వచ్చునపుడు, దప్పిగొని, నలుగడలుంబరికించి = నాలుగువైపులు పరిశీలించి

తా :- ఈవిధముగా బంపి శ్రీరామచంద్రుడు అనంతమైన యైశ్వర్యముతో సముద్రపర్యంతమైన భూమిని చిరకాలము పాలించెను. ఈవృత్తాంతము వాల్మీకిచే విస్తరించి చెప్పబడగా లోకము లన్ని యెరిగినదే యగుట వలన దీనిని నీకు సంక్షేపముగా జెప్పితిని. ఆశ్రీరాముని వలె యగును కనుక నీవంటి వారికి యడవిలో నొంటరిగా రాగూడదని యాముని యయాతి మహారాజును గౌరవించి పంపగా నతడు తిరిగి వచ్చునపుడు దప్పిగొని నాలుగువైపులను పరిశీలించి –

విశే :- ఈ రామాయణ మహాభారతాది ప్రసిద్ధేతి వృత్తము లన్నియు ప్రతికల్పమున పంచాంగమందలి తిథి నక్షత్రముల వలె నాయాయుగము లందీ షద్భేదములతో మరల మరల పునరావృత్త మగుచునే యుండునని వానిని ఆయాకాలములందు వాల్మీకి వ్యాసులవతరించి లోకోపకారార్థమై యక్షరబద్ధము చేయుచునే యుందురని హిందూపురాణ సంప్రదాయము. అటుల గాకున్న నిక్ష్వాకు మహారాజునకు నైదవ తరము వాడైన యయాతి మహర్షికి జాబాలి మహర్షి ఏబది నాల్గవ తరము వాడైన శ్రీరాముని కథను చెప్పుట పొసగదు కనుక జాబాలి యంశకంటె మొదట జరిగిన రామాయణ కథను యయాతి మహారాజునకు వినిపించి యుండును. రామాయణ మహాభారతాదులు ప్రతికల్పమునందును ప్రవరిల్లుచు వచ్చినవి. కనుక వాని యందు వాని యందా యాపురుషుల జన్మకర్మములను గురించిన భేదములుప్పతిల్లుచు వచ్చినవి. వానిని పౌరాణికులు కల్పభేదములు గానే యంగీకరింతురు. కావున పాఠకుల సౌకర్యార్థమై అట్టివానిలో నొకకథను నేని సందర్భమున మీకు పరిచయము చేసితిని

యయాతి నూతి దగ్గరకు వచ్చుట

41.కం॥ తనదండ ప్రాఁకులఁ్గలో
మును గట్టిన రాలసంధి మొలచిన చెట్లం
బెనఁగొని చీఁకటి గ్రమ్మం
గనఁదగు నొకపాడు నూయి గనుఁగొని యందున్ -41

టీక :- తనదండన్ = తనసమీపమున, ప్రాకులన్ = పెద్దపెద్ద చెట్లు, లోన్ = లోపల, మును గట్టిన = పూర్వము కట్టినటువంటి, రాలసంది = రాళ్ల సందున, మొలిచిన, చెట్టులన్ = చెట్లను, పెనగొని, యల్లుకొని, చీకటిక్రమ్మన్ = చీకటిక్రమ్మగా, కనదగు = కనిపించు, ఒకపాడు నూయి = ఒక పాతబావి, కనుగొని = చూచి, అందున్ = దానిలో -

తా : తన సమీపమున అనగా చుట్టు పెద్దపెద్దగా పెరిగిన చెట్లను లోపల నంతవరకు గట్టిన రాళ్లతెట్టెలో మొలిచిన చెట్లల్లుకొని చీకటి క్రమ్మి కనిపించు నొక పాడు బావిని చూచి, దానిలో -

''అలం - స్వభావోక్తి''

42.సీ॥ మాటమాటై యల్గి మఱుఁగుమైఁ దాఁగిన
నీటిరాయని కూర్మి నెలఁత యనఁగ
నామని తోడి సయ్యాటకై యచ్చోటి
కరుగు దెంచిన కానసిరి యనంగఁ
జిలువ కన్నియలతోఁ జెలిమి గావింపగా
వచ్చిన వలరాచలచ్చి యనఁగ
నడవి సోయగమున కబ్బుర మంది క
న్గొనగ జేరిన పాఁప కొమ్మ యనఁగ
ఆ॥ ననుఁగుఁ జెలిని బోలె నలరుఁ దీవియ నూఁది
నిగుడు మనములోని నెగులు చేతఁ
జప్పు డేమియైన సరగనాలించుచు
నున్నదాని, నొక్క యువిదఁ గాంచి - 42

టీక :- మాటమాటై యల్గి = మాటపై మాటవచ్చి యలిగి, మఱుగు మై = మారుశరీరముతో, డాగిన = దాగినట్టి, నీటిరాయని = వరుణ దేవుని యొక్క, కూర్మి = ప్రియమైన, నెలత యనగా.= స్త్రీయనగా/ ఆమని తోడి = వసంతుని తోడి, సయ్యాటకై = సహాటనకు అచ్చోటి కరుగు దెంచిన =అచటికి వచ్చిన, కానసిరియనంగ = వనలక్ష్మి యనగా/ చిలువ కన్నియలతో = నాగకాంతలతో, చెలిమిగావింపగా = స్నేహము చేయగా, వచ్చిన = వచ్చినటువంటి, వలరాచ లచ్చి యనగ = మన్మదులక్ష్మియనగా/ అడవి సోయగమునకు = అడవి యొక్క అందమునకు, అబ్బురమంది = ఆశ్చర్యపడి, కన్గొనగ జేరిన = దర్శించుటకు వచ్చిన, పాప కొమ్మ యనగ = నాగకన్య యనగా / నను గు జెలిని బోలె = ప్రియమైన సఖివలె, నలరు దీవియనూది = కోమలమైన ఒక తీగను ఊని, నిగుడు = నిక్కినట్టి, మనములోని = మనస్సులోని, నెగులు చేత = దుఃఖముతో, చప్పుడేమియైన = ఏచప్పుడైనను, సరగ నాలించుచు = చక్కగా వినుచు, ఉన్నదానిన్ = ఉన్నదానిని, ఒక యువిదన్ = ఒక్క యువతిని, కాంచి = చూచి -

తా :- మాటపై మాట వచ్చి యలిగి మారు రూపముతో వచ్చి దాగినట్టి వరుణ పత్ని యనగా, వసంతుని తోడి సయ్యాటకు వచ్చిన వనలక్ష్మి యనగా, నాగకాంతలతో చెలిమి సేయవచ్చిన మన్మథలక్ష్మి యనగా, ఆయడవి యొక్క అందమున కాశ్చర్యపడి దర్శించుటకై వచ్చిన నాగకన్యయనగా, నొప్పి ప్రియమైన చెలిని వలె

నొక కోమలమైన తీగనూది, మనస్సులో నిక్కుచున్న దుఃఖముతో ఏచప్పుడైనను దానిని జాగ్రత్తగా వినుచు, నున్నట్టి యొక యువతిని దానిలో - అనగా నానూతిలో చూచి -

ముందరి పద్యముతో నన్వయము

''అలం - ఉత్ప్రేక్ష''

విశే :- ఈ పద్య మాంధ్రమహాభారత మందలి ఆది పర్వమున గల ఆ-3-140వ పద్యము

సీ॥ చనుదెంచి యమ్మహా జనపతి -

అనుదాని యడుగు జాడలో సాగినది.

దానియందలి వరుణదేవు తోడ కరవల్లి జలనివా, సంబువిడచి - అనుగీతము దీనియందు సీసపాదములుగా, తుత్తూ్కపమున విలసత్కూలమున వల్లి యన్నిష్ట సఖినూది - యన్నసీస పాదము లిందు గీతముగా పరివర్తితమైనవి.

43.వ:- వెఱఁగుపడి వారువంబు డిగ్గి చేరం జనుదెంచిన
నయ్యయాతిం గని మున్నెఱుంగ నిదిగాన మదిలోనఁ
బొంగు నడలు నిలుపలేక - 43

టీక :- వెఱగుపడి = ఆశ్చర్యపడి, వారువంబు డిగ్గి = గుఱ్ఱమును దిగి, చేరం జనుదెంచిన = సమీపమునకు వచ్చిన, నయ్య యాతింగని = (ఆ+యయాతిని) చూచి, మున్నెరుంగనిదిగాన మునుకు = సంతాపము, యెరుగనిది = తెలియనిది, కనుక, మదిలోన, పొంగునడలు = పొంగెడు దుఃఖము, నిలుపలేక -

తా :- ఆశ్చర్యపడి, గుఱ్ఱమును దిగి సమీపమునకు వచ్చిన యాయయాతిని చూచి తానంతవరకే సంతాప మెరుగనిది కనుక మనస్సున పొంగివచ్చు దుఃఖమును నిలుపలేక -

యయాతి నూతం బడిన దేవయాని నుద్ధరించుట

44.క:- వలిపెంబు చెఱఁగు మోమున
నెలఁ జేరిన మంచు పగిది నెఱయంగాఁ, గో
వెలఁక్రోల్చు చందమున నా
యెలనాఁగ కలంగి పెద్దయెలుఁగున నేడ్చెన్ - 44

టీక :- వలిపెంబు చెఱగు = చీరయొక్క కొంగు, మోమున = ముఖముపై నెలజేరిన మంచు పగిది = చంద్రుని గప్పిన మంచుతెరవలె, నెఱయంగా = ఒప్పుగా, కోవెల క్రోల్చు చందమున = కోకిల కూసి నట్లు, ఆయెలనాగ = ఆయువతి, కలంగి = మిక్కిలి బాధపడి, పెద్ద యెలుగున = గొప్పనైన ధ్వనితో, ఏడ్చెన్ = ఏడ్చెను.

తా :- చీరయొక్క కొంగు ముఖముపై చంద్రుని గప్పిన మంచు తెర వలె యొప్పుగా కోకిల కూసినట్లు ఆయువతి మనస్సులోని బాధతో పొగిలి పెద్దగా నేడ్చెను.

''అలం - ఉపమ''

ఈ ఏడుపు - పారిజాతాపహరణ మందలి సత్యభామను, వసుచరిత్ర యందలి గిరికను తలపించును.

విశే :- ఆంధ్ర ప్రబంధములలో ఈ కావ్యనాయికల యేడ్పొక ప్రత్యేకతను సంతరించు కొన్నది. ఈ సంప్రదాయమునకు శృంగార నైషధమున

తే :- ''వేడి యూర్పులు నిగుడంగ వెక్కి వెక్కి, యేడ్వ దొడగెల తాంగి వృద్ధిశ్రు మ్రోల''
అని దమయంతితో శ్రీకారము చుట్టించిన వాడు శ్రీనాథుడు. అతని పిమ్మట పోతన మొదలుకొని ప్రబంధయుగాంతము వరకు గల కవులందరు కావ్యనాయికల ఏడుపులపై స్వతంత్ర పద్యములు రచించిరి.

''అలం - ఉపమ''

45.వ:- ఇట్లు తెగి వగచు నమ్మగువం గనుంగొని మది గరంగం గడియవచ్చి-45

టీక :- ఇట్లు = ఈవిధముగా, తెగి = సిగ్గువిడిచి, వగచు = దుఃఖపడు అమ్మగువం గనుంగొని = (ఆ+ మగువ) ఆయువతిని చూచి, మదికరంగన్ = మనస్సుకరుగగా, కదియ వచ్చి = సమీపించి

తా :- ఈవిధముగా నామె సిగ్గును విడిచి దుఃఖపడు నాయువతిని చూచి యయాతి మహారాజు మనస్సు కరుగగా సమీపమునకు వచ్చి -

46.చ॥ అడలున నెంతయుం గలఁగి, యగ్గలికం గుడిచేయి సాచివ్రై
వడఁకెడు కొమ్మకేలు చెలువంబుగఁ బట్టి యయాతి నూతిలో
వెడలిచి, యప్పుడమ్మగువ వేనలిఁగన్నులు మోముఁ జెక్కులు
న్నెడ చనుదోయి నెన్నడుము మేను పిఱుందును గాంచి వేడుకన్ - 46

టీక :- అడలున = భయముతో, ఎంతయుంగలిగి = మిక్కిలి కళవలపడి, అగ్గలికన్ = పూనికతో, కుడిచేయి సాచి = కుడిచేయి చాపి, మైవడకెడు = శరీరము వణకుచున్న, కొమ్మకేలు = ఆమెయొక్క చేయి, యయాతి, చెలువంబుగ బట్టి = ఒప్పునట్లుగా బట్టి, నూతిలో వెడలిచి = బావినుండి వెడలించి, అప్పుడు, అమ్మగువ = ఆయువతి యొక్క, వేనలి = కొప్పు, కన్నులు, మోము = ముఖము, చెక్కులు = చెంపలు, మెడ, చనుదోయి, నెన్నడుము = సన్నని నడుము, మేను = శరీరము, పిఱుందు = పిరుదులు, కాంచి = చూచి, వేడుకన్ = సంతోషముతో

తా :- ఆమె భయముతో మిక్కిలి కళవళము జెంది యయాతికి అందుకొనుటకై పైకి కుడిచేతిని చాపగావణుకుచున్న యామె చేతిని యయాతి తగినట్లుగా పట్టుకొని బావినుండి వెలికి తీసి ఆమె యొక్క వెంట్రుకలు, కన్నులు, ముఖము, చెంపలు, మెడ, చనుకట్టు, నడుము, శరీరము మరియు పిరుదులను చూచి వేడుకతో -

విశే :- ఇందు యయాతి చూపు ఆమెపై తలమొదలుకొని పాదముల వరకు వరుసగా అనగా పైనుండి క్రిందికి ప్రసరించినట్లు చెప్పబడినది. ఈ సందర్భమున ఆంధ్రమహాభారతమున నన్నయ నూతిలో బడిన దేవయానను గని నీవెవరని మొదటనే యడిగి బావి నుండి పైకి తీసినట్లు చెప్పగా తెలగన తన కథా ప్రణాళిక ననుసరించి యామెను బావినుండి పైకి తీసిన పిమ్మట నీవెవరని యడిగినట్లు చెప్పెను, అంతేకాక నన్నయ-

జలధివిలోల వీచి విల సత్కల కాంచి సమంచి తావనీ
తలవ హనక్షమంబయిన దక్షిణహస్తము నంద దున్నమ
ద్గళ దురుఘర్మ వారి కణక్రమక రాబ్జము వట్టి నూతిలో
వెలువడ కోమలిందిగి చెవిశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్-

అని యాయన నామెను తనకుడిచేత బావినుండి పైకి లాగి వెళ్లెనని మాత్రమే చెప్పెను. కాని తెలగన్న యట్లుగాక నిందామె శరీర మాపాద మస్తక మతడు పరిశీలనగా చూచి యామె సౌందర్యమున కబ్బురపడుచు నీవెవ్వరని యడిగినట్లు కల్పించెను.

ఇది తెలగన్న యేర్పరచు కొన్న కథా ప్రణాళికకు తగిన మార్పనవలెను.

47. కII కరమరుదుగ నప్పొలంతుక
గరగరికకు వెఱఁగు పడుచుఁ, 'గలకీ, నీవె
వ్వరి దాన విందులో నే
కరణిం బడవలసెఁ జెప్పుము కలతెఱఁగ' ననుడున్ - 47

టీక :- కరమరుదుగన్ = మిక్కిలి ఆశ్చర్యకరముగా, అప్పొలతుక = (ఆ+పొలతుక) ఆయువతి యొక్క, గరగరికకు = సౌందర్యమునకు, వెఱగు పడుచు = విస్మయ పడుచు, కలకీనీవె వ్వరి దానవు, ఇందులో = ఈబావిలో, ఏకరణింబడవలసె = ఏవిధముగా పడవలసి వచ్చినది, చెపుము = చెప్పుము, కలతెఱగు = జరిగిన విధానము, అనుడున్ = అనగా -

తా :- యయాతి మిక్కిలి యరుదైన ఆమె శరీర సౌందర్యమునకు విస్మయపడుచు, ఓయువతీ నీవెవరి దానవు! దీనిలో ఏవిధముగా పడవలసి వచ్చినది చెప్పుమనగా-

48. కII తనువెదక వచ్చి యటని
ల్చిన ఘూర్ణిక యనెడు దానిఁ జెలికత్తియఁగ
న్గొన, నది యత్తెఱఁ గెల్లను
మును పెఱుఁగుటఁ జేసి రాచముక్కంటి దొరన్ - 48

టీక :- తనువెదుకవచ్చి = తనను వెదుకుటకై వచ్చి, అటనిల్చిన = అక్కడనిలిచిన, ఘూర్ణిక యనెడు దాని = ఘూర్ణిక అను నామెను, చెలికత్తియన్ = స్నేహితురాలిని, గన్గొనన్ = చూడగా - అనగా తనవిషయమతనికి చెప్పుమన్నట్లుగా- అది = ఆమె, అత్తెఱ గెల్లను = (ఆ+తెఱగు) ఆస్థితియంతగూడ, మునుపెరుగుట జేసి = మునుపు = అంతకు పూర్వమే, ఎరిగినందువలన, రాచముక్కంటి దొరన్ = ఆయవనీశ్వరుని-

తా :- తనను వెదుకుటకై వచ్చి యచట నిలిచి పోయిన ఘూర్ణిక యను చెలికత్తెను చూడగా నామె విషయ మంతయు నంతవరకే యెరిగినది కనుక నా యయాతిని చూచి -

49. చII కనుగొని వెమ్మది న్నెగులు గ్రమ్మఁగ రక్కసి యొజ్జయంచుఁ బే
ర్కొనఁ దగునట్టి శుక్రునకుఁ గూరిమి కూఁతురు దేవయాని నాఁ
దనరిన యిన్నెలంత నొక తప్పునకై వృషపర్వు పట్టి నూ
తను బడఁద్రోచి పోయె నని దాని తెఱఁ గది విన్నవించినన్ - 49

టీక :- కనుగొని = చూచి, నెమ్మదిఁ = తనమనస్సులో, వెగులు క్రమ్మగ = దుఃఖము వ్యాపించగా, రక్కసి యొజ్జయంచుఁ = రాక్షసగురువని. పేర్కొన దగునట్టి, చెప్పదగినట్టి, శుక్రునకు, కూరిమికూతురు = ప్రియమైన బిడ్డ, దేవయానినాఁ = దేవయాని యనగా, తనరిన యిన్నెలంతఁ = ఒప్పిన యీమె (ఈ + నెలంత) ఒక తప్పునకై, వృషపర్వు పట్టి – వృషపర్వుడను దానవ రాజు కూతురు. నూతను బడఁద్రోచిపోయె = ఈబావిలో పడద్రోసి వెళ్లెను, అని, దాని తెఱంగు = ఈమె విషయము, అది విన్నవించినఁ = అని తెలుపగా –

తా :- చూచి తనమనస్సులో దుఃఖము నిండగా నామె, ఓమహా రాజా! ఈమె దానవ గురువని చెప్పదగిన శుక్రాచార్యుని కూతురు. దేవయాని యనునట్టిది. ఈమెను ఒక తప్పుకొఱకు వృషపర్వుని కూతురు. ఈ బావిలో త్రోసిపోయినది. అని యామె విషయము విన్నవింపగా –

50.తే॥ ''అతివ, వృషపర్వుఁ డన నెవ్వఁ? డతని యనుఁగుఁ
గూఁతు పేరేమి? తనుఁ బట్టి నూతఁ ద్రోయు
నంతపని యేమి చేసె నీయలరుఁ బోఁడి?
యనుడు నవ్వాలుగంటి యయాతిఁ జూచి'' – 50

టీక :- అతివ = ఓయువతీ! వృషపర్వుడన నెవ్వడు, అతని, అనుగు కూతురుపేరేమి = గారబమైన బిడ్డ పేరేమి, తనుబట్టి = తనను పట్టుకొని, నూత ద్రోయు నంతపని = బావిలో పడదోయ వలసినంత పని, ఈ యలరుబోడి = ఈసుకుమారి, ఏమిచేసె, అనుడు = అనిఅడుగగా, అవ్వాలుగంటి = ఆయొక్క ఘూర్ణిక, యయాతి జూచి = యయాతి మహారాజును చూచి –

తా :- ఆయయాతి మహారాజు ఘూర్ణికను చూచి, ఓయువతీ! వృషపర్వుడనగా నెవ్వరు. అతని కూతురు పేరేమి, ఈమె తనను బట్టి బావిలో ద్రోయవలసినంతటి దోషమేమి జేసినది. యనియడుగగా నాఘూర్ణిక ఆమహారాజుతో –

విశే :- 1. రాక్షసులలో దైత్యులు దానవులు అసురులు అని మూడు తెగలున్నట్లు రాజశేఖరుని కావ్యమీమాంసయందు చెప్పబడినది.

హిరణ్యాక్ష- హిరణ్యకశిప ప్రహ్లాద- విరోచన- బలి- బాణాదులు దైత్యులు, అనగా దితికుమారులు – విప్రచిత్తి- శంబర – నముచి, పులోమాదులు దానవులు

47. క॥ కరమరుదుగ నప్పొలఁతుక
గరగరికకు వెఱఁగు పడుచుఁ, 'గలకీ, నీవె
వ్వరి దానవిందులోనే
కరణిం బడవలసెఁ జెప్పుము కలతెఱఁగ' ననుడున్ - 47

టీక :- కరమరుదుగఁ = మిక్కిలి ఆశ్చర్యకరముగా, అప్పొలతుక = (ఆ+పొలతుక) ఆయువతి యొక్క, గరగరికకు = సౌందర్యమునకు, వెఱగు పడుచు = విస్మయ పడుచు, కలకీనీవె వ్వరి దానవు, ఇందులో = ఈబావిలో, ఏకరణింబడవలనె = ఏవిధముగా పడవలసి వచ్చినది, చెపుము = చెప్పుము, కలతెఱగు = జరిగిన విధానము, అనుడుఁ = అనగా -

తా :- యయాతి మిక్కిలి యరుదైన ఆమె శరీర సౌందర్యమునకు విస్మయపడుచు, ఓయువతీ నీవెవరి దానవు! దీనిలో ఏవిధముగా పడవలసి వచ్చినది చెప్పుమనగా-

48. క॥ తనువెదక వచ్చి యటని
ల్చిన ఘూర్ణిక యనెడు దానిఁ జెలికత్తియఁగ
న్గొన, నది యత్తెఱఁ గెల్లను
మును పెఱుఁగుటఁ జేసి రాచముక్కంటి దొరన్ - 48

టీక :- తనువెదుకవచ్చి = తనను వెదుకుటకై వచ్చి, అటనిల్చిన = అక్కడనిలిచిన, ఘూర్ణిక యనెడు దాని = ఘూర్ణిక అను నామెను, చెలికత్తియఁ = స్నేహితురాలిని, గన్గొనఁ = చూడగా - అనగా తనవిషయమతనికి చెప్పుమన్నట్లుగా- అది = ఆమె, అత్తెఱ గెల్లను = (ఆ+తెఱగు) ఆస్థితియంతగూడ, మునుపెరుగుట జేసి = మునుపు = అంతకు పూర్వమే, ఎరిగినందువలన, రాచముక్కంటి దొరఁ = ఆయవనీశ్వరుని-

తా :- తనను వెదుకుటకై వచ్చి యచట నిలిచి పోయిన ఘూర్ణిక యను చెలికత్తెను చూడగా నామె విషయ మంతయు నంతవరకే యెరిగినది కనుక నా యయాతిని చూచి -

49. చ॥ కనుగొని వెమ్మది న్నెగులు గ్రమ్మఁగ రక్కసి యొజ్జయంచుఁ బే
ర్కొనఁ దగునట్టి శుక్రునకుఁ గూరిమి కూఁతురు దేవయాని నాఁ
దనరిన యిన్నెలంత నొక తన్వునకై వృషపర్వు పట్టి నూ
తను బడఁ ద్రోచి పోయె నని దాని తెఱఁగది విన్నవించినన్ - 49

టీక :- కనుగొని = చూచి, నెమ్మదిన్ = తనమనస్సులో, నెగులుక్రమ్మఁగ = దుఃఖము వ్యాపించగా, రక్కసి యొజ్జయంచున్ = రాక్షసగురువని. పేర్కొన నగునట్టి చెప్పదగినట్టి, శుక్రునకు, కూరిమికూతురు = ప్రియమైన బిడ్డ, దేవయానినాన్ = దేవయాని యనగా, తనరిన యిన్నెలంతన్ = ఒప్పిన యీామె (ఈ + చెలంతి) ఒక తప్పునకై, వృషపర్వు పట్టి – వృషపర్వుడను దానవ రాజు కూతురు. నూతను బడద్రోచిపోయె = ఈబావిలో పడద్రోసి వెళ్లెను, అని, దాని తెఱంగు = ఆమె విషయము, అది విన్నవించినన్ = అని తెలుపగా –

తా :- చూచి తనమనస్సులో దుఃఖము నిండగా నామె, ఓమహా రాజా! ఈమె దానవ గురువని చెప్పదగిన శుక్రాచార్యుని కూతురు. దేవయాని యనునట్టిది. ఈమెను ఒక తప్పుకొఱకు వృషపర్వుని కూతురు. ఈ బావిలో త్రోసిపోయినది. అని యామె విషయము విన్నవింపగా –

50.తే॥ ''అతివ, వృషపర్వుఁ డన నెవ్వఁ? డతని యనుఁగుఁ
గూఁతు పేరేమి? తనుఁ బట్టి నూతఁ ద్రోయు
నంతపని యేమి చేసె నీయలరుఁ బోఁడి?
యనుడు నవ్వాలుగంటి యయాతిఁ జూచి'' – 50

టీక :- అతివ = ఓయువతీ! వృషపర్వుడన నెవ్వడు, అతని, అనుగు కూతురుపేరేమి = గారబమైన బిడ్డ పేరేమి, తనుబట్టి = తనను పట్టుకొని, నూత ద్రోయు నంతపని = బావిలో పడదోయ వలసినంత పని, ఈ యలరుబోడి = ఈసుకుమారి, ఏమిచేసె, అనుడు = అనిఅడుగగా, అవ్వాలుగంటి = ఆయొక్క ఘూర్ణిక, యయాతి జూచి = యయాతి మహారాజును చూచి –

తా :- ఆయయాతి మహారాజు ఘూర్ణికను చూచి, ఓయువతీ! వృషపర్వుడనగా నెవ్వరు. అతని కూతురు పేరేమి, ఈమె తనను బట్టి బావిలో ద్రోయవలసినంతటి దోషమేమి జేసినది. యనియడుగగా నాఘూర్ణిక ఆమహారాజుతో –

విశే :- 1. రాక్షసులలో దైత్యులు దానవులు అసురులు అని మూడు తెగలున్నట్లు రాజశేఖరుని కావ్యమీమాంసయందు చెప్పబడినది.

హిరణ్యాక్ష–హిరణ్యకశిప ప్రహ్లాద–విరోచన–బలి–బాణాదులు దైత్యులు, అనగా దితికుమారులు – విప్రచిత్త–శంబర – నముచి, పులోమాదులు దానవులు

అనగా దనువుకుమారులు. బలివృత్రాసుర, విశరస్త వృషపర్వాదులు అసురులు. వీరందరి కసురత్వము సామాన్యలక్షణ మగుటచే వీరందరు -

శ్లో॥ అసురాదైత్య దైతేయా దనుజేంద్రారి దానవాః -
శుక్ర శిష్యా దితసుతా పూర్వదేవాసుర ద్విషః - అమ

అని అసురాది నామములచే సామాన్యముగా చెప్పబడిరి.

2. వృషపర్వుడు కశ్యప ప్రజాపతి కుమారుడు. ఇతని తల్లిపేరు దనుజ. మయబ్రహ్మ ఇతనికి సభాభవనము నిర్మించగా మిగిలిన సామగ్రి చేతనే ధర్మరాజుకు మయసభ కట్టి యిచ్చెను.

3. ఆనాటి సభాభవనములలో మయసభకు కలిగిన ఖ్యాతి మరిదేనికి లేకుండెను. అయిన నవశేషములతో నిర్మించిన సభనే యంతటి లోకోత్తరమైన పుడసలు వస్తువులతో కట్టిన వృషపర్వుని సభ మరెంత యద్భుతముగా నుండెనో యెవ్వరెరుగుదురు.

ఘూర్ణిక యయాతికి దేవయాని వృత్తాంతము చెప్పుట

51. క॥ వినువృషపర్వుఁ డనంగాఁ
దనరుఁ రక్కసుల ఱేఁడు తనకవిలోనం
బెనఁగఁ దగు మార్తునెందుం
గని యెఱుఁగక జగము లేలుఁ గడ లేనిసిరిన్ - 51

టీక :- విను, వృషపర్వుం డనంగాఁ, తనరును రక్కసుల ఱేడు = రాక్షసుల యొక్క రాజు ఒప్పుచుండును, తనకు = ఆమహారాజు తనకు, అనిలోనఁ = యుద్ధమున, పెనగదగు = యుద్ధము చేయగల, మార్తు నెందుఁగని = శత్రువునెక్కడ నైనను చూచి, ఎరుగకఁ, కడలేనిసిరిఁ = అంతములేని యైశ్వర్యముతో, జగములేలుఁ = లోకములు పాలించును.

తా :- ఓ మహారాజా! చెప్పెదను వినుము, వృషపర్వుడను పేర నొక దానవరాజు యొప్పును. ఆయన యుద్ధమున తనకు సాటిగల వారెవరు లేనివాడై యంతములేని యైశ్వర్యముతో లోకములేలును -

52.తే॥ అతని కూఁతురు శర్మిష్ఠ యనఁగ నొప్పుఁ
గూర్మి సకియలు వేగురు గొల్వ నెపుడు
నా చెలియఁ గూడి యాకొమ్మ యాడుకొనుచు
నరమరలు లేని చెలుముల ననఁగి పెనఁగి -52

టీక :- అతని కూతురు, శర్మిష్ఠ యనగఁ = ఒప్పు, కూర్మిసకియలు = ప్రియమైన చెలులు ఎపుడు, వేగురు గొల్వఁ = వేయి మంది సేవింపగా, ఒప్పును ఆచెలియగూడి = ఆమెతో కలిసి, ఈ కొమ్మయాడు కొనుచు = ఈమె ఆడుకొనుచు, అరమరలు లేని = పొరపొచ్చెములు లేని, చెలుములఁ = స్నేహముతో, అనగిపెనగి = కలిసి మెలిసి -

తా :- అతని బిడ్డ శర్మిష్ఠ యనగా నొప్పును, ఆమె వేయి మంది ప్రియమైన చెలులు సేవింపగా నుండును. ఆమెతో గూడి యామె పొరపొచ్చములు లేని ప్రేమతో కలిసి మెలసి యాడుచుండును.

53.వ:- తిరుగుచు నొక్కనాఁడు - 53

టీక :- తిరుగుచు నొక్కనాడు = ఆవిధముగా వారు స్నేహముగా తిరుగుచునొక దినమున-

54.క॥ రంగగు తొడవులఁ బూఁతల
నంగుగఁ గైసేసి యందు నాడెడు తమిచేఁ
బొంగారెడు వేడుకతో
సింగారపుఁ దోఁట కరిగెఁ జెలువలుఁ దానున్ - 54

టీక :- రంగగు = అందమైన, తొడవులఁ = భూషణములను, పూతలఁ = లేపనములను, అంగుగ కైసేసి = చక్కగా నలంకరించుకొని, అందుఁ = ఆవేషములో, ఆడెడు తమిచే = ఆడుకొను కుతూహలమున, పొంగారెడు వేడుకతో = మనస్సులో పెల్లుబుకు సంతోషమున, సింగారపు దోటకు = శృంగార వనమునకు, చెలువలు = చెలికత్తెలు, తానుఁ = తాను, తిరిగెను = వెళ్లెను.

తా :- వారావిధముగా సంచరించుచు నొకనాడు అందమైన భూషణములు లేపనములు ధరించి నిండుగా నలంకరించుకొని యావేషమున నాడుకొను కోరిక మనస్సులో పెల్లుబుకగా సంతోషమున చెలికత్తెలు మరియు తాను శృంగార వనమున కేగి,

55.సీ॥ మెదలు తుమ్మెద దిమ్ము రొదలచే నుప్పొంగి
తులకించు పూఁబొదల్ దూఱి దూఱి
పలుమాఱు విరుల తావుల తావులగు తీవ
యుయ్యేలల్ తగనెక్కి యూఁగి యూఁగి
వలిప పయ్యెదల కొంగులు దొలంగఁగ నిక్కి
కొమ్మ లందుచు ననల్గోసి కోసి
పైఁడి మెట్టిక లెక్కి పైకేఁగి చేతగ
ట్లందు దాఁగురు మూఁతలాడి యాడి
తే॥ పరువు లెత్తెడు నంచలఁ బట్టిపట్టి
గట్టి పుప్పొడి మెట్టలు మెట్టి మెట్టి
యలసి చెమటలు వాయ నోలాడఁదలఁచి
యందఱును గూడి కొంత దవ్వరిగి యచట - 55

టీక :- మొదలు తుమ్మెద దిమ్ము = మిక్కిలిగా సంచరించు తుమ్మెదల గుంపుల యొక్క, రొదలచే నొప్పొంగి = ఝుంకారములచే పొంగిపోయి, తులకించు = చక్కగా కనిపించు, పూబొదల్ దూరిదూరి = పూవుల పొదలలో చొచ్చి/ పలుమారు = అనేక పర్యాయములు, విరుల తావుల తావులగు = పూవులయొక్క పరిమళములకు నివాసములగు, తీవయుయ్యేలల్ = తీగల యూయలలు, తగనెక్కి = ఒప్పునట్లుగా యెక్కి, యూగియూగి = ఊగి;/ వలిప పయ్యెదల = సన్నని పైటల యొక్క, కొంగులు, తొలంగగన్ = తొలగుచుండగా, నిక్కి= నిగిడి, కొమ్మలందుచు = పైనగల కొమ్మల నందుకొనుచు, అనల్గోసిగోసి = పూవులు కోసి/ పైడి = బంగారు యొక్క, మెట్టిక లెక్కి = తాపలెక్కి, పై కేగి = పైకివెళ్ళి, చేతగట్లందు = క్రీడాపర్వతములలో, దాగురు ముతలు = దాగిలిమూతలు, ఆడియాడి = ఆడి/ పరువులెత్తెడు = పరుగెత్తు, నంచలన్ బట్టిపట్టి = హంసలను పట్టుకొని, గట్టి పుప్పొడి మెట్టలు = గట్టిబారిని పుప్పొడి మిట్టలు, మెట్టిమెట్టి = ఎక్కి, అలసి, చెమటలు వాయున్ = చెమటలు పోవునట్లుగా, ఓలాడదలచి = జలక్రీడ లాడ దలచి, అందరును గూడి, కొంత దవ్వరిగి = కొంత దూరమేగి, అచట -

తా :- మిక్కిలిగా సంచరించెడు తుమ్మెదల యొక్క ఝుంకారములకు పొంగిపోయి, కన్నుల పండువుగా కనిపించు పొదరిండ్లు దూరి పరిమళములు వెదజల్లు పూలతీగ

లెక్కి యుయ్యాలలూగి సన్ననిపైట కొంగులు ఎదలపై నుండి జారుచుండగా నిక్కి కొమ్మలందుకొని పూవులు కోసి, బంగారు తాప లెక్కి పైకి వెళ్ళి క్రీడాపర్వతములలో దాగుడుమూతలాడి, పరుగెత్తు హంసల వెంటబడి వానినిపట్టుకొని, గట్టి బారిన పుప్పొడి తిన్నెలెక్కి అలసిపోయి, చెమటలు తొలగునట్లుగా నోలలాడ దలచి యందరును గూడి కొంత దూరమేగి -

''అలం - సముచ్ఛయము''

56. సీ॥ పసిఁడి సోపసములపైఁ గుంది కట్లకై
కడునుద్దులైన జక్కవల కవల
పరువంపుఁ దొగల వెంబడిఁ గేరె యుప్పన
పట్టెలాడెడు తేఁటి పట్టి కదుపు
తమకంబు లుప్పొంగఁ దరగయుయ్యెల లెక్కి
కర మూఁగు రాయంచ కన్నియలును
మాటికి నెత్తమ్మి మఱుపునఁ బింపిళ్లు
గూయు బెగ్గురు రాచ కొమ్మగములు
గీ॥ మలసి చెలువంపు గలవలు మాటునందు
మేఁత దలఁపక డాగురు మూఁత లాడు
నీటి పులుఁగుల తుటుములు నిగిడి మెఱయు
సిరులనీనెడు సొబగుచేఁ జెలఁగి మఱియు - 56

టీక :- పసిసి సోపనములపైఁ = బంగారు మెట్లపై, గుందికట్లకై = కుందికట్లను యాటలకై, కడుఁ = మిక్కిలిగా, ఉద్దులైన = జట్లుగానేర్పడిన, జక్కవలకవలు = చక్రవాకముల యొక్క జంటలు / పరువంపు = కోడెప్రాయముగల, తొగలవెంబడి కలువలవెంట కేరి = కేరింతలాడుచు, ఉప్పెన బట్టెలాడెడు, తేటి పట్టికదుపు = పిల్ల తుమ్మెదల గుంపు/ తమకంబులుప్పొంగ = కుతూహలం పొంగుతూ ఉండగా, తరగనుయ్యెలలఁ = తరంగాలను ఉయ్యాలనెక్కి, ఊగు, రాయంచ కన్నియలును = రాజహంసల పిల్లలు/ మాటికి = పదేపదే, నెత్తమ్మి మరుపునఁ = ఎఱ్ఱతామరల చాటున, పింపిళ్ళుగూయు = పెదవులపై ధ్వనిచేయుచునాడు, బెగ్గురు రాచకొమ్మగములు = పెద్దకొంగల యొక్క పెంటి గుంపులు/ మలసి = ఒదిగి, చెలువంపు కలువల = అందమైన కలువపూల, మాటునందు = చాటున, మేతదలపక

= మేతలను గూడ మరచి, దాగురు మూతలాడు = దాగిళ్ల మూడిళ్లాడు, నీటిపులుగుల తుటుములు = జలపక్షుల సమూహములు/ నిగిడి మెరయు = నిక్కి ప్రకాశించు, సిరుల నీనెడు = సంపదలను వెదజల్లు, సొబగుచే జెలగి = అందముతో నొప్పి, మఱియు -

తా :- ఆసరస్సున బంగారు మెట్లపై కుందికట్లు అనుదాని నాడుటకై జట్లుజట్లుగా గూడిన జక్కవ జతలు, కోడె ప్రాయముగల కలువలవెంట కేరింతలతో నుప్పెన బట్టె లాడు తుమ్మెద పిల్లలు, కుతూహలము పొంగుచుండగా తరగలను నూయెలపై నూగు రాజహంసల పిల్లలు, మాటిమాటికి నెర్ర తామరల సందున నుండి పింపిళ్లు గూయు పెద్ద కొంగల పెంటులు అందమైన కలువల మాటున నుండి మేతలను గూడ తలపక దాగురు మూతలాడు జలపక్షులు గలిగి సౌందర్య సంపదతో నొప్పి మఱియు -

విశే :- ఈపద్యమున నానాటి బాలికల క్రీడలగు కుందికట్లు, ఉప్పనబట్టెలు, ఊయెలలూగుట, పింపిళ్లు గూయుట, దాగుడుమూతలు అను నాటలు చెప్పబడినవి.

1. కుందికట్లు - ఇద్దరిద్దరు జతలుగా నిలిచి మొదటి వారి ఎడమకాలు రెండవ వారి కుడికాలు కలిపి కట్టుకొందురు. అటుల బాలుర కొలది నాలుగైదు జట్లుగా నేర్పడి యొకలక్ష్యమును నిర్దేశించుకొని దానిని తాకుటకై పరుగులెత్తెదరు. అపుడెవరు ముందుగా లక్ష్యమును తాకిన యెడల వారు గెలిచినట్లు లెక్క

2. ఉప్పన బట్టెలు = దీని నుప్పుగెరయని గూడ నందురు.

57.సీ॥ నలువగు కలువ మొగ్గలు జడల్గా, నాఁచు
పొలుపైన కుచ్చులి బొంత గాఁగఁ,
గడు నొప్పు సంకులు కామాక్షి కవ గాఁగఁ
దామరవిరి ముద్దు మోము గాఁగఁ,
శైవాలు తొగరేకు కకపాల గాఁగఁ బు
ప్పొడి మైన లందిన బూది గాఁగఁ,
సిరి మీలు లేఁదూడు సింగినాదము గాఁగఁ,
దలిరు లేఁ దీఁగ లాతంబుగాఁగఁ,

తే॥ ముదురు మంకెన పువ్వు కెమ్మోవి గాఁగఁ,
తముల చూపఱఁ గొలిపెడు కొమరుఁదనపు
జోగురాలును బోలెను సొబగు మీఱు
కొలను గాంచిరి మదిలోని కోర్కు లలర - 57

టీక :- నలువగు = సుందరమైన, కలువమొగ్గలు, జడల్గా = జడలుగా, నాచు = శైవాలము, పొలుపైన = అందమైన, కుచ్చులి బొంతగా = యోగినులు ధరించెడు బొంతగా/ , కడునొప్పు = మిక్కిలిగా ప్రకాశించు, తామరవిరి = తామర పూవు, ముద్దు మోముగాఁగ = అందమైన ముఖముకాగా/ క్రైవాలు = వంగిన, తొగరేకు = కలువరేకు, కకపాలగాఁగఁ = కక్షపాలగా, పుప్పొడి, మైనలందిన = శరీరమునకు పూసికొనిన, బూదిగాఁగ = విబూతికాగా/ సిరిమీరు లేదూడు = అందమైన లేత తామర కాడ, సింగినాదముకాగా = శృంగ నాదముకాగా, తలిరులేదీగ = చిగురుటాకులు గల లేత తీగ, లాతంబుగాఁగ = బెత్తముకాగా/ ముదురు మంకెన పువ్వు = ముదురురంగుగల బంధూకము, కెమ్మోవికాగా = కెంపుమోవి/ అనగా ఎర్రనైన పెదవికాగా/ చూపఱఁ = చూచువారిని, తములు గొలిపెడు = ఆసక్తులు కలిగించు, కొమరుదనపు = పడుచు దనపు, జోగురాలును బోలెను = యోగిని వలెను, సొబగు మీరు = అందమున మించు, కొలను = కొలనును, వారు, మదిలోని = మనస్సులోని, కోర్కులలర = కోరికలు వికసించగా, కాంచిరి = చూచిరి.

తా :- వారు సుందరమైన కలువమొగ్గలు జడలుగా నాచు కుచ్చిలి బొంతగా, తామరపూవు అందమైన ముఖముగా వంగిన కలువరేకు కక్షపాలగా, పుప్పొడి శరీరమునకు అలదుకొనిన విభూతిగా, లేత తామరకాడ సింగినాదముగా, లేతతీగ బెత్తముగామంకెన పూవు పెదవిగా చూచు వారి కాసక్తి కలిగించు జోగురాలివలె నున్న కొలనును చూచిరి.

విశే :- పోతనగారు భాగవతమున గజేంద్రుడు విహరించుటకు దిగిన సరోవరమును మఱియు నాసరోవర లక్ష్మి - (భాగ-స్క-8-50) యని సరోవరమును లక్ష్మియనగా లక్షణవంతమైన యువతితో పోల్చెను. కావున నటులేనిందు తెలగన దేశ్యము మరియు స్త్రీ సమమైన ''కొలను'' ను జోగురాలితో రూపించెను.

''అలం - పరిణామము''

58.వ:- ఇట్లుగాంచి దగ్గఱం జనునప్పుడు - 58

టీక :- ఇట్లుకాంచి = ఈవిధముగా చూచి, దగ్గరం జనునప్పుడు = సమీపించు నపుడు

తా :- ఈవిధముగా నున్న దానిని చూచి వారు సమీపించు నపుడు -

59.కు॥ ఒడికపుఁ దన సొబగునకె
క్కుడు చెన్నులు గలుగఁ జూచి, కొల నాయన్నుల్
నడకొలఁకు లంచు, వారికిఁ
గడువేడుకఁ దమ్మి తావి కానుకఁ జేసెన్ - 59

టీక :- ఒడికపు = మనోహరమైన, తనసొబగునకు = తనయొక్క సౌందర్యమునకు, ఎక్కుడు = మిక్కిలి, చెన్నులు = అందములు, కలుగ జూచి = ఉండుట చూచి, కొలను, ఆయన్నుల్ = ఆవనితలు, నడకొలకులంచు = నడచెడు సరస్సులనుచు, కడువేడుకణ = మిక్కిలి వేడుకతో, తమ్మితావి = తామర పరిమళము, కానుకచేసెన్ = కానుకగా పెట్టెను.

తా :- ఆకొలను తనయొక్క మనోహరమైన సౌందర్యమున కంటె ఆయువతులు ఇంకను మిక్కిలి సుందరముగానుండుట చూచి వారిని నడకొలకులు అనగా నడుచు చున్న సరస్సులని భావించి వారికి తామర తావిని కానుకగా పెట్టెను.

''అలం - రూపకము''

60.వ:- చేసిన నచ్చెలువలు వలపు మించిన సొంపునం బెంపు
గని కలఁక దొఱంగి సిరిదొలంకు కొలంకు కెలంకునకుం
జనినిల్చి - 60

టీక :- చేసినణ = అటులచేయగా, అచ్చెలువలు = (ఆ+చెలువలు) వారు, వలపుమించిన = పరిమళము నిండిన, సొంపునణ = అందమునకు, కలక దొఱంగి = తమయొక్క ఆయాసము తొలగి, సిరిదొలంకు = సౌందర్యముతో నిండిన, కొలంకు కెలంకు నకుణ = సరస్సు సమీపమునకు, చని, నిల్చి = నిలిచి,

తా :- ఆకొలను వారికటుల పరిమళము కానుక చేయగా వారు పరిమళముతో నిండిన యాసౌందర్యమునకు తమయలసట మరచి సుందరమైన యాసరోవరము ప్రక్కకు జని నిలిచి -

61.తే॥ పలుదెఱంగుల సొబగైన వలువ బాఢ్చి
చెందిరపుఁ గావి పావడల్ పొందుపఱిచి
చిగురు గరులను దగు మరుచిలువ లనఁగ
నెలఁత లెల్లను గొలని లోపలికిఁ జనఁగ - 61

టీక :- పలుతెఱంగుల = అనేక విధములైన, సోబగైన = అందమైన, వలువ బాఢ్చి = చీరలు విడిచి, చెందిరపు = సింధూరపు వర్ణముగల, కావి = ఎర్రనైన, పాడవల్ = లంగాలు, పొందు పరచి = చక్కగా ధరించి, చిగురు గరుల౯ = లేతనైన ఱెక్కలతో, తగు = తగినట్టి, మరుచిలువలనగ = మన్మధుని యొక్క ఆలేటి పిట్టలనునట్లు; (నెల=నెలవు/,అనగా నివాసము,నెలత = ఇంటిని ధరించునది. పురంధ్రి, నెల = ఋతుకాలము, నెలఁత = ఋతు ధర్మమును ధరించునది.) నెలఁత లెల్లను = ఆయువతులందరు, కొలనిలోపలికి, చనగ౯ = వెళ్లగా -

అర్థవి :- చిలువ = పొట్టిబాతు బ్రౌ- ఆలేటి పిట్ట అనగా ఆడేలని దేశ్యము.

తా :- ఆయువతులందరు తమయొక్క వివిధములై యందమైన చీరలన్ని విడిచి, కావిపావడలు ధరించి లేతనైన రెక్కలతో కూడిన ఆలేటి పిట్టలనగా ఆకొలను లోపలికి దిగగా - అపుడా సరస్సు-

"అలం - ఉత్ప్రేక్ష"

62.తే॥ తరగ చేతుల బరువంపు విరుల ముత్తి
యములు కానుకగాఁ జేసి, యపుడు కొలఁకుఁ
జెలియ వారల యడుగులఁ జేర్చెఁ దనదు
నాచు వేనలి పూఁదావి ననిచి నిగుడ - 62

టీక :- తరగచేతుల౯ = తరంగాలనెడు హస్తములతో, పరువంపు = ప్రాయముగల అనగా వాడని, విరుల ముత్తియములు, పూవులనెడు ముత్యములు, కానుకగా జేసి = దక్షిణగానిచ్చి, అపుడు, కొలకుచెలియ = ఆసరోవరలక్ష్మి, తనదు = తనయొక్క, నాచు వేనలి పూదావి = నాచుయనెడు వెంట్రుకల యొక్క పూవుల పరిమళమును, నిగుడ ననచి = సూటిగా పంపి, వారల = వారియొక్క అడుగుల జేర్చెన్ = పాదములకు చేర్చెను -

తా :- ఆసరోవర వనిత తనయొక్క తరగలను హస్తములతో వాడిపోని పూలనెడు ముత్యములను వారికి కానుకగా పెట్టి తనయొక్క నాచు అను వెంట్రుకలయొక్క పూవుల పరిమళమును వారియొక్క పాదములకడ జేర్చెను. అనగా తనపై తేలుచున్న పూలను వారి చేతుల కందించి అడుగునందలి నాచుకాళ్ళకు తాకునట్లు చేసెను.

''అలం - రూపకము''

నదీకన్యలు తమలోని పూవులను పాదముల కడ జేర్చుటకు-

క్రమమొప్పఁగ నదులెల్ల వంశరవమాకర్ణించి సంజాతమో
హములన్ మన్మథసాయకక్షత విశాలావర్తలై హంసవా
క్యములం జేరి తరంగ హస్తముల నాకర్షించి పద్మోపహా
రములన్ కృష్ణపదార్చనంబు సలిపెన్ రామావిలోకించితే.

భాగ.స్క.10.పూ.791

63.వ:- ఇట్లు కొలను సొచ్చి,

టీక :- ఇట్లు = ఈవిధముగా వారు కొలను సొచ్చి = సరోవరము ప్రవేశించి

64.సీ॥ తమ మోములకు నుల్కి తగవడం కెడునట్లు
తళ్ళుగొట్టెడు నీటి తమ్ములలరఁ
దమచన్నుఁ గవల యందముల కోడుటఁ బోలె
జక్కవ లొక్కమైఁ జడల నెగయఁ
దమకొప్పులకు లోఁగి తలఁగి పోయె ననంగఁ
గప్పు నిప్పగునాచు కడకుఁ బోవఁ
దమకన్నులకు నీఁగి తలఁకు దచందంబునఁ
బెల్లుగాఁ గల్వలు తల్లడిల్లఁ
తే॥ బూని తమ చూపులకు నోడిపోవు కరణిఁ
బలుమొగంబులఁ దుమ్మెదల్ గలఁగి పఱవ
ముందుముందుగఁ జెలరేఁగి మూఁక లగుచు
నీటిలోనికిఁ జనుదెంచి నెలఁత లలరి - 64

టీక :- తమమోములకున్ = తమయొక్క ముఖములకు, ఉల్కి = భయపడి, తగన్ వడంకెడునట్లు = వణకు చున్నట్లుగా, తళ్ళు గొట్టెడు నీటి = నీటియొక్క, తళ్ళు = తడులు, అనగా తరంగముల యంచులు, కొట్టెడు = తాకెడు, తమ్ములలరన్

= తామరలు ఒప్పుచుండగా, / తమ, చన్నుగవ = రొమ్ముల యొక్క, అందములకు = సౌందర్యమునకు, ఓడుటపోలె = ఓడినట్లు, జక్కవలు = చక్రవాకములు, ఒక్కమై = ఒక్క గుంపుగా, చదల నెగయ = ఆకాశమున కెగురుచుండగా/ తమ, కొప్పులకు లోగి = కేశబంధవములకు లొంగిపోయి, తలటిపోయె = తొలగిపోయెను, అనంగ, కప్పు = నలుపు, విప్పగు నాచు = విస్తారమైననాచు, కడకు బోవ = అంచులకు పోగా / తమ, కన్నులకు, వీగి = వెనుక కొదిగి, తలకు చందంబునన్ = జడియు చున్నట్లుగా, పెల్లుగా = మిక్కిలిగా కల్వలు తల్లడిల్ల = చలించు చుండగా, పూని = పూనుకొని, తమ చూపులకు = తమయొక్క చూపులకు, ఓడిపోవు కరణి = ఓడిపోయినట్లు, తుమ్మెదల్ బలుమొగంబుల = అనేక దిక్కులకు, కలగి = చికాకుపడి, పరవన్ = పరుగెత్తగా/ ముందుముందుగా = పైసంఘటనలకంటె ముందుగనే, చెలరేగి = ఉత్సాహమున విజృంభించి, మూకలగుచు = గుంపులగుచు, నెలతలు = ఆయువతులు, నీటిలోనికి జనుదెంచి = నీటిలోనికి వచ్చి, అలరి = సంతసించి-

భా :- తమయొక్క ముఖములను చూచి భయమున వణకుచున్న వేమో అన్నట్లు నీటి తళ్ళకు తామరలు కదలు చుండగా, తమ యొక్క చన్నుల యందమున కోడిపోయిన వానివలె ఆసరోవర మందలి చక్రవాకములన్ని యొక్క పెట్టున పైకి లేవగా, తమయొక్క కొప్పులను చూచి, లొంగిపోయి తొలగె నన్నట్లు నాచుప్రక్కలకు పట్టగా, తమయొక్క నేత్రసౌందర్యమునకు వెరచి కలత చెందె ననగ కలువలు కదలిపోవ, తమయొక్క చూపులకు ఓడిపోయినట్లు తుమ్మెదలు దిక్కుదిక్కులకు చెల్లాచెదరై పోవ వాని యన్నిటి కంటె ముందుగానే వారు గుంపులు గుంపులై నీటిలోనికి వచ్చి, సంతసించి-

విశే :- జలక్రీడకు వారు కొలనులో ప్రవేశించగా కలిగిన సరస్సును తెలగన్న యీ పద్యమున నాసరోవరలక్ష్మి భయపడినట్లు చక్కగా రూపుకట్టించెను.

''అలం - ఉపమ''

65.తే॥ చల్లు లాడఁగ నప్పుడు చదల నెగసి
మగుడు తెలినీటి తుంపరల్ దగియెఁ జూడ
వారి నీరాటకును మెచ్చి వలపురాయఁ
డాని కురియించు పువ్వుల వాన లనఁగ - 65

టీక :- చల్లులాడగఁ = వారు ఒకరిపై యొకరు నీరు చల్లుకొను చుండగా, అపుడు, చదలనెగసి = ఆకాశమున కెగిరి, మగుడు = తిరిగివచ్చు, తెలినీటి తుంపరల్ = తెల్లని నీటి తుంపర్లు, వారి, నీరాటకును మెచ్చి = జలక్రీడలకు సంతసించి, వలపు రాయుడు = మన్మధుడు, అని = పూనుకొని, కురియించు = పువ్వుల వానలు, అనగ చూడఁ = చూచుటకు, తగియెఁ = ఒప్పెను

తా :- వారు ఒకరిపై ఒకరు నీరు చల్లుకొనుచుండగా నపుడు పైకెగిరి మరల క్రిందికి వచ్చు నీటి తుంపురులు మన్మధుడు వారి జలక్రీడలకు సంతసించి కురిపించెడు పూవుల వానవలె చూచుటకు కనిపించుచుండెను.

విశే :- వైదిక పరిభాషయందు నీటికి పుష్పమనిపేరు. మంత్ర పుష్ప మధ్యమున చెప్పెడు యోపాంపుష్ప మీవిషయమ్మును తేటపరచును.

''అలం - ఉత్ప్రేక్ష''

66.తే॥ ఓలలిడి పట్ట నరిగిన, నొయ్య నీట
మునిఁగి దవ్వుల లేతురు, ముదిత లంతఁ
దెలిమొగులు సొచ్చి వెడలుచుఁ జెలువు మీఱు
మేలి తుఱఁగలి గొనియెడు మించు లనగ - 66

టీక :- ఓలలిడి = ఓలయనికేక వేసి, పట్టనరిగినఁ = వేరొకతె పట్టు కొనుటకు వెళ్లగా, ఒయ్యనఁ = వెంటనే, నీటమునిగి, ముదితలు, తెలిమొగులు సొచ్చి = తెల్లని మేఘమున ప్రవేశించి, వెడలుచు = మరల బయటికి వచ్చుచు, చెలువు మీరు = అందమున మించు, మేలి = శ్రేష్టమైన తురగలి గొనియెడు = ప్రకాశించెడు, మించులనగ = మెఱుపులు అను నట్లుగ, అంతఁ = అపుడు, దువ్వులఁ = మిక్కిలి దూరమున, లేతురు-

తా :- వారు ఓల ఓలయని కేకవేసి, ఇతరులు పట్టుకొనుటకు రాగా వెంటనే నీటిలో మునిగి, తెల్లని మేఘమున ప్రవేశించి మరల బయటికి వచ్చెడు మెరుపు తీగల వలె వారు మరల మిక్కిలి దూరమున పైకి లేచుచు చుందురు.

''అలం - ఉత్ప్రేక్ష''

67.కll మగువ వడి నీఁదు కొని తా.
నొగి దవ్వుగఁ బోవహ జూచి, యొక్కతె కలు వం
దగ వైచిన, రేకులు మైఁ
దగులుఁడు నది వేల్పు తేనిఁ దలఁపించెఁగడున్ - 67

టీక :- మగువ = ఒకస్త్రీ, వడినీదుకొని = వేగముగా నీదుకొనుచు, తాన్ = తాను, ఒగిన్ = క్రమముగా దవ్వుగ బోవన్ = దూరముగా వెళ్ళగా, చూచి = అదిచూచి, ఒక్కతె, కలువన్ = ఒక కలువ పూవును తగన్ = ఆమెకు తగులునట్లు, వైచినన్ = వేయగా, రేకులు = ఆకలువ రేకులు, మైదగులుడు = శరీరమున కంటుకోగా, అది = ఆమె, కడున్ = మిక్కిలిగా, వేల్పుతేనిన్ = ఇంద్రుని, తలపించెను = జ్ఞాపకము చేసెను.

తా :- ఈతలో ఒక యువతి వేగముగా నీదుకొనుచు మిక్కిలి దూరము వెళ్ళగా అది చూచి మరియొకామె యొక కలువ నామెకు తగులునట్లు విసరగా దానిరేకులామె శరీరమున కంటి ఆమె యపు డింద్రుని తలపించెను.

విశే :- హస్తి నీ హస్త విన్యస్త పద్మంబుల, వేయుగన్నుల వాని వెఱపు సూపు (భాగ.స్క.8-49) అని ఈ పోలిక భాగవతమున నున్నది.

"అలం-స్మృతి"

68.కll తమ్ములు నక్కొమ్మల కనుఁ
దమ్ములు గనుఁగొనుచుఁ నన్నదమ్ములటంచున్
జుమ్మని మ్రోయుచుఁ దుమ్మెద
దిమ్ములు వడి మూఁగ మునిఁగి తేలుడు రతివల్ - 68

టీక :- తమ్ములు = తామరలు, అక్కొమ్మల = (ఆ+కొమ్మల) ఆస్త్రీల యొక్క, కనుదమ్ములు = నేత్రపద్మములు, కనుగొనుచు = చూచుచు, అన్నదమ్ములటంచు = సోదరులని, జమ్మని మ్రోయుచు = ఝుంకారము చేయుచు, తుమ్మెద దిమ్ములు = తుమ్మెద గుంపులు, వడిమూగన్ = వేగమున వారి మొగములపై మూగగా, అతివల్ = ఆసొగసు కత్తెలు, మునిగి తేలుదురు = నీటిలో మునిగి మరల తేలుదురు.

తా :- తామరలు ఆయువతుల యొక్క కను దామరలు సోదరులని అనగా యొకటేనని వానిని చూచి తుమ్మెద తుటుములు ఝుంకారముతో ముసరుటకు రాగా నాయువతులు మునిగి మరల తేలుదురు -

"అలం - భ్రాంతిమత్తు - అనుప్రాస"

69.కి॥ ఎలనాఁగఁ గుబ్బల మదిఁ
జెలులని జక్కవలు వచ్చుఁ జేరఁగఁ, బమటా
బలు వున్నదొ, యాబటువగు
చెలు వున్నదొ, వాని కెఱుఁగఁ జెల్లునె యచటన్ - 69

టీక :- ఎలనాగల = లేబ్రాయపు ఆయువతుల యొక్క, గుబ్బలన్ = చన్నులను, మదిన్ = మనస్సున, చెలులని = తమయొక్క చెలికత్తెలని, జక్కవలు = చక్రవాకములు, చేరగవచ్చున్ = సమీపించు చుండును, తమకు, ఆబటువున్నదో = ఆబలువు తన మున్నదా? ఆబటువగు = ఆయొక్క పొంకమైన, చెలువున్నదో = అందమున్నదా! అచటన్ = ఆసరస్సున, దానికి, ఎరుగ జెల్లునె = తెలియ తగునా! అనగా కాదనుట,

తా॥ ఆయువతుల యొక్క చన్నులను చూచి జక్కలువలు తమ మనస్సులో నవి తమ చెలికత్తెలని చేరవచ్చును కాని యా జక్కవలగు ఆచన్నులంతటి గుండ్రని తనమున్నదా! ఆ యొక్క పొంకమైన యందమున్నదా! వానికేవి తెలియును. అనగా తెలియదు

''అలం - ప్రతీపము''

70.తరల:- పలు దెఱంగులఁ బోవుచుందురుఁ బట్టె నన్నిటి కన్నియై,
యలిగి వేవెనువెంట నేఁగెడు నట్టి జాబిలి మేపరుల్
బలె, జడల్గడు నీటఁ దేలుచుఁ బైపయిం జను దేరఁగా
నిలువు టీఁ తల వచ్చు కొమ్మల నెమ్మొగమ్ములు పొల్పగున్ - 70

టీక :- నిలువు టీతల కొమ్మలు = వెల్లకిలగా నీదెడు యువతులు, నీట దేలుచు = నీటిపై దేలుచు, పలు దెఱంగులన్ = పలువిధములుగా, పోవుచుందురు, పైపయిన్ జనుదేరగా = వారటుల నొకరిని మించి యొకరు బయలు దేరగా, కొమ్మల నెమ్మొగంబులు = ఆయువతుల యొక్క నిండైన ముఖములు – చంద్రబింబముల వలె – పొల్పగున్ = ఒప్పు చుండును, జడల్గన = వారి జడలు చూడగా, పట్టన్ = ఆచంద్రబింబములను పట్టుకొనుటకై, అన్నిటి కన్నియై= అన్ని చంద్రులకన్నియై, అలిగి = కోపించి, వే = వేగముగా, వెను వెంటనే గెడునట్టి = వాని వెనుకనే గెడు నట్టి, జాబిలి మే పరుల్ బలె = రాహువులవలె, పొల్పగున్ = ఒప్పును.

తా :- నిలువు టీతలలో వెళ్లెడు యువతులు నీటిపై తేలి పలు విధములుగా పోవు చుండగా వారి ముఖములు అపుడు చంద్రుడు నీటిలో పుట్టిన వాడేకనుక చంద్రబింబముల వలె, వాని వెనుక వ్రేలుచు వెంట వచ్చు జడలు ఆ చంద్రబింబము లకు అన్నిటి కన్నియై కోపమున వెంటాడు రాహువుల వలె నొప్పుచుండెను.

''అలం - ఉపమ''

71.కII పొలతుల నీడలు దగియెఁ
బలువై యచ్చెలుల పొలుపుఁ బడయఁగఁ గోర్కిం
జిలువ నెలంతలు నీటం
దలక్రిందయి తంబము సేయఁ దగిలి రనంగన్ - 71

టీక :- పొలతుల నీడలు = దరిపై నిలిచినపుడు నీటిలోని ఆయువతుల యొక్క నీడలు, అచ్చెలుల పొలుపు = ఆయువతుల యొక్క సౌందర్యమును, బడయఁగఁ = పొందుటకై, కోరిఁ = కోరికతో, చిలువ నెలంతలు, నాగకాంతలు, నీటఁ = నీటియందు, తలక్రిందులు, తపము సేయఁ, తగిలిరనం గఁ = పూనిరన్నట్లుగా, బలువై తగియెఁ = మిక్కిలిగా నొప్పెను.

తా :- దరిపై నిలిచినపుడు ఆయువతుల యొక్క నీటిలోని ప్రతిబింబములు, వారియొక్క సౌందర్యమును పొందగోరి నాగకాంతలు తలక్రిందుగా తపము చేయ బూనిరేమో యన్నట్లు ఒప్పెను.

''అలం - ఉపమ''

72. పంచ చామరము :-
దరింగరంబు నిల్చి పొల్చి దాటి నీటిలోఁ బొరిఁ
బొరి న్మునించి తేలి తేలి పొల్తుకల్దలిర్తు, ర
చ్చర ల్మలం గలంచ మించు సంద్రు నందుఁ బుట్టుచుఁ
దురీన లేచునట్టి జాడ దోఁపఁ జూప రెన్నఁగన్ - 72

టీక :- దరిం = తటముపై, కరంబు నిల్చి పొల్చి = మిక్కిలిగా నిలిచి కనిపించుచు, దాటి = దాని నతిక్రమించి, నీటిలో, పొరింబొరి న్మునింగి తేలితేలి = మరల మరల మునిగిపైకి తేలుచు, పొల్తుకల్ - ఆయువతులు, చూపరెన్నగఁ = చూచు వారను కొనగా, మలంగ లంచ = మందరముతో తరచగా, మించు సంద్రునందు = సముద్రుని యందు, పుట్టు చుఁ తురీనఁ = తటాలున, లేచు జాడ దోపఁ = పైకి లేచి వచ్చునట్లుగా, తలిర్తురు = ఒప్పుదురు-

తా ॥ ఆ యువతులు తటముపై నిలిచి కనిపించి మరల మరల నీటిలో దూకి మునిగి తేలి పైకి వచ్చునపుడు ఆనాడు దేవ దానవులు మందరముతో సముద్రమును చిలుకగా నందు పుట్టి పైకి లేచి వచ్చు నప్సరసలవలె చూచు వారి కనిపించు చుండిరి.

''అలం - ఉపమ''

73.వ:- ఇట్లు నీరాట సల్పునట్టి యెడ, - 73

టీక :- ఇట్లు = ఈవిధముగా, నీరాట = జలక్రీడ, సల్పునట్టియెడ -

తా :- ఈవిధముగా వారు జలక్రీడ సలుపునపుడు

శర్మిష్ఠా దేవయానుల కలహము

74.క॥ సురకరువలి చనుదెంచిన
దరిఁ బెట్టిన కోక లెల్లఁ దడఁ బడి పోఁగా
నరిగి యని దెచ్చి చెలుల
బ్బుర మగుతమ చీర లెల్లఁ బూనిన, నందున్ - 74

టీక :- సురకరువలి = సుడిగాలి, చనుదెంచిన = వచ్చిన, దరిబెట్టిన కోకలెల్లన్ = వడ్డుపై నున్న వస్త్రములన్ని, తడబడి పోగాన్ = తారుమారుకాగా, అరిగి యవి దెచ్చి = వెళ్లి చెలులు గాలికి తడబడిన యా చీరలను దెచ్చి, చెలులు = ఆస్త్రీలు, అబ్బురమగు = ఆశ్చర్య కరమగు, తమ చీర లెల్లన్, పూనినన్ = ధరించగా, అందున్ = ఆచీరలలోపల,

తా :- సుడిగాలి వచ్చి ఒడ్డుపై నుంచిన తమ చీరలన్ని తారుమారు కాగా అపుడా యువతులందరు వెళ్ళి వానిని తెచ్చుకొని తమ తమ చీరలన్ని ధరించిరి. అపుడు వానిలో-

సురకరువలికి ప్రయోగము

క॥ ఖరుడగుకంసుని పంపున
నరిగితృణావర్తుడవని కవచాటముగా
సురకరువలియైబిసబిస
నరుదరు దనము సరివిసరిహరిగొనిపోయెన్
భాగ.స్క.10.పూ.264

75.కII లలిని నెలంతయుఁ దానును
వలువలు వీడ్వడఁగఁ దాల్చి, వైళమె చెలువల్
దలపింప నెఱిఁగి కినుకం
గులుకుచు రక్కసుల ఱేని కూఁతురు తెగువన్ -75

టీక :- లలిన్ = ఒప్పునట్లుగా, ఈనెలతయు = ఈమె, తానును = ఆమె వలువలు = తమచీరలు, వీడ్వడగ దాల్చి = తారుమారుగా ధరించి, వైళమ = ఆవెంటనే, చెలువల్ = చెలికత్తెలు, దలపింపన్ = వారికి తమ పొరపాటుతెలియ పరచగా, ఎఱిగి=అదితెలిసి, కినుకం గులుకుచు = కోపమున కులుకుచు, అక్కసుల ఱేని కూతురు = రాక్షసరాకుమారియైన శర్మిష్ట, తెగువన్ = సాహసమున -

తా :- అపుడు ఈమె యామె తమ చీరలు ఒకరి వొకరు కట్టుకొనగా నది చూచి చెలులు వారిని వ్యాకుల పరిచిరి. అపుడు శర్మిష్ట తాము పొరపడు టెరిగి కోపమున కులుకుచు సాహసమున -

76.ఉII నెట్టన రేయినిం బగలు నేరమి వెట్టు నటంచు వేలుపు
ల్వెట్టియుఁ గొట్నము ల్సలుప వ్రీలని చేబలు వొప్పు సోఁకుడుం
బట్టము గట్టుకొన్న వృషపర్వుని కూఁతర, నట్టి నేను నీ
కట్టిన మైలఁ గట్టుదునె కావర మేటికి వచ్చునీ కనన్ - 76

టీక :- నెట్టన = మిక్కిలిగా - సీ ॥ నెట్టన ఎంతేని నెరిగరంబు .... అత్యంతముగ ననుట కాఖ్యలయ్యె - ఆం.శే. 57, రేయినిం బగలు = రాత్రింబగళ్లు, నేరమి వెట్టు నటంచు = దోషము నారోపించునని, వేలుపుల్ = దేవతలు, వెట్టియు, కొట్నముల్ = ఊడిగములు, సలుపన్ = చేయుచుండగా, వ్రీలని = భంగపడని, చేబలు వొప్పన్ = భుజబలవ మొప్పుచుండగా, సోకుడుం బట్టము గట్టుకొన్న = రాక్షస రాజ్యమునకు పట్టాభిషేకము చేసికున్న, వృషపర్వుని కూతురున్ = వృషపర్వ మహా రాజా యొక్క బిడ్డను, అట్టి నేను = అటువంటి నేను, నీకట్టిన మైల = నీవు కట్టి విడిచిన మైలకోక, కట్టుదునె = కట్టుకొన దాననా, నీకు కావరమేటికి వచ్చె = నాచీరను కట్టుకు ఇంత గర్వమేల వచ్చెను. అనన్ = అనగా-

తా :- ఓసీ దేవయానా! నేను దేవతలందరు తమపై ఏదో నేరము మోపునని భయముతో చేతులు కట్టుకొని రాత్రింబవళ్లు మిక్కిలిగా, వెట్టి మరియు ఊడిగము

చేయుచుండగా రాక్షసరాజ్యమునకు పట్టాభిషేకము చేసికొనిన వృషపర్వ మహారాజు బిడ్డను. అటువంటి దానిని, నీవు కట్టిన మైల కోక కట్టెదనా! నీవిది ఎరుగక నాకోకను కట్టితివి. నీకింత గర్వమేల వచ్చెననగా -

77.వ:- విని యయ్యేల నాఁగకు దేవయాని యిట్లనియె - 77

టీక :- విని, అయ్యేల నాగకు = (ఆ+ ఎలనాగ) ఆషర్మిష్టతో, దేవయాని ఇట్లనియె = దేవయాని ఈవిధముగా ననెను.

తా :- శర్మిష్టకోపమున నట్లు పలుకగా నదివిని దేవయాని యామెతో నిట్లనెను.

78.క॥ 'ఉసు రొక్కటియై బొందులు
వెసరెండుగ నుండి, వల్వ వీడ్వడుటకుఁగాఁ
గసరెద, విది తగవగునా?
పసిబిడ్డవె? వాయి తెఱచి పల్కెదవు చెలీ!' - 78

టీక :- చెలీ! ఉసురొక్కటియై = ప్రాణమొక్కటియై, బొందులు = శరీరములు వెసన్ = క్రమముగా, రెండుగ నుండి, వల్వ = చీర, వీడ్వడుటకుగాన్ = వేరైనందులకు, కసరెదవు = కసురు కొందువు, ఇది తగువగునా = ఇదిన్యాయమేనా! వాయి తెఱచి పల్కెదవు = నోరుచేసి మాటాడెదవు, పసిబిడ్డవె = నీవు పసిదానవా! అంత ఎరుగవా!

తా :- ఓ సఖీ! మనము ప్రాణమొకటియై శరీరములు రెండుగా బ్రతుకు చున్నాము గదా! నీవు చీర తారుమారైనందులకే ఇంతగాకసరు చున్నావు. ఇది న్యాయమేనా! నోరు చేసి మాటాడు చున్నావు. నీవేమి పసిదానవా! అనగా అంత తెలియని దానవా! అని తాత్పర్యము.

79.క॥ అనవుడు నుడుగకఁ మిక్కిలి
కినుకం గేరడము లాడ, గేలిగఁ గొనుచు
న్విని విని వేసరి యొర్వక,
యెనసిన వగతోడఁ గూడ నీపడు చని యెన్ -79

టీక :- అనవుడున్ = అనినపిమ్మట, ఉడుగక = మానక, మిక్కిలికినుకన్ = మిగుల కోపముతో, కెరడము లాడన్ = నిష్ఠూరము లాడగా, గేలిగ కొనుచున్ = వానిని పరిహాసముగా తీసికొనుచు, వినివిని, వేసరి = చివరకు విసిగి, ఓర్వక =

ఓర్చుకొనలేక, ఎనసిన వగ తోడగూడఁ = ఆమాటలకు కలిగిన దుఃఖముతో గూడ, ఈ పడుచు = ఈచిన్నది, అనియెఁ = ఇట్లనెను.

తా :- దేవయాన అట్లన్నప్పటికి కామె మానక కోపముతో నటులే నిష్ఠురము లాడగా నీమె యవి పరిహాసముగా తలచి విని విని విసిగి పోయి చివరకు దాని నోర్చుకొనలేక మనస్సులో కలిగిన దుఃఖముతో ఈమె ఇట్లనెను.

శర్మిష్ఠ దేవయానిని నూత ద్రోయుట

80. మత్తకోకిల:-

'ఓలి రక్కసి వంగడంబున కొజ్జ కూరిమి కూఁతుర
న్నేల వేలుపుఁ గన్నియం దగ నీవు గట్టిన పుట్టముం
దాలుపం దగు నమ్మ, నా' కని దాని కర్మిలిఁ బల్కఁదా
నాలకింపక నూతఁ ద్రోచి గయాళి యై చనియెన్వడిన్ - 80

టీక :- ఓలి ! = తగినట్టి, గీ॥ ఓగివరుస యోలి, పొందినానోజ నాగ- క్రమమునకు నాఖ్యలు - ఆం.శే.16. రక్కసి వంగడంబునకు = రాక్షస వంశమునకు, ఒజ్జ = గురువైన యతనికి, కూరిమి కూతురఁ = గారాబపుబిడ్డను, నేలవేలుపు కన్నియఁ = బ్రాహ్మణ కన్యను - తగఁ = ఒప్పునట్లుగా, నీవు కట్టిన పుట్టముఁ = నీవు ధరించిన వస్త్రమును, నాకు, తాలుపం దగునమ్మ = ధరింప వచ్చునా, అని, దానికి = ఆమెకు, అనగా నామె మాటలకు, అర్మిలిఁ బల్కఁ = బదులుగా ననగా, తాఁ = ఆమె, ఆలకింపక = ఆమాటలు వినక, గయాళియై = గయ్యాళితనమున, వడిఁ =వేగమున, నూతద్రోచి = ఈబావిలో త్రోసి, చనియెఁ = వెళ్లెను.

తా :- ఓసీ శర్మిష్ఠా నేను మీరక్కసి వంశమునకు తగినట్టి గురువైన శుక్రాచార్యుని గారాబు బిడ్డను. బ్రాహ్మణ కన్యను, కనుక నాకు మాత్రము నీవు కట్టిన వస్త్రమును కట్టవచ్చునా యని యామె మాటలకు బదులు పలుకగా నామె వానిని విని పించుకొనకయే గయ్యాళి తనమున నీమెను బావిలోనికి త్రోసి వెళ్ళెను.

81వ॥ అని యక్కాలికి తెఱం గెఱింగించిన విని కటకటం
బడుచు మగిడి పొగడం దగు తేజి నెక్కి మక్కువతో
యయాతి తన ప్రోలికిం జనియె, నిట దేవయాని యు శర్మిష్ఠ
చేసిన యెగ్గుఁ దలంచుచుం జనిచని - 81

టీక :- అని, అక్కలికి తెఱంగు = (ఆ+ కలికి) ఆయొక్క శర్మిష్ఠ విధము, ఎఱింగించినన్ = తెలుపగా, విని, కటకటం బడుచు = బాధపడుచు, మగిడి = తిరిగి, పొగడందగు = ప్రశస్తమైన, తేజినెక్కి= గుఱ్ఱమునెక్కి, మక్కువతో = ప్రేమతో, యయాతి తనప్రోలికిం జనియె = తనపట్టణమునకు వెళ్ళును, ఇట = ఇక్కడ, దేవయానియు శర్మిష్ఠచేసిన యెగ్గు= శర్మిష్ఠ చేసిన కీడు, తలంచున్ = తలచు కొనుచు, చనిచిని = వెళ్లి.

తా :- అని ఆశర్మిష్ఠ యొక్క విధము తెలుపగా నాయయాతి మహారాజు మనస్సున బాధపడి తిరిగి తన యొక్క గుఱ్ఱము నెక్కి తమ పట్టణమునకు వెళ్లెను. ఇక్కడ దేవయాని శర్మిష్టచేసిన కీడు తలచు కొనుచు నూతినుండి బయటికి వచ్చిన పిమ్మట నాయరణ్యమున వెళ్లుచు -

82.క॥ తనతోడ వచ్చు ఘూర్ణిక
యను చెలికత్తియను జూచి యయ్యింతి మదిం
బెనఁ గొను వగలం బొగులుచుఁ
గనుఁ గొనల గినుక వొడమఁగాఁ దమకమునన్ - 82

టీక :- తవతోడ వచ్చు = తనవెంటవచ్చు, ఘూర్ణికయను చెలికత్తియను జూచి = ఘూర్ణికయను నామెను చూచి, అయ్యింతి (ఆ+ఇంతి) ఆమె, మదిన్ = మనస్సునందు, పెనుగొను వగలన్ = అల్లుకొనిన దుఃఖముతో, పొగలుచు = బాధపడుచు, కనుగొనలన్ = కటాక్షములందు, కినుక వొడమగా = కోపము కలుగగా, తమకమునన్ = పూనికతో అనగా పట్టుదలతో -

తా :- అపుడు తన వెంట వచ్చుచున్న ఘూర్ణికను చూచి, యామె తన మనస్సును అల్లుకొనిన దుఃఖముతో బాధపడుచు తనుకొలకులలో కోపము కనిపించు చుండగా పట్టుదలతో -

శుక్రుడు వచ్చి దేవయాని నోదార్చుట

83.తే॥ ''చెలువ'' వృషపర్వువీడు నేఁ జేరనొల్ల
నయ్యకీ జాడ నుడువు నీ; వనుడు నదియుఁ
జని యెఱింగించుటయు వంత పెనఁగొనంగ
నొంటిఁ గాల్నడ రక్కసి యొజ్జ వచ్చి - 83

టీక :- చెలువ = ఓసీ ఘూర్ణికా! నే = నేను, వృషపర్వు వీడను = వృషపర్వుని పట్టణమును, చేరనొల్లఁ = చేరుటకు సమ్మతింపను, అయ్యకు = మాత్రంగ్రికి, ఈజాడ = ఈవిషయము, నీవు, నుడువు = చెప్పుము, అనుడుఁ = అనగా, అదియుజని = అదివెళ్లి, ఎఱింగించుటయు = విషయము శుక్రాచార్యునికి తెలుపగా, వంత పెనగొనంగ = దుఃఖము కలుగగా, రక్కసి యొజ్జ = రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు, ఒంటి = ఒక్కడే, కాల్నడ వచ్చి = కాలినడకతో వచ్చి-

తా :- ఓసీ ఘూర్ణికా! నేను వృషపర్వుని పట్టణమునకు రాను. నీవువెళ్లి మాతండ్రికీ విషయము చెప్పుమనగా నామె వెళ్లి అదిచెప్పెను. అది విని శుక్రాచార్యుడు బాధపడి ఒక్కడే కాలినడకతో కూతురున్న యెడకు వచ్చి -

విశే :- ఈసందర్భమున నాంధ్ర భారతమున -

శర్మిష్ఠ ... . తన్నురోయుచు వచ్చు ఘూర్ణిక యను పరిచారికంగని యేను వృషపర్వుపురంబు సొరనొల్ల శర్మిష్ఠచేత నాపడిన యవమానంబు మదీయ జనకున కెఱింగింపు మని పంచిన నదియును నతిత్వరిత గతింజని - యని నన్నయ వ్రాసెను.
ఆది 3-145. తనకావ్యమున
ఈ వచనమునే తెలగన పద్యీకరించెను.

84.సీ॥ కలువలు ముత్యాలఁ గనియెడునో నాఁగఁ
బొరిఁ బొరిఁ గన్నీటి బొట్లు జాఱ
నిరు లాఁకట మెసంగి యెరవేయు చుక్కలో
నాఁ గప్పుఁ గొప్పున ననలువ్రేల
వలఁబడ్డ జక్క వల్వలె వల్వ పయ్యెద
నిట్టూర్పులను జన్ను మిట్టలదరఁ
గళుకులై తమ్మిపైఁ గ్రమ్ము మంచును బోలె
మొగమునఁ జెమట తుంపురు లెలర్పఁ

తే॥ బండి వాడిన యల దొండ వంటి వదిగి
మొనసి వఱువట్లు వట్టి కెమ్మోవి దనరఁ
జెన్ను దఱిగిన సొగపు తో విన్ననైన
దేవయానిఁ గనుంగొని తెగచి వగచి - 84

టీక :- కలువలు ముత్యాల గనియెడునో = కలువపూవులు ముత్యముల నీను చున్నవేమో, నాగన్ = అననట్లుగా, పొరిపొరిన్ = మాటిమాటికి, కన్నీటిబొట్లు = కన్నీటి చుక్కలు, జాఱన్ = స్రవించుచుండగా, ఇరులు = చీకట్లు, ఆకటన్ మెసంగి = ఆకలితో తిని, యెరవేయు చుక్కలో = నెమరు వేయుచున్న చుక్కలేమో, సీ॥ ఆహారమాకలి యవని పన్నగములు, పఱగుచునుండును నెరయు నంగ - ఆం. భా.3-64. నాన్ = అనగా, కప్పుగొప్పున = నల్లని కొప్పులో, ననలుప్రేల = పూవులు ప్రేలాడు చుండగా/ వలబడ్డ = వలలో పడిన, జక్కవల్వలె = చక్రవాకముల వలె, వల్పెపయ్యెదన్ = పలుచని పయ్యెదలో, నిట్టూర్పులను = (నిడు+ఊర్పు) దీర్ఘశ్వాసలతో, చను మిట్టలదర = ఉబికిన రొమ్ములు కదులుచుండగా / కళుకులై = ప్రకాశించునవై, తమ్మిపై = తామరపై, గ్రమ్ము మంచునుబోలె = క్రమ్మిన మంచువలె, మొగమున = ముఖముపై, చెమట తుంపురులు = చెమట బిందువులు, ఎలర్పన్ = ఒప్పుగా/ పండి వాడిన = బాగుగా పండి వాడిపోయిన, అల = ఆయొక్క, దొండపంటి పగిది = దొండపండు వలె, మొనసి = ఒప్పి, వరువట్లుపట్టి = మిక్కిలిగా నెండ బారి, కెమ్మోవి = ఎఱ్ఱని పెదవి, తనరన్ = ఒప్పుగా, చెన్ను తరిగిన = కాంతి తగ్గిన, సొగసుతో = అందముతో, విన్ననైన = చిన్నబోయిన, దేవయానిని, కనుంగొని = చూచి, తెగచి వగచి= కలిగి దుఃఖించి -

తా :- కలువ పూలు ముత్యాల నీను చున్నవేమో యన్నట్లు కన్నీటి చుక్కలు రాలుచుండగా చీకట్లు చుక్కల నాకలికి మేసి నెమరువేయు చున్నవేమో యన్నట్లు కొప్పునుండి పూలు జారుచుండగా, వలలో బడిన జక్కవలవలె సన్నని పైటలోని చున్నులదురు చుండగా తామరపై కప్పు మంచు బిందువుల వలె ముఖముపై చెమట బిందువులు ప్రకాశించు చుండగా బాగుగా పండి వాడిపోయిన దొండ పండు వంటి పెదవి మిక్కిలి తడియూరి వట్టుకట్టగా కాంతి తగ్గిన యందముతో చిన్న బోయిన దేవయానను చూచి కలిగి పోయి దుఃఖించి -

అర్థవిశే :- ఇరులాకట మెసంగి యెరవేయు చుక్కలోనా - అను పాదము ఎరవేయు అనగా ఆహారముగా గ్రహించు, తిను, అను నర్థములున్నవిగాని ఆకట మెసంగి యనుటలోనే ఆక్రియ పూర్తియైనది. కనుక నెరవేయుట యనగా నిచట నెమరు వేయుట యని చెప్పవలెను.

పశువులు తాము తినిన గడ్డిని నెమరునకు తెచ్చు కొని మరల నములునపుడు ఆపరకలు కొన్ని క్రిందపడుచుండుట గూడ నరుదుగా జరుగును కనుక -

''ఎలుతురంతామేసి ఏరునెమరేసింది'' - అను జానపద ప్రయోగము గూడ నున్నది కనుక పై యెరవేయుటకు నేను నెమరు వేయుట యను యర్థమును చెప్పితిని.

''అలం - ఉత్ప్రేక్ష''

85.క॥ మును ఘూర్ణికచే వినుటం
దనకూఁతుం గారవించి, 'తలిరుంబోఁడీ,
చనునే వగవఁగ నొక యెడ
ననయమునగు నలువకైన నవుగాము లొగిన్ - 85

టీక :- మును = అంతవరకు, ఘూర్ణికచే వినుటన్ = ఘూర్ణికతో వినినందువలన, తనకూతుం గారవించి = తనబిడ్డను గౌరవించి, తలిరుంబోడి = చిగురుటాకు వంటి, కోమలమైన దానా!, తగునే వగవగ = దుఃఖించుట తగునా, ఒక యెడన్ = ఒకప్పుడు, నలువకైన = బ్రహ్మకైనను, ఔగాములు = మేలుకీళ్లు, ఒగిన్ = క్రమముగా, అనయమున్ = ఎల్లపుడును, అగున్ = అగును

తా :- తానంతవరకు ఘూర్ణికతో జరిగిన విషయము వినిన వాడు కనుక తనబిడ్డను బుజ్జగించి, ఓదేవయానా! ఈవిధముగా దుఃఖించుట తగునా! బ్రహ్మకైనను మేలుకీడులు క్రమముగా నొక్కొక్కప్పుడు జరుగుచుండును గదా!

86.తే॥ కొమ్మ శర్మిష్ఠ తారాచు కూఁతు రగుట
నెఱుఁగ కీలాగు నిచ్చోట నెగ్గొనర్చి
తప్పుచేసిన, నది నీకుఁ దడవఁ దగునె,
కొండికయుఁ గాదె యదియు, నట్లుండె వినుము - 86

టీక :- కొమ్మ = ఓదేవయానా! శర్మిష్ఠ, తారాచకూతురగుట = తాను రాజుబిడ్డ కావున, ఎఱుగక = తెలియక, ఈలాగు నిచ్చోట = ఇచ్చట నీవిధిగా, ఎగ్గొనర్చి = కీడు చేసి, తప్పు చేసినన్, అదినీకు తడివ నగునె = లెక్కింప వచ్చునా, కొండికయు గాదె నదియు = అది అనగా ఆశర్మిష్ఠ, కొండికయుగాదె = పిల్లయేగదా, అనగా

నీకంటె చిన్నదేగదా యని భావము. అదియు యట్లుండె = అదియట్లుండని వినుము -

తా :- ఓ దేవయానా ! శర్మిష్ఠ తాను రాజకూతురు కనుక ఎరుక లేక నీవిధముగా యిక్కడ నీకు ఆపదకలిగించి తప్పుచేసినది. అది నీవు లెక్కపెట్టవచ్చునా! ఆమె చిన్నపిల్లగదా! యది యట్లుండని - వినుము.

విశే :- శర్మిష్ఠ రాచకూతురు. కొండుక యది- దానితోడి దేమి రమ్మనిన - అని యాంధ్రమహాభారతము - ఆది-3-148.

నన్నయ్యగారు చెప్పిన రాచకూతురు-కొండుక- యను రెండు విశేషణములను తెలగన్న విడువకుండ శర్మిష్ఠకు వాడుట నిచట గమనింప దగిన యంశము.

87.ఉ॥ చెన్నగు మానికంబులును జెల్వగు గుఱ్ఱము లేనుఁగుల్పదా
ర్వన్నె పసిండి కోర్కి గడువంగను బాఱుల కిచ్చి యెన్నియేఁ
జన్నము లెన్నఁ జేయుచు నసంబున మీఱెడు వారుసాటియే,
కన్నియఁ యల్కలేక యొడికంబుగ నుండెడి ప్రోడ కెయ్యెడన్ -87

టీక :- చెన్నగు = అందమైన, మానికంబులును = మాణిక్యములు, చెల్వగు = అందమైన, గుఱ్ఱములు, ఏనుగుల్, పదార్వన్నె పసిండి = పదియారు వన్నెల మేలిమి బంగరు, కోర్కి గడువంగను = కోరికలు తీరునట్లుగా, పాఱుల కిచ్చి = బ్రాహ్మణులకిచ్చి, యెన్నియేఁజన్నవములు = ఎన్నియో యజ్ఞవములు, ఎన్నిజేయుచునను = గణించునట్లుగా చేయుచు, అసంబున మీఱెడు వారు = కీర్తి కెక్కిన వారు, కన్నియ = ఓదేవయానా! అల్కలేక = కోపము లేకుండ, ఒడికంబుగఁ = నేర్పుతో, ఉండెడి, ప్రోడకు = నేర్పరికి, ఎయ్యెడఁ = ఎక్కడనైనను, సాటియే = సమానమైన వారుందురా!

తా :- ఓ దేవయానా! మాణిక్యములు, గుఱ్ఱములు, ఏనుగులు, మేలిమి బంగారము కోరికలు దీరునట్లుగా బ్రాహ్మణులు కిచ్చుచు యెన్నెన్నో యజ్ఞములు చేసి కీర్తి కెక్కిన వారందరు ఎప్పుడైనను అక్రోధునకు సాటిరారు.

విశే :- అనుపమ వినయాన్వితులై
యనూన దక్షిణల గ్రతు సహస్రంబులు సే
సిన వారికంటె నక్రో
ధనుడు కరంబధికుడంధ్రుడు తత్త్వవిధి జ్ఞల్
అనిమూలము తెలగన్న పైపద్యమున నన్నయగారి దక్షణలను మాత్రము విస్తరించెను.

88.కII తిట్టినఁ గొట్టిన బన్నము
ముట్టిన నలుకయును వగపును దొఱఁగుచునె
ప్పట్టున నలరిన మరలం
బుట్టువు వారలకు లేదు పువ్వుం బోఁడీ! - 88

టీక :- తట్టిన = తాకిన, కొట్టిన = దండించిన, బన్నము ముట్టినన్ = అపజయము కలిగినను, అలుకయును = కోపమును, వగపు = దుఃఖము, మును = మొదట, తొఱగుచున్ = విడుచుచు, ఎప్పట్లునన్ = ఎప్పుడును, తనరినన్ = ఒప్పిన యెడల, పువ్వుంబోడి = ఓదేవయానా! మరలం బుట్టువు = మరుజన్మము, వారలకు లేదు.

తా :- ఓ దేవయానా! ఇతరులు తాకినను, కొట్టినను, అవమానము కలిగినను, కోపము దుఃఖమును ఎప్పుడు పొందని వారికి మరు జన్మముండదు.

విశే :- ఈసందర్భమున నన్నయగారు

కII అలిగిన నలుగక యెగ్గులు
పలికిన మరి వినని యట్ల ప్రతివచనంబుల్
పలుకక బన్నము వడి యెడఁ
దలపకయున్న తడ చూవె ధర్మజ్ఞుడిలన్ - ఆది.3.147

అని మహాభారతము ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రం బని- పలుకుదురని వ్యాసమహర్షి హృదయము తన పద్యమున నావిష్కరించగా తెలగన్న యటులగాక తనపద్యమున జన్మరాహిత్యమును గోరుము ముక్షువుల మార్గమును తెలిపెను.

89.వII కావున నలుక నలకువకు నిలుకడ యగుట, దానివిడు
వ వలయుఁ, దెలియు, మదియు నుంగాక ప్రోచు వారి
యెడ నొక్క కొదవ గలిగిన మది నిడం దగ, దిదియేమి
రమ్మనపుడు దేవయాని యతని కిట్లనియె - 89

టీక :- కావున, అలుక = కోపము, అలకువకు = న్యూనతకు, నిలుకడ యగుట = స్థానయగుట వలన, దాని, విడువ వలయు, తెలియుము, అదియుంగాక, ప్రోచువారి యెడ = రక్షించు వారి దిక్కునుండి, ఒక కొదువ = కొరత, కలిగిన, మదిని డందగదు = మనస్సులో నుంచుకో దగదు, ఇదియేమి, రమ్ము, అనవుడు = అనినపిమ్మట, దేవయాని, అతనికిట్లనియె.

తా :- కనుక కోపము న్యూనత మూలమగుట వలన దానిని విడువ వలెను. ఇది తెలిసికొనుము. అదిగాక రక్షించువారి యెడ ఏదేనొక కొరత కలిగిన యెడల దానిని మనస్సున నుంచుకొనదగదు. కావున రమ్మనగా దేవయాని యిట్లనెను.

క॥ కోపము నుబ్బును గర్వము
నాపోవక యునికి యును దురభిమానముని
ర్వ్యాపారత్వము ననునివి
కాపురుష గుణంబులండ్రు కౌరవనాథా!
అని విదురునిమాట
మహాభార- ఉద్యో 2-32

90.క॥ నిండుఁ దలంపునఁ దగరా
పొండను గారవములేని పొరపొచ్చెము నం
గొండంత పసిఁడి యిచ్చిన
నుండంగాఁ దగునె వారి యొద్దం దండ్రీ -90

టీక :- తండ్రీ! నిండు దలంపునన్ = నిండైన మనసుతో, తగన్ =తగినట్లుగా, రాపొండను గారములేని = రండి పొండి అను గౌరవము లేని, పొరపొచ్చెమునన్ = వేర్పాటున, కొండంత పసిడి యిచ్చినన్ = కొండత బంగార మిచ్చినటప్పుటికి, వారి యొద్దన్ = వారిదగ్గర, ఉండగా దగునె = ఉండదగునా!

తా :- తండ్రీ! నిండైన మనసుతో రండిపొండి అను గౌరవము లేని భేదము గల చోట కొండంత బంగార మిచ్చినను ఉండవచ్చునా!

ఈ సందర్భమున -
కడుననురక్తియు నేర్పును
గడకయు గలవారిను కగడవగ నెగ్గల్
నొడివెడు వివేక శూన్యుల
కడనుండెడు నంతకంటె కష్టము గలదే -
ఆది 3.149 అని నన్నయ

91.క॥ నెలకొను చుట్టఱికంబును
జెలికారము మునుపుఁ దనకు జేసిన మేలుం
దలఁపక యెగ్గులు పలికెడు
ములుచలకడ నుండిరేని మోసము వచ్చున్ - 91

టీక :- నెలకొను = నిలిచి యుండు, చుట్టరికంబును, చెలికారము = స్నేహము, మునుపు = పూర్వము, తనకు చేసిన మేలున్, తలపక = తలుచుకొనక, యెగ్గులు పలికెడు = దూషించెడు, ములుచల కడఁ= దుష్టుల దగ్గర, ఉండిరేని = యెవరైన నున్నయెడల, మోసము వచ్చుఁ =మోసము కలుగును -

తా :- స్థిరముగా నిలిచి యుండు స్నేహము, తనకు మొదట చేసిన యుపకారము, తలచుకొనక, దూషించెడు గుణము గల దుష్టులచెంత నెవరైన నుండిన యెడల మోసము కలుగును-

మచ్చికలేనిచోటనను మాసము వచ్చిన చోట మెండుగా
కుచ్చితులున్నచోట గుణకోవిదులుండని చోట విద్యకుఁ
మెచ్చనిచోట రాజు కరుణించని చోట వివేకులుండిరే
నచ్చట మోసమంద్రు సుగుణాకర పెమ్మయ సింగధీమణీ!
-అని సింగధీమణి చాటువు

92.వ:-'కావున నేను వృషపర్వుని వీడు సొరనొల్ల' ననిన నతండు -

టీక :- కావున నేను, వృషపర్వుని వీడు = వృషపర్వుని పట్టణము, చొరనొల్లననిన = చేనుటకంగీకరింపను. అనగా, అతడు-

తా :- కాబట్టి నేను వృషపర్వుని పట్టణమును ప్రవేశింపననగా నతడు -

93.కII 'పట్టీ, నినుఁ బాసిన నా
కెట్టు మెయి న్నిలుచు? నుసులు నేడుగడయు నె
ప్పట్టునను నీవ, నీతో
నెట్టనఁ జనుదెంతు' ననుచు నెగులునఁ బలికెన్,' -93

టీక :- పట్టీ = ఓకూతురా! నినుబాసినఁ = నిన్ను విడిచిన యెడల నాకు + ఎట్టు మెయిన్నిలుచు = ఏవిధముగా దేహము నిలుచును, అనగా మరణింతుననుట, ఉసురులు = పంచప్రాణములు, ఏడుగడయు = తల్లిదండ్రిగురువు దైవము మొదలైన యాధారము, ఎప్పట్టునను = ఎప్పుడు గూడను, నీవ = నీవె, నీతో= నీవెంటనే, నెట్టన = అవశ్యముగా, చనుదెంతు ననుచు = వత్తునని నెగులునఁ = దుఃఖముతో పలికెను.

తా :- ఓ కూతురా! నిన్ను విడిచిన యెడల నాకేవిధముగా దేహము నిలుచును, నాయొక్క పంచప్రాణములుగాని, ఏడుగడ గాని అన్నియు నీవే, నేను నీవెంటనే తప్పక వత్తును. అనెను - ఇచట

విశే :- .... శుక్రుండు నాకు నీవగతివి నీతోడనేను వత్తుననుచు కూతుంబట్టువరచు చున్నంత .....

ఆది 3-150 అని మూలము.

వృషపర్వుడు శర్మిష్ఠను దేవయానికి దాసిగా నిచ్చుట

94.వ॥ అత్తెరంగున నుండ వృషపర్వుం డటకు వచ్చి వంతతో
నెంతయు విన్ననై యున్న కన్నియం దొడలపై నిడుకొని
బడలికఁ గడలేక కడలు కొను నడలునం దగులు నొజ్జలం
గనుంగొని మ్రొక్కి యిట్లనియె - 94

టీక :- అత్తెరగున నుండ= ఆవిధముగా నుండగా, వృషపర్వుడు + అచటికి వచ్చి, వంతతో = దుఃఖముతో, ఎంతయు = మిక్కిలిగా, విన్ననై = చిన్నబోయి, ఉన్న, కన్నియన్ = బిడ్డను, తొడలపై నిడుకొని = తొడలపై ఉంచుకొని, బడలికన్ = అలసట చేత, కడలేక కడలుకొను = అంతము లేక వ్యాపించు, అడలునన్ = దుఃఖమున, తగులు = చిక్కి నట్టి, ఒజ్జలంగనుగొని = గురువులను చూచి, మ్రొక్కి = నమస్కరించి, ఇట్లనియె-

తా :- వారావిధముగా నుండగా వృషపర్వు డచటికి వచ్చి దుఃఖముతో మిక్కిలి చిన్నబోయి యున్న బిడ్డను తొడపై యుంచుకొని యలసటతో నంతులేని దుఃఖమున చిక్కిన గురువును చూచి నమస్కరించి యిట్లనెను-

విశే :- ఇచట - అంతయు చారుల వలన నెఱింగి వృషపర్వుండు శుక్రునొద్దకు వచ్చి - యని ఆంధ్రమహాభారతము ఆది -3-150

తెలగన్న ఈవిషయము వృషపర్వునికెట్లు తెలిసెనో తెలుపలేదు.

నన్నయ గారు ''అంతయు చారుల వలన నెరింగి'' అని యిచట తనలోకజ్ఞతను ప్రకటించెను-

95.సీ॥ 'దేరములోఁ దెఱగంటిదొర నింగలపు వేల్పు
గడిమి గెల్చినది నీకతనఁ గాదె
కలనిలో జముని రక్కసి ఱేని నెదిరించి
గాసిఁ బెట్టుటయు నీకతనఁ గాదె
యనిలోన నీటి రాయని గాడ్పుఁ దెరలించి
వెతమాలు టెల్ల నీకతనఁ గాదె
కయ్యాన జక్కుల గమికాని ముక్కంటిఁ
గుతిల వెట్టుటయు నీకతనఁగాదె

తే॥ తమ్మి చూలియు వెన్నుండుఁ దలఁకి మాకుఁ
గలగు చుండుట యెల్ల నీకతనఁ గాదె,
కాకయుండినఁ దలఁప రక్కసులకెల్ల
బేరు నిల్చునె జేజేల పేర్మికతన?' -95

టీక : ఓ ఆచార్యా! దురములో = యుద్ధమున, తెఱగంటి దొరࡨ = ఇంద్రుని, ఇంగలపు వేల్పుࡨ = అగ్నిదేవుని, కడిమిࡨ =శౌర్యముతో, గెల్చినది = జయించినది, నీకతࡨ = నీవలననేగదా, కలనిలోࡨ = యుద్ధమున, జమునిࡨ = యముని, అక్కసితేనిࡨ = నిర్రుతిని, ఎదిరించి, గాసిబెట్టుటయు = బాధించుట, అనిలోన = యుద్ధమున, నీటిరాయని = వరణుని, గాడ్పుࡨ = వాయుదేవుని, తెరలించి = జయించి, వెతమాలుట= బాధలు పొందకుండుట/, కయ్యానࡨ = యుద్ధమున, జక్కులకమికాని = యక్షరాజైన కుబేరుని, ముక్కంటిని = శివుని, కుతిల పెట్టుటయు = బాధించుట/, తిమ్మచూలియు = బ్రహ్మ, వెన్నుండు = విష్ణువు, మాకు, తలకి = జడిసి, కలగుచుండుట యెల్ల = క్షోభపడుట యంతయు, నీకతనగాదె = నీవలననేగదా!, కాకయుండిన = అటుల గాని యెడల, తలపࡨ = ఆలోచించగా, జేజేల పేర్మికతనࡨ = దేవతల యొక్క గొప్పదనము చేత, రక్కసుల కెల్లࡨ = రాక్షసులందరికి, పేరునిల్చునె = పేరునిలుచునా -

తా :- యుద్ధమున నింద్రుని, అగ్నిదేవుని, యముని, నిర్రుతిని, వరుణుని, వాయువును, కుబేరుని, శివుని జయించినది నీవలననేగదా! ఓ ఆచార్య నీవలననే దేవతలందరు మమ్ము తలుచుకొని జడియు చుందురు. నీవులేని యెడల దేవతల యొక్క గొప్పదనమున రాక్షసుల పేరు నిలుచునా! అనగా నిలువదనుట -

''అలం - ఉదాత్తము''

96.కII అనిపలికి దేవయానిం
గనుఁగొని రక్కసుల ఱేఁడు 'కలఁగకు నీకీ
కిను కేమిటఁ దీఱెడు నది
వినిపింపు మొనర్తు నట్ల వేగిర' మనుడున్ - 96

టీక :- అని పలికి, దేవయానిం, కనుగొని = చూచి, అక్కసుల ఱేడు = రాక్షసరాజు, కలగకు = క్షోభపడకు, నీకీకిను కేమిట దీరెడుర్ = నీకు ఈకోపము దేనివలన తీరును, అదివిని పింపుము = దానిని తెలుపుము, వేగిరము = వెంటనే, అట్ల = ఆవిధముగా, ఒనర్తున్ = చేయుదును, అనుడుర్ = అనని పిమ్మట

తా :- అనిచెప్పి దేయానను చూచి ఆవృషపర్వుడు, అమ్మాయీ బాధపడకు నీకీ కోపమెట్లు తొలగునో చెప్పుము, దానిని నేను వెంటనే చేసెదను. అనగా -

విశే :- ఈదేవయాని కేది యిష్టంబు దాని యిత్తునడుగుమనిన -
ఆది -3-153 అనిమూలం

97.వ:- దేవయాని యిట్లనెను - 97

టీక :- దేవయాని యిట్లనియె = ఆమె ఇట్లనెను.

98.కII 'అట్టేని నీదుకూరిమి
పట్టిని శర్మిష్ఠ, నాకుఁ బనిసేయంగాఁ
గట్టడసేయు మటన్నను
నెట్టన రక్కసుల ఱేడు నెమ్మది లోనన్' - 98

టీక :- అట్టేని = అట్లయిన, నీదుకూరిమి పట్టిని = నీయొక్క గారాబు కూతురును, శర్మిష్ఠ నాకు, పనిసేయంగా = నేను చెప్పిన పని చేయునట్లుగా, కట్టడ సేయుము = నియమింపుము, అటన్నర్ = అనగా, రక్కసులరేడు = దానవరాజు, నెట్టనర్ = చక్కగా, నెమ్మదిలోనర్ = తననిండు మనస్సుతో -

తా :- అట్లయిన నీయొక్క గారాబు బిడ్డ యైన షర్మిష్ఠను, నేను చెప్పిన పనులు చేయునట్లుగా నియమింపుము, అనగా నాదానవరాజు తన మనస్సున చక్కగా నాలోచించి -

విశే :- అట్లేని శర్మిష్ఠ కన్యకా సహస్రంబుతో నాకు దాసిగా వలయు నిదియ నాకిష్టంబు దీని నయిచ్చునది యనిన - ఆది -3-153

ఈ విషయమునే తెలగన కందమున పాడిగెను.

99.క॥ కర మలరి కూఁతురను పెం
పరయక యాతండు దేవయాని కొసఁగె వే
వురి విరిఁబోఁడుల తోడుత
వరుసను శర్మిష్ఠఁ దెచ్చి వరవుడు గాఁగన్ -99

టీక :- కంమలరి = మిక్కిలి సంతసించి, కూతునకు పెంపరయకఁ = బిడ్డయని గొప్పదన మెంచక, ఆతడు, వేవురు విరిబోణుల తోడుత = వేయిమంది కుసుమ సుకుమారమైన వారిలో, వరుసను = క్రమముగా,శర్మిష్ఠ దెచ్చి = శర్మిష్ఠను తీసుకొనివచ్చి, వరవుడు కాగఁ = దాసియగునట్లుగా, దేవయాని కొసగెఁ = దేవయానికిచ్చెను.

తా :- ఆమాట విని అతడు మిక్కిలి సంతసించి, తనకూతరను గొప్పను చూడక నామెను వేయిమంది చెలికత్తెలతో తెచ్చి దాసిగా దేవయాని కిచ్చెను.

100వ:- అప్పుడు వృషపర్వుండు తన కూఁతు సంతసిల్లు దేవ
యానిం జూచి శుక్రున కిట్లనియె

టీక :- అప్పుడు, వృషపర్వుండు తనకూతునిచ్చుటకు = తనకూతురును ఇచ్చినందులకు, సంతసిల్లు = సంతోషించు దేవయానిం జూచి, శుక్రునకిట్లనియె = శుక్రునితో నిట్లనెను.

తా :- అప్పుడు వృషపర్వుడు తనకూతురు నిచ్చినందువలన సంతసించిన దేవయానిని చూచి శుక్రునితో నిట్లనెను.

101.క॥ 'ఏడ న్మీ కొలమింటం
జూడము ముంగురులు గూడుచుం గొనబునని
ట్టేడేటి కట్టు దప్పిన
చేడియ, నిఁకనైనఁ బెండ్లి సేయం దగదే!' - 101

టీక :- ఏడఁ = ఎచటగూడను, మీకొలము = మీకులమునందు, అంటంజూడము =చూడమనుట, ముంగురులు గూడచుఁ = అలకలు కూడుచు, - సీ॥ అలకలు

కురులను నలదురు బహుతచే, వరలు ముంగురులన భ్రమరకములు - ఆం.భా 2-144 - గొనబునన్ = సౌందర్యమున నొప్పి, యిట్టీడేరి = ఇట్టు+ ఈడేరి = ఈవిధముగా వయస్సు వచ్చి, కట్టుదప్పినన్ = మితిదప్పిన, చేడియన్ = యువతిని, ఇకనైనన్ = ఇపుడైన, పెండ్లిసేయందగదే = పెండ్లిచేయకూడదా!

తా :- ఓ ఆచార్యా! యిట్టిది మీకులమున ఎచటను చూడము. నీకూతురు అలకలు ముడికి గూడుచు సౌందర్యమున మించి యిటుల వయసు మితి దప్పు చున్నది యికనైన వివాహము చేయకూడదా!

102.ఆ॥ అనిన శుక్రుఁ డనియె 'నా సోఁకు ఱేని తోఁ
గలదు దీనికొకటి కచుఁడు దొల్లి
పెలుచ నేలవేల్పుఁ బెండ్లిగాకుండెడు
మనుచుఁ గినుకఁ బలికి యతఁడు చనియె - 102

టీక :- అనినన్ = అనగా, శుక్రుడనియె, నాసోకుఱేనితో = ఆరాక్షస రాజుతో శుక్రుడిట్లనెను - కలదు దీనికొకటి = దీనికి ఒక కారణము కలదు, కచుడు తొల్లి = పూర్వము కచుడు, పెలుచన్ = నిష్ఠురముగా, నేలవేల్పు = బ్రాహ్మణుడు, పెండ్లిగా కుండెడు = వివాహ మాడకుండుగాక, అనుచు, కినుక బలికి = కోపముతో శపించి, అతడు చనియె = అతడు వెళ్లెను.

తా :- అనగా శుక్రుడా వృషపర్వునితో దీనికొక కారణము గలదు, పూర్వము కచుడనువాడు కోపమున ఈమెను బ్రాహ్మణుడు వివాహము కాకుండుగాక! అని శపించి వెళ్ళెను.

103.తె. అందుకతనమున నీయింతి కెందుఁ దగిన
చెలువు నెవ్వనిఁ గూర్చునో నలువ యనుచు
వంత నున్నాఁడఁ గాక, యీ వాలుగంటి
పెండ్లి దూఁగించు టది యెంత పెద్ద మాకు - 103

టీక :- అందుకతనమున = ఆకారణమున, ఈ యింతి = ఈమెకు, నలువ = బ్రహ్మదేవుడు, ఎందుదగిన = ఎక్కడను తగినట్టి, చెలువుని = భర్తను, ఎవ్వని గూర్చునో యనుచు = ఎవరిని ఏర్పరచునోయని, వంతనున్నాడ గాకన్ = చింతతో నున్నాను గాని, ఈ వాలుగంటి = ఈ మె యొక్క, పెండ్లి తూగించుట = పెండ్లి నేర్పరచుట, ఇది ఎంత పెద్ద మాకు = ఇది ఎంత పెద్ద విషయము-

తా :- అందువలన నీమెకు తగిన పతిని బ్రహ్మ ఎవరిని ఏర్పరచునో యని చింతతో నున్నాను. గాని లేని యెడల ఈమె యొక్క పెండ్లి నేర్పరచుట నాకు ఏమంత పెద్దవిషయము.

104వ:- అనవుడు - అనిన పిమ్మట

105.క॥ 'అయ్యో, కచుఁడన నెవ్వం?
డయ్యో, యీముద్దరాలి నట్లనఁగఁగతం
బెయ్యది!' యనవుడు నత్తొలి
దయ్యంబుల యొజ్జ వలికెఁ దగ నాతని తోన్ - 105

టీక :- అయ్యో ! కచుడనెవ్వండు = కచుడనగా నెవడు, అయ్యో = అయ్యో పాపము, ఈ ముద్దరాలిన్ = ఈముగుదను, అట్లనగ గతం బెయ్యది = అట్లు శపించుటకు కారణమేమి. అనవుడు = అనగా, అత్తొలిదయ్యంబు యొజ్జ = (అ+తొలి = అత్తొలి) పూర్వ గీర్వాణు లైన యారాక్షసుల గురువు, అతని తోడన్, తగన్ = పలికెను, ఇట్లు చెప్పను-

తా :- అయ్యో! ఆకచుడనగా నెవడు – పాపమీముద్దరాలి నట్లు శపించుటకు కారణమేమి యనగా దానవ గురువైన యా శుక్రాచార్యుడిట్లనెను –

శుక్రుండు కచుని వృత్తాంతము వృషపర్వునకు జెప్పుట

106.సీ॥ వినుమన రక్కసులును వేలుపులుఁ దొల్లి
కలనిలోఁ బోరాడి పొలియుచుండఁ
దెగిన సోఁకుడు మూఁక మగుడ నాబలు విద్దె
పెంపుచే బ్రదికి యింపెల్లు చుండ
జేజేలు పొలిపోయి చేయునట్టిది లేక
కింకతోఁ బొగిలి యాకీ లెఱింగి
యిది నేర్చిరాఁ బ్రోడ యెవ్వఁడో యని చాలఁ
దలపోసి తమ యొజ్జ దండ కరిగి
తే॥ విన్నఁ దనములచే సొంపు చెన్ను దఱిగి
యందఱును మ్రొక్కి ముందఱ కరుగు దెంచి
కలక డగ్గుత్తికల చేత నెలుఁగు రాలు
పడుచు నుండంగ నిట్లని పలికి రపుడు - 106

టీక :- విను = వినుము, మనరక్కసులును = రాక్షసులకు, వేలుపులు = దేవతలు, తొల్లి = పూర్వము, కలనిలోఁ = యుద్ధమున, పోరాడి = కొట్లాడిపాలియుచుండఁ = మరణించుచుండగా/ తెగిన సోకుడు మూక = మరణించు రక్కసులు, మగుడఁ = తిరిగి, నాబలువిద్దె = నాయొక్క గొప్పనైన విద్యయొక్క, పెంపుచే = గొప్పదనముతో, బ్రతికి = జీవించి, అంపిల్లుచుండఁ = విజృంభించుచుండగా/ జేజేలు = దేవతలు; పాలివోయి = మొక్కవోయి, చేయునట్టిది లేక = ఏమియు చేయలేక, కింకతో = బాధతో, - గీ ...... తెలుపు కింక నారొగ సంజ్ఞయై కెరలుచుండు - ఆం. భా. 2-124-పొగిలి = దుఃఖపడి, ఆకీలెఱింగి = ఆయొక్క రహస్యమును తెలుసుకొని, ఇది = ఈవిద్య; నేర్చి రాఁ = నేర్చికొని వచ్చుటకు, ప్రోడయెవ్వడోయని= సమర్థుడెవడోయని, చాలతలపోసి = మిక్కిలిగా నాలోచించి, తమ యొజ్జ = తమయొక్క గురువుగారి, దండ కరిగి = సమీపమునకు వెళ్ళి, విన్నదనములచే = చిన్న బోయిన రీతితో, సొంపు = అందము, చెన్నుదరిగి = కాంతి హీనమై, అందరును బ్రొక్కి = అందరు నమస్కరించి, ముందటకరుగుదెంచి = ముందుకు వచ్చి, కలకఁ = దుఃఖముతో, డగ్గుత్తికల చేతఁ = రుద్ధ కంఠములతో, ఎలుగురాలు పడుచు నండగ = ధ్వని కీచుపడుచుండగా, ఇట్లని పలికి రపుడు = అపుడు యిట్లని పలికిరి-

తా:- ఓ వృషపర్వుడా చెప్పెదను వినుము. పూర్వము మన రాక్షసులు దేవతలు యుద్ధములు చేసినపుడు మరణించుచుండగా, నందు మరణించిన రక్కసులు తిరిగి నాయొక్క విద్యా బలమున బ్రతుకు చుండ దేవతలు కుంఠితులై యేమియు చేయలేక, దుఃఖముతో ఆవిద్యయొక్క రహస్యమును తెలిసికొని రాగల సమర్థుడెవడో యని మిక్కిలిగా నాలోచించి, తమ గురవుగారి చెంత కేగి కాంతిదరిగి చిన్నవోయి, అందరు గూడ నమస్కరించి ముందునకు వచ్చి రుద్ధకంఠముతో యెలుగురాలు పడుచుండగా ఇట్లనిరి -

107.తే రాజు మగఁడైన వెనుకను గాఁజఁ గడియ
మన్నసామెత నిక్కంబె యయ్యె మాకు
నీవుగల్గియు నిటువంటి నెగులుగల్గె
నింక మాచంద మేమని యెన్నుకొనఁ? - 107

టీక :- రాజుమగడైన వెనుకను = రాజేమగడైనప్పుడు, గాజుకడియ మన్న సామెత = కడియముగాజు అన్నట్లుగా, గాజు వెలలేనిది, కడియము వెలగలది, కనుక రాజే భర్తయైనపుడిక కడియములకేమికొరత వానిని గాజుగా ధరింతురు- నిక్కంబెమయ్యె మాకు = మాకు నిజమయ్యెను, నీవు కల్గియు = నీవుండి గూడ, ఇటువంటి నెగులు కల్గె = ఇటువంటి యాపద వచ్చెను. ఇంక, మాచందమే మని = మావిషయమే మని, ఎన్ను కొనగ= చెప్పకొనవలెను.

తా :- ఆచార్యా! రాజు మగడైన పిమ్మట కడియము గాజైన సామెత మాపట్ల నిజమైనది కాని నీవుండ గూడ మాకిటువంటి యాపద వచ్చినది. మాస్థితి యింక నేమని చెప్పుకొనవలెను.

విశే : గాజు కడియమగు-

స్త్రీలు కడియములను గాజులకు రక్షణగా వానిముందు ధరింతురు. కనుక గాజనగా రక్షణ లేనిది కడియమనగా రక్షణ గలది. మరియు గాజనగా వెలలేనిది కడియమనగా వెలగలదని తాత్పర్యము. గాజు కడి యమైన దనగా అల్పమైన దైనను దానివిలువ పెరిగినదని కడియము గాజైన దనగా విలువైన దైనను తన విలువ కోల్పోయిన దని యర్థము కాగా -

స్త్రీకి రాజే భర్తయైన పుడిక కడియముల కేమి కొదువ. అవి గాజులతో సమానమే అంతకు మించి యపుడామెకు కంకణములు గలుగును. బృహస్పతికి "గీష్పతి" యని యొక పేరు.

బృహస్పతి సురాచార్యోగీష్పతిర్ధిషణో గురుః అని యమరము.

గీష్పతి యనగా వాక్కుల కధిపతి కనుక వాక్కులకే యధిపతియైనపుడు మంత్రములన్ని నతని యధీన మందే యుండును. అందువలన వారికి కమృత సంజీవనీ విద్యకేమి కొదువ. ఇంకను దానిని మించినది గూడ గలిగియే తీరవలెను. కాని యిపుడు దేవతలకు గీష్పతి గురువుగా నుండియు అట్టిదేమి కలుగలేదని పై సామెత యొక్క భావము.

"అలం - లోకోక్తి"

108. క॥ విను ఋసులును వేల్పులు
నని యెడి నీరెండు దెగల, నాశుక్రుండు నీ
వునుఁ దగ నడిపెడి వా, రతఁ
డని నీల్గిన పొలసుఁదిండ్ల నందుఁ జమనుపన్ - **108**

టీక :- విను = వినుము, రక్కసులును = రాక్షసులను, వేల్పులు = దేవతలు, అని యెడు = అనునట్టి, ఈ రెండు తెగలన్ = ఈ రెండు జాతులలో, ఆశుక్రుడు, నీవును, తగక = ఒప్పునట్లుగా నడిపెడివారు = నడుపుచున్నట్టివారు, అతడు, అని నీల్గిన = యుద్ధంబున మరణించిన, పొలసు దిండ్లనందఱక = రక్కసులందరిని, మనుపక =రక్షింపు చుండగా-

తా :- చెప్పెదను వినుము, రాక్షసులను ఆశుక్రుడు, దేవతలమైన మమ్ము నీవు నడుపు చుండగా యుద్ధమున మరణించి ఆరక్కసులందరిని శుక్రుడు రక్షించుచుండగా-

109.కll బలిసిరి రక్కసు లనిలోఁ
బొలిసినవా రెల్ల మన cగc, బోయిన పోకై
యలసిరి వేల్పులు మగుడం
దలకొను బ్రదు కాసలేమిc దలcపవు దీనిన్ - 109

టీక :- అనిలోన్ = యుద్ధమున, పొలసినవారెల్లక = మరణించిన వారందరు, మనగక = బ్రతుకగా, బలిసిరి రక్కసులు = రాక్షసులు బలవంతులైరి, (రక్కసులు బలిసిరి) వేల్పులు = దేవతలు, పోయిన పోకై = పోయిన దేపో కడగా - అనగా మరల తిరిగి రాకుండ, మగుడక = తిరిగి, తలకొను బ్రదుకు = బ్రతుక గలుగుట, ఆసలేమి = ఆశలేకుండుట వలన, అలసిరి = బలహీనులైరి, తలపవు దీనిక = దీనిని నీవాలోచించుట లేదు.

తా :- శుక్రుని యొక్క విద్యాబలమున, యుద్ధమున మడసిన రక్కసులందరు బ్రతికి బలిసి పోవు చుండగా చచ్చిన వారు మరల బ్రతికెదరను నాసలేకుండుట వలన దేవతలు బలహీనులయిరి. నీవు దీని నాలోచించుట లేదు.

110.కll అనయము నీతో సరివాc
డనిలో రక్కసుల మొనల నన్నిటి మనపం
దనవారిc బ్రోవcడితc డన
వినుచును, నీసడికి నెట్లు వెఱవవు, తంండ్రీ ! - 110

టీక :- తండ్రీ = ఓ ఆచార్యా, అనయముక = ఎల్లపుడు, నీతోసరివాడు = నీతో సమానమైన సాటివాడు, అనిలోక = యుద్ధమున, రక్కసుల మొనలక = రాక్షస సైన్యములను, అన్నిటి మనుపక - అన్నిటిని కాపాడుచుండగా, ఇతడు, తనవారిక,

బ్రోవడు = కాపాడని, వినుచును, ఈసడికి = ఈయపవాదకు, నీవేట్లు వెరవవు = నీవేవిధముగా భయపడవు.

తా :- ఓ తండ్రీ! ఎల్లపుడు నీసాటి వాడైన శుక్రుడు యుద్ధమున చచ్చిన రాక్షసులందరిని బ్రతికించు చుండగా, ఇతడు తనవారిని కాపాడడు అని చెప్పు కొనుట వినుచు గూడ నీయపవాదుకు నీవేవిధముగా వెరచుట లేదు.

111.తే॥ ఒరునిఁ బ్రోచుట కొఱుకుఁగా నరుగు దెంచి
చెనఁటి నైనను వేఁడఁగా జెల్లుఁ బుడమి,
వెఱచు జేజేలగమిఁ బ్రోవ వెన్నుఁ డరిగి
రక్కసుని వేఁడె, నతనికిఁ దక్కు వేమి! - 111

టీక :- ఒరుని బ్రోచుట కొఱకుగా = ఇతరుని రక్షించుట కొరకై, అరుగు దెంచి = వచ్చి, చెనటినైనను = దుష్టుని నైనను, వేడగా జెల్లుపుడమి = ప్రపంచమున వేడుట యొప్పును, వెఱచు = శత్రువులకు భయపడు, జేజేలగమి బ్రోవ = దేవతలను కాపాడుటకై, వెన్నుడరిగి = విష్ణువు వెళ్ళి, రక్కసుని వేడి = దానవుడైన బలిచక్రవర్తిని యాచించెను. అతనికి తక్కువేమి = అతనికేమి తక్కువ -

తా :- ఓ ఆచార్యా! ఇతరులను కాపాడుటకై ఒక నీచుని గూడ ప్రపంచమున యాచింపవచ్చును, అది దోషముగాదు. పూర్వము దానవులకు భయపడు దేవతలను కాపాడుటకై విష్ణువు వెళ్ళి బలిచక్రవర్తిని యాచింప లేదా! అతనికేమి తక్కువ.

శుక్ర బృహస్పతుల వృత్తాంతము -

భృగ్వంగి రసు లిద్దరు బ్రహ్మపుత్రులైన యాది ఋషులు, భృగువు బ్రహ్మయొక్క హృదయమునుండి అంగిరసుడతని యొక్క మనస్సు నుండి పుట్టిరి.

భృగుమహర్షికి పలువురు భార్యలు కలరు. హిరణ్యకశిపుని కూతురైన ''దితి'' యితని మొదటి భార్య. ఆమెకు కవి, దేవ వర్ణిని అనువారు కలిగిరి. కర్దముని పుత్రికయైన ఖ్యాతి రెండవ భార్య. ఆమెకు ధాత, విధాత అనుకుమారులు కలిగిరి. పులోమయను దానవ కాంత ఇంకొక భార్య. ఆమెకు చ్యవన మహర్షి కలిగెను. ఉశన ఇంకొక భార్య ఆమెకు శుక్రుడనువాడు కలిగెను.

అంగీరసుని భార్యశివ. ఆమెకు ఉతథ్యుడు, బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనసుడు, బృహస్పతి, బృహన్మంతుడు, బృహద్భానుడు, సంవర్తనుడు, అంగీరసుడు అని పదిమంది కుమారులు, భానుమతి, రాక, సినీవాలి, గుహువు, అర్చిష్మతి, మహిష్మతి, మహామతి, యోగసిద్ధి అని ఎనిమిది మంది పుత్రికలు కలిగిరి.

అంగీరసుని సంతానమున ఉతద్యుడు పెద్దవాడు. అంగీరసుడు చిన్నవాడు, బృహస్పతి వారి నడిమివాడు. ఆసోదరులో నీముగ్గరే ప్రసిద్ధులు. కూతులలోయోగసిద్ధ ప్రసిద్ధ -

బాల్యమున బృహస్పతి మరియు శుక్రుడు అంగీరసుని కడనే చదివిరికాని కొంతకాలమునకు శుక్రుడు అంగీరసుడు తనకు విద్యసరిగా చెప్పుటలేదని యతనిని విడిచి వెళ్లి గౌతము నాశ్రయించెను.

వారు పెద్దవారైన పిమ్మట బృహస్పతిని దేవత లాచార్యునిగా వరించగా శుక్రుని దానవులు గురువుగా చేసికొనిరి.

శుక్రుని భార్య ప్రియవతుని కుమారితయైన ఊర్జస్వతి. ఆమె యందతనికి చండుడు, అమర్కుడు, త్రాష్టుడు, ధరాత్రుడు అను వారు కలిగిరి.

బృహస్పతి తన విద్యాభ్యాస యోగాభ్యాసములలోనే పెద్దకాలము గడిపి ఈడు వ్రాలి వివాహము చేసికొనెను. అతని భార్య తార- బృహస్పతి దగ్గర అత్రిమహర్షి కుమారుడైన చంద్రుడు చదువుకొనెను. ఆకాలమున తార యతనిని మోహించి యతనికి బుధుడను కుమారుని కనును. అది యానాటి దేవలోకమున నొక పెద్ద గొడవ జరిగి సమసిన పిమ్మట నామె నిలద్రొక్కు కొని పిమ్మట బృహస్పతికి కచుడను కుమారుని కనెను.

దేవతల దగ్గర యమృత ముండెను. దానివలన యుద్ధములందు మరణించిన వారు బ్రతుకుచుండగా శుక్రుడు దానికి బదులు తాను రక్కసుల కొరకేదైన సంపాదింపవలెనని యాలోచించి గురువైన గౌతముని సలహాపై గౌతమీనదీ తీరమున కు వెళ్లి శివుని గురించి కణధూమ వ్రతమున తపము జేసి మెప్పించి యతనితో మృత సంజీవనీ విద్యను పొందెను.

ఆకాలమున అనగా శుక్రుడటుల తపము జేయు కాలమున దానిని భంగపరచుటకై సేవానెపమున నింద్రుడు తనకూతురగు జయంతిని నియోగించగా నపుడామెయందు శుక్రుడు దేవయాన యనెడు కన్యను గనెను.

శుక్రునకు ఇంతవరకే ఊర్జస్వతియను భార్య యుండెను ఆమె ప్రియవ్రతునికుమారిత. చండుడు అమర్కుడు ఈమెకుమారులు.

112.ఉ॥ దేవరపట్టి నిక్కచు మదిం బసిబిడ్డఁడు నాక, పేర్మిసం
జీవనిఁ దేరఁ బంపు, డది సేకుఱు నీతని చేతఁ బెంపునుం
జేవయుఁగల్గు వారలకుఁ జిన్నదనంబు దలంప వచ్చునే,
కావున దీని కియ్యకొనఁగాఁ దగు మాపయిఁ గల్గు ప్రేము డిన్ -

టీక :- దేవర! ఓస్వామీ, పట్టిని = మీకుమారుడైన, ఇక్కచు = ఈకచుని, మదిన్ = మనస్సున, పసిబిడ్డడు = చిన్నవాడు, నాకన్ = అనుకొనక, పేర్మిన్ = ప్రేమతో, సంజీవిని దేర బంపుడు = సంజీవిని తెచ్చుటకు పంపుడు, అది చేకురు నీతని చేత = ఇతనిలోనది మనకు లభించును, పెంపునున్ = గొప్పదనము, చేవయు = శక్తియు, కల్గువారలకు = కలవారలకు, చిన్నతనంబు = చిన్నతనము, తలంప వచ్చునే = తలప వచ్చునా! కావున, మీరు మాపయిగల్గు =మాపైని గల, ప్రేమ డిన్ = ప్రేమతో- దీనికియ్యకొనగాదగున్ = మీరు దీనికి ఒప్పుకొనవలెను.

తా :- ఓస్వామీ! మీకుమారుడైన ఈకచుని పసిబిడ్డడని తలపక ప్రేమతో సంజీవిని తెచ్చుటకు పంపుడు, అది యతని చే మనకు లభించును. గొప్పదనము మరియు సామర్థ్యము గలవారికి, చిన్నతనము తలపరాదు, కనుక మీరు మీపైగల ప్రేమతో దీనికంగీరించవలెను-

113.చ॥ అనవుడు నెట్టకేల కతఁ డర్మిలిఁ బంపఁగచుండు వచ్చి మ
మ్మును బొడగన్న మేమతని ముద్దు దొలంకెడు రూపుఁ జూచి ర
మ్మని కడుగారవించి మది నారసి కూరిమిఁ జెప్పుచుండఁగా
నొనరెడు నేర్పుచేఁ జదువు చుండెను దెల్విని దేవయానితోన్- 113

టీక :- అనవుడు = అనగా, ఎట్టకేలకు = చివరకు, అతడు, అర్మిలిబంపన్ = ప్రేమతో పంపగా, కచుండు వచ్చి = కచుడు వచ్చి, మమ్మును బొడ గన్నన్ = మమ్ము దర్శించగా,మేము, అతని, ముద్దులొలంకెండు మోము జూచి = ముద్దువచ్చెడు ముఖము చూచి, రమ్మని, కడుగారవించి = మిక్కిలి గౌరవించి, మదినారసి = అతని మనసెరగి, కూరిమి జెప్పు చుండగాన్ = ప్రేమతో విద్యచెప్పు చుండగా, ఒనరెడు నేర్పు చే = తనకు కలిగిన నేర్పువలన, దేవయానతోన్ = దేవయానతో తెల్విని = తెలివి గలిగి, చదువు చుండెను-

తా :- అనగా ఎట్టకేల కతడు ప్రేమతో తనకుమారుని బంపగా నాకచుడు వచ్చి మమ్ము దర్శించెను. మేమతని ముద్దువచ్చెడు ముఖము చూచి రమ్మని పిలుచుకొని మిక్కిలిగా గౌరవించి యతని మనసెరిగి ప్రేమతో, విద్యను జెప్పుచుండగా నతడు తనకు గల నేర్పువలన తెలివితో దేవయానతో పాటు చదువుచుండెను -

114.వ:- ఇట్లు చదువుచు

టీక :- ఇట్లు = ఈవిధముగా, చదువుచు-

115.క॥ చట్టుఁ దనంబునఁ గడుమా
పట్టునఁ గనికరముఁ గూర్మి బయలుపడంగా
నెట్టుకొని వేల్పు బొజ్జల
పట్టి కచుం డొరిమ తోఁడ బను లొనరింపన్ - 115

టీక :- చట్టుదనంబునన్ = శిష్యరికముతో, కడున్ = మిక్కిలి, మాపట్టునన్ = మాయెడల, కనికరము = దయ, కూర్మి = ప్రేమ, బయలు పడంగా = ప్రకటపడుచుండగా, నెట్టుకొని = ముందునకు చొచ్చుకొని, వేల్పు డొజ్జల పట్టి = దేవతాగురువైన బృహస్పతి కుమారుడు, కచుండు, ఒరిమతోడన్ = నేర్పుతో, ఏనులొనరించెన్ = మేము చెప్పిన పనులు చేసెను.

తా :- శిష్యత్వముతో కచుడు మాపై దయ, ప్రేమ కనిపించు చుండగా పనులందు ముందునకు వచ్చి నేర్పుతో మేము చెప్పిన వన్ని చేయుచుండగా -

116.ఉ॥ ఎన్నఁడుఁ గంటలేదు విను మిత్తెఱఁగెల్లనుఁ సోఁకురాయ, యీ
కన్నియదేవయాని మది గ్రమ్మెడు ప్రేముడి నిచ్చలుంగచు
గన్నులఁ గానకుండిన వగం దుఱపిల్లి యొడ ల్డొఱంగుఁదా
నున్నవి యేమి చెప్ప నిఁక, నుగ్మలికిం గల కూర్మి యెట్టిదో ! - 116

టీక :- సోకు రాయ = ఓదానవరాజా వినుము, ఇత్తెరగు = ఈవిధానము, ఎన్నడు గంటలేదు= (కనుట = కంట) ఎన్నడును చూడలేదు, ఈకన్నియ = దేవయాని, మదిగ్రమ్మెడి ప్రేముడి = మనస్సులో నిండిన ప్రేమ నిచ్చలున్ = ఎల్లప్పుడు, కచున్ = కచుని, కన్నుల గానకుండిన = కన్నులతో చూడకుండిన, వగన్ = బాధతో, దురపిల్లి = శోకించి, ఒడల దొఱంగు = శరీరము విడుచుటకు, సిద్ధముగా

నుండెడిది, ఏమి చెప్పనిక = ఇక ఏమి చెప్పవలెను, యుగ్మలికింగల = ఈ యువతికి అతని పైగల, కూర్మి యెట్టిదో = ప్రేమ ఎటువంటిదో,

తా :- ఓ దానవరాజా! వినుము, ఈవిధానము ఎన్నడును చూడలేదు. అదే మన కన్యయైన ఈదేవయాని మనస్సులో నిండిన ప్రేమతో ఎల్లపుడు కచుని చూడకుండిన శరీరము విడుచుటకు సిద్ధముగా నుండెడిది. ఈయువతికతని పై గల ప్రేమ యెట్టిదో! ఇక నేమి చెప్పవలె.

117.క॥ ఇత్తెఱఁగున దొయ్యలికి
నెత్తురు పొత్తగుచు నతఁడు నిచ్చలు మదిలో
హత్తిన ప్రేముడిఁ జదివెడు
నత్తఱి నొకనాఁడు ఱేపటంతఁ గడంకన్ - 117

టీక :- ఇత్తెఱగునన్ = ఈవిధముగా, తొయ్యలికి = ఈదేవయానకు, నెత్తురు పొత్తగుచు = ప్రాణస్నేహితుడై, అతడు, నిచ్చలున్ = ఎల్లపుడు, మదిలోన్ = మనస్సులో, హత్తిన ప్రేముడి = అతుకు కొనిన ప్రేమతో, చదివెడు నత్తరి = చదువు చుండగా, ఒకనాడు, ఱేపటంత = ప్రొద్దుననే, కడంకన్ = ఉత్సాహముతో -

తా :- ఈవిధముగా కచుడు దేవయానకు ప్రాణస్నేహితుడై ఎల్లపుడును మనస్సున గట్టిన నాటుకొని ప్రేమతో చదువు చుండగా నొకనాడుదయముననే ఉత్సాహముగా-

118.క॥ తనకుఁ దగునేల వేలుపుఁ
బనులెల్లను దీర్చి వేల్మి పసరముఁ గావన్
వెనుకొని యడవికి నరిగిన
గినుక రక్కసులు వాని గీటడఁచి వెసన్ - 118

టీక :- తనకు దగు = తనకు విహిత మైన, నేలవేలుపు పనులెల్లను = బ్రాహ్మణ కృత్యములన్ని, తీర్చి = ముగించుకొని, వేల్మి పసరము = హోమ ధేనువు, కావన్ = రక్షించుటకై, వెనుకొని = దానివెనుక, అడవికి నరిగినన్ = అడవికి వెళ్ళగా, కినుకన్ = కోపముతో, రక్కసులు = రాక్షసులు, వానిన్= వానిని, వెసన్ = వేగముగా, కీటడచి = వధించి-

తా :- కచుడు తనకు విహితమైన బ్రాహ్మణోచిత కృత్యములన్నియు ముగించుకొని హోమ

ధేనువును రక్షించుటకై దాని వెనుక అరణ్యమునకు వెళ్లగా కోపమున రాక్షసులు వానిని పట్టుకొని వధించి-

దానవులు కచుని చంపుట

119.తే॥ పట్టి యొక మ్రానితో నంటఁ గట్టి వైచి
మరల వచ్చిరి యంతఁ దామరల విందు
కచుని యునికికి నడలుచుఁ గడకుఁ బోవు
కరణిఁ గను పట్టి పడమటి కడలి మునిఁగె - 119

టీక :- పట్టి = పట్టుకొని, ఒక మ్రానితో = ఒక చెట్టు మ్రానుకు, అంటగట్టి వైచి = గట్టిగా కట్టివేసి, మరల వచ్చిరి, అంతన్ = అపుడు, తామరల విందు = సూర్యుడు, కచుని యునికికి = కచుని యొక్క స్థితికి, అడలుచు = దుఃఖపడుచు, కడకు బోవు కరణి = దూరముగా బోవునటుల, గనుపట్టి = కనిపించి, పడమటి కడలన్ = పశ్చిమ సముద్రమున, మునిగె = అస్తమించెను.

తా :- వారు కచుని చంపి, పట్టుకొని ఒక మ్రానికి గట్టిగా కట్టివేసి మరల వచ్చిరి. అపుడు సూర్యుడు కచుని యొక్క స్థితికి వగచి, దూరముగా వెళ్లుచున్నాడేమో అనునట్లుగా పడమటి సముద్రమున మునిగెను.

విశే :- ప్రకృతిని కథానుగుణముగా దర్శించి వర్ణించుట మహాకవుల ప్రతిభావిశేషములలో నొకటి -

నన్నెచోడుడు శివుని కంటి మంటకు మన్మథుడు బూడిద యైనపుడు రతిదేవికి చుట్టున్న వృక్షములన్ని దుఃఖచు చున్నటు -

అటులేపెద్దన హిమాలయమున ప్రవరుడు వరూధిని తిరస్కరించి వెళ్లినపుడు అస్తమించు సూర్యుడా ప్రవరునిపై కోపమున నెర్రబడినట్లు తరుణీన నన్య కాంత నతి దారుణ పుష్పశిలీముఖ వ్యథా - మను ఆ.2 అను పద్యమున వర్ణించిరి.

అలంకారము - ఉత్ప్రేక్ష

120.వ॥ కచుండు రామికి దేవయాని తద్దయు దురిపిల్లుచు నిట్లనియె -120

టీక :- కచుండు, రామికి = రానందులకు, దేవయాని, తద్దియు = మిక్కిలి, దూరపిల్లుచుఁ= చింతిల్లుచు, ఇట్లనియె = ఇట్లనెను.

121.తే॥ "అకట, ప్రొద్దుగ్రుంకె, నావులు చనుదెంచెఁ,
గచుఁడు రాఁడి దేమి కతమొ నేడు?
చిలువగములు రక్కసులుఁ గొట్టు మిట్టాడు
నడవి లోన నేమి యయ్యెనొక్కొ!"

టీక :- అకట = అయ్యో, ప్రొద్దుగ్రుంకె = సూర్యుడస్తమించెను, ఆవులు చనుదెంచె = ఆవులు ఇండ్లకు వచ్చెను, కచుడు రాడు, ఇదేమికత మొనేడు = ఈనాడు ఇదేమి కారణమో! చిలువగములు = సర్పములు, రక్కసులు = రాక్షసులు, కొట్టుమిట్టాడు = ఎగసిపడు, అడవి లోన, ఏమియయ్యెనొక్కొ = ఏమియాయెనోగదా !

తా :- అయో! ప్రొద్దుగ్రుంకెను, ఆవులింటికి వచ్చెను, ఈనాడు కచుడింటికి రాలేదు. ఇదేమి కారణమో, పాములు, రాకాసులు ఎగసి పడెడు యడవిలో నతడేమాయెనో గదా !

విశే :- ఇది గూడ తెలగన్న నన్నయ గారి యడుగు జాడలో నడచిన పద్యము చూ. భార. ఆది –

ఉ. వాడిమయూఖముల్గలుగు వాడపరాంబుధి గ్రుంకె ధేనువుల్
నేడిట వచ్చె నేకతమ నిష్ఠ మెయిన్ భవదగ్ని హోత్రముల్
పోడిగ వ్రేల్వగా బడియె ప్రొద్దును బోయెక చుండు నేనియుఁ
రాడు వనంబులోన మృగ రాక్షస పన్నగ బాధ నొందెనో

భార– ఆ. 3–112

122.క॥ అనివగచు దేవయానిం
గనుఁగొని లోఁ జూపు జేతఁ గాంచి కచుందేఁ
బనిచితి సంజీవని నది
యనువుగ మైనుసుఖు నించి యతనిం దెచ్చెన్ – 122

టీక :- అనివగచు = అనిదుఃఖపడు, దేవయానిఁ = దేవయానిని, కనుగొని = చూచి, లో జూపు చేత = దివ్య దృష్టితో, గాంచి = చూచి సంజీవనిని, కచుందే బనిచితి = కచుని తెచ్చుటకు పంపితిని, అది = ఆసంజీవనీ, అనువుగఁ = తగినట్లుగా, అతనిఁ

= అతనిని, మైనుసుఋనించి = శరీరమున ప్రాణములు నింపి, అతనిందెచ్చెఁ = అతనిని తెచ్చెను -

తా :- అని దుఃఖించు దేవయానిని చూచి దివ్యదృష్టితో కచుని గని సంజీవనిని అతనిని తెచ్చుటకు బంపగా నది యతనిని మరల బ్రతికించి కొనివచ్చెను.

123.వ॥ ఇట్లు, పెక్కు వరుసలు రక్కసులు యుక్కివంబున మక్కిన
బ్రదికింపనుండి వెండియు నొక్కనాడు - 123

టీక :- ఇట్లు = ఈ విధముగా, పెక్కువరుసలు = అనేక పర్యాయములు, రక్కసుల = రాక్షసుల యొక్క, ఉక్కివంబునఁ = మోసమున, మక్కినఁ = మరణించగా, బ్రతికింపనుండి = పునర్జీవితుని చేయుచుండి, ఒక్కనాడు -

తా:- ఈవిధముగా నతడనేక పర్యాయములు, రాక్షసుల యొక్క మోసమున మరణించి, బ్రతికింపబడుచుండగా నొకనాడు-

కచుని బూడిద దానవులు సురలో కలిపి శుక్రునికి త్రాపుట

124.క॥ అడవికి వేలిమి పసరము
బడిఁ జన, అక్కసులెఱింగి పట్టుకొని కచుఁ
వడిబూది చేసి నాకుం
దొడిం బడఁగాఁ గల్లునీటితో నిచ్చిరొగిన్ - 124

టీక :- అడవికి, వేలిమి పసరము = హోమదేనువు , పడజనఁ = వెంటబడిపోగా, రక్కసులెరింగి = రాక్షసులు తెలిసికొని, పట్టుకొని, కచుఁ = కచుని, వడిఁ = వేగముగా, బూదిచేసి = బూడిద జేసి, నాకుఁ, తొడబడిగాఁ = పూనుకొని, ఒగిఁ = తిన్నగా, కల్లునీటి తో నిచ్చిరి.

తా :- కచుడు అడవికి హోమదేనువు వెంట బడిపోగా రక్కసు లది తెలిసి యతనిని పట్టుకొని బూడిద చేసి దానిని తిన్నగా నాకు కల్లునీటితో కలిపి యిచ్చిరి.

అడవికి పువ్వులు దేరగ
వడినరిగిన కచుని జంపి వారకదనుజుల్
పొడవు సెడగాల్చి సురతోఁ
దడయక యిబ్బూది శుక్రుద్రావించి రోగిఁ - 3-114
అని మహాభారతము

125. ఉత్సాహ :-

గుట్టుతోడ నిట్లొసంగఁ గ్రోలి యేను నన్నుతో
గుట్టుపాటి యుండునంతఁ గ్రుంకు మెట్ట నెత్తపుం
జట్టు మీఁద బ్రొద్దు చేరె సంజ తోడ నీటిరా
పట్టపయ్య కెంపుగోడ పట్టు పైఁడి సాననాన్ - 125

టీక :- గుట్టుతోడఁ = రహస్యముగా, ఇట్లొసంగఁ = ఈవిధముగా నీయగా, క్రోలి = త్రావి, యేనునన్నుతో = నేను మైకములో, గుట్టు పాటి = మౌనము వహించి, ఉండునంతఁ = ఉండగా, క్రుంకు మెట్ట = అస్తమయపర్వతము యొక్క, నెత్తపుం చట్టు మీఁద = శిఖరముపై గల చదరపు శిలపై, సంజతోడ = సాయంకాలముతో, నీటిరాపట్ట పయ్య = వరుణుని యొక్క, కెంపుగోడ = ఎర్రని గోడు, పట్టు = తరిమెనవెట్టు, పైడిసాననాన్ = బంగారు సానయనగా, పొద్దు చేరెఁ = సూర్యుడు చేరెను.

తా : ఆవిధముగా వారు కచుని బూడిద కల్లులో కలిపి నాకు రహస్యముగా నీయగానేను మైకమున గుట్టుగా నుండగా అస్తమయపర్వత శిఖరముపై వరుణుని యొక్క ఎర్రని గోడ ను పట్టు బంగారు సాన యనునట్లుగా సూర్యుడు చేరెను.

''అలం - ఉత్ప్రేక్ష''

126.క॥ అక్కచుడు రామి నప్పుడు
పొక్కుచు నీ దేవయాని పొడము వగ నయో,
రక్కసుల చేత మడిసెనె,
యక్కటు, తనుఁ గన్నతల్లి యటమటఁ గడువన్! -126

టీక :- అప్పుడు, అక్కచుడు రామి = ఆకచుడు రాకపోవుట వలన, పొక్కుచుఁ = బాధపడుచు, ఈ దేవయాని, పొడమువగఁ = మనస్సులో కలిగెడు దుఃఖముతో, అయో = అయ్యో, అక్కట = అక్కటా! తనుగన్నతల్లి = తనను కన్నతల్లియైన తారాదేవి, అలమట గుడువఁ = దుఃఖమును పొందగా, కచుడు, రక్కసుల చేత మడిసెనె = రాక్షసులతో చచ్చెనా.

తా :- అపుడాకచుడు రాకపోవుట వలన దేవయాని మనస్సులో నుబికిన దుఃఖముతో అయ్యో! అతనిని కన్నతల్లి దుఃఖము ననుభవింపగా నతడు దానవులతో చచ్చెనా యని ముందరి పద్యముతో -

127.ఉ॥ అక్కరు లామొగంబు చెలు వాకను దమ్మిల సోయగంబు నా
యక్కును జేతు లానడుము నాపిఱు దా తొడ లాయొ యారపుం
బిక్కలు మెట్టc దమ్మిలును బ్రేముడి నామదిc బాయకుండగా
నక్కచు నెట్లుగా మఱతు? నాఅడి దయ్యమ! యింత చేసితే! - 127

టీక :- అక్కరులు = ఆవెంట్రుకలు, ఆమొగంబు చెలువు = ఆముఖము యొక్క అందము, ఆకనుదమ్మిల = ఆనేత్ర పద్మముల యొక్క, సోయగమ్ము = సౌందర్యము, ఆయక్కును = ఆఱొమ్ము, చేతులు, ఆనడుము, ఆపిరుదు, ఆతొడలు, ఆయొయారపుం బిక్కలు, మెట్ట దమ్మిలును = స్థల పద్మములైన పాదములు, ప్రేముడి = ప్రేమతో, నామదిబాయకుండగాс = నామనసును విడువకుండగా నుండగా, అక్కచుс = ఆకచుని ఎట్లుగా మరతుс = ఏవిధముగా మరతును, ఆతడి దయ్యమ = ఓ ఆరడిపెట్టు దైవమా, ఇంత చేసితే = అంతపని చేసితివా!

తా :- ఆవెంట్రుకలు, ఆవుుఖవుు, ఆకనులు, ఆఱొమ్ము చేతులు, ఆనడుము ఆపిఱుదులు, ఆతొడలు, ఆపిక్కలు, ఆపాదములు ప్రేమతో నామనసున నాటుకొని విడువకుండ నున్నవి. కావున ఆకచుని ఎట్లు మరతును, ఓదుష్టమైన దైవమా ఎంతపని చేసితివి.

విశే :- ఇందులో కచుని సౌందర్యము తల మొదలుకొని పాదముల వరకు వర్ణించ బడినది. దేవతలను పాదాది కేశ పర్యంతము మానవులను శిరము మొదలకొని పాదములపర్యంతము వర్ణించవలయునని సంప్రదాయము. తెలగన్న దేవజాతియైన కచుని శిరస్సు మొదలు కొని వర్ణించుట యనగా అతనిపై మానవత్వారోపణ చేయుట యనవలెను. అనగా కచుని యందు దేవకుమారుడుగా గాక ఉదాత్తమైన మానవ బాలకునిగానే రూపించెనని భావింపవలెను.

రామాయణమున వాల్మీకి గూడ శ్రీరాముడు దైవమైనను అతని నొక యాదర్శ మానవునిగనే చిత్రించెను.

ఈపద్యము పాండురంగ మహాత్మ్యమందలి నిగమ శర్మోపాఖ్యానమున గల పుత్రులు లేరె యెవ్వరికి - అనుపద్యమును తలపించును.

128.క॥ 'మునుc నలువ యెఱిcగి మదినా
కినుమునc గావింప బోలు నిమ్మెయిc గాకుం

డిన నింత తడవు కచునిం
గనుఁగొన కుండుటకు నెట్లుగా నెటు లోర్తుఁ?' - 128

టీక :- మును = మొదటనే, నలువ యెఱిగి = బ్రహ్మ దేవుడీ విషయ మెరిగి, మదినాకు = నాకు మనస్సును, ఇనుమున గావింప బోలుఁ = ఇనుముతో చేసి యుండవచ్చును. అనగా కఠినముగా ననుట, ఇమ్మెయిగాకుండిన = ఇటుల గాని యెడల, ఇంతతడవు = ఇంతసేపు, కచునిఁ, కనుగొనకుండుటకు = చూడకుండుటకు, ఎట్లుగాఁ = ఏవిధముగా, ఇటులోర్తుఁ = ఇటుల సహింతును.

తా :- ఇది మొదటనే బ్రహ్మదేవుడెరిగి నామనస్సును ఇనుముతో చేసియుండ వచ్చును. అటుల గాకున్న యెడల నేనింత సేపు కచుని చూడక ఏవిధముగా సహించగలను.

''అలం - ఉత్ప్రేక్ష''

129.క॥ అని వాఁడు రాకయుండిన c
దనమేను దొఱంగ మదిని దహతహ పడు దీ
నిని గాంచి చాల వేసరి
యెనసి నవగ డిందుపఱుప నేనిట్లంటిన్ - 129

టీక :- అని, అట్లు తలచి, వాడురాక యుండిన = కచుడు రాకున్న, తనమేను దొరంగఁ = తనయొక్క శరీరము విడుచుటకు, మదిని తహతహపడు = మనసులో తొందరపడే, దీనినిగాంచి = ఈమెను చూచి, చాలావేసరి = మిక్కిలి విసిగి, ఎనసినవగఁ = మనస్సులో రేగిన దుఃఖమును, డిందు పరుపఁ = అణచుటకై, ఇట్లంటిఁ = ఈవిధముగా నంటిని .

తా :- అని యనుకొని కచుడు రాకున్న తాను దేహమును విడుచుటకు తొందర పడుట చూచి నేను చెప్పి చెప్పి విసిగి, ఆమె మనసున రేగిన దుఃఖమణచుటకై ఈవిధముగా నంటిని.

130.క॥ వినువేల్పు టొజ్జ కొడుకని
కినుకఁ రక్కసులు వాని గీట డఁచెద, రా
తనకింత వగవ నేటికిc
జనుఁగా కలవుట్టు వేదు చక్కికిc గడcకన్ - 130

టీక :- వినం, ఓదేవయానీ యిటు వినుము, అతడు, వేల్పుటొజ్జ కొడుకని = సురాచార్యుడైన బృహస్పతి కొడుకని, కినుకన్ = కోపమున, రక్కసులు = రాక్షసులు, వానిన్ = అతనిని, కీటడచెదరు = వధించెదరు, ఆతనికి = అతనికై, ఇంత వగవ నేటికి = ఇంతగానెందుకు దుఃఖించవలె, కడకన్ = అతడు తనపూనికతో. అల = ఆయొక్క, పుట్టువేదు చక్కికి = జన్మరాహిత్యమైన స్థలమునకు, చనుగాక = పోయి యుండవచ్చును.

తా :- ఓదేవయాని యిటువినుము, అతడు బృహస్పతి కుమారుడని రక్కసులతనిని పగబట్టి చంపుచున్నారు. కనుక నతనికై యింత దుఃఖించుటెందులకు, వాడు మరల పుట్టని లోక మునకు వెళ్ళి యుండును. అనగా పరమధామమునకు చేరి యుండునని తాత్పర్యము.

వగవక సంజీవని పెం,
పగణిత గర్వమున నసురులాకచుతోడన్
బగగొని చంపెదరాతడు
సుగతికి జనుగాక నేల శోకింపంగన్- బా. 3-116

తెలగన తనపద్యమున ఈ పద్యమందలి యుత్తరార్థమును మాత్రము గ్రహించెను.

131.వ:- అనవుడు మిగుల వగల నొగిలి యిమ్మగువ యిట్లనియె - 131

టీక :- అనవుడు = అనగా, మిగుల = మిక్కిలిగా, వగలనొగిలి = దుఃఖమున కలిగి, ఇమ్మగువ = ఈమగువ యైన దేవయాని, ఇట్లనియె = ఇటనెను.

తా :- అనగా మిక్కిలి దుఃఖమున కలిగిపోయి ఈ దేవయాని యిట్లనెను.

132.చ॥ గొనముల ప్రోక యంగిరసు కూరిమి మన్మఁడు వేల్పు టొజ్జ పే
ర్మిని గనుఁగొన్న బిడ్డ మఱి మీకును జట్టు కడింది రూపు నే
ర్పును గడునేమముం గలుగు ప్రోడయితా తొలువేల్పు మూఁకచేఁ
జనిన కచుం దలంప, మది జాలిఁ గరంగదె యెట్టి వారికిన్ - 132

టీక :- గొనముల ప్రోక = సద్గుణముల రాశి, అంగిరసు కూరిమి మన్మడు = అంగీరసునికి ప్రియమైన పౌత్రుడు, వేల్పుటొజ్జ = దేవగురువు, పేర్మిని కనుగొన్న బిడ్డ = ప్రియముగా కనుకున్న కొడుకు, మరి = మరియును, మీకును జట్టు = మీకు

శిష్యుడు, కడింది రూపు నేర్పును = గొప్పనైన రూపము మరియు నేర్పుగలవాడు, కడునేమముంగలుగు ప్రోడ = మిక్కిలి నియముగల సమర్థుడు, అయి, తా = తాను తొలు వేల్పు మూకచే జనిన = రాక్షసులచే మరణించిన, ఎట్టి వారికిఁ = ఎటువంటి వారికైనను, మది = మనస్సు, జాలికరంగదె = జాలితో కరుగదా !

తా :- సద్గుణరాశి, అంగీరసుని ముద్దుల మనుమడు, సురాచార్యుని యొక్క ప్రియమైన పుత్రుడు మీకు శిష్యుడు, గొప్పనైన రూపసంపద మరియు నేర్పుగలవాడు, మిక్కిలి నియమము గలవాడు, ఇటు వంటి వాడయి తాను రాక్షసులచే చచ్చెననగా ఎటువంటి వారి కైనను మనసు జాలితో కరుగదా ! కరుగుననుట

విశే :- సద్గుణశాలి మరణించినపుడ తనిని గురించి యందరు జాలి బొందుట లోక సహజము.

''అలం – ఉదాత్తము''

133.సీ॥ జగములఁ గలిగింపఁ జాలు నల్మోగముల
దొరపట్టి యైన యంగిరసు మన్మఁ
డరయ వేల్పుల కెల్ల నయగా రనందగు
నుడుగు జేనికిఁ గూర్మి కొడుకుఁ గుఱ్ఱ
వేమాఱు నోఁచిన నోముల పంటయై
కనుపట్టఁగాఁ దార కన్నబిడ్డ
భృగువు మూఁడవ యప్పు తగఁ దీర్పఁ గలిగిన
పెను లిబ్బి వగు నీకు ననుఁగుఁ జట్టు
తే ॥ నేల వేలుపు మొదలిటి నమములకు
నెలవు, చెలువపు గమి కాఁడు, పిలుకుమారి
రక్కసుల చేతఁ బోయిన యక్కుమునకు
వగవ కెట్లోర్తు, మై యెల్ల నొగులఁ, దండ్రి! –133

టీక :- జగముల గలిగింపజాలు = లోకములను సృజింప సమర్థుడైన, నల్మోగముల దొర = బ్రహ్మ యొక్క, పట్టియైన = కుమారుడైన అంగీరసు మన్మడు/ అరయఁ = విచారించగా, వేల్పులకెల్లఁ = దేవతలకందరికి, అయగార నందగు = అయ్యవారు అనబడిన, నుడుగు జేనికి = బృహస్పతికి, కూర్మి కొడుకు గుఱ్ఱ = ప్రియమైన బిడ్డడు, వేమారు నోచిన = వేయితడవలు నోమిన, నోముల పంటయై =

నోముఫలమై, కనుపట్టగా = కనిపించునట్లుగా, తారకన్నబిడ్డ = తారాదేవి కన్నటువంటి కొడుకు/ భృగువు = భృగుమహర్షి యొక్క మూడవ యప్పు = ఋణత్రయము నచివరిదగు పితృఋణము, తగఁ = ఒప్పునట్లు, తీర్పగలిగిన, పెను లిబ్బివి = గొప్పసంపదవు, అగునీకు = అయినట్టి నీకు, అనుగు చట్టు = ప్రియమైన శిష్యుడు/ నేలవేలుపు = బ్రాహ్మణుల యొక్క, మొదలిటి నేమములకు = మొదటి నియమములకు, నెలవు = నిలయమైనవాడు/, చెలువపు గమికాడు = మిక్కిలి యందమైన వాడు /, పిలుకుమారి రక్కసుల చేత బోయిన = రాక్షసులచేత చచ్చిపోయిన, అక్కచునకు = ఆకచునికి, తండ్రీ! మైయెల్లనొగులఁ = శరీరమంతయు బాధపడగా, వగకెట్లోర్తుఁ= దుఃఖంచకుండ నెట్లుందును.

తా :- తండ్రీ! కచుడు బ్రహ్మ కుమారుడైన అంగీరసుని మనుమడు, దేవతల గురువైన బృహస్పతి యొక్క ముద్దులకొడుకు తారాదేవి నోముల పంట, భృగు మహర్షి వంశీయుడవై నీశిష్యుడు, బ్రాహ్మణ నియమములు గలవాడు, అందగాడు అటువంటివాడు రాక్షసులతో చచ్చెననగా దుఃఖించకుండ నెట్లుందును.

విశే :- 132వ పద్యభావమే యిందు పునరావృతమైనది. శుక్రుని భృగువు యొక్క ఋణత్రయము దీర్చిన లిబ్బియనుట శబ్దచమత్కారము.

''అలం - ఉదాత్తము''

134.ఆ॥ అతనిఁ జూచికాని యారగింప నటంచు
వగచు చన్న దీని తెగువ యెఱిఁగి
చిదిమి కడుపులోనఁ జేవెట్టి కలఁచిన
యట్లులైన నోర్వ కడలి యేను, -134

టీక :- అతని జూచికాని = అతనిని చూచికాని, ఆరగింపనటంచు = తిననని, వగచుచున్న = దుఃఖపడుచున్న, దీని = ఈమె యొక్క, తెగువ యెరిగి = సాహసము తెలిసి, చిదిమి = చితిపి, కడుపులోన, చేవెట్టి = చేయిపెట్టి, కలచిన యట్లులైన = మథించినట్లు కాగా, ఓర్వక = సహించక, అడలి యేను = నును హడలి పోయి -

తా :- అతనిని చూచి కాని నేను తినననని యిది దుఃఖపడుచుండగా ఈమె యొక్క తెగువ నెరిగి నాకు కడుపులో చేయిపెట్టి పిసికి నట్లు కాగా అది యోర్చుకొనలేక నేను హడలి పోయి -

హానిం జూచికాని కుడువ నొల్లనని దేవయాని యేడ్చుచున్న

ఆ-3-119

135.మ॥ విను లోఁజూపున నేలపై నడవులు, న్వీళ్లు న్మలల్ సంద్రముల్
పెనుదీవు ల్దగు పల్లియ ల్వెదకి హాళిం జిల్వ ఱేండ్లిమ్ము లుఁ
వినుద్రోవ ల్గడు వేలుపు న్నెలవు లన్నిం జూచి యేఁ గానతే
కనయంబున్మది నబ్రము న్వగపు నా కంతంతకుం గ్రమ్మఁగన్- 135

టీక :- విను = వినుము, లో జూపున = దివ్యదృష్టితో, నేలపై నడవులుఁ = భూమిపై గల యరణ్యములు, వీళ్లుఁ = పట్టణములు, మలఁ = కొండలు, సంద్రముల్ = సముద్రములు, పెనుదీవుల్= పెద్దపెద్ద ద్వీపములు, తగు పల్లియల్ = వెదుక దగినట్టి గ్రామము, వెదకి, హాళిఁ = ఆసక్తితో చిల్వ ఱేండ్లి మ్ములుఁ = నాగులయొక్క నివాసములు, అనగా పాతాళమును, వినుద్రోవల్ = ఆకాశమార్గములు, కడువేలు పున్నెలవులు = మిక్కిలిగా దేవతానివాసములు, మదినబ్రముఁ = మనస్సులో ఆశ్చర్యము, వగపు = దుఃఖము, నాకు, అంతంతకుఁ = అంతకంతకు అనగా పైపైగా, క్రమ్మగఁ = అలుమగా -

తా :- ఓ దానవరాజా! వినుము. నేను దివ్యదృష్టితో భూమిపైగల యడవులు, పట్టణముల, కొండలు, సముద్రములు, ద్వీపములు, పల్లెలు, వెదకి మరియు నాగలోకము, ఆకాశము, దేవతల యొక్క పట్టణములు అన్నిటిని చూచి నేను అతడెక్కడకనిపించక పోగా మనస్సున ఆశ్చర్యము మరియు దుఃఖము అంతకంతకు కమ్ముకొను చుండగా-

136.తే॥ మఱియు నట్లు చూడ మదిలోనఁ దోఁచినఁ
గంటిబూది యగుచుఁ గల్లుతోడఁ
గలసినాదు నిండుఁ గడుపు లోనన యున్న
కచుని సంతసంబు గడలు కొనఁగ - 136

టీక :- మరియు, అట్లుచూడ = ఆవిధముగా చూడగా, మదిలోన దోచిన = మనస్సులో కనిపించగా, బూదియగుచు = బూడిదయై కల్లుతోడ కలిసి = సురతో కలిసి, నాదు = నాయొక్క, నిండు కడుపు లోనన = నిండిన కడుపులోనే, ఉన్న కచుని, సంతసంబు = సంతోషము, కడలుకొనగా = అతిశయించగా, కంటిఁ = చూచితిని.

తా :- అటుల చూడగా నాకు మనస్సులో నగిపించి చూచు కొనగా బూడిదయై కల్లుతో కలిసి నిండిన నాయొక్క కడుపులోనే యున్న కచుని సంతోషమతిశయించగా చూచితిని.

137.క॥ కలుదోసంబున రాకా
సులు చేసిన యట్టి కాని చొప్పును మదిలోఁ
దెలిసికొని యలుక వొడమినఁ
గలఁగుచు నిట్లంటి నిజ్జగంబుల నిల్పన్ - 137

టీక :- కలుదోసంబున = మద్యము యొక్క దోషమున, రాకాసులు చేసిన = దానవులు చేసిన, అట్టికాని చొప్పును = అటువంటి కాని పనిని, మదిలో దెలిసికొని, అలుక వొడమినన్ = కోపము కలుగగా, ఇజ్జంగంబుల నిల్పన్ = ఈలోకముల నుద్ధరించుటకై, కలగుచు = మనస్సులో బాధపడిన వాడనై, ఇట్లంటిన్ = ఈవిధముగా నంటిని.

తా :- కల్లుత్రావెడు దోషము వలన రాక్షసులు చేసినట్టి కాని పనిని మనస్సున తెలిసికొని కోపము కలిగి, ఈలోకముల నుద్ధరించుటకై యిట్లంటిని.

138.క॥ 'తొలు బాముల బలునేమం
బుల తోడం బెక్కు జన్నములు సేయంగాఁ
గల తెలివిఁ జెఱచు నెయ్యెడఁ
గలుద్రావం దగునె యెఱుక గలవాఱలకున్!' - 138

టీక :- తొలుబాముల = పూర్వజన్మములలో, బలునేమంబులతోడన్ = అనేకమైన నియమములతో, పెక్కు జన్నములు సేయంగా = అనేకమైన యజ్ఞములు చేయగా, కలతెలివిని = కలిగిన జ్ఞానమును, ఎయ్యెడన్ = ఎట్టి సందర్భములందైనను, చెఱచును, ఎఱుకగల వారలకున్ = జ్ఞానము గలవారికి, కలుద్రావం దగునె = కల్లుత్రాగవచ్చునా !

తా :- పూర్వజన్మములలో అనేక నియమములతో ఎన్నియో యజ్ఞములు చేయగా కలిగిన తెలివి కల్లు ఎట్టి సందర్భములందైనను పాడు చేయును కావున జ్ఞానవంతులు కల్లు త్రాగరాదు.

ఈసందర్భరమందలి నన్నయగారి వాణి వినుడు

ఆ. మొదలి పెక్కు జన్మముల పుణ్యకర్మముల్
పరగ బెక్కు జేసి పదడ బడిన
యట్టి యెఱుక జనులకాక్షణ మాత్రన
చెఱచు మద్యసేవ సేయదగునె
భార - ఆది-3-120

శుక్రుడు కచునికి సంజీవనీ నుపదేశించుట

139.క॥ అనికలు ద్రావుట యెవ్వరి
కిని గాదని పలికి పంతగించుచు సంజీ
వని చేతఁ గడుపులోఁ గచు
ననువునఁ బ్రదికింపఁ దెలిసి యతఁడిట్లనియెన్ - 139

టీక :- అని = ఇట్లని, కలుద్రావుట = సురాపానము, ఎవరికిని గాదని పలికి = ఎవ్వరికిని కూడదని, పంతగించుచు = పంపముతో చెప్పి = అనగా కఠినమైన నియమమును చేసి, సంజీవని చేత, కడుపులో కచున్ = ఉదరమున నున్న కచుని, బ్రతికింపన్ = జీవింప జేయుగా, తెలిసి = అది అంతయు తెలిసి, అతడిట్లని యెన్ = అతడీవిధముగా ననెను.

తా :- ఇట్లని కల్లుత్రాగుట ఎవరికిని గాదని పంతము పట్టి చెప్పి సంజీవని చేత కడుపులో నున్న కచుని బ్రతికింపగా ఇదంతయు తెలసి యతడిట్లనెను.

140.ఉ॥ లావుఁ గడంక యున్మఱి నలంగని మేనును బొందఁగల్గినే
దేవర విద్దచే బ్రతికితిం, గదనీకడుపింక వెల్లనే
త్రోవయొ యానతీవలయుఁ దోచిన లాగున నన్నుఁబ్రోవఁగా,
నావుడు నోడకుండు మని నామది వీఁడరు దెంచు టెట్లొకో-140

టీక :- ఏన్ = నేను, దేవరవిద్దచే = తమ యొక్క విద్యచే, బ్రతికితిన్= జీవించితిని, లావు = బలము, కదంకయున్ = గొప్పదనము, మఱి, నలంగని మేనును = ఏబాధ పొందజాలని, శరీరమును పొందగలిగితి; తగన్ = తగునట్లుగా, నన్నుబ్రోవగన్ = నన్ను కాపాడుటకు, నీకడుపు = నీయొక్క పొట్టను, ఇంకన్, వెల్లన్ ఏత్రోవయో = యేమార్గమో, తోచిన లాగన్ = మీకు తోచిన విధముగా, ఆనతీయవలయున్ = ఆజ్ఞాపించ వలయును, నావుడు = అనగా ఓడకుండుమని- భయపడవలదని,

నామదిఁ = నామనస్సున, వీడరు దెంచు టెట్లకో = వీడేవిధముగా వచ్చునో అని - ముందరి పద్యముతో -

తా :- నేను మీయొక్క విద్యచే బ్రతికి బలమును, గొప్పదనమును మొక్క వోని శరీరమును పొందితిని, ఇక నీకడుపు నుండి వెళ్ళు మార్గమేదో తెలుపవలయును. అనగా నేను నీవు భయపడ వలదని నామనస్సులో వీడెట్లు బయటికి వచ్చునని యాలోచించి-

141.వ:- అని పలు దెఱంగులం దలపోసి - 141

క : అని పలుదెఱంగులఁ = అని అనేక విధముగా, తలపోసి = ఆలోచించి

1?.క:- వినుకడుపు ప్రక్కలించుచుక
జనుదేరఁగ సోలిపడ్డ నరగనె కడక
న్నను బ్రదికింపఁగ సంజీ
వనిఁ జెప్పితిఁ గచున కపుడు వదలని కూర్మిన్ - 142

టీక :- విను = ఓదానవరాజా వినుము, కడుపు వుక్కలించుచుకఁ = కడుపును పగుల్చుకొని, చనుదేరగఁ = బయటికి రాగా (నేను) సొలిపడ్డ = మరణించగా, నరగ = వెంటనే, కడకఁ = ప్రయత్నించి, నన్ను, బ్రతికింపగ = బ్రతికించుటకు కచునకు, అపుడు, వదలని కూర్మిఁ = విడువ రానట్టి ప్రేమచే, సంజీవని చెప్పితి = సంజీవనీ విద్య నుపదేశించితిని.

తా :- వినుము ఓవృషపర్వా ! కచుడు నాకడుపు పగుల గొట్టు కొని బయటికి రాగా నేను మరణించి నపుడు మరల నన్ను ప్రయత్నించి బ్రతికించుటకై అతనిపై గల ప్రేమచే సంజీవనీ విద్య నుపదేశించితిని.

143.తే॥ బ్రదుకుఁ ద్రోవ యిట్లు పరఁగ నేఁజెప్పినఁ
గచుఁడు వెడలె నిండుఁగడుపు వ్రచ్చి
పుట్టుగట్టు చఱిని బొడము తమ్మల విందు
కరణి మేని తెల్వి కడలు కొనఁగ - 143

టీక :- బ్రతుకు త్రోవఁ = జీవించు మార్గమును, ఇట్లు = ఈవిధముగా, పరగనే జెప్పిన = ఒప్పునట్లుగా చెప్పగా, నిండుకడుపు = నిండు గానున్న నాకడుపు, వ్రచ్చి = పగులగొట్టుకొని, పుట్టుగట్టుచని = ఉదయ పర్వతము యొక్క చరియపై, పొడము

= ఉదయించు, తమ్ముల విందు కరణి = సూర్యుని విధముగా, మేని తెల్వి = శరీర ప్రకాశము, కడలుకొనగ = వ్యాపించగా, కచుడు వెడలె = కచుడు బయటికి వచ్చెను.

తా :- కచునికి నేను జీవించు మార్గ మిట్లు చెప్పగా నతడు, ఉదయపర్వత శిఖరముపై పుట్టు సూర్యుని వలె శరీరము ప్రకాశించు చుండగా నాపొట్టను పగులగొట్టుకొని బయటికి వచ్చెను.

''అలం - ఉపమ''

క. ఉదరభిదాముఖమున న
భ్యుదితుండై నిర్గమించె బుధనుతుడుకచుం
డుదయాద్రిదరీముఖమున
మది తుండగు పూర్ణహిమమయూఖడ పోలెన్

భార. ఆ. 3-125

144.చ॥ చెలఁగుచు నిట్లుదాఁ గడుపు చించుచు వెళ్లిన, మేనిలోనును
ర్దాలఁగుట నేలపైఁ బడినఁ, దోడనె నన్బ్రదికించి నేర్పుతోఁ,
వెలసెను వానికిఁ = బ్రతుకు విద్దెయు మిక్కిలి పెంపుతోడవే
ల్పులు గొని యాడుచుం గురియు పువ్వుల వానలు మీఁదఁ
బర్వఁగన్-144

టీక :- చెలగుచునిట్లు = సంతోషముతో నిటుల, తా = తాను, కడుపుచించుచు వెళ్ళిన = కడుపు పగలగొట్టుకొని వెళ్ళగా, మేనిలో = శరీరము నందు, నునుర్దొరగుటన్ = ప్రాణములు పోగా, నేలపై బడిన తోడనే = క్రిందపడగనే నేర్పుతో, నన్బ్రదికించి = నన్ను జీవింప జేసి, మరియు, బ్రతుకు విద్దెయు = సంజీవని యొక్క, మిక్కిలి పెంపు తోడ = మిగుల గొప్పదనముతో, వేల్పులు గొనియాడుచున్ = దేవతలు పొగడుచు, కురియు = వర్షించు, పువ్వుల వానలు = పూలవానలు, మీద బర్వగన్ = మీద వ్యాపించగా, వెలసెను = ఒప్పెను.

తా :- అతడు సంతోషమున నిటుల తాను నాకడుపు చించు కొని వెళ్ళి నేను శరీరము తొరగగా అనగా ప్రాణములు పోయి క్రింద పడగనే తన నేర్పుతో నన్ను బ్రతికించి, ఆసంజీవనీ విద్యతో దేవతలు తన్పై పూవులవాన కురిపించగా ప్రకాశించెను.

విశే :- శుక్రుడు ఇచట పునర్జీవితుడైన సందర్భమును తెలగన్న శుక్రుని చేతనే చెప్పించెను గాని నన్నయగారు ఒక కవిగా వాగను శాసనుడుగా నిచటతన స్వీయాభిప్రాయమును వ్యక్తపరచెను. చూడుడు

తే॥ విగత జీవుపై వడియున్న వేదమూర్తి
యతని చేత సంజీవితుడై వెలింగె
దనుజమంత్రి యుచ్చారణదక్షుచేత
నభిహితంబగు శబ్దంబునట్లపోలె

మంత్ర మందలి బీజాక్షరములెంత ప్రభావ సంపన్నములైనను వానిని స్పష్టముగా నుచ్చరించినపుడే యవి జపకర్తకు ఫలమునిచ్చును. అటుల గాన పుడొక్కొక్కతరివ్యతిరేక ఫలము గూడ కలుగుననుటకు వృత్రుడొక యుదాహరణము. అతడు ఇంద్రునివుడియించుటకై యజ్ఞము చేసి "ఇంద్రశత్రుర్వర్ధస్వ" యనుమంత్రమున కలిగిన స్వరదోషమున నింద్రునిచే తానేహతుడయ్యెను. అటులే యిక సాహిత్య ప్రపంచముననది పద్యముగాని పదముగాని పాటగాని యందలి సాహిత్యమును చక్కగా నెరిగి యాయాపదములను రసానుగుణముగా మరియు నిర్దుష్టముగా పలికినపుడే యందలి ధ్వని జీవించి శ్రోతకుకలుగవలసిన రసానందమును కలిగించి చేయవలసిన యుపదేశమును చేయును. లేని యెడల నవి మృతప్రాయము లైపోవును.

నన్నయగారు శబ్దములందలి యీ ధ్వని యొక్క తత్త్వమును చక్కగా నెరిగిన వాడు కనుక దానిని చట శుక్రుని పునర్జీవితుని జేయునెపమున నుపమానమూలముగా శబ్దశక్తిని సూచించు నీపద్యమును స్వతంత్రముగా రచించెను.

145.వ:- ఇట్లు సంజీవని వడసి కచుండు తాఁ దడవున్న వాఁ
డయి మాతో నొక్కనాఁ డిట్లనియె -145

టీక :- ఇట్లు సంజీవని వడనిసి = ఈవిధముగా సంజీవని పొంది, కచుండు, తడవున్న వాడయి = చాలాకాలమున్న వాడు కావున, మాతో, ఒక్క నాడు ఇట్లనియె.

తా :- ఈవిధము కచుడు సంజీవని విద్యను పొంది మాదగ్గర చాలాకాల మున్నవాడు

కనుక నొకనాడు మాతో నిట్లనెను.

146.క॥ మీరును మీదేవేరియు
గారవమునఁ బ్రోవఁ దడవుగా నిట నుంటిం
గోరినది గల్గె నంపుడు
తారను మాతండ్రిఁ జూడఁ దలఁచితి ననుడున్ - 146

టీక :- మీరును మీదేవేరియు = మీరు మరియు మీసతీమణియైన జయంతి, గారవమున బ్రోవన్ = గౌరవమున కాపాడుచుండగా, తడవుగా నిటనుంటిన్ = చాలాకాలముగా నిచట నుంటిని, కోరినది కల్గె = నాకు కోరిన విద్యలభించినది. తారను మాతండ్రి జూడతలచితి ననుడున్ = మాతల్లియైన తారాదేవిని మరియు మాతండ్రియైన చంద్రుని జూడగోరితిని అని అనగా -

తా :- ఆచార్యా ! మీకు మరియు మీపత్ని నన్ను గారాబమున కాపాడుచుండగా చాలాకాలము మీయింట నుండి తిని, నాకు కోరిన విద్య గూడ లభించినది. ఇక మాతల్లిదండ్రిని చూడ గోరుచున్నాను. అనగా -

147.ఉ॥ పిన్నవుగాన నీవు కడుఁ బ్రేముడి ముంగిటి లోనఁ ద్రిమ్మర
న్నిన్న బలెం దలంపఁబడు నీవిట నిల్చిన పెక్కులేండ్లు, మా
కన్నులు వాఁచు నీమొగము గానక యెప్పుడుఁ జూడకున్ననా
యన్న, యిదేటికిం దమక మారసి చూచిన వింత వాఁడవే - 147

టీక:- పిన్నవుగాన = చిన్నవాడవు కనుక, నీవు, కడుప్రేముడిన్ = మిక్కిలి ప్రేమతో, ముంగిటి లోనన్ = వాకిటిలో, త్రిమ్మరన్ = తిరుగుచుండగా, నిన్నబలెందలంపబడు = నిన్నటి వలెనే తలంచు చున్నాను. అనగా చాలాకాలమైనను కాలము తెలియ లేదనుట, నీవు, ఇట నిల్చిన = ఇక్కడున్నటువంటి, పెక్కులేండ్లు = చాలా ఏండ్లైనను, మాకన్నులు వాచు నీమొగము గానకనెప్పుడు = నీముఖము చూడకున్న మాకన్నులు వాయును, నాయన్న = ఓనాకుఱ్ఱా!, ఇదేటికిన్ = ఇందెందులకు, అనగా నింటికి వెళ్లెదననుట, తమక మారసి చూచిన = నీయొక్క ఉత్సాహము చూడగా, వింత వాడవే = చిత్రమైన వాడవు.

తా :- ఓ కచుడా ! నీవు బాలుడవు కనుక మాకడకు వచ్చి పెక్కేండ్లైనను నీవు వాకిటిలో తిరుగుచుండగా నిన్న వచ్చిన వానివలెనే మేము తలచు చున్నాము. నిన్ను చూడకున్న

మాకన్నులు కాయలు కాయును. కావున ఓకుఙ్ఞా! ఇదేమిటి యిప్పుడే వెళ్లుదు ననుట యెందులకు, నీయుత్సాహము జూడ చిత్రమైన వానివలె నున్నావు,

విశే :- అనగా కోరిన విద్య లభించినంత కాలము ఇంటి ఊసే యెత్తకుండ నుండి ఈనాడు హఠాత్తుగా వెళ్లెదననుట వారికి చిత్రమనిపించి యుండవచ్చు.

''అలం - లోకోక్తి''

148.క॥ నీవనఁగ దేవయాననఁ
గావేఱే, మాకు వింతగాదే కద, నీ
కీవేగిర మేటికి మది,
నావుడు నతఁడట్ల కొన్ని నాళ్లుండి వెసన్ - 148

టీక :- నీవనన = దేవయాననగా, వేఱేమాకు = మాకు నీవు ఒకటి, దేవయాన ఒకటియా! వింతగాదేకద = ఇది వింతయేమి కాదు గద ! ఈవేగిర మేటికి = ఈతొందర ఎందులకు, మదిన్ = మనస్సులో, నావుడు = అనగా, నతడట్లు = అతడటులే, కొన్ని నాళ్లుండి, మరల కొన్ని దినములుండి, వెసన్ = నింపాదిగా -

తా :- ఓకచుడా ! మాకు నీవనగా దేవయానగా వేరేనా ! ఇదేవి వింత గాదుగదా! మనస్సులో నీకీ తొందర ఎందుకు అనగా నటులే మరల కొన్నిదినములుండి నింపాదిగా !

149.వ:- తన వీటికిం బోయెద నని విన్నవించుటయు - 149

టీక :- తనవీటికి = తమపట్టణమునకు, పోయెదనని = వెళ్ళెదనని, విన్నవించుటయు = తెలుపగా-

''కచుడు తమ లోకమునకు పయనమగుట''

150. సీ॥ కరము పెద్దయిన యంగిరసు చెంతకుఁ బోయి
చక్కఁగా జాగిలి మ్రొక్కి నన్ను
జేజేల కొజ్జయై చెలగెడు మీతండ్రిఁ
గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి కొనియె నన్ను
తనతోడఁ బుట్టువుఁ దార నెమ్మదిలోన
నర్మిలి దైవాఱ నడిగె నన్ను

కడు జయంతుఁడు లోనుగాఁ గొమాళ్లను గూడ
వేల్పు మన్నిని దీవించె ననుము

తే॥ మఱియుఁ దక్కిన వారి నామాటగానె
తగిన లాగునఁ బలుకు మందఱకుఁ, జాల
నలరు నీవని చెప్పి, నేననుప నతఁడు
నరుగ సమకట్టి యున్నచో నప్పు డెఱిఁగి - 150

టీక :- కరముపెద్దయిన = మిక్కిలి పెద్దవాడైన, అంగీరసు చెంతకు బోయి = అంగీరసుని దగ్గరకేగి, చక్కగా, సాగిలి మ్రొక్కెననుము = సాష్టాంగ పడితినని చెప్పుము, జేజేల కొజ్జయై = దేవతల గురువై, చెలగెడు మాతండ్రి = ఒప్పుచున్న మీతండ్రిని, గ్రుచ్చి కౌగిటి జేర్చుకొనియె ననుము = కౌగిలించి తిననుము, తనతోడబుట్టువు = తనకు తోబుట్టిన, తార నెమ్మదిలోనఁ = తారను మనస్సులో, నర్మిలి దైవారఁ = ప్రేమ మీరగా, అడిగెననుము = అడిగితినని చెప్పుము, కడు = మిక్కిలియైన, జయంతుడులోనుగా = జయంతుడు మొదలైన కొమాళ్లను గూడ = దేవతా కుమారులను గూడ, వేల్పుమన్నిని = ఇంద్రుని, దీవించెననుము = దీవించెనని చెప్పుము, మరియు = ఇంకను, తక్కిన వారిఁ= మిగిలిన వారిని, నామాట గానే = నాయొక్క మాటలుగనే తగిన లాగున బలుకుము = వలసినట్లుగా చెప్పుము, నీవు అందరకు చాలనలరు = మిక్కిలి ప్రియముగా నుండుము అని చెప్పి, నేననుపఁ = నేనుపంపగా అతడు, అరుగ సమకట్టి యున్నచో = పోవుటకు సిద్ధముకాగా, అప్పుడెఱిగి = అపుడు తెలిసికొని,- దేవయాన అని ముందరి పద్యముతో -

తా :- ఓ కచుడా! నీవు అందరికంటె పెద్దవాడైన యంగిరసుని దగ్గరకు పోయి యతనికి సాష్టాంగ నమస్కారము చేసితినని చెప్పుము, దేవగురువైన మీతండ్రిగారి నాలింగనము చేసితినని చెప్పుము. తనకు తోబుట్టిన తారను ప్రేమతో నడిగితినని చెప్పుము. జయంతుడు మొదలైన దేవకుమారులను, ఇంద్రుని దీవించితినని చెప్పుము. ఇంకను మిగిలిన వారికందరికి తగిన రీతిగా నామాటలుగానే చెప్పుము. నీవందరికి ప్రియము కలిగి యుండుము. అని నేను చెప్పి పంపగా నతడు వెళ్ళుటకు సిద్ధపడగా అపుడది తెలిసి-

''అలం - ఉదాత్తము''

151. సీ॥ ముదురు వెన్నెల గాయు ముత్యాల తిన్నెపైఁ
బైఁడి యచ్చన గండ్లు పాఱవైచి
మఱియాడి యాడి తామర కెంపుఁ బీఁటపై
నోమన గుంటల నుజ్జగించి
పాఁపమేఁ పరిపచ్చ పన్నారు లోవులఁ
గులుకు గుజ్జన గూళ్లు కుడుచుటుడిగి
తన యీడు వారైన తలిరాకుఁ బోండ్ల తో
సిరిబొమ్మ పెండ్లిండ్లు సేయకడలి

తే॥ తోఁడిచెలు లెల్ల వెఱఁగుతోఁ గూడ రాఁగ
గొనబుఁగ నుదమ్ములను నీళ్లు గ్రుక్కు కొనుచుఁ
జిన్ని వేనలి జాఱంగఁ జిన్నవోయి
తెగువ నచటికి నేతెంచె దేవయాని - 151

టీక :- ముదురు వెన్నెలగాయు = దట్టమైన వెన్నెలను వెదచల్లు, ముత్యాల తిన్నెపై = ముత్తెముల యరుగుపై, పైడియచ్చెనగండ్లు = బంగారు కచ్చకాయలు, వారవైచి = పారవేసి, మఱి = ఇంకను, ఆడియాడి = మిక్కిలిగా నాడి, తామర కెంపు పీటపై = పద్మరాగపు పలకపై, ఓ మనగుంటలన్ = ఓమన గుంతలను, ఉజ్జగించి = ప్రాలుమాలి, పాపమే పరిపచ్చ = గరుడ పచ్చల యొక్క, పన్నారు లోవులన్ = పిల్లలాడుకొను వంటపాత్రలలో, కులుకు = ఒప్పుచున్న, గుజ్జనగూళ్లు = బంతిగా కూర్చొని తినెడు తిండ్లు, కుడుచు టుడిగి = తినుట మాని, తన ఈడు వారైన, తలిరాకు బోండ్లతో = లేతవయసు కన్నెలతో, సిరిబొమ్మ పెండ్లిండ్లు = చక్కనైన బొమ్మలపెండ్లిండ్లు సేయకన్ = చేయక, అడవి = దిగులుపడి, తోడి చెలు లెల్ల = తోడి సఖులందరు, వెఱగుతో = విస్మయముతో, కొద్దిపాటి భయముతో, కూడరాగా = వెంట రాగా, గొనబు = అందమైన, కనుదమ్ములను, నేత్రపద్మము లందు, నీళ్లు గ్రక్కుకొనుచు, చిన్నివేనలి = చిన్ననైన వెంట్రుకల ముడి, జారంగ = విడిజారిపోవుచుండగా, చిన్నవోయి తెగువన్ = సాహసమున, దేవయాని, అచటికేతెంచెన్ = అచటికి వచ్చెను.

తా :- దట్టమైన వెన్నెల వలెనున్న ముత్యాల యొక్క అరుగుపై ఆడుచున్న యచ్చన గాయలు పారవేసి, పద్మరాగపు పలక పైగలయోమన గుంటలాడుట ప్రాలుమాలి, గరుడ పచ్చల పాత్రలతో బొమ్మలాటలో వండుకొనిన గుజ్జన గూళ్లు తినుట మాని,

బొమ్మల పెండ్లియాట విడిచి దిగులుతో ఈడైన సఖులు విస్మయమున తన వెంట రాగా కన్నులలో నీరు గ్రక్కు కొనుచు వెంట్రుకలు ముడివీడి జారు చుండగా సాహసమున దేవయాని యపుడచటికి వచ్చెను.

విశే :- ఈపద్యమున మరికొన్ని బాలికాక్రీడలు చెప్పబడినవి.

1. అచ్చనగండ్లు - ఇపుడు పురుషులు అక్షక్రీడలో విసరెడు పాచికలవలె విసరెడు రాళ్లని అందువలన వీనికి(అక్ష+కల్లు) అచ్చనగండ్లని వ్యవహార మేర్పడెనని శ్రీతిమ్మా వజ్ఝల కోదండ రామయ్యగారు చెప్పిరి.

ఈ యాటకు కుబేరాక్ష క్రీడయని మరియొక పేరు కుబేరాక్ష మనగా కచ్చకాయ బాలికలీక్రీడను వాని తోనే యాడుదురు. కనుక దీనికి కచ్చకాయ లాట యని పేరు నిలిచినది. కచ్చకాయలు లేని పక్షమున చిన్న చిన్న గులరాలతో దీని నాడుదురు. కలవారైన యెడల వీనిని వెండి లేదా బంగారుతో గోళీకాయలవలె చేయించుకొందురు.

"అలం - స్వభావోక్తి"

152.వ: ఇట్లు వచ్చిన నక్కచుండిట్లనియె - 152

టీక :- అట్లు వచ్చిన = ఆవిధముగారాగా, అక్కచుండు = ఆకచుడు, ఇట్లనియె = ఈవిధముగా అనెను.

153. మత్తకోకిల :-

'తోడఁ బుట్టుగుకన్న నీవొగిఁ దోడు నీడయి ప్రోవఁగా
నీడ నేకొదలేక యుండితి నింక మాతలిదండ్రులం
జూడ ఁ బోయెద, నయ్యవారలు జూచి రమ్మని పంపెనో
చేడియా, మదిలోన నాదగు సేమ మారయు చుండుమీ!'

టీక :- తోడబుట్టివుకన్నఁ = తోబుట్టిన వారికంటె, నీవొగిఁ = నీవు తగినట్లుగా, తోడునీడయి ప్రోవగా = తోడునీడవై రక్షించు చుండగా, ఈడఁ = ఇక్కడ, ఏకొదలేక యుండితి = ఏ కొఱత లేకుండనున్నాను ఇంక, మాతలిదండ్రులఁ, చూడబోయెదఁ = అయ్యవారలు, చూచిరమ్మని పంపెఁ = ఓచేడియా = ఓదేవయానా! మదిలోనఁ = మనస్సులో, నాదగు = నాయొక్క, సేమము =

కుశలము, అరయు చుండుము = విచారించు చుండుము.

తా :- ఓ దేవయానా! నేను నీవు తోబుట్టు కంటె మిక్కిలిగా తోడునీడయి కాపాడుచుండగా నిక్కడ యేకొరత లేక యుంటిని. ఇక మాతల్లిదండ్రులను చూడబోవు చున్నాను. అయ్యవారు అనగా గురువుగారు కూడ చూచి రమ్మని ఆజ్ఞ ఇచ్చినారు. కనుక వెళ్ళి వచ్చెదను, నీవు మనస్సులో అపుడపుడు నాక్షేమమును గురించి తలచుకొనుచు అరయు చుండుము.

దేవయాని కచునికి తనకోరికను తెల్పుట

154.క॥ అనిపలుకఁ గొమ్మ మిక్కిలి
తనమది గలఁగ గంగ, 'నిట్టి తలఁపులుగలవే?
మును నీకు నాకుఁ దగులము
నొనరించెం దమ్మిచూలి యుల్లములందున్ - 154

టీక :- అనిపలుకన్ = అని చెప్పగా, కొమ్మ=దేవయాన, మిక్కిలి = మిగుల, తనమది కలగంగ = తనయొక్క మనస్సు కలత పడగా, ఇట్టి తలపులు గలవే = ఇటువంటి ఆలోచనలుండునా! మును = ఇంతవరకే, నీకునాకు, తమ్మి చూలి= బ్రహ్మదేవుడు, ఉల్లము లందున్ = మనస్సు నందు, తగులము నసరించెన్ = స్నేహమేర్పరచెను.

తా :- అని యనగా ఆదేవయాని తన మనస్సులో మిక్కిలి బాధపడి యివి యేటి యాలోచనలు, బ్రహ్మదేవుడు ఇంత వరకే మన యిద్దరికి మనస్సులో జతకలిపెను.

155.సీ॥ ముగురు వేల్పులు మెచ్చు భృగువున కర్మిలి
మనుమఁ డన్నది నీకుఁ జనువు గాదె?
యనయంబుఁ దొలివేల్పుటయగారికినిఁ గూర్మి
యల్లుఁడన్నది నీకు నమువు గాదె?
పొగడు నీలువు చేతఁ దగు దేవయానికిఁ
బెనిమిటి యన నీకుఁ బెంపు గాదె?
తుద వృషపర్వుండు మొదలైన రక్కసు
లన్నించు టది నీకు వన్నెగాదె?

తే ॥ తొడరి యోఁగామి నీమదిఁ దోఁచ కున్న
ననుఁగులగు పెద్దవారల నడిగి చూడు,
మేల విడనాడ, నాలిగా నేలు నన్నుఁ,
వినుము చెప్పెద, మాటలు వేయునేల !

టీక :- ముగురు వేల్పులు మెచ్చఁగ = త్రిమూర్తులు మెచ్చగా, భృగువున కుఁగ = భృగుమహార్షికి, అర్మిలి మనుమ డన్నది = ప్రియమైన మనుమడని యనుట, నీకు చనువుగాదె= నీకు గొప్ప గదా! అనయంబు = ఎల్లపుడును, తొలివేల్పులయగారికిని = అసుర గురువునకు, కూర్మి యల్లుడన్నది = ప్రియమైన యల్లుడనుట, నీకు ననువుగాదే = నీకు తగినది కదా!, పొగడు నీలువు చేత = శీలమున పేరుగన్న, తగు = తగినట్టి, దేవయానికి, పెనిమిటియననీకు = భర్తయనగానీకు, బెంపు గాదె = గొప్పగాదా! తుదఁగ = చివరకు, వృషపర్వుండు, మొదలైన రక్కసుల్ = మొదలైన రాక్షసులు, మన్నించుటది నీకు = గౌరవించుటనగా నీకు, వన్నెగాదే = కీర్తిగాదా! తొడరి ప్రయత్నమున యోగామి = మంచి చెడ్డల క్రమము, నీమదిఁగ = నీమనసునకు, దోచుకున్న = తెలియని యెడల, అనుగులగు = నీకు ప్రియమైన గొప్పవారిని, అడిగి చూడుము, ఏలవిడనాడఁగ = నన్నెందులకు విడిచి పెట్టెదవు, ఆలిగా నేలు నన్ను =నన్ను భార్యగా చేసికొనుము, మాటలు వేయునేల = ఇన్ని మాట లెందులకు, వినుము చెపెద = నేను చెప్పునది వినుము

తా:- త్రిమూర్తులు మెచ్చగా భృగువునకు మనుమడనుట నీకు గొప్పగదా! దానవాచార్యుడైన శుక్రునికి యల్లుడనుట నీకు దగినది కదా! శీలవతియైన దేవయానకు పతియనుట నీకు గొప్పగదా! వృషపర్వుడు మొదలైన రాక్షసరాజులతో మన్నింప బడుట నీకు గౌరవము కదా! ఈ మంచి చెడ్డల వరుస నీకు తెలియని యెడల నచ్చిన వారి నెవరినైన యడిగి చూడుము. నన్నెందులకు విడిచి పెట్టెదవు. భార్యగా నేలుకొనుము. వేయి మాట లెందులకు నేను చెప్పునది వినుము.

''అలం - ఉదాత్తము''

156.క॥ అనc జెవులు మూసికొనుచుం
దన మదిలో నలిగి కచుcడు దలిరుంబోcడీ
వినc దగని పలుకు పలుకం
జనునే, తలc పోయ నిట్లు చాలు నుడుగుమీ ! -156

టీక :- అనన్ = అనిచెప్పగా, చెవులు మూసుకొనుచున్, కచుడు, తన మదిలో నలిగి = మనస్సులో కోపించిన వాడై, తలరుం బోడీ! ఓయువతీ, వినదగని పలుకు = వినగూడని మాట, పలుకం జనునే = పలుక వచ్చునా!, అట్లు తలపోయన్ = నేనా విధముగా తలచను. అనగా వివాహ మాడ ననుట, చాలున్ = ఈమాటలు చాలు, ఉడుగమీ = మానుకొనుము.

తా :- దేవయాని అట్లనగా కచుడు చెవులు మూసుకొని, మనస్సులో కోపము కలిగిన వాడై ఓయువతీ! వినగూడని మాట వెందుకు చెప్పెదవు, అట్లన వచ్చునా! నేను నీవన్నట్లుగా తలచను చాలు, ఈ మాటలు మానుము.

157.క॥ విను చదువు చెప్పిన తcడుం
దన తండ్రియు, నొక్క రూప తలcపcగ నదిగా
వున నీవు నాకుc జెల్లెల,
వను వగునా యిట్టి మాట లాడcగ నీకున్? -157

టీక :- విను = దేవయానీ ! వినుము, చదువు చెప్పి నతడున్ = చదువు చెప్పినవాడు, తనతండ్రియు, తలపగన్ = ఆలోచించగా, ఒక్కరూప = ఒక్కటే, అది కావున = అట్లగుట వలన, నీవు, నాకున్ = చెల్లెలవు = సోదరివి, ఇట్టి మాటలాడగ నీకున్ = నీకు ఇటుల మాటాడుటకు, అనువగునా = తగునా!

తా :- దేవయానీ! ఆలోచించి చూచిన యెడల చదువు చెప్పిన వాడు, కన్నతండ్రి ఇద్దరు కూడ ఒక్కటే కనుక నీవు నాకు సోదరివి. ఇటుల మాటాడుట నీకుతగదు.

దేవయాని కచులు పరస్పరము శపించుకొనుట

158.ఉ॥ నావుడు దేవయాని మదినాటిన యల్కా, 'నట్లైన నీకు సం
జీవని పంపుసేయ' దని చేరికc బల్కె, నతండు మిక్కిలిం
దావగ నొంది, 'యోనెలంత, నాకది వమ్మయి పోయెనేనియు
న్నీవనినట్ల నావలన నేర్చిన వారికిc బంపు సేయదే!' -158

టీక :- నావుడు = అనగా, దేవయాని, మదినాటిన యల్కా౯ = మనస్సులో కలిగిన కోపమున, అట్లైన = అట్లయిన యెడల, నీకు సంజీవని పంపు సేయదని = సంజీవని పని చేయదని, చేరిక బల్కె౯ = కోపమున ననెను, అతండు = ఆకచుడు, మిక్కిలి౯ = మిగుల, తా౯=తాను, వగనొంది= బాధపొంది, ఓనెలత = ఓదేవయానీ! నాకు+ అది వమ్మయి పాయెనేనియు౯ = వ్యర్థమై పోయినట్లయిన, నీవనినట్ల = నీవుపలికినట్లే, నావలన, నేర్చిన వారికి, పంపుసేయదే = పనియేయదా!

తా :- అనగా దేవయాని మనస్సున కలిగిన కోపమున నట్లయిన నీకు సంజీవని పని చేయదని పలికెను, అదివిని కచుడు మిక్కిలి దుఃఖపడి ఓదేవయానా! నీవన్నట్లు అదినాకు వ్యర్థమైపోయి నట్లయిన నావలన నేర్చిన వారికైన పనిచేయదా! చేయునుగాక!

159.క॥ అని కిన్కతోడ, 'నిటువలెc
బని మాలిన పాట నన్నుc బలికితి వటుగా
వున నీకు నేలవేలుపు
పెనిమిటి గాకుండు', ననుచుc బెలుచన్నొడివెన్ - 159

టీక :- అని, కిన్కతోడ౯ = కోపముతో, ఇటువలె = ఈరీతిగా, పనిమాలిన పాటనన్ను = పనికి రానటువంటి పనిగా నన్ను, బలికితివి = శపించితి, అటుగావున = అందువల, నేల వేలుపు = బ్రాహ్మణుడు, పెనిమిటి కాకుండు ననుచు = నీకు భర్త కాకపోవుగాక యని, పెలుచన్నొడివె౯ = కఠినముగా పలికెను.

తా :- అని కోపముతో ఈవిధముగా నావిద్య పనికి రాని పాటుగా శపించితివి గావున నీకు బ్రాహ్మణుడు పెనిమిటి కాకుండుగాక యని కఠినముగా బలికెను.

160.వ॥ ఇట్లీ కొమ్మం బలికి కచుండు తన నెలవునకుం జనియె
ననిపలికి శుక్రుండు వృషపర్వుండునుం దోడ నేఁగుదేర
వీటికిం దోడ్కొని వచ్చిన దేవయాని శర్మిష్ఠ గొలువఁ
బాటలం దేటమాటలం దోఁటలం బ్రొద్దు గడుపుచు నుండె
నంత-160

టీక :- ఇట్లీ కొమ్మం బలికి = ఈవిధముగా నీమెను శపించి, కచుండు, తన నెలవునకుం జనియెం = తననివాసమునకు వెళ్లెను, అనిపలికి = అనిచెప్పి, శుక్రుండు, వృషపర్వుండు, తోడనేగుదేర = వెంటరాగా, వీటికిం దోడ్కొని వచ్చిన = పట్టణమునకు తోడుకొని రాగా, దేవయాని, శర్మిష్ఠగొలువ, పాటలఁ = పాటలతో, తేటమాటలఁ = కల్మషము లేని మాటలతో, తోటలఁ = వనములందు, ప్రొద్దు గడుపుచుండెఁ, అంత = అపుడు-

తా :- ఈవిధముగా నీమెను శపించి కచుడు తమ నివాసము నకు వెళ్లెను, అని చెప్పి శుక్రుడు వృషపర్వుడు వెంట తోడుకొని రాగా పట్టణము లోనికి వచ్చెను. అంత దేవయాని శర్మిష్ఠ సేవించుచుండగా నాటపాటలతో కాలము గడుపు చుండెను.

ఆశ్వాసాంతము

161.చ॥ కొఱలెడు తేజుచేఁ బసిఁడి గుబ్బలియు న్మఱి వెండి కొండయుం
గరఁగు నటంచు, సంద్రములు కాఁకల నింకు నటంచు, నెల్లెడఁ
నెఱయు నసంపుఁగప్పురము నించి జగంబులఁ గల్గువార లం
దఱుఁ గొనియాడు చుండగఁ సతంబుగ రాసిరిఁ గన్న నేర్పరీ ! - 161

టీక :- కొఱలెడు తేజనఁ = బాగుగా ప్రకాశించు తేజస్సుతో, పసిడి గుబ్బలియుఁ = మేరువు, మరి =మరియు, వెండికొండయుఁ = కైలాసము, కరగునటంచు = కరిగి పోవునని, సంద్రములు = సముద్రములు, కాకల నింకునటంచు = వేడిమితో నింకి పోవునని, ఎల్లెడఁ = అంతటను, ఎఱయు = దీపించు, అసంపుకప్పురము నించి = కీర్తియను కర్పూరము నింపి, (చల్లదనముగలుగజేసి) జగంబులఁ = లోకమున, కల్గువారలందరు = కలవారందురు, కొనియాడు చుండగా, సతంబుగ

= శాశ్వతముగా, రాసిరిగన్న = రాజైశ్వర్యమును గాంచిన, నేర్పరీ! నిపుణుడా!

తా :- ఓ అమీనుఖానా బాగుగా ప్రకాశించు నీయొక్క ప్రతాపమున మేరువు కైలాసము కరిగిపోవును, సముద్రములింకి పోవును, అనునట్లుగా నంతటను దీపించు యశమను కర్పూరమును నింపి చల్లబరచుచు లోకమున గల వారందరు పొగడు చుండగా శాశ్వతమైన రాజైశ్వర్య మును పొందినవాడా! ఓయమీను ఖానా!

162.క॥ పురుకుత్సు రంతిదేవున
గరునిన్మాంధాతఁ బృథుని గయుని దిలీపుఁ
భరతు యయాతిం దెగడెడు
సరవిఁ జగములను మించు చాగపుఁ గడలీ! -162

టీక :- పురుకుత్సు- రంతిదేవు- సగరుఁ - మాందాంత- పృధుని, గయుని, దిలీపుఁ = భరతుఁ, యయాతిఁ, పురుకుత్సుని, రంతిదేవుని సగరుని - మాందాతను, పృథుచక్రవర్తిని , గయుని, దిలీపుని, భరతుని, యయాతిని, తెగడెడు సరవిఁ = నిరసించెడు రీతిగా, జగములను మించు లోకములందు ప్రకాశించు, చాగపు కడలీ = త్యాగసముద్రుడా!

తా :- పురుకుత్సుడు మొదలైన షట్చక్రవర్తులను, షోడశ మహారాజులను మించిన త్యాగసముద్రుడా!

విశే :- పద్యమున పేర్కొనబడిన వారి పరిచయము.

ఈవృత్తమున నలుగురు సూర్యవంశ ప్రభువులు ఐదుగురు చంద్రవంశ ప్రభువులు పేర్కొనబడినారు. వారిలో వంశక్రమమున

1. మాంధాత-

మొదటివాడు. ఇతడు యవనాశ్వుని కుమారుడు. యవనాశ్వుడు పుత్రులు లేక యజ్ఞము చేయుచు నారాత్రి మంత్రించిన జలము తానే త్రాగుట వలన యవనాశ్వుడు తండ్రి గర్భము నుండియే ఉదయించెను. యిదొక విచిత్రమైన జననము. ఈబాలుడు పుట్టగనే

ఇంద్రుడు వచ్చి యితని నోట తనవ్రేలు నుండి అమృతమును కుడిపి ఇతనికి మాంధాతయని పేరిడెను.

ఈమహారాజు మిక్కిలి పరాక్రమ వంతుడు. ఆకాలమున రావణు నోడించి బంధించి బ్రహ్మ యొక్క మాటచే విడిచి పుచ్చెను. ఇతని భార్య తృణబిందుని కుమార్తె బిందుమతి. వీరికి పురుకుత్సుడు, అంబరీషుడు, ముంచి కుందుడు అనుపుత్రులు కలిగిరి. వీరందరును ప్రసిద్ధులు. కవి కర్లరసాయనము మాందాతను గురించి తెలుపు కావ్యము.

2. పురుకుత్సుడు -

ఇతడు షట్చక్రవర్తులలో నొకడు. బిందుమతి మాందాతల కుమారుడు. గొప్పపరాక్రమ వంతుడు. నాగు లితనిని తమ లోకమునకు కొనివెళ్ళి తమకన్యయగు నర్మదనిచ్చి వివాహము చేసిరి. ఆంగీరసులు నాగులను బాధించుచుండిరి. ఆవిషయము నర్మద యితనితో చెప్పగా నాంగీరసులను వధించి యితడు నాగులకు వారిభయమును తప్పించి నాగులతో తననాగలోక విహారము స్మరించిన వారికి సర్పభయము కలుగకుండ వరమును పొందెను. నర్మదాపురుకుత్సీయము ఇతని వృత్తాంతమును తెలుపు కావ్యము.

3. సగరుడు -

ఇతడిక్ష్వాకు వంశమున ముప్పది ఏడవ పురుషుడు. బాహుకుని కుమారుడు. అతనికి అసితుడని మరియొక పేరు. బాహుకుని హైహయులు బాహుకు నోడించగా అతడు భార్యలతో నడవికి వెళ్లి యచటనే మరణించెను. అపుడొక భార్య గర్భవతిగా నుండెను. ఆమె సహగమనము చేయబోగా ఔర్వమహర్షి వారించెను. పిమ్మట సవతులామె నోర్వజాలక విషము పెట్టిరి. గర్భస్థుడైన శిశువా విషముతో జన్మించి నందువలన నతనికి సగరుడని పేరుపెట్టిరి. ఇతడు గొప్ప పరాక్రమశాలి. అశ్వమేధములు చేసి ఆగుర్రములను పట్టిన వారి నందరను వధించు చుండెను.

4. దిలీపుడు-

సూర్యవంశమున నిద్దరు దిలీపులున్నారు. మొదటి వాడు భగీరథుని తండ్రి. ఇతడా వంశమున నలుబదవ వాడు.రెండవ వాడు ఏబది ఏడవవాడు రఘువు తండ్రి. ఇతడే దేవతలకు

సహాయముగా స్వర్గమునకు వెళ్లి యుద్ధము చేసెను. ఇతడు పరాక్రమమునకు దానమునకు గూడ పేరు చెంది ఇక్ష్వాకు వంశమును తన పేర వెలయించెను.

చంద్రవంశపురాజులు

5 పృధువు-

ఇతడు యయాతి మహారాజుకు పదునెనిమిదవ తరమున నిలుచును. యదువు శాఖలోని వాడు. అంగుని పుత్రుడైన వేనుని కుమారుడు. వేనుడు దుర్మార్గుడగుట వలన మహర్షులతనిని శపించి మృతిజెందిన వేనుని శరీరమును మధించి యితనిని పుట్టించిరి. ఇతడు రాజ్యాభిషిక్తుడైన పిమ్మట భూదేవిని గోవును చేసి యామెనుండి సమస్తమైన యర్థములు పితికెను. భూమికితని పేరనే పృధియను పేరుసార్థక మయ్యెను.

6. భరతుడు-

ఇతడు గూడ యయాతికి పదునెనిమిదవ తరముననే నిలుచును. పూరుని శాఖలోని వాడు. దుష్యంతుని కుమారడు. ఇతనికి సర్వదమనుడని మొదటి పేరు. మహాపరాక్రమశాలి. ఇతనితో యదువంశము నిస్సంతుకాగా దేవతలితనికి మమత కుమారుడైన భరద్వాజుని పెంపుడు నిచ్చిరి.

7. గయుడు

పురాణ వాఙ్మయమున గయులు ఏడుగురున్నారు. వారిలో భరత వంశీయుడైన వాడు పృధువు యొక్క పౌత్రుడు. నక్తుని పుత్రుడు. ఇతని భార్య జయంతి. ఈ మహారాజు యజ్ఞపురుషుని నిరంతరము తనహృదయమున నిలుపుకొని సకల జీవతతికి ఆనంద మొసగు చుండెను. ఇతని పాలనమున వసుంధర కామదేనువువలె నుండెను.

8. రంతిదేవుడు

దుష్యంతుని కుమారుడైన భరతునికి ఐదవతరమువాడు. సంకృతి కుమారుడు. ఇతడనేక గోమేధములు చేసెను. అపుడు కర్మవశమున గోవులై పుట్టిన జ్ఞానులు స్వయముగా వచ్చి యితనితో ఓమహారాజా! నీవు మమ్ములను నీయజ్ఞములందు వ్రేల్చుము. దాన నీకు

కీర్తియు మాకు మోక్షము కలుగునని ప్రార్థించు చుండిరట. అపుడతడు వానితో మీలో ఒక గోవైనను దీనిని తిరస్కరించిన నేనీ యజ్ఞములు మానుదునని ప్రతిజ్ఞ చేసి గోమేధములు చేయుచుండ ఒక నాడు యాజ్ఞికులు గోశాలనుండి ఒక గోవును తేబోవ నది తీనలేగతో కృపణులు వచ్చిరి. యిక నేను వెళ్లవలె ననెనట. అది విని వచ్చిన వారు రాజునకు చెప్పగా నాటితో నతడు గోమేధములు మానెనట. ఆపత్కాలమున గూడ దానము చేయుటలో నితడు ప్రసిద్ధుడు.

9. యయాతి - ఈకావ్యనాయకుడు.

''అలం - తుల్యయోగిత ''

163. మాలిని :-

నలుమొగముల చూలున్నల్లనౌ మేని డాలుం
జెలఁగు నడుగు జాలుం జిందముం జుట్టువాలు
న్వలచు కలిమి యాలు న్వన్నె దువ్వల్వ మేలుం
గలుగు నతడు నీపైఁ గల్మితో నుండు మేటీ - 163

టీక :- నలుమొగముల చూలుꣳ = బ్రహ్మను గన్నవాడు, నల్లనౌమేనిడాలుꣳ = నల్లని శరీర కాంతిని, చెలగు నడుగు జాలుꣳ = పాదమున ప్రకాశించు గంగను, చిందముꣳ = శంఖమును, చుట్టువాలుꣳ = చక్రమును, వలచు కలిమి యాలుꣳ = తనంతగాతాను వలచి వచ్చిన లక్ష్మీదేవిని, వన్నెదువ్వల్వమేలుꣳ = వస్త్రములలో మేటిదైన బంగారు వలువను, గలుగు నతడు = ధరించిన వాడు, నీపై = నీమీద, కల్మితో = కరుణతో ఉండుమేటీ -

తా :- బ్రహ్మనుగన్న వాడు, నల్లని మేను గలవాడు, పాదమున గంగ ప్రభవించిన వాడు, శంఖ చక్రములు ధరించినవాడు, లక్ష్మిగలవాడు, బంగారు పుట్టము గట్టిన వాడు అయిన విష్ణువు నీపై దయగలిగి యున్న వాడైన గొప్పవాడా ! ఓ అమీను ఖానా !

విశే :- వలచు కలిమియాలు :- పూర్వగాథ -

లక్ష్మీదేవి సముద్రుని కూతురు, తండ్రియాయె వివాహమును చాటించగా

నామెను వరించుటకై సమస్తమైన దేవతలు వచ్చిరట కాని ఒక్క విష్ణువు మాత్రమే రాలేదట. అతడు క్షీరసముద్రమున శేషునిపై తన యోగ నిద్రలో తానుండెనట. అపుడు లక్ష్మీదేవి స్వయంవరాగతు లందరి నొకపరి పరికించి వీరందరు నన్ను వలచువారే గానినేను వలచువారు గారని తనకు తానుగా వెదకుచు వెళ్లి వెన్నుని మెడలో వరమాల వేసిరట. అందువలననే యామె వలచు కలిమి యాలైనది.

''అలం - పర్యాయోక్తి''

ఇది శ్రీమదనగోపాల మంత్రప్రసాదలబ్ధ సారస్వత, సుకవిహిత వచో విభవ, భావనామాత్యతనూభవపౌన్ని కంటి తెలగనార్య ప్రణీతంబైన యయాతి చరిత్రంబను నచ్చ తెనుఁగు కబ్బంబునందు తృతీయాశ్వాసము.

★ ★ ★

చతుర్థాశ్వాసము

1 క॥ సిరిమీఱిన రాజుల దే
వర, మానిసి తనము పూని వచ్చిన సెకకఁ
దొరవేలుప, బలునిలుకడ
తఱి కొండ, యమీనుఖాన, తలఁపులనెలవా - 1

టీక :- సిరిమీఱిన = ఐశ్వర్యవంతులైన, రాజుల దేవర = రాజులకు దైవమైన వాడా ! మానిసి తనము పూని = మనుష్య దేహము ధరించి, వచ్చిన సెకకఁ దొరవేలుప = అగ్గికన్ను కలవాడా! అనగా శివుడా! బలునిలుకడఁ మిక్కిలియగు స్థైర్యమున, తఱికొండ = మందరమా, అమీనుఖానా, తలపుల నెలవా! కోరికలకు నిలయమైన వాడా!

తా: ఓ అమీను ఖానా ! శ్రీమంతులైన రాజులందరికి దైవమైనవాడా మనుష్యదేహము ధరించి జనించిన శివుడా! ధైర్యమున మందర పర్వతము వంటి వాడా (యాచకుల) కోరికలకు నిలయమైనవాడా!

'అలం - రూపకము. ''

2. వ॥ అటమీఁది తెఱంగు వినుము - 2.

టీక : అట మీది తెఱంగు వినుము = ఆతరువాతి విధమును వినుము.

వసంతర్తు వర్ణనము

3. చ॥ కరువలి రక్కసుల్కినుక గ్రమ్మి వడంకఁగ బ్రాఁకు వేల్పులఁ
దొరకని యాకు రెంటెములు దోఁచఁగఁగోవెల కరాఁతఁ జెప్పఁగా.
వరయుచు వారలం గడిమి నామని వెన్నుఁడు నొంపఁ, జెందునె
త్తురు బలె లేఁజిగుళ్లలరెఁ దోఁపుల జూపఱ చూడ్కి పండువై - 3

టీక :- కరువలిరక్కసుల్ = వాయువను రాక్షసులు, కినుక గ్రమ్మి = కోపము క్రమ్ముకొని, బ్రాకువేల్పులఁ = వృక్షములను దేవతలను, వడంకగఁ వణకిపోవు చుండగా, దొరకని = పూనుకొని, ఆకురెంటెములు = ఆకులను జమిలినేత బట్టలను, దోచగఁ

= దోచుకోగా, ఆవిషయము, కోవెల కూత చెప్పగా ఆమని వెన్నుడు = వసంత మాధవుడు, అరయుచు = వారిని అనగా ఆరక్కసులను వెదకుచు, కడిమిన్ = శౌర్యముతో ఒంపన్ =వధించగా, బిందునెత్తురు బలె = చిందిన నెత్తురువలె, చూపఱ చూడ్కికి = చూచువారి చూపులకు, పండువై = సంతోషము కలిగించునవై, లేజిగుళ్ళు = చెట్లకు కొత్త చిగుళ్లు, అలరెన్ = ఒప్పెను.

తా :- వాయువను రాక్షసులు కోపమున వృక్షములను దేవతలయొక్క ఆకులను వస్త్రములను హరింపగా, నావిషయము కోకిలకూత చెప్పగా వసంత మాధవుడు ఆరక్కసులను వెదకుచు వచ్చి వధించగా వెడలిన రక్తమువలె చెట్ల కొమ్మలకు క్రొత్తచిగుళ్ల కన్నులపడులై యొప్పెను.

"అలం - ఉపమ"

4\. సీ॥ అలమింటఁ జెలఁగు రాచిలుకల చాలుపు
లేవేలుపు మన్నీని విండ్లు గాఁగఁ
బూఁ దేవియలఁ జాలఁ బొదలు తేఁటుల మ్రోఁత
రహిమించు నఱుముల రవలిగాఁగ
మూఁకలై పొడవైన చీఁకటి మ్రాఁకుల
చాళ్లు గార్కొన్న మొగుళ్లు గాఁగ
వెలుతు రీయక జాఱు విరితేనియలసోన
వదలక కురియు పెన్వాన గాఁగ

తే :- వేడుకలు మీఱఁ దోఁటల నాడుకొమరు
వెలదు లెల్లను మెఱుఁగు దీవియలు గాఁగఁ
గ్రమ్మ యుప్పొంగుచును దొలుకారు వోలె
వలపు నెలుపుచు నామని పొలుపు మీఱె, - 4

టీక :- అల = ఆ యొక్క, మింటజెలఁగు = ఆకాశమున విహరించు, రా చిలుకల చాలుపుల్ = రామచిలుకల వరుసలు, వేలుపు మన్నని = ఇంద్రుని యొక్క, విండ్లు గాగన్ = చాపములుకాగా/ పూదేనియలన్ = పూలతేనెలపై, మిక్కిలి పొదలు = మిక్కిలిగా ముసరు, తేటులమ్రోత = తుమ్మెదల రవళి, రహిమించు = నల్లనికాంతితో మించు మేఘము ల యొక్క, ఉరుముల = ఉరుముల యొక్క, రవళిగాగన్ = మ్రోత గాగ/ మూకలై = గుంపులై, పొడవైన = దీర్ఘమైన, చీకటి మ్రాకుల చాళ్లు = తమాల

వృక్షముల వరుసలు - ఇవికానుగులో నొక భేదము కార్కొన్న = నల్లగా మూగిన మొగుళ్లగాగ = మేఘములుకాగా/ వెలుతురీయక జాఱు = తెరిపిని యీయకుండ శ్రవించు, విరితేనియలసోన = పూల తేనెల యొక్క ధారలు, వదలక కురియు = విడువకుండ కురిసెడు, పెన్వానకాగ = జడివాన కాగ/ వేడుకలు మీర = సంబరములు మించగా, తోటలనాడు = తోటలందు క్రీడించు, కొమరు వెలది లెల్లను = కౌమారప్రాయపు యువతులు, మెఱుగు దీవియలు కాగ = శంపాలతలు కాగా, క్రమ్మిమయు ప్పొంగుచునను, బాగుగా కమ్ముకొని విజృంభించు, తొలుకారువోలె = మునాయిటి వలె, వలపు నెఱుపుచు = వాంచితములు కలుగజేయుచు ఆమని పొలుపు = వసంత మాసము, మీటెౙ = మిక్కిలిగా విజృంభించెను.

తా :- ఆయొక్క ఆకాశమున విహరించు రామచిలుకల బారులు ఇంద్రచాపములుగా తేనెలకై పూవులపై ముసరు తుమ్మెదల రొద యురుముగా గుంపులు గుంపులై పాడవుగా పెరిగిన చీకటి చెట్లు మేఘములుగా తెరిపి నీయకుండగా నెప్పును పూవుల పై నుండి జారుచుండు తేనెల ధారలు జడివానగా, సంబరములతో తోటలలో నాడు యువతులు మెరుపు తీగలుగా ఆ వసంతర్తువు, తన విలాసముతో బాగుగా క్రమ్ముకొని తొలుకారువలె విజృంభించెను.

విశే :- తొలుకారు అనగా మొదటి ఋతువు. ఋతువులందు మొదటిది వసంతమేకాని తొలుకారనులోకమున - లౌకికసంవత్సరములు. శ్రావణముతో నారంభము కనుక - వర్షాకాలవు వాడుకగా నున్నది. అందువలన తెలగన యీ పద్యమున తొలుకారను పేరు సార్థముగా వసంత వర్షముల రెండినొకటిగా రూపించి తనలోకజ్ఞతను ప్రదర్శించెను.

''అలం - పరిణామము''

5. తే॥ ఎలమిమ్మై జాజి యీరంపు టేనుఁగులను
నొంచు నామని యను తెఱనోటిమెకము
గోళ్ళనంగను దగు మోదుగులను మొగ్గ
లమరెఁ, దమరంగు మిన్నెల్ల నలమికొనఁగ, –5

టీక :- ఎలమియ్మై = విజృంభించి, జాజి ఈరంపు టేనుగులను = జాజిపొదలను ఏనుగులను, ఒంచు = వధించు / జయించు, ఆమనియను వసంతమను, తెఱనోటి

మెకము = సింహము, గోళ్ళనంగను = గోరులనగా, తగు = తగినట్లు, మోదుగులను = మోదుగుచెట్లకు, మొగ్గలు = కొరకములు, తమరంగు, మిన్నెల్ల = ఆకాశమంతటా, అలమికొనగ = వ్యాపించగా, అమరెన్ = ఒప్పెను.

తా :- జాజి పొదలను ఏనుగులను వధించుటకు విజృంభించిన సింహము యొక్క గోళ్ళనగా మోదుగు చెట్లపై తమకాంతి యాకాశమంతటా వ్యాపించగా మొగ్గలుదయించెను-

విశే :- వసంతమున వృక్షజాతులన్ని పుష్పించునుగాని జాజిపూయదు. అది వర్షర్తువుననే పుష్పించును. వసంతమున తెవులుగొనినట్లు నిలుచును. అందువలన కవి వసంతమును దానిని వధించుట విజృంభించిన సింహమని చెప్పెను.

''అలం - ఉత్ప్రేక్ష''

6. క॥ క్రందుకొను చిగురు జొంపము
లం దగ బలుమావులంత, లలినెల్లెడలం
జెందిరపుఁ గావిపడగల
నందంబగు మరుని తేరు లనఁగాఁ బొలుపై - 6

టీక :- క్రందుకొను = దట్టమైన, చిగురు బొంపములన్ = చిగురుగుంపులో, అంతన్ = అపుడు, పలుమావులు = అనేకమైన మామిడి గున్నలు, ఎల్లెడలన్ = అంతట, లలిన్ = ఒప్పుచు, చెందిరపుగాలి పడగల = ఎఱ్ఱని గాలిపడగలతో, అందంబగు = అలంకరించిన, మరుని తేరులనగా = మన్మథుని రథములనగా, పొలుపై = అందమై, తగెన్ = ఒప్పెను.

తా :- అపుడు మామిడి గున్నలు దట్టమైన చిగురు గుబురులతో నెక్కడ జూచినను, ఎఱ్ఱనిగాలి పడగలతో నలంకరించిన మన్మథుని రథమునిగా నొప్పెను.

విశే :- ఇది వసుచరిత్రలోని 3-135 వ పద్యమును తలపించును. చూడుడు-
పరిమిళితప్రవాళనవపట్ట పటధ్వజ చూతనూతన
స్మర రథరాజముల్ భ్రమరజాలగుణాంచిత పాంసుచక్రముల్
గెరలమహాబలంబు దరలింపలతావని తాళిఋవ్వులే
మరువపు బంతులట్లు శుకమండలి యాడెడిగంటె పుప్రయిన్

''అలం - ఉత్ప్రేక్ష''

7. మత్తకోకిల :-

పిచె మావులుఁ గ్రోవులుం దగు నిప్పలు న్గురి వెందలుం
బూచెనిమ్మలు దాడి నిమ్ములుఁ జొన్నలు న్సుర పొన్నలుం
గాచె జిన్నుల కన్న మున్నుగ గంగరావులు మోవులుర్
రాచెఁ గొమ్మలనింగి గోఁగులు రావులుం గడు తీవులన్ - 7

టీక :- మావులు = మామిళ్ళు, క్రోవులు = ఎర్రగోరంటలు, సీ॥ - కొరివినా క్రోవినాక్రొమ్మినాగ - గురవక నామమౌ - ఆం.భా. 3-52 అగు = తగినట్టి ఇప్పలుర్, గురివెందలుర్, ఏచెర్ = చెలరేగెను, అనగా బాగుగా పూచెను, నిమ్మలు, దాడి నిమ్మలు = దానిమ్మలు, పొన్నలుర్, సురపొన్నలు, పూచెను, జిన్నుల కన్నమున్నుగర్ = జిన్నులను చెట్లకంటె మొదట, గంగరావులు = గంగరాగి అనగా వనాశ్వత్థము, మోవులుర్ = మోవి ఒక ఫలవృక్షము, కాచెర్ = ఫలించెను, గోగులు = కొండగోగులు, రావులున్ = రాగులు, అనగా అశ్వత్థములు, కడుతీవులర్ = మిక్కిలి తీవిగా, కొమ్మలర్=కొమ్మలతో, నింగిర్=ఆకాశమును, రాచెన్=ఒరసెను.

తా :- వసంతమున మామిడులు ఎర్రగోరింటలు, ఇప్పలు, గురివెందలు, ఏపుగా పూచెను. నిమ్మలు, దానిమ్మలు, పొన్నలు, సురపొన్నలు పూచెను. జిన్నుల కంటె మొదట గంగరావులు, మోవి చెట్లు కాచెను. కొండగోగు, రాగి, బాగుగా పెరిగి తమకొమ్మలతో ఆకాశమును తాకెను. అనగానంత యెత్తుగా పెరిగెను.

విశే :- జిన్నులు అనునవి ఒక విధమైన ఫలవృక్షములు, దీనియాకులు పనసయాకుల వలె, పండ్లు ఉసిరికాయల వలె నుండును. దీని యందు తెలుపు నలుపు అను రెండు భేదములు గలవు. ఈ వృక్షములు తిరుపతి కొండలలో కలవు.

'అలం - యమకము''

8. శా॥ వ్రేలుం గొమ్మలు నేలఁ దారసిలిన న్వెళ్ళంగ రాకుండఁగా
లోలోఁ ద్రిమ్మరు నాలిగాడ్పులు పగళ్లుర్ రేలుఁ బూఁదావులం
జాలన్ముచ్చిలి పోవఁ బట్టుకొని పజ్జం బచ్చగండార్లలో
సోలం గావలిఁ బెట్టె నామని యనం జూపట్టె లేఁదోఁటలన్ - 8

టీక :- లేదోటలర్ = లేతతోటలలో, వెళ్ళంగ రాకుండగా = బయటికి పోరాకుండ, వ్రేలుంగొమ్మలు = వ్రేలాడుకొమ్మలు, నేలదారసిలినర్ = నేలకు అంటుకొనగా,

లోలో ద్రిమ్మరు = వానలోలోపలనే తరుగు, నాలిగాడ్పులు = పిల్లగాలులు, పగుళ్లుఁ రేలు = పగలు మరియు రాత్రులందు, పూలతావులను = పూవుల పరిమళములను, చాలద్రుచ్చిలి = మిక్కిలిగా దోచుకొని, పోవుఁ = పోవుచుండగా, పట్టుకొని పజ్జఁ = ఆప్రక్కలలోని, పచ్చ గండార్లలోఁ = పచ్చని చెరసాలలో, పోలఁ = తగినట్లు, కావలి బెట్టె ఆమనియనఁ = వసంతమగునట్లుగా, చూపట్టెఁ = కనిపించెను.

తా :- ఎలదోటలో చెట్లకొమ్మలు పూలగుత్తుల బరువులకు వంగి అటు ఇటు దూరి పోరాడకుండ నేలను రాయుచుండగా వానిలోపల తిరుగు పిల్లగాలులు రేపుమాపు ఆపూవులయొక్క వాసనలు దోచుకొని పోవుచుండ వసంతుడవి బయటికి పోకుండ పచ్చని చెరసాలలో బంధించి కాపు పెట్టినట్లు కనిపించుచుండెను.

''అలం - ఉత్ప్రేక్ష''

9. తే॥ అమరెఁ బుప్పొడి కుప్పలై యంతనంత
మెట్ట దామర పాకుల మీఁద జాతెఁ
బైఁడి చూలాలి వేవిళ్ల వాయఁదోఁట
కలిమిచెలి పెట్టుకల వంటకంబు లనఁగ - 9

టీక :- అంతనంత = అక్కడక్కడ, పుప్పొడి కుప్పలై, మెట్ట తామర పాకుల మీదజాతి, పెడి చూలాలి = భూదేవి యొక్క వేవిళ్ళు వాయఁ = వేవిళ్ల అనగా బైకాలు పోవుటకు, తోటకలిమిచెలి = ఆవనలక్ష్మి పెట్టెడు, కలవంట కంబులనగఁ = పిండివంటలనగా, అమరెఁ = ఒప్పెను.

తా :- ఆ తోటయందు పుప్పొడి అక్కడక్కడ మెట్టతామరాకులపై కుప్పలుకుప్పలై అది భూదేవి యొక్క వేవిళ్ల పోవుటకు వనలక్ష్మి పెట్టెడు పిండివంట అనగానొప్పెను.

''అలం - ఉత్ప్రేక్ష''

10. చ॥ చలి మిరిగాడ్పుచే నెగసి సన్నపు సుళ్లగు చాక సంపుమం
దల విలసిల్లెఁ బుప్పొడులు దట్టముగా, మదిఁగ్రమ్మ కూర్మిచేఁ
గలఁగి విరాలిఁ గుందు తెలిఁగంటి నెలంతల మీఁదఁ జొన్పు పూ
విలుతుని పైఁడి చుట్టలుగు వేలములుం బలె సొంపు పెంపునన్ - 10

టీక :- మదిగ్రమ్మ = మనస్సులో క్రమ్ముకొనెడు, కూర్మిచే = ప్రేమచే, కలగి = కలతనొంది, విరాలిగుందు = విరహముతో బాధపడు, తెఱగంటినెలంతల మీద = దేశతాస్త్రీలపై, చొనుపు = ప్రయోగించి పంపు, పూవిలుతుని = మన్మథుని యొక్క, పైడి చుట్టలుగు = బంగారపు సుదర్శనము యొక్క, వేలములుఁబలె = గుంపులవలె, సొంపు పెంపునఁ = తమయందము యొక్క అతిశయముచే, చలిరి గాడ్పుచేనెగసి = చల్లని పిల్లగాలిచే లేచి, పుప్పొడులు, దట్టముగా = చిక్కగా, సన్నపు సుళ్లగుచు = సన్నని సుడులు తిరుగుచు, ఆకసంపు మందలఁ = ఆకాశముయొక్క మార్గములలో - విలసిల్లెఁ = ప్రకాశించెను.

తా :- అదివసంతము గావున మనస్సులందు గ్రమ్మిన శృంగార భావములచే విరహమును పొందు దేవతా స్త్రీలపైకి మన్మథుడు పంపు బంగారపు సుదర్శనములవలె ఆకాశమార్గమున చలిగాలికి పైకిలేచి దట్టముగా సుడులు తిరుగు పుప్పొడులు చూడనొప్పెను.

''అలం - ఉపమ''

11\. క॥ అగిసెవిరు ల్కరు వలిచే
నెగయం దోఁదేఁటి చాల్పు లేఁగుం దఱుచై
తొగరాచ పదువులన్వెను
దగులుచు నెలదిండి పిండు దార్కొను పగిదిన్ - 11

టీక :- అగిసెవిరుల్ = అవిసెపూలు, కరువలిచేఁ = గాలిలో, ఎగయఁ = లేవగా, అనగా కదలగా, లోఁ = వానితో పాటుగా, తేటి చాల్పులు = తుమ్మెద బారులు, తఱుచై = గుంపులై, తొగరాచ పదవులఁ = కలువల రేడైన చంద్రుని గుంపులను, వెనుదగులుచు = వెన్నాడుచు, నెలదిండిపిండు = రాహుసమూహము, తార్కొను పగిదిఁ = సమీపించు చున్నట్లుగా, ఏగుఁ = వెళ్ళును.

తా :- అవిసెపూలు గాలికి లేవగా వానివెంట తుమ్మెద బారులు చంద్రవంకలను వెన్నాడుచు సమీపించుచున్న రాహువుల గుంపులవలె వెళ్ళు చుండెను.

విశే :- చంద్రులను కబళించు రాహువుల పోలిక ఇతని చేత నిది మూడవసారి.

''అలం = ఉపమ''

12.మ:- ఎలమిం దుమ్మెద మ్రోఁత వాసెవలై యింపొంద, మత్తిల్లుకో
వెలసీకారుల కూఁకపాట లమర న్వేవేడ్కతోనాలిగా
డ్పుల పేరం గల నట్టువు ల్గఱపఁ గొపుల్తాపు లేఁదీవెపా
త్రల కయ్యామని పూవు ముత్తెపుసరు ల్దాల్పంగ నిచ్చెంగడున్ - 12

టీక :- నాలిగాడ్పుల పేరన్ = మందమారుతము అనుపేర, గలనట్టువుల్ = ఉండెడు నర్తకులు, కఱపన్ = నేర్పగా, గోపుల్ తాపు = కోపులను నాట్య విశేషములను చూపు, లేదీవపాత్రలకు = లేత తీగలను పాత్రలకు, అయ్యామని = ఆవసంతము. ప్రేమతో, తుమ్మెద మ్రోత = భ్రమర ఝుంకారము, వాసెరమలై యింపొద వాసెయను వాద్య ధ్వని కాగా, మత్తిలుకో వెలసీకారుల = మదించిన కోకిలను, సీకారుల = గాయకుల యొక్క, కూకపాటలమరన్= కూతలను పాటలొప్పగా, వే = వేగముగా, వేడ్కతో = సంతోషముతో, పూవు ముత్తెపు సరుల్ = పూవులను ముత్యాల చేరులు, కడున్ = మిక్కిలిగా, తాల్పంగ నిచ్చెన్ = ధరించుటకై యిచ్చెను.

తా :- మంద మారుతమను నర్తకులు లేదీగెలను పాత్రలను నేర్పగా నవి తమయొక్క నాట్యవిశేషములు చూపగా ఆవసంతము సంతసించి భ్రమర ఝుంకారమను వాసెధ్వని, కోకిల కూతలను పాటలు ఒప్పుచుండగా సంతోషమున వానికి - అనగా నాలేవదీవవలకు పూవులను ముత్తెముల చేరులు ధరించుటకై యిచ్చెను.

విశే :- ఇందులో ఆభరణోత్సవము చెప్పబడినది. పూర్వము ఆచార్యులు శిష్యులకు సంగీత నాట్యములు నేర్పగా శిష్యులవి మొదటి సారిగా సభకు ప్రదర్శించునపుడు ఆనాటి పరీక్షకులు వారికి బహుమానముగా వస్త్రాభరణములు పారితోషికముగా నిచ్చుట యాచారముగాన నదియిందు తెలుపబడినది.

''అలం - రూపకము''

13.వ:- మఱియు విరితేనియ లాని పూని మత్తిలి తత్తఱం బునం దిరుగు
తేఁటి మొత్తంబుల యెఱకల సన్నం గరువలి గట్టువ నట్టువ గఱవ
నామని రాఁజేని కడ నాడు లేవ పాతర లముందఱఁ గ్రందుగా నుత్తిన
మవ్వంపు దుప్పటంబుల తెరలమరువు లనం గ్రమ్ము పూదుమ్ముల
ముమ్మరంబులం గొమ్మలం గానక త్రిమ్మరు కలికి రాచిలుక పలుకుల
రొదల నెదలు గలంగ మెలంగు తెరువరులనేయ, బాసటంబు చిలి కిన
మరుని చిలుకులు పోని తుమ్మెద దిమ్ముల నలరు నలరుం గాంచి వలఁజేని

కాని పనికిం గినుకం గొను తోఁట కలిమి చెలియ చూపుల సొంపునం గెంపుసోననంబులగు దాసనం బులును, దాసనంబులు చీఁకటి ప్రూఁకు మూఁకలలోన నిరులు దొరలు తమ దాయ యగు వేఁడి వెలుంగు నింగికి వెఱచి పఱచిన, నతని మెయిపుట్టు గులం బట్టి లోనిడు కొన్న వడువున నున్నఁ గేకిసలు గొట్టు నిర్ల పట్టిపిండు నుంబోలెఁ జెలంగు కోవెలలును, గోవెల లొగరుం జిగురు లుమియుం గని మున్నీటితో నానిక మానికంబులు వెడలించు.నించు మొగు లుందెగ లని బెట్టుగా నాడు జుట్టు నట్టువ పిట్టలు కఱి చిలువ తెఱవ లను తలంపు పెంపున జడల కొడియ వడివడిం దీవ యుయ్యెల లూఁగు మగువల నగవు వెన్నెల లోన దిక్కుల పెక్కువలుం బోలెఁ గానిపించు పొన్న మొగ్గ లును, బొన్న మొగ్గల హత్తిన ముత్తెపుం దొడవు లయ్యెడ నిడి పూఁదేనియల జలకం బాడుతోపు వేలుపుఁ జానకు దిద్దిన నిద్దంపుఁ బసపు ముద్దల యొద్దికం దగు పెద్ద నిమ్మ పండ్లును, నిమ్మపండ్ల యచ్చుపుఁ బచ్చడాలు చాల న్మిఱుచుం గారుగోఁగులపైఁ బర్వఁ జనుపకంబులని కలంగి తొలంగి చేరక తిరుగుతత్తఱంబుల తేఁటి మొత్తం బులం గెలిచేసి మించు తీవెచానల యెలుంగు లనం గులుకుఁ బలుకులు గల కలికి చిలుకలును, జిలుక ముక్కుల నొక్కంబడు మారేడుం బండ్ల చెన్నుఁగని తమ యున్నుల చన్నుల పోలిక లని విరాలిం జాలింబడు తెరువరులం జూచి వగచు ప్రూఁకుల కన్నీరు నుంబోలె బోరునం జాఱు పూఁదేనియ లును బూఁదేనియ కాలువ చాళ్ల పుళ్లంబడి వడివడిం దిరుగు మరుని కెంపు బొంగరంబులుం బోని మెట్ట దామర మొగడలును, దామర మొగడలం దెగడు చిన్ని చన్నులుగల కన్నియ లన్ను చూపం బూఁదేనియ లాని తీనియల యందుం దాడు నేర్పులకు మెచ్చి పచ్చ విల్కాఁడు గురియించు విరివానలుం బోలెఁ గరువలిచేఁ దొరుగు పరువంబు నన లునుం, గలిగి వలరాజు లాయంబునుం బోలె మావులకుం. దానకంబై, చానల సోయగంబునుం బోలె మోవులం బాపటల సొంపుమీఱి, వెలయాండ్ర చన్నుల చెన్నున గోరంటలం బొదలి, తోఁపు చూపఱకుం బేరామనిగా నామని యొప్పెనంత – 13

టీక :- మఱియు = ఇంకను, విరితేనియలాని = పూవులలోని తేనెలు త్రావి, పూనిమత్తిల్లి = బాగుగా మదించి, తత్తరంబునందిరుగు. వేగిర పాటుతో తిరుగుచున్న, తేటి

మొత్తంబుల = తుమ్మెదగుంపుల యొక్క, ఎఱుకల సన్నం = టెక్కుల యొక్క సైగలచే, కరువలిగట్టి వానట్టువ = తెమ్మెరయను మాటకారి నర్తకి, గఱపఁగ= నేర్పగా, ఆమని రాజేనికడ = వసంతుడను ప్రభువు దగ్గర, ఆడు = నాట్య మాడునట్టి, లేవపాతరల ముందఱ = గుబ్బపు తలాడములను పాత్ర లముందు, క్రందుగానెత్తిన = ఒక్కుమ్మడిగా నెత్తిన, తెరమరువులనఁగ = మరుగుతెరలనగా, క్రమ్ము = కమ్ముకొను, పూదుమ్మల = పుప్పొడుల యొక్క, ముమ్మరంబులఁగ = ఆధిక్యముతో, కొమ్ములఁగానక = తమ పెంటులను చూడక, త్రిమ్మరు = తిరుగు, కలికిరాచిలుకల = కలికి తనముగల రామచిలుకల యొక్క, పలుకులరొదల= కలకలధ్వనులచే, ఎదలుకలంగ = మనస్సులు కలతచెందుచుండగా, మెలంగు = సంచరించు, తెరువలేయఁగ = బాటసారులను వేయుటకు, బాసటంబు చిలికిన = విషము చల్లిన, మరున చిలుకులు వోని =మన్మధుని యొక్క బాణాగ్రములను పోలిన, తుమ్మెదల దిమ్ములఁగ = తుమ్మెదల యొక్క గొప్పనైన రొదలతో , అలరునలరుం గాంచి = ఒప్పు పూవులను చూచి, వలజేని కాని పనికిఁ = మన్మధుని యొక్క అకృత్యమునకు, కినుకంగొను = కోపించు, తోటకలిమి చెలియ = వనలక్ష్మియొక్క, చూపుల సొంపునఁ = చూపులయొక్క యందమున, కెంపుపోసనంబులగు = ఎఱుపుదనముపై పూతగా గలుగు, దాసనంబులును = జపాపుష్పములను –

దాసనంబులు = ఆ జపాపుష్పములు, ఇరులు దొరలు = చీకటులు గ్రమ్ము, చీకటి మ్రాకులలోన = తమాల వృక్షములందు, తముదాయ యగు = తమకుశత్రువగు, వేడివెలుంగు = సూర్యుడు, వెఱచి = భయపడి, నింగికి పరచినఁ= ఆకాశమునకు పరుగెత్తిన, అతని మెయిపుట్టు గులంబట్టి = అతని యొక్క తనూభవులను పట్టుకొని లోనిడుకొన్న వడువున = లోపల నుంచుకొన్న విధముగా, ఉన్న = ఉన్నటువంటి, కేకినలు గొట్టు = పరిహాసమున కేరింతలాడు, ఇర్లపట్టి పిండునుం బోలె = చీకటి పిల్లల గుంపులవలె, చెలంగు కోవెలలును = ఒప్పుచున్న కోకిలలును –

కోవెలలు, వగరుజిగురు లుమియంగని = వగరెక్కిన చిగురుటాకులు వెళ్లగాయుంచుండుట చూచి, మున్నీటితో నానిన మానికంబులు = సముద్ర జలముతోపాటు త్రావిన రత్నములను, వెడలించు = వెడలగ్రక్కు, ఇంచు మొగులుండెగలని = అతిశయించిన మేఘముల గుంపులని, బెట్టుగానాడు =

విజృంభించి నర్తించు, జొట్టునట్టువ పిట్టలు = నెమిళ్ళు, కఱిచిలువ తెఱవలను = నల్లని నాగకాంతలను, తలంపు పెంపునన్ = తలంపులతో, జడలకున్ = వేణులకు, ఒడియన్ = హఠాత్తుగా పట్టుకొన బోవుచుండగా, వడివడిన్ = మిక్కిలి వేగముగా. తీవయొయ్యల లూగు = తీగెల యొక్క యూయలెక్కి ఊగుచున్న, మగువలనగవు వెన్నెలలోనన్ = యువతుల యొక్క నవ్వులను వెన్నెలలో, దిక్కుల పెక్కువలుంబోలె = చుక్కల గుంపులవలె, కానిపించు, పొన్న మొగ్గలును = పొన్న చెట్లయొక్క కోరకములు –

పొన్నమొగ్గల హత్తిన = పొన్నమొగ్గలు పొదిగిన, ముత్తెంపు తొడవులు = ముత్యముల యొక్క ఆభరణములు, అయ్యెడనిడి = అపుడు ధరించి, పూదేని యల జలకం బాడు = పూల తేనెలో స్నానమాడు, తోపువేలుపు జానకు = తోటయను దేవతా యువతికి, దిద్దిన = ఏర్పరచిన, నిద్దంపు = అచ్చమైన నిగనిగయను, పసుపు ముద్దల = పసుపు ముద్దల యొక్క, ఒద్దికన్దగు = రీతిగానుండు, పెద్దనిమ్మపండ్లును–

నిమ్మపండ్లు, అచ్చపు పచ్చడాలు = శ్రేష్ఠమైన పచ్చదనము, చాలన్మరుచు = మిక్కిలిగా హెచ్చించు, కారుగొగులపై బర్వ = నల్లనికొండ గోగులపై వ్యాపించగా, చనుపకంబులని = సంపెంగలని, కలంగి తొలంగి = జడిసి దూరముగా జని, చేరక, వానిని సమీపించక, తిరుగు తత్తరంబులన్ = తిరిగెడు తొందరపాటులుగల, తేటి మొత్తంబులం గేలిచేసి = పెంటితుమ్మెదల గుంపులను పరిహాసము చేసి, మించు = విజృంభించు, తీవెచానల = తీగలను యువతుల యొక్క, యెలుంగులనన్ = రంతలనగా, కులుకుపలుకులుగల = ముద్దు మాటలుగల, కలికి చిలుకలును = పెంటిచిలుకలును, లేదా ముద్దువచ్చు చిలుకలని గూడ –

ఈ దళమున – నల్లగోగులను చంపకములని వెఱచిన తుమ్మెదలకు – ఆడుతుమ్మెదలకు సంపెంగ వాసన పడదు. ఆవాసనకవి మూర్ఛపెవును. అందువలననవి దానిని దరి జేరవు –

ఆ. వాని చక్కదనము వైరాగ్యమును జూచి, కాంక్షజేయు జార
కామినులకు భోగబాహ్యమయ్యె పూచిన సంపెంగ,
పొలుపు మధుకరాంగనలకు దోలె – మను – ఆ–2.వ.

ఇందులో చెప్పబడిన వారు వేశ్యలు కనుక పెద్దనగారు ఆటవెలదిని ప్రయోగించుట ఆయన వృత్తౌచిత్యమునకు యిదొక పెద్దయుదాహరణము.

ఆడు తుమ్మెదలకు సంపెంగ వాసన పడదనుటకు - చూ.

చంపకము - భ్రమరము - వ్యాసము - ఆంధ్రప్రభ వార్తపత్రిక డా॥వి. బుచ్చారెడ్డిగారు.

చిలుకముక్కులన్ = ఆచిలుకల యొక్క ముక్కుల చేత, నొక్కంబడు = నలుగునట్లు చేయబడు, మారేడుంపండ్ల చెన్నుంగని = మారేడు పండ్ల యొక్క యందమును చూచి, తమ యన్నుల చన్నుల పోలి కలని = అవి తమ యొక్క స్త్రీలయొక్క చన్నులను పోలినవని, విరాలిం జాలింబడు = ప్రియురాండ్ర యొక్క స్మృతిచే వియోగము కలిగి దానివలన దీనత్వమును పొందు, తెరవరులం జూచి = బాటసారులను చూచి, వగచు మ్రాకుల కన్నీరుం బోలె = దుఃఖించు చెట్ల యొక్క అశ్రువుల వలె, బోరునంజారు = మిక్కిలిగా స్రవించు, పూదేనియలును = పూలతేనియలును -

పూదేనియ కాలువ చాళ్లన్ = పూలతేనియల యొక్క కాలువల వరుసలలో, సుళ్లంబడి = సుడులలో పడి, వడివడిం దిరుగు = మిక్కిలివేగముగా తిరుగు, మరుని= మన్మధుని యొక్క కెంపు బొంగరంబులంబోని = ఎఱ్ఱని రత్నములతో చేసిన బొంగరముల వలెనున్న, మెట్ట తామరల మొగడలును = స్థలపద్మముల యొక్క మొగ్గలును-

తామకరమొగడలన్ దెగడు = తమ్మిమొగ్గలను పరిహసించు, చిన్ని చన్నులు గల కన్నియలు = చిన్నవైన చన్నులుండెడి కన్యలు, అన్నుచూపన్ = పరవశత్వము కలుగునట్లుగా, పూదేని యలాని = పూవుల తేనెలు త్రాగి, తీనియల యందున్ = అరుగు లపై వసించి, పాడు = పాటలుపాడు, నేర్పులకు మెచ్చి = నైపుణ్యములకు మెచ్చుకొని, పచ్చవిల్కాడుగురియించు = మన్మధుడు కురిపించు, విరివానలుంబోలె = పూలవానలవలె, కరువలిచే దొరగు = గాలిచేరాలు, పరువంపుననలుంగలిగి = కోడెప్రాయపు మొగ్గలుకలిగి-

వలరాజులా యంబునుంబోలె = మన్మధుని గుఱ్ఱపు శాలవలె, మావులకుం దానకంబై = మగగుఱ్ఱములకు/ మామిడులకు, నిలయమ్మై చానల సోయగంబునుం

బోలె = స్త్రీల యొక్క అందమువలె మోవులన్ బాపటలన్ = మోవిమరియు పాపటయను చెట్లతో / అందమైన పెదవులతో మరియు సీమంతములతో - సీ॥ మోవియన వెలంది మోవికి మోవిచెట్టునకు బాసిలు. వేం - 124. గీ॥ పరగు బల్కప్పు మోవి వాతెరవదవియు నాగనోష్ఠంబు - ఆం. భా 2-142 వెల యాంధ్ర చన్నుల చెన్నున = వేశ్యలయొక్క యురోజముల వలె, గోరంటలం బొదలి = గోరంటలు. గోటి నొక్కులలో = గోరంట చెట్లతో, పొదలి = బప్పి, సీ॥ గోరంట నాగను గోరంట మానికి, గోరంటమనుటకు గొఱలు - వేం. 113 గోరంటలు-

సీ॥ సరవినఖక్షతస్థానముల్వివరింతు - సందిటగల యవిసందువంక
లనబొల్చు - మెడనున్న యవియె మొగిలిరేకు/ లనగదగు-
చనుగుబ్బలను నెలకొను - నవియె లెస్స నెమిలి యడుగులనగ
నొప్పు - వెన్నున గనబడు చున్నయవియు నమ్మ -
పెనంగ దనరును పిరుందుపై - గానిపించిన యవికల్వరేకు-
గీ॥ లనగ నెసగు, మీజెయి చెక్కిటను దొడకడ, నిలుచునవి క్రొన్నెల లనంగ జెలగు
చుండు-
వేంకటేశాంధ్రము - ప.77.
భళిరా తేరకు తేర జిక్కెనిటు తీ బంగారు కుండంచు ....
కటీసీమను.

త్పలపత్రాళిఘటింపగా - అని రామకృష్ణుని ప్రయోగము. చూ.పాండు.8.

లోవు = ఆలోమి, చూపరకున్ = చూచువారికి, పేరావునిగా = గొప్ప యుత్సవముగా, ఆమని యొప్పె = వసంతమొప్పెను.

తా :- ఇంకను ఆవసంతము తేనెలు బాగుగా త్రావి మదమెక్కిన తుమ్మెదలు తత్తరమున తిరుగుచుండగా వానియొక్క రెక్కల యొక్క గాలియను సైగచేత కరువలి యనే మాట కారినర్తకి నేర్పగా వసంతుడను ప్రభువు ముందర నటించు గుజ్జుపు తలాడమను పాత్రల ముందు ఒక్కుమ్మడిగా నెత్తిన తెరలనగా బాగుగా కమ్మిన పుప్పొడి దుమారమున తమకొమ్మలను చూడలేక తిరుగెడు చిలుకల యొక్క పలుకులచే మనసులుకలత చెంది సంచరించు విరహులపై ప్రయోగించుటకు తగిన విషదిగ్ధమైన బాణపు ములుకులను తుమ్మెదలతో గూడిన పూవులను చూచి మన్మథుని యొక్క యీ యకృత్యమునకు కోపించిన వనలక్ష్మి యొక్క చూపులవలె ప్రకాశించు దాసాని పూవులతో

ఆ పూవులు చిమ్మచీకటులు గ్రమ్ము చీకటి చెట్ల గుంపులలో చీకటులు తమశత్రువైన సూర్యుడు జడిసి యాకాశమునకు పరుగెత్తగా నతని కుమారులను పట్టుకొని తమలోన బందీచేసి పెట్టుకొని వానితో పరిహాసము లాడుచున్నట్లున్న చీకటి పిల్లల గుంపుల వంటి కోకిలలతో

ఆ కోకిలలు చిగురుటాకులు దండిగా యెక్కి వెడల గాయు చుండగా దానిని చూచి సముద్ర జలముతో పాటుగా నందలి రత్నములను గూడ త్రాగి వానిని వెళ్లగాయు మేఘములని తలచి పొంగిపోయి నాట్యమాడెడు నెమళ్లు, తమజడలను జూచి నల్లత్రాచులని ఒడిసి పట్టుకొనుటకు లేచుచుండగా తీగ నుయ్యాలలపై వడివడిగా నూగెడు తరుణుల యొక్క నవ్వు లను వెన్నెలలో ప్రకాశించు చుక్కలవలె నొప్పుచున్న పొన్నమొగ్గ లతో

ఆ పొన్నమొగ్గలను ముత్యములు పొదిగిన యాభరణములు ధరించి, పూదేనెలతో స్నానమాడు వనలక్ష్మియను దేవతా యువతికి స్నానమాడుటకై తీర్చిపెట్టిన పసుపు ముద్దలనునట్లుగా నొప్పు పెద్దపెద్ద నిమ్మపండ్లతో ఆ నిమ్మపండ్ల యొక్క పచ్చనికాంతి యాసమీపమందలి కారుగోగులపై యునగా నల్లని కర్ణికారములపై వ్యాపించగా నవిసంపెంగలని జడిసి వానికి దూరదూరము తిరుగునాడు తుమ్మెదల గుంపులను పరిహాసముచేయు పూలతీగలను యువతుల యొక్క ధ్వనులనగా ముద్దుముద్దుగా పలుకు చిలుకలతో -

ఆ చిలుకల యొక్క ముక్కులతో చిదుపబడు మారేడు పండ్లను జూచి యవి తమ ప్రియురాండ్ర చన్నులవలెనున్న వని తలచి, ఆస్మరణతో వారాళి కలిగి దీనత్వమును పొందు బాటసారులను చూచి దుఃఖించు చున్న వృక్షముల యొక్క కన్నీటివలె మిక్కిలిగా స్రవించు పూలతేనెలతో-

ఆ తేనెల కాలువల యొక్క సుడులలో మన్మథుని యొక్క దర్మరాగపు బొంగరముల వలె గిరగిర తిరుగు మెట్ట తామరల యొక్క మొగ్గలతో-

ఆ తామరల యొక్క మొగ్గలను పరిహాసము చేయుచును మొగడలు గల కన్యలు తేనెలుత్రాగి పరవశించి యచటి తిన్నెలపై నిలిచి పాటలు పాడుచుండగా వారినేర్పులకు మెచ్చుకొని మన్మథుడు కురిపించెడు పూలవానలవలె గాలికి రాలు పరువపు మొగ్గలతో -

చిలుకలు, మన్మథుని గుఱ్ఱములు అవి మామిడి చెట్లపై యెక్కువగా నివసించును కనుక మామిడికి కీరేష్టమని వ్యవహారము గనుక మన్మథుని యశ్వశాలలైన మామిడి చెట్లకు

స్త్రీల యొక్క (వనలక్ష్మి) యందమువలెనున్న మోవులకు పాపటలకు వెలయాంధ్ర యొక్క చన్నులవలెనున్న గోరంటలకు నిలయమై వసంతమున తోటలు చూచువారికి కనుల పండువై యొప్పెను.

''అలం - ముక్త పదగ్రస్తము''

మొదటి వాక్యమునందలి క్రియతో రెండవ వాక్యమును ఉత్ప్రేక్ష - ఉపమ - రూపక భ్రాంతిమత్తులు - ప్రారంభించుట ముక్తపద గ్రస్తమన బడును.

చెలు లుద్యాన విహారము చేయుట

14. క॥ తోరపుఁ గన్నెల వేవుర
తోరహి శర్మిష్ఠ కొలువఁ దులకింపుచుసిం
గారపుఁ దోఁటకుఁ జనియెన్
గారవమున దేవయాని, కడునాటతమిన్ - 14

టీక :- తోరపుకన్నెల = అందమైన కన్యలైన, వేవురతో = వేయిమందిలో, రహిన్ = క్రమముగా, షర్మిష్టగొలువన్ = షర్మిష్ట సేవించుచుండగా, తులకింపుచు = వైభవమున ప్రకాశించుచు, దేవయాని, కడు = మిక్కిలిగా, ఆటతమిన్ = క్రీడాకుతూహలముతో, గారవమున - గౌరవముతో, సింగారపుతోటకు = తనయొక్క శృంగార వనమునకు, చనియెన్ = వెళ్లెను.

తా :- అందమైనట్టి వేయిమంది కన్యలతో షర్మిష్ట తనను సేవించు చుండగా మిక్కిలి వైభవమున ప్రకాశించుచు, దేవయాని ఒకనాడు శృంగారపుతోటకు వెళ్లెను.

15.సీ॥ మొదలెడు గండుఁ దుమ్మెదల పెన్రొదల చేఁ
బొదలెడు గురివెంద పొదలఁ దూఱి
కలకలఁ బల్కు చిల్కల కొలంబులఁ జాల
నలరు పొన్నల మూఁగి యలరు లాగి
చెలఁగుచుఁ గిలకిలల్గులుకు కోవెలలకు
నలకువల్గడపు జిన్నులకు నుఱికి
ననలచే మరుని మన్ననలచేఁ జెన్నైన
పొగడలకును దమ్మిఁ బొగడనరిగి

తే ॥ కలికి యెల దేఁటి కదుపుల కలికి యులికి
పెనలు గొనియెడు చిన్ని గుంపెనల కేఁగి
మరల కానట్టు మెట్టతామరలు చిదిమి
తోఁగ నాడుచు నెలఁతుకల్ నీటు మెఱసి - 15

టీక :- మెదలెడు = తిరుగుచుండెడు, గండుతుమ్మెదల = పెద్దతుమ్మెదల యొక్క, పెఁరొదలచే = మిక్కిలియైన మ్రోతలచేత, పొదలెడు = ఒప్పుచున్న, గురివెంద పొదలఁ, దఱిసి = చొచ్చి, కలకలబల్కు = కలధ్వనులు చేయు; చిల్కలకొలంబులఁ = చిలుకల యొక్క గుంపులతో, చాలనలరు = మిక్కిలిగా ప్రాకశించు, పొన్నలమూగి = పొన్నలదగ్గర మూగి, అలరు లాగి = పూవులను కోసి, చెలగుచు = సంతోషమున నతిశయించుచు, కిలకిలల్గులుకు = కిలకిలమను కోకిలలకు, అలకువల్గడపు = న్యూనతలు తొలగించు, జిన్నులకునురికి = జిన్నులను వృక్షములకు పరుగెత్తి, ననలచే = పూవులతో, మరునిమన్ననలచే = మన్మధుని యొక్క గౌరవముతో, చెన్నైన = అందగించిన, పొగడలకును, తమ్ము = తమను చూచువారు, పొగడనరిగి = పొగడునట్లుగావెళ్లి, కలికి = సుందరమైన, యలదేటికదుపులకు = పిల్లతుమ్మెయదల గుంపులకు, అలికియులికి = జడిసి వెనుకకు తగ్గి, పెనలుగొనియెడు = అల్లుకొనెడు, చిన్ని = చిన్ననైన, గెంపెనలకేగి = గుంపెన వృక్షముల చెంతకేగి, మరలకానట్టు = మరలపుట్టకుండ, మెట్టతామరలు = స్థలపద్మములు, చిదిమి = చిదిమిపెట్టి, నెలతుకల్ = ఆయువతులు, తోటనాడుచు = తోటలో నాడుచు, నీటుమెఱసి రీవితో ప్రకాశించి.

తా :- బాగుగా మెదలు చున్న గండు తుమ్మెదల మ్రోతలచే నొప్పు గురివెంద పొదలలో దూరి, కలకలమని పలుకులు పలుకు చిలుకల గుంపులు గల పొన్నచెట్ల దగ్గర మూగి, కిలకిలమని కోకిల కంఠములకు న్యూనతలు తొలగించుచు అవి యుండు చెట్ల దగ్గరకు పరుగెత్తి పూవులతో మన్మధుని యొక్క మన్ననకు పాత్రమైన పొగడల దగ్గరకు తమను పొగడునట్లుగా పరుగెత్తి పిల్లతుమ్మెదల గుంపులకు జడిసి వెనుకడుగు వేయుచు, అల్లుకొనిన గుంపెన చెట్లదగ్గరకు వెళ్లి, మరల పుట్టకుండ అనగా మూలముతో గూడ మెట్టతామరలు చిదిమి ఆయువతులీవిధముగా తోటలో నాడుచున్నటుగా నొప్పి -

''అలం - యమకము''

16 ఉ॥ తొంగలి పూవుఁ దేనియలఁ దూకొనిమత్తిలి తుమ్మెదల్పయిఁ
బొంగుచు వ్రాల నొప్పెసఁగఁ బూచిన పొన్నఁ గడంగి కాంచి, ము
న్మ్రింగిన యావిసంబు వెసమీదికి బిచ్చిలు వేఁడికంటియా
జంగ మటంచు మ్రొక్కె నొకచాన, నెలంతలు చూచి నవ్వఁగన్ - 16

టీక : తొంగలి పూవు దేనియల్ = వ్రేలుచున్న పూవులయొక్క తేనెలను, తూకొని = ప్రవేశించి, గీ॥ తూకొనెను చొచ్చె చొరబారె దూఱెదూసి, ననదటాకించె ననుమాట కర్థమగును. ఆం.భా. 3.122; మత్తిలి = మదించి, తుమ్మెదల్, పయిఁ = వానిపై, పొంగుచు వ్రాలఁ = విజృంభించి వ్రాలగా, ఒప్పెసగు = అందమైన, పూచిన పొన్నఁ = కడంగి కాంచి = బాగుగా చూచి, మున్ మ్రింగిన యావిసంబు = పూర్వము సముద్ర మథన కాలమున మ్రింగినట్టి విషము, వెసఁ = క్రమముగా, మీదికి పెచ్చిలు = పైకిపొంగు వేడికంటి = అగ్నినేత్రము గల, ఆజంగమటంచు = ఆయొక్కశివుడని, ఒకచాన = ఒక యువతి, నెలంతలు చూచినవ్వగఁ = సాటివనితలు చూచినవ్వుచుండగా మ్రొక్కెను.

తా :- వ్రేలాడు చున్న పూగుత్తులపై తేనెలకై చొచ్చుకొని మదించి వ్రాలిన తుమ్మెదలుగల యొక పొన్నచెట్టును చూచి యొక్కతె పూర్వము సముద్రమథన కాలమున త్రాగిన విషముపైకి పొంగిన శివుడని తన తోటి వారు నవ్వగా దానికి మ్రొక్కెను -

"అలం - భ్రాంతిమత్తు"

17. క॥ వడిఁజనఁ దనయడుగులఁ గల
కడుఁగెంపుఁ దనంబు పుడమిఁ గ్రమ్మినఁ, దమిచే
నొడి తలిరు వడియె నని యటఁ
దడవఁగ నగి రొక్క కలికిఁ దారాడు చెలుల్ - 17

టీక :- ఒక్క కలికి = ఒక యువతి, వడిజనఁ = వేగముగా నడుచు చుండగా, తనయడుగుల గల = తనయొక్క పాదములకుండెడు, కడుకెంపు దనంబు = మిక్కిలియైన యెరుపుదనము, పుడమిగ్రమ్మినఁ = నేలపై వ్యాపింపగా, తమిచేఁ = సంభ్రమమున.

సీ॥ .... ఒప్పు సంభ్రమ సంజ్ఞ యుత్తలమ్ము,
తమకము తహతహ తమితత్తఱము ..... చిడిముడి

పాటునాగదనరారు, ఆం. భా. 1-140. ఒడితలిరు = వడిలోని చిగురాకు, పడెనని, ఆటదడవగ౯ = అక్కడ చేతులతో వెదుకగా, తారాడు చెలుల్ = ఆసమీపమున తిరుగుచెలులు, నగిరి = నవ్విరి.

తా ॥ ఒక యువతి, వేగముగా నడచుచు తనపాదములకు గల ఎరుపు దనము నేలపై వ్యాపించగా నచటతన యొడిలోని చిగురు టాకులు పడెనేమోయని సంభ్రమమున వంగినేలను తడవెను. అదిచూచి యాసమీపమున తిరుగు చెలులు నవ్విరి.

''అలం - భ్రాంతిమత్తు''.

18. చ॥ మునుపొకచోటఁ దుమ్మెదలు మూఁగిన మల్లెలు గోయఁబోయినం
బెనకువఁ గుట్టినం గలుగు బీతు మదిం దొలఁకంగఁ గ్రమ్మచుం
దనకడకంటి చూపు పయిఁదార్కొన గొజ్జఁగులందుఁ దేంట్లు వ్రా
లిన వని చేర నోడి యొకలేమ కడుం గడఁ జోపుఁ దమ్మిచేన్ - 18

టీక :- ఒకలేమ = ఒక ముద్దరాలు, మునుపొక చోట౯ = తొలుతనొక ప్రదేశమున, తుమ్మెదలు మూగిన మల్లెలు, కోయబోయిన౯ = త్రెంచబోగా, పెనకువ గుట్టిన౯ = ఆ త్రెంచుటలోని పెనగుటలో - తేంట్లు= తుమ్మెదలు, కుట్టిన౯ = కురువగా, కలుగు బీతు = కలిగిన భయము, మది౯దొలకంగ = మనస్సున తొలుకు చుండగా, అనగా కలుగు చుండగా, గొజ్జగులందు = గులాబులలో, తనకడగంటి చూపు = తనయొక్క కడకన్నుల దృష్టి, క్రమ్ముచు౯ = వ్యాపించుచు, పయిందార్కొన౯ = వానిపై అనగా ఆగులాబులపై కూడి యుండగా, అందు తేంట్లు వ్రాలినవని = ఆపూవులలో తుమ్మెదలు వ్రాలినవని, చేరనోడి = వానిని సమీపించుటకు వెరచి, తమ్మిచే౯ = తమకము అనగా భ్రాంతితో, కడు౯ = మిక్కిలిగా, కడబోవును = అవికడకు తొలగునట్లు బోవును.

తా :- ఒక ముద్దరాలు మొదట తుమ్మెదలు వ్రాలిన మల్లెలు కోయ బోయి ఆత్రెంచుటలో తుమ్మెదలు కట్టగా కలిగిన భయము మనస్సున తలసూపు చుండగా గొజ్జంగులు కోయంబోయి తన యొుక్క కడకంటి చూపులు వానిపై వ్యాపించగా అందుతుమ్మెదలు వ్రాలి యున్నవని భ్రాంతితో నవి తొలగిపోవునట్లు జోపును. అనగా జోపుచుండెను- .

''అలం - భ్రాంతిమత్తు''

19. పంచచామరము :-
సరుల్ పెనంగొనంగఁ జిల్గుఁ జన్నుఁ గప్పు జాఱఁగాఁ
గురుల్వెసన్నొసల్వొసంగఁ గూడి చాల మీఱఁగాఁ
దరుల్బెడంకు చుండ నాని తారసిల్లి యేగి క్రొ
వ్విరుల్గుఱించి కోసె నొర్తు వెంటఁ జానలంటఁగాన్ - 19

టీక :- ఒర్తు = ఒక్కర్తె, సరుల్ పెనంగొనంగ = హారములు చిక్కువడు చుండగా, జిల్గు చన్ను గప్పు జారగా = చన్నులపైగల సన్ననిపయ్యెద జారుచుండగా, కురుల్ = వెంట్రుకలు, వెసఀ = వేగిరముగా, నొసల్ = పొసంగ గూడి, నుదుటిపై యొప్పినట్లుగా వ్రాలి, చాలమీరగా = మిక్కిలిగా ప్రకాశించగా, తరుల్ బెడంకు చుండ = వళులు బెణకు చుండగా, క్రొవ్విరుల్ = క్రొత్త పూవులకై, గుఱించి = అనితారసిల్లియేగి, ఏగి = వృక్షముల దగ్గరకు వెళ్లి, తారసిల్లి = దానిని సమీపించి, ఆని = కొమ్మలను పట్టుకొని, వెంటజానలంటగాఀ = జాణలు తనవెంట వచ్చుచుండగా కోసెఀ = పూవులుగోసెను.

తా :- ఒక్కర్తె హారములు చిక్కుపడుచుండగా, చన్నులపై నుండి జిలుగు పైట జాఱుచుండగా, ముంగురులు నొసటిపై వ్రాలి యందమినుమడించు చుండగా, కడుపుపైగల ముడుతలు బెణకు చుండగా కొత్తపూవుల కొరకై చెట్ల దగ్గరకు వెళ్లి వాని మండలందు కొని జాణలందరు తననునుసరించు చుండగా పూవులు గోసెను.

"అలం - స్వభావోక్తి"

-: వృక్షదోహదములు :-

20.సీ॥ బొట్టుకు లేమావిఁ బొదలించె నొక్కర్తు
చూచియుఁ జేనంటి సొబగు మీఱఁ
బొన్నఁ బ్రేకణమును బూయించెనొక్కర్తు
చిరునవ్వు నునుఁబాటు దుఱఁగ లింపఁ
బొగడను గంకేళిఁ దగ విరుల్గలిగించె
నెమ్మిఁగల్లుమిసి తన్నియు నొకర్తు
కొసరి వావిలిఁ గొండగోఁగును ననిపించె
మూర్కొని మాటాడి ముదిత యొర్తు

తే॥ క్రోవిc బూవుల నిండించెc గొమ్మ యోర్తు
కదిసి కూరిమి తోడుతc గౌcగిలించి
చనుపకంబునc గ్రొన్ననల్ దనియనించె
ముదిత యొక్క తె తనముద్దు మోముc జూపి - 20

టీక :- ఒక్కర్తు = ఒకతె, బొట్టుగులేమావి = తిలకమును, మాకందమును చూచియు చేనంటి = కన్నులతో చూచి చేతులతో తాకి, సొబగుమీరన్ = అందము మీరునట్లుగా, పొదలించెన్ = పూయించెను, ఒక్కర్తు = ఒకతి, పొన్న ప్రేంఖణమును = పొన్నను ప్రియాళువును,

సీ॥.... ... ప్రేంకడమనగను, బ్రేంకణమన దోచు ప్రియంగువు, ఆం.భా. 2.49. చిరునవ్వునును బాటన్ = దరహాసము, మరియు కోమలమైన పాట, తుఱగలించు = ఒప్పగా, పూయించె = పుష్పింపజేసెను, ఒక్కర్తు = ఒకతె, పొగడను కంకేళిన్ = పొగడ చెట్టును మరియు అశోకమును, నెమ్మిన్ = ప్రేమతో, కల్లుమిసి తన్నియు = మదిరను పుక్కిలించి యుమిసి, మరియు పాదతాడనముచేసి, తగవిరుల్ గలిగించె = తగినట్లుగా పూయించెను, ముదిత యోర్తు = ఒక యువతి, కొసరి వావిలి కొండగోగును = వావిలని మరియు కర్ణికారమును, మూర్కొని మాటాడి = వాసన చూసి మరియు దానితో ఊసులాడి, ననిపించెన్ నన = పూవు. ననిపించు = పూయించెను, పుష్పింపజేయు, కొమ్మయోర్తు = ఒకామె, కదిసి = సమీపించి, కూరిమి తోడుత కౌగిలించి = ప్రేమతో నాలింగనము జేసి, క్రోవిన్ = ఎఱ్రగోరంటను, పూవుల నిండించెన్ = పూలతో నిండించెను. ముదిత యొక్కతె = ఒక యువతి, తన ముద్ద మోము జూపి = తనయొక్క అందమైన ముఖమును చూపి, చినుపకంబునన్ = సంపెంగయందు, క్రొన్ననల్ = క్రొత్తపూవులు, తనియనించెన్ = తృప్తిగా పూయించెను.

తా :- ఒకర్తె తిలకమును కనులెత్తి చూచి, తీయమామిడిని చేతులతో తాకి ఒకర్తు పొన్నను చిరునవ్వులో, ప్రియాళువును కోమలమైన పాటతో, ఒకర్తుక, పొగడను సీధువుమ్మించి, అశోకమును కాలితో తన్ని, వేరొకతె వావిలిని వాసన చూచి, కొండగోగును మామిడి, ఇంకొకతె గట్టిగా కౌగలించుకొని ఎఱ్రగోరింటను, వేరొకతెతన ముఖము చూపి సంపెంగను, పూయించిరి.

విశే :- దీని యందు వృక్షదోహదములు చెప్పబడినవి

స్త్రీకృతి వృక్ష దోహదములు -

అశోకశ్చరణాహత్యా - వకుళోముఖ సీధునా

ఆలింగనాత్కురవక - స్తిల కోవీక్షణేనచ

కరస్పర్శేనమాకందో - ముఖరాగేణ చంపకః

ఫల్లాపతః కర్ణికారః - సింధు వారోముఖానిలాత్

గీత్యాప్రియాళుర్ని తరాం నమేర్వ్వసి తేనచ -

''అలం - స్వభావోక్తి''

-: చెలుల వన విహారము :-

21. సుగంధి :-

చాలుఁ జాలు నెంతకైనఁ జాలు నున్నగన్నెరుల్
రేలపూల కేలగోల, రేయ నిందులోనఁ బో
నేల తాళు, మన్న నన్ను నెట్టు దిట్టెనక్కటా,
మేలు మేలు ముద్దరాల, మెచ్చువచ్చు నామదిన్ - 21

టీక :- చాలుచాలు, ఉన్నగన్నెరుల్ = మనచెంతగల గన్నేరుపూలు, ఎంతకైన జాలు = ఎంతగొప్ప దండలు కట్టినను చాలును, రేలపూలకేల గోల = అరగ్వధ పుష్పులకు గోలయేల, రే+ అని అద- గోలయెందులకేయని రేయని = రాత్రియని ఇందులోన బోనేల = ఈ పొదలలోదూరు టెందుకనుచు యనుచు, తాళుమన్నః = ఆగుమనగా, అక్కటా = అయ్యో! నన్ను నెట్టు దిట్టెన్ = నన్నెటుల దిట్టెను, ముద్దరాలా! మేలు మేలు, నామదిః = నామనస్సునకు నీవు చేసినపని, మెచ్చువచ్చుః = నచ్చినది.

తా :- చాలుచాలును, మనదగ్గరున్న ఈగన్నేరు పూలె ఎన్ని దండలకైన చాలును. రేలపూవులకై గోల ఎందులకు? రేలపూలకై గోల యెందుల కనుచు ఈ పొదలలో దూరుటెందులకు తాళు మనగా చూచితిరా అదినన్నెటుల దిట్టినది. ఓ ముద్దరాలా! మేలుమేలు నీవు చేసిన పని నాకు నచ్చినది.

విశే :- ఇవి నొకదానితో నొకటి కలియన దేనికదియె విడివిడిగా నుండు వాక్యము. సుగంధికి చామరము - ప్రశాంతి, శాలిని యని గూడ నామాంతరములు భీమకవి దీనిని ''హంసయాన'' యనెను. 11వ ఛందమున మరియొక శాలిని గలదు

దానికి ప్రతిపాదమున మతతగగరిను గణములుండి 7వ యక్షరము యతిగానుండును. సుగంధికి ''రజరజర'' అను గణములుండి 9 వయక్షరము యతిగానుండును. చిత్ర కవి ప్రశాంతిని సుగంధిని వేర్వేరుగా చెప్పెను గాని రెండును ఒక్కటియే. ఈ వృత్తమున కతడు 8వ యక్షరము యతిగా చెప్పెను. ''హంసయాన'' అను పేరున నిదియే కాక యింకను హంసక్రీడ (మభభగ) హంసాస్య (జరభర) కలహంస (నభజయ) హంసపద (తమభభనన ననగ -10 -15) అను వృత్తములున్నవి.

''అలం – వృత్యనుప్రాస''

22.వ:- అని మఱియు నొక్క యెడ - 22

టీక :- అని మఱియు నొక్కయెడ = ఇట్లనిపలికి మరియు ఇంకొకచోట-

23.క॥ చెలితీవయుయ్యె లూఁగఁగ
నలరుం జడయు న్మొగంబు నలుక మెయింజా
బిలిదిండి దగుల నెలయుఁ
దులదుల వెనుకకును గడిమి త్రోపాడు రహిన్ - 23

టీక :- చెలితీవయుయ్యెలూగగ = యొకర్తె తీగయుయ్యెలనెక్కి యూగుచుండగా అలరుఁ జడయుఁ = రాహువు వెంట తగులగా, నెలయుఁ = చంద్రుడు, దులదులఁ = దబదబ, వెనుకకును, ఆరాహువును వెనికి వైపునకు, కడిమిఁ = బలముతో, రహిఁ = ఒప్పునట్లుగా, త్రోపాడుఁ = త్రోసివేయుచుండును.

తా :- ఒక చెలి తీవయుయ్యలనెక్కి యూగుచుండగా నామెముఖమను చంద్రుని పూవుల జడయను రాహువువెంట తగులగా ముఖమను చంద్రుడతనిని బలము కొలది వెనుకకు త్రోయుచున్నట్లు జడ మరియు నామె ముఖము కని పించుచుండెను.

''అలం – ఉపమ''

24. తోటకము :-
పొలుపు ల్గనుఁగో వలపు ల్గొలుపుం
దొలుకారు మెఱుంగులతో నెనయై
వలరాచసిరు ల్వలె వారొక చోఁ
బలుపా గురివెందల పందిరిలోన్ - 24

టీక :- వారు ఒకచో = ఒకచోట, పొలపుల్ గనుగో౯ = సౌందర్యము చూడగా వలపుల్ గొలుపు౯ = మనస్సును వ్యామోహపరచు నట్టి, తొలుకారు మెరుంగులతో = వర్షాకాలమందలి ప్రథమ దినము లందలి మెరుపులతో ఎనయై = సమానమై, బలపౌ=మిక్కిలియైన, గురివెందల పందిరిలో౯ =గురివెందగింజల పందిరి లోన-

తా :- అంత వారొక చోట అందమును చూడగా మనస్సును వ్యామోహ పరచుచు, తొలుకారు మెరుపులతో సమానమై కనుపించు బలిసినట్టి యొక గురివెంద పందిరిక్రింద -

విశే :- ఇందు గురివెంద పందిరి మేఘమునకు దానితో పగిలి ఎఱ్ఱగా కనిపించు కాయల గుత్తులు మెరుపులకు ఉపమేయములు.

''అలం - ఉపమ''

వృత్తవిశేషము - ఇది ఏకగణవృత్తము దీనికి ప్రతిపాదమున 4సగణములుంపి 9వ యక్షరము యతిగా నుండును.

ఈఛందమయున మొత్తము 5 ఏక గణవృత్తములున్నవి. అవి
యగణచతుష్కము - భుజంగప్రయాతము - యతి.8వ యక్షరము
రగణ చతుష్కము - స్రగ్విణి యతి . 7వ యక్షరము
తగణ చతుష్కము - సారంగము
భగణ చతుష్కము - భామిని

25.సీ॥ చిన్నారి పొన్నారి చిఱుత పాయంబులఁ
జెలఁగు నంచలఁ బెండ్లిచేసి చేసి
యెల జవ్వ నపు మంపు గలిగి పెంపున మించు
చిలుకలఁ బాన్పుపైఁ జేర్చిచేర్చి
పూలతేనియ లందుఁ జూలాలి గొరువంక
పిండు గంట్లంబులు పెట్టిపెట్టి
కోవెల బాలెంత కొమ్మల కిమ్మ్గా
నొనరించి తీగఁ బురు డోమి యోమి
తే॥ పల్మఱును దేఁటి చిన్ని పాపలకుఁ గులికి
పువ్వుఁ దేనియ నుగ్గులు పోసిపోసి
కడలుకొను వేడుకల తోడఁ బడఁతు లందు
వెడలి వెండియు నొక చోట విరులు చిదిమి - 25

టీక :- చిన్నారి పొన్నారి చిరుత ప్రాయంబుల = మిక్కిలి చిన్నవయసు, చెలగు = ఒప్పు చున్నట్టి, అంచల పెండ్లి చేసి చేసి = హంసలకు పెడ్లిండ్లు చేసి ఎలజవ్వనపు మంపు = క్రొత్త యవ్వనపు మైకము, గలిగి పెంపునమించు = గర్వముతో నతిశయించు, చిలుకల = చిలుక దంపతులను, పాన్పున జేర్చిజేర్చి = పడకలపై చేర్చి, పూల తేనియలందు = పూలతేనెలలో చూలాలిగోరవంక పిండుకు = బాలెంతలైన గోరెంకల గుంపులకు, అల్లుంబులు పెట్టిపెట్టి = చూలాలి సుడిదలు పెట్టి, కోవెల బాలెంత కొమ్ములకు = కోకిల బాలెంతలకు ఇమ్ముగా నొనరించి = చక్కగా పరిచర్య చేసి, తగఁ = తగినట్లు, పురుడోమియోమి యేమి = పురుళ్లు పోసి పల్మఱును = పలుమారు, తేటి చిన్నిపాపలకు = తుమ్మెల యొక్క చిట్టిపాపలకు, కులికి = వయ్యారమున, పువ్వుదేనియ = పూలతేనియను, ఉగ్గులు పోసి పోసి = ఉగ్గులు పెట్టి కడలుకొను, వేడుకల తోడ = అతిశయించిన సంబరమున, పడతులందు వెడలి = యువతులాగురివెంద పందిరి క్రింద నుండి వెడలి, వెండియు = మరల, ఒక చోట = వేరొక చోట విరులు చిదిమి = పూవులుగోసి.

తా :- వారు ఆగురివెంద పందిరి క్రింద పిల్లహంసలను పట్టుకొని వానికి పెండ్లిండ్లు చేసి, చిలుక కుమారులను పానుపులపై జేర్చి, గోరువంకల చలాంద్రుకు సూడిద లిచ్చి కోకిల బాలెంతలకు పురుళ్ళు దీర్చి, తుమ్మెద పాపలకు తేనెల యుగ్గులు పోసి, మిక్కుటమైన సంతోషమున నాసోదరింటి నుండి వెడలి మరియొక చోట మరికొన్ని పూవులు గోసి-

విశే :- ఈపద్యమున పెండ్లి మొదలుకొని పుత్రోదయము వరకు సన్నివేశములు వరుసగా చెప్పబడినవి.

26. రగడ :- మధురగతి

మావులు దగుమరుమావుల కిరవులు
తా వులకును గడు తావుల విరువులు
కోవులె మదిఁ గైకోవులె కన్నియ
మోవులు పగడపు మోవులు వన్నియ
గుంపెనలకుఁగా గుంపెన లేటికి
లంపుల విరులత లంపులు బోటికి
మానుప మోదుగ మానుప నేదగు

కానిక పూవిలు కానిక యీఁదగు
వేనలి పువ్వులు వేనలి జాఱెడుఁ
గానవె యొప్పులుగా నవె మీఱెడుఁ
బొగడను మాటికిఁ బొగడను నెచ్చెలి
మొగలివిరు ల్వామొగలివె నెచ్చెలి
రంతేటికి గోరంతే మల్లెల
వంతులకా సేవంతులఁ జెల్లెల
చనుపకములు గొనఁ జనునే మాటికి
నన విల్తుని మన్నన గలమేటికి
నెమ్మిని నుండియు నెమ్మికి వదరెడుఁ
గొమ్మా పొన్నలు గొమ్మా పదరెడుఁ
జాలుం జాలని జాలవి యీవిరి
గోల యొసఁగు బరిగోలదె వావిరి
మారేటికిఁ బలుమాఱేటికిఁ జన
గోరంటలఁ గొనగోరంటవెనన
విరిగి పయింగడు విరిగిరి చానలు
విరులు గలుగు క్రొవ్విరిగా చానలు
దమ్ములు దగియెడుఁ దమ్ములపేరిట
నెమ్మలఁ గొనఁ దగ నెమ్మల మీరిట
రాకునెలంత పరాకున నిమ్మకు
మాఁకు లదే మఱి మా కిఁక జిమ్మకు
మబ్బెందల మీ కబ్బెందలఁ జెలి
గబ్బెత యది యాగుబ్బెత గన్నలి
కారనకే యొడి కారపుఁ గింకను
నేరము మాకిది నేరము బొంకను
నీడకుఁ జెలిరా కీడకుఁ గోయఁగ
నాడకురా విడనాడకు పాయఁగఁ
బనసలపైఁ బూఁ బనసల్ గనుఁగొను
పనుపడ్డవి మరు పనులకు నవిమును
మరువము చెలి నామరువములో యను
కలవో విరు లక్కరవోఁ గోయను

మాటకు మూరక మాటకు వత్తురె
బోటులు మఱి మీబోటులు మెత్తురె
యనుచుఁ దగిలి సయ్యాటలఁ బాడుచు
నన విలుకాని వినం గొని యాడుచు - 26

టీక :- మావులు = ఈ తోటల యందలి మామిడులు, తీగు = తగినట్టి, మరుమావులకు = మన్మధుని గుఱ్ఱములైన చిలుకలకు, ఇరవులు = నివాసములు, తావులకును = అవిపరిమళములకు, కడు మిక్కిలియైన తావుల నిరువులు = స్థానములకు ఇరుగున గలవి; కన్నియ = ఓపిల్లా! కోవులే - నాళములను, మదిగ్గె కోవులె = మనస్సులో మెచ్చవులే, మోవులు = ఈ మోవిచెట్లు, పగడపు = పగడముల యొక్క, మోవులన్నియ = కోవెలవంటి వన్నె గలవి పగడపు తీగెల యొక్క అగ్రభాగములు-

గుంపెనలకుగాఁ = గుంపెన పూలకుగాను, గుంపెన లేటికి = గుంపించుట యనగా నన్యాపదేశముగా నిందించుట కనుక అట్టి గుంపెన లెందులకు, బోటికి = ఈ చేడికు, లంపుల = దొంగబుద్ధులతో కూడిన, విరులతలంపులు = పూలయొక్క కోరికలే, మానుయమో దానిని మానుపలేమా ! దుగ = ఆయొక్క తహతహ, మానుపనేదగు = మానుపించుటయేు తగును; కానుక = బహుమానముగా పూవిలుకానిక = మన్మధునికే, ఈదగు = ఈమెనీయదగును. అనగా నంతటి సౌందర్యవతి యనుట -

వేనలిపువ్వులు = జడలోని పూలు, వే = వేగముగా, నలిఁ = క్రమముగా, జారెడు = జారుచున్నవి, కానవి = చూచుకొనవె, ఒప్పులుగాఁ = శరీరముపైనందముగా, నవిమీరెడు = అవి యొప్పుచున్నవి. నెచ్చెలి = ఓచెలియా! పొగడను = వకుళమును, మాటికి పొగడను = నేను పదేపదే పొగడను, నెచ్చెలి = ఓ స్నేహితురాలా, ఇదె = ఇదిగో, మొగిలి విరుల్ = మొగిలిపూలు, పూమొగలివె = పూలమొగ్గలిదుగో -

చెల్లెలా = ఓసోదరీ, రంతేటికి = జగడ మెందులకు, మల్లెల వంతులకు = మల్లెపూవుల యొక్క బదులకు, ఆసేవంతులఁ = ఆచేమంతులను, కోరు = కోరుకొనుము, అంతె = అంతెయెసుమా, అనవిల్తుని మన్ననగల = మన్మధుని యొక్క మన్ననగల, మేటికి = ఈ గొప్పదానికి అనగా సౌందర్యములో విఱ్ఱవీగు దానికనుట, చినుపకములు = సంపెంగలు, కొనజనునే మాటికి. పదేపదే

తీసికొనవచ్చునా! అనగా కూడదనుట. నెమ్మినుండియు = నెమ్మదిగా నుండి గూడ, ఆనెమ్మికి = ఆవంజాలమునకై, మదరెడు = అల్లరిచేయు చున్నావు, కొమ్మా = ఓచెలియా, పొన్నలు కొమ్మా = పొన్నలను తీసికొనవమ్మా, పదరెడు వంతుల చేయుటెందులకు –

చాలుచాలని = చాలుచాలునని, చాలని యీవిరి = సరిపోని యీ పూవు, గోలయిచ్చు = ఈ అమాయకురాలిచ్చును, అదె = అదిగో, వావిరిబరిగోల = శేపాలిక యొక్కరెమ్మ, మారేటికి = మారెడు చెట్టునకు, పలుమారేటికి జన = పదేపదే ఎందుకకు వెళ్లవలె, గోరంటలఁ = గోరంటపూలను, కొనగోరఁ అంటివె = కొనగోటితో గిల్లవమ్మా ! ననవిరిగి పయిఁ = పూచిన విరిగి చెట్టుపై, కడు విరిగిరి చానలు = యువతులు మిక్కిలిగా విరుగబడిరి –

విరులు కలుగు = పూవులు కలుగగా; క్రొవ్విరిగా చానలు = ఈ యువతులు మదించిరి గదా, తమ్ములపేరిటఁ = మనకు సోదరులను డేర, తమ్ములు తగియెడు = పద్మములు తగును. అనగా– నవిమనకు విరాళిని కలిగించునవి కావని భావము.

ఎమ్మెల మీరిట. ఎమ్మెలఁ + మీరి + ఇట = విలాసములతో మించి ఇచట, ఎమ్మెలఁ = శృంగారచేష్టలను, కొనదగను = నేను గ్రహించుటకు తగను, నెలంత = ఓ యువతీ, పరాకునఁ = పరధ్యానముతో, నిమ్మకు = నిమ్మ దగ్గరకు, రాకు = రావలదు, మాకులదే అదిగో మ్రాకులు అనగా చెట్లు, మాకిక జిమ్మకు = మాకు + ఇకఁ + చిమకు = చిమ్మన గ్రోవితో మాపై యిక చల్లవలదు.

మబ్బెందలె = మబ్బు + ఎందలె = మేఘమెక్కడ, మాకబ్బెంద లెచెలి = చెలీ, మాకు, తలె + అబ్బెఁ. తలె = ప్రసాదము, అబ్బెఁ లభించెను, గుబ్బెత = ఓసీ ! ప్రౌడా !

సీ॥ జవరాలు గుబ్బెత జవ్వని యనగను యువతి సమాఖ్యలై యొప్పు ఆం. భా. 2.106. అది ఆగుబ్బెత కన్ను = ఆయువతి యొక్క కన్ను, ఒడికారపుకింకను = ఉద్రేకపు కోపమున, అది, అలికారనకె = తుమ్మెద యొక్క నలుపు అనవద్దు, నేరము మాకిది = ఇది మాకు దోషము, నేరము బొంకను = అబద్ధమాడలేము, ఈడకు గోయగఁ = ఈడ పారే వతముఁ ఎర్రకిత్తిలి, పారేవతమును కోయుటకు, నీడకు = ఈ చాయకు, చెలిరాకు = ఓ చెలియారావలదు –

ఆడకురా = అక్కడకు రమ్ము, విడనాడకు పాయగ = తొలగి పోవునట్లు విడువవద్దు, పనసలపై = పనసపండ్లపై, పూబనసల్ = కనుగొను = పూ = పూవు అనగా లేతదశలో ఉండు, పనసల్ = కంటకములు, కనుగొను = చూడుము, అవి, మును = ఇంతవరకే, మరుపనులకు = కామకేళికి, పనుపడ్డవి = అలవాటు పడినవి, చెలి = ఓ యువతీ, మరువము, నామరువము లోయను, ఈ పరిమళము నా యొక్క మర్మము సుమాయనును.

విరులక్కరవో గోయను = పూవులిపుడే యక్కరదీర కోసి కొనుటకు, అవి, కఱవో = కరువా అనగా లేవా యనుట, మాటకు = జగడమునకు, మూరక = పెదమొగము కాక, అనగా నూర కొనక, మాటకు వత్తురె = పదే పదే వత్తురా ! అది బోటుల = జాణలు, మరి = మరియు, మీ బోటులు = మీతోడి వారు, మెత్తురె = మెచ్చు కొందురా! అనుచు, తగిలి = తదేక చిత్తలై సయ్యాటలన్ = కలసి యాడుచు, పాడుచున్ = పాటలు పాడుచు, ననవిలుకాని = మన్మధుని, వినన్ = అందరు వినునట్లుగా, కొనియాడుచు = పొగడుచు, అనగా మన్మధగీతముల బాడుచు.

తా :- ఓ కొమ్మా ! ఈ టోటలోని మామిడులు మన్మధుని గుత్తములకు నివాసములు మరియు నవి పరిమళములకు తావులు. ఈ కోవి దారములను నీవు మెచ్చవులే, ఈమోవులు వన్నెలో పగడపు తీగల మొలకలు –

గుంపెన పూవులకై ఈ గుంపెన లెందులకు. దీని కెపుడును పూవుల కొరకీ దొంగ బుద్ధులే. అవి మాన్ప వలెను. ఈ సొగసరిని మన్మధునికే కానుక నీయవలెను.

ఓసీ ! నీ జడలోని పూవులు క్రమముగా నొకటొకటి రాలుచు నీశరీరముపై పడుచున్నవి చూచుకొనవే నెచ్చెలీ ! నీవు పొగడ పూలను మరీ మరీ పొగడు చుందువు. కాని ఇవిగో మొగిలి పూవులు, ఇవి పూల మొగ్గలు –

ఓ చెల్లెలా ! ఆ మల్లెపూలకై రంతెందులకు, వానికి బదులుగా నీచేమంతులను తీసికొనుము. మన్మధుని యొక్క మన్ననగల ఈ మేటికి, మాటి మాటికి సంపెంగలు తీసికొన వచ్చునా ! నెమ్మదిగనే యుండి ఆ వంజుళములకై తొందరపడే ఓ కొమ్మా ! ఈ పొన్నలు తీసికొనవమ్మా వదరుటెందులకు ?

చాలుచాలని ఈ గోలది చాలనటువంటి ఈ పూలిచ్చినది. అదిగో అది

యిచ్చెడు వావిలి బరిగోల - అనగా పూలవన్ను. మారెడు దగ్గరకు పదేపదే వెళ్లుట యొందులకు, గోరంటలను కొన గోటితో త్రుంచవె, అనుచు, విరిగి పూవులపై ఆ కొమ్మ లందురు విరుచుక పడిరి.

పూవులను కలిగి ఈ యువతులు మదించి పోయిరి. తామరలు వారికి తమ్ముల సమానమైనవి. మీరిచట శృంగార విలాసములతో నున్నారు గాని నేనిపుడవి చేకొనను. ఓసీ నీవు పరాకున నిమ్మదగ్గరకు రాకు, అదిగో మ్రాకులు నీవు వానిపై చల్లుగాని చిమ్మన గ్రోవులతో మాపై చిమ్మకు.

ఓసీ! మేఘమెక్కడనే! మాకు ప్రసాద మబ్బినదిలే. ఓసీ గుబ్బెత, అది ఆమె కన్నుగాని తుమ్మెద యొక్క నలుపుకాదే. మేము బొంకులాడము. అది మాకు దోషము. ఇదే పండ్లు కోయుటకు నీవీనీడకు రమ్ము.

ఓసీ ! అక్కడ ఆడకు, ఇటురమ్ము, మమ్ములను తొలగిపోవు నట్లుగా విడువవద్దు. అదుగో పనసపండ్లపై ఆలేత ముండ్లను చూడుము. అవి ఇంతవరకే కాముకేళి కలవాటు పడినవే. ఇదుగో ఈమరువమును చూడుము. అది యిదియే, నా మరువమను చున్నది.

పూవులిపుడే అక్కర దీర కోసికొనుట కవికరువా ! ఓసీ ! ఊరకొనక మాటి మాటికి జగడములకు వత్తురా ! అది జాణలు గాని, నీతోడి వారు కాని మెచ్చుకొందురా ! అని యీవిధముగా సయ్యాటలతో, పాటలతో విహరించుచు, మన్మధ గీతములు పాడుచు-

విశే :- ఈ రగడకు చతుర్మాత్రాగణములు గా-భ-స-సల గణములు మాత్రమే వాడుదురు. జగణమునిషిద్ధము. ప్రతిపాదమున రెండు గణములపై యతియుండును. ఇది చతురస్రగతి. ఏక తాళమునకు చెందును.

మధురగతిని రెట్టించిన యెడల హరిగతి.

హరిణగతిని రెట్టించిన యెడల వృషభగతి రగడ యగు చుండును.

''అలం - యమకము''

27.వ:- ఇట్లు నీటుమెఱసి తోఁటల నాఁడు బోటులాట సాలించి - 27

టీక :- ఇట్లు = ఈ విధముగా, నీటు మెఱసీ = ఠీవి ప్రకాశింపగా, తోటలన్ = ఆరామములందు, ఆడుబోటులు = విహరించు యువతులు, ఆట సాలించి = తమ యొక్క క్రీడను మాని.

తా :- అని యా విధముగా ఉవిలో తోటలలో విహరించెడు నాయువతులు తమ యాట చాలించి.

28.క॥ కప్పుం గొప్పులఁ జన్నుం
గప్పుల మొగముల నొడళ్లఁ గప్పిన మెఱుఁగుం
బుప్పొడి విదిరిచికొని మఱి
యప్పడఁతుక లరిగి కప్రప నఁటుల చెంతన్ - 28

టీక :- కప్పుం గొప్పులన్ = నల్లని కొప్పులపై, చన్నుంగప్పుల = పైటలపై, మొగముల = ముఖములపై, ఒడళ్లన్ = శరీరములపై, కప్పిన = కప్పు కొనిన, యెఱుంగు పుప్పొడి = నిగనిగలాడు పూపరాగము, విదిరిచి కొని = దులుపుకొని, మఱి = మఱియు, అప్పడ తుకలు = ఆ యువతులు, అరిగి = వెళ్లి, కప్పడ నటుల చెంతన్ = కర్పూరపు టరటి చెట్ల దగ్గర -

తా :- ఈ విధముగా వారు కొప్పులపై పైటలపై మొగములపై శరీరములపై పడిన పుప్పొడిని దులుపుకొని పిమ్మట యచటి నుండి వెడలి కర్పూరపు టరటి చెట్ల దగ్గర -

29.సీ॥ పువ్వుఁ దేనియ కాల్వ పొంతఁ జొన్నల లోనఁ
బొలుపొందు చెంగల్వ కొలని దరిని
బూచిన చనుపకంబులఁ జుట్టి వచ్చిన
గురివెంద తీవ పందిరుల యందుఁ
జలువల నెలవులై యలరారు నెలఱాల
తిన్నియ ల్పన్నీటి తేట నలికి
విరి విల్తు నతని దేవేరిఁ గస్తురిఁ దమ్మి
రేకుపై వ్రాసి గుఱించి నిలిపి
తే॥ కమ్మ విరి నీట జలకంబుగాను గూర్చి
నగవు ముత్యాల తొడవులు దగన మర్చి
కలికి క్రొన్నన పొడ భాసికములు చేర్చి
సిరుల నెదిరించుచును బెండ్లి సేయుచుండ - 29

టీక :- పూవు దేనియ కాల్వపొంత = ఒక పూదేనె కాలువ దగ్గర, పొన్నలలోన = పొన్నచెట్ల గుంపులో, పొలుపొందు = అందమైన చెంగల్వ కొలని దరిని = ఎఱ్ఱకలువల కొలను ప్రక్కన, పూచిన = పూచి నటువంటి, చనుపకంబులఁ = సంపెంగలను, చుట్టి వచ్చిన = చుట్టుగా తిరిగిన, గురివెంద తీవ = గుంజాల తలయొక్క, పందిరుల యందు= పందిరిలలో, చలువల నెలవులై = శైత్యమునకు నివాసములై, అలరారు = ఒప్పు, నెలరాల తిన్నియల్ = చంద్రకాంతపు రాళ్ళ యొక్క తిన్నెలు, పన్నీటి తేటనీలికి = తేటయైన పన్నీటిలో నీలికి, విరివిల్తుఁ = మన్మధుని, అతని దేవేరిఁ = అతని భార్య యైనరతీ దేవిని, కస్తురిఁ = కస్తూరితో తమ్మిరేకుపై వ్రాసి - తామర దళముపై దించి; గుఱించి నిలిపి = మన్మధుని గురించి నిలిపి -

''ఆతిష్ఠ తామిమాం మూర్తిం మదనుగ్రహ కాంక్షయా'' అని విగ్రహ పూజాసందర్భమున నా వాహనము చేయుట సంప్రదాయము కావున ఈ నిల్పుట యట్టిది - కమ్మవిరి నీట = మధురమైన పన్నీరుతో, జలకంబుగాను గూర్చి = అనికి జలకమాడించి, నగవు ముత్యాల తొడవులు = దరహాసములను ముక్తాభరణముల, తగినమర్చి = తగినట్లుగా ధరింపజేసి, కలికి శృంగారమైన, క్రొన్నన పాదఁ = క్రొత్తనైన పూవుల రెమ్మను, బాసికములు చేర్చి = బాసింగములు కట్టి, సిరుల నెదిరించుచును = ఐశ్వర్యములను ధిక్కరించుచు, పెండ్లి సేయుచుండ = ఆ రతీమన్మధులకు వివాహము చేయుచుండగా -

తా :- ఒక పూతేనె కాలువ దగ్గర పొన్నచెట్ల గుబురలో నందమైన చెంగలువల సరిస్తీరమున గల బాగుగా పూచిన సంపెంగల చుట్టుగా నల్లకొనిన గురివెందల పందిరి క్రింద చల్లదనమునకు నిలయమైన యొక చంద్రకాంతపు తిన్నెను తేటయైన పన్నీటితో నలికి దానిపైయొక తామర రేకున రతీమన్మధులను కస్తూరితో వ్రాసి నిలిపి వారికి పన్నీట నభిషేకము చేసి తన దరహాసములను ముత్యాల దండలు కూర్చి అందమైన పూల రెమ్మలను బాసింగములుగా నమర్చి సంపదల నన్నిటిని ధిక్కరించెడు సంబరముతో వివాహము చేయుచుండగా -

విశే :- శృంగార కావ్యములన్నింటి యందు ఈ విధముగా మన్మధ ప్రతిష్ఠ మన్మధ పూజయున్నదిగాని ముప్పది మూడుకోట్ల దేవతలకు నాలయములు గల భారత దేశమున మన్మధునకు మాత్రమెక్కడను నాలయము కనిపించదు. ఇది విచిత్రము. కాగా అస్సాము నందు - ''అజోంత్రిక్'' అనునొక పల్లెటూరిలో మాత్రమే

మన్మథాలయ మున్నదట. అందలి మూల విరాట్టు రతీదేవితో శృంగారభంగిమలో నున్న మన్మథుడేనట, అస్సామునగాపురాణ ప్రకారము కామ రూపదేశము కనుక నీవిధముగా మనదేశమున కామునికి నొక రూపము గల్పించి నిల్పిన కీర్తి యారాష్ట్రమునకు దక్కినది.

''అలం - ఉదాత్తము''

30.తే॥ నాలిగాడ్పును కాలరి యోలి నగిరి
వారి వేనలి విరుల నింపారు తావు
లెల్లఁ గానుకగా నిచ్చి యెలమిఁ బిలువ
నచట వేఁటాడుచున్న యయాతి వచ్చి - 30

టీక :- నాలిగాడ్పును కాలరి = పిల్లగాలియను కాలిబంటు, ఓలినరిగి = తగి నట్లుగా వెళ్లి, వారి = ఆ స్త్రీల యొక్క, వేనలి విరుల తావులెల్లఁ = సిగలోని పూవుల యొక్క పరిమళములన్ని, కానుకగా నిచ్చి, కానుక చేసి, యెలమి బిలువ = ప్రియముతో పిలువగా, నచట వేటాడు చున్న యయాతి వచ్చి -

తా :- అపుడు పిల్లగాలియను కాలిబంటు వెళ్లి, వారుధరించిన సిగలలోని పూవుల వాసన నతనికి కానుకగా చేసి ప్రేమతో పిలువగా నా సమీపమున వేటాడుచున్న యయాతి యచటికి వచ్చి -

విశే :- నన్నయుగారు గూడ ఈ సందర్భము నిటులే చెప్పెను. ఆయున వారి యంగరాగములు, వస్త్రముల యొక్క పరిమళము నంతటిని బంపగా తెలగన్న వారియొక్క సిగపూల వాసనను మాత్రమే పంపెను. వెళ్ళి పిలువలేదుగాని హిమాలయమున ప్రవరునికి గూడ వరూధుని యొక్క పరిమళమే - తాంబూల సంబంధమైనది - ఎదురు కోలిచ్చెను. అనగా పురుషులకు యువతుల వాసన యెదురు కోలిచ్చుట మహాభారత కాలము నుండి గూడ నున్న దేయనవలె.

సీ.తే. అనిలుడను దూతపోయి తోడ్కొనియుదెచ్చె
దేవయాని పాలికి మాగత్స్నష్ణ జేసి
కాననంబున గ్రుమ్మరు వాని వీరు
నతిపరిశ్రాంతుడై నయయా ఆనంత - ఆది. 3-156
అని నన్నయ

31. క॥ తెలిమొగులు లోన వెలిఁగెడు
తొలుకారు మెఱుంగు పగిదిఁ దోరపు టోరపుల్
తులకించు నాటతమిచే
నలరుంబొద వెడలివచ్చు నల శర్మిష్ఠన్ - 31

టీక :- తెలిమొగులు లోనవెలిగెడు = తెల్లని మేఘమున ప్రకాశించు, తొలికారు మెఱుంగు పగిది = మునాయిటి మెరుపు వలె, తోరపుటోరపుల్ = స్థూలమైన, బలమైన, యొరపులు = అందములు తులకించు = ప్రకాశింపగా, ఆటతమిచే = ఆట యొక్క తన్మయత్వమున, నలరుంబోవ = ఒక పూవుల పొదను, వెడలివచ్చు = వెడలి బయటికి వచ్చు, అలశర్మిష్ఠ = ఆ యొక్క శర్మిష్ఠను-

తా :- తెల్లని మేఘమున ప్రకాశించెడు తొలికారు మెరుపువలె, బలమైన తన యందములు ప్రకాశించుచుండగా నాటలో మునిగి యొక పూవుల పొద నుండి బయటికి వచ్చునట్టి శర్మిష్ఠను.

''అలం - ఉపమ''

యయాతి శర్మిష్ఠంగాంచి వర్ణించుట

32.వ:- కాంచి యగ్గుబ్బెత సోయగంబున కబ్బుర పడి యబ్బలి
యుండు తనలోన - 32

టీక :- కాంచి = చూచి, యగ్గుబ్బెత = ఆగుబ్బెత, ఆ యొక్క యువతి, సోయగంబునకు = సొగసునకు, అబ్బురపడి = ఆశ్చర్యపడి, అబ్బలి యుందు = ఆగొప్పవాడైన యయాతి, తనలోన = తన మనస్సున -

తా :- చూచి యా యువతి సౌందర్యమున కాశ్చర్యపడి ఆ యయాతి తన మనస్సులోన

విశే :- యువతులందు పురుషులను మొదట నాకర్షించునది వారి స్తన సౌభాగ్యము మాత్రమే - కాళిదాసు గారి శాకుంతలమున గూడ దుష్యంతుడుకు చబంధము సడలించిన పిమ్మట యుబ్బిన గుబ్బులుగల శకుంతలనే చూచెను - అందువలన గుణముఖ్యంతునారీణాం అని యున్నప్పటికి స్తన ముఖ్యంతునారీణాం అనుటకే లోకమున ఓట్లెక్కువ.

33.సీ॥ తమ్ములు చుక్కలు తాఁబేళ్లు మరుపొదు
ల్పసిఁడి యనంటులు నిసుక తిప్ప
సుడి చదల్ బంగారు కడవలు తీవియ
ల్చివురు చిందంబు పసిండి యద్ద
ములు తలిర్వెన్నెల మొల్ల మొగ్గలు నవ్వుఁ
బువ్వుమీలు ననఁ దూపులును విండ్లు
నరతొగదొర సోఁగ సిరివ్రాఁత చెలువముల్
రహిమించు జేజేల రాచరాలు -

తే॥ నివిగదా పోలికలు చూడ నింతులందు
నొడలి యొప్పులు గొనియాడు చున్న యెడల
నవి బెడంగున నీచాన యందు, సాటి
సేయవచ్చిన నేరికి సిగ్గుగాదె! - 33

టీక :- తమ్ములు = పద్మములు, చుక్కలు, తాబేళ్లు, మరుపొదుల్ = మన్మథుని తూనీరములు, పసిది యనుంటుల = బంగారు అరటి బోదెలు, ఇసుకతిప్ప, సుడి = నీటిసుడి, చదల్ = ఆకాశము, బంగారు కడువలు, తీవియల్ = తీగలు, చిగురు = చిగురాకులు, చిందంబు = శంఖము, పసిండి యద్దములు = బంగారు అద్దములు, తలిర్వెన్నెల = లేత వెన్నెల, మొల్లమొగ్గలు = నువ్వుపువ్వు, మీలు చేపలు, వనతూపులు = పూల బాణములు, విండ్లు = చాపములు, అరతొగదొర = సగము చంద్రుడు, సోగసిరి వ్రాత చెలువముల్ = అందమైన శ్రీకారములు, రహిమంచు జేజేలరాలు = నిగనిగలాడు ఇంద్రనీలములు, ఇంతులందు = స్త్రీలయందు, ఇవిగదా పోలికలు చూడఁ = ఉపమానములు ఇవియేగదా? ఒడలి మొప్పులు = శరీరము యొక్క అందములు, కొనియాడు చున్న యెడల = కీర్తించవలసి వచ్చినపుడు, అవి, బోఢంగుగఁ = అందమునందు, ఈ చానయందు, ఈ యువతి యందు, సాటిచేయవచ్చిన = పోలికగా చెప్పవచ్చిన యెడల, ఏరికిఁ = ఎవరికైనను, అది, సిగ్గుగాదే- సిగ్గుపడవలసిన విషయముగదా!- అనగా ఆమె శరీరాంగములు పై యుపముల కంటె బాగుగా నున్నవనుట.

తా :- లోకమున స్త్రీలను వర్ణించవలసి వచ్చినపుడు, పద్మములు, చుక్కలు, తాబేళ్లు, తూణీరములు, అరటిబోదులు, ఇసుక తిన్నెలు, సుడి, ఆకాశము, బంగారు కుండలు, తీగలు, చిగురాకు, శంఖము, అద్దములు, వెన్నెల, మొల్లమొగ్గలు,

నూగుపూవు, చేవలు, మన్మథబాణములు, చాపములు, అర్ధచంద్రుడు శ్రీకారములు, ఇంద్రనీలములు అని యిటుల పాదమస్తకము పోలికలు చెప్పుదురుగాని లవి యీామెయందు చెప్పుటకు సిగ్గగును గదా!

విశే :- ఈ పద్యము ప్రభావతీ ప్రద్యుమ్నములోని నెత్తమ్ము లించు వటఫల శ్రీలంచు, తాబేటి చిప్పలనుచు - అనుదానికి ప్రతిబింబాకార సంపాదము.

''అలం - ఉపమ''

34.తే॥ మరుని యురు లనఁదగి తేఁటి సిరుల వఱలు
తెఱవ కురులకు సరిరామిఁ దీఱెఁగాక
కడిమిఁ దమ పెంపువోఁ బూరి గఱవనేల
రహియఱఁ వేలుపుల రాచరాలకెల్ల - 34

టీక :- మరుని యురులనదిగి = మన్మథుని యొక్క ఉరులు అనునట్లొప్పి, తేటిసిరులఁ = తుమ్మెదల యొక్క కాంతులతో, వఱలు = ప్రకాశించు, తెఱవ కురులకు = తెరవ = తెఱ+వాయి = అందమైన వాతెఱఅనగా పెదవులు కలది/ తెఱచియుండు నోరు గలది అనగా రహస్య ముదాచనిది అని ఈపదము నకు రెండు విధములైన వ్యుత్పత్తు లున్నవి. తెఱవ కుఱులకు = ఈ యువతి యొక్క వెంట్రుకలకు సరిరామి=సాటి రాకపోవుట, తీఱెగాక సరిపోయెగాని, రహియఱఁ = తమప్రశస్తి మాసిపోగా/ కాంతి హీనముకాగా, వేలుపుల రాచరాలకెలఁ = ఇంద్రనీలముల కన్నింటికి, కడిమిఁ = గొప్పదనములో, తమపెంపువో = తమయొక్క ఆధిక్యము పోగొట్టుకొని, పూరిగరవ నేల = గడ్డి నెందుకు తినవలె.

తా :- మన్మథుని యురులనదగి, తుమ్మెదరెక్కల కాంతులతో ప్రకాశించు ఈమె వెంట్రుకలకు ఇంద్రనీలములు సాటిరాకపోవుట సరేకాని యని తమ యొక్క గొప్పదనము నంతయు పాగొట్టుకొని గడ్డిపరకల నెందుకు తినవెలె.

విశే :- ఇంద్రనీలములందు తృణగ్రాహి క్షీరగ్రాహియని రెండు భేదము లున్నవి. తృణగ్రాహిని గడ్డిపరకలతో వేసిన అయస్కాంత మినుమునువలె ఆపరకల నాకర్షించును. క్షీరగ్రాహిని పాలపాత్రలో వేసిన ఆపాలన్ని నల్లగా కనిపించును. యుద్ధములందోడిన వారు గడ్డికరుచుట అనగా నోటిలో గడ్డి పరక నుంచుకొని

తమ యోటమిని ప్రదర్శించుటాచారము గావున తృణగ్రాహి యటులే నీమెకురుల కోడిగడ్డి గరచు చున్నదని కవి యూహ

''అలం - సందేహము''

ఉపమేయంవమును ఇదియా అదియా అని సందేహించిన యెడల సందేహాలంకారమనబడును.

35. క॥ మరుఁడర నెలకడ డాఁచిన
విరితూపును నల్ల చెఱకు విండ్లను బలె, వే
మఱునలరుఁ జేరు చుక్కయు
నరుదగు కను బొమలు మిగుల నతివకు నమరెన్ - 35

టీక :- మరుడు = మన్మధుడు, అరనెలకడ దాచిన = అర్థచంద్రుని చెంత దాచిన, విరి తూపును = పూలబాణమును, నల్లచెఱకు విండ్లనుబలె, అతివకు = ఆశర్మిష్టకు, వేమఱు నలరు = మిక్కిలిగా ప్రకాశించు, చేరుచుక్కయు = పాపెట చేరు, అరుదగు కనుబొమలు = మిక్కిలి యరుదైన సౌంధర్యముగల కనుబొమలు, అమరెన్ = ఒప్పెను.

తా :- శర్మిష్ఠకు మన్మధుడు అర్థచంద్రుని దగ్గర దాచిన పూల బాణము నల్లచెఱకు విండ్లవలె పాపెట చేరు మరియు కనుబొమ లమెరెను.

విశే :- చెఱుకున తెల్లచెఱుకు, ఎఱ్ఱచెఱుకు, నల్లచెఱుకు అను మూడు భేదములున్నవి. నల్లచెఱుకు ఉలువపాడుమండలమున నెక్కువగా పండును.

36. క॥ నెలఁతుక కన్ను లనంగాఁ
బొలువగు నెల వెలుఁగు మేపుఁబులుఁగులు తమిచేఁ
గొలఁది యెఱుంగక తిని, వె
న్నెల గ్రక్కెడు ననఁగ నెసఁగు నెలకొను నగవుల్ - 36

టీక :- నెలతుక = ఆయొక్క శర్మిష్టయొక్క, కన్నులనంగా = కన్నులనగా, పొలువగు = అందమైన, నెలవెలుగు మేపు పులుగులు = వెన్నెలను తిను చకోర పక్షులు, నగవు లనంగా = ఇంకనవ్వుల నగనో, ఆ చకోరములు, వెన్నెలన్ = వెన్నెలను, తమిచే = మిక్కిలి కుతూహలముతో, కొలది యెఱుంగ కతిని = కొంచెమనునది

ఎరుగకుండ తిని, అనగా మిక్కిలి వెక్కసముగా తిని, క్రక్కెడు ననగనెసగుఁ = అవి ఆవెన్నెలను క్రక్కుచున్నవన్నట్లుగా నొప్పును.

తా :- ఆశర్మిష్ఠ యొక్క కన్నులు వెన్నెలను మేయు చకోరములు ఇకనగవులనగా ఆచకోరములు తృప్తిదీరక వెక్కసము గాతిని వెళ్లగాయుచున్న వెన్నెల యున్నట్లుండును.

విశే :- కన్నులను కాటుక పిట్టలతోను చకోర పక్షులతోను పోల్చుట కవి సంప్రదాయము.

''అలం - రూపక- ఉత్ప్రేక్ష''

37. క॥ తమ్ములఁ బూవిల్తునిక్రొ
తమ్ములఁ జీరికిని గొనక యడకించుఁ గడుం
గొమ్మ నిడువాలుఁ గన్నులుఁ
గ్రొమ్మించులు గలిగి పొలుపు గుతికెడు చూపుల్ - 37

టీక :- కొమ్మ = ఆశర్మిష్ఠ యొక్క, నిడువాలుగన్నులు = పొడవై ఱెప్పలు సగము వాలిన కన్నులు, తమ్ములను = తామరలను, పూవిల్తుని క్రొత్తమ్ముల = మన్మథుని యొక్క, క్రొత్త + తమ్ములను = నూతనమైన బాణములను, చీరికిని గొనక = లెక్క చేయక, కడుఁ ఆడకించును = మిక్కిలిగా నాక్షేపించును. చూపుల్ = దృష్టులు, క్రొమ్మించుగలిగి = తొలుకాఱుమెఱుపుకలిగి, పొలుపుగులికెడుఁ = కాంతితో కులుకు చుండును.

తా :- ఆశర్మిష్ఠయొక్క కన్నులు తామరలను మరియు మన్మథుని యొక్క నూతనమైన బాణములను లెక్కచేయక మిక్కిలిగా నాక్షేపించును. ఆచూపులు తొలుకారు మెరుపులవంటి కాంతిగలిగి యందమున కులుకు చుండును.

''అలం - తుల్యయోగిత''

38. తే: పెలుచఁ దమదాయ యైన సంపెంగ విరిని
గెలిచె నని ముక్కు నిరుగడఁ గొలిచి యుండి
త్రుళ్లి యాడెడు తుమ్మెద పిల్ల లనఁగఁ
బొలుచు నెలఁతుక చూపులు చెలువ మమర - 38

టిక :- నలతుక చూపులు = ఆమెయొక్క దృష్టులు, ముక్కు ఆమె యొక్క నాసిక, పెలుచఁ = చులకనగా, తమదాయమైన = తమకు పగరాలైన, సంపెంగ విరిని గెలిచెనని = సంపెంగ పుష్పమును జయించెనని, ఆముక్కును ఇరుగడఁ, రెండువైపులను, కొలిచి యుండి = సేవించుచుండి, తృళ్ళియాడెడు = త్రుళ్ళిపడెడు, తుమ్మెదపిల్ల లనగ = తుమ్మెద పిల్లలన్నట్లుగా - చెలువమమర - పొలుచుఁ = అందములో నొప్పుచుండును.

తా : ఆమె చూపులు ఆమె యొక్క నాసిక తమకు పగయైన సంపెంగ పూవును జయించెను. కనుక దానిని రెండు వైపులలో చేరి సేవించుచు త్రుళ్ళిపడుచుండెడు తుమ్మెద పిల్లలనగా నందముతో నొప్పును.

విశే :- కవులు స్త్రీల యొక్క ముక్కును, సంపెంగపూవు, నాగుపూవు, గునుగుపూవులతో కన్నులను తుమ్మెదలతో పోల్చుచుందురు. ఆడు తుమ్మెదలకు సంపెంగలకు పడదు కనుక ఈ ప్రకృతి మర్యాదను కవితా పరముగా మొదట వలచిన వాడు ముక్కు తిమ్మన యందురు. కాని నానా సూనవి తాన హసనల - అను పద్యము మాత్రము వసుచరిత్రయందుండును. భట్టు మూర్తి యొక్క ఈకల్పన యనంతర కాలమున పలువురుకవుల నాకట్టుకొనినది. అట్టివానిలో ఈ తెలగన్నయు నొకడు.

''అలం - కావ్యలింగము''

39.తే॥ కప్పురము పాదు లోపలఁ గరము సరది
నాటివెన్నెల యను తేటనీటఁ దడువ
మొనలు చూపిన ముత్యాల మొలక లనఁగ
నొరపు తోడుతఁ జెలిపలువరుస దనరె - 39

టీక :- కప్పురపు పాదులలోపల = కర్పూరపు పాదులలో, కరము = మిక్కిలిగా, సరదినాటి = సదిరినాటి, వెన్నెలయను, తేటనీటదడువ, మొనలు చూపిన = తలయెత్తిన, ముత్యాల మొలక లనగ = ముత్తెములమొలకలేమో అన్నట్లుగ, ఒరపు తోడుత = కాంతితో, చెలిపలువరుస = ఆమె యొక్క దంతపంక్తి, తనరెఁ = ఒప్పెను.

తా :- ఆమెయొక్క పలువరుస కర్పూరపు పాదులలో చక్కగా సదిరి నాటి వెన్నెలయనే

తేటయై నీటిలో తడపగా మొలకెత్తిన ముత్తుముల మొలకలేమో యన్నట్లు మెరుపుతో నొప్పెను.

''అలం - ప్రౌఢోక్తి''

కవి తన యొక్క కల్పనచే వస్తువునకుత్కర్ష నాపాదించిన యెడల ప్రౌఢోక్తి యనబడును.

40. క॥ లలిఁ బంచదార లోపల
దిలకింపఁగ, నించి జుంటి తేనియలు, కడుం
జిలుకఁగఁ, బెరిఁగిన పగడపుఁ
దలిరనఁగా నతివ పెదవి తగుఁ గొనియాడన్ -40

టీక :- లలిన్ = ఒప్పునట్లుగా, పంచదారలోపలన్ = చక్కెరలో, జుంటి తేనియలు = చిన్నతేనెలు, తిలకింపగన్ = ప్రకాశింపగా, నించి = నింపి, కడుం జిలుకగ = మిక్కిలిగా మథించగా, పెరిగిన = దానిలో వర్థిల్లిన, పగడపు తలిరనగా = పగడపు చిగురనునట్లుగా, అతివ పెదవి, ఆమెయొక్క అధరము, తడుకొని యాడన్= పొగడుటకు తగును.

తా :- పంచదారలో జుంటి తేనియనింపి దానిని బాగా చిలుకగా నందులో పెరిగిన పగడము యొక్క చిగురను నట్లుగా నామె యొక్క పెదవి పొగడదగి యుండెను.

''అలం - ప్రౌఢోక్తి ''

41. తరల:-
చిలువ టెంకి మెకంబు చెట్టని చెప్పుకొందురు కల్ల, యీ
పొలఁతి నెమ్మొగముం గడంకను బోలఁ జాలక నెమ్మదిం
గలఁగి చుక్కల రాయఁ డెంతయుఁగంది వెల్వెలఁ బాఱెఁగా
కలరు విల్తుని మేనమా మగు నయ్య కాకొద గల్గనే ! - 41

టీక :- అరువిల్తుని మేనమామగు నయ్యకు = మన్మధునికి మేనమామ యైన చంద్రునికి, ఆకొద = ఆయొక్క కొదవ అనగా మచ్చ, చిల్వటెంకి = పుట్టయని, మెకంబు - జింకయని, చెట్టు+అని = వృక్షి చెట్టని, చెప్పుకొందురు= లోకులు వాడుకొనుచుందురు. కల్ల = కాని అది యబద్ధము, ఈ పొలతి నెమ్మొగముః =

ఈమె యొక్క నిండైన ముఖమును, కడంకనుపోలజాలక = అందమున పోలలేక, నెమ్మదిఁ గలగి = మనస్సులో కలతచెంది, చుక్కలరాయడు = నక్షత్రేశుడైన ఆచంద్రుడు, ఎంతయుగంది = ఎంతగానో బాధపడి, వెల్వెల బారెగాక = వెలవెల బోయెను గాని, లేని యెడల ఆచంద్రునికి, ఆకొంద = ఆమచ్చ, గల్గునే = కలుగునా! అనగా కలుగదనుట.

తా : చంద్రునిలోని మచ్చను లోకము పట్టయని జింకయని, చెప్పని చెప్పుచుందురుగాని యది యబద్ధము, అతడామె మొగమును పోలజాలక వెలవెల బోయెను. అటులగాకున్న నతని యం దా మచ్చ యెటుల గలుగును.

''అలం - అపహ్నుతి''

42. తే॥ చెలువమెడ తుంట విల్తుని చింద మరయ
నందు నిరుగడ వైచిన కుందనంపు
సరులు పూఁబోడి చేతులు చాల నరయఁ
గాక యుండిన నీగరగరిక గలదె ! -42

టీక :- చెలువమెడ = ఈమెయొక్క గొంతు, అరయఁ = బాగుగా నాలోచించగా, తుంటవిల్తుని చిందము = మన్మధుని యొక్క శంఖము, అందు = ఆశంఖమునకు, ఇరుగడఁ = రెండువైపులలో, వైచిన = వ్రేలాడవేసిన, కుందనంపు సరులు = పూబోడి చేతులు, బంగారు దండలు, ఆమె చేతులు, కాక యుండిన = అటులగాకున్న చాలనరయ = చక్కగా విచారించగా వానికి, ఈగరగరిక కలదె = ఈ యందముండునా! -

తా :- ఈమె యొక్క గొంతు మన్మధుని యొక్క శంఖము, చేతులు ఆశంఖమునకు రెండువైపులకు వ్రేలాడువేసిన బంగారు దండలు, చక్కగా విచారించి చూచిన అటులగాని యెడల వానికి అనగా నామెమెడకు చేతులకు ఈ యందమెక్కడిది.

''అలం = రూపకము''

43. చ॥ చెలినుదురుం గడుందొరయ సేమముతో నెలకుండఁ గల్గిన
వ్వలి మలయల్లు వానితల వాడని పువ్వయి, నిచ్చనేము నీ
నెలఁతుక చేతులం బడిననే లరదంబగు వేల్పు దాల్చున
ర్మిలి, నని చేరె నమ్మొగలి రేకు లనందగు వాఁడిగోళ్లగిన్ - 43

టీక :- చెలినుదురుః = ఆమెయొక్క నొసలును, కడుఁ దొరయఁ = మిక్కిలిగా పోలగా, నెలకు = చంద్రునికి, అవ్వలిమల యల్లువాని తలఁ = ఆహిమవంతుని యొక్క అల్లుడైన శివుని తలపై, నిచ్చఁ = నిత్యము, వాడని పువ్వయి = వాడిపోని పూవై, ఉండగల్గె= నివసింపగలిగెను, ఏము = మేము గూడ, ఈనెల తుక చేతులంబడిన = ఈమె చేతులలో పడిన యెడల, నేలరదంబగు వేల్పు = భూమిని రథముగా గల్గిన శివుడు, తాల్చునర్మిలినని = మనను ప్రేమతో ధరించునని, చేరెనమ్మొగిలిరేకులు = ఆమొగిలిరేకులు చేరెను. అనందగు = అనదగినట్లుగా, ఒగిఁ - వాడి గోళ్లు = వాడియైన గోళ్లు ఒప్పెను -

తా :- చంద్రుడీమెను దురును పోలుటచే శివుని తలపై నిత్యము వాడని పూవై నివసించ గలిగెను కనుక మనము గూడ నీమె చేతులలో బడిన శివుడు మనలను గూడ ధరించగలడని మొగిలి రేకులు ఆమె గోరులై చేరెనన్నట్లుగా ఆమె గోరులొప్పెను.

విశే : కాలిగోరులను చంద్రబింబములుగా బొటనవ్రేలిగోరు పూర్ణ చంద్రుడుగా తక్కినవి క్రమముగా నొక్కొక్క తిథి తక్కువలో చతుర్దశి, త్రయోదశి, ద్వాదశి, ఏకాదశి చంద్రబింబములతో - చేతి వ్రేళ్లగోర్లను మొగిలిరేకులతో పోల్చుట కవి సంప్రదాయము.

మొగిలిపూలు శివపూజకు పనికిరావు. దానికి సంబంధించిన కథనిక్కడ జ్ఞాపకము చేసికొనవలెను.

ఒకపుడు బ్రహ్మవిష్ణువు లిద్దరు నేను గొప్ప యనగా నేను గొప్పయని వాదులాడ సాగిరి. అపుడు వారి నడుమ శివుడు లింగ రూపమున నావిర్భవించి దీని యాది యంతము లెవరు కనుగొందురో వారు మీలో గొప్పయని పలికెను అపుడు విష్ణువు వరాహ రూపమున పాతాళమునకు చొచ్చుక వెళ్లగా బ్రహ్మ హంసరూపమున ఆకాశమునకు వెళ్లెను. అపుడు వారిద్దరు గూడ ఎవరును తమ ప్రయత్నమున సఫలురై ఆశివలింగము యొక్క యాద్యంతములు కనుగొనలేక పోయిరి. కాని బ్రహ్మ తాను అంతము కనుగొనలేదని చెప్పుట చిన్నతనమని భావించి, తాను ఆలింగము యొక్క యంతమును చేచినట్లొక యావును, ఒక మొగిలి చెట్టును అబద్ధపుసాక్ష్యములుగా తెచ్చెను.

విష్ణువు వరాహరూపమున వచ్చి నేను నీ యాదిని కనుగొనలేక పోయితినని నిజము చెప్పెను. గాని బ్రహ్మ నేను నీయొక్క యంతమును చూచితినని యబద్ధమాడి ఇదుగో

నాసాక్షులని ఆయావును, మొగిలచెట్టును చూపెను. అంత శివుడు నిజము చెప్పినందులకు విష్ణువును నీవు లోకమున సర్వకాలములందు పూజింపబడుదువని పలికి బ్రహ్మతో నీవబద్ధమాడి తివిగాన భూలోకమున నీకు పూజలేకుండ పోవుగాక యని శపించెను. అంతేకాక నతనికి సాక్ష్యముగా వచ్చిన యావుతో నీపాలు, మొగిలితో నీపూలు నాపూజకు నేటినుండి పనికి రావని శపించెను. అంతకొంతకాలమునకు శివుడు కైలాసమున తపము చేసికొను చుండ నాసమీపమున పాలుత్రాగి నెమరు వేయుచున్న యావు దూడల యొక్క నోటినురగ వాయు వశమున వెళ్లి శివునిపై బడెను. అంత శివుడలిగి వానివైపు చూడగా తెల్లని యాదుడలన్ని నల్లగా నయ్యెను. అదిచూచి దేవతలు ప్రభూ అవి కామధేనువు బిడ్డలు కనుక మీయనుగ్రహపాత్రములు గాని యాగ్రహ పాత్రములు కావని పలికిరి. అంత శివుడు ప్రసన్నమై నాటి నుండి తన పూజకై కరియావుల పాలు శ్రేష్టమైనవని చెప్పి వానిననుగ్రహించెను.

ఈకథలోని మొగిలి చంద్రుడా మెసుదుటితో పోలగా అతనిని శివుడు తలపై ధరించెను. కనుక మానమామె గోటికైన సరిపోయిన శివుడను గ్రహించు నేమోయని యాస పడినవి. ఇది ఇచ్చటి కవి చమత్కారము.

44.తే॥ అతివ చన్నులు జక్కవ లగుటకేమి
నందియం, బింక దండల చాయ నిగిడి
టెక్కలై యుండ, సొంపునఁ బిక్కటిల్లి
వలిప పయ్యెద యనుచిన్ని వలను దగుల - 44

టీక :- అతివ చన్నులు = ఈమె రొమ్ములు, జక్కవలగుటకు = చక్రవాకములగుటకు, ఏమి సందియం బింక = ఇంకేమి సందేహము, అనగా లేదనుట, ఏలనగానవి దండల చాయ నిగిడి = బాహువుల సమీపమున నిక్కియవి అనగా నాబాహువులు, టెక్కలై యుండ, బాహువులకు రెక్కలని వ్యవహారముగాన అవి వానికి టెక్కలై యుండగా, అవి, సొంపున పిక్కటిల్లి = అందమున నతిశయించి, వలిప పయ్యెద = సన్ననిపైట, అను, చిన్న వలను దగులః = చిన్నవలలో తగిలి యుండగా - ఏమిసందియం బింక = ఇంకేమి సందియము.

తా :- ఆమె చన్నులు టెట్టల సమీపమున పైకిపోట మరిచి, అందమున పిక్కటిల్లి యాటెట్టలు తమకు టెక్కలైయుండి, పయ్యెద యను వలయందు బడి యుండగా నవి యింక చక్రవాక పక్షులను టకు సందేహమెందులకు - అనగా కూడదనుట.

శ్లేషాను ప్రాణిత నిశ్చయము.

''అలం - సందేహము''

45.క॥ గరగరిక నిచ్చ గలుగక
బురదం గలఁగుటయు కాక పొలుపఱఁ గాఁదా
మర మొగ్గల పేరిటి తా
మర మొగ్గలు పోలఁగలవె మగువ చనుఁగవన్ - 45

టీక :- నిచ్చల్ = ఎల్లప్పుడు, గరగరిక - కలుగక = సౌందర్యముండక, బురదన్ = పంకిలమునందు, కలుగుటయుకాక = కలత పొందు చుండుటే గాక, పొలుపరగా =సౌందర్యము కొలుపోవుచుండగా, తామర మొగ్గల పేరిటి = తామర మొగ్గలను పేరుగల తామర మొగ్గలు, మగువచనుగవన్ = ఈమె చన్నులను, పోలగలవే = పొలగలవా-

తా :- ఎల్లప్పుడు అందముతో నుండక, మరియు బురదలో కలగుచు యందమును కోలుపోవు చుండను కనుక తామర మొగ్గ లను పేరుగల తామరమొగ్గలు ఈమె చన్నులను పోలగలవా!

ఇచట తామర మొగ్గలకు శోభాహీనమునకు బురదయందు కలతపొందుట సౌందర్యము కోలుపోవుటయను రెండు లక్షణములు చెప్పబడినవి. అవి తాము + అరమొగ్గలు, అనగా బురదలో కూరుకొని యుండునపుడు సగమేకనిపించునవి కావున అరమొగ్గలు లేదా న్యూనత పొందిన మొగ్గలు, ఇక ఈపదమున గల రేఫము శకటఫమైనపుడు తాఁ=తామె మఱి మొగ్గలు, మఱియనగా దుఃఖము, బురదలో కుందుచున్నవి కావున దుఃఖపడుచున్న మొగ్గలు అందువలననవి-

''అలం - సందేహము''

46. క॥ బంగారుఁ దీవయుం బలె
నంగునఁ దగు పొలఁతి మేన నారు దనర్చుం
బొంగారు మెఱుఁగు లోపలి
సింగారపు మిసిమి గ్రమ్ముజీరయ పోలెన్ - 46

టీక :- బంగారు తీవయుంబలె = బంగారు తీగవ, అంగున దగు = సౌందర్యముతో నొప్పు, పొలతి మేన = ఆమెశరీరముపై, నారు= నూగారు, పొంగారు మెరుగు లోపలి = ప్రకాశించు మెరుగు లోపల గల, సింగారపు మిసిమి = అందమైన కాంతి, క్రమ్మ = క్రమ్మినటువంటి, జీరయ పోలెన్ = రేఖవలె, తనర్చు = ఒప్పును.

తా :- బంగారు తీగవలె యందముతో నొప్పు నీమె యుదరముపై నూగారు తళతళ లాడు మెరుగునందు మిసిమి గ్రమ్మిన ఓరవలె నొప్పుచున్నది.

''అలం - ఉపమ''

47.చ॥ మురువునఁ దమ్మిచూలి మది ముందఱెఱింగిన యట్లు నేర్పుతోఁ
దరులను పైఁడికట్టులను దానెతిరంబుగ నుంచెఁగాక, యే
వెరవున నిల్చు దీనిదగు వ్రేఁకపు గుబ్బల వ్రేఁగునం జదల్
దొరసిన యట్టి నెన్నడుము, తోరపు నల్వకడంక మెచ్చితిన్ - 47

టీక :- మురువునన్ = చక్కగా, తమ్మిచూలి = బ్రహ్మ, మదిన్ = మనస్సులో ముందరెఱింగినయట్లు = భవిష్యత్తును తెలిసినట్లు, నేర్పుతో = విజ్ఞతతో, తరులను పైడికట్టులను = ముడుతలను బంగారుకట్లను, తానె = ఆబ్రహ్మదేవుడే, తిరంబుగ నుంచెగాక = స్థిరముగా నుంచె నుగాని, లేని యెడల, దీని దగు = ఈమె యొక్క, వ్రేకపు గుబ్బల వ్రేగునన్ = లావైన చన్నులయొక్క బరువున, చదల్ = ఆకాశము దొరసిన యట్టి నెన్నడుము = పోలినట్టి సన్నని నడుము. ఏ వెరవున నిల్చున్ = ఆకట్లులేకున్న ఏవిధముగా నిలువగలదు, తోరపు = గొప్పనైన నల్వకడంక = బ్రహ్మదేవుని యొక్క ఈ ప్రయత్నమును, మెచ్చితిన్ = నేను ప్రశంసించుచున్నాను.

తా :- బ్రహ్మ చక్కగా మనస్సులో భవిష్యత్తును అనగా నీమె చన్నులు మిక్కిలిగా బలియును వానిని నడుము భరించుటకష్టమని తెలిసి తన నేర్పుతో నీమె పొట్టపై ముడుతలను బంగారుకట్లు ఏర్పరచెను. కాని లేని యెడల ఆకాశమును బోలిన నీమె యొక్క ఆసన్నని నడుము మిక్కిలి లావైన గుబ్బల యొక్క బరువును ఎట్లు ఓర్చుగలుగును. నేను బ్రహ్మయొక్క ఈపనిని మెచ్చితిని.

''అలం - ఉత్ప్రేక్ష''

48. క॥ ఎన యిసుక తిప్ప యని చె
ప్పిన నే మనవచ్చుఁ జెలియ పిఱుఁదుంబలెఁ దా
నునుపో యది యటువలెఁ గడుఁ
దనుపో? కాదనరు దానిఁ దద్దయుఁ గడకన్ - 48

టీక :- చెలియ పిరుదు - ఎన = సాటి, ఇసుక తిప్పయని, చెప్పినన్ = ఏమన వచ్చు అది, చెలియ పిరుదుంబలె = ఈమెని తంబమువలె, తా = తాను, నునుపో = స్నిగ్ధమో, అటువలె, కడు = మిక్కిలి, తనుపో = మనోజ్ఞమో, విజ్ఞులు, దానిని తద్దయు = మిక్కిలి, కడకన్ = పూనికతో దానిన్ = ఆ పోలికను - కాదనరు.

తా:- ఈ చెలియ పిరుదునకు యిసుక తిన్నెను సాటి చెప్పుదురు గాని అది ఆపిరుదువలె నునుపా, అందమా! దీనిని ఆలోచించి ఎవరును ఈ ఉపమానమును కాదనుట లేదు. అనగా స్త్రీ సౌందర్యమునకు గల నుపమాసామగ్రిలోని యిసుకతిన్నెలీమె పిఱుదులకు సరికావని భావన కాని యవి తప్ప మరొకటి పిఱుదులకు సాటియైనవి కవిసమయమున లేకుండుట దయనీయము.

''అలం - ప్రతీపము''

49. క॥ పలుదెఱఁగులఁ దమనేరుపు
కొలఁది నెఱజాణ లెల్లఁ గొనియాడిన, ని
య్యెలనాఁగ మెఱుఁగుఁ దొడలం
దలక్రిం దైనను నరంటి తరమా పోలన్! - 49

టీక :- పలుదెఱగులన్ = అనేక విధములుగా, తమ నేరుపుకొలదిన్ = తమపాండిత్యము కొద్ది, , నెఱజాణలెల్లన్ = మాటకారి తనముగల వారెల్లరును, కొని యాడినన్ = పొగడినప్పటికి, ఇయ్యెల నాగ = ఈమె యొక్క, మెఱుగు తొడలన్ = నిగనిగలాడు ఊరువులను, తలక్రిందైనను = అనగా నంత కష్టపడినను, పోలన్ = పోలుటకు, ఆరంటితరమా = అరటి బోదెకు సాధ్యమగునా = అనగా కాదనుట-

విశే :- అరటిబోదెలు మొదటలావుగా తుదకు సన్నగా నుండును కనుకవానిని తలక్రిందు చేసినపుడు యువతుల యొక్క యూరువుల వలె కనిపించును అవి పైపొరను వలిచనపుడు నునుపై స్త్రీలయొక్క తొడల వలెనే యుండును.

''అలం - వ్యతిరేకము''

50.కII తలఁకకు మని యేకతమునఁ
బలికిన మొఱవెట్టునపుడె పరికింపంగాఁ
బొలఁతుక చిఱు దొడలంగా
ళెలు వోలమి డాఁగె వెఱచి లెక్కింపగాన్ - 50

టీక :- తలకకు మని = భయపడకు మని, యేకతమున బలికిన = ఒంటరి పాటున చెప్పినను, మొరపెట్టునపుడె = అవి మ్రోగునపుడే, పరికింపంగా = పరిశీలించి చూడగా, పొలతుక చిరు తొడలన్ = ఈమె యొక్క చిన్ననైన తొడలను, పోలమి = సాటిరాకుండుటచే, లెక్కింపంగాన్ = గణించి చూడగా, కాళెలు = కాహళికలు, వెఱచిదాగె = భయపడి దాగెను.

తా :- భయపడ వద్దని ఏకాంతమున చెప్పినప్పటికి కాహళలు మొర పెట్టునపుడె మేమామె చిరుతొడలకు సాటిరామని చెప్పి భయపడి దాగెను.

విశే :- కాహళ సార్వకాలిక మైన వాద్యముగాదు. అది యుద్ధమువంటి విప్లవ సందర్భము లందే యుపయోగ పడునది కనుక దానికి ఏకాంతమున దాగుటయే యెక్కువ. అందువలన నది యామె తొడలకు జడిసి దాగెనని కవి చమత్కారము.

51.మ. తమకుం బోలిక లైనవే యను మదిం దాఁబేళ్లఁ దామల్కతో
నెమక నీళ్ళ మునిగియున్న వన నెంతే నొప్పు, నున్గోళ్ళనం
దములై మీఱెడు తెల్లడాలు గమిలోనం గొమ్మమీఁ గాళ్లు చూ
చి మదిం జూడఁగ, వీనిసాటి గలదే చెప్పంగ నెచ్చోననున్ - 51

టీక :- నన్గోళ్లన్ = నునుపైన గోరుల యొక్క అందములై మీరెడు, తెల్ల డాలుగమిలోనన్ = తెల్లదనముయొక్క ప్రకాశములో మునిగిన కొమ్మ మిగాళ్లు చూచి = ఆమె యొక్క పైపాదములు చూచి, అవి, తమకున్ = పోలికలైన, వేయను మదిన్ = తమకు సాటియైన విగదా యను మనస్సుతో, తాబేళ్ళన్ = కచ్ఛపములను తాము- అనగా ఆపాదములు, అల్కతో నెమకన్ = కోపము వెదకగా, నీళ్లమునింగి యున్నవనన్ = నీళ్లలో మునిగియున్నవని చెప్పుట, ఎంతేనొప్పున్ = ఎంతగానో యొప్పును, మదింజూడగ, విచారించి చూడగా, ఎచ్చోన్ = ఎచటనయినను, వీని సాటి గలదే = వీనికి సాటి యున్నదా! అనున్ = అనును.

తా :- ఈమె యొక్క మీగాళ్ల గోళ్లయొక్క తెల్లని కాంతితో ప్రకాశించుచు, తాబేళ్లను అదితమకు సాటియైనవే యని వెదకగా నవిపోయి నీళ్లలో మునిగినవి. కాని లేకున్న వాని కాయవసరము లేదు. ఆలోచించగా నెక్కడనైనను వీనికి సాటియున్నదా ''చెప్పండి'' యని యవి యను చున్నవి.

''అలం - సందేహము''

52.వ:- అని ఇట్లు నెమ్మది నక్కొమ్మ సోయగంబులు కైవారంబులు సేయుచున్నంత.

టీక :- అని యిట్లు = ఈ విధముగా, నెమ్మదిన్ = తనయొక్క నిండు మనస్సుతో, ఆకొమ్మ సోయగంబు = ఆమెయొక్క యందము, కైవారంబు సేయు చున్నంత - పొగడుచుండగా-

తా :- అని ఈవిధముగా యయాతి నిండుమనసుతో నామెయొక్క యందమును నుతించుచుండగా -

53.సీ॥ బలుమించు తలమించు నలిమించు సిరిఁబొల్చు
మేచాయవిరుల సంపెఁగలఁ జేయ
నెలతీరుఁ బలుమాఱు లలిఁగేరు నెమ్మోము
చెలఁగి తమ్ములను దమ్ములను జేయ
జగడాలఁ బగడాల నగుడాలు గల మోవి
చెందమ్మి రేకులఁ జివురు సేయఁ
గరము చీఁకటిఁ గప్పు కప్పు వేనలి యొప్పు
తేఁటుల కొకవింత నీటుసేయ
తే॥ నలువ జగములఁ గలిగిన పొలుపుగరఁచి
యెంచి వెన్నెల కరువులో నించి యతివఁ
గాఁ దలంచఁగఁ బోలు నీకలికి నవుర,
యనఁగ నటవచ్చు నద్దేవయానిఁ గాంచి - 53

టీక :- బలు = మిక్కిలి, మించుతలన్ = మెరుపుయొక్క అగ్ర భాగమును, మించు = మీరునట్టి, నలి = సౌందర్యమున, మించు = మీరి, సిరి బొల్చు = కాంతికలుగు,

వేంచాయం = శరీరకాంతి, విరుల సంపెంగల చేయుఁ= పూవులన్నిటిని సంపెంగనలుగా చేయుచుండగా, నెలతీరు =చంద్రుని యొక్క రీతిని; పలుమారు=అనేక పర్యాయములు, లలిగేరు = క్రమముగా పరిహసించు, నెమ్మోము = నిండుదనము -గలముఖము, తమ్ములను = పద్మములను, తమ్ములను = సోదరులను అనగా తన వెనుక బుట్టిన వాని, అనగా తనకంటె తక్కువ వానినిగా, చెలగిచేయ = ఉల్లాసమున చేయు చుండగా, పగడాలఁ = విద్రుమములను, జగడాలఁ = కలహమున, నగు పరిహసించునట్టి, డాలుగల మోవి = కాంతిగల పెదవి, చెందమ్మి రేకులఁ = ఎర్రతామర దళము లను, చివురునేయ = చిగురుగా చేయగా, అనగా లేతవిగా చేయగా - అనగా పెదవి యంతకంటె ముదురు రంగు గలదనుట, కరము = మిక్కిలిగా, చీకటికప్పు = చీకటి వంటి నలుపు లేదా చీకటినే కప్పివేయునట్టి, కప్పువేనలి యొప్పు = నల్లనైన కొప్పు యొక్క అందము, తేటులకు = తుమ్మెదలకు, ఒక వింత నీటు సేయ = ఒక కొత్తనైన కాంతిని కలిగించు చుండగా, నలువ = బ్రహ్మ జగముల గలిగిన = లోకములందుగల, పోలుపు గఱచి = అందము నంతటిని నేర్చి, ఎంచి = వానిలో ఉత్తమమైనవి యెన్ను కొని, వెన్నెలకరువులోనించి = వెన్నెలతో చేసిన, కరువు = అనగా ప్రతిమలు పోతపోయు మూస = అటువంటిమూసలో నుంచి, ఈకలికిని = ఈసుందరిని, అతివ = అనగా మిక్కిలి సుందరమైనది అని యర్థము, ఇది యుట సార్థక ప్రయోగము. ఈ యువతిగా, తలంచంగ బోలును = చేసియుండవచ్చును. ఔరయనగ = ఔరా! యని ఆశ్చర్యపడునట్లుగా, అటవచ్చి = అక్కడికి వచ్చి యద్దేవయానిగాంచి = ఆదేవయానిని చూచి.

తా : మిక్కిలిగా తళతళలాడు మెఱుపు కొనలను మించునట్టి కాంతితో సిరిగలిగిన తనయొక్క శరీర కాంతి పూవులన్నిటిని సంపెంగల చేయుచుండగా - అనగా ఆమె శరీరకాంతి ప్రసరించి యవియన్ని బంగారు కాంతితో కనిపించు చుండగా నని తాత్పర్యము - చంద్రుని యొక్క అందమును పలుమారు గేలిచేయు ముఖము. పద్మములను తనకు తమ్ములనుగా చేయుచుండగా అనగా వానికంటె అందమున మొదటిదై - పగడాలతో జగడమాడి పరిహసించు పెదవి ఎర్రతామర తేకులను లేత బరచుచుండగా, చీకటిని సైతము తన యొక్క నల్లదనమున కప్పివేయగల కొప్పు యొక్క కాంతి తుమ్మెదలకు మరియొక క్రొత్తవన్నెను కలిగించు చుండగా,

బ్రహ్మదేవుడు లోకముల లోని అందమైన దానినన్నిటిని పరిశీలించి యందులో మేలైన వెన్నుకొని వానిని కరగించి వెన్నెల కరువులో పోసి యతివగా తీర్చినట్లుండి ఔరాయని యాశ్చర్యపడజేయు యా దేవయాని అక్కడకి రాగా నామెను చూచి-

విశే :- భట్టుమూర్తి ఒక చాయ, ననపాయ, పికగేయ, సముదాయ- లలనాజనాపాంగ, వంటి పద్యములకే ముహూర్తము న(మ్రుగ్గ పోసెనోగాని ప్రబంధకవు లెవ్వరు గూడ నతని పదముల పోహళింపు నుండి తప్పుకున్న వారుగారు.

''అలం – పరిణామము''

54.వ:- మున్నన్నెలంత నెఱింగియు నెఱుంగని వాఁడపోలెఁ జక్కం దనంబునకు
నిక్కయగు శర్మిష్ఠ దెలియవలసి
యక్కొమ్మ కిట్లనియె - 54

టీక :- మున్నన్నెలంత దెఱింగియు (మున్ను+ ఆ+ నెలంత) యయాతి యామెను మునుపే యెఱిగి యుండియు, నెఱుంగని వాడవోలె = ఎరుగని వాని యట్లు, చక్కదనంబునకు నిక్కయగు = అందమునకు నివాసమైన, శర్మిష్ఠం దెలియవలసి =శర్మిష్ఠ నెరుగగోరి, అక్కొమ్మ కిట్లనియె = ఆమెతో నిట్లనెను.

తా :- యయాతి మహారాజామె నంతవరకే ఎరిగినను ఎరుగనట్లు, శర్మిష్ఠ ఎవరో తెలియగోరి యామెతో నిట్లనెను.

యయాతి మీరెవ్వరని దేవయాని నడుగుట

55. క॥ పలుమాఱు నిందు వత్తును
దొలుత నినుం జూచి యెఱుఁగఁ దొయ్యలి నీకుం
గులమెయ్యది, పేరెయ్యది,
యలకొమ్మయు నీవు నేమి యుగుదురు వావిన్ - 55

టీక :- పలుమారు నిందు వత్తును = ఓయువతీ! నేను అనేక పర్యాయము లిచటికి వచ్చుచుందును. తొలుత నినుజూచి ఎఱుగ = మొదటనిన్ను జూచి యుండలేదు. తొయ్యాలి = ఓయువతీ! తీకుంగులమెయ్యది = నీకులమేమిటి, పేరెయ్యది =

పేరేమిటి, అల= ఆయొక్క, కొమ్మయు = సుందరియు, నీవునేమియగుదురు వావిఁ = నీవు వరుసకు నేమగుదురు.

తా :- ఓ యువతీ! నేననేక పర్యాయము లిక్కడ వచ్చుచుందును. గాని నిన్ను చూచి ఎరుగను, నీకులమేమిటి, నీపేరేమిటి, ఆయువతి మరియు నీవు వరుసకు నేమగుదురు.

వ :- అయ్యయాతియు దత్ప్రదేశంబున సుఖోనవిష్టుండై దేవయానిందొల్లి యెఱింగిన వాఁడై యతిశయరూపలావణ్య గుణ సుందరియయిన శర్మిష్ఠనెఱుంగవేఁడి – అని మహాభారతము ఆది 3-158

ఈ సందర్భమున తెలగనమూలమును తొలుత నినుంజూచియెఱుగ నని యెందుకు మార్చెనో తెలియదు.

56.వ:- అనవుడు – 56

టీక :- అనవుడు = అని యడిగిన పిమ్మట

57.సీ॥ మున్ను నన్నెఱుఁగుదు విన్నాతి వృషపర్వుఁ
డనుతొలువేల్పు రాయని కొమార్తె
శర్మిష్ఠ నాఁగ నీచాన నన్నుల నాఁడు
నీట ద్రొబ్బించిన నెలఁత గాదె
నాఁటి తప్పునకు నీననఁ బొండ్లతో నాకు
వరవుడై యున్న దీ వాలుఁగంటి
నముఁ బెండ్లి యాడి మన్నన దీనిలోనుగాఁ
గల నెలఁ తుక లూడిగములె సేయఁ
తే॥ గడలిఁ బుట్టిన పొలఁ తుకల్ కదిసి కొలువ
వెలయు నలవేయిగన్నుల వేల్పుపోలెఁ
బెంపుతో నిచ్చఁ గడలేని సొంపు మెఱయుఁ
బుడమి నాతోడి సవతిగా నడుపవయ్య! – 57

టీక : మున్ను నన్నెరుగుదువు = ఓమహారాజా! ఇంతవరకు నీవు నన్నెరు గుదువు; ఇన్నాతి = ఈనాతి దృషపర్వుడను తొలువేల్పురాయని – దానవుని యొక్క కుమార్తె, శర్మిష్ఠనాగఁ = శర్మిష్ఠయనగా, ఈచాన = ఈమె, నన్నులనాడు = నన్ను ఆనాడు,

నీటఁద్రొబ్బించిన = బావిలో త్రోయించిన, నెలతగాదె = యువతికాదా, నాటి తప్పునకు ఆనాటి దోషమునకు, ఈనన బోండ్లతో నాకు = ఈయువతుల తో నాకు, ఈవాలుగంటి = ఈ యువతి, పరవుడై యున్నది = దాసియైనది. ననుపెండ్లి యాడి = నన్ను వివాహమై, మన్ననఁ = గౌరవముతో, దీనిలోనుగా గలనెలతుకలు = ఈమె మొదలైన యువతులు, ఊడిగములు సేయఁ = సేవలు చేయుచుండగా, కడలి బుట్టిన పొలతుకల్ = సముద్రమున జనించిన అప్సరసలు, కలిసికొలువ = కలిసి సేవించు చుండగా, వెలయు = ప్రకాశించు, అల = ఆయొక్క, వేయి కన్నుల, వేల్పు వోలె = సహస్రాక్షుడైన ఇంద్రుని వలె, వెంపుతోఁ = గొప్పదనముతో, నిచ్చ = నిత్యము, కడలేని = సొంపు మెరయ = అంతము లేని వైభవము ప్రకాశింపగా, పుడమిఁ = భూమిని, నాతోడిసవతిగా = నాకుసాటియైన భార్యగా, నడుపవయ్య = ఏలుము-

తా :- ఓ మహారాజా! ఇంతవరకు నీవు నన్నెరుగుదువు. ఈమె వృషపర్వుడను దానవరాజు బిడ్డ. ఆనాడు నన్ను బావిలో త్రోయించిన యువతి, ఆదోషమునకుగాను వీరందరితో నిపుడు నాకు దాసి యైనది. నీవు నన్ను వివాహమాడి, వీరందరు నిన్ను గౌరవమున కొలుచుచుండగా అప్సరసలతో సేవింపబడెడు నింద్రునివలె యంతములేని వైభవమున వెలుగుచు, భూదేవిని నాకు సవతిగా నేలుకొనుము.

విశే :- రాజులను భూభర్తలనుట కవిసంప్రదాయము - అందువలననామె రాణులకు సవతియగును.

తే :- నన్ను మున్న యెఱుంగు దిన్నాతినాకు
దాసివృషపర్వుడను మహాదానవేంద్రు
కన్యనాయొద్దనెప్పుడు గదలకుండు
ననఘమరిదీని శర్మిష్ఠయంద్రు జనులు - ఆది - 3-159

58.వ:- నావుడు నతండిట్లనియె - 58

టీక :- నావుడు = అనగా, నతండిట్లనియె = అతడిట్లనెను.

తా :- అనిన పిమ్మట అతడిట్లనెను.

59.ఆ:- 'చెలియ, రాచకన్నియల నేలవేలుపు
ల్తగిలి పెండ్లి యాడఁ దగవు గాక!
పుడమి నేలవేల్పుఁ బువ్వుఁ బోఁడుల రాజు
లెలమిఁ బెండ్లియాడ దలఁపఁ దగునె?' - 59

టీక :- చెలియా! ఓయువతీ - రాచకన్నియల నేల వేలుపుల్ = రాజకాంతలను బ్రాహ్మణులు, తగిలి పెండ్లియాడన్ = వలచి వివాహమాడుట, తగవగాక =న్యాయముగాని, పుడమిన్ = భూమిపై, నేలవేల్పు పువ్వు బోడుల =బ్రాహ్మణ కన్యలను, రాజులు = క్షత్రియులు, ఎలమి పెండ్లియాడ = ప్రేమతో వివాహమాడుటకు, తలపదగునె = తలంపవచ్చునా !

తా ॥ ఓ యువతీ! క్షత్రియకన్యలను బ్రాహ్మణులు వివాహమాడ వచ్చును గాని బ్రాహ్మణకన్యలను క్షత్రియు వివాహమాడుటకు కోరవచ్చునా!

విశే :- కర్దముడు, దమదగ్ని, విక్రమార్కుని తండ్రి. వీరు క్షత్రియ కన్య లను వివాహమాడిన బ్రాహ్మణులు. ఇక్ష్వాకులు క్షత్రియులై యుండి బ్రాహ్మణ కన్యలను వివాహమాడిరి. ఇట్టి వానిని విలోమ వివాహము లందురు. అవి శాస్త్ర నిషిద్ధము.

వ. క్షత్రియకన్యకల బ్రాహ్మణులు వివాహంబగుదురుగాక యధర్మోత్తరంబుగా క్షత్రియులు బ్రాహ్మణ కన్యకల వివాహం బగుదురే - అని మహాభారతము
ఆది 3-162

60.క॥ అని పలుకు రాచవేలుపుఁ
గనుఁగొని చిఱునగవు మోముఁ దమ్మిం గమ్మం
దనరఁగ నచ్చేడియ యి
ట్లనియె న్మది లోనఁ గోర్కు లనయముఁ బొదలన్ - 60

టీక :- అనిపలుకు = అని చెప్పుచున్న, రాచవేలుపు గనుగొని = ఆరాజేంద్రుని చూచి, చిరునగవు = దరహాసమె, మోము దమ్మింగ్రమ్మన్ = ముఖపద్మముపై క్రమ్మగా, అచ్చేడియ = ఆచేడియ, తన రగన్ = ఒప్పునట్లుగా, మదిలోని కోర్కులు = మనస్సులోని కోరికలు, అనయము పొదలన్ = మిక్కిలి సందడించు చుండగా, ఇట్లనియెన్ = ఇట్లనెను.

తా :- అనుచున్నటువంటి అపుడమీశుని చూచి, చిరునవ్వు ముఖముపై వ్యాపించగా ఆదేవయాని మనస్సులోని కోరికలు సందడించు చుండగా నిట్లనెను.

''అలం - రూపకము''

61. తరల :-

కడఁగి విన్ను వెలుంగు దాఁ గుఱిగాఁగ నబ్బలు కానలో
నడలుచున్న ననుం గనుంగొని యప్పు డర్మిలి నూతితో
వెడలఁ దీయుచుఁ గేలుపట్టితివేకదా యిఁకఁ బెండ్లికిం
గడమ లెల్లను సొంపు లింతియె కాక మీర లెఱుంగరే - 61

టీక :- కడిగి = ప్రయత్నించి, విన్నువెలుంగు = ఆకాశముపై ప్రకాశించు చుండు కర్మసాక్షి, తా = తాను, గుఱికాగఁ = లక్ష్యముకాగా అనగా చూచుచుండగా, అప్పుడు = ఆనాడు, నూతిలో = బావిలో, అడలుచున్న = దిగులుపడుచుండునట్టి, ననుంగనుగొని = నన్నుచూచి, అర్మిలిఁ = ప్రేమతో, వెడలదీయుచు = పైకితీయుచు, కేలుపట్టితివేగదా = కరగ్రహణము చేసితివిగదా! ఇక = ఇంక, పెండ్లికిఁ = వివాహమునకు, కడమిలెల్లను = తక్కిన లాంఛనములన్ని, సొంపులింతియెకాకఁ = అవి వేడుకలు మాత్రమేగాని అనగా వివాహమున కరగ్రహణము అనగా వరుడు వధువు చేయి పట్టుకొనుట అనునదే ముఖ్యముగాని తక్కిన వన్ని కావనుట, మీరలెరుంగరే = ఇదిమీకు తెలియనిదా!

తా :- ఓ మహారాజా! ఆనాడాకాశమున ప్రకాశించుచు జగచ్చక్షువు, కర్మసాక్షియునైన సూర్యుడు చూచుచుండగా, నీవు బావిలో నుండి దిగులు పడుచున్న నన్ను చేయిపట్టుకొని పైకిలాగితివి. ఇక వివాహమునకు కరగ్రహణమే ముఖ్యము గాని తక్కిన వన్ని దాని కనుబంధమైన కార్యక్రమములే గదా! ఇది మీరెరుగనిదా!-

ఛం.విశే:-

ఈవృత్తమునకు తరళము మరియు ధ్రువకోకిలయనియు నామాంతరములు ''నభరసజజగ'' అనునవి దీనిగణములు 11వ యక్షరములపై యతియుండవలెను.

నిగ్రహమేదినన్ను దరణి ప్రభరూపము వెల్వరించునాడుగ్రమయూఖ సాక్ష్యముగ నున్నత దక్షిణపాణి జేసి భూపాగ్రణి నాదుదక్షిణ కరాబ్జము వట్టితి కాన - ఆది -3-160

తెలుగువారికి వివాహము పదారు దినముల పండుగ. దానిలో శాస్త్రీయ దేశీయాచారము లెన్నియో కలిసినవి. అవి సుమారు నలువది వరకుండును. వివాహ పర్యాయముల వలన అందు ముఖ్యమైనవి కొన్ని తెలియును-

వివాహమునకు సంస్కృతమున ఉద్వహము, కల్యాణము, దారకర్మము, పరిణయము, పాణిగ్రహణము, లగ్నము అనియు గూడ పర్యాయము లున్నవి.

1. ఉద్వహము = ఉద్ధరించుట, ఎత్తుకొని పోవుట

వరునికి దానము చేయబడిన కన్య తండ్రియొక్క ఏడుతరముల వారిని మరియు భర్తయొక్క గోత్రమును ఉద్ధరించును.

శ్రీకృష్ణుడు రుక్మిణిని అర్జునుడు సుభద్రను చేపట్టిన విధానములు ఉద్వహములకుదాహరణములు. ఇది క్షత్రియులకు తగును. రాజపుత్రులలో నిప్పుడు గూడ యీ యాచారమున్నదట.

2. కల్యాణము = శుభస్కరము. వివాహబంధములో విడివిడిగా నున్న స్త్రీ పురుష లేకమగుట. సంసారమునకు శుభస్కరమగును.

ఈనాడు ఆలయములలో జరుపు దేవతల వివాహములు కల్యాణము లనబడుచున్నవి. వీనియొక్క పరమార్థమును అష్టాక్షరీ చరమ- ద్వయ మంత్రార్థములతో సమన్వయ పరచి కథాసందర్భములతో గూడ కల్యాణములు అను పుస్తకమున శ్రీయన్. గోపాలాచార్యగారు వివరించిరి.

3. దారకర్మము = దారయనగా పతిని సోదరులతో వేరుపరుచునది యని వ్యుత్పత్తి వివాహము వరునికి అతని కొరకేర్పడిన నూతన గృహముననే జరుగవలెనని యొక మతము. ఇప్పటి పెండ్లిపందిరి దాని చిహ్నమే యందురు. సిరిజంగాలలో ఇప్పటికీ యాచారమున్నది. ఈనాటి విద్యావంతులైన యువతులందరు దారలే.

పరిణయము = పూర్ణత్వము నిచ్చునది.

శతపథ తైత్తరీయ బ్రాహ్మణములు భార్యాభర్తలలో సగము కనుకనామెను పొందుటకు అతనికి పూర్ణత లేదని చెప్పును.

(శతపథ- 5-2-1-10 తైత్త - 3-3-3.)

5 పాణిగ్రహణము = చేతిని పట్టుకొనుట

గృహ్ణామితే సౌభగత్వాయ హస్తమ్ (ఋ 10-85-36) అను మంత్రముచే ఓ వధూ ! సౌభాగ్యాన్ని పొందటం కోసం నేను నీ పాణిని గ్రహించుచున్నాను. అని పలుకును. ఇది ఋగ్వేదమున సోముడు సూర్య అను వధువుతో ననిన వాక్యము – దీని వలననే వివాహము పాణిగ్రహణమైనది.

ఉత్కళదేశమున పాణి బంధము గూడ నున్నది. అక్కడి పురోహితుడు వరుని చేతిపై వధువు చేతినుంచి దర్భతో కట్టును.

6 లగ్నము = తగులుకొనుట. అనగా మనసు నిలుచుట.

వధూవరులకు వారి నడుమ పట్టిన తెర తొలగించగనే ఒకరి నొకరు చూచుకొని తన మనస్సును పరస్పరము లగ్నము చేసి కొందురు. కనుక నిది లగ్నము. ఈనాడీ తెరకంటె మొదలే పెండ్లి చూపులలోనే జరుగు చున్నది.

7 వివాహము = ''విశేషేణవహంతి'' అను ధాతువు ననుసరించి –

చక్కగా పొందించుట, చక్కగా కొనిపోవుట అని వివాహ పదమునకు అర్థము. కన్యాదాత గురుకులమున స్నాతకమైన పిదప కాశియాత్రకు వెడలిన ఉత్తముడైన వరుని వెదకి తమ కన్యనతనికి కూర్చును. ఆ పిమ్మట వివాహమున ప్రధాన హోమానంతరము వరుడు కన్యను హోమాగ్నితో కూడ ప్రత్యేకమైన వాహనముపై తమ ఇంటికి కొనివెళ్లి వివాహ కార్యమును పూర్తి చేసికొనును. ఈ రెండు కారణములచేత పెండ్లికి వివాహమను పేరు నిలిచినది.

8. పెండ్లి = పెణ్ + ఇల్ = పెణ్ అనగా స్త్రీ పెండ్లము ఇల్లాలు. పెండి యాడుట యనగా యిల్లాలిని చేసికొనుట అని అర్థము.

కు॥ మణ్ణాసయు పొణ్ణాసయు
పెణ్ణాసయు లేని .... ధూర్జటి – కాళ – 3 – 185

62.క॥ 'చదువులకు నొజ్జయై కడుఁ
బొదలిన నాయయ్య పొత్తపుం గూర్పరిచే
నిది తగ వనిపించెద నె
మ్మది లోపల నీకు నింత మనికిత ముచ్చన్!' – 62

టీక :- చదువులకు నొజ్జయై = విద్యలకు గురువై, పొదలిన మాయయ్య = ఒప్పునట్టి మాతండ్రి పొత్తువుం గూర్పరిచే = గ్రంథ కర్తచేత, శుక్రుడు నీతిశాస్త్రవేత్త, అతడు గ్రంథించిన నీతిశాస్త్రమే నీతికి మొదటి గ్రంథము. అందువలన యాయన కవి - నెమ్మది లోపల = మనస్సున, నీకునింత = నీకు ఇంతగా, మనికిత మున్నఁ = విచారమున్న యెడల, నేను, ఇది తగవని పించెదఁ = ఇది ధర్మమేయని చెప్పింతును.

తా : ఓ మహారాజా ! నీకు మనస్సున నీ విషయమై అంతగా విచారమున్న యెడల, విద్యలను గురువు, నీతి శాస్త్రమునకు కర్తయైన మాతండ్రి గారితోనే నిది ధర్మమేయని చెప్పింతును.

కII తెలియగ ధర్మా ధర్మం
బులునడపుచు నిఖిలలోక పూజ్యుండైని
ర్మలుడగు శుక్రుండు పంచిన
నలఘుభుజా ! నను వివాహమగుదే యన్నఁ - ఆది - 3 - 163.

అని ఆంధ్రమహాభారతము.

63.వ:- అనవుడు - 63

అనవుడు = అనిన పిమ్మట.

శుక్రాచార్యులు దేవయానులున్న కడకు వచ్చుట

64.కః- అట్టేని పెండ్లియయి చే
పట్టెద నిన్నను డుఁ బొంగి పడఁతుక సోఁకుం
బట్టపు టొజ్జల నటకు
న్నెట్టనఁ బిలిపించె నతఁడు నెల దాల్పుబలెన్ - 64

టీక :- అట్టేని = అట్లయిన యెడల, పెండ్లియై = వివాహమాడి, చేపట్టెదనిన్ను = నిన్ను గ్రహించెదను, అనుడు = అనిన పిమ్మట, పొంగిపడతుక = ఆమె సంతసించి, సోకుంబట్టపు టొజ్జలఁ = రాక్షసులకు గురువైన ఆయనను, అనగా శుక్రాచార్యుని అటకుఁ = అక్కడకు, అతడు, నెలతాల్పుబలెఁ = శివుని వలె, నెట్టనఁ = వెంటనే, పిలిపించెఁ = రావించెను.

తా :- అట్లయిన నిన్ను వివాహమాడి చేపట్టెదనని చెప్పగా నామె పొంగిపోయి రాక్షసుల కాస్థానాచార్యుడైన శుక్రుని యచటికి శంకరుని వలె వెంటనే పిలిపించెను.

వ:- అమ్మహాముని వచ్చియిది ధర్మవిరుద్ధంబుగాదని చెప్పినేని
నిన్ను వివాహంబగు దుననియ యాతియొడంబుడిన - ఆది -3-164

65.చ॥ చనుదేరం గని మింటిమానికము నిచ్చల్ పోవు మజ్జారె, యా
వినుత్రోవ న్నడయాడ కేలయిటకు న్విచ్చేసెనో యబ్బురం
బనఁగన్ను ల్మిఱుమిట్లు గొల్పు మెయిచాయల్గాయ నీరెండలం
దనయున్నట్లుగఁ జేరవచ్చు నతనిన్ దౌదవ్వులం జూచుచున్ - 65

టీక :- చనుదేరంగని = అతడు వచ్చుచుండగా, మజ్జారే = ఆశ్చర్యార్థకము, మింటమానికము = సూర్యుడు, నిచ్చల్ పోవు = ఎల్లపుడు వెళ్లు, వినుత్రోవన్నడ యాడక = ఆకాశమార్గమున వెళ్లక, ఏల = ఎందుకు ఇటకున్ విచ్చేసెనో = ఇక్కడికి వచ్చేనో, అబ్బురంబనన్ = ఆశ్చర్యమనగా, కన్నుల్, మిరుమిట్లుగొలుపు - మెఱుచాయల్ = దేహకాంతులు, కాయనీరెండలన్ = పలుచని యెండగాయు చుండగా, తన యున్నట్లుగ = తాను అక్కడనే యున్నట్లుగా/ఉన్నపాటున, చేరవచ్చు=సమీపించు, అతనిన్ = ఆశుక్రుని, దౌదవ్వులన్జూచుచున్ = దూరదూరము నుండియే చూచుచు.

తా :- అతడు అనగా నాశుక్రుడు వచ్చుచుండగా అయ్యారే ! ఆకాశమున సంచరించు సూర్యుడు నిత్యము నడుమ దారిని వెళ్లకనెందులకో యిక్కడికి విచ్చేసెనని చూపరు లాశ్చర్యమంద, కన్నులు మిరమిట్లు గొలుప, నతని దేహకాంతులు నీరెండగాయు చుండగా నున్నపాటున నచటికి చేరవచ్చుచుండగా నతనిని దూర దూరము నుండియే చూచి-

విశే :- ఇది నన్నయమార్గము

ఆయన మహాభారతమున సభాపర్వమందు నారదుడు ధర్మజాదుల కడకే తెంచునపుడు -

నీరజమిత్రుడేల ధరణీ గతుడయ్యెడు నొక్కొ- ఆది - 1 - 23

అని వర్ణించెను. దేవర్షులందు నారదుడు తెల్లనివాడు అటులే శుక్రుడు గూడ కనుక

నన్నయగారి ననుసరించి యయాతి గూడ నిక్కడ శుక్రుని సూర్యుని పోల్చిచెప్పెను.

''అలం - సందేహము''

66.క॥ వడిఁ బుడమితేఁడు వలె వా
టిడుకొన్న పసిండిఁవ్రాఁత నెసఁగెడు వలువ
న్నడుము బిగియించుకొని మఱి
యడుగులపై వ్రాలిలేచి యతఁడును దానున్ - 66

టీక :- వడిన్=వెంటనే, పుడమి ఱేడు= ఆ మహారాజు వలెవాటిడు కొన్న =(వల్లె + వాటము) వలాటముగా వేసికున్న, పసిండి వ్రాత నెసగెడు వలువన్ = బంగారు జరియంచుగల శాలువను, నడుమున్ = బిగియించుకొని = నడుమునకు చుట్టుకొని, మరి = మరియు, అడుగులపై వ్రాలి = పాదములపైబడి లేచి, అతడును = తానున్ -

తా :- అతనిని చూచి వెంటనే యా మహారాజు వలాటముగా వేసికొన్న బంగారు జరిశాలువను నడుమునకు చుట్టుకొని పాదములపైబడి లేచి అతడు మరియు తాను -

విశే : పెద్దవారికి నమస్కరించునపుడు శాలువను/ ఉత్తరీయమును నడుమునకు చుట్టు కొనుట యాచారము.

''అలం - ఉపమ''

67.క॥ చనుదెంచి యివము గ్రమ్మెడు
చను పకములలోని మావి చక్కిం దగుక్రొ
న్న నచప్పరంబు లోపలఁ
దనరెడు కప్పురపు జగతిఁ దయమినున్న యెడన్ - 67

టీక :- చనుదెంచి = వచ్చి, ఇవము క్రమ్మెడు = చల్ల దనము వ్యాపించెడు, చనుపకములలోని = సంపెంగల గుంపులోని, మావిచక్కిన్ = ఒక మామిడి దగ్గర గల, తగు = తగినట్టి, కొన్ననచప్పరంబులోపల = కొత్త పూవులుగల చపారముల లోపల, తన రెడు = ఒప్పెడు, కప్పురపు జగతిన్ = కర్పూరపుటరుగుపై, తమి నున్నయెడన్ = కుతూహలము తో గూర్చుండగా -

తా :- అక్కడినుండి తామిద్దరు వచ్చి, సంపెంగల నడుమ నొక మామిడి దగ్గర క్రొత్తనైన పూల తీగలల్లుకొని చల్లదనముగ్రమ్మెడు చప్పరము క్రింద కర్పూరపు టరుగుపై కుతూహలమున గూర్చుండగా -

''అలం - ఉదాత్తము''

68.క॥ నెమ్మదిఁ గూరిమి చెలులగు
కొమ్మలు వేవురును గొలువఁ గ్రొమ్మించులలో
నిమ్మగు లేనెల యుంబలె
నమ్మెయికిని వచ్చి దేవయాని కడంకన్ - 68

టీక :- నెమ్మదిన్ = నిండు మనస్సుతో, కూరిమి చెలులగు = ప్రియమైన సఖులైన, కొమ్మలు వేవురును కొలువ = సఖులు వేయిమంది సేవించు చుండగా, క్రొమ్మించులలో = కొత్త మెరుపులలో, ఇమ్మగు = ఉన్నట్టి, లేనెయుం బలె = లేత చంద్రుని వలె, దేవయాని, అమ్మెయికిని వచ్చి = అక్కడికి వచ్చి, కడంకన్ = యత్నములతో -

తా :- వారచట కూర్చుండగా దేవయాని నిండు మనసుతో తనను వేయి మంది చెలులు సేవించు చుండగా క్రొత్త మెరుపులతో నుండెడు లేత చంద్రునివలె యక్కడకు వచ్చి - ప్రయత్నములో .

''అలం - ఉపమ''

69.ఆ॥ మ్రొక్కి లేచికేలు మోడ్చుచుఁ దనచంద
మల్లఁ జెప్పి యయ్యాతిఁ జూపి,
'తలఁచి చూడ మున్నె తగులైతిఁ గావునఁ
బెనిమి టితఁడె నాకు వినుము తండ్రి !' - 69

టీక :- మ్రొక్కిలేచి = నమస్కరించిలేచి, కేలు మోడ్చుచు = చేతులు జోడించుచు, తన చందమల్ల జెప్పి = అల్ల ఆయొక్క తన విధానము చెప్పి, అయ్యయాతి జూపి, ఆ యయాతిని చూపి, తలచి చూడన్ = ఆలోచించి చూడగా, మున్నె = ఇదివరకే తగులైతిగావున = ఇతనిని వలచితిని కనుక, వినుము తండ్రీ నాకు పెనిమిటితడే = ఇతడే నాకు భర్త.

తా :- ఆమె వినయమున నమస్కరించి లేచి నిలిచి చేతులు జోడించుచు, తన విషయ మంతటిని జెప్పి, ఆయయాతిని చూపి తండ్రీ వినుము నేనితనిని ఇంతవరకే వలచితిని గనుక నితడే నా భర్త యనెడు.

70.ఉ॥ 'ఈ విరి�c బోడిc గైకొను మి దేటికి సందియ' మంచుc గూరిమిన్
దేవర యానతిచ్చిన మదిం దలకించుచుc బెండ్లి యాడెడున్
రావల రాజు నన్నును దిరంబుగ సొంపునc బెంపుమీఱంcగాc
గావునc గూcతుcగా వలసి కాదన కీచను వీయcగాc దగున్ - 70

టీక : ఈ విరిబోడి గైకొనుము = ఈమెను స్వీకరించుము, ఇదేటికి సందియము = ఈ సందేహమెందులకు, అంచు = అనుచు, కూరిమిన్ = ప్రేమతో, దేవరయాన తిచ్చినన్ = మీరుసెలవిచ్చిన యెడల, మదిన్ = మనస్సున, తులకించుచు = సందేహము విడిచి ప్రకాశించుచు, పెండ్లియాడెడున్ = వివాహమగును, నన్నును, తిరంబుగ = గట్టిగా, రావలరాజు = ఈ రాజమన్మధుడు, సొంపునన్ = అందముగా, పెంపుమీరగాన్ = తన యొక్క గొప్ప తనము ప్రకట పడగా, కావున, కూతుగా వలసి = నీకు కూతురు గావలసిన దానను కనుక, కాదనక = కూడదనక, ఈచను వీయగా దగున్ = నాకు ఈ స్వాతంత్ర్య మీయవలెను.

తా :- తండ్రీ ! ఈ సంశయమెందుకు. ఈమెను పరిగ్రహింపుమని మీరు ప్రేమతో సెలవిచ్చిన యెడల ఈ మహారాజు తన గొప్పదనమునకు తగిన వైభవమున నన్ను వివాహ మాడగలడు కావున నేను నీ కూతురను కనుక కూతురుగా మీరు నాకు ఈచను వీయవలెను.

71.తే॥ 'ఇతని కీయక మదిలోన నెంచ నన్ను
నొరుల కొసఁగc దలంచిన నొకటి వినుము
తగనిపని యన కెన్ని చందములనైన
నొడలు దొఱcగుదు నిపుడు, నీయడుగు లాన !' - 71

టీక :- ఇతని కీయక = మీరు నన్ను యితనికి ఈయ నిష్టములేక, మదిలోన = మనసున, ఎంచన్ = ఏవేవో లెక్కించుచు, నన్ను ఒరులకొసగ దలంచినన్ = నన్ను ఇతరులకీయదలచి నట్లయిన, ఒకటి వినుము = ఒకటి చెప్పెదను వినుడు, తగని పని యనక = ఇది కూడదని తలచక, ఎన్నిచందములనైన ఎన్ని విధములుగానైన,

ఇపుడు = ఇపుడే నీయడుగులాన = నీపాదముల సాక్షిగా, ఒడలు తొఱగుదు = శరీరమును విడుతను.

తా :- ఓ తండ్రీ నీవున న్నితని కీయ మనస్సులో నితరుల కిచ్చుట కాలోచించు నట్లయిన ఒకమాట చెప్పెదను వినుము. నేను తగనిపని యనక - ఆత్మ హత్య మహాపాపమైనను ఎన్ని విధములగానైన ప్రయత్నించి, నీయడుగుల సాక్షిగా యిపుడే ఈ శరీరమును విడుతును.

విశే :- దమయంతిగూడ నలుడు తన దగ్గరకు దూతయై వచ్చి తన నెరిగించు కొన్నపుడామెయతనితో నేను నిన్నే వివాహమాడుదునని బ్రతిమాలి యతనిలో - నీవు దీనికొడంబడనినాడు రజ్జువిషాగ్నిజలంబులం బ్రాణపరిత్యాగం బుసేసికొందు (అ 6 - 2-48) నని పలికెను కనుక కన్యలకీ సంప్రదాయ మతిప్రాచీనము నుండి వచ్చు చున్నదేయనవలెను.

ఇటులే దుర్యోధనుడు తండ్రితో నీవు నేను పాండవులలో జూదమాడుటకిష్టపడవేని -

తే - దీనికోపబడు మొడబడవేనినేడ
యీక్షణమ సర్వభక్షుచే భక్షితుండ
నగుదుదెల్లమే నెట్లైన - సభా - 2 - 127

అని బెదిరించెను. ఈనాడు మన మంగపిల్లల పట్టుదలలు గూడ నిటులేయున్నవి.

72.కII అని తెగువఁ బలుకు కూఁతును
గనుఁగొని మదిలోనఁ గూర్మి గడలు కొనంగాఁ
దనరి యతఁ డియ్యకొనియెం
తన తలఁపున గచుని మాటఁ దలపోసి వెసన్, - 72

టీక :- అని తెగువ = అని సాహసమున, బలుకు కూతును = చెప్పుచున్న బిడ్డను, కనుగొని = చూచి, మదిలోన = మనస్సున, కూర్మిగడలు కొనంగా = ప్రేమనిండగా, తనరి = ఒప్పి, తన తలపున = తన మనస్సున, కచుని మాట తలపోసి = కచుని శాపము నాలోచించి, అతడు, ఇయ్యకొనియెన్ = అంగీకరించెను.

తా :- అని సాహసమున చెప్పుచున్న బిడ్డను చూచి శుక్రుడు మనస్సున ప్రేమనిండగా నామెకు కచుడు పెట్టిన శాపము నాలోచించి, యందుల కంగీకరించెను.

యయాతి దేవయానిం బెండ్లి యాడుటకు శుక్రాచార్యులు సమ్మతించుట

73.వ:- ఇట్లయ్యకొని రాకాసి యొజ్జ తన పజ్జనున్న యయాతిం
జూచి నీకు నిద్దేవయానిం జేకొనవచ్చు నని యొడం
బఱిచి యారాజునుం గూఁతును దోడ్కొని వీటికిం
జను దెంచు నప్పుడు వృషపర్వుం డెదురు వచ్చి
తన నగరు విడిది సేయుటకు నతండు - 73

టీక :- ఇట్లియ్యకొని = ఈ విధముగా నంగీకరించి, రాకాసియొజ్జ = దాన వాచార్యుడు, తన పజ్జనున్న = తన ప్రక్కనున్న, యయాతింజూచి, నీకు, నిద్దేవయానిఁ = ఈ దేవయానిని, చేకొని వచ్చునని = గ్రహింపవచ్చునని, ఒడంబఱిచి = ఒప్పించి, ఆ రాజుం గూతును. దోడ్కొని = ఆ రాజును, కూతురును వెంటగొని, వీటికిం జనుదెంచు నప్పుడు = పట్టణమునకు వచ్చునప్పుడు, వృషపర్వుం డెదురు వచ్చి, తన నగిరు = తన యొక్కకోట, విడిది సేయుటంబ = విదుబాటు సేయగా నతండు -

తా :- ఈవిధముగా శుక్రుడంగీకరించి యయాతితో నీవీమెను పరిగ్రహింప వచ్చునని తెలిపి వారిని వెంటగొని పట్టణమునకు రాగా వృషపర్వుడు వారికెదురుగా వచ్చి తోడ్కొని వెళ్లి తనయొక్క కోట వారికి విడుబాటు సేయగా నతడు -

74.సీ॥ పదియాఱు వన్నెల బంగారు నును జీవి
వని గడియార ముప్పరిగ గడచి
దురము లోఁ దెఱగంటి దొరను గెల్చిన నాఁటి
కతలు వ్రాసిన తొట్టికట్టు దాఁటి
రేరాచ ఱాలఁ గూర్చిన రచ్చ పట్టులో
రహిఁ బాడు పాటల రవలి యరసి
తలఁపు రానేల సంతన చేసినట్టి పెఱ
జగతిపై ముత్యాల చవికె యెదుటఁ

తే॥ దమ్మి కెంపులు గట్టిన తావులందు
వారువము నిల్పి, తనవెంట వచ్చినట్టి
మన్నెవారల ననుపుచు నున్న యెడను,
జెంత వృషపర్వుఁ డప్పుడు చేర నరిగి - 74

టీక :- పదియూరు వన్నెల బంగారు, నునుజీనిపని = పదారు వన్నెల బంగారముతో నిద్ధముగా చనిపనిచేసిన, గడియార ముప్పరిగ = గంటలు వాయించెడు మేడ అనగా మోసల, గడిచి = దాటి, ఆనాడు రాజుల హజారములలో ముఖశాలలో గంటలు కొట్టు చుండిరి. అపుడా గంటలు గొట్టువారు ఆగంట యందే యేపనులు చేయవలెనో తెలుపు శ్లోకములు లేదా పదములు గూడ చదువు చుండిరి. హో॥ పదుర్గం కృష్ణమాచార్యులవారు సమయామృత మను పేర నీగంటలు కొట్టుట కొాకకృతినే రచించిరి - దురములో = యుద్ధమున, తెరగంటి దొరను = ఇందుని, గెల్చిననాటి, కతలు వ్రాసిన, తొట్టికట్టుదాటి = కక్ష్య మరియు ప్రసాదములకు నడుమ నుండు అంతరాళ మండపము దాటి, రేజాచరాల గూర్చిన = చంద్రకాంత శిలలతో గట్టిన, రచ్చపట్టులో = రచ్చస్థానమున, రహిబాడు = అందముగా పాడునట్టి, పాటల రవలి యరసి = పాటల యొక్క ధ్వని విని; తలపురాల్ = చింతామణి రాళ్ళు తెల్లగా స్పటికము వలె నుండి చౌకపు పలకలుగా పగిలెడు ఒక రకపు రాయికి చింతామణి రాళ్లని దేశీయ వ్యవహారము - సంతన చేసినట్టి = తాపినట్టి, నేలఁ వెఁజగతిపై = పెద్ద యరుగుపై, ముత్యాల చవికె = ముత్యాలశాల, ఎరుట, తమ్మికెంపులు గట్టిన = పద్మరాగ మణులు కట్టిన, తావులందు, స్థలములందు, వారువము నిల్పి = గుఱ్ఱమును నిలిపి, తన వెంట వచ్చినట్టి, మన్నెవారలను = సామంతరాజులను, అనుపుచుఁ = తిరిగి పంపుచు, ఉన్నయెడను = ఉండగా, వృషపర్వు డప్పుడు, చెంతచేర నరిగి = ఆ యయాతిని సమీపించి.

తా :- పదారు వన్నెల బంగారముతో చీనిపని చేసిన గడియారపు శాలను దాటి -

వృషపర్వుడు ఇంద్రుని జయించినప్పటి చిత్రములు వ్రాసిన తొట్టికట్టు దాటి - మధ్యయుగపు రాజులు ఈ తొట్టికట్టులలో తమవేట చిత్రములు ఉంచుకొను చుండిరి - చంద్రకాంతపు రాళ్లతో కట్టిన రచ్చలపై పాటలు బాడెడు వారి పాటలు విని, చింతామణి రాళ్లు పరచిన నేలపై గల - పెద్ద యరుగుపై ముత్యాల చవికె ఎదురుగా పద్మ రాగములు పొదిగిన స్థలమున గుఱ్ఱమును నిల్పి ఆ యయాతి మహారాజు తన వెంట వచ్చిన సామంత రాజులను తిరిగి పంపునపుడు, వృషపర్వుడు సమీపమునకు వచ్చి,

75.మ:- పొలుపౌ కప్రకనంట్లు కస్తురి మెకంబుల్ మేలి జవ్వాది పి
ల్లులు రాచిల్కలు మానికంబులును జిల్గుల్ మంచి ముత్యాలపే
రులు పేల్ బోగవు రెంటెముల్ పసిఁడి తేరుల్ పల్లకుల్ లోనుగా
నులు పాచేసె యయాతికిం దలఁపులో నుప్పొంగుచుం గూర్మితోన్-75

టీక :- పొలుపౌ = అందమైన, కప్రపనంట్లు= కర్పూరపు అరటిచెట్లు. కస్తురి మెకంబుల్ = కస్తురి జింకలు, మేలి జవ్వాది పిల్లులు = శ్రేష్టమైనజ జవ్వాది పిల్లులు, రాచిల్కలు = రామచిలుకలు, మానికంబులును = మాణిక్యములు, జిల్గుల్ = సన్నని వస్త్రములు, మంచి ముత్యాల, పేరులు = దండలు, మేల్ = శ్రేష్టమైన, బోగపు రెంటెముల్ = అందముగల గుండ్రని టోపీలు, పసిడి తేరుల్ = బంగారు తేరులు, పల్లకుల్ = పల్లకీలు, లోనుగా = మొదలైనవి, తలపులో = మనస్సులో ఉప్పొంగుచుఁ = పొంగిపోవుచు, కూర్మితో = ప్రేమతో, ఉలుపాచేసె యయాతికిఁ = ఆయయాతి మహారాజునకు, కానుకలుగా నిచ్చెను.

తా :- వృషపర్వుడటుల వచ్చి, ఆయయాతి మహారాజునకు అందమైన కర్పూరపుటనటులు, కస్తూరి జింకలు, జవ్వాది పిల్లులు, రామచిలుకలు, మాణిక్యములు, సన్నని వస్త్రములు మంచి ముత్యముల దండలు, భోగపురెంటెములు, బంగారు తేరులు, పల్లకీలు మొదలైనవి సంతోషమున నుప్పొంగుచు కానుకగానిచ్చెను.

76.వ:- మఱియును - 76

టీక :- మఱియును = ఇంకను

77.సీ॥ జేజేల దొరప్రోలు చెఱవట్టి తెచ్చిన
పాలివోని యచ్చరపువ్వుఁ బోండ్లఁ
దామర చెలిపట్టి తావు గొల్లాడఁగాఁ
దగులు పడ్డట్టి యేనుఁగుల గముల
ననిగెల్చి నీటిరాయని వీడు చుఱాడి
వాలికై కొన్నట్టి వారువముల
నిగుడి జక్కుల ఱేని నెల్లవెల్ల దోఁచగాఁ
గలిగిన వేల్పు రాకంట సరులఁ

తే॥ గొల్లకొలఁదులు బంగారు కొలువుసాల
ముంగలను నిల్పి, మదిలోనఁ జెంగలించి,
చేరి కానుక చేసినఁ జిత్తగించి,
యడు గరలనంది, వృషపర్వు విడిది కనిపి - 77

టీక:- జేజేల దొరప్రోలు = ఇంద్రుని పట్టణము, చెరవటి తెచ్చిన, పొలిపోని = శీలముచెడని, అచ్చర పూవుబోండ్లఁ = అప్సరసలను, తామరల చెలిపట్టి = సూర్యుని కుమారుడైన యముని యొక్క, తావుకొల్లాడగా = స్థలమును దోచుకొనగా, తగులు పడినట్టి = దొరికినట్టి, ఏనుగుల గములు = ఏనుగుల గుంపులు, అని గెల్చి = యుద్ధమున గెల్చి, నీటిరాయుని వీడు = వరుణని పట్టణము, చూఱాడి = కొల్లగొట్టి, వాలి = పరాక్రమించి, గైకొన్నట్టి = తీసుకున్నట్టి, వారువములు = గుఱ్ఱములు, నిగిడి = విజృంభించి, జక్కులఱానిఁ = కుబేరుని, నిలువెల్ల దోచగా = అనగా నూచముట్టుగా కొల్లగొట్టగా, కలిగిన = లభించిన, వేల్పురా = మాణిక్యముల యొ క్క, కంటసరులు = కంఠాభరణములు = మాణిక్యము దేవలోకమున తప్ప మానవ లోకమున లేదని రత్నశాస్త్రము - కెట్ల కొలదులు, బంగారు కొలువుసాల = బంగారు సభామంటపము, ముంగలను నిల్పి = ముందర నుంచి మదిలోన చెంగలించి - మనస్సున చెలరేగి, చేరి = వృషపర్వుని సమీపించి, కానుక చేసిన = కానుకలుగా నీయగా, చిత్తగించి = అంగీకరించి, ఉడుగరలనంది = ఆకానుకలు తీసికొని, వృషపర్వుఁ = వృషపర్వుని, విడిదికనిపి = తననివాసమునకు పంపి-

తా :- స్వర్గమును కొల్లగొట్టి అచ్చటినుండి చెరపట్టి తెచ్చిన అప్సరసలను సంయమనీ నగరము ముట్టడించి కొనివచ్చిన ఏనుగులను, వరుణ నగరము నుండి తెచ్చిన గుఱ్ఱములను, అలకాపట్టణము నుండి కొని వచ్చిన మాణిక్యాభరణములను తన బంగారు సభామంటపము యొక్క ఎదురుగా నుంచి మనస్సున పొంగిపోవుచు యయాతి మహారాజునకు వానిని కానుక సేయగా నవి స్వీకరించి వృషపర్వుని అతని మేడకు పంపి -

''అలం - ఉదాత్తము''

78.క॥ తేజీ డిగి తనయంతటి
రాజులు మేలప్ప యనుచు రాఁగాఁజని తాఁ
దేజునను మేడలోపలి
జాజుల చప్పరములో నెసంగుచు నుండెన్ - 78

టీక :- తేజీదిగి = గుఱ్ఱమును దిగి, తనయంతటి రాజులు = తనతో సమానమైన ప్రభువులు, మేలప్ప యనుచు = అప్పామేలు అని పొగుడుచు, రాగాజని = వెంటవచ్చు చుండగా వెళ్లి, తా = తాను, తేజానను = తన యొక్క దర్పముతో, మేడ లోపలి, జాజులు చప్పరములో = జాజిపూవుల చపారమున ఎసంగుచునుండెన్ = ఒప్పుచుండెను.

తా :- యయాతి మహారాజు వృషపర్వుడిచ్చిన కానుకలు స్వీకరించి, గుఱ్ఱమును దిగి తనతో సమానమైన ప్రభువులు అప్పామేలుమేలని పొగడుచు వెంట వచ్చుచుండగా దర్పముతో మేడలోపలికి వెళ్లి యచట నొక జాజి పూవుల చప్పరమున నిలిచెను.

నగరాలంకారము

79.తే॥ అంతరక్కసి యొజ్జ దానాన తిచ్చి
పంప వృషపర్వుఁ డప్పుడు సొంపు మెఱయఁ
బలు దెఱంగులఁ దనవారు పత్యె కాంఁడ్ర
చెలువు మీఱంగ వీడు గైసేయఁ బనుప - 79

టీక :- అంతరక్కసి యొజ్జ = అపుడు దానవాచార్యుడైన శుక్రుడు, తానా నతిచ్చిపంపఁగ = తాను ఆజ్ఞాపించి పంపగా, వృషపర్వుడప్పుడు = అప్పుడు వృషపర్వుడు, సొంపుమెరయు, అందమొలుకునట్లుగా, పలుతెఱంగుల = పలువిధములైన, తనవారు పత్తెగాంఁడ్ర = తనయొక్క ఉద్యోగస్థులను, చెలువు మీరంగ = శృంగారము మీరునట్లుగా, వీడు = పట్టణము, కైసేయబనువ = అలంకరించుటకు పంపగా -

తా :- అపుడు శుక్రాచార్యుడు ఆజ్ఞాపించి పంపగా వృషపర్వుడు తన యాస్థానమందలి వివిధములైన యుద్యోగులను, అనగా పనివారి ననుట - పట్టణమును అందము మించునట్లుగా నలంకరించుటకు పంపగా -

80.చ॥ అలవలరాజు చేతి యలరమ్ము లనందగు టేమి, చెల్వపుం
బొలతుల మోము దామరలఁ బోలని సిగ్గున వీఁగి పెక్కు రూ
పులఁ జని వారి వాకిళుల పొంతలఁ జేరిన నిండు జందమా
మలవలె మీఱెరంగు లలమం దొగగోరణముల్ బెడంగులై - 80

టీక : అల = ఆయొక్క, వరరాజు చేతి = మన్మధుని చేతిలోని, అలరమ్ము లనందగుటేమి = పూలబాణములనుటే యేమి, చెల్వపుంబొలతుల మోము = అందమైన యువతుల యొక్క ముఖములను, తామర బోలని = పద్మములను పోలని, సిగ్గునవీగి = లజ్జతో వెనుకకు తగ్గి, పెక్కురూపుల = అనేక రూపములు ధరించి, కలవారి వాకిళుల = ధనవంతులైన వారి వాకింఢ్ల, పొంతలజేరిన = సమీపమున చేరిన, నిండు చందమామల వలె, తొగ తోరణముల్ = కలువతోరణములు, బెడంగులై = అందమైనవై, రంగులల వంగ = తమకాంతులంతటను వ్యాపించుచుండగా, మీరెఁ = ప్రకాశించెను.

తా :- అపుడు కలవారి వాకింఢ్లలో కట్టిన కలువ తోరణములు, మన్మధుని చేతిలోని బాణములనుటే యేమి, ఆపట్టణమందలి యందగత్తెల మోములను పోలలేక సిగ్గుతో వెనుకబడి యనేక రూప ములు ధరించి ధనవంతులైన వారి వాకింఢ్ల సమీపమున జేరిన చందమామలవలె ప్రకాశించు చుండెను.

''అలం - ఉపమ''

81.కII గందపు మ్రాఁకుల కురుఁజుల
నందులనుం బూల చలువ చప్పరములు గాఁ
బొందింపఁ గ్రమ్ము చీఁకటి
మందటిలెఁ మేలుకట్టు మానికముల చేన్ - 81

టీక :- గందపు మ్రాకులు = చందన వృక్షములను, కురుజల సందులనుఁ = మొగముల సందున, పూలపూవులయొక్క, చలువ చప్పరములుగా = చలువ గుణములుగా, పొందింపఁ = అమర్చగా, క్రమ్ము చీకటి = అలమిన చీకటి, మేలు కట్టు = పైకప్పునకు కట్టు చాందినీ యొక్క, మానికములచేఁ = మాణిక్యములతో, మందటిలెఁ = మందగించెను.

తా :- పూలతో కట్టెడి చలువ పచ్చరములకు గందపు మాకులను మొగురముల సందులందమర్చగా కలిగిన చీకటి ఆచప్పరములలో గట్టిన చాందినీలయొక్క మాణిక్యకాంతులతో మందగించెను.

82.సీ॥ ఏదారిc జూచిన మేదించి జవ్వాది
బురదతో గోడలు పూయువారు
నేతావుc జూచినc బ్రాతఱా లూడ్చి నె
త్తమ్మి కెంపుల గనెన్ దాల్చువారు
నేవీదిc జూచినc దావు లుప్పొంగcగా
విరులచేc బందిళ్ళు వేయువారు
నేతిన్నెc జూచిన నించుమిం చగుపట్ల
నించి కప్రంబు గ్రమ్మించువారు
తే॥ నెచటc జూచిన నాణిగా నేర్పరించి
పెద్ద ముత్యాల ముగ్గులు పెట్టువారు
నెందుc బొగడపు మేరువు లెత్తువారు
నైరి వీటను గలిగిన వారలెల్ల - 82

టీక :- వీటను గలిగిన వారలెల్ల = ఆపట్టణమందుండెడి వారందరు, ఏదారి జూచిన = ఏబాటలో చూచినను, మేదించిజవ్వాది = జవ్వాది మెత్తగా కలిపి, బురదతో = ఆయసలుతో, గోడలు పూయువారు, ఏతావు జూచిన = ఎక్కడ జూచినను, ప్రాతరాలూడ్చి = పాతబడిన రాళ్లతీసి, నెత్తమ్మికెంపుల = నిండుతనముగల పద్మరాగముల యొక్క, గనెc = గన్ను వ్రేటు, రాళ్ల = అనగా శిలాఖండములు, తాల్చువారు = తాపించువారు, ఏవీథి జూచిన = ఏబజారు చూచినను, తావులు ప్పొంగగా = పరిమళములు పొందుచుండగా, విరులచే = పూవులతో, పందిళ్లవేయువారు, ఏతిన్నె జూచినc = ఏయరుగును చూచినను, ఇంచు మించగుపట్ల = గుంతమిట్టమైన చోట, నించికప్రంబు = కర్పూరమునించి, క్రమ్మించువారు = దానిని క్రమ్ముకొని పోవునట్లు చేసెడు వారు, ఎచట జూచిన = ఎక్కడ చూచిన, ఆణిగా నేర్పరచి = మేలైనవిగా వేరు చేసి, పెద్దముత్యాల ముగ్గులు = పెద్దపెద్దగా ముత్యముల ముగ్గులు పెట్టువారు, ఎందు = ఎక్కడ చూచినను, పగడపు మేరువులు=పగడముల యొక్క సారువలు, ఎత్తువారలైరి =ఎత్తెడు వారలైరి.

తా :- ఆపట్టణమున గల వారందరు ఏదారియందు చూచినను, జవ్వాదిని మెత్తగా కలిపి ఆయలుకులో గోడలు పూయువారు, ఎక్కడ జూచినను తమ ఇండ్లకు పాత రాళ్ళను తొలగించి యచట నూతనమైన పద్మరాగపు గనేటుల నమర్చువారు, ఏవీధిలో చూచినను వాసనలు గుబాళించగా పూవులతో పందిరులు వేయువారు,

యేయరుగును చూచినను దాని ఎత్తుపల్లములను కర్పూరపు పొడితో కమ్ముకొని పోవు నట్లు చేయువారు, ఏవాకిలి చూచినను పెద్దపెద్దగా ముత్యాల ముగ్గులు పెట్టువారు, ఎక్కడ చూచినను పగడపు సోకువ లెత్తు వారలై కనిపించిరి.

విశే :- పూర్వము దొరల జాగీర్దారుల కాలమున వారి యిండ్లలో పెండ్లి పేరంటములు జరుగునపుడు తమగ్రామములలోని వీధులని తిరిగి చూచి ఆయాస్థలములందలి మొరుకులు కూలిపడిన భాగములు బాగుచేయించి గ్రామమంతయు నలంకరింపించుచుండిరి. కావున తెలగన్నతన నాటి యాసంప్రదాయము నిందు ప్రదర్శించెను.

83.వ:- అప్పుడు

దేవయాని వివాహసన్నాహము

84.ఉ॥ ఎల్లియ, సోఁకుబొజ్జ యతఁ డేపునఁ జేయును గూఁతు పెండ్లి, యం
చల్లన పైఁడి పళ్లెరము లందును గందము బూలుఁ బచ్చఁ బ్రాల్
పెల్లుగ నించి, పొల్తుకలు పేరఁటముల్ దగఁ జెప్పి, వీటిలో
నెల్లెడఁ ద్రిమ్మరం దొడఁగి రింపుగ వాయిదముల్ చెలంగఁగన్ - 84

టీక :- పొల్తుకల్ = స్త్రీలు, ఎల్లియ = రేపే, సోకుటొజ్జ = శుక్రుడు, అతడు, ఏపున జేయును కూతుపెండ్లియంచు = గొప్పగా కూతురు పెండ్లి చేయునని యనుచు, అల్లనఁ = మెల్లగా, పైడిపళ్లెరములందును = బంగారుపళ్లెరములతో గందము, పూలు, పచ్చబ్రాల్ = పసుపు బియ్యము, పెల్లుగనించి = మిక్కిలిగా నించుకొని, వీటిలో = పట్టణమున, ఇంపుగ వాయిదముల్ చెలంగగఁ = వినసొంపుగా వాయిద్యములు మ్రోగుచుండగా, ఎల్లెడ దిమ్మరం దొడగి = అంతట తిరుగసాగి పేరంటముల్ తగజెప్పిరి. తగిన రీతిలో పేరంటములు చెప్పిరి.

తా :- ముత్తయిదువలు బంగరు పళ్లెరములు తీసికొని వాని యందు గంధము, పూలు, పసుపు బియ్యముంచుకొని పట్టణమున మంగళ వాద్యములు మ్రోగుచుండగా నిల్లిల్లు తిరిగి శుక్రుడు రేపే తన కూతురికి వివాహము చేయునని పేరంటములు చెప్పిరి.

85.మ:- వరుసన్ శుక్రుఁడు నాఁడు వేగఁ, దన చెల్వన్ జూచి, యీకన్నెకున్
దొరయౌ రూపును బాయముం గలిగి చెన్నుం గల్గు నీనేల ఱేఁ
డరుదై కల్గెఁ దలంచినట్లు, యెడ సేయం బోలునే, యింకనే
ర్పరులౌ కొమ్మలఁ బంపుమా తగుపనుల్ గావింప రాణింపఁగన్ - 85

టీక :- వరుసన్ = క్రమముగా శుక్రుడు, నాడు = ఆనాడు, వేగన్ = తెల్లవారగనే/ వెంటనే, తనచెల్వన్ జూచి - తనభార్యమైన జయంతిని చూచి ఈ కన్నెకున్ - ఈమెకు, దొరయౌ = సమానమగు, రూపును, ప్రాయమున్ = వయసును కలిగి, చెన్నుంగలుగు = అందముకలిగిన, నీ నెల రేడు = ఈ మహారాజు, తలంచినట్లు = మనమూహించని యట్లు, అరుదైకల్గె = అపురూపముగా లభించెను, ఇంక నెడసేయం బోలునే = ఇంకాలస్యము చేయవచ్చునా, తగుపనుల్ = తగినట్టి పనులు, రాణింపగావింపన్ = చక్కగాసేయుటకు, నేర్పరులౌ కొమ్మలబంపుమా = నిపుణులైన స్త్రీలను పంపుము.

తా :- శుక్రుడానాడు తెల్లవారగనే తనభార్యయైన జయంతితో ఈకన్నెకు సాటియై ఈడుజోడు మరియు రూపము గల మహారాజు మన మూహించకుండగనే అరుదుగా లభించినాడు కనుక నిక ఆలస్యమెందులకు వివాహకృత్యములు చక్కగా చేయునట్లు నేర్పరులైన స్త్రీలను నియమింపుము.

86.క॥ వివరింప నెడము లేదిఁక
నువిదకు సోబనపు జలక మొనరింపగా
జవరాండ్ర, బనుపు మనవుడుఁ
బువుఁ బోఁడియు నలరి తగిన పొలఁతులఁబనిచెన్ - 86

టీక :- వివరింపన్ = నీకు వివరించి చెప్పుటకు, ఎడము లేదిక = వ్యవధి లేదు. ఉవిదను = యువతికి, సోబనపు జలక మొనరింపగా = మంగళస్నానము చేయించుటకు, జవరాండ్ర బనుపుము = యువతులను బంపుము, అనవుడు = అనగా, పువుబోడియు = ఆమె, అలరి = సంతసించి, తగిన పోలతుల = తగినట్టి స్త్రీలను. పంచెన్ = ఏర్పరచెను.

తా :- ఓసీ! నీకు అన్ని వివరించుట కిపుడు సమయము చాలదు. దేవయానకు మంగళ స్నానము చేయించుటకై తగిన యువతులను పంపుమనగా నామె సంతోషించి యందులకు తగిన వారి నేర్పరచెను.

87.కః పనిచినఁ గొందఱు నెలఁతలు
ననిచిన సంతసము తోడ నగవు దొలంకం
జని యుదిరిపైఁడి కళుకుల
పని మెరవడి నలరు గరుడపచ్చల చవికెన్ - 87

టీక :- అని పనిచిన = అనిపంపగా, కొందరు నెలతలు = కొందరు స్త్రీలు, అనిచినఁ = పంపగా, సంతసముతోడ = సంతోషముతోడ, నగవు తొలకఁజని = చిరునవ్వు పెదవులపై తొలుకుచుండగావెళ్లి, ఉదిరిపైడి = మేలిమి బంగారము, యొక్క కులుకుల పని మెరవడి = మెరుగు పనియొక్క ప్రకాశమున, అలరు= ఒప్పునట్టి, గరుడపచ్చల చవికెఁ = గరుడ పచ్చల యొక్క చవికెలో.

తా :- జయంతీదేవి యటుల బంపగా కొందరు యువతులు సంతోషమున వెళ్ళి మేలిమి బంగారము యొక్క కళకుల పనితనము గల గరుడ పచ్చల చవికెలో.

88.చః కలికి యొకర్తు చేఁదుడువఁ, గస్తురిచే నరఁ గల్కి నొక్కపై
దలి, యొకకొమ్మ ముత్తెములు దార్చెను ముగ్గుగ, నోర్తుపెట్టెఁగెం
పులపని పెండ్లి పీఁట, యొక బోటియు బంగరు చేలవైచె, నో
ర్తులలిని దేవయానిఁ దగఁ దోడ్కొని వచ్చెను వేడ్కతోవెసన్ - 88

టీక :- కలికి యొకర్తు = ఒసుందరి, చేదుడువ = చేతితో తుడువగా ఒక్కపైదలి = ఒక యువతి, కస్తురిచే నరగల్కి = కస్తూరితో అరుగు అలికెను. ఒక్కకొమ్మ = ఒక యువతి, ముత్తెములు ముగ్గుగా బెట్టెను. నొర్తుబెట్టె, కెంపుల పని పెండ్లిపీట = ఒకతెకెంపులు తాపిన పెండ్లిపీటను తెచ్చిపెట్టెను, ఒకబోటియు బంగరు చేలవైచె = ఒకతె దానిపై బంగారు వస్త్రము పరచెను, ఓర్తు = ఒకతె, లలిని = ఒప్పునట్లుగా, దేవయానిఁ, వేడ్కతో = సంతోషమున, తగఁ = తగి నట్లుగా, వెసఁ = వేగముగా, తోడ్కొని వచ్చెఁ = తోలుక వచ్చెను.

తా:- ఆగరుడ పచ్చల చవికెలో గల యరుగును ఒక సుందరి చేతితో తుడువగా ఒకామె దానిని కస్తూరితో నలికెను. ఒకామె ముత్తెముల ముగ్గు బెట్టెను. వేరొకతె యచట కెంపులు తాపిన పెండ్లిపీట తెచ్చిపెట్టెను. ఇంకొకామె దానిపై బంగారు బట్ట పరిచెను. అపుడు మరియొకతె సంతోషమున వేగముగా దేవయానిని కొని వచ్చెను.

"అలం - సముచ్చయము"

89.సీ॥ కొప్పు మెల్లన విచ్చి కురులు చిక్కొడలించి
తలయంటె నేర్పుతోఁ బొలఁతి యొర్తు
పసుపుతోఁ గూడఁ గప్రము చాలమేదించి
నలుఁగు పెట్టెను గూర్మి మెలఁత యొర్తు
మించి తావులుగ్రమ్ము మంచి గందమ్మున
నటకలి యిడియెఁ దొయ్యలి యొకర్తు
బంగారు బిందెలఁ బన్నీరుగుల్కుచు
జలక మార్చిరి కొంద లలరుఁ బోండ్లు
తే॥ వలిప పావడఁ దడియొత్తెఁ జెలి యొకర్తు
కదిసి చెంగావి దువ్వల్వగట్టె నొకతె
నెఱులు నేర్పునఁ దడియార్చె నెలఁత యొర్తు
చెలఁగి జాజులు వేనలిఁ జెరివెనొకతె - 89

టీక :- పొలితి యొకర్తు = ఒక యువతి, కొప్పుమెల్లన విచ్చి = వెంట్రుకల ముడిని చిన్నగా విచ్చి, కురులు చిక్కొడలించి = వెంట్రుకలు చిక్కుదీసి, నేర్పుతో తలయంటెను, మెలత యొర్తు = ఒక యువతి, పసుపుతో గూడ కప్రము చాలమేదించి = కర్పూరము చక్కగా కలిపి, కూర్మిౖ = ప్రేమతో, నలుగుపెట్టై, తొయ్యాలు యొకర్తు = ఒక యువతి, మించి తావులు గ్రమ్మ = మిక్కిలిగా పరిమళించు, మంచి గందమ్మున, అటకలియిడియెను = జిడ్డుపోవు పిండి (నలుగు) పెట్టెను, బంగారు బిందెలౖ = బంగారు బిందెలతో, పన్నీరు చిల్కుచు = పన్నీరు చల్లుచు, కొందరలరు బోండ్లు = కొందరు యువతులు, జలకమార్చిరి = స్నానమాడించిరి, చెలియొకర్తు = ఒకచెలి, వలపపావడౖ = సన్నని పావడతో, తడియొత్తె = శరీరము తుడిచెను - పన్నీటిలో స్నానమాడిన పిమ్మట అనగా సుగంధ జలములతో స్నానమాడిన పిమ్మట, శరీరమును గుడ్డతో తడి పోవునట్లు ఒత్తుకొనవలెను. తుడుచుకోరాదు. తుడుచుకొనిన యెడల శరీరమున కంటిన ఆపరిమళము పోవును. కదిసి = సమీపించి, చెంగావి దువ్వలువ = చెంగావి, (చెన్ను+కావి) అనగా నారింజరంగు చలువచీర, కట్టెనొకతె = ఒకటె కట్టించెను, నెఱులు = పొడవైన వెంట్రుకలు, నేర్పునౖ = నిపుణతతో, నెలత యొర్తు = ఒక యువతి, తడియార్చెను, చెలగి = ఆనందమున నుల్లసిల్లి, ఒకతె, జాజులు వెనలి చెరివె = జాజిపూలు కొప్పున తురిమెను.

తా :- ఒకతె దేవయానకు మెల్లగా ముడివిప్పి నేర్పుతో వెంట్రుకల చిక్కు పాపెను. ఒకతె పసుపుతో కర్పూరము మెత్తగా కలిపి నలుగు పెట్టెను. ఒకతె మంచి గంధముతో కలిపి యట కలిపెట్టెను. కొందరు బంగారు బిందెలతో జలకమాడించిరి. పిమ్మట వేరొకతె సన్నని పావడతో తడియొత్తెను. ఒకతె చెంగావి చీర కట్టించెను. ఒకతె పొడవైన వెంట్రుక లార్చెను. మరియొకతె వెంట్రుకల ముడిలో జాజులు తురిమెను.

''అలం - సముచ్చయము ''

90.సీ॥ మట్టెలు పిల్లాండ్లు మఱి వీర మద్దియ
లెలమిని దొడిగెఁ దొయ్యలి యొకర్తు
గంటలు మొలనూలు కడిఁది యొడ్డాణంబు
నుంగరంబులు వెట్టె నువిద యోర్తు
ముత్యాల పేరులు మొగపుఁ దీఁగెయు బన్న
సరములు గీలించె జాణ యోర్తు
పచ్చలకడియముల్ బంగారు గాజులుఁ
బదకముల్ సవరించె ముదిత యోర్తు
తే॥ తమ్మి కెంపుల పంజుల కమ్మదోయి
చేరు చుక్కయు ముంగర చెవుల పువులు
బవిరలును గొప్పు వలయును బడఁతి యోర్తు
దిద్దెఁ, గస్తురి నామంబు దీర్చెనోర్తు - 90

టీక :- తొయ్యలి = యొకర్తు, మట్టెలు = కాలి రెండవ వ్రేలి ఉంగరములు, పిల్లాండ్లు = మూడవవ్రేలికి తొడుగు నాకులు, వీరమద్దియల్ = వీరముద్రికలు, ఇవి బొటన వ్రేలికి తొడుగుదురు. ఎలిమిని దొడిగెను = ప్రేమతో కాలివ్రేళ్లకు తొడిగెను, ఉవిదయోర్తు = ఒక యువతి, గంటల మొలనూలు = గంటలుగల రశన, కడిది యొడ్డాణంబు = గొప్పదైన వడ్డాణము - ఒడ్డాణమునడుమునకు, మొలనూలు జఘనమునకు ధరింతురు- మరియు, ఉంగరంబులు = అంగుళీయకములు, పెట్టె = ధరింపజేసెను. ముత్యాలపేరులు = ముత్యాలదండలు, మొగపు తీగయు = ముఖముగల తీగె - తీగెయను నగలో మొగపుతీగె - సామాన్యమైన తీగెయని రెండుభేదములుండును మొగపు తీగకు ముఖమునకు రెండువైపుల పూవులు, పత్తికాయ లుండును. బన్నసరములు = కట్లదండలు, కీలించె = ధరింప జేసెను.

ముదిత యోర్తు = ఒకతె, పచ్చల కడియముల్ = బంగారు గాజులు, పదకముల్ = మతకములు, సవరించె = ధరింపజేసెను. కడియముగా జగుట అను సామెత దీనియందున్నది. కడియములు చేతులకు ముందుండును. గాజులు దాని వెనుక యుండును. కనుక కడియము గాజగుట యనగా వెనుక బట్టుట రివాజు. కడియమగుట యనగా వెనుకనున్నది ముందునకు వచ్చుటయని తాత్పర్యము – పడతి యొకర్తు = ఒకతి, తమ్మికెంపుల = పద్మరాగముల యొక్క, పంజాల కమ్మదోయి = పంజాల కమ్మలు – కమ్మలనగా చెలి యాకులు, వీని నిర్మాణమున ననేక భేదము లున్నవి – చేరుచుక్క = పాపెటచేరు, ముంగర = ముక్కర, చెవులపువులు, కమ్మలు, పంజాలకమ్మలు, చెవుల పువులు రెండు ఒకటే – వ్యక్తులవర్ణనలలో ఎంతో క్రమమెరిగిన వాడు ఇతడిక్కడ ఎట్లు పొరవడెనో తెలియదు – బవిరలును, కొప్పువలయును, దిద్దె = తీరెను, ఓర్తు, కస్తూరి నామంబు తీర్చె = కస్తూరి నామము పెట్టెను.

తా :- ఒకతె దేవయానకు వీరమద్దెలు, మెట్టెలు, పిల్లాణులు, తొడిగెను. ఒకతె శింజినీరశన, వడ్డాణము, ఉంగరములు పెట్టెను. ఒకతె ముత్యాలపేరులు బన్నసరము, మొగపు తీగె ధరింపజేసెను. ఒకతె పచ్చల కడియాలు, బంగారు గాజులు, పతకములు ధరింపజేసెను. ఒకతె కెంపుల కమ్మలు, చేర్చుక్క, మూగర, చెవులపూలు, బవిరెలు, కొప్పువల, సవరించెను. ఒకామె కస్తూరి నామము దిద్దెను.

విశే :- ఈకావ్యమున తెలగన వ్యక్తుల వర్ణనను, పాదాది శిరః పర్యంతము, కేశాదిపాద పర్యంతము అను రెండు పద్ధతులవలంబించి వానిని క్రమము తప్పకుండ చెప్పుటలో తనయొక్క యౌచిత్య దృష్టిని వెలార్చెను. ఈపద్యమున దేవయానిని పాదాది శిరః పర్యంతము చూపెను. మొదటిసారిగా నామెను యయాతి యుద్ధరించి నపుడు కేశాది పాదపర్యంతము చూపెను.

ఇందు మరియొక విశేషమేమన గురువులకు నడికట్టు కట్టుకొని నమస్కరించుట, కస్తూరి నామము దిద్దుకొనుట ఈ రెండు వైష్ణవులకు, అందును కస్తురినామము శ్రీరంగనిది కనుక తెంగలశాఖ వారికి ముఖ్యమైనది కనుక నివి కవిపై మరిగింటి యప్పలాచార్యుల వారి ప్రభావమును చూపును.

91.కII పొలఁతి మొగముఁ బోలుదు నని
మలయంగా నిండుఁ జందమామనువడిఁ దొ
య్యలి కడకుఁ బట్టి తెచ్చెనొ
యలరుచు నన నొకతె నిలువుటద్దము నిలిపెన్ - 91

టీక :- పొలతి మొగము పోలుదునని = ఆమె ముఖమునకు సాటివత్తునని, మలయంగాఁ = గర్వించుచుండగా, నిండు చందమామను = పూర్ణచంద్రుని, వడిఁ = వేగముగా, తొయ్యాలి కడకు = ఆదేవయాని దగ్గరకు, పట్టితెచ్చెనొ, అలరుచుననఁ =సంతోషించుచు ననగా, ఒకతె, నిలువు టద్దము నిలిపెన్ = నిలువుటద్దము నిలిపెను.

తా :- ఒక తెనేను దేవయాన ముఖమును పోలుదునని గర్వించు చుండగా నిండు చంద్రుని పట్టి తెచ్చి నట్లుగా నిలువు టద్దమును తెచ్చినిలిపెను.

విశే :- ఇందు నిండు చంద్రుడు గుండ్రము, నిలువుటద్దము దీర్ఘచతురస్రము కనుక నీయుపమానము చింత్యము.

''అలం - ఉత్ప్రేక్ష''

92.క:- కారు మెఱుంగన, మరుదే
వేరియుఁ దా ననఁగఁ, బైఁడి విరి దండన, బం
గారపు బొమ్మనఁగా, సిం
గారంబున దేవయాని కడుఁ జెలు వొందెన్ - 92

టీక :- కారుమెఱుంగున = తొలుకారు మెరుపుతీగ యనగా, మరుదేవేరియు = మన్మథుని భార్యయైన రతీదేవి, తాననగ, పైడివిరిదండన = బంగారపు పూల దండయనగా, బంగారపు బొమ్మనగా, దేవయాని, సింగారంబున, కడు = మిక్కిలి, చెలువొందెఁ = ప్రకాశించెను.

తా :- దేవయాని అపుడు తొలుకారు మెరుగనగ, మన్మథుని రాణియనగా, బంగారపు పూలదండ యనగా, బంగారు బొమ్మనగా మిక్కిలి ప్రకాశించెను.

''అలం - మాలోపమ''

ఉపమానములు ఒకటి కన్న నెక్కువగా కూర్చిన యెడల మాలోపమయన బడును.

93.వ:- అంతనక్కడ

టీక :- అంతనక్కడ = ఆసమయమున నచట,

94. సీ॥ పచ్చల వని నొప్పు పైఁడి ముక్కాలిపీఁట
యుడియె వేడుకతోడ నింతి యొకతె
కై దండ లిచ్చి రాకలువ రాయనిఁ దెచ్చి
యందు మీఁదట నుంచె నలివ యోర్తు
సవ తెచ్చటను లేని చౌకట్టు పోఁగులు
తిగిచెఁ గొల్కు లెడల్చి మగువ యోర్తు
కడుమించు డాకేల గండ పెండేరంబు
మెల్లన వదలించె మెలఁత యొకతె

తే॥ వచ్చి సిక జాజిసరములు విచ్చె నొకతె
కంట సరులును ముత్యాలకడియములును
బదకములు లోనుగాఁ గల బలుపు సొమ్ము
లొయ్య నొయ్యన సడలించె నువిద యోర్తు - 94

టీక :- ఇంతి యొకతె = ఒకస్త్రీ, పచ్చల పనినొప్పు= పచ్చలతో తీర్చిన, పైడిముక్కాలిపీట = బంగారు ముక్కాలిపీట, యుడియె వేడుక తోడ = వేడుకతో పెట్టెను, అలివ యోర్తు = ఒక సందరికై దండనిచ్చి = చేతిని ఊతగా నిచ్చి, రాకలువ రాయని దెచ్చి= రాజచంద్రుని తీసుకుని వచ్చి, అందు మీదట = ఆబంగారు పీటపై, ఉంచె = ఉంచెను, మగువయోర్తు = ఒకయువతి, సవతెచ్చటను లేని = ఎక్కడగూడ సాటిలేని, చౌకట్టు పోగులు, కొల్కులెదల్చి = కొలుకులు సడలించి, తిగిచె = తీసెను, నెలతయొకతె = ఒక యువతి, డాకేలన్ = ఎడమ కాలికి, కడుమించు = మిక్కిలి ప్రకాశించు, గండపెండేరంబు, మెల్లన, సడలించె = వదులుచేసి తీసెను. గండపెండేరము ఎడమకాలి కుండు ననుటకు వదలక వామపాదమున - ఒకతె వచ్చి, సికన్ = వెంట్రుకలముడికిగల, జాజి సరయులు = జాజి పూల దండలు, విచ్చె = విచ్చెను, ఉవిద యోర్తు = ఒక యువతి, కంటసరులు = మెడలోని దండలు, ముత్యాల కడియములును, పదకములును = పతకములు, లోనుగాగల = మొదలైన, బలుపు సొమ్ములు = మిక్కిలినగలు, బయ్యనొయ్యనన్ = క్రమక్రమముగా, సడలించె = వదిలించి తీసెను.

తా :- అపుడక్కడ ఒక యింతి పచ్చలపని చేసిన ముక్కాలిపీటను పెట్టెను. వేరొకతె కైదండతో యయాతిని కొనివచ్చి దానిపై కూర్చుండ బెట్టెను. అపుడు ఒక యువతి కాలుకులు సడలించి చెవులకుగల ముత్యాల చౌకట్లు తీసెను. వేరొకతె ఎడమకాలికి గల గండపెండేరము తీసెను. ఒకతె వచ్చి సిగముడికిగల జాజులు విచ్చెను. వేరొకతె క్రమక్రమముగా మెడలోని దండలు ముత్యాల కడియములు, పతకములు, మొదలైనవి సొమ్ములన్ని తీసెను.

95.కII నెలవంటి మొగము చెమ్మట
మొలకలఁ దగఁ, గౌను వణఁక, ముంగురు లాడన్
దలయంటె నొకతె ఱేనికిఁ
గలపంబునఁ జేసి తావిగట్టిన నూనెన్ - 95

టీక :- ఒకతె ఱేనికి = ఆమహారాజునకు, కలపంబున జేసి = పరిమళ గంధములతో, తావిగట్టిన నూనెన్ = పరిమళము వచ్చునటుల చేసిన నూనెతో - నూనెకు తావిగట్టుట ఆనాడు కలవారి యిండ్లలో నుండెడి యొక విద్య దానిని వారు పూలనూనె యనుచుండిరి. నెల వంటి మొగము = చంద్రుని వంటి ముఖము, చెమ్మట మొలకల తగన్ = చిరు చెమట బిందువులతో నొప్పు చుండగా, కౌనువణక = నడుము వడకు చుండగా, ముంగురు లాడన్ = అలకలునుదుటిపై కదులు చుండగా, తలయంటెన్ = తలయంటెను.

తా :- ఒకర్తె ఆమహారాజునకు చంద్రుని వంటి ముఖముపై చిరు చెమట బిందువులు పట్టుచుండగా నడుము వణకు చుండగా ముంగురులు నుదుటిపై యాడుచుండగా గందముతో తావిగట్టిన నూనెతో తలయంటెను.

''అలం - స్వభావోక్తి ''

నూనె కు తావి గట్టుట -

పరిమళ కారకవిద్య హిందువులకు కొత్తకాదు. దీనిని గంధయుక్తి పేర అరువది నాలుగు కళలలో నొకటిగా నెన్నబడినది. వాత్స్యాయ నుడిది, చతుష్షష్టి కళలలో పదునెనిమిదిగా భోజుడు పన్నెండవదిగా పేర్కొనిరి. చూ.సం. ప.కోపు2.50

1. గులాబీరేకులు, నిమ్మగడ్డి, కాసెపూత, మంచిగందపు చెక్క పొట్టు వీని నుండి వాసన నూనెలను తయారు చేయువచ్చును. ఏ పరిమళము కావలసిన

వారావస్తువులను ఏవాసన లేని శుభ్రమైన అలీవ్ నూనెలో వేసి దానిని బట్టి ద్వారా మరగబెట్టి ఆయావిరి నొక గొట్టము ద్వారా వేరేపాత్రలోనికి పట్టిన యెడల అది చల్లారి పరిమళ తైలమగును.

2. బట్టీగా కాకుండా పై వలెనే పరిమళ వస్తువుల నానూనెలో వేసి బాగుగా మరిగించి దించి గట్టిగా మూత యుంచి దానినటులే 15 దినములుంచి పిమ్మట వడకట్టుకొనవలెను. నెలదినము లుంచిన ఇంకను మంచిది. నిపుడు కూడనది పరమళ తైలమగును.

3. పొట్టు తీసిన పావుసేరు తెల్లనూవులను పావుసేరు (తూకము) మొగిలి చెండ్లలో బాగుగా కలిపి 15 దినములు మూతగల పాత్ర యందుంచి పిమ్మట యానూవులను చేతిగానుగ యందు తైలము తీసిన యెడల నది కేతకీ తైలమగును. ఇది పరిమళమునకే కాకవైద్యముగా గూడ పనికి వచ్చును. దీనిలో మర్దించిన కటిశూల, ఆమవాతము శిరశ్శూల హరించును. ఈతైలమును కొంచెము వెచ్చ జేసి చెవిలో వేసిన కర్ణశూల హరించును. వ్రణములపై పూసిన యెడల తొందరగా మానును. చూ. పుష్పాయుర్వేదము పు.307.

4. పై విధముగానే కిలో తెల్ల నూవులను పొట్టుతీసి కిలో మల్లె పూవులతో బాగుగా కలిపి మూడు దినములు మూతగల పాత్ర యందుంచి నాల్గవనాడు చేతిగానుగతో నాడించిన యెడల మల్లికాతైలము దిగును. ఇది గూడ పరిమళమునకేకాక శిరోనేత్ర వ్యాదులందు చర్మవ్యాదు లందు మంచిపని చేయును. చూ. పుష్పా. పు. 335.

5. పిల్లిగడ్డ అనగా పునుగు పిల్లి మెడక్రింద చర్మము, మంచి గందపు చెక్క దాపుడు బట్టలమడతలలో నుంచిన యెడల దాని పరిమళ మా వస్త్రములకు కూడ పట్టుచుండును.

96.క:- సరి చే తొడవులు మ్రోయఁగ
సరగ నెఱులుదువ్వి దువ్వి సరిసందముగా
సిరిగందపు టటకలి యిడె
విరిఁబోఁడి యొకర్తు రాచవేలుపు దొరకున్ - **96**

టీక :- విరిబోడియొకర్తు = ఒక యువతి, రాచవేలుపు దొరకుఁ = ఆరాజేంద్రునకు, సరి = చక్కగా, చేతొడవులు = చేతికి తొడిగిన కంకణములు, మ్రోయగ = గలుగలు

మను చుండగా, సరగన్ = వేగముగా, నెఱులు = వెం[డ్రుకలు, దువ్విదువ్వి = సరసందముగా = సరసదనముగా, సరిగందపు టటకలి యిడె = [శ్రీగందముతో చేసిన యటకలిని బెట్టెను.

తా :- ఒకతె ఆరాజేం[ద్రునికి కంకణములు [మోగుచుండగా వెం[డ్రుకలు దువ్వి సరసదనముతో [శ్రీగందపు అటకలిని బెట్టెను.

''అలం - స్వభావోక్తి''

97.చ॥ జలకములందు లేవనుచు సందియమొప్పఁగ నూరకున్నఁ, బై
దలిని గికాకికన్ నగుచుఁ, దామరకంటి యొకర్తు తేటవె
న్నెల పటికంపు బందియల నించిన గొజ్జఁగి పూవు నీటి చేఁ
దల గడిగెన్ యయాతికి నెదంగడు సంతస ముల్లసిల్లఁగన్, - 97

టీక :- తామర కంటి యొకర్తు = ఒక పద్మాక్షి, జలకములు = నీరు అందున్ + లేవనుచు = దానిలో లేవని, సందియ మొప్పగన్ = సందేహముకలిగి, ఊరకున్న = ఊరకుండగా, పైదలిని = ఆయువతిని, కికాకికానగుచున్ = కిక్కిక్కిక్కి అని నవ్వుచు, అనగా హేళనగా నవ్వుచు, తేటవెన్నెల పటికంపు = స్వచ్ఛమైన వెన్నెలవంటి స్పటికపు, బిందియల నించిన = బిందెలతో నింపి యుంచిన, గొజ్జగి పూవు నీటిచే = గులాబి పన్నీటితో, తలగడిగెన్ యయాతికి = యయాతికి శిరస్నానము చేయించెను. అతడు, ఎదన్ = మనస్సునందు, కడు= మిక్కిలి, సంతసముల్ల సిల్లగన్ = సంతోషమును పొందగా -

తా :- ఒక పద్మాక్షి వేరొకతె గులాబి పన్నీరు నించిన స్పటికపు బిందెలను చూచి యందు నీరు లేదని సంశయించి నిలువగా నామెను చూచి హేళనగా నగుచు యయాతి మనస్సులో నుల్లసిల్లునట్లుగా నతనికి శిరస్నానము చేయించెను.

''అలం - [భాంతిమత్తు''

98.వ:- అప్పుడు

99.క॥ ఎలనాఁగ యొకతె దలిమపు
వలిపంబులు గట్ట నిచ్చెవడి, నడుగులఁబా
వలు దొడిగె నొకతె, యొక్కతె
తలఁ బావడ యొత్తి తిగిచి తడియార్చెఁదగన్ - 99

టీక :- ఎలనాగయొకతె = ఒకయువతి, తలిమపు వలిపంబులు = శ్రేష్టమైన వస్త్రములు, కట్టనిచ్చె = కట్టుకొనుట కిచ్చెను; ఒకతె, వడిఁ = వేగమే, అడుగుల వావలు దొడిగె = పాదములకు పాకొళ్ళు తొడిగెను. ఒక్కతె, తలఁ = తలపై, పావడ యొత్తితిగిచి = ధౌత వస్త్రములతో తడియొత్తి తీసి, తడియార్చె తగఁ = తగినట్లుగా తడియార్చెను.

తా :- ఒకతె ఆమహారాజునకు మేలైన వస్త్రములు కట్టనిచ్చెను ఒకతె పాకోళ్ళ తొడిగెను. ఒకతె ఉదికిన వస్త్రములతో తలను తడియొత్తి యార్చెను.

100.సీ॥ నిలువుటద్దం బొక నెలఁత చూపఁగ, నోర్తు
క్రొన్నెల నామంబు గోరఁ దీర్చెఁ,
గలికి యొక్కతె రాచ కల్వరాయని మేనఁ
గలపంబు చేసిన గంద మలఁదెఁ,
జాన యొక్కర్తుక చనుపకంబుల సరుల్
చింగులు వారంగ సిక నమర్చె,
జెలువ యొక్కతె గప్పెఁ గలికి రాయంచంచు
బంగారు చెఱఁగుల పచ్చడంబు,

తే॥ పరఁగ వెలలేని చౌకట్లు బన్నసరులుఁ
బసిమి నొప్పారు పచ్చల పతకములును
గండ పెండేరములు లోనుగాఁగఁ గలుగు
సొమ్ము లొకయింతి గైచేసె సొంపు మెఱయ - 100

టీక :- నిలువుటద్దం బొక నెలత చూపగఁ = ఒక యువతినిలువు టద్దము చూపగా, క్రొన్నెల నామంబు = కొత్త చంద్రవంక వంటి నామము, గోరదీర్చెఁ = గోటితో దీర్చెను, కలికి యొకతె రాచ కల్వరాయని మేన = ఒక యువతి ఆరాజేంద్రుని శరీరముపై, కలపంబు చేసిన గందములదె = పలుచగా కలిపిన గందము పూసెను, చాన యొక్కర్తుక = ఒక జాణ, చనుపకంబులసరుల్ = సంపెంగ దండలు, చింగులు వారంగ, సిగనమర్చె = దొంతవలుగా తలకు చుట్టెను, చెలువ యొక్కతె = ఒక సుందరి, కలికి రాయంచంచు - రాజహంసల యంచుగల, బంగారు చెరగుల = బంగారు జరీయంచులుగల, పచ్చడంబు గప్పె = శాలువాగప్పెను- పూర్వము శాలువాల అంచులపై హంసలు, సింహములు, ఏనుగులు, కమలములు వచ్చునట్లు నేతగాండ్రు నేసేవారు - ఒక యింతి = ఒక స్త్రీ, పరగఁ =

ఒప్పునట్లుగా, వెలలేని చౌకట్లు = అమూల్యమైన చౌకట్ల పోగులు, బన్నసరులు = కట్లదండలు, పసిమినొప్పారు = పచ్చదనముతో ప్రకాశించు, పచ్చలపతకములను = పచ్చల పతకములు, గండపెండేరములు, లోనుగా గలుగు సొమ్ములు = మొదలైన యాభరణములు, సొంపు మెరయ = అందము కనిపించు నట్లుగా, కైసేసె = అలంకరించెను.

తా :- అపుడొక యువతి ఆరాజేంద్రునికి నిలువుటద్దము చూపగా ఒకతె నెలవంకనామము దిద్దెను. ఒకతె పలుచని గందము శరీరమునకు పూసెను. ఒకతె జట్టుముడికి సంపెంగలు చుట్టెను. ఒకతె రాయంచల యంచుగల బంగారు జరీశాలువా కప్పెను. ఒకతె చౌకట్లపోగులు, బన్నసరములు, పచ్చల పతకములు, గండపెండేరములు మొదలైన యాభరణములన్ని ధరింపజేసెను.

101.క॥ ఎడలేదు లగన మనుచుఁ
బడిబడిఁ బిలువంగ నవుడు బలువాయిదముల్
గడలు కొనంగా నచ్చర
పడత్రుల దవళములు పెండ్లిపాటలు పెలఁగన్ - **101**

టీక :- అపుడు పురోహితుడుఁ, ఎడలేదు లగన మనుచుఁ = లగ్నమాలస్యము లేదనుచు = పడిపడిపిలువంగఁ = మీదమీద పిలుచు చుండగా, అపుడు, పలువాయిదముల్ =అనేకమైన వాయిద్యములు, కడలు కొనంగాఁ = దిక్కులంటునట్లు వ్యాపింపగా, అచ్చరపడతుల = అప్సరసల యొక్క ధవళములు = పెండ్లిపాటలు, చెలగఁ = ఒప్పుచుండగా -

తా :- అపుడు పురోహితుడు లగ్నమునకు ఆలస్యములేదని మీద మీద పిలుచు చుండగా అనేకమైన వాయిద్యములు దిక్కులంటగా మ్రోగుచుండగా, అప్సరసలు ధవళములు పెండ్లిపాటలు పాడుచుండగా -

102.క॥ వెలియేనుఁగుపైఁ బన్నిన
యలరుం జప్పరము లోన నతివలువీచో
పులు వీవ, ఱేఁడు రెండవ
వలరాయని పగిది వచ్చి వాకిట దిగియెన్ - **102**

టీక :- వెలయేనుగుపై బన్నిన = తెల్లని యేనుగుపైనమర్చిన, అలరుం జప్పరము లో = పూవుల యొక్క అంబారిలో, అతివలు = స్త్రీలు, వీచోపులు = వింజామరలు, వీవఁ = విసరు చుండగా, జేడు = ఆయయాతి మహారాజు, రెండవ వలరాయని పగిది = రెండవ మన్మధునివలె, వచ్చివాకిట దిగియెఁ = వచ్చి పెండ్లి వాకిటిలో దిగెను.

తా :- అపుడు తెల్లని ఏనుగుపై కట్టిన పూవుల యంబారిలో ఇరువైపుల యువతులు వింజామరలు వీచుచుండగా నాయయాతి మహారాజు రెండవ మన్మధునివలె వచ్చి పెండ్లి వాకిట దిగెను.

''అలం - ఉపమ''

103.తే॥ కలికి యొక్కతె మగమానికములగిండి
నించి పన్నీరు వోయఁగా, నేల జేని
యడుగుఁ దమ్ములు గడిగెఁ దొయ్యలి యొకర్తు
తుడుచె నెలగావి పయ్యెదతుదఁ జెలంగి - 103

టీక :- కలికి యొక్కతె = ఒక యువతి, మగమానికముల దిండినించి = వజ్రమయమైన గుండ్రని కలశము నునించి, పన్నీరు వోయగా, నేలజేని = అపుడమీశుని యొక్క, అడుగు దమ్ములు = పాద పద్మములు, తొయ్యలి యొకర్తు = ఒక యువతి, కడిగె = కడిగెను, మరియొకతె, నెలకావి పయ్యెద తుదఁ = చంద్రకావిపైట యొక్క కొనతో, తుడిచె, చెలంగి = సంతోషమున తుడిచెను.

తా :- ఒకతె అపుడు వజ్రపు గిరిడిలో పన్నీరు పోయుగా మరియొకతె అతని పాదపద్మములు కడిగెను. మరియొకతె యువి తన చంద్రకావిపైట కొనతో తుడిచెను.

''అలం - ఉదాత్తము''

104.ఉ॥ కారు మెఱుంగులం దెగడు కైపున నొప్పునెలంత లంత, బం
గారపుఁ బళ్లెరంబుల వగ న్మను ముత్తెపు ముగ్గులోన నిం
పారెడు కెంపు దివ్వియల నందపుఁ గెందొడవు ల్చెలంగఁగా
నారతు లిచ్చి రప్పుడు యయాతికి లేనగ వొప్పు నర్మిలిన్ - 104

టీక :- అంతఁ = అపుడు, కారుమెరుంగులఁ దెగుడు = తొలుకారు మెరుపు తీగలను పరిహసించు, కైపున నొప్పు నెలంతలు = గర్వముతో నొప్పెడు స్త్రీలు, బంగారపు పళ్లెరంబుల, వగఁ = ఒప్పునట్టి, నునుముత్తెపు ముగ్గులోనఁ = స్నిగ్ధమైన ముత్యములతో పెట్టినటువంటి ముగ్గులో, ఇంపారెడు = ఒప్పునట్టి, కెంపు దివ్వియెల - ఎఱ్ఱని దీపములతో అందపు కెందొడవుల్ చెలంగగా = శృంగారమైన యెఱ్ఱ రత్నముల భూషణములు ప్రకాశించు చుండగా, అప్పుడు, యయాతికి, లేనగ ఒప్పఁ = చిరునగవుతో, అర్మిలిఁ = ప్రేమతో, ఆరతులిచ్చిరి = మంగళ హారతులిచ్చిరి.

తా :- అపుడు తొలుకారు మెరుగులను పరిహసించెడు గర్వము గల యువతులు బంగారు పళ్లెరములలో ముత్యాలముగ్గుల నడుమగల నెఱ్ఱని దీపములతో తాము ధరించిన కెంపుల నగలు ప్రకాశించు చుండగా నివాళులిచ్చిరి.

''అలం - అతిశయోక్తి''

వివాహము

105.ఉ॥ తామర కెంపు లంతటను దాచిన ముక్కాలి పీఁటమీఁద టం
గోమలు లంతఁ బెండ్లికొడుకుం దగ నుంచినఁ బొల్పుమీఱఁగా
బ్రామినుకుం దెఱంగునను రక్కసి యొజ్జ యొసంగెఁ గూఁతునున్
గోమునఁ బెంచుకోర్కి సమకూరుటకుం దనబాస మెచ్చఁగన్ - 105

టీక :- తామర కెంపులంతటను దాచిన = పద్మరాగ మణులంతట తాపిన, ముక్కాలి పీట మీదటఁ = మూడుకాళ్ల పీటపై, కోమలు లంత = ఆయువతులపుడు, పెండ్లి కొడుకుఁ, తగ నుంచినఁ = తగునట్లు కూర్చొన బెట్టగా, పొల్పుమీరగాఁ = అందముతో నొప్పుచుండగా, ప్రామినుకుఁ దెరంగునను = వేదవిద్యవలె, కూతునుఁ = బిడ్డను, రక్కసి యొజ్జ = దానవగురు వైన శుక్రుడు, గోమున బెంచు కోర్కి = గారాబమున పెంచిన తన కోరిక, సమకూరుటకుఁ = కలుగుటకు, తన బాస మెచ్చగఁ = తన యొక్క మాటను, ఆ రాజు మెచ్చుకొనగా, నిచ్చెఁ = కూతురి నిచ్చెను.

తా :- పద్మరాగమణులు తాపిన ముక్కాలిపీటపై యపుడు యువతులు యయాతిని కూర్చొన బెట్టగా శుక్రుడతనికి గారముగా తన బిడ్డను వేదవిద్య నిచ్చినట్లు తన మాట మెచ్చు చుండగా నిచ్చెను.

106.సీ॥ అలనాఁడు జగములు గెలిపించినను మెచ్చి
తారకుం డిచ్చిన వారు వములు
కని పైఁడి కంటి రాకాసి ఱేఁ డిచ్చిన
పాఁప మేపుడు పచ్చ పతకములును.
తీవితోఁ గొడుకు పెండ్లికిఁ బిల్వ నరుదెంచి
బలితెచ్చి యిచ్చిన బన్నసరము
తనకు వేలుపు ఱేఁడు తలఁకి కానుక సేయ
వృషపర్వుఁ డిచ్చిన వెలఁ దిపిండు
తే॥ నేమి సేయించునో యని యెఁద గలంగి
కడలి యంపిన బలు మానికములు మఱియు
మామ యల్లున కిచ్చె గారాము మెఱయ
హెచ్చు సొంపునఁ గూఁతును నిచ్చునపుడు - 106

టీక :- అలనాడు = అనాడు, జగములు గెలిపించినను = లోకములన్ని గెలిపించగా, తారకుండిచ్చిన వారువములు = తారాకా సురుడిచ్చిన గుఱ్ఱములు, కని = చూచి, పైడికంటి = రాకాసి ఱేడిచ్చిన = హిరణ్యా క్షుడను దాన ప్రభువు ఇచ్చిన, పాపమేవుడు పచ్చ పతకములును = గరుడపచ్చల యొక్క పతకములు, తీవితో, కొడుకు పెండ్లికి, పిల్వనరు దెంచి = పిలుచుటకు వచ్చి, బలి తెచ్చియిచ్చిన బన్నసరము = బలిచక్రవర్తి తెచ్చి యిచ్చిన పన్నగహారము, తనకు వేలుపుఱేడు = తనకు నింద్రుడు, తలకి కానుక సేయ = భయపడి కానుగగా నీయుగా, వృషపర్వుడిచ్చిన వెలది పిండు = స్త్రీలయొక్క సమూహము మరియు ఏమిసేయించునోయని, ఎదకలంగి = మనస్సులో క్షోభించి, కడలి యంపిన = సముద్రుడు పంపిన, బలు మానికములు = అనేకమైన మానికములు, మామ = మామయైన శుక్రాచార్యుడు, హెచ్చు సొంపున = మిక్కిలి నచ్చగా, కూతును నిచ్చునపుడు = బిడ్డ నిచ్చునపుడు, గారాయ మెరయు = ప్రేమతొలకగా, అల్లున కిచ్చె = అల్లునికిచ్చెను.

తా :- మాయమైన శుక్రుడు యయాతికి తన బిడ్డనిచ్చునపుడు ప్రేమతో తనతో లోకములన్ని గెలిపించినపుడు తారకు డిచ్చిన గుఱ్ఱములు, హిరణ్యాక్షుడు తనకిచ్చిన గరుడ వచ్చల పతకములు, కొడుకు పెండ్లికి పిలుచుటకై వచ్చి బలిచక్రవర్తి కానుకగా నిచ్చిన బన్నసరము, ఇంద్రుడు వృషపర్వునికి భయపడియిచ్చిన

దాసీజనము మరియు సముద్రుడు తననేమి చేయించునో యని భయపడి పంపిన యనేకమైన మాణిక్యములు అరణముగా నిచ్చెను.

''అలం - ఉదాత్తము''

107.వ:- అంత నిట్లు కావించి తెరమఱుంగున నప్పుడమిఱేని
నునిచి ననుచు తమిం దన కూఁతుందోడి తేర
శుక్రుండు పనుచుటయు - 107

టీక :- అంత = అపుడు, ఇట్లు కావించి = ఈ విధముగా చేసి, తెరమఱుంగున = తెరచాటున, అప్పుడమిఱేని నునిచి = తెరచాటున నారాజును నిలిపి, శుక్రుడు ననుచు తమిఁ = పల్లవించెదుకు తూహలముతో, తనకూతుం దోడి తేర = తన బిడ్డను కొని వచ్చుటకు, పనుచుటయు = పంపగా-

తా :- అపుడు ఆవిధముగా నరణము లిచ్చి శుక్రుడు యయాతి మహారాజును తెరచాటున నిలిపి చిగురించెడు కుతూహలమున కొందరు స్త్రీలను తన కూతును తోడి తెమ్మని పంపగా -

108.సీ॥ అడుగుఁ దమ్ముల చాయ పుడమి యొత్తక యుండఁ
జిగురు మించిన తీవిఁ జెలువ మమర
ముదిత యొకర్తు పయ్యెద చెఱంగున సారె
చెక్కుటద్దంబుల చెమట దుడువ
మోము పంపగ జాఱు ముత్యాల పాపట
నకి యోర్తు పలుమాఱు చక్కనిడఁగ
వావిచ్చుఁ గప్పు పల్వరుస చీఁకటి గ్రమ్మ
మరి యోర్తు తెలనాకు మడిచి యొసఁగఁ

తే॥ గలికిన్నుల చూపులు గ్రమ్మికొనుచు
నిగుడఁ బటికింపు ఱాకట్టు నేల యల్ల
నలరు కస్తురి నాటిన యట్లు గాఁగఁ
దెలివిఁ జనుదెంచెఁ గడునాన దేవయాన - 108

టీక :- అడుగు దమ్ములచాయ = పాదపద్మముల కాంతి, పుడమి యొత్తక యుండ = నేల యొత్తకుండ నుండగనే, చిగురు మించిన ఠీవి= చిగురాకులను మించిన కాంతితో, చెలువ మమర = అందముగా నొప్పుచుండగా, ముదిత యొకర్తు = ఒక యువతి, పయ్యెద చెరంగున = పైట చెంగుతో, సారె = మరల మరల, చెక్కుటద్దంబుల చెమట దుడువ = అద్దములవంటి చెంపల యొక్క చెమటను తుడుచుచుండగా, మోయ వంపగ = దేవయాని తలవంచు కొనగా, జారు ముత్యాల పాపట = జారినట్టి ముత్యాల పాపిట చేరు, సకియోర్తు = ఒక సఖియ, పలుమారు = అనేక మారులు, చక్కనిడగ = చక్కగా నుంచగా, వావిచ్చు = నోరు తెరచినపుడు, కప్పు = నల్లని దాసిన కప్పు, పల్వరుస చీకటిగ్రమ్మ = దంతపంక్తిని నల్లగా చేయుచుండగా, మరియొర్తు = అది చూచి మరి యొకతె, తెలనాకు మడిచియొసగ = తెల్లని తమలపాకు మడిచి యీాయగా - తమల పాకులలో తెల్లనివి, నల్లనివియని రెండు రకములు, నల్లవి పైత్యకారి, తెల్లనివి శ్రేష్ఠమైనవిగా చెప్పుదురు - కలికి కన్నుల చూపులు = ఆయొక్క దేవయాని చూపులు, క్రమ్ముకొనుచు నిగుడఁ = వ్యాపించుచు నిలువగా, పటికంపు రాకట్టునేల = స్పటికములు పరచిన రాతికట్టునేల, అల్ల = ఆయొక్క, అలరు కస్తురి నాటిన యట్లు కాగా = మేలైన కస్తూరి ఆనేలలో పాతుకున్నట్లు కనిపించగా, కడునానఁ = మిక్కిలిసిగ్గుతో, దేవయాన, తెలివిఁ జనుదెంచె = తెలివిగలిగి వచ్చెను.

తా :- ఆమె నడచి వచ్చునపుడు పాదములు నేలయొత్తకపోయినప్పటికి చిగురు టాకులను మించిన యెలుపుతో నొప్పుచుండగా ఒక యువతి పైటకొంగుతో నామె చెంపలకు గ్రమ్ముచెమట మాటిమాటికి తుడుచు చుండగా ఆమెతలవంచుకొని నడుచు చుండగా పాపెటనుండి జారెడు ముత్యాల చేరును ఒకతె చక్కబరచు చుండగా నోరు తెరచి నపుడు దాసెన కప్పు దంతములకు, నలుపు నీపాదించుట చూచి యొకతె తెలనాకు మడిచి యీాయగా, నామె తల వంచుకొని నపుడు చూపులు అచటి స్పటికపు పలకలనేలలో నాటుకొనిపోయి యవి కస్తురి యంటినట్లు కనిపించుచుండగా మిక్కిలిసిగ్గున నామె చనుదెంచెను.

''అలం - స్వభావోక్తి''

109.వ:- ఇట్లు వచ్చిన తెఱవం దెరమఱుంగున నిడి తగు
తెఱఁగులు గావించిన పిదప నత్తెర దిగిచిన సమయంబున - 109

టీక :- ఇట్లు వచ్చిన తెఱవన్ = ఈ విధముగా వచ్చిన దేవయానిని, తెఱ మఱుంగున నిడి = తెరచాటున నిలిపి, తగు తెఱంగులు = నడువ వలసిన విధులు, కావించిన పిదవ, జరిపిన తదుపరి, అత్తెర దిగిచిన సమయంబున = ఆ తెర తీసినపుడు -

తా :- ఈ విధముగా వచ్చిన దేవయానిని తెరచాటున నిలిపి చేయవలసిన విధులు ముగిసిన పిమ్మట నాతెరను తొలగించగా -

110.తే॥ తాళిగట్టె నపుడె తలిరాకుఁ బోఁడికిఁ
బుడమి ఱేఁడు వేడ్క గడలు కొనఁగఁ,
దనరు పెక్కు వాయిదమ్ముల మ్రోఁతలు
చెలఁగి ముజ్జగములు చెవుడు పఱుప - 110

టీక :- పుడమి ఱేడు = ఆమహారాజు, వేడ్కగడలు కొనగ = సంతోష మతిశయించగా, తనరు = ఒప్పుచున్నట్టి, పెక్కు వాయిదమ్ముల మ్రోతలు = వాయిద్యముల ధ్వనులు, చెలగి = విజృంభించి ముజ్జ గములు = మూడు లోకములు, చెవుడు పరుప = చెవుడు పడునట్లు చేయుచుండగా, అపుడె = నాసమయమందె, తలిరాకు బోడికి = ఆదేవయానకు, తాలిగట్టె = మాంగల్యము గట్టెను.

తా :- ఆ మహారాజు సంతోషమతిశయించు చుండగా, అనేకమైన వాద్యముల మ్రోతలు దిక్కులన్ని చెవుడు పడ వేయుచుండగా నాసమయమున దేవయాన మెడలో తాలిగట్టెను.

111.క॥ చెలియొకతె యెత్తి పట్టినఁ
దలిరాకుం బోఁడి ఱేనితల ముత్తి యపుం
దలఁబ్రాలు వోసిన తుద
నెలఁతుక తలఁబ్రాలు వోసె నేర్పు దలిర్పన్ - 111

టీక :- చెలియొకతె = ఒక సఖియ, ఎత్తిపట్టిన = ఎత్తిపట్టుకొనగా తలిరాకుం బోడి = ఆ దేవయాని, ఱేని తలన్ = మహారాజు తలపై ముత్తియంపు తలంబ్రాలుం బోసిన = ముత్యములు తలంబ్రాలు పోయగా, తుదన్ = చివరకు, నెలతుక = ఆదేవయాని,

నేర్పు దలిర్పన్ = తన యొక్క ప్రజ్ఞ కనిపించునట్లుగా, తలంబ్రాలు వోసె = తలంబ్రాలు పోసెను.

తా :- ఒకచెలి యెత్తి పట్టుకొనగా దేవయాని మహారాజు తనతలపై ముత్యాల తలంబ్రాలు వోసిన పిదప చివరకు ఆమె తన నేర్పు మీరగా తలంబ్రాలు పోసెను.

విశే :- పూర్వం వరోవధ్వాశ్శిరసి ప్రాపయేత్. ద్వితీయపర్యాయే వరస్య శిరసి పూర్వం ప్రాపయేత్. తృతీయ పర్యాయే వధ్వాశ్శిరసి. పూర్వం. చతుర్ధ పర్యాయే అన్యోన్యం యుగపత్.

తా:- మొదట వరుడు వధువు శిరస్సున అక్షతలు పోయవలెను. రెండవ సారి వరుని శిరస్సున ముందుగా పోయవలెను. మూడవసారి మొదట శిరస్సున పోయవలెను. నాలుగవసారి పరస్పరము ఒక్కసారిగా పోసి కొనవలయును. ఉపనయన వివాహవిధి. పు- 156-7

అని శాస్త్రము కనుక దేవయాని మహారాజు తనతలపై మొదట పోసిన పిదప తాన తని తలపై పోసెను.

ఈ సందర్భమున మంత్రములిట్లుండును.

i. పశవోమే కామస్సవమార్ధ్యతామ్ - దేవతలు నాకోరికను వృద్ధి పొందింతురుగాక

ii. యజ్ఞోమే కామస్సమార్ధ్యతామ్ - యజ్ఞము నాకోరికను వృద్ధి పొందించునుగాక.

iii. శ్రీయోమే కామస్సమార్ధ్యతామ్ - శ్రేయము నాకోరికను వృద్ధిపొందించునుగాక.

112.మ:- నలిఁ గెందమ్ముల చాయ కెంపుల బలెన్ రంజిల్లు నమ్ముత్తియం
బులు రాపాడుచు దోయిలింపుచును మోముం జందురున్నవ్వువె
న్నెల లల్లల్లనఁ సోకఁ గొను మిగుల న్నిక్కంగ నొక్కు మ్మడిం
దలఁబ్రాల్ వోసె నెలంత రాచ నెలకుం దార్కొన్న కోర్కిందగన్- 112

టీక :- నలిన్ = క్రమముగా, కెందమ్ముల చాయ = ఎర్రతామరలవలె, కెంపుల బలెన్ = కెంపులవలె, రంజిల్లు = ప్రకాశించు, అమ్ముత్తియంబులు = ఆముత్తియములు, రాపాడుచు = చేరలతో రాయుచు, దోయిలించుచును = దోసిలితో తీసికొనుచు, మోముంజందురున్ = ముఖచంద్రుని యొక్క, నవువెన్నెలలు = దరహాస

చంద్రికలు, అల్లల్లనసోక = మెల్లమెల్లగా తాకుచుండగా, కాను మిగులన్నిక్కంగ = నడిమి మిక్కిలిగా నిక్కగా, ఒక్కుమ్మడిన్ = ఒక్కమొత్తముగా - నెలంత = ఆమె, రాచనెలకున్ = ఆరాజచంద్రునికి, తోర్కొన్న కోర్కిన్ = తగిలినటువంటి కోరికకు, తగన్ = తగినట్లు, తలంబ్రాల్ పోసె = తలంబ్రాలు పోసెను.

తా :- తలంబ్రాల ముత్తియములు క్రమముగా నెర్ర తామరలవలె, కెంపులవలె కనిపించుచుండగా నామె వానిని చేరలలో రాయుచు, దోసిళ్లతో ముంచుకొనుచు ముఖచంద్రుని యొక్క నవ్వువెన్నెలలు వానికి సోకుచుండగా సన్నని నడుము మిక్కిలిగా నిక్కగా నామె యారాజ చంద్రుని పై తగిలిన తన కోరికకు తగినట్లుగా తలంబ్రాలు పోసెను.

విశే :- ఈ పద్యమున నలిగెందమ్ముల చాయ కెంపుల బలెన్ రంజిల్లు - అనుటలో ''జానక్యాకమలామలాంజలిపుటేయా పద్మరాగాయితాః'' అను వివాహమంగళ శ్లోక ఛ్ఛాయ కనిపించును.

''అలం - స్వభావోక్తి''

113.ఆ॥ మంచు మీఁది పెద్దమంచు తుంపర లన
మగువ మేనిమీఁద దగఁగ జాఱ
నలరి పుడమి ఱేఁడు నౌఁదల దగు ముత్తి
యంపుఁ బ్రాలు నించె సొంపు మెఱయ - 113

టీక :- పుడమిఱేడు = ఆమహారాజు, మంచుమీది = మంచు మీదగల, పెద్దమంచు తుంపరలన్ = గొప్పవైన మంచు తుంపర లనగా, మగువ మేనిమీద = ఆదేవయాని యొక్క శరీరము పై, తగగ జారన్ = తగినట్లు జారుచుండగా, అలరి = సంతసించుచు, ఔదలన్ = ఆమెనడినెత్తిపై, సొంపుమెరయన్ = అందముగా, తగు = తగినట్టి, ముత్తియంపుబ్రాలు నించె = ముత్తియముల తలంబ్రాలు పోసెను.

తా :- ఆ మహారాజు మంచుమీదినుండి లావులావైన మంచు తుంపర జారుచున్నట్లుగా ఆమె శరీరముపై నుండి తలంబ్రాల ముత్యములు జారుచుండగా సంతసించుచు నామె నడినెత్తిపై యతడు ముత్తెముల తలంబ్రాలు పోసెను.

''అలం - ఉత్ప్రేక్ష''

114.క॥ పోల్పఁ దొలిమిన్కు తెఱఁగున
వేల్పించిన పిదప, రాచవిరివింటి దొరన్
వేల్పులకుఁ బ్రొక్కించిరి
పాల్పడి యల పెండ్లికూఁతు పజ్జన కడఁకన్ - 114

టీక :- పోల్పఁ = తగునట్లుగా, తొలిమిన్కు తెఱగున = ఋగ్వేదోక్తముగా, వేల్పించిన పిదప = హవనము చేయించిన పిమ్మట, రాచవిరి వింటి దొరఁ = ఆరాజమన్మథుని, అల = ఆయొక్క, పెండ్లికూతు ప్రక్కన = దేవయాన ప్రక్కన, పాల్పడి = ప్రేమతో, కడకఁ = ప్రయత్నపూర్వకముగా, వేల్పులకుఁ = దేవతలకు మ్రొక్కించిరి.

తా :- అపుడు తగురీతిగా ఋగ్వేద ప్రకారముగా నగ్నికార్యము చేయించి యా మహారాజును, దేవయానితో గూడ ప్రేమతో దేవతలకు మ్రొక్కించిరి.

విశే :- వివాహ ప్రయోగములు ఋగ్వేదోక్తము యజుర్వేదోక్తమని రెండు విధములు. సాధారణముగా యాజుష ప్రయోగమే యెక్కువ. ఆశ్వలాయన సూత్రులు మాత్రము తమ సంస్కారములు ఋగ్వేదోక్తము గా జరుపుకొందురు. వధూవరులు వేర్వేరు శాఖల వారైనపుడు పురోహితులు కన్యాదాన పర్యంతమాడ పెండ్లి వారి శాఖా ప్రకారము జరిగించి యాపిమ్మట మగ పెండ్లి వారి శాఖా పద్ధతిలో తక్కిన కార్యక్రమము ను సాగింతురు.

115.క॥ తగఁ బ్రాకెనయును దీఱిచి
నగవుల పను లైన వెనుక, నాలవనాఁడొ
ప్పుగ నాగవల్లి సేయఁగఁ
బగడపు టుప్పరిగ లోనఁ బడఁతుక లెల్లన్ - 115

టీక :- తగఁ = ఒప్పునట్లుగా, ప్రాకెనయుఁ దీరిచి = మూడవనాటి కార్యము ముగించి - నగవుల పనులైన వెనుక = పరిహాసకార్యములు - అనగా పూర్వము వివాహములలో నాగవల్లికి మొదట వియ్యాలవారు ఒకరొకరిని వియ్యంకులను, వియ్యపురాండ్రను చేసుకొను పేర పరస్పరము హాస్యములు పట్టించు కొనెడు వారు. కనుక - ఆతంతు ముగిసిన వెనుక, నాలవనాడు - ఒప్పుగఁ = తగినట్లుగా, నాగవల్లి సేయగ = నాగపెండ్లి చేయుటకు, పగడపుటుప్పరిగ లోన = పగడముల యొక్క మేడలో, పడతుకలెల్లఁ = ఆయువతులందరు.

తా :- పెండ్లిలో మూడవదినమునాటి పనులైన పాకెనను ముగించి ఒకరినొకరు వియ్యపు వారిని చేసికొని నాలవనాడు నాగపెండ్లి చేయదలచి, ఆయువతులందరు ఒక పగడాల మేడలో-

116.సీ॥ చెలcగుచు మంచి పచ్చలు దెచ్చి మేలేర్చి
దట్టంబుగాc గ్రుచ్చి తాచి తాచి
వెన్నెలల్ వెదచల్లు వెండి ముత్తియములు
నేర్పుతోc గ్రేవల నించినించి
యచటెల్ల బలుగావి నద్దినట్లుగc జేయు
నెఱిమించు కెంపుల నెఱసినెఱసి
చెంత దివ్వెలc బోని చీcకట్లు వెదచల్లు
తెఱగంటి రాఱాలc దీర్చి దీర్చి
తే॥ రమణ మీఱcగ గోమేదికరములు చాలc
జెలువ మొప్పార నంచులc జేర్చి చేర్చి
కొలcదునై దువచిలుకల కొలుకు లపుడు
పొలుపుదీర్చిరి మదిలోనc బొదలుతమిని - 116

టీక :- చెలగుచు = సంతోషమున, మంచి పచ్చలు దెచ్చి, మేలేర్చి = వానియందు మేలైనవి ఏరుకొని, దట్టంబుగా గ్రుచ్చి = దట్టముగా పొదిగి, తాచితాచి - బాగుగా తాటించి, వెన్నెలల్ వెదజల్లు వెండి ముత్తియములు = వెన్నెలవలె ప్రకాశించు తెల్లని ముత్యములు, నేర్పుతో = నైపుణ్యముగా, గ్రేవలన్ = ఆపచ్చల ప్రక్కలలో, నించి నించి = చక్కగా అమర్చి, అచటెల్ల = ఆప్రదేశమంతయు, బలు కావినద్దినట్లుగ జేయు = దట్టమైన కావిరంగును అద్దినట్లుగా చేయగలిగిన, నెఱిమించు కెంపులన్ = కాంతిమించిన కెంపులను, నెఱసినెఱసి = నేర్చి, అనగా పరిచి, చెంత = వాని సమీపము లందు, దివ్వెలబోని = దీపములకు తొలగిపోని, చీకట్లు వెదజల్లు = నలుపును వ్యాపింప జేయు, తెరగంటి రాఱాల దీర్చి దీర్చి = ఇంద్రనీలముల తీర్చి, రమణ మీరగ = అందము మీరగ, గోమేధికములు, చాల చెలువ మొప్పార = మిక్కిలి యందము కలుగునట్లుగా, అంచులన్ జేర్చి చేర్చి = ఆ ఇంద్రనీలముల యంచులకు నించి, ఐదువ = ఐదు వన్నెలు గలది అనగా ముత్తైదువ, గంధము, కుంకుమ, పసుపు, సింధూరము, కాటుక - ఇవి ఐదు వన్నెలు, పునిస్త్రీలు ఎల్లపుడు ధరించదగినవి- చిలుకల కొలుక లపుడు = యువతులు, అపుడు = ఆ

సమయమున, మదిలోన బొదలు తమిని = తమమనస్సులలో పొంగుచున్న కుతూహలముతో, కొలపు పొలుపు దీర్చిరి = పోలుపటము వేసిరి.

తా :- అపుడాయువతులందరు మంచి పచ్చలు తెచ్చి వానిలో మేలైన వేరి నేలపై దట్టముగా పొదిగి తాటించి దాని యంచులకు తెల్లని వెండి ముత్యముల అంచు తీర్చి ఆప్రదేశమందంతయు, ఎఱ్ఱని కావి యద్దినట్లు కెంపెలు నేర్చి, వాని సమీపమున చీకట్లు వెదజల్లు ఇంద్రనీలములు చేర్చి అపుడా ముత్తైదువలు తమ మనస్సులలోని ఉత్సాహము పొంగుచుండగా పోలుపటము తీర్చిరి.

''అలం - ఉదాత్తము ''

117.మ:- చెలి చన్నుంగవఁ బోలఁ జాలుననుచుం జెందమ్మి పూమొగ్గలం
జెలువల్ కిన్కను గట్టివేసి రనఁగా జెన్నొందుచు నాల్గువం
కల నుప్పొంగుచుఁ బూజకుండ లలరెం గైపొంది యామీఁదుఁగాఁ
గలయం జుట్టిన నూలితోడ దివియల్ గన్పట్టు చుఁ జుట్టిరాన్ - 117

టీక :- చెలి చన్నుంగవ బోల జాలుననుచున్ = దేవయాని యొక్క చన్నులను పోలునని, చెందమ్మి పూల మొగ్గలన్ = ఎఱ్ఱతామర మొగ్గలను, చెలువల్ = ఆయువతులు, కిన్కను గట్టివేసిరనగా = కోపమున కట్టివేసినా రన్నట్లుగా, చెన్నొందుచున్ = అందముగా కనిపించుచు, నాల్గువంకలన్ = నలుదిక్కులందు, ఉప్పొంగుచు, పూజకుండలలరెన్ = పూజకుండలు ఒప్పెను - కైపొంది = అందమును పొంది, ఆమీదుగా, కలయం జుట్టిన = కలిపి చుట్టిన, నూలితోడ = నూలుదారముతో, దివియల్ గన్పట్టుచున్ - దీపములు కనిపించుచు, చుట్టిరాన్ = చుట్టుతిరిగి రావా-

తా :- ఆచెలువలు పోలుపటమునకు నాలుగు వైపుల పూజకుండలు నిలిపి వానిపై నుండి నూలుదారమును జుట్టి వానిపై దీపములు పెట్టగానవి వారు ఇవి మా చెలి యొక్క చన్నులను పోలు చున్నవని కోపమున పట్టుకొని వచ్చి కట్టివేసిన ఎఱ్ఱ తామర మొగ్గల న్నట్లుండెను -

''అలం - ఉత్ప్రేక్ష ''

118.చ:- నెలతుక లిట్లు ప్రోలు తగ నేర్పు చెలంగఁగఁ జేర్చి తీర్చిరా
చలువ వెలుంగు నింతిఁ దగుచందము లెల్ల నమర్చి పిమ్మటం
గలువల చప్పరంబు కడఁ గట్టిన గొజ్జఁగి మేడలోపలన్
మలఁచిన కెంపుగోళ్ల సిరిమంచముపై నొగి నున్పునత్తఱిన్ - 118

టీక :- నెలతుకలు = ఆవనితలు, ఇట్లు = ఈవిధముగా, ప్రోలు తగఁ = ఒప్పునట్లు, నేర్పు చెలంగగ = తమ నైపుణ్యమొప్పగా, చేర్చి తీర్చి రాచలువ, ఆ = ఆయొక్క, చలువవెలుగు నింతి = చంద్రుని భార్యయైన రోహిణీదేవిని, తగుచందము లెల్లఁ = తగిన విధానముగా, అమర్చి = ఉంచి, పిమ్మటఁ = తరువాత, కలువల చప్పరంబుకడ = కలువల మంటపము దగ్గర, కట్టిన, గొజ్జగి మేడలోపలఁ = గులాబీలమేడలో, మలచిన = చక్కని పని చేసిన, కెంపుగోళ్ల = ఎర్రని కోళ్ళు యొక్క, సిరిమంచముపై = అందమైన మంచముపై, నున్పనత్తరిఁ = ఉంచినపుడు.

తా :- ఆ యువతులీవిధముగా తమ నేర్పుతో ప్రోలును దీర్చి, అందు రోహిణీ దేవిని తగిన విధానముగా నుంచి ఆతరువాత కలువల మండపము సమీపమున గల గులాబుల మేడలో పనితనముగల కెంపుకోళ్ళ యొక్క శృంగారమైన మంచముపై నుంచునపుడు-

119.కII తెలనాకులు బాగాలును
నలమిన పెనిమిటులఁ గూర్చి యైదువ యెలనాఁ
గల కెల్ల నిడిరి వీడ్య
మ్ములు దగ నప్పుడమి ఱేఁడు ముదితయుఁ గడఁకన్ - 119

టీక :- అప్పుడమిఱేడు = ఆమహారాజు, ముదితయు = దేవయాని, తెలనాకులు = తెల్లని తమలపాకులు, బాగాలు = మంచిపోకలు, ఇవి కత్తిరించబడి యుండును. కనుక భాగాలని పేరు. అలమిన పెనిమిటుల గూర్చి = భర్తలతో కూడినట్టి, ఐదవ ఎలనాగలకు = ముత్తయిదువులైన స్త్రీలకు, ఎల్లఁ = అందరికి, వీడ్యమ్ములు = తాంబూలములు, కడకఁ ఇడిరి = ఒప్పునట్లుగా యిచ్చిరి.

తా :- ఆ మహారాజు మరియు దేవయాని శృంగార గృహము ప్రవేశించు నపుడు భర్తలతో కూడిన ముత్తయిదువుల కెల్ల తమల పాకులు వక్కలు యిచ్చిరి. వీనికి దంపతి తాంబూలములని పేరు

120.వ:- అయ్యెడ.

టీక :- అయ్యెద = ఆసమయమున -

121.సీ॥ బుగులు కొంచును దావి దగ నామతించుక
స్తురిజీని వ్రాఁతల దుప్పటములుఁ
బసిమి మించులు మించు పదియాఱు వన్నియ
బంగారు చెఱఁగుల పచ్చడములు
ముంగొంగులను వ్రేలు ముత్యాల కుచ్చుల
నలరెడు చెంగావి వలిపములను
గఱిమానికంబుల గముల తేటలను గూ
ర్చిన మేలి పట్టంచు రెంటెములును
తే॥ జెందిరపుఁ గావు లంచల బందుకట్లు
జిలుఁగు వన్నెలు మంజిళ్లు చిలుకచాలు
మొదలుగాఁగను జదివించి రదను వేచి
యనుఁగు లగునేల ఱేండ్లు యయాతి కపుడు - 121

టీక :- గుబులు కొంచును = గుబాళించుచు, తావి = పరిమళమును కస్తురి, తగనామ మించు = కస్తూరి కి తగినట్లు గాను వలచుపించు, చీనివ్రాతల = చీనిపనిగలిగిన, దుప్పటములు = దుప్పట్లు, పసిమి మించులు మించు = బంగారుకాంతులు మించు, పదియారు వన్నియ = పదారవ వన్నెగల, బంగారు చెఱగుల = బంగారు అంచులు గల పచ్చడములు, మందముగల శాలువలు, ముంగొంగులను వ్రేలు = ముందరి కొంగులతో వ్రేలాడుచున్న, ముత్యాలకుచ్చుల నలరెడు = ముత్యాల కుచ్చులతో నందమైన చెంగావి వలిపెములను, చెన్నుకావిగల వస్త్రములు, కఱి మానికంబుల గముల = ఇంద్రనీలముల సమూహములను, తేటలను గూర్చిన = అచ్చమైన వానిని గూర్చిన, మేలిపట్టంచు = శ్రేష్టమైన పట్టంచుగల, రెంటెములను = జమిలినేత బట్టలు - టూబైటూ - చెందిరపు కావులు = చంద్రకావులు అనగా సింధూరపు వన్నెకావి వస్త్రములు, అంచల బందుకట్లు = హంసల అంచులుగల బందుగట్లు - జిలుగు వన్నెలు = సన్నని వన్నె బట్టలు, మంజిళ్లు = మంజిష్ట వర్ణములుగల వస్త్రములు, - 'గోల్డెన్ఎల్లో' - చిలుకచాలు = చిలుకల చాలుగల అంచుతో నేసిన వస్త్రములు, మొదలుగాగను, అదనువేచి = సమయము కొరకు కాచు కొని యుండి, అనుగులగు నేలరేండ్లు = అతనికి ప్రియమైన రాజులు, అపుడు యయాతికి చదివించిరి.

తా :- సువాసనగుబాళించుచు కస్తురిని పిలుచు చీని వ్రాతలుగల దుప్పట్లు, పదారువన్నెల బంగారంచులు గల పచ్చడములు, ముందరి కొంగులకు ముత్యాలకుచ్చులు

వ్రేలాడు చెంగావి వస్త్రములు, ఇంద్రనీలములు తాపిన మేలైన పట్టంచు గల జమిలినేత బట్టలు, ఇంకను చంద్రకావులు, అంచల బందుకట్లు జిలుగు వన్నె మంజిష్టాలు, చిలుకచాళ్లు మొదలైన వస్త్రములు అతనికి ప్రియమైన రాజులందరు సమయము కొరకు వేచి యుండి చదివించిరి.

విశే :- ఈ పద్యమున ఆనాటి వస్త్రభేదములు గీతమున చెందిరపుకావు లంచల బందుకట్లని వ స్త్రముల జాతులు చెప్పబడినవి. పాల్కురికి సోమన బసవ పురాణమున 20 వస్త్రముల జాతుల పేర్లు తెలిపెను. చూ.పు. 56

''అలం - ఉదాత్తము''

122.చ॥ పొసఁగెడు వేలుపు న్మొదవుఁ బోలినయావుల నొక్క వేయిటిం
బసిమి దనర్చు కుందనపుఁ బల్ల కులఁ వెలలేని సొమ్ములఁ
సఁ గడుఁ గూర్మితోడఁ జదివించిన పిమ్మట గారవంబుతోఁ
బసుపున కిచ్చెనంత వృషపర్వుఁడు కొన్ని విలాతు లింతికిన్ - 122

టీక : వేలుపు న్మొదపు = కామధేనువు, బోలిన యావులఁ = పోలినట్టి ఆవులు - అనగా పొసగిన - బప్పినట్టివి. ఒకవేయిటఁ = ఒక వేయింటిని, పసిమి దనర్చు = పచ్చని కాంతితో నొప్పు, కుందనపు పల్లకులఁ= బంగారు పల్లకీలను, వెలలేని సొమ్ములఁ = అమూల్యా భరణములను వెసఁ = వేగమున, కడు కూర్మితోడ = మిక్కిలిప్రేమతోడ, చదివించిన పిమ్మట, గారవంబుతో = గారాబమున, అంతఁ = ఆపిమ్మట, వృషపర్వుడు, కొన్ని వింతులు= కొన్నివైదేశికములు, పసుపునకిచ్చె = పసుపు కుంకుమక్రింద.నిచ్చెను.

తా :- కామధేనువు లన దగిన యావులను వేయింటిని పసిమి కాంతులుగల బంగారు పల్లకులను, అమూల్యాభరణములను చదివించిన పిమ్మట వృషపర్వుడు గారాబమున కొన్నివైదేశికములు దేవయానకు పసుపుకుంకుమ క్రింద నిచ్చెను.

విశే :- పూర్వకాలపు యాన సాధనములు పల్లకీలు మేనాలు అని రెండు విధములు పల్లకీలలో పురుషులు, మేనాలలో స్త్రీలు పయనించుచుండిరి.

123.వ:- అప్పుడు శుక్రుండు

టీక :- అప్పుడు శుక్రుండును = అపుడు శుక్రాచార్యుడు

124.క:- అల్లున కిచ్చెను బచ్చల
పల్లకియును దమ్మి కెంపుఁ బతకపు జోడున్
జల్లుల సమక ట్టులరన్
బల్లించిన వారువమును బంగరు గొడుగున్ - 124

టీక :- శుక్రుడు - అల్లునకు = పచ్చల పల్లకియును, తమ్మికెంపు పతకపు జోడున్ = పద్మరాగముల యొక్క పతకముల జత, జల్లుల సమకట్టు = చయరవాలములతో చేసిన యలంకారము, అమరన్ = ఒప్పగా, పల్లించిన = ఎక్కుటకు సిద్ధపరచిన, వారువమును = గుఱ్ఱమును, బంగరు గొడుగున్ = ఇచ్చెను.

తా :- అపుడు శుక్రుడల్లునకు పచ్చల పల్లకి, పద్మరాగపు పతకముల జోడు, చామరముల సమకట్టుతో నలంకరించి సిద్ధపరచిన గుఱ్ఱమును, బంగారు గొడుగును యిచ్చెను.

విశే :- జిల్లుల సమకట్టు, మనుచరిత్రయందు సూర్యుని గుఱ్ఱములకు మెడల క్రింద సీవిరుల గుత్తులలంకరించి నట్లు చెప్పబడినది. కనుక అది కావచ్చును. ఆకాలమున నెక్కుటకు గుర్రము నెట్లు సిద్ధపరుచు చుండిరో దాని యందే యిట్లు చెప్పబడినది.

సీ ॥ పచ్చని హురుముంజి పనివాగెపక్కెర
పారసి పల్లంబు పట్టమయము
రాణనొప్పారుపైరాణంబు సింగిణి
తళుకుల కోరుల తరకసంబు
మిహిపసిండి పరుంజా మొహదాకెలంకుల
రావు గుజ్జరిసేఁతకేవడంబు
డాకెలంకున సిరాజీ కరాచురకత్తి
కుడగటక్రొవ్వాఁడి గొరకలపొది
పీలికుంచె తలాటంబు బేరజంబు
మణుల మొగముట్టు వన్ని సాహిణి యొకండు
కర్తయెదుటికి గొనివచ్చె గంధవాహ
బాంధవంబగు నొక మహాసైంధవంబు
అల్లసాని పెద్దన - మను. ఆ.4-28

125.కII జాలుకొను పెంపుతోఁ దగ
నీలాగునఁ దగవు నడిపి యింపు దలిర్పన్
లోలో నలరుచుఁ దనయి
ల్లాలిం గని శుక్రుఁ డనియె నర్మిలితోడన్ - 125

టీక :- జాలుకొను పెంపుతో = తరగని గొప్ప దనముతో, తగన్ = తనకు తగినట్లుగా, ఈ లాగున తగవు నడిపి = ఈవిధముగా మర్యాదలు చేసి, ఇంపుదలిర్పన్ = మనస్సునకు వికాసము కలుగగా, లోలోనలరుచు = లోలోపల సంతోషపడుచు, తన ఇల్లాలిన్ గని = తన భార్యను చూచి, శుక్రుడు, నర్మిలితో = ప్రేమతో, నియెన్ = ఇట్లనెను.

తా :- ఈ విధముగా శుక్రుడు తనయొక్క గొప్పదనమునకు తగినట్లుగా మర్యాదలన్ని చేసి తనమనస్సుకు దార్తముకాగా లోలోపల సంతసించుచు తన యిల్లాలితో ప్రేమతో నిట్లనెను.

126.కII ఇలువడియుఁ జెలువుఁ గలిమియుఁ
గల వానికిఁ గన్నె నొసఁగఁగా గోరుదు, ర
ట్లిలు వడియు జెలువుఁ గలిమియు
గలవానికిఁ గన్నెనొసఁగ గాంచితి, మింతీ! - 126

టీక :- ఇలువడియు = ఇంటితనము, చెలువు = అందము, కలిమియు = సంపద, కలవానికి, కన్నెనొసగగా = బిడ్డనిచ్చుటకు, కోరుదురు, అట్లు =ఆవిధముగా, ఇలువడియు, ఇంటి తనము, చెలువు = అందము, కలిమియు = ఐశ్వర్యము, కలవానికి; కన్నెనొసగగా = బిడ్డనీయగా, గాంచితి మింతీ = కలిగితిమి.

తా :- ఓ యింతీ! లోకమున తలిదండ్రులు ఇంటితనము, అందము, ఐశ్వర్యము కలవానికి బిడ్డనీయగోరుదురు. మనమవి కలవానికి బిడ్డనీయగలిగితిమి.

''అలం - ప్రహర్షణము''

కోరిన వస్తువుల ప్రయత్నముగనేలభించినట్లు చెప్పిన యెడల ప్రహర్షణాలంకార మనబడును.

127.క॥ 'ఒండుకొొదలేదు, తూరుపు
కొండపయిం బ్రొద్దు వొడిచెc గొమ్మా యిcకనే
డెండc బడకుండc గూcతుం
గొండిక యన కంపవలయుc గూరిమి' ననుడున్ – 127

టీక :- ఒండు కొొదువలేదు = ఒక్కటిగూడ తక్కువలేదు, కొమ్మా! ఓఅతివా! తూరుపు కొండపయిన్ = ప్రొద్దుపొడిచె, ఇక, నెండ బడకుండ = నేడు + ఎండబడకుండ = ఈనాడు ఎండకాక మొదలే, కొండిక యనక = మనదేవయాన చిన్నపిల్లనక, కూరిమిని = ప్రేమతో, అంపవలయున్ = పంపవలెను, అనుడున్ = అనగా.

తా :- ఓసీ ! బిడ్డకు ఒక్కటికూడ కొొదువ లేదు. తూర్పు కొండపై ప్రొద్దు పొడిచినది కనుక ఈనాడిక ఎండగాక మొదలే బిడ్డను పంపవలెను. చిన్నపిల్ల అనుకోవద్దు. అని చెప్పగా –

128 అమ్మదిత యంపునదియై కూcతుం గనుంగొని ఇట్లనియె – 128

టీక :- అమ్మదిత = ఆమె, అంపునదియై = బిడ్డను పంపుటకు సిద్ధపడి కూతుంగనుగొని – బిడ్డను చూచి ఇట్లనియె.

తా :- అపుడామె బిడ్డను పంపుటకు సిద్ధపడి, ఆమెను చూచి యిట్లనెను.

దేవయానికి తల్లి బుద్దులు చెప్పుట

129.క:- మగc డేకొలcదిని నడపినc
దగ నట్లే, నీరు కొలcది తామరపై, యే
పగిది న్నడ చెదవో నీ
దగు నేరుపు చూత మింక నలరుం బోడీ! – 129

టీక :- తలరుంబోడి = ఓ దేవయానా!, మగడే కొలదిని నడిపిన = భర్త ఎంతగా నడిపిన, తగన్ = తగినట్లు, అట్లే = అదేవిధముగా నీరుకొలది తామరపై = తామర చెరువులో నీరెంత లోతున్న నంత ఎత్తే పెరుగును. కాని ఎక్కువ తక్కువ పెరుగదు. కనుక ఉన్నంతలో ముడుచుకొను, లేదా సదురుకొను గుణమును నీరుకొలది తామర యనుట కద్దు – ఏపగిదిన్నడచెదవో = ఏవిధముగా నడుచు కొందువో, ఇంక, నీదగు నేరుపు చూతము = నీయొక్క నేర్పులను చూతము.

తా :- బిడ్డా! నీ మొగడు ఎంతగా నడిపిన యంతకే యొదిగి నడుచు కొనుము గాని ఎక్కువ తక్కువలకు పోవలదు, నీరు కొలది తామర పై ఇక నీవెట్లు నడుచు కొనెదవో చూతము.

''అలం =లోకోక్తి''

130.కll మగఁ డేడుగడయు దేవర

మగువకు వేఱొండు లేదు, మఱిగావునన

మ్మగ డోఁగిరంబు గుడువక

తగ దింతికి నారగింపఁ దన కెట్టి యెడన్ -130

టీక :- మగువకు = స్త్రీకి, మగడేడు గడయు = మగడే ఏడుగడ, దేవర = మగడే దైవము, వేరొండు లేదు, మఱి = మఱి ఇంకొకటి లేదు, కావున అమ్మగడు = ఆయొక్క భర్త, ఓగిరంబు గుడువక = అన్నము తినక, ఇంతికి = స్త్రీకి, తనకు, ఎట్టి యెడన్ = ఎట్టిసమయమందైనను, తగదు. ఆరగింప = తినుట తగదు.

తా :- స్త్రీకి పతియే యేడుగడ, అనగా తల్లి, దండ్రి, గురువు, దైవము సమస్తము అతడే దైవము కనుక ఎటువంటి సమయమందైనను మగడు తినకుండ తినరాదు.

''అలం - లోకోక్తి''

131.చll కినియక యర్మిలిన్ మగనికిం దగులైన యనుంగు లేఁగు దెం

చినఁగడుఁ బెంపుసేయిఁ దగుఁ జెచ్చెర నెమ్మది సంతసిల్లు చుం,

దనబలఁగంబు నన్నలును దమ్ములు లోనుగ వచ్చి రేనియుం

బెనిమిటి పంపు ప్రేముడిఁ జేయుట పాటి చెల్వకున్ - 131

టీక :- కినియక = కోపించక, మగవానికిన్ = భర్తకు, తగులైన = స్నేహితులైన అనుంగు లేగు దెంచిన = ప్రియమైన వారు వచ్చినపుడు, అర్మిలిన్ = ప్రేమతో, కడుపెంపు సేయదగు = వారిని మిక్కిలి పెద్ద జేయగా దగును, చెచ్చెరన్ = తగినట్లుగా, నెమ్మది = నిండైన మనస్సులో, సంతసిల్లుచున్ = సంతోషించుచు, తన బలగంబు = తనయొక్క బలగమైన, అన్నలును, తమ్ములు, లోనుగ = మొదలైనవారు, వచ్చిరేనియున్ = వచ్చిన యెడల, పెనిమిటి పంపు = భర్తయొక్క వైపునుండి,

ఆజ్ఞతో, చెల్వకు = స్త్రీకి, పెంపును = వారిని గౌరవించుట, ప్రేముడి జేయుట = ప్రేమించుట, పాటి = పాడి, యగాధర్మము.

తా :- స్త్రీకి భర్తకు ప్రియమైన స్నేహితులు వచ్చినపుడు వారిపై కోపించక, ప్రేమతో వారిని పెద్దజేయ దగును. తనయొక్క బలగమైన అన్నలు, తమ్ములు వచ్చినపుడు పతి యొక్క ఏర్పాటుతో అనగా నతని యొక్క ఆజ్ఞతోగాని లేదా యతని పక్షముననేగాని వారిని గౌరవించుట ధర్మము.

132.క॥ చొచ్చిన యింటికిఁ దగని
న్నిచ్చిన యింటికిని వన్నె యే చందమునం
దెచ్చెదవో చూచెదఁగా,
నిచ్చలు మనవంగ డంబు నిన్నుర బొగడన్ - 132

టీక :- చొచ్చిన ఇంటికి = పుట్టినింటికి, తగన్ నిన్నిచ్చిన యింటికిని = మెట్టినింటికి, వన్నె = కీర్తి, ఏచందమునన్ దెచ్చెదవో = ఏవిధముగా తెత్తువో, చూచెదగా, నిచ్చలు =ఎల్లపుడు, మన వంగడంబు=మనవంశము, నిన్నున్‌బొగడన్ = నిన్ను పొగడు నట్లుగా -

తా :- బిడ్డా నీవు పుట్టినింటికి మెట్టినింటికి, నిన్నందరు పొగడు నట్లుగా ఏవిధముగా కీర్తి దెచ్చెదవో చూచెదను.

133.తే॥ వినుము మగఁ డేరినేనియు మనుపఁ గోరు,
నలుగు, నట్లనె చెలువయుఁ దలఁప వలయు,
నన్న తమ్ముఁడు తండ్రి మామనుచుఁ గూర్మి
నొంటి పాటునఁ గూడి కూర్చుండఁ దగదు ! - 133

టీక :- వినుము మగ డేరి నేనియు = మగడెవర్నైన, మనువగోరు = కాపాడదలచును, అలుగు = కోపించునో, చెలువయున్ = అతని భార్యగూడ, అట్లనె = వారిపట్లయటులనె, అనగా భర్త స్నేహభావము చూపగా స్నేహమున వైరభావము చూపగా వైరమున ననుట దలఁప వలయు = భావింపవలెను. అన్న, తమ్ముడు, తండ్రి, మామ, అనుచున్ = అని వరుసలను భావించుచు, కూర్మిన్ = వారిపై గల ప్రేమతో ఒంటిపాటునన్ = ఏకాంతమున, కూడి = వారితో కలిసి, కూర్చుండ దగదు = కూర్చొనరాదు.

తా :- ఓ దేవయానా! భర్త ఎవరి యెడ ప్రేమ జూపునో యవర పట్ల క్రోధమును ప్రదర్శించునో భార్య గూడ వారిపట్ల యటులనేమెలగ వలయును. ఏకాంతమున పురుషులతో నెపుడే గాని అన్నయని, తమ్ముడని, తండ్రి యని, మామయని వరుసను తలుచు కొని కూర్చొనరాదు.

134.క॥ ఆవెన్నుఁడు లచ్చియు బలె,
దేవియు దేవరయుఁ బోలెఁ, దెలివి దలిర్పన్
నీవును మగఁడును బూవుం
దావి యనం, గూడి మనుఁడు తరలని కూర్మిన్ - 134

టీక :- ఆవెన్నుడులచ్చియు బలె = ఆవిష్ణువు మరియు లక్ష్మివలె, దేవియు దేవరయు బోలె = దేవి మరియు దేవర వలె, అనగా పార్వతి పరమేశ్వరుల వలె, తెలివి దలిర్పన్ = జ్ఞానవంతులైన, నీవును మగడును = నీవు మరియు నీభర్త, పూవుం దావి యనఁ గూడి, పూవు మరియు పరిమళ మన్నట్లుగా కలిసి, తరలని కూర్మిన్ = ఉడివోని ప్రేమతో, మనుడు = జీవించుడు.

తా :- లక్ష్మీనారాయణులవలె, పార్వతీ పరమేశ్వరులవలె మీరు ఆదర్శవంతులై పూవు మరియు పరిమళము వలె ఒకరి నొకరు విడువని వారై ఎడతెగని ప్రేమతో జీవింపుడు.

''అలం - ఉపమ''

135.చ॥ పెనిమిటి దండుదాడి చని పెంపునఁ గ్రమ్మరుదాఁక విడియం
బును సిరిగందమున్ విరులు ముట్టక యుండదగుం బొలంతి, తే
జునఁ గడు నొప్పు మట్టసపు సొమ్ములతోఁ గుఱు మాపు చీరతోఁ
దనకలి కొప్పుతో మిగులఁ దార్కొను ముత్తెపు సేన బొట్టుతోన్ - 135

టీక :- పెనిమిటి దండు దాడిచని = భర్త దండెత్తిగాని, ఇతరులపై దాడిచేసిగాని వెళ్లి, పెంపున గ్రమ్మరుగాక = మళ్ళి తిరిగివచ్చు వరకు, విడియంబును = తాంబూలము, సిరిగందమున్ = శ్రీగంధము, విరులు = పూవులు, ముట్టక యుండ దగున్ పొలంతి = యువతి వానిని తాకకుండ నుండ వలెను. తేజాన కడునొప్పు = ప్రకాశమున మిక్కిలిగానుండు, మట్టసపు సొమ్ములతో= పొందికయైన నగలతో, కురుమాపు చీరతో కొలదిగా మాసిన చీరతో, తనకలి కొప్పుతో = చిక్కువడిన వేణితో, మిగులన్ = మిక్కిలిగా అనగా తఱచుగా తార్కొను ముత్తెపు = సేన

బొట్టుతోఁ = కలిగియుండెను, ధరించెడు, ముత్తెపు = ముత్తెముల యొక్క, సేన బొట్టు = పాపెట బొట్టుతో - యుండదగుఁ = ఉండవలెను.

తా : భర్త దండు, దాడి మొదలైన వానితో పరదేశ గతుడైనపుడు భార్య, యతడు తిరిగి వచ్చువరకు తాంబూలము, శ్రీగంధము పూలు ముట్టరాదు. మట్టసపు సొమ్ములతో, కురుమాపు చీరతో చిక్కువడిన కొప్పుతో, ముత్యాల పాపట బొట్టుతో మాత్రమే యుండవలెను.

విశే :- పాపెట బొట్టు 'సువాసిని' చిహ్నము కనుక దానిని ఎల్లపుడు ధరించుచునే యుండవలెను. ఇక భర్త పరోక్షమున తక్కిన నగలెందుకనగా - నవి యతని క్షేమకారకము. కావున స్త్రీ యెల్లపుడు కొన్ని నగలైన ధరించి యుండవలెను. చూ. కళా. సుగాత్రీశాలీనుల వృత్తాంతము.

''అలం - ఉదాత్తము''

136.సీ॥ అది వేల్పురాయని యనుఁగు నెచ్చెలి సుమీ
బత్తితోఁ గూర్చుక వత్తుగాని
ప్రొద్దు పట్టికి నిది బోన కత్తియసుమీ
ప్రోది తోడుత నడుపుడుదువుగాని
పైదలి యది గాడ్పు దాది కూఁతురుసుమీ
కూర్మియుప్పొంగ సాకుఁదువుగాని
యది పైడి దొరరాణి యనుఁగు జెల్లెలు సుమీ
యువిద గారవము సేయుదువు గాని

తే॥ యనుచు శర్మిష్ఠ యూడిగం బమరఁ జేయు
నలరుఁబోండ్లను వేర్వేఱ నప్పగించి
చెంతఁ దలవంచుకొని తన చెలులనడుమ
విన్నవై యున్న రక్కసి కన్నెఁ జూపి - 136

టీక :- అది = ఆపిల్ల, వేల్పురాయని = ఇంద్రుని యొక్క, అనుగు నెచ్చలి సుమీ = ప్రియమైన సఖి సుమా, బత్తితో = భక్తితో కూర్చుక వత్తుగాని = నడుపుకొని రమ్ము, ప్రొద్దుపట్టికి = యమునికి, ఇదిబోన కత్తియ సుమీ = ఈమె అన్నపు వడ్డించునది. ప్రోదితోడుత = పోషణ భారముతో, నడుపుదువుగాని = రక్షింతువుగాక, పై దలియిది = ఈ యువతి, గాడ్పుదాది కూతురు సుమీ =

వాయుదేవుని యొక్క దాసిబిడ్డ సువా, కూర్మి యుప్పొంగ - ప్రేమ పొంగుచుండగా, సాకుదువుగాని = రక్షింతువుగాని, ఇది పైడిదొరరాణి = ఇది కుబేరుని భార్యయైన చిత్రలేఖ యొక్క, అనుగు చెల్లెలు సుమీ = ప్రియమైన చెల్లెలు, ఉవిద = ఓయువతీ, గారవము సేయుదువుగాని = గౌరవముతో చూడుము, అనుచు - శర్మిష్ఠ; ఊడిగంబమర జేయు = తగినట్లుగా సేవ జేయు, అలరుబోండ్లను = యువతులను - వేర్వేరనప్పగించి = వేరువేరుగా నప్పజెప్పి, చెంతన్ = సమీపమున, తలవంచుకొని, తనచెలులనడుమ = తనయొక్క చెలికత్తెల మధ్య విన్ననై యున్న = చిన్న బోయియున్న , రక్కసి కన్నె జూపి = దానవరాజు కూతురైన శర్మిష్ఠను జూపి,

తా :- ఓ శర్మిష్ఠా ఈమె ఇంద్రునికి ప్రియమైన స్నేహితురాలు. కనుక భక్తితో కొలువుము, ఈమె యమునికి బోనకత్తెకనుక చక్కగా నడుపుము, ఈమె వాయుదేవునికి దాది కూతురు కనుక చక్కగా రక్షింపుము. ఈమె కుబేరుని భార్యచెల్లెలు కనుక తగినట్లు సేవించుము. అని వేర్వేరుగా నామెకు సేవించ వలసిన వారిని పరిచయము చేసి, చివరన తన చెలుల నడుమ తలవంచుకొని చిన్నబోయి నిలిచిన శర్మిష్ఠను దేవయానికి చూపి -

137.కII ఇది పుట్టుబోగి దీనికిఁ
గొదవేమియు లేక యుండఁ గూర్చుక రమ్మీ
చెదరఁగఁ జూడక నీవలె
ముదితా! కడు గూడు నీళ్లు మొదలగు నెడలన్ - 137

టీక :- ఇది పుట్టుబోగి = ఈమె పుట్టుక చేతనే ఐశ్వర్యవంతురాలు, దీనికి కొదవేమి లేక యుండ = ఈమెకేదియు తక్కువగాకుండ, కూర్చుకరమ్మా = నడుపుకొని రమ్ము, ముదితా! ఓ దేవయానా! నీవలె = నీవెట్లో అటులే, కడున్ = మిక్కిలిగా, కూడునీళ్లు = ఆహార పానీయములు, మొదలగు నెడలన్ = మొదలైన వాని దగ్గర, దరగ జూడకు = వేరుగా చూడవద్దు.

తా :- ఓ దేవయానా! ఇది అనగా ఈ శర్మిష్ఠ అగర్భ శ్రీమంతురాలు. కనుక నీమెకేదియు కొదవ కలుగకుండ చూచు కొనుము. ఆహార పానీయముల దగ్గర నీవెటులో ఈమెనటులే చూడుము కాని వేరుగా చూడవలదు.

138.వ:- అని పెక్కు చందంబులం గూతునకుం జెప్పి పయనంబు
సేయుటయును - 138

టీక :- అని, పెక్కు చందముల = అనేక విధములుగా కూతునకుంజెప్పి = బిడ్డకు బుద్ధులు చెప్పి , పయనంబు సేయుటయు = పయనము చేయగా -

తా :- అని ఈవిధముగా బిడ్డ కనేక విధములైన బుద్ధులు చెప్పి ప్రయాణము చేయగా-

139.చ॥ దళముగఁ గల్వరేకుల తుదన్ దిగజాఱెడు మంచునట్లుకన్
గొలుకుల డిగ్గు నీరు గని, గుండెదిగుల్లన దల్లి, యిట్లనుం,
జెలువను గేలుదమ్ములను జెక్కులు నొక్కుచుఁ గౌఁగిలించుచున్
వెలవెలవాఱు మోముపయి విన్నదనంబు దొలంకుచుండఁగన్ - 139

టీక :- తళముగ = దట్టముగా, కలిరేకులు తుదన్ = కలువపత్రములు చివరల నుండి, దిగజాఱెడు, మంచునట్లు = మంచు బిందువులవలె, కొలకుల డిగ్గు = కనుకొలకుల నుండి జారు, నీరుగని, గుండెదిగుల్లన = గుండె దిగులుపడగా, తల్లి చెలువను రేలుదమ్ములను = హస్త పద్మములతో, చెక్కులునొక్కుచు = చెంపలుబుడుకుచు, కౌగిలించుచున్, వెలవెలబారు = తెల్లబారు, మోముపయి = ముఖముపై, ఎన్నదనంబు = చిన్నబాటు తొలంగు చుండగన్ = కనిపించుచుండగా, ఇట్లనున్ = ఈవిధముగా ననెను.

తా :- కలువ రేకుల నుండి జారు మంచు బొట్లవలె దట్టముగా కను కొలకుల నుండి నీరు జారు బిడ్డను గని తల్లి గుండె దిగులుతో చేతులతో చెంపలు పుడుకుచు - కౌగలించుకొని - ముఖముపై చిన్నవోయిన తనము కనిపించు చుండగా నిట్లనెను.

''అలం - ఉపమ''

140.క॥ ఉల్లమున వగవ నేటికి,
నెల్లుండియు పిల్వనంప నేతెంచెదు, నా
తల్లివి గద, నీ తమ్ముఁడు
మల్లికయుం దోడు రాఁగ మది నడలేలా? - 140

టీక :- నాతల్లివిగదా! నీవు బిడ్డవుగదా ! ఉల్లమున వగవనేటి = మనస్సున దుఃఖించుట ఎందులకు, ఎల్లుండియె = రేపుగాక నామరునాడు, పిల్వనంప నేతెంచెదు =

పిల్వనంపెదను వచ్చెదవుగాని, నీతమ్ముడు, మల్లికయుఁ = నీ తమ్ముడు మరియు మల్లిక, తోడురాగ = జతగా వచ్చుచున్నారుగదా! మదినడలేలా = మనస్సులో దిగులెందుకు–

తా :– బిడ్డా! నాతల్లివిగాదా! మనస్సులో ఎందుకు దుఃఖపడెదవు నిన్ను ఎల్లుండియె మరల పిలిపించు కొందును. ఇపుడు నీ తమ్ముడు మరియు మల్లిక తోడు వచ్చుచున్నారుగదా ! దిగులెందులకు –

141.ఉ॥ లచ్చియు రూపు వంగడము లావును రాచఱికంబు గౌరవం
బెచ్చుగఁ గల్గి, యిజ్జగము నేలెడు పెన్మిటిఁ జెంది తర్మిలిం.
బిచ్చిలు పొంపుతోడ నినుఁ బెంచిన మచ్చికఁ బాయలేకకా,
నొచ్చెము లేదుగా తలఁప నొక్కటియుం గన నీతెఱంగునన్ – 141

టీక :– అంగనా ! = ఓదేవయానా !, లచ్చియు = ఐశ్వర్యము, రూపు = సౌందర్యము, వంగడము = వంశము, లావును = గొప్పదనము, రాచఱికంబు = ప్రభుత్వము, గౌరవంబు = గౌరవము, కలిగి, ఇజ్జగము నేలెడు = ఈ ప్రపంచమును పాలించు, పెన్మిటి జెందితివి = భర్తను పొందితివి, అర్మిలఁ = ప్రేమతో, పిచ్చిలు సొంపుతోడ = స్నేహమాధుర్యమున, నినుబెంచిన = నిన్ను పెంచినట్టి, మచ్చిక బాయలేక = అలవాటు పొగొట్టుకొనలేక, కాని ఏతెఱంగునఁ = ఏవిధముగా చూచినను, తలఁపఁ = ఆలోచింపగా, ఒక్కటియుఁ = ఒచ్చెము లేదుగా = కొరత లేదు కదా!–

తా :– తల్లీ ఓదేవయానా! ఐశ్వర్యము, సౌందర్యము, వంశము, గొప్పదనము ప్రభుత్వము యిన్ని కలిగి ఈ లోకము నంతటిని పాలించు భర్తను పొందితివి. నీవు నిన్ను పెంచిన స్నేహమును విడలేక దుఃఖించు చుంటివేగాని ఏవిధముగ చూచినను నీకొక్కటి గూడ తక్కువ లేదు కదా!–

142.ఆ ॥ అనుచు గారవించి యనుఁగుఁగూఁతును దోడు
కొనుచుఁ, జెలులుఁ దాను కొంత దవ్వు
వచ్చి, యంతనిల్చి, పచ్చల పల్లకి
లోన, గొమ్మ నునిచి, మేను నిమిరి – 142

టీక :– అనుచుగారవించి = అని బుజ్జగించి, అనుగు కూతును = ప్రియమైన బిడ్డను, తోడుకొనుచు = వెంట తీసుకొని, చెలులు, తాను, కొంత దవ్వు వచ్చి =

కొంతదూరము వచ్చి), అంతఁ = ఆపిమ్మట, నిల్చి, పచ్చలపల్లకిలోన, కొమ్మన... = బిడ్డనెక్కించి, మేను నిమిరి = శరీరమును నిమిరి-

తా :- అని బిడ్డను గారాబము చేసి, తోలుకొని చెలులు మరియు తాను కొంత దూరము వచ్చి నిలిచి, ఆమెను పల్లకినెక్కించి శరీరము నిమిరి-

143.క॥ ఉండుమను మమ్మ, క్రమ్మఱి
పొండను నీచెలులఁ దోడఁ బుట్టువులగు నీ
చండుని మార్కుని ననుపుము,
...ండుగఁ దగ నుండు నీవు నీపెనిమిటి తోన్ - 143

టీక :- ఉండుమనుమమ్మ = అమ్మా ఉండుమని చెప్పు, క్రమ్మఱి పొండను నీచెలులతోడ = నీచెలికత్తెలతో తిరిగి పొమ్మని చెప్పుము. తోబుట్టువులగు = సోదరులైన ఈ చండుని మార్కుని ననుపుము. ఈ చండుని, మార్కుని పంపుము. నీవు పెనిమిటి తోడఁ = నీవు భర్తతో, తగఁ ఒప్పునట్లుగా, నిండుగనుండుము.

తా :- తల్లీ ! నీచెలికత్తెలతో నిలువుమని తిరిగిపొమ్మని చెప్పుము. నీవు వెళ్లిన పిమ్మట సోదరులైన ఈ దండుని, మార్కుని తిరిగి పంపుము. భర్తతో నీవు నిండుగా నుండుము.

144.క॥ అనిపల్కి కూఁతు రంపినఁ
జనియెఁ శుక్రుని పొలంతి చానలుఁ దానుఁ
నునుపైఁడి గావి చెఱఁగులఁ
బనుపడియెడి జీనితోడి పల్లకి గదలన్ - 144

టీక :- అనిపల్కి = అని చెప్పి, కూపిరంపినఁ = కూతురువెళ్లి రమ్మని చెప్పగా, శుక్రుని పొలంతి = శుక్రుని భార్యయైన జయంతి చానలు తానుఁ = చెలికత్తెలు మరియు తాను, నును = నునుపైన, పైడికావి చెరగుల = బంగారు కావి యంచులతో, పనుపడి యెడి = సిద్ధముగా నుండెడి, చీనితోడి పల్లకి = చీనిపనితో గూడిన పల్లకి, కదలఁ = కదలుచుండగా, చనియెఁ = వెళ్లెను.

తా :- అని చెప్పి బిడ్డ వెళ్ళిరమ్మనగా తాను మరియు చెలులు బంగారు కావి చెరగులు గల పలకీలు సిద్ధముగా నుండగా వానినెక్కి కదలి వెళ్లిరి.

145.వ:- ఇట్లు గదలుటయు శుక్రుండు వెంటనరిగి, యటమున్ను వెడలి
వీడు విడిసి యున్న యయాతింగనుంగొని యిట్లనెను.

టీక :- ఇట్లు కదలుటయు = ఈవిధముగా వారు వెనుకకు మరలగా, శుక్రుండు వెంటనరిగి = శుక్రుండు వారి వెంట వెళ్లి, అటః = అచట, మున్ను వెళ్ళి = మొదలు పోయి, వీడు విడిసి యున్న = పెండ్లి బలగముతో విడిది చేసియున్న, యయాతిం గనుగొని = యయాతిని చూచి, ఇట్లనియె-

తా :- ఈవిధముగా జయంతి మొదలైన వారు కదలి తిరిగి వెళ్లగా శుక్రుడు వారి వెంట పోయి అక్కడ తమ కంటె మొదలే వెళ్లి విడిది చేసియున్న యయాతిని చూచి యిట్లనియె.

శుక్రుడు దేవయానిని యయాతి కప్పగించుట

146.కII 'ఏదియు నెఱుఁగదు ప్రోదిః
బోదునఁ బెరిగినది ఱేఁడ, మొన్నటిది సుమీ,
పైదలి నేరము కలిగినఁ
గాదని తెలుపుదువు గాని కడు నలుగకుమీ' - 146

టీక :- ఱేడ = ఓమహారాజా ! ఏదియునెరుగదు = ఈమెకేదియు తెలియదు. ప్రోదిః = మాపోషణలో, బోదున పెరిగినది = ప్రేమతో పెరిగినది, మొన్నటిది సుమీ = నిన్న మొన్నటిది – అనగా చిన్నపిల్ల, పైదలి – ఈ యువతి యొక్క, నేరము కలిగిన = దోషమున్న యెడల, కాదని తెలుపుదువు గాని =అటుల కూడదని చెప్పుము కాని, కడునలుగకుమీ = మిక్కిలిగా కోపింప వలదు.

తా :- ఓ మహారాజా ఈమె ఏది కూడ ఎరుగదు. మిక్కిలి గారాబముగా పెరిగినది. నిన్నమొన్నటిది. కనుక ఏదైన తప్పు జరిగిన ఇటుల చేయకూడదని చెప్పుముగాని కోపింపవలదు.

147.వII అని యప్పగించి శర్మిష్ఠం జూపి ఇట్లనియె - 147

టీక :- అని యప్పగించి = అని అప్పగింతలు పెట్టి, శర్మిష్ఠంజూపి = శర్మిష్ఠను చూపి, ఇట్లనియె -

తా :- అని బిడ్డనప్పగించి శర్మిష్ఠను చూపి ఇట్లనెను -

148.క॥ 'చెలువున వృషపర్వుండను
బలియుని గారాపుఁ బట్టి పసిబిడ్డ సుమీ'
వలరాచపనులు వెలిగాఁ
గలిగిన సొంపులను నడపఁగా దగు దీనిన్! - 148

టీక :- ఈమె చెలువున = వృషపర్వుండను = వృషపర్వుడను; బలియుని గారాబుపట్టి = బలవంతుడైన మహారాజు యొక్క ముద్దుబిడ్డ, పసిబిడ్డ సుమీ = పసిపిల్ల, అనగా నేమెరుగనిది. వలరాచపనులు వెలిగా = శృంగార కృత్యములు మినహా, కలిగిన = కలిగినటువంటి, సొంపులను = విలాసమైన పనులందు, దీనిన్ = ఈమెను, నడుపగా దగును = ఉంచదగును.

తా :- ఈమె వృషపర్వుడను మహారాజు యొక్క ముద్దుబిడ్డ పసిపిల్ల కనుక నీమెను శృంగార విలాసములకు తప్ప ఇతర కార్యములందు నడుప వచ్చును.

149.వ:- అని చెప్పి యతండు సేయు గారవంబున సంతసిల్లి - 149

టీక :- అనిచెప్పి, అతండుసేయు = ఆమహారాజు చేసిన గారవంబున = గౌరవమున, సంతసిల్లి = సంతోషించి-

తా :- అని ఈవిధముగా చెప్పి యామహారాజు చేయు గౌరవమునకు సంతోషించి-

150.చ॥ పుడమిని గల్గు ఱేండ్లు తగఁ బూనికఁ గానుక లిచ్చి నిచ్చ నీ
యడుగుల వ్రాలఁగా 'జగము' లన్నియు నేలుచు వెండి పైఁడియుం
గొడుకులుఁ గూతులుం గలిగి గుఱ్ఱము లేని కపిండు పల్లకీల్
గొడుగులు నివ్వటిల్లఁగను గూరిమితో మను పెక్కు లేండ్లొగిన్! -150

టీక :- పుడమిని గల్గుఱేండ్లు = భూమిపై గలరాజులు, తగన్ = తమకు తగినట్లు, పూనిక కానుకలిచ్చి = కానుకలిచ్చి, నిచ్చన్ = ఎల్లపుడు, పూనిక - నీయడుగువ్రాలగా = వినయము యొక్క కూడితో = నీపాదములపై బడుచుండగా, జగములన్నియు = లోకములన్నింటిని, ఏలుచు = పాలించుచు, వెండిపైడియున్ = వెండి

బంగారము, కొడుకులు బిడ్డలు గలిగి, గుఱ్ఱములు, ఏనికంపిండు = ఏనుగు మందలు, పల్లకీల్= పల్లకులు, గొడుగులు, నివ్వటిల్లగను = ప్రకాశింపగా, పెక్కు లేండ్లోగిన్ = చిరకాలము, కూరిమితో మనుము = ప్రేమతో జీవించుము.

తా :- ఓ మహారాజా! భూమిపైగల రాజులందరు తమతమకు తగినట్లు కానుకలిచ్చుచు నీపాదములపై బడుచుండగా, వెండి బంగారము, కొడుకులు బిడ్డలు, గుఱ్ఱములు, ఏనుగులు, పల్లకీలు, గొడుగులు, మిక్కిలిగా గలిగి లోకములన్ని పాలించుచు ప్రేమతో చిరకాలము మనుము.

యయాతి తన పురంబున కేగుట

151.మః- అని దీవింపుచు శుక్రుఁ డంతటను నెయ్యం బొప్పఁగాఁ గ్రమ్మ రం
జనియెన్ రాజును బేరులుం గడిఁది నిస్సాణంబులన్ లోనుగాఁ
గను బెక్కుల్ బలువాయిదంబులు చెలంగన్ వీడు చేరంగ, నం
తను దానం గలవార లెల్లఁ గడఁకల్ దైవాఱ నొక్కుమ్మడిన్ - 151

టీక :- అని దీవింపుచు = అని దీవించి, శుక్రుడంతటను = అంతట శుక్రుడు, నెయ్యంబొప్పగా = ప్రేమతో, క్రమ్మరం జనియెన్ = తిరిగి వెళ్లెను - రాజును = మహారాజు, బేరులు = భేరీలు, కడిది నిస్సాణంబులున్ = గొప్పనైన తప్పెటలు, లోనుగాగను = మొదలైన, పెక్కులు వాయిదంబులు = అనేక వాయిద్యములు, చెలంగన్ = మ్రోగగా, వీడు చేరంగ = పట్టణము సమీపించగా, అంతను = అపుడు, దానం గల వారలెల్ల = ఆపట్టణమున గల వారందరు, కడకల్ దైవార = తమప్రయత్నము లొప్పగా, ఒక్కుమ్మడిన్ = ఒక్కమొత్తముగా -

తా :- అని దీవించి శుక్రుడు తిరిగి వెళ్లిన పిదప ఆమహారాజు, భేరీలు, తప్పెటలు మొదలైన వాయిద్యములు మ్రోగుచుండగా తమ పట్టణమును సమీపించ, నపుడా పట్టణమున గల వారందరు ఒక్కుమ్మడిగా తమతమ ప్రయత్నములందు నిమగ్నులై

152.కః కలపడగ లెత్తి కస్తురి
కలయంపులు చల్లి యాణిగల ముత్తెపు ము
గ్గులు వెట్టి వీది వీదులఁ
గలయంగా మేలుకట్లు గట్టిరి వేడ్కన్ - 152

టీక :- వేడ్కన్ = సంతోషముతో, కలపడగ లెత్తి = తమ చెంతనున్న ధ్వజము లెగురవేసి, కస్తురి కలయంపులు చల్లి = కస్తూరితో సాన్పిచల్లి, ఆణిగల ముత్తెపు ముగ్గులు బెట్టి = ఆణిముత్యములతో ముగ్గులుపెట్టి, వీధివీధులన్, కలయంగా = అంతట కలియునట్లుగా, మేలుకట్లు కట్టిరి = వితానములు కట్టిరి.

తా :- వారు సంతోషమున నింటింట కేతనములెత్తి కస్తూరితో కల్లాపి చల్లి, ముత్తెపు ముగ్గులుపెట్టి వీధి వీధులలో నంతట గూడను మేలుకట్లు కట్టిరి.

153.చ॥ అరుదటు చూడఁగా నమరె నందుఁ గ్రందుగఁ గుందనంపుఁబెన్
గురుఁజులమీఁద దార్కొనిన క్రొత్తగు పుత్తడి బొమ్మ లెల్లెడన్
సొరిదిని ఱేని సోబనపు సొంపు గనుంగొన వచ్చినట్టి య
చ్చరపువుఁ బోండ్ల చందమునఁ జక్కదనంబుల సొంపు పెంపునన్ -153

టీక :- అరుదు - అటుచూడగా నమరె, అందులన్ - ఆపట్టణమున, క్రందుగన్ = అందముగా, కుందనంపుపెన్ గురుజాల మీద = గొప్పనైన బంగారు గురుజాలపై, దార్కొనిన = ఉంచబడిన, క్రొత్తగు పుత్తడి బొమ్మలు = క్రొత్తవైన బంగారు బొమ్మలు, ఎల్లెడన్ = అంతటను, సొరిదిని = క్రమముగా, ఱేని సోబనపు సొంపుగనుంగొన = ఆరాజు గారి యొక్క వైభవముయొక్క అందమును చూడగా వచ్చినట్టి, అరుదెంచినట్టి, అచ్చరపువు బోండ్ల చందమున = అప్సరసలు విధానమున చక్కదనంబున, సొంపుపెంపునన్ = శృంగారము యొక్క పెంపున, అరుదు = అరుదన్నట్లుగా, అటుచూడగా = వానిని చూడగా, అమరెన్ = ఒప్పెను.

తా :- అపుడా పట్టణమందలి బంగారు బురుజులపై నిలిపిన పుత్తడి బొమ్మలు వాని యందము చూడగా ఆమహారాజు యొక్క వైభవమును చూచుటకై వచ్చి నిలిచిన యప్సరసలన్నట్లుగా నొప్పెను.

''అలం - ఉపమ''

154.సీ॥ ఎడలేక యుండంగ విడిన తోరణములు
పైల్లుపైఁ బడెడు కరుళ్లు గాఁగఁ
దఱుచుగాఁ బెట్టిన తావి దూపపుఁ బొగల్
గుంపులై మెలఁగు మొగుళ్లుగాగ

గములైన కరిమానికముల మేడలు లోనఁ
గలఁగి డాఁగిన యట్టి మలలుగాఁగ
నెల్లప్పుడును బిక్కటిల్లు బేరులమ్రోత
రహిమించు తరఁగల రవలిగాఁగ

తే॥ మేలిపటికంపు గోడల డాలు చాల
బెంపుతోఁ బర్వుతెలినీటి సొంపు గాఁగఁ
బుడమి - లోపలఁ వేఱొండు కడలివోలె
నెసఁగు నవ్వీడు సిరిపుట్టినిల్లు గాఁగ, - 154

టీక :- అవ్వీడు = ఆపట్టణము, ఎడలేక యుండంగ = సందులే కుండగా, ఇడిన తోరణములు = కట్టిన తోరణములు, పెల్లు = పెల్లుగా, పైబడెడు = పైన బడుచున్న, కరళ్లుగాగ = పెద్ద పెద్ద అలులు కాగా, తరచుగా = ఎక్కువగా, పెట్టిన, తావి దూపపు పొగల్ = పరిమళ దూపములు గుంపులైమెలగు = గుంపులు గుంపులుగా కూడిన, మొగుళ్లు కాగ = మేఘములు కాగా, గములైన = గుంపులైన, కరిమానికముల మేడలు = ఇంద్రనీల భవనములు, కలగి = ఇంద్రునికి భయపడి, లోన = లోపల, దాగిన యట్టి మలలు కాగ = పర్వతములు కాగా, ఎల్లప్పుడును = ఏవేళలోను, పిక్కటిల్లు = మిక్కిలిగా వ్యాపించిన, భేరుల మ్రోత = భేరుల ధ్వని, రహిమించు = ప్రకాశించునట్టి, తరగల రవళికాగ = తరంగముల యొక్క ధ్వనికాగా, మేలి = శ్రేష్టమైన, పటికంపు గోడల డాలు = స్పటికపు గోడల కాంతి, చాలపెంపుతో పర్వు = మిక్కిలి విస్తారముగా వ్యాపించు, తెలినీటి సొంపుగాగ = స్వచ్ఛమైన నీటి యొక్క అందముకాగా, పుడమి లోపల = ప్రపంచమున, వేరొండు కడలివోలె = మరియొక సముద్రమువలె, అవ్వీడు = ఆపట్టణము, సిరిపుట్టినిల్లు గాగఁ = లక్ష్మీదేవికి పుట్టినిల్లుగా, ఎసగుఁ = ఒప్పును.

తా :- ఆపట్టణము, పట్టణము నిండ సందులేకుండ నుండు తోరణములు, గొప్పగొప్ప కరళ్లుగా పరిమళ దూపముల పొగలు పైన వ్రాలిన మేఘముగా, ఇంద్రనీలపు మేడలు లోపల దాగిన పర్వతములుగా, ఎల్లపుడు మ్రోగెడు భేరీరవముల తరంగముల యొక్క ధ్వనిగా, స్వచ్ఛమైన స్పటికపు గోడల కాంతి అంతులేని అంతులేని జలముగా నాపట్టణము లక్ష్మీదేవికి పుట్టినిల్లై ప్రపంచమున రెండవ సముద్రముగా నుండెను.

''అలం - పరిణామము''

155.ఉ॥ మంది గుఱాలు నేనుఁగులు మావుతులుఁ దొరలెన్నఁబెక్కురై
క్రందుగఁ గూర్మితో నెదురుగాఁ జని పౌజులు దీర్పఁ జూచుచుం,
గొందఱు ముందటన్ బయిఁడి కోలల హెగ్గళు లెచ్చరింపగా,
నిందనియాముచేఁ బొదలు నేనుఁగు నెక్కి మదిం జెలంగు చున్ - 155

టీక :- మంది = జనము, గురాలు = అశ్వములు, ఏనుగులు, మావుతులు, = మావటీలు, దొరలు, ఎన్నన్ = ఇటుల లెక్కించగా, పెక్కులై అనేకులై, క్రందుగన్ = వరుసగా, కూర్మితో = ప్రేమతో, ఎదురుగా జని = మహారాజున కెదురేగి, పౌజులు దీర్ప = వరుసలుగా నిలువగా, చూచుచున్ = వారందరిని చూచుచు, కొందరు, ముదరన్ = ముందట, పైడికోలల = బంగారు బెత్తములు, పూని హెగ్గళు లెచ్చరింపగా = హెగ్గడి కాండ్రు హెచ్చరికలు పలుకు చుండగా, ఇందని = పైకుబికిన, ఆముచేబొధలు= మదముతో కూడిన, ఏనుగునెక్కి, మదిం జెలంగుచున్ = మనస్సులో సంతసించుచు.

తా :- గుఱ్ఱములు, ఏనుగులు, మావటీలు, దొరలు, అని యిటుల అనేక విధములైన జనులు వరుసగా మహారాజున కెదురువెళ్లి, పౌజు దీరి నిలువగా వారందరిని చూచుచు ఒక మదగజము నెక్కి బంగారు బెత్తముల హెగ్గడి కాండ్రు హెచ్చరికలు పలుకు చుండగా మనస్సున సంతసించుచు.

156.వ:- వీడు చొచ్చి యారాజు రాజవీదిం జనునప్పుడు 156

టీక :- వీడుచొచ్చి = పురప్రవేశము చేసి, ఆరాజు; రాజవీధింజను నపుడు = రాజవీధిలో వెళ్లునపుడు

తా :- ఆ రాజు యిటుల పుర ప్రవేశము చేసి రాజవీధిలో వచ్చుచుండగా

157.ఉ॥ చూడఁగ నేగుదెంచి కడుఁ జక్కులతో డుత రాయుముత్తెపున్
మేడల మీఁది కెక్కి యల మేనక గ్రేణి యొనర్చు పాయపుం
జేడియ లబ్బురం బయిన చెంగలువల్తగఁ జల్లి రందఱున్
వేడుక తోడ రాకలువ విందుపయి న్మది కూర్మి లెచ్చఁగన్ - 157

టీక :- చూడగా నేగు దెంచి = ఆ మహారాజును చూచుటకై వచ్చి, కడుఁ = మిక్కిలిగా, చుక్కల తోడుత రాయు = చుక్కలను ఒరిసికొను, ముత్తెపుఁ మేడల మీదికెక్కి = ముత్యాల మేడలపై కెక్కి, అల = ఆ యొక్క, మేనకఁ గ్రేణి యొనర్చు = పరిహాసము చేయు పాయపురం జేడియలు = వయసుగల యువతులు, అబ్బురంబయిన = అశ్చర్యకరమైన, చెంగలు వల్ = ఎర్రకలువలు వేడుకతోడ = సంతోషముతో, రాకలువ విందుపయిఁ = ఆరాజచంద్రునిపై మది కూర్మిలెచ్చఁగఁ = మనస్సులో కోరికలు హెచ్చుచుండగా, అందఱుఁ = వారందరు, తగఁ = తగినట్లు చల్లిరి.

తా :- ఆ మహారాజును చూచుటకు వచ్చి మేనకను పరిహాసము సేయు ప్రాయము గల యువతులు మిక్కిలిగా ఎత్తయి చుక్కలను రాయుచున్న ముత్తెపు మేడలెక్కి వేడుకతో నా మహారాజుపై అశ్చర్యకరముగా నెర్ర కలువ రేకులను చల్లిరి.

''అలం - అతిశయోక్తి''

158.క॥ అంతట నాగ సరంబుల
నింతులు తానములు మిగుల హెచ్చించుచు, సా
మంతము పరవం, బువులు వ
సంతము లోనుగను గొనుచుc జనుదే, మఱియున్ - 158

టీక :- అంతటఁ = అపుడు, ఇంతులు = స్త్రీలు, నాగసరంబులఁ = నాగ స్వరములతో, తానములు మిగుల హెచ్చించుచు = తానము అనగా రాగ బేధములను, హెచ్చించుచు = ఎక్కువగా చేయుచు, సామంతము పరవఁ = దిట్టతనముతో వ్యాపించగా, పువులు, వసంతము = పసుపు సున్నము కలిపిన నీరు, కొనుచు = తీసుకొని, చనుదే = రాగా మరియుఁ = ఇంకను.

తా :- అపుడు కొందరు స్త్రీలు తానములు పాడుచు పూలు మరియు వసంతము తీసుకొని మహారాజునకు ఎదురుగా రాగా.

159.సీ॥ వేలుపు పూబోండ్ల గేలిసేయు నొయారి
చెలువలు తగ వీర మలహరియును
గ్రొక్కాఱు మెఱుఁగు లుక్కున స్రుక్కఁగాఁ జేయు
వెలఁదుకల్బంగారు వీరణములు
వలరాజు పెంచిన చిలుకలవలెఁ జాల
బెంపొందు నెలఁతుక ల్పిల్లఁ గోళ్లఁ
బూఁదీఁగెలో యనఁ బొలుపొందు పడఁతుక
ల్పెల్లుగాఁ బైఁడి తప్పెటలు, మఱియు
తే॥ గలిగినవి యెల్ల నేర్పుతోఁ దలిరుఁ బోండ్లు
కడఁగి మ్రోయింప, హెగ్గడి కత్తె లరిది
పైఁడి కోలలు పూని వేపదఁ డటంచుఁ
బల్లకీ ముందఱను బరాబరులుసేయ - 159

టీక :- వేలుపు పూబోండ్లన్ = దేవతాస్త్రీలను, గేలిసేయు = పరిహాసము చేయు, యొారి చెలువలు = వయ్యారముగల యువతులు, తగన్ = ఒప్పునట్లుగా, వీరమల హరియును = వీరమలహరి యను చర్మ వాయిద్యములను, క్రొక్కారు మెఱుగులున్ = కొత్త మెరుపులను, ఉక్కున స్రుక్కగా చేయు = సామర్థ్యమున సుడిపడ జేయు, వెలదుకల్ = స్త్రీలు, బంగారు వీరణములు = బంగారుతో చేసిన వీరణములు, వలరాజు పెంచిన = మన్మథుడు పెంచిన, చిలుకలవలె, చాల పెంపొందు = మిక్కిలి అతిశయించిన, వెలతుకల్ = యువతులు, బంగారు వీరణములు = బంగారుతో చేసిన వీరణములు, వలరాజు పెంచిన = మన్మథుడు పెంచిన, చిలకలవలె, చాలపెంపొందు = మిక్కిలి అతిశయించిన, నెలతుకల్ = యువతులు, పిల్లగోళ్ళ = పిల్లనగ్రోవులు, పూదీగలో యనన్ = పూవుల తీగలేమో నన్నట్లుగా, పొలుపొందు = ఒప్పు, పడతుకల్ = స్త్రీలు, పైడి తప్పెటలు = బంగారు తప్పెటలు, మరియు, కలిగినవి యెల్ల = కలవాద్యములన్ని, తలిరుబోండ్లు = యువతులు, నేర్పుతో, కడగి మ్రోయింప = పూని వాయించు చుండగా, హెగ్గడి కత్తెలు = హెచ్చరికలు పలుకు వారు, అరిది = అసాధారణముగా పైడికోలలు పూని బంగారు బెత్తములు ధరించి, వే = వేగముగా, పడడటంచు = పడింది అని, పల్లకీ ముందరను, బరాబరులు సేయు = హెచ్చరించుచు నడువగా -

తా :- దేవతాస్త్రీలను పరిహసించుగల సుందరులు వీరమల హరులను, తొలుకారు మెరుపులను యబ్బుర పరచగల యువతులు వీరణములను మన్మధుడు పెంచిన చిలుకల వలెనున్న కొందరు పిల్లన గ్రోవులను, పూల దీగల వలె నుండు కొందరు బంగారు తప్పెటలను, ఇంకను కలిగిన వాద్యములన్ని కొందరు యువతులు మ్రోగించు చుండగా, హెగ్గడి కత్తెలు బంగారు బెత్తములు పట్టుకొని పల్లకీ ముందు తొందరగా నడువుడని జనమును హెచ్చరించుచు బరాబరులు సేయగా -

''అలం - అతిశయోక్తి''

160.వ:- అరుదెంచి = వచ్చి - 160

161.క॥ ఆదట నేనుఁగు డిగి, తన
పైదలియుం దాను బైఁడి పళ్లెరముల ము
త్తైదువ లారతు లీఁగాఁ
బ్రోదిం దననగరు సొచ్చెఁ బూనిక మెరయన్ - 161

టీక :- ఆదట నేనుగు దిగి = తొందరగా ఏనుగును దిగి, తనపైదలి యుందాను = తన యొక్క భార్య మరియు తాను, పైడిపళ్లెరముల = బంగారు పళ్లెరములతో, ముత్తైదువ లారతులీగా = సువాసినులు నివాళించు చుండగా, పూనిక మెరయన్ = తన యొక్క రీతి ప్రకాశించు చుండగా, ప్రోదిన్ = శోభతో, తననగరు = తన యొక్క మేడ, సొచ్చె = ప్రవేశించెను.

తా :- ఆ విధముగా వచ్చి యయాతి మహారాజు దేవయానతో ఏనుగు దిగి ముత్తయిదువలు మంగళ హారతు లీయగా ఠీవిగా తన నగరు ప్రవేశించెను.

162.వ:- అనవుడు నటమీఁది తెఱం గెట్లుండె నని యడు
గుటయు - 162

టీక : అనవుడు = అనిచెప్పగా, నటమీది తెఱం గెట్లుండెనని = ఆ. తదుపరి విషయమెట్లుండెనని యడుగుటయు, అడుగగా -

తా : అని చెప్పగా ఆ తరువాతి వృత్తాంతమెట్లుండెనని యడుగగా -

163.ఉ॥ లాలసరీగ జాంకుశ, తలంపుల సొంపుల తమ్మిచూలి, యి
న్నేలయు నింగి పట్టముగ నిండ నమర్చిన నీయసంబు చేఁ
గాలి మెసంగు తేని యొడికంబును జుక్కల సోయగంబు ము
త్యాల బెడంగు డిగ్గపడునట్లుగఁ జేసిన చాగపుం బలి - 163

టీక :- లాలసరీగ జాంకుశ, తలంపుల సొంపుల తమ్మిచూచి = కోరికలను అంగములుగల బ్రహ్మదేవా ! యిన్నేలయునింగి = ఈ భూమి మరియు ఆకాశము, దట్టముగ నిండన్ = పూర్తిగా నిండునట్లుగా, అమర్చిన = ఉంచిన, నీయసంబుచే = నీకీర్తిచేత, గాలిమెసంగు తేని యొడికంబును = వాతాశన ప్రభువు అనగా సర్పరాజైన శేషుని యొక్క అందమును, చుక్కల సోయగంబు = నక్షత్రముల సౌందర్యము, ముత్యాల బెడంగు = ముత్తెముల యొక్క అందము, డిగ్గపడునట్లుగ జేసిన = తగ్గునట్లుగా చేసిన, చాగపుంబులీ = పరాక్రమ సింహమా! -

తా :- లాలసరీగ జాంకుశా ! తలంపుల సొంపుల నలువయైన వాడా ! భూమ్యాకాశములందు నిండుగా నింపిన నీకీర్తిచే శేషుని యొక్క నక్షత్రముల యొక్క ముత్యముల యొక్క కాంతిని తగ్గించిన వాడా ! పరాక్రమ సింహమా ! ఓ అమీను ఖానా ! -

''అలం - తుల్యయోగిత''

164.క॥ పొలఁతులకు మేఁటి పగఱకుఁ
దలఁపులతో నుండు చక్కఁ దనమునఁ గడుఁ జే
బలువు కడండకల, నెన్నం
గల జాణల రాయ, మేను గలవల రాయా ! - 164

టీక :- పొలతులకు = స్త్రీలకు, మేటి పగఱకు = గొప్పనైనవైరులకు, తలపులలో నుండు = మనస్సులలో మెదలుచుండు, చక్కదనమును = సౌందర్యమును, కడు = మిక్కిలియైన, చేబలువు కడంకలన్ = భుజబలము యొక్క ఆధిక్యముననను,

ఎన్నంగల జాణల రాయ = చెప్పదగిన నేర్పరీ, మేను గలవలరాయా = శరీరముగల మన్మదా! –

తా :– స్త్రీలకు పగవారలకు మనస్సులలో మెదలు అందము మరియు భుజ పరాక్రమము గలవాడా ! శరీరము ధరించిన మన్మధుడా ! –

''అలం – దీపకము''

ప్రస్తుతా ప్రస్తుతముల నొకే క్రియతో చెప్పిన యెడల దీపక మనబడును.

165. బంధుర వృత్తము –

అనిమొన నెదిరెడు బలుపగతుర మూఁ
కనుక కడలిం గని, యేనిక ఁ
జనియెడు పటుపగు నలతటి మలచే
తనుదగఁ ద్రచ్చి, మెలంకువ వం
తన గలిగిన గెలుపులసిరి నెలఁతం
దక్కcగఁ గైకొని యాయకతో
నెనరుగ ననపుం గలువల సైదో
డ్నీ టుగఁ గూర్చిన నేరుపరీ ! – 165

టీక :– అనిమొన నెదిరెడు = యుద్ధరంగమునం దెదుర్కొను, బలుపగతుర = మిక్కిలియైన శుత్రువుల యొక్క, మూకను కడలిఁ = గుంపు అనుసముద్రమును, కని = చూచి, ఏనిక పౌజనియెడు = గజసైన్యమను, పటుపగు = విశాలమైన, తటిమలచేతఁ = మందరముతో, తగఁద్రచ్చి = ఒప్పునట్లుగా కలచి = మెలంకువ వంతనఁ = ఆ జాగ్రత యొక్క ఫలమనగా, కలిగిన = ఉదయించినట్టి, గెలుపులసిరి వెలతఁ = విజయలక్ష్మిని, దక్కఁగైకొని = చేపట్టి, ఆయకతో = నామెతో, నెనరుగ = ప్రేమతో, అసపుం గలువలనై దోడుఁ = కీర్తియను చంద్రుని, నీటుగ గూర్చిన = రీవిగా కూర్చిన, నేర్పరీ = నిపుణుడా !–

తా :– యుద్ధరంగమున నెదిరించెడు శత్రువుల మూక యను సముద్రమును గజసైన్యమను మంథరముతో చిలిచి, తత్ఫలముగా కలిగిన విజయ లక్ష్మిని, కీర్తియనెడు

చంద్రునితో కూర్చిన వాడా ! ఓ అమీను ఖానా! -

విశే :- అనగా అతని విజయములు మరియు కీర్తితోడ్తోడ అక్క తమ్ముల వలె నున్నవని తాత్పర్యము -

''అలం - రూపకము''

గద్య-

ఇది శ్రీమదన గోపాలమంత్ర ప్రసాదలబ్ధ సారస్వత సుకవిజన వర్ణనీయ వచోవిభవ భావనామాత్య తనూభవ పొన్నికంటి వంశ్య తెలగనార్య ప్రణీతంబైన యయాతి చరిత్రంబను నచ్చ తెనుఁగు కబ్బంబు నందుఁ జతుర్థా శ్వాసము.

★ ★ ★

పంచమాశ్వాసము

1. క॥ సిరిరాచవేల్పు, కడునీ
వరితనమున నీటి దాల్పు, వలమురి సుడివా
ల్దొరవంటి యొప్పుగల దే
వరజాణ, యమీనుఖాన, వలపుల తేఁడా ! - 1

టీక :- సిరిరాచ వేల్పు = ఓలక్ష్మీపతి, కడున్ = మిక్కిలి, ఈ వరితనమున = దానమున, నీటితాల్పు = మేఘమా, వలమురి = శంఖము, సుడివాల్ = చక్రము, దొరవంటి = ధరించినట్టివాడు, అనగా విష్ణువు, వంటి యొప్పుగల దేవర = అతని వంటి అందము గలవాడా ! జాణ = నేర్పరి! అమీనుఖాన ! వలపుల తేడా ! = మన్మధుడా!

తా :- ఐశ్వర్యముగల భూమీశ్వరా ! దానగుణమున మేఘము వంటివాడా! శంఖచక్రములు ధరించిన దొర వంటి యందము గలవాడా ! జాణా! మన్మధుని వంటి వాడవైన ఓ అమీను ఖానా !

''అలం - రూపకము''

2.వ:- అటమీఁది తెలుంగు వినుం డిట్లు యయాతి
దేవయానిం బెండ్లియై వఱలు సిరులతో నుండు
నంత నక్కన్నియం దలిమం బెక్కింపం దలంచి
తలిరుం బోండ్లు - 2.

టీక :- అటమీది తెలుంగు వినుండు = ఆ తరువాతి విషయము వినుడు. యయాతి దేవయానిం బెండ్లియై = యయాతి దేవయానిని వివాహమాడి, వఱలు సిరులతో నుండునంత = విస్తారమైనవైభవముతో నుండగా, అక్కన్నియన్ = ఆదేవయానను, తలిమం బెక్కించం దలంచి = మంచమెక్కించ తలచి, తలరు బోండ్లు = చెలులైన యువతులు -

తా :- ఆమీది విషయము వినుము. యయాతి దేవయానిని వివాహమాడి తమ పట్టణము జేరినంత చెలికత్తెలు వారికి శోభనము చేయదలచి -

చెలులు దేవయానను తలిమ మెక్కించుట

3\. సీ॥ నలఁచి పైచినఁ జాల నలరుక ప్రపుఁదావి
పొలుపొందు నెమ్మేనబుగులు కొనఁగ
వేనలిఁ దుఱిమిన విరిసరంబుల సొంపు
లలమి తేఁటుల నెల్ల నామతింపఁ
దెలివి కట్టాణి ముత్తెముల పేరుల రంగు
కలిమిఁ బాలిండ్ల వెన్నెలలుగాయ
వలపుల చిఱునవ్వు కలయఁ బూఁజాలుగా
ముద్దుఁ జెక్కుల మీఁద మొలకలెత్త
తే॥ మోముఁ దామర యింపైన మురువు తోడఁ
జెలువ మగు తియ్యఁ దేనియచేత నమరు
మరుని యాఱవ తూపునాఁ బరఁగు నట్టి
దేవయానిఁ, గనుంగొని తీవి మెఱసి - 3

టీక :- నలచివైచినను = నిలిపినను, చాల = మిగుల, అలరుక ప్రువుతావి = గుబాళించెడు కర్పూరపు, వాసన, పొలుపొందు = అందమైన, నెమ్మేన = కోమలమైన శరీరమున, బుగులు కొనగ = పరిమళించగా వేనలి దురిమిన = కొప్పున, తురిమిన = ముడిచిన, విరిసరంబుల సొంపు = పూలదండల యందము. అలమి = వ్యాపించి, తేటులనెల్లఁ = తుమ్మెదల నన్నింటిని, ఆమతింప = పిలుచుచుండగా/తెలివి = స్వచ్ఛమైన, కట్టాణి = (కడు + ఆణి) మిక్కిలి శ్రేష్ఠమైన, ముత్తెముల పేరులరంగు = ముత్యాల దండల రంగు, కలిమి = సంపద, పాలిండ్ల వెన్నెలలుగాయ = చన్నులపై కాంతి, ప్రసరించుచుండగా, వలపుల చిరునవ్వు = వలపుతో కూడిన దరహాసము, కలయ పూజాలుగా = పూలచాలుగా వ్యాపించి, ముద్దు చెక్కుల మీద = అందమైన చెంపల మీద, మొలక లెత్త = అంకురించు చుండగా / మోముదామర = ముఖపద్మము, ఇంపైన మురువుతోడ = మనోజ్ఞమైన సుందరముతో, చెలువమగు = అందమైన, తీయతేనియ నమరు = తీయని తేనెతో గూడిన, మరుని యారవ తూపునా = మన్మథుని ఆరవ బాణమనగా, పరగునట్టి, దేవయాని కనుంగొని = దేవయానిని చూచి, తీవి మెరసి = తీవితో -

తా :- నలిచి పెట్టినప్పటికి మిక్కిలిగా శరీరముపై కర్పూరపు, వాసన గుబాళించు చుండగా కొప్పున తురుము కొనన పూవులు తనవాసనతో తుమ్మెదలను పిలుచు చుండగా

మేలిముత్తెముల దండ తెల్లనై చన్నులపై వెన్నెల చల్లుచుండగా వలపుతో కూడిన చిరునవ్వు చెంపలపై వ్యాపించి పూవులు పూయించుచుండ, మాటి మాటికి చూడబుద్ధి వేసెడి ముఖము తీయని తేనియతో గూడిన యధరముతో ప్రకాశించగా మన్మథుని యారవ బాణము వలె నున్న దేవయానిని చూచి, ఒకచెలి రీవితో -

''అలం - స్వభావోక్తి''

4. సీ॥ బంగారు కుండలఁ బగటు నీగబ్బిగు
బ్బల మీఁది కొకమేలు గలుగు నేఁడు
జగడాలఁ బగడాలఁ దెగడు నీమోవికిఁ
బొలుపైన యొకడాలు గలుగునేడు
మెఱుఁగుచేఁ గ్రొమ్మించు మించు నీమేనికి
నలరింప నొకయింపు గలుగు నేఁడు
తళ్కులై ముద్దులు గుల్కునీ చెక్కుల
కెలమిగా నొకసొంపు గలుగు నేఁడు

తే॥ తాళుకో ప్రొద్దు గ్రుంకిన దాఁక ననుచుఁ
బలుకఁ దనలోని కూరిమి బయలు పడఁగ
నీక, కన్నుల జంకించి యేమొ గొణుగు
దేవయానిఁ గనుంగొని తెఱవ యొకతె - 4

టీక :- బంగారు కుండల పగటు = సువర్ణ కలశములను తిరస్కరించు, నీగబ్బి గుబ్బల మీదికి = బింకముతో కూడిన నీచన్నులపైకి, ఒక మేలు కలుగు నేడు=ఈనాడు ఒక మంచి కలుగును జగడాలఁ = కలహమున, పగడాలఁ = పగడములనుచ, తెగడు నీమోవికి = తిరస్కరించు నీపెదవికి, పొలుపైన = అందమైన, ఒక డాలు కలుగు నేడు = ఈనాడు ఒక కాంతి కలుగును/మెఱుగుచే = కాంతితో; క్రొమ్మించు = క్రొత్త మెరుపును, మించునీమేనికి = మించెడు నీశరీరమునకు, అలరింపఁ = సంతసింప చేయుటకు, ఒక యింపుకలుగు నేడు = ఈనాడొక మనోజ్ఞత కలుగును, తుళ్కులై = తళతళలాడుచు, ముద్దుల గులుకు = ముద్దులు చిందు, నీ చెక్కులకు = నీ చెంపలకు, ఒక సొంపు కలుగునేడు = ఈనాడు ఒక అందము కలుగును/ ప్రొద్దుగ్రుంకినదాక = సూర్యుడస్తమించు వరకు, తాళుకో, ఓర్చుకో, అనుచు, పలుకఁ = అనగా, తనలోని = తన మనస్సులోని, కూరిమి బయలు పడనీక = ప్రేమ తెలియనీయక, కన్నుల జంకించి = కన్నులతో బెదిరించి,

ఏమొగొణుగు = ఏదియో లోలోపలనే యను, దేవయాని గనుంగొని = దేవయానిని చూచి, తెఱవ యొకతె = ఒక యువతి.

తా :- బంగారు కుండలను తిరస్కరించు బింకమైన నీచన్నులకు ఈనాడొక మేలుకలుగును. పగడములను తిరస్కరించు నీపెదవికి ఈనాడొక క్రొత్త కాంతికలుగును. క్రొత్త మెరుపు తీగను గూడ తిరస్కరించు నీదేహకాంతికి ఈనాడొక మనోజ్ఞత కలుగును. తళతళలాడుచు ముద్దు వచ్చు నీచెంపలకు ఈనాడొక యందము కలుగును. ప్రొద్దుగ్రుంకువరకు తాళుకొమ్మను చెలిని చూచి దేవయాన కన్నులతో బెదిరించి, మనస్సులోని ప్రేమ బయలు పడనీయక ఏమోగొణుగు చుండగా వేరొకతె ఆమెను చూచి -

''అలం - గూఢోక్తి''

5. క॥ కని మది గలిగిన తీరున
విను మగనిఁ వ్రాసికొన్న నిలువుఁ బతిమలం
గనుఁగొని యెఱుఁగక పలికిన
ననఁ బోఁడిం గినియఁ దగునె నవలా నీకున్? - 5

టిక :- కని = చూచి, నవలా = ఓ యువతీ ! మదిగలిగిన తీరున = నీ మనస్సులో నున్నట్లుగా, నినుమగనిఁ వ్రాసికొన్న = నిన్ను నీపతిని చిత్రించుకొన్న, నిలువు బతిమలఁ = నిలువు బొమ్మలను, కనుగొని = చూచి, ఎరుగక పలికిన = తెలియక మాటాడిన, ననబోఁడిఁ = ఆ యువతిని, నీకుఁ కనియదగునె = కోపించ వచ్చునా!

తా :- ఏదో గొణుగు దేవయానిని చూచి ఓ కొత్త వయసు దానా ! నీవు మనసులో ఉన్నట్లు దించుకొన్న నీవు మరియు నీ యొక భర్త యొక్క నిలువు బొమ్మలను చూచి ఆమె తెలియక నేదో యనగా నీవామెపై కోపించ వచ్చునా !

6. తే॥ మగువ, యెన్నఁడు సిగ్గున మగనిఁ జూడ
నట్టిగోలవు, నిన్నన నగునె, యైన
విదియనాఁ డేరువడకున్నఁ దదియనాఁడు
కానఁ బడియెడు పని, కింత కనల నేల ? - 6

టీక :- మగువ = ఓ యువతీ, ఎన్నడు = ఎన్నడుగూడ, సిగ్గున = లజ్జతో మగని జూడనట్టి గోలవు = భర్తను చూడనట్టి అమాయకురాలవు, నిన్ననగునె = నిన్నన వచ్చునా!,

ఐనఁ = అయినప్పటికి, విదియ నాడేరు పడకున్న తదియనాడు = విదియనాడు కనిపించని చంద్రుడు తదియనాడు తానే కనిపించునని సామెత, కాన బడియెడు పనికి = కనిపించు దానికి, ఇంతకనల నేల = ఇంతగా కోపించుటెందులకు

తా :- ఓ యువతీ ! నీవు పాపము సిగ్గుతో ఎన్నడుగూడ మగని చూడని అమాయకు రాలవు, నిన్నన వచ్చునా ! అయినప్పటికి విదియనాడు కనిపించని వాడు తదియనాడు తానే కనిపించగలడు గనుక ఇంతదానికే అంతగా కోపించవలెనా !

''అలం - లోకోక్తి''

7.వ:- అనినగుచుం బలుకునంత - 7

టీక :- అనినగుచు బలుకునంత = అనినవ్వుచు ననుచుండగా -

8. క॥ అఱి ముఱిని గ్రుంకు మలపై
నెఱసంజను గ్రమ్మినట్టి యెరవలి సెగబి
ట్టఱిమినఁ జని వడిఁ గ్రుంకెం
బఱపున ననఁ, బ్రొద్దుగ్రుంకెఁ బడమటి కడలిన్ - 8

టీక :- అరిమురిని = ఆ వెంటనే, క్రుంకుమలపై = అస్తమయ పర్వతముపై, ఎఱసంజను = ఎర్రని సంధ్యను, అనుక్రమ్మినట్టి = వ్యాపించినట్టి, ఎరవలిసెగ = దావాగ్ని యొక్క వేడిమి, బట్టలిమిన = మిక్కిలిగా వ్యాపించగా, చని = వెళ్లి, వడిగ్రుంకెఁ బరపునన = వేగముగా పరుగెత్తి కుంకెననగా, పడమటి కడలిఁ = పశ్చిమ సముద్రమున ప్రొద్దుగుంకె = సూర్యుడు గ్రుంకెను.

తా :- చెలియట్లను చుండగా నావెంటనే అస్తమయ పర్వతముపై, ఎర్రని సంధ్యాకాలము అను దావాగ్ని వ్యాపించి, ఆసెగ మిక్కిలిగా చుట్టు కొనగా సూర్యుడు వేగముగా పరుగెత్తి వెళ్లి, పడమటి సముద్రమున మునిగె ననగా ప్రొద్దుగ్రుంకెను.

''అలం - ఉత్ప్రేక్ష''

9.వ:- అప్పుడు - ఆ సమయమున

10.తే॥ మెలఁత మగమానికంబుల మేడలోన
నెత్తమాడుద మరుదెమ్ము నీ వటంచుఁ
గూర్మిఁ గైదండ యొసఁగి తోడ్కొనుచుఁబోయి
చనుపకంబుల నొప్పెడు చవిక యందు - 10

టీక :- మెలత = ఓయువతీ, మగ మానికంబుల మేడలోన = వజ్రముల యొక్క మేడయందు, నెత్తమాడుదము = పందెమాడుదము, అరుదెమ్ము నీవటంచు = నీవు రమ్మని, కూర్మికైదండ యొసగి = ప్రేమతో చేయూతనిచ్చి, తోడ్కొనుచు బోయి = తోలుకొని పోయి, చనుపకంబుల నొప్పెడు = సంపెంగలతో నొప్పెడు, చవికెయందు = ఒక చతురస్ర మండపమున

తా :- ఓయువతీ ! మనము వజ్రముల యొక్క మేడలో పందెమాడుదము రమ్మని చేయూత నిచ్చి తోడుకొని వెళ్లి సంపెంగలతో నొప్పు నొక చతురస్ర మంటపమున-

విశే :- మెలత యనగా పతిచే మెలపుకొనబడునది. పతిని మెలపుకొనునది అని తాత్పరయ్యము. కనుక నిచటది సార్థకమైన ప్రయోగము.

11.సీ॥ పలుకులఁ దేనియ ల్గులుకఁ గొక్కోకంబు
చెలఁగి రాఁజేయు రాచిలుక గములు
నలరి వీనుల పండువులు గాఁగ వలరాచ
ప్రామిన్కు లొగి నేర్చుపారువములు
నలరుల విలుకాని గెలుపుఁ గబ్బంబులఁ
జదివెడు గోరువంక కొదమ పదువు
వినఁగూడు మరునిదే వేరొపైఁ బాలులు
పాడు లేఁబాయంపుఁ బరితములును
తే॥ గలిగి పూఁదేరు రాయని కొలుపు నెలవు
పగిది నొప్పారు పసిఁడి యుప్పరిగ లోనఁ
గెంపు నెఱమాని కంపు వాకిటికి వచ్చి
తమ్మి కెంపుల పలకల తలుపు దిగువ - 11

టీక :- పలుకుల తేనియల్గులుక = మాటలతో తెనెలుట్టి పడుచుండగా, అనగా తీయగా నుట, కొక్కోకంబు = రతిశాస్త్రము, చెలగి సంతసించి, రాజేయు = నేర్పు, రాచిలుక గములు = రామచిలుకల గుంపులు / అలరి = సంతసించి, వీనుల పండువులుగాగ = కర్ణపేయముగా, వలరాచ ప్రామిన్కులు = మదన వేదములు, ఒగిఁ = క్రమముగా, నేర్చు పారువములు = నేర్పునట్టి పావురములు / అలరుల విలుకాని = మన్మథుని యొక్క, గెలుపు, కబ్బంబుల = విజయ కావ్యముల, చదివెడు = పఠించు, గోరువంక కొదమ పదవు = కోడెప్రాయపు గోరెంక

గుంపులు/ వినగూడఁ = వినుటకు సొంపైన, మరుని దేవేరిపై = రతీదేవిపై పాటలు, పాడు, లేఁబ్రాయపు = లేతవయసుగల, బరితములును = కోకిలలు / కలిగి పూదేరు రాయని = మన్మధుని యొక్క, కొలువు నెలువు పగిదినొప్పారు = సభామందిరము వలెనున్న, పసిడి యుప్పరిగ లోన - బంగారు చంద్రశాలలో, కెంపునెఱమానికంపు = మేలైన మణిక్యపు మణుల యొక్క వాకిటికి వచ్చి = ద్వారము దగ్గరకు వచ్చి తమ్మికెంపుల పలకల = పద్మరాగపు మణుల యొక్క పలకలుగల, తలుపు దిగువ = తలుపు తీయగా -

తా :- తేనెలొలుకు పలుకులతో కొక్కోకమును నేర్చుచిలుకలు ! చెవుల పండువుగా మన్మధవేదములు చదువు పావురములు మన్మధుని యొక్క విజయ ప్రబంధములు చదువు శారికలు వినసొంపైన రతీదేవి పాటలు పాడుకోకిలలు గలిగి మన్మధుని కొలువు కూటమువలె నున్న బంగారు ఉప్పరిగలో మాణిక్యములు పొదిగిన ద్వారము కడకు వచ్చి, పద్మ రాగపు పలకల తలుపులు తెరువగా

''అలం - ఉదాత్తము - ఉపమ''

12.చ॥ బొగడల సాన రాచిలుక పుత్తడిపావలు తావి దూపపుం
బొగలు జవాది వంక తెలిముత్తెపుఁ జిప్ప పసిండి గిండియుం
బగడపుఁ గోళ్ల మంచము జమల్పఱుపుం గపురంపుఁ దిన్నె కెం
పుగముల జాలవల్లికయుఁ బువ్వులు మించుల నిల్వుటద్దమున్ - 12

టీక :- బొగడలసాన = కోళ్లగలసాన, రాచిలుక = రామచిలుక, పుత్తడి పావలు = బంగారు పాకోళ్లు, తావి దూపపుం బొగలు = పరిమళ దూపముల పొగలు జవాది వంక = జవ్వాజి పాత్ర, తెలిముత్తెపు చిప్ప = తెల్లని ముత్తెపు చిప్ప - జివ్వాది మొదలైనవి మేదించుటకు - పసిండిగిండియుఁ = బంగారు గిండిచెంబు, పగడపు కోళ్లమంచము, జమిల్పరుపు = జమిలిపరుపు, కపురంపు తిన్నె = కర్పూరపుటరుగు, కెంపుగముల జాలవల్లికయు = కెంపులతో చేసిన తమలపాకులపెట్టె, పువ్వులు, మించుల నిల్వుటద్దముఁ = కాంతిగల నిలువుటద్దము-

తా :- మొగడలసాన, రామచిలుక - బంగారు వాడుకలు అగరు పొగలు, జవాదికోవి, ముత్తెపు చిప్ప, బంగారు గిండి, పగడపు కోళ్ల మంచము, జమిలి పరుపు, కర్పూరపు తిన్నె, కెంపుల జాల వల్లిక మరియు నిలువు టద్దము -

విశే :- ఇవన్నియు మనపూర్వులు పడకగదులందుంచు కొనెడు సామగ్రి.

''అలం - ఉదాత్తము''

13.తే॥ కలిగి యొప్పారు నందు బంగారు కోళ్ల
తూఁగు మంచముపై వేల్పు దొరయ పోలె
సొంపు పెంపున మిక్కిలి సోయగంబు
నలరఁ జెలువొందుచున్న యయాతిఁ జూచి - 13.

టీక :- కలిగి యొప్పారు = కలిగి ఒప్పుచున్న, అందు = ఆ మేడ యందు బంగారు కోళ్ల, తూగు మంచముపై = ఊయెల మంచముపై, వేల్పు దొరయ పోలె = ఇంద్రునివలె, సొంపుపెంపున = ఠీవితో, మిక్కిలి సోయగంబు నలర = అధికమైన యందముతో నొప్పుచున్న, యయాతి జూచి = యయాతి మహారాజును చూచి -

తా :- పైవన్నియు కలిగి యుండిన ఆ మేడలో బంగారు కోళ్లు గల తూగు మంచముపై ఇంద్రుని వలె ఠీవిగా నందముతో నొప్పుచున్న యయాతిని చూచి

''అలం - ఉపమ''

14.చ॥ నడుము వడంక, సిబ్బితి గనంబడ, విప్పగు గొప్పకప్పుక్రొ
మ్ముడివిడి జాఱ, నందియల మ్రోతకుఁ దొడుగఁ దమ్మికెంపుపెం
దొడవులు మ్రోవఁ, బయ్యెద చనుంగవ చక్కి నొకింత చూపఁగా
వడి మగుడంగ నేఁగు చెలువంగని నవ్వుచు నింతు లింపునన్ - 14

టీక :- నడుము వడంక = నడుము వణకు చుండగా, సిబ్బితి కనంబడ = సిగ్గుకనిపించగా, విప్పగు = విశాలమైన, గొప్పకప్పు క్రొమ్ముడి = గొప్పనైన నల్లని కొప్పు, విడిజాఱ = విడిపోయి జారుచుండగా,

పురుషులను గనినపుడు స్త్రీలకు కలిగెడి యవస్థలు -

నీవీబంధము వీడు మోవి యదరు న్నేత్రంబులల్లాడుమున్
గ్రేవల్గొనగ విచ్చు క్రొమ్ముడి విరుల్ పృథ్వీస్థలిం జెందు, స
ద్భావాగారము లోన చెమ్మగిలు చిత్తంబుత్తలం బొందు నా
నా విభ్రాంతులు బుట్టునింతులకు చెంతన్వింత వారుండినన్
శత పక్షి సంవాదము. క్షేమేంద్రుడు.

అందియల మ్రోతకు తోడుగ = అందెల చప్పుడకు తోడుగా, తమ్మి కెంపు పెందొడవులు మ్రోవ = పద్మరాగ మణులయొక్క ఆభరణములు మ్రోగుచుండగా, పయ్యెద చనుంగవ = పైటలోని చన్నులు, నిక్కి యొకింత చూపగా = కొంచెము నిక్కి కనిపించగా, వడిః = వేగముగా మగుడంగనేగు = తిరిగి వెళ్లు, చెలువంగని = ఆదేవయానిని చూచి, నవ్వుచు నింతు లింపునః = ఆమె నక్కడికి తోడకొని వచ్చిన చెలులు అందముగా నవ్వుచు -

తా :- అక్కడ ఆ యయాతిని చూడగనే దేవయాని నడుము జవజవ లాడగా, సిగ్గుకనిపించగా, గొప్పనైన తురుము ముడివీడి జారగా అందెల చప్పుడకు తోడుగా పద్మరాగపు భూషణములన్ని గల్లనగా పైటలో నుండి చన్నులొకింత నిక్కికనిపించగా వేగముగా వారిని విడిపించుకొని వెనుకకు తిరిగిన దేవయానిని చూచి వారు నవ్వుచు -

''అలం - స్వభావోక్తి''

15.క॥ ననఁ బోడి యోర్తు కూడం
జని, కేలు దెమల్చి పట్టి, చనునే నీకుం
బెనిమిటిని జూచి క్రమ్మఱఁ
బెనఁగక చనుదె మ్మటంచుఁ బేర్కొని తిగువన్ - 15

టీక :- ననబోడియోర్తు = ఒక యువతి, కూడంజని = గబగబ వెళ్లి యామెను కలసి, కేలు తమల్చి పట్టి = చేయిచిక్కించుకొని గట్టిగా పట్టుకొని, పెనిమిటిని చూచి క్రమ్మర=భర్తను చూచి మరలి పోవుట, చనువే నీకుః = తగునా, పెనగక = ఇగ్గు లాడక, చనుదెమ్మటంచు=రమ్మని, పేర్కొని = పేరున పిలిచి, తిగువః =లాగగా-

తా :- అపుడొక యువతి వేగముగా జని యామె చేతిని గట్టిగా పట్టుకొని ఓసీ దేవయానా! పతిని చూడగనే మరలిపోవుట నీకు తగునా ! పెనుగు లాడక రమ్మని, పేరుపెట్టి పిలిచి లాగగా !-

16.తే॥ తెఱవ యాకొమ్మ కేలు విదిర్చి వైచి
కేలఁ గంబంబు పట్టి జంకించి పెనఁగ
వెలఁది మమ్మేల వెట్టి నవ్వింపనీకు
బయటి కెత్తిన దివ్వె నీదయిన నడక - 16

టీక :- తెఱవ = ఆ దేవయాన, ఆ కొమ్మకేలు = ఆమె చేయి; విదిర్చి వైచి = విదిలించి వేసి, కేలఁ = చేతితో, కంబంబువట్టి = స్థంభము పట్టుకొని, జంకించి పెనగ = వారిని భయపెట్టుచు పెనగులాడగా, వెలది = ఓ యువతీ !, మమ్మేల = మమ్ముల నెందుకు, వెఱ్ఱినవ్వింప నీకు = వెఱ్ఱి వారిని చేసినవ్వించెదవు, నీదయిన నడక = ఇంతవరకటినీ ప్రవర్తన, బయటికెత్తిన దివ్వె = బయటికి తెచ్చిన దీపమేగదా !

తా :- అపుడు దేవయాన ఆమె చేయి విదిలించి వేసి భయపెడుతు పెనగు లాడగ వారు, ఓ దేవయానా మమ్ముల నెందుకు వెఱ్ఱి వారిని చేసి నవ్వింతువు. నీ ప్రవర్తన బయటపెట్టిన దీపము గదా ! అనగా అందరికి తెలిసినదే యనుట.

"అలం - లోకోక్తి"

17.కII తక్కిన కన్నెల వలెనీ
విక్కడ బూటకము సేయనేటికి నీకుఁ
మ్రొక్కెద నిఁక బెనఁగకునా
యక్కవు గద, రమ్మటంచు నడుగలఁ బడియెన్ - 17

టీక :- తక్కిన కన్నెలవలె = అందరు కన్నెల వలె, నీవు + ఇక్కడ బూటకము సేయనేటికి = ఎందుకునటన చూపెదవు, నేటికి నీకుఁ మ్రొక్కెద = ఈనాటికి నీకు ఒక నమస్కారము చేసెదను. ఇక పెనగకు = ఇంక పెనుగులాడ వద్దు, నాయక్కవుగద = రమ్మటందు, నీవు మా యక్కవు గదా ! రమ్ము అని అడుగుల బడియెఁ = ఆమె పాదములపై వ్రాలెను.

తా :- నీవు అందురు పిల్లలవలె ఇక్కడ బూటకము సేయుటెందులకు. ఈనాటికి నీకొక నమస్కారము చేసెదను. నీవు మాయక్కవు గదా ! "చలము చేయకరమ్ము" అని యామె పాదములపై బడెను.

"అలం - పర్యాయోక్తి"

18.చII వివిచిన సిబ్బితిం దఱిమి నెమ్మదిఁ జేరి మరుండు నొంపనో
ర్వని పని గట్టిపెట్టి చెలిరమ్మని కేలుదెమల్చి తివ్వఁగాఁ
జనియెఁ బెనంగుచు న్మఱియు సన్నల వచ్చెదఁగాని మించిపో
మ్మనియు బెడంకియు న్మగుడి యంతట నింతట నిల్చి లాగుచున్ - 18

టీక :- నినిచిన సిబ్బితిం దఱిమి = అపుడు అంతవరకు నిండినసిగ్గును ప్రోదోలి, నెమ్మది జేరి = శాంతించి, సమీపించి, ఓర్వనిపని గట్టిపెట్టి, అనగా విదిలించి వేయుటలు చాలించి, చెలి = సఖి, రమ్మని, కేలు తెమల్చి తివ్వగా = చేతిని బట్టిలాగగా, చనియె బెనంగుచుఁ = పెనగు లాడుచు వెళ్లెను, మఱియు సన్నలఁ = సైగలతో, వచ్చెదగాని, మించి పొమ్మనియు = ముందుగ వెళ్లుమని, బెడంకియుఁ = బెడిసి, మగుడి = తిరిగి, అంతటనింతట నిల్చి = అపుడపుడు పోక నిలుచుచు, లాగుచుఁ = ఆమెను లాగుచు -

తా :- అపుడు దేవయాన తనలో నిండుకొనిన సిగ్గును పోద్రోలి శాంతించి పెనుగు లాడుట విడిచి, చెలిచేతిని బట్టిలాగగా పెనగుచు వెళ్లెను. మరియు సైగలతో వచ్చెదనుగాని మీరు వెళ్లుడని కొంచెము బెట్టుచేసి నడుమ నడుమ నిలుచు చుండగా నామెను లాగుచు -

"అలం - స్వభావోక్తి"

19.వ:- ఇట్లు వచ్చినఁ దోడ్కొని చని నెచ్చెలి యచ్చెల్వం జూపి
రాజున కిట్లనియె - 19

టీక :- ఇట్లు వచ్చినం దోడ్కొనిచని = ఈ విధముగా రాగా తోడుకొని వెళ్ళి, నెచ్చెలి = ఆసఖి, అచ్చెలువం జూపి = ఆదేవయానను చూపి, రాజున కిట్లనియె = రాజుతో నిట్లనెను.

తా :- ఈవిధముగా రాగా అనగా పెనగిడినగ నట్లుగా వెళ్లగా నామెను సమీపమునకు గొనివెళ్లి యాసఖియయాతికి దేవయానను చూపి యిట్లనెను.

20.కII "మును పెంత కూర్మి గలిగిన
ననఁ బోఁడికి నిట్టియెడల నానయ తగుఁ, గా
వున మగువ తడవు నడిపెం
గనుఁ గొనుఁడీ మీర లొండుగాఁ దలఁపకుఁడీ ! - 20

టీక :- మునుపెంత కూర్మి కలిగిన = అంతవరకెంత ప్రేమ యున్నప్పటికి, ననబోడికి నిట్టియెడల = యువతి కిటువంటి సమయమున, నానయె తుగుఁ = సిగ్గుపడుటే తగును. కావున, మగువ తడవు నడిపెఁ = ఆలస్యము చేసెను. కనుగొనుడీ = చూడండి, మీరలొండుగా దలపకుడీ = మీరు మరొక విధముగా ననుకొన వద్దు.

తా :- మహారాజా ! ఇంతవరకెంత ప్రేమ యున్నను ఇటువంటి సమయమున స్త్రీకి సిగ్గేసింగారము. కావున ఆలస్యము చేసెను. మీరు మరొక విధముగా ననుకొనవద్దు.

21.వ:- అని విన్నవించి యామించుఁ బోఁడి నారాజేని
పాన్పుఁ జేర్చునంత - 21

టీక :- అని విన్నవించి = అని వినయమున తెలిపి, ఆమించుబోడి = ఆ చెలికత్తె, ఆజేనిఁ = ఆ రాజు, పాన్పున జేర్చునంత = పడక పై చేర్చు సమయమున

తా :- అని తెలిపి ఆ చెలికత్తె మహారాజును మంచముపై చేర్చునపుడు -

22.సీ॥ చిలుకకు, జదువు రాఁ జెప్పలే దాయెఁగా
యనుచు వేగిరపడి చనియెనొకతె
నెమ్మియే మయ్యెనో నేఁ డాట గఱపక
యరుగు దెంచితి నని మరిగెనొకతె
యీపరాకున మేతఁ యిడనైతిఁగా ప్రోది
గోరవంక కనుచుఁ దానరిగె నొకతె
నడలేర్పలే దాయె నసువు రాయంచకుఁ
దడవయ్యె ననుచుఁ దాఁ దారెనొకతె
తే॥ తనదు కనుసన్న జేనికిఁ దలిరుఁబోడిఁ
నలము కొమ్మని చూపుచుఁ దలఁగెనొకతె
విడెము దేవైతి వని యొక్క వెలఁదిఁ దిట్టి
పూని యమ్మేడ వెలికినిఁ బోయెనొకతె - 22

టీక :- ఒకతె - చిలుకకు, చదువురాఁ = చదువ వచ్చు నటుల, చెప్పలేదాయెగా ననుచు = అయ్యో చెప్పలేకపోతినే యనుచు, వేగిరపడి చనియె = తొందరపడి వెళ్లెను/ ఒకతె, నెమ్మియేమయ్యెనో = పెంపుడు నెమిలి ఏమాయెనో, నేడాటగరపక = ఈనాడు ఆటనేర్పకనే, అరుగు దెంచితినని మరిగె = వచ్చితినని మాయమయ్యెను/ ఒకతె, ఈపరాకున = ఈ పరధ్యానముతో, మేత యిడనైతిగా = మేత పెట లేదు, ప్రోదిగోరువంక కనుచు పెంచిన గోరువంకకని, తానరిగెఁ = తాను వెళ్లెను/ ఒకతె, నడనేర్పలేదాయె = నడక నేర్పక పోయితిని, నసువు రాయంచకు =

ప్రియమైన పెంపుడు హంసకు, తడవయ్యె = ఆలస్యమై పోయె, అనుచుతా౯ = అనుచు తాను, తారె౯ = జారు కొనెను/ ఒకతె, తనదు కనుసన్న౯ = తన యొక్క కంటిసైగతో, ఱేనికి = మహారాజునకు, తలిరుబోణి౯ = ఆయువతిని, అలము కొమ్మని చూపుచు - వాటేసుకొనుమని తెలుపుచు, తలగె౯ = తొలగి పోయెను, ఒకతె, విడెము దేవైతివని = తాంబూలము తేలేదని, ఒక్క వెలది దిట్ట = మరొకామెను దిట్టుచు, పూని = కావలయునని, అమ్మేడ వెలికిని బోయె = ఆమేడ బయటికి వెళ్లెను.

తా :- అపుడు ఒకతె అయ్యోనేను చిలుకకు చదువు చెప్పలేదని, ఒకతె నెమిలికి ఆటనేర్పలేదని, ఒకతె, ఈ మధ్యాహ్నమున గోరువంకకు మేత మరచితి నని, ఒకతె హంసకు నడక నేర్పవలెనని, ఒక్కొక్క మిషతో వెడలిపోగా, మరొకతె, తనకనుసైగతో నికనామెను ఆక్రమించుమని తెలుపుచు తొలగిపోయెను. మరొకతె తాంబూలము తేలేదేమని వేరొకతెను తిట్టుచు నామేడ వెలుపలికి వెళ్లెను.

''అలం - ఉపమ''

23.వ:- అంత = అపుడు

24. కll నను నెఱుఁగని గోలవు బలె
నినయము నిట్లనఁగి పెనఁగి యలసితివి గదా,
యని మేనంతయు నిమురుచు
ననఁ బోఁడి౯ గారవించె ననలెత్తు తమి౯ - 24

టీక :- నను నెఱుగని గోలవుబలె = ఆ మహారాజు దేవయానిని, నన్నెరుగని యమాయకురాలివలె, అనయము = చాలాకాలము ఇట్ల నగిపెనగి = ఈవిధముగా వారితో పెనగి, నలిగి, అలసితివి గదా యుని, మేనంతయు నిమురుచు = శరీరమంతయు నిమురుచు, ననలెత్తు తమి౯ = వికసించెడు కుతూహలమున, ననబోడిని = ఆ యువతిని, గారవించె౯ = గౌరవించెను.

తా :- ఓ దేవయానా ! నీవు ఇంతవరకు నన్నెరుగని దానివలె పాపమింతసేపు వారితో పెనుగులాడి యలసి పోయితివి గదాయని యామెను శరీర మంతయు నిమురుచు మనస్సులో మొగ్గ దొడుగు కుతూహలమున నామెను గౌరవించెను.

25.చ॥ పనుపడుకూర్మి నొక్కొక నెపంబునఁ జెక్కులుఁ గొప్పు గుబ్బలుం
గనుఁగవ యంటి, సిబ్బితిఁ దగం దొలగించుచుఁ బాన్పుఁ జేర్చి, నే
ర్పునఁ జెలిఁ గౌఁగిటం బొదివి, పొందెఁ గడుం గడు సేద దీర్చుచు
న్నన విలుకాఁడు సంతసమునం దనపూనిక యౌట కుబ్బుచున్ - 25

టీక :- పనుపడు కూర్మిన్ = ఆమెపై కలిగిన ప్రేమచె, ఒక్కొక నెపంబున = ఒక్కొక మిషతో, చెక్కును = చెంపలు, కొప్పు, గుబ్బలున్ = చన్నులు, కనుగవ = కన్నులు, అంటి = స్పృశించి, సిబ్బితి = లజ్జను, తగన్ = తగినట్లుగా తొలగించుచు, పాన్పు జేర్చి = పడకపైకి చేర్చి, నేర్పునన్ = చాతుర్యముచే, చెలిన్ కౌగిటన్ బొదివి = ఆమెను కౌగిటిలో ఇమిడించుకొని, కడుంగడు సేదదీర్చుచున్ = ఆమె యొక్క మిక్కిలియైన యలసటను తొలగించుచు, అనవిలుకాడు = మన్మథుడు, సంతసమునన్ = సంతోషమున, తన పూనిక యౌటకున్ = తన పట్టు దల నెగ్గుటకు, ఉబ్బుచున్ = సంతసించుచు, పొందెన్ = ఆనందము పొందెను.

తా :- అపుడా మహారాజా యామెపైగల ప్రేమచే ఒక్కొక్క నెపమున ఒక్కొక్కటిగా చెంపలు, కొప్పు చన్నులు, కన్నులు తాకుచు యామె సిగ్గును తొలగించి పడకపై చేర్చి యలసట తొలగునట్లు కౌగిటిలో పొదవుకొని మన్మథుడు తన పట్టుదల నెగ్గినందుల కుబ్బుచుండగా నాయయాతి యానందమును పొందెను.

26.సీ॥ పుక్కిళ్ల విడయంబు లక్కప్పురపుఁ దావిఁ
బొదలెడు సన్నయూర్పులు సలంగఁ
గౌఁగిళ్ల బిగ్గరఁ గదియించి మేనుల
నిరుపుర చేతుల నెలమి నలమఁ
దలిరుపైఁ దెంపులు దాచిన చందాన
మునిపళ్ల నొక్కుల మోపు లలరఁ
జెలఁగి పెనంగఁ గూర్చినఁ క్రొవ్విరులు జాఱి
చిక్కైన కొప్పునఁ జిన్నె లమరఁ
తే॥ గ్రమ్మ చెమరున నొకకొంత రగఁగి నెఱసి
బుగులు కొని జాఱు కస్తురి బొట్టు దనర
నిదుర మంపునఁ దగిలి రన్నెల ఱేఁడుఁ
బడఁ తియును నంత వలరాచ పనుల నలసి - 26

టీక :- పుక్కిళ్ళ విడియంబులు = పుక్కిటిలోని తాంబూలములు, అక్కప్పురపు తావిఁ = ఆ యొక్క కర్పూరపు వాసనను, పొదలెడు = కలిగించెడు / గుప్పెడు, సన్నయూర్పులు చెలంగ = నెమ్మదియైన శ్వాస లొప్పు చుండగా / కౌగిళ్ల బిగ్గర గదియించి = కౌగిటిలో బిగ్గరగా నదుము కొని, మేనుల = శరీరములను, ఇరువురు = ఆ యిద్దరు, చేతుల నెలమి నలుమ = చేతులతో ప్రేమతో కౌగలించుకొనగా / తలిరుపై = చిగు రాకుపై, కెంపులు తాచిన = కెంపులు పొదిగిన, చందాన = రీతిని, ముని పళ్ల నొక్కులఁ = కొనపంటి నొక్కులచే, మోపులలర = పెదవులు ఒప్పుచుండగా - చెలగి పెనంగ = విజృంభించి పెనగగా, కూర్చిన క్రొవ్విరులు రాలి = కొప్పులో తురుముకొనిన క్రొత్త పూవులు రాలి, చిక్కైన కొప్పునఁ = చిక్కుబడిన కొప్పులో, చిన్నెలమర = ఆగుర్తులు నిలువుగా / క్రమ్మ చెమరున = క్రమ్మిన చెమటతో, నొక కొంత కరిగి = కొంచెము కరిగి, నెఱసి = ఒప్పి, బుగులుకొని = పరిమళించుచు, జారుకస్తురి బొట్టు దనర = జారుచున్నటు వంటి కస్తూరి తిలకమొప్పుచుండగా, అంతఁ = అపుడు, అన్నెలఱేడు = ఆమహారాజు, పడతియు = దేవయాన, వల రాచపనుల నలసి = కామకేళిలో నలసిపోయి, నిదురమంపున = నిదుర మత్తున, తగిలిరి.

తా :- పుక్కిటిలోని తాంబూలము యొక్క కర్పూరపు వాసనలు సన్నగా గుబాళించెడు శ్వాసతో, కౌగిళ్లలో బిగ్గరగా ఒకరి నొకరు చేతులతో నదుముకొనగా ! చిగురాకుపై తాపిన కెంపులవలె, పరస్పరము పెదవులపై మునిపండ్ల నొక్కు లేర్పడగా, కామకేళిలో విజృంభించి పెనగగా కొప్పు విడిపోయి చిక్కువడి పూవులన్ని రాలగా, కమ్ముకున్న చెమటతో తిలకముగా దిద్దుకొన్న కస్తూరి కరిగి పరిమళించుచు జారుచుండగా వారిద్దరు కామకేళితో నలసి పోయి నిదుర మత్తున తగిలిరి.

''అలం - స్వభావోక్తి''

27.వ:- అపుడు = అ సమయమున

28.చ॥ తెలతెలవాఱెనఁ దొరల దేవర తామరకంటి వాతెఱఁ
బలుమొన లొత్తి మేల్కొలుపఁ, బైదలి గేస్తుని మోము చెక్కుచే
నలముచుఁ జేత దువ్వలువ నంత మొలఁ సవరించి లేచి, తా
నలయక పీడె మిచ్చె నతఁ డప్పటి కప్పునిపైఁ దలంపిడఁ - 28

క :- తెలతెలవాటినఁ = తెలతెలవారరాగా, దొరలదేవర = ఆయయాతి, తామరకంటి వాతెఱఁ = ఆకమలాక్షి పెదవిని, పలుమొనలొత్తి = దంతములతో దంశించి, మేల్కొలుప = నిద్దురనుండి మేలుకొలుపగా, పైదలి = ఆమె, గేస్తుని మోము = తనయొక్క పతిముఖము, చెక్కుచే నలముచు = తన చెంపతో కప్పుచు లేచి, అంతఁ = అపుడు, చేత = చేతితో, దువ్వలువ = అనగా సన్నని వస్త్రముతో, అంతఁ = అపుడు, మొలఁ, కటిభాగమును, సవరించి = చక్కజేసికొని, లేచి, తాఁ = ఆ దేవయాని, అలయకఁ = అలసిపోక, అతడు = ఆ మహారాజు, అప్పటికి = ఆసమయమున, అప్పనిపైఁ = ఆకార్యముపై, అనగా మరల రతికేళిపై, తలంపిడఁ = కోరికనుంచుకొనగా, వీడె మిచ్చెఁ = తమలపాకును చుట్టి యిచ్చెను. అనగా తానును దానినంగీకరించెనట.

తా :- అపుడు తెలతెలవారుచుండగా నాయయాతి మహారాజామె పెదవిని తనమునిపంట నొక్కి మేల్కొలుపగా నామె యతని యొక్క ముఖమును తన చెంపచే కప్పుచు లేచి చేతితో తనయొక్క కటిభాగమున దువ్వలువను సవరించుకొని అతడపుడు మరల రతికేళిపై తలంపిడగా నామె దాని కంగీకరించి యతనికి విడియము చుట్టి యిచ్చెను.

"అలం - స్వభావోక్తి"

కోడికూత వేళయందనను వేకువ జాముననను యువదంపతులు సామాన్యముగా మరల రతులను దేలుచుందురు -

ఉదా :- వేకువకు-

మలయపు గాలిరేలు వనమాలివి మాన పతాక ఘల్లుమం
చులియఁ బసిండి మువ్వగమి నొక్కక మాటుగ దల్పునుల్కిమి
న్నలము తదీయ హేమ వరణాంచల చంపక శాఖలందుఁబ
క్షులు రొదసేయ వేగెనని కూడుదు రల్కలు దేరిదంపతుల్

అము -ఆ-1-74

ఉదా :- కోడికూతకు -

మ. సమయా భీలత కుక్కుటంబు వివిధ ఛందస్త్రియామాంతరకం
తిమయామో భగవాఁ కుసుమ ధన్వీ దూనినీ దేవతా

రమణాయాం వినియోగ యంచు నిదియా రంభించెగా బోలునా
నమరేఁ దధ్వని మానినుల్ తమకు దామై నాథులఁ బైకొనఁ
పింగళి సూరన ప్రభావతీప్ర-

29.వ:- ఇట్లు వీడెం బొసంగి క్రమ్మఱ నారాచ కొమరు కోర్కి దీర్చి నేర్పు
తమి నలరునంత - 29

టీక :- ఇట్లు వీడెం బొసంగి = ఈవిధముగా విడియమిచ్చి, క్రమ్మర = మరల, నారాచ కొమరు = ఆమహారాజు యొక్క కోరిక దీర్చి, నేర్పు తమిన్, తనయొక్క నేర్పరి తనముతో గూడిన తృప్తితో, అలరునంత = సంతోషమున నొప్పుచున్నంత -

తా :- ఈవిధముగా మహారాజున కామె విడియ మిచ్చి మరల యతని కోరిక దీర్చి తనయొక్క నేర్పరి తనముతో గూడిన తృప్తితో సంతసమున నుండగా -

30.చ॥ పెనిమిటియైన వెన్నుఁ డొగిఁ బ్రేముడి విచ్చినఁ, బుట్టు గ్రుంకుగ
ట్లను తన రెండు చేతుల నొయూరము మీఱగ నేలకొమ్మదా
ల్చిన పవడంపుఁ జుట్టలుఁగుఁ జిందమునుం బలెఁ జూడనొప్పె, నం
తను దగఁ దూర్పునఁ వెనుకఁ దమ్ములవిందును జందమామయున్-30

టీక :- పెనిమిటియైనవెన్నుడు = భర్తయైన విష్ణువు, బగిన్ = క్రమముగా, ప్రేముడినిచ్చిన = ప్రేమతో నీయగా, పుట్టుగ్రుంకు గట్లను = ఉదయాస్తమయ పర్వతములను, తనరెండు చేతులఁ= తనయొక్క రెండు చేతులతో, ఒయారము మీరగ, నేలకొమ్మ= భూదేవి, తాల్చిన = ధరించిన, పవడంపు చుట్టలుగు = పగడపు చక్రము, చిందమునుంబలె = శంఖమువలె, అంతను = అపుడు, తగఁ = ఒప్పునట్లుగా, తూర్పునఁ = తూర్పున, వెనుకఁ = పడమరన, తమ్ములవిందును = సూర్యుడును, చందమామయుఁ = చంద్రుడు, చూడనొప్పెన్ = చూచుటకు తగియుండెను.

తా :- అపుడు భర్తయైనటువంటి విష్ణుమూర్తి యీయగా భూదేవి ఉదయస్తమయ పర్వతములనెడు తన రెండు చేతులతో పగడపు చక్రమును, శంఖమును ధరించినట్లుగా ఉదయగిరిపై సూర్యుడు, అస్తగిరిపై చంద్రుడు చూడనొప్పిరి.

''అలం - ఉపమ''

ఉదయగిరిపై ఉదయించెడు సూర్యుని అస్తగిరిపై అస్తమించెడు చంద్రుని ఏకకాలమున గని మాఘుడు తన కావ్యమున

ఉదయతి వితతోర్ధ్వ రశ్మిరజ్జా
అహిమరుచౌహిమ ధామ్ని యాతి చాస్త్రం
వహతిగిరి రయం విలంబి ఘంటాద్వయ
పరివారిత వారణేంద్ర లీలాం

శిశుపాలవధ - స4-20

సూర్యచంద్రులు మేరువును ప్రదక్షణము చేయుచునట్లు పురాణ వచనము కనుక ఒకవైపు ఉదయించు సూర్యునిలో రెండవవైపస్తమించుచున్న చంద్రునితో నాపర్వతరాజము రెండువైపుల ఘంటల వ్రేలాడు చున్న నేనుగు వలె కనిపించు చుండెనని పై శ్లోక తాత్పర్యము.

పూర్వము రాజవీధులలో నటుల గంటలు వ్రేలాడు యేనుగులు సంచరించు చుండెడివి కనుక రాజమార్గములకు దీనిని బట్టియే ఘంటాపథమను మాట రూఢియైనదని కొందరందురు.

ఈశ్లోకము వలన మాఘునకు ఘంటా మాఘుడని బిరుదేర్పడినది. కాని ఈసందర్భమున తెలగన్న యొక్క యూహ మాఘుని- గూడ మించి పోయినది.

సుదర్శనము కన్నులు మిరు మిట్లు గొలుపు కాంతిగలది కనుక నది సూర్యునితో శంఖము తెల్లనిది కనుక పాలిపోవుచున్న చంద్రునితో నుపమించుట తెలగన్న యొక్క ప్రకృతి పరిశీలనమున కద్భుతమైన యుదాహరణము.

''అలం- ఉపమ''

31.వ:- అప్పు డప్పడంతి యొప్పుల కుప్ప యగు పసిండి యుప్పరిగ
లోనికిం జని తగు పనులు గావించి యున్నంతం, జెలులువచ్చి - **31**

టీక :- అప్పుడు, అప్పుడంత = ఆయువతి, ఒప్పులకుప్పయగు అందముల రాశియగు, పసిండి యుప్పరిగ లోనికింజని = బంగారుమేడలలోనికి వెళ్లి, తగుపనులు = సమయకృత్యములు, కావించి యున్నంతః = ముగించుకొని యుండగా, చెలులువచ్చి -

తా :- అపుడామె పడక గదినుండి బంగారు మేడలోనికి వచ్చి కాల కృత్యములన్ని ముగించు కొన్న పిదప చెలికత్తెలు వచ్చి,

32.తే॥ 'రహిని వలపుల రాయని రాచలచ్చి
కరణి నొక వింత యగు సోయగమున మెఱయు
నిన్నుఁ గనుఁగొనఁగాఁ గల్గెఁ గన్ను లారఁ,
గోర్కు లెల్లను మాకుఁ జేకూడె నేఁడు !' -32

టీక :- రహిని = ప్రకాశమున, వలపుల రాయని, మన్మధుని యొక్క, రాచలచ్చి కరణి = రాజ్యలక్ష్మివలె, ఒక వాతసోయగమున మెరయు, ఒకక్రొత్త కాంతితో ప్రకాశించు, నిన్ను కన్నులార గన్గొనగా గల్గె = కన్నులార చూడ గంటిమి, మాకు, కోర్కులెల్లను = కోరికలన్నియు చేకూడెనేడు = ఈనాడు కలిగెను.

తా :- ఓ దేవయానా! మన్మధుని రాజ్యలక్ష్మి వలె నొకక్రొత్త యందమున ప్రకాశించు నిన్ను చూడగా నీనాడు మాకోర్కికలన్ని తీరెను.

''అలం - ఉపమ''

33.వ:- అనిపలుకం గినుకం బలె జంకించు దేవయానిం గని యొక్క తొయ్యలి యిట్లనియె - 33

టీక :- అనిపలుకఁ = ఇటుల చెలికత్తెలనగా, కినుకం బలె జంకించు = కోపించినది వలె బెదిరించు, దేవయానింగని = దేవయానను చూచి, ఒక్క తొయ్యాలి యిట్లనియె = ఒకామె ఇట్లనెను.

తా :- అని చెలికత్తె లిట్లు పలుకగా వారిని కోపించినట్లుగా బెదిరించు దేవయానిని చూచి అపుడొక యువతి యిట్లనెను.

34.సీ॥ అదలించితివి కొమ్మ నదియె మెఱుంగుఁలు
యెద్ద జారనీకు వే యిగురుఁబోఁడి
యొఱుఁగ కన్నది దానినేల జంకించెదు
వెలఁది రోయింకొక్క విడెము సేయు
మఱచి పల్కినది యోమగువ యాయెల నాఁగ
మెడఁ బచ్చికస్తురి మెదిచి యలఁదు

నగుచు నన్నది దీని దగుతప్పుఁ జూడక
సందిళఁ బూయవే గంద మతివ
తే ॥ కనల నేటికి వీడ్వడఁ గప్పుకొన్న
మగనిదుప్పటి, యిచ్చి రామగుడ, ననిన
నతివ బంగారు నరలోని కరిగి మిగులఁ
బెరుఁగు సిబ్బితివే గడెఁ బెట్టుకొనియె - 34

టీక :- అదలించితివి కొమ్మ = ఓయువతీ! మమ్ముల అదిలించితివి గాని, అదియె = అదుగో, ఇగురుబోడి ఓయువతీ! మెఱుంగు పయ్యెద జారనీకువే = పైటను జారనీయ వద్దు/ అనగా చన్నుల పైగోరొత్తులు కనిపించు చున్నవనుట, ఎరుగకన్నది = పాపము తెలియక యున్నదిలే, దానినేల జంకించెదు - దానినెందుకు బెదరించెదవు, వెలదిరో = ఓయువతి, ఇంకొక్క విడెము సేయు = ఇంకొకసారి తాంబూలము వేసికొనుము- అనగా పెదవులపై పలుగంటులు కనిపించు చున్నవనుట, తాంబూలములోనవి మరుగు పడును- ఓమగువ, మరచి పల్కిన ఆయెలనాగ = ఆమెమరచిపోయి యనినది లెమ్మ, మెడఁ = మెడకు, పచ్చి కస్తురి మెదిచి యలరు = పచ్చికస్తురి బాగుగా మెత్తగా రంగరించి పూసికొనుము. అనగా అక్కడ నఖక్షతములు కనిపించుచున్న వనుట నగుచునన్నది = నవ్వుచుయన్నది. దీనిదగు తప్పు చూడక = ఈమెయొక్క తప్పును లెక్కించకు, అతివ = ఓదేవయానా, సందిళ్ల బూయవే గందము = గందము రెట్టలకు పూసుకొనుము- అనగా బాహువులపై గూడ గోరొత్తులు కనిపించు చున్నవనుట - కనల నేటికి = కోపించు టెందులకు, వీడ్వడ గప్పుకొన్న మగని దుప్పటి = తారుమారుగా కప్పుకొన్న మీ యాయన శాలువ - ఇచ్చిరాయ గుడ ననిన = తిరిగి యిచ్చి రమ్మనగా, అతివ = ఆమె, బంగారు నరలోని కరిగి = బంగారు గదిలోనికి వెళ్లి, పెరుగు సిబ్బితిచే = ముంచుకొని వచ్చెడు సిగ్గుతో, గడెబెట్టుకొనియె = తలుపు గొళ్లెము పెట్టు కొనెను.

తా :- ఓ కొమ్మా! గద్దించినావు సరేగాని అదిగో ఆపైట చక్కగా సదరుకొనుము, జారనీయవద్దు, తెలియకన్నది. ఆమెనెందుకు బెదిరించెదవు గాని మరొకసారి తాంబూలము వేసికొనుము. ఆమె మరచిపోయి ఏదో మాటాడినదిగాని మెడకు వచ్చి కస్తురి బాగుగా రంగరించి పూసికొనుము, ఆమె నవులాట కనినది. తప్పపట్టవలదు గాని రెట్టలకు గందము అలరు కొనుము. కోపమెందులకుగాని

నిదుర మంపుతో తారుమారుగా కప్పుకొని వచ్చిన మీ యాయన శాలువ తిరిగి యిచ్చిరమ్మి - అని యిటుల చెలులామెను పరిహాసము పట్టించగా ముంచు కొని వచ్చు సిగ్గుననామె గదిలోనికి వెళ్లి గడియ వేసికొనెను.

విశే :- మెడపై నున్న గోరొత్తులకు మొగిలిరేకులు, చన్నులపై నున్న వానికి నెమిలి యడుగులు, సందిట నున్న వానికి సందువంకలని వ్యవహారములు, కేళికాగృహము నుండి వచ్చిన దేవయాని శరీరముపైనివి యన్ని కనిపించుచుండెనని పై పద్య తాత్పర్యము.

''అలం - గూఢోక్తి''

నఖక్షతములు :-

సీ ॥ సరగ నఖక్షత స్థానముల్ వివరింతు
సందిటగల యవి సందువంక
నల బొల్చు మెడనున్న యవి యె మొగలిరేకు
లనదగుఁ జను గుబ్బలను నెలకొను
నవియె లెస్స నెమిలి యడుగుల నగనొప్పు
వెన్నున గన బడుచున్న యవియు
నమ్మెపెనంగ దనరును బిరుందుపై
గానిపించిన యవి కల్వరేకు
లనగ నెసగు మీాజెయిఁ జెక్కిటను దొడకడ
నిలుచునవి క్రొన్నెల లనంగ జెలగుచుండు
మరియు దంతక్షతముల నామములు సెలగు
పెదవికెంపు పల్గంటునా వేంకటేశ

వేంకటేశాంధ్రము - మానవ-77

కామశాస్త్రము దంత నఖక్షతాదులు అష్టవిధములని చెప్పబడినవి.

నఖక్షతములు :- 1. ఆచ్ఛురితకము 2. అర్థచంద్రము 3. మండలము 4. రేఖ 5. వ్యాఘ్రనఖము 6. మయూర పదకము 7. శశప్లుతము 8. ఉత్పల పత్రకము.

కామ-సూ-2.2.4

కటిసీమపై నుంచెడు నఖక్షతముల కుత్పల పత్రములని వ్యవహారము.

ఉదా:- మ :- భళిరా తేరకు తేరజిక్కొనిటులీ బంగారు కుండంచు చం
కలు దాటించుచు కెంపుమోవి బుడుకంగా గుబ్బపాలిండ్లు బి
ట్టల మంగా ముఖగంధపారణము సేయంగా కటీసీమను

దంతక్షతములు:- త్పల పత్రాళి ఘటించగా దివురు మిత్రద్రోహి మోహాంధతన్
- పాండు ఆ-3-61

1. గూఢకము 2. ఉచ్ఛూనకము 3. బిందువు 4. బిందుమాల
5. ప్రవాళమణి 6. మణిమాల 7. ఖండాభ్రకము 8. వరాహ చర్వితకము

కామ సూ:2.5.4 చూ.
సం.ప.కో.పు. 133

35.తే॥ ఇట్టు లర లోనఁ జొచ్చిన యిగురుఁ బోఁడిఁ
గల్లఁ జేసితి మని చాల గారవించి
పిలుచుకొని వచ్చి సకియలు పెంపుసేయ
నలరె నీఠివిఁ గొన్ని నాళ్లరుగునంత - **35**

టీక :- ఇగురుబోడి = ఆదేవయాన, ఇటులరలోన జొచ్చిన = ఈవిధముగా గదిలో ప్రవేశించిన, కల్లసేసితిమని = మనము పాపెవరావెంను మిక్కిలిగా నాటపట్టించితిమని, చాలగారవించి = మిక్కిలి గౌరవించి సకియలు, పిలుచుకొని వచ్చి = ఆమెను గదినుండి వెలుపలికి తీసుకు వచ్చి, పెంపుసేయ = మిక్కిలిగా గొప్పసేయగా - అదృష్టవంతురాలవని - అలరెనీఠివి కొన్నినాళ్ళు = కొన్నిదినము లాఠీవి యొప్పెను. అరుగునంత = కాలమటుల జరుగుచుండగా -

తా :- ఆదేవయాన అటుల గదిలోనికి వెళ్లి గడియవేసి కొనగా చెలులు మనమామెను మిక్కిలిగా పరిహాసము చేసితి మని వెలుపలికి పిలుచుకొని వచ్చి మరల గౌరవించగా నాఠీవి కొన్ని దినములు నడిచెను. అటుల దినములు జరుగుచుండగా -

-: దేవయాని కుమారులను గనుట :-

36.క॥ వెలవెలఁ బాఱె న్మొగ మూ
ర్పులు మిక్కిలి సందడించెఁ బొక్కిలి విరిసెఁ
నలుపెక్కెఁ జన్ను మొనల
న్నెలకొని యుప్పి దలికి నెల మసలంగన్ - **36**

టీక :- అప్పైదలికిని = ఆమెకు, నెలమసలంగ౯ = నెలతప్పగా, వెలవెల బారె న్మొగము = ముఖము తెల్లనయ్యేను, ఊర్పులు మిక్కిలి సందడించె = శ్వాసవెక్కువ యాయెను. పొక్కిలి విరిసెన్= నాభివికసించెను. నలుపెక్కె చన్ను మొనల౯ = చూచుకములందు నలుపు వారెను.

తా :- అపుడామెకు నెలతప్పగా ముఖము తెల్లబడెను. శ్వాసలు తొందరగా నాయెను. నాభివికసించెను. చనుమొనలు నలుపెక్కెను.

''అలం - స్వభావోక్తి''

37.చ॥ కడుబలుపయ్యె నెన్నడుము, గ్రందుగ వాచవ లుప్పతిల్లె, నుగ
దొడవులు వ్రేఁకమయ్యె, మదిఁ దోఁచెను గోర్కులు, పాటలాటలు౯
గుడుపులు నించవయ్యె, మఱికూర్కులు డప్పియుఁ జాలఁ బుట్టె, నె
న్నడలు దడంబడం దొఁణగె నాతికిఁ దొమ్మిదినెల్లు నిండఁగన్ - 37

టీక :- నాతికి = ఆదేవయానకు, తొమ్మిదినెల్లు(నెల్ల=నెలలు) తొమ్మిది నెలలు, నిండగ౯ = పూర్తికాగా - కడుబలువ యెనెన్నడుము = సన్నని నడుము మిక్కిలి లావుగా నాయెను. క్రందుగ౯ = వరుసగ, వాచవులుప్పతిల్లె = వివిధమైన రుచులపై కోరికలు పుట్టెను, నుగదొడవులు వ్రేకమయ్యె - నునుపైన నగలు బరువయ్యెను, మదిదోచెను కోర్కెలు= వివిధరకములైన కోరికలు కలిగెను, పాటలాటలు౯ కుడుపులు నించవయ్యె = పాలులు, ఆటలు, ఆహారములు రుచించ వయ్యెను. మరి = మరియు, కూర్కులు దప్పియు చాల బుట్టె = నిద్ర, దాహము ఎక్కువాయెను. నెన్నడలు తడం బడం దొడగె = అందమైన నడకలు తడబడసాగెను.

తా :- ఆమెకు తొమ్మిదినెలలు నిండరాగా, నడుము బాగుగా లావెక్కెను, వివిధమైన రుచులపై మనసు పుట్టెను, సొమ్ములు బరువయ్యెను, మనస్సున వివిధమైన కోరికలు జనించెను, ఆటలపై పాటలపై, ఆహారముపై విరక్తికలిగెను. నిద్రదాహము, ఎక్కువయ్యెను, నడకలు మందగించెను.

విశే :- ఇవన్నియు గర్భవతులకు క్రమముగా కలుగు లక్షణములు.

''అలం - సముచ్చయము''

38.వ:- అంత = అపుడు

39.క:- లలినానెలంతకు యదు వనఁ
గలిగెం గొమరుండు కలిమికలికికి మరుఁడుఙ
బలెరూపు సొంపునఙ రా
కలిమియు బలిమియును దనదుకైవడిఁ దోఁపన్ - 39

టీక : లలిఙ = ఒప్పునట్లుగా, ఆనెలతకు = ఆమెకు, కలిమికలికికి = లక్ష్మీదేవికి, మరుడుంబలె = మన్మధునివలె, రూపుసొంపునఙ = అందమున, రాకలిమియు = రాజైశ్వర్యము, బలిమియు = పరాక్రమము తనదు కైవడి దోఁపఙ = తనవలెనే కనిపించుచుండగా, యదువన గలిగెన్ కొమరుండు = కుమారుడు యదువనగా జనించెను.

తా :- అపుడామెకు లక్ష్మీదేవికి మన్మధుని వలె, రూపము నందును, రాచరికము నందును బలపరాక్రమమునకు తనవలెనె కలిగిన యదువు అను కుమారుడు కలిగెను.

''అలం - ఉపమ''

యదువు :-

దేవయాన యయాతి మహారాజుల యొక్క జ్యేష్టపుత్రుడు. గొప్ప తత్వవేత్త. భాగవత మందలి యేకాదశ స్కంధమునగల అవధూత యదు సంపాదము ప్రసిద్ధము.

శుక్రునిచే యయాతికి కలిగిన యకాల వార్థక్య మితడు స్వీకరించ నిరాకరించిన కారణమున రాజ్యాధికారమును గోల్పోయెను. కాని యనంతర కాలమున ఇంద్రుడితనికి మరల రాజ్యాధికారము కలిగించెనని కొన్ని పురాణములు చెప్పినవి.

భాగవతమందే యయాతి చరిత్ర వలన మరల యయాతి :- నిజభుజ శక్తిపాలతంబగు భూమండలంబు విభాగించి ద్రుహ్యునకు పూర్వభాగంబును, యదువునకు దక్షిణ భాగంబును, తుర్వసునకు పశ్చిమభాగంబును, ననువున కుత్తర దిగ్భాగంబును సంరక్షించుచుండని యిచ్చె (9-584వ) నని చెప్పబడినది. దీనిని డా॥ శ్రీపుట్టపర్తి శ్రీనివాసాచార్యుల వారు యయాతి తన రాజ్యము నేవురికి పంచి యిచ్చి ప్రధానవంశము నిలబెట్టుటకు మాత్రము కనిష్ఠపుత్రుడైన పూరునే నియోగించి యతనికి ప్రతిష్టానము రాజధానిగా గల మధ్యదేశమును (గంగా యమునలకు మధ్యనున్న భాగమునందు దక్షిణభాగమును) యిచ్చెనని, జేష్టుడైన యదుచక్రవర్తి చర్మణ్వతీ (చెంబల్) వేత్రవతి

(బేత్వా) శుక్తిమతి(రేన్) నదులతో విరాజిల్లు నైఋతి భాగమును, తుర్వసు ''రీవా'' ప్రాంతమున గల ఆగ్నేయ దిగ్భాగమును, ద్రుహ్యుడు పడమటి ప్రాంతమును, అను ఉత్తర ప్రాంతమును పొందిరని కొన్ని పురాణములనుండి తెలియుచున్నదని పోతన భాగవతము - రాజవంశములు - భువన కోశము. అను వ్యాసమున తెలిపిరి. చూ॥ ఆంధ్రమహా భాగవతోపన్యాసములు ఆంధ్రసారస్వత పరిషత్తు ముద్రణ.

ఇతని కాలము శ్రీకోటవెంకటాచలముగారు భారతీయ శకములు అను గ్రంథమున కలిశకము 5050 నాటికి 3,10,31,040 గతాబ్దములని తెలిపిరి చూ.పు.24 ముద్రణ 1950

ఇండియన్ క్రోనాలజి యందు యయాతి కాలము కలి పూ. 3450 బి.సి. 6551 అని చెప్పబడగా పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు గారు యయాతి యుగము క్రీ.పూ. సుమారు 3000-2750 నడుము అని చెప్పినారు.

ఇండియన్ క్రోనాలజి - బై- త్రివేది - భారతీయ విద్యాభవన్ ప్రచురణ క్రీ.శ. 1963.

40.వ:- ఇట్లు గలిగిన యక్కొమరుండు పెరుఁగుచున్న యెడ - 40

టీక :- ఇట్లుకలిగిన = ఈవిధముగా కలిగి, అక్కొమరుండు = ఆబాలుడు పెరుగుచున్నయెడ = పెరుగుచుండగా-

తా :- ఆవిధముగా కలిగిన యాబాలుడు పెరుగుచుండగా -

41.తే॥ కలిమి దైవా ఱ నయ్యింతి గనియె మఱియు
నలరి దుర్వసుఁడను రాచకలువ ఱేని
గట్టు దొరవట్టి కూరిమి గడలు కొనఁగ
నాఱుమొగములు కలిగిన యతని బలెను, - 41

టీక :- కలిమిదైవార = ఐశ్వర్యము విస్తరించగా, అయింతి = ఆమె మరియు అలరి =సంతోషమున నుండి, తుర్వసుడను రాచ కలువ ఱేని = తుర్వసుడను రాజచంద్రుని, గట్టుదొరవట్టి = పార్వతి, కూరిమి గడలు గొనగ = ప్రేమనిండగా, ఆరుమొగములుకలిగిన యతని బలెను = షణ్ముఖుని వలె, కనియె = కనెను.

- ఆపెమ్మట దేవయాని తమయొక్క వంశము విస్తరించగా పార్వతీదేవి షణ్ముఖునిగన్నట్లుగా తుర్వసుడను రాజచంద్రునిగనెను.

''అలం - ఉపమ''

యయాతి పుష్పవనమున కేగుట

42.వ:- ఇవ్విధంబేబునం బెడిదంపుఁ గడిమి మగఁటిమి నింగడు
నమరు కొమరులం గాంచి మించిన సిరులం గొఱలు దేవ
యానిం జూచి శర్మిష్ఠ తనలోన - 42

టీక :- ఇవ్విధంబున = ఈవిధముగా, బెడిదంపు కడిమిఁ మగటిమిఁ = ఉద్ధతమైన బలపరాక్రమములలో, కడునమరు = మిక్కిలిగా నొప్పిన, కొడుకులంగాంచి = కుమారులనిగని, మించిన శిరులం గొఱలు = అమితమైన యైశ్వర్యమున ప్రకాశించు, దేవయానిం జూచి, శర్మిష్ఠతన లోన-

తా ॥ ఈవిధమున గొప్పనైన బలపరాక్రమ వంతులైన కుమారులను పొంది యంతులేని యైశ్వర్యమున నొప్పు దేవయానిని చూచి శర్మిష్ఠ తనమనస్సు -

43.క॥ పెనిమిటినిఁ జెంది కొడుకులఁ
గనమగువలు గోరు టెందుఁ గల దటువలెనే
పెనిమిటినిఁ జెంది కొడుకులఁ
గనియెను గదె దేవయాని కణఁకెట్టిదియో - 43

టీక :- పెనిమిటిని జెంది = భర్తనుపొంది, కొడుకులగనఁ = పుత్రులను పొందుట ,
మగువలు కోరుటెందు గలదు = ఎచటనైనను స్త్రీలు కోరుదురు, అటువలె నె = పెనిమిటినిజెంది = భర్తను పొంది, కొడుకుల కనియెను గదె = కొడుకులను పొందెను గదా! దేవయాని, కణకెట్టిదియో = ఆమెపూనిక ఎటువంటిదో

తా :- స్త్రీలు భర్తను పొంది కుమారులను గనవలయునని ఎచట నైన కోరుచుందురు. అటువలెనె దేవయాని భర్తను పొంది కుమారును గనెను. ఆమె యొక్క అతిశయ మెట్టిదో గదా!

విశే :- పతిబడసి సుతుసుతులబడయం, అతివలు గోరుదురు, చూ. మహాభారతము. అనగా వివాహానంతర మాతృత్వము కోరుదురు గాని కన్యా మాతృత్వమున కిష్టపడరని తాత్పర్యము.

44. కII ఏమను కొనఁ గల దిఁక, నే
గోమున రాకాసి తేని కూఁతురఁగా, నే
నోములు నోఁచితినో, యీ
బాములఁ బడవలసె, ననుచుఁ బనవుచు నుండెన్ - 44

టీక :- ఏమను కొనగల దికను = నేనేమను కొనను, నే=నేను, గోమున = గర్వమున, రాకాసి కూతురగా = దానవుని కూతురనై పుట్టుటకు, నేనేనోములు నోచితినో, ఈ బాముల బడవలసె = ఈకష్టములు పడవలసెను. అనుచు పనవుచు నుండెన్ = దుఃఖించు చుండెను.

తా :- నేనేమను కోగలను, దానవకాంతనై పుట్టుటకు పూర్వము గర్వమున ఏమినోములు నోచితినో ఇపుడీ పాటు పడవలసి వచ్చినది. అని దుఃఖించు చుండెను.

''అలం - లోకోక్తి''

45. కII అంతట నొక నాఁ డింతులు
సంతసమునఁ గొలువఁ బైఁడి జగ్గిలెపైఁ జే
మంతుల మాడువులో, విరి
కొంతపు వేల్పనగ రాజు కొల్వున్న యెడన్ - 45

టీక :- అంతటనొకనాడు = అపుడు ఒకనాడు, ఇంతులు = స్త్రీలు, సంతసమున గొలువ = సంతోషమున సేవించు చుండగా, పైడిజగ్గిలెపై = బంగారపు జగిలితో, చేమంతుల మాడువులో = చేమంతుల మేడలో, విరికొంతపు వేల్పనగ = మన్మధుడనగా, రాజుకొలువున్న యెడన్ = మహారాజు కొలువుండగా -

తా :- అపుడొకనాడు స్త్రీలు కొలుచుచుండగా మహారాజు బంగారు జగిలిలోని చేమంతుల మేడలో మన్మధుని వలె కొలువుదీరి యుండగా-

''అలం - ఉపమ''

46. మII కుసుమంబద్దిన వల్పె పయ్యెద చెఱంగు న్మంగలం జెక్కి, వె
క్కసమై యొప్పెడు గబ్బిగుబ్బ చను వ్రేకం దానగాలేక, కా
నసియాడ, న్మొల మాలిగంట లొగి మ్రోయం, గొమ్మ యొక్కర్తువ
చ్చి సుమాళంబున మ్రొక్కి, కానుకొసఁగెం జెంగల్వ లాఁతేనికిన్ - 46

టీక :- కుసుమంబద్దిన = చెంగావియద్దిన, వల్పెపయ్యెద చెఱంగుఁ = సన్నని కొంగును, ముంగలం జెక్కి = భుజముపై నుండి తీసి ముందుకు చెక్కుకొని, పెక్కసమైయొప్పెడు = సహింపరాకుండ నుండెడు, గబ్బి గుబ్బచనుఁబ్రేకఁ = బింకమై గుబ్బటిల్లిన చన్నుల బరువున, ఆనగా లేక = భరించలేక, కౌనసియాడఁ = నడుమల్లల నాడు చుండగా, మొలనూలిగంట లొగిమ్రోయఁ = మొలనూలు యొక్క గజ్జెలు మ్రోగు మొలనూలిగంట లొగిమ్రోయఁ = మొలనూలు యొక్క గజ్జెలు మ్రోగుచుండగా, కొమ్మ యొకర్తు వచ్చి = ఒక యువతి వచ్చి, ఆ జేనికిఁ మ్రొక్కి = ఆ రాజునకు నమస్కరించి, చెంగల్వలు కానుకొసగఁ = చెంగల్వలు కానుక పెట్టెను-

తా :- చెంగావి యద్దిన చీరకొంగును ముందువైపు చెక్కుకొని యొక యువతి బిగువైన చన్నుల బరువున నడుము జవజవ లాడుచుండగా మొలనూలు గంటలు మ్రోగగా వచ్చి ఆ మహారాజునకు నమస్కరించి చెంగల్వలు కానుక చేసెను.

''అలం - స్వభావోక్తి''

47.ఉ॥ ఆవిరు లట్లొసంగి కడునర్మిలి తోడుతఁ గొమ్మ మోమునం
దావికి తుమ్మెదలఁ దాఁ బలుమాఱును జోఁపుకొంచు, నే
దేవర తోఁటఁ గాచుపాలతి, న్వినుమచ్చట సొంపు మీఱు పూఁ
దీవెలు విన్నవింపఁ జనుదెంచితి నిచ్చటె, కంచు నిట్లనున్ - 47

టీక :- ఆవిరులట్లొసంగి = ఆ పూవులావిధముగా నిచ్చి, కడునర్మిలితోడుత = మిక్కిలి ప్రేమతో, కొమ్మ = ఆయువతి, మోమునం తావికి వ్రాలు = ముఖముపై పరిమళమునకు వ్రాలు, తుమ్మెదలను, తాపలు మారును జోపుకొంచు = తాను పదేపదే జోపుకొంటు, నేదేవర తోటగాచు పాలతిఁ = మహారాజా ! నేను మీవనపాలకురాలని, వినుము = నామనవి వినుడు, అచ్చట సొంపు మీరు పూదీవెలు = అక్కడ అందముతో నొప్పు పూల తీగలు విన్నవింపఁ = తెలుపుటకై, ఇచటికి, చనుదెంచితిని = వచ్చితిని, అంచు = అనుచు, నిట్లనుఁ = ఈ విధముగా ననెను.

తా :- ఆమె ఆ పూవులా విధముగా నిచ్చి మిక్కిలి ప్రేమతో నామె ముఖముపై పరిమళమునకు వ్రాలు తుమ్మెదలను పలుమారును జోపుకొనుచు, ప్రభూ నేను

మీ వనపాలకను, అచటి పూవుల తీగలను గుఱించి తెలుపుటకై వచ్చితిని అని యిట్లు చెప్పెను.

''అలం - స్వభావోక్తి''

48.మః- సురపొన్న ల్కలిగొట్లు చిందుగలు కర్జూరంబు లబ్బెందలు
స్గురువెంద ల్మొగడ ల్మొగళ్లు విరుగ ల్గోరంటలు స్సంపెంగ
ల్గరుగు ల్జిన్నులు దాడినిమ్మలు మొదల్గామ్రాఁకు లొక్కుమ్మడి
న్విరులం గన్నుల పండువై తనరెడి వేంచేసి చూడందగున్ - 48

టీక :- సురపొన్నల్, కలిగొట్లు, చిందుగలు, ఖర్జూరంబులు, లబ్బెందలు, గురువెందలు, మొగడలు = మొగడ తామరలు, మొగుళ్లు= మొగిలి చెట్లు విరుగులు = గోరంటలు, సంపెంగలు, గరుగులు, చిన్నలు, దాడి నిమ్మలు = దానిమ్మలు, మొదల్గామ్రాకులు = మొదలైన చెట్లు ఒక్కుమ్మడిన్ = ఒకేసారిగా, విరులన్ = పూవులతో, కన్నుల పండువై = నేత్రపర్వమై, తనరెడిన్ = ఒప్పుచున్నవి, వేంచేసి దగున్ = మీరు వచ్చి చూడవలెను.

తా :- మహారాజా ! మనతోటలో సురపొన్నలు, కలగొట్లు, చిందులు, ఖర్జూరాలు, అబ్బెందలు, గురువెందలు, మొగడ తామరలు, మొగుళ్ళు విరుగులు, గోరంటలు, సంపెంగలు, గరుగులు, చిన్నలు, దానిమ్మలు, మొదలైనచెట్లన్ని ఒకేసారి పూచినవి. కనుక మీరు వచ్చి చూడ వలెను.

విశే :- ప్ర 36 ద్వి - 48 చ - 7, 20, 26 పం. 48 ఈ పద్యములన్ని ఒకసారి చూడవలె.

49.కః అని విన్నవించు పలుకులు
విని సంతస మొప్ప రాజు వెలఁదుక లెల్లె
న్మునుపడి యూడిగముల తోఁ
జనుదేరం గదలి తోఁట చక్కికి నరిగెన్ - 49

టీక :- అని విన్నవించు పలుకులు = అని చెప్పెడు మాటలు, వినిరాజు సంతస మొప్ప = సంతోషమున, వెలదుక లెల్లన్ = స్త్రీలందరు, మునుపడి = ముందుండి, ఊడిగములతో జనుదేరన్ = సేవలలో బయలు దేరగా, కదలి తోటచక్కికి = తోట సమీపమునకు, అరిగెన్ = వెళ్లెను.

తా :- అని వనపాలిక విన్నవించు మాటలు విని మహారాజు ఊడిగపు యువతులు ముందుండి సేవలు చేయుచుండగా వనమువైపు బయలు దేరెను.

50.తే॥ ఇట్టు లరిగిన రాజుతో నేఁగు దెంచు
కొమ్మలెల్లను బూవులు గోయఁ గడఁగి
మొత్తములు గూడుకొనుచు నువ్వెత్తుగాఁగఁ
గడల బ్రాఁకుల వేర్వేఱఁ గ్రమ్ము కొనఁగ - 50

టీక :- ఇట్టు లరిగిన = ఈ విధముగా వెళ్లిన, రాజుతో నేగు దెంచు = రాజు వెంట వచ్చు, కొమ్మలెల్లను = యువతులందరు, పూవులు కోయగడగి = పూని, మొత్తములు గూడుకొనుచు = గుంపులై, ఉవ్వెత్తు గాగ = మిక్కిలి విజృంభణముతో, కడల బ్రాకుల = అన్ని దిక్కులందును, చెట్లయందును, వేర్వేర = వేరువేరుగా క్రమ్ముకొనగా -

తా :- ఈ విధముగా రాజుతో వెళ్లిన చెవెలందరు పూలు గోయ బూని గుంపులు గుంపులై, అన్ని దిక్కులందును, అన్ని చెట్లయందును వ్యాపించి -

51.సీ॥ కొమ్మ, ఈపొన్న పూగుత్తు లంటితివేని
గొమరైన నీగబ్బి గుబ్బలాన
చెలువ, యీమానిలేఁ జిగు రంటితేని నె
త్తావి నింపొందు నీ మోవియాన
వెలది, యీపూదీవియల నంటితేని ను
న్నాడవుల తోడి నీయొడలి యాన
కలికి, యీకొలనిలోఁ గలువ లంటితివేని
గడునొప్పు నీవాలుఁ గన్నులాన
తే॥ యతివ, యీ మెట్ట దామర లంటితేని
నొడిచి చాటెద నేను నీయడుగులాన
యనుచుఁ బూఁ బోండ్ల నెల్లఁ దానానపెట్టి
తోఁట తోయ్యలి యారాజు తోడ ననియె - 51

టీక :- కొమ్మ , ఈపొన్న పూగుత్తు లంటితివేని = ఈ పొన్న పూలగుత్తులను తాకితివా, కొమరైన = అందమైన, నీగబ్బి గుబ్బలాన = బింకమైన నీచన్నులపై యొట్టు / చెలువ, యీమాని లేజివురంటితేని = ఈమామిడి యొక్క లేచిగురును తాకిన

యెడల, నెత్తావినిం పొందునీ మోవియాన = నిండుగా గుబాళించు నీపెదవిపై యొట్టు/ వెలది, ఈపూవు దీవియల నంటితిరేని = ఈ పూల తీగలను తాకిన యెడల, నున్నొడవుల తోడి = నునుపైన భూషణములుగల నీ ఒడలియాన = నీశరీరముపై యొట్టు / కలికి, ఈ కొలనిలో కలువలంటితివేని = కలువలను తాకిన యెడల, కడునొప్పు = మిక్కిలి యందమైన, నీకన్నులాన = నీ కన్నులపై యొట్టు / అతివ, ఈమెట్ట తామరలంటి తేని = ఈ స్థలపద్మములను తాకిన యెడల, ఒడిచి చాటెదనేను = నేను నిన్ను గెలిచి చాటించెదను, నీయడుగులాన = నీ పాదములపై యొట్టు, అనుచు, పూబోండ్ల నెల్ల = యువతులనెల్ల, తానాన పెట్టి వృక్షములను ముట్టకుండ తాను ఒట్టుపెట్టి, తోట తొయ్యాలి = ఆ వనపాలకురాలు, ఆరాజుతోడ, అనియె = ఇట్లనెను.

తా :- ఓ కొమ్మా ! ఈపొన్నగుత్తులు తాకితె నీ గుబ్బలపై ఒట్టు, ఓ చెలువా! ఈ మామిడి చిగురంటితె నీపెదవిపై ఒట్టు, వెలదీ ! ఈ పూలతీగ లంటితె నీ ఒడలిపై ఒట్టు, ఓకలికీ ! ఈకలువలు తాకితె నీకన్నులపై ఒట్టు, ఓ అతివా ! ఈమెట్టతామరలు తాకిన నీపాదాలపై ఒట్టు, అని ఈవిధముగా అందరిపై యొట్లు పెట్టి ఆవన పాలిక మహారాజుతో నిట్లనెను.

52.ఉ॥ వన్నెగ మీఁదఁబ్రాఁకి దిగఁబ్రాలెడు తీవలచేత నొప్పెడుం
బొన్నలు ఱేఁడ, చూచితివె పూల బెడంగున నాల్గువంకలం
జెన్నుగ వ్రేలుచున్ జడలచేఁ గడుమీఱుచుఁ బెక్కురూపులో,
క్రొన్నెలఁదాల్చు వేలుపులొకో, యని చూపఱు చూచి మెచ్చఁగన్ -52

టీక :- ఱేఁడ చూచితివె = ఓ మహారాజా చూచితివె, వన్నెగమీర బ్రాకి = అందముగా పైకిప్రాకి, దిగఁబ్రాలెడు తీగల చేత = క్రిందికి దిగులాడు తీగల తోడ, బొన్నల = బప్పుతున్న పొన్నచెట్లు, పూలబెడంగున = పూవులయొక్క సౌందర్యాలతో, నాల్గువంకలఁ = నాలుగువైపులతో, చెన్నుగవ్రేలుచుఁ = అందముగా వ్రేలాడుచు, జడలచే కడుమీరుచు = జడలతో నొప్పుచు, పెక్కు రూపుతో = అనేక రూపములు ధరించిన, క్రొన్నెల దాల్చు వేలుపులొకో = క్రొత్త నెలవంకలను ధరించిన శంకరులేమోయని, చూపఱు = చూచువారు, చూచి మెచ్చఁగఁ = చూచి మెచ్చుకొనునటుల, ఒప్పెడుఁ = ఒప్పుచున్నవి.

తా :- ఓ మహారాజా! చూచినావా! తీగలుపైకి క్రిందికి వ్రేలాడు చుండగా పూచి నిలిచిన పొన్నలు చూచువారికి అనేక రూపములు ధరించి నిలిచిన శంకరులేమో అన్నట్లున్నవి.

''అలం - ఉత్ప్రేక్ష''

53.కII బలువగు సొంపున వ్రేఁగగు
తలిరులచే మావిగములు తద్దయు మీఁచె
న్వలరాయని తామర కెం
పుల మేడలు వోలెఁ జిల్కబోదల కిరవై - 53

టీక :- మావిగములు = మామిడులు, బలువగు సొంపున = మిక్కిలియందమున, వ్రేగగు తలిరులచే = భారమైన చిగుళ్లచే, చిల్కబోదల కిరవై = చిలుకల పిల్లలకు నివాసమైన, వలరాయని = మన్మధుని యొక్క తామరకెంపుల మేడలు వోలె = పద్మరాగమణుల భవనములవలె, తద్దయునొప్పెఁ = మిక్కిలిగా నొప్పనంచున్నవి.

తా :- ఓ మహారాజా! మామిడి గున్నలు గుబురులైన చిగురులతో మిక్కిలి సుందరమైన చిలుక పిల్లలకు నివాసమై మన్మధుని యొక్క పద్మరాగ భవనములవలె నొప్పుచున్నవి.

''అలం - ఉపమ''

విశే :- తామర కెంపులకు పద్మరాగములనిపేరు. ఇవి కెంపులలో నొక తరగతి కెంపులు పద్మరాగము, కురువిందము, సౌగంధికము - నీలగంధి యనినాలుగు రకములు పద్మరాగమెట్టి తామర రంగున నుండును. కెంపులందిదియే శ్రేష్ఠమైనది. కురువిందము పసుపు కలిసిన ఎఱుపు. నిప్పుల రంగున నుండును. మనుచరిత్రయందు మేరుపర్వత కూటము లందైరావతము కొమ్ములలో చిమ్ముకురువిందములనభ్రకరిణి నిప్పు కల నిభ్రమయు చున్నట్లు వర్ణింపబడినది. సౌగంధికమ శోకపు చిగురు రంగు కెంపులందిదిమధ్యమము. నీలగంధి నీలపు తళుకు కలిసి యుండును. దీనిని నాసిరకమందురు.

చూ. వ్యవహారికాంధ్రమహాభారతం. పురిపండా ఆది సభా పర్వాలు పు. 311 ముద్ర 1963.

54.చ॥ పరువము లైన క్రొవ్విరులఁ బాయక కెంపగు దాడినిమ్మలం
దిరముగఁ గ్రమ్మినట్టి పువుఁ దేనియలానఁగ వచ్చిక్రమ్మఱన్
దిరుగుచుఁ జాల్పులైన మగతేఁటులు మీఱెడు ఱేఁడ, చూచితే
విరివిలుకాఁడొనర్చు నలవేలిమి మంటలపైఁ బొగల్వలెన్ - 54

టీక :- ఱేడ = ఓ మహారాజా ! పరువములైన క్రొవ్విరుల = ప్రాయముగల కొత్తపూవులను, పాయక = రాలిపోక, ఎల్లపుడు, కెంపగు దాది నిమ్మలన్ = ఎర్రనైన దానిమ్మలను, పువుదేనియ లానగ వచ్చి = పూవుల తేనెను త్రాగుటకై వచ్చి వ్రాలి, కమ్మఱన్ = మరల, తిరుగుచు, చాల్పులై = వరుసలై, తిరముగ = వదలి పోకుండ, క్రమ్మినట్టి = క్రమ్ముకొను నట్టి, మగతేటులు = గండు తుమ్మెదలు విరివిలుకాడొనర్చు = మన్మధు చేయు, అల = ఆ యొక్క మేలిమి మంటలపై = యజ్ఞజ్వాలలపై, పొగల్వలెన్ = పొగలవలె, మీరెడు = ఒప్పుచున్నవి, చూచితే = చూచితివా !

తా :- ఏ మహారాజా ! క్రొత్తపూవులతో ఎల్లప్పుడు ఎర్రగా కనిపించే దానిమ్మలపై తుమ్మద గుంపులు తొలగి పోకుండ లేచుచు వ్రాలుచు మన్మధుడు చేయుచున్న హోమ జ్వాలలపై పొగలవలె నున్నవి. చూచి నావా!

''అలం - ఉపమ''

విశే :- ఎర్రని దానిమ్మలపై నల్లని తుమ్మెదలు మనోహరమైన దృశ్యము.

55.క॥ పనసలు కెమ్మోకలఁ దగుఁ
గనుఁ గొనఁగా గాడ్పు బల్మిగారాకుపెక
ల్చిన చోటఁ గ్రమ్మ నెత్తురు
లనఁ జూపఱు మదుల కెల్ల నబ్బుర మొదవన్ - 55

టీక :- పనసలు - గాడ్పు = వాయుదేవుడు, బల్మి = బలముతో, కారాకు పెకల్చిన చోట = పండుటాకులు పెకలించిన చోట, గ్రమ్మ నెత్తురులన = క్రమ్ముకొనెడు నెత్తురులన్నట్లుగా, చూపరమదులకెల్ల = చూచువారి హృదయము లన్నింటికి, అబ్బురమొదవన్=ఆశ్చర్యము కలుగగా, కను గొనగా=చూడగా, కెమ్మోకల దగున్=ఎర్రని చిగుళ్లతో నొప్పుచున్నవి.

తా :- మహారాజా ! పనసలు వాయువు తన బలముతో పండుటాకులు పెకలించి వేయగా నచ్చట గ్రమ్మిన నెత్తురుల వలె ఎఱ్ఱని చిగురాలకు లొప్పుచు చూచువారి కాశ్చర్యము

గొల్పు చున్నవి. చూడుము.

''అలం - ఉత్ప్రేక్ష''

56.చ॥ అరుదుగఁ బువ్వుఁదేనె కడుపారగఁ గ్రోలుడు నన్ను చూపినం
బరువున దవ్వుగా నెగసి పాదిరి మీఁదికి మాటి మాటికిం
దిరిగెడు తుమ్మెద ల్వలపు దేవర పచ్చల మేడ యెక్కియు,
చ్చెరువుగఁ దుంటవింట వడిఁ జిమ్మెడు కస్తురి యుండలోయనన్- 56

టీక :- అరుదుగ = ఆశ్చర్యకరముగా, పువ్వుతేనె = మకరందము, కడు పారగ గ్రోలుడు = కడుపునిండ ద్రాగినందు వలన, అన్నుచూపినన్ = మదము కలిగి నందువలన, పరువున = వేగముగా, దవ్వుగా నెగసి = దూరముగా ఎగిరి, పాదిరి మీదికి మాటిమాటికిన్ = పాదిరి పూలపైకి పదేపదే, తిరిగెడు తుమ్మెదల్ = తిరుగుచున్న తుమ్మెదలు, వలపు దేవర = మన్మధుడు, పచ్చల మేడయెక్కి, అచ్చెరవుగ = ఆశ్చర్య కరముగా, తుంట వింట = చెఱుకు విల్లున, వడిజిమ్మెడు = వేగముగా చిమ్ము = కస్తురి యుండలోయన్ = కస్తూరి యుంటలేమో యన్నట్లు, దనరును = ఒప్పును.

తా :- ఆశ్చర్యకరముగా పూదేనె కడుపునిండుగా త్రాగి కైపెక్కుట వలన మాటికి వేగముగా పాదిరి పూలమీదికి తిరిగెడు తుమ్మెదలు మన్మధుడు పచ్చల మేడనెక్కి ఉండీలతో చిమ్ము కస్తూరి యుండలేమో అన్నట్లున్నవి.

''అలం - ఉత్ప్రేక్ష''

57.తే॥ సన్నగరువలిఁ దొడిమలు సారె సడలి
పొగడక్రిందట రాలిన పువ్వు లమరెఁ
దెరువరుల మీఁది కినుక వేగిరమె రాఁగఁ
దొరుఁగు మరుతేజి సెలవుల నురువుల నఁగ - 57

టీక :- పొగడ క్రిందట = పొగడ చెట్టుక్రింద, సన్నకరువలిన్ = సన్నని గాలితో, సారె = పదేపదే, దొడివులు సడలి = రాలిన పువ్వులు, తెరవరుల మీదన్ = బాటసారులపై, కినుక = కోపము, వేగిరమెరాగ = తొందరగా రాగా, తొరగు = స్రవించుచున్న, మరుతేజి = చిలుకల యొక్క, సెలవుల నురువు లనగ = చెలిమెల యొక్క నురుగులు అనగా, అమరెన్ = ఒప్పెను.

తా :- ఓ మహారాజా ! సన్ననిగాలికి తొడిమలు సడలి, పొగడ చెట్లక్రింద రాలిన పూవులు

మన్మధునికి బాటసారులపై కోపము రాగా అతని గుఱ్ఱము యొక్క చెలిమెల నుండి జారిన నురగ లన్నట్లుగా నున్నవి.

''అలం - ఉత్ప్రేక్ష''

58.కII కంగొదవఁగఁ బూచిన యా
ముంగిలి సంపెంగ లవిగొ, మొగి నాయని దాఁ
బొంగుచుఁ బఱపించిన మరు
బంగారు గుడారు లనఁగఁ బరఁగెడుఁగంటే ! - 58

టీక :- కంగొదవగ౯ = బిత్తరము పుట్టునట్లుగా, పూచిన = పుష్పించిన, ఆ = ఆయొక్క, ముంగిలి = ముందటగల, సంపెంగలు = చంపకములు, అవిగో, కంటే = చూచితివా! అవిమొగి౯ = మనముందర, ఆమని = వసంతుడు, తా౯ = తాను, పొంగుచు = విజృంభించి, పపించిన = పరుచునట్లు చేసిన, మరు = మన్మధుని యొక్క, బంగారు గుడారులనల నగ౯ = స్వర్ణపట కుటీరములనగా, బరగెడు౯ = ఒప్పు చున్నవి.

తా :- ఓ మహారాజా ! మనముందఱ బిత్తరముకలుగునట్లు పూచిన ఆయొక్క సంపెంగలను చూచితివా ! అవి వసంతుడు సంతోషమున పొంగి పోవుచు మన ముందర పరపించిన బంగారు గుడారముల వలె నొప్పు చున్నవి.

''అలం - ఉపమ''

59.ఉII అల్లనె కోయిల ల్చిగురుటా కునునంజూడు నంజి నల్లడం
ద్రుళ్లెడు నాముతోఁ దెరువరుల్ దమయుల్కుఁడు విన్నగుండియల్
జల్లని త్రెళ్లఁ గన్నులను జాజుదగ న్వలరాచ బూతపుం
బిల్లలు వోలె నచ్చకఱి మేనుల చాయలు బీతుకొల్పఁగన్ - 59

టీక :- అల్లవేకోయిల౯ = అదుగో కోకిలలు, చిగురుటాకను నంజాడు = చిగురు టాకులనే మాంసము, నంజి = బాగుగా మెక్కి, నాముతో = మదముతో, కన్నులను జాజా తగ౯ = కన్నులు ఎరుపెక్కగా, వలరాజు = మన్మధునియొక్క బూతుపుం బిల్లల వోలె = బూత పిల్లల వలె, అచ్చకరి మేనుల చాయలు = అచ్చమైన నల్లని శరీరములయొక్క, చాయలు= కాంతులు, బీతుకొల్పగ౯ = భయపెట్టగా,

తెరవరుల్ = బాటసారులు, తమయల్కుఁడు విన్న = తమ యొక్క కూతలు వినగా, గుండియల్ = గుండెలు, జిల్లని త్రేళ్ల = జల్లుమని మరణించగా, నల్గడఁ = నాలుగు వైపులలో, త్రుల్లెడు = త్రుళ్లిపడుచున్నవి.

తా :- మహారాజా ! అదుగో కోకిలలు, చిగురుటాకులనే మాంసము మెక్కి మదించి, కన్నులెఱ్ఱబడగా మన్మథుని బూతపిల్లలవలె నల్లని శరీరాలతో భయముగొలుపుతు, తమ కూతలు వినగానే బాటసారుల గుండెలు జల్లని మరణింపగా నాలుగు వైపుల త్రుళ్లిపడుచున్నవి. చూడుము.

''అలం - రూపకము''

60.తె॥ పడఁతి యీలాగు విన్నవింపంగ వినుచు
నరుగుదేరంగు నంతట నలరుఁదేనె
కాల్వలోఁ గొన్న లేమావి గముల నడుమ
మెఱయు పొదరింటిలోన శర్మిష్ఠ దనరి - 60

టీక :- పడతి యీలాగు = ఆవనపాలిక ఈవిధముగా, విన్నవింపంగ వినుచు = తెలుపగా వినుచు, అరుగు దేరంగ = వచ్చుచుండగా, అంతటఁ = అపుడు, అలరు దేనెకాల్వ = మకరంద ప్రవాహము, లోగొన్న = చుట్టుకొనిన = లేమావిగముల నడుమ = లేతమామిడి గుబురులలో, మెరయు పొదరింటిలోన = ప్రకాశించు నొకపొదరింటి యందు, శర్మిష్ఠ తనరి = శర్మిష్ఠ ఒప్పి -

తా :- ఆమె ఈవిధముగా విన్నవించు చుండగా, మహారాజు వినుచు వచ్చుచు న్నుండగా నపుడు ఒకతేనె కాలువ చుట్టుకొన్న మావిగుబురుల నడుమ గల యొక పొదరింటిలో శర్మిష్ఠ మొప్పుచుండి -

శర్మిష్ఠ యయాతిని గాంచుట

61.తే॥ అడుగుఁ దామర లొకకొమ్మ తొడల మీఁదఁ
జాఁచి పూఁబాన్పుపై నొక్కసకియ మేన
నత్తమిలి మోము తావికి నలము తేంట్లఁ
జూచి నెత్తమ్మి క్రొవ్విరిఁ జోఁపు కొనుచు - 61

టీక :- అడుగు దామరలు = పాదపద్మములు, ఒకకొమ్మ తొడల మీద చూచి, పూబాన్పుపై = పూలపానుపుపై, ఒక్క సకియ మేన నత్తమిలి = యొక యువతిపై యొరిగి, మోము తావికి = ముఖగంధమునకు, అలము తేంట్లజూచి = వ్యాపించెడు తుమ్మెదలను చూచి, నెత్తమ్మి క్రొవ్విరిన్ = ఒక కొత్తనైన యెఱ్ఱ తామరతో జోపుకొనుచు -

తా :- తన యొక్క పాదములు ఒక యువతిపై చాచి వేరొక యువతిపై యొరిగి, ముఖపరిమళమునకు ముసురు తుమ్మెదలను ఒక ఎఱ్ఱ తామరతో జోపుకొనుచు-

62.కII గరగరిక నుండి రెండవ
మరుఁడుం బలె వచ్చుఱేని మైపొల్పు మదిన్
బొరిపొరిc గలఁపఁగc గూరిమి
కర మెలమిన్ మొలక లెత్తc గనుఁగొని తనలోన్ - 62

టీక :- గరగరికనుండి = నిర్మలముగానుండి, రెండవ మరుడుం బలె వచ్చు = రెండువ మన్మధుని వలె వచ్చు, ఱేని మై పొల్పున్ = మహారాజు యొక్క శరీర సౌందర్యము, మదిన్ = మనస్సును, పోరిపోరి గలపగన్ = మిక్కిలిగా కలత బెట్టగా, కూరిమి = అతనిపై ప్రేమ, కరమెలమిన్ = మిక్కిలి యనురాగముతో, మొలక లెత్త = తల చూపగా, కనుగొని = అతనిని చూచి -

తా :- శర్మిష్ఠ - నిర్మలమైన మనస్సుతో నుండి రెండవ మన్మధునివలె వచ్చు ఆమహారాజు యొక్క శరీర సౌందర్యము, తన యొక్క మనస్సును మిక్కిలి కలవర పరచగా హృదయమున నతనిపై ప్రేమ మొలకెత్తగా నతనిని చూచి -

''అలం - ఉపమ''

63.శాII ఈరావేలుపుఱేఁడు తామగఁడుగా నేనోముల న్నోఁచెనో
కా, రాకాసుల యొజ్జకూఁతు రనుచున్ గార్కొన్న కోర్కుల్ మదిన్
జేరల్ పెట్టcగ లోన, బూవిలు తుఁడుం బ్రేరేపగా, నంతటం
జేరంగాc జనుదెంచు రాజుc గని లేచెం బాన్పుపై డిగ్గుచున్ - 63

టీక :- ఈఱావేలుపు ఱేడు = ఈరాజేంద్రుడు, మగడుగాన్ = మగడగుటకు, ఏనోములన్నోచెనోకా = ఏనోములు నోచెనో గదా ! రాకాసుల యొజ్జ కూతురు = శుక్రాచార్యుని యొక్క బిడ్డయైన దేవయాని, తాన్ = తాను, అనుచున్,

కార్కొన్న కోర్కుల్ = దట్టముగా వ్యాపించిన కోరికలు, మదిఁ = మనస్సును, చేరల్ వెట్టగ = చేయివెట్టి కలచగా, లోనబూవిలు తుడుఁ(బేరేపగా = లోపల మన్మధుడు (ప్రేరేపించగా, అంతటఁ = అపుడు, చేరంగా జనుదెంచు = సమీపమునకు వచ్చు, రాజాగని = రాజాను చూచి, పాన్పుపై డిగ్గుచుఁ = పురుపు దిగుచు, లేచెఁ = లేచెను.

తా :- ఈ రాజేంద్రుడు మగడగుటకు దేవయాని ఏ నోములు నోచెనో యని మనస్సున కోరికలు నించుకొనగా, హృదయమున మన్మధుడు (ప్రేరేపించగా తన సమీపమునకు వచ్చు రాజాను చూచి పరుపుపై నుండి దిగుచు లేచెను.

''అలం - లోకోక్తి''

64.ఆ:- ఇట్లులేచి ఱేని కెదురేఁగి తనచేతి
కమ్మదమ్మిఁ గూర్మిఁ గానుకిచ్చి
యెడలఁ దనరు కెంపుఁ దొడవుల కెంజాయ
నిక్కఁ బుడమిఁ జాఁగి మ్రొక్కెనపుడు - 64

టీక :- ఇట్లులేచి = ఈవిధముగాలేచి, ఱేనికెదురేగి = మహారాజానకు ఎదురుగా వెళ్ళి, తనచేతి కమ్మదమ్మి = తనచేతనున్న తామరపూవు, కూర్మికానుకిచ్చి = (ప్రేమతో కానుకగానిచ్చి, ఆనెపమున తన (ప్రేమనే కానుకగా నిచ్చి యని గూడ - ఒడల దనరు కెంపుతొడవులఁ = శరీరముపైగల కెంపుల సొమ్ములతో, కెంజాయనిక్కఁ =ఎరుపుకాంతి వ్యాపించు చుండగా, చాగిమ్రొక్కెనపుడు= అపుడు సాష్టాంగ పడెను.

తా :- ఈ విధముగాలేచి యామె మహారాజా కెదురువెళ్లి, తన చేతనున్న అందమైన తామరను కానుకగా నిచ్చి తాను ధరించిన కెంపుల సొమ్ముల కాంతులు వ్యాపించు చుండగా సాష్టాంగ నమస్కారము జేసెను.

''అలం - స్వభావోక్తి''

65.వ:- ఇట్లుమ్రొక్కి ఱేని నమ్ముద్దియ గద్దెపైనుంచి తద్దయు
నుద్దవిడి నతని మీఁది తమకంబు గమకంబై పర్వనతని
మదియుఁ దనపయిం దగులుటం దెలిసి కలికి చిలుకలు
గులుకు కిలకిల కులుకులు దొలఁకు నెలపొలుపుల నెలవుకొలుపు
పలుపలుకుల బెళుకు మెలఁకువ నయ్యయాతి కిట్లనియె - 65

టీక : ఇట్లుమ్రొక్కి = ఈవిధముగా నమస్కరించి, జేనిఁ = మహారాజును, అముద్దియ = ఆ యువతి, గద్దెపైనుంచి = పీఠముపై కూర్చుండబెట్టి తద్దయు = మిక్కిలి ఉద్దవిడిఁ = అత్యంతమైన, అతని మీది తమ కంబు = అతనిపైగల మోహము, గమకంబైపర్వ = ప్రకటమై వ్యాపింప గా, అతని మదియు = అతని మనస్సు గూడ, తన పయిందగులుటం దెలిసి = తనపై నెలకొని యుండుట తెలిసి, కలికి = ఆశర్మిష్ఠ చిలుకలు కులుకు కిలకిల = చిలుకలు కులుకుచు చేసెడు కిలకిలా రావములను ఉలుకులు, తొలుకు = బెదురు తొణికిసలాడు = నెలపాలుపుల, వెన్నెల కాంతులను, నెలవు కొలుపు = కనిపింపజేయు, పలుపలుకుల = అనేకమైన పలుకుల కాంతిలగా, మెలకువ = జాగ్రత్తగా నయయాతి తో యిట్లనెను -

తా :- ఈవిధముగా నమస్కరించి, మహారాజు నామె గద్దెపై కూర్చుండ బెట్టి తనప్రేమ మిక్కిలి యెక్కువయై యతనిపై నెలకొనగా నతని మనస్సు గూడ తనపై తగిలి యుండుట తెలిసికొని ఆశర్మిష్ఠ చిలుకలు చేయు కిలకిలలకు, బెదురుకొను భయము కనిపించుచుండగా దంతకాంతుల వెన్నెల నిగుడగా నామహారాజుతో నిట్లనెను.

''అలం - అనుప్రాస - స్వభావోక్తి''

శర్మిష్ఠ యయాతితో సంభాషించుట

66.క॥ విను, నన్నేలిన నెలఁతకుఁ
బెనిమిటి వైనపుడె నాకుఁ బెనిమిటివగు, దె
ట్లన, నాలుఁగొడుకు వరవుడు
ననునవి పాయనివి, చదువులందును వినవే ! - 66

టీక :- విను = ఓ మహారాజా ! వినుడు, నన్నేలిన నెలతకు = మా యజమాను రాలికి, పెనిమిటివైనపుడె = భర్తవైనపుడె, నాకు పెనిమిటి వగుదు = భర్తవగుదువు, ఎట్లన = ఏవిధముగా ననగా, ఆలు, కొడుకు, వరవుడు ననునవి, భార్య, కొడుకు దాసి అనువారు, పాయనివి = విడువ రానివారు, చదువు లందును వినవే = శాస్త్రములో వినవా !

తా :- ఓ మహారాజా ! మీరు మా యజమానురాలికి భర్తవైననాడే నాకును భర్తవగుదువు, ఎట్లనగా భార్య, కుమారుడు, మరియు దాసి విడువ రాని వారని శాస్త్రములు చెప్పునుగదా !

67.క॥ అదిగాన దేవయానిఁ
మదిఁగైకొనినట్ల నన్ను మన్నవ మీఱం
గొదలేక యుండ నేలుము
వదలక వలఁతేని బారి వడిఁ బడకుండన్ - 67

టీక :- అదికాన = అందువలన, దేవయానిఁ = దేవయానను, మదిగైకొనినట్ల = మనస్సున స్వీకరించినట్లు = నన్ను మన్నన మీఱఁ = నన్నుగూడ గౌరవముతో, వదలక = విడువకుండ, వల తేని బారి = మన్మధుని బారికి, వడిబడకుండఁ = చిక్కకుండ, కొదలేక యుండ = యేమియు తక్కువగాకుండ, నేలుము = పాలింపుము -

తా :- ఓ మహారాజా ! అందువలన దేవయానిని అంగీకరించి నట్లుగా నన్ను గూడ నంగీకరించి మన్మథుని బారిని బడకుండ కాపాడి తక్కువ లేకుండ యేలుకొనుడు.

68.తే॥ అనుడుఁ దొయ్యలి కిట్లను నయ్యయాతి
కొమ్మ నిను నిచ్చునాఁడు శుక్రుండు నాకు
నప్పగించుచు నొక్కటి యానతిచ్చెఁ
బడక వెలిగాఁగ దీనిని నడుపు మనుచు - 68

టీక :- అనుడు = అనగా, తొయ్యలి కిట్లను నయ్యయాతి = ఆమెతో యయాతి యిట్లనెను. కొమ్మ = ఓ యువతీ, నినునిచ్చునాడు = నిన్ను అప్పగించినాడు, శుక్రుండు నాకు నప్పగించుచు = నాకప్పజెప్పుచు, దీనిని, పడక వెలిగాగ = శయ్యాసంబంధము లేకుండ, నడుపు మనుచు = పోషింపుమని, ఒక్కటి యానతిచ్చి = ఒక విషయము చెప్పెను.

తా :- అనగా నాయయాతి మహారాజామెతో ఓ తొయ్యల్ శుక్రుడు నిన్ను నాకప్పగించు నాడీమెతో పడకను పరిహరించి నడుపుమని యొక నియమమును చెప్పెను.

69.వ:- అని పలికి యతని యానతికి వెఱచి మిగుల
నమ్మగువపయిం దగిలిన తన మీద మగిడించి నగరికిం
జనియె, నంత శర్మిష్ఠ మరుబారికి లోనై, - 69

టీక :- అని పలికి = అని చెప్పి, అతని యానతికి వెఱచి = అతని ఆజ్ఞకు భయపడి, మిగులఁ = మిక్కిలిగా, అమ్మగువ పయిఁ దగిలిన = ఆమెపై నెలకొన్న, తనమదిఁ

= తన మనస్సును, మగిడించి = మరల్చుకొని, నగరికిం జనియె = కోటకు వెళ్లెను. అంతఁ = అపుడు, శర్మిష్ఠ మరు బారికిలోనై = మన్మధుని బాదకు వశమై.

తా :- అని చెప్పి తానతని యాజ్ఞకు భయుపడి, ఆమె తగిలిన తన మనస్సును మరలించుకొని తమ నగరికి వెళ్లెను, అపుడిక్కడ శర్మిష్ఠ మన్మధుని బాధకు లోనై

శర్మిష్ఠ విరహ వేదన

70.ఉ॥ చెక్కిటఁ జెయ్యి చేర్చి, సెగచిందెడి యూర్పులవేఁడి మోవితాఁ
బొక్కఁగఁ గంటినీటి తెలిబొట్లు చనుంగవ మీఁద రాల, ఱేఁ
డిక్కడి కేలవచ్చె నను నేటికి నెవ్వగపాలు చేసె, నే
నెక్కడ నివ్విరాలి దరియింతుఁ దలంచఁగ మించుకాఁకలన్ - 70

టీక :- చెక్కిట చెయ్యిజేర్చి = చెంపకు చేయి పెట్టుకొని, సెగచిందెడి యూర్పులఁ = వేడి నిశ్వాసల యొుక్క, వేడిఁ = తాపముచే, మోవి = పెదవి, పొక్కగఁ = వాడిపోగా, కంటినీటి తెలిబొట్లు = కన్నీటి యొుక్క తెల్లని చుక్కలు, చనుంగవ మీదరాల = చన్నులపై రాలుచుండగా, రేడిక్కడి కేలవచ్చె = మహారాజిక్కడి కెందుకు వచ్చెను, నను + ఏటికి = నన్నెందులకు, నెవ్వగ పాలుజేసె = ఈబాధకు గురిచేసెను, నేను, తలంచగఁ = తలచుకొనుటకు, మించుకాకలఁ = మించినటువంటి ఈ తాపమును, ఇవ్విరాలిని = ఈ విరహమును, ఎక్కడ తరియింతు = ఏ విధముగా తరింతును.

తా :- శర్మిష్ఠ చెంపకు చేయానించి, సెగలు గ్రక్కెడు యూర్పులతో పెదవి ఎండిపోగా, కన్నీటి బొట్లు చన్నులపై రాలుచుండగా, ఆ మహా రాజిక్కడికెందుకు వచ్చెను. నన్నేటికి ఈ బాధల పాలు జేసెను. నేను ఆలోచించుటకు గూడ సహించరాని యీ తాపమును, యీ విరహమును ఏవిధముగా తరించగలను

''అలం - స్వభావోక్తి''

71.సీ॥ తావులు నెఱపి యేతావులరు నిండంగఁ
బొదలి యిమ్మాఁకులు పూయనేల ?
పూచెఁ బో, యీతోఁట గాచు తామరకంటి
పోయి విన్నపముఁ దాఁ జేయనేల ?

చేసెఁ బో, యిది గుఱిచేసి యారావేల్పు
తెఱవలు గొల్వ నేతేర నేల ?
యే తెంచెఁ బో, వేడ్కనింతయుఁ గనిపోక
చెలువుఁ డియ్యెడకు వేం చేయనేల ?
తే॥ కోరి వెంచేసెఁ బో, లోనిగుట్టు విడిచి
మించు కూరిమి నేనె పైకొంచు వేఁడఁ
గొసరి డాసిన నతఁ డియ్యకొనక చనఁగ
వలపు బలియించుకొని యిట్లు కలఁగనేల - 71

టీక :- తావులు నెఱసి = వాసనలు చిమ్ముచు, ఏతావులు నిండంగ = అన్ని దిక్కులునిండునట్లుగా, పొదలి = ఒప్పి, ఇమ్మాకులు = ఈ చెట్లు, పూయనేల = ఎందుకు పూయవలె/పూచెబో = పూచెను కాక, ఈ తోటగాచు తామరకంటి = ఈతోటను రక్షించు వనపాలిక, పోయి = మహారాజు దగ్గరకువెళ్లి, విన్నపము తాసేయ నేల = ఎందుకు విన్నవించువలె/చేసెబో = చేసెనుగాక, అది గురిచేసి = ఆమాటపై లక్ష్యముంచి, ఆ ఱావేల్పు = ఆ మహారాజు, తెఱవలు గొల్వ = యువతులు సేవించుచుండగా, ఏతేరనేల = ఎందుకు రావలె, ఏతెంచెబో = వచ్చెనుగాక, వేడ్కనింతయు గనిపోక = సంతోషమున దీనిని చూచిపోక, చెలువు డియ్యెడకు = ఆయనగారిక్కడికి, వేం చేయనేల = ఏల రావలె, కొరివేం చేసెబో = చూచెడు కోరికతో వచ్చెగాక, లోనుగుట్టు విడిచి = నేను నా రహస్యము విడిచి, మించుకూరిమిఁ = అతిశయించిన ప్రేమతో, నెనెపైకొంచు = నేనే కలిగించుకొని, వేడఁ = ప్రార్థించగా కొసరి డాసినఁ = కావలెనని సమీపించిన, ఱేడియ్యకొనక = మహారాజంకీకరింపక, చనగఁ = వెళ్లిపోగా, వలపు బలిమించుకొని = వలపును అతనిపై పెంచుకొని, ఇట్లుకలుగనేల = ఇట్లెందుకు బాధపడవలె-

తా :- తోటలోని చెట్లన్ని దిక్కుదిక్కులకు వాసనలు నింపుతు ఎందుకు పూయవలె, పూచెనుగాక ! వనపాలిక వెళ్లి ఆవిషయము రాజుగారి కెందుకు చెప్పవలె, చెప్పెనుగాక, అతడామె మాటను మన్నించి ఈతోట కెందుకు రావలె, వచ్చెనుగాక, ఊరక చూచి పోకనేనున్న యెడకెందుకు రావలె, వచ్చెనుగాక, నేను నాగుట్టును విడిచి మనస్సులో పొంగిన ప్రేమతో అతని నెందుకు ప్రార్థించి సమీపించితిని. అందులకా రాజిష్ట పడక తిరిగి వెళ్లగా ఇపుడెందు కిటుల బాధ పడవలె,

''అలం - ముక్తపదగ్రస్తము''

72.కII అనుచు న్మిక్కిలి మదిలో
నవలెత్తెడు కోర్కెచేత నలఁగుచుఁ జెలులె
ల్లను జేరి వేడుకొనినం
గినియుచు విడెమొల్లకారగింపక వగతోన్ - 72

టీక :- అనుచున్ = మిక్కిలి, మదిలో = మనస్సులో, నవలెత్తెడు కోర్కెచేత = చిగురించి కోరికలతో నలుగుచు = నలిగిపోవుచు, చెలులెల్లను చేరి, వేడికొనినన్ = ప్రార్థించగా, కినియుచు = వారిని కోపించుచు, విడె మొల్లక = తాంబూలము సేవింపక, ఆరగింపన్ = ఆహారము ముట్టక, వగతోన్ = దుఃఖముతో

తా :- అనుకొనుచు మనస్సున మిక్కిలిగా చిగురించెడు కోరికల చేత నలిగి పోవుచు, చెలికత్తెలందరు చేరి ప్రార్థింపగా వారిని కోపించుచు, నాహారము ముట్టక తాంబూలము సేవించక చింతతో -

73. లయగ్రాహి.
అంచ యెల బోద నడిపించ, కలచిల్కఁ జది
వించక, నెమల్కొదమ నెంచఁ దగఁగా నా
డించ, కొగిఁ బారువపు టించు గులుకు బ్బినఁద
లంచక, జవాది మెయి నించక, ననల్ గో
యించక, కురుల్ విరుల నించి జడనీటు సవ
రించక యు, వీణె మొరయించక, కొలంకుల్
గాంచక, తలంగి కడు నించు విలుకాని సెగ
ముంచుకొని వేఁడిమి గలంచు మది నుండెన్ - 74

టీక :- అంచ యెలబోద = లేతహంసపిల్లలకు, నడిపించక = నడక నేర్పక, అల, చిల్క జదివించకన్ = చిలుకకు చదువు చెప్పక, నెమిల్కొదమున్ = నెమలి పిల్లను, ఎంచదగగా నాడించక = మెచ్చునట్లు నాట్యము నేర్పక, ఒగిన్ = క్రమముగా, బారువపుటించు = పావురముల యొక్క గుంపు, కులుకుబ్బినన్ = కులుకులు చూపు చున్నను, తలంచక = వానిని చూడనొల్లక, జవాది మెయినించక = జవాదిని అలదుకొనక, అనల్ గోయించక = చెలులతో పూలు కోయించక, కురుల్ విరుల నించి = వెంట్రుకలలో పూలు తురుముకొని, జడ నీడు సవరించకయు = నీటుగా షిడవేసి కొనకనే, వీణ మొరయించక, వీణవాయించక, కొలంకుల్ గాంచక =

సరస్సులు చూడక, తలంగి = పైవాని కన్నిటికి దూరముగా నుండి, ఇంచు విలుకాని సెగ = మదన తాపము, ముంచుకొని, నిండుకొని, వేడిమి ఆ యొక్క తాపము, కలచు మది నుండెన్ = కలచివేసెడు మనసుతో నుండెను.

తా :- ఆమె మించుకొని విరహ తాపమునకు లోనై హంసపిల్లకు, నడకలు, చిలుకలకు, పలుకులు నెమిలి పిల్లలకు నాట్యములు నేర్పక పావురముల కులుకులు చూడక, జవ్వాది నలదు కొనక. జడనీటుగా వేసికొని పూవులు తురుముకొనక, సరస్సులు చూడక, అన్నిటికి దూరముగా నుండి మదన తాపమున వేగుచుండెను.

''అలం -'వృత్త్యనుప్రాస''

74.మ॥ జిగిమై సొంపును దమ్మిమై మఱుగు రాచెంగల్వ చేకత్తియుఁ
సిగపూ మొగ్గల తాయెతుల్ చిగురుకాసెం జెక్కినం జాలఁబొ
ల్పగునుఁ గేదఁగిరేకు వంకియునుఁ జాయల్ మీఱఁగాబు వ్వుఁదీఁ
గెగుదెం దా వలరాచ యొంటరి కడుం గేడింపుచుంజిమ్మనన్ - 74

టీక :- వలరాచ యొంటరి = మన్మథుడను యొక్కటి, జిగిమై సొంపును = నిగనిగలాడు శరీరము యొక్క అందము, తమ్మియై మరుగు = తామర యను కవచము, రాచెంగల్వ చేకత్తియుఁ = ఎఱ్ఱకలువయను పిడిబాకు, సిగపూమొగ్గల తాయతుల్ = సిగపూల యొక్క మొగ్గలనే తాయెతలు, చిగురుకాసెఁ = చిగురాకులకాసె, చెక్కినఁ, చాలపొల్పగునఁ గేదగి రేకు వంకియుఁ = మిక్కిలి యందమై నునుపైన మొగిలి రేకను వంకకత్త, చాయల్ మీరగా = కాంతులీను చుండగా, పువ్వు దీగెలగుదెఁ = పూల తీగలను గుదియను, కడుఁ = మిక్కిలి, కేడింపుచుఁ = కవ్వించుచు, చిమ్మినఁ = చిమ్మగా -

తా :- మన్మధుడను యోధుడు, కాంతియను తీవితో తామర కవచము ఎఱ్ఱకలువ పిడిబాకు, సిగమొనుగ్గల తాయెతులు, చిగురుకాసె ధరించి పూల తీగయను గుదియను ఆమెను మిగుల కవ్వించుచు విసరగా -

''అలం - రూపకము''

75.ఉ॥ కన్నులనీరు గ్రక్కుకొని కాఁకలమ్మెఁ దెరలంగ, గుత్తపుం
జన్నులమీఁది ముత్తియఁపు జాయలు వేఁజొక జాడ గాఁగనె
క్కొన్న విరాలిచేఁ దలఁకు కూరిమి నెచ్చెలిఁ జూచి విన్ననై,
కన్నియ లందఱుం దమకుఁ గన్నుల నీరొలుకం గలంగుచున్ - 75

టీక :- అపుడు, కన్నియ లందరుఁ - కన్నుల నీరు గ్రుక్కుకొని = కన్నులలో నీరు నింపుకొని, కాకలఁ = తాపమున, మైదెరలంగ = శరీరము వేగిపోవు చుండగా, గుత్తపుఁ = బిగువైన, చన్నుల మీది ముత్తెపుఁ = ఎదపైగల ముత్యముల యొక్క, ఛాయలు = కాంతులు, వేరొక జాడ కాగఁ = వేరేవిధముగా కాగా, నెక్కొన్న విరామిలిచే = అతిశయించిన విరహముచే, తలకు = దిగులు పడు, కూరిమి నెచ్చెలి జూచి = ప్రియమైన సఖియను జూచి, విన్ననై = చిన్నబోయి, కన్నియలందరుఁ = చెలికత్తె లందరు, కన్నులనీ రొలుకఁ = కన్నీరు జారుచుండగా, కలంగుచుఁ = క్షోభపడుచు-

తా :- అపుడు ఆమె చెలులందరు కన్నులలో నీరు గ్రుక్కుకొని మదన తాపమున వేగిపోగా బిగువైన చన్నులపై గల ముత్యాల దండలు కాంతి మారిపోగా దిగులు పడుచున్న తమ యజమానురాలిని చూచి కన్నుల నుండినీరు జారుచుండగా కలగిపోవుచు-

76.క॥ 'కంటిరె చెలువలు, వాలుం
గంటిని బూవింటి దంట కాఁకలు తనమై
నంటిన నొర్వక పొరలెడి,
వింటిరె, చలిపనులు సేయువెర విఁక వలయున్'! - 76

టీక :- వాలుగంటిని కంటిరెచెలువలు = చెలులారా చూచితిరా ! పూవింటి దంట కాకలు = మన్మథుని యొక్క సెగలు, తనమై నంటిన = తన శరీరమునకు సోకగా, ఓర్వక పొరలెడి = సహించలేక పొరలు చున్నది. చలిపనులు సేయు = శీతలోపచారములు సేయు, వెరవు = విధానము ఇకవలయుఁ = ఇపుడు చేయవలెను, వింటిరె = విన్నారా !

తా :- ఓ చెలులారా ! శర్మిష్ఠను చూచినారా ! మదన తాపము శరీరమును సోకగా దానిని సహించలేక పొరలు చున్నది. కావున మనమిపుడు శైత్యోప చారములు చేయవలయును విన్నారా !

-: శిశిరోపచారములు :-

77. రగడ :

అని పల్కి చెలులంత నలరుఁ దేనియవాకఁ
గనుప క్రోవులలోని కప్రవంటుల మోక
నడు మఁ జెన్నొంది పొన్నలలోన లేమావి

కడనొప్పు గొజ్జంగి కమ్మ క్రొవ్విరితావి.
తిలకించు నెలరాల తిన్నె మీఁదటఁ జాలఁ
బొలుపొందు మంచి కప్పురపుఁ టల్కులమేడఁ
గావించి, యందుఁ జెంగల్వ రేకులు నించి
యావెలందుకఁ దెచ్చి యందుపైఁ దగనుంచి,
మంచిగందము మేన మాటి మాటికిఁ బూసి
మించు ముత్తెపు సరుల్ మెడక్రిందుగా వేసి
తమ్మిమొగ్గలు దెచ్చి తలగడల్గాఁ బెట్టి
కరమొప్పు చీని చెంగావి వల్వముగప్పి
విరుల రేకులఁ జాల వెలఁది మీఁదను విప్పి
తలిరాకుఁ దగ మెట్ట దమ్ములం గీలించి
పలుమాఱు మూఁగికొని పైదలిని లాలించి
చలిపనుల్ గావింప, జాలిమానుటలేక
బలియంగ లోఁగి యప్పుడఁతు లెల్లను మూఁక
లగుచుఁ దాళఁగఁ జాల దక్కటా ఈకొమ్మ
పగ గ్రాఁగుచున్న, దెవ్వరు మాన్పఁగల రమ్మ
యనుచు నెమ్మదిఁ దాల్మి యలరించుకొని చేరి
నన విల్తు దూఱు నందఱు మనంబునఁ గోరి – 77

టీక :- అని పల్కి = అని పలికి, చెలులంత, అలరు తేనియవాక = పూదేనె ప్రవాహము, యొక్క, కనుపక్రోవులలోని = రెట్లగంటలలోని, కప్ర పంటుల = కర్పూరపు టంటుల, మోక, సమూహము, నడుమ, చెన్నొంది = ప్రకాశించుచు, పొన్నలలోన, లేమావికడ = లేత మామిడి దగ్గర, ఒప్పు = ఒప్పుచున్న, గొజ్జగికమ్మ = గులాబి రెమ్మల, క్రొవ్విరి తావి = కొత్త పూవుల వాసన, తిలకించు = ప్రకాశించు, నెలఱాల తిన్నెల మీద = చలువరాతి తిన్నెలపై, చాలపొలుపొందు = మిక్కిలిగా ప్రకాశించు, మంచికప్పురపు = మంచి కర్పూరము యొక్క, మేడ గావించి = మేడనుకట్టి, అందు = దానియందు, చెంగల్వ రేకునించి = ఎఱ్ఱతామర రేకులు నింపి, ఆవెలందుక దెచ్చి = శర్మిష్ఠను గొనివచ్చి, అందుపై = ఆకలువ రేకులపై, తగ్ = చక్కగా, ఉంచి, మంచి గందము, మేన = శరీరమునందు, మాటిమాటికి బూసి = మరల మరల పూసి, మంచి ముత్తెపు సరుల్ = మంచి ముత్తెముల దండలు, మెడక్రిందుగావేసి = మెడలో వేసి, తమ్మిమొగ్గలు దెచ్చి = తామర మొగ్గలు తీసికొని

వచ్చి, తలగడల్గా బెట్టి = తల దిండ్లుగా నమర్చి, లేదూండ్లు = లేత తామర కాడలు, క్రమ్మకోఁ = శరీరమంతటా క్రమ్మకొనునట్లు, కడియముల్ గాఁజుట్టి = వలయాలుగా చుట్టి, కరమొప్పు = మిక్కిలి యందమైన, చీనిచెంగావి = మేలిపట్టుయొక్క, వల్వెముగప్పి = వస్త్రము కప్పి, విరుల రేకుల చాల = మిక్కిలిగా పూరేకులను, వెలది మీదను గప్పి, తలిరాకు = చిగురాకు, తగఁ = ఒప్పునట్లుగా, మెట్టదమ్మలఁ గీలించి = పాదములందు చేర్చి, పలువూరు = అనేక పర్యాయములు, మూగికొని = ముసిరి, పైదలిని = ఆమెను, లాలించి = బుజ్జగించి, చలిపనుల్ గావింప = శైత్యోపచారములు చేయగా, జాలి మానుటలేక = ఆమె దీనత్వము తొలగక, బలియంగఁ = ఇంకను ఎక్కువ కాగా, ఒగిఁ = ఒక్కుమ్మడిగా, అప్పడతులెల్లను = ఆ యువతులందురు, అక్కటా, ఈకొమ్మ = ఈమె, వగఁగ్రాగుచున్నది = బాధపడుచున్నది, ఎవ్వరు మాన్పగలరమ్మ, అనుచు, నెమ్మదిఁ = తమ యొక్క మనస్సులలో, తాల్మి = ఓర్పు, అలరించుకొని = ఏర్పరచు కొని, చేరి = ఆమెను సమీపించి, అనవిల్తు, మన్మథుని, దూఱఁ = దూషించుటకు, అందరు మనం బునగోరి = మనస్సులందు నందరు తలచుకొని

తా :- అని యనుచు ఆ చెలులందరపుడు పూదేనె ప్రవాహము ప్రక్కనగల తెల్లుగంటలలోని కర్పూరపు అరటి యొక్క లేత మొక్కల సమీపమున గల పొన్నచెట్లలో నొప్పుచున్న లేతమామిడి దగ్గర గులాబి పొదలు క్రొత్త పూవుల వాసనలు చిమ్ముచుండు చలువరాతి తిన్నెలపై యొక కర్పూరపు మేడ నేర్పరచి దానిలోనికి శర్మిష్ఠను గొనివచ్చి అందు పరచిన కలువ రేకులపై యామెనుంచి, శరీరమునకు మాటిమాటికి మంచి గంధము పూయుచు మంచి ముత్తెముల దండలు మెడలో వేసి, తామర మొగ్గలను దెచ్చి తల దిండుగా బెట్టి, లేత తామర కాండలు తెచ్చి చేతులకు కాళ్లకు కడియములుగా జుట్టి, శరీరముపై చెంగావి

పట్టువస్త్రము గప్పి, చిగురుటాకులు తెచ్చి పాదములనందులోనుంచి, ఈవిధముగా వారు చుట్టు ముసిరి అనేక రీతులుగా శైత్యోపచారము చేసినను ఆమె తాపము తగ్గక పెరుగుట చూచి, అపు దందరొక్కు మ్మడిగా, ఆహా ! ఈమె శరీరము మిక్కిలి కాగుచున్నది. దీని నెవరు మాన్పగలరు, అని తమ మనస్సులో నోపిక పట్టుకొని యామెను సమీపించి వారందరు మన్మథుని దూషించుటకు తలచుకొని -

ఉపాలంభనములు

78.చ॥ వలపులరాయ, యుచ్చి గురువా తెరకొమ్మనలంచు టెల్లన
ప్పొలసుల బోనపుం దొరకుఁ బుట్టిన గాదిలి కూఁతు రంచునో,
సొలయక యాఁడుదానిఁ దెగఁ జూచిన, రోయరె నిన్ను నయ్యయో,
దెలియవు నీకుఁ దండ్రిపగ తీఱునె దీనిఁ గలంచి నంతటన్ - 78

టీక :- వలరాయ = ఓ మన్మథా !, యుచ్చ గురువా తెరకొమ్మన్ = చిగురాకు వంటి పెదవి గల ఈమెను, ఎలంచుటెల్ల = బాధించుటంతయు జూడగా, అప్పొలసుల బోనపుందొరకు పిశితాశనుడైన వృషపర్వునకు, పుట్టిన = జనించినట్టి, గాదిలి కూతురంచునో = ప్రియమైన బిడ్డ యనియో, సొలయకన్ = స్రుక్కన్ అనగా మానక, ఆడుదాని తెగ జూచిన = స్త్రీని వధింప జూచిన యెడల, అయ్యయో, తెలయవుగాక! రోయరె నిన్ను = నిన్ను జనులు ఏవగించుకొనరా ! దీనిగలంచినంతటన్= ఈమెను బాధించినంత మాత్రమున, తండ్రి పగదీరునె = ఈమె తండ్రిపైగల పగ తీరిపోవునా !

తా :- ఓ మన్మదా ! నీవు ఈ పల్లవాధరను దానవుని కూతురిని బాధించు చున్నావేమో ! గాని ఆడు దానిని వధించిన యెడల లోకము నిన్నేవగించు కొనదా ! అదిగాక నీవీమెను బాధించినంత మాత్రమున యీమెయొక్క తండ్రిపైగల పగనీకు తీరిపోవునా !-

79.క॥ పగచాటదు నీయెడ, న
ట్లగుట యెఱింగియును బలియు నాముకతనని
మ్మగువం జెనకెద విట్టిది
తగునే ? వలరాజ, దానిఁ దలపోయవుగా ! - 79

టీక :- ఓ వలరాజా ! ఈమె పగచాటదు నీయెడన్ = నీపట్ల శత్రుత్వము ప్రకటింపదు. అట్లగుట యెఱింగియును = అది తెలిసి గూడ, బలిమి నాముకతన = బలిసిన గర్వమున, యిమ్మగువన్ జెనకెదవు = ఈమెను బాధపెట్టెదవు, ఇట్టిది తగునే = ఇది తగునా ! దీని తలపోయవుగా = దీనిని ఆలోచించవు గదా !

తా :- ఓ మన్మథా ! నీమె నీపై పగచూపదు, అదితెలిసిగూడ నీవీమెను బాధించు చున్నావు, నీకిది తగునా, ఆలోచించవు గదా !

80.చ॥ వలపులరాజవీవు, దళవాయల జాబిలి చిల్క తేజి, తూ
పులు నన, లెంచ విల్చెఱకు, పొందగఁ దేఁటులు నారి బొందణీ
తలి, రెలమావి యంపపొది, తారెడు తెమ్మెర చుట్టు, మిట్టినీ
కలవడు టెట్లు మొక్కలపు టందము, లబ్బుర మెంచి చూచినన్ - 80

టీక :- ఓ మన్మథా! వలపులరాజవీవు = నీవు వలపులకు రాజువు. దళవాయల జాబిలి, అల జాబిలి = ఆయొక్క చంద్రుడు నీకు దళవాయి, అనగా సేనాధిపతి, చిల్క తేజి = చిలుక నీకు గుఱ్ఱము, తూపులుననలు = పూవులు బాణములు, ఎంచవిల్ చెఱకు = చూడగా చాపము చెఱుకు గడ, పొందుగ తేటులునారి = తుమ్మెదలు దానికి తగిన యల్లెత్రాడు, బొందణీతలరు = ఈ చిగురాకునీకు కవచము, ఎలమావి యంపపొది = లేతమామిడి నీకు తూణీరము, తారెడు తమ్మెర చుట్టము = ఎటు పడిన నటువెళ్ళు మలయానిలయము నీకుబంధువు, ఇట్టినీకు = ఇటువంటి నీకు, మొక్కలపు టందము = శౌర్యము అల వడుటెట్లు, ఎట్లుకలుగును, యెంచి చూడగన్ = ఆలోచించగా, అబ్బురము = ఆశ్చర్యము.

తా :- ఓ మన్మథా! నీవావలపుల రాజువు. అనగా శృంగారపురుషుడవు. నీసేనాధిపతి చంద్రుడు, చిలుక నీకు వాహనము, పూవులు బాణ ములు. చెఱుకు గడవిల్లు, తుమ్మెదలు అల్లెత్రాడు, చిగురాకు కవచము, లేమామిడి తూణీరము. ఎటుపడిన నటువెళ్ళు గాలిగాడు నీ చుట్టము. ఇటులున్న నీవు శౌర్యవంతుడ వగుట ఆలోచించగా చిత్రము.

''అలం - విషమము''

81.సీ॥ నిగిడి తెర్వరుల గుండెలు జల్లు రనఁ బేర్చి
పెళపెళనార్చు కోవెలకుఁ దోడు
పలుకు పల్కనకు నింగలవు వేఁడిమి చిల్క
గిలకిలల్ గుల్కు చిల్కలకుఁ దోడు
మొనసి మేనులు చుఱుక్కని పొక్కఁగా దూఱి
మెఱుముచు విసరు తెమ్మెఱకుఁ దోడు
పీనులఁ గ్రొవ్వాఁడి వేఁడి సూదులు సొన్పు
లాగున మ్రోయు తేంట్లకును దోడు

తే॥ నీవు పగవాఁడవుం బలె నెలంత మీఁద
సెగలు వెదచల్లు వెన్నెలల్ దగులవైచి
నెగులు సేయంగ నీకును దగునె యకట
చనదె యిఁకనైనఁ జెలినోమఁ జందమామ ! - 81

టీక :- ఓ చందమామా ! నిగిడి = నిక్కి, తెర్వరుల = బాటసారుల, గుండెలు జల్లురన = గుండెలదర, పేర్చి = పూని, పెళపెళ నార్చు = పెళపెళమని యరచు, కోవెలకు తోడు = కోకిలకుతోడుగా, పల్కుపల్కునకు = మాట మాటకు, ఇంగలపు వేడిమిచిల్క = అగ్గియొక్క వేడిమిని చిల్లు, కిలకిలల్ గుల్కు = కిలకిలలు కులుకించు, చిల్కలకు తోడు = చిలుకలకు తోడుగా మొనసి = పూనుకొని, మేనులు చురుక్కని = శరీరము చురుక్కుమని, అనగా శీతలత్వముచే ననుట - పొక్కగా = పొక్కునట్లుగా, అనగా పగిలి యనుట - దూఱి = ఇండ్లలో ప్రవేశించి, మెఱుముచు విసరు = పొడుచుచు వీచు, తెమ్మెరకు తోడు = తెన్ + మెర = తెమ్మెర అనగా దక్షిణానిలము, దానికి తోడు! వీనులఁ = చెవులలో, క్రొవ్వాడి = నూతనమైన పదును గలిగిన, సూదులు చొన్పు = సూదులుగ్రుచ్చు, లాగున, మ్రోయు = అరచు, తేంట్లకును తోడు = తుమ్మెదలకు తోడు, తుమ్మెదలకు నిలయములని వ్యవహారము కనుక గ్రుచ్చుట వాని స్వభావమని ఇచట తెలియ వలెను. నీవు పగవాడవుం బలె = పగవాని వలె, నెలత మీద = ఈమెపై, సెగలు వెదజల్లు = కాకలను చల్లెడు, వెన్నెలల్ = (వెల్ + నెల) వెన్నెల, ధవళ కాంతులు తగులవైచి, అనట = అయ్యో, నెగులు సేయంగ = కీడు చేయుట, నీకును తగునె = నీకు తగునా, ఇకనైన, చెలినోమ = ఈ చెలియను కాపాడుట, చనదె = కూడదా !

తా :- ఓ చందమామా ! నిక్కిపోయి బాటసారుల గుండెలు తల్లడిల్లు నటుల పెళపెళమని కూసెడు కోకిలల జతకు నిప్పులసెగలు చల్లెడు పలుకులతో కలకలమను చిలుకల జతకు శరీరము చురుక్కు మనగా దూసికొని వీచెడు మలయానిలము జతకు చెవులలో సూదులు గ్రుచ్చినట్లు రొదచేయు తుమ్మెదల జతకు నీవు సెగలు వెదజల్లెడు వెన్నెలను తగుల వేయు చున్నావుగాని యికనైన నీమెను కాపాడుట నీకు తగదా !

82.వ:- అని వలరాయనిం గలువ రాయనిం దూఱి పలికి యచ్చెలు
వలు; వెండియుఁ జలువలు గావింపం దలంచినం జూచి
యా చిగురు బోఁడి మెల్లన నిట్లనియె - 82

టీక :- అని, వలరాయనిఁ = మన్మధుని, కలువల రాయనిఁ = చంద్రుని, దూఱి పలికి = దూషించి, అచ్చెలులు = ఆయువతులు, వెండియు = మరల, చలువలు గావింపఁ = శైత్యోపచారములు సేయ, తలంచినఁ = తలచగా, ఆచిగురు బోడి = ఆశర్మిష్ఠ, మెల్లన నిట్లనియె = మెల్లగా యిట్లనెను.

తా :- అని మరుమన్మధుని చంద్రుని దూషించి పలికి యామెకు మరల శైత్యోప చారములు సేయ చూచుచుండగా నామె మెల్లగా నిట్లనెను.

83.కll 'కడలేని జాలి యెక్కడ
గడపట్టును, వట్టిచల్వ గావించెద, రీ
యడియాస-లేల, యింకను
విడువుఁడు నామీఁది కూర్మి వెలఁదుక లెల్లన్' - 83

టీక :- కడలేని = అంతిములేనట్టి, జాలియెక్కడ గడపట్టును = మీ యొక్క దయ ఎప్పటికి ముగియును, వట్టిచల్వగావించెదరు = మీరు వ్యర్థమైన ఈ శైత్యోప చారములు చేయుచున్నారు. ఈ అడియాసలేలఁ అడి = వట్టిది, ఈయొక్క వ్యర్థమైన ఆశలెందులకు, వెలదుక లెల్ల = మీరందరు, ఇంకను, నామీది కూర్మి = నాపై గల ప్రేమ, విడువుడు.

తా :- ఓ చెలులారా ! మీకు నాపైగల అంతములేని జాలికి యంతెక్కడ. అనగా నుండదనుట - మీరు పైపైమాత్రమే వట్టి శైత్యోప చారములు చేయుచు చున్నారు కాని వీనివలన లాభములేదు. నాపై గల ప్రేమను మీరింక విడిచి పెట్టుడు.

84.వ:- అని పల్కునెడ = అని యనునపుడు.

85.తేll సకియ యక్కొల్లఁ దడియఁగా జాఱి నెఱయు
చున్న కన్నీళ్లు మిక్కిలి నొనరెఁ జూడ
నలిగి వలరాయఁ డేసిన యలరుఁ దూపు
లపుడు దాఁకిన మంట చల్లార్పునట్లు - 85

టీక :- సకియ = ఆమె యొక్క, అక్కొల్లదడియగా = ఱొమ్మంతయు తడియు నట్లుగా, జాఱినెఱయు చున్న = స్రవించి యొప్పుచున్న, కనీళ్లు, అలిగి = కోపించి, వలరాయడేసిన = మన్మధుడేసిన, అలరుతూపులు = పూల బాణములు, అపుడు తాకిన = ఆసమయమున తగిలిన, మంట చల్లార్చు నట్లు = బాధను చల్లబరచు నటుల, చూడఁ = చూడగా, మిక్కిలి నొనరెను = మిక్కిలిగా నొప్పెను.

తా :- అపుడామె యొక్క రొమ్మంతగా తడియునట్లు స్రవించిన కన్నీళ్లు మన్మధుడు కోపించి వేసిన బాణములపుడు తాకిన మంట చల్లార్చుటకు చల్లిన నీళ్లవలె కనిపించెను -

''అలం - ఉపమ''

86.క॥ ఈడగునో కావో యని
చూడఁ హత్తించునట్లు బోటియడుగులం
జేడియ లొత్తిరి కెంజిగు
రోడకు నాయక్క, తాళు మొక్కెం, తనుచుః - 86

టీక :- ఈడగునో కాదోయని = సమాన మగునో లేదో యని, చూడః = చూచుటకై, హత్తించునట్లు = అతికించినట్టు, బోటియడుగులః = ఆమె పాదములకు, చేడియ లొత్తిన కెంజిగురు = ఆయువతులు శీత లోపచారమున్నకై పెట్టిన లేత చిగురు, నాయక్క, ఓడకుము, తాళు మొక్కింత = ఒక్కింత తాళుము. అనుచుః = అనుచు శైత్యోప చారములు సేయుచుండగా.

తా :- చెలులు, ఓచెలీ! కొంచెము తాళుము. నీ పాదములకు ఈడగునో కాదో చూతమని హత్తించు చున్నామని ఓదార్చుట పాదములకు చిగు రాకులు హత్తించు చుండిరి.

''అలం - ఉపమ''

87.మ॥ దళమైమించు విరాలి కాఁకల గడుం దాళంగఁ బూఁబోఁడిమై
కలయం జల్లిన కప్పురం బమరె, వీఁకః రేసి పూవింటివాఁ
డలుకం బల్మఱుఁ దూపుఁ గ్రొవ్విరుల నేయః రాలు పుప్పొళ్లు నుం
బలె, నెత్తావులుఁ జల్వలోని మిసుముల్ పైపైఁ గడుం బర్వఁగన్ - 87

టీక :- దళమై మించు = దట్టమై మించెడు, విరాలి కాకలః = విరహ తాపమున, కడుః = మిక్కిలిగా, తాళంగః = తాళుకొనగా, పూబోడిమై = ఆమె శరీరముపై, కలయం జల్లిన కప్పురంబు = నిండుగా చల్లిన కర్పూరము, వీకః = పట్టుదలతో, రేసి = విజృంభించి, పూవింటివాడు = మన్మధుడు, అలుకః = కోపముతో, పల్మరు = అనేక పర్యాయ ములు, తూపుక్రొవ్విరులనేయః = పూవుల యమ్ము లేయగా, రాలు పుప్పొళ్ల నుంబలె = రాలుచున్న పుప్పొళ్లవలె, నెత్తావులు = కమ్మని వాసనలు,

చల్వలోని నిసుముల్ = శైత్యోప చారమందలి, కర్పూరపు టిసుక, పైపై = మీద మీద, కడుఁ బర్వఁగఁ = మిక్కిలిగా వ్యాపించగా, అమరెఁ = చూడ నొప్పెను.

తా :- దట్టమైన విరహ తాపమునకు మిక్కిలిగా తాళుకొనుచున్న నామె శరీరముపై చల్లిన కర్పూరపు పొడి మన్మథుడు విజృంభించి పూవు టమ్ములు వేయు చుండగా రాలిన పుప్పొడుల వలె నుండి యవి పైపై సువాసనలు వ్యాపింప జేయుచు నొప్పుచుండెను.

''అలం - ఉపమ''

88.తే॥ ఇంతి, యెక్కడ నీడేఱె దిట్టి జాలి
నక్కటా, యని మేనెల్ల నలమి నిమిరి
కడిఁది తమ్ముల నవ్వెడు కన్నుదోయి
నెలఁత యొక్కతె తేట పన్నీటఁ దుడిచె - 88

టీక :- నెలత యొక్కతె = ఒక నెలత, ఇంతి, ఇట్టిజాలిని = ఇటువంటి బాధను, యెక్కడ నీడేఱెదు = ఎక్కడ దాటగలవు అక్కటా, అయ్యో యనఁ = అనగా మేనెల్లఁ = శరీరమంతటను, అలమి = పూసి, నిమిరి, కడిదిఁ = మిక్కిలిగా, తమ్ముల నవ్వెడు = పద్మములను హసించు, కన్నుదోయిఁ = కన్నులను, తేటపన్నీటఁ = తేటయైన పన్నీటితో, తుడిచె = తుడిచెను.

తా :- ఒకతె ఆమెతో ఓయింతి యింతటి తాపము నెటుల తాళుకొందువు. అయ్యో పాపమని శరీరమంతటిని నిమిరి చూచి తేటయైన పన్నీటితో ఆమె శరీరమును మరియు కన్నులను తుడిచెను.

''అలం - అతిశయోక్తి''

89.వ:- ఇత్తెఱంగునం దెఱవ లెల్లం జలిపనులు చేయు చుండి
రంత నక్కడ యయాతియు శర్మిష్ఠం జూచిన యది మొద
లు తనమది బొదలు వలరాచ వేఁడిమి వాఁడిమిం
బొక్కుచు నొక్క యెడఁ జూడం గూడిన మేడలో నేకతంబున
నుండి తనలోన - 89

టీక :- ఇత్తెఱంగున = ఈవిధముగా, తెఱవ లెల్లఁ = స్త్రీలందరు, చలి పనులు = శైత్యోపచారములు, చేయుచుండిరి, అంతఁ = అపుడు, అక్కడ యయాతియు, శర్మిష్ఠఁ చూచినది మొదలు, తన మదిని = మనస్సులో, పొదలు = కలిగిన, వలరాచ

వేడిమి పొడిమిఁ = మన్మథ తాపము యొక్క తీక్షణతచే, పొక్కుచు = బాధపడుచు, ఒక యెడ = ఒకచోట, చూడం గూడిన = చూడదగిన మేడలో ఏకతంబున నుండి = ఏకాంతమున నుండి తనలోన -

తా :- ఈ విధముగా యువతులందరు శర్మిష్ఠకు శీతలోపచారములు చేయుచుండిరి. అపుడు అక్కడ యయాతియు శర్మిష్ఠను చూచినది మొదలు మనస్సులో కలిగిన మదన తాపము యొక్క తీవ్రతకు బాధపడుచు ఒక మేడలో ఏకాంతమందుండి తనలోన-

-: యయాతి విరహ వేదనకు లోనగుట :-

90.సీ॥ ఆ కొమ్మ వేనలి యడుగుఁ దమ్ములు నొసల్
చిఱుదొడల్ బొమలును మెఱుఁగుఁ దొడలు
కన్నులు పిఱుఁదు మొగంబు నెన్నడుము లేఁ
జెక్కిళ్లుఁ బొక్కిలి చెవులు నారు
తెలినవ్వు గబ్బి గుబ్బలు మోవి మెడయుఁలు
ల్వరుస చేతులు వ్రేళ్లు వాడి గోళ్లుఁ
బలుమఱుఁ దేనియ లొలుకు పల్కులు చెన్ను
మించుల గేరుప నెమ్మేని యొఱపుఁ
తే॥ దగిలి మదిలోన నిలిచి యెంతయుఁ గలంప
నువిదఁ బలుమాఱుఁ దలఁపుచు నుస్సురను చు
మోసపోయితి నంచును మోము వాంచి
చెయ్యి చెక్కిటఁ జేర్చి తాఁ జిన్నఁ బోయి - 90

టీక :- అ కొమ్మ = ఆమె యొక్క, వేనలి = కొప్పు, అడుగు దమ్ములు = పాద పద్మములు, నొసల్ = నుదురు, చిరుదొడల్ = పిక్కలు, బొమలు = కనుబొమలు, మెఱుగు తొడలు, కన్నులు, పిఱుదు = నితంబము, మొగంబు = ముఖము, నెన్నడుము = సన్నని నడుము, లేజెక్కిళ్ళు = లేత చెంపలు, పొక్కిలి = నాభి, చెవులు నారు = నూగారు, తెలినవ్వు = మేలిమి దరహాసము, గబ్బి గుబ్బలు = బింకమైన చన్నులు, మోవి = పెదవి, మెడయు పల్వరుస, చేతులు, వ్రేళ్లు, వాడిగోళ్లు = వాడియైన గోరులు, పలుమరు = పదే పదే, తేనియలొలుకు పలుకులు = తీయని మాటలు, చెన్నుమించులఁ = అందమైన మెరుపులను, గేరు = పరిహాసము చేయు, నెమ్మేని

= కోమలమైన దేహము యొక్క, యొఱపు = అందము, తగిలి మదిలోన నిలిచి = మనస్సున తగులుకొని నిలిచి, యెంతయు గలంప = మిక్కిలి కలవర పరచగా, ఉవిదన్ = ఆ యువతిని, పలుమారు = అనేక పర్యాయములు తలచచు, ఉస్సురనుచు = నిట్టూర్పులు విడుచుచు, మోసపోయితిని, అనుచును, మోము వాంచి = ముఖము వంచి, చెయ్యి చెక్కిట జేర్చి = చేతిని చెంపకు చేర్చి, చిన్నవోయి = చిన్న బుచ్చుకుని-

తా :- ఆ మహారాజు షర్మిష్ఠయొక్క కేశాది పాద పర్యంతమైన యంగములు తన మనస్సున తగిలి నిలిచి కలవరపరచగా నామెను పలుమారు తలచు కొనుచు అయ్యో ! మోసపోయితినని నిట్టూర్పులు విడుచుచు చిన్న వోయి -

91.వ:- అంతకంతకు వింతయై యెంతయుం బలియు
వలరాచకాఁక వ్రేఁకంబునం బ్రొద్దు గడుపు చున్నంత -

టీక :- అంతకంతకు = రానురాను, వింతయై = చిత్రమై, ఎంతయు బలియు = ఎంతగనో ఎక్కువయగు, వలరాచకాక = మన్మధ తాపము యొక్క, వ్రేకంబునన్ = బరువున, ప్రొద్దుగడుపు చున్నంత = కాలపు గడుపు చుండగా -

తా :- ఆ మహారాజు రానురాను చిత్రముగా మిక్కుటమగు మన్మధ తాపము యొక్క బరువున కాలము గడుపు చుండుగా -

92.సీ॥ అలమి నెమ్మది నున్న యతివలే నవ్వుచే
బలెనొడ లెల్ల వెల్వెలుకఁ బా ఱె
నాచాన మైరంగు లను తేనె సోనచేఁ
దిలకించెననఁ గోర్కి తీఁగె సాఁగె
నానెలంతుక మొగం బను నిండునెల తెల్వి
బలెఁ గన్నుఁ దమ్ములు పాలవఁ దొణఁగె
నాలేమ చినుగొండ లానలేమినిఁ బోలె
సాఁగి నిట్టూర్పులు సందడించెఁ
తే॥ బూని తనలోన నిల్చిన పొలఁతి నెపుడు
మఱి తలం పేమియును లేక మదికి మగుడ
నిగుడు చూపులఁ గనుగొంచు జగము రిత్త
చూపులనె చూచు మరుమరుల్ సోఁకి కలప - 92

టీక :- నెమ్మదినున్న = నిండైన మనస్సులో దాగిన, యతివలే నవ్వు = ఆమె యొక్క చిరునవ్వు, అలమిన బలె = వ్యాపించినట్లు, ఒడలెల్లన్ = శరీరమంతయు, వెల్వెలుకబారె = తెల్లబారెను. ఆచాన = ఆ యువతి యొక్క, మైరంగు = శరీర కాంతి, అనుతేనెసోనచే = అను తేనె వాన చేత, తిలకించెనన = పూచెననగా, కోర్కి = కోరిక, తీగసాగె = వర్ధిల్లెను, ఆనెలంతుక = ఆయువతి, మొగంబును = ముఖమును, నిండువెన్నెల తెల్విబలె = నిండు వెన్నెల కాంతివలె, కన్ను దమ్ములు = నేత్రపద్మములు, సొలవ దొడగె = ముకుళించ సాగెను, ఆలేమ = ఆమె యొక్క, చన్గొండలు = గుబ్బలను పర్వతములు, ఆన లేమిని బోలె = తాకలేనట్లు, సాగి = దీర్ఘమై, నిట్టూర్పులు = దీర్ఘశ్వాసలు, సందడించె = ఎక్కువయ్యెను, పూని తనలోన నిల్చిన = పూనుకొని తన లోపల నున్న, పొలతిని = యువతిని, ఎపుడు – మరి తలంపేమి యును లేక = ఇతరమైన ఆలోచన లేవి యును లేక, మదికి మగుడ = మనస్సునకు మరల – నుగుడ చూపుల గనుగొంచు = ఆసక్తమైన అనగా నిలిచి పోయిన చూపులచే చూచుచు, మరుమరుల్ = మన్మధుని యొక్క మాయ, కలపన్ = కలచి వేయగా, జగము = ప్రపంచమును, రిత్త చూపులనే చూచు = ఉత్తగనే – అనగా నామమాత్రముగనే చూచును –

తా :- ఆ మహారాజు మనస్సులో నిలిచిపోయిన ఆమె చిరునవ్వు వ్యాపించినట్లు శరీరమంతయు కృశత్వమున తెల్లబడగా ఆమె రూపమను తేనెవానతో పెరిగినట్లు కోరిక తీగ సాగగా, ఆమె ముఖమును చంద్రుని వెన్నెల సోకినట్లు తన యొక్క నేత్రపద్మములు ముకుళించగా, ఆమె యొక్క చన్నులను కొండలను తాకలేక, శ్వాసలను వాయువులు దీర్ఘమై సందడించగా, మనస్సులో నిలిచిన ఆమె తప్ప యితరమైన చింత లేవియు లేక అతడు ప్రపంచము నంతయు రిత్తచూపులతో చూడ సాగెను.

అనగా యయాతి కామె తప్ప ప్రపంచము కనిపించకుండ నాయె నని భావము.

''అలం – కావ్యలింగము''

93.క॥ తనమది లోపల రాఁజెడు
ననవిల్తుని కాఁక చేత నలినలి యగుచున్
మునుకొన్న సెగల కోర్వక
నును బాన్పున నున్న రాజునుం గని చెల్వల్ – 93

టీక :- తనమది లోపల = తన మనస్సులో, రాజేడు = రగుల్కొనెడు, అన విల్తుని కాకచేత = మన్మధుని తాపముతో నలినలి యగుచుఁ = మిక్కిలిగా నలిగి పోవుచు, మునుకొన్న = విజృంభించిన, సెగల కోర్వక = తాపమునకు ఓర్చుకొనలేక, నును బాన్పున నున్న = మెత్తని పరుపు పైనున్న, రాజునుంగని = రాజును చూచి, చెల్వల్ = ఆయువతులు-

తా :- మనస్సులో రగులుచు విజృంభించిన మదన తాపమును సహించలేక ఆరాజు మృదువైన తల్పముపై నుండగా అపుడా రాజును చూచి యువతులు -

94.కII తాలిమి గల రాజనుటం
దాళుచు నున్నాఁడు గాక తరమగునా యీ
జాలింబడఁగా నిప్పులు
రాలెడు మైకాఁక నిల్పరా దెవ్వరికిన్ - 94

టీక :- తాలిమిగల రాజగుటఁ = ఓర్పుగల రాజు కావున, తాళుచు నున్నాడు గాక = ఓర్చుకొను చున్నాడుకాని, తరమగునా ఈజాలిం బడగా = ఈ బాధను సహించుటకు తరమగునా, నిప్పులు రాలెడు మైకాక = శరీర తాపము నిప్పులు రాల్చు చున్నది, నిల్పరాదెవ్వరికిఁ = దీనిని ఎవరు కూడ ఓర్చు కొనలేదు.

తా :- మహారాజు మిక్కిలి యోర్పు గలవాడు కనుక దీనిని సహించు చున్నాడు. యిందులకు సహింప తరముగాదు. శరీరపు తాపము నిప్పులు రాల్చు చున్నది. యిది యితరులకు ఓపిక పట్టుకొనుట కష్టము

''అసంభవాలంకారము''

95.కII ఈరాజున కివముగ నొక
తీరునఁ గావించి సేదఁ దీర్పమి దగునా
యోరుచునా, మైసెగలకుఁ
జేరఁగరా దనుచు నెడము సేయందగునే ? - 95

టీక :- ఈరాజున కివముగఁ = ఈ మహారాజునకు చలువగ, ఒకతీరున గావించి = ఏదో ఒక విధముగా ఉపచారముచేసి, సేద దీర్పమి = ఈ బాధను తొలగించ కుండుట తగునా ! సేవకులమైన మనకొప్పునా!, ఓరుచునామై సెగలకు = శరీర తాపమునకు నిత డోర్చుకొనునా !, చేరగ రాదనుచు = శరీర తాపమున మహారాజును

సమీపించలేక పోవు చున్నామని, ఎడమ సేయందగునే= ఆలస్యము చేయవచ్చునా! -

తా :- ఈ మహారాజున కేవిధముగానైనను తాపము చల్లబడుటకు నుప చారములు సేయక నూరకుండ దగునా ! ఆతనిని సమీపించలేక పోవు చున్నామని ఆలస్యము చేయవచ్చునా ! -

96.వ:- అని పలికి = అని ఆలోచించి.

-:చెలికత్తెలు యయాతికి శశిరోపచారములు చేయుట :-

97.క॥ సిం గారపుఁ దోఁటకుఁ జని
చెంగల్వల కొలని పొంత జిన్నులకడ సం
పంగియల నడిమి యనఁటుల
చెంగట లేమావి దండ సేమంతులలోన్ - 97

టీక : సింగారపు తోటకు జని = శృంగార వనమునకు వెళ్లి, చెంగల్వల కొలని పొంత = చెంగల్వ సరస్సు సమీపమున, జిన్నులకడ = జిన్నుల నువృక్షముల దగ్గర, సంపంగియల నడిమి నటుల సంపెంగల నడుమ గల, యరటి చెట్లయొక్క, చెంగట = సమీపమున -

''అలం - ఉదాత్తము''

98.సీ॥ గందంపుఁ బొడిపైచి గట్టించి యందుపై
నెలరాలఁ గట్టిన నెలవు నందుఁ
గల్వ రేకుల మిద్దెఁ గావించి యాచుట్టు
కురువేరు డడి గట్టి విరుల తేనెఁ
బూసి ముత్యాల కీల్బొమ్మలు లేఁ దూఁడు
జిమ్మన గ్రోవులఁ జిమ్మ నెగయు
పన్నీట బొబ్బిల్లు పచ్చక ప్రపుఁ దీనె
మీఁదఁ బుప్పొడిరవ పాదుకొల్పి
తే॥ గడిత పడునట్టి వెన్నెల కళకు లమర
మెఱయు పడగండ్ల బొమ్మల మేటి వగలు
చూచియుంబలె గరఁ గఁగఁ జొదుకు దనరు
లందు మీఁదటఁ దెచ్చి యయాతి నునిచి - 98

టీక :- గంధపు పొడిపైచి = గంధపు పిండివేసి, కట్టించి = యరుగు కట్టించి, అందుపై = దానిమీద, నెలరాల గట్టిన - చలువరాళ్లతో కట్టిన, నెలవు నందు = భవనమున, కలువరేకుల మిద్దెగావించి = కలువ రేకులతో మిద్దె నేర్పరచి, ఆ చట్టుకురువేరు, దడికట్టి = చాటుగా తడకలు కట్టి, వీరుల తేనె బూసి = దానికి పూల తేనె అలుకుగా పూసి, ముత్యాల కీల్బొమలు = దానిలో ముత్యములతో చేసిన కీలుబొమ్మలు, లేదూడు చిమ్మన గోవులఁ = లేత తూడులతో చేసిన చిమ్మన గోవుల చేత, చిమ్మఁ = చిమ్ముచుండగా, నెగయు = ఎగురు చున్న, పన్నీట బొబ్బల్లు = పన్నీటితో బాగుగా తడిపిన, పచ్చి కప్రపు తిన్నె = పచ్చి కర్పూరపు తిన్నె, మీద పుప్పొడి రవ = పైపుప్పొడి రవ్వ, పాదుకొల్పి = ఏర్పరచి, గడిత పడునట్టి = గట్టి పడినట్టి, వెన్నెల కళుకు లమర = వెన్నెల యొక్క కాంతులొప్పగా, మెఱయు = ప్రకాశించు, వడగండ్ల బొమ్మల = వడగండ్లతో చేసిన బొమ్మల యొక్క, మేటి వగలు = గొప్పనైన హోయలు, చూచి యుంబలె = చూచినట్లు, గరగగ = కరుగు చుండగా, చొదుగు = చెమ్మగల, తలిరులందు మీద = చిగురు టాకుల మీద, తెచ్చి యయాతి నునిచి = కొనివచ్చి యయాతిని ఉంచి-

తా :- గంధపు పిండితో యరుగు కట్టించి దానిపై చంద్రకాంత శిలలతో భవన మేర్పరచి, దానిని కలువ రేకులతో మిద్దెగప్పి దానిచుట్టు కురువేరు దడులు గట్టి వానికి తేనె పూసి, దానియందు ముత్యాలతో చేసిన కీలు బొమ్మలమర్చి అవి లేత తూండ్లతో చేసిన చిమ్మన గ్రోవులతో పన్నీరు చిమ్ముచుండగా దానితో అంతటా బాగుగా తడిసిన పచ కర్పూరపు తిన్నెపై పుప్పొడి రవ పరచి దానిపై గట్టిపడిన వెన్నెల పలకలుంచి దానిపై వడగండ్ల బొమ్మల నిలిపి, అవి దాని సౌందర్యము చూచి కరుగు చున్నట్లు కరుగుచుండగా ఆ చెమ్మలో తడిసెడు చిగురు టాకుల మీద యయాతి మహారాజును కొనివచ్చి ఉంచి -

''అలం - ఉదాత్తము''

99. తే॥ మించుకార్చిచ్చు సేత నడంచఁబోవు
తెగువ నారాజు మైసెగల్ దీర్చఁ బూని
చలువ లొనరింప సమకట్టి చెలువలెల్లఁ
గదిసి యమ్మేటి మేని కాఁకలకుఁ గాక - **99**

టీక :- మించుకార్చిచ్చు చేత = విజృంభించిన దావానల కృత్యము, అనగా మంట, నడంచ బోవు తెగువ = ఆర్ప చూచెడి సాహసము వలె, ఆ రాజు మైసెగల్ దీర్పబూని = ఆమహారాజు యొక్క శరీర తాపము తలచి, చలువ లొనరింప సమకట్టి = శీతలోప చారములు చేయబూని, చెలువలెల్ల = ఆ యువతులందరు, కదిసి = సమీపించి, అమ్మేటి = ఆ దొర యొక్క, మేని కాకలకు = శరీర తాపమునకు, కాక = నిలువలేక / వారి యుపచారములు చాలక -

తా :- ఆ యువతులందరు, యయాతి యొక్క శరీర తాపమును దావాన లమును చల్లార్చ యత్నించి నట్లు ప్రయత్నము చేసి, తాము చేసిన యుపచారములతో నది తగ్గకపోగా-

100.సీ॥ పారవార నిండఁ గప్పుర ముప్పతిల్లెడు
విరిసరుల్ కొప్పులఁ గరముఁ జెరివి
చినుఁగని యునఁటిలేఁ జిగురు గుబ్బలమీఁదఁ
గదియంగఁ జేర్చి పయ్యెద లొనర్చి
జిలుఁగు జేలల మీఁదఁ జెంగల్వ విరిరేకు
లెలమిగాఁ గూర్చి యింపలరఁ గట్టి
గములుగా నెలసూడిగములుగాఁ జేతులఁ
దలముగాఁ దూండ్లు గుత్తములు చేసి
తే॥ మఱియు నందఱుఁ దమ్ము నేమఱక వచ్చి
తెఱవ లెల్లను మిగుల వాతెఱలు వాడ
విరుల తేనియ నించి వావిరిని గంద
మసలు గావించి మేనుల నలఁదు కొనుచు - 100

టీక :- పారపారనిండ = ఆకు ఆకు నడుమ, కప్పుర ముప్ప తిల్లెడు = కర్పూరము కలిగినట్టి, విరిసరుల్ = పూలదండలు, కొప్పున, కరము చెరివి = మిక్కిలిగా నలంకరించి/ చినుగని అనటి = అరటి యొక్క, లేగిగురు = లేత చిగురు, గుబ్బల మీద కదియుంగ చేర్చి = రొమ్ములపై నుంచి, పయ్యెద లొనర్చి = వానిని కొంగులుగా చేసి, పైయెద (పై + ఎద = ఎదపై గలది, అనగా పైట) / జిలుగు చేలల మీద = సన్నని వస్త్రములపై, చెంగల్వ విరిరేకు = ఎఱ్ఱకలువలు, ఎలమిగా గూర్చి = అందముగా నమర్చి, ఇంపలరగట్టి = బాగుగా కట్టి/ గములుగా = గత్తులుగా నెలసూడిగములుగా = వెన్నెల కడియములుగా చేతుల౯ = చేతులందు,

దళముగా = దట్టముగా, తూండ్లు = తామర కాడలు, గుత్తముగ జేసి = బిగ్గరగా జుట్టి, మరియు = ఇంకను అందరు, తమ్ము = తమను, ఏమరక వచ్చి = మరువకుండ వచ్చి, తెఱవ లెల్లను = ఆ యువతులందరు, మిగులఁ = మిక్కిలిగా, వాతెఱలు వాడఁ = పెదవు లెండు చుండగా, విరుల తేనియనించి = పూదేనెతో వావిరిఁ = మిక్కిలిగా, గందమసలు గావించి = గంధము పలుచగా చేసి, మేనుల నలదుకొనుచు = శరీరమునకు పూసుకొనుచు,

తా :- దళము దళము నిండ కర్పూరము నించిన పూవుల దండలు వెంటుకలకు చుట్టి చినుగనట్టి లేత యరటి యాకులు తెచ్చి ఎదపై పైటవలె గప్పి సన్నని వస్త్రములపై ఎట్టి కలువరేకులు చక్కగా అమరించి కట్టి గుత్తులు గుత్తులుగా తామరకాడలు చేతులకు కడియముల వలె చుట్టి ఇంకను తనను మరువకుండ ఉపచారమునకు వచ్చిన యువతులందరు తమ పెదవు లెండిపోవు చుండగా పూల తేనెతో గంధమసలుగా కలిపి, శరీరమునకు పూసికొనుచు-

విశే:- ఇచ్చట శైత్యోపచారము చేయవచ్చిన వారే తమ పెదవు లెండగా శైత్యోపచారములు చేసికొనవలసి వచ్చిన దనగా నింక నా మహారాజు యొక్క వలకాక యెంతమితిమీరియుండెనో అని ధ్వని -

"అలం - అనుగుణము"

101.సీ॥ కురులలోఁ గదియంగఁ గ్రొత్త పుప్పొడిఁ దెచ్చి
మేదించి నించెను మెలఁత యొకతె
యివముగా వట్టి వేల్పిడ నొప్పు పూఁదేనె
యొడలి మీఁదను జల్లె నువిద యొకతె
చెలరేఁగి యన్నుకైన సిరిగందమున ముంచి
విరుల వీచోపుల విసరె నొకతె
పదనిచ్చి పచ్చిక ప్రంబునఁ గావించి
కడియముల్ దొడిగెను గలికి యొకతె
తే॥ కలియఁ బన్నీటఁ దడిపిన తలిరుఁ దెచ్చి
యడుగుఁ దమ్ముల నొత్తెఁ దొయ్యలి యొకర్తు
చాలచెల్వగు నాణిముత్యాల పేరు
లతని యక్కునఁ గీలించె నతివయొర్తు -101

టీక :- మెలత యొకతె = ఒక యువతి, కురులలోఁ = వెంట్రుకలలో, కడియంగ = బాగుగా కలియునట్లు, కొత్తపుప్పొడి దెచ్చి = నూతనమైన పూపరాగము తీసికొని వచ్చి, మేదించినించెను = రంగరించి యలదెను, యువిద యొకతి, వట్టి వేళ్లిడగా = వట్టివేళ్లు వేయగా, లేక వానితో నుంచగా- ఇవముగా నొప్పు = చల్లగానైనా, పూదేనె = మకరందము, బడలమీాదను చల్లె = శరీరముపై చల్లెను, ఒకతె, చెలరేగి = ఉత్సాహమున, అనుకైన = మృదువైన, సిరిగందమున ముంచి= శ్రీగందము నీటితో ముంచి, విరులవీ చోపులఁ = పూవుల విసనకర్రలతో, విసరె = విసరెను, పదనిచ్చి = బాగుగా మెదిపి పచ్చికప్రంబున గావించి = పచ్చికర్పూరముతో చేసి, కలికి యొకతె = ఒకసుందరి, కడియముల్ తొడిగెను = కడియములు చేసి తొడిగెను, కలయఁ = బాగుగా కలియునట్లుగా, పన్నీట దడిపిన = పన్నీరులో తడిసిన, తలిరు దెచ్చి = చిగురాకులు తెచ్చి, తొయ్యలి యొకర్తు = ఒకతె, అడుగు దమ్ములనొత్తె = పాదములకు హత్తించెను, చాలచెల్వగు = మిక్కిలి యందమైన, ఆణిముత్యాల పేరు = మంచి ముత్యాల దండ, అతని యక్కున = అతని ఎదపై, అతివ యొర్తు = ఒకయువతి, కీలించెను = ఉంచెను.

తా :- ఒకతె కొత్తపుప్పొడి దెచ్చి బాగుగా రంగరించి వెంట్రుకలులో బాగుగా కలియునట్లు తలకు పట్టించెను. ఒకతె వట్టి వేళ్లలో నుంచగా చల్లనైన పూదేనె శరీరమునకు పూసెను. ఒకతె శ్రీగంధమున ముంచిన పూల విసనకర్రలతో విసరెను. ఒకతె పచ్చికర్పూరము బాగుగా పిసికి కడియములుగా చేసి చేతులకు పెట్టెను. ఒకతె పన్నీటితో తడిపిన చిగురాకులను దెచ్చి యతని పాదములకు హత్తించెను. ఒకతె అతని యెదపై మంచి ముత్యాల పేరు వేసెను.

విశే :- ఇతని శైత్యోపచారములు అందరి కంటె ప్రత్యేకము గానున్నవి.

102. క॥ అప్పుడు ఱేనికి నలఁదిన
కప్పురపుం గంద మలరెఁ గస్తురియు బలెం,
గప్పరు చాయలం దగి
ముప్పిరిగొను మేనికాఁక ముంచుకొనంగన్ - 102

టీక :- అప్పుడు, ఱేనికి = మహారాజునకు, ముప్పిరిగొను మేని కాక = మూడువిధములుగా నలుముకొనిన శరీర తాపము ముంచుకొనంగఁ = విజృంభించగా, ఱేనికి నలఁదిన కప్పురపుం గందము = మహారాజునకు పూసిన

కర్పూరపు గందము, కస్తూరిబలెన్ = కస్తూరివెల, కప్పారు చాయలందగి = నల్లనైన కాంతులతో కూడి, తగెన్ = ఒప్పెను-

తా :- అపుడా మహారాజునకు శరీరతాపము ముప్పిరియై విజృంభించగా శరీరమున కలదిన మంచిగంధము కస్తూరి వలె నల్లనై యొప్పెను.

''అలం = తద్గుణము''

103.క॥ చెలులందరు నీకరణిం
బలు దెఱఁగులఁ గలుగు చలువపను లొనరింపన్
వలరాచ కాఁక మిక్కిలి
తలచూపి యొకింత యైనఁ దరలక బలియన్ - 103

టీక :- చెలులందఱు = చెలికత్తెలందరు, ఈకరణిన్ = ఈవిధముగా, పలుతెఱగుల గలుగు = అనేక విధములైన, చలువ పను లొనరింపన్ = శైత్యోపచారములు చేయగా, వలరాచకాక = మన్మథ తాపము, మిక్కిలి తలచూపి = మిగుల విజృంభించి, ఒకింతయైన = ఏమాత్రము గూడ, తరుగక యుండెన్ = తగ్గకుండ నుండెను.

తా :- ఆచెలికత్తెలందరు ఈ విధముగా ననేక విధములైన శైత్యోపచారములు చేసినను ఆమహారాజునకు మదన తాపము కొంచెము గూడ తొలగకుండ నుండెను.

104. లయవిభాతి :-
చెలువ లొనరించు బలుచలువలకుఁ బైనలము
కలువలకుఁ దేఁటులను తులువలకు లేఁబూ
ములుకులకు రాచిలుక పలుకులకుఁ దెమ్మెరల
బెళుకులకుఁ గ్రొన్ననల తళుకులకు నెమ్మె
యలపులకుఁ బారువపు సొలపులకుఁ గ్రమ్ముకొను
తలఁపులకు ముమ్మరపు వలపులకుఁ దెల్వె
న్నెలలకును గొమ్మ గనుకలలకును జెంతఁ దగు
మలలకును గోర్కులను వలలకును లోఁగున్ - 104

టీక :- చెలువలొనరించు = ఆయువతులు చేయు, పలుచలువలకు = మిక్కిలియైన శీతలోపచారములకు, పైనలము కలువలకు = పైన కప్పెడు కలువరేకులకు, తేటులను తులువలకు, = తుమ్మెదలను దుష్టులకు / దుష్టమైన తుమ్మెదలకు,

లేబూములుకులకు = లేతనైన పూవు టమ్ములకు, రాచిలుక పలుకులకు = రామచిలుకల ధ్వనులకు, తెమ్మెరల బెళుకులకు = పిల్లగాలుల యొక్క బెణకులకు, క్రొన్ననల తళుకులకు = కొత్త పూవుల యొక్క కాంతులకు, నెమ్మె యలవులకు = తనకోమలమైన శరీరము యొక్క యలసటకు, పారువపు సొలపులకు = పావురముల యొక్క సొంపులకు, క్రమ్ముకొను తలపులకు = మూగెడు కోరికలకు, ముమ్మరపు వలపులకు = దట్టమైన ప్రేమలకు, తెల్వెన్నెలకు = తెల్లని వెన్నెలకు కొమ్మ కనుకలలకును = శర్మిష్ఠను గురించి కనెడు కలలకు, చెంత దగు మలలకును = సమీపమున గల పర్వతములకు, అనగా క్రీడాపర్వతములకు, కోర్కులను వలలకును = కోరికలను వలలకు, లోగుః = వశమై భయపడు చుండును.

తా :- ఆమహారాజు అచట శశిరోపచారములతో నుండి ఆచెలికత్తెలు చేయు శీతలోపచారములకు తనపైన గప్పిన కలువరేకులకు, వానిపై వ్రాలెడు తులువలైన తుమ్మెదలకు మన్మధుని పూములుకులకు చిలుకల పలుకులకు పిల్లగాలుల తాకుళ్లకు తనశరీరమునకు కలిగెడు యలసటకు పావురముల యొక్క అందమునకు తనలో కలిగెడు తలపులకు మనసులో మూగెడు కోరికలకు దట్టమైన వెన్నెలకు శర్మిష్ఠను గుఱించి కనెడు కలలకు ఆసమీప మందలి క్రీడాపర్వతములకు కోరికలను వలలకు మిక్కిలిగా లోగి భయపడును-

''అలం - అనుప్రాస''

105.వ:- ఇట్లు వలరాచ సెగల మిగుల నొగులు రాజుం గని వగలం దగిలి
మగువ లిట్లనిరి - 105

టీక :- ఇట్లు వలరాచసెగల = ఈవిధముగా మదన తాపమున మిగుల నొగులు = మిక్కిలిగా బాధపడు, రాజుం గని = మహారాజును చూచి, వగలవ దగిలి = చింతలోపడి, మగువలిట్లనిరి = ఆయువతులిట్లనిరి.

తా :- ఈవిధముగా మదన తాపమున వేగు మహారాజును చూచి చింతలోపడి ఆయువతులిట్లను కొనిరి.

మదనోపాలంభనము

106.క॥ మరుఁడా యెవ్వరితోడం
బురుడా, వడి వేఁడి వాఁడి పూఁ దూపుల వే
మరుడాసి నొంప నక్కటఁ
యొరుఁడా యీరాజు నీకు నొగిఁ దలఁ పంగన్ - ? 106

టీక :- మరుడా = ఓమన్మథుడా! ఎవ్వరితోడు బురుడా = ఎవరితోడనైన నీకు స్పర్ధనా, వేడివాడి రూనులన్ = వేడిగల వాడియైన అమ్ములను, వేమఱు = పలుమారు, డాసి = సమీపించి, ఒంపన్ = వారిని వేధించుటకు, అక్కటా = అయ్యో, ఈరాజు నీకు, ఒగిన్ దలపంగన్ = బాగుగా నాలోచించగా, ఒరుడా = పరాయి వాడా!

తా :- ఓ మన్మథా వాడివేడి తూపులు వేయుటకు నీకెవరి తోడనైనా స్పర్ధనా! పలుమారు వారిని సమీపించి బాధించుచుందువు, అయ్యో! ఆలోచించగా ఈరాజునకేమైన పరాయివాడా!

''అలం - అనుప్రాస''

107.క॥ వలరాయా! వేఁడిన నీ
తలరాయా, యించుకైనఁ దలఁపవు మదిలోఁ
గలరా యీరాజున కెన
కొలరా యేలయ్య తిట్టు కుడువఁగ నీకున్? - 107

టీక :- వలరాయా! ఓమన్మథా! నీతలరాయా = నీయొక్క శిరస్సు పాషాణమా - అనగా కరుగదనుట, వేడిన = ప్రార్థించినను, మదిలో = మనస్సులో, ఇంచుకైన దలపవు = ఏమాత్రమా లోచింపవు, కలరాయీ రాజునకెన = ఈ రాజునకు, ఎన = సాటిగలరా, తిట్టుకుడువనీకున్ = తిట్లు తినుటకు నీకు, కొలరానేలయ్య = దోషమునకు వచ్చుట యెందులకు? - కొలయున దురితంబుపేరు ...... ఆం.శే.21

తా :- ఓ మన్మథా! ఈ మహారాజునకు లోకమున నెవరైన సాటి గలరా! ఎంతగా ప్రార్థించినను మాప్రార్థనను గురించి యా లోచించవు. నీతలయేమైన రాయియా. ఇటుల తిట్లు తిను దోషమున పడుట యెందులకు -

''అలం - యమకము''

108.వ:- అనిపల్కునంత = అనియనగా

109.శా॥ ఆనం బెట్టి మరుండు నొంప వగతో నానేల తేఁ డిమ్మెయిం
గాసిం బొందఁగ జూడలే కరుగు వీఁక ప్రొద్దు వేఁగ్రుంకినం
బాసెం జక్కవ లిర్లు చాల బలిసెఁ బైఁ జందురుం డొప్పుగాఁ
గాసెఁ వెన్నెల పిండి చల్లిన కడంకం గల్వ పూపండువై - 109

టీక :- ఆనం బెట్టి = ఒట్టుబెట్టి, వరుండ పంపఁ = మన్మథుడు బాధ పెట్టగా, వగతో నానేల తేడు = దుఃఖముతో నా మహారాజా, యిమ్మెయింగాసిం బొందగ = ఈవిధముగా బాధ పొందగా, చూడ లేకరుగు వీకఁ = కనలేక వెళ్లినట్లు, ప్రొద్దువేగ్రుంకినఁ= సూర్యుడు వెంటనే గ్రుంకగా, పాసెఁ జక్కువలు = జక్కవలు జంటలెడ బాసెను. ఇర్లు చాల బలిసెఁ = చీకట్లు మిక్కిలిగా వ్యాపించెను. పై = ఆకాశముపై, చందురుండు = చంద్రుడు, కల్వపూ పండువై = కల్వలకు పండుగగా, పిండిజల్లిన కడంకఁ = పిండి జల్లిన రీతిగా, ఒప్పుగా గాసెఁ వెన్నెల = వెన్నెల చక్కగా కాసెను.

తా :- మన్మథుడామహారాజును ఒట్టుబెట్టినట్లు బాధింపగా ఆవగలోకములు చున్న రాజును చూడలేక పోయినట్లు సూర్యుడు గ్రుంకెను. అపుడు జక్కవలు జంటలు బాసెను. చీకటి దట్టముగా వ్యాపించెను. ఆపిమ్మట చంద్రుడు కలువలకు పండుగకాగా పిండిచల్లనట్లు వెన్నెలగాసెను.

110.వ:- అప్పుడు

111.క॥ వెడవిల్తుఁ డలరు వింటను
గడువడి విరి దూపు లేర్చి కది యింపుచున
ప్పుడఁతిఁ రాచందురునిం
గుడియెడమల నేసి యేసి కోయని యార్చెన్ - 111

టీక :- వెడవిల్తు దలరు వింటను = మన్మథుడు పూములకులతో, కడువడి = మిక్కిలి వేగముగా, విరితూపు లేర్చి = పూములుకులు ఏరి, కడియింపుచు = కూర్చుచు, అప్పుడతిఁ = ఆశర్మిష్ఠను, రాచిందురునిఁ = రాజచంద్రుని, కుడియెడమల నేసి యేసి = ఎడపెడగా బాణములు వేసి, కోయని యార్చెఁ = సంతోషమున కోయని

యరచెను.

తా :- అపుడు మన్మథుడు మిక్కిలి వేగముగా పూముటమ్ములేరుచు, ఆశర్మిష్ఠను యయాతిని కుడియెడమలుగా నేసి సంతోషమున కో యని యరచెను.

విశే :- కార్యవశమున నెపుడేని సంతోషము మిక్కుటముగా కలిగినపుడు కోయని ఏదో యొక విధముగా కేకలు వేయుట మానవ స్వభావము.

112.తే॥ అందు శర్మిష్ఠ మిక్కిలి యలము కొనుచు
మించు వెన్నెల వేఁడిచే మేను వొక్క
బువ్వుఁ బానుపు మీఁదటఁ బొరలి పొరలి
వలఁపు రాయని చేఁత చేఁ దెలివి దఱిగి, - 112

టీక :- అందు = ఆయిద్దరి యందు, శర్మిష్ఠ, మిక్కిలి యలము కొనుచు, మిక్కిలిగా వ్యాపించుచు, మించు వెన్నెల వేడిచే = బాగుగా కాసెడు వెన్నెలలో, వలపురాయని చేతచే = మన్మథుని యొక్క కృత్యముచే, తెలివి దరిగి = ముఖముపై కాంతి తిరిగి, పువ్వు పానుపు మీదట = పూవుల యొక్క పరుపుపై, పొరలి పొరలి = పొర్లిపొర్లి, మేనుపొక్క =శరీరము బొబ్బలెత్తగా-

తా :- ఆయిద్దరి యందు శర్మిష్ఠ మిక్కిలిగా వ్యాపించిన వెన్నెలచేత, మరియు మన్మథుని యొక్క బారిచేత ముఖముపై కాంతి తరిగి, పూవుల పరుపుపై పొరలి పొరలి శరీరము బొబ్బలెత్తగా -

113.చ॥ వెడ వెడ గన్ను మూయుఁ, బలవించుఁ, గనుంగవ విచ్చి రాజ, నన్
విడువఁగ బాడియే యను, గనింగని యే చెదు మేని వేఁడి నే
మిడుకఁగ నీకు నాఁడుకొన మేలటవేయను, నల్గిపోవ నా
యెడ నొక నేరమైనఁ గలదే యను, నన్నిటఁ జూడవే యనున్ - 113

టీక :- వెడ వెడ కన్నుమూయు = తఱుచుగా కన్నులు మూయును, పలవించు = పలవరించును, కనుంగవ విచ్చి = కనులు తెరచి రాజ, నన్ విడువగ పాడియేయను - నన్ను విడుచుట నీకు న్యాయమేనా యనును, కనింగని యేచెదు = చూచుచు చూచుచు బాధించెదవు, మేని వేడిన్ = శరీర తాపముతో, నేమిడుకగన్ = నేను బాధపడు చుండగా, నీకు నాకు నాడుకొన = నీకు ఆడుకొనుట యనగా సంతోషముగా నుండుట, మేలట వేయను = మేలగు నాయనును, అల్గిపోవన్ =

కోపించి వెళ్ళుటకు, నాయెడఁ = నాయందు, ఒక నేరమైనఁ = ఒక దోషమైన, కలదే యనుఁ = ఉన్నదా యనును, నన్నిటఁ = నన్ను యిక్కడ, చూడవేయనుఁ = చూడుమాయనును.

తా :- శర్మిష్ఠ పడకపై పరుండి పదేపదే కనులు మూయును, పలువరించును. కనులు విచ్చి ఓరాజా ! నన్ను విడుచుట నీకు న్యాయమా యనును, చూచుచు చూచుచునే బాధించెదవు, నేను శరీర తాపముతో మిడుకు చుండగా నీవు ఆడుకొను చుండుట యేల! నీవు కోపించి వెళ్లుటకు నాయందొక దోషమైన నుండెనా! నన్ను యిక్కడ నొక సరి చూడుమా యనును.

విశే :- ఈపద్యము హోయను పాండురాజ తనయాయను - అనుచాయ-

114.వ:- ఇట్లు పలికి మరుని పూములుకుల కులుకు నక్కలికిం
గ్రమ్ముకొని క్రమ్మఱ ముమ్మరం బగు తెమ్మలు గావింపం
గొమ్మలు గడంగా - 114

టీక :- ఇట్లు పలికి = ఈవిధముగా కనుచు, మరుని పూములుకులకు మన్మధుని యొక్క బాణములకు, ఉలుకు = భయపడు, అక్కలికిఁ = ఆశర్మిష్ఠను, క్రమ్ముకొని = చుట్టుముట్టి, క్రమ్మఱఁ = మరల, ముమ్మరంబగు = దట్టమైన, తెమ్మలు గావింపఁ = శీతలోప చారములు సేయుగా, కొమ్మలు = ఆయువతులు, కడంగి = పూనుకొని-

తా :- ఈవిధముగా మన్మధుని యొక్క బాణములకు జడిసిన శర్మిష్ఠను చెలులు చుట్టిముట్టి మరల ముమ్మరముగా శీతలోపచారములు చేయుటకు పూనుకొని-

115.సీ॥ అతివ మిక్కిలి తూలె నాలసింపఁగ నేల
చల్లగాఁ బన్నీరు చల్లరమ్మ!
చేడియ మైసెగ న్వాడె పీచిగురాకు
పరువంపుఁ గ్రొవ్విరుల్ పఱవరమ్మ!
పొలఁతికి నివముగాఁ బూఁ దేనెలో ముంచి
విరుల వీచోపులు వీవరమ్మ!
నెలఁతకు గొజ్జంగి నీట మేదించిన
యలరు కప్రము మేన నలఁదరమ్మ!

తే॥ తెరలు చున్నవి తొంటి ముత్తెములు దిగిచి
క్రొత్తలుగఁ దెచ్చి పొలిండ్లఁ గూర్పరమ్మ!
మరుని వేఁడిమి యెంతయు మలసెనమ్మ!
వెలఁది కడుసోలె, నేమి గావింత మమ్మ! - 115

టీక :- అతివ మిక్కిలి తూలె = ఈమె మిక్కిలిగా నలసినది, ఆలపింపగ నేల = యిక ఆలస్యము చేయుటెందులకు, చల్లగా = చల్లబడుటకు, పన్నీరు జల్లరమ్మ = పన్నీరు చల్లండి, చేడియ = ఈమె, మైసుగఁ = శరీరతాపమున, వాడె, ఈచిగురాకు, పరువంపు క్రొవ్విరుల్ = వాడని కొత్తపూవులు, పరువరమ్మ= పరుపుగా పరవండి, పొలతికి = ఈయువతికి, ఇవముగా = చల్లగా, పూదేనెలో ముంచి = పూవుల తేనెలో ముంచి, విరుల వీచోపులు = పూల యొక్క వీవనలు, వీచరమ్మ = విసరండి, నెలతకు = ఈమెకు, గొజ్జంగి నీటమేదించిన = పన్నీటిలో రంగరించిన, అలరుకప్రము = మంచి కర్పూరము, మేననలదరమ్మ = శరీరమున పూయండి, తెరలుచున్నవి = కాలి పొట్టు రాలుచున్నవి, తొంటి ముత్యములు = మొదటి ముత్యములు, తిగిచి = తీసి, క్రొత్తలుగ దెచ్చి = క్రొత్త వానిని దెచ్చి, పొలింఢ్ల గూర్పరమ్మ = ఎదపై వేయుడు, మరుని వేడిమిఁ = వలకాకతో, ఎంతయు మలసెనమ్మ = ఎంతగనో బాధపడెను, వెలది కడుసోలె = ఈమె మిక్కిలి కృశించెను. ఏమి కావింత మమ్మ = ఇపుడేమి చేయుదము.

తా :- ఈమె మిక్కిలిగా నలసినది. ఆలస్యమెందులకు, చల్లబడుటకు పన్నీరు చల్లుడు, ఈచిగురాకు శరీర తాపమునకు వాడిపోయినది దీనిని తీసి వాడని పూలు పరుచుడు, ఈమెకు చల్లగా నుండుటకు వీవనలు పూదేనెలో ముంచి విసరుడు, పన్నీటిలో రంగరించి కర్పూరము శరీరమునకు పూయుడు, ఈ ముత్తెములు కాకకు చిటులు చున్నవి. ఇవి తీసి కొత్తముత్తెముల దండలు వేయుడు, మదన తాపమున నీమె మిక్కిలిగా కృశించెను. కావున నిపుడు మనమేమి చేయుదము-

116.తే॥ అనుచు వే వచ్చి, చలిపను లోనరఁ జేసి
యలసి వేగింపఁ జాలక యతివ లెల్లఁ
గన్నుఁదమ్ములు మోడ్చ నక్కలికి యంతఁ
దనదు దండకు రాజురాఁ దలఁచి లేచి - 116

టీక :- అనుచు, వేవచ్చి= వేంటనేవచ్చి, చలిపను లొనరజేసి = శీత లోపచారములు తగినట్లుగా జేసి, అలసి = అలిసిపోయి, వేగింపజాలకఁ = మెలకువగా నుండలేక, అతివలెల్ల = ఆచెలులందరు, కన్నుదమ్ములు మోడ్చఁ = కనులు మూయగా, అక్కలికి యంతఁ = ఆమెయపుడు, తనదు దండకు = తనసమీపమునకు, రాజురా దలచి, రాజు వచ్చునట్లుగా తలచి, లేచి-

తా :- అని వారు వేగముగా వచ్చి యామెకు శైత్యోపచారములు చేసి యలసిపోయి మెలకువగా నుండ జాలక కనుమూయగా నపుడామె తన దగ్గరకు రాజుగారు వచ్చునట్లుగా తలచి లేచి -

శర్మిష్ఠ లేచి పొదరింటికడకు వెళ్లుట

117.క॥ వడిఁ గేలు పట్టుకొనినఁ
విడువిడు మని పోవునట్టి వెరవైనను వెం
బడి నేగెడు తలఁపునఁ గొ
మ్ముడి యొకచేఁ దురుము కొనుచు మో మలరంగన్, - 117

టీక :- వడిఁ = వేగముగా, కేలుపట్టుకొనినఁ = చేయిపట్టుకొనగా, విడువిడుమని పోవునట్టి = విడువు విడువు మని విడిపించుకొని పోయినట్టు, వెరవైనను = తీరుకాగా, వెంబడి నేగెడు తలపున = అతని వెంట వెళ్లెడు నుద్దేశముతో, క్రొమ్ముడి యొకచే = వెంట్రుకల యొక్క క్రొత్తముడిని యొక చేత, తుఱుముకొనుచు = చక్కచేసికొనుచు, మోమలరంగఁ = ముఖము వికసించగా -

తా :- వేగముగా చేయి పట్టుకొనగా నతడు విడువు విడువుమని విడిపించుకొని వెళ్లినట్లు కాగా నొక చేత విడిపోవు చున్న ముడిని సరిచేసికొనుచు ముఖము వికసించగా -

''అలం - స్వభావోక్తి''

118.సీ॥ వేఁడిమి వెదచల్లు వెన్నెల వడకునై
చెయ్యి మోమున మాటుచేసికొనుచు
నుడికి నట్లున్న పుప్పొడి మెట్టఁగాఁ బొక్కు
నడుగుఁ దమ్ములు కేల నలముకొనుచు

గట్టులవలె నొప్పు కపురంపుఁ దిప్పలఁ
గడునెక్కి నిట్టూర్పు విడిచి కొనుచుఁ
జిలువల వలె నడుగుల యడుగునఁ బడు
నెల దీఁగియలఁ ద్రొక్కి యులికి పడుచుఁ

తే॥ బూని తెకతెక మని యెడు పువ్వుఁదేనె
యొడలిపైఁ గాఱి చుఱ్ఱన నూఁదికొనుచు
నాలిగాడుపు సోఁకినఁ గీలుకొన్న
సోగకుఁ జిగురాకు మేనిపైఁ జేర్చుకొనుచు, - 118

టీక :- వేడిమి వెదజల్లు = సెగలుచల్లు, వెన్నెల వడకునై = వెన్నెల యొక్క వడదెబ్బకు, చెయ్యి, మోమున = ముఖమునకు, మాటుచేసి కొనుచు, ఉడికినట్లున్న = పొయ్యిపై ఉడికినట్లున్న పుప్పొడిఁ, మెట్టగా = చేరగా, పొక్కు = బొబ్బలెక్కు, అడుగు దమ్ములు = పాదపద్మములు, కేలనలముకొనుచు = చేతితో తడుముకొనుచు, గట్టువలెనొప్పు = గట్లవలెనుండు, కపురంపు తిప్పలఁ= కర్పూరపు గుట్టలను, కడునెక్కి =మిక్కిలిగానెక్కి, నిట్టూర్పు విడిచికొనుచు = నిట్టూర్పులు విడుచుచు, చిలువలవలె =పాములవలె, అడుగుల యడుగున = పాదముల యొక్క అడుగున, పడు = పడునట్టి, ఎలదీగియల త్రొక్కి = లేక తీగలను ద్రొక్కి, ఉలికి పడుచు, పూని, తెకతెకమని యెడు పువ్వుదేనె = బాగుగా కాగిన పూదేనె, బడలిపైగారి = కారిశరీరముపైన బడి, చుఱ్ఱనఁ = చుఱ్ఱుమనగా, నూదుకొనుచు = నోటితో ఊదుకోనుచు, నాలిగాడ్పులు సోకిన = పిల్లగాలులు సోకగా, కీలుకొన్న సెగకు = కలిగిన వేడిమికి, చిగురాకు, మేనిపై జేర్చుకొనుచు = శరీరముపై కప్పు కొనుచు -

తా :- వేడిమిని గ్రక్కు వెన్నెల యొక్క వడకు ముఖమునకు చేయడ్డముగా పెట్టుకొనుచు, ఉడికినట్లున్న పుప్పొడి తిన్నెలను చేరినపుడు పాదములు బొబ్బలెత్తగా, చేతితో తడుము కొనుచు, గట్లవలెనుండెడు కర్పూరపు కుప్పలను ఎక్కుచు దిగుచు నిట్టూర్పు విడుచుచు, పాములవలె కాళ్ళక్రింద బడు తీగలను త్రొక్కినపుడులికి పడుచు, బాగుగా కాగిన తేనె శరీరముపై బడి చుఱ్ఱుమన్నపుడూదు కొనుచు, మల యానిలము సోకగా నావేడికి చిగురాకులు శరీరముపై కప్పు కొనుచు -

119.కll మరుఁడార్చి పోకుపో కని
విరి దూపులఁ గదుము కొనుచు వేసనేయంగా
నరిగి పొదరింటి కడ వా
విరిఁ జెలితనుఁ బ్రోచు తేని వెదకుచునుండెన్ - 119

టీక :- మరుడార్చి = మన్మధుడు కేకవేసి, పోకుపోకని = పోవలదు పోవలదని, విరితూపులన్ = పూలబాణములతో, గదుము కొనుచు = తరుముచు, వెసవేయంగా = క్రమముగా బాణములు వేయుచుండగా, అరిగి పొదరింటికడ = వెళ్లి ఒక పొదరింటి దగ్గర, వావిరిన్ = వరుసగా, తనుబ్రోచు తేనిన్ = తనను కాపాడు ప్రభువును, చెలి = ఆమె, వెదకుచు నుండెన్ = వెదకు చుండెను.

తా :- మన్మధుడు పోవలదు పోవలదని కేకలు వేయుచు గెదుముచు పూములుకులు వేయుచునే యుండగా నామె వెళ్లి ఒక పొదరింటి దగ్గర తనను కాపాడురాజును వెదకుచుండెను.

120.వ:- అంతనక్కడ = అపుడక్కడ

విరహశాంతికై యయాతి పొదరింటి కడకు వచ్చి యచటికి తనకంటె మొదలే వచ్చిన శర్మిష్ఠను గాంచుట

121.ఉll వేనలి క్రొవ్విరుల్ దొరఁగ, వీనులఁ గమ్మల డాలు పర్వఁగాఁ,
గా సియాడఁగా, గలికి కన్నుల చూపు విరాలిఁ గొల్పగా,
మేను తళుక్కునన్ మెఱయ మించును బోలె నెలంత వచ్చిక
న్నాన, యయాతి పుట్టు నడియాసల దిగ్గున లేచి యిట్లనున్ - 121

విరహశాంతికై యయాతి పొదరింటి కడకు వచ్చి యచటికి తనకంటె మొదలే వచ్చిన శర్మిష్ఠను గాంచుట

టీక :- వేనలిన్ = కొప్పునుండి, క్రొవ్విరుల్ దొలగ = క్రొత్తపూలు రాలుచుండగా, వీనులన్ = చెవులందు, కమ్మల డాలు పర్వగా = తాటంకములు యొక్క కాంతులు వ్యాపించుచుండగా, కానసి యాడగా = నడుము జవ జవ లాడుచుండగా, కలికి కన్నుల చూపు = ఆమె యొక్క చూపులు విరాల గొల్పగా = విరహమును

కలిగించుచుండగా, మేను తళుక్కుర్ మెరయ = శరీరము తళుకుమని మెరయు చుండగా, మించును బోలె = మెఱుపు తీగవలె, నెలంత వచ్చి = ఆశర్మిష్ఠ వచ్చి, కన్గొనన్ = చూడగా, యయాతి, పుట్టువడియాసలన్ = వృద్ధమైన యాశకలుగుచుండగా, ఇట్లనుర్ = ఈవిధముగాననును -

తా :- సిగనుండి పూవులు రాలుచుండగా చెవులపై తాటంకముల కాంతులు వ్యాపించుచుండగా, చూపులు విరాళిని గొలుపుచుండగా, శరీరము తళుక్కుమని మెఱయు చుండగా మెఱుపు తీగవలె శర్మిష్ఠ వచ్చి యయాతిని చూడగా నడుపడక్పై నుండి లేచి యిట్లనెను -

''అలం - స్వభావోక్తి''

122.క॥ మగువా, యిచ్చో నిట్టిది
నగవా, సెగపాలు చేసి నను నేఁచంగాఁ
దగవా, యొఱపున నీకుం
దగువాఁడను గానె, యనుచుఁ దహతహఁ జనుచోన్ - 122

టీక :- మగువా = ఓయువతీ, యిచ్చోనిట్టిది తగవా = ఇక్కడ ఇటువంటి న్యాయమా, సెగపాలు జేసినను నేచంగా తగవా = వలకాకల పాలు జేసి నన్నిక్కడ బాధించటము నీకు న్యాయమా, ఒరపున నీకున్ = తగువాడను గానె = అందముననీకు తగిన వాడను గానా, అనుచు, తహ తహ జనుచోన్ = ఆతురతతో వెళ్లుచుండగా -

తా :- ఓయువతీ! యిక్కడ యిటుల చేయుట న్యాయమా, నన్నిక్కడ యిటుల విరహము పాలు చేసి బాధించుట నీకు తగునా! అందమున నేను నీకు తగిన వాడను గానా అనుచు తహతహ తో వెళ్లుచుండగా-

123.సీ॥ కడుమించు ననఁటి నున్గంబముల్ తొయ్యలి
తొడలంచుఁ బలుమాఱుఁ దడవి చూచు
జిగిమీఱు మావి కెంజి గురాకుఁ బూఁ బోఁడి
మోవి యంచును బంటి మొనఁ దనర్చుఁ
బొలుపైన జిగినొప్పు నలరు గుత్తులఁ గొమ్మ
గబ్బిగుబ్బ లటంచుఁ గౌఁగిలించు

మెట్టదామర లింతి మెట్టదమ్ము లటంచుఁ
దక్కకుమని సాఁగి మ్రొక్కఁబోవుఁ
తే॥ జిలికి తేనియ లొలుకంగఁ గలవరించుఁ
గలికి చిలుకల పలుకులు కలికి యెలుఁగు
లనుచు వేమాఱుఁ జెవి యొగ్గి యాలకించు
గుండె జల్లన నేమేమొ కొసరి పలుకు - 123

టీక :- కడుమించి = మిక్కిలి చక్కనైన, అనటి నున్గంబముల్ = అరటి యొక్క నునుపైన బోదెలు, తొయ్యాలి తొడలంచు = ఆమెతొడలని, పలుమారు తడవి చూచు = అనేక పర్యాయములు వానిని నిమిరి చూచును, జిగిరిమీరు మావి కెంజిగురాకు = కాంతిగల మామిడి చిగురు; పూబోడి మోవి యంచును = ఆమె పెదవియని పంటిమెన దనర్చు = దానిని పండ్లతో నొక్కును, పొలుపైన = అందమైన, జిగినొప్పు = కాంతిగల, అలరుగుత్తులఁ = పూలగుత్తులను, కొమ్మచను గుబ్బలటంచు = ఆమె యొక్క చన్నులని, కౌగలించు = కౌగలించు కొనును, మెట్టదామరలి = స్థల పద్మములు, ఇంటి మెట్టదమ్ముల టంచు = శర్మిష్ఠ యొక్క పాదములని, తక్కకుమని సాగిమ్రొక్క బోవు = నన్ను మోసము చేయువద్దని సాష్టాంగ పడబోవును; చిలికి తేనియ లొటకంగ = తేనెలు చిందునట్లుగా అనగా మధురముగా, కలవరించు = పలవరించెడు, కలికి = ఆయువతి యొక్క చిలుకల పలుకులకు = చిలుకలవంటి పలుకులకు, అలికి = భయపడి, ఎలుగులనుచు = ఆమె యొక్క మాటలని, చెవి యొగ్గియాలకించు = చెవి చేర్చి వినును, గుండె ఝల్లనఁ = గుండె ఝల్లుమను నట్లుగా, ఏమేమొ కొసరి పలుకు = యేమేమో మరి మరియనును -

తా :- యయాతి తోటలోని నునుపై యరటి బోదెలను చూచి శర్మిష్ఠతొడలని పలుమారు నిమురును. మామిడి చిగురాకు చూచి ఆమె పెదవి యని పంటితో నొక్కును, సొగసైన పూల గుత్తుల చూచి ఆమె గుబ్బలని కౌగలించును, స్థల పద్మములను గని ఆమె పాదములని, నన్ను మోసము చేయవలదని సాష్టాంగ పడును. తేనెలుట్టి పడ పలికెడు చిలుకల పలుకులవిని అవి శర్మిష్ఠ కలవరింతలని చెవి యొగ్గి వినును, మరియు వానికి తల్లడిల్లి పోయి ఏమేమో మరిమరి మాటాడును.

''అలం - భ్రాంతిమత్తు''

124.వ:- మఱియును = ఇంకను

125.చ॥ చెలువట నిల్చిన ట్లయినఁ జేతులఁ జన్గవ యప్పళించువే
నలి తగ దువ్వు మోముగను నవ్వుఁ బిఱుందునఁగేలమర్చుఁజె
క్కిలి పుణుకుంగ్ గవుంగిటనుఁ గీల్కొలుపుంగ్ బిగియాచి యంతలోఁ
దెలియు నయోయనుంగ్ మగుడఁ దివ్వఁగఁ బోవు నెఱుంగుఁ గ్రమ్మరన్-125

టీక :- చెలువటనిల్చినట్లయిన = చెలువ , ఆ యొక్క షర్మిష్ఠ అక్కడ నిల్చినట్లుగాకా, చేతులంగ్ = చేతులతో, చన్గవయప్ప లించు = చన్నులను అబ్బుకొనును. వేనలి తగదువ్వుంగ్ = వెంట్రుకలు నిమురును, మోముగని నవ్వు, ముఖముచూచి నవ్వును. పిఱుందున కేల మర్చు = పిఱుదుపై చేయివేయును. చెక్కిలిపుణుకుంగ్ = చెంపలునివురును, కవుంగిటను గీల్కొలు పుంగ్బిగియించి = బిగ్గరగా కౌగిటిలో పొదువును,నీ అంతలో తెలియుంగ్ = అంతలోనది వట్టిదని తెలియుగా, అయోయనుంగ్ = అయ్యోయనును, మగుడంగ్ = మరల, దివ్వగబోవు = ఆమెను లాగ బోవును, ఎఱుంగు క్రమ్మరంగ్ = మరల కాదని తెలియును -

తా :- యయాతి, శర్మిష్ఠ తనవుుందు నిలిచినట్లు కాగా చేతులతో నామె చనులబ్బుకొనును, వెంటుకలు దువ్వును, ఆమె ముఖము చూచి నవ్వును. పిరుదపై చేయి వేయును. చెక్కిలి పుడుకును. బిగ్గరగా కౌగలించును, అంతలోనది భ్రమయని తెలిసి అయ్యోయనును. మరల నామెను దగ్గరగా లాగుకొనబోవును, మరల వట్టిదని తెలియును.

126.తే॥ అరిగి యాచందమునను నెయ్యం బెలర్పఁ
గౌఁగిలింపుచుఁ గూరిమిఁ గదిసి తేనె
మోవి యానుచుఁ జెక్కిలి ముద్దువెట్టు
కొనుచు లోలోనఁ గన్నీళ్లుగ్రుక్కుకొనుచు - 126

టీక :- అరిగి = వెళ్లి, ఆచందమునను = ఆ తీరునను, నెయ్యం బెలర్ప = స్నేహముతో, కౌగలింపుచు, కూరిమింగ్ = ప్రేమతో, కదిసి = సమీపించి, తేనెమోవి యానుచు = మధురమైన యధరమును పానము చేయుచు, చెక్కిలి ముద్దువెట్టుకొనుచు = చెంపలు ముద్దు పెట్టు కొనుచు, లోలోన = మనసులో, కన్నీళ్లు గ్రుక్కుకొనుచు = కన్నీళ్లు ఆగికొనను.

తా :- వెళ్లి తానావిధముగా స్నేహము కనిపించు చుండగా నామెను కౌగ లింపుచు ప్రేమతో పెదవులను చుంబించుచు చెంపలు ముద్దు పెట్టు కొనుచు లోలోపల కన్నీళ్లు గ్రక్కుకొనుచు -

127.వ:- చనిచిన యచ్చటికిం దనయట్లు మున్న వచ్చి యున్న
శర్మిష్ఠం గాంచి - 127

టీక :- చనిచని = పోయిపోయి, తనయట్ల = తానటుల, వచ్చి యున్నయట్లు = మొదట వచ్చినట్లుగా శర్మిష్ఠంగాంచి = శర్మిష్ఠను చూచి -

తా :- మొదట తాను వెళ్లినట్లు పోయిపోయి తానక్కడ శర్మిష్ఠను చూచి.

శర్మిష్ఠ యయాతి మహారాజుల సంభోగము

128.క॥ మరుఁడు తమి రేఁచఁగా డ
గ్గరి యంతట మిగులఁ జెలఁగు కాఁకలచే నొం
డొరులం గౌఁగిటఁ జేర్చుచుఁ
బరికింపుచుఁ గల్ల యనుచుఁ బాయుచు మగుడన్ - 128

టీక :- మరుడు = మన్మధుడు, తమిఁ = పట్టుదలతో, రేచగా = రేగించగా, డగ్గరి = సమీపించి, అంతటఁ = అపుడు, మిగులఁ = మిక్కిలిగా, చెలగు కాకలచేఁ = విజృంభించెడు తాపముతో, ఒండొరులఁ = ఒకరి నొకరు, కౌగిట జేర్చుచు = ఆలింగనము చేసికొనుచు, పరికింపుచు = పరిశీలించుకొనుచు, కల్లయనుచు = ఇది నిజమా యనుకొనుచు, మగుడఁ = మరియు -

తా :- మన్మధుడు పట్టుదలతో వారిని రేగునట్లు చేయగా అపుడువారు మిక్కిలిగా విజృంభించెడు మదన తాపమున ఒకరినొకరు కౌగలించు కొనుచు, ఇది కల్లయనుచు మరియు -

129.క॥ కదియుచుఁ బాయుచుఁ గ్రమ్మఱఁ
గదియుచుఁ బాయుచును మిగుల గరకరితోఁ బూఁ
బొదరింటి లోనికిం జని
వదలుచు దిగజాఱు జిలుఁగువ ల్వల తోడన్ - 129

టీక :- కదియుచు = సమీపించుచు, పాయుచు = విడిపోవుచు, క్రమ్మఱఁ = మరల, కదియుచు = కలిసికొనుచు, పాయుచును = విడిపోవుచు, మిగుల కరకరితో =

మిక్కిలి స్పర్థతో, పూపొదరింటిలోనికిఁ జని = ఒక పూవుల పొదలోనికి వెళ్ళి, వదలుచు = సడలిపోవుచు, దిగ జారు = క్రిందికి జారు, జిలుగు వల్వాల తోడఁ = సన్నని వస్త్రములతో,

తా :- వారు ఒకరినొకరు కలియుచు విడిపోవుచు మిక్కిలి స్పర్థలతో మరల మరల కలియుచు విడిపోవుచు ఒక పొదరింటిలోనికి వెళ్లి ప్రిదిలి జారిపోవు చున్న వస్త్రములతో

'అలం – సముచ్ఛయము''

130.చ॥ మునుపుగ నాలిగాడ్పు వడిముంద రెఱింగియు రాల్ప నొప్పుక్రొ
న్ననల యరంగుపై నలరినవ్వుచు వాతెఱ లాని యానుచుఁ
దనియక క్రిందుమీఁ దగుచుఁ దార్చి కవుంగిటఁ జేర్చుచుం గడుం
బెనఁగిరి చిల్క తేజిదొర బీరము వాఱఁగ వార లిద్దఱున్ - 130

టీక :- నాలిగాడ్పు = పిల్లగాలి/ మలయానిలము, వడిఁ = వేగముగా ముందరెఱింగియు = ఆగామిని తెలిసి, అనగా నక్కడికి శర్మిష్ఠా యయాతి మహారాజులు రాగలరని తెలిసి, మునుపుగఁ = మొదటనే, రాల్పఁ = పూలురాల్చియుండగా, ఒప్పు = ఒప్పినట్టి, కొన్న నలయ ఱుంగుపై = కొత్త పూవులు గల యరుగు మీద, అలరినవ్వుచు = సంతోషమున నవ్వుచు, వాతెఱలు = పెదవులు, ఆనియానుచుఁ = ఒకరి నొకరు చుంబించు కొనుచు, తనియకఁ = తృప్తిలేక, క్రిందు మీదగుచు = తలమునుకలైపోవుచు / పూలపరుపుపై ఒకరు క్రిందు ఒకరు మీదుగా పొరలుచు, దార్చి = దగ్గరగా లాగుకొని, కవుంగిట జేర్చుచుఁ = కౌగిలిలో చేర్చుకొనుచు, చిల్కతేజి దొర = మన్మధుని యొక్క, బీరము వారగఁ = శౌర్యము ప్రకటమగునట్లుగా, వార లిద్దరుఁ = ఆ యిద్దరు, పెనగిరి = అల్లుకొనిరి.

తా :- మలయానిల మంతవరకే ఎరిగి వారక్కడికి వచ్చుట కంటె మొదలే నా పొదరింట గల యరుగుపై పిల్లగాలి పూవులు రాల్చి యుండగా నాపరుపుపై వారు సంతోషముగా నవ్వుచు ఒకరి యధరము లోకరు పానము చేయుచు, తృప్తిలేక వలపున తలమునకలై క్రిందు మీదుగా పొరలుచు, ఒకరినొకరు దగ్గర లాగుకొని బిగ్గరగా కౌగలించు కొనుచు వారిద్దరు పెనగిరి.

131.క॥ ఈచందమునం దగవల
రాచపనుల్ దీర్చికొనుచు రహి మీఱంగా
నాచెల్వయు రాజును మది
నీ చెయ్వులు నిక్క మనుచు నెఱిఁగిరి తమలోన్ - 131

టీక :- ఈ చందమునన్ = ఈ విధముగా, తగు = తగినట్టి, వలరాచ పనుల్ దీర్చుకొనుచు = మన్మధకేళిని దేలుచు, రహిమీరంగా = ప్రకాశించగా, ఆ చెల్వము = ఆశర్మిష్ఠ మరియు రాజును = యయాతి మహారాజు, మదిన్=మనస్సున, ఈ చెయ్వులు=ఈ చేష్ట, నిక్కమనుచు = నిజమని, ఎరిగిరి తమలోన్=తమ మనస్సులలో నిదికలగాదని తెలిసిరి.

తా :- ఈ విధముగా వారు తగినట్లు మదన కేళిని దేలుచునపుడు, తన మనస్సులలో నది కలగాదని నిజమేనని ఎరిగిరి.

132.చ॥ చెలువుఁడు మిక్కిలిం దెలివిఁ జెందకమున్న నెలంత యొక్కచే
వలువ చెఱంగు వట్టికొని వావిరిఁ దక్కినచేల చన్నులం
దలముచు మోముదమ్మి తన యక్కునఁ జేర్ప నెఱింగి ఱేఁడు వే
నలి దగఁబట్టి యెత్తుటయు నవ్వుచుఁ బెన్మిటిఁ దేల్చి నింపులన్ - 132

టీక :- చెలువుడు = పతి, మిక్కిలిన్ = మిగుల/ పూర్తిగా, తెలివి జెందకమున్న = స్పృహకు రాకమొదలే, నెలంత = ఆశర్మిష్ఠ, ఒక్కచే = ఒక్కచేతితో, వలువ చెఱంగు బట్టుకొని = చీరకొంగు పట్టుకొని, వావిరిన్ = వరుసతో తక్కిన చేల = మిగిలిన వస్త్రము, చన్నులందు = రొమ్ముపై, అలముచు = కప్పుకొనుచు, మోముదమ్మి = ముఖపద్మము, తన యక్కున జేర్పన్ = తన ఎదపై చేర్చగా, ఎఱింగిఱేడు = ఆ మహారాజది తెలిసి, వెనలి దగబట్టి = వెంట్రుకలు బట్టుకొని, ఎత్తుటయు = ఆతలను పైకెత్తగా, నవ్వుచు, పెన్మిటి దేల్చినింపులన్ = భర్తను సంతోషములందు ముంచెను.

తా :- పతియైన యయాతి పూర్తిగా స్పృహకురాగా ముందే యామె లేచి చీర యొక్క ఒకకొనను చేతబట్టికొని, రెండవ దానిని తన చన్నులపై గప్పుకొని యతని రొమ్ముపై తన తల యుంచి పడుకొనగా నతడది యెఱిగి జడను బట్టి తలపైకెత్తగా నామె నవ్వుచు యతనిని మరల మరుకేళిలో దేలించెను.

''అలం - స్వభావోక్తి''

133.వ॥ ఇట్లు వలరాచ కలయికల బలియి కల సొలపు వలపులు
గొలుపు తలంపుల నబ్బిలియుండునుం జెల్వయు నలరుచు
న్నంత - 133

టీక :- ఇట్లు = ఈవిధముగా, వలరాచ కలయిలకః = మన్మధ కేళిలో, సొలపుల = పరవశము యొక్క, తలపులు గొలుపు = ప్రేమను తెలుపు, తలంపులః = కోరికలతో, అబ్బలియుండునుః = ఆగొప్పవాడైన రాజు, చెల్వయు = ఆయువతియు, అలరుచున్నంత = సంతోషించుచుండగా-

తా :- ఈ విధముగా మన్మధకేళిలో పరవశత్వము లోని వలపులతో గూడిన కోరికలతో నా మహారాజు మరియు నామె సంతసించు చుండగా-

చెలికత్తెలు వెదకుచువచ్చి శర్మిష్ఠా యయాతి మహారాజులను గనుట

134.చ॥ చెలువలు మేలుకాంచి తమ చెంగట రాజును గానకయ్యయో
నెలకొను కాఁక కోరువక నేఁడెటు వోయెనొ మించికాయు వె
న్నెల వడదాఁకి పూఁబొదల నీడకు నేఁగెనో మావి చూచెనో
కలువలవిందుఁ గన్గొనెనొ కాఁగిన క్రొవ్విరితేనె మెట్టెనో - 134

టీక :- చెలువలు మేలుకాంచి = ఆయువతులు మేలుకొని, తమ చెంగట = తనసమీపమున, రాజునగానకః = రాజును చూడ, అయ్యయో, నెలకొనుకాక కోరువక = శరీరమున నున్న తాపమును సహించక, నేడెటుపోయెనో = ఈరాజెటు వెళ్లెనో, మించి కాయు = విజృభించి కాయుచున్న, వెన్నెలవడదాకి = వెన్నెలదెబ్బతగిలి, పూబొదల నీడకు నేగెనొ = పూపొదల నీడలకు వెళ్లెనో, మావిచూచెనో = మామిడిని చూచెనో, కలువలవిందు గన్గొనెనో = చంద్రుని చూచెనో = కాగిన క్రొవ్విరి తేనెః = వెన్నెలకు బాగుగా కాగిపోయిన క్రొత్తపూవుల తేనెను, మెట్టెనో = చేరెనో -

తా :- అపుడు నిద్రించుచున్న చెలులందరు మేలుకొని, అక్కడ రాజు లేకుండుట చూచి అయ్యయ్యో మహారాజు శరీర తాపమున కోర్వక యెక్కడ వెళ్ళెనో, బాగుగా కాయుచున్న ఈవెన్నెల వడతాకి ఏపూల పొదనీడకు వెళ్లెనో, ఎక్కడ చిగురించిన మామిడిని చూచెనో! నిండుచంద్రుని చూచెనో, వెన్నెలకు కాగిపోయిన తేనెపాకను చెరెనో-

విశే :- నాయకుడు – నాయడు, నేడు–వెలమప్రభువులందు మాదా నేడు, సింగమనేడు అని నేడు శ్రేష్ఠతావాచకముగా గల ప్రభువులు కలరు.

135 క॥ మనమందఱ మిప్పగిదిఁ
వనరంగాఁ దగునె వెట్టివారమె యకటా
పనిపూని తేని వెదకం
జనవలదే యంచు నొక్క జవరాలు వడిఁ = 135

టీక :- మనమందరమును, ఇక్కరణిఁ = ఈవిధముగా, వనరంగా దగునె = చింతించవచ్చునా!, వెట్టి వారమె = ఏమిపిచ్చి వారమా! అకటా = అయ్యో, పనిబూని = అదేపనిగా పెట్టుకొని, తేని వెదుకఁ = జనముదే, మహారాజును వెదకుటకు పోవలదా, అంచు= అనుచు, ఒక్క జవరాలు వడిఁ = ఒక్క యువతి వేగముగా –

తా :- మనమందర మీవిధముగా చింతించవచ్చునా! ఏమివెట్టి వారమా- మనము పనిగట్టుకొని వెళ్లి ఆమహారాజును వెదకవలదా యని ఒక యువతి వేగముగా –

136.గీ॥ అతని చొప్పునఁ జనుదేర నటక మున్ను
వెడలి చనుదెంచి శర్మిష్ఠ వెదకఁ దలఁచి
యున్న పూఁబోఁడి యలరి యయ్యువిదఁగాంచి
తమనెలంతుక యంచు నెంతయుఁ దలంచి – 136

టీక :- అతని చొప్పున జనుదేర = ఆమహారాజు జాడకొరకు బయలు దేరగా, అటకు మున్ను = అచటికి మొదలు, వెడలి చనుదెంచి = పోయివచ్చి, శర్మిష్ఠవెదక దలచి యున్న = శర్మిష్ఠను వెదక దలచిన , పూబోడి = యువతి, అలరి = సంతసించి, అయ్యువిదగాంచి = ఆయువతిని చూచి, తమనెలంతుక యంచు = తమలోని యామె నేయని, యెంతయు దలంచి = మిక్కిలిగా భావించి –

తా :- మహారాజు జాడను వెదకుటకై బయలుదేరగా అచటనంతకు మొదటనే శర్మిష్ఠను వెదకుటకై వచ్చిన యువతి ఆమెను చూచి తమ శర్మిష్ఠనే యనుకొని –

137.క॥ ఒక్కతెవు నిటకు వత్తువె
యక్కట రేయెండలోన నడుగుం దమ్మిల్
పొక్కఁగఁ జిఱుతవె నిన్నుం
జెక్కిలి గొట్టంగనేమి సేయుదుఁ దల్లీ – 137

టీక :- ఒక్కతెవెనిటకు వత్తువె = ఒక్కదానివే యిక్కడకు వచ్చెదవా! అక్కటా = అయ్యో, రెయొండలోన = ఈవెన్నెలలోన, అడుగుందమ్ముల్ బొక్కగ = పాదములు బొబ్బలెత్తు చుండగా, నిన్నుఁ, చెక్కిలిగొట్టంగ = చెంపకురికి వేయుటకు, చిఱుతవె = చిన్నదానివె, ఏమిసేయుదు తల్లీ !

తా :- తల్లీ! ఒక్కర్తెవు నీవు ఈవెన్నెలలో నీయడుగులు బొబ్బలెత్తగా యిటుల రావచ్చునా! నిన్ను చెంప వాయించుటకు చిన్నదానవు కావుగదా! ఏమిసేయుదును.

''అలం – అసంభవము''

138.కి॥ మింటిసిక వేల్పు మిక్కిలి
కంటి సెకఁ బొచ్చి పుట్టుగానక పోఁకుఁ
వెంటబడి మరుఁడు వాలుం
గంటీ, రాఁదగునె నెంత గండము గడచెన్ – 138

టీక :- మింగసిక వేల్పు = శివుని యొక్క, మిక్కిలి కంటి సెకఁ బొచ్చి = అగ్నినేత్రము యొక్క వేడిమిలో పడి, పుట్టుగానక = మరలపుట్టుకలేక, మరుడు = మన్మధుడు, వెంటబడిసోకును = వెంటబడి పట్టుకొనును, వాలుంగంటీ = ఓయువతీ! ఎంతగండముగడచెఁ = ఎంతగండము తప్పినది.

తా :- ఓచెలీ! మన్మధుడు శివుని అగ్గికంటి సెగలోబడి మరల పుట్టగాక సోకు దయ్యమై వెంటబడి పట్టుకొనును కనుక ఎంత గండముగడిచినది.

''అలం – అసంభవము''

139.వ:- అనుటయు నక్కొమ్మ యిట్లనియె – 139

టీక :- అనుటయు = అనగా! అక్కొమ్మ = ఆయువతి యిట్లనియె

తా :- అనగా నామె యిట్లనెను.

140.క ॥అమ్మా, నే విన్నేలిన
యముద్దియఁగాను బుడమి నసము దలిర్పఁ
ద్రిమ్మరు యయాతి యుడిగపుఁ
గొమ్మఁ మారాజు మరుఁడు గొల్పు విరాలిన్ – 140

టీక :- అమ్మా! = తల్లీ, నే=నేను, నిన్నేలిన = నిన్ను రక్షించెడు, అమ్ముద్దియగాను = ఆమెను కాను, పుడమి = భూమిపై, అసముదలిర్పఁ = కీర్తియొప్పగా, త్రిమ్మరు = సంచరించు, యయాతి యుడిగపు కొమ్మఁ = యయాతి మహారాజుయొక్క దాసిని, మారాజు = మాయొక్క మహారాజు, మరుడుకొల్పు = మన్మధుడు కల్పించెడు, విరాలిఁ = విరహమున

తా :- తల్లీనేను మహారాణిని గాను, ప్రపంచమున తనకీర్తి నిండగా సంచరించు యయాతి మహారాజు దాసిని, మహారాజు మన్మధుడు గలిగించెడు విరహమును-

141.క॥ బడలినఁ గని మే మెల్లఁ
గడు జల్వలు చేసి యలసి కనుమోడ్చిన, నె
క్కడికిం బోయెనొ, యడుగీ
యెడకుం బొదరింటి దాఁక నే తెంచెనన్ - 141

టీక :- బడలినఁ = అలసిపోగా, కని = చూచి, మేమెల్లఁ = మేమందరము, కడు చల్వలుచేసి = మిక్కిలిగా శీతలోపచారములు చేసి, అలసి = అలసిపోయి, కనుమోడ్చినఁ = కాసింత కన్ను మూయగా, యెక్కడికిం బోయెనొ, ఎక్కడకు వెళ్లెనో అడుగీయడకుఁ = అతని జాడ ఇక్కడకు, పొదరింటి దాక = పొదరింటి వరకు, నేతెంచెననఁ = వచ్చెననగా -

తా :- మిక్కిలిగా నలసిపోగా మేమది చూచి అందరము మిక్కిలిగా శీతలోపచారములు చేసి యలసి కాసింత కనుమూసితిమి. అపుడాయన యెక్కడికి బోయెనో - మేము లేచి వెదుకుచురాగా ఆయన జాడ యిక్కడికి ఈపొదరింటి వరకు వచ్చినది. అనగా

142.క॥ వినియక్కొమ్మయు దానికిఁ
దనరాకయు నట్ల జెప్పి తలిరుంబోఁడీ
మనమిప్పొద వెదకుదమా
యన విని శర్మిష్ఠ లేచి యరుదెంచుటయున్ - 142

టీక :- వినియక్కొమ్మయు దానికి = వినియామెగూడ రెండవ యామెకు, తనరాకయు, నట్లజెప్పి= తానువచ్చుట గూడ నదేవిధముగా తెలిపి, తలిరుంబోడి = ఓసీ! మనమిప్పొద వెదకుదమా = మనమీపొదలో చూదమా! అనఁ = విని, అదివిని శర్మిష్ఠ లేచి, అరుదెంచటయుఁ = రాగా-

తా :- ఆమాట విని యామె రెండవ యామెతో నేను నీవలెనే వచ్చితినని తెలిపి మనమీపొదలో చూదమాయనగా నామాట విని శర్మిష్ఠ యాపొద నుండి లేచిరాగా-

విశే :- ఈ పద్యమున తలిరుంబోడీ మనమిప్పొద వెదకుదమా! యనుచోట సార్థకమైన సంబోధన -

143.చ॥ వలవని జాలిఁ బెట్టి కడవారిబలెన్నెనరుం దలంపక
ప్పొలఁతుల నందఱన్నిదుర పుచ్చిహళాహళి గాఁగ నొంచు న
వ్వలపులరాజు గూర్ప నిటవచ్చి పెనంగితి తేని గూడి యో
మెలఁతుక మార్తుచేఁ దగిన మిన్నతి గొంట గదమ్మ నేరుపుల్ - 143

టీక :- వలవని జాలిబెట్టి = నన్ను వలదని దీనత్వమున ముంచి, కడవారి బలెన్ = తక్కిన వారివలె, నెనరుందలంపకన్ = ప్రేమనుదలచక పొలతులనందఱన్ = యువతులందరిని, నిదురపుచ్చి, హళాహళిగాగన్ = మిక్కిలి వేగిరి పడునట్లు, ఒంచు = బాధించు, అవ్వలపులరాజు = మన్మథుడు, కూర్పన్ = ఏర్పాటు చేయగా, ఇట వచ్చి = ఇక్కడికి వచ్చి, పెనంగితి తేని గూడి = మహారాజు గూడి పెనగితిని, ఓమెలతుక = ఓయువతీ! మార్తుచే = శత్రువుచే, తగిన మిన్నతి గొంట, తగినట్టి గొప్పగౌరవము పొందుట, కదమ్మనేరుపుల్ = అదియేగదా నేర్పు.

తా :- సఖీ! ఆమహారాజు నన్ను ఒల్లనటువంటి విషాదమున ముంచి, పరాయి వానివలె యేమాత్రము జాలితలచక వెళ్లిపోగా, నేను మిమ్ములందరిని నిదురపుచ్చి. మన్మథుడు పెట్టు తత్తరమున యిక్కడికి వచ్చి ఆరాజును గూడి ప్రేమతో పెనగితిని - శత్రువుతో తగిన మన్నన పొందుట - అనగా మొదట నొల్లకుండ వెళ్లెను కనుక శత్రువనుట - యేగవానేర్చు.

విశే :- ఈపద్యమున షర్మిష్ఠ దాసిని మెలతుక యనుట గూడ సార్థకమైన సంబోధన.

144.తే॥ అనుడుఁ గన్నుల జంకించి యతివ మీఁద
లేని దొకయల్క యప్పుడే పూని పల్క
నలరుఁబోఁడిఁ గనుంగొని యయ్యయాతి
యుడిగపుం గొమ్మ నవ్వుచుఁ బడఁతి జూచి - 144

టీక :- అనుడు = అనగా, కన్నుల జంకించి = కన్నులతో బెదరించి, అతివ మీద = ఆమెపై, లేనిదొక యల్క యప్పుడే పూని = నిష్కారణమైన ఒక కోపమును అపుడే

వహించి, పల్కు = అనెడి, అలరుబోడి గనుంగొని = ఆమెను చూచి, అయ్యయాతి యుడిగపుం గొమ్మ = ఆయయాతి యొక్క దాసి, నవ్వుచున్ పడతి చూచి = ఆమెను చూచి -

తా:- అనగా నామెకన్నులతో బెదిరించి యపుడే యామెపై నిష్కారణమైన యొక నింద మోపి మాటాడగా అపుడా యయాతి దాసి నవ్వుచు, ఆమెను చూచి -

145.క॥ మొగముం బోలిన యంతనె
పగఁ గొండల మీఁదఁ జాలఁ బదిలంబుగ నీ
తొగ రాకొమరుల నునిచితి
మగువా నినుఁ జెనకఁ దరమె మాబోఁటులకున్ - 145

టీక :- మగువా! = ఓ యువతీ!, మొగముం బోలిన యంతనె = ముఖమును పోలినంతలోనే, పగన్ = పగతో, ఈతొగరా కొమరుని = ఈబాల చంద్రులను, కొండల మీద, చాలపదిలంబుగన్ = మిక్కిలి భద్రముగా, నునిచితి = ఉంచితివి, మాబోటులకున్ = మావంటివారికి, నిను జెనక తరమె = నిన్ను గెలుచుట సాధ్యమా!

తా:- ఓయమ్మా! ముఖమును పోలినంతలోనే ఆచంద్రవంకలను కొండలపై భద్రముగా నుంచితివి గాన మావంటి వారికి నిన్ను గెలువ తరమా!

విశే:- బాలచంద్రలనగా చంద్రవంకలు. అవిగోటి నొక్కులకు సంకేతము శర్మిష్ఠ యొక్క పైట యించుక తొలగి నామెచను మిట్టతపై ఆదానికి నఖక్షతములు కనిపించుచుండెను. ముఖమునకు చంద్రుని తోడి సామ్యము చంద్రుడు కొండశిఖరము పైనుదయించు చుండుట సహజము కావున ఆచెలికత్తె చంద్రవంకల నెపమున నామెను పైట సరిచేసి కొమ్మని సూచించెను.

"అలం - గూఢోక్తి"

146. తే॥ అనిన మో మరవంచి యయ్యలరుఁబోఁడి
తనదు పయ్యెద యొక్కింత తలఁగఁ జూచి
సిగ్గుచే నిండునెల సొమ్పు చిన్ని మోఁ అపుఁ
బోలెఁ బూఁబొద సొచ్చె మై పొలుపు దనర - 146

టీక :- అనినఁ = అనగా, మోమోరవంచి = ముఖము ఓరగా వంచి, అయ్యలరుబోడి = ఆమె, తనదు పయ్యెద = తనపైట, ఒక్కింత తలగ జూచి = తొలగుట చూచి, సిగ్గుచే, నిండునెల సొచ్చు= పూర్ణచంద్రుని ప్రవేశించు, చిన్ని మెఱుపు బోలె = చిన్ని మెఱుపు తీగవలె, మైపొలుపు దనరఁ = శరీరకాంతి యొప్పుచుండగా, పూబొదసొచ్చెఁ = పూలపొదలోనికి వెళ్లెను.

తా :- అనగానామె ముఖమును ఓరగా వంచుకుని తనపైట కొంచెము తొలగుట చూచుకొని సిగ్గుతో చంద్రునిలో ప్రవేశించు చున్న మెరుపు తీగ వలె పూవులపొదలోనికి వెళ్లెను..

''అలం - ఉపమ''

147.తే॥ ఇట్లు పొద చొచ్చి రాజుతో నెసక మెసఁగ
నరమరలు లేని వలపుల ననఁగి పెనఁగి
యలసి చాలించి మఱియు నయ్యలరుఁబోఁడి
చిట్టకంబులు సేయుచుఁ జెలఁగునంత - 147

టీక :- ఇట్లుపొదసొచ్చి = ఈవిధముగా పొదలోనికి వెళ్లి, రాజుతో నెసకమెసగ = విజృంభించి, అరమరలు లేని వలపులఁ = భేదములు లేని ప్రేమతో, అనగి పెనగి = వశమై పెనగి, అలసి = అలిసిపోయి, చాలించి = కౌగిలి చాలించి, మరియు అయ్యలరుబోడి = ఆమె, చిట్టకంబులు సేయుచు = రాజు బుగ్గలపై చిటుకలు వేయుచు, చెలగునంత = ఉప్పొంగు చుండగా -

తా :- ఇటులామె పొదలోనికి వెళ్లి అరమరలేని వలపుతో విజృంభించి రాజుతో మరల పెనగి యలసిపోయి కౌగిలి చాలించి యతని బుగ్గలపై చిటుకలు వేయుచుండగా-

''అలం - స్వభావోక్తి''

-: యయాతి శర్మిష్ఠలు పొదరిల్లు వెడలి వచ్చుట :-

148.క॥ తలఁపులు సమకూఱెం దగ
వెలి తేమియు లేక యింక వేంచేయఁ దగున్
దెల తెలవాఱె నటంచును
నెలతుక లెఱిఁగింప లేచి నెరవగు వేడ్కన్ - 148

టీక :- తగఁ = తగినట్లు, తలపులు సమకూరెఁ = కోరికలు తీరెను, వెలితి + ఏమియు కొరతయనునదిలేకుండ, వెలి = వెలుపలికి, తేమియు లేకఁ = రహస్యము లేకుండ, ఇంక వేంచేయదగుఁ = ఇకరావలెను, తెలతెలవారెఁ, అటంచును = అనుచు, నెలతుకలెరిగింపఁ = ఆయువతులు తెలుపగా, లేచి= ఆపాదనుండి లేచి, నెవగువేడఁ = మిక్కిలియైన వేడుకతో-

తా :- ఓ మహారాజా! తగిన విధముగా మీకోరికలు తీరెను. కావున యిక రహస్యము లేకుండ వెలుపలికి వేంచేయవలెను. తెలతెలవార వచ్చినదని ఆపాద సమీపమున నున్న యువతులు తెలుపగా, లేచి, వారు మిక్కిలి సంతోషముతో -

149.చ॥ చెదరిన ముంగురుల్ నగవు చిందెడు మోములుఁ జిట్లుగందముల్
పెదవుల కెంపులుఁ నుదుటఁ బేరినక ప్రముసొల్పుఁ జూపులున్
నిదురలు లేమిఁ గన్గొనల నిండిన జాజు లెలర్పు చుండఁగాఁ
బొదిరిలు వెళ్లి వచ్చె వలపుల్ దగనింతియు రాచవేల్పుతోన్ - 149

టీక :- అపుడు, యింతియు = ఆశర్మిష్ఠ, చెదరిన ముంగురుల్ = చెదరిపోయిన వెంట్రుకలు, నగవు చిందెడు మోములు = చిరునవ్వు లొలికించు ముఖములు, చిట్లు గందముల్ = శరీరముపై పెటెత్తిన గందపుపూతలు, పెదవుల కెంపులుఁ = ఎఱ్ఱబారిన పెదవులు, నుదటఁ = నొసట, పేరిన = పేరుకొని పోయిన, కప్పురపు సొంపు = కర్పూరము యొక్క అందము, పొల్పుచూపులుఁ = అందమైన చూపులు, నిదురలులేమి = నిదురలు లేనందువలన, కన్గొనలఁ = కన్నులకొలుకు లందు, నిండిన జాజులు = నిండుకొనిన ఎఱ్ఱదనము, ఎలర్పుచుండగా = ఒప్పుచుండగా, వలపుల్ దగ = ప్రేమలు తగులునట్లుగా, ఇంతియు = ఆశర్మిష్ఠ, రాచవేల్పుతోఁ = రాజేంద్రునితో పొదరిలువెళ్లి వచ్చెఁ = పొదరిల్లునుండి బయటికి వచ్చెను.

తా :- చిక్కులు వడిన నుదుటిపైగల వెంట్రుకలతో, చిఱునవ్వులతో గూడిన ముఖములతో పేటెత్తిన గంధములతో, ఎరుపెక్కిన పెదవులతో, నొసల్లపై పేరుకొనిన కప్పురములలో, నిద్రలు లేనందువలన ఎరుపెక్కిన కన్నుకొలకులతో నామె యామహారాజుతో గూడి పొదరిల్లుదాటి బయటికి వచ్చెను -

''అలం - స్వభావోక్తి''

150. లయిగ్రాహి :-

ఇప్పగిది వచ్చి చెలి చిప్పిలు తమ్మిన్ దగిలి
చెప్పఁ దగు కోరికలు గప్పుకొనుచుండన్
గొప్పలగు పుప్పొడుల తిప్పలను గ్రొన్ననల
కుప్పలను జెన్నలరు నిప్పలను జాలన్
దెప్పరముగా నిడిన కప్పురపుఁ దిన్నెఁ దగి
యుప్పరము లైన విరిచప్పరములందున్
ముప్పిరిగొనం దనిపె నప్పువుల వింటి దొర
నప్పుడు యయాతి తనచొప్పు గొనియాడన్ - 150

టీక :- ఇప్పగిది = ఈవిధముగా, వచ్చి = పూపొదనుండి వెలుపలికి వచ్చి, చెలి = ఆశర్మిష్ఠ చిప్పలు తమిన్ = అతిశయించు కోరికతో, తగిలి = ఒప్పి, చెప్పదగు కోరికలు = మేలైన కోరికలు, కప్పుకొను చుండన్ = మూగు చుండగా, గొప్పలగు = పుప్పొడుల, తిప్పలను = గుట్టలను, క్రొన్ననల = క్రొత్తపూవుల యొక్క కుప్పలగు, చెన్నలరు = అందమైన, ఇప్పలను = ఇప్పచెట్లతో, చాలన్ = మిక్కిలి, దెప్పర ముగా నిడిన = ఎక్కువగా నుంచిన, కప్పురపు తిన్నెన్ = కర్పూరపుటరుగులందు, తగి = ఒప్పియుండి, ఉప్పరములైన = ఎత్తయిన, విరిచప్పరములందున్ = పూలమంచెలపై, ముప్పిరి గొనన్ = మూడు మడుగులుగా అనగా మిను మిక్కిలిగా, అప్పుడు, యయాతి, తనచొప్పుకొని యాడన్ = తనయొక రీతిని మెచ్చునట్లుగా, అప్పువుల వింటి దొరన్ = ఆమన్మథుని, తనిపెన్ = తృప్తిపరిచెను.

తా :- ఈవిధముగా పూపొదనుండి బయటికి వచ్చి ఆయయాతి, శర్మిష్ఠను, అతిశయించిన కోరికలో తగిలి చెప్పదగిన కోరికలు ముసురుచుండగా ఎత్తయిన పుప్పొడి తిప్పలపై, క్రొత్తనైన పూవుల రాసులపై ఇప్పచెట్లలోగల కర్పూరపు టరుగులపై, ఎత్తయిన పూలమంచెలపై ఆమెను తనయొక్క రీతి మెచ్చునట్లుగా ముప్పిరిగా తనిపెను.

యయాతి మహారాజు శర్మిష్ఠ నంతఃపురమునకు గొనిపోవుట

151.చ॥ వలపుల ఱేఁడు సేయు కొదవం బడ కెంతయు రాజు మీఱ లో
నలరుచుఁ జూడ వచ్చెనన నంతటఁ బుట్టుగు గట్టు మీఁదటన్
దెలివి దలిర్పఁ దామరల దేవర తోఁచిన, ఱేఁడుఁ గొమ్మయున్
సొలపుల తోడుతన్ నగరుఁ జొచ్చిరి లోపలి దిడ్డి త్రోవచేన్ - 151

టీక :- వలపులఱేడు సేయు = మన్మథుడు చేయునట్టి అల్లరికి, కొదవం బడక = తక్కువ బడకుండ, అనగా వెలితి యనిపించకుండ, ఎంత యు రాజు మీఱన్ = యయాతి ఎంతగనో మీరగా, లోనరచు = మనస్సులో సంతసించుచు, చూడవచ్చెనన్, అంతటన్ = అపుడు, పుట్టగు గట్టు మీదటన్ = ఉదయ పర్వతముపై, తెలివి దలిర్ప = కాంతితో విలసిల్లుచు, తామరల దేవర తోచిన = సూర్యుడు కనిపించగా, రేడు = యయాతి, కొమ్మయున్ = శర్మిష్ఠ, సొలపుల తోడుతన్ = పరవశములతో, లోపలి దిడ్డి త్రోవచేన్ = పట్టణ మందలి దిడ్డిదారి గుండ, నగరు సొచ్చిరి = కోటలో ప్రవేశించిరి.

తా :- మన్మథుని విజృంభణ కేమాత్రము రాజు తీసిపోకుండ నుండగా మనస్సున సంతోషించి యతనిని చూడవచ్చి నట్లు ఉదయ పర్వతముపై సూర్యుడు కాంతితో ప్రకాశించుచు కనిపించెను. అపుడు ఆమహారాజు మరియు శర్మిష్ఠ పరవశములతో దొడ్డి దారిని తనకోటలో ప్రవేశించిరి.

''అలం - పరికరము''

152.క:- ఇది రే యిదిపగ లనుచున్
మది నెఱుఁగక చాలఁ బొదలు మరుపోడుములన్
సదమద మగుచుండిరి య
మ్ముదితయు రాఱేఁడుఁ గూర్మి ముంచుకొనంగన్ - 152

టీక :- ఇది పగలు, ఇదిరేయి + అనుచున్ = ఇదిపగలు ఇదిరాత్రియని, మది నెరుగకన్ = మనస్సులో తలచక, చాలపొడలు= మిక్కిలిగా నొప్పు, మరుపోడుములన్ = కామవిలాసములతో, అమ్ముదితయు = ఆశర్మిష్ఠ, రాఱేడు = ఆయయాతి మహారాజు, కూర్మిముంచు కొనంగన్ = ప్రేమ నిండుకొనగా, సదమద మగు చుండిరి = నలుగు చుండిరి.

తా :- ఆమహారాజు మరియు శర్మిష్ఠ యిద్దరు, యిది పగలు యిది రాత్రి యని యెరుగక మదిలో పెరుగు చుండు కోరికలతో కామవిలాసములందు సదమద మగుచుండిరి.

153.ఆ:- సరవి తోడ నంత శర్మిష్ఠయందు య
యాతి గాంచె ద్రుహ్యు ననునిఁ బూరు,
దారు నెదిగి పుడమిలో రాజు, లెల్లను
గొలువఁ దమరు తండ్రిఁ గొలుతు రెపుడు - 153

టీక :- సరవి తోడతన్ = క్రమముగా, అంతన్ = అటుపిమ్మట, శర్మిష్ఠ యందు, యయాతి, ద్రుహ్యు = ద్రుహ్యుని, అనుని = అనువును, పూరు = పూరుని, కాంచె = కనెను, వారునెదిగి = వారు పెరిగి, పుడమిలో రాజులెల్లరు గొలువ = భూమండలమున రాజులందరు సేవించు చుండగా, తమరు = తాము, తండ్రిన్ = ఎపుడున్, కొలుతురు = తండ్రి నెప్పుడు సేవింతురు.

తా :- ఆవిధముగా కాలము గడుపుచు యయాతి శర్మిష్ఠ యందు, ద్రుహ్యుడు, అనువు, పూరుడు అను ముగ్గురు కుమారులను గాంచెను. వారు పెరిగి భూమండల మందలి రాజులందరు తమను సేవించుచుండగా తండ్రిని సేవించు చుండిరి.

154.వ:- ఇట్లు యయాతి దేవయాని యందు యదువును,
దుర్వసుండును, అనువారి నిర్వురను, శర్మిష్ఠయందు
ద్రుహ్యుండును ననుండును, బూరుండును ననువారి
ముప్వురంగాంచి -

టీక :- ఇట్లు యయాతి = ఈవిధముగా యయాతి దేవయానియందు, యదువు, తుర్వసు డనువారినిర్వురను = యదువు తుర్వసుడు అను వారిని యిద్దరిని, శర్మిష్ఠయందు ద్రుహ్యుండు, అనుండు, పూరండును ననువారిని = ద్రుహ్యుడు, అనువు, పూరుడు అను వారి, ముప్వురంగాంచి = ముగ్గురిని పొంది-

తా :- ఈ విధముగా యయాతి మహారాజు దేవయాని యను భార్యయందు యదువు తుర్వసుడు అను నిద్దరు, శర్మిష్ఠ యందు ద్రుహ్యుడు, అనువు, పూరుడు అను ముగ్గురు కుమారులను గని.

155.సీ॥ మునుకొన్న బీతుతో మొనసి వేల్పుల ఱేఁడు
తనసొమ్ము లెల్లనప్పనము లిడఁగఁ
దమకుఁ గల్గినయట్టి తమిఁ జూపి కిన్నరుల్
దండిపాటకుల చందమునఁ గొల్వఁ
బేరోలగం బున్నఁ బేర్చుకైపుల తోడ
నచ్చర పూఁబోఁడు లరుగు దేర
తముగావు మనుచు సంద్రముల యావల నేలు
నేల ఱేండ్లెల్లఁ గానికలు వనుప

తే॥ యదువు దుర్వసుఁడును ద్రుహ్యుఁడనుఁడు పూరుఁ
డెపుడు నెనలేని కూర్మితో హెచ్చి పొదలి
నేను మగుటీవిఁ దనయానలో మెలంగఁ
గడిమి తోడ యయాతి యిప్పుడమినేలె - 155

టీక :- మునుకొన్న బీతుతో = అలముకొనిన భయముతో, మొనసివేల్పుల ఱేడు = ఇంద్రుడు పూనికొని, తనసొమ్ము లెల్ల = తనసంపదలన్ని, అప్పనములడగ = అర్పించగా, తమకు గల్గిన యట్టి, తమిజూపి = సామర్థ్యము జూపి, కిన్నరుల్ = దేవ గాయక జాతివారు దండిపాటకుల చందమున = గొప్పనైన వంది మాగధుల వలె, కొలువ = సేవించగా, పేరోలగం బున్న = నిండుకొలువు దీరగా, పేర్చు కైపుల తోడ, అతిశయించిన పరవశమున, అచ్చర పూబోడులు = అప్సరసలు, అరుగుదేర = వచ్చుచుండగా, తము గావుమనుచు = తమను రక్షింపు మనుచు, సంద్రముల యావలనేలు = సముద్రముల యవతల దేశములు పాలించు రాజులు, కానుకలు నవుప = కానుకలు పంపగా, యదువు, తుర్వసుడును, ద్రుహ్యుడు, అల్ల = ఆయొక్క పూరుడు, ఎప్పుడు, ఎనలేని = సాటిలేని, కూర్మితో, ప్రేమతో, హెచ్చి పొదలి = మిక్కిలిగా మెలగుచు, నేనుమగటీవిఁ = గొప్పనైన దర్పముతో, తనయాజ్ఞతో మెలంగఁ = తనయొక్క ఆజ్ఞతో నడచు చుండగా, కడిమి తోడఁ = శౌర్యముతో, యయాతి, ఇప్పుడమిఁ = ఈభూమిని, ఏలెను-

తా :- ఇంద్రుడు తనను పట్టుకొనిన భయముతో తన యొక్క సంపద నప్పగింపగా, కిన్నరులు తమసామర్థ్యము నంతటిని చూపుచు నతని కీర్తిని వందిమాగధుల వలె గానము చేయుచుండగా, అతడు కొలువు దీరినపుడప్సరసలు పరవశమున నర్తించుటకు వచ్చుచుండ గా సముద్రముల యావల గల రాజులు తమను

కాపాడుమని యెల్లపుడు కానుకలు పంపుచుండగా, యదువు, తుర్వసుడు, ద్రుహ్యుడు, అనువు, పూరుడు ఎప్పుడును సాటిలేని ప్రేమతో మెలగుచు తనయాజ్ఞతో దిరుగుచుండగా యయాతి మహారాజు సాటిలేని పరాక్రమముతో ఈభూమిని పాలించెను.

ఫలప్రతి

156.సీ॥ ఈకబ్బ మర్మిలి నెవ్వారు చదివిన
విన్నను వ్రాసిన నెన్నఁదగిన
విడిముడిచేఁ బొంగి వెండియుఁ బైఁడియు
ద్రవ్వి తండముగాఁగఁ దవిలి మెఱసి
కొడుకులుఁ గోడండ్రు గూఁతులు మనుమలు
మనుమరాండ్రును మేలిమగు పసిండి
పాఁడియుఁ బంటయుఁ బల్లకీ లేనుఁగుల్
సాలలగుఱ్ఱముల్ చాలఁగలిగి

తే॥ ప్రొద్దు కల్వల ఱేఁడును బుడమి మిన్ను
బలెను దిరమైన యునికిచేఁజెలఁగి, యీగి
పెంపువేల్పుల రాయని సొంపు నొనర
మనుచు నుందురు తనరు సేమములనెపుడు - 156

టీక :- ఈకబ్బమర్మిలిన్ = ఈకావ్యమును ప్రేమతో, నెవ్వారు చదివిన = ఎవరు చదివినను, వ్రాసినన్ = వ్రాసిన యెడల, ఎన్నదగిన = చెప్పదగిన/ విడిముడిచే బొంగి = సంపదలతో పొంగి, వెండియు పైడియు = వెండి బంగారవులు, త్రవ్వితండముగాగన్ = రాసులురాసులుగా, తవిలి మెఱసి = కలిగిప్రకాశించి/ కొడుకులు, కోడండ్రు, కూతులు, మనుమలు, మనుమరాండ్రును, మేలిమగు పసిండి = శ్రేష్ఠమైన యువతులు బంగారము/ పాడియు పశుసంపద, పంటయు = పొలములు, వల్లకీల్ + ఏనుగుల్, సాలలన్ = శాలలందు, గుఱ్ఱముల్, చాలగలిగి = మిక్కిలిగా కలిగి/ ప్రొద్దు = సూర్యుడు కల్వలతేడును = చంద్రుడు, పుడమి = భూమి, మిన్ను = ఆకాశము, బలెను = వలెను, తిరమైన యునికిచే చెలగి = శాశ్వతమైన బ్రతుకు కలిగి, యీగిపెంపు= త్యాగము యొక్క పెంపు, వేల్పులరాయని సొంపు, ఇంద్రునియొక్క వైభవము, ఒనరన్ = ఒప్పగా,

మంచునుందురు = జీవించు చుందురు, నేయముల్ = క్షేమములు, తనరు నెపుడు = ఎపుడును ఒప్పును -

తా :- ఈ కావ్యమును ప్రేమతో నెవరు చదివినను, విన్నను, మరియు వ్రాసినను వారు చెప్పదగిన సంపదచే పొంది వెండి, బంగారము రాసులుగా గలిగి, కొడుకులు, కోడండ్రు, కూతురులు(అల్లుండ్రు) మనుమలు, మనుమరాండ్రు, యువతులు బంగారము ఇంకను పాడిపంటలు, గుఱ్ఱములు, ఏనుగులు, పల్లకీలు మిక్కిలిగా కలిగి, సూర్యచంద్రులు భూమ్యాకాశముల వలె స్థిరమైన జీవనము కలిగి, త్యాగముల యొక్క పెంపుతో ఇంద్రవైభవమున నొప్పుచుందురు. వారికి ఎల్లపుడు క్షేమములు కలుగుచుండును.

-: ఆశ్వాసాంతము :-

157.చ॥ బవరపు వేఁటలోఁ బొదలి పైకొని పేరపుఁ బుల్గుమూఁకఁగై
దువ యను చోఁపుఁ గోల నెగఁ దోలుచు నొప్పుడు రాయపక్కిసా
ళువుఁడిభరాముశా తలఁపులోఁ గడుమెచ్చి యొసంగు మన్ననం
దవిలి యశంబు లెల్లెడలఁ దార్కొనఁ జేసిన రాచ జాబిలీ - 157

టీక :- బవరపు వేటలో దగిలి = యుద్ధమనువేటలో మునిగి, పైకొని = విజృంభించి, వేరపుపుల్గుమూక = పరుగెత్తుడు గుఱ్ఱములను, వేటపక్షులు, కైదువు+అను = కైదువయును, కత్తియును, చోపు గోలఁ = మృగములను జోపెడు కఱ్ఱతో, ఎగదోలుచు = గెదుముచు, ఒప్పెడు, రాయపక్కి సాళువుడు = రాయపక్షి సాళ్వుడైన, ఇభరాముశా = ఇబ్రాహీం పాదుషా, తలపులోకడుమెచ్చి = మనస్సులో మిక్కిలి మెచ్చుకొని, ఒసందుమన్ననందవిలి = ఇచ్చెడు గౌరవమును పొంది, యశంబు = కీర్తిని, ఎల్లెడలఁ = అంతట, తార్కొన జేసిన = వ్యాపింప జేసిన, రాచ జాబిలీ = ఓరాజచంద్రమా!

తా :- యుద్ధమున వేటలో గుఱ్ఱములను దీవవము, కత్తియును చోపు గోల యొప్పుగా శత్రువులను మృగములను జోపిన రాయపక్షి సాళ్వుడగు నిబ్రాహీము పాదుషా మనస్సున మెచ్చి యిచ్చిన మన్ననతో రాజ్యమంతటను కీర్తిని వ్యాపించ జేసి కొనిన ఓ రాజచంద్రమా ! అమీనుఖానా !

''అలం - రూపకము''

158 క॥ పెనcకువ నందఱు జగములc
గొనియాడcగc గోరినట్టి కోరిక లొదువన్
మను కుతుబుశాహు కూరిమి
గనిసిరులొందెడు నమీనుఖానా, జాణా ! - 158

టీక :- పెనకువన్ = పూనికతో, జగమున నందరు = ప్రపంచమున నెల్లరు, కొనియాడగన్ = ప్రశంసించగా, కోరినట్టి కోరికలు, ఒడవన్ = కలుగునట్లు చేసి, మను = జీవించు, కుతుబుశాహు = కుతుబుషా యొక్క, కూరిమిగని = ప్రేమను పొంది, సిరులొందెడు = ఐశ్వర్యము పొందెడు, అమీనుఖానా! జాణా = ఓనేర్పరీ!

తా :- ప్రపంచమున తననందరు కొనియాడు నట్లు కోరిన వారి కోరికలన్ని పూనికతో కలుగ జేయుచు జీవించు కుతుబ్షా యొక్క ప్రేమను పొంది యైశ్వర్యవంతుడ్వైన జాణవైన ఓ అమీనుఖానా!

159 మణిగణ నిరకరము : -
కలువల చెలి, సెగకను కలిగిన య
బ్బలి యునిc, బలుకుల పడcతుకc దెలిగ్రొ
త్తలరుల వలమురి, ననమున నగుచున్ - 159

టీక :- కలువల చెలిన్ = చంద్రుని, సెగకను గలిగిన యబ్బలియును = అగ్నినేత్రముగ యూవెునగానిని యనగా శివుని, పలుకుల పడతుకన్ = సరస్వతిని, తెలికొత్తలరులను = తెల్లనైన క్రొత్త పూవులను – అనగా కల్పవృక్ష ప్రసూనములను, వలమురిని = దక్షిణావర్త శంఖమును, అసము ననగుచున్=కీర్తిచే పరిహించుచు, బలుపున దగు = శౌర్యముతో నొప్పు నిడు పరి తనపుబలీ = గొప్పవాడ్వైన బలవంతుడా ! ఓ అమీను ఖానా !

తా :- చంద్రుని, శివుని, సరస్వతిని, కల్ప ప్రసూనములను, దక్షిణావర్త శంఖమును నీకీర్తిచే పరిహసించుచు శౌర్యముతో నొప్పిన గొప్పవాడ్వైన ఓ అమీను ఖానా !

''అలం – అతిశయోక్తి''

గద్య -

ఇది శ్రీమదనగోపాలమంత్ర వరప్రసాదలబ్ధ సారస్వత, సుకవిజన హిత వచోవైభవ భావనామాత్య తనూభవ సౌజన్యవినయధుర్య పోనికంటి వంశ్య తెలగనార్య ప్రణీంతబైన యయాతి చరిత్రంబనునచ్చతెనుఁగు కబ్బంబునందు సర్వంబును పంచమాశ్వాసము సంపూర్ణము.

వ్యాఖ్యాతృగద్య -

ఇది శ్రీమన్మైత్రేయస గోత్రపవిత్ర కాత్యాయనసూత్ర కపిలవాయి వంశ పారావార ప్రభూత కళానిధి సింగపట్ల ణార్యాంతమాంబా పేత్రమాణిక్యాబా వేంకటాచలార్యపుత్ర అమరావతీపురనివాస చేపూరులక్ష్మణార్య వాత్సల్య సంవర్ధిత లబ్ధకవిత్వ స్ఫూర్తి లింగమూర్తి నామధేయ ప్రణీతంబైన సుగమ వాఖ్యానంబును యయాతి చరిత్ర వ్యాఖ్యానంబు సర్వంబు సంపూర్ణము.

పద్య సూచిక

యయాతి చరిత్రము

అంచయెల బోద	5	-	73
అంతఁ బ్రొద్దు	2	-	118
అంతట	2	-	9
అంతట	4	-	158
అంతనక్కడ	5	-	120
అంతనారాచ	2	-	25
అంతనొకనాఁడింతులు	5	-	45
అంతరక్కసి	4	-	79
అందుకతమున	3	-	103
అందుశర్మిష్ఠ	5	-	112
అకట	3	-	121
అక్కచుఁడు	3	-	126
అక్కురులా	3	-	127
అగడితలో	1	-	80
అగొసెవిరు	4	-	11
అచ్చుతెనుంగు	1	-	12
అట్టేని	4	-	64
అడలున	3	-	46
అడవికి	3	-	124
అడుగుఁ	4	-	108
అడుగుఁదామర	5	-	61
అడుగుందమ్ములు	3	-	4
అతనిఁ జూచి	3	-	134
అతనికి	1	-	60
అతని కూతురు	3	-	52

అతని చొప్పున	5 - 136
అతివచన్నులు	4 - 44
అతివ మిక్కిలి	5 - 115
అతివ వృషపర్వు	3 - 50
అత్తవారిండ్లకు	1 - 43
అదలించి	5 - 43
అదికాన	5 - 67
అదివేల్పు	4 - 136
అదెతాటకి	3 - 8
అనఁజెవులు	3 - 156
అనయము	3 - 110
అనవిని	2 - 55
అనవుడు	1 - 13
అనవుడు	3 - 79
అనవుడు	3 - 113
అనికలు	3 - 139
అనికినెదుర్ప	1 - 93
అనికిన్క	3 - 159
అనితెగువ	4 - 72
అనిదీవింపు	4 - 151
అనినమోమోర	5 - 146
అనినశుక్రుఁడనియె	3 - 102
అనిపలికి	3 - 96
అనిపలుక	3 - 154
అనిపలుకు	4 - 60
అనిపల్కికూఁతు	4 - 144
అనిపల్కిచెలులంత	5 - 77
అనిపల్కిన	3 - 9
అనిమొన	4 - 165

అనిలో	1	-	45
అనిలోన	3	-	38
అనిలోమార్గోను	1	-	50
అనివగచు	3	-	122
అనివాఁడు	3	-	129
అనివిన్నవించు	5	-	49
అనుకుంజూపు	2	-	31
అనుకువెన్నెల	2	-	84
అనుచుగారవించి	4	-	142
అనుచున్మిక్కిలి	5	-	72
అనుచువేవచ్చి	5	-	116
అనుఁడురక్కసి	2	-	92
అనుఁడు గన్నుల	5	-	144
అనుఁడుదొయ్యలి	5	-	68
అనువుగ	1	-	25
అన్నా	2	-	54
అపుడు	2	-	23
అపుడు	2	-	23
అప్పుడు చూచిన	3	-	30
అప్పుడు తేనికి	5	-	102
అబ్బురమై	1	-	35
అమరెఁ	4	-	9
అమ్మాలే	5	-	140
అయ్యా	3	-	105
అరబీ	1	-	58
అరయన్	1	-	61
అరయవెన్నుఁడె	2	-	105
అరిగి	5	-	126
అరుదటు	4	-	153

అరుదుగఁ	5 - 56
అతిముఖిని	5 - 8
అలనాడు	4 - 106
అలమింట	4 - 4
అలమి	5 - 92
అలరఁ	2 - 61
అలరు	1 - 119
అలవలరాజా	4 - 80
అలవేల్పుదొర	1 - 98
అలవోకయు	2 - 65
అల్లనల్లన	2 - 53
అల్లవె	5 - 59
అల్లునకిచ్చెను	4 - 124
ఆకొమ్మ	5 - 90
ఆతనిఁ	3 - 20
ఆతటి	2 - 81
ఆదట	4 - 161
ఆపగిది	2 - 30
ఆమగువ	1 - 18
ఆరాచవేల్పు	1 - 96
ఆటఁగట్టిన	2 - 50
ఆవిరుల	5 - 47
ఆవిడేలున్	1 - 4
ఆవెన్నుఁడు	4 - 134
ఆసం బెట్టి	5 - 109
ఆసిలారు	1 - 24
ఆహా!	1 - 100
ఇంచుక	1 - 82
ఇంతియెక్కడ	5 - 88

ఇటువలె	2	-	33
ఇట్టట్టెందును	2	-	63
ఇట్టి కొమాళ్ల	1	-	68
ఇట్టిగొనంబులచే	1	-	39
ఇట్టులరలోనఁ	5	-	35
ఇట్టులరిగిన	5	-	50
ఇట్లు చాలు	3	-	13
ఇట్లు పొదచొచ్చి	5	-	147
ఇట్లువచ్చిన	3	-	3
ఇట్లువచ్చి	3	-	39
ఇట్లులేచి	5	-	64
ఇట్టేని	3	-	98
ఇతనికీయక	4	-	71
ఇత్తెఱఁగునఁ	3	-	117
ఇత్తెఱంగునం	5	-	89
ఇదిపుట్టుబోగి	4	-	137
ఇది మొదలుగాఁగ	2	-	101
ఇది రేయిది	5	-	152
ఇప్పగిది	5	-	150
ఇరులు	2	-	75
ఇలువడియు	4	-	126
ఇసుమున	2	-	43
ఈ కబ్బుబర్మిలి	5	-	156
ఈకరణిం	2	-	108
ఈగొనముల	1	-	69
ఈచందము	5	-	131
ఈడగునో	5	-	86
ఈరాజాన	5	-	95
ఈరావేలుపు	5	-	63

ఈవిరిఁబోఁడిఁ	4	-	70
ఉండు	4	-	143
ఉద్దవిడి	1	-	111
ఉబ్బుగుబ్బులు	2	-	42
ఉల్లమున	4	-	140
ఉలికిపడి	3	-	26
ఉలుపచాల	2	-	115
ఉసుఱొక్కటి	3	-	78
ఎడఁగలుగ	2	-	22
ఎడలేక	4	-	154
ఎడలేదు	4	-	101
ఎదురుగ	2	-	11
ఎద్దులు	2	-	18
ఎనయుసుక	4	-	48
ఎనలేని	2	-	62
ఎనిమిది	1	-	83
ఎన్నఁడు	3	-	116
ఎలనాఁగ	4	-	99
ఎలనాఁగల	3	-	69
ఎలమిం	4	-	12
ఎలమిన	2	-	121
ఎలమిమై	4	-	5
ఎల్లియ	4	-	84
ఏఁటికి	4	-	108
ఏచి	1	-	37
ఏచెమావులు	4	-	7
ఏడన్మి	3	-	101
ఏదారిఁ	4	-	82
ఏదియు	4	-	146

ఏమనుకొనఁ	5	-	54
ఒండు	4	-	127
ఒక్కతెవు	5	-	137
ఒటికపుఁ	3	-	59
ఒరువిఁ	3	-	111
ఒరుల	3	-	19
ఒఱపరి	1	-	56
ఓలలిడి	3	-	66
ఓలిరక్కసి	3	-	80
కంగొదవఁగ	5	-	58
కంటికి ఱెప్ప	2	-	113
కంటిని	1	-	59
కంటిరె	5	-	76
కంబమయ్యెరొ	2	-	3
కడక	1	-	33
కడకడలి	2	-	69
కడఁగివిన్న	4	-	61
కడలి	3	-	31
కడలేని	5	-	83
కడువలిగి	3	-	29
కడుబలుపయ్యె	5	-	37
కడుమించు	5	-	123
కదియుచుఁ	5	-	129
కనఁదగు	1	-	77
కనితనరాజు	1	-	51
కనిమదిఁ	5	-	5
కనుఁగొని	3	-	49
కన్నులనీరు	5	-	75
కప్పఁగఁ	2	-	49

కప్పుగొప్పులఁ	4 - 28
కప్పురము	4 - 39
కరమరుదుగ	3 - 47
కరమల	2 - 79
కరమలరి	3 - 99
కరము	3 - 150
కరువలి	2 - 109
కలనం	1 - 26
కలపడగలెత్తి	4 - 152
కలపము	1 - 8
కలికినిజమరి	1 - 55
కలికియొకర్తు	4 - 88
కలికి యొక్కతె	4 - 103
కలిగి	5 - 13
కలిమిచెలి	1 - 22
కలిమిదైవాఱ	5 - 41
కలిమిని	1 - 17
కలిమి పొలతి	1 - 44
కలుములకు	2 - 125
కలుములచెలి	2 - 126
కలువల	5 - 159
కలువలు	3 - 84
కలుదోసంబున	3 - 137
కస్తూరి	2 - 88
కారుకోడి	1 - 113
కారుమెఱుంగున	4 - 92
కారుమెఱుంగులం	4 - 104
కినియక	4 - 131
కుక్కల	2 - 10

కురులలో	5	-	101
కుసుమం	5	-	46
కొక్కెర	2	-	24
కొండ	1	-	106
కొడుకుంబాసిన	3	-	15
కొడుకుల	1	-	42
కొప్పుమెల్లన	4	-	89
కొమ్మ మెకంపు	3	-	28
కొమ్మయీపొన్న	5	-	51
కొమ్మశర్మిష్ఠ	3	-	86
కొఱలెడు	3	-	161
కోడిగ	2	-	95
క్రందుకొను	4	-	6
గందంబు	5	-	98
గందపు	4	-	81
గడితపు	1	-	89
గమకమున	1	-	72
గరగరిక	5	-	62
గరగరిక	4	-	45
గరిత	1	-	40
గాసిలు	3	-	17
గుట్టు	3	-	125
గురిమెద	1	-	102
గొనముల	3	-	132
చట్టుఁ	3	-	115
చదువుల	1	-	66
చదువులకు	4	-	62
చని యుంగలము	2	-	107
చనుదెంచి	4	-	67

చనుదేఱు	4	-	65
చలిపిందిరులను	1	-	38
చలిమిరి	4	-	10
చల్లని	2	-	35
చల్లులాడగ	3	-	65
చాలుఁజాలు	4	-	21
చిన్నారి	4	-	25
చిలుకకుఁ	5	-	22
చిలువటింకి	4	-	41
చిలువల	2	-	111
చుట్టవు	1	-	23
చూడఁగ	4	-	157
చెంగట	2	-	16
చెక్కిట	5	-	70
చెదరిన	5	-	149
చెన్నగు	3	-	87
చెలఁగుచు	4	-	116
చెలిచన్నుంగవ	4	-	117
చెలితీవ	4	-	23
చెలినుదురుం	4	-	23
చెలియరాచ	4	-	59
చెలియొకతె	4	-	111
చెలులందఱు	5	-	103
చెలువట	5	-	125
చెలువ మెడ	4	-	42
చెలువలు	5	-	134
చెలువ లొనరించు	5	-	104
చెలువ వృషపర్వు	3	-	83
చెలువుఁడ	5	-	132

చెలువున	4	-	148
చెవులకీ	1	-	120
చేలుఁ	1	-	107
చొచ్చిన	4	-	132
జగముల	3	-	133
జగములు	2	-	110
జడదారి	3	-	21
జలకము	4	-	97
జాలుకొను	4	-	125
జిగిమై	5	-	74
జేజేల	4	-	77
తక్కిన	5	-	17
తగఁగోటఁ	1	-	75
తగఁబ్రాకె	4	-	115
తగఁబ్రోలి	3	-	14
తగునట్టి	1	-	64
తగువేల్పు	1	-	52
తట్టినఁ	3	-	88
తడవఁగ	1	-	88
తడవయ్యె	2	-	91
తనకుఁ దగునేల	3	-	118
తనకుఁ బగ	2	-	77
తనకున్నిచ్చలు	1	-	9
తనతోడ	3	-	82
తనదండ	3	-	41
తనమదిలో	5	-	93
తనరుచు	3	-	12
తనరూపు	1	-	57
తనవారి	1	-	71

తనవాలు	1	-	92
తను	3	-	48
తమకుం	4	-	51
తమమోము	3	-	64
తమ్మి	2	-	120
తమ్మినివాలి	3	-	18
తమ్ములఁ	4	-	37
తమ్ములుచుక్కలు	4	-	33
తమ్ములునక్కొమ్మ	3	-	68
తమ్ములు మొగిడి	2	-	74
తరఁగ	3	-	62
తలఁకకు	4	-	50
తలఁప	2	-	73
తలఁపఁడు	1	-	95
తలఁపులు	5	-	148
తలిదండ్రులే	1	-	47
తళుకుల్	1	-	78
తామర	4	-	105
తామరతంపరై	1	-	31
తాలిమి	5	-	94
తాళిగట్టి	4	-	110
తాపులు	5	-	71
తిరుగుచు	3	-	53
తుండించె	2	-	32
తునిసి	2	-	114
తులకించు	2	-	44
తెగి	2	-	104
తెనుఁగునను	1	-	14
తెన్నున	3	-	33

తెఱగంటి	1	-	3
తెఱవ	5	-	16
తెలతెల	5	-	28
తెలనాకులు	4	-	119
తెలిమొగులు	4	-	31
తెలివిం	1	-	123
తెలివిసింగపు	1	-	6
తేజీడిగి	4	-	78
తొలుత	2	-	6
తొలుబాముల	3	-	138
తోటలు	1	-	94
తోడబుట్టుగు	3	-	153
తొరవుఁ	4	-	14
దండకమను	3	-	16
దరింగరంబు	3	-	72
దళముగఁ	4	-	139
దళముగనందు	1	-	79
దళమై	5	-	87
దానిఁగని	2	-	14
దురమునవోడి	1	-	5
దురమునవారువంపు	1	-	122
దూరములోఁ	3	-	95
దురములో	1	-	30
దేవరపట్టి	3	-	112
దొమ్మి	1	-	34
నగఁనల్గినను	1	-	85
నడుము	5	-	14
ననఁబోడి	5	-	15
ననునెఱుఁగని	5	-	24
నలఁచి	5	-	3

నలుమొగముల	3	-	163
నలువగు	3	-	57
నాలి	4	-	30
నావుడు దేవయాని	3	-	158
నావుడునయ్యాయాతి	2	-	59
నింగిపేరింటిలో	2	-	72
నింగిబీటలు	1	-	116
నిండుఁదలంపున	3	-	90
నిగనిగ	1	-	70
నిగిడి	5	-	81
నినిచిన	5	-	18
నిలువుటద్దం	4	-	100
నీటి	2	-	41
నీవనఁగ	3	-	148
నెట్టన	3	-	76
నెమ్మదిఁ	4	-	68
నెఱపల్కు	1	-	46
నెలఁతుక	4	-	36
నెలకొను	3	-	91
నెలతాల్పు	3	-	35
నెలతుఁక	4	-	118
నెలపూఁదాలుపు	2	-	123
నెలవంటి	4	-	95
నేలచూలి	3	-	22
పగ	5	-	79
పచ్చల	4	-	94
పటికంపు	2	-	51
పట్టంగ	1	-	27
పట్టికొని	3	-	25
పట్టియొక	3	-	119

పట్టీనిను	3	-	93
పడంతి	5	-	60
పదియాఱు	1	-	97
పదియాఱు	4	-	74
పనసలు	5	-	55
పనిచిన	4	-	87
పనుపడు	5	-	25
పరువము	5	-	54
పలపల	1	-	29
పలుకులం	5	-	11
పలుకులు	1	-	86
పలుకులే	1	-	20
పలుతలంపుల	1	-	73
పలుదెఱంగుల	4	-	49
పలు దెఱంగులంబో	3	-	70
పలుదెఱంగుల	3	-	61
పలుమాఱు	4	-	55
పసిండి	3	-	56
పాదివేంట	2	-	21
పిడుగుల	2	-	26
పిన్నవు	3	-	147
పిలికి	1	-	103
పిలిచి	1	-	10
పుక్కిళ్ళ	5	-	26
పుడమిని .	4	-	150
పురుకుత్సు	3	-	162
పులికూనల్	1	-	104
పువ్వు	4	-	29
పూవింటి	1	-	19
పూనికం	2	-	70

పూనిపదిరెండు	2 -	76
పెంపు	2 -	17
పెనఁకువ	5 -	158
పెనిమిటిదండు	4 -	135
పెనిమిటిని	5 -	43
పెనిమిటియైన	5 -	30
పెలుచఁ	4 -	38
పెలుచగు	3 -	7
పొడవగు	1 -	76
పొడవుల	1 -	32
పొడిచిన	2 -	29
పొదలట్లు	2 -	7
పొదలెడు	2 -	103
పొరపొర	5 -	100
పొరులం	1 -	124
పొలతుల్	1 -	7
పొలతుల	3 -	71
పొలఁతి	4 -	91
పొలఁతుల	4 -	164
పొలుపుల్గనుఁ	4 -	24
పొలుపొ	4 -	75
పొసఁగెడు	4 -	122
పోల్ప	4 -	114
ప్రొద్దు	1 -	117
బంగారుఁ	4 -	46
బంగారుకుండల	5 -	4
బడలినఁ	5 -	141
బలిమిఁ	2 -	98
బలిమితో	2 -	99
బలిసిరి	3 -	109

బలుమించి	4	-	53
బలువగు	5	-	53
బలువెన	2	-	86
బలువైన	1	-	112
బవరవు	5	-	157
బుగులు	4	-	121
బొగడల	5	-	12
బొట్టుగు	4	-	20
బెట్టుగా	2	-	36
బెళుకులై	1	-	84
బ్రదుకుఁ	3	-	146
మంచుమీఁది	4	-	113
మందిగుఱాలు	4	-	155
మగఁడేకొలది	4	-	129
మగఁడేడు	4	-	130
మగువయెన్నడు	5	-	6
మగువ వడి	3	-	67
మగువా	5	-	122
మట్టెలు	4	-	90
మదిఁగూర్మి	2	-	49
మదిలోఁగి	3	-	11
మదిలోఁ	1	-	53
మనమందఱి	5	-	135
మనవాఁడై	3	-	34
మరి	1	-	114
మరుఁడర	4	-	35
మరుడాయెవ్వరి	5	-	106
మరుఁడార్చి	5	-	119
మరుఁడు	5	-	128

మరుని	4	-	34
మఱియు	3	-	136
మాటనేర్పు	1	-	65
మాటమాటై	3	-	42
మానికపు	1	-	99
మారేళ్లు	1	-	36
మావులుఁ	2	-	48
మావులు (రగడ)	4	-	26
మించిన	2	-	37
మించియమీను	1	-	28
మించు	5	-	99
మింటి	5	-	138
మిడి	2	-	19
మీఱును	3	-	146
ముగురు	3	-	155
ముదురు	3	-	151
మున	3	-	85
మున్నీటి	1	-	16
మునుకొన్న	5	-	155
మునునలువ	3	-	128
మునుపు	5	-	130
మునుపాకచోటఁ	4	-	18
మునుపాకరక్కసి	2	-	58
మునుపెంత	5	-	20
మునువడిన	2	-	4
మున్ను	4	-	57
మున్నెవ్వరు	1	-	11
మురువునఁ	4	-	47
మెదలు	3	-	55

మెదలెడు	4	-	15
మెఱసి	1	-	81
మెలత	5	-	10
మొగముం	5	-	145
మ్రొక్కి	4	-	69
రంగగు	3	-	54
రంగుగ	2	-	45
రక్కసి	2	-	90
రక్కసులు	2	-	57
రహిని	5	-	32
రాజండన్	2	-	27
రాజా	3	-	107
రాలెంజాక్కలు	2	-	66
లచ్చి	4	-	141
లలిఁబంచదార	4	-	40
లలినానెలఁతకు	5	-	39
లలినీనెలఁ	3	-	75
లావుఁ	3	-	140
లాలసరీ	4	-	163
లాలసరి	1	-	48
లేఁటి	1	-	110
లొంగిలి	4	-	16
వచ్చి	2	-	100
వడిఁగేలు	5	-	117
వడిఁజన	4	-	17
వడిఁబుడమి	4	-	66
వడినుసి	2	-	8
వడినొక్క	2	-	13
వడివడిం	2	-	89
వన్నెగ	5	-	52

మరుసన్	4	- 85
వరుసవెంబడి	1	- 87
వలపులరాజు	5	- 80
వలపులరాయ	5	- 78
వలపులఱేఁడు	5	- 151
వలరాయా	5	- 107
వలవలని	5	- 143
వలిగాలి	2	- 38
వలిపెంబు	3	- 44
వినరింప	4	- 86
వినియకొల్కమ్మ	5	- 142
వినుకడుపు	3	- 142
వినుచదువు	3	- 157
వినునన్నేలిన	5	- 66
వినుమన	3	- 106
వినుము	4	- 137
వినురక్కసులు	3	- 108
వినులోఁజూపున	3	- 135
వినువృషపర్వ	3	- 51
వినువేల్పు	3	- 130
విన్నున	2	- 39
విన్నెలు	1	- 91
వీడదు	1	- 63
వీణెయక్కున	2	- 80
వెడవిల్తు	5	- 111
వెడవెడ	5	- 113
వెదకి	3	- 36
వెన్నుని	3	- 5
వెరవున	2	- 124
వెఱవకుఁ	2	- 117

వెలయాలుఁ	2	-	96
వెలవెలఁ	5	-	36
వెలిచాయ	2	-	78
వెలియేను	4	-	102
వేడిమి	5	-	118
వేనలి	5	-	121
వేలుపు	4	-	159
వేల్పుమన్నినికై	2	-	12
వేల్పురాయుడు	2	-	82
ప్రేలుం	4	-	8
సకియ	5	-	85
సన్నకరువలి	5	-	57
సరగ	2	-	68
సరవితోడ	5	-	153
సరిచేతొదవులు	4	-	96
సరుల్	4	-	19
సలిఁ	4	-	112
సింగారపు	5	-	97
సిరిగుబ్బచన్నుఁ	3	-	1
సిరిమీఱిన	4	-	1
సిరిరాచవేల్పు	5	-	1
సిరిరామోకాలొడ్డిన	2	-	93
సిరివంటి	2	-	1
సిరుల	1	-	1
సీతఁగాంచి	3	-	23
సురకరువలి	3	-	74
సురపొన్న	5	-	48

వచనాలు

అంత	5	-	23
అంత	5	-	38
అంత	1	-	101
అంత	2	-	102
అంతకంతకు	5	-	91
అంతనక్కడ	4	-	93
అంతనిట్లు	4	-	107
అంతనెఱుకులు	2	-	5
అందు	2	-	119
అటమీఁద	2	-	2
అటమీఁది	3	-	2
అటమీఁది	4	-	2
అటమీఁది	5	-	2
అట్టియెడ	2	-	106
అట్లు	3	-	24
అతండు	1	-	21
అతని	1	-	49
అత్తెఱంగున	3	-	94
అనవుడుఁ	2	-	56
అనవుడుఁ	3	-	104
అనవుడుఁ	4	-	56
అనవుడుఁ	4	-	63
అనవుడుఁ	4	-	162
అనవుడుఁ	3	-	131
అనిచెప్పి	4	-	149
అనినగుచుం	5	-	7
అనిపలికి	1	-	15
అనిపలికి	2	-	94

అనిపలికి	2	-	97
అనిపలికి	5	-	69
అనిపలికి	5	-	96
అనిపలుకం	5	-	33
అనిపలు	3	-	141
అనిపల్కునంత	5	-	108
అనిపల్కునెడ	5	-	84
అనిపెక్కు	4	-	138
అనిమఱియు	4	-	22
అనియక్కలికి	3	-	81
అనియడుగుట	2	-	60
అనియప్పగించి	4	-	147
అనియమ్మున్నీటి	2	-	47
అనియమ్మున్నీటి	2	-	47
అనియిచ్చుం	1	-	2
అనియిట్లు	4	-	52
అనివగచి	2	-	116
అనివల	5	-	82
అనివిన్నవించి	5	-	21
అనివిన్నవించు	1	-	109
అనుటయు	5	-	139
అప్పుడ	5	-	31
అప్పుడా	2	-	52
అప్పుడు	2	-	20
అప్పుడు	2	-	71
అప్పుడు	2	-	83
అప్పుడు	2	-	85
అప్పుడు	4	-	83
అప్పుడు	4	-	98

అప్పుడు	5	-	9
అప్పుడు	5	-	27
అప్పుడు	5	-	110
అప్పుడువృష	3	-	100
అప్పుడుశుక్రుండు	4	-	123
అప్పుడొక	2	-	15
అమ్ముదిత	4	-	128
అయ్యెడ	4	-	120
అరుదెంచి	4	-	160
ఇంక	1	-	62
ఇట్లియ్యకొని	4	-	73
ఇట్టికొమ్మం	3	-	160
ఇట్లుకడలి	1	-	90
ఇట్లుకదలుట	4	-	145
ఇట్లుకలిగిన	5	-	40
ఇట్లుకాంచి	3	-	58
ఇట్లుకాంచి	1	-	118
ఇట్లుకావించి	3	-	27
ఇట్లుకూడి	2	-	122
ఇట్లుకొలను	3	-	63
ఇట్లుగాలిం	2	-	28
ఇట్లుచదువుచు	3	-	114
ఇట్లుతమకు	2	-	67
ఇట్లుతాటకిం	3	-	10
ఇట్లుతెగి	3	-	45
ఇట్లునీటు	4	-	27
ఇట్లునీరాట	3	-	73
ఇట్లుపలికి	5	-	114
ఇట్లుపెక్కు	3	-	123

ఇట్లుమ్రొక్కి	5	-	65
ఇట్లుయయాతి	5	-	154
ఇట్లువచ్చిన	3	-	152
ఇట్లువచ్చిన	4	-	109
ఇట్లువచ్చినం	5	-	19
ఇట్లువలరాజ	5	-	105
ఇట్లువలరాజ	5	-	133
ఇట్లువీడెం	5	-	29
ఇట్లుసంజీవని	3	-	145
ఇట్లెందును	2	-	64
ఇప్పగిది	3	-	40
ఇవ్వితంబునం	5	-	42
కచుండు	3	-	120
కాంచి	4	-	32
కావుననలుక	3	-	89
కావుననేను	3	-	92
చనం	2	-	34
చని	5	-	127
చను	1	-	121
చాఁగి	1	-	105
చేసిన	3	-	60
తన	3	-	149
తొలు	3	-	32
దేవయాని	3	-	97
నావుడు	4	-	58
పలు	2	-	112
ప్రేముడిం	3	-	6
మఱియు	4	-	13
మఱియుఁ	2	-	40

మఱియుఁ	1	-	67
మఱియును	4	-	76
మఱియును	5	-	124
యున్నన్నెలంత	4	-	54
వలరాజు	2	-	87
వారియందు	1	-	41
విని	3	-	77
వీడు	4	-	156
వెలుఁగు	3	-	43
వేఁట	1	-	115
వేలంబు	3	-	37
సిరులుం	1	-	74

సూర్యారాయ నిఘంటువు ఈకావ్యమునుండి స్వీకరించిన పదాలు

అంగు
అగరు
అచ్చు
అటకలి
అబ్బెందలు
అఱ
ఆటి
ఇందని
ఈడేఱు
ఎరవలి
ఒడికము
ఒడికారము
కట్టు
కడిమి
కఱుకు
కాఫెలు
కుచ్చులిబొంత
కుతిలపెట్టు
కొట్టుమిట్టాడు
కొట్నము
కోపు
కోపులు
గండారు
గుంపెనలు
చట్టు
చలిమిరి
జగతి
తమకము
తమి
తానము
తెగచి
తెరలించు
దండ
దాడినిమ్మ
దురపిల్లు
నెత్తురుపొత్తు
పంతము
పన్నారు
పాకెన
పింపిళ్లు
పెలుచ
పైడిచూలాలు
పొలివోవు
పొసనము

★ బందుకట్లు
బాసటము
బొమిడికము
మరువము
మలము
మేరువు
రాపాడు
రెంటెము
లంపులు
లొట్టిపిట్ట
లోపులు
వలపు
వల్లించు
★ విరిగి
విలాతి
వీరణము
సమకట్టు
★ సరిది

★ ఈగుర్తుగలవి ఏకైక ప్రయోగములు

కొన్ని నామమాలికలు

ఆహార పదార్థాలు	-	రాజశేఖర	-	2-127
కుక్కలపేర్లు	-	వరాహ	-	4-73
గుర్రములపేర్లు	-	సింహాసన	-	3-141
గృహోపకరణాలు	-	వరాహ	-	4-112
చెట్లపేర్లు	-	నారద	-	1-457
దాణలపేర్లు	-	వరాహ	-	4-186
దృష్టిభేదాలు	-	సింహాసన	-	7-62
నదుల పేర్లు	-	నారద	-	1-120
మతములపేర్లు	-	నారదీయ	-	6-245
మునులపేర్లు	-	నారదీయ	-	1-458
విలాసవస్తువులు	-	వరాహ	-	4-122
సర్పజాతులు	-	సింహాసన	-	8-98
స్త్రీలపేర్లు	-	సింహాసన	-	4-291

పండితారాధ్యచరిత్ర -

పర్వత ప్రకరణం లోని నామమాలికలు -

పర్వతాలపేర్లు	–	52
నదులపేర్లు	–	53
విశ్రమస్థానాలు	–	12
జలస్థానాలు	–	13
జలపాత్రలు	–	15
పత్రులు	–	22
పూలు	–	36
పండ్లు	–	39
కాయలు	–	04
వీణలు	–	39
తాళములు	–	108
వాసలు	–	18
రాగములు	–	
బాహత్తర నియోగులు	–	72

ఉపయుక్త గ్రంథాలు

<u>నిఘంటువులు :-</u>

1. అచ్చతెనుగు పదకోశము – పోతుకుచ్చిసుబ్రహ్మణ్యశాస్త్రి
2. ఎట్మలాజికల్ డిక్షరీ(ఆంగ్ల) ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటి ప్రచురణ- 1984
3. సామలింగాను శాసనం
4. పూర్వగాధాలహరి – వేమూరి శ్రీనివాసరావు
5. పౌరాణిక్ కోశ్ – రాణాప్రసాద్ శర్మ
6. వేంకటేశాంధ్రము – గణపవరపు వేంకటకవి
7. శబ్దరత్నాకరము – బహుజనపల్లి సీతారామాచార్యులు
8. శబ్దార్థచంద్రిక – మహంకాళి సుబ్బారాయుడు
9. సంకేత పదకోశం – డా॥రవ్వా శ్రీహరి
10. సాంబనిఘంటువు – కస్తూరి రంగయ్య
11. సూర్యరాయాంధ్ర నిఘంటువు
12. హిందీకథాకోశ్ (హింది) హిందుస్తాని అకాడమి, అలహాబాద్

<u>వ్యాకరణములు :-</u>

13. అప్పకవీయము
14. ఆంధ్రశబ్దచింతామణి
15. తెలుగు చందోరీతులు – రావూరి దొరసామిశర్మ
16. బాలవ్యాకరణము – దైసివ్యాఖ్యానము

అలంకార శాస్త్రములు

17. ఆంధ్రచంద్రాలోకము - ఆడిదము సూరకవి

18. ఆంధ్రభాషాభూషణం - మూలఘటిక కేతన

19. అలంకార సూత్రము - జమ్ముల మడక మాధవ రామశర్మ

20. కావ్యాలంకార సంగ్రహం - సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి

21. కువలయానందసారం - బులుసు వేంకటరమణయ్య

22. తెలుగు కావ్యాదర్శం - అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి

23. ప్రతాప రుద్రీయశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు

చరిత్రలు :-

24. ఆంధ్రదేశచరిత్ర - సంస్కృతి - బి.యన్.శాస్త్రి 1,2 భాగములు

25. ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి- ఖండవల్లి లక్ష్మీరంజనం

26. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి

27. ఇండియన్ క్రోనాలజి (ఆంగ్ల)

28. కలిశకవిజ్ఞానం - కోట వేంకటాచలం

29. తెలుగు సంస్కృతి

30. భవిష్యద్భారతము - యన్.యస్.అవధాని

31. విజయనగర చరిత్ర - నూతలపాటి పేర్రాజు

32. వాఖియాతె మములుకతె బీజాపూర్ (ఉర్దూ) బషీరుద్దీన్ అహమ్మద్ కలెక్టర్ వాల్యూనెం.3.ము 1915

కవులచరిత్రలు :-

33. కవితరంగిణి - భా.6 చాగంటి శేషయ్య

34. సమగ్రాంధ్ర సాహిత్యం - భా. ఆరుద్ర

విమర్శలు సిద్ధాంత వ్యాసాలు :-

35. అచ్చతెనుగు కృతుల పరిశీలనం – కె.వి. సుందరాచార్యులు

36. కవిసమయములు – డా॥ ఇరువెంటి కృష్ణమూర్తి

37. తెలుగువారి క్రీడలు – వడ్ల సుబ్రహ్మణ్యం

38. భాగవతోపన్యాసాలు – ఆంధ్రసారస్వత పరిషత్తు

39. శ్రీమహాభారతం వైజ్ఞానిక సమీక్ష

40. విజ్ఞాన సర్వస్వము – హంసవింశతి

41. విజ్ఞానము వినోదములు – డా॥ జి వెంకటరత్నం

కావ్యప్రబంధాలు :-

42. అముక్తమాల్యద – శ్రీకృష్ణదేవరాయులు

43. ఆంధ్రమహాభారతం – ఆదిపర్వం – నన్నయ

44. కళాపూర్ణోదయం – పింగళి సూరన

45. కాళహస్తి మహాత్మ్యం – ధూర్జటి

46. కాశీఖండం – శ్రీనాధుడు

47. చాటు పద్యమణిమంజరి – భా2. వేటూరి ప్రభాకరశాస్త్రి

48. తపతీసంవరణం – అద్దంకి గంగాధరకవి

49. నిరంకుశోపాఖ్యానం – కందుకూరి రుద్రకవి

50. పండితారాధ్య చరిత్ర – పాల్కురికి సోమన

51. పారిజాతాపహరణం – నంది తిమ్మన

52. ప్రభావతీప్రద్యుమ్నం – పింగళి సూరన

53. బసవపురాణం – పాల్కురికి సోమన

54. మొల్లరామాయణం – ఆతుకూరి మొల్ల

యయా

55 మనుచరిత్ర - అల్లసాని పెద్దన - వెంపరావారి వాఖ్య

56. రాజశేఖర చరిత్ర - మాదయగారి మల్లన

57. వరాహపురాణం - నందిమల్లయ్య ఘంటసింగయ

58. వసుచరిత్ర - రామరాజభూషణుడు

59. శ్రీమహాభాగవతం - పోతన

60. సింహన ద్వాత్రింశిక - కొరివి గోపరాజు

61. హరవిలాసం - శ్రీనాథుడు

యయాతి చరిత్రలు :-

62. వావిళ్ల ప్రతి

63. అకాడమీ ప్రతి - నోరినరసింహశాస్త్రిగారి పరిష్కరణ-పీఠిక.

64. మూసీ పబ్లికేషన్ - ప్రతిశ్రీవిరించి గారి పరిష్కరణ పీఠిక

ఇతరములు :-

65. మహాభారతము ఆదిపర్వము వచనము కీ.శే. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

66. వివాహ ఉపనయన క్రమణిక - చర్ల గణపతి శాస్త్రి

67. వ్యవహారికాంధ్రమహాభారతం - పురిపండా అప్పలస్వామి

68. విప్రుల యిండ్ల పేర్లు - గోత్రప్రవరలు

పత్రికలు :- మూ.ప.

భారతి - సందేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు

జయంతి - విశ్వనాథ సత్యనారాయణ

మిసిమి - అలపాటి రవీంద్రనాద్